చెన్నై

ఆంధ్రభూమి
శుక్రవారం 1 ఫిబ్రవరి 2013

ఎందుకు రావాలి

మనవాళ్లకి అవార్డులు!

పద్మ అవార్డుల్లో తెలుగువారికి మళ్లీ మొండి చెయ్యా? అని తెగ చర్చలు, సంపాదకీయాలు, వ్యాసాలు వచ్చేస్తున్నాయి. రిపబ్లిక్ దినం ముందు రోజు ఇది మనకు తప్పనిసరి తద్దినం. ఆవేళ ఓ నాలుగు రంకెలు వేసేసి, మళ్లీ ఏడాది దాకా నోరెత్తం. ఆ దిశగా ఏ అడుగూ వేయం. ఆనవాయితీ తప్పకుండా ప్రతీ ఏడాది మిస్సయ్యేవాళ్లల్లో బాపు-రమణ లుంటారు కాబట్టి, నాబోటి అభిమానులకు ఫోన్‌కాల్స్ తప్పవు.

ఎమ్బీయస్ ప్రసాద్

బాపు రమణలకు రాలేదని మనం ఇంత గింజుకుంటున్నాం కదా వాళ్లేమనుకుంటారన్న సందేహం ఎవరికైనా రావచ్చు. రమణగారితో నేను చాలాసార్లు ఈ విషయంగా మాట్లాడాను- ఎందుకు రావడం లేదండీ? అని. 'వాళ్లూ వీళ్లూ వదిలేయండి, మీ వీరాభిమాని పివి గారు ప్రధానిగా ఉండగా కూడా రాలేదేమిటి? మీ వీడియో పాఠాలు దేశమంతా పంపిణీ చేయిద్దామనుకున్న వ్యక్తి ఆయన. ఆయనేనా మీకు ఇప్పిద్దామనుకోలేదా?' అని. 'ఇస్తే మేం ఎగిరి గంతేయమని ఆయనకు తెలుసు కాబట్టే పట్టించుకోలేదు' అని చెప్పారు రమణ గారు. ఎవరో పివిగారితో అన్నారట-ఈసారైనా ఇద్దామండీ అని. 'ఎందుకయ్యా, వీళ్లకు బదులు ఇంకోరికిస్తే వాళ్లయినా సంతోషిస్తారు' అన్నారట పివి. కోతి కొమ్మచ్చి చదివితే తెలుస్తుంది

బాపుకి 'చిత్రబ్రహ్మ', రమణకు 'హాస్యబ్రహ్మ'లాంటి బిరుదులేవైనా ఉన్నాయా? వాళ్లు సరేనంటే ఇవ్వడానికి వందలాది సంస్థలు క్యూ కడతాయి. కానీ వాళ్లు ఒప్పుకోరు. దేనికీ వాళ్లు ప్రయత్నించలేదు. ప్రతీ అవార్డు తీసుకునేముందు చాలా తర్జన భర్జనలు పడేవారు. చివరకు మొహమాటానికి లొంగి తీసుకునేవారు. పేరుకు ముందు ఎ ప్పుడూ 'కళాప్రపూర్ణ' లాటివి తగిలించుకోలేదు. గౌరవ డాక్టరేట్లు వచ్చినా డాక్టర్ అని పెట్టుకోలేదు. ఇలాటివాళ్లు ప్రభుత్వ అవార్డుల గురించి ఏం ప్రయత్నిస్తారు?

మన రాష్ట్ర రాజకీయ నాయకులు ఏమీ చేయడం లేదు, అందుకే మన రాష్ట్రానికి 'మొండి చెయ్యి చూపిస్తున్నారు' అని వాదించడం అతి సులభమైన పని. రాజకీయ నాయకులు పట్టించుకోలేదు కాబట్టి మనకు పద్మ అవార్డులు రావడం లేదు అంటారు. ఎట్‌లీస్ట్ బాపు-రమణల విషయంలో సిన్సియర్‌గా ట్రై చేసిన ఎంపీలు నాకు తెలుసు. కానీ పని జరగలేదు. ఈ ఒక్క విషయమే కాదు, ఏ విషయంలోనైనా నిర్ణయం తీసుకునే వారికి దాని గురించి కొంత పూర్వావగాహన ఉంటేనే కథ ముందుకు నడుస్తుంది. దీన్నే మార్కెటింగ్ పరిభాషలో పొజిషనింగ్ అంటారు. ఇప్పుడో ఎలక్ట్రిక్ షాపుకి వెళ్లి ఓ ఇమ్మర్షన్ రాడ్ అడిగామనుకోండి. నాలుగు కంపెనీలవి ఉన్నాయి, ఏది కావాలి? అంటాడు. నిజానికి ఏది మంచిదో మనకూ తెలియదు. నాలుగు పేర్లూ చెప్పమంటాం. వాటిల్లో ఏది మనకు పరిచితంగా అనిపిస్తుందో, ఏ పేరు స్ఫురిస్తుందో అది ఇవ్వమంటాం. ఆ సమయంలో మనకు స్ఫురించేట్లా చేయడానికి మొత్తం అడ్వర్టయిజింగ్ వ్యవస్థ పనిచేస్తుంది. తమ ఉత్పాదన పేరును రేడియోల్లో, టీవీల్లో పదే పదే వినిపించడం, ఓ సెలబ్రిటీ బ్రాండ్ అంబాసిడర్‌ను నియమించి వాళ్ల చేత చెప్పించడం జరుగుతుంది. అలాగే ఢిల్లీ వాళ్లకు కూడా పదే పదే మనవాళ్ల పేర్లు వినిపించేట్లా చేస్తే వాళ్లకు పరిచితమైన పేరులా అనిపిస్తుంది. భూపేన్ హజారికా అస్సామీ గాయకుడు. ఆయన ఆ భాషలోనే పాటలు పాడుతూ ఉండిపోయాడనుకోండి, మనకు తెలిసేదా? అస్సామీ, బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పాడి జాతీయ

స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. అందువలన ఆయనకు మరణానంతరం 'పద్మవిభూషణ్' ఇచ్చినా 'ఓహో' అనుకున్నాం తప్ప, 'ఆయనెవరు? ఎవడో అనామకుడికి ఇచ్చేసారే' అనలేదు.

ఘంటసాల ఎంత గొప్ప గాయకుడో మనకు తెలుసు. కానీ ఢిల్లీవాళ్లకు ఎలా తెలుస్తుంది? ఘంటసాల గారిపై స్టాంపు వెలువరించడానికి ఆయన అభిమానులు తీవ్ర ప్రయత్నం చేశారు. చివరకు 2003 ఫిబ్రవరిలో ఫలించింది. ఎలా? ఘంటసాలగారు గొప్ప గాయకుడంటే పోస్టల్ డిపార్టుమెంట్ కొట్టిపారేశారు. సరేలేవయ్యా, మంచి గాయకులు చాలామందే ఉన్నారులే అని. లేదండీ పదివేల పాటలు పాడారు అని చెపితే అయితే గొప్పవాడే అయివుంటాడు అనుకుని సరే అన్నారు. నిజానికి ఘంటసాల అన్ని పాటలు పాడనే లేదు. మూడు వేల లోపే పాడారు.

స్టాంపు విడుదల సమయానికే ఒకాయన ఘంటసాల పాడిన పాటల పల్లవులు అంటూ ఓ పుస్తకం వేసి, సరైన లెక్క వేసి చూపించాడు. అది చూసి ఆ అభిమానుల గుండెలు దడదడలాడాయి. మీరు అబద్ధం చెప్పేరేం? అని పోస్టల్ వాళ్లు నిలదీస్తారేమోనని భయం. ఇక్కడ గుర్తించాల్సింది ఏమిటంటే-ఘంటసాల ఎంత గొప్ప గాయకుడో ఢిల్లీ పత్రికల్లో, ఇంగ్లీషుల్లో ఎక్కడా వ్యాసాలు రాలేదు. స్టాంపు కమిటీ వారికి ముందునుండీ అవగాహన ఉండి ఉంటే పాటల సంఖ్య గురించి అబద్ధమాడవలసిన అవసరం పడేది కాదు. చివరకు సంఖ్య గురించి అబద్ధమాడితే అది చూసి ఇంప్రెస్ అయి అంగీకరించారు.

ఢిల్లీలో కూర్చుని అవార్డులు నిర్ణయించే కమిటీకి కూడా సమస్యలుంటాయి. ప్రతీ రాష్ట్రం కొండవీటి చాంతాడంత లిస్టు పంపించి వేస్తుంది. స్థానికంగా ఎన్నో మొహమాటాలుంటాయి. అందువలన అందరి పేర్లూ జాబితాలో ఇరికించేస్తారు-రాకపోతే 'నన్నేం చేయమంటావ్?' అనడానికి వీలుగా! ఆ లిస్టు కళ్ల ముందు పడేసి కూర్చున్నప్పుడు తెలిసున్న పేర్ల దగ్గర కమిటీ సభ్యుని చూపు ఆగుతుంది. షార్టు లిస్టులోకి ఆ పేరు ఎక్కవచ్చు. తర్వాత ఫైన్ ట్యూనింగ్‌లో ఆ పేరు ఉండవచ్చు, జారిపోవచ్చు-అది వేరే విషయం. కానీ వాళ్ల చూపు ఆగేలా చేయడానికి ఏం చేయాలి అన్నదే మనం ఆలోచించాలి. జాతీయస్థాయిలో పేరు తెచ్చుకున్న వారి పేరు సహజంగా దేశమంతా తెలుస్తుంది. రాష్ట్రస్థాయిలో మాత్రమే పేరు తెచ్చుకున్న వారి పేరు పక్క రాష్ట్రం వాడికి కూడా తెలియదు.

కేంద్రం పద్మ అవార్డులు ఇవ్వలేదని ఢిల్లీని విమర్శించే ముందు మన రాష్ట్రం వాళ్లు ఏమాత్రం సత్కరించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఏవైనా అత్యున్నత పురస్కారాలను ప్రకటించి, ఏడాదికి ఇద్దరు ముగ్గుర్ని గుర్తించి అవార్డులిస్తే అవి కేంద్రానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. మనం ఏమీ పట్టించుకోం. ఒకవేళ ఏవైనా ఇద్దామన్నా, తంబలుగా తంబలుగా ఇచ్చేస్తే వాటి విలువ కూడా పోతుంది. ప్రభుత్వం ఆచి తూచి అవార్డు ఇస్తుందని ఒక అభిప్రాయం ఉంటుంది కాబట్టి తీసుకున్నవారికి కూడా తృప్తిగా ఉంటుంది.

రెండో విషయం కళాకారుల పక్షాననుండి చెప్పాలి. గుమ్మడిగారు రంగారావుగారితో సమానమైన నటుడు. రంగారావుగారు నటనలో ఫోర్సు ఉంటుంది. కానీ పాత్రలో ఇమిడిపోవడంలో గుమ్మడి తర్వాతనే ఎవరైనా. కానీ గుమ్మడి తెలుగువాళ్లకి మాత్రమే తెలుసు. రంగారావు తమిళులకి కూడా తెలుసు. తమిళ సినిమాల్లో కూడా వేశారు కాబట్టి. అలాగే సావిత్రి, కన్నాంబ, ఎస్.వరలక్ష్మి, నాగయ్య..వీళ్లందరు తమిళులకు కూడా తెలుసు. వాళ్ల మార్కెట్ విస్తృతం కాబట్టి, గుర్తింపు కూడా సులభంగా వస్తుంది. ఏసుదాసు తప్ప మలయాళంలో పాడే ఇతరులు మనకు తెలియదు. ఎందుకంటే ఆయన మాత్రమే తెలుగులో కూడా పాడారు కాబట్టి. సుశీలగారికి పద్మ అవార్డు రావడమే లేటు, అది కూడా తమిళంలో పాటలు పాడి ఉండకపోతే ఎప్పటికీ వచ్చేది కాదు. ఎస్పీ బహుభాషల్లో పాడారు కాబట్టి సుశీలగారికంటే త్వరగా వచ్చింది.

ఎన్టీయార్, ఎయన్నార్ ఎంత గొప్ప నటులైనా కావచ్చు. పరభాషల వాళ్లకి వాళ్ల ప్రతిభ తెలియనే తెలియదు. ఎందుకంటే వాళ్లు ఎంత సేపూ తెలుగుమీదే

మిగతా... IVలో

యు టూ బ్రూటస్?

రెండు వారాల గ్యాప్ తరువాత మళ్లీ విడుదలలు ఈ వారం ప్రారంభమయ్యాయి. కమల్ 'విశ్వరూపం', విశాల్ 'వేటాడు వెంటాడు', కన్నడ డబ్బింగ్ 'దండుపాళ్యం' ఈవారం విడుదలయ్యాయి. విశ్వరూపం, వేటాడు వెంటాడు సినిమాలు కొంచెం ఇబ్బందులు పడి పడి ఆఖరికి ఒకరోజు ఆలస్యంగా జనం ముందుకు వచ్చాయి. ఈ కారణంగా సరియైన టాక్‌కు నోచుకోలేదు. విశ్వరూపం మల్టీప్లెక్స్‌లకు పరిమితమవుతుందన్న టాక్ రాగా, విశాల్ సినిమా థ్రిల్లర్‌లు నచ్చేవారికి మాత్రమే అన్న అభిప్రాయం వినపడుతోంది. నాయక్, సీతమ్మవాకిట్లో....సినిమాల కలెక్షన్లు ఇంకా ఫరవాలేదు అనే రేంజ్‌లోనే వున్నాయి.

బిజినెస్ తెలిసిన దర్శకుడు

భారీ సినిమాలు, వరుస విజయాల దర్శకుడు రాజమౌళికి, వ్యాపారం కూడా తెలుసట. అదే ఇప్పుడు టాలీవుడ్ టాక్. తాను దర్శకత్వం వహించిన సినిమా నుంచి డబ్బులు రావాలంటే, పారితోషికం, మహా అయితే ఏదో ఒక ఏరియా హక్కులు, ఇంకా కాకుంటే వాటా ఇలాంటివే ఇప్పటి వరకు తెలుసు. కానీ రాజమౌళి స్టయిలే వేరట. ముందుగా సినిమాని తానే ప్లాన్ చేసి, దాన్ని వార్తల్లో నిలిపి, దానికి కావాల్సిన ప్రాథమిక వ్యవహారాలన్నీ తానే డిజైన్ చేసి, కొంత వరకు పెట్టుబడి పెట్టి, ప్రాజెక్ట్ ఒక లైన్‌లో పడ్డాక, అప్పుడు ఎవరో ఒక నిర్మాతలకు అప్పగించడం అన్నది రాజమౌళి వ్యవహారం అని గుసగుసలు వినిపిస్తున్నాయి. మర్యాదరామన్న ఈగ ఈ విధంగానే ప్రారంభమై, తరువాత నిర్మాతల చేతికి ప్రాజెక్ట్ రావడం గమనార్హం. ఇప్పుడు ప్రభాస్‌తో తీయబోయే 'బాహుబలి'కి కూడా ఇంతవరకు నిర్మాత ఫలానా అని ఫైనల్ కాలేదు. కానీ వ్యవహారాలన్నీ ఇంత భారీగా, అంత లెవెల్లో సాగుతున్నాయన్న వార్తలు మాత్రం గుప్పుమంటున్నాయి. మరి ఎవరి చేతిలోకి చేరుతుందో ఈ వందకోట్ల ప్రాజెక్ట్? చూడాల్సిందే?

డబ్బులు మిగిలాయి

ఇటీవల స్వామిరారా అనే 'కొత్త'సినిమా ఆడియో ఫంక్షన్ జరిగింది. సాధారణంగా ఆడియో ఫంక్షన్ అంటే టీవీ యాంకర్‌లను తెచ్చి, లక్షో, అరలక్షో ఇచ్చి, కార్యక్రమం నడిపించడం అలవాటు. కానీ ఈ సినిమాకు హీరో హీరోయిన్లు నిఖిల్, స్వాతి, తామే ఆద్యంతం యాంకరింగ్ చేసేసి, నిర్మాతకు ఖర్చు తగ్గించారు? స్వాతి పూర్వాశ్రమం టీవీ యాంకరింగే. నిఖిల్‌కు కూడా మాంచి ఎనర్జీ లెవెల్స్ వున్నాయి కాబట్టి బండిని బాగానే నడిపించేసారు. పైగా ఈ ఫంక్షన్‌కు మూడు రోజుల ముందు నుంచే టీవీలో ప్రోమోలకు కూడా నిఖిలే యాంకరింగ్ చేసాడు. చిన్న సినిమాలకు ఈ పద్ధతేదో బాగానే వున్నట్లుంది?

తాగినా.. మీరు తాగకండి

ఇటీవలి కాలంలో సినిమా ప్రారంభంలో పొగతాగడంపై, మద్యం సేవించడంపై నినాదం చూపించడం, దానికి హీరోల చేతే వాయిస్ ఓవర్ చెప్పించడం ఆనవాయితీగా మారింది. విశాల్ వేటాడు వెంటాడు సినిమాలో అయితే మరో అడుగు ముందుకు వేసి, పొగాకు కారణంగా వచ్చే క్యాన్సర్‌పై కొన్ని సెకెండ్ల ప్రకటన కూడా చూపారు. చిత్రంగా రామ్‌చరణ్ నటించిన నాయక్ సినిమా ప్రారంభంలో మాత్రం వాయిస్ ఓవర్‌కు ఎమ్ఎస్ నారాయణను ఎంచుకోవడం విశేషం. రామ్‌చరణ్ లాంటి పెద్ద హీరో ఇలాంటివి చెపితే వుండే ప్రభావం కచ్చితంగా వేరుగా వుంటుంది. ఆ సంగతి విస్మరించడమే కాకుండా, తరచు తాగుబోతు పాత్రలు వేసే ఎమ్ఎస్ చేత చెప్పించడం, కావాలని వెక్కిరించడమే అవుతుందన్న అభిప్రాయాలు వినపడుతున్నాయి ఫిలింనగర్ సర్కిల్‌లో. మరి తాగుబోతు రమేష్ చేత ఏ సినిమాలో చెప్పిస్తారో చూడాలి?

మళ్లీ వస్తోంది

జయసుధ.. జయప్రద కొన్నాళ్ల పాటు తెలుగుతెరను ఏలిన కథానాయికలు. జయప్రద బాలీవుడ్‌లోకి అక్కడి నుంచి రాజకీయాల్లోకి వెళ్లిపోయింది. జయసుధ ఇక్కడే వుంటూ, మెల్లగా రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే అయింది. కాస్సేపు కాంగ్రెస్‌లో, మరి కాస్సేపు వైఎస్ఆర్‌సి పార్టీలో వున్నట్లు నడుస్తోంది జయసుధ పొలిటికల్ కెరియర్. ఇప్పుడు జయప్రద చూపు కూడా అదే పార్టీవైపు పడిందని వార్తలందుతున్నాయి. మరోపక్క ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి జయసుధ కూడా అదే పార్టీలోకి వస్తారనీ అంటున్నారు. అంటే మొత్తానికి చాన్నాళ్ల తరువాత ఇద్దరు కథానాయికలు ఒకే చోటికి చేరబోతున్నారన్నమాట. మరేం ఇక ఆ పార్టీ పెద్ద మల్టీస్టారర్ సినిమానే అవుతుంది. ఇప్పటికే రోజా అక్కడే వుందిగా?

వెన్నెల ఆంధ్రభూమి
శుక్రవారం 1 ఫిబ్రవరి 2013

★★విశ్వరూపం

తారాగణం: కమల్‌హాసన్, ఆండ్రియా, పూజాకుమార్, లీ విట్టేకార్ తదితరులు

ఫొటోగ్రఫీ : సాను వర్గీస్

సంగీతం: శంకర్ మహదేవన్

నిర్మాత: ఆస్కార్ రవిచంద్రన్

దర్శకత్వం: కమల్‌హాసన్

అంతే 'రూపం' లేదు

నక్సలైట్ల నేపథ్యంలో దర్శకుడు కృష్ణవంశీ సింధూరం సినిమా తీసారు. నక్సలిజం మంచి చెడ్డలు చర్చిస్తూనే, వారి దైనందిన కార్యక్రమాలపై దృష్టి సారించారు. రామ్‌గోపాల్‌వర్మ సత్య సినిమా తీస్తూ అదే పని చేసారు. మణిరత్నం కొంచెం డిఫరెంట్‌గా ఇలాంటి వాటి జోలికి పోకుండా, రోజాలో టెర్రరిజంపై చర్చకు తెరతీసారు. ఇప్పుడు కమల్‌హాసన్ నుంచి టెర్రరిజం నేపథ్యంలో అద్భుతమైన సినిమా తీస్తున్నాడన్న ప్రచారం నేపథ్యంలో ఫక్తు స్పై థ్రిల్లర్ వచ్చింది. అదే విశ్వరూపం. ఈ సినిమాపై తెగ హడావుడి, గొడవలు జరిగిపోతూ వుంటే వుండొచ్చు కానీ, అది ఫక్తు స్పై థ్రిల్లర్ మినహా మరేమీ కాదన్నది వాస్తవం. ఎటొచ్చీ పనిలో పనిగా రామ్‌గోపాల్ వర్మ సత్యలో, కృష్ణవంశీ సింధూరంలో చూపినట్లు, ఈసారి టెర్రరిస్టు కుటుంబాల వ్యవహారం కూడా కాస్త టచ్ చేసాడంతే.

ఇండియన్ రా ఏజెంట్ నాజర్ (కమల్) ఓ పథకం ప్రకారం ఆఫ్ఘనిస్థాన్ టెర్రరిస్టు ముఠాలోకి ప్రవేశిస్తాడు. తెలుగు వచ్చిన జిహాదీ దొరకడం కష్టం అని అతగాడ్ని చేరతీస్తారు తీవ్రవాదులు. అప్పటికే వారి దగ్గర కొందరు అమెరికన్లు బందీగా వుంటారు. మరోపక్క ఒసామా బిన్ లాడెన్ లాంటి కీలక నేత వారి దగ్గరికి రాబోతూ వుంటాడు. ఆ టెర్రరిస్టు ముఠా నాయకుడు ఒమర్ (రాహుల్) కుటుంబానికి నాజర్ చేరువవుతాడు. ఓ పథకం ప్రకారం వారి ఆనుపానులు అమెరికా దళాలకు అందిస్తాడు. దాంతో అమెరికా సైన్యాల దాడిలో ఒమర్ కుటుంబం మొత్తం హతమవుతుంది.

అయితే సినిమా ఇలా ప్రారంభం కాదు. సగటు దక్షిణాది సినిమాల్లాగానే హీరో అజ్ఞాతవాసంతో మొదలవుతుంది. విశ్వనాథ్ (కమల్) కథక్ డ్యాన్సర్. అతగాడి భార్య నిరుపమ (పూజాకుమార్) న్యూక్లియర్ అంకాలజిస్ట్. కేవలం డబ్బు కోసం, అమెరికా రావడం కోసం అతగాడ్ని చేసుకున్న నిరుపమ, తన కొలీగ్‌కు దగ్గరవుతుంది. విశ్వనాథ్‌ను వదిలించుకోవాలంటే అతగాడి తప్పులు తెలియాలన్న ఉద్దేశంతో ఓ ప్రయివేటు డిటెక్టివ్‌ను నియమిస్తుంది. అప్పుడు తెలుస్తుంది విశ్వనాథ్ హిందువు కాదు ముస్లిమ్ అని. మరింతగా ఆరా తీయబోయి హత్యకు గురవుతాడు ఆ డిటెక్టివ్. అదే సమయంలో విశ్వనాథ్ ఆచూకీ అమెరికాలోనే అజ్ఞాతంగా వుంటున్న టెర్రరిస్టు నాయకుడు ఒమర్‌కు తెలుస్తుంది. దీంతో వాళ్లు విశ్వనాథ్, నిరుపమల వెంట పడతారు. మరో పక్క అమెరికాలో పవర్‌ఫుల్ బాంబ్ పేల్చేందుకు ఒమర్ అండ్ కో ప్రయతిస్తుంటారు. ఈ నేపథ్యంలో చివరకు ఏం జరిగిందన్నది మిగిలిన సినిమా.

కమల్‌హాసన్‌కు మన తెరపై, మన సినిమా హాలీవుడ్ స్థాయిలో చూపించాలన్నది చిరకాలపు తపన. ఇలా చూపాలంటే, కథాంశం కూడా ఆ రేంజ్‌లోనే వుండాలని

అనుకుంటాడు. కానీ కథాంశంలో కొత్తదనం వుంటుంది కానీ, కథలో కాదు. ఏదో ఒక ఉపద్రవం, దాని నుంచి తప్పించడం ఎలా అన్నదే థ్రెడ్. ఈ దారంతోటే కొత్త తళుకుల దండను తయారుచేయాలని తపన పడతాడు. వైవిధ్యమైన క్యారెక్టర్లను డిజైన్ చేస్తాడు. ఇందులోనూ అదే చేసాడు. కథక్ డ్యాన్సర్‌గా, జిహాదీగా, రా ఏజెంట్‌గా మూడు పాత్రలు డిజైన్ చేసాడు. వాటిని పోషించడంలో కానీ, కథను తెరకెక్కించడంలో కానీ వంక పెట్టడానికి లేదు. ముఖ్యంగా కథకు సరిపడా లొకేషన్లు ఎంచుకోవడంలో, చిత్రీకరణ కోసం ఖర్చు పెట్టడంలో ఎక్కడా వెనుకాడ లేదు. అయితే ఈ స్పై థ్రిల్లర్ చూస్తుంటే, హాలీవుడ్ సినిమాను తెలుగు డబ్బింగ్‌లో చూస్తున్నట్లుంటుంది తప్ప, ప్రత్యేకమైన ఫీలింగ్ ఏదీ కలుగదు. సినిమా ప్రారంభంలో వున్న భారతీయ సినిమా ఆత్మ రానురాను కనుమరుగవుతుంది. ముఖ్యంగా కథ ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రవేశించేసరికి కాస్త గాడి తప్పినట్లు అనిపిస్తుంది. అంతేకాదు, అసలు హీరో భారత్ తరపున ఆఫ్ఘనిస్థాన్ వచ్చినట్లా? అక్కడి జిహాదీలను అమెరికా సైనికులకు పట్టించడం అన్నది భారత్‌కు ఎందుకు? మరి అమెరికాకు సాయం చేసినవాడు అని తెలిసినపుడు, ఎఫ్‌బిఐ అతగాడి వ్యవహారాలు గమనించాలి కానీ, అనుమానించి అరెస్టు చేయడం ఎందుకు? పట్టించాక అమెరికా చేరిందెందుకు? నిరుపమను చేసుకుని, ఆమె చర్యలను గమనించే గాలికి వదిలేసిందెందుకు? అన్న ప్రశ్నలు అలాగే మిగిలిపోతాయి? పోనీ ఒమర్ అండ్ కో అమెరికాలో బాంబు తయారుచేస్తారని ముందుగానే పసిగట్టి, అక్కడ ఈ విధంగా మాటు వేసారని కూడా అనుకోలేం. ఎందుకంటే, ప్రయివేటు డిటెక్టివ్ రంగ ప్రవేశం తరువాత కూడా ఒమర్‌కు విశ్వనాథ్‌కు లింక్ కలవదు. పైగా కమల్ తరహా కామెడీ సినిమాలో అక్కడక్కడ మెరవడం బాగానే వుంది. అదే సమయంలో అతని స్టయిల్ తలకాయనొప్పులూ వున్నాయి. నీగ్రో క్యారెక్టర్ ఒళ్లంతా షేవ్ చేసుకునే సన్నివేశం ఇందుకు ఉదాహరణ. సినిమా ప్రారంభంలో నిరుపమ సైక్రియాటిస్ట్ దగ్గరకు ఎందుకు వెళ్లిందో కూడా అర్థం కాదు.

ఇన్ని సందేహాలు మిగిల్చే సినిమాలో స్క్రిప్ట్ మాత్రం పకడ్బందీగానే వుంది. పెద్దగా విసిగించలేదు. ఒక్క జిహాదీల జీవితాలను చిత్రీకరించేటప్పుడు తప్ప, కమల్ ఎంచుకున్న సాంకేతిక నిపుణులు, నటులు అందరూ గట్టివారే కాబట్టి, సినిమా స్థాయి కచ్చితంగా చాలా ఉన్నతంగానే వుంది. శంకర్ ఎహసాన్ లాయ్ల సంగీతంలో కథక్ నృత్య గీతం బాగుంది. నేపథ్య సంగీతం విభిన్నంగా వుంది. సాను ఫొటోగ్రఫీ కళ్లకు హాయిగా వుంది. ఆఫ్ఘనిస్థాన్‌లో జిహాదీలు-అమెరికా సైన్యం నడుమ పోరు చిత్రీకరణ బాగుంది. అయితే అంతమాత్రం చేత వంద కోట్ల బడ్జెట్ అయ్యేంతగా సినిమాలో ఏముంది అనిపిస్తుంది?

హాలీవుడ్ సినిమాలు చూసేవారికి పెద్దగా నచ్చకున్నా, ఆ రేంజ్‌లో తెలుగు సినిమాలు చూద్దామనుకునే వారికి నచ్చుతుంది.

- వి.ఎన్.ఎన్

యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్

2008లో రిలీజైన 'రేస్' సీక్వెల్ ఇది. సైఫ్‌అలీఖాన్ - అనిల్‌కపూర్ మినహా మిగతా వారంతా కొత్తవారే. 'రేస్'కి 'టూ'కి మధ్య అంతగా సమన్వయం లేకపోయినప్పటికీ - యాక్షన్ థ్రిల్లర్‌గా మనసులో అలజడి సృష్టించింది. చూట్టానికి ఇదొక రివెంజ్ స్టోరీ. అబ్బాస్ - మస్తాన్ ద్వయం భారీ బడ్జెట్‌తో భారీ లొకేషన్స్‌లో సగటు ప్రేక్షకులను థ్రిల్లింగ్‌లో ముంచెత్తటానికి చేసిన ప్రయత్నం కొంతలో కొంత సఫలీకృతమైనట్టే.

రేస్-2 కథలో - రణవీర్ సింగ్ (సైఫ్ అలీ ఖాన్) గర్ల్‌ఫ్రెండ్ సోనియా (బిపాసా బసు)ను ఆగంతకుడు హత్య చేస్తాడు. దీంతో మర్డర్ చేసిన వారిపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. మాజీ స్ట్రీట్ ఫైటర్ అన్‌లీగల్ అమీషా. ఈ నేపథ్యంలో జరిగిన మెలో డ్రామా ఏమిటన్నది చూడాల్సిందే.

కథలో అనేకానేక మలుపులు. కథకి మలుపు ఒక ఫ్లస్ పాయింట్ అయితే - ఇస్తాంబుల్, సైప్రస్ తదితర లొకేషన్స్ కథకి రిచ్‌నెస్‌ని తెచ్చిపెట్టాయి. యాక్షన్స్ సీక్వెన్స్‌లు మైమరపిస్తాయి. క్లైమాక్స్ ట్విస్ట్ బాగుంది. ఐతే - ఇవేవీ 'రేస్'ని దృష్టిలో ఉంచుకొని చూట్టం మానేస్తేనే. ఆ కథకీ ఈ కథకీ పోలిక పెట్టకూడదు. ఎంటర్‌టైన్‌మెంట్ రీత్యా ఆలోచిస్తే - రేస్-2 కూడా ట్విస్ట్ పరంగా బాగుంది. సైఫ్ అలీఖాన్ - జాన్ అబ్రహాం పోటాపోటీగా నటించి కథ తమ భుజస్కంధాలపై మోశారు. కేరెక్టర్ పరంగా కంటే గ్లామరెస్‌గా.. సెక్సీగా కనిపించింది దీపికా పదుకొనె. 'మిస్ శ్రీలంక' జాక్వెలిన్ ఫెర్నాండెజ్.. అమీషా పటేల్ - తన పరిధి మేరకు అందంగా కనిపించారు. అమీషా కాస్తంత వొళ్లు తగ్గించుకుంటే బావుంటుం దేమో?! ప్రతి క్షణం ఫ్రూట్స్ తింటూ కాలం గడిపే కేరెక్టర్‌లో అనిల్‌కపూర్ కొద్దిగా హాస్యాన్ని అందించాడు.

ప్రీతమ్ సంగీతం ఫర్వాలేదు. 'బే ఇంతేహా' 'పార్టీ ఆన్ మై మైండ్'.. ఇత్యాది పాటలు క్యాచీగా ఉన్నాయి. 'రేస్' మాదిరిగా అటు క్లాస్‌నీ ఇటు మాస్‌నీ ఆకట్టుకోవాలన్న ప్రయత్నం అక్కడక్కడ బెడిసి కొట్టడంతో 'రేస్-2' ఒక్క మాస్ ప్రేక్షకులను మాత్రమే అలరించగలదు. ఎన్నో సినిమాల్లో చూసేసిన కథ కావటం.. హాలీవుడ్ క్రైం థ్రిల్లర్స్‌ని ఇష్టపడే ప్రేక్షకులకు ఆయా కథలు కొత్త కాదు. కాకపోతే ఆ లోపాన్ని స్క్రిప్ట్ పరంగా.. ఫైట్స్ పరంగా భర్తీ చేసుకుంటూ వచ్చారు. అందులో - సోనియాని హత్య చేసిన వ్యక్తిని రణవీర్ ఛేజింగ్ చేసే దృశ్యం.. కేథడ్రిల్‌లో దొంగిలించిన అతి విలువైన

★★ రేస్-2

తారాగణం: సైఫ్ అలీఖాన్, జాన్ అబ్రహాం, అనిల్‌కపూర్, దీపికా పదుకొనె, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, అమీషా పటేల్ తదితరులు

సంగీతం: ప్రీతమ్ చక్రవర్తి

నిర్మాతలు: సిద్ధార్థ రాయ్ కపూర్, రమేష్ తురానీ, రొన్నె స్క్రెవాలా

దర్శకత్వం: అబ్బాస్ అలీభాయ్ బర్మావాలా - మస్తాన్ అలీభాయ్ బర్మావాలా

వ్యాపారాలతో కోటికి పడగలెత్తి బిజినెస్‌మేన్‌గా మారిన అర్మాన్ మాలిక్ (జాన్ అబ్రహాం)తో పరిచయం పెంచుకుంటాడు. అర్మాన్ చేయని దందా లేదు. డీల్స్ లేవు. అండర్ వరల్డ్ డాన్‌లతో అతడికున్న పరిచయాలతో దందా సామ్రాజ్యాన్ని ఏలేస్తుంటాడు. అతడికి తోడు చెల్లెలు ఎలీనా (దీపికా పదుకొనె), గర్ల్‌ఫ్రెండ్ అమీషా (జాక్వెలిన్ ఫెర్నాండెజ్). వీరిద్దరూ అడ్డొచ్చిన వాణ్ణి హత్య చేసైనా.. పంతం నెగ్గించుకోవాలనుకుంటారు. రణవీర్ ఆ కోటలో ప్రవేశించి అర్మాన్ ఆనుపానులన్నీ గమనిస్తూంటాడు. తన పథకాన్ని ఎప్పటికప్పుడు తన ఫ్రెండ్ ప్లస్ ఇన్స్‌పెక్టర్ రాబర్ట్ డి కోస్టా -ఆర్‌డి (అనిల్ కపూర్), అతని అసిస్టెంట్ చెర్రీ (అమీషా పటేల్)కి చెబుతూంటాడు రణవీర్. ఒకానొక సందర్భంలో అమీషా తన గర్ల్‌ఫ్రెండ్ చెల్లెలని తెలుసుకుంటాడు. సోనియా హత్యకు కారకుడైన అర్మాన్‌ని మట్టుబెట్టేందుకు ప్లాన్ వేశానంటుంది ఫ్యూజ్‌కి లోనయ్యే ప్రమాదం ఉంది. దీని కోసం మళ్లీ 'రేస్-3' తీయాలేమో?! షిరాజ్ అహ్మద్ స్క్రిప్ట్ ఫర్వాలేదు. మాస్ మసాలాకి ఏయే అంశాలు కావాలో? ఎక్కడెక్కడ వాటిని పొందుపరచాలన్న ఈక్వేషన్ బాగానే వర్కవుట్ అయింది. కథ రెండో భాగం అంతా 'షైడ్ ఆఫ్ టురిన్' తతంగంతోనే సరిపోయింది. ఇటలీలోని ఈ చర్చి సన్నివేశాలు అంతా నాటకీయంగా అనిపిస్తాయి. యాక్షన్ సన్నివేశాల ముందు అవన్నీ కొట్టుకు పోయినట్టే.

-బి.ఎన్.

ప్రేక్షకులకు శత్రువు

★ శత్రువు

తారాగణం: శ్రీకాంత్, అక్ష, రఘు బాబు, గిరిబాబు, చలపతిరావు, దువ్వాసి మోహన్, జాకీ తదితరులు

సంగీతం: గణ

నిర్మాత: ఎ.రామిరెడ్డి

దర్శకత్వం: ఎన్.ఎన్.ఆర్. ప్రసాద్

పాతబస్తీలో... చార్మినార్ ప్రాంతం. ఆ అమ్మాయి అక్కడ ఆటో దిగి.. పక్కనే ఉన్న బస్టాప్‌కి వెళ్తుంది. ఉన్నట్టుండి ఆమెని ఎవరో వెనుక నుంచీ తోసేస్తారు. అరక్షణంలో మృత్యువు ఆమెని పలకరించి వెళ్తుంది. ఆందోళన నుంచీ తేరుకుని - కూల్‌డ్రింక్ తాగుదామని కిరాణా కొట్టుకి వెళ్తే.. కొట్టువాడి సందేహాస్పద చూపులు. ఇంతలో -అక్కడి ఫోన్ రింగ్. ఆ కూల్‌డ్రింక్‌లో విషం కలిసిందంటూ బెదిరింపు- ఈ నేపథ్యం చూస్తే.. కచ్చితంగా ప్రేక్షకుణ్ణి ఎక్కడికో తీసుకెళ్తున్నాడన్న సందేహం కాదు ఆలోచన సుడి తిరుగుతుంది. కానీ - ఏదో క్రైం థ్రిల్లర్‌ని ఊహించేసుకుంటే సరిగ్గా దానికి వ్యతిరేక దిశలో కథ నడవటం.. నటుడు శ్రీకాంత్ కెరీర్ అలనాటి చంద్రమోహన్‌కి మల్లే 'మినిమమ్' గ్యారంటీ ఫేస్‌తో కొట్టుకొస్తున్న స్థితి ఇప్పుడు లేదు.. లోబడ్జెట్ చిత్ర నిర్మాతలకూ.. ఇటు బడా నిర్మాతలకూ మధ్య సందిగ్ధావస్థలో పడిన శ్రీకాంత్‌కి 'శత్రువు' అటువంటి ఊగిసలాటలోనే ఉండిపోయింది.

కథలోకి వెళ్తే- ఇదొక మృత్యుభయం కాన్సెప్ట్. ఆ కాన్సెప్ట్‌కి క్రైం మసాలా దట్టించి.. అక్కడక్కడ 'ప్యాచ్' వర్క్‌చేసిన కథ. అనూ (అక్ష)ని ఫోన్‌లో ఎవరో బెదిరిస్తారు. వారం రోజుల్లో చంపేస్తామన్న ఆ ఫోన్‌కాల్ ఆమెలో భయాన్ని పుట్టిస్తుంది. ఆమె ఎవరి సంరక్షణలో ఉన్నప్పటికీ వారంతా హత్యకు గురవుతారు. ఆ మిస్టరీ (?)ని ఛేదించటానికీ, తనను రక్షించుకొనే ప్రయత్నంలో ఓ జైలర్‌ని కలుస్తుంది. అతణ్ణుంచీ శంకరన్న (శ్రీకాంత్) బయోడేటా సంపాదిస్తుంది. శంకర్ మోస్ట్ డేంజరస్ క్రిమినల్. ఇతడి సెటిల్‌మెంట్ల చిట్టాకి ఒక ఫైల్ సరిపోదు. 24 కత్తిపోట్లకు గురై కూడా మృత్యువు నుంచీ తప్పించుకున్న చరిత్ర అతడిది. ఇలాంటి క్వాలిఫికేషన్లు ఎన్నో. జైలు నుంచీ విడుదలైన అతణ్ణి ఫాలో అప్ చేసి.. తనకు సహాయం చేయమంటుంది. వారం రోజుల్లో లక్షలు వచ్చి పడుతూంటే - సాయం చేయటానికేం? అని హామీ ఇస్తాడు. ఆమెని చంపేస్తామని బెదిరిస్తున్నదెవరు? అసలామె ఎవరు? ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి? ఇవన్నీ ఆరా తీస్తాడు. మృత్యు భయం ఆమెకా? లేక ఆమెని రక్షిస్తానని మాట ఇచ్చిన శంకర్‌కా?

అనూష సిటీ మేయర్ (రెహమాన్) కూతురు. కూతుర్ని ఐశ్వర్యంలో ముంచెత్తాలని తండ్రిగా అతడి ఆశ. మెడలో రుద్రాక్షలూ.. చూట్టానికి శాంత స్వభావిలా కనిపించే అతడి నిజ స్వరూపం అతడి శత్రువులకు మాత్రమే తెలుసు. విదేశాల్లో ఎంబిఏ చేసేందుకు వెళ్లిన అనూషకి కార్తీక్ పరిచయ మవుతాడు. అది ఇష్టంగా.. కొన్నాళ్లకు ప్రేమగా మారుతుంది. కార్తీక్‌కి ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆడాలన్న కోరిక. కానీ స్పాన్సరర్స్ దొరకరు. ఈ మాట అనూషతో చెప్పి బాధపడతాడు. కార్తీక్‌ని తన తండ్రి దగ్గరకు పంపుతుంది. చూట్టంతోనే ఎంతో శాంత మూర్తిలా కనిపించిన అనూష తండ్రి అసలు రూపం ఆ రాత్రి కార్తీక్‌కి అర్థమవుతుంది. సెటిల్‌మెంట్లూ.. దందాలూ.. భూకబ్జాలు - అవినీతి.. ఇదీ అతడి మరో కోణం. కార్తీక్ ఆ విషయం గమనించి.. ఉన్నట్టుండి అక్కడ్నుంచీ పారిపోవాలనుకుంటాడు. స్టేషన్‌లో రైలు ఎక్కిస్తానని.. రైలు కిందికి తోసేస్తాడు అనూష తండ్రి. ఈ సంఘటన చూసిన అనూష స్నేహితురాలు ఆమెకి ఫోన్‌చేసి కార్తీక్ హత్యోదంతాన్ని చెబుతుంది. దాంతో అనూ తన తండ్రిని ప్రశ్నిస్తుంది. మాటామాటా పెరిగి తండ్రి అవినీతి కార్యకలాపాలను అందరికీ చెబుతానంటూ ఇల్లు వదిలి బయటికి వచ్చేస్తుంది. అప్పట్నుంచీ ఆమెకు తండ్రి నుంచీ.. అధికార పార్టీ నాయకుడి నుంచీ బెదిరింపులు వస్తూంటాయి. ఈ నేపథ్యంలోనే శంకర్‌ని ఆశ్రయిస్తుంది అనూ.

ఆ తర్వాత కథ ఏమిటో? ఎవరిని అడిగినా చెప్పేస్తారు.

కథ ఎన్ని మలుపులు తిరిగినా.. ఎటు నుంచి ఎటు వెళ్లినా.. పాత కథలనే తలపించటం దర్శకుడి లోపం కాదు. కథాలోపం. ఆ లోపం కనిపించకుండా ఉండటం కోసం 'డైలాగ్స్' అస్త్రాన్ని ప్రయోగించాడు. కవితాత్మక ధోరణిలో.. యతి ప్రాసల కోసం యత్నించినప్పటికీ.. మాటలు అక్కడక్కడ పేలటం ఈ చిత్రానికి కనిపించని ఎసెట్. కథకి ఊపిరి. కామెడీ ట్రాక్ లేకపోవటం మరో మైనస్. పాటలు కూడా సరిగ్గా టైంకి వచ్చేస్తూంటాయి.

కథాపరంగా కొంతవరకు మేయర్.. మరో భాగాన్ని అక్ష తీసేసుకుంటే.. శ్రీకాంత్‌కి ఇక మిగిలింది ఫైట్స్.. పాటలు.. కొన్ని డైలాగ్‌లు మాత్రమే. ఇది తండ్రీ కూతుళ్ల కథ. అంతే. దీనికి 'బాడీగార్డ్'లా శ్రీకాంత్ట్ట హీరోయిన్లు పాటలకే పరిమిత మవుతున్నారన్న మాట శ్రీకాంత్ విషయంలో ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. దీనికితోడు మెలో డ్రామా.. సెంటిమెంట్లూ.. సినిమా కథ నేచురాలిటీకి దగ్గరగా ఉండటం లేదన్న సంగతిని రుజువు చేస్తూ - ఎన్ని కత్తిపోట్లు దిగినా.. హీరోయిన్‌ని రౌడీలు ఏ దారిలో తీసుకెళ్లారన్నది ఇట్టే తెలిసిపోతూంటుంది. ఇంతకీ అనూ తండ్రి అనూషకి శత్రువా? లేక శంకర్ శత్రువా? అన్న సందేహం వస్తూంటుంది. చావంటే భయం లేదని.. మాటిమాటికీ డైలాగులు వల్లిస్తే సరిపోతుందా? దానికి తగ్గ గాంభీర్యత ఉండొద్దా? ఫ్లష్‌బ్యాక్ ఏమిటో చెప్పు? అంటూ అనూని వేధించటం.. చీకాకు పుట్టిస్తాయి. మాటలు మినహా సంగీతం ఒకటే రొద. 'రేగిపండ్లు' పాట కాస్తంత మాస్. నటన విషయంలో.. అక్ష - రెహమాన్ కథని లాక్కొచ్చారు. మిగతా పాత్రలన్నీ మరీ చిన్నవి. ఒకటీ రెండు డైలాగులకే పరిమితమై పోయాయి. ఇప్పటికైనా - శ్రీకాంత్ హీరో తరహా పాత్రలపై మోజు తగ్గించుకొని.. కేరెక్టర్ రోల్స్‌లోకి వెళ్లటం మంచిదేమో?! అక్ష ఫర్వాలేదు. మంచి రోల్స్ వస్తే చేయగల సత్తా ఉంది. అందరూ సీనియర్ నటులే అయినప్పటికీ.. కథాపరంగా వారికి ఎటువంటి ప్రాధాన్యత లేకపోవటంతో తేలిపోతారు. దర్శకత్వం గురించి అంతగా చెప్పుకోవాల్సిందేం లేదు. ఎందుకంటే - ఎమోషనల్స్ సీన్స్ ఉండవు కాబట్టి.

-బిఎన్కే

శుక్రవారం 1-2-2013

రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

శ్రీ నందన, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం,

తిథి- బహుళ పంచమి ఉ.09.25,

నక్షత్రం- హస్త సా.06.09,

వర్జ్యం- రా.02.01నుండి 03.33 వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)

ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. ప్రతి పని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.)

మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు.

మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రు బాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు. ఆకస్మిక లాభాలుంటాయి.

మిథునం (మృగశిర 3,4పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.)

వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగానుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష)

అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.)

మానసికాందోళనతో ఉంటారు. ఆకస్మిక ధన నష్టం కలిగే అవకాశముంది. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేకశ్రద్ధ అవసరం. విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.)

ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి.

ఆకస్మిక ధన లాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

తుల (చిత్త 3,4పా., స్వాతి, విశాఖ 1,2,3పా.)

కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి.

ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ)

రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లల పట్ల జాగ్రత్తగానుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్పఅనారోగ్య బాధలుంటాయి.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.)

మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధలనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. చెడు సహవాసానికి దూరంగా నుండుటకు ప్రయత్నించాలి.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.)

తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగానుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి)

విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తవహించుట మంచిది. అనవసర వ్యయప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

అవార్డుల వేటలో మరో చిత్రం

★★ సిల్వర్ లైనింగ్స్ ప్లే బుక్

తారాగణం: బ్రాడ్లీ కూపర్, జెన్నిఫర్ లారెన్స్ రాబర్ట్ డినీరో, జాకీ కీపర్ క్రిస్ టక్కర్, అనుపమ్‌ఖేర్ తదితరులు.
సంగీతం: డాని ఎఫ్‌మిన్
ఫొటోగ్రఫీ : మసనోబు తవ్‌యాంగ్
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: డేవిడ్ రస్సెల్

మాథ్యూ క్విల్ రాసిన ''సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్'' నవల ఆధారంగా అదే పేరుతో రూపొందిన అమెరికన్ రొమాంటిక్ కామెడీ డ్రామా చిత్రం ఇది. రొమాంటిక్ డ్రామా ప్రధానంగా కొనసాగిన ఈ నవల భావోద్వేగాలతో కూడుకుని వుండటం వలన నవలను సినిమాకెక్కించడానికి దర్శకుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రస్సెల్ ఈ నవలను అయిదేళ్ళనుండి ఇరవైసార్లు స్క్రిప్టును తిరగరాశారు. కుటుంబ సంబంధాల గొప్పదనాన్ని వివరించటంతోపాటు, ఈ నవల లోని నాయకుడిలా రస్సెల్ కొడుకు మానసిక రోగి కావడంవల్ల, అతను ఈ నవల పట్ల ఆకర్షితుడై దాన్ని సినిమా తీయాలని సంకల్పించాడు.

మానసిక ఉద్రేకాలవల్ల మనిషి రెచ్చిపోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించవచ్చు. ఉద్రేకాలను అదుపులో పెట్టుకునేవాళ్ళు కొందరే వుంటారు. ఉద్రేకంలో ఏం చేస్తున్నారో తెలియని మనుషులను చూసి భయపడి వాళ్ళను పిచ్చి ఆసుపత్రిలో చేర్చే ప్రమాదముంది. అలా పిచ్చాసుపత్రిలో వుండిపోయిన పాట్ అనే టీచర్ ఎనిమిది నెలల తర్వాత విడుదలవుతాడు. తనను మోసగించిన మాజీ భార్య ప్రేమను చూరగొనాలనుకుంటాడు. విధవరాలైన టిఫాన్ తన ఒంటరితనాన్ని, డిప్రెషన్‌ను పోగొట్టుకోవడానికి తన ఆఫీసులో వున్న అందరితో సెక్స్ సంబంధాలను పెట్టుకుంటుంది. ఫిలడెల్ఫియా ఈగిల్ పార్టీని విపరీతంగా అభిమానించే పాట్ తండ్రికి పందాలు కట్టే సరదా ఎక్కువ. పాట్ స్నేహితుడు రోన్ని పెళ్ళిచేసుకుని వివాహ సంబంధంలో చిక్కుకునిపోతాడు. అతని భార్య అతని ఆత్మవిశ్వాసాన్ని రూపుమాపి అతనిపై పెత్తనం చెలాయిస్తూ వుంటుంది. ఈ పాత్రధారులు చుట్టు అల్లుకున్న ఈ కథ వాళ్ళ స్వభావాలను, ప్రవర్తనను అద్భుతంగా చిత్రీకరించింది.

పాట్ తల్లిదండ్రుల సహకారంవల్ల మానసిక సమస్యల నుండి చికిత్స పొంది పిచ్చాసుపత్రి నుండి ఎనిమిది నెలల తర్వాత బయటకు రావడంతో చిత్రం ప్రారంభమవుతుంది. పాట్ భార్య నిక్కీ అతని నుండి దూరమవుతుంది. తండ్రికి ఉద్యోగంపోయి ఆర్థిక ఇబ్బందుల్లో వుంటాడు. తిరిగి తన భార్య ప్రేమను పొంది తన జీవితాన్ని సరియైన మార్గంలోకి మళ్ళించాలనుకుంటాడు.

ప్రభుత్వం నియమించిన సైకియాట్రిస్ట్ డాక్టర్ పాటిల్ దగ్గరకుపోయి, తాను ఆస్పత్రికి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందో చెబుతాడు. టీచర్‌గా పనిచేస్తున్న పాట్ ఒకరోజు స్కూలునుండి ఇంటికి వచ్చేసరికి, తన భార్య నిక్కీ షవర్ కింద ఇంకో టీచర్‌తో సెక్స్‌లో ఉండటాన్ని చూసి భరించలేకపోతాడు. పట్టలేని కోపంతో వాడ్ని చచ్చేట్టు కొట్టడంతో, ఉన్మాదిగా ప్రవర్తించాడని పిచ్చాసుపత్రిలో వేస్తారు.

విడుదలైన పాట్ తన మిత్రుడైన రోనీ ఇంటికి డిన్నర్‌కు వెళ్ళగా అక్కడ అతని మరదలు టిఫాన్ కలుస్తుంది. ఉద్యోగం పోగొట్టుకున్న యంగ్ విడో టిఫాన్ తన కామవాంఛలకు చికిత్స పొంది వస్తుంది. టిఫాన్, పాట్ వారి మానసిక సమస్యల గురించి చర్చించుకోవడంతో స్నేహితులవుతారు. పాట్ విడిపోయిన నిక్కీతో సంబంధాలు నెరపడానికి టిఫాన్‌ని ఉపయోగించుకోవాలనుకుంటాడు. పాట్ రాసిన ఉత్తరాలను నిక్కీకి అందజేస్తే, దానిబదులుగా రాబోయే డాన్స్ పోటీలలో తనకు పార్ట్‌నర్‌గా అతను పాల్గొనాలనీ ఆమె షరతుపెడుతుంది. పాట్ దానికి ఒప్పుకోవడంతో ఇద్దరూ కలిసి డాన్స్ బాగా ప్రాక్టీస్ చేస్తారు. ఆ డాన్స్ గనుక నిక్కీ చూస్తే తను మంచిమనిషిగా మారానని గుర్తిస్తుంది అనుకుంటాడు. నిక్కీ రాసిన ప్రేమ ఉత్తరాన్ని టిఫాన్ తెచ్చి పాట్‌కు ఇస్తుంది.

పాట్ తండ్రి ఈగిల్స్ ఫుట్‌బాల్ టీం మీద తన పూర్తి డబ్బును పందెం కాస్తాడు. పాట్ ప్రాక్టీస్‌ను వదిలి ఆ గేమ్ చూడటానికి వస్తాడు. అక్కడ వర్ణ వివక్షత కల్గిన ముఠా తన సైకియాట్రిస్ట్ డాక్టర్ పాటిల్ అతని సోదరుడిపై దాడి చేస్తుండగా, వారితో పోట్లాడిన పాట్‌ను పోలీసులు పట్టుకుంటారు. ఈగిల్స్ ఓడిపోతుంది.

టిఫాన్, పాట్‌లు పాల్గొన్న డాన్స్ పోటీలో వీరి జంట మీద పాట్ తండ్రి పందెం కాస్తాడు. పాట్ డాన్స్‌లో పాల్గొనేముందు నిక్కీ రాసిన ఉత్తరాన్ని మళ్ళీ చదువుతాడు. అందులోని భాషను చూసి అది నిక్కీ రాసింది కాదనీ, నిక్కీ పేరుతో టిఫాన్ రాసిందని గుర్తిస్తాడు. ఫుట్‌బాల్ పోటీలను చూడటానికి అందరితోపాటు పాట్, టిఫాన్ కూడా వస్తారు. అక్కడ ప్రేక్షకులలో వున్న నిక్కీని చూసి టిఫాన్ హడలిపోతుంది. ఆమెను చూసి పాట్ వెళ్ళిపోతే తాను ఒంటరినై పోతానని భయపడుతూ ఆమె బార్‌కు వెళ్ళి తాగుతుంటుంది. అది చూసి పాట్ వెళ్ళి ఆమెకు నచ్చజెప్పి ఆడిటోరియంకు తీసుకువచ్చి డాన్స్ పోటీలో పాల్గొనడంతో ఆ జంట గెలుస్తుంది. ప్రేక్షకుల అభినందనలతో ఆ కుటుంబం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ప్రేక్షకులలో వున్న నిక్కీ దగ్గరకు మాట్లాడటానికి పాట్ వెళతాడు. అది చూసి టిఫాన్ గుండె బద్దలవుతుంది. ఇక తనకు అక్కడ స్థానంలేదని బాధతో వెళ్ళిపోతుంది. అది చూసి పరుగెత్తుకుంటూ వచ్చిన పాట్ ఆమెను తాను ప్రేమిస్తున్నాననీ, అది నిర్ధారించుకున్నాకనే చెబుదామని ఆగిపోయానని చెబుతాడు. నిక్కీ రాసినట్టుగా ఆమెనే ఉత్తరాలు రాసి తెచ్చివ్వడాన్ని తాను గుర్తించానని చెబుతాడు. అలా వాళ్ళు కలిసిపోయి దంపతులు కాగా, పాట్ తండ్రి గెలిచిన డబ్బుతో కొత్త రెస్టారెంట్‌ను ప్రారంభిస్తాడు.

ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారులైన పాట్‌గా బ్రాడ్లీ కూపర్, టిఫాన్‌గా జెన్నిఫర్ లారెన్స్, పాట్ తండ్రిగా సీనియర్ నటుడు రాబర్ట్ డినీరో చక్కగా నటించారు. సైకియాట్రిస్ట్ డా.పాటిల్‌గా హిందీ నటుడు అనుపమ్‌ఖేర్ హుందాగా నటించారు. ఈ చిత్రం విశేష ప్రజాదరణను, విమర్శకుల ప్రశంసలను పొందడంతోబాటు అవార్డు రేసులో ముందంజ వేసింది. ఇది నాలుగు గోల్డెన్ గ్లోబ్ అవార్డు నామినేషన్లతోపాటు, ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో కలిసి ఎనిమిది ఆస్కార్ అవార్డులకు నామినేషన్లను పొందగలిగింది. అలాగే మూడు బఫ్తా అవార్డు నామినేషన్లను, నాలుగు స్క్రీన్ ఆక్టర్స్ గిల్డ్ నామినేషన్లను, అయిదు ఇండిపెండెంట్ స్పిరిట్ అవార్డు నామినేషన్లను పొందగలగడం విశేషమే.

- కె.పి.

యథాతథంగా యథార్థగాథ

ఇది యదార్థగాథల సీజన్ అనుకుంటా! ఎందుకంటే గత వారం విడుదలైన 'క్రిష్ణ లవ్స్ గీత' చిత్రం డబ్బై అయిదుశాతం నిజం... అని చెప్పుకుంటే, ఇప్పుడొచ్చిన 'దండుపాళ్యం'కు, నిజం...ఇది కథకాదు అన్న ఉపశీర్షిక నినాదం ఇచ్చారు. విశేషమేమిటంటే ఈ రెండూ కూడా కన్నడంనుంచి తెలుగుకు అనువాదితమైనవే. ఎనభై తొంభై దశకాల్లో బెంగుళూరుకు ఓ గంట ప్రయాణం వ్యవధిలో ఉన్న 'దండుపాళ్యం' ప్రాంతంనుంచి ఏర్పడ్డ దొంగలు చేసిన బీభత్సం వగైరాల సమాహారం ఈ చిత్రం ఇతివృత్తం. ఈ ముఠాలో ఉన్న స్త్రీ పగలు ఇళ్లవద్దకు వెళ్లి అక్కడి ఆనుపానులు గ్రహించి తర్వాత వాళ్ల బృందంతో అనువైన సమయంలో వస్తుంది. మొదట ఆమె వెళ్లి తలుపుతట్టి మంచినీళ్లు అడుగుతుంది. లోపల ఉన్న మహిళ నీళ్లివ్వడానికి వెళ్లగానే దళంలో మిగతావారు లోపలికి వచ్చి చంపడం, పాడుచేయడం, దొంగతనాలు చేయడం జరుగుతుంది. ఈ విధానం ద్వారా లెక్కలేనన్ని చేసినా ఎవరికీ దొరకరు. తర్వాత ఓ చిన్న ఆధారంతో పోలీసధికారి చలపతి పట్టుకోవడం, ఉరిశిక్ష పడేలా విషయాన్ని తీసుకురావడంతో అంతమవుతుంది. ఇంత ఈజీగా హత్యలూ, మానభంగాలూ జరుగుతాయా అంటే జరిగేయి కదా అని చరిత్ర తిరగేస్తున్నారు. కానీ దర్శకుడు ఇలా జరిగిన బీభత్సాన్ని ఈ స్థాయిలో తెరపై చూపెట్టడంవల్ల ఆ విధానానికి బలహీన మనస్కులు ఆకర్షితులైతే పరిణామాలు ఊహించుకుంటేనే ఆందోళన కలుగుతోంది. అసలు యదార్థమనుకున్నాం, అయినది అందులో తీవ్రత ఎక్కువ వుంటే దాన్ని సాధ్యమైనంతగా తగు ప్రమాణంలో తెరపై చూపిస్తే చాలు. పైన చెప్పిన చోరీ విధానం పదేపదే చూపారు. ఆపై వారు జరిపే హింసనీ కూడా. అసలన్నిసార్లు చూపక్కరలేదు. ఒక్కసారి చూపితే చాలు. అసలంతకన్నా చిత్రం నిడివి వున్న రెండుగంటల నాలుగు నిమిషాల్లోనూ దర్శకుడు అర్థవంతంగా విభజించుకోవచ్చు. తొలి కొంత భాగం వారి విధానాలు చూపినా, అసలు వారలా మారడానికి ఉన్న నేపథ్యంపైనా, ఇంకొంత భాగం అలాంటి ఘటనలను ఎలా ఎదుర్కోవాలన్న దానిపైనా విభజించి వుంటే సముచితంగా ఉండేది. అలాకాకుండా ఇలా 'యదార్థమంటూ'అదే పదే పదే చూపితే విషయంలోకి వాణిజ్యకోణంపైనే చిత్రం ఎక్కువ దృష్టిపెట్టిందన్న భావనా కలుగుతుంది. ఈ భావనకు బలం లక్ష్మి తదితర పాత్రల (పూజాగాంధీ)పై కల్లుకాంపౌండ్ బ్యాక్‌గ్రౌండ్‌గా చూపిన కిళ్లీ నాకిళ్లీ, ఏక్‌దో తీన్ జోర్‌గావో, సీటీమారో పాట సన్నివేశం. అలాగే ఈ బృందం అంతా విచ్చలవిడి శృంగారానికి పరమాకర్షితులు అని అప్పటికే చూపారు. అయినా వేశ్యను ప్రవేశపెట్టి ఓ సన్నివేశం, అందులో ఇంకొన్ని అభ్యంతరకర మాటలు చొప్పించడం శుద్ధ అనవసరం. ఇది

విస్మరిస్తే దర్శకుడు చిత్రం తీర్చిదిద్దడానికి చేసిన హోమ్‌వర్క్ అంతాఇంతా కాదు. చిత్రంలో నటీనటులను ఎన్నుకున్న దగ్గర్నించీ, పాత్రల ఆహార అలవాట్లు, (గాడిద మాంసం తినడం, పందుల్ని పట్టుకోడం లాంటివి) దొంగలకీ ఉన్నత స్థాయిలో ఉన్నవారికీ వున్న అవగాహన గురించి ఇలా ఒకటేమిటి అన్నిటిపైనా సాధికారిత కోసం ప్రయత్నం చేసినది స్పష్టంగా కనపడుతోంది. దురదృష్టంకొద్దీ వాటన్నిటికీ మోతాదు మించిన హింసను జతచేయడంతో తెరపై దాన్ని తట్టుకోడం కష్టమైంది. దొంగలు సెక్షన్ 395లాంటివి పేర్కోడంలో చిత్రంలో లాయరు ఓ సందర్భంలో నువ్వు నల్లకోటు వేసి వాదించుకోకూడదా? అని అంటాడు. కొన్నిచోట్ల దృశ్యపరంగా చూపిన స్థాయి సరిపోదనుకున్నారో ఏమో, మీరెందుకు ''వెయ్యికీ, రెండువేలకీ హత్యలు చేస్తారంటే, ఆ తర్వాత వాళ్ల వంటిపై, ఇళ్ళల్లో చేసే దోపిడీ వుందిగా! అంటూ వివరణిప్పిస్తారు. అలాగే ఇంకోచోట చంపడానికి వివిధ పద్ధతులుండగా నువ్వలా గొంతుకోసే చంపుతావెందుకు అని పోలీసధికారి కృష్ణ (మకరంద్ దేశ్‌పాండే)ని అడిగితే ''అలా గొంతుకోయడంవల్ల వచ్చే ధ్వని నాకిష్టం''అంటూ చెప్పించారు. ఇది ఎంతగా నిజం అయినా, ఆ స్థాయి చిత్రణ విషయంలో దర్శకుడు సంయమనం పాటించవల్సింది. పాత్రధారుల విషయానికొస్తే లక్ష్మి పాత్రధారిణి పూజాగాంధీయే మొత్తం ఫోకస్ వశం చేసుకున్నారు. ఆ పాత్ర కూర్చోడం దగ్గర్నుంచి, పాత్రోచితంగా ధూమపానం చేయడం తదితర హావభావాలన్నీ కచ్చితంగా చేసేశారు. ఆ పాత్ర అంతగా రాణించడానికి ఆమెకు గళదానం చేసిన కళాకారిణీ కారణమే. తర్వాత ఎక్కువశాతం ఆకర్షించిన నటుడు తిమ్మపు పాత్రధారి జైదేవ్. చూసే చూపు, చేసే చేష్టలా అన్నీ సైలంట్‌గా చూపరులను భయం పుట్టించాయి. మిగతా పాత్రధారులూ, ఆ పాత్రలే కన్పడేలా చేశారు. సంభాషణలు చాలాచోట్ల శృతి తప్పాయి. అక్కడ సెన్సారు కత్తెరా చురుగ్గా పనిచేసింది. అయినా ఇంకొన్నిచోట్ల దాని జాడలు కనపడ్డాయి. ''మీరు గీతే గీస్తే మేము రోడ్డేవేస్తాం''అని నేరస్థుణ్ణి ఉద్దేశించి పోలీసు అధికారి అన్న మాట బాగుంది.

న్యాయస్థానంలో న్యాయవాది పాత్ర ద్వారా గరుడపురాణం వాక్యాలు చెప్పించడం బాగుంది. సమాచార హక్కు స్ఫూర్తిని అర్థంచేసుకోకుండా దుర్వినియోగంచేసిన తీరునీ చిత్రంలో ఇనస్పెక్టరు పాత్రద్వారా చెప్పించారు. ఆ పాత్రధారి (రవిశంకర్) కూడా బాగా ఆకట్టుకున్నారు.

మొత్తానికి దర్శకునిలో ఉన్న యదార్థ ఆవిష్కరణ అంశం అభినందనీయమైనా, దాన్ని సమంజసమైన రీతిలో తెరకెక్కిస్తే అన్నివిధాలా బాగుండేది. వీరే 'దండుపాళ్యం 2'. వాగ్దానం చేశారు కనుక అందులో తగిన జాగ్రత్తలు తీసుకుంటారేమో చూద్దాం! సమస్యల్ని ఎత్తిచూపడమే కాదు, అవి సమసిపోయే పరిష్కారాలూ సూచించడం సమంజసం- అవసరం కూడా!

- అన్వేషి

వెన్నెల ఆంధ్రభూమి
శుక్రవారం 1 ఫిబ్రవరి 2013

★ దండుపాళ్యం

తారాగణం: రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రఘుముఖర్జీ, నిషాకొఠారీ, సుధారాణి, భవ్య, దొడ్డన్న, రవికాలే, జయదేవ్, ప్రతీక్, శ్రీనివాసమూర్తి, కారిసుబ్బు, యతిరాజ్, పెట్రోల్ ప్రసన్న, బుల్లెట్ ప్రకాష్, తదితరులు.
సంగీతం: అర్జున్‌జన్యా
నిర్మాత: వెంకట్
దర్శకత్వం: శ్రీనివాసరాజు

రివ్యూలు

సాంప్రదాయ తెలుగు చిత్రం 'సీతమ్మ'

దాదాపు 20 సంవత్సరాలు తర్వాత మల్టీస్టారర్ చిత్రంతో పాటు అచ్చతెలుగు చిత్రంగా 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' నిలిచిపోతుంది. అనురాగాలు, ఆప్యాయతలు, అనుబంధాలు, అపార్థాలు అన్ని ఈ తెలుగింటి చిత్రంలో కనిపిస్తాయి. పెద్దోడి పాత్రలో వెంకటేష్ నటన సోసోగా వున్నా చిన్నోడి పాత్రలో మహేష్ నటన సూపర్‌గా వుంది. 'ఏరా', 'ఒరేయ్', 'నువ్వు మరీనారా బాబు'లాంటి సింపుల్ డైలాగ్‌లు చక్కగా పలికారు. రేలంగి పాత్రలో ప్రకాష్‌రాజ్ జీవించారు. సీతమ్మలో అంజలి నటన ఎంత ఎక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. అన్ని బాగున్నా సినిమాలో ఇంటర్వెల్ తర్వాత కొంత వేగం తగ్గింది. హాస్య నటుడు రవిబాబు అనవసరం అన్పించింది. మిక్కిజేమేయర్ సంగీతం అద్భుతం. 'మరీ అంతగా', 'వాన చినుకులు' 'సీతమ్మ'పాటలు బాగున్నాయి. ఇంత మంచి చిత్రం అందించిన దిల్‌రాజ్, దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల మరింత పెద్దస్థాయికి ఎదగాలని ఆశిస్తున్నాం.

- నల్లపాటి సురేంద్ర, విశాఖపట్నం

సింపుల్‌గా, ఆహ్లాదంగా వుంది

'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు'. వినటానికి ఈ పేరు చాలా సింపుల్‌గా, ఆహ్లాదంగా వుంది. అలాగే ఈ సినిమాలో పాత్రలు కూడా అంతే సింపుల్‌గా ఉన్నాయి. ఈ సినిమాలో

చూడటానికి కథ అంటూ ఏమీ లేదు. పక్కవారిని చిరునవ్వుతో పలకరించాలి, అప్పుడే మనిషి అనేవాడు హాయిగా ఉంటాడు అనే కాన్సెప్ట్‌తో తయారైన తెలుగువారి ఆత్మీయ అనుబంధాలతో వుట్టిపడే సినిమా ఇది. ఈ కథను నడిపించినది శ్రీకాంత్ అడ్డాల అయినా, ఈ సినిమా రూపకల్పన చేసి వెంకటేష్, మహేష్ లాంటి హీరోలను పెట్టి శ్రీకాంత్ మలచిన పాత్రలకు డబ్బులు పెట్టి ప్రాణంపోసిన దిల్‌రాజుగారిని ఎంతో అభినందించాలి. ప్రకాష్‌రాజ్, మహేష్, వెంకటేష్, జయసుధ, కోట లాంటి హేమాహేమీలు వున్న ఈ చిత్రంలో అంజలి నటన చాలా బాగుంది. సీత పాత్రలో చాలా చక్కగా నటించింది. ఇక మాటల విషయానికి వస్తే గణేష్‌పాత్రో తన కలాన్ని ఎక్కువగా శ్రమపెట్టలేదు. కాని మూడునాలుగు పాత్రలనుండి మాటలు ఆలోచింపజేస్తాయి. సిరివెన్నెల, అనంత్‌శ్రీరామ్ సందర్భానికి తగినట్లుగా రాసిన పాటలు బాగున్నాయి. సినిమాటోగ్రాఫర్ గుహాన్ ప్రతి ఫ్రేమ్‌ను తన కెమెరాలో ఆహ్లాదకరంగా బంధించాడు. సంగీత దర్శకుడు మిక్కిజేమేయర్ విషయానికి వస్తే ప్రతి పాట బాగుంది. సంపాదన, డబ్బు కాదు ముఖ్యం. అనురాగం, ఆప్యాయతలు, సమాజంలో ఇది వున్నంతకాలం సాటి మనిషి అనేవాడు ఆనందంగా ఉంటాడు అని దర్శకుడు ఈ సినిమా ద్వారా తెలియజేశాడు.

- పి.వి.కె.సుజిత్‌కుమార్‌రెడ్డి, కొమరోలు

వెజిటేరియన్ భోజనం

దిల్‌రాజు నిర్మించిన 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' చిత్రం పూర్తిగా క్లాస్ అండ్ వెజిటేరియన్ భోజనం అనిపిస్తుంది. నేటి ట్రెండ్‌కు ఈ సినిమా సూట్ కాలేదు. పూర్తిగా అనుబంధాలు ఆప్యాయతలపై వచ్చిన ఈ చిత్రంలో అన్నదమ్ములుగా నటించిన వెంకటేష్, మహేష్‌లు తమ పాత్రలలో లీనమయ్యారు. హీరోయిన్లుగా సమంత, అంజలి పాత్రలు క్లాస్‌మాస్‌ను మెప్పించాయి. ముఖ్యంగా గీతగా వేసిన సమంత పాత్ర చిత్రానికే శోభనిచ్చింది. వాన చినుకులు, వాన చినుకులు అన్న గీతం క్లాస్ పాట. ఈ పాటలో వెంకటేష్ అంజలిలు లీనం అయిపోయారు. తల్లిదండ్రులుగా నటించిన ప్రకాష్‌రాజ్, జయసుధల పాత్రలు నిజ జీవితంలో మనం తల్లిదండ్రులుగానే భావిస్తాము. చిన్నబ్బాయ్ మహేష్ అంటే ప్రాణం ఇచ్చి తల్లిగా రక్షికట్టించింది. వెంకటేష్ నిజంగా ఈ చిత్రంలో పెద్దబ్బాయిగా మంచి నటన ప్రదర్శించాడు.

- కేలిపాక శ్రీనివాస్, బెల్లంపల్లి

అద్భుతమైన దృశ్యకావ్యం

పాత చింతకాయపచ్చడి లాంటి కథలకు అర్థంపర్థంలేని కథనాల్ని జోడించి ప్రేక్షకులను మానసికంగా తెలుగు సినిమాలు తీవ్రంగా హింసిస్తున్న తరుణంలో వేసవిలో పన్నీటి జల్లులా వచ్చిన అద్భుతమైన దృశ్యకావ్యం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లెచెట్టు' సినిమా. సినిమా పరిశ్రమలో ఒక టాప్ ప్రొడ్యూసర్ అయ్యివుండి టాప్ స్టార్స్‌తో కమర్షియల్ విలువలు అనేవి మచ్చుకైనా లేకుండా సినిమా తీసిన దిల్‌రాజు ధైర్యసాహసాలకు హ్యాట్సాఫ్. ప్రతీ సన్నివేశాన్ని అద్భుతమైన ఫ్యామిలీ ఫొటోలా పది కాలాలపాటు అందరి మనసులలో గుర్తుండిపోయేలా తెరకెక్కించిన దర్శకుడు అడ్డాల శ్రీకాంత్‌కు జోహార్లు. మనం నవ్వుతూ అందరినీ సంతోషంగా వుంచాలి. సమాజానికి మంచి కుటుంబాలే ఆధారం అన్న పాయింటును చాలాబాగా చెప్పారు. లోపాలు కొన్ని వున్నా మంచి సినిమాచూస్తున్న అనుభూతిలో అవేమీ పెద్దగా మనకు పట్టవు. ఇటువంటి మంచి సినిమా మళ్ళీ వచ్చే పదేళ్ళలో రాకపోవచ్చు.

- సి.సాయిమనస్విత, విజయవాడ

కుటుంబ సభ్యులతో చూడవచ్చు

ఎటువంటి కమర్షియల్ ఎలిమెంట్స్ లేకుండా ఒక మంచి చిత్రం, ఒక మల్టీస్టారర్ చిత్రం, ఒక కుటుంబ కథా చిత్రం, ఒక స్వచ్ఛమైన తెలుగు చిత్రం తీయవచ్చు అని శ్రీకాంత్ అడ్డాల అనే దర్శకుడు 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రం తీసి నిరూపించాడు. ఈ చిత్రాన్ని మన కుటుంబ సభ్యులతో నిర్భయంగా చూడవచ్చు అని భరోసా ఇచ్చాడు. ఒక ఐటంసాంగ్ లేదు, భారీ ఫైట్స్ లేవు, ద్వంద్వ అర్థాల డైలాగులు లేవు, హీరోయిన్ అంగాంగ ప్రదర్శన లేదు, కామెడీ ట్రాక్ లేదు. కుటుంబం, విలువలు స్వచ్ఛమైన తెలుగు బాగుంది. మన జీవితంలో జరిగే సంఘటనలే కథగా మలిచి మనకు ఒక గొప్ప చిత్రాన్ని, అనుభూతిని మిగిల్చాడు. వెంకటేష్, మహేష్ ఇద్దరూ హుందాగా నటించారు. ప్రకాష్‌రాజ్ ఆయనకు ఆయనే సాటి. గుహాన్ సినిమాటోగ్రఫీ ఒక పెయింటింగ్‌లా అనిపించింది. సీత పాత్రలో నటించిన అంజలి మాత్రం మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

- బి.ఉరుకుందయ్య, ఆదోని

కథ తక్కువ సరదా ఎక్కువ

ఇరువురు టాప్ పాపులర్ నటుల కాంబినేషన్‌లో సినిమా కథ నడవాలి కాని వారికి భిన్నమైన ఇమేజి కథలో కనిపించకూడదు. ఇరువురికీ సమానస్థాయి పాత్రలు నడవాలి, వారి మధ్య సంఘర్షణ సన్నివేశాలు, సంభాషణలు కొట్లాటలు, కనీసం ఒకరికి ఎక్కువ మరొకరు తక్కువ సీన్లు పడకుండా చూసుకోవాలి. ఇటువంటి ఆంక్షలు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఫైనాన్షియర్, దర్శకుడ్ని, కథకుడ్ని ఒక కథని కాగితంమీద పెట్టమంటే అచ్చం సకుటుంబ సపరివార సంక్రాంతి చిత్రం తయారౌతుంది. అదే దిల్‌రాజు ఎంటర్‌టైనర్ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' సినిమా. కథలో ఏమాత్రం కొత్తదనం లేక నెమ్మదించింది. ఆ లోటు వెంకటేష్, మహేష్‌లు ఫ్రేక్వెన్సు ఎంట్రెన్సులు యిచ్చి కొంత తీర్చగలిగారు. గతంలో స్టార్ కాంబినేషన్స్‌లో వచ్చిన గుండమ్మకథ, మిస్సమ్మ, చరణదాసి, మాయాబజార్ వంటి ఆణిముత్యాలు. ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌ల కోసం ఎవరూ తాపత్రయపడలేదు. వాటిని కథా, కథనాలే అమోఘంగా నడిపించాయి. వరుసగా వస్తున్న బీభత్సం సినిమాలు, రక్తపాతాలు, తలలు, సుమోలు గాల్లో పల్టీలు వగైరాలు చూసి చూసి విసిగిపోయిన ప్రేక్షకులకి సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు సినిమా తప్పక నచ్చుతుంది.

- తాళాబత్తుల సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం

కల్మషంలేని గోదావరి

శ్రీకాంత్ అడ్డాల కలం నుండి జాలువారిన సంక్రాంతి సంబరం ఈ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు'. ప్రస్తుతం నానాటికీ ఉమ్మడి కుటుంబం యొక్క విలువలు దిగజారిపోతూ వుంటే ఆ ఉమ్మడి కుటుంబం యొక్క మానవత్వపు విలువలను రెండున్నర గంటల చిత్రంగా మలచిన తీరు బావుంది. మొత్తంమీద ఈ చిత్రం కల్మషంలేని గోదావరి నదీప్రవాహంలా, తెల్లవారు జామున వచ్చే ఓ అందమైన కలలా, చందమామ పుస్తకంలోని మధ్యపేజీ కథలా ముందుకు సాగింది. కుటుంబ కథాచిత్రాలలో నటించడం వెంకటేష్‌కు పెట్టింది పేరు. వెంకటేష్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. మహేష్‌బాబు తన సహజ నటనలో హాస్యాన్ని పండించిన తీరు బావుంది. ప్రకాష్‌రాజ్, అంజలి నటించారు అనడంకంటే జీవించారు అనడం ఉత్తమం. సమంతకు అంత ప్రాధాన్యత గల పాత్ర లభించలేదు. సెకండాఫ్‌లో హీరోలు ఉద్యోగ వేటలో ఉండటం చూపించారు. చివరికి వారికి ఉద్యోగం వచ్చి నట్లు చూపించి ఉంటే బావుండేది.

- వెలిశాల దుర్గాప్రసాదు, విజయవాడ

అర్థంపర్థంలేని చిత్రం

ఈమధ్య కాలంలో ఇటువంటి వెరైటీ సినిమా రాలేదని నెల రోజుల నుండి మీడియాలో దర్శక నిర్మాతలు స్వంత డబ్బా కొట్టుకున్నారు. చివరికి ఎవరికీ అర్థంకాని వెరైటీ సినిమా 'కో అంటే కోటి' సినిమా మిగిలిపోయింది. నలుగురు దొంగలు నల్లధనం కొల్లగొట్టి హాయిగా సెటిలైపోవాలన్న ఒక చిన్న పాయింటు చుట్టూ అర్థంపర్థంలేని సన్నివేశాలను అల్లుకొని ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టారు. కథ ఎటువెళ్తోందో అర్థం కాక ప్రేక్షకులకు సగం సినిమాకే శిరోభారం కలుగుతుంది. ద్వితీయార్థంలో పిచ్చి పిచ్చి సన్నివేశాలకు అలవాటుపడిపోవడంవలన ముగింపుకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇంత వెరైటీ సినిమాలో ఒక్కటంటే ఒక మంచి పాట లేక చక్కని ఎమోషనల్ సన్నివేశం లేదా చక్కని కామెడీ లేకపోవడంబట్టే సినిమా తీయడంలో దర్శకుడికి వున్న పట్టు, అవగాహన అర్థమౌతుంది.

- సిహెచ్.సాయిబుత్తిక్, నల్గొండ

రామ్‌చరణ్ పెర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌కావాలి

తెలుగులో హీరోని హైలెట్‌గా చూపడంలో వినాయక్‌ది ప్రథమస్థానం. ఇంతకుముందు కృష్ణ, ఆది, అదుర్స్ వంటి చిత్రాలలో రవితేజ, జూనియర్ ఎన్టీఆర్‌లను శక్తివంతంగా చూపాడు. మంచి చిత్రాలకు కమర్షియల్ అంశాలను జోడించి, ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే చిత్రాలను చాలాతీశారు. ఇటీవల రామ్‌చరణ్ నటించిన 'నాయక్'కూడా ఆ కోవలోకే వస్తుంది. కాని దాన్ని ఇంట్రెస్టింగ్‌గా తీయలేకపోయాడు. చరణ్ ద్విపాత్రాభినయం (సిద్ధార్థనాయక్, చెర్రీ) కాస్త సినిమాకు ప్లస్ పాయింట్. కాజల్, అమలాపాల్‌లు నామమాత్రపు పాత్రలో కనిపించారు. ఇటీవల దర్శకులు కేవలం కమర్షియల్ అంశాలను హైలెట్ చేస్తూ, స్టోరీని ఇంట్రెస్టింగ్‌గా తీయలేకపోతున్నారు. కథకు వస్తే కలకత్తా మహానగరంలో ప్రదీప్‌రావత్ చేసే దౌర్జన్యాలను (అమ్మాయిలను వ్యభిచారంలోకి దింపడం) సిద్ధార్థనాయక్ బావ రాజీవ్‌కనకాల (డాక్టర్)పై అధికారులకు రిపోర్ట్స్ అందిస్తానని చెప్పడంతో రావత్ అనుచరులు అతన్ని చంపుతారు. ఆ నగర ప్రజలు కూడా రావత్ దుర్మార్గాలకు విసిగి, నాయక్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంటారు. వారి సహాయంతో రావత్ ముఠానుండి కలకత్తా ప్రజలను రక్షిస్తాడు. రామ్‌చరణ్ ఇంకా పెర్ఫార్మెన్స్‌పరంగా చాలా ఇంప్రూవ్‌కావాలి. ఇతర నటులు, ఫొటోగ్రఫీ అన్ని బాగున్నాయి.

- బి.కృష్ణమాచారి, హైదరాబాద్

కేవలం అభిమానుల 'నాయక్'

ఈపాట గుర్తుందా?

తెలుగుసినిమా అంటే మంచి పాటకు చిరునామా. పాటలు లేకుండా సినిమా చూడలేకపోవడం అన్న అభిరుచి ఇప్పటికీ అలాగే నిలిచివున్నా, సాహిత్యపు విలువలు మాత్రం నానాటికీ తీసికట్టవుతున్నాయి. కొత్త పాటలు బాగులేవని గొంతు చించుకోవడం కన్నా, పాత పాటల్లోని మాధుర్యాన్ని ఓసారి గుర్తు చేసుకోవడమే ఈ శీర్షిక ఉద్దేశం. పాఠకులు కూడా తమకు గుర్తున్న మంచి పాటలను కార్డుపై రాసి పంపించవచ్చు. బాగా పాపులర్ అయిన పాత పాటల కన్నా, మరిచిపోతున్న మంచిపాటలను గుర్తుచేయడం ముఖ్యం.

చిలిపి నవ్వుల నిను చూడగానే
వలపుపొంగేను నాలోనే
వలపు పొంగేను నాలోనే
ఎన్ని జన్మల పుణ్యాల ఫలమో
నిన్ను నే చేరుకున్నాను
నిన్ను నే చేరుకున్నాను

చూపుల శృంగారమొలికించినావు
చూపుల శృంగారమొలికించినావు
మాటల మధువెంతో చిలికించినావు
వాడని అందాల వీడని
బంధాల తోడుగా నడిచేములే..

చిలిపి నవ్వుల నిను చూడగానే
వలపు పొంగేను నాలోనే
ఎన్ని జన్మల పుణ్యాల ఫలమో
నిన్ను నే చేరుకున్నాను

నేను నీదాననే నీవు నావాడవే
నను వీడిపోలేవులే
కన్నుల ఉయ్యాలలూగింతునోయి
కన్నుల ఉయ్యాలలూగింతునోయి
చూడని స్వర్గాల చూపింతునోయి
తీయని సరసాల తీరని సరదాల
హాయిగా తేలేములే..

ఎన్ని జన్మల పుణ్యాల ఫలమో
నిన్ను నే చేరుకున్నాను
నిన్ను నే చేరుకున్నాను
చిలిపి నవ్వుల నిను చూడగానే
వలపుపొంగేను నాలోనే
వలపు పొంగేను నాలోనే
ఆ.. ఆ..ఆ.. ఆ..

ఈ పాట మీకు తెలుసా?
ఏ సినిమాలోది?
గీత రచయిత ఎవరు?
సంగీత దర్శకుడు ఎవరు?
మాకు తెలియచేయనక్కరలేదు..
మీరు గుర్తు చేసుకుంటే చాలు..
తెలియకుంటే, వివరాలు వచ్చేవారం ఇక్కడే.

గతవారం పాట

సినిమా : చెల్లెలి కాపురం
సంగీతం : కె.వి.మహదేవన్
రచన : సి.నారాయణరెడ్డి

థ్రిల్లర్ కోసం ప్రయత్నం

రివ్యూ

థ్రిల్లర్ సినిమాలు మనకు తక్కువ. అయితే ఇటీవలి కాలంలో హీరోలు వైవిధ్యమైన విషయాల కోసం వెదుకులాడడం, యువ దర్శకులు కాస్త డిఫరెంట్ సినిమాలు తీయాలని తపించడంతో ఇలాంటి సినిమాలు తరచు వస్తున్నాయి. ఆ కోవకు చెందిన సినిమా 'వేటాడు-వెంటాడు' బోలెడు బాలారిష్టాలు దాటి తెలుగులో ఈవారం విడుదలయింది. అనుకోని పరిస్థితులు ఎదురైతే కథానాయకుడు ఏ విధంగా స్పందిస్తాడన్నది మామూలు సినిమాలకు థ్రెడ్ అయితే, అసలు ఆ పరిస్థితులు ఎందుకు వచ్చాయన్నది కూడా తెలియకుండా వుంచడం ఇటువంటి థ్రిల్లర్‌లకు కీలకం.

ఊటీలో రేంజర్ కొడుకు శంకర్ (విశాల్). అడవికి రక్షకుడిగా, యాత్రీకులకు గైడ్‌గా వుండే అతగాడు (సునయన)తో ప్రేమలో పడతాడు. కానీ అతగాడి వైఖరి నచ్చక ఆమె దూరమవుతుంది. ఆ విషాదంలో వున్న శంకర్‌కు వున్నట్లుంది బ్యాంకాక్ నుంచి కొరియర్ వస్తుంది. శంకర్‌ను మర్చిపోలేకపోతున్నానని, బ్యాంకాక్ రమ్మని లేఖ రాసి, టికెట్ జత చేసే మరీ పంపిస్తుంది ఆ కొరియర్‌ను సునయన. దాంతో అక్కడకు బయల్దేరిన శంకర్‌కు ఎయిర్‌పోర్ట్‌లో పరిచయమవుతుంది మాయ (త్రిష). తీరా బ్యాంకాక్ వెళ్లాక, సునయన కనిపించదు. అనుకోని తలకాయనొప్పులు ఎదురవుతాయి. ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో తెలియదు. అలాంటి పరిస్థితులు చివరకు ఎక్కడకు దారి తీసాయన్నది మిగిలిన వ్యవహారం.

థ్రిల్లర్‌గా సినిమాను క్లయిమాక్స్ ముందువరకు డీల్ చేసిన విధానమైతే బాగానే వుంది కానీ, గతంలో వచ్చిన వాటికి భిన్నంగా, పెద్దగా శతతృప్తమేమీ లేకుండా, కేవలం శాడిస్టిక్ మెంటాలిటీతో హీరోని ఇబ్బంది పెట్టడం అన్నది మన ప్రేక్షకులకు పెద్దగా కనెక్ట్ కాక పోవచ్చు. అదే విధంగా విశ్రాంతి మలిభాగం సగానికి వచ్చే వరకు అద్భుతమైన సస్పెన్స్‌ను నడిపి, దాన్ని విడగొట్టడం ఎలాగో తెలియక, విలన్ల చేత, ఫ్లాష్‌బ్యాక్‌గా చెప్పించడం అంతగా నప్పలేదు. పైగా ఈ చిక్కుముడి విప్పడంలో హీరో చేసినదేమీ లేక, హీరోయిజం ఎలివేట్ కాలేదు. ఒక వేళ విలన్ మనుషులు అప్రూవర్లుగా మారకపోయి వుంటే కథ ఎటు మళ్లేది? అన్న సందేహం కలుగుతుంది.

ఇలాంటి సినిమాను దర్శకుడు తిరు అంత గొప్పగా అయితే తీయలేకపోయాడు. సన్నివేశాలను మరింత క్రిస్ప్‌గా, బలంగా రూపొందించి వుంటే బాగుండేది. యువన్ శంకర్ రాజా నేపథ్యసంగీతం మాంచి పీక్‌లో సాగుతుంటే, సన్నివేశం అంత రేంజ్‌లో వున్నట్లు అనిపించదు. రిచర్డ్ ఫొటోగ్రఫీ పర్వాలేదు.

నటుల విషయంలో విశాల్ ఫర్వాలేదు కానీ, గెటప్ విషయంలో కాస్త శ్రద్ధ పెట్టాలి. ఎంతయినా సినిమా అంటే కమర్షియల్ వ్యవహారం కదా. త్రిష ఓకె. శాడిస్టిక్ విలన్లుగా మనోజ్‌బాజ్‌పాయ్, జెడి చక్రవర్తి బాగానే చేసారు కానీ, మరీ పడీ పడీ నవ్వడం ఇబ్బందిగా వుంది. బహుశా శాడిస్టిక్ వ్యవహారం అంటే అలానే వుంటుందేమో?

మరికాస్త శ్రద్ధ పెట్టి వుంటే మంచి థ్రిల్లర్‌గా రూపొందివుండేది ఈ సినిమా.

- సాహితి



★ వేటాడు - వెంటాడు

తారాగణం: విశాల్ కృష్ణ, త్రిష కృష్ణన్, సునయన, జె.డి.చక్రవర్తి, మిలింద్ సోమన్, మనోజ్ బాజ్‌పాయ్, సంపత్ రాజ్, శ్రీమాన్, జాన్ విజయ్ తదితరులు
సంగీతం: యువన్ శంకర్ రాజ్
నిర్మాత: శ్రీనివాస్ దామెర
దర్శకత్వం: తిరు

తారక నామ సంవత్సరం

తెలుగు సినిమా చరిత్రలో 1963వ సంవత్సరం "తారకనామ సంవత్సరం" అని అనవచ్చు. కారణం ఒక రకంగా ప్రపంచ సినిమా చరిత్రలో ఒక అగ్రశ్రేణి కథానాయకుడు ఏడాదిలో 13 చిత్రాలలో కథానాయకుడిగా నటించి రికార్డు సాధించిన అపురూప సంవత్సరం కావటమే. అందుకేనేమో ఆ మహానటుడిని అభిమానులు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ అని కూడా కీర్తిస్తుంటారు. ఆ మహానటుడే నందమూరి తారక రామారావు. 1963లో మొత్తం 27 చిత్రాలు విడుదల కాగా అందులో యన్.టి.రామారావు 13 చిత్రాలలో కథానాయకుడిగా నటించి సరికొత్త రికార్డును స్థాపించారు. 100 సంవత్సరాల భారతీయ సినిమా చరిత్రలో ఈ అరుదైన రికార్డును సాధించిన నటుడు మరెవరూ లేకపోవటం ఒక విశేషం. అంతేకాకుండా రాబోయే కాలంలో కూడా ఈ రికార్డును మరెవరూ అధిగమించలేరన్నది కూడా జగమెరిగిన సత్యం. 1963లో యన్.టి.ఆర్. నటించిన 13 చిత్రాలలో 7 చిత్రాలు సాంఘికం కాగా మిగతా 6 చిత్రాలలో ఒకటి జానపదం మిగతా ఐదు పౌరాణిక ఇతిహాసాలు కావటం మరో విశేషం. వివరాలలోకి వెళ్తే ఏడు సాంఘిక చిత్రాలలో అపజయాలు అంతగా లేకపోయినా విజయాలలో మిశ్రమ ఫలితాలు వున్నాయి. మరొక విశేషం ఏమిటంటే అప్పటివరకు కాంతారావు స్థాయి హీరోతో అధికంగా దర్శకత్వం వహించిన జానపద బ్రహ్మ బి.విఠలాచార్య అగ్రకథానాయకుడు యన్.టి.ఆర్. హీరోగా చేసిన సినిమాకు దర్శకత్వం వహించారు. అదే 'బందిపోటు'. 1963లోనే విడుదలై, అఖండ విజయం సాధించింది. ఇక మిగిలిన ఐదు చిత్రాలు పౌరాణిక గాథలే. రామాయణ కృతికర్త వాల్మీకి చరిత్ర వాల్మీకిగా విడుదలైంది (దర్శకుడు సి.యస్.రావు) మరొక పౌరాణిక చిత్రం శ్రీ తిరుపతమ్మకథ (దర్శకత్వం బి.యస్.నారాయణ).

ఇక కృష్ణార్జునయుద్ధం, నర్తనశాల, లవకుశ చిత్రాల గురించి ఎంత చెప్పుకొన్నా తరగదు. ఐదు దశాబ్దాలు దాటినా నేటికీ ఈ మూడు చిత్రాలు ఏదైనా ఛానల్‌లో ప్రసారం అవుతూంటే తెలుగు ప్రేక్షకులు రోజువారీ కార్యక్రమాలను ప్రక్కనబెట్టి టీ.వి. సెట్టుకి అంకితం అయిపోవటం గమనిస్తూనే వున్నాం. వీటి గురించి క్లుప్తంగా ముచ్చటించుకోవాలంటే నర్తనశాల జకార్తా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించబడి విదేశీ ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. అర్జునుడిగా, బృహన్నలగా ఆ పాత్రలలో యన్.టి.ఆర్. జీవించారనే చెప్పవచ్చు. నందమూరి బాలకృష్ణ దర్శకత్వ శాఖలో అడుగుపెట్టాలని నిర్ణయించుకొని ఈ చిత్రాన్నే రీమేక్ చేద్దామని అనుకొన్నాడు. కారణాంతరాలవల్ల వాయిదాపడింది.

ఇక లవకుశ విషయానికి వస్తే రాముడంటే యన్.టి.ఆర్. సీతమ్మతల్లి అంటే అంజలీదేవి అనే విధంగా తెలుగువారి హృదయాలలో శాశ్వతంగా స్థానం పొందారు ఆ ఇద్దరూ. అసలు ఈ చిత్ర నిర్మాణానికి ఒక ఫ్లాష్‌బ్యాక్ కూడా వుంది. లవకుశ నిర్మాత ఏ.శంకరరెడ్డి ఈ చిత్రానికి ముందు యన్.టి.ఆర్, అక్కినేని హీరోలుగా చరణదాసి చిత్రం (20-12-1956 విడుదల) నిర్మించారు. ఈ చిత్రంలోని ఒక అంతర్నాటకం యన్.టి.ఆర్, అంజలీదేవి శ్రీరాముడు, సీతాదేవి పాత్రలలో పాల్గొన్న సన్నివేశం ఒక ప్రత్యేక ఆకర్షణ. వాస్తవానికి ఈ చిత్రం మూలకథ రవీంద్రనాథ్ ఠాగూర్ 'షిప్‌రెక్' ఆధారమైన సందర్భానుసారంగా ఈ సన్నివేశం జతపరచారు. ఆనాటినుంచి శ్రీరాముడు, సీత పాత్రలలో యన్.టి.ఆర్, అంజలీదేవిలతో పూర్తి నిడివిగల చిత్రం నిర్మించాలని తలంపు కలిగి ఈ స్క్రిప్టుకోసం సంవత్సరాల తరబడి కృషి ఫలితమే లవకుశ చిత్ర నిర్మాణం. ఈ చిత్రంలో జయంతి, వాసంతి ఏమాత్రం గుర్తింపులేని సాదాపాత్రలలో తళుక్కున మెరసి మాయమౌతారు. జానపద కవిగా ముద్రపడ్డ కొసరాజు మొదటిసారిగా 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'లాంటి సన్నివేశ ప్రధానమైన పాట రాసారు. ఈ సన్నివేశం చిత్రకథకు ఆయువుపట్టు.

ఇక శ్రీకృష్ణార్జునయుద్ధం (1963 విడుదల) విషయానికి వస్తే మరొక ఆసక్తికరమైన ఫ్లాష్‌బ్యాక్ వుంది. దీనికిముందు మరొక ఫ్లాష్‌బ్యాక్‌లోకి ఒక సారి వెళ్దాం. తెలుగు సినిమా రంగంలో ఈ ఇద్దరి అగ్రనటుల కాంబినేషన్ మొదటిసారిగా పల్లెటూరి పిల్ల చిత్రంతో ప్రారంభమైంది. ఈ చిత్రం 27-4-1950 విడుదల. నిర్మాత దర్శకుడు బి.ఎ.సుబ్బారావు ఈ అపూర్వ కలయికను ఆదర్శంగా తీసుకొని యస్.యస్.వాసన్ ఇద్దరు అగ్రశ్రేణి నటులు దిలీప్‌కుమార్, దేవానంద్‌లతో ఇన్సానియత్ చిత్రాన్ని హిందీలో నిర్మించారు. తెలుగులో అగ్ర నటుల కాంబినేషన్ మరి కొంత కాలం కొనసాగి సంసారం (1950), పరివర్తన (1954), మిస్సమ్మ (1955), మాయాబజార్ (1957), భూకైలాస్ (1958), గుండమ్మకథ (1962) చిత్రాలు వచ్చాయి. ఈ మహానటుల కాంబినేషన్‌లో పదవ చిత్రంగా శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రం వచ్చింది. ఇప్పటివరకు వీరిద్దరి కాంబినేషన్ సాఫీగానే సాగింది. అటు నిర్మాతలు ఇటు అభిమానులు ఆనందించారు.

ఈ చిత్రం తర్వాత సినిమా రంగంలోగల కొందరు 'గయుళ్ళ' కారణంగా ఈ వెండితెర కృష్ణార్జునుల మధ్య సినీ కలహాలు ప్రారంభమై సంవత్సరాల తరబడి కొనసాగింది. అభిమానులు తల్లడిల్లిపోయారు. పంపిణీదారుల ప్రయత్నాలు సఫలంకాలేదు. సినీ భీష్ముడు చక్రపాణి ప్రయత్నాలు ఫలించలేదు. ఒక పుష్కరానికి పైగా ఈ ఎడబాటు కొనసాగింది. యన్.టి.ఆర్. స్వంత బ్యానర్‌పై స్వీయ దర్శకత్వంలో "సాక్షాత్ చంద్రగుప్త" చిత్రం నిర్మాణానికి పథకం సిద్ధంచేసుకొన్నారు. బెంగళూరులో ఒక షూటింగ్ విరామ సమయంలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. హైదరాబాద్‌కు రాగానే తయారైన స్క్రిప్టులో మార్పులు చేసి ఇద్దరు కథానాయకుల పాత్రలకు ప్రాధాన్యత వచ్చేటట్లుగా స్క్రిప్టును సిద్ధంచేసి సాక్షాత్ చంద్రగుప్త టైటిల్‌ను చాణక్య చంద్రగుప్తగా మార్చి చిత్రాన్ని నిర్మించారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత అగ్రనటుల కాంబినేషన్‌లో చాణక్య చంద్రగుప్త 25.8.1977న విడుదలైంది.

- పర్చా శరత్‌కుమార్

ఇది కథ కాదు

అంజలీదేవి తొలి 'ముద్దు'

ఇప్పుడంటే సినిమాల్లో ముద్దుల గురించి, వాటికి సెన్సార్‌వారు ఇచ్చే అనుమతుల గురించి తరచుగా చర్చ జరుగుతూ ఉంటుంది. కానీ 1947లోనే అంజలీదేవి తన తొలి చిత్రం

'గొల్లభామ'లో ఓ 'ముద్దు' దృశ్యంలో నటించాల్సి వచ్చింది. అప్పుడామె ఎలాంటి మానసిక సంఘర్షణకు గురై ఉంటుంది? ఆ చిత్రంలో నాయికానాయకులు కృష్ణవేణి, కె.రఘురామయ్య. అంజలీదేవిగా మోహినిగా 'వ్యాంప్' పాత్రలో ఆ చిత్రం ద్వారానే ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ చిత్రంలో మోహిని కథానాయిక రూపంలో వచ్చి, నాయకుణ్ణి కౌగిలించుకుని, మళ్లీ తన అసలు రూపంలోకి మారి అతన్ని చుంబించే సన్నివేశం ఉంది. నిజంగా ముద్దుపెట్టుకోకుండా, అటువంటి 'భ్రమ' కలిగేలా ఆ సన్నివేశం తీయాలని దర్శకులు సి.పుల్లయ్య ఉద్దేశం. మొదటి చిత్రం.. అందులోనూ 'ముద్దు సన్నివేశం' అనగానే, ఆర్టిస్టు కంగారుపడి పోతుందని, అంజలీదేవిని పిలిచి, దగ్గర కూర్చోబెట్టుకుని ఆ సన్నివేశాన్ని స్పష్టంగా వివరించి, హీరో ఆ దృశ్యంలో ఎలా నటిస్తాడో, అందుకు 'రియాక్షన్' ఎలా ఇవ్వాలో చెప్పి, ఆమెలోని కలవరాన్ని పోగొట్టారు పుల్లయ్యగారు. 'గొల్లభామ'లో ఆ ముద్దు సన్నివేశం, ఎంతో చక్కగా సహజంగా ఉండడమే కాదు.. ఆనాటి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది!

- బి.కె.ఈశ్వర్

హృతిక్ ప్రాజెక్ట్?

'క్రిష్ 3' తో హృతిక్ రోషన్ ప్రస్తుతం బిజీబిజీ. ఆ తర్వాత 'ఏక్ థా టైగర్' చిత్ర దర్శకుడు కబీర్ ఖాన్‌తో కలిసి వర్క్ చేయనున్నాట్ట. సజిద్ నాడియాలా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను కబీర్ మాటల్లోనే. హృతిక్‌తో ఇప్పటికి చాలాసార్లు మాట్లాడాను. క్రిష్ 3' షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల త్వరలోనే స్టోరీ డిస్కషన్ జరుగుతుందని అన్నాట్ట. ముందుగా కథ అనుకోవటం మానేసి - ఇలా హృతిక్ వెంట పడటం ఏమిటన్న ప్రశ్నకు - కథ మొదట్నుంచీ అనుకుంటున్నదే. కాకపోతే హృతిక్ ఇమేజ్‌కి తగ్గట్టు కొన్ని మార్పులు చేర్పులూ చేయాల్సి ఉంది. మా ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కాబట్టి ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి. ప్రేక్షకుల అంచనాలను రీచ్ కాకపోతే - పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. ఈ విషయంలో అచితూచి అడుగు వేయాల్సిందే నంటున్నాడు. హృతిక్ కూడా ఈ చిత్రం పట్ల ఆసక్తి చూపిస్తున్నాట్ట. జోయా అక్తర్ బదులు కరీనా కపూర్‌ని తీసుకున్నట్టు రూమర్స్ వస్తున్నాయి అని ప్రశ్నిస్తే - జోయా అక్తర్‌ని తీసుకున్నట్టు గానీ.. తీసుకోమని గానీ చెప్పలేదు. జోయా తనంతట తనుగా వస్తే కాదనీ అనను అంటూ చెబుతున్నాడు కబీర్. చూద్దాం - త్వరలోనే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుందేమో?!

ఎందుకు రావాలి
మనవాళ్లకి అవార్డులు!

Iవ పేజీ తరువాయి

ఫోకస్ చేశారు కాబట్టి! ఎన్టీయార్‌కు హిందీనుండి ఆఫర్లు వచ్చాయి. కానీ ఆయన తెలుగులోనే వందలాది సినిమాలు చేసుకుంటూ వెళ్లారు తప్ప జాతీయ స్థాయిలో గుర్తింపు గురించి పట్టించుకోలేదు. రాజకీయాల్లోకి రాకపోతే ఎన్టీయార్ పేరు దేశంలో మనకు తప్ప ఎవరికీ తెలిసేది కాదు. హిందీ సినిమాల్లో వేయాలంటే అక్కడి క్రమశిక్షణా రాహిత్యంతో, అలవోకగా వేగాలి. ఆ టైములో ఇక్కడ మూడు సినిమాల్లో వేసుకోవచ్చు. ఆ లెక్కలు వేసుకున్నారు కాబట్టే మన వాళ్లు హిందీకి వెళ్లలేదు. వెళ్లిన శ్రీదేవి, జయప్రద లాంటి వాళ్లు దేశం మొత్తం మీద పేరు తెచ్చుకున్నారు. జయసుధ లాటి వాళ్లకు టాలెంటు ఉన్నా ఆ స్థాయి గుర్తింపు రాలేదు. గిరీష్ కర్నాడ్ కన్నడ నటుడే కానీ హిందీ రంగానికి వెళ్లారు కాబట్టి అందరికీ తెలిసారు. అవార్డుల కోసం పోటీ పడినప్పుడు ఈ ఇమేజి ఎంతో ఉపకరిస్తుంది.

సాధారణంగా చాలామంది కళాకారులకు ఇటువంటి వాటిపై నిరాసక్తత హెచ్చు. ప్రేక్షకులను, రసజ్ఞులను అలరించడమే మా పని కానీ, అవార్డుల కోసం తిరగడం మా లక్ష్యం కాదంటారు వారు. కళ ఆత్మానందం కోసమే, కానీ పదిమందితో పంచుకున్నపుడు, దానికి సార్థకత. దానికి పైమెట్టు-గుర్తింపు. వృత్తిని ఆరంభించిన తొలిదశలో వచ్చిన అవార్డులు స్ఫూర్తినిస్తాయి. వృత్తికి మరింతగా అంకితమయ్యేటందుకు దోహదపడతాయి. చివరి దశలో వచ్చినవి సంతృప్తినిస్తాయి. ఇన్నేళ్ల తర్వాత తమ తపస్సు వృథా పోలేదన్న ఆనందాన్నిస్తాయి. అందువలన ప్రజాదరణతో పాటు ప్రజాప్రభుత్వాలిచ్చే అవార్డులకు కూడా మనసులో సముచిత స్థానం ఇవ్వాలి. తమ గురించి ఇతరులకు తెలిసేట్లా చేయాలి. అది తప్పేమీ కాదు.విదేశాలలో నవలా రచయితలకు, సినిమా రచయితలకు కూడా ఏజంట్లు ఉంటారు. రచయితకు కథా కల్పనాశక్తి ఉండవచ్చు. కానీ తనను తాను మార్కెట్ చేసుకునే శక్తి ఉండక పోవచ్చు. అందువల్ల ఆ కళ తెలిసిన వారితో ఒప్పందానికి వస్తాడు. తన కళను పదిమందికి అందించే ప్రయత్నం చేస్తాడు. మన దగ్గర అది లేదు.

ఇది ఎందుకు రాస్తున్నానంటే మన ఏరియా ఆఫ్ ఆపరేషన్ బట్టే మన పాపులారిటీ ఉంటుంది. మేరియో మిరాండా గోవాలో కొంకణి భాషలో కార్టూన్లు వేసుకుంటూ ఉంటే అతనికి (మరణానంతర) పద్మవిభూషణ్ వచ్చేదే కాదు. కానీ అతను టైమ్స్ గ్రూపుపత్రికల్లో ఇంగ్లీషులో కార్టూన్లు వేశాడు. అనేక కారెక్టర్లు సృష్టించాడు. దేశమంతా తెలిసాడు. బాపుగారు తెలుగు పత్రికలకే వేశారు. ఆయన కారెక్టర్లన్నీ తెలుగునాట పాతుకుపోయాయి. అందువలన దేశంలో బాపు అంటే ఎవరో తెలియకపోచ్చు...వచ్చు ఎందుకు, తెలియదు. బెంగాలీ పత్రికల్లో కార్టూనిస్టుగాని, ఇలస్ట్రేటర్‌గాని ఒక్కరు మనకు తెలుసా? తెలుగునాట అమ్మాయిని బాపు బొమ్మ అనడమేచాలు, కోటి అవార్డుల పెట్టు అని మనం అనుకుంటాం. మేరియో మిరాండాకు గోవాలో ఇలాటి ఖ్యాతి ఉండి ఉండదు. ఆయన ఆపరేట్ చేసినది జాతీయస్థాయిలో.

బాపు, రమణ, ఇంకా వేరెవరైనా కానీయండి-వాళ్లు జాతీయస్థాయి గుర్తింపుకోసం ప్రయత్నించలేదు. తెలుగు వాళ్లకు జాతీయస్థాయి పురస్కారం రావాలని కోరిక ఉన్నవాళ్లు జనవరి సీజనులో అవార్డు వచ్చిన వాళ్లను తిట్టిపోయడం మాని, తక్కిన 11నెలల్లో మనవాళ్ల గురించి ఇంగ్లీషులో, ఇతర భాషల్లో వ్యాసాలు రాసి, భారతీయులందరికీ మనవాళ్ల గొప్పతనం చాటాలి. మీడియావారు తెలుగులో చర్చలు జరపడం మాని వాళ్ల హిందీ, ఇంగ్లీషు అసోసియేట్ ఛానెళ్ల ద్వారా వీరి గురించి ప్రచారం చేయాలి. ఇర్వింగ్ వాలెస్ ప్రైజ్ నవలలో రాశాడు-రవీంద్రుడికి నోబెల్ ప్రయిజ్ ఎందుకు వచ్చిందంటే-అతని స్వీడిష్ మిత్రుడు 'గీతాంజలి'ని స్వీడిష్ భాషలో అనువదించి కమిటీకి అందచేశాడట. అప్పుడు వాళ్లకు దాని గొప్పతనం బోధపడింది. అలాగే మనవాళ్లు బాపుగారి దగ్గరకెళ్లి 'మీరు గొప్పవారు సార్' (రమణగారి మాటల్లో చెప్పాలంటే-విష్ణుమూర్తి దగ్గరకెళ్లి 'నీకు నాలుగు చేతులున్నాయి స్మీ' అని చెప్పినట్టు) అనడం కాదు, ఇతర భాషీయుల వద్దకు వెళ్లి 'బాపుగారు గొప్పవారు, ఫలానా ఫలానా కారణాల వలన. అలాటి ప్రతిభావంతుడు మీకు కూడా లేడు' అని చెప్పగలగాలి, చెప్పాలి.

అలాటి కృషి జరగకుండా ఉత్తిపుణ్యాన అవార్డులు రావాలంటే-ఎందుకు రావాలండీ?

పులికి మంత్రి పేరు..!

మనుషుల పేర్ల ముందు, చివర కూడా 'పులి'ని చేరుస్తాం. అది శ్రేష్ఠవాచకం. పులి థాత్రే- ఆంధ్రా పులి- తెలంగాణ పులి- రాయలసీమ పులి- యిలాంటి మాటలున్నాయి గానీ- రాజస్థాన్‌లో ఓ మంత్రిణి- 'జూ'లో పుట్టి, పెరుగుతున్న పులి పిల్లలకి- తన పేరెట్టాలని ఆదేశించింది. రాజస్థాన్‌లోని- రంతాఛోర్ నేషనల్ పార్కు నుంచి - 'సారిస్కా' పులి సంరక్షణ కేంద్రం (అడవి)లోనికి రెండు పులి పిల్లల్ని తీసుకువచ్చి వదిలి పెట్టారు. వీటికి ఆ రాష్ట్ర వన్యమృగ శాఖ సహాయ మంత్రిణి- బీనాకాక్- తన పేరు మీద బీనా-1, బీనా-2 అనే పేర్లు పెట్టాలని కోరారు. సాధారణంగా యిలాంటి చోట్ల పులులకి- టి-1, టి-2 అనో- సారిస్కా ఒన్; సారిస్కా టూ - అనో- రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేస్తారు కానీ- ఇలా మంత్రుల పేర్లెట్టరు. మంత్రుల పేర్లు ప్రాజెక్టులకీ, పార్కులకీ, బస్టాండులకీ పెడతారు. ఇక్కడి కథ వేరు. మంత్రి బీనాకాక్- యీ పులుల తల్లి అనారోగ్యంతో

అవీ..ఇవీ..అన్నీ..

- వీరాజీ

మరణించగా- తల్లిలేని పిల్లలుగా ఇవి దీనావస్థలో వుండగా- వాటిని అయిదారు మాసాల వయసునుంచీ- ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాకింది. ఆప్యాయంగా, ఆత్మీయంగా మన పేరెట్టి- వాటిని పిలిస్తే-అవి ఎంతో ఆరోగ్యంగా- ఆనందంగా సంచరిస్తాయన్న నమ్మకం ఒకటి- ఈ పులి పిల్లలమీద అంతులేని మమకారం మరొకటి- శ్రీమతి కాక్‌గారికున్నాయ్. మామిడి పళ్లకి- సోనియా ఆమ్, అఖిలేష్ ఆమ్ అని పేరెట్టినట్లు- ఇకమీదట పులిపిల్లలకి కూడా రాహుల్ పులి- లల్లూ ప్రసాద్ పులి- పులి దత్తాత్రేయ- లాంటి పేర్లు పెడతారేమో? 'పులి వెంకన్నా!' అంటూ ఓ పులిని పిలుస్తారేమో? కానీ, 'కోడింగ్' మారుతుంది- అని అధికారుల గోల!

veeraji@sify.com

చిట్కా

కొద్దిగా పసుపు, వెన్న కలిపి రాసుకుంటే గరుకుగా, ఒరుసుగా ఉండే చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. నీటిలో పసుపు వేసి రాసుకొని, స్నానం చేస్తే జిడ్డుకారుతున్న చర్మం కూడా పొడిగా తయారవుతుంది.

వేపాకు పొడి, పసుపు, నూనె కలిపి శరీరానికి రాసుకొని అరగంట తర్వాత స్నానం చేస్తే దురదలు, చీడ లాంటి చర్మవ్యాధులకు దూరం కావచ్చు.

చెమట కారణంగా శరీర దుర్గంధం ఏర్పడితే పసుపు, వట్టివేళ్ళు, కర్పూరాలు కలిపి మరవే యించి, నున్నిపిండిలా ఉపయోగిస్తే చక్కని ఉపశమనం పొందవచ్చు.

కండ్ల కలక వ్యాధికి గురైతే పరిశుభ్రమైన తెల్లటి వస్త్రాన్ని నీటిలో తడిపి కళ్ళమీద వేసుకుని పడుకుంటే, చల్లగా ఉండి, నొప్పి, మంట, చురుకుపోట్లు నివారణవుతాయి. కళ్ళు నీరు కారడం నిలిచిపోతుంది. గజ్జి, దురద, ఇతర పుండ్లను పసుపు నీటితో కడిగినా, పుండ్ల మీద పసుపు వేసినా ఫలితం కనిపిస్తుంది.

పసుపు, లవంగాలు, జాపత్రి, దాల్చినచెక్క పొడిగా చేసి తేనె కలిపి, కుంకుడు గింజ పరిమాణంలో తీసుకుంటే ఎలర్జీవలన కలిగే పడిశం, తుమ్ములను నుంచి విముక్తి పొందవచ్చు.

- లక్ష్మీ సువర్చల

పిల్లలు చెబితే వినాలి..!

బాల్యం అరుదైన వరం. ఆ మధుర క్షణాలను పిల్లలు మనసారా అనుభవించాలి. ఇంట్లో పిల్లల అల్లరి, సరదాలను చూసి పెద్దలు కూడా ఆ మాధుర్యాన్ని తెలుసుకోవాలి. పిల్లలు పెద్ద వాళ్లయి పోయాక ఆ ఆనందం మరి దొరకదు. పిల్లలు పుట్టాక వారికి మాటలు వచ్చేంత వరకూ తల్లిదండ్రులు ఎంతో మురిపెంగా చూసుకుంటారు. మూడేళ్లు వచ్చేసరికే పిల్లల్ని కాన్వెంటుకు పంపడంతో వారి స్వేచ్ఛకు గండి పడడం మొదలవుతుంది. పిల్లలు ఎదిగేకొద్దీ వారు క్రమంగా తల్లిదండ్రుల లాలనకు దూరమవుతుంటారు. పేరెంట్స్, ఇతర కుటుంబ సభ్యులు ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటూ పిల్లలను అంతగా పట్టించుకోరు. స్కూల్‌లో చేరాక చిన్నారులపై పలు రకాలుగా వత్తిడులు ప్రారంభమవుతాయి. వారిపై తల్లిదండ్రుల రుసరుసలు సర్వసాధారణమవుతాయి. కాస్త ఆలస్యంగా నిద్ర లేచినా, 'స్కూల్‌కు టైమ్ అవుతోంది. ఇంత ఆలస్యంగా లేస్తే ఎలా?- అని పిల్లలపై తల్లిదండ్రులు కేకలేస్తారు. నర్సరీ నుంచి ప్రతి క్లాసులో ఫస్ట్ ర్యాంక్ రావాలనే ఆరాటంలో పసివాళ్లకు చదువు, శిక్షణ తప్ప మరో సరదా లేకుండా చేస్తుంటారు. ఆడుకోడానికో, స్నేహితులను కలిసేందుకో వెళితే-' ఇప్పటిదాకా ఏం చేశావ్? ఎక్కడికెళ్లావ్? ఎందుకెళ్లావ్' వంటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేయడంతో చిన్నారులు బిక్కమొహంతో భయం భయంగా నిలబడాల్సి వస్తుంది.

పిల్లల విషయంలో అనవసరంగా హైరానా పడి పెద్దలు ఆందోళన చెందడం, పిల్లల్ని ఆందోళనకు గురి చేయడం సరికాదు. తల్లిదండ్రులు వత్తిడి తగ్గించుకోవాలి, చిన్నారులపై వత్తిడి పెంచరాదు. ఉల్లాసకరమైన వాతావరణంలో ఎవరి పనులు వారు చేసుకోవాలి. పిల్లలు ఏం చెబుతున్నారో శ్రద్ధగా, ఓపికతో వినాలి. దండించే ధోరణిని ప్రదర్శించకూడదు. పిల్లల మనసులను హత్తుకునేలా ఏ విషయమైనా సున్నితంగా వివరించాలి. పిల్లలకు అర్థమయ్యే భాషలో మంచి అలవాట్లు, ప్రవర్తన, నైతిక విలువలు వంటి విషయాలను వీలైతే కథల రూపంలో చెప్పాలి. పురాణాలు, గొప్ప వ్యక్తుల విజయ గాథలు వంటివి చెబితే పిల్లల్లో మంచి నడవడిక అలవడుతుంది. కొంతమంది తల్లిదండ్రులు 'మేం చెప్పిన మాటలు పిల్లలు వినడం లేదం'టూ ఇతరులకు చెబుతుంటారు. పిల్లల మనసులను నొప్పించే ఇలాంటి వ్యతిరేక ప్రచారం మంచిది కాదు. ఇలాంటి మాటలతో పిల్లలకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

స్కూల్‌లో టీచర్ కొట్టిందని పిల్లలు చెబితే- 'అసలేం జరిగింద'ని తల్లిదండ్రులు పూర్తి వివరాలు ఆరా తీయరు. 'నువ్వు ఏదో పిచ్చి పని చేయకపోతే టీచర్ ఎందుకు కొడుతుంది?'- అని తిడితే పిల్లలు చిన్నబుచ్చు కుంటారు. వారి వాదన వినేందుకు కూడా అవకాశం ఇవ్వాలి. పిల్లలు ఎలాంటి ప్రశ్నలు వేసినా కసురుకోకూడదు. వారికి సరైన సమాధానాలు చెప్పి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. పేరెంట్స్ తమకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్న భావన పిల్లల్లో కలిగించాలి. పిల్లల ధోరణి మారాలంటే ముందుగా పెద్దల వైఖరి కూడా మారాలి.

పిల్లల విషయంలో కొంతమంది తల్లిదండ్రులు చిన్న చిన్న విషయాలను సైతం అతిగా ఊహించుకుని ఆందోళన చెందుతుంటారు. ఆ ప్రభావం మొత్తం కుటుంబంపై తప్పకుండా పడుతుంది. గోరంతలను కొండంతలుగా ఊహించుకుంటే ఆనందం కరవవుతుంది. సంతోషంగా ఉండడం వల్ల ఎవరి పనులను వారు సంతృప్తికరంగా చేసుకునే వీలుంటుంది. జీవితాన్ని ఆనందంగా గడపడం నేర్చుకోవాలి, పిల్లలకూ నేర్పించాలి. నవ్వుతూ కనిపించే వారంటే- స్నేహం చేసేందుకు ఎవరైనా ముందుకు వస్తారు. జీవితం అనేది అందమైన బహుమతి. ఆహ్లాదకరంగా శ్రమిస్తూ, అనుకున్నది సాధించాలనే విషయాలను తాము ఆచరిస్తూ పిల్లలు ఆచరించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలి.

- సివి సర్వేశ్వర శర్మ

భార్యకు జీతం

- ఎం.ఎస్. శ్యామలాశర్మ

ఉదయం 7 గంటలైంది.. స్కూల్ ఆటో 8.30కల్లా గుమ్మంలో ఆగుతుంది పిల్లల్ని తీసుకెళ్ళడానికి. కృష్ణ భోజనం చేసి 9.30కల్లా ఆఫీసుకి బయలుదేరతాడు. హడావుడి పడుతూ వంటింట్లో అష్టావధానం చేస్తోంది ఇందు. కిచెన్‌కి ఎదురుగా హాల్‌లో పిల్లలు తరుణ్, సిరి హోమ్ వర్క్ చేసుకుంటున్నారు. మధ్యలో వాళ్ళని ఓ కంట కనిపెడుతోంది ఇందు. ఇంట్లో జరుగుతున్న విషయాలు తనకు సంబంధం లేనట్లు హాలులోంచి వరండాలోకి, వరండాలోంచి హాలులోకి కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ 'అతని' రాకకోసం ఎదురు చూస్తున్నాడు కృష్ణ.

''ఈ నడవడమేదో పొద్దున్నే చేస్తే వాకింగ్ అవుతుంది, కాస్త పొట్టయినా తగ్గుతుంది. అలా ఊరికే తిరగకపోతే పిల్లలచేత హోమ్‌వర్క్ చేయించచ్చుగా?'' అంది వ్యంగ్యంగా ఇందు.

మామూలుగా ఐతే వ్యంగ్యంగా మాట్లాడిన భార్యకు దీటుగా సమాధానం చెప్పేవాడు. కానీ, ఇప్పుడు కృష్ణ ధ్యాసంతా 'ఆ వ్యక్తిపైనే ఉంది. ఇంతకీ కృష్ణ ఎదురుచూస్తున్న వ్యక్తి ఎవరంటే 'పేపర్ బాయ్'. రోజూ పేపర్ 6 గంటలకే వస్తుంది. ఈ రోజు ఎందుకో ఆలస్యమైంది. ఉదయాన్నే ఇందు ఇచ్చే వేడి వేడి కాఫీతోపాటు పేపర్లోని వార్తా విశేషాలు కూడా కృష్ణ తాగేస్తాడు. పేపర్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న కృష్ణకి పేపర్‌బాయ్ మోగించిన సైకిల్ బెల్, 'పేపర్' అన్నమాట 'మధుర మంజులగానం'లా వినిపించింది. పేపర్ బాయ్ పేపర్‌ని వరండాలో పడేలా విసిరి వెళ్లిపోయాడు. కుర్చీలో కూర్చుని పేపర్‌లోని వార్తావిశేషాల్ని చదువుతున్న కృష్ణకి- 'గృహ నిర్వహణలో శ్రమించే గృహిణులకి ఇకపై భర్త జీతంలో ఇరవై శాతం జీతంగా ఇవ్వాలని బిల్లు అమలు చేద్దామని కేంద్రం ఆలోచిస్తున్నది''-అన్న వార్తతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యింది.

:::::

''ఉదయం లేచిన దగ్గర్నుండి టైమ్ ప్రకారం కాఫీ, భోజనం అమర్చి పెట్టాలి. ప్రతీదీ చేతికందించాలి. ఆఫీసునుంచి రాగానే కాఫీ ఇవ్వాలి. టిఫిన్లూ, భోజనాలు మామూలే. ఆదివారం ఇంట్లోనే ఉంటారు కనుక స్పెషల్స్ చేయాలి. పైగా ఆ కూర చెయ్యి, ఈ పచ్చడి చెయ్యి అంటూ పురమాయింపులు. మీ వర్కింగ్ అవర్స్ ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకే కానీ నా డ్యూటీ 24 గంటలూను. ఆదివారం కూడా నాకు రెస్ట్ లేదు. మీరు నా పనుల్ని ఒక్క రోజు చేస్తే తెలుస్తుంది నేను పడే కష్టం. మీ ఆఫీసు పని నేనూ చేయగలను'' అంటూ పని ఎక్కువైనప్పుడు, ఇందు అనే మాటలు గుర్తుకు వచ్చాయి కృష్ణకి. ఈ వార్త చూసిందంటే- ''అమ్మో..! ఇంకేమైనా ఉందా? ఇంకా రెచ్చిపోదూ?'' అనుకున్నాడు భయంగా.

''ఇవాళ ఆఫీసుకి వెళ్ళరా? టైమవుతోంది, ఇంకా స్నానం కూడా అవలేదు' అంటూ వచ్చింది ఇందు.

''ఆ వచ్చేస్తున్నా, ఈ లోపు నువ్వు భోజనం రెడీ చేసేయ్'' అన్నాడు పేపరు మడుస్తూ.

''పేపర్ ఎక్కడో పెట్టేయకండి. టీపాయ్‌పై పెట్టండి. నా పని పూర్తయ్యాక చదువుతాను'' అంది ఆమె లోపలికి వెళ్తూ.

భోజనం చేసేసి ఆఫీసుకెళ్తూ, మర్చిపోకుండా పేపరు బీరువాపై దాచేసి, ఏమీ తెలియనట్లు 'ఆఫీసుకెళ్ళొస్తానని' చెప్పి వెళ్లిపోయాడు కృష్ణ.

:::::

ఆఫీసు నుంచి కృషం వచ్చేసరికి రాత్రయింది.

'ఇంతాలస్యమైందేం?' అడిగింది భర్తని.

''ఇవాళ మీటింగ్ వల్ల లేట్ అయింది. కాస్త వేడినీళ్ళుపెడతావా, అలసటగా ఉంది స్నానం చేస్తాను'' అన్నాడు. వేడినీళ్ళతో స్నానం చేసి, భార్య వడ్డించిన కమ్మటి భోజనం చేసి, గదిలో ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌లో పెట్టి, మంచంపై వాలిన కృష్ణకి 'ఇంతకుమించిన స్వర్గం ఏముంది?' అనిపించింది.

''ఏమండీ.. పేపరు ఎక్కడ పెట్టారు? పొద్దున్నంతా తెగ వెతికాను కనిపించలేదు'' అంది వంటింటి పని ముగించుకుని వచ్చిన ఇందు.

ఆ మాట వినగానే స్వర్గలోకం నుండి భూమిపై పడ్డట్టుగా ఉలిక్కిపడ్డాడు అతను.

'పేపరా? అక్కడే పెట్టాను కనిపించలేదా?' అన్నాడు అమాయకంగా మొహం పెట్టి. 'ఆ.. గుర్తుకు వచ్చింది, బీరువాపై పెట్టాను' అన్నాడు గుర్తుకు వచ్చినట్లు నటిస్తూ.

''బీరువాపై పెట్టడానికి అదేమైనా సూట్‌కేసా? రాను రాను మీతో పడలేక పోతున్నాను'' అని విసుక్కుంటూ పేపర్ తెచ్చుకునేందుకు వెళ్ళింది.

ఇందు పేపర్‌లో ఆ వార్త చదవకముందే, తాను నిద్రపోవడం మంచిదని 'ఇందూ.. నాకు నిద్ర వస్తోంది గుడ్‌నైట్' అంటూ దుప్పటి ముసుగు పెట్టేశాడు నిద్ర రాకపోయినా.

:::::

మర్నాడు ఉదయం లేచి బ్రష్ చేసుకుని 'ఇందూ.. కాఫీ' అని చెప్పి, పేపర్ కోసం వరండాలోకి వచ్చాడు కృష్ణ.

పేపర్ తీశాక మొదటి పేజీలో పెద్ద పెద్ద అక్షరాలతో ఉన్న వార్తని చదివి పక్కలో బాంబు పడినట్లుగా ఉలిక్కిపడ్డాడు.

'భార్యలకి భర్త జీతంలో 20 శాతం ఇవ్వాలని ఆర్డర్ జారీ చేశారు. 1వ తారీఖు నుండి అమలు' అన్న వార్తని చూసి అతని నోట మాట రాలేదు.

'ఏవండీ! కాఫీ' అంటూ భర్తకి అందించి, తానూ కాఫీ కప్పు పుచ్చుకుని ఎదురుగా కూర్చుంది ఇందు.

ఇందు తీరిగ్గా కాఫీ పట్టుకుని ఎదురుగా కూర్చునేసరికి 'కొంపతీసి పేపరు చదవలేదు కదా?' అనుకున్నాడు.

'ఏంటండీ! పేపరులో విశేషాలు' అంది కాఫీ తాగుతూ.

''ఏం ఉంటాయి? నువ్వేంటి ఇంత ఖాళీగా కూర్చున్నావు'' వంట హడావుడి లేదా?'' అన్నాడు.

''లేదండీ! ఇవాళ పిల్లలకు సెలవు. కంగారు లేదు' అంది.

''ఈ మధ్య ఇలా కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుని చాలా రోజులయింది'' అన్నాడు పేపరు పక్కన పడేస్తూ.

'దాచాలంటే దాగదులే..' అంటూ కూనిరాగం తీసిన భార్యని చూసి కంగారు పడ్డాడు.

'అసందర్భంగా ఏమిటా పాట' అని విసుక్కున్నాడు.

''విసుక్కోకండి శ్రీవారూ.. నాకంతా తెలుసు. ఆ రోజు మీరు పేపరు బీరువాపై ఎందుకు పెట్టారో, నేను పేపరు కోసం వెళ్ళగానే దుప్పటి ముసుగు ఎందుకు పెట్టారో.. నాకు పేపరు చదివిన తరువాత అర్థమైంది. భర్త జీతంలో భార్యకి 20శాతం గురించే కదా! అప్పటినుండి మీకన్నా ముందరే పేపరు చూస్తున్నా. పేపరులో పడింది చదవలేదనుకున్నారా'' అంది.

తేలు కుట్టిన దొంగలా అయింది కృష్ణ పరిస్థితి.

''మీకు రోజూ సేవ చేస్తున్నా, నా శ్రమని మీరు గుర్తించలేదు కానీ ఎక్కడో ఢిల్లీలో ఉన్న కేంద్ర మంత్రి గుర్తించారు. మా శ్రమకు తగిన ప్రతిఫలం ఇప్పిస్తున్నారు'' అంటూ ఇంకా ఏదో అనబోతున్న ఇందును ''ఇక చాల్లే ఆపు! ఇన్నాళ్ళూ నీ సరదాలు, ముద్దు ముచ్చట్లు తీర్చిన భర్తకన్నా, ఎక్కడో ఉన్న కేంద్ర మంత్రి గొప్పట! నన్ను ఒక్కసారైనా మెచ్చుకున్నావా?'' అన్నాడు ఉక్రోషంగా.

''సరే! మిమ్మల్నే రోజూ పొగుడుతాను. ఎందుకంటే జీతం ఇచ్చేది మీరే కదా'' అంది దయతలిచినట్లు.

''అవునండీ! రేపటినుంచి అమలు అన్నారు కదా, ఒకటో తారీఖు రేపే కదా, వచ్చే నెల 1న ఇస్తారా జీతం? లేకపోతే రేపట్నించీ ఇస్తారా? మీ జీతం నలభై వేలు కదండీ. ఇరవై శాతం అంటే ఎనిమిది వేలు కదండీ నాకు వచ్చే జీతం'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

''మీ ఆఫీసులో ప్రమోషన్ కోసం టెస్ట్‌లు అవీ రాయండి. ప్రమోషన్ వస్తే జీతం పెరుగుతుంది. మీ జీతం పెరిగితే నా జీతం కూడా పెరుగుతుంది కదా'' అని ఉచిత సలహా ఇచ్చింది భర్తకి.

''చాల్లే! ఇక ఆపు! నాకు ఆఫీసుకి టైమవుతోంది. వంట చెయ్యి'' అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

:::::

అప్పట్నించి మొదలయ్యాయి కృష్ణ పాట్లు. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన కృష్ణకు కాఫీ అందించి పేపరు, పెన్ను పట్టుకుని వచ్చింది ఇందు.

''చెప్పండి..! పొద్దున్న కాఫీ రెండుసార్లు, 9.30కి భోజనం, ఒంటిగంటకి టిఫిన్, సాయంత్రం కాఫీ, రాత్రి భోజనం. టీవీ చూస్తూ తినడానికి స్నాక్స్. ఆదివారం వెరైటీ టిఫిన్. భోజనంలో స్పెషల్ ఐటెమ్. సాయంత్రం టీ, రాత్రి భోజనం అంతే కదా మీ మెనూ..'' అంది నోట్ చేసుకుంటూ.

''నువ్వు రోజూ చేసే పనులేగా, ఇవన్నీ ఇపుడెందుకు?'' అన్నాడు అనుమానంగా.

''నిన్నటి దాకా నేను గృహిణిని, ఇవాళనుండి నేనూ ఉద్యోగినే! నా వర్క్ తెలుసుకుంటున్నాను'' అంది.

''అమ్మా..! మనింటికి ఎవరో వస్తున్నారు. ఆటో ఆగింది ఇంటి ముందర'' అంటూ వచ్చాడు తరుణ్.

కృష్ణ బయటికి వెళ్ళి చూస్తే- అతని బాబాయ్, పిన్ని లోపలకు వస్తున్నారు.

''నమస్కారం మావయ్యగారూ, బావున్నారా అత్తయ్యా?'' అంది ఇందు మంచినీళ్ళు అందిస్తూ.

''బావున్నాం.. నువ్వెలా ఉన్నావు, పిల్లలు ఏరీ?'' అన్నాడు పరంధామయ్య.

తరుణ్, సిరి వచ్చి వాళ్ళని చూసి సిగ్గుపడుతూ తల్లి వెనకాల నించుండిపోయారు.

''ఇందూ.. భోజనాల సంగతి చూడు. బాబాయ్‌కి గుత్తి వంకాయ కూర చాలా ఇష్టం. మా పిన్నికి బంగాళా దుంపల వేపుడు ఇష్టం. రెండు కూరలూ చెయ్యి'' అన్నాడు కృష్ణ.

''వాడలాగే అంటాడు. ఎక్కువ శ్రమ పడకు. తేలికగా వండు చాలు'' అన్నాడు పరంధామయ్య కృష్ణ చూపించే అభిమానానికి పొంగిపోతూ.

''అలా అనకండి మావయ్య గారూ, రాక రాక మా ఇంటికి వచ్చారు. ఆ మాత్రమైనా చేయకపోతే ఎలా? అంది ఇందు.

''నేనూ వస్తాను, నీకు సాయం చేస్తాను'' అంది లక్ష్మమ్మ.

''తొందరగా వంట చేసి వస్తాను. మీరు, మావయ్య గారు, మీ అబ్బాయి కూర్చుని మాట్లాడుకోండి'' అని ఇందు వెళ్లింది.

భోజనానికి కూర్చున్న పరంధామయ్య- కంచంలో వడ్డించిన పదార్థాలను చూడగానే ఆగలేక పోయాడు.

''నువ్వు చాలా అదృష్టవంతుడివిరా అబ్బాయ్. కోడలి వంట చాలా బావుంది. మంచి, మర్యాద తెలిసిన అమ్మాయి'' అంది లక్ష్మమ్మ ఇందువంక ప్రేమగా చూస్తూ.

మర్నాడు కాఫీలు తాగి వారు బయలు దేరుతుండగా, ''ఈసారి ఇలా వచ్చి అలా వెళ్లితే ఊరుకోను. రెండురోజులుండి వెళ్లాల్సిందే'' అంది ఇందు.

తన బాబాయ్, పిన్ని పట్ల ఇందు చూపిస్తున్న అభిమానానికి కృష్ణ పొంగిపోయాడు ఆనందంతో. ఆ ఆనందం వెనుక పొంచి ఉన్న ప్రమాదాన్ని మాత్రం గుర్తించలేదు.

''నాకు చాలా ఆనందంగా ఉంది ఇందూ.. మా బాబాయ్, పిన్ని చాలా సంతోషించారు'' అన్నాడు.

''నాకు అలాగే ఉంది. ఇంకో రెండు రోజులు ఉంటే. బావుండేది. నాకు రెండు రకాల ప్రయోజనం ఉండేది'' అంది.

''రెండు రకాలుగా ప్రయోజనమా ఏమిటి?'' అన్నాడు అర్థం కాక.

''పెద్దవాళ్లు ఇంట్లో ఉంటే సందడిగా ఉంది. నాకూ కాలక్షేపంగా ఉండేది. అత్తయ్యగారి దగ్గర తెలియని విషయాలు తెలుసుకునేదాన్ని. రెండో విషయం ఏంటంటే వాళ్ళుంటే- నాకు ఉప్పాడ పట్టు చీర వచ్చేది'' అంది.

''వాళ్ళు ఉంటే నీకు పట్టు చీర రావడమేమిటి?'' అన్నాడు అయోమయంగా.

'' ఓవర్ టైం (ఓటీ) చేసినందుకు ఎగస్ట్రా ఇవ్వరా?'' అంది.

''ఓటీ ఏంటి?''

''మీరు ఉద్యోగం చేస్తున్నారు కదండీ. ఓటీ అంతే తెలీదా? మామూలుగా అయితే మన నలుగురికీ పనులు చేయడం నా పని. కానీ నిన్నరాత్రి అదనంగా పనిచేశాను. ఎగస్ట్రా పనికి జీతం ఇవ్వాలి కదా. నిన్న రాత్రి ఒక్కపూటే కనుక కొంతే వస్తుది. రెండురోజులుంటే ఎక్కువ జీతం వస్తుంది కదా. దాంతో పట్టుచీర కొనుక్కుందామనుకున్నాను, ప్చ్'' అంది నిరాశగా. భార్య లాజిక్‌తో కృష్ణకి మతిపోయింది.

''అయితే చీరలు నేను కొనక్కర్లేదన్నమాట. నీ జీతంతోనే కొనుక్కుంటావా?'' అన్నాడు కొంతైనా ఖర్చు తప్పిందనుకుని.

''అదేం కుదరదు... మీరు కొనే చీరలు మీ కోటానే, నా జీతంతో నేను కొనుక్కునే చీరలు వేరే'' అంది కచ్చితంగా.

ఏడుపొక్కటే తరువాయి అన్నట్లుగా ఉంది కృష్ణ పరిస్థితి.

అంతటితో ఆగలేదు... వరుసగా షాకుల మీద షాక్‌లు ఇస్తోంది ఇందు కృష్ణకి.

ఆదివారం వస్తే ఇదివరకు స్పెషల్స్ చేసి 'తినండి' అని కొసరి కొసరి తినిపించే ఇందు, ఇపుడు 'మీకేనా ఆదివారం సెలవు? నాకు లేదా? ఈవాళ నాకు రెస్ట్' అని ముసుగుతన్ని పడుకునేది లేదా టీవీ ముందు పిల్లలతో సెటిలైపోయేది.

ఇదివరకు సెలవు ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూసే కృష్ణ ఇప్పుడు వర్కింగ్ డే ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నాడు. ఇంటికి ఫ్రెండ్స్‌ని పిలవడం మానేశాడు. వాళ్లకి కాఫీ ఇస్తే ఎగస్ట్రా జీతం ఇమ్మంటుందేమో? అన్న భావంతో తనకి ఇంకోసారి కాఫీ తాగాలి అనిపించినా అడగట్లేదు. మొన్నటికి మొన్న కృష్ణ అక్కయ్య పండుగకి బట్టలు తీసుకుందామని వచ్చింది. వాళ్లది పల్లెటూరు. పండుగకి ఇంట్లో పనివాళ్లకి, పొలం పని చేసేవాళ్లకి బట్టలు పెట్టాలి. ఇక్కడైతే బట్టలు బావుంటాయని. లాటుగా తీసుకోవచ్చని వచ్చింది. ఇందుని కూడా బజారుకి రమ్మంది.

ఇందు 'వస్తాను పదినా' అంది. బాబాయ్ వాళ్ళు వచ్చి వెళ్లిన అనుభవంతో కృష్ణకి గుండెలు దడదడలాడుతున్నాయి. మళ్ళీ ఎక్కడ ఓటీ అడుగుతుందోనని!

''ఓటీతోపాటు పనిమీద బయటకు వెళ్లినప్పుడు టి.ఎ ఇస్తారు కదా. దానికి బదులుగా నేనో చీర తీసుకున్నాను. ఆ చీరకు డబ్బులు వదిన ఇచ్చారు. మీరు వదినకు ఇవ్వండి చీర డబ్బులు'' అని ఆర్డరు వేసింది ఇందు. తొండ ముదిరి ఊసర వెల్లి అయినట్టు, మామూలు ఉద్యోగిలా ఉండే ఇందు లంచాలు పట్టే ఉద్యోగిలా తయారయ్యింది అనుకున్నాడు.

ఒకరోజు ఇందు అమ్మా,నాన్నగారు వచ్చారు. వాళ్లను చూశాక ''మళ్ళీ ఓటచ ఇవ్వాలా'' అన్నాడు నీరసంగా.

''అక్కర్లేదు లెండి. ఈసారికి స్వచ్ఛందంగా పనిచేస్తాను'' అంది ఉదారంగా.

'అమ్మో.. అమ్మో..' అని గుండెలు బాదుకున్నాడు ఇందు తెలివికి.

''తనవేపు బంధువులు కానీ. స్నేహితులుకానీ వస్తే ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది. వాళ్ల అమ్మా నాన్నా వస్తే స్వచ్ఛందంగా చేస్తుందిట'' అంటూ గింజుకున్నాడు.

రానురానూ కృష్ణ పిసినారిలా మారాడు. తన కోసం బట్టలు కూడా కొనుక్కోవడం మానేసాడు. ఇందు మాత్రం తనకి నచ్చిన చీరలు, వస్తువులు కొనుక్కుంటోంది. ప్రతి ఆదివారం హోటళ్ల ఖర్చు భరించలేక, ఇందుతో ఒప్పందానికి వచ్చాడు. ఇద్దరూ సమానంగా పనులు పంచుకునేటట్లు. ఆమె ఎంత పనిచేస్తే కృష్ణకూడా అంతపని చేయవలసిందే. వంటలో సాయంచేస్తున్న కృష్ణకి ఓ సందేహం వచ్చింది.

''ఇందూ! మరి నేను ఎప్పుడైనా నెల జీతం ఇవ్వలేదనుకో, అప్పుడేం చేస్తావు'' అన్నాడు.

''మీరు జీతం ఇవ్వకపోతే మహిళా సంఘంలో ఫిర్యాదు చేస్తాం. వాళ్లొచ్చి మీకు టైమ్ ఇస్తారు. ఆ టైమ్‌లో కనుక మీరు జీతం ఇవ్వకపోతే జీతం ఇచ్చేదాకా మన ఇంటి ముందు 'ధర్నా' చేస్తారు'' అని వివరించింది.

''ఆహా...! ఇంత ముందు జాగ్రత్తలు తీసుకున్నారన్నమాట. పక్కింటామె ఒక చీర తనకన్నా ఎక్కువ కొనుక్కుంటే ఓర్వలేని వాళ్ళు ఇలాంటి విషయాల్లో మాత్రం ఒక్కటైపోతారు'' అనుకున్నాడు పళ్ళు కొరుక్కుంటూ.

అలవాటు లేని పనులతో ఒళ్లంతా పట్టేసినట్టయింది కృష్ణకి. భోజనాల తరువాత కాసేపు పడుకుంటానని గదిలోకి వెళ్లాడు. మంచి నిద్రలో ఉండగా పెద్దగా మాటలు వినిపించి మెలకువ వచ్చింది కృష్ణకి. ఆ గొంతు పక్కింటి పిన్నిగారిది. పెద్ద గొంతుతో మాట్లాడుతుంటే నిద్ర పారిపోయింది.

''మా అమ్మాయికి పెళ్ళి సంబంధం కుదిరింది'' అంది పక్కింటి పిన్నిగారు.

''చాలా సంతోషం. ఇంతకీ అన్ని విషయాలు మాట్లాడుకున్నారా?'' అంది ఆతృతగా ఇందు.

''అన్ని విషయాలూ వివరంగా మాట్లాడుకున్నాం. మా అమ్మాయి చేయబోయే పనుల గురించి, జీతం, ఓటీలు, బోనస్‌లు.. అన్నీ మాట్లాడాం' అంది పిన్నిగారు.

''నా విషయంలోనే శ్రద్ధ తీసుకుని ఎగ్‌స్ట్రా డబ్బులు ఎంత తీసుకోవాలో, ఎలా అడగాలో చెప్పిన మీరు, మీ అమ్మాయి విషయంలో అజాగ్రత్తగా ఉంటారా? మీ దయవలన నేను అనుకున్న చీరలన్నీ కొనుక్కోగలిగాను'' అంది ఇందు కృతజ్ఞతగా. ఈ మాటలు వినగానే ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు కృష్ణ.

''మహాతల్లీ! ఇదంతా నీ నిర్వాకమా? ఉండు.. నీ పని చెప్తా'' అనుకుంటూ విసురుగా హాలులోకి వచ్చాడు.

హఠాత్తుగా వచ్చిన భర్తను చూసిన ఇందు తడబడింది.

''ఏమ్మా.. మీరేనా? మా ఇందుకి ఇవన్నీ చెప్పింది. సాత్వికంగా ఉండే ఇందుకి ఇవన్నీ నూరిపోసి రాక్షసిలా తయారుచేసింది మీరేనా?'' అన్నాడు కోపంగా.

''ఏమయ్యోయ్! నేనేం చేశాను. డబ్బులిచ్చింది నువ్వు, కొనుక్కున్నది మీ ఆవిడ, మధ్యలో నన్నంటావేంటి'' అంది గట్టిగా అరుస్తూ.

''ఏమీ అనుకోకండి పిన్నిగారూ.. ఆయనకేమయిందో ఈవాళ. ఎందుకండీ అలా మాట్లాడతారు?'' అంది.

''ఆవిడ మాటల వల్లే కదా నువ్విలా తయారయ్యింది. తక్షణం ఆవిడ్ని వెళ్లిపొమ్మని చెప్పు'' అన్నాడు ఆవేశంగా.

''ఇందూ నీ మొహం చూసి ఊరుకున్నాను లేకపోతేనా..'' అంటూ ఏదో అనబోతున్న పిన్నిగారిపై-

''ఏం చేస్తారు?'' అన్నాడు.

''ముందు మీరు లోపలకి వెళ్లండి'' అని భర్తను గదిలోకి తోసింది ఇందు.

ఇందు తోసిన తోపుకి గోడకి గుద్దుకున్నాడు, నుదురు వెళ్లి గోడకి కొట్టుకుంది. 'అబ్బా..' అంటూ అరిచాడు గట్టిగా.

'ఏవండీ..' అంటూ ఎవ

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
శనివారం
2, ఫిబ్రవరి
2013

సౌందర్యలహరి

భవదున్మేష విజృభణంబు పరికింపంగా సరోజాత సం
భవ జన్మంబు భవన్నిమేషమమి త బ్రహ్మాండ కల్పాంత బై
రవ సంక్షోభిత మన్న దక్కిన భవత్సారంభ భూరి క్రియా
నివహం బెవ్వరు నేర్తురిట్టిదని వర్ణింపంగ సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! నీ సంతోష వికాసంలో బ్రహ్మకు జన్మ, నీవు ఔప్పు వేస్తే (ఆబ్రహ్మ సృష్టికి) ప్రళయం - అని అంటే ఇక నీ మహాకార్య సమూహం ఇట్లాంటిది ఇట్లాంటిది అనిఎవరు వర్ణించ గల్గుతారు. ఈపద్యం కూడా పరమేశ్వరాధిక్యాన్ని తెలుపు తున్నదే. ఈశ్వరుని ఆనంద వికసనమే లోకోత్పత్తికిహేతవు. ఈశ్వరుడు కనుఔప్పు వేయడమే లోకాలకు ప్రళయ హేతవు. ఆయన కనుతెఱవడం, ఔప్పు వేయడం అన్న చిన్నచిన్న వాటితోనే సృష్టిస్థితిలయాదులను చేయగలుగతున్నాడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

2 శ్రీ లత

అయినా ఎవరూ కదల్లేదు!

''ఎవరి పిల్లలు వాళ్ళకే బరువు ఈ కాలంలో! అయినా.. 'తల్లికి లేని ప్రేమ తడికల కెందుకుంటుందనీ..' కన్నదే కఠినం దాల్తే కర్మానికెవరొస్తారు?'' నిట్టూర్చిందో బామ్మ వేదాంతిలా.

అంతకంతకూ ఏడుపు తక్కువై వణుకు పెరగసాగింది బిడ్డలో! ఈ మనుషుల్ని కరిగించడం వేదనవల్లా, రోదన వల్లా కుదరదని 'కునుకు' సిద్ధమవుతూ. దవడలు బిగుసుకుని మూలగసాగింది చలికి.

అపుడొచ్చింది.. జీవన!

గుంపులోంచి తొంగిచూస్తూ అడిగింది.. ''ఏం జరిగింది?'' అని.

జీవన ఆరు నెలల క్రితం ఈ కాలనీలోనే వుండేది. అందుకే అందరూ గుర్తుపట్టి పలకరింపుగా చూశారు.

''మరేం లేదు జీవనా! ఎవరో నికృష్టురాలు బిడ్డను కని ఇలా చెత్తకుండీలో పారేసింది. దాని అమ్మ కూడా దాన్నీ ఇలాగే వేసుంటే తెలిసొచ్చేది. చూడూ... ఆ బిడ్డ ఎలా అల్లాడిపోతోందో!'' ఒక పెద్దాయన విషయం చెప్పాడు.

''ఏమిటో... ఆ బిడ్డ చచ్చిపోయేలా వుంది. తల్లి ఒడిలో వెచ్చగా పడుకోవాల్సిన బిడ్డ- కుళ్ళు కంపులో కలిసి కుళ్లిపోబోతోంది'' జీవనకు పరిచయం వున్నావిడ దగ్గరగా జరిగి మనుషుల్ని పక్కకు నెట్టి మరీ చూపించింది.

''ఆ బిడ్డ చచ్చిపోతుంటే.. మీరందరూ తల్లిని తిడుతూ, బిడ్డ మీద అనవసరపు ఉపయోగం లేని జాలి ప్రదర్శిస్తూ నిలుచున్నారా?'' మందలింపుగా అంది జీవన.

అప్పటికే తన కళ్ళల్లో నీళ్ళు.. పరుగెత్తికెళ్లి బిడ్డను తెచ్చుకోవాలన్నంత ఆత్రం కనిపించింది ఆ కన్నీళ్ళలో..

''భలేదానివే! మరేం చేయమంటావు తల్లీ!'' ఎవరో దీర్ఘం తీశారు.

''ఎవరో ఒకరు పెంచుకోవచ్చుగా!'' అంది జీవన పరిష్కారంగా.

''ఇంకా నయం! ఎవరికి పడుతుందీ తలకు రోకలిపోటు. తల్లికే అవసరం లేని బిడ్డ!'' ఛీత్కరించిందో పెద్దావిడ.

''ఎవడిక్కందో- ఏ దొమ్మరివాళ్ళపాలో అవుతుంది పాపం! తల్లి కూడా దొమ్మరిదైతే బావుండేది. ధైర్యంగా పెంచుకునేది'' ఇంకో గొంతు జాలి చూపించింది.

''మీరసలు ఆడవాళ్ళేనా? ఇందాకట్నుంచీ తల్లి నలా తిడుతూనే వున్నారు. మీరూ తల్లులయ్యారుగా! ఏ తల్లిమాత్రం తన బిడ్డను చెత్తకుండీలో వేయాలనుకుంటుంది? ఏ పరిస్థితులు ఆమె గుండెను చంపి ఈ పని చేయించాయో పాపం!'' అంది జీవన.

మళ్ళీ కాసేపు ఆగి, 'అయినా చేస్తే ఏదైనా సాయం చేయాలి. లేదా ఊరుకోవాలి అంతే గానీ, ఈ అనవసరపు ప్రసంగాలు ఎందుకు?' అనునయంగానే అంది.. ఆవేశాన్ని ఆపుకుని.

''అంత విశాల హృదయం ఉన్నదానివి- నువ్వే తీసుకెళ్ళి పెంచుకోవచ్చుగా'' గుంపులోంచి ఎవరో సవాలు విసిరారు.

''నేను పెళ్ళి కాని అమ్మాయిని కాబట్టి ఆలోచిస్తున్నాను. లేకపోతే ఎప్పుడో ఈ బిడ్డను తీసుకెళ్దును'' అంది బిడ్డవైపే చూస్తూ.

''పెళ్ళి కాకపోతే ఏంటట?'' పెద్దాయనకు అనుమానం సరైందే వచ్చింది.

''రేపు మీరే ఈ బిడ్డ ఎవరు? నీ దగ్గరెందుకుంది? ఈ బిడ్డమీద ఇంత ప్రేమేంటి? అని ఆరాలు తీస్తారు. ప్రాణాలు తోడేస్తారు! రేపు ఏదైనా సంబంధం వస్తే 'జీవనకు ఇంతకుముందే ప్రేమ వ్యవహారం నడిచింది. ఒక బిడ్డను కూడా కన్నది'' అని చాటుమాటు ఇన్ఫర్మేషన్ ఇచ్చేస్తారు''అంది బిడియంగా.

''చాల్లే ఊరుకో... జీవనా! ఏంమ్మాటలివి? నువ్వు చిన్నప్పట్నించీ మాకు తెలీదూ? ఏదో ఆరునెలల కిందట కాలనీ వదలి వెళ్ళావని నీ మీద అంతటి నిందలేస్తామా? పైగా మా అందరి ముందే నువ్వా మంచి పని చేస్తుంటే.. రేపు ఎవరైనా నిన్ను ఏమైనా అంటే మేమే ముందు తలతిక్క దిగేలా సమాధానం ఇవ్వమూ.. నీ తరపున!'' బామ్మగారు సమర్థించింది.

''అంతేనంటారా? అమాయకంగా అడిగింది జీవన.

''అవునండీ! ఆ బిడ్డను తీస్కెళ్ళి మానవత్వం వుందని ఋజువు చేయండి. మగాడిగా నేను పెంచలేను కనుక ఆలోచిస్తున్నాను'' ఎవరో ఓ అబ్బాయి ప్రోత్సహించాడు.

జీవన ఆ బిడ్డవైపు కదిలింది.. జీవనం ఇవ్వడానికి.. ఆత్రంగా! తనకంటే ముందే ఎవరో వెళ్ళి బిడ్డను తన చేతుల కందించారు.

''నిజంగా ఎంత గొప్ప మనస్సో ఈ అమ్మాయిది? ఆదర్శాలు వల్లించేందుకే అనుకున్నాం. ఆచరించేందుకు కూడా సమర్థురాలు!'' అని ఇంకే ఏమేవో మెచ్చుకోళ్ళు కొనసాగుతుండగా బిడ్డను తెచ్చుకుంది ఇంటికి.

ఇంట్లోకి రాకముందే తల్లి వసంత ఎదురొచ్చింది.

కూతురు చేతిలో బిడ్డను లాక్కుంటూ... ''అయ్యో! పసిది ఎంత వణికిపోతోందో...!'' అని గబగబా తల తుడిచి, పొత్తిళ్ళుమార్చి, కూతురుకు అందించి, సాంబ్రాణి తేవడానికెళ్ళింది.

బిడ్డను అందుకున్న జీవన జాకెట్ హుక్ తీసి గుండెలకదుముకుంది... పాలుబుకుతుంటే!

ఆర్తిగా బిడ్డ పాలు త్రాగుతుంటే పాలకంటే ఎక్కువగా కన్నీళ్ళు పొంగాయి జీవనలో!

సాంబ్రాణి తెచ్చి తలకువేస్తూ.. ''వెధవ సంఘానికి భయపడి బంగారమంటి బిడ్డను బలిచేసుకునేవాళ్ళమే... కాస్తవుంటే!'' అని మెటకలు విరుచుకుంది వసంత. మనవరాలు బతికి బయటపడినందుకు.

''తప్పనిసరయిందమ్మా! ఈ బిడ్డ నా బిడ్డ అని చెప్పుకుంటే పెళ్ళి కాకముందే పుట్టిందని నన్నూ, దాన్నీ జీవితాంతం హింసిస్తారు.. తూట్లు పొడుస్తారు. ఇప్పుడందరూ 'జీవనకు ఎంత విశాల హృదయం.. ఆ పాపకు ఎంత అదృష్టం' అనుకుంటున్నారు.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం

133 — శ్రీపాద కృష్ణమూర్తి

ఆ ఇరువురూ ఆ కొమ్మపైన కూర్చుండి ఆసక్తితో పరిణామాన్ని పరికిస్తున్నారు.

తర్వాత సుగ్రీవుడు రామలక్ష్మణులను గుహలోపలికి తోడ్కొని పోయాడు. అంతకు పూర్వం అవనిజ పడవైచిన నగల మూట కొనివచ్చాడు. ''రామా! దనుజుడు నీ సతిని అడవిలో వంచించి, మీ కనుగప్పి అపహరించుకొని గగన మార్గన వెడలుతూ వుండగా- ఈ గిరిపైన మమ్ము కాంచి పైటకొంగు చించి, ముడివేసి తన నగలు పడవేసింది అని చెప్పి ఆ మూట ఇచ్చాడు.

అంత శ్రీరాముడు ఆ మూటని అందుకొని, ముందుగా వగల మున్నీట దోగి కన్నీట ఆ తొడవుల కసటుకడిగి, ఉరముపైన వుంచుకొని సీతను తలచుకొని, దుఃఖించి- లక్ష్మణుణ్ణి పిలిచి మాటలో తొట్రుపాటు అధికంకాగా ''లక్ష్మణా! చూశావా? సీత నగలు మంటిపాలు అయాయి. ఈ నగలు పారవేయడానికి కారణం ఏమిటో? ఆమె ఏ సమయంలో? ఇది సీత పైట చెరగు. ఈ జిలుగు పైటకు ఈ అవస్థ పట్టింది. ఏమనగలను? పన్నీటితో నా పాదాలు కడిగి, ఈ పయ్యెద చెంగుతో తడి ఒత్తేది. ఈ పైటనే సురటి కావించి నా చెమట బిందువులు తుడిచేది. ఈ చెరగునే నా అడుగులకి మడుగులుగా పరచేది'' అని శోకించాడు. కన్నుల బాష్పాలు నించాడు. మూర్ఛిల్లాడు. అంతలోనే తెలివి వచ్చి, భక్తితో విసమిత గ్రీవుడైన సుగ్రీవుణ్ణి కని ''నా ప్రియసతిని అపహరించిన రావణాసురుడు ఏ దేశంలో నివశిస్తాడు? వాడి నృపధాని ఏది? సుగ్రీవా తెలియజెప్పు. ఆ రక్కసుడి అతిశయాన్ని అణచి, చంపి, సీతను కైకొని వస్తాను''అని వాపోయాడు.

శ్రీరామడి పలుకులు విని సుగ్రీవుడు 'ఆద్రోహి పురం నేనెరుగను. తెలియకుంటే నేమి? ఇకపైన తెలుసుకొనే నెరవు నేను ఆలోచిస్తాను. నీవు ఈ శోకం మాని నిశ్చల ధైర్యపరుడవు కమ్ము. అత్యంతమూ పరాక్రమశాలి అయిన వాలి నా భార్యని రుమను కైకొన్నా నేనింతగా వగవను. ఆపద అనే జలధి దాటడం కోసం ఆత్మధైర్యం తెప్పగా చేసుకొనే మానవుడు తెలివి కలవాడు'' అని స్తుతింపబడతాడు. మావంటి ప్రాకృత మనుష్యులక్రియ నీవూ శోకించటం నీతియా?'' అని పలికాడు.

సుగ్రీవుడి ఆప్తవాక్యాలు విని రఘురాముడు కడు ధీరుడు అయినాడు. సతిని కొనిపోయిన జాడ ఎరింగిన పిదప అంతరంగంలో వ్యథతో కుమిలిపోవడం మనపాడి కాదని నిర్ణయించుకొన్నాడు. వెంటనే సంతాపం అణచుకొన్నాడు. పద్మముఖి అయిన సీతను కనుగొనే పనికి పూనుకొనే ముందు ఈ సుగ్రీవుడి పగ తీర్చవలసి ఉంది'' అని తలుస్తూ సీత నగలు లక్ష్మణుడికి ఒసగాడు.

రాముడు సుగ్రీవుడి దెస వీక్షించాడు. తీవ్రంగా ఆలోచించి చూస్తే మిత్రుడు మనుజుడికి పరమాధారం అయినట్టు చుట్టం కాలేడు. గుణవంతుడైనా గుణహీనుడైనా పరికింపగా సఖుడే సద్గతి అని విద్వాంసులు చెప్పుతారు. కనుక నీ నెయ్యం అబ్బిన నాకు ఏ కొదువా లేదనడం నిశ్చయం. నీ పత్నిని స్వాధీనం చేసుకొని, నిన్ను సంహరింపతలచే పాపాత్ముడైన వాలిని ఇప్పుడే పరిమారుస్తాను. అన్నదమ్ములు సోదర వాత్సల్యంతో అలరారుతూ వుండటం కన్నా సౌఖ్యం ఉందా? పగపూనిన నీ అన్న వాలికీ నీకూ వైరం ఏర్పడటానికి కారణం తప్పక తెల్పు'' అని రాముడు కోరాడు.

అంత సుగ్రీవుడు ''శ్రీరామచంద్రా! నాకు వాలికి కలిగిన వైరం కథని సాంతం చెబుతాను. సావధానంగా వినవలసింది.

''మంధరగిరిని కవ్వంగాను, సర్పరాజు వాసుకిని కవ్వపు త్రాడుగానూ చేసికొని మమ్మల్ని దేవతలందరూ మన్నన చెయ్యగా భుజబలంతోనూ, తెలివితోనూ వాలీ, నేను వడిగా ఒక ప్రక్క వ్రాలాము. మరొక వంక వ్రాలిన సురలు, గరుడులు, ఉరగులు, సాధ్యులు, సిద్ధులు, అసురులు అందరూ పాల సంద్రాన్ని త్రచ్చగా త్రచ్చగా గరళం పుట్టింది.

-ఇంకాఉంది

శనివారం, 2 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ షష్ఠి ఉ.08.00,
సప్తమి రా.తె.05.08
నక్షత్రం: చిత్త సా.05.25
వర్జ్యం: రా.10.43 నుండి 12.14 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది. రహస్య శత్రువులపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. క్రొత్త వ్యక్తులను నమ్మి మోసపోరాదు.ఈ రాశివారికి మానసికాందోళన తప్పదు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థాన చలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువచేస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నిన్నటివరకు వాయిదా వేయబడిన కొన్ని పనులు ఈ రోజు పూర్తిచేసుకోగలుగుతారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు, సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ధనలాభయగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అనుకూల వాతావరణమేర్పడుతుంది.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అనారోగ్యమేర్పడుతుంది. పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
అపకీర్తి రాకుండా జాగ్రత్త పడుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా నుండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. కుటుంబం అంతా సౌఖ్యంగా ఉంటారు. సన్నిహితులను కలుస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. అనవసరంగా డబ్బు ఖర్చగుటచే, ఆందోళన చెందుతారు. విదేశీయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. కొన్ని పనులు పూర్తిచేసుకోలేకపోవునుకబడుతారు.

మంచిమాట

నిజం విలువ

సత్యంపలకడం, ధర్మం ఆచరించడం అనేవి మనిషి కర్తవ్యాలు. ఆనాటి రాజులు కూడా సత్యధర్మాల వలనే తమ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నమ్మేవారు. సత్యమే శివం. అదే సుందరం. మనది కర్మభూమి వేదాలు ప్రణమిల్లిన భూమి. ఈ భూమిలో పుట్టిన ప్రతి ఒక్కరు ధన్యులే. సత్యాన్ని కాపాడ్డానికి, ఇచ్చిన మాట పాటించడానికి కష్టాలను కూడా ఇష్టాలుగా భావించేవారు. ఆనాడు శ్రీరామచంద్రుడు తన జీవిత పర్యంతమూ సత్యాన్నే పలికాడు. సత్యహరిశ్చంద్రుడు సత్యం కోసమే రాజ్యాన్ని, భార్యాబిడ్డలను పోగొట్టుకున్నా వాటినితిరిగి పొందడానికి సత్యాధర్మాలనే ఆయుధాలుగా చేసుకొన్నాడు.

భగవంతుడు చూస్తుంటాడా? అసలు భగవంతుడు ఉన్నాడా? అంటూ ప్రశ్నించిన వాళ్ళు వాళ్ళకు తెలియకుండా భగవంతుని నామజపం చేస్తున్నారు. పిపీలికాది బ్రహ్మాండమంతా శివమయం అయినపుడు నాస్తికులు, ఆస్తికులులేరు. భగవంతుడిని ద్వేషిస్తున్నాం అనేవారందరూ, లేక దేవుణ్ణి అన్వేషిస్తున్నాం మాకు కనిపిస్తేనే మేము నమ్ముతాం అనేవారు సైతం ఎల్లపుడు భగవంతుణ్ణి స్మరించేవారే. వారిది వైరభక్తి అనిఅవనవచ్చు. కంసాదిదానవ వీరులది ఈ కోవలోని వైరభక్తే కదా.

అలానే త్యాగం ఒక సుగుణం. త్యాగం చేయడంమంటే మనకున్న దాన్ని లేకుండా చేసుకోవడం కాదు. ఉన్నదానిలో మరొకరికి సాయంచేయడమే. ఈ త్యాగగుణంలో పటాటోపాలు, ఆర్భాటాలకు తావుండకూడదు. ఎందుకంటే అది గర్వం పెరగడానికి పనికివస్తుంది కాని త్యాగగుణాన్నిపెంచదు. కనుకనే కర్ణుడు కుడిచేత్తో చేసే దానం ఎడమ చేతికి తెలియనవసరం లేదంటాడు. అలాంటిగుణసంపత్తి పెంచి పోషించుకోవాలి.

కాలం ఒక్క క్షణం కూడా మన కోసం ఆగదు. అలాంటి కాలంలో ఒక్క క్షణమైనా ఇతరుల కోసం జీవిస్తే ఆ జన్మకు పరిపూర్ణత లభిస్తుంది. ఆపదల్లో ఒక ఆపన్న హస్తం దొరకకపోతుందా అని ఎదురుచూసేవారికి ఆ హస్తం చేసే మేలు కొన్ని జన్మలదాకా పుణ్యాన్ని మూటకట్టుతుంది. ఆ సాయం అందుకున్నవారూ సంతోషిస్తారు. దీనికి కులమతాలు, కాని హెచ్చుతగ్గులుకాని అక్కరకురావు. సాయం అందించాల్సిన చేయి సాయం చేయాలి. దీనిలో మన తన భేదాలు ఉంచుకోకూడదు. సాయం అందించడానికి న్యాయంగా బతకడానికి మనకు ఆస్తిఅంతస్తులుకాని, బలపరాక్రమాలు కాని అవసరం లేదు. మన వ్యక్తిని ఇంకోవ్యక్తి బాగుచేస్తే , ఎవరిని వారు ఉద్ధరించుకొని ఎవరి భావాలను వారు మంచిదారిలో పెట్టుకొంటే చాలు ఇతరులకు మేలు చేసినట్టే. మనం మంచిని చేయడం, ఇతరులలో తప్పును వెతకకుండా ఉండడం చేస్తే చాలన్నమాట. ఇలానే మన పరిధిలో మనం న్యాయాన్ని రక్షించవచ్చు, ధర్మాన్ని కాపాడవచ్చు. కనికరం, జాలి ఇతరులపట్ల సానుభూతి ఇందులో ఉన్న తృప్తి ఎందులోనూ లేదు. ధర్మం కోసం సత్యం కోసం జీవించలేనివ్యక్తి చివరకు ప్రగతి నిరోధకుడే ఔతాడు. కాని అభ్యుదయకారకుడు కాలేడు. కనుక ధర్మాన్ని ఆచరించాలి. సత్యాన్నే పలకాలి. దీనిని మరిచిన నాడు నరకం ఎక్కడో లేదు ఇక్కడే కనిపిస్తుంది. సత్యధర్మాలను పాటించేవారికి ఈ భూతలమే స్వర్గతుల్యమౌతుంది. భగవంతుడు అలవైకుంఠపురంలో ఆమూలాగ్రంలో కన్నా ఎదుటిమనిషిలోనే కనిపిస్తాడు. పరుని సేవ పరమాత్మగా భావిస్తాడు. మనిషి మాధవుడుగా భాసిల్లుతాడు. ధర్మోరక్షితిరక్షతః కదా. కనుక సత్యాన్ని, ధర్మాన్ని పాటించినవారికి కష్టాలుకూడా ఇష్టాలుగానే కనిపిస్తాయి.

-ఎం.దాక్షాయణి

● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరతావులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

వృతాసురుడు

11

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 4

మాటాట

ఆధారాలు:
అడ్డం
2. శంక
5. నీరు
7. దెస
8. సైన్యము
10 సున్నపుపూత
11. గీత
14. ఉప్పు
15. దేరా వంటిదే

నిలువు
1. ముదము
3.మాట
4. కూతురు, కీ. సంవత్సరం
6. మనసులితనము
9. వద్దాణం
10. ప్రకాశము
12. కొంటే విశేషణంగా గలవాడు
13. యవనిక

మాటాట -3 సమాధానం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

nudi@andhrabhoomi.net

నుడి

నిర్వహణ: **డా.సామల రమేష్‌బాబు** - ncharithra@gmail.com Cell: 9848016136

కుదురు మాటలు (క్రియాధాతువులు Verbal Bases)

చల్లారు = వేడిలేనిదవుట
చలివాపు = భయముదీర్చి బుజ్జగించుట
చాఁచు = ప్రసరింపఁజేయుట
చాటు, చాటించు = వీధిలోనుద్ఘోషించి యందఱి కును దెలియఁజేయుట
చాఁదు = సానమొదలగువానిమీఁద రాచుట
చాఁపు= ప్రసరింపఁజేయుట
చారు = కళ్ళము మొదలైన వానిలోఁ జీఁపురుకట్ట మొదలైన వాని చేత ధాన్యాదులు ప్రోగుసేయుట
చాలు = పర్యాప్తమగుట, శక్తుండగుట
చాలించు = పని నిలుపుట
చాల్పడు = అంతయుఁబడుట
చిక్కు = కృశించుట, లభించుట, మిగులుట, చేతికిఁబట్టువడుట
చిక్కువడు = దారములు పరస్పరము మేళనము గుట, కష్టమునొందుట, చేతికిఁబట్టువడుట
చిక్కుకొను = అంటుకొనుట, పరాధీనుఁడవుట
చిగిర్చు, చిగిరించు = పల్లవించుట
చించు = వస్త్రములు మొదలైనవానిని రెండుగాఁజేయుట
చిచ్చికొట్టు = పిల్లకాయల నిద్రపుచ్చుట
చిట్లు, చిటులు = ఎండిన ఫలాదులు తనకుఁదానె ధ్వనిగా బగులుట
చిటారించుగ్రా = కోపము చేత వికృతమగుట
చిత్తగించు = బుద్ధికిఁదెచ్చుకొనుట
చితుకు, చిదుకు = విశీర్ణమగుట
చిదుపు, చిదుము = చంపుట, విశీర్ణముగఁజేయుట

-శ్రీ వేదం పట్టాభిరామయ్య శాస్త్రి 200 ఏళ్ళ క్రితం రచించిన 'ఆంధ్ర ధాతుపాఠ / ధాతుమాల' నుంచి

11
ఆంధ్రభూమి
శనివారం
2, ఫిబ్రవరి
2013

అమ్మ భాషకు బాలసాహిత్యం ఊపిరి!

ఘనమైన మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు కోట్ల రూపాయలు కుమ్మరించి ఆంధ్రప్రదేశ్ నాలుగు చెరగులా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాల్గవ ప్రపంచ తెలుగు సభల వైభవ ఘంటికలను మ్రోగించి ప్రపంచంలోనే పరమోన్నత ఆధ్యాత్మిక కేంద్రంగా, పుణ్యక్షేత్రంగా గుర్తింపబడిన తిరుమల తిరుపతి క్షేత్రంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను జరపటం ముదావహమే కాని ఆశయ సాధన మేరకు ఆ సభలు తెలుగు భాష పరిపుష్టికి దోహదపడగలవనేది సందేహాత్మకమే!

యునెస్కో లెక్కల ప్రకారం ఈ రోజున తెలుగునాటనున్న తెలుగు భాషకున్న పరిస్థితులు ఇలాగే కొనసాగిస్తే మరో రెండు దశాబ్దాలలో తెలుగు ఉనికి ప్రపంచంలోనే అదృశ్యం కాగల దన్న భయంకర నగ్నసత్యం తెలుగు భాషాభిమానుల గుండెలను పిండి చేయగలదన్నది తథ్యం!

దీనికి విరుగుడుగా ప్రభుత్వం పాలనా రంగంలో అన్ని స్థాయిలలోను తెలుగును అమలుపరిచే శాసనాలు అమలు చేస్తామని గట్టి భరోసా ఇవ్వడమొక్కటే చాలదు. చిత్తశుద్ధితో శాసనాలు అమలుజరపాలి.

అదలా ఉండనివ్వండి! మొన్న జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల తీరును పరిశీలిస్తే ప్రభుత్వం వారు తెలుగు సంస్కృతి, భాషల వైభవ రీతిని ప్రదర్శించే కార్యక్రమాలను ఉన్నత స్థాయిలో చూపడానికి ప్రయత్నించి కొంతమేర విజయం సాధించగలిగారని చెప్పవచ్చు. కాని దురదృష్టం ఏమిటంటే తెలుగు భాష ఉత్తరోత్తర బతికి బట్టకట్టి నిలబడాలంటే కవి సమ్మేళనాలు, అవధానాలు సాంస్కృతిక కార్యక్రమాలు, తారలు దిగివచ్చిన కార్యక్రమాలు, తెలుగువారి విందు పసందులు, తెలుగు వారి పంచెకట్టు వేషధారణలు ఇవి మాత్రమే చాలవు. ఒక ముఖ్యమైన అంశం మూల ప్రాంతాలలో కూడా ఆంగ్లమాధ్యమ పాఠశాలలు కోకొల్లలుగా ఆవిర్భవించడమే! పదవ తరగతివరకు ఆంగ్ల మాధ్యమంలో చదివిన తెలివైన పిల్లలు కూడా పట్టుమని పది తెలుగు మాటలు గుణింతాలు తప్పులు లేకుండా వ్రాయలేకపోతున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితి తెలుగు భాషను బతికించగలదా? వేల రక్తి, ఆసక్తిని కలిగించడానికి నేటి తరగతుల తెలుగు వాచకములొక్కటే చాలవు. విరివిగా మన మాతృభాషలో బాల సాహిత్యాన్ని ప్రోత్సహించి ఆ బాల సాహితీ ఫలాలను పిల్లలచే ఆరగింపజెయ్యాలి. అప్పుడే మాతృభాష రానున్న తరాల కాలంలో నిలబడగలదు.

దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు రాజ్యవిస్తరణ చేసిన కృష్ణదేవరాయలు అనేక భాషల సౌందర్యం తెలుసుకొని దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగును కీర్తించాడు. విదేశీయులు కూడా అందమైన అజంత భాష అని తెలుగును వ్యాఖ్యానించారు. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి కూడా సుందర తెలుంగని తెలుగును ప్రశంసించాడు. ఇటీవల ప్రపంచ భాషల లిపుల పోటీలలో కొరియా తరువాత మన తెలుగు అందమైన లిపిగా రెండవ స్థానం ఆక్రమించింది. ఇంతటి ప్రశస్తమైన తెలుగును మన తరంలో దిగజార్చుకోవడం మనకు సిగ్గుచేటు! మన తరానికే సవాల్!

అందుకే మన తల్లి పలుకు తెలుగును నిలబెట్టుకోవడానికి మన ఇంటినుంచే మనం మన కర్తవ్యం ప్రారంభించాలి. తెలుగులోనే మాట్లాడుకోవాలి. తెలుగులో మాట్లాడడానికి పిల్లలను ప్రోత్సహించాలి. దీనికి సమాంతరంగా ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో స్పందించాలి.

మొన్న జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో బాలసాహిత్యానికి చోటెక్కడుంది? అన్ని ప్రక్రియలలో కృషిచేసినవారిని గుర్తించి సత్కరించామని భుజాలెగరేసుకున్నారే గాని పెద్దల కనుసన్నలలో బాల సాహిత్యం కనిపించలేదా? వారి జ్ఞాన చక్షువులకు బాల సాహిత్యం గోచరించలేదా? బాలసాహితీ కృషీవలురు వారికి తారసపడడం లేదా?

జరిగిన పొరపాటేదో జరిగిపోయింది. ప్రభుత్వంవారు కళ్ళు తెరచి బాల సాహిత్యానికి సముచిత స్థానం కల్పించాలి. బాల సాహిత్య రచయితలకు ప్రోత్సాహమిచ్చి రానున్న తరాలలో రచయితలు బాల సాహిత్య రంగంలోకి రావడానికి దోహదపడాలి. బాలల అకాడమీని పునరుద్ధరించి అమ్మ భాషకు ప్రాణం పోయాలి.

బాల సాహిత్యం బాలలకు చేరువగా ఉన్నంతవరకు మన తెలుగు భాష బతికి ఉండగలదు. విజ్ఞులు ఆలోచించి నిర్ణయాలు తీసుకొని బాల సాహిత్యం కూడా సాహిత్యంలో ఒక ముఖ్యమైన ప్రక్రియగా పరిగణించాలని కోరుతున్నాను.

-బెలగాం భీమేశ్వరరావు
9989537835

అందుకే మన తల్లి పలుకు తెలుగును నిలబెట్టుకోవడానికి మన ఇంటినుంచే మనం మన కర్తవ్యం ప్రారంభించాలి. ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకోవాలి. తెలుగులో మాట్లాడడానికి పిల్లలను ప్రోత్సహించాలి. దీనికి సమాంతరంగా ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో స్పందించాలి. మొన్న జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో బాలసాహిత్యానికి చోటెక్కడుంది? అన్ని ప్రక్రియలలో కృషిచేసినవారిని గుర్తించి సత్కరించామని భుజాలెగరేసుకున్నారే గాని పెద్దల కనుసన్నలలో బాల సాహిత్యం కనిపించలేదా? వారి జ్ఞాన చక్షువులకు బాల సాహిత్యం గోచరించలేదా? బాలసాహితీ కృషీవలురు వారికి తారసపడడం లేదా?

సంస్కృతీ శిఖరం

ఆయనంటే ఆనాటి వారందరికీ
అంతులేని అనురాగం
ఆయన పాఠం చెబుతుంటే అంతా ఆ గదివైపే!
పద్యం గద్యం ఏదైనా అది
ఆయన అందమైన గళసీమకే నైవేద్యం
ఆయన చెప్పిన నాలుగక్షరాలే తమను
ఇంతవారిని చేసాయని వారి కృతజ్ఞత
ఆమూర్తిని చూస్తేనే
తనువులు పులకించే పరవశం
ఆయనో పదహారణాల తెలుగు శిఖరం
ఆయనేఆనాటి తెలుగు పంతులయ్య
నేటి తెలుగుపంతుళ్ల దారేవేరు
ఆహార్యం అటుంచు భాష సొగసులుఎక్కడ?!
మార్కుల్ని కురిపించాల్సిన మాంత్రికుడతడు!
తెలుగే కదా ! దాన్ని తెగబోథించాలా?
రాబోయే తెలుగు వసంతంలోనైనా
ఎదగలి ఈ సంస్కృతీ శిఖరం
పారగుభాషా వైభవాలను మించి!
అందుకోసం ఎదురు చూద్దాం
కళ్లజోడు లేని తెలుగుకళ్లతో..!!!

- అమ్మిన శ్రీనివాసరాజు
ఖమ్మం జిల్లా 9949137408

ఇన్ని 'మనం'ల మధ్య బతికేనా?

ఇంతకుమునుపు హైదరాబాద్‌లో ప్రపంచ తొలి తెలుగు మహాసభలు జరిగాయి. అదే క్రమంలో తిరుమలలో 4వ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభమవడం ముగిసిపోవడం కూడా జరిగింది. ఈ సందర్భంగా ఎన్నో వాద ప్రతివాదాలు తెరపైకి వచ్చాయి. కాని తెలుగుకి సంబంధించి గత కొంతకాలంగా రాష్ట్రంలో జరిగిన అత్యంత హేయమైన దుర్ఘటనల చర్చ కాని, వాటి పునరావృతాన్ని నిరోధించటానికి తీసుకోవలసిన ప్రత్యేకమైన చర్యల ప్రస్తావన కాని ఎక్కడా జరిగినట్లులేదు.

కాని, బడుల్లో తెలుగు మాట్లాడినందుకు పంతుళ్లు వేసిన శిక్షలు అనుభవించిన చిన్నారులను మనదగ్గరే చూస్తాం. అలాగే దశాబ్దాల కాలం తరువాత గాని డిడిరిని సప్తగిరిగా మార్చుకోలేదు మనం.. మాండలిన్ శ్రీనివాసు, బాలమురళీకృష్ణలను తమిళులు గుర్తించి గౌరవిస్తే కాని వారెవరో తెలిసికోలేని అజ్ఞానంలో జీవించాము మనం.

మద్రాసుని చెన్నయి, బొంబాయిని ముంబాయి, కలకత్తాని కోలకతా, భువనేశ్వర్‌ని భుభనేశ్వర్, అస్సామ్‌ని అస్సోమ్‌గా నిర్మొహమాటంగా మార్చుకున్నారు వారంతా. మనం మాత్రం గోదావరిని- గోడావరి అని హైదరాబాదుని హైడ్రాబాద్ అని ఆంగ్ల యాసతో పిలుచుకుంటూ గర్వపడుతుంటాము మనం.

చెన్నయి వాసులు భక్తిశ్రద్ధలతో త్యాగరాజు (మన తెలుగు దిగ్గజం) ఆరాధనోత్సవాలను జాతీయ ప్రసార మాధ్యమాలలో ప్రసారం చేయించుకోగలిగారు.. ఒక ప్రక్క నవతరం త్యాగరాజుని మరిచిపోతుంటే నిశ్చింతగా నిద్రపోతున్న మన ప్రభుత్వం... కనీసం అన్నమయ్య ఆరాధనోత్సవాలు జరిపించాలని.. వాటిని రాష్ట్రీయ, జాతీయ ప్రసార మాధ్యమంలో ప్రసారం చేయించాలని వత్తిడిని తేలేకపోయాం మనం...

వీధి వీధిన ఆంగ్ల భాషలో కనిపించే దుకాణాల పేరు పలకలను తెలుగులో (అది కూడా పైభాగాన) ఉండాలని పట్టుబట్టలేదు మనం... గత రెండు దశాబ్దాలుగా వెండితెరని ఏలగలిగిన ఒక్క తెలుగు ఆడపడుచు లేని ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నాం మనం... ప్రతీ తెలుగు చలన చిత్రానికి ఆంగ్ల శీర్షిక తగిలించే రుగ్మతని విడనాడలేని తెలుగు చిత్రసీమలో తరిస్తున్నాం మనం.

తెలుగు నేలపై తెలుగు పాట పాడిస్తే విడ్డూరం అనే పాట రాసుకోవడం ఘనత అనుకుంటున్నాము మనం.. ముందొక ఆంగ్ల పదం.. వెనకొక ఆంగ్ల పదం లేకుండా మాట్లాడలేని వ్యాఖ్యాతలైన మనం... అమ్మను మమ్మీ లని చచ్చిన శవాలుగా మార్చిన మనం.. నాన్నని డాడీ అంటూ చంపేసిన మనం.. (డాడీకి పాత ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ప్రకారం పిచ్చికుక్క చేత కరవబడి తరుమబడేవాడని అర్థం ఉందిట. తరువాత కాలంలో ఈ అర్థం తీసివేయబడిందట. ఈ అర్థం కారణంగానే మంచి సాహిత్య విలువలున్న ఆంగ్ల భాషా చలన చిత్రాలలో డాడీ పదం వాడబడదు.. దానికి బదులుగా ఫాదర్ లేదా పాపా వాడతారు) ఆంటీ, అంకులంటూ అన్ని బంధాలను రెండు పదాలకు కుదించుకుంటున్న మనం.. అన్నాన్ని రైసని.. కూరని కర్రీ అని వెఱ్ఱిగా పిలుచుకుంటున్నాం మనం.

చందమామరావే జాబిల్లి రావేని... శ్రీరాముని దయ చేతనుని తుంగలో తొక్కి... రింగా రింగా రోజెస్.. ఉయ్ ఆల్ ఫాల్ డౌన్ అని మనమందరము చచ్చిపోతామని చెప్పే పద్యాలను చిన్న పిల్లల గొంతులో పోసి వాటిని మళ్లీ చెప్పిస్తూ మురిసిపోయే మనం... (ఏ విధంగానైతే మన దేశంలో పరివార నియంత్రణకి ప్రభుత్వం ఇదివరలో ఒక ప్రకటన చేసిందో, అదేవిధంగా చిన్న పిల్లల పద్యం అనబడుతున్న ఈ రింగా రింగా రోజెస్ అనేది ఇంగ్లండులో ప్లేగువ్యాధి ప్రబలినపుడు అక్కడ ప్రజలను జాగృతం చేయడానికి తయారుచేసిన ఒక ప్రకటన. కళ్ళదగ్గర పోజీ అనే పువ్వులు పెట్టుకుని అందరు తమని తాము రక్షించుకోవాలని లేదా అందరు మరణిస్తారని.. ఉయ్ ఆల్ ఫాల్ డౌన్ అని హెచ్చరించిన ప్రకటన భావమది. దీనిని వారు చిన్న పిల్లల పద్యంగా స్వీకరించి ఉండవచ్చు. కాని మన బుద్ధి ఏమైంది.)

మనమందరము తెలుగువారము... తెలుగులోనే మాట్లాడుకుందామని ప్రకటనలు తయారుచేసుకున్న ఏకైక జాతి జనులం మనం.. తెలుగు రాకపోయినా ఫరవాలేదని.. ఒకటవ తరగతి నుండే ఏ బి సి డీలు నేర్పించాలని పట్టుబట్టే మనం.. మెలికలు తిరిగిపోయే దూరదర్శని విదూషికలు (ఏంకరు) తెలుగుకు తెగులు పట్టిస్తుంటే మురిసిపోయే మనం..

పౌర సరఫరా దరఖాస్తు పత్రాన్ని కూడా తెలుగులో తయారు చేసుకోలేని మనం.. (రెండేళ్ళ ముందర అనుకుంటా- పౌర సరఫరా పత్రాలను (రేషన్ కార్డులు) కావలసినవారి కోసం నిమిత్తం ప్రభుత్వం జారీ చేసిన దరఖాస్తు పత్రం పూర్తిగా ఆంగ్లంలో ఉండడడం చూసి ఉంటారు. పౌర సరఫరా పత్రమనేదే ప్రముఖంగా తక్కువ చదువుకున్నవారికి చెందినది. అటువంటి దరఖాస్తు పత్రాన్ని కూడా ఆంగ్లంలో విడుదల చేయడం మన ప్రభుత్వానికే చెల్లింది.)

ఇన్ని మనంల మధ్య ఆపసోపాలు పడుతూ అన్నిటా, అంతటా, అందరికి అస్పృశ్యమైపోతున్న తెలుగు, తనవారి చేతనే కాటికి పంపివేయబడుతున్న తెలుగు బ్రతకాలంటే ఎలా బ్రతుకుతుంది. భాషగా ఆంగ్లం కావలసినదే. అలాగే భారతీయ భాషలన్నీ కూడా కావలసిందే. భారతీయ భాషలేవి కూడా మృత భాషలు కావు. అవి అమృత భాషలు.

ప్రస్తుతం రాష్ట్రంలో 9.33 కోట్ల ప్రజలు, ప్రపంచంలోని మరొక కోటిమంది తెలుగు భాష మాట్లాడేవారున్నారు. ఇంకా భారతదేశంలో అందరికంటే ఎక్కువ మంది మాట్లాడే భాష కూడా తెలుగే. అయినా యునెస్కో ప్రకటించిన రెడ్‌లిస్ట్ (అంతరించిపోతున్న భాషల జాబితా)లో తెలుగు భాష కూడా ఉండటం పరిస్థితి తీవ్రతని తెలియజేస్తున్నది.

మన దేశంలో ఏ భారతీయ భాషని మాట్లాడేవారి సంఖ్యని తీసుకున్నా వారి సంఖ్య ప్రపంచంలోని ఎన్నో దేశాల మొత్తం జనాభాకి వేల రెట్లు ఉన్నారు. మనం తలచుకుంటే, కాస్తంత భాషాభిమానాన్ని పెంపొందించుకుంటే అంపశయ్యమీదకి చేరుతున్న తెలుగుని విశ్వ వేదికపైన ప్రతిష్ఠించగలము. 7.06 బిలియన్లు ఉన్న ప్రపంచ జనాభాలోని కనీసం ఒక 40 శాతం ప్రజలైనా తమ భావ ప్రకటనని కేవలం 26 అక్షరాలున్న ఆంగ్లంలో చేయగలుగుతున్నారంటే ఆంగ్ల అక్షరాలకు రెట్టింపు అక్షరాలున్న భారతీయ భాషల శక్తి సామర్థ్యం ఇంకెంత విస్తృతమైనదో వేరే చెప్పనక్కర్లేదు.

అమ్మలు కాస్తంత శ్రద్ధ వహించి తమ బిడ్డని ఎలాగైతే ప్రత్యేక శ్రద్ధతో సాకుతున్నారో అంతే శ్రద్ధతో వారి మరొక బిడ్డ అయిన తెలుగుని కూడా అపురూపంగా, అశ్రద్ధ చేయకుండా, సవతి బిడ్డ అనుకోకుండా చూసుకుంటూ పిల్లలకి అమ్మ భాషలో జోలపాడుతూ, తెలుగు పదాల అమృతాన్ని తరువాతి తరం చెవిలో పోస్తూ ఉంటే తెలుగు భాష పునర్‌వైభవాన్ని పొంది తీరుతుంది. ప్రజలు ఆంగ్ల బానిసత్వాన్ని వీడి అయిన దానికి కానిదానికి ఆంగ్ల భాషా పదాల వాడుక తగ్గించి, ప్రయత్న పూర్వకంగా మాతృభాషని వాడుతూ ఉంటే తెలుగేకాదు ప్రతీ భారతీయ భాషా బ్రతుకుతుంది. ప్రభుత్వాలు రాష్ట్ర భాషకు ప్రాముఖ్యతనిచ్చి, వాటిని కేవలం పేరుకి పాలనా భాషలుగా ఉంచేయకుండా, వాటి ద్వారా ఉపాధిని కూడా కల్పించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తే తెలుగు తప్పక బ్రతుకుతుంది. మళ్లీ వచ్చే ప్రపంచ తెలుగు మహాసభలలో కూడా ఇప్పటి విషయాలనే చర్వితచరణం కాకుండా ఇవి అన్నీ త్వరలోనే ప్రారంభమై, నిరంతరంగా జరుగుతాయని ఆశిద్దాం.

-పెమ్మరాజు లక్ష్మీనారాయణ రాజు
9441487181

పిల్లల్లో చదువు.. ఒత్తిడి

ఒక వ్యక్తి ఆశించినదానికీ, నిజంగా జరిగేదానికీ లేదా జరగబోతున్న దానికి మధ్య ఉండే తేడానే వత్తిడి. ఒత్తిడికి గురి అయినపుడు అందుకు ప్రతిగా వారి మనసు, శరీరం స్పందిస్తాయి. ప్రతివారికీ కొంత ఒత్తిడిని భరించే శక్తి ఉంటుంది. కలిగే ఒత్తిడి భరించేదానికన్నా తక్కువగా ఉంటే అది ఉపయోగకరంగా ఉంటుంది. దాన్ని దాటితే నష్టాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి పిల్లల చదువులో కొంతమేరకు ఒత్తిడి అవసరమే. అయితే అది వారి భరింపు గిరిలోనే ఉండాలి. అది కూడా ఎవరికివారు ఒత్తిడిని తెచ్చి పెట్టుకోవాలి లేదా ఆ వయుపుగా పెద్దవారు, టీచర్లు ప్రోత్సహించాలి. బలవంతంగా రుద్దకూడదు. ఏ కారణంవల్ల అయినా పిల్లల చదువు ఒత్తిడి భరించలేని స్థాయికి చేరింది అంటే మానసిక అలజడి (యాంగ్జయిటీ)కి లోను అవుతారు. దాంతో శారీరక ఆందోళన (టెన్షను) మొదలు అవుతుంది.

ఇది ఒత్తిడి యుగం. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు కాటికి కాళ్లు చాపుకున్న ముసలివాళ్ళవరకూ ఒత్తిడికి లోనుకానివారు అంటూ ఎవరూ ఉండరు. అయితే ఒత్తిడికి గురి అయిన సంగతిని వారు గుర్తించవచ్చు, గుర్తించలేకపోవచ్చు. ఒత్తిడి కలగటానికి గల కారణాన్ని బట్టి, దాని తీవ్రతను బట్టి ఉంటుంది. ఒత్తిడికి కలిగిన వ్యక్తిని బట్టి దాన్ని అసలు గుర్తించలేని స్థాయి మొదలుకొని ఆత్మహత్య చేసుకొనేవరకూ ఏ స్థాయిలో అయినా ఉండవచ్చు. ఒత్తిడికి గురయ్యే వ్యక్తి, అతని మానసిక పరిణతి, వ్యక్తిత్వాన్ని బట్టి ఫలితం ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు ఒకే రకపు ఒత్తిడికి గురి అయినపుడు ఒకరు దాన్ని అసలు ఒత్తిడి కింద పరిగణించక పోగా, రెండో వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చుకునేంతగా స్పందించవచ్చు. ఒత్తిడికి స్పందించే తీరు వారి సర్దుబాటుతత్వం, సమస్యను ఎదుర్కొనే సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. పిల్లల మోతాదుకు మించి ఎక్కువ ఒత్తిడికి గురి అయినప్పుడు మనసుకు నిలకడ కుదరదు. అందువల్ల ఏ పని మీద ధ్యాస పెట్టలేరు. నేర్చుకోవటం మందగిస్తుంది. నేర్చుకున్న విషయాలు సరిగా గుర్తుకురావు. మతిమరుపు ఎక్కువ అవుతుంది, చిన్న చిన్న విషయాలకు తికమకపడతారు. ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా వస్తుంటాయి, వారి మీద వారికి నమ్మకం పోతుంది.. ఆలోచనలలో స్పష్టత లేకపోవటంవల్ల నిర్ణయాలు సరిగా తీసుకోలేరు. తటపటాయింపులు ఎక్కువ అవుతాయి. చదువులమీద, ఆటల మీద ఆసక్తి కోల్పోతారు. ఎవ్వరితో కలవటానికి ఇష్టపడరు. తల్లిదండ్రులతో ముభావంగా ఉంటారు. బడికి వెళ్లనని మొరాయించవచ్చు. ఇంట్లో వారి పట్ల తెలియకుండానే వ్యతిరేక అనిపింపును ఏర్పరచుకుంటారు. ఇంటినుండి పారిపోవటం, ఆత్మహత్యా ప్రయత్నం లాంటి చర్యలకు పాల్పడతారు. చిన్న పిల్లలు వారికి ఉన్న ఒత్తిడిని గుర్తించలేరు. ఒత్తిడివల్ల బాధపడుతున్నాము అని కూడా వారికి తెలియదు. అలాంటప్పుడు వారి ఆందోళన శారీరక లక్షణాల రూపంలో బయటపెడుతుంటారు. తలనొప్పి, వొళ్ళు నొప్పులు, నిద్రపట్టకపోవడం లేదా ఎప్పుడూ పడుకొని ఉండటం, ఆకలి మందగించటం లేదా అతిగా తినటం, నీరసంగా కనపడతారు.

ఒత్తిడివల్ల పిల్లలమీద కలిగించే దుష్ఫలితాలు పెద్దవారితో పోలిస్తే చాలా తీవ్రంగా ఉంటాయి. కారణం ఏమిటంటే వారి మీద పడే ఒత్తిడి బయటకు కనిపించని విధంగా ఉంటుంది. పిల్లలువారికి వారుగా ఒత్తిడిని గుర్తించలేరు. పలానా కారణం వల్ల ఇబ్బంది పడుతున్నాము అని పెద్దవారికి తెలియచేయలేరు. అందువల్ల పిల్లల మీద ఒత్తిడి కొనసాగుతూనే ఉంటుంది. రెండోది పయిన చెప్పినట్టు ఒత్తిడి ఒక స్థాయి దాటితో అది చదువు మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది కాబట్టి బిడ్డ భవిష్యత్తు వారి సామర్థ్యానికి తగ్గట్టు ఉండదు. చదువుకు సంబంధించిన కారణాలు అదనపు ఒత్తిళ్ళు ఇలా ఉంటాయి. 1.మార్కులు, రాంకులు గురిగా నడిపే రెసిడెన్షియలు, కార్పొరేటు బడులవల్ల 2.పిల్లల వయసుకు మించి హోంవర్కు ఇవ్వటం 3.విపరీతమయిన క్రమశిక్షణ పాటించడం 4.సొంత భాషలో మాట్లాడనివ్వకపోవటం, ఇంగ్లీషులోనే మాట్లాడమనటం 5.వచ్చిన భాషలో తేలికగా నేర్చుకోవాల్సిన అంశాలు రాని భాషలో కష్టంగా ఉండటం 6.పిల్లలను అవమానపరచే, చావబాదే టీచర్లు ఉన్నప్పుడు. 7. చదివే పిల్లలు, చదవని పిల్లలు అని తేడా చూపించటం. 8.శక్తికిమించిన గురిని ఇచ్చినపుడు 9.పిల్లల చదువుల గురించి హయిరానా పడే తల్లిదండ్రులు ఉన్నప్పుడు.

తొలి చదువులు-30
-డా. పి.శ్రీనివాస తేజ
8500121314

పిల్లలపైన ఒత్తిడిని తగ్గించే పద్ధతులు:

- ✓ పిల్లల శక్తికి మించిన చదువు నేర్పే ప్రయత్నం చేయకూడదు.
- ✓ చదువుపట్ల పిల్లల్లో ఆసక్తిని కలిగించాలే తప్ప బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయకూడదు.
- ✓ ఇంగ్లీషును పూర్తిగా నేర్పాకే దాన్ని బోధనా భాషగా తీసుకోవాలి. ప్రాథమిక తరగతుల్లో సొంత భాషలో బోధించటంవల్ల దాదాపు చదువు ఒత్తిడిని తగ్గించవచ్చు.
- ✓ సరళమయిన, శాస్త్రీయమైన బోధనా పద్ధతులను టీచర్లకు నేర్పాలి.
- ✓ బడినుంచి వచ్చాక ట్యూషన్లు, కోచింగుల్లో ఇరికించకూడదు.
- ✓ పిల్లల్ని ఫలానా సమయంలో లేదా ఫలానా సమయం వరకు చదవమని బలవంత పెట్టకూడదు. ఒకవేళ వారికయి వారు వాళ్ళు చదువుకుంటుంటే అభ్యంతరం కూడా చెప్పకూడదు.
- ✓ పిల్లల్ని ఎక్కువగా తమ ఈడు పిల్లలతో ఆడుకోనివ్వాలి. చదువు పేరుతో ఆటల సమయాన్ని కుదించకూడదు.
- ✓ పరీక్షల సమయంలో కూడా 8 గంటల నిద్ర అవసరం. ఒత్తిడిని తగ్గించే ఒకే ఒక సహజ చికిత్స నిద్ర.
- ✓ పిల్లలు మంచి ఫలితాలను సాధిస్తే అభినందించాలి. చిన్న చిన్న బహుమతులు కూడా ఇవ్వాలి. అలా అని దాన్ని అలవాటుగా మార్చకూడదు.
- ✓ పిల్లలకు పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవటం లేదా ఎదుర్కొనే నైపుణ్యాలను, నైపుణ్యాన్ని (కోపింగ్ స్కిల్స్) అలవాటు చేయాలి.
- ✓ మనసుకు హాయిని ఇచ్చే వినోద కార్యక్రమాలకు పిల్లలను దూరం చేయకూడదు.
- ✓ చదువు అంటే పరీక్షలు, మార్కులు, ర్యాంకులే కాక జీవితాన్ని గురించి తెలుసుకోవటం అనేదిగా ఉండాలి.
- ✓ పిల్లల్ని ప్రతి విషయంలో అదుపాజ్ఞల్లో పెట్టడం మానెయ్యాలి.

సిసలైన మాణిక్యం.. మన పద్యం

తేనెలొలికే తెలుగు భాషకు పరిపూర్ణత చేకూర్చేవి పద్యాలు అంటే అతిశయోక్తి కాదు. పద్యాలు లేని తెలుగు సాహిత్యాన్ని ఊహించలేము. కేవలం తెలుగు భాషకు మాత్రమే సొంతమైనది పద్యం. కథలు, కవితలు, గేయాలు, వ్యాసాలు, విమర్శలు, నవలలు, నాటకాలు, యక్షగానాలు, బుర్రకథలు ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగు సాహిత్య ప్రక్రియలు ఒక మహావృక్షానికి గల శాఖోపశాఖలైతే దానిపై పూర్తిగా వికసించిన సహస్రదళ పద్మంవంటిది పద్యం. ఈ పద్యం తెలుగు భాష పుట్టిన నాటినుండి నేటిదాకా పరిమళిస్తూనే, సువాసనలను వెదజల్లుతూనే ఉన్నది.

పౌరాణిక నాటకాలన్నీ పద్యాలతో కూడి ఎంతో జనరంజకంగా ఉంటాయి. నాటక రంగంలో నిష్ణాతులైన ఒకప్పటి నటీనటులు వేదిక మీద పద్యాలను ఆలపిస్తుంటే ప్రేక్షకులంతా చప్పట్లు చరుస్తూ తన్మయత్వంతో తిలకించి పులకించేవారు. ఆ పద్యాల చివరన ఒక్కొక్కసారి కొన్ని నిమిషాలపాటు రాగం తీసేవారు. మైమరిచిన జనాలు 'వన్స్‌మోర్' కేకలు వేసి మళ్ళీ మళ్ళీ పాడించుకుని విని ఆనందించేవారు.

గయోపాఖ్యానం, కురుక్షేత్ర సంగ్రామం, ఇటువంటి నాటకాలలోని పద్యాలంటే అందరూ చెవికోసుకునేవారు. ప్రస్తుతం అంతటి రాగాలాపనతో పద్యాలను వినిపించే వాళ్ళుగాని, అంత ఆసక్తితో నాటకాలను చూసే వాళ్ళుగాని తగ్గిపోయారు. నాటక రంగాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రజలపై కూడా ఉన్నది. ఒకప్పుడు అమ్మమ్మలు, నాయనమ్మలు, భారత, భాగవతాలలోని పద్యాలను పాడుతూ ఇంటి పనులను చేసుకునేవారు. గజేంద్ర మోక్షంలోనివో, అధ్యాత్మ రామాయణంలోనివో పద్యాలను పాడుకుంటూ నిద్రకుపక్రమించేవారు. ఆ పద్యాలను వింటూ పెరిగే పిల్లలు తమకు తెలియకుండానే వాటిని నేర్చుకునేవారు. ఇప్పటిలాగా టివిలు, కంప్యూటర్‌లు లేవు గాబట్టి పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని పెద్దవాళ్ళు పద్యాలు వల్లె వేయించేవారు.

వేమన శతకం, సుమతీ శతకం, దాశరథీ శతకం, భాస్కర శతకం, భాగవతం, రామాయణం మొదలైన వాటిలోని పద్యాలన్నీ పిల్లలకు కంఠతా వచ్చేసేవి. ఈ రోజుల్లో అలా చెప్పే బామ్మలు, అమ్మమ్మలు లేరు. అంత శ్రద్ధగా నేర్చుకునే పిల్లలూ తగ్గిపోయారు. ఏ కొందరో నేర్చుకుంటే అదో పెద్ద విశేషంలా టివిలో ప్రదర్శిస్తుంటే చూసి సంతోషించవలసి వస్తోంది. నేడు అంతా పదహారణాల తెలుగువాళ్ళయినా పట్టుమని పది పద్యాలు కూడా రానివాళ్ళు ఎందరో ఉన్నారు. ఛందోబద్ధమైన పద్యాలను సందర్భానుసారంగా ఆశువుగా, అవలీలగా నేటికీ చెప్పగలుగుతున్న శత, సహస్ర అవధానులందరికీ శతకోటి వందనాలు. అవధానం అనేది సామాన్యమైన విషయం కాదు. ఎంతో విషయ పరిజ్ఞానం కలిగి, జ్ఞాపక శక్తి కలిగి, క్షణాలలో మేధోమథనం జరిపి అప్పటికప్పుడు తనకు పృచ్ఛకులు ఇచ్చిన అక్షరాలను గాని, అంశాలను గాని ప్రయోగించి పద్యాలను అల్లి చెప్పటంతో పాటు సందర్భానుసారంగా, సమయస్ఫూర్తితో, చలోక్తులతో పద్యాలను వినిపించి ప్రేక్షకులను మనోరంజకులను గావించటం అనేది అవధాన ప్రక్రియలో ఒక భాగం మాత్రమే. మన తెలుగు జాతి గర్వించదగిన ఇటువంటివాటిని మనం కాపాడుకుంటూ వాటిని అమోఘంగా ప్రదర్శిస్తున్న అవధానులను గుర్తించి గౌరవించటం మన బాధ్యత.

'అడిగెదనని కడువడిజను' పద్యంలో గజేంద్రుని రక్షించటానికి వేగంగా వెళుతున్న

సారనాథ్

విశేషాలు

వారణాశికి 8 కి.మీ. దూరంలో ఉన్న సారనాథ్ స్థూపం దర్శనీయ స్థలాలలో ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు ఈ ప్రదేశం బౌద్ధులకు పరమపవిత్ర స్థలం. సుమారు 2 వేల సంవత్సరాల క్రితం నిర్మించిన 150 అడుగుల ఎత్తుగల ధమేఖ్ స్థూపం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. దీనిపైన బుద్ధుని జీవిత విశేషాలను తెలిపే అనేక శిల్పాలను అందంగా చెక్కారు. దీనికి పడమర దిశగా 'అశోక స్తంభం' నాలుగువైపులా సింహం బొమ్మలతో చారిత్రక ప్రసిద్ధి చెందింది. ఇక్కడే మూలగంధి కటి విహార్ అనే పురాతన దేవాలయాన్ని చూడవచ్చు. జపాన్‌కు చెందిన కోసెట్స్‌నోర్ అనే శిల్పి ఈ దేవాలయాన్ని మలచడం విశేషం. ప్రహరీ గోడల నిండా బుద్ధుని జాతక కథలు అతి రమ్యంగా చిత్రించబడ్డాయి. మొట్టమొదటిసారి బుద్ధుడు మత ప్రచారం ప్రారంభించింది ఈ ప్రదేశం నుండే. అందుకే బౌద్ధులకు ఇది పరమ పవిత్ర ప్రదేశం.

- పి.వి

సిసింద్రి

sisindri@andhrabhoomi.net

12

ఆంధ్రభూమి

శనివారం
2, ఫిబ్రవరి
2013

వీకెండ్ క్విజ్-448

వీరిద్దరూ ఎవరు?

మీ జవాబులను కార్డుపై రాసి పంపించండి. సరైన సమాధానాలు రాసిన వారిలో ఒకరిని డ్రాలో ఎంపిక చేసి రూ. 100 బహుమతి అందిస్తాం.

చిరునామా: సిసింద్రి, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

క్విజ్-447 సమాధానాలు

- లష్కర్- ఇ- తోయిబా ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ
- బిజెపి అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్

విజేత

ఎ. పద్మినీ మీనాకుమారి,
ఫ్లాట్ నెం. 20, స్నేహదీప్ అపార్ట్‌మెంట్స్,
గోకుల్‌నగర్, స్ట్రీట్ నెం. 1,
తార్నాక, సికిందరాబాద్- 500 017.

సరైన సమాధానాలు రాసిన వారిలో కొందరు

మార్గం శరత్‌బాబు, హైదరాబాద్
యార్లగడ్డ జ్యోతి, హైదరాబాద్
ఉలాపు రామలక్ష్మిదేవి, గిద్దలూరు
జి.రమణమ్మ, గిద్దలూరు
కె.నరస్వతి, గిద్దలూరు
డి.అశామహేశ్వరి, గిద్దలూరు
యక్కంటి తులసమ్మ, గిద్దలూరు
డి.నవ్యత వైష్ణవి, గిద్దలూరు
యన్.రేష్మాకరిష్మా, గిద్దలూరు
వరయోగి రామ్‌మోహన్, బొల్లారం
పగిడి అమృత, గిద్దలూరు
దర్శి శైలజ, గిద్దలూరు
రెంటాల స్వర్ణలత, గిద్దలూరు
వై.రమాదేవి, గిద్దలూరు
ఉలాపు బాలకేశవులు, గిద్దలూరు
పి.అమరమయూరి, గిద్దలూరు
జి.లక్ష్మి, గిద్దలూరు
నల్లమిల్లి స్నేహాంజలి, ఒంగోలు
దొడ్డిపట్ల ఆదిత్య కార్తీక్, అత్తిలి
వి.నుమన్ నంజీవ్, విజయవాడ
జి.శివకుమార్, దేవరకొండ
ఎ.వి.ఎల్.నరసింహారావు, వరంగల్
భారతుల శ్వేత, సికిందరాబాద్
కె.ఎన్.నాయుడు, బాపట్ల
నూనె భానుప్రసాద్, చీరాల
డి.యమున, బాపట్ల
కొండపాటూరి శివనాగరాజు, బాపట్ల
ఎన్.లక్ష్మీఆదిత్య, చీరాల
వరగంటి రేవంత్‌కృష్ణ, మంగళగిరి
అంబటి ఎ.నాయుడు, కొత్తగూడెం
తూపిలి వినీత, హైదరాబాద్
యార్లగడ్డ వైష్ణవి, హైదరాబాద్
బి.వినయ్‌బాబు, హైదరాబాద్
దాసరపు దశరథ, భువనగిరి
దాసరపు రేణుక, భువనగిరి
ధరణి శ్రీనిజ, హైదరాబాద్
గోపిశెట్టి ఉమామహేశ్వరరావు, చల్లపల్లి
తూపిలి భారతీదేవి, హైదరాబాద్
ఉరందూరు పద్మావతి, తిరుపతి
తూపిలి లీలావతి, తిరుపతి
సి.నుప్రియ, హైదరాబాద్
చిగురుపాటి సతీష్, హైదరాబాద్
పాలడుగు సరోజిని, బోరబండ
కొచ్చెర్ల సురేష్, పొన్నూరు
వి.వసంతలక్ష్మి, హైదరాబాద్
మిక్కిలినేని గిరిజ, హైదరాబాద్
ఇనగంటి రాజేశ్వరి, అప్పికట్ల
రాజోలి సరళకుమారి, హైదరాబాద్
ఆర్.వీణ, హైదరాబాద్
రాజోలి మంజుల, హైదరాబాద్
లక్కింశెట్టి శివకుమారి, చినకొండ్రుపాడు
చేకూరి రేణుక, భరత్‌నగర్
పిన్నమనేని నరస్వతి, మాదాపూర్
కుర్రా శకుంతల, అప్పికట్ల
బంక రజని, షాపూర్‌నగర్
బంక సత్యనారాయణ, షాపూర్‌నగర్
బి.రామారావు, ఏలూరు
శాఖమూరి జయశ్రీ, నరసరావుపేట
జాలాది మస్తాన్‌రావు, కొత్తపేట
కుర్రా కోటేశ్వరరావు, భట్టిప్రోలు
జాగర్లమూడి రాఘవమ్మ, కావూరు
కొడాలి వెంచమ్మ, మోషరు
పాలడుగు పద్మజ, మోతీనగర్
పి.పరశురామయ్య, పూండ్ల
తుమ్మల రఘునాథరాయలు, బోరబండ
కొడాలి దేవిప్రియ, హైదరాబాద్
తుమ్మల లక్ష్మిశ్రీ, మాదాపూర్
మల్లంపాటి నాగేశ్వరరావు, అప్పికట్ల
మన్నె సుశీల, ఈతేరు
ఉరందూరు లత, వి.కోట

ఆటోగ్రాఫ్

పి.సుశీల

ప్రఖ్యాత గాయని

P. Susheela

కథ

మంచి మనసులు

అనగనగా ఒక అడవిలో ఓ 'సింహం దంపతులు' తమ బిడ్డ అడవిలో తప్పిపోయినప్పటి నుంచి చాలా దిగులు పెట్టుకున్నాయి.

లేక లేక కలిగిన తన బిడ్డమీద గంపెడాశలు పెట్టుకుంది తండ్రి సింహం. తల్లి సింహం తన బిడ్డకోసం అదేపనిగా ఏడుస్తూనే వుంది.

ఆ అడవికి యువరాజుగా పట్టాభిషిక్తుడవ్వాల్సిన యువ సింహం అనుకోకుండా మాయ మవటం ఆ దంపతులను తీవ్రంగా కలిచివేయసాగింది.

తల్లి సింహం బిడ్డ గురించి వేదనతో మంచం పట్టింది.

''బిడ్డ వస్తే గానీ...ఆమె మామూలు స్థితికి రాలేదని'' వైద్యులు రూఢీ చేసారు.

మృగరాజుకి ఏం చెయ్యాలో పాలుపోవట్లేదు.

మంత్రి ఎలుగుబంటి ఇచ్చిన ఆదేశాల మేరకు అడవంతా జల్లెడపట్టినా సింహం పిల్ల జాడ కానరాలేదు.

''నది దాటి పక్క అడవిలోకెళ్ళి, స్వయంగా వెదికిమరీ నా బిడ్డని తెచ్చుకుంటాను.'' అని -సింహరాజు పంతంబట్టి మరీ ఒంటరిగానే బయలుదేరింది.

యాభై మైళ్ళ దూరం వరకు కాలినడకనే నడిచింది కానీ.. వేరే అడవి పొలిమేరల్లోకి మాత్రమే వెళ్ళగలిగింది. బాగా నడిచి నడిచీ ఆయాసం వచ్చి ఓ గడ్డి మైదానంలో వెల్లకిలా కూలబడిపోయి ''దాహం-దాహం''అని మూల్గసాగింది.

అర్ధరాత్రి దాటాక అక్కడికి దారితప్పి వచ్చిన లేగదూడ సింహం దప్పికను తీర్చడానికి నీళ్ళు తెచ్చి గొంతులో పోసింది.

సింహానికి పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టైంది. దూడని చూసి సింహానికి నోట్లో నీళ్ళూరాయి. అసలే ఆకలి మీదుండి ''దీన్ని చంపి తినెయ్యాలనుకుంది.''

లేగ దూడని ఒడిసిపట్టుకుంది. లేగదూడ మాత్రం చిరునవ్వు చిందించసాగింది.

''నన్ను చూస్తేనే భయంతో వణికి చస్తాయి అన్ని జంతువులు. అలాంటిది ఒక అల్పప్రాణినైన నువ్వు ఏ మాత్రం జంకులేకుండా ఆ నవ్వు ఏంటి?'' సింహం గాండ్రించింది.

''నేను మీ ముందు అల్పప్రాణినే. నన్నిప్పుడు మీరు తినేస్తారని కూడా తెలుసు.''అంటున్న లేగదూడ మాటలు సింహాన్ని ఆశ్చర్యానికి గురిచేసాయి.

''నా చేతిలో నీకు చావు మూడిందని తెలిసికూడా ఆ ఆనందం ఏంటి?''

''సింహరాజా.. మా అమ్మ ఎప్పుడూ ఓ మాట చెబుతూ వుంటుంది. జాలి లేని జీవులు మన మీద దాడిచేసి చేజిక్కించుకొని తినాలని చూస్తాయి. అప్పుడు మనం నవ్వుతూనే వారికి ఆహారంగా మన దేహాన్ని త్యాగం చెయ్యాలని, సంతోషంగా వున్నప్పుడు నవ్వడం కాదు. కష్టాల్లో, నష్టాల్లో ఆఖరికి మృత్యువు ముందున్నా పెదవులపై చిరునవ్వు చెదరకూడదని అమ్మ ఎప్పుడూ చెబుతుంటుంది.'' అంటున్న ఆ లేగదూడ మాటలు విన్న సింహానికి మిక్కిలి ఆశ్చర్యం కలిగింది. అప్పటివరకూ ఆ దూడని తినెయ్యాలని ఆబగా వున్న సింహం తన నిర్ణయాన్ని మార్చుకుంది.



దూడని చూస్తే సింహానికి ముచ్చటేసింది. ''ఇంత చిన్న వయసులో ఎంత పరిణతి చెందిన మాటలు మాట్లాడుతుందో ఈ లేగ దూడ. ఈ దూడ తల్లి పెంపకం చాలా మంచిది.'' అని భావించి దూడని తినకుండా వదిలేసి వాళ్ళమ్మని కలవాలనుకొని, దూడతో కలిసి వాళ్ళింటికెళ్ళింది.

అప్పటివరకూ బిడ్డకోసం బెంగపెట్టుకొని ఎదురు చూస్తున్న ఆవు ఎదురుగా బిడ్డని చూశాక సంతోషం పట్టలేకపోయింది. వెనకాలే సింహాన్ని చూసి బెరుకు చెందింది.

''అమ్మా.. నువ్వెప్పుడూ చెబుతుంటావు కదా.. సింహాలు క్రూరమృగాలని, అది అబద్ధం. ఇదిగో ఈ సింహరాజు ఇవాల్టినుండి నాకు మిత్రుడు'' అంటున్న లేగదూడ మాటలు విని ఆవు విస్మయానికి గురయ్యింది.

''తల్లిదండ్రులు సంస్కారవంతులైతే- బిడ్డలు ఆణిముత్యాలు అవుతారనడానికి మీరే నిదర్శనం''అంటూ సింహం మొట్టమొదటిసారి ఆవుకి నమస్కరించింది.

సింహాన్ని తమింట్లోకి ఆహ్వానించింది ఆవు. ఆ ఇంట్లో నాలుగైదు పడకల మీద క్షతగాత్ర జంతువులు కట్లతో వున్నాయి.

వాటికి సపర్యలు చేస్తోంది ఎద్దు.

అందులో ఉన్న తన బిడ్డ సింహాన్ని చూసి- సింహానికి నోటమాట రాలేదు.

పిల్ల సింహం- తండ్రి సింహాన్ని గుర్తుపట్టి పడకలోంచే మూలుగుతూ పలకరించింది.

''ఇదంతా ఎలా జరిగిందని?'' సింహరాజు అడగకముందే ఆవు ఇలా చెప్పుకొచ్చింది. ''మీ బిడ్డనెవరో కొట్టి, నదిలో తోసేసారు. ఒడ్డుకు కొట్టుకొస్తే చూసి తీసుకువచ్చి వైద్యం చేస్తున్నాను...

కాలు, చేయి ఇప్పుడిప్పుడే నయమౌతోంది. ఆపదలో వున్న వాళ్ళని కాపాడాలని మా అమ్మ ఎప్పుడూ చెబుతూ ఉండేది'' అంటున్న ఆవు మాటలు విన్నాక, సింహంలో నిద్రిస్తున్న మంచితనం మేల్కొని, కన్నీళ్ళు వరదలై ఉప్పొంగి, కృతజ్ఞతా పూర్వకంగా ఆవు కాళ్ళని కడిగాయి.

''కసాయి వాడిలో కూడా మంచి, మానవత్వం నిద్రిస్తూ వుంటాయి. సరైన సమయం వచ్చినప్పుడు పరిస్థితులే వాటిని మేల్కొలుపుతాయి.'' అంటున్న ఎద్దు మాటలు విని సింహం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

'' నాకు సాయం చేసిన మీ బిడ్డని తినాలనుకున్నాను. కానీ.. మీ బిడ్డ తియ్యని మాటలు నన్ను అలా చేయనివ్వలేదు. నా బిడ్డని కాపాడిన మీ ఋణం ఎలా తీర్చుకోవాలో..? ''అంటున్న సింహం మాటలకు అడ్డుపడ్తూ ''అయ్యయ్యో.. అంతంత మాటలనకండి. సాయంచేసిన వారికి కృతజ్ఞత చెబితే ఆ సేవకి అర్థం వుండదు'' అంటూ పిల్ల సింహాన్ని తండ్రి సింహానికి అప్పజెప్పింది ఆవు. సింహరాజు సంతోషంగా తన బిడ్డని తీసుకుపోయింది.

బిడ్డ రావడం చూసి తల్లి సింహం లేచి కూర్చుంది. ''మన వంశ వారసత్వం నశించిపోవాలని ఆ నక్కే నన్ను కొట్టి, నదిలో తోసేసింది.''అని బిడ్డ చెప్పగానే, ఆ నక్కని అడవిలోంచి వెలేసింది సింహం.

పిల్ల సింహం క్షేమంగా తిరిగొచ్చినందుకు అడవంతా సంబరాలు చేసుకున్నాయి జంతువులన్నీ.

ఆ సంబరాలకు ఆవు కుటుంబం కూడా వచ్చింది.

- హుమాయున్ సంఘీర్

ఎలా వుంది భారతదేశం?

కాబూల్ జానపద గాథ

ఒకసారి ఆఫ్ఘనిస్తాన్ దేశంలోని కాబూల్ నగరం నుండి ఒకాయన సందర్శన కోసం భారత్ వచ్చాడు. వీధుల్లో తిరుగుతుంటే ఆయనకు రకరకాల మిఠాయిలను అందంగా అమర్చి విక్రయిస్తున్న ఒక మిఠాయి దుకాణం కనిపించింది.

ఆయనకు ఒకటి, రెండుకన్నా ఎక్కువ హిందుస్తానీ పదాలు తెలియవు. ఆయన ఆ దుకాణంలోకి వెళ్ళి చూడగానే మధురంగా, నోరూరిస్తున్న ఒక మిఠాయిని చూపించాడు దుకాణదారుడికి.

దాని పేరు అడుగుతున్నాడనుకుని, ''కాజా''అన్నాడు దుకాణదారు. ఆ మిఠాయి పేరు కాజా అనే కాకుండా, 'తినెయ్' అనే అర్థం కూడా వస్తుంది.

ఆ కాబూల్ వాసికి రెండవ అర్థం మాత్రమే తెలుసు. అందుకని అతడు గుప్పిళ్ళకొద్దీ కాజాలను తీసుకుని, ఆనందంగా ఒక్కొక్కటీ చప్పరించేసాడు.

తర్వాత వర్తకుడు ఆ వ్యక్తిని డబ్బులు అడిగాడు తిన్నవాటికి. కానీ, అతడే మంటున్నాడో అర్థం కాని ఆ వ్యక్తి అక్కడి నుంచి సంతోషంగా వెళ్ళిపోయాడు. దాంతో కోపగించిన ఆ వర్తకుడు కాబూల్ వ్యక్తిమీద న్యాయాధికారికి ఫిర్యాదుచేసాడు. కొందరు భటులు వచ్చి అతణ్ణి బంధించి, న్యాయాధికారి సమక్షానికి తీసుకెళ్ళారు.

''ఆ వ్యక్తి తల గొరిగించి, తారు పూసి, గాడిదపై ఎక్కించి, ఊరేగింపుగా తీసుకెళ్ళి నగర పొలిమేరల వద్ద విడిచిపెట్టండి. అది చూసిన వాళ్ళందరికీ చబ్బాన్ని ఉల్లంఘించినపుడు యీ నగరంలో ఎలాంటి శిక్షపడుతుందో అర్థమవుతుంది''-అని న్యాయాధికారి ఆజ్ఞాపించాడు.

భారతదేశంలో అది అనాగరిక, ఆటవిక శిక్షగా భావింపబడినప్పటికీ, ఆ కాబూల్ వ్యక్తి అదొక తమాషా అని అనుకున్నాడు. తనను ఊరేగిస్తున్నప్పుడు జనాలంతా దారికి ఇరువైపులా నిల్చుని చూడటం చూసి తనను వారు గౌరవిస్తున్నారనుకున్నాడు.

అతడు స్వదేశానికి తిరిగి వెళ్ళాక అక్కడి జనాలు అతణ్ణి ''ఎలా వుంది భారతదేశం?'' అని అడిగారు.

''ఓ.. బ్రహ్మాండం! చాలా ఆకర్షణీయమైన ధనిక దేశం అది. అక్కడ మీకు ఏదైనా ఉచితంగా యిస్తారు. మీరేదైనా దుకాణానికి వెళ్ళి, మీకు నచ్చిన మిఠాయిని చూపిస్తే, అది మొత్తం తినెయ్యమంటారు. ఆ తర్వాత రక్షక భటులు బాజాభజంత్రీలతో వచ్చి, తల గొరిగించి, తలకు తారు రంగు అద్ది, మీరు స్వారీ చేయటానికి చక్కటి గాడిదను, మంచి భారతీయ సంగీతాన్ని ఏర్పాటు చేస్తారు. ఇదంతా ఉచితంగానే! అందమైన దేశం, దాతృత్వం గల జనాలు, అద్భుతమైన ప్రజలు''-అని చెప్పాడు తన్మయత్వంగా.

- మేకల మదన్‌మోహన్‌రావు

చిన్నారుల కోసం

అర్థాల ఆట



కింద ఇచ్చిన తెలుగు పదాల అర్థాల ఆధారంగా ఆంగ్ల పదాలతో గడులు నింపాలి.

ఆధారాలు

అడ్డము	నిలువు
1. కొంగ	1. డబ్బా
3. రొట్టె	2. వెలుపలకు దారి
5. పెద్ద	4. మేనకోడలు
8. పనిముట్టు	6. మొత్తము
9.ప్రేమ	7. గోవు
11. కలము	8. వర్తకము
13. సమాప్తము	10.ఉత్సాహము
14. ఈటె	12.అబద్దము

గత వారం సమాధానాలు

అడ్డము : 1. MAIZE 3. FAT 5. WHO 8. CLUE 9. CAPE 11. INN 13.NIL 14. WATER

నిలువు : 1.MOB 2.ECHO 4.TWICE 6.SUN 7.YAK 8.COVIN 10.SNOW 12.JAR

-కైపు ఆదిశేషారెడ్డి

యాంటీ వైరస్ ప్రోగ్రాం

స్వార్జిత్ తన స్కూల్ అసైన్‌మెంట్‌ని పూర్తిచేయడానికి కంప్యూటర్‌ని ఆన్ చేసి చూస్తే, మానిటర్‌లో అర్థం పర్థం లేనిది కనిపించింది. ఏ కమాండ్‌నీ అది రిసీవ్ చేసుకోక పోవడంతో స్వార్జిత్ తన తండ్రితో చెప్పాడు.

''నాకు కంప్యూటర్ అవసరం ఉంది నాన్నా.. కానీ, అది సరిగ్గా పనిచేయడం లేదెందుకో చూడు.''

ఆయన కంప్యూటర్‌కి కొన్ని కమాండ్స్‌ని టైప్ చేసాక చెప్పాడు.

''మన డెస్క్‌టాప్‌కి వైరస్ వచ్చినట్లుంది. బహుశా మనం యాంటీ వైరస్ ప్రోగ్రాంని ఉపయోగించాల్సి ఉంటుంది.''

''యాంటీవైరస్ ప్రోగ్రాం అంటే ఏమిటి?'' స్వార్జిత్ ప్రశ్నించాడు.

''ఇంటర్నెట్ నుంచి, ఇ-మెయిల్స్ నుంచి కంప్యూటర్‌ను నాశనం చేసే సాఫ్ట్‌వేర్‌ని డౌన్‌లోడ్ చేసుకోకుండా కాపాడే ప్రోగ్రాంని యాంటీవైరస్ ప్రోగ్రాం అంటారు. ల్యాప్‌టాప్‌ని ఉపయోగించి నీ క్లాస్‌వర్క్‌ని పూర్తిచేసుకో ఈ పూటకి'' తండ్రి చెప్పాడు.

స్వార్జిత్ తన అసైన్‌మెంట్‌ని పూర్తిచేసుకున్నాక వాడి తండ్రి అడిగాడు.

''ఈరోజు అప్పచెప్పాల్సింది నోటికి వచ్చిందా?''

''ఇంకా రాలేదు నాన్నా.. ఇవాల్టిది, రేపటిది కలిపి రేపు అప్పచెప్తాను'' స్వార్జిత్ చెప్పాడు.

నిత్యం విష్ణుసహస్ర నామాల్లోని పది నామాలని మొదటి నుంచి స్వార్జిత్ తండ్రికి వారం రోజులుగా అప్పచెప్తున్నాడు. అవి తన కొడుక్కి కంఠస్థం రావాలని అతని ఆశ. కంప్యూటర్ వైరస్ గురించి తన కొడుక్కి తెలిసింది కాబట్టి అతను దాన్ని విష్ణుసహస్రనామాలను కంఠస్థం చేయాల్సిన ఆవశ్యకత గురించి బోధించడానికి వినియోగించదలచుకున్నాడు.

''కంప్యూటర్ ఎలా వైరస్‌ని డౌన్‌లోడ్ చేసుకుని దాన్ని నాశనం చేస్తుందో అలాగే ప్రపంచంలోని రకరకాల దృశ్యాలని చూసి, మాటలు విని, చదివి మనం కూడా మన ప్రవర్తనని నాశనం చేసే వైరస్‌ని మనసులోకి డౌన్‌లోడ్ చేసుకుంటుంటాం. కంప్యూటర్‌లోని మనకి తెలీకుండానే ఎలా వైరస్ ప్రవేశిస్తుందో అలాగే మనకి తెలీకుండానే మన మనసులోకి కూడా వ్యామోహాలనే రకరకాల వైరస్‌లు డౌన్‌లోడ్ అవుతుంటాయి.



అవి టీవీ కార్యక్రమాల నుంచి కావచ్చు, సినిమాల నుంచి కావచ్చు, చదివే దినపత్రికలు, పుస్తకాల నుంచి కావచ్చు. కాబట్టి పాపం అనే ఆ వైరస్ మీద దాడి చేసి చంపేసే యాంటీవైరస్ ప్రోగ్రామే విష్ణుసహస్ర నామాలు. అవి కంఠస్థం చేసాక మనసులో ఉంటే, అదే మనకి యాంటీవైరస్ ప్రోగ్రాంగా పనిచేసి- చెడ్డ మాటలని, చెడ్డ జోక్స్‌ని మొదలైన వాటిని మనసులోకి రానీకుండా ఆపుతుంది. కాబట్టి వాటిని నిత్యం చదవడం విస్మరించకూడదు.

''ఓ..! విష్ణు సహస్ర నామాలు మన పర్సనల్ యాంటి వైరస్ ప్రోగ్రాం అన్న మాట?'' స్వార్జిత్ చెప్పాడు.

స్వార్జిత్ తను నిత్యం అప్పచెప్పాల్సిన నామాలను ఆరోజునించి చిన్న కాగితాల మీద రాసుకుని, రోజూ కనపడేచోట ఉంచి బట్టీపట్టడం చేయసాగాడు. ఆ తర్వాత వాడు ఏరోజు నామాలని ఆ రోజు అప్పగించసాగాడు.

-మల్లాది వెంకట కృష్ణమూర్తి

తారుమారు కావు!

చేసి చూద్దాం

సమతల దర్పణంలో మీ ముఖాన్ని చూసుకుంటే ప్రతిబింబంలో కుడి ఎడమలు తారుమారవుతాయి. ఆ విధంగా తారుమారు కాకుండా దర్పణంలో ప్రతిబింబాన్ని ఎలా ఏర్పరచవచ్చునో చేసి చూద్దాం.

మీ కుడి బుగ్గపై లిప్‌స్టిక్ సహాయంతో చిన్న చుక్కను పెట్టాలి. ఇప్పుడు సమతల దర్పణంలో మీ ముఖం ప్రతిబింబం చూడాలి. ప్రతిబింబంలో లిప్‌స్టిక్ చుక్క ఎడమ బుగ్గమీద వున్నట్లు కన్పిస్తుంది. సమతల దర్పణంలో వస్తు ప్రతిబింబంలో కుడి ఎడమలు తారుమారవుతాయి.

మీరు కుడి కన్ను రెప్పపైకి కిందికి కదపాలి. దర్పణంలో మీ ఎడమ కన్ను రెప్పపైకి కిందికి కదులుతున్నట్లు కన్పిస్తుంది. ఇప్పుడు మొదటి దర్పణం పక్కన మరియొక సమతల దర్పణం ఉంచాలి. మీ ముఖం పరావర్తన ప్రతిబింబాలు రెండు దర్పణాలలోను కన్పించేటట్లు వాటి మధ్య కోణాన్ని సవరించి ఉంచాలి.

సరియైన స్థానంలో రెండవ దర్పణాన్ని మొదటి దర్పణం పక్కన ఉంచినపుడు మొదటి దర్పణంలోని ప్రతిబింబం యొక్క మరో ప్రతిబింబం రెండవ దర్పణంలో కన్పిస్తుంది.

మొదటి దర్పణంలోని ప్రతిబింబంలోని కుడి ఎడమలు రెండవ దర్పణం ప్రతిబింబంలో తారుమారు అవుతాయి. అంటే రెండవ దర్పణంలో కన్పించే ప్రతిబింబంలో కుడి ఎడమలు తారుమారు కాని మీ ముఖ ప్రతిబింబం మీకు కన్పిస్తుంది.

- సి.వి.సర్వేశ్వరశర్మ

నేను గీసిన బొమ్మ

నుదురుపాటి శ్రీరామ కార్తీక్, గుడివాడ



నూనె లక్ష్మీ ఆదిత్య, చీరాల-పేరాల

ఎన్. దీప్తి, గుడివాడ

డి. దినేష్‌కుమార్, హైదరాబాద్

దర్భ కీర్తన, పెద్దాపురం

వై. అనసూయ, గుంటూరు

వై. ప్రీతమ్, నాయుడుపేట

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

ఆదివారం 3, ఫిబ్రవరి 2013

ఖర్జూరం, రవ్వ కేసరి

కావలసినవి

ఉప్మా రవ్వ - 1 కప్పు
పంచదార - 3/4 కప్పు
యాలకుల పొడి - 1/2 టీ.స్పూ.
నెయ్యి - 5 టీ.స్పూ.
ఖర్జూరం -1/2 కప్పు

తయారు చేసేదిలా

ఖర్జూరాన్ని గింజలు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో నెయ్యి వేడి చేసి రవ్వ, ఖర్జూరం వేసి దోరగా వేయించాలి. ఇందులో రెండు కప్పుల నీళ్ళు పోసి కలుపుతూ ఉడికించాలి.

రవ్వ ఉడికిన తర్వాత పంచదార, యాలకుల పొడి వేసి కలపాలి. చివరిగా మరికొంచెం నెయ్యి వేసి వేడిగా సర్వ్‌చేయాలి.

పనస బిర్యానీ

కావలసినవి

పనస ముక్కలు ..... 300 గ్రా.
బాస్మతి బియ్యం ..... 400గ్రా.
ఉల్లిపాయలు 2
పుదీనా ఆకులు ..... పిడికెడు
లవంగాలు 4
యాలకులు 3
దాల్చిన చెక్క ..... అంగుళం
షాజీర ..... 1 టీ.స్పూ.

మసాలా కోసం:

ఉల్లిపాయ 1
టమాటాలు 2
అల్లం వెల్లుల్లి ముద్ద ..... 2 టీ.స్పూ.
ఉప్పు ..... తగినంత
గరం మసాలా పొడి ..... 2 టీ.స్పూ.
నెయ్యి ..... 2 టీ.స్పూ.
కుంకుమ పువ్వు ..... చిటికెడు

చేయండి ఇలా

రెండు ఉల్లిపాయలను సన్నగా తరిగి బంగారు రంగు వచ్చేవరకు వేయించి పెట్టుకోవాలి. పావు కప్పుడు పాలలో కుంకుమ పువ్వు నానబెట్టాలి. బియ్యం కడిగి నీళ్లు పోసి గంట సేపు నానబెట్టి ఆ తర్వాత అందులో లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క, షాజీర వేసి సగం ఉడికించి తీసి జల్లెట్లో వేసుకోవాలి. ఈ బిర్యానీ కోసం పూర్తిగా పండినవి కాకుండా కొంచెం పచ్చిగా ఉన్న పనస ముక్కలు తీసుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి పనస ముక్కలను కొద్దిసేపు వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో సన్నగా తరిగిన ఉల్లిపాయను వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. తర్వాత ఇందులో టమాటా ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. టమాటా ముక్కలు పూర్తిగా ఉడికిన తర్వాత అల్లం వెల్లుల్లి , కారం పొడి, పనస ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టి ఉడికించాలి. పనస ముక్కలు ఉడికిన తర్వాత గరం మసాలా వేసి కలపాలి.

ఇపుడు అసలు పని మొదలవుతుంది. ఓవెన్ ప్రూఫ్ బౌల్ తీసుకుని లోపలంతా నెయ్యి రాయాలి. అడుగున పనస ముక్కల కూర వేసి సమానంగా పరవాలి. దానిపైన సగం ఉడికించిన బాస్మతీ బియ్యం వేసి పైన పుదీనా ఆకులు, కుంకుమ పువ్వు పాలు వేయాలి. చివరలో వేయించిన ఉల్లిపాయ ముక్కలు చల్లాలి. అల్యూమినియం ఫాయిల్‌తో మూసేసి ఓవెన్‌లో పెట్టి 150 డిగ్రీ సెల్సియస్ వద్ద 20 నిమిషాలు బేక్ చేయాలి. ఓవెన్ లేకుంటే మంద పాటి గిన్నెలో కూడా పెట్టి ఉడికించుకోవచ్చు. తయారైన బిర్యానీని పెరుగుపచ్చడి లేదా కుర్మాతో వేడిగా సర్వ్ చేయాలి.

క్యారట్, బ్రెడ్ కస్టర్డ్

కావలసినవి

బ్రెడ్ స్లైసులు - 10
క్యారట్ తురుము - 1/4 కప్పు
పాలు - 1 లీ.
పంచదార - 1/2 కప్పు
కస్టర్డ్ పౌడర్ - 3 టీ.స్పూ.
వెనిలా ఎసెన్స్ - 3-4 చుక్కలు
జీడిపప్పు, బాదం - 6- 8
నెయ్యి - 3 టీ.స్పూ.

వండే విధం

ముందుగా పాన్‌లో నెయ్యి వేడి చేసి క్యారట్ తురుము, పంచదార కలిపి ఉడికించుకోవాలి. మొత్తం ఉడికిన తర్వాత నన్నగా తరిగిన జీడిపప్పు, బాదం పప్పు వేసి కలిపి దింపేయాలి.

పాలు చిక్కబడేదాకా మరిగించాలి. చిన్న కప్పులో సగం నీళ్ళు తీసుకుని కస్టర్డ్ పౌడర్ కలుపుకుని మరుగుతున్న పాలల్లో వేసి ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. చిక్కబడిన తర్వాత పంచదార, ఎసెన్స్ వేసి కలిపి దింపేయాలి. అది చల్లారిన తర్వాత గిలక్కొట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. బ్రెడ్ స్లైసుల అంచులు తీసేయాలి. ఒక్కో బ్రెడ్ స్లైసు నీళ్ళలో ముంచి అరచేతిలో అదిమి పెట్టి నీరంతా పిండేయాలి.

మధ్యలో చెంచాడు క్యారట్ హల్వా పెట్టి అన్ని వైపుల నుండి మూసేయాలి. నీరేమైనా ఉంటే పోయేందుకు మెల్లిగా పండాలి. ఈ రోల్స్‌ని చల్లటి కస్టర్డ్‌లో వేసి వెంటనే సర్వ్ చేయాలి.

పంతువా

కావలసినవి

రత్నపురి గడ్డలు / స్వీట్ పటాటో - 3 పెద్దవి
పాలపొడి - 2 టీ.స్పూ.
బియ్యం పిండి - 2 కప్పులు
జాజికాయ పొడి - చిటికెడు
కేవ్రా నీళ్ళు - 1/4 టీస్పూ.
పంచదార - 2 కప్పులు
నీళ్ళు - 1/2 కప్పు
వంట సోడా - చిటికెడు
నూనె - వేయించడానికి

ఇలా చేయాలి

రత్నపురి గడ్డలను కడిగి నీళ్లు పోసి మెత్తగా ఉడికించుకోవాలి. చల్లారిన తర్వాత పై తొక్క తీసి సన్నగా తురుముకోవాలి లేదా చేత్తో మెదపాలి. ఇందులో బియ్యం పిండి, పాలపొడి, జాజికాయ పొడి వేసి కలిపి ముద్దగా చేయాలి. అవసరమైతే మరికొంచెం బియ్యం పిండి కలుపుకోవచ్చు. తర్వాత దాన్ని చిన్న చిన్న గుండ్రటి ఉండలుగా లేదా కోలగా చేసుకోవచ్చు. బాణలిలో నూనె వేడి చేసుకుని ఈ ఉండలను వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. వేరొక పాన్‌లో పంచదార, నీళ్లు వేసి ముదురు పాకం రాగానే తయారుచేసుకున్న వేడి వేడి పంతువాలను వేసి, ఐదు నిముషాల తర్వాత వేడిగా సర్వ్ చేయొచ్చు.

కారం చాట్

కావలసినవి

కారప్పూస లేదా కుర్కురే చిప్స్- 2 కప్పులు
ఉల్లిపాయ - 1
టమాటా - 1
కీరా ముక్కలు - 1/4 కప్పు
క్యారట్ తురుము - 3 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
చాట్ మసాలా పొడి - 1/2 టీ.స్పూ.
మిరియాల పొడి - 1/4 టీ.స్పూ.
జీరా పొడి - 1/2 టీ.స్పూ.
స్వీట్ చట్నీ - 2 టీ.స్పూ.
కారం పొడి - 1/4 టీ.స్పూ.

వండండి ఇలా

ఒక గిన్నెలో చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకున్న ఉల్లిపాయ, టమాటా, కీరా వేసి కలపాలి. ఇందులో క్యారట్ తురుము, కారప్పూస లేదా మార్కెట్‌లో రెడీగా లభించే కుర్కురే చిప్స్ వేసి కలపాలి.

తర్వాత స్వీట్ చట్నీ, కారం పొడి, చాట్ మసాలా పొడి, మిరియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పువేసి కలిపి వెంటనే సర్వ్ చేయాలి. పిల్లలకు ఇలా చేయడం నేర్పిస్తే వాళ్ళే దీన్ని సొంతంగా తయారు చేసుకోగలుగుతారు.

ముల్లంగి ఆకు, పెసరపప్పు కూర

కావలసినవి

ముల్లంగి ఆకు తరుగు - 2 కప్పులు
పెసరపప్పు - 3/4 కప్పు
ఉల్లిపాయ - 1
కరివేపాకు - 2 రెబ్బలు
పసుపు - 1/4 టీస్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 3 టీ.స్పూ.

తయారు చేసేదిలా

ముల్లంగి ఆకులు శుభ్రం చేసుకుని, కడిగి సన్నగా తరగాలి. పెసరపప్పు నీళ్లలో నానబెట్టి పావు గంట తర్వాత ఉడికించాలి. పెసరపప్పు సగం ఉడికిన తర్వాత తీసి జల్లెట్లో వేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ వేసి దోరగా వేయించాలి. ఇందులో కరివేపాకు, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం పొడి వేసి మరో రెండు నిమిషాలు వేపాలి. ఇందులో సన్నగా తరిగిన ముల్లంగి ఆకు, పెసరపప్పు వేసి కలిపి మూత పెట్టాలి. కొద్దిగా మగ్గిన తర్వాత తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టి నిదానంగా ఉడికించాలి.

ఆకు, పెసరపప్పు పూర్తిగా ఉడికి, నీరంతా ఇగిరిపోయాక గరం మసాలా పొడి కలిపి దింపేయాలి. ఈ కూర అన్నం లేదా చపాతీలకు బావుంటుంది.

కీరా పోహా

కావలసినవి

అటుకులు ..... 2 కప్పులు
కీరా తురుము ..... 1/2 కప్పు
ఉల్లిపాయ ..... 1 చిన్నది
పచ్చిమిర్చి 3
కరివేపాకు ..... 1 రెబ్బ
కొత్తిమీర ..... కొద్దిగా
టమాటా ..... 1 చిన్నది
ఆవాలు, జీలకర్ర ..... 1/4 టీ.స్పూ.
ఎండుమిర్చి 2
క్యారట్ తురుము ..... 2 టీ.స్పూ.
పసుపు ..... చిటికెడు
ఉప్పు ..... తగినంత
నూనె ..... 3 టీ.స్పూ.

ఇలా వండాలి

పాన్‌లో నూనె వేడి చేయాలి. అటుకులను నీళ్ళలో వేసి ఉంచాలి. నూనె వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి కొద్దిగా వేగిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి అవి మెత్తబడేవరకు వేయించాలి. తర్వాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, కీరా తురుము, పసుపు, కరివేపాకు వేసి మరో రెండు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు అటుకులను గిన్నెలో నుండి తీసి నీరంతా పిండేసి పోపులో వేయాలి. అన్నీ వేసాక తగినంత ఉప్పు వేసి కలియబెట్టి మూత పెట్టాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత సన్నగా తరిగిన కొత్తిమీర వేసి ఇష్టముంటే నిమ్మరసం పిండి దింపేయాలి. దీనిని వేడిగా సర్వ్ చేస్తేనే బావుంటుంది.

- జ్యోతి వలబోజు

ఆరెంజ్ రసం

కావలసినవి

ఉడికించిన కందిపప్పు ..... 1/2 కప్పు
నీళ్లు ..... 4 గ్లాసులు
టమాటాలు 2
నారింజ రసం ..... 1/2 కప్పు
నిమ్మరసం ..... 1 టీ.స్పూ.
పసుపు ..... 1/4 టీ.స్పూ.
ఉప్పు ..... తగినంత
ఇంగువ ..... చిటికెడు
కొత్తిమీర ..... 2 టీ.స్పూ.
కరివేపాకు ..... 1 రెబ్బ
నెయ్యి ..... 1 టీ.స్పూ.
నూనె ..... 1 టీ.స్పూ.
ఆవాలు, జీలకర్ర ..... 1/4 టీ.స్పూ.
మిరియాలు ..... 1 టీ.స్పూ.
జీలకర్ర ..... 1 1/2 టీ.స్పూ.
ఎండుమిర్చి 1
కందిపప్పు ..... 2 టీ.స్పూ.

ఇలా చేద్దాం

కందిపప్పు, ఎండుమిర్చి, జీలకర్ర, మిరియాలు కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు, సన్నగా తరిగిన టమాటాలు, పసుపు వేసి 10 నిమిషాలు మరిగించాలి. ఉడికించిన కందిపప్పు మెదిపి రెండు గ్లాసుల నీళ్ళు కలిపి పలుచగా చేసుకుని మరుగుతున్న నీళ్ళలో వేయాలి. రెండు నిమిషాల తర్వాత రసం పొడి వేసి కలపాలి. ఐదు నిమిషాలు మరిగించి దింపేయాలి. ఇపుడు ఇందులో నారింజ రసం, ఇష్టముంటే నిమ్మరసం కలపాలి. చిన్న గిన్నె లేదా పోపు గరిటలో నూనె, నెయ్యి కలిపి వేడి చేసి ఇంగువ వేయాలి. తర్వాత జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి వేసి చిటపటలాడాక కరివేపాకు వేసి దింపి రసంలో కలపాలి. చివరిగా సన్నగా తరిగిన కొత్తిమీర వేసి మూత పెట్టాలి. ఈ రసం చేయడానికి కాస్త పుల్లగా ఉండే నారింజలు తీసుకోవాలి. దొరక్కుంటే కొద్దిగా నిమ్మరసం కలుపుకుంటే సరిపోతుంది.



పాలకూర పచ్చడి

కావలసినవి

పాలకూర తరుగు ..... 3 కప్పులు
పచ్చిమిర్చి 4
నువ్వులు ..... 3 టీ.స్పూ.
ఆవాలు, జీలకర్ర ..... 1/4 టీ.స్పూ.
ఎండుమిర్చి 3
పసుపు ..... చిటికెడు
నూనె ..... 4 టీ.స్పూ.
ఉప్పు ..... తగినంత

చేయండి ఇలా

పాలకూర కడిగి సన్నగా తరిగి పెట్టుకోవాలి. పాన్‌లో రెండు చెంచాల నూనె వేడి చేసి పాలకూర తరుగు, నిలువులో చీల్చిన పచ్చిమిర్చి, పసుపు వేసి కలిపి మూత పెట్టాలి. వేరొక పాన్‌లో నువ్వులు దోరగా వేయించి, చల్లారాక పొడి చేసుకోవాలి. పాలకూర మగ్గి నీరంతా ఇగిరిపోయాక దింపి చల్లారనివ్వాలి. తర్వాత దీనిలో నువ్వుల పొడి, తగినంత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. పాన్‌లో మిగిలిన నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక ఎండుమిర్చి వేసి కొద్దిగా ఎర్రబడ్డాక తీసి రుబ్బిన పాలకూరలో వేసి కలపాలి. ఈ పచ్చడి అన్నంలోకి, రొట్టెలకు ఎంతో బావుంటుంది.

నవతరం పాఠకుల్లో మారుతున్న అభిరుచులకు అనుగుణంగా,
ప్రతి ఆదివారం ఒక పూర్తి పేజీని విభిన్నమైన వంటలకు కేటాయించాలన్న సూచనలకు
వేదికగా రూపుదిద్దుకున్న పేజీ- 'రుచి'. ఇది మీ పేజీ. మహిళలైనా.. నలభీములైనా
ఎవరైనా కావచ్చు.. కొత్త తరహా వంటలను రూపొందించి పంపితే
ఈ పేజీ స్వాగతిస్తుంది. ఎటొచ్చీ వంటకం ఫొటో కూడా జతపర్చడం మర్చిపోవద్దు.

మా చిరునామా
రుచి పేజీ,
ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీ దేవీ రోడ్,
సికింద్రాబాద్ -3

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
ఆదివారం
3, ఫిబ్రవరి
2013

సేకరణ: కుందా

పవనుండై హిమధాముడై యనలుడై పానీయమై యాత్మయై రవియై యంబరమై మహీవలయమై రమ్యాష్టమూర్తి క్రియన్ భువనాండంబులు రక్షణాంగములుగా బుట్టించు సత్యద్భుతో త్సవలీలా విభవంబుతోడ భవదాజ్ఞా శక్తి సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! నీ యొక్క అద్భుత లీలా వైభవం కల్గిన ఆజ్ఞాశక్తి వల్ల అష్టమూర్తి పృథివి ఆపః తేజో వాయురాకాశాలు సూర్యచంద్రుల పురుషుడుఅయి తన చేష్టతో ఈ బ్రహ్మాండాలు రక్షణాంగాలుగా పుట్టిస్తాడు.

సర్వేశ్వరుడు త్రిమూర్తులకు అతీతుడు. హరిహర బ్రహ్మలకుకూడా ఆయనఅతీతుడన్న మాట. శివునకు అష్టమూర్తులు. జగత్తు యొక్క మౌలిక ద్రవ్యాలను ఎనిమిదిగా విభజించి చూపినారు. అవన్నీ కలిస్తేనే బ్రహ్మాండాలు. అవన్నీ పంచభూతాలుగా, సూర్య చంద్ర ఆత్మలుగా ఉంటాయి. ఈ ఎనిమిది వినా లోక సృజన జరుగదు. ఈ ఎనిమిదింటిని కల్పించిసృజించినవాడు శివుడు. ఆ శివుడు ఈశ్వరుని ఆజ్ఞాశక్తి వల్లనే ఈ ఎనిమిదింటితో బ్రహ్మాండాలను సృష్టించాడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

3 **శ్రీ లత**

ఇద్దరికీ గౌరవం... సమాజాన్ని మనం మార్చలేం.. అది గాయపడిన వారికి ఓదార్పునివ్వ కపోగా. కంట్లో నలుసులా కలత పెడుతూనే వుంటుంది. అందుకే ఆ 'నలుసు'ను ఉపాయంగా తొలగించుకున్నాను. నేను చేసింది తప్పంటావా అమ్మా?'' అడిగింది తల్లి భుజంమ్మద తలపె డుతూ.

''ఏమోనే! నాకు మాత్రం గుండె గుండెల్లో లేదు.. నువ్వాడే ఈ నాటకంలో బిడ్డను కుప్ప తొట్లో పడుకోబెట్టి వస్తే ఆ వానలో, చలిలో ఏమై పోతుందోనని ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకున్నా నంటే నమ్ము'' అంది తల్లి వసంత.

''ఏదోలేమ్మా! నా జీవితంలో ఒక పెద్ద సమస్య తీరిపోయిందిగా! ఇప్పుడు నా బిడ్డను ధైర్యంగా పెంచుగోగలను కదా!'' అంది.

తల్లి చూపుల్లో ఏదో సందేశం కనిపించింది.. 'అది ఇప్పుడాలోచించకూడదమ్మా! బిడ్డలను ధైర్యంగా, బాహాటంగా పెంచుకోలేని స్థితిలోనే బిడ్డకు జన్మనివ్వాలని అనుకున్నపుడు ఆలోచిం చాలి!' అంది.

''సర్లే! తల తుడుచుకో! అసలే బాలింతవూ, చల్లనీళ్ళలో చెయ్యే పెట్టకూడదు.. అలాంటిది.. వర్షంలో తడిసొచ్చావ!'' అంది వెనక్కి వచ్చి జడ విప్పుతూ...

''అమ్మా! నామీద నీకెప్పుడూ కోపం రాదా?'' అంది జీవన... ఒడిలో పాపను సరిచేసుకుంటూ.

''నీ బిడ్డ మీద నీకు కోపం వస్తుందా? అడి గింది వసంత'' జుట్టు విదిలిస్తూ...

''నా బిడ్డేం తప్పు చేసిందని కోపం వస్తుం దమ్మా?'' బిడ్డ తల నిమురుతూ అడిగింది జీవన.

''నా బిడ్డ మాత్రం ఏం తప్పు చేసిందని?'' అంది తువ్వాలుతో జుట్టు తుడుస్తూ..

''ఇంతకంటే పెద్ద తప్పేముందమ్మా? ఏ ఆడపి ల్లయినా... '' కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి జీవనకు.

వసంత మౌనమైంది.

''నాన్న చనిపోయాక నన్ను ఎంత కష్టపడి పెంచి, చదివించి, ఉద్యోగం వచ్చేదాకా పోషిస్తే... నీకు చెప్పకుండానే నిన్ను అడక్కుండానే తల్లిన యిన నన్ను చూస్తే నీకు అసహ్యం కలగడం లేదా అమ్మా!'' అడిగింది జీవన తల అలాగే వెనక్కి వాల్చి, తల్లి గుండెలకు తల ఆనించి.

''నా కూతురు మాత్రం సృష్టికి విరుద్ధంగా ఏం చెయ్యలేదే! సృష్టిలో జరిగే, ప్రకృతిలో సహజ మైందే చేసింది. కానీ, నాతో పంచుకోలేక...'' అని మధ్యలోనే ఆపేసి... కూతురు తలను అలాగే పట్టుకుని హత్తుకుని వదిలి, లేచి కూతురి ఒళ్ళో వున్న పాపను తీసుకుని ఉయ్యాలలో పడుకోబె ట్టింది.

''వాదించి వాదించీ ఇక ఎలాగూ నీ మొండి కూతురు నీ మాట వినదని నీ కూతురిమీద ప్రేమతో సమాజ నియమాలనూ, సంస్కృతినీ కూడా కాదంటున్నావా అమ్మా?'' తల్లివైపే తదే కంగా చూస్తూ అడిగింది జీవన.

''సమాజాన్నీ, సంస్కృతినీ కాదనడంలేదు. నా పెంపకంలో లోపాన్ని ఒప్పుకుంటున్నాను. నా బిడ్డ జీవించడానికి తగిన నేర్పరితనం, లోకజ్ఞానం నేర్పలేకపోయానే.. అని బాధపడుతున్నాను''.

''నేను చేసిన తప్పుకు నువ్వెందుకమ్మా బాధప డటం?''

''నువ్వు తప్పు చేస్తున్నావనే విషయం స్ఫుర ణకు వచ్చేలా నీకు జాగ్రత్తలు నేర్పనందుకు''.

''అంటే...'' అడిగింది జీవన ఉయ్యాలను మరో వైపు పట్టుకుని.

''ప్రేమ అనే విషయం స్త్రీ పురుషులిద్దరిమధ్య జరిగే సహజత్వమే అయినా.. ఒకవేళ ఆ ప్రేమ ఓడిపోయి ఇద్దర్నీ బాధపెట్టినా... ప్రకృతి మాత్రం ఒక్కరినే శిక్షిస్తుంది. అది నీకు తెలియలేదంటే నిన్ను నేను చాలా అమాయకత్వంలో ఉంచానని పిస్తోంది. నీ అమాయకత్వంలోంచి అనుభవంతో బయటికొచ్చేసరికి బ్రతుకు ఒక ప్రశ్న మాదిరిగా

నిలబడుతుందని తల్లిగా నేను నిన్ను హెచ్చరించ లేకపోయాను'' అంది వసంత... పాప ఉయ్యా లలో ఉన్న పాలసీసా మూత తీసి వంటింట్లోకి

''అమ్మా! నేను తప్పు చేశా కదమ్మా!'' అంటూ వెనకే వచ్చి.. లైటర్ కోసం వెతుకుతున్న తల్లికి లైటర్ అందించింది.

''నాకు తెలుసమ్మా! నాకంటే నువ్వే ఎక్కువ బాధపడుతున్నావ. ఒకవేళ అబార్షన్ జరిగివుంటే నేన చేసిన తప్పు నిన్ను బాధించకుండా కొంత తగ్గించి వుండేదాన్ని కదూ!'' అంటూ తల్లి చుట్టూ చేతులు వేసి అల్లుకుంది మల్లెతీగలా!

''ఆ.. నా కూతురి జీవితం ఒక శిక్ష అయిందనే బాధ తగ్గేదే! నీకు మరో జీవితం ఏర్పరచుకోవడా నికి నా వంతు బాధ్యత తీరేదే! కాని, అది ఎలాం టిదంటే రోగగ్రస్తం అయ్యాక మందులు వాడటం వంటిది. అంతేగాని, రోగం నీకు సోకకుండా తీసు కునే జాగ్రత్త మాత్రం కాదు. అదీగాక, ప్రకృతి సహజంగా ప్రాణం పోసుకున్న ఏ జీవినీ హత మార్చే హక్కు మనకు లేదు. అలాంటప్పుడు ఒక శిశువును చంపి బలిలో నేను పాలుపంచుకున్న నేరం మిగిలేది'' అంది వసంత. అప్పటికే కాఫీ కలిపి కప్పులో పోసి కూతురు కందించింది.

తను చెప్పబోయే విషయమేదయినా సరే సూటిగా, తేటగా చెబుతుంది వసంత. ఎదుటి వాళ్ళ కోసం తన భావాలకు పొరలు కప్పదు.

''అమ్మా! కూతురిగా నీ నమ్మకాల్ని, ప్రశాంత తను వమ్ము చేసినా నా కూతురికి న్యాయం చెయ్యాలనే తలంపుతో, నాకూతరికి తల్లి ప్రేమ, సమాజ గౌరవం దక్కాలనే స్వార్థంతో నా కూతు రినే కుప్పతొట్టిలో పడుకోబెట్టి, నేనే తెచ్చి పెంచు కోవాలనే నిర్ణయం.. తప్పంటావా?''

''తప్పకుండా తప్పే! అయితే ఈ తప్పులో నీ తెలివితేటలున్నాయి. కాబట్టి ఈ తప్పు ఎవరికీ కని పించదు. పైగా.. గొప్పతనంలా, పెద్ద త్యాగంలా పరావర్తనం చెందుతుంది'' అంది వసంత, తాగిన కప్పులు లోపలకు తీసుకెళ్తూ..

ఆమె గుండెల్లో ఉన్న దిగులు.. మాటలు దాచ లేకపోతున్నాయి. ఎంత దాచుకున్నా భవిష్యత్తును గురించిన భయం.. గుండెను దడదడలాడిస్తూనే ఉంది.

''మరి.. మంచికీ, చెడుకూ తేడా ఏమిటమ్మా?'' అడిగింది జీవన- వంటింట్లో వున్న తల్లిని గుమ్మం లోంచి తొంగిచూస్తూ.

సింక్‌దగ్గర గిన్నెలు కడుగుతున్న వసంత... వెన కనుంచి కదిలే కార్యసిద్ధిలా కనిపిస్తోంది.

''సాక్ష్యం! సమాజంలో కనిపించే సాక్ష్యమే మంచీ, చెడును నిర్ణయిస్తుంది. అంతరాత్మ ఆ సాక్ష్యాన్ని ఛేదించి మంచి చెడులను విభజిస్తుంది. దాన్ని మనసుకు మాత్రమే తెలియజేస్తుంది'' అని చెప్పి, కడిగిన కప్పులను బోర్లించి, చేతులు కొంగుకు తుడుచుకుంటూ పాప దగ్గరకు వచ్చింది.

-ఇంకాఉంది

134

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

లోకాలన్నింటినీ ఆ గరళం కాల్చివేస్తూ ఉంటే దేవదానవులు హరుణ్ణి ప్రార్థించారు. శివుడు అద్భుతంగా ఆ విషాన్ని మ్రింగి గరళ కంఠుడయాడు. పిమ్మట మరల తరువ జ్యేష్టాదేవి పుట్టింది. ఆమెని కవిరాజు స్వీకరిం చాడు. క్షీరసముద్రాన్ని మరీ మరీ తరువగా తరువగా ప్రస్తుతికెక్కిన పలు వస్తువులు ఆ దుగ్ధాబ్ధినుంచి అవ్వారిగా పుట్టుకువచ్చాయి. అందరు తమ తమ కోర్కెలకు తగిన వస్తువు లను ఎలమితో గ్రహించారు.

ఐరావతము, మేషమహిషాలు, మకర కరేణువులు, హయవృషభాలు అందుప్పతి ల్లగా ఇంద్రాది దిక్పాలురు వాటిని వాహనా లుగా కైకొన్నారు. మహనీయాలైన సౌభాగ్య మహిమలు తమకు సహజాలై లక్ష్మి అవత రించడం కాంచి శ్రీమన్నారాయణుడు ఆమెను స్వీకరించి పరిణయం ఆడాడు. చంద్రుడు దేవతాసతులు ఉదయించారు. అందరిలోను 'తార' అను నాతిని దేవతలు మాకు ఒసగగా ఆ తారను మేము గ్రహిం చాము.

ఆ విధంగా దేవదానవులందరూ క్షీరోద ధిని తరువగా అమృతం ఉద్భవించింది. సకల దేవతలు హర్షించి ఆ అమృతము, కామధేనువు, కల్పవృక్షము, చంద్రుణ్ణి కైకొని తమ లోకం అరుగుతూ, అమరులు మమ్ము పంపివేశారు. అప్పుడు ఆ 'తార'తో కలిసి ఒక రమణీయ ప్రదేశంలో కొంత కాలం ఉన్నాము.

సుషేణుడి అనుగు కుమార్తెను 'రుమను' పెండ్లయి చెలువపు వేడుకలతో నేను ఆమెతో నివసింపసాగాను. మా తండ్రి, మంత్రులు వాలి పెద్దవాడు అని కిష్కింధకు అతడిని పట్టం కట్టి రాజుని కావించారు. వాలి కూడా నన్ను చాలగా మన్నన చేసి, ప్రీతితో చూస్తూ ఉండేవాడు. నేనున్ను వాలికి బంటు నయి, పితృసముడిగా ఎంచి అహరహం సేవిస్తూ ఉండేవాడను. ఈ రీతిగా మేము అన్యోన్యంగా సహోదర వాత్సల్యంతో గడపే వాళ్లము.

ఒకనాడు దుందుభి కొడుకు 'మాయవి'అనే క్రూర రాక్షసుడు అకారణ వైరం వహించి, నట్టనడిరేయి కిష్కింధకి చను దెంచి, ఆ నగరం బెదరిపోయే మాదిరి దుర్వార గర్వంతో పేర్చి వచ్చి తనతో యుద్ధం చెయ్యమని వాలిపై కాలుత్రవ్వాడు. అప్పుడు అనుమపాన జయశీలి వాలి కడు క్రోధం పూని, నన్ను వెంట నిడుకొని పురం వెడలి మాయావితో పోరాటానికి బయల్వెడాడు.

వాలి మాయావితో యుద్ధం చేయుట

ఆ మాయావి మా ఇరువురుని కనుగొని రణం చెయ్యడానికి వెరచి, పారిపోయి తన గుహలోనికి ప్రవేశించాడు. అపుడు వాలి దర్పంతో అధిక గర్వోద్ధతుడైన ఆ మాయా విని పట్టి వధించి వస్తాను. నేను తిరిగి వచ్చు నందాక ఈ గుహలోపలికి వేరొకడు చొచ్చిరా కుండా, ఏమరక నువ్వు ఈ గుహ ముఖ ద్వారం దగ్గర వేచి వుండు'' అని చెప్పాడు. తాను గుహలోకి వెళ్ళాడు. గుహలోపల ఘోరంగా ఒక యేడాదిపాటు ఇద్దరూ భీకర యుద్ధం చేశారు. అప్పుడు రక్తం ప్రవాహాలు కట్టి, ఎడతెగకుండా గుహ ముఖద్వారాన్ని ముంచివేస్తూ వుండడం చూసి రాక్షసుడి పెను బొబ్బలు విని ''వాలి ఆ రక్కసుడి చేతిలో మరణించి వుంటాడు. నేను ఇక్కడే వుంటే ఆ మాయావి చనుదెంచి నన్నూ వధిస్తాడు'' అని నిశ్చయం చేసుకొన్నాను. వెంటనే ఒక కొండతో ఆ గుహ ముఖద్వారాన్ని మూసివే శాను. అక్కడనే మా అన్నకు తిలోదకాలు వదలాను. కిష్కింధకు మరలి వచ్చాను. మంత్రులతో జరిగిన విషయమంతా చెప్పాను. అనంతరం మంత్రులు వాలి తర్వాత ఈ వానర రాజ్యాన్ని పాలించడానికి నీవే అర్హుడవని నన్ను తెచ్చి ఈ కిష్కింధకి పట్టం కట్టారు. అప్పటినుంచి నేను వానర రాజ సార్వభౌముడిని అయి రాజ్యం ఏలుతు న్నాను. కొన్నాళ్ళకు వాలి మాయావిని పరి మార్చి గుహద్వార ముఖాన నేను పెట్టిన కొండను పిండీగుండగా కొట్టి వెలికి వచ్చి అక్కడ నేను లేకపోవటం చూసి తీవ్రంగా కోపించి, కిష్కింధానగరం చొచ్చాడు.

-ఇంకాఉంది

ఆదివారం, 3 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ అష్టమి రా.తె.04.15
నక్షత్రం: స్వాతి సా.04.12
వర్జ్యం: రా.09.27 నుండి 10.57 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలు స్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):** వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశా లుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అనుకోని ఆపదల్లో చిక్కు కోకుండా జాగ్రత్త పడుట మంచిది.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదుచేస్తారు. ముఖ్యమైన కార్యాలు పూర్తి అవుతాయి.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** నూతన కార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురి చేస్తుంది. అసత్యానికి దూరంగా ఉండాలి
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** అపకీర్తి రాకుండా జాగ్రత్త పడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైర మేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆల స్యంగా తొలగిపోతాయి.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబా ధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధిక మగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. వృథా ప్రయాణాలె క్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైర మేర్పడకుండా జాగ్రత్త వహించాలి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర ఆభరణా లను పొందుతారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థి తులు సంతృప్తికరంగా ఉండక మానసికాందో ళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధ లుంటాయి. మిత్రుల సహకారం అందుతుంది.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలు న్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణ యాలు తీసుకోలేరు.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఋణ బాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆద ర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు.

మంచిమాట

సత్సంప్రదాయాలు

పూర్వీకులు సమాజం యొక్క మేలుగోరి మానవాళి సౌకర్యార్థం కొన్ని నియ మాలు నిర్వర్తించవలసిన కార్యక్రమాలు ఏర్పరచారు. వాటిని ప్రతివారూ ఆచరిస్తే సుఖ సంతోషాలతో జీవించగలరని నిర్ణయించి నిర్ధారించి నిర్దేశించారు. తరువాతి తరం వారు వాటిని తు.చ తప్పక పాటిస్తూ తమ సంతతిని కూడా వాటిని ఆచరించాలని ఆదే శించారు. ఆ పనులు సమాజ శ్రేయస్సుకు ఎంతో ఉపయుక్తమనీ, సమాజాన్ని సన్మా ర్గంలో నడపడానికి ఎంతో అవసరమనీ తలచినవారు వాటినే 'సత్సంప్రదాయాలు' అని అన్నారు. అవి మంచిని వర్ధిల్లజేసేందుకు బాగా ఉపయోగపడేవి. సత్సంప్రదా యాలు అని వాటిని పిలవడం ఎంతో సమంజసంగా తోస్తుంది.

క్రమానుగతంగా అవి తప్పనిసరిగా ఆచరించే కార్యక్రమాలుగా, నియమాలుగా మారిపోయాయి. ఆ సంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకొనే వాళ్ళను సమాజం సంప్రదాయ వ్యతిరేకులుగా చూసి ఈసడించుకోవడం జరుగుతోంది. ఎట్టి విపత్కర పరిస్థితులు ఎదురైనా సరే సంప్రదాయాలను పాటించాల్సిందే. ఇది సర్వులూ అంగీక రించే విషయమయింది.

సంప్రదాయాల్లో దైవికమయినవనీ, లౌకికమయినవనీ, భౌతికమయినవిగా పేర్కొ నవచ్చు. దైవ సంబంధమైన పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, ఊరేగింపులూ, పండు గలూ, జాతరలు మొదలైనవి ప్రముఖమైనవి. పూజా కార్యక్రమాల్లో శారీరకంగానూ, మానసికంగానూ పరిశుద్ధంగా ఉండాలి. కుటుంబంలో ఎటువంటి అశౌచ పరిస్థి తులూ ఉండకూడదు. పవిత్ర చిత్తంతో కార్యక్రమాలు నిర్వహించాలి. దేవాలయాల్లో ప్రవేశించేటప్పుడు శుభ్రమైన దుస్తులతోపాటు నిష్కల్మష హృదయాలు కలిగి ఉండాలి. పాదరక్షలతో పవిత్ర మందిరాలలోకి ప్రవేశించరాదనే ఆంక్షలు ప్రతిచోటా కనిపిస్తాయి. ప్రతియొక్కరూ వాటిని మనస్ఫూర్తిగా పాటించడం చూస్తున్నాం.

లౌకికమైన సంప్రదాయాల్లో ముఖ్యంగా జనన, మరణాల సమయాల్లో పాటించ వలసినవి. శిశు జనన సందర్భంలో తిథి, వార, నక్షత్రాదులను గమనించడం, వాటివల్ల శిశువు యొక్క గ్రహస్థితి భవిష్యత్తు ఎలా ఉంటుందో జ్యోతిష్కుల నడిగి తెలుసుకో వడం వారిచ్చిన సూచనలమేరకు శిశువుయొక్క పేరు నిర్ణయించడం, బారసాల మొద లైనవి చేయడం జరుగుతోంది. శిశువుకు ఏదైనా దోషం ఉందని తెలిస్తే గ్రహశాంతి కోసం చేసే పూజలు మొదలైనవి సంప్రదాయబద్ధంగా జరుగుతాయి.

కుటుంబంలో ఎవరైనా మరణించినప్పుడు సంప్రదాయానుసారంగా ఖననం చేయడమో లేక దహనం చేయడమో జరుగుతోంది. దైవజ్ఞుల సూచనలమేరకే దశ దిన కర్మలూ, పిండ ప్రదానాలూ దాన ధర్మాలూ సంప్రదాయం మేరకే జరుగుతాయి. ఇట్టి సంప్రదాయాలు ప్రాచీనులు ఏర్పరచిన పద్ధతుల్లోనే జరుగుతాయి.

పండుగలు, పబ్బాలు, ఉత్సవాలూ ఊరేగింపులూ జాతరలూ ఏయే సమయాల్లో ఎలా నిర్వహించాలి అనేవి కూడా సంప్రదాయానుసారమే నిర్వహించబడతాయి. పండుగల సందర్భాల్లో అభ్యంగన స్నానాలు చేయడం, కొత్త బట్టలు ధరించడం, దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకోవడం అనేవి సమాజంలో జరిగే సత్సంప్రదా యాలే!

దేవతా విగ్రహాలను ఊరేగించే సమయంలో ప్రతివారూ తరతమ భేదాలు విడిచి భక్తిప్రపత్తుల్లో ఆధ్యాత్మిక భావాలతో పాల్గొనడం ఒక సత్సంప్రదాయమే కదా!

ఉత్సవాలూ, జాతరలను ఎందుకు ఏర్పరచారో వాటివల్ల కలిగే మేలు, కీళ్ళను గూర్చి హేతుబద్ధంగా ఆలోచించాలి. అప్పుడే వాటి వెనుక ఉండే మర్మాలు గోచరి స్తాయి. సమాజానికి మేలు చేసేవి అయితే తప్పక వాటిని పాటించాలి. అందరికీ ఆద ర్శప్రాయంగా మెలగడం అలవరచుకోవాలి. సత్సంప్రదాయాలను ఆచరించడం సజ్జన లక్షణంగా భావించాలి. ప్రతి మానవుడు అట్టి సన్మార్గంలో నడవటానికి ప్రయత్నిం చాలి.

-కరణం రాజేశ్వరరావు

వృతాసురుడు 12

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 5



మాటాట -4 సమాధానం

మాటాట

ఆధారాలు:

అడ్డం

1. బలునకు ఇది
నిలువెల్లా
3. ఉష్ణము
4. మణితో స్త్రీ
8. చాలాబాధ
9. కూతురు
11. యుద్ధం, నాశనం
13. భ్రాంతి
14. కాగడా

నిలువు

2. చంద్ర గుప్తుని తల్లి
3. జడ
5. యంత్రము
6. అనుకూల పవనం, సుడిగాలి
7. రైల్లో చేసేది
10. అమృతం
11. యథార్థ జ్ఞానం
12. శివుని వాహనం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

CMYK

అక్షర

పరిచయం..

జొ ట్టున్నమ్మ ఎన్ని ముళ్లయినా వేస్తుందన్నది సామెత. రచయిత మల్లాదిది కూడా ఇదే తరహా. ఆయన ఏ అంశాన్నైనా చదివిం చేలా రాసేయగలరు. ఆఖరికి ఆయన అక్కౌంట్ పుస్తకం కూడా అని అన్నా అతిశయోక్తి లేదు. సుదీర్ఘ రచనానుభవంలో, రచయితగా తనకు, వివిధ దశల్లో, వివిధ పత్రికల్లో ఎదురుపడిన వివిధ స్థాయి పాత్రికే యుల గురించి, ఆయన ఓ సీరియల్ రాసారు. అందులోనూ ఓ చిన్న విశేషం వుంది. అది ముందు వెబ్‌లో సీరియల్‌గావచ్చి, ఆపై ప్రింట్‌మీడి యాలో వచ్చింది. ఆపై ఇప్పుడు 'జరిగిన కథ' పేరిట పుస్తకంగా వచ్చింది. అలనాటి చందమామ మొదలు నిన్న మొన్నటి పత్రికల వరకు మల్లాది రచనను ప్రచురించిన ప్రతి పత్రిక ప్రస్తావన ఈ పుస్తకంలో వుంది. వాటిలో వివిధ స్థాయిల్లో పనిచేసిన వారితో ఆయన అనుభవాలు ఇందులో పొందుపరిచారు. ఆ అనుభవాల్లో తీయనివి, పుల్లనివి, చేదువి..ఇలా షడ్రుచులూ వున్నాయి. కొన్ని చోట్ల ఆయన నిర్మొహ మాటం చూసి కొంచెం ఆశ్చర్యం వేస్తుంది. ఆయన జ్ఞాపక శక్తి తెలిసి ముచ్చటేస్తుంది. అయినా ఇలా రాసి కొంతమం దికైనా కోపం తెప్పిస్తారని తెలిసి, సత్తెకాలపు మనిషి అనిపి స్తుంది. మొత్తానికి పుస్తకం చదవబుద్ధేస్తుంది. అంతటితో ఆగలేదు మల్లాది. కొన్ని చోట్ల వివిధ వ్యక్తుల మానసిక విశ్లే షణ కూడా చేపట్టారు. సుదీర్ఘ పరిచయంతో ఆయన ఈ విధమైన గ్రహింపునకు వస్తే వచ్చి వుండొచ్చు. కానీ దాన్ని ప్రింట్ వరకు తీసుకెళ్లడమంటే ధైర్యమే. ఎందుకంటే, రచ యిత అంటే పదిమంది ఎడిటర్లను, పబ్లిషర్లను మంచి చేసుకుంటూ ముందుకు సాగాల్సి వుంటుంది కనుక. కానీ మల్లాదిది ఆ విషయంలోనూ ముక్కుసూటితనమే.

జరిగిన కథ
(పత్రికా సంపాదకులతో అనుభవాలు)
-మల్లాది వెంకట కృష్ణమూర్తి
వెల: రూ.120
ప్రతులకు: లిపి పబ్లికేషన్స్ గాంధీనగర్, హైదరాబాద్ - 500 080
98490 22344

11
ఆంధ్రభూమి
ఆదివారం
3, ఫిబ్రవరి
2013

నైసర్గిక సహజ కవి అలిశెట్టి

ప్రభాకర్ కవితలు అతని జీవనక్రమాన్ని, అతని కవితా సిద్ధాంత ధోరణిని తెలియపరచడంతో అతను ఏమిటో చదువరులకు చెప్పక చెప్పుతాడు. అతని మాటల్లోనే "చరిత్ర పుటపై చెక్కుతున్న చెక్కుచెదరని సత్యం నేను" ఈ చరణం చాలు ఆ కవితా వైభవపు వెల్లువకి మచ్చుతునగా నిలవడానికీ. అట్లాగే అతను 'చురకలు' కవితలకు ముందుగా రాసుకున్నాడు. 'నాకు మెజారిటీ ప్రజల బాధలూ గాథలే ముడి సరుకులయ్యాయి.' ఆ ముడి సరుకులు అతడి కవితల గనిని అతి అరుదైన ఖనిగా చేసాయి. అతడు కాలంచేసి ఇరవై ఏళ్ళయినా, బ్రతికున్న ముప్పైతొమ్మిదేళ్ళ జీవితంలో రాసిన అచ్చులో తన కవితలు చూసుకున్న ఇరవై ఏళ్ళ కాలవ్యవధిలో అవి చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి.



అలిశెట్టి ప్రభాకర్ కవిత సంపాదకులు: జయధీర్ తిరుమలరావు, నిజాం వెంకటేశం, బి.నర్సన్, ప్రచురణ: అలిశెట్టి మిత్రులు; జగిత్యాల/ హైదరాబాదు; వెల: రూ.150/-; పేజీలు: 354, ప్రతులకు: 1-1-276/ఏ, ప్లాట్ నెం.104, ఆర్కె అపార్ట్‌మెంట్స్, ఒకటో వీధి, చిక్కడపల్లి, హైదరాబాద్- 500 027)

"ఇ దెక్కడి జాగా మిత్రమా, కనుచూపు మేరకు ఇక్కడంతా కలుషిత ప్రదూషితాలే కన్పడుతున్నాయి' అని ఉమ్రావ్‌జాన్ 'అదా'తన చుట్టు ప్రక్కల్లోని సమాజ పరిసరాలను కవితా తటస్థ నిర్లిప్తతతో చెప్పినా;

'ఈ బడలిక- అలసటలు, ఈ జ్వరపు చిర చిర చీదరలు/ ఇదో ఇక్కడే మనుషులు కూర్చుని ఒకరి తప్ప మూలుగులని మరొకరు వినేది... ఇక్కడే ఎక్కడైతే ఆలోచన వ్యాకుల ఖేదంగా మారుతుందో...' అని ఆంగ్ల కవి జాన్ కీట్స్ యువతని కబళించి వేస్తున్న సామాజిక, శారీరక రుగ్మతల గురించి టీబీతో బాధపడుతూనే రాశాడు.

'మందులు కొనుక్కోలేని నిర్భాగ్యపు నగరంలో/ మళ్ళీ మళ్ళీ ఊపిరితిత్తుల్లో క్షయ రాజుకోవడం/ పరిపాటయిపోయింది./ పుట్టిన గడ్డనుంచి ఇక్కడికి రావటమే పొరపాటయి పోయింది' అని అలిశెట్టి ప్రభాకర్ (1954-93) తన స్వీయ ప్రకటనలో ప్రకటించాడు.

ఈ ఇద్దరివీ కళాతప్త అభివ్యక్తులే. పిన్న వయసులో మరణించినా తమ తమ పరిసరాలు, పరిస్థితులని గమనిస్తున్న సునిశిత దృక్పథాలు వీరివి. ఇవి నిరాశా, నిస్పృహలు కానేకావు. చుట్టూ ఉన్న వాస్తవాలు. ఆ వాస్తవాల్లో బ్రతకడాన్ని వీళ్ళెవరూ తృణీకరించలేదు. కానయితే ఆ దుర్భర వాస్తవాలని తమ కవిత్వ కళానైపుణ్యాలతో సమాజంవైపు సంధించి వదిలారు.

అలిశెట్టి ప్రభాకర్ విషయంలో అతను కేవలం కవి మాత్రమేకాక ఒక చిత్రకారుడు, ఒక ఫొటోగ్రాఫర్- లెన్సుని కలం, కుంచెలతోపాటు ఒక కళామాధ్యమంగా చేసిన ఫొటోగ్రాఫర్ కావడం అతని కళా తృష్ణని మూడింతలు చేసింది. ఆ తృష్ణతోపాటు వచ్చే అస్వస్థతలని కూడా పెంచింది. అదే రాసుకున్నాడ

తను- భారమవుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసల మధ్యే/ మృత్యువును పరిహసించేందుకు ఒకింత/ సాహసం కావాలి. (పే.1.) అన్నాడు.

ఈ మృత్యువు ధిక్కారపు, సాహసం అతనికి అతని కవిత ఇచ్చిందని ఈ పుస్తకం తెలుపుతోంది. ఈ కళాసాధనాన్ని ముందుపెట్టుకొని తన భౌతిక శరీరపు పీడన, వేదనలని అధిగమించాడు. అక్షరాలలో తననితాను భద్రపరచుకొని భౌతికంగా వెళ్ళిపోయాడు. అదే మాట ఈ పుస్తకానికి జయధీర్ తిరుమలరావు తన ముందుమాట రాస్తూ 'కవిత్వంతో చావుని గెలవాలనుకున్న పిచ్చివాడు. గెలుస్తానని నమ్మినవాడు. (XIII) స్వీయ జీవితాన్ని మండించి సమాజానికి వెలుగులు అందించినవాడు (IX) అని అంటాడు.

ప్రభాకర్ కవితలు అతని జీవనక్రమాన్ని, అతని కవితా సిద్ధాంత ధోరణిని తెలియపరచడంతో అతను ఏమిటో చదువరులకు చెప్పక చెప్పుతాడు. అతని మాటల్లోనే ''చరిత్ర పుటపై చెక్కుతున్న చెక్కుచెదరని సత్యం నేను'' (పే.302) ఈ చరణం చాలు ఆ కవితా వైభవపు వెల్లువకి మచ్చుతునకగా నిలవడానికీ. అట్లాగే అతను 'చురకలు' కవితలకు ముందుగా రాసుకున్నాడు. 'నాకు మెజారిటీ ప్రజల బాధలూ గాథలే ముడి సరుకులయ్యాయి.' (పే.55) ఆ ముడి సరుకులు అతడి కవితల గనిని అతి అరుదైన ఖనిగాచేసాయి. అతడు కాలంచేసి ఇరవై ఏళ్ళయినా, బ్రతికున్న ముప్పైతొమ్మిదేళ్ళ జీవితంలో రాసిన అచ్చులో తన కవితలు చూసుకున్న ఇరవై ఏళ్ళ కాల వ్యవధిలో అవి చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. ఆ పదాలు, పదాల సరళత- భావ సంక్లిష్టత, ఆ కవితలని నిత్య నూతనంగా ఉంచుతున్నాయి. రాసిన ప్రభాకర్‌కి తెలుసును కదిలే కాలం తన కవితా ఒర వడికి, అక్షరాల వెల్లువ ఎదురీదలేదని. అందుకే 'నా కవిత' (పే.12)లో రాసుకున్నాడు. 'నా గుప్పిట్లో/ మండుతూన్న/ ఎన్నో గుండెలు.../ ఒక్కొక్క దాన్లో/ దూరి,/ వాటిని చీరి,/ రక్తాశ్రువులు ఏరి/ పరిశీలిస్తాను/ నేను./ కలంలోని ఆ అక్షరధార సామాన్యుడి రక్తాశ్రువులను స్పృశించింది కాబట్టి ఈ కవి అమరుడు. మనిషి ఎలా కళాకారుడు కాగలడో 'తేడా'కవిత (పే.24)లో తెలియచెపుతాడు. అ.ప్రభాకర్‌కి మనిషిని ఏఏ లక్షణాలు కళాకారులను చేస్తాయో క్షుణ్ణంగా తెలుసు. అందుకే 'కళాపోషణ'(పే.82)లో అసలు కళకి, ఆపాదించుకున్న కళకి తేడా తెలియచేస్తాడు. 'ఆశయం' (పే.26) కవితలో విరిగిన అక్షరాలని ఏరుకుంటూ పాఠకుడినీ ఓ చేయి వేయమంటారు. అప్రమత్తులయిన పాఠకులు ఇన్నేళ్ళుగా ఆ అక్షరాలని పదిలపరుచుకొని, కవితలని ఆస్వాదిస్తున్నారు.

జీవిత దుర్భర సత్యాల, నగ్నత మరీ బరిసెలా భాసిస్తున్నప్పుడు ఆ దుర్భర నగ్నత మీద తన అక్షర సాపేక్షతని వాడుకున్నారు అ.ప్రభాకర్. 'ఏమిటీ విడ్డూరం...?/ ఒక్కొక్కప్పుడు/ చెట్లన్నీ/ శిలల్లా స్ఫురిస్తాయి/ మొహాలన్నీ/ నరికేయబడ్డ మొండాల్లా తోస్తాయి/ కొమ్మ ఉండీ ఊగని/ కొలిముండీ మండని/ ఎందుకీ జీవితాలని./ (పే.47) చేయి తిరిగి కవిత్వపు అల్లిక ఇది. ఎక్కడా నిస్పృహ ధ్వనించనీయని నైరాశ్యపు వాస్తవ చిత్రణ.

'చురకలు' లాంటి కవితా చెణుకులతోపాటు 'చరిత్రహీనులు' (పే.29), 'ప్లాస్టిక్ సర్జరీ' (పే.33) లాంటి దీర్ఘకవితలు కూడా ఈ సంకలనంలో చేర్చబడ్డాయి. సంపాదక వర్గం కృషి ఈ ఎంపికలో కానవస్తుంది. 'నగరం'పట్ల అ.ప్రభాకర్ బేజార్ భావన చెప్పుకోదగిన తీరులో ఉంది. ఈ పుస్తకంలోని కవితలలో. ప్రపంచ భాషల్లోని కవిత్వ అంశం అయిన 'నగరం' ప్రతీకని అ.ప్రభాకర్ ఉపయోగించిన తీరు సమకాలీన సమాజాన్ని అభివర్ణిస్తుంది. ప్రపంచ యుద్ధాల నేపథ్యం కనిపించని ప్రభావాన్ని చూపిన కాలమది. మనిషిలోని జీవసత్యాన్ని బయటి పరిస్థితులు లాగేస్తుంటే, మనిషి తన చేతిలో లేని వేగవంతమైన మార్పులని నిశ్చేష్టుడయి చూస్తున్న కాలం అది. అ.ప్రభాకర్‌లోని కళాకారుడు ఆ నిశ్చేష్టతకి కవితల్లో అక్షరమయి, చిత్రాల్లో రంగుగామారి, కెమెరా కంటికి ఒక విశిష్ట కోణమయి బేరీజు వేసుకున్నాడు కాబట్టి ఈనాటికీ నిలిచాడు.

అప్పటికీ అతనిలోని కవికి చిత్రకారుడికీ పోటా పోటీనే! కవిత్వం ఆయుధమైనప్పటికీ చిత్రకారుడు అంతరించిపోతున్నాడనే బాధ. తన కవితలని చిత్రాల్లో, ఫొటోల్లో అమర్చుకొని ''పోస్టర్ కవితలు' అనే పేరుతో ఒక వినూత్న ప్రక్రియ మొదలుపెట్టుకున్నాడు. యువతని ఉర్రూతలెత్తించే ప్రక్రియ ఇది. ఈ ప్రయోగం మీద కించపరిచే విమర్శలను కవి హృదయం తట్టుకోలేకపోయిందని ముందుమాట స్పష్టంచేస్తుంది. కాలాన్ని తన వేగంతో దాటేసి, అదే కాలాన్ని తన వేగానితో సరిపాటిగా చేయలేనప్పుడు కవి సునిశిత మేధస్సు, హృదయం పడే పాట్లు అన్నీ పడ్డారు అ.ప్రభాకర్.

ఉత్తమ కలానికి కావాల్సిన ఒక ''ఫ్రెంజీడ్'' లక్షణం అ.ప్రభాకర్ కవితల్లో ఆమూలంగా ఉంటుంది. ఇవన్నీ ఒకెత్తయితే, ఈ పుస్తకమూ, దాని ప్రచురణకి ముందుకొచ్చిన అలిశెట్టి మిత్ర బృందం, ఆ మిత్రులను మంత్రముగ్ధులను చేసిన అ.ప్రభాకర్ వ్యక్తిమత్వం ఇంకొక ఎత్తు.

-మనోజ

అరుదాయి

చరిత్ర వాహినిలో పెరిక కులం
-కానుగంటి మధుకర్
వెల: రూ.120
ప్రతులకు:
కానుగంటి మధుకర్
ఇం.నెం.20-451/1, మమత నగర్,
పరకాల - 506 164. వరంగల్ జిల్లా
9866 16 55 16

ఆర్వియార్
స్పోకెన్ ఇంగ్లీష్
ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్ - ఇంగ్లీష్ అండ్ తెలుగు
సంపాదకుడు: పి.రాజేశ్వరరావు
వెల: రూ.150/-
ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, గాంధీ, నవోదయ, తెలుగు బుక్‌హౌస్‌లు మరియు ప్రముఖ పుస్తక విక్రేతలు

గేయ కవితని ఎత్తిపట్టిన పరిశోధనాక్షరాలు

గేయం సాహిత్య ప్రక్రియగా గుర్తింపబడడానికి ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటుంది. గానయోగ్యతని కవిత్వంగా గుర్తించడానికి సాహిత్య వ్యవస్థ సుముఖంగా ఉండదు. ఐనా గేయం తన పట్టు నిలుపుకుని తన అస్తిత్వాన్ని నిలుపుకుంటుంది.

పద్య కవిత్వం, వచన కవిత్వంతో పోటీపడి గుర్తింపు పొందడానికి కవిత్వపరమైన స్థాయి ఉన్నా రూపపరమైన న్యూనతకి గురికావడం బాధాకరం.

జాతీయోద్యమ కాలంలో, జమీందారీ వ్యతిరేకోద్యమంలో, ఆ పిమ్మట ప్రజోద్యమాలలో, ముఖ్యంగా తెలంగాణా రైతాంగ పోరాటంలో గేయం తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత వసంతమేఘ గర్జనలో గేయం పాటగా రూపెత్తి తన శక్తిని, సత్తాని చాటింది. ఓవైపు సినీ గేయాలు, మరోవైపు పోరాట గీతాలు తెలుగు కవిత్వానికి వన్నె తెచ్చాయి. ప్రస్తుత కాలంలో తెలంగాణా ప్రాంతీయోద్యమంలో గేయమే ఉద్యమానికి నాయకత్వం వహించింది. ధూంధాంల పేరుతో మారుమోగింది. ఐనా పాటల రచయితలకు సాహిత్య పురస్కారాలు తక్కువే. వారి ఇతరేతర రచనలకు గుర్తింపు వస్తుంది. కాని గీతాలకు గుర్తింపురాదు. సినారె వంటి అద్భుత గేయ రచయిత రాసిన వచన కవితకే గుర్తింపు వస్తుంది. గేయ రచన ద్వారా పాపులారిటీ ఉంటుంది.

కాని పురస్కారం మాత్రం ఇతర ప్రక్రియలకు వస్తుండడం గమనించవలసిన విషయం. ఈ నేపథ్యంలో సుద్దాల అశోక్ తేజ రాసిన 'నేలమ్మా నేలమ్మా' అనే గేయ సంపుటిపై యం.ఫిల్. పరిశోధన చేసి రాసిన పుస్తకం గీత రచన మీద పరిశీలనాత్మక విశ్లేషణ వెలువడడం ఊరట. అశోక్‌తేజ స్వతహాగా కవి. వచనం రాయలేదు. గేయమే ఆయన వ్యక్తీకరణ.

'నేలమ్మా నేలమ్మా' గేయ రూప కవిత్వం పరిశీలన రచయిత: గోపగాని రవీందర్ వెల: రూ.90/- పేజీలు: 148 ప్రతులకు: రమణశ్రీ ఇంటి నెం.9-76/2, గుస్సాడిగుట్ట, ఉట్నూరు - 504431, ఆదిలాబాదు జిల్లా ప్రచురణ: పాలపిట్ట బుక్స్, హైదరాబాదు.

ప్రముఖ ప్రజాకవి సుద్దాల హనుమంతు కుమారుడు. ఆ ఇంటి వారసత్వం పాటే అవుతుంది అని నిరూపించాడు. 'వెలుగురేకలు' నవల రాసినా గేయ కవిగానే సుపరిచితుడు. తండ్రి హనుమంతు పూర్తిచేయని 'వీర తెలంగాణా సాంఘిక యక్షగానం' సవరించి పూరించాడు. 'బతుకు పాటలు', 'ఆకు పచ్చ చందమామ' గేయ సంకలనాలు లోగడ అచ్చయ్యాయి. ప్రస్తుతం 'నేలమ్మా...' సంకలనంపై గోపగాని రవీందర్ పుస్తకం వెలువరించారు. అశోక్ జీవితం, గీతం కలసికట్టుగా ఈ రచన సాగింది. సాహిత్య సిద్ధాంతాల జోలికి పోకుండా వర్ణనాత్మక పరిశోధన కోణంలోంచి పరిశీలించాడు.

అశోక్ గీతాలను ఎనిమిది రకాలుగా విభజించాడు. ఆయా రకాల గీతాలను విశ్లేషించి అందులోని విలువలని ఎత్తిచూపాడు. సినీ జాతీయ గేయ కవిగా గుర్తింపుపొందిన అశోక్ కేవలం సినిమా రచనలకే కాకుండా సామాజిక అవసరాల కోసం కూడా పాటలు రాసి ఆ ముద్రనుండి కాపాడుకున్నాడు. రైతాంగ సమస్యలు, విభిన్న సామాజిక ఉద్యమాలు, మహిళల జీవితాలను వస్తువుగా తీసుకుని రాసిన గీతాలు ప్రాచుర్యం పొందిన విధానం ఎత్తిచూపాడు గ్రంథంలో. తెలంగాణా మీద విత్తనమై మొలకెత్తిన పాట పార్శ్వాలు ఎత్తిచూపాడు.

ఒక గీతం రాయడానికి ఆయన పడే శ్రమ ఎంతటిదో ఇతివృత్త నిర్వహణని బట్టి చెప్పవచ్చు. లోతులకి వెళ్ళి రాయడం కవి ప్రతిభా వ్యుత్పత్తులకు అద్దం పడుతుంది.

సంక్షిప్తత, రాగమాధుర్యం, చక్కని పదజాలం అశోక్ సొత్తు అని రవీందర్ ఉదహరణలతో నిరూపించాడు.

-జయధీర్

సామాజిక రాజకీయాల వ్యాసకదంబం

చైతన్య కిరణాలు (వ్యాసాల సంకలనం) రచయిత: వి.జయరాముడు వెల: రు.100 ప్రతులకు - ప్రముఖ పుస్తక కేంద్రాలు

నిరంతర అధ్యయనం, అపార మైన అనుభవాలు, నిశిత పరిశీలనలతో జయరాముడు రాసిన 50 వ్యాసాల సంకలనం ఇది. ప్రజాకోణం నుంచి కొంత, రాజకీయ సిద్ధాంతాల కోణంనుంచి మరికొంత రచయిత విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలివి. సామ్రాజ్యవాదం, తెలంగాణా ఉద్యమం, అక్రమార్జన అవినీతి, కుంభకోణాలు, మానవ హక్కులు, ఆశ్రిత పక్షపాతాలు, అధికారుల అలసత్వం మొదలైన అన్నిటినీ నిష్కర్షగా వెల్లడించారు జయరాముడు.

''చమురు కోసమే ఇరాక్‌పై బుష్ రంకెలు''

''తెలుగు వాళ్లు మూడు రాష్ట్రాలుగా విడిపోతే తప్పా?''

''ఐపిఎస్ అధికారుల ఆలాపనలు''

''అమ్మకానికి ప్రభుత్వ రంగం''

వంటి వ్యాసాలు పాఠకులకి ఆయా అంశాలపై కొంత పరిజ్ఞానాన్ని కలిగిస్తాయి.

-ద్వాదశి

నిండైన మనిషితనం, నిటారైన కవిత్వం - యుగ స్వరం

దిగంబర కవితావేశంలో పేరెన్నికగల కవి నిఖిలేశ్వర్. విప్లవ జనవాణితో కలగలిసిన కవితా గళం. అది దాదాపు ఏభై ఏళ్ళ కవిత్వ పథం వీడని యాత్రికుడు. నిరంతరం సృజన రంగంలో తనదైన ముద్రవేస్తూపోతున్న ఈ కవి తాజా పుస్తకం 'యుగ స్వరం'.

నిఖిల్ కవి మాత్రమే కాదు. అవసరార్థం అనువాదకుడు. కథకుడు. విమర్శకుడు కూడా. ప్రజాదృక్పథంగల రచనానుశీలన, ఉద్యమోన్ముఖత కవిని నిటారుగా నిలుపుతాయి. మంచి మనిషి కానివాడు మంచి కవి అయినా ఫాయిదా లేదని నిరూపించిన వ్యక్తిత్వం. సాహిత్య రాజకీయాలకు దూరంగా ఉంటున్న వ్యక్తి. జీవితాన్ని కబళించే ఆధునికత, ఆధిపత్య రాజకీయాలు, అన్ని రకాల దోపిడీలను ఎదిరిస్తూ సమాజం పక్షాన నేనున్నాననే హామీఇచ్చే నిఖిల్ చాలామంది కవులకన్నా ఎంతో నయం. పేరు ప్రఖ్యాతులను వ్యక్తిలాభంగా మార్చుకునే కుహనా ప్రగతివాదులు చూసి నేర్చుకునే తెరచిన పుస్తకం ఈయన. కవిత్వాన్ని డాంబికంచేసే కుహనా విప్లవ కవులు, అవార్డుల కవులతో పోల్తే నిఖిల్ వంటి వారు కవిత్వ గౌరవం పెంచారని నిస్సందేహంగా చెప్పవచ్చు. వ్యక్తిగత, నిర్మాణ విలువలను కాపాడిన కొద్దిమందిలో నిఖిల్ ఒకరు. ప్రజాసంఘాలను చెప్పచేతుల్లో ఉంచుకోవాలనే ప్రగతిశీల భూస్వామ్య తపనని వ్యతిరేకిస్తూ కవిత్వానికి విలువలు ఆపాదించిన కవి. అతను కేవలం కవి కాదు. క్రియాశీలి. సిద్ధాంతాల ప్రకటన కాదు. ఆచరణ వాది. పేరుకోసం పేరున్న పత్రికలకే రాస్తానని భీష్మించుకోలేదు. కవిత్వ ఇతివృత్తాన్ని వ్యక్తిగతాడం బరానికి వెలిగించలేదు. సామాజిక వాస్తవికతనీ, సంఘర్షణలనీ ఎత్తిచూపడానికే ప్రయత్నించాడు. సామాజిక దశలను చారిత్రక అవగాహనతో విక్షిస్తూ, ప్రతిస్పందిస్తూ కవిత్వీకరించాడు.

ఈ సంపుటిలో రెండుభాగాలు ఉన్నాయి. ఒకటి యుగాన్వేషణ. రెండు యుగస్వరం. యుగాన్వేషణ భాగానికి ఒక ముందస్తు కవిత రాశాడు. అందులో

"కాలమంతా యంత్రమై
ఎవరికివారు విడిభాగాలై
చెల్లాచెదురైనప్పుడు
ఈ యుగాన్వేషణ"చేస్తున్నానని చెప్పుకున్నాడు.

"ఈ వ్యవస్థ మూలాన్ని
చేజిక్కించుకున్న శక్తులకు
ఊడిగంచేస్తున్న రాజ్యాంగ యంత్రం
మనది కానప్పుడు
భూగోళీకరణాన్ని ఛేదించే
మానవీయమం తప్ప మరేమార్గం లేదు"

అని తన ఆలోచనని విస్పష్టం చేశాడు. ఎక్కడికక్కడ విరిగిపడే శబ్దాలతో, మూలిగే బాధలతో కూనారిల్లుతున్న సమాజాన్ని చూసే కవి అందుకు కారణాలను కూడా అన్వేషిస్తాడు.

"మన ఉద్యమాల దారిలో
రక్త చారికలను కడిగేస్తున్న
కన్నీటి ధారలకు
అంతమెక్కడో చెప్పగలవా"అని ఉద్యమాలను, తన నితాను ప్రశ్నించుకున్నాడు. రాలిన పూల జ్ఞాపకాల్ని జీవితాంతం విజయమని నమ్మమనడం సరికాదు అని నిఖిల్ అభిప్రాయం.

వానావరుపు కూడా భయపెట్టే కొత్త ఉపద్రవాలై

యుగ స్వరం కవి: నిఖిలేశ్వర్ వెల: రూ.80/- పేజీలు: 150 ప్రతులకు: నిఖిలేశ్వర్, 2-2-647/185/1A, శారదానగర్, బాగ్‌అంబర్‌పేట్, హైదరాబాదు- 500 013.

నాయి. సునామీలు వస్తే ఆదుకోవడానికి సాంకేతికత, ప్రభుత్వ యంత్రాంగం ఏదీ కాపాడలేదు. 'ఒక్కొక్క ఆకుపై/ దీపాలను వెలిగించే వాన' బాగుంటుంది. కాని అదే వాన ''కూలుతున్న వంతెనలు/ ఏ నిమిషాన భూకంపనలు ఎక్కడికి విసిరేస్తాయో'' అనే భయాన్ని కూడా వ్యక్తంచేస్తాడు.

'యుగస్వరం' భాగానికి రాసిన ముందస్తు మాటలో

అత్యగౌరవ అనంత ఘోష
ముత్తాతల నాటినుంచి
శ్రమ విలువకై స్వేచ్ఛకై
జనవిముక్తి పోరాటం" అంటూ అది ఏనాడూ మూగపోని జన స్వరంగా వినిపిస్తాడు తన కవితలో.

తన స్వీయానుభవాన్ని సామాజిక దశలలోని వివిధ ఉద్యమాలను, మార్పులను, యాత్రలను కవిత్వీకరించాడు. 92 ఏళ్ళ తల్లి మృతి కావచ్చు, ఎన్‌కౌంటర్ కావచ్చు, జల్ జంగల్ జమీన్ పోరాటం కావచ్చు తనదైన సమన్వయ కవిత్వ భావనలో ఇమిడ్చి దగ్దసమాజ గీతికలోంచి ఓ ఆశాభావాన్ని అక్షరాలలో పూయించి పాఠకుడికి అందిస్తాడు. కవి తన భావాలను నిర్భయంగా, స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తాడు. కవిత్వానికి అది కూడా ఒక గుణమే కదా. చాలామంది చూరుకి వేలాడుతూ తామెంత వీరులమో చూడండని తపతపలాడిస్తారు. దీర్ఘకాల అనుభవం అతని కవిత్వంలో కానవస్తుంది.

ఐతే దిగంబర కవిగా ఉండి విప్లవ కవిగా మారిన వేళ తన ఆగ్రహాన్ని తానే సెన్సార్ చేసుకున్నాడు. విప్లవ భావజాలంనుండి, ఆ నిర్మాణాలనుండి బయటపడి ప్రగతిశీల కవిగా మారినప్పుడు తీవ్రత మరింత మారింది. సరళత పెరిగింది. అప్పుడు జీవిత పార్శ్వాలు, అనుభవ భావనలు చోటుచేసుకున్నాయి. అందుకే ''వివిధ రంగాలలోని ఉద్యమాలవైపు దృష్టి మళ్ళినందువల్ల కవితా రచనలో కొంతమేర శ్రద్ధాసక్తులు తగ్గిన మాట కూడా వాస్తవమే''అని తన గురించి తాను విశ్లేషించుకున్నాడు. ''దాని ఫలితమే నిర్లక్ష్యాన్ని ఎదుర్కోవడం''అని చెప్పుకున్నాడు.

ప్రజోద్యమాలలో క్రియాశీల పాత్ర వహించినప్పుడు కవిత్వం అవసరం కాదు. అవకాశం ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖలు, అనువాదాలు, విమర్శ ముఖ్యం అవుతుంది. ఆ దశ దాటి మండుతున్న తరం (1970ల తరువాత) పన్నెండేళ్ళకు ''ఈనాటికీ'' అనే కవిత్వ సంకలనం వచ్చింది. అప్పటినుండి కవిత్వ రూపాన్నీ సారాన్ని సమన్వయ పరుస్తూ రాస్తున్న నిఖిల్ అభినందనీయుడు. అతని కవిత్వంకన్నా, వ్యక్తిత్వం మరింత గొప్పది. వ్యక్తిగా మరణించి కవిగా రాణించినవారు ఉండవచ్చు. కాని వారికంటే నిఖిల్ వంటి కవులనే జనం స్వీకరిస్తారు. ఆమోదిస్తాడు పాఠకుడు. ఈ కవిత్వాన్ని ఎక్కువగా విశ్వసిస్తాడు. ఇక్కడే నిఖిల్ తనని తాను నిలబెట్టుకున్నాడు. తాళవృక్షంలా నిటారుగా నిలిచాడు.

- జయవంత్

'నాలుగు మినార్ల' నగర చరిత్ర

ప్రాచీన భారతీయ నగరాలు, షోడశ జనపదాలను ఇప్పుడు గుర్తించడం కష్టం. అవన్నీ ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయాయి. నూతన రాజ్యాల ఆవిష్కరణ-విస్తరణలతో ఎన్ని కొత్త నగరాలు వెలిశాయి. ఒకప్పటి నగరాలు ఇప్పుడు కుగ్రామంగా మారడం, కుగ్రామాలే నగరాలుగా రూపొందడం కాలగతిలో మామూలే. ప్రతి నగరానికో చరిత్ర ఉంటుంది. గ్రామ చరిత్రలు చరిత్రకారుడికే కాక, సామాజిక శాస్త్రవేత్తల అధ్యయనంలో కూడా ఒక భాగమే. ఒక నగర చరిత్ర గురించి చెప్పడమంటే, వీటన్నింటినీ వివరంగా తెలియజేయడమే అవుతుంది. ఆ మధ్య హైదరాబాద్ నగరం నాలుగు వందల ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం వారు ఏడాది పొడుగునా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ చరిత్రమీద పత్రికల్లో బోలెడన్ని వ్యాసాలు, ఫోటోలను ప్రచురించారు. తెలుగులో మాత్రం వేదగిరి రాంబాబు రాసిన 'నాలుగు శతాబ్దాల నగరం' అనే ఒకే ఒక పుస్తకం కనపడుతుంది. 91లో వచ్చిన ఈ పుస్తకం ఇప్పుడు మలి ముద్రణగా మనముందు కొచ్చింది

'నాలుగు శతాబ్దాల నగరం' డా.వేదగిరి రాంబాబు శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాద్-44 వెల: రూ.100 ప్రతులకు: అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలు

హైదరాబాద్ చరిత్ర గురించి పుస్తకాలు రాకపోవడానికి ముఖ్య కారణం - ఆ చరిత్రకు సంబంధించిన ప్రధాన ఆధారాలు లేకపోవడం. ఉన్నా అవి అరకొర సమాచారమే లభిస్తున్నది. ఎంతసేపూ కులీ కుతుబ్‌షా గురించి, హైదరాబాద్ నగర నిర్మాణం గురించి కథలు కథలుగా చెప్పుకోవడం కనిపిస్తుంది. ఈ కథలు చారిత్రక సత్యాలను మరుగుపరిచే ప్రమాదముంది. ఇలాంటి కథల ఆధారంగా అల్లిన చరిత్ర ఒకలా ఉంటుంది.

ఉర్దూ గ్రంథాల్లో కనిపించే చరిత్ర మరోలా ఉంటుంది. అందుకని ఉర్దూ, పర్షియన్ గ్రంథాల ఆధారంగా పురావస్తు, వాఙ్మయ ఆధారాలతో నైజాం రాష్ట్ర చరిత్రను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.

క్రీశ 1518-1948 వరకు నైజాం రాష్ట్రాన్ని పరిపాలించిన కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీల చరిత్రకు సంబంధించిన ప్రామాణిక గ్రంథంగా ఈ 'నాలుగు శతాబ్దాల నగరాన్ని' వేదగిరి రాంబాబు తీర్చిదిద్దారు. వాళ్ల చరిత్ర కనుగుణంగా హైదరాబాద్ నగర నిర్మాణం, విస్తరణ గురించి వివరంగా తెలియజేసారు. వీటితోపాటుగా హైదరాబాద్ స్థూల నామాల గురించి, వాటి చరిత్ర గురించి కూడా తెలియజేయడం బాగుంది. తెలంగాణ స్పృహ పెరిగినకొలది కొన్ని పత్రికలు తెలంగాణలో ఉన్న ప్రముఖ స్థలాలు, కట్టడాల గురించి వాటి స్థూల నామాలు, చరిత్ర గురించి ఫోటోలతో సహా వివరిస్తున్నాయి.

మరి కొన్ని పత్రికలు హైదరాబాద్ స్థూల నామాలను అప్పటి ఫోటోలతో సహా ఇస్తున్నాయి. నాలుగు వందల నగరం చదువుతుంటే ఇవన్నీ తప్పకుండా జ్ఞాపకం వస్తాయి. అప్పటి పాలకులు-కట్టడాల ఫోటోలను ఇందుల

అర్చన

archana@andhrabhoomi.net

12 ఆంధ్రభూమి ఆదివారం 3, ఫిబ్రవరి 2013

చారిత్రక నగరం అయోధ్య

మన పురాణాలలో చెప్పినట్టు 'అయోధ్య' నగరం ఓ చారిత్రక, పౌరాణిక నగరం. ఎందరెందరో రాజులు, తీర్థంకరుల, మహనీయుల పాదస్పర్శతో పునీతమైన పుణ్యప్రదేశం. సాక్షాత్తు విష్ణు భగవానుడి అవతారంగా చెప్పబడ్తున్న శ్రీరామచంద్రుని పుట్టిన స్థలంగా దీనిని హిందూవులు విశ్వసిస్తారు. ఇక్కడి నేల పవిత్రం... గాలి పవిత్రం... పరిసరాలు పవిత్రం. అందుకే అయోధ్యను సప్తమోక్ష పురాలలో ఒకటిగా మన పురాణాలు చెప్పాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫైజాబాద్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలోఉన్న అయోధ్య విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ, మహిమ రీత్యా ప్రఖ్యాతి చెందిన నగరం. సాక్షాత్తు శ్రీరామచంద్రుడు, స్వామినారాయణుడు, ఎందరెందరో మహనీయులకు జన్మనిచ్చిన అయోధ్య 'పూర్వనామం' సాకేత. కోసల దేశ రాజధానిగా ప్రసిద్ధిగాంచిన ఈ నగరం ఎందరెందరో ఇక్ష్వాకుల రాజులకు పుట్టిల్లుగా పరిఢవిల్లింది. ఇక్ష్వాకు మహారాజు కుమారుడైన వైవస్వతమను అయోధ్యను అభివృద్ధిపరిచినట్లు ఇక్కడి చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. భారతదేశంలో అతిపురాతన పుణ్యధామాలలో ఒకటిగా, మహిమాన్విత ధామాలలో ఒకటిగా పేరుప్రఖ్యాతులు సాధించిన 'అయోధ్య'కు ఆ పేరు రావడానికి శ్రీరాముడి తాతముత్తాతలే కారణంగా తెలుస్తోంది. శ్రీరాముని తాతలలో ఒకరైన 'అయుధ' అయోధ్య క్షేత్రాన్ని పాలించాడు. ఆ కారణంగా ఆయన తదనంతర కాలంలో ఈ క్షేత్రానికి అయోధ్య అనే పేరు వచ్చినట్లు చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతుంది. 'యుధ్' అంటే సంస్కృతంలో యుద్ధమని అర్థం. అ'యుధ' అంటే నాశనం కానిదని అర్థంగా చెబుతారు. కనుక కాశీనగరం ఎలా అయితే నాశనం లేని నగరంగా పురాణాలలో పేరు ప్రఖ్యాతులు సాధించిందో అలాగే అయోధ్య నగరం కూడా ఎలాంటి విపత్కర పరిస్థితులలోనూ నాశనం చెందని నగరంగా ప్రసిద్ధిగాంచింది. గౌతమబుద్ధుని కాలంలో 'పాలి'భాషలో అయోధ్యను 'అయోజహ' అని పిలిచేవారు. బ్రిటీషువారి కాలంలో ఈ నగరాన్ని 'అజోధ్య' లేక 'అజోదియా' అని పిలిచేవారు. మొగలుల కాలంలో అయోధ్య నగరం ఆగ్రా, కుతుబ్‌శంలో అతిపురాతన పుణ్యధామాలలో ఒకటిగా, మహిమాన్విత ధామాలలో ఒకటిగా పేరుప్రఖ్యాతులు సాధించిన 'అయోధ్య'కు ఆ పేరు రావడానికి శ్రీరాముడి తాతముత్తాతలే కారణంగా తెలుస్తోంది. శ్రీరాముని తాతలలో ఒకరైన 'అయుధ' అయోధ్య క్షేత్రాన్ని పాలించాడు. ఆ కారణంగా ఆయన తదనంతర కాలంలో ఈ క్షేత్రానికి అయోధ్య అనే పేరు వచ్చినట్లు చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతుంది. 'యుధ్' అంటే సంస్కృతంలో యుద్ధమని అర్థం. అ'యుధ' అంటే నాశనం కానిదని అర్థంగా చెబుతారు. కనుక కాశీనగరం ఎలా అయితే నాశనం లేని నగరంగా పురాణాలలో పేరు ప్రఖ్యాతులు సాధించిందో అలాగే అయోధ్య నగరం కూడా ఎలాంటి విపత్కర పరిస్థితులలోనూ నాశనం చెందని నగరంగా ప్రసిద్ధిగాంచింది. గౌతమబుద్ధుని కాలంలో 'పాలి'భాషలో అయోధ్యను 'అయోజహ' అని పిలిచేవారు. బ్రిటీషువారి కాలంలో ఈ నగరాన్ని 'అజోధ్య' లేక 'అజోదియా' అని పిలిచేవారు. మొగలుల కాలంలో అయోధ్య నగరం ఆగ్రా, కుతుబ్‌జయ జయ వైష్ణవి దుర్గే;శరణం భవ కరుణామయి; బ్రూహి ముకుందేతి కృతులతో శ్రీ నారాయణ తీర్థులకు నాద నీరాజనం అర్పించారు.

ఇంకా ఏఏ నాద బ్రహ్మలు ఏ దేవాలయంలో ఏఏ కృతులు రచించారో, అదే దేవాలయంలో కూర్చుని సామూహికంగా ఆలపించుకోవడం బృందమంతటికీ ఒక దివ్యమైన అనుభూతిని కలిగించింది. చార్ ధామ్ మధ్య మూడు రోజుల మినీ బస్‌లో ప్రయాణమంతా దివ్య సంకీర్తనలతో అంతా గాన సముద్రపు అలల మీద నావ ప్రయాణం లాగ సాగింది.

తిరువరూరులో శ్రీ శ్యామశాస్త్రి వారి నివాస స్థలం, కంచి కామకోటి పీఠం వారి ఆధ్వర్యంలో చక్కగా నిత్యపూజ, దీప ధూపాలతో నిర్వహణ జరుగుతోంది. అలాగే ముత్తుస్వామి దీక్షితార్ వారి సముదాయం ఒక ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. సంగీత సమారోహణాలకి నిలయమైంది. శ్రీ నారాయణ తీర్థుల వారి సమాధి ఒక దేవాలయమే. నిత్య కైంకర్యాలతో విరాజిల్లుతోంది. కొంత పునరుద్ధరణ కార్యక్రమం కూడా ఆ ట్రస్టు వారు సంకల్పించారు. త్వరలోనే చేపట్టనున్నారు. త్యాగరాజ జన్మస్థలం ఎవరో వ్యక్తులు కనుక్కొన్నారు. చాలా శిథిలావస్థలో ఉంది.

తిరువైయారులో శ్రీ త్యాగరాజస్వామి వారి నివాస స్థానం. పురాతన వైభవం చెక్కు చెదరకుండా ఆహ్లాదకరంగా, ఆధునికంగా చేసారు. అదే ట్రస్టువారు శ్రీ త్యాగరాజ స్వామి సమాధికి సమీపంలో ఒక కొత్త కల్యాణ మండపం, అతిథి గృహం నిర్మించి చాలా శ్రద్ధ, విధేయతలతో నిర్వహిస్తున్నట్టు ప్రత్యక్షంగా తెలుస్తోంది. అదే సముదాయంలో, శ్రీ త్యాగరాజు వారి 6వ తరం, వంశపారంపర్యులు శ్రీ ఎస్.త్యాగరాజ శర్మగారు నివశిస్తూ నిత్యాగ్ని హోత్రాదులతో పూజలు, గోసేవలు నిర్వహిస్తున్న ఒక భవనం, వారి వంశ పారంపర్య నివాస స్థానంగా ఉంది.

ప్రస్తుతం అక్కడున్న వసతి సమారాధన సమయంలో వచ్చిన సంగీత కళాకారులకు, సామాన్యులకు సరిపడదు. తగిన సదుపాయాలు నామకహా కూడా లేవు. ఈ సమాధి వ్యవహారాలు పర్యవేక్షణకు తమిళనాడు ప్రభుత్వం నియమించిన ఒక కమిటీ వుంది. ఒక యుగ పురుషుడు, ప్రపంచ వ్యాప్తంగా సంగీత భక్తి భావాలకు సృష్టికర్తయైన త్యాగబ్రహ్మ సంస్మరణకు, ఉత్సవ రూపంగా ఆయనకు నివాళులర్పించడానికి అక్కడి వసతులు నిరాశాజనకంగానే ఉన్నాయి. ఈ సంగీత చైతన్య, విజ్ఞాన, భక్తి, ముక్తి స్రవంతిలో మూడు రోజుల నీరాజనోత్సవాలు ఒక వంతు అయితే నూతన సంవత్సర శుభ సమయంలో ప్రఖ్యాత నాదస్వర విద్వాంసులు కళైమామని శ్రీ షేక్ మహబూబ్ సుభానీ వారి బృందం వారి సతీమణి శ్రీమతి కాళీషాహి మహబూబ్, వారి కుమార్తె, అల్లుడు, సమేతంగా రెండు గంటలకు పైగా తన్మయత్వంతో సాగించిన నాదస్వర గోష్ఠి త్యాగరాజ స్వామి వారికి నీరాజనంగా అర్పించిన ఘట్టం అందరినీ ముగ్ధులను చేసింది. నావంటి పామరుని కూడా భక్తిభావంతో పరవశింప చేసింది. ప్రత్యేక అనుభూతి కలిగించింది. అదేవిధంగా ఒక కూచిపూడి విద్యార్థుల బృందం వచ్చి శ్రీ త్యాగరాజునకు నాట్య పుష్పాంజలి కావించి, అందరి మనస్సులను దోచుకున్నారు.

- జి.ఆర్.ఎస్.రావు

మాన్విత ఆలయాలకు నెలవు. అయోధ్యలో కాలు మోపిన భక్తులంతా ముందుగా ఇక్కడ సరయూ నదిలో స్నానాదికాలు చేయడం సంప్రదాయం. 'స్వర్గ్‌ద్వార్'గా కీర్తికెక్కిన ఇక్కడే యాత్రికులు పిండప్రదానాలు చేస్తారు. సాక్షాత్తు శ్రీరాముడు అవతార సమాప్తిని చాలించిన పుణ్యప్రదేశంగా ఇది ఖ్యాతికెక్కింది. సరయూ నది ఒడ్డునే లక్ష్మణ మందిరం ఉంది. ఇక్కడ లక్ష్మణుడు కొలువుదీరాడు. దీనికి సమీపంలోనే నాగేశ్వరనాథ్ మందిరం ఉంది. శ్రీరాముని కుమారుడు 'కుశుడు' నిర్మించిన ఆలయంగా ఇది ఖ్యాతికెక్కింది. విక్రమాదిత్య కాలం నుంచీ చరిత్రకు నిదర్శనంగా మిగిలిన ఆలయం ఇదొక్కటేగా దీనిని చెబుతారు. నాగేశ్వర నాథ్ మందిరానికి సమీపంలో కాలేరామ్ మందిరం ఉంది. సరయూ నదిలో దొరికిన నల్లని సీతాలక్ష్మణ సహిత శ్రీరామచంద్రుని విగ్రహాలు ఇక్కడ ఈ ఆలయంలో ప్రతిష్ఠించారు. ఇక్కడకు సమీపంలోనే 'హనుమాన్ ఘడి' ఉంది. ఇక్కడ నవాబు షౌజుద్దౌలా నిర్మించిన రామచంద్రాలయం ఉంది. అయోధ్య నగరం నడిబొడ్డున ఉన్న ఈ మందిరానికి చేరుకోవడానికి 76 మెట్లున్నాయి. హనుమంతుడు ఇక్కడో గుహలో ఉండి రామజన్మ భూమిని రక్షించేవాడని ఇక్కడి స్థల పురాణం చెబుతోంది. ఇక్కడ అంజనీమాత ఒడిలో బాల అంజనేయుని మూర్తి దర్శనం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతుంది. దీనికి సమీపంలో 'కనకభవన్'ఉంది. కైకేయి మాత సీతామహాసాధ్వికి బహుమతిగా ఇచ్చిన పుణ్యస్థలం 'కనకభవన్'. బంగారు సింహాసనం ఉన్న ఈ భవనమే శ్రీరామచంద్రుని నివాస స్థలంగా చెబుతారు. బంగారు కిరీటాలు ధరించి రామలక్ష్మణ సీత విగ్రహాలు ఈ మందిరంలో దర్శనమిస్తాయి. విశాలమైన ఈ ఆలయ ప్రాంగణం నిత్యం భక్తజన సందోహంతో అలరారుతుంది. సదా శ్రీరామనామ స్మరణంతో ఇక్కడి పరిసరాలు మారుమ్రోగుతాయి. అయోధ్య నగరంలోనే మరోచోట చోటిదేవ్ కాళీమందిరం ఉంది. అతిపురాతనమైన ఈ మందిరంలో కొలువుదీరిన అమ్మవారిని సీతాదేవి ఆరాధించేదని ఇక్కడ స్థల పురాణాల ద్వారా అవగతమవుతోంది. వీటితో పాటు శ్రీరామజానకి బిర్లా ఆలయం, తులసి స్మారక భవన్, రామ్‌కిపౌరి, దతువన్‌కుండ్, జానకి మహల్, బ్రహ్మకుండ్, లక్ష్మణ్‌కిలా, రామ్‌కథా, మ్యూజియం, వాల్మీకి రామాయణ మ్యూజియం, సుందర సదన్, హరిహర మందిరం, తులసీదాసు మందిరం, క్షీరేశ్వరుని మందిరాలున్నాయి. ఇవన్నీ చూడదగినవి. పుణ్యప్రదమైనవి. అయోధ్యలో అత్యంత పుణ్యప్రదేశం రామజన్మభూమి ప్రాంతం. ఈ ప్రాంతంలో 1528లో బాబరు మసీదు నిర్మించాడని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. అయితే బాబరు మసీదు కూల్చివేత అనంతరం ఆ ప్రదేశంలో శ్రీరాముని మూర్తిని ఉంచి పూజిస్తున్నారు. మన పురాణాలలో విశిష్టమైన పవిత్ర క్షేత్రంగా ఖ్యాతికెక్కిన అయోధ్య నగరం సప్తమోక్ష పురాలలో ఒకటి. ముక్తిక్షేత్రంగా, స్వర్గ్‌ధామ్‌గా పేర్గాంచిన ఈ నగరంలోకి అడుగిడినంత మాత్రానే సమస్త పాపాలు పోతాయని ఇక్కడి స్థల పురాణాల ద్వారా అవగతమవుతోంది. వాల్మీకి మహర్షి రాసిన రామాయణ మహాకావ్యానికి వేదికగా నిలిచిన అయోధ్య నగరం చేరుకోవడం చాలా సులువు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు 134 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ నగరానికి సమీపంలో ఉన్న ఫైజాబాద్‌లో విమానాశ్రయం కూడా ఉంది. అలహాబాద్‌కు 166 కిలోమీటర్లు, గోరక్‌పూర్‌కు 132 కిలోమీటర్లు, వారణాసికి 209 కిలోమీటర్ల దూరంలోఉన్న అయోధ్యను సులువుగా చేరుకోవచ్చు. అయోధ్య చిన్న నగరమే అయినప్పటికీ కావల్సిన అనేక వసతులున్నాయి. అయోధ్య నగరంలో మాంసాహారం నిషిద్ధం. సరయూ నదిలో స్నానం చేసి అయోధ్య పుణ్యస్థలిలో ఉన్న మహిమాన్విత దేవాలయాలను సందర్శించడం పూర్వజన్మల పుణ్యఫలం. ప్రాప్తం ఉన్న వారికే ఆ పుణ్యఫలాలు దక్కుతాయని పురాణాల ద్వారా అవగతమవుతోంది. ఆ శ్రీరాముని అపార కరుణామృతం అందరిమీదా వెల్లివిరియాలని ఆకాంక్షిద్దాం.

-దాసరి దుర్గాప్రసాద్

సెల్: 8977676085

సాక్షాత్తు విష్ణుభగవానుడి అవతారంగా చెప్పబడ్తున్న శ్రీరామచంద్రుని పుట్టిన స్థలంగా అయోధ్యను హిందూవులు విశ్వసిస్తారు. ఇక్కడి నేల పవిత్రం... గాలి పవిత్రం... పరిసరాలు పవిత్రం. అందుకే అయోధ్యను సప్తమోక్ష పురాలలో ఒకటిగా మన పురాణాలు చెప్పాయి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఫైజాబాద్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలోఉన్న అయోధ్య విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ, మహిమ రీత్యా ప్రఖ్యాతి చెందిన నగరం. అలహాబాద్‌కు 166 కిలోమీటర్లు, గోరక్‌పూర్‌కు 132 కిలోమీటర్లు, వారణాసికి 209 కిలోమీటర్ల దూరంలో ఉన్న అయోధ్యను సులువుగా చేరుకోవచ్చు. అయోధ్య చిన్న నగరమే అయినప్పటికీ ఇక్కడ భక్తులకు కావల్సిన అనేక వసతులున్నాయి. అయోధ్య నగర ప్రాంతంలో మాంసాహారం నిషిద్ధం.

దక్షిణ భారత సంగీత సంగమం

దక్షిణ భారతమంటేనే దైవత్వానికి, కర్ణాటక సంగీతానికి అరుదైన అవినాభావ సంబంధం. అనేక పుణ్య తీర్థములు, ఆకాశాన్నంటే గుడి గోపురాలు, దైవాంశ సంభూతులైన వాగ్గేయకారులు, దైవత్వాన్ని సాక్షాత్కరింప చేసిన విద్వాంసులు, అదేవిధంగా సామాన్య మానవులకు కూడా దైవ సన్నిధికి మార్గం చూపి, ముగ్ధులను చేసే గురువులు, ఎందరో మహానుభావులు- ఇవన్నీ కలిస్తే ఒక దివ్యానుభూతిని కలిగించే సంగమం. దైవత్వాన్ని సాక్షాత్కరింపచేసిన సంగీతంతో భక్తి ముక్తి మార్గాలలో నడిపించే గురువులు- ఇవన్నీ అనుసంధానం చేయగలిగిన సంగమాలు ఎన్నో, ఎన్నెన్నో భారదేశమంతటా.

అటువంటి అద్భుతమైన దివ్యానుభూతిని సాక్షాత్కరింపచేసే సంగమాలలో తంజావూరు ఒకటి. పెన్నారు, వెట్టారు, అడయార్, జలసుధ మరియు కావేరీ పంచ నదుల సంగమ ప్రదేశం తిరువైయారు క్షేత్రంలో శ్రీ పంచ నదీశ్వర స్వామి, శ్రీ ధర్మాంబిక వెలసిన దేవాలయాలు, బృహదీశ్వర స్వామి మరియు బంగారు కామాక్షి వెలసిన తంజావూరు, శ్రీ కలమలాంబిక, శ్రీ త్యాగరాజేశ్వర ఆలయాల దివ్యధామం తిరువరూరు; శ్రీ రంగనాధస్వామి మరియు జలలింగ రూపంలో ఆవిర్భవించిన శ్రీ జంబుకేశ్వర స్వామి దేవాలయాల ధామం శ్రీ రంగం-ఈ నాలుగు ధామాల్ని దక్షిణ భారత 'చార్‌ధామ్'గా పరిగణిస్తే, ఈ చార్ ధామ్ సామాన్య మానవులకు చేయూతనిచ్చి, సంగీత, భక్తి, జ్ఞాన మార్గంలో తన్మయత్వం చేసి ముక్తిని ప్రసాదించే నాలుగు యోగుల కలయికతో ఈ ప్రదేశం ముక్తిధామ్‌గా మారింది.

1. తిరువైయారు: పంచ నదీశ్వర స్వామి దేవాలయం, ధర్మాంబిక దేవాలయం, త్యాగరాజ నివాస గృహం, త్యాగరాజ సమాధి. **2. తంజావూరు:** బృహదీశ్వర ఆలయం, బంగారు కామాక్షి దేవాలయం, శ్రీ నారాయణ తీర్థుల సమాధి, తిరుప్పతుందూర్‌లో. **3. తిరువరూరు:** శ్రీ త్యాగరాజేశ్వర దేవాలయం, కమలాంబిక దేవాలయం, త్యాగరాజ, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్‌ల నివాస గృహములు. **4. శ్రీ రంగం:** రంగనాథ స్వామి, జంబుకేశ్వర (జలలింగం) దేవాలయాలు.

గురుబ్రహ్మ... అన్నట్లు సాక్షాత్కరింపచేసిన పరమ యోగులు, త్రిమూర్తులు, శ్రీ శ్యామ శాస్త్రి (1763-1827), శ్రీ త్యాగరాజస్వామి (1767-1847), శ్రీ ముత్తు స్వామి దీక్షితార్ (1775-1835), సమకాలీనులైతే క్రీస్తు పూర్వం (1675-1745) నివసించి తరించిన శ్రీ (అశ్రా) నారాయణ తీర్థుల సంగీత వారసత్వంతో ఈ ప్రదేశాన్ని 'ముక్తిధామ్' అని కూడా అనాలి.

ఈ నాలుగు దివ్య ధామాలు శ్రీ శ్యామశాస్త్రి, శ్రీ త్యాగరాజస్వామి, శ్రీ ముత్తు స్వామి దీక్షితార్ నివసించి తరించిన తిరువరూర్ అయితే, తంజావూరు రైల్వే స్టేషనుకు సమీపంలో శ్రీ నారాయణ తీర్థులు నివశించి తరించిన సమాధి స్థానం, తిరుప్పతుందూర్. అదేవిధంగా శ్రీ త్యాగరాజస్వామి నివాస గృహం, ఉంఛ వృత్తితో జీవించి, పరమ పదించిన ప్రదేశం తిరువైయారు, కావేరి నదీ గట్టునే వున్న వారి సమాధి.

ఈ దివ్య ప్రదేశం, దక్షిణ భారతదేశంలో దైవాలయాలకు, నదులకు సంగీతానికి సంగమం. ఈ సంగమము చెన్నైకి దరిదాపు 200 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ దివ్య ధామాలు నాలుగూ ఒక దానికొకటి దరిదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

ఈ 'చార్‌ధామ్' కర్ణాటక సంగీత దివ్య సంగమం దర్శించిన దివ్యానుభూతిని పొందుటకు ఒక 30 మందితో కూడిన మా భక్త బృందం, నూతన (2013) సంవత్సరాదిలో (డిసెంబర్ 31-జనవరి 3వ తేదీలలో) క్షేత్ర దర్శనం చేసుకున్నాం. 'సంగీత ప్రచార సేవక రత్న' బిరుదును సార్థక్యం చేసుకున్న గురువు కె.ఎస్.ఆర్.బాలకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో ఈ దివ్య క్షేత్ర దర్శనం సార్థక్యమైంది. దివ్యానుభూతిని అక్షరాలలో వివరించడం కష్టం అయినా, అది పదిమందితో పంచుకోవడం కూడా ఒక అనుభూతే. ఇప్పటిదాకా దర్శించని సంగీతాభిమానులకు ఒక ప్రేరణ కూడా.

పంచ నదీశ్వర స్వామి మరియు శ్రీ ధర్మాంబిక వెలసిన దేవాలయాలు, త్యాగరాజస్వామి నివసించి, శ్రీ సీతారామ లక్ష్మణ హనుమానులను సాక్షాత్కరింప చేసుకున్న తిరువైయారులో వారి సమాధికి దగ్గరగా నూతన అతిథి గృహంలో మా బృందం నివసించి, తరించింది. శ్రీ త్యాగ బ్రహ్మ వారసుల ఆతిథ్యంతో ఒక విధమైన సాన్నిహిత్యాన్ని కూడ రుచించాము. ప్రతి రోజు శ్రీ త్యాగరాజస్వామి సమాధి దగ్గర పూజలు, దివ్య సంకీర్తనార్చన కావించి రోజుకి రెండు ప్రదేశాలలో రెండు మినీ బస్‌లలో దివ్య దర్శన పరిక్రమలు చేసాం.

త్యాగబ్రహ్మ 96 కోట్ల రామనామ జపం చేసి, శ్రీ నారద మహా ముని రచించిన స్వరార్ణవాన్ని అందుకున్న శ్రీ పంచనదీశ్వర, శ్రీ ధర్మాంబిక దైవాలయ సమూహం దర్శించినపుడు మా బృందం అంతా పరవశించి అర్పించినది సంగీత నీరాజనమే; తన్మయత్వంతో పాడిన వివిధ వర్ణాల కృతుల పూల హారమే. నాదాత్మనమనిశం; ఏహి శ్రీ జగదీశ; శంభో మాంపాహి; శివ శివ శివ శంభో.

తంజావూరులో శ్రీ బృహదీశ్వరాలయం, బంగారు కామాక్షి ఆలయం దర్శించినపుడు శ్రీ శ్యామశాస్త్రి రచించిన సరోజ దళనేత్రీ, శ్రీ ముత్తుస్వామి భాగవతార్ విరచిత హిమగిరి తనయే హేమలతే, శ్రీ ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కామాక్షీదేవి పాహిమాం, శ్రీ రాజ రాజేశ్వరి; శ్రీ ధర్మపురి సుబ్రహ్మణ్య శాస్త్రి రచించి గానం చేసిన కమలాంబ నా చింత దీర్చవమ్మా అనే పంచ వర్ణాల పుష్పాంజలి అర్పించాము.

తిరుపత్తుందూర్‌లో శ్రీ నారాయణ తీర్థుల వారి సమాధి ఆలయంలో ప్రవేశించగానే మా బృందం

సర్వులనూ కాపాడే తల్లివి నీవే

ఈ వారం బార్హతం శతకంలోని రెండవదైన భుజగశిశుభృతా స్తుబకములోని శ్లోకాలనుచూద్దాం.

1. మరుదధిప మనోనాథా మధుకర చికురాస్మాకం।
వృజిన విధుతి మాధత్తాం విశద హసిత లేశేన॥
తుమ్మెదల్లాంటి ముంగురులున్న ఇంద్రాణీదేవి తన నిర్మలమైన చిరునవ్వుతో మా పాపాలను నాశనం చేయుగాక!

2. అఖిల నిగమ సిద్ధాంతో బహు మునివర బుద్ధాంతః।
సుర పరిబృఢ శుద్ధాంతో భరత వసుమతీ మవ్యాత్॥
అన్ని వేదాలూ పొగిడినదీ, అనేక మునులు తెలుసుకున్న అంతం కలదీ అయిన ఇంద్రుడి అంతఃపుర స్త్రీయైన ఇంద్రాణీదేవి ఈ భారత భూమిని

రక్షించుగాక!

3. భగవతి భవతీ చేతో రతి కృదభవ దింద్రస్య।
సతవ జనని సంతాన ద్రుమవన మతి రమ్యం వా॥
అమ్మా! నీవు ఇంద్రుడి మనస్సుకు హాయిని కూర్చేదానివి. నీ మనస్సుకు హాయినిచ్చే వాడు ఇంద్రుడు. రమ్యమైన కల్పక వనమే మీ ఇద్దరికీ హాయినిచ్చేదిగా అయింది.

4. పతి రఖిల యువశ్రేష్ఠః కిమపి యువతి రత్నం త్వం।
వనివిహృతిషు వాంచేతో హరణ మభవ దన్యోన్యం॥
యువకులందరిలోకీ శ్రేష్ఠుడు నీ పతి. నీవో యువతీ రత్నానివి. వన విహారాల్లో మీ అన్యోన్యత మీ ఇద్దరి మనస్సులూ ఒకదానితో మరొకటి హరింపజేస్తున్నది.

5. మధుర లలిత గంభీరై స్తవ హృదయ ముపన్యాసైః।
వనవిహరణ లీలయా మహరదయి దివో రాజా॥
6. కలవచన విలాసేన ప్రగుణ ముఖ వికాసేన।
భువనపతి మనో హార్షీ ర్జనని వన విహారే త్వం॥
7. కనక కమల కాంతాస్యా ధవళ కిరణ వక్త్రేణ॥
అసిత జలజ పత్రాక్షీ సిత నళిన దళాక్షేణ॥
8. అళిచయ నిజధమ్మిల్లా నవజలధర కేశేన।
మృదులతమ భుజావల్లీ ధృఢ తమ భుజదండేన॥
9. అమృత నిలయ బింబోష్ఠీ రుచిర ధవళ దంతేన।
అతి ముకుర లసద్గండా వికచ జలజ హస్తేన॥
10. యువతి రతితరాం రమ్యా సులలిత వపుషాయానా।
భగవతి శచి యుక్తాత్వం త్రిభువన విభునేంద్రేణ॥
అమ్మా! అలా వన విహారం చేసేటపుడు ఇంద్రుడు తన మధురమైన, లలితమైన, గంభీరమైన మాటలతో నీ హృదయాన్ని ఆకర్షించాడు. నీవు నీ చక్కని మాటకారితనంతో, అంతకుమించిన గుణాలు కలిగిన ముఖ విలాసంతో ఆ ఇంద్రుని మనస్సును ఆకర్షించావు. నీవు బంగారంతో తయారైన పద్మంలాగా సొగసైన ముఖాన్నీ, నల్ల కలువ రేకుల్లాటి కళ్లనూ కలిగి ఉంటే, ఆ ఇంద్రుడు తెల్లని కాంతులీనే ముఖాన్నీ, తమ్మి రేకుల వంటి కళ్లనీ కలిగి ఉన్నాడు. నీవు తుమ్మెదల గుంపులా కనిపించే జడ కొప్పునూ అతి మృదువైన భుజాలనూ కలిగి ఉంటే, ఇంద్రుడు వర్షాకాలంలో మేఘంలాటి జుట్టునూ అతి దృఢమైన భుజ దండాలనూ కలిగి ఉన్నాడు. నీవు అమృతానికి నిలయమైన దొండపండ్లను తలపించే పెదాలనూ, అద్దాలను మించి ప్రకాశించే చెక్కిళ్లనూ కలిగిఉన్నావు. మెరిసే దంతాలతో వికసించిన పద్మంలాటి చేతులున్నవాడు ఇంద్రుడు. అత్యంత సుందరమైన యువతివై నీవు అత్యంత సుందరుడైన యువకునిలాగా ఉండే త్రిభువనాలకూ పతియైన ఇంద్రునితో కలిసి ఉన్నావు.

11. వికచ కుసుమ మందార ద్రుమ వన వరవాటీషు।
విహరణ మయి కుర్వాణా మనసిజ మనుగృహ్ణాసి॥
12. తవ శచి చికు రేరాజ త్కుసుమ మమర వృక్షస్య।
నవ సలిల భృతో మధ్యే స్ఫురదివ నవ నక్షత్రం॥
13. అభజత తరు రౌదార్యం విభవమపి మహాంతం సః।
వికచ కుసుమ సంపత్యా భగవతి భజతే యస్త్వాం॥
తల్లీ, వికసించిన పూలున్న మందారపు వనంలో విహరిస్తూ నీవు ఆ మన్మథుని అనుగ్రహిస్తూ ఉన్నావు. నీ ముంగురులలో ప్రకాశించే కల్పక పుష్పం (కల్ప వృక్షానికి పూసే పూవు) కొత్త మేఘాల మధ్య ఉండి ప్రకాశించే కొత్త నక్షత్రంలాగా మెరుస్తూ శోభిస్తూ ఉంది. ఏ కల్ప వృక్షమైతే వికసించిన పూలతో నిన్ను పూజిస్తూ ఉందో, ఆ చెట్టు తన ఔదార్యాన్నీ, ఐశ్వర్యాన్నీ నీ వల్లనే పొందుతూ ఉంది.

దేవుళ్లకు పేర్లెవరు పెట్టారు?

★ దేవుళ్ళు ఎంతమంది? వాళ్ళకు ఆయా పేర్లను పెట్టినవారు ఎవరు? అలాగే భూమిమీద గల జంతువులకు, చెట్లకు, క్రిమికీటకాదులకు ఆయా పేర్లు పెట్టినవారు ఎవరు? -యంత్రపాటి కృష్ణమూర్తి

దేవుడు నిజానికి ఒక్కడే. ''ఏకో దేవః కేశవో వా- శివో వా'' అనే సూక్తి ఈ విషయాన్నే నిర్వచిస్తోంది. ఆ దేవుడే ఇతర దేవతలను, లోకాలను, పశుపక్ష్యాదులను, ఆయా భాషలను, సృష్టిచేసి, ఆయా పేర్లను కూడా ఆయనే ఆయా రూపాలకు ఆయా పేర్లను ఖరారుచేశాడు. ఈ విషయాలను తర్కమీమాంసాది శాస్త్రాలలో బాగా చర్చించారు.

★ శివాది దేవతలందరికీ సంతానమున్నట్లే శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సంతానము కలదా?!

- చెట్లపల్ల నరసింహారావు, విజయవాడ

మానవుల జీవితాలకు సన్నిహితంగా ఉన్నట్లు కనిపించేందుకోసం దేవతలకు కూడా సాంసారిక జీవితం పురాణాలలో వర్ణింపబడింది. కానీ, ఎక్కడికక్కడ సంకేతమయంగా వర్ణింపబడింది. ఆ సంకేతాలు కాలక్రమంలో మరుగున పడిపోయి, కథలు మాత్రము మిగిలిపోయాయి. సంకేతాల మీద ఎక్కువ దృష్టిపెట్టి ఆలోచిస్తే, ఇలాంటి సందేహాలు తగ్గుతాయి. శ్రీ వేంకటేశ్వరస్వామివారి విషయంలో ఆ కథ మరీ సంక్లిష్టం. ఆ కథలో లక్ష్మీ విష్ణువులు దేవతలుగా ఆకాశంనుంచి కిందికి దిగి, మానవులుగా మారి, మళ్ళీ దేవతావిగ్రహాలుగా పరిణామం చెందారు. అందువల్ల ఆ స్వామిగాథను మనుష్యగాథగా కాకుండా, దేవతా గాథగా స్వీకరిస్తే వారి భక్తులే వారి సంతానం- అని అర్థమౌతుంది.

తిరుమలలో భక్తులు దైవదర్శనమునకు వెళ్ళి తల నీలాలు ఇచ్చుట ఎప్పటినుండి మొదలైంది?

- ఐశ్వర్య, చెన్నయి

వేంకటేశ్వరస్వామి కలియుగ దైవం. కలియుగానికి ఉన్న ప్రధాన లక్షణాలలో మానవులు తమ కేశాలకు ప్రాధాన్యమిచ్చి, వాటిని అలంకారాలుగా భావిస్తారని పురాణాలలో అనేకచోట్ల వుంది. మానవుల హృదయాలలోంచి, కలియుగ బీజాలను తొలగించటం కోసమే స్వామి భక్తుల తలనీలాలను తనకు కానుకగా సమర్పించే విధానాన్ని యేర్పాటు చేశాడు. ఐతే, ఈనాటి మానవులు ఈ అంతరార్థాన్ని అంతగా పట్టించుకోకుండా, కేవలం మొక్కుబడిగా తలనీలాలు ఇచ్చి వస్తున్నారు.

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :
కుప్పా వేంకట కృష్ణమూర్తి
ఇంటి నెం. 11-13-279, రోడ్ నెం. 8,
అలకాపురి, హైదరాబాద్-500 035.

ఆరోగ్యం

★ విటమిన్-సి పుష్కలంగా లభించే ఉసిరికాయలను విరివిగా వాడితే జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది. యాంటీ బాక్టీరియల్‌గా పనిచేసే ఉసిరి వల్ల చర్మం, శిరోజాలు నిగారింపును సంతరించుకుంటాయి.

★ చలికాలంలో విరివిగా దొరికే బత్తాయి పళ్లను తరచూ వాడితే శరీరానికి విటమిన్-సి నమృద్ధిగా లభిస్తుంది. చర్మ సంబంధిత సమస్యలు, జలుబు వంటివి దూరమవుతాయి. వొంటికి చలవ చేసే గుణం బత్తాయిలో ఉంది.

★ శీతాకాలంలో బెల్లం తింటే శరీరానికి అవసరమైన వేడి లభిస్తుంది. రక్త ప్రసరణ, జీర్ణశక్తిని పెంచేందుకు బెల్లంలోని మెగ్నీషియం, మినరల్స్, పొటాషియం, ఫాస్పరస్, ప్రొటీన్లు దోహదం చేస్తాయి. బెల్లాన్ని నేరుగా తినడానికి పిల్లలు ఇష్టపడకపోతే హల్వా వంటి స్వీట్లు తయారు చేసి తినిపించవచ్చు.

★ చలికాలంలో తరచూ నిమ్మ టీని తాగితే మంచి ఫలితం ఉంటుంది. నిమ్మలోని విటమిన్-సి వల్ల శరీరానికి ఉత్తేజం కలుగుతుంది. సలాడ్లలో కాస్త నిమ్మరసం కలుపుకుని తీసుకున్నా మంచిదే.

★ దగ్గు, కఫం నుంచి ఉపశమనం పొందాలంటే అల్లం టీని తరచూ తాగాలి. టీలో కాస్త శొంఠి పొడి వేసుకుని తాగినా జీర్ణశక్తి పుంజుకుంటుంది.

★ టమాటా సూప్ చర్మ సంరక్షణకు దోహదం చేస్తుంది. ఈ సూప్‌లో కాస్త వెన్న, మిరియాల పొడి వేసి పిల్లల చేత తాగిస్తే జీర్ణశక్తి పెరుగుతుంది. దగ్గు వంటి సమస్యలు దూరం అవుతాయి.

ఇంట్లో రత్నాల ముగ్గులు



తెలుగువారి ముగ్గుల పండగ- సంక్రాంతి సందడి ఇటీవలే ముగిసింది. మళ్లీ అలా ముగ్గులు వేయాలంటే ఏడాది వరకూ ఆగాలా? ముగ్గులు సంక్రాతికే వేయాలని రూలేమీ లేదుగా..! రోజూ ఇంటి వాకిలి ముందు భాగం ఖాళీగా ఉండకూడదని మహిళలు ఏదో ఒక ముగ్గ వేసేస్తుంటారు. అప్పుడప్పుడు వేరే పండగ రోజులలో, ప్రత్యేక సందర్భాలలో కొంచెం పెద్ద ముగ్గులు వేయాలనుకుంటాం. నిజానికి ముగ్గుల అందమంతా సంక్రాంతి రోజులలోనే ఉంటుంది. ఆ నెల రోజులు కాకున్నా కనీసం సంక్రాంతి పండగరోజైనా అందమైన ముగ్గ వేసి రంగులతో నింపుతారు మగువలు. ఈ ఓపిక, శ్రద్ధ మళ్లీ రాదు. కానీ, ఈ మాట తప్పు అని చెప్పుకోవచ్చు. రంగు రంగుల అందమైన ముగ్గులు సంక్రాంతికే కాదు ఏ పండగకైనా, పబ్బానికైనా, పార్టీ ఐనా వేసుకోవచ్చు. అది కూడా ఇంటిముందు వాకిట్లోనే కాదు, ఇంట్లోకూడా అలంకరణగా అందమైన ముగ్గులు వేసుకోవచ్చు. మరి దాని సంగతేంటో చూద్దాం.

ఈ కొత్తరకం ముగ్గులు మనం ఎప్పుడూ వేసే ముగ్గుపొడి లేదా చాక్‌పీస్‌తో వేసేది కాదు. ఇది ఇవాళ పెట్టి రేపు తుడిచేసేది కాదు. అలాగని శాశ్వతంగా ఉండేది కాదు. ఈ ముగ్గులను ఇంట్లో కానీ ఆఫీసు గదులలో కానీ మనకు కావలసిన చోట పెట్టుకుని తర్వాత తీసేయొచ్చు. ఎలా కావాలంటే అలా అమర్చుకోవచ్చు. పైగా ఈ ముగ్గులు ఎంత అందంగా ఉంటాయంటే చీరల మీద పూసలు, రాళ్లతో ఎంబ్రాయడరీ చేసినట్టుగా మెరిసిపోతూ అందాలొలికిస్తూ ఉంటాయి. ఇవేం కొత్త ముగ్గులు అనుకుంటున్నారా? ఇవే ఇప్పుడు విరివిగా ప్రాచుర్యంలో ఉన్న కుందన్ రంగోలీ రకం ముగ్గులు. వీటిని మామూలు ముగ్గుల డిజైన్లలోనే వేసుకోవచ్చు. కానీ చుక్కలు అవసరం లేదు. సృజనాత్మకత, ఓపిక తోడైతే ఎన్నో డిజైన్లను సృష్టించవచ్చు. వీటిని మనకు కావలసినచోటపెట్టి తర్వాత తీసేయడానికి వీలుగా తయారు చేయడం జరుగుతుంది. వీటిని ఫ్లోటింగ్ లేదా తేలియాడే ముగ్గులుగా కూడా ఉపయోగించుకోవచ్చు. శుభకార్యం ముగిసిన తర్వాత వాటిని భద్రంగా కవర్లో పెట్టి దాచిపెట్టవచ్చును. మళ్లీ అవసరమైనప్పుడు బయటకు తీసుకుంటే సరిపోతుంది. అంటే ఒకసారి చేసి పెట్టుకుంటే ఎన్నోసార్లు ఉపయోగించుకోవచ్చునన్నమాట.

కావలసిన వస్తువులు

కొంచెం మందంగా ఉండే కార్డ్‌బోర్డ్ ముక్కలు, మందంగా ఉండే పారదర్శకమైన ప్లాస్టిక్ షీట్లు, అంటించడానికి గ్లూ, వేర్వేరు సైజులు, షేపులతో, రంగు రంగుల చమ్కీలు, సీక్వెన్స్, ముత్యాలు, జరీ దారాలు, గ్లిట్టర్ పెయింట్, కత్తెర వంటివి సిద్ధం చేసుకోవాలి. ముందుగా మనకు నచ్చిన ముగ్గు డిజైన్‌ని ఎంపిక చేసుకుని దాన్ని కార్డ్‌బోర్డ్ కానీ ప్లాస్టిక్ షీట్ మీద కానీ గీసుకుని జాగ్రత్తగా కట్ చేసుకోవాలి. ఈ ముగ్గులను మొత్తం ఒకే షీట్ మీద చేయొచ్చు లేదా విడివిడిగా కూడా చేసుకోవచ్చు. షీటు మీద పెన్సిల్‌తో డిజైన్ వేసుకుని దాని కనుగుణంగా సీక్వెన్స్ అతికించాలి. గ్లూ పెట్టడం వల్ల అవి ఊడిపోకుండా ఉంటాయి. ఇందులో మీరు గుండ్రటివి కానీ, కోలగా ఉన్నవి కానీ రంగులు మారుస్తూ అందమైన డిజైన్లు సృష్టించవచ్చు. మధ్యలో చిన్న చిన్న అద్దాలు పెట్టి అంచుల మీద ముత్యాలు లేదా పూసలు పెట్టవచ్చు. అన్నీ గ్లూతో అంటించాలి. ఇలా కొద్దికొద్దిగా చేసుకుంటూ పోవాలి. తొందరపడితే డిజైన్ చెడిపోతుంది. ఇలా

అన్నింటినీ అతికించిన తర్వాత జాగ్రత్తగా పక్కన పెట్టి ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత కావాలంటే ప్లాస్టిక్ షీట్లమీద వేసిన ముగ్గు మీద సీక్వెన్స్ పూసల మధ్య గ్లాస్ వాటర్ కలర్ వేయొచ్చు. వెడల్పాటి అందమైన ఇత్తడి లేదా బ్లాక్ మెటల్ గిన్నెలలో నీళ్లు పోసి పూలు అమర్చి ఈ ముగ్గుల షీట్లను పెట్టవచ్చు. దానిపైన ఫ్లోటిన్ కాండిల్ పెడితే అందంగా ఉంటుంది. ఇవే ఫ్లోటింగ్ (తేలియాడే) ముగ్గులు. కార్డ్‌బోర్డ్ షీట్లు కట్ చేసుకున్న తర్వాత వాటికి నెట్ లేదా జరీ బట్టను ముడతలు లేకుండా అతికించాలి. చార్ట్ పేపర్ కానీ వేరే డిజైన్ పేపర్ ఏదైనా మొత్తం అతికించాలి. దానిపైన డిజైన్ వేసుకుని సీక్వెన్స్, పూసలు రాళ్లు అతికించాలి. అన్నీ తయారు చేసుకుని ఆరనివ్వాలి. అవసరమైనప్పుడు అందంగా అమర్చుకోవాలి. ఒక సెట్టు తయారుచేసుకుంటే వాటినే నాలుగైదురకాలుగా, కొత్త కొత్త డిజైన్లలో అమర్చవచ్చు. ఈ ముగ్గుల షీట్లను జరీ లేసులు, గ్లిట్టర్ పెయింట్‌తో కూడా మరిన్ని మెరుగులు దిద్దొచ్చు. మన అభిరుచి, సృజనాత్మకత మీద అంతా ఆధారపడి ఉంటుంది.

శుభకార్యాలప్పుడు ఇంట్లోనే ఓ మూలన కానీ, మధ్యలో కానీ, టేబుల్ మీద కానీ ఈ ముగ్గుల షీట్లను పెట్టి పూలతో మరింత అందంగా చేయొచ్చు. ఈ కుందన్ రంగోలీ రకాలు మార్కెట్లో విరివిగా దొరుకుతున్నాయి కూడా. వంద రూపాయల నుండి ఎన్నో డిజైన్లలో ఈ ముగ్గులు అమ్ముతున్నారు. అందమైన ముగ్గులు, పువ్వులు, మామిడి పిందెలు, నెమళ్ళ ఆకారంలో కూడా ఈ డిజైన్లు తయారుచేసుకోవచ్చు. మధ్యలో పెద్ద ముగ్గ వేసుకుని దానికి తోడుగా చిన్న చిన్న పువ్వులు లేదా డిజైన్లలో షీట్లు చేసుకుని అమర్చుకోవచ్చు. లేదా చిన్న చిన్న ముక్కల నిన్నింటితో బార్డర్‌లా అమర్చుకోవచ్చు. ఇంట్లో పార్టీ జరిగినప్పుడు ఓ మూలన ఈ ముగ్గు పెట్టి మధ్యలో చిన్న దీపం వెలిగించి పెడితే ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది.

- ప్రవల్లిక

రోదసిలో ఇరాన్ వానరం!

రోదసిలోకి మనిషిని పంపాలన్న తహతహ ఇరాన్ దేశానికి కూడా కొంతకాలంగా వుంది. భూ పరిభ్రమణ పరిధిలోకి- మనిషితో రోదసి శకటాన్ని పంపించి- తిరిగి భూమ్మీదికి దింపుకోవాలన్న ఈ పరిశోధనా పథకంలో భాగంగా- ఆ దేశం ఎలుకల్ని, పిల్లుల్నీ, తాబేళ్లనీ రోదసిలోకి పంపి ప్రయోగాలు చేసింది. కానీ- గుంభనంగా చేసింది. 2020 నాటికి ఏది ఏమైనా- ఇరానీయుడు- రోదసి యాత్ర చేసి తీరాలి- అన్నదే ధ్యేయం అంటున్నారు.

ఓ వానరానికి - అంతరిక్షయానం చేసేందుకు తర్ఫీదునిచ్చి- దాన్ని పిల్లల కారులాంటి చిన్న బొమ్మ కారులో పెట్టి అంతరిక్షంలోకి పంపారు. ఈ రోదసీ శకటం భూమికి 120 కిలోమీటర్ల ఎత్తున- కక్ష్యలో ప్రవేశించి భూమి చుట్టూ- రోదసీ ప్రదక్షిణాలు చేసి- తిరిగి వచ్చేసింది కూడా! ఈ సంగతిని గత నెల అంటే- జనవరి 29న ఇరాన్ ప్రకటించింది. అంతకుముందు రోజు 28న ఇరాన్ మర్కటం భూమ్మీదికి సురక్షితంగా దిగింది. ఇది నిజమా? కాదా? అన్న సంగతిని - అమెరికా ఇంకా నిర్ధారణ చేసుకోలేదుట!

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

అమెరికాలో దీపావళి తపాలా బిళ్ల!

అమెరికా ప్రభుత్వం ఇతర మతాల పండుగలకి, క్రైస్తవ మత పర్వదినం క్రిస్‌మస్‌కి- స్టాంపులు విడుదల చేసింది. మహమ్మదీయుల 'ఈద్'కీ, యూదుల హనూఖా పండుగకీ పోస్టల్ స్టాంపులు విడుదలయ్యాయి. అలాగే దీపావళి సందర్భంగా కూడా 'స్టాంపు' విడుదల చెయ్యాలని ప్రతినిధుల సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులు అసెంబ్లీలో ఈ ముసాయిదా బిల్లుని పెడుతూ- చెడు మీద మంచి విజయాన్ని సూచిస్తూ- మహోత్సాహంగా సాగే దీపావళి పండుగన అమెరికాలో కూడా - ఏటా- కోలాహలంగా - ఉత్సాహంగా జరుపుకుంటారని భారతీయ సంతతికి చెందిన సభ్యురాలు- ఇండో అమెరికన్- అమీ బెరా కరోలినా బిములోనీ, గ్రేస్ వెల్లింగ్‌లు వాదించారు. దీపావళిని హిందువుల పండుగానే గాక ప్రపంచ పండుగగా గుర్తించి- తపాలా బిళ్ల వేయాలన్న ప్రతిపాదన చట్టం అయితే- త్వరలో మనవాళ్ళు- మనకి దీపావళికి యు.ఎస్. పోస్టల్ స్టాంపులు వేసిన కవర్‌లలో శుభకాంక్షలు పంపడం ఖాయం.

అమెరికన్ ఇండియన్ దీపావళికీ జై!

veeraji@sify.com

సాయం చేస్తే తప్పు పట్టొద్దు

"దొడ్లో ఏం చేస్తున్నావురా?" అరిచింది అనసూయమ్మ మనవడిని.

"అరిటాకులు కోస్తున్నాను, వాణీ ఆంటీ అడిగారు" అన్నాడు.

"అన్ని చెట్ల ఆకులు కోసేశారు. మిగిలిన ఆకులు చిరిగిపోయి వున్నాయి. ఇక గెలవేసిన చెట్టుకే కొయ్యాలి. ఆకులన్నీ కోస్తే గెల అందరికీ కనబడి దిష్టి తగులుతుంది. గెల పెరగాలన్నా.. దానిని ఎవ్వరూ చూడకుండా బాగా ఎదగాలన్నా ఆకులతో కప్పి వుండాలిరా. మంచి ఆకులు లేవని ఆంటీతో చెప్పు" అన్నాను.

"ఆవిడ ఏమన్నా అనుకుంటుందేమో మామ్మా.. వాళ్ళింట్లో నిమ్మకాయలు ఎప్పుడు కావాలంటే అప్పుడు కోసుకెళ్ళు అని వాచస్పతి అంకుల్ చెప్పేరని- ప్రతి మంగళవారం అరడజను కాయలు కోసి ఆంజనేయస్వామి గుళ్ళో పూజలో వుంచి... ఇంటికి, మన షాపుకి కడుతున్నాను. అప్పుడప్పుడు మా ఫ్రెండ్స్‌కి పంచి పెడుతున్నాను".

"అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు వాళ్ళ చెట్టు నిమ్మకాయలు నువ్వెందుకు పంచి పెడుతున్నావు?"

"మనం అరటిపళ్ళు వీధిలో అందరిళ్ళకీ పంపుతాం. వాళ్ళు ఎవరితోనూ పరిచయాలు పెంచుకోరు. ఎవరూ కాయలు కావాలని అడగరు. చెట్టు నిండా నిమ్మకాయలే.. అందుకే నేనే కోసి ఇస్తుంటాను" గర్వంగా

చెప్పేడు మనవడు.

నిజమే.. వాచస్పతి కుటుంబ సభ్యులకు వీధిలో వాళ్ళతో పరిచయాలు తక్కువ. మాతోనే కొద్దిగా స్నేహంగా.. అదీ వాళ్ళ కుర్రాడు, మావాడూ ఫ్రెండ్స్ కావడంవల్ల.. చనిపోయిన తన తల్లిదండ్రులకే కాకుండా, పిల్లలు లేకుండా లోకం వీడిన అన్నావదినల అబ్బీకాలుకూడా ఆయనే పెడతారు. అందుకు కావలసిన అరిటాకులు మా ఇంటి నుంచే... ఇక ఎవరింట్లో పులిహోర చేయాలన్నా వాళ్లింట్లో నిమ్మకాయల్ని మావాడు తెచ్చి ఇస్తాడు. 'కాయలు కావాలన్నప్పుడు కోసుకెళ్ళు.. అడగక్కరలేదని అంకుల్ చెప్పేరుగా'.. ఇదీ మనవడి వరస.. అరగంట తరువాత వాడు ఇంటికి చేరేడు. 'ఎక్కడికెళ్ళేవు?' అని అడిగాను. 'రైతుబజార్‌కెళ్ళి అరిటాకులు కొనుక్కొచ్చి ఇచ్చాను.. అంకుల్ తెచ్చిపెట్టమన్నారు.' అన్నాడు.

ఇతరులకి సాయం చేయాలని, మనకున్నది పదిమందితో పంచుకోవాలని, ఇవ్వడంలోనే ఆనందం, తృప్తి వున్నాయని చెబుతూ పిల్లలకు మంచి అలవాట్లు నేర్పాలి. అంతేగానీ, 'కూలివాడిలా వాళ్ళకి మోసుకెళ్లడమేమిటి?'-అంటూ పిల్లల్ని మందలించే కొందరిని చూసినపుడు, 'పరోపకారం మహాపాపం' అనే భావన పిల్లల్లో కలిగించే తల్లిదండ్రులను చూసినపుడు చాలా బాధేస్తుంది.

-జ్యోతిర్మయి

దాంపత్య బంధంతో 'హృదయం' పదిలం!

'పెళ్లి చేస్తే పిచ్చి కుదురుతుంద'నే మాటెలా ఉన్నా, వివాహం చేసుకున్న వారు హృద్రోగాలకు దూరంగా ఉంటున్నారని ఓ తాజా అధ్యయనంలో పరిశోధకులు తేల్చారు. ఒంటరి జీవితం గడిపేవారి కంటే- పెళ్లయిన వారు గుండెపోటుకు గురైనా ఆ ప్రమాదం నుంచి క్షేమంగా బయట పడుతున్నారట! ఆడైనా, మగైనా వివాహం కాని వారే గుండె సంబంధిత రోగాలతో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ఫిన్లాండ్‌లో జరిగిన ఓ విస్తృత స్థాయి సర్వేలో తేలింది. మధ్య వయస్కులైన దంపతులు లేదా సహజీవనం చేస్తున్న జంటలు గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చేరకముందు, చికిత్స తర్వాత సులువుగా ప్రమాదం నుంచి బయట పడుతున్నారు. 1993 నుంచి 2002 వరకూ హృదయ సంబంధ వ్యాధుల తీరుతెన్నులపై లోతుగా విశ్లేషించాక ఆ వివరాలను పరిశోధకులు వెల్లడించారు. గుండెపోటు వచ్చిన సందర్భాల్లో వివాహితులు ప్రమాదం నుంచి తొందరగా కోలుకునే అవకాశాలు కూడా ఎక్కువేనట. వయసుతో సంబంధం లేకుండా పెళ్లికాని వారికే గుండెపోటుతో హాని ఉందని పరిశోధకులు పలు ఆధారాలను సాక్ష్యంగా చూపుతున్నారు. అధ్యయనం మేరకు పదేళ్లలో 15,330 మంది గుండెపోటును ఎదుర్కొనగా, 28 రోజుల కాలవ్యవధిలో సుమారు 7,700 మంది మరణించారు. మృతుల్లో అవివాహిత పురుషులు, మహిళలే అధిక సంఖ్యలో ఉన్నట్లు తేల్చారు. ఆరోగ్యపరంగా అవివాహితులు మంచి అలవాట్లకు దూరంగా ఉండడం వల్లే వారు గుండెపోటు వచ్చినా తట్టుకోలేక పోతున్నారని పరిశోధకులు విశ్లేషించారు.

ఫిన్లాండ్‌లో భౌగోళికంగా నాలుగు ప్రాంతాలకు చెందిన 34 ఏళ్ల దాటిన వారి ఆరోగ్య పరిస్థితులను, గుండె సంబంధిత సమస్యలను పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనం చేశారు. వివాహం, కుటుంబ పరిస్థితులు వంటి సామాజిక అంశాలకు, హృద్రోగ సమస్యలకు ఉన్న సంబంధాల గురించి పలు కోణాల్లో అధ్యయనం చేసినట్లు పరిశోధకులు తెలిపారు. గుండెపోటుకు సంబంధించి ఎన్నో సంఘటనలను అధ్యయనం చేయగా, ఇందులో సగం కంటే ఎక్కువ కేసుల్లో మరణాలు సంభవించాయని వారు పేర్కొన్నారు. అవివాహిత పురుషుల్లో 58 నుంచి 66 శాతం వరకూ హృద్రోగ లక్షణాలు కనిపించగా, అవివాహిత మహిళల్లో 60 నుంచి 65 శాతం వరకూ గుండె జబ్బుల జాడలు కనిపించాయి. ఇదే వయసుకు చెందిన వివాహిత స్త్రీలు, పురుషులు మాత్రం హృద్రోగ సమస్యలకు దూరంగా ఉంటున్నారు. గుండె జబ్బులతో మృత్యువాత పడే వారిలో పెళ్లయిన వారి కంటే అవివాహితులే అధిక సంఖ్యలో ఉంటున్నట్లు కూడా పరిశోధకులు గుర్తించారు. అవివాహిత పురుషుల్లో 60 నుంచి 168 శాతం, అవివాహిత మహిళల్లో 71 నుంచి 175 శాతం హృద్రోగాల వల్ల మరణాలకు చేరువవుతున్నారు. పెళ్లయిన పురుషుల్లో (65 నుంచి 74 ఏళ్ల లోపు) ఏటా ప్రతి లక్ష మందిలో 866 మంది మాత్రం హృద్రోగాలతో మరణిస్తుండగా, పెళ్లి కాని వారైతే ప్రతి లక్షమందిలో ఏటా 1,792 మంది మృత్యువాత పడుతున్నారు. పెళ్లయిన మహిళల్లో (65 నుంచి 74 ఏళ్ల లోపు) ఏటా ప్రతి లక్ష మందిలో 247 మంది మరణిస్తుండగా, పెళ్లి కాని వారిలో 493 మంది మరణిస్తున్నారని అధ్యయనంలో తేల్చారు. దాంపత్య బంధాన్ని అనుభవిస్తున్న వారు కష్టసుఖాల్లో తోడు కలిగి ఉండడం, మంచి ఆహార అలవాట్లు, సమాజ పరంగా గౌరవనీయ స్థానంలో ఉండడం వంటి కారణాలతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందుతున్నారు. వీటన్నింటికీ అవివాహితులు దూరంగా ఉంటున్నందున హృద్రోగ సమస్యలకు లోనవుతున్నారని అధ్యయనంలో పరిశోధకులు నిగ్గు తేల్చారు.



vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
సోమవారం
4, ఫిబ్రవరి
2013

సేర్చుకుందాం

జలజాత ప్రభవాండ భాండములు దుశ్చాతరిత్రులం బాత్రులం
జెలువై యుండ యథా ప్రమాణములుగా శిక్షింపరక్షింప ని
శ్చల లీలం బ్రభవించు రాజు భవదాజ్ఞా శక్తిగా కింతవ
ట్టిలమిం జేకొని నిర్వహిం ప మరి రాజెవ్వండు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా బ్రహ్మాండ భాండాలు చెడ్డ వాళ్లతోనూ మంచి వాళ్లతోనూఉండగా యథా ప్రమాణంగా చెడ్డవాళ్లని శిక్షించడానికి , మంచి వాళ్లని రక్షించడానికి నీ ఆజ్ఞాశక్తియే రాజు. అంతే తప్ప అట్లాంటి అధికారం ఉన్న రాజు ఇంకోక కెవ్వరుండ గల్గుతాడు?ఇతరులు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసినప్పటికీ వారినాపని చేయమని నియోగించేది ఈశ్వరుని ఆజ్ఞాశక్తియే. అందుచేత సర్వాధికారి సర్వేశ్వరుడే తప్ప ఇతరులెవ్వరూ కాదు. దీనికి ఇది, దీనికి ఇది అని ప్రమాణీకరించచేది కూడా ఈశ్వరశక్తియే. అంటే సర్వమూ ఈశ్వరమయమే కనుక వేరు అన్నదిఎక్కడ ఎందుకు ఉంటుంది? అనగా ఉండదని భావం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

4 **శ్రీ లత**

సాక్ష్యం లేని 'తప్పు' తప్పు కదా. తప్పు చెయ్యడం కూడా తప్పు కాదు. కానీ, తప్పని తెలిసీ.. తప్పు చెయ్యడం తప్పు.

జీవన అమ్మవైపు చూస్తూండిపోయింది.

అప్పుడప్పుడు.. అందులోవనూ... నిజాలు చెప్పేటప్పుడు అమ్మ గొంతులో జీసస్ మెత్త దనం... గాంధీ సత్యధనం.. కనిపిస్తాయి.

''అమ్మెంత స్వచ్ఛమైనది..!'' అనుకుంది.

ఆ ఆలోచననూ, వివేచననూ భంగపరుస్తూ... గుడిగంటలా ఫోన్ మ్రోగడంతో జీవన అక్కడ నుంచి లేచి వెళ్లింది.

వసంత కూడా 'గతంలో'కి నాలుగడుగులు నడిచింది.

⁘⁘⁘

వసంతకు 'జీవన' పుట్టేనాటికి చాలా సిరులు న్నాయి.

మంచి చదువు, కాన్వెంట్ టీచర్‌గా ఉద్యోగం.. ఎంతో ప్రేమించి, కట్న కానుకలు తీసుకో కుండా తనను చేసుకుని జీవితం మొదలుపె ట్టిన భర్త.. మోహన్.

మోహన్‌కు బ్యాంకులో క్యాషియర్ ఉద్యోగం. భార్య అన్నా కూతురన్నా అమిత మైన ప్రేమ. జీవితాన్ని ఒక ప్రణాళిక ప్రకారం కొనసాగించాలనే ఇద్దరి ఆదర్శం. ఇంకా ఇలా...ఎన్నెన్నో...

మొత్తానికి పేదరికంలో మాత్రం లేదు వసంత. ఉన్న సిరులన్నీ ఎప్పుడూ ఆనందడో లికల్లో ముంచెత్తేవే తప్పితే... నిరాశ నీడలను పరచేవి కావు. ''ఇవి చాలు.. మన జీవితాలు సుఖమయంగా సాగడానికి! ముఖ్యంగా నువ్వు చాలు!'' అంటుండేవాడు మోహన్.

''మనకున్న 'సిరి'కి ఒక్క జీవన చాలు. తనను తీర్చిదిద్దుకుంటే మంచి బిడ్డను ఈ సమాజానికి అందించిన వాళ్ళమవుతాం. సామాజికంగా మన బాధ్యత అప్పుడు కాని పరిపూర్ణం కాదు'' అనేవాడు.

''చాల్లెండి.. జీవన ఒక్కతే అయిపోదూ! తోడు ఎవరయినా తమ్ముడో, చెల్లెలో వుంటే బావుంటుంది'' అనేది వసంత.

''ఏం.. మనం వుండమా తోడుగా.. మనం ముసలాళ్ళం అయ్యేసరికి వాళ్ళాయనా, పిల్లలూ వచ్చేస్తారు. మనం అప్పుడు హాయిగా వెళ్ళిపోవచ్చు'' అనేసి నవ్వేవాడు మోహన్.

''నువ్వు నాతోపాటు వచ్చేయాలి మరి! 'నా కూతురు, నా మనవరాలు, మనవళ్లూ...'' అని ఆగి పోకుండా! అంటూ టీజ్ చేసేవాడు.

''శుభమా అని మొదలుపెట్టి దుఃఖాంతరం చేస్తారు టాపిక్‌ను'' కసిరేది వసంత.

అప్పటికే కళ్ళల్లో సుడులు తిరిగిపోయేవి కన్నీళ్ళు.

వాటిని తన చెంపలతో అద్దుతూ ''సుఖాంతం చేసేయమంటావా మరి'' అంటూ రొమాన్స్‌లోకి దింపేవాడు.

వీళ్లిద్దరి కలయికను చూసి పరుగెత్తుకొచ్చి ఇద్ద

రిమీదా పడి చప్పట్లు కొడుతూ నవ్వేది జీవన.

జీవన అన్నా, తన భవిష్యత్ అన్నా ఎంతో పది లంగా భావించేవాడు మోహన్.

''జీవన మన శరీరాల వారసత్వం మాత్రమే కాదు, మన ఆదర్శాలకు వారసత్వంకూడా కావాలి'' అని గుర్తుచేస్తుండేవాడు.

''అంటే... ప్రేమించి పెళ్లిచేసుకోవాలనా...?'' వెక్కిరించేది వసంత.

''ఉహూ... ఆ ఆదర్శం మనం పాటించేశాంగా! ఇంకా బలమైన ఆదర్శం... అంటే ప్రత్యేకమైన ఆదర్శం'' అనేవాడు రెండు చేతులను విశాలంగా సాచి.

⁘⁘⁘

మోహన్ ఆకస్మిక మరణం వసంతను పిచ్చి దాన్ని చేసినా.. జీవన పట్ల అతనికి వుండే ఆప్యా యతా, భద్రత క్షణం క్షణం గుర్తుకొచ్చి దిటువు తెచ్చుకునేది.

మోహన్ ఫొటోలు చూసినప్పుడల్లా ''నేనూ వచ్చేస్తా నీ దగ్గరకు'' అని ఏడ్చినా... పక్కలో జీవన కదిలేసరికి ఏడుపు ఆపేసేది. మోహన్ మీద వున్న ప్రేమను కూడా జీవన వైపు మలుపుకుని ప్రతీ అడుగును అపురూపంగా నడిపించు కుంటూ వచ్చింది. చిన్నప్పటినుంచే ఎన్నో విలు వైన పుస్తకాలను చదవడం నేర్పించింది. సొంతంగా ఆలోచించి అభిప్రాయాలు వెల్లడించే జీవనను చూసి బోలెడు ఆనందం పడిపోయేది. తనకిష్టమైన చదువు, అందుకు తగిన ఉద్యోగం వచ్చేవరకు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకుండా జాగ్రత్త చేసింది.

జీవననెప్పుడూ ఊహల్లోకి వెళ్ళనిచ్చేది కాదు. వాస్తవంలో నిలబడాలని హితవు చెప్పేది. ఆత్మవి శ్వాసం, ఆత్మస్థైర్యం ఏనాడూ విడిపోకూడదనేది. అమ్మకూచిగా ఉండే జీవనకు దూరపు చుట్టాలు సంబంధం తెచ్చారు. ''నేనప్పుడే చేసుకోనమ్మా'' అనేడిస్తే ''తనను విడిచి వుండాల్సొస్తుందని కాబోలు'' అనుకుంది. 'ఇంకెవరినైనా ప్రేమిస్తూం దేమో' అనే ఆలోచన మాత్రం రాలేదు. ఎందు కంటే జెండర్ తేడా లేకుండా పెంచడంతో జీవన చిన్ననాటినుంచి కూడా అమ్మాయిలతో పాటు అబ్బాయిలు వచ్చినా... లేదా తను వెళ్ళినా.. వాళ్ల గురించి మంచి అభిప్రా యాలు చెబుతుండేది. లోతుగా వెళ్ళేది కాదు. ఎవరినయినా ప్రేమించానని జీవన చెబితే తనకనుగుణంగా నిర్ణయం వుంటుందనే భావన జీవనలో స్ఫురిం చేలా చేసింది. అయినా 'ప్రేమ' గురించి మాటలెప్పుడూ తల్లిదగ్గర తీసుకురాలేదు జీవన. తన ఉద్యోగం సాటి ఉద్యోగులు, పోతే పుస్తకాలు, వీటిలో తనకంటూ ఓ ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకుంది జీవన.

రెండు రోజులు జ్వరంతో, వాంతులతో బాధపడిన జీవనను డాక్టర్ దగ్గరకు తీసు కెళ్తే వచ్చిన రిజల్ట్.. ప్రెగ్నెన్సీ.

ఆ మాట డాక్టర్ నోట రాగానే విస్తుపో యింది వసంత.

జీవన దిమ్మెరపోవడం చూసి తనెక్కడ డిప్రెషన్‌లోకి వెళుతుందోనని తనను తాను అదుపు చేసుకుని ఇంటికి తీసుకొ చ్చింది. ఇంటికొచ్చాక మంచానికి అంటు కుపోయిన జీవన రెండు రోజులసలు లేవ లేదు. తల్లి మొహం చూడలేదు. ఏడ్చింది... ఏడ్చినట్లుగానే వుంది. వసం తను లేపి బలవంతంగా పాలు తాగించ బోతే కళ్లు తెరవకుండానే గటగటా త్రాగేసి మళ్ళీ పడుకునేది తప్ప ఒక్క మాట కూడా మాట్లాడేది కాదు. దాంతో ఏదైనా అఘాయిత్యానికి పాల్పడు తుందేమో అనే అనుమానం వచ్చింది వసంతకు. ఆ భయంతోనే నిముషం కూడా ఏమార్చకుండా కనిపెట్టుకు కూర్చుంది. మోహన్ మాదిరిగానే జీవన కూడా చాలా సెన్సిటివ్.

-ఇంకాఉంది

135

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

అతణ్ణి కని నేను ప్రణామం చేశాను. వాలి నా నమస్కారం స్వీకరించలేదు సరికదా ''ఓరోరి! తమ్ముడిపని నిన్ను విశ్వసించి విరో ధితో పోరాడే చోట నన్ను విడిచి వచ్చి, నా రాజ్యాన్ని సంతోషంగా ఏలుతున్నావురా? ఇది న్యాయమేనా? నువ్వు మిక్కిలి పాపబుద్ధివి. నిన్ను నేను చంపినా నాకు దోషం అంటు కోదు'' అని నిందించాడు.

అంత నేను వాలి అంఘ్రులమీద వ్రాలి వినయము, భయమూ వెలయగా ''ఓ అన్నా! నువ్వూ రాక్షసుడు మాయావీ కొండబిలంలో ఒక సంవత్సరంపాటు పోరు సల్పారు. బిలం లోపల నుంచి రక్తపూరం ఉబికి బిలద్వారాన్ని సమీపించింది. నేను విపరీతంగా భీతుణ్ణి అయినాను. వేగంగా పరుగుపెట్టి కిష్కింధకు వచ్చాను. నీవు రాక పోవడం చూసి మంత్రులు కట్టడితో నన్ను అభిషిక్తుణ్ణి చేశారు. తప్పనిసరిగా రాజ్యం పాలింపజొ చ్చాను. అంతే తప్ప ఇందులో నా కపటం అణువంత అయినా లేదు. నువ్వు మరలిరావ డమే నాకు శుభం. నీ రాజ్యమును నీవే స్వీక రించు. వరుస- వావిలో నీకు తమ్ముడిని. నీ సేవకుడిని. పుత్ర సమానుడిని. నా యెడ ఆవంత దొసుగు పొసగినా నన్ను కరు ణించు'' అని పరిపరివిధాల ప్రార్థించాను.

కాని మా అన్న అంతకంతకు నాపై మండి పడ్డాడు. మంత్రులు ''తమ్ముడిపట్ల యింత క్రోధం తగదు. ఇందులో సుగ్రీవుడి దోషము సుంతయినా లేదు- నీవు ఏడాది అయినా రాలేదు. రాజ్యం అరాచకం కారాదని అతణ్ణి మేమే అభిషేకించాము'' అని నచ్చచెప్పారు. అయినా మంత్రుల మాటలు చెవిని పెట్టలేదు. నా సతిని రుమను అపహరించాడు. నన్ను చావకొట్టి చంపదలచాడు. అప్పుడు నేను ప్రాణాలపై తీపితో ఒంటరినై పరుగెత్తసా గాను. వాలి నా వెన్ను తవిలి తరుమజొచ్చాడు. భూలోకమంతా తిరిగి తిరిగి పరతెంచి వచ్చి ఈ అచలంమీద నివశిస్తున్నాను. ఈ పర్వతం దరికి వాలి రాజాలడు'' అని బదులు పలి కాడు. శ్రీరాముడు అచ్చెరువందాడు. ''సఖా! సుగ్రీవా! వాలి ఈ అచలం ఏల ఎక్కజా లడు?'' అని ప్రశ్నవేశాడు. వానరవరుడు సుగ్రీ వుడు వినయంతో రామచంద్రుడితో ఈ భంగి వచించాడు.

''పూర్వం 'దుందుభి' అను పేరుగల దుర్మార్గుడైన రాక్షసుడు ఉండేవాడు. ఆ దుందుభి వెయ్యి గజాల బలం కలవాడు. ఈ బలానికి తోడుగా బ్రహ్మ దేవుడు ఒసగిన వర బలంవల్ల మదమత్తుడై త్రిజగాలను అల్లకల్లోలం చెయ్యగా వాడితో అని చెయ్యడా నికి అందరూ భీతిల్లేవారు. ఆ దుందుభి కారు మహిషం అయ్యాడు. సముద్రుడి చెంతకు వచ్చి, తనతో కయ్యం చెయ్యమని కారు మేఘం ఉరిమినట్టు-భయంకరంగా ఉరి మాడు. సముద్రుడు ఈ రాక్షసుడితో మనకెం దుకు? అని వెరగంది రత్నకోటులు కోట్లు కానుక పెట్టి ''బల్లిదుడవు. నీతో అని సల్పడా నికి నేను చాలను. నీతో ఆజి చెయ్యడానికి వింధ్య పర్వతరాజు ఒక్కటే సమర్థుడు. శీఘ్రమే యోగి ఆ వింధ్యముతో తలపడు'' అని చెప్పాడు.

సముద్రుడి మాటలు విని దుందుభి ఇంద్రుడి దంభోళి నైశిత్యనిహతులు కల శిఖ రాలతో ఒప్పారే వింధ్యాచలాన్ని కొమ్ములతో కోరాడుతూ వుంటే ఆ అచలాధీశుడు అతి భీతుడై ''ఓ దుందుభీ! నీ సరివాడనా నేను? ఓసరిల్లక నీతో కయ్యం ఒనర్పనేర్తునా? నీతో యుద్ధం చెయ్యగల మహావీరుడిని పేర్కొంటు న్నాను, విను. కిష్కాంధాపతి అయిన వానర పతి వాలి నీతో పోరు సల్పగల బలశాలి. శీఘ్రమే అతడిపైకి కలహానికి వెళ్లు. ఇక ఆల సింపకు'' అని వాక్రుచ్చాడు. బలగర్వితుడు దుందుభి కన్ను మిన్ను కానక కిష్కింధకువ చ్చాడు. ఆ దుందుభికి చావు మూడి, భయంక రమైన ప్రళయకాలవేళ గర్జించే మేఘం మాదిరి- తనతో ఆలము ఒనర్ప రావలసిం దని వాలిని ఆహ్వానించాడు.

వాలి ఆగ్రహోదగ్రుడై పురం వెడలివ చ్చాడు. దుందుభి కరణి ధ్వనించే ఆ దుందుభి రాక్షసుడిని ''నీకు ఆయువుమూడి వచ్చావు. ఇంక ఎక్కడికి పోగలవు?'' అని వాడితో తలపడ్డాడు.

-ఇంకాఉంది

సోమవారం, 4 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ నవమి రా.01.59

నక్షత్రం: విశాఖ మ.02.44

వర్జ్యం: సా.06.28 నుండి 07.58వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సుంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):** బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శత్రుబాధలు దూరమవుతాయి.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉంటాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవ ధ్యానం అవసరం. శారీరిక అనారోగ్యంతో బాధ పడతారు. వృధా ప్రయాణాలెక్కువవుతాయి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభర ణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయా లను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభి స్తారు. ఋణవిముక్తి లభిస్తుంది.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆక స్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రు లతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవు తాయి.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందు తారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజ యాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలి స్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తిని స్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభా లను పొందుతారు. ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** లాభదాయకంగా ఉంటుంది. తొందరపాటువల్ల కూడదు. చెడును కోరేవారికి దూరంగా ఉండాలి. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహి స్తాయి. శారీరకంగా బలహీనమేర్పడుతుంది.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీ యుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీ ర్ణబాధలు అధికమవుతాయి. కీళ్లనొప్పుల బాధ నుండి రక్షించుకోవడం అవసరం.

మంచిమాట

జీవిత పరమార్థం

ప్రతి జీవికి జననం, మరణం సర్వసాధారణం. మానవ జన్మ కూడా అతీతం కాదు.అన్ని జీవరాసుల్లోనూ మానవ జన్మ ఎత్తినవారు మాత్రమే ఆత్మ సాక్షాత్కారం గురించి యోచిస్తారు. యోచించినదాన్ని జీవితకాలంలో సాంతం చేసుకునే ఆస్కారం ఉన్నది కూడా ఒక్క మానవ జన్మకే. జనన మరణాలమధ్య మనిషి సాధించాల్సిన సంస్కార సహిత ఆత్మసాక్షాత్కారమే జీవిత పరమార్థం.

ఆత్మ సాక్షాత్కారానికి ఉపయుక్తమయ్యే సత్యం, ఇంద్రియ నిగ్రహం, సహనం, నిరాడంబరత, భగవంతునిపై సంపూర్ణ విశ్వాసం అనే అంశాలను మనిషి సాధించి తీరాలి. వీటిని ఉపేక్షిస్తే మనిషి పతితుడవుతాడు. గొప్ప వంశంలో పుట్టినప్పటికీ వీటిని విస్మరించినవాడు అధముడు. వీటికి జీవం పోసినపుడే జీవిత పరమార్థం నెర వేరినట్లు.

భౌతిక మాయకు వశుడై అవకాశాలను దుర్వినియోగం చేసుకుంటే భగవంతుడు ఒసంగిన అద్భుత మానవ జన్మ సార్థకతను కోల్పోతుందని భగవద్గీతలో శ్రీకృష్ణపర మాత్మ వివరిస్తాడు. ''అగ్నే నయ సుపథా అస్మాన్ / విశ్వాని దేవ వయునాని విద్వాన్'' అంటుంది శ్రీమద్భాగవతం. 'ప్రభూ! గడచిన కాలంలో నేను చేసిందంతా నీవు ఎరు గుదువు. కావున నా ప్రగతికి ఎలాంటి ఆటంకాలు లేకుండా నా పూర్వ పాపాల నుంచి కాపాడు. సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. శరణు వేడుతున్నాను'' అన్నపుడు, భగ వంతుడు శరణాగతుడ్ని పాపాలతో సహా దేనినైనా నశింపజేగలడు అని వివరిస్తుంది. కావున శరణాగతి పొందడం ప్రథమ కర్తవ్యం.

ఇంకాస్త ముందుకెళ్లి భగవద్గీతను పరిశీలిస్తే, జీవిత ప్రారంభ దశలో దేవాదిదేవు డిని శరణు వేడేవాడు కేవలం భక్తియుక్తమైన భగవత్‌సేవ ద్వారానే ఇతర దశలన్నిం టిని అధిగమిస్తాడని తెలుపుతుంది. అలా శరణు పొందినవారి బాధ్యతను భగవం తుడు తానే స్వీకరించి వారి పాపాలనుంచి విముక్తి కలిగిస్తాడు. భక్తియుక్త భగవత్‌సే వకు సిద్ధమవ్వాలి.

భగవంతునికి భక్తియుక్త సేవ చేసే విధానంలో పాపాలు ఆచరించే అవకాశం ఉండదు. భగవంతుని సేవించే వ్యక్తి ఆయన కల్యాణ గుణాలను పొందుతాడు. కనుక బ్రాహ్మణ గుణాలను పొంది యజ్ఞయాగాదులు చేసే అర్హతను సైతం పొందు తాడని వివరిస్తుంది.

నేటి విద్యా విధానంలో భౌతికపరమైన విషయాలు వివరిస్తారు తప్ప ఆధ్యాత్మిక తకు అంతగా చోటులేదు. దాన్ని గ్రహించటం కష్టం. వేద మంత్రాలను, వేదసారాన్ని, నియమిత కర్మలను ఆధ్యాత్మిక ఆచార్యుని అనుగ్రహం చేత పొందవచ్చు. మానవుడు ప్రామాణిక ఆధ్యాత్మిక ఆచార్యున్ని పొందటమంటే భగవదనుగ్రహం పొందినట్లే. తద నుగుణంగా వేద శాసనాలు, వేదసారం ఒకటొకటి అర్థంకావటం మొదలవుతాయి. ఇకపై భక్తుడు భౌతిక ప్రపంచంవైపు చూపు మళ్లించే అవకాశం చాలా తక్కువ. సర్వ విధాలా సురక్షితమైన భక్తుడు పరమ గమ్యమైన పరిపూర్ణతను సాధించి జీవిత పర మార్థాన్ని పొందగలడు. మానవ జన్మ ఎత్తడం ఎంతో పవిత్రతను సాధించినట్లయితే, ఆ పవిత్రతకు భక్తి మార్గాన్ని ఆపాదించి, భక్తియుత సేవలో పునీతం కావాలి. సాధా రణ భౌతిక జీవితంలో యాంత్రిక జీవితానికి స్వస్తిపలికే గడియలు రానిదే ఆధ్యాత్మి కత సాధ్యపడదు. ఆధ్యాత్మికత సాధ్యపడుతున్న క్షణం నుంచి భగవద్ధామాన్ని చేరు కోవటం సులభతరమవుతుంది. అదే జీవిత పరమార్థానికి నాంది.

-చెన్న రామమూర్తి

వృతాసురుడు 13

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 6



మాటాట

ఆధారాలు:
అడ్డం
1. అచార్యుడే
4. పార్వతి
5. వరాహం
6. ఈరోజు
8. నివాసస్థానం, కాగితం పీట
10. ఊపిరి
12. గాలి
14. శిష్యుడు

నిలువు
1. వసుదేవ పత్ని
2.ద్రావిడ విశ్వవిద్యాలయం ఉన్న చోటు
3. పుష్పాడి
4. వ్యవహార భాషోద్యమ పితామహుడు
7. గంధ్రగొడ్డలి
8. బస, అనుకూలత, సౌఖ్యం
11. యతి.
13. విడ్డూరమే వంటిదే

మాటాట -5 సమాధానం

1పి	ష	2ము		3వి	డి	
		4ర	5మ	ణి		6వ్ర
7వ్ర			ర			భం
8యా	త	న		9త	నూ	జ
ణ			10సు			నం
ము		11వ్ర	ధ	12నం		
	13భ్ర	మ		14ది	చి	టి

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరఠావులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

పొగబట్టిన గ్రీసు!

గ్రీసు దేశమంటే సంపదకు కొలమానం. అలాగే విచ్చలవిడి ఖర్చుకు దానికి అదే సాటి. కానీ ఆర్థిక సంక్షోభం, రుణబాధలు, ఆదేశం కథనే మార్చేశాయి. అత్యంత విలాసవంతంగా జీవితాన్ని గడిపిన గ్రీసు ప్రజలు ఇప్పుడు చెక్కపొయ్యలతోనే కాలం గడుపుతున్నారు. దాని కారణంగా సర్వత్రా పరిసరాలు పొగమయమవుతున్నాయి. చమురు ధరలు దాదాపు ఏడాది కాలంలో 50 శాతం పెరిగిపోవడంతో ఆ భారాన్ని భరించలేక గ్రీసు ప్రజలు తమ జీవన విధానాన్నే మార్చుకున్నారు. ఇంట్లో వంట కోసం ఫర్నీచర్ నుంచి చెట్ల వరకూ ప్రతిదాన్నీ వాడేస్తున్నారుట. ఇందు కోసం రక్షితారణ్యాలను సైతం ధ్వంసం చేస్తున్నారు.

కెర్రీ నెత్తిన పశ్చిమాసియా కుంపటి!

అమెరికా విదేశాంగ మంత్రిగా జాన్ కెర్రీ సీన్‌లోకి వచ్చారు. నాలుగేళ్ల పాటు ఈ పదవిని నిర్వహించిన హిల్లరీ క్లింటన్ అన్ని దేశాలకూ అమెరికాను సన్నిహితం చేసేందుకు ప్రయత్నిస్తే..మరి జాన్ కెర్రీ ఆ సయోధ్య వారసత్వాన్ని ముందుకు తీసుకెళతారా లేక తనదైన శైలిలోనే దూసుకెళతారా అన్నది ఆసక్తిని కలిగిస్తోంది. ముఖ్యంగా మధ్యప్రాచ్యానికి సంబంధించినంత వరకూ అమెరికాకు ఎడతెగని సవాళ్లే ఎదురవుతున్నాయి. రెండు దేశాల సిద్ధాంతాన్ని అవలంబించని పక్షంలో పశ్చిమాసియా సమస్య అగ్నిగుండమే అవుతుందన్న సహేతుక వాదనను కెర్రీ ఇప్పటికే వినిపించారు. పదవిని చేపట్టిన వెంటనే కెర్రీ ఇంత కచ్చితంగా మధ్యప్రాచ్య సమస్య పరిష్కార మూలాన్ని చెప్పేయడానికి కారణం..ఈ అంశంపై ఆయనకు ఉన్న లోతైన అవగాహనే..! గత రెండు సంవత్సరాల నుంచి ఇజ్రాయెల్ కనబరుస్తున్న వ్యతిరేకత కారణంగానే సమస్య జటిలమవుతోందన్న వాస్తవాన్ని గుర్తించడమే..పశ్చిమాసియాలో శాంతి ప్రక్రియ ఎప్పుడు మొదలైనా దానికి ఇజ్రాయెల్ తన వితండవాదంతో మోకాలడుతోంది. ఇజ్రాయెల్‌ను దారికి తెచ్చి పశ్చిమాసియాలో సుస్థిర శాంతిని పాదుగొల్పాల్సిన బాధ్యత అమెరికాపైనా ఉందన్నది వాస్తవం. పాలస్తీనాకు సంబంధించినంత వరకూ గత ఏడాది చారిత్రక పరిణామమే చోటు చేసుకుంది. ఐక్యరాజ్య సమితిలో గుర్తింపు లభించడం ఒక రకంగా ఆ దేశ వాసుల సుదీర్ఘ కలలు పండినట్టే..ఇంత సానుకూల పరిస్థితులు నెలకొన్నా ఇజ్రాయెల్ మొండి వైఖరి కారణంగా ఎటూ తేల్చలేని విపత్కర పరిస్థితిని అమెరికా ఎదుర్కొంటోంది. ఇంకెంత మాత్రం జాప్యం చేయకుండా ఇజ్రాయెల్-పాలస్తీనా నేతల్ని చర్చలకు పిలిచి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే కెర్రీ ముందున్న సవాలు. ఈ విషయంలో ఇజ్రాయెల్ కొత్త ప్రధాని నెతన్యాహును ముందుకు నడిపించాల్సిన బాధ్యత కూడా ఆయనదే. తాను అనుకున్నది సాధించడంలో కెర్రీకి ఎంతో నైపుణ్యం పట్టుదల ఉన్నాయి. ఇదే అంకితభావాన్ని పశ్చిమాసియా విషయంలో కనబరిస్తే ఆ సమస్య ఓ కొలిక్కి రావడానికి ఆస్కారం ఉంటుంది. అమెరికా గట్టిగా ఆదేశిస్తే ఇజ్రాయెల్ దారికి రాకుండా ఉండదు. ఈ విషయంలో జాన్ కెర్రీ ఏ విధంగా వ్యవహరిస్తారో వేచి చూడాలి..



ఇరాన్‌పై ఏమి చేద్దాం!

ఇరాన్ సమస్య పరిష్కారానికి అన్ని దారులూ మూసుకుపోతున్నాయా? దౌత్యపరమైన ప్రయత్నాలతో ఇరాన్‌ను దారికి తేవాలన్న పశ్చిమ దేశాల ప్రయత్నాలు అడుగంటిపోతున్నాయా? తాజాగా తీవ్రమవుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఇదే నిజమనిపిస్తోంది. ఐరాస, భద్రతా మండలి, అమెరికా తదితర పశ్చిమ దేశాల ఆదేశాలను ధిక్కరించి అణు కార్యక్రమాన్ని దీర్ఘకాలంగా కొనసాగిస్తున్న ఇరాన్ విషయంలో ఎటూ తేల్చుకోలేని విషమ పరిస్థితే అంతర్జాతీయంగా ఎదురవుతోంది. ముఖ్యంగా స్వీయ అవసరాలను తీర్చుకోవడానికేనని చెబుతున్నా..ఇరాన్ అణు కార్యక్రమం అనేక కోణాల్లో తమకు ముప్పేనన్న వాదనను అమెరికా గట్టిగానే వినిపిస్తోంది. అణు సంపత్తిని పెంచుకోవడమే లక్ష్యంగా యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ఇరాన్ చేపట్టిందని, దీని వల్ల తమకే కాకుండా తమ మిత్ర దేశాలకూ ముప్పేనని చెబుతున్న అమెరికా ఐరాస వెన్నుదన్నుతో, భద్రతా మండలి తీర్మానాల బలంతో అహ్మదినెజాద్ ప్రభుత్వాన్ని దారికి తెచ్చేందుకు ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ నేపథ్యంలో 'ఇక దౌత్యపరమైన మార్గాలన్నీ మూసుకు పోయినట్టే..'నని అమెరికా వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను కలిగిన అంశమే! ఇరాన్ నుంచి ముంచుకొచ్చే ముప్పు విషయంలో ఏ సూక్ష్మ అంశాన్నీ వదలడానికి వీల్లేదని, అన్ని విధాలుగా అమెరికా రక్షణకు పట్టం కట్టే రీతిలోనే ముందుకు సాగుతామని అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే దేనికీ సైనిక చర్య పరిష్కారం కాదన్న వాదనను కూడా అమెరికా పరిగణనలోకి తీసుకుంటోంది. కొంత తీవ్ర స్థాయిలోనైనా ఇరాన్‌పై వత్తిడి తెచ్చి అణు కార్యక్రమాలను నిలిపివేసే విధంగానే ప్రయత్నిస్తామని రక్షణ మంత్రిత్వ పదవికి నామినీగా ముందు కొచ్చిన చుక్ హాగల్ చెప్పినప్పటికీ చమురు సంపత్తి అపారంగా కలిగిన ఈ దేశం అంత తేలిగ్గా దారికొచ్చే సూచనలు మాత్రం కనిపించడం లేదు. ప్రాంతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా అమెరికా, దాని మిత్ర పక్షాల ప్రయోజనాలకు విఘాతం కలిగించే రీతిలోనే ఇరాన్ అణు కార్యక్రమం సాగుతోందని సెనేట్ సాయుధ సర్వేసుల కమిటీకి ఇచ్చిన వివరణలో హాగల్ స్పష్టం చేయడంతో అగ్రరాజ్యం తదుపరి వ్యూహమేమిటన్నది ఆసక్తిని కలిగిస్తోంది. ఇరాన్ ఎంతగా ధిక్కార స్వరాన్ని వినిపిస్తే దానిపై తీసుకునే తదుపరి చర్యల అంతగానూ పెరుగుతుందన్న సంకేతాలను హాగల్ ఇప్పటికే అందించారు.

రక్షణ మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తీసుకునే నిర్ణయాలు ప్రస్తుత పరిణామాలకు, వాటి తీవ్రతకు అద్దం పట్టేవిగానే ఉంటాయనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన సంకేతాలను ఆయన అందించారు.. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించని పక్షంలో ప్రాంతీయంగా ఆయుధ పోటీ పెరిగిపోతుందన్న వాదను అమెరికా దీర్ఘకాలంగా వినిపిస్తూనే ఉంది. అలాగే ఉగ్రవాద కార్యకలాపాలను అనేక కోణాల్లో పెంచిపోషిస్తున్న దేశంగా దానిపై ఇప్పటికే ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో దౌత్య ప్రయత్నాలన్నీ మూసుకుపోయాయని చెప్పడం ద్వారా అమెరికా వేసే తదుపరి అడుగు ఏకపక్షంగా ఉంటుందా? అన్ని దేశాలనూ కలుపుకుని ముందుకు సాగేదిగా ఉంటుందా అన్నది చర్చనీయాంశమైంది.

- బి.రాజేశ్వర ప్రసాద్

కల్లోల దిశగా ఈజిప్టు

ఈజిప్టు పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. గత కొంతకాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను పరిశీలిస్తే ప్రభుత్వం ఉందా? పాలన కొనసాగుతున్నదా? అన్న అనుమానాలు వచ్చితీరుతాయి. హోస్నీ ముబారక్ నియంతృత్వాన్ని ఎదిరించిన ప్రజలు, అతనిని గద్దెదింపి, మహమ్మద్ ముర్సీని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టినా, పరిస్థితులు ఏమాత్రం మారలేదు. ప్రభుత్వ విభాగాలపై ముర్సీ ఇంకా పట్టు సంపాదించలేదు. ముబారక్ మాదిరిగానే సైనిక బలంతో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించవచ్చన్న అభిప్రాయంతో ముర్సీ గుడ్డిగా ముందుకు వెళ్లడం అనేకానేక సమస్యలకు కారణమవుతోంది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే, దేశంలో పాలన పూర్తిగా కుప్పకూలిపోతుందని ఈజిప్టు సైన్యాధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ఇటీవల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ హెచ్చరించాడు. అతని మాటలను తేలిగ్గా తీసుకోవడానికి వీలులేదు. సమస్యలు వాటంతట అవే చక్కబడతాయన్న ఆశ అంతకంటే లేదు. ఇప్పుడు ఈజిప్టు మొత్తం రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇస్లాం మత విశ్వాసాలకు అనుగుణంగా పాలన జరగాలన్నది ఓ వర్గం డిమాండ్. వివిధ జాతులు, సమూహాలు, మతాలకు చెందిన ప్రజలతో కూడిన ఈజిప్టులో లౌకిక వాదమే సరైన మార్గమని మరో వర్గం నమ్ముతోంది. ఈ విషయంపై జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ కొత్త సమస్యలు సృష్టించిందే తప్ప, ఉన్న సమస్యను పరిష్కరించలేకపోయింది. ఇస్లామిక్ మత విశ్వాసాలను అనుసరించి రాజ్యాంగాన్ని రూపొందిస్తే అమెరికాసహా అధిక శాతం ప్రపంచ దేశాలకు విరోధిగా మారిపోవాల్సి వస్తుంది. లౌకిక వాదాన్ని అమలు చేస్తే, దేశంలో అధిక జనాభా గల ముస్లింలు ఎక్కడ ఆందోళనలకు దిగుతారో, ముబారక్ మాదిరిగానే తనను కూడా ఎక్కడ పదవీచ్యుతుడ్ని చేస్తారోనన్న భయం ముర్సీని వెంటాడుతోంది. ముందుకు వెళితే నుయ్యి.. వెనక్కు వస్తే గొయ్యి అన్న చందంగా మారింది ముర్సీ పరిస్థితి. అందుకే, సైన్యంపై ఆధారపడి రోజులు నెట్టుకొస్తున్నాడు. అటు మతవాదులు, ఇటు లౌకికవాదులు వీధి పోరాటాలకు దిగడంతో సైన్యం కూడా చేష్టలుడిగి, ప్రేక్షక పాత్ర పోషిస్తున్నది. పరిస్థితి మరీ చేజారే ప్రమాదం కనిపించినప్పుడు మాత్రం రంగంలోకి దిగుతోంది. పాలన పూర్తిగా పడకేసింది. అరాచకం పెచ్చరిల్లింది. ఎవరికి వారే తమదే సరైన విధానమని ప్రకటించుకుంటూ, దేశాన్ని అతలాకుతలం చేస్తున్నారు. నిరసనలు, ఘర్షణలు, దోపిడీలు, లూటీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అందుకే, అల్ సిసి భయాందోళనలు వ్యక్తం చేశాడు. అతని వ్యాఖ్యలు, హెచ్చరికలు కేవలం ప్రజలకు, అధికార పార్టీకే పరిమితం కాదు. ప్రతిపక్ష పార్టీలు కూడా అల్ సిసి అభిప్రాయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకూ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నిస్తున్న సైన్యం ఇక లాభం లేదనుకొని ముర్సీపై తిరుగుబాటు చేస్తే ఈజిప్టు చరిత్ర పునరావృతమవుతుంది. మరోసారి నియంతృత్వ పాలన కొనసాగుతుంది. ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుంది. మళ్లీ మరో ప్రజా ఉద్యమం అవసరమవుతుంది. రక్తపాతం అనివార్యమవుతుంది. ఈ అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకోకుండా ఉండాలంటే, దిక్కుతోచని స్థితిలో ఉన్న ఈజిప్టును సరైన మార్గంలో నడిపించే బాధ్యతను అధ్యక్షుడు ముర్సీ యుద్ధ ప్రాతిపదికపై చేపట్టాలి. అన్ని వర్గాల ప్రజలకు భద్రత కల్పించాలి. ప్రజాస్వామ్యం వేళ్లుకునే దిశగా రాజ్యాంగాన్ని పునర్నిర్మించాలి. లేకపోతే, ఈజిప్టు సంక్షోభానికి తెరపడదు. అక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లదు. అభివృద్ధి పథంలో దూసుకెళ్లదు.

- బిఎల్

ఫ్రాన్స్‌కు మాలీ సవాళ్లు!

పటిష్టమైన ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను పెనవేసుకున్న ఆఫ్రికాలో అనిశ్చితి చోటు చేసుకోవడం ఫ్రాన్స్ కంటికి కునుకు లేకుండా చేస్తున్నది. ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలతో ఫ్రాన్స్‌కు సత్సంబంధాలున్నాయి. పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందుకే ఆఫ్రికా ఖండంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా, దాని ప్రభావం తమ దేశంపై పడుతుందని ఫ్రాన్స్ భయం. ఇందులో నిజం లేకపోలేదు. లిబియాలో మౌమర్ గడాఫీ శకానికి తెరదించడంలో నాటో నేతృత్వంలోని దళాలు కీలక పాత్ర పోషించాయి. ఫ్రాన్స్ కూడా తనవంతు సాయం అందించింది. ఇప్పుడు మాలీ నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఫ్రాన్స్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నది. ఆఫ్రికా సారథ్యంలో అంతర్జాతీయ దళాలు (అఫిస్మా) మాలీలో శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్నాయి. పెచ్చరిల్లిపోతున్న ఇస్లామిక్ తీవ్రవాదులను అదుపు చేసేందుకు పోరాటం సాగిస్తున్నాయి. అఫ్గానిస్థాన్, ఇరాక్ దేశాల్లో సంకీర్ణ దళాలకు నేతృత్వం వహించిన అమెరికా ఎదుర్కొంటున్న చేదు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఫ్రాన్స్ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నది. మాలీ ఉత్తర ప్రాంతంలోని టింబుకు, గావో, కిడాల్ తదితర ప్రాంతాల్లో ఇస్లామిక్ తీవ్రవాదులకు మంచి పట్టు ఉంది. వారిని ఏరి పారేసేందుకు అఫిస్మా పోరాడుతునే ఉంది. ఈ దిశగా మంచి పురోగతిని సాధించింది. కొండలు, గుట్టలు, పర్వత ప్రాంతాల్లో తలదాచుకున్న తీవ్రవాదులను కూడా మట్టుపెట్టేందుకు కంకణం కట్టుకుంది. అఫిస్మాలో ఫ్రెంచ్ దళాల పాత్ర అత్యంత కీలకంగా మారింది. అయితే, ఎంతోకాలం తమ దళాలను మాలీలో ఉంచే పరిస్థితి లేదని ఫ్రాన్స్ ఇప్పటికే స్పష్టం చేసింది. సాధ్యమైనంత త్వరలో బలగాలను ఉపసంహరించుకుంటామని ఫ్రాంకొయిస్ హొలాండే ప్రకటించాడు. తీవ్రవాదుల సమస్యను పరిష్కరించిన మరు క్షణం అక్కడి నుంచి ఫ్రెంచ్ దళాలు వెనుదిరుగుతాయని, మాలీలో శాంతి స్థాపన, ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలను అఫిస్మా చూసుకుంటుందని హొలాండే తేల్చిచెప్పాడు. ప్రస్తుతం మాలీలో నెలకొన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే, తీవ్రవాదుల చెర నుంచి దేశాన్ని విముక్తి చేయడం అనుకున్నంత సులభం కాదు. అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ల పాలన కుప్పకూలి దశాబ్దం గడుస్తున్నా అక్కడ ఇప్పటికీ ఉగ్రవాద దాడులు జరుగుతునే ఉన్నాయి. రక్తపాతం జరుగుతునే ఉంది. ప్రభుత్వానికి ఇస్లామిక్ ఉగ్రవాద మత సంస్థలు సవాళ్లు విసురుతునే ఉన్నాయి. మాలీలోనూ ఇదే పరిస్థితి. అఫిస్మా కృషి వల్ల ఉగ్రవాదులు తాత్కాలికంగా తమ దాడులను నిలిపేసినా, ఏ క్షణంలోనైనా గెరిల్లా దాడులకు ఉపక్రమించే ప్రమాదం లేకపోలేదు. మాలీ తాత్కాలిక అధ్యక్షుడు డియోన్ కౌండా ట్రావోర్ ఏడాదిలోగా ఎన్నికలు జరిపిస్తానని, ప్రభుత్వ ఏర్పాటు జరుగుతుందని నమ్మబలుకుతున్నాడు. అంతర్గత విభేదాలతో, దాడులు, ప్రతిదాడులతో ఆట్టుడుకుతున్న మాలీలో శాంతి స్థాపన అనుకున్నంత సులభం కాదు. ఈ విషయాన్ని గ్రహించిన ఫ్రాన్స్ గౌరవంగా తప్పుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. అయితే, మాలీ నుంచి ఎదురవుతున్న లేదా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా అధిగమించాలన్నది ఫ్రాన్స్ ముందుకున్న ప్రధాన సమస్య. అఫ్గానిస్థాన్ కారణంగా అమెరికా ఏం చేయాలో అర్థం గాక మల్లగుల్లాలు పడుతోంది. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడడమే ప్రధాన కర్తవ్యంగా ఫ్రాన్స్ యోచిస్తున్నది. ఆతర్వాత పరిస్థితులను బట్టి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలన్నది ఫ్రాన్స్ ఆలోచన. ఇది ఎంత వరకూ నెరవేరుతుందో చూడాలి.

- మైత్రేయి

ఆంగ్ల దేశం.. అన్య భాషలదే భోజ్యం!

ఆంగ్లభాషకు పుట్టినిల్లుగా, రాజధానిగా బ్రిటన్ ప్రాభవం విశ్వవ్యాప్తం. శతాబ్దాల చరిత్ర కలిగిన అత్యున్నతస్థాయి విద్యాసంస్థలతో పాటు ఆంగ్ల భాషకు ఆయువుపట్టుగా బ్రిటన్ ఖ్యాతి ఎనలేనిది. ఆక్స్‌ఫర్డ్ వంటి విశేష ఖ్యాతి కలిగిన యూనివర్శిటీలకు నిలయమైన నేల కూడా ఇదే. ఆంగ్లభాషపై పరిశోధనలకు, కొత్తకొత్త పద ప్రయోగాలకు పెట్టింది పేరు కూడా బ్రిటన్‌దే. భాషాపరంగా ప్రపంచ దేశాలు ప్రామాణికంగా తీసుకునే బ్రిటన్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రపంచ భాషగా వెలుగొందుతున్న ఆంగ్లాన్ని ప్రపంచమంతా విరివిగా వాడుతుంటే సొంత దేశంలోనే దానికి ఆదరణ లేకుండా పోయింది. పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా తయారైందనేది తాజా గణాంకాల సారాంశం. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో నివసిస్తున్నవారిలో 40 శాతం మంది మాతృభాష ఆంగ్లం కాకపోవడమే ఇందుకు తార్కాణం. ప్రపంచీకరణ ఒకవైపు, వలసలు మరోవైపు ఇందుకు ప్రధాన కారణమే అయినా, సొంత దేశంలో మాతృభాష మాట్లాడేవారి సంఖ్య ఏయేటి కాయేడు పడిపోతుండటం బ్రిటన్‌కున్న ఆంగ్లభాషా ప్రాభావాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రతి ఐదుగురిలో ఇద్దరికన్నా ఎక్కువమంది మాతృభాష ఆంగ్లం కాదని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఇంగ్లండ్, వేల్స్‌లో నివసిస్తున్న 40లక్షల మంది ప్రజలు ప్రధానంగా వినియోగించే భాష ఇంగ్లీషు కాకపోవడం జీర్ణించుకోలేని వాస్తవం. వీరితోపాటు ఏడు లక్షలకు పైగా ప్రజలు ఆంగ్ల భాషను సరిగా మాట్లాడలేమని తేల్చిచెప్పడం ఆంగ్లభాష దుస్థితికి అద్దం పడుతోంది. మరో లక్షా 40వేలమందికి అస్సలు ఇంగ్లీషు మాట్లాడటమే రాదన్నది మరో చేదు నిజం. యూరోపియన్ యూనియన్‌లో బ్రిటన్ ప్రధాన భాగస్వామి కావడం, తూర్పు యూరప్‌నుంచి వలసలు పెరగడం, వీసా నిబంధనలు ఎత్తివేయడం వంటి తాజా పరిణామాలతో బ్రిటన్‌లో వలసదారుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. దీంతో సంప్రదాయ ఆంగ్లభాష మాట్లాడే వారి సంఖ్య పడిపోతూ వచ్చింది. బ్రిటన్ మాతృభాషపైనా దీని ప్రభావం ప్రమాదకరస్థాయికి చేర్చిందన్నది తాజా గణాంకాలు తేల్చిన వాస్తవం.

...బయట పల్లకి మోత అంటే ఇదేనేమో! ఆంగ్ల భాషకు పుట్టినిల్లు బ్రిటన్. కానీ అక్కడి మెజార్టీ ప్రజలకు ఇది మాతృభాష కాదన్న వాస్తవం విస్మయం కలిగించేదే.. ప్రపంచ దేశాల ప్రజలకు ఆంగ్లం లేకపోతే రోజు గడవదు. కానీ..ఈ భాషకు మాతృదేశమైన బ్రిటన్ వాసులకు మాత్రం ఆంగ్లంతో పని లేదట! కారణం..మెజార్టీ ప్రజలకు అది మాతృ భాష కాకపోవడమే..స్పెయిన్ సహా అనేక భాషలే వారికి మూలం కావడం..ఒక రకంగా చెప్పాలంటే ఆంగ్ల దేశంలో అన్య భాషలదే భోజ్యమన్నమాట

తాజా గణాంకాల ప్రకారం - ఇంగ్లండ్ వాసుల్లో ఎక్కువ శాతం మంది ప్రధానంగా వినియోగించే భాష ఇంగ్లీషు కాదు. ఇంగ్లండ్, వేల్స్‌లో నివసించే 5,46,174మంది పోలిష్ భాషను ప్రధాన భాషగా వినియోగిస్తున్నారు. రెండవ ప్రధాన భాషగా వెల్ష్‌ను వినియోగించేవారి సంఖ్య 5,62,000మంది. దశాబ్దం క్రితం బ్రిటన్ వీధుల్లో పోలిష్ మాట వినపడేది కాదు. కానీ 2004లో బ్రిటన్ యూరోపియన్ యూనియన్‌లో కలిసిన తర్వాత పోలీష్ మాట్లాడేవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఏడాదికి 13వేలమంది పోలండ్ దేశీయులు బ్రిటన్‌కు వలస వచ్చే అవకాశముందని అధికారంలో ఉన్న లేబర్ పార్టీ ప్రభుత్వం గతంలో అంచనా వేసింది. అయితే 2003 డిసెంబర్ నుంచి 2010 డిసెంబర్ మధ్యకాలంలో పోలండ్ దేశీయుల సంఖ్య 75వేల నుంచి 5,32,000కు పెరగడం గమనార్హం. 2007లో పోలండ్‌నుంచి అత్యధికంగా 96వేలమంది బ్రిటన్‌కు వలస వచ్చారు. బ్రిటన్‌లో ప్రస్తుతమున్న పోలండ్ దేశీయుల్లో నాలుగోవంతు జనాభా లండన్‌లోనే స్థిరపడటం విశేషం. తూర్పు ఇంగ్లండ్‌లోనూ పోలండ్ దేశస్థులు అధిక సంఖ్యలో స్థిరపడ్డారు. వారిలో ఎక్కువశాతంమంది వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్నారు.

ప్రస్తుతం లండన్‌లో విదేశీ మాతృభాషను మాట్లాడేవారిదే పైచేయి. దేశవ్యాప్తంగా వందకు పైగా విదేశీ భాషలను మాట్లాడేవారున్నారు. ఈ భాషల్లో అందరికీ చిరపరిచితమైనవాటితోపాటు కాలగర్భంలో కలిసిపోయిన భాషలు కూడా ఉండటం విశేషం. పురాతన భాషగా పేరొందిన గాలిక్‌ను ప్రధాన భాషగా వినియోగించేవారు 33మంది మాత్రమే ఉన్నా ప్రస్తుతం వినియోగంలో ఉండటం ఆశ్చర్యకరమే. 1974లోనే గాలిక్ భాష అంతరించిపోయినట్లుగా అధికారికంగా రికార్డుల్లో నమోదైంది కూడా. ఇంకా, స్కాటిష్ గాలిక్ భాషను వినియోగించేవారు 58మంది, కార్నిష్‌ను 557మంది, కరేబియన్ క్రియోల్‌ను 510మంది, జిప్సీ భాషను 461మంది మాట్లాడుతున్నట్లు గణాంకాలు తేల్చాయి. ఫ్రెంచ్ ప్రధాన భాషగా మాట్లాడేవారు 1,47,099మంది, పోర్చుగీస్ 1,33,453మంది, స్పానిష్ మాట్లాడేవారు 1,22,022మంది, జర్మన్ భాషను 77,240మంది వినియోగిస్తున్నారు. 38,946మంది బల్గేరియన్లు, 67,586మంది రొమేనియన్లు తమ మాతృభాషనే వినియోగిస్తున్నారు.

తూర్పు యూరోపియన్‌లో ప్రముఖంగా పేరొందిన భాషల వినియోగంకూడా బ్రిటన్‌లో అధికంగానే ఉంది. లిథువేనియా, లాట్వియా మాతృభాషలు వీటిలో ప్రముఖమైనవి. ప్రస్తుతం బ్రిటన్ మొత్తం 100 విదేశీ భాషల వినియోగం ఉంది. వీటిలో డానిష్, కరేబియన్ క్రియోల్, జిప్సీ, నేపాలీ, పాస్టో వంటివి ముఖ్యమైనవి. అంతేకాదు, భారతీయ భాష అయిన మలయాళం కూడా బ్రిటన్‌లో ప్రముఖంగా వినియోగంలో ఉండటం మరో విశేషం. ఒక ప్రాంతంనుంచే ఎక్కువగా వలసలు రావడం, అక్కడి భాషనే విరివిగా వినియోగిస్తుండటం, సాంస్కృతిక నేపథ్యం వంటి వాటివల్ల బ్రిటన్‌లో విదేశీ భాషల వినియోగం పెరిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

- మోహన్

సాహితి

email: sahiti@andhrabhoomi.net

ఉరికొయ్య

'నేల మీద
పరచుకున్న నీలాకాశమా... అది'
అడిగాన్నేను
సముద్రాన్ని చూపిస్తూ...!

కాదు
బతుకుమగ్గం మీద మా అయ్య
నేసి ఆరేసిన
నేత చీరన్నాడతడు!

'విరబూసిన
ముద్దమందారమా... అది'
మళ్లీ అడిగాన్నేను
సూరీడ్ని చూపిస్తూ...!

కాదు
మగ్గం ఉరికొయ్యకు
ఉయ్యాలూగుతున్న
మా అయ్య
నెత్తుటి శిరస్సన్నాడతడు!

- సిరికి స్వామినాయుడు,
9494010330

కవిత సృజనలో కొరవడిన సాహిత్యం

నేటి సామాజిక వ్యవస్థ ఆర్థిక పేరాశతో జీవితపు వడిని పెంచుతుంది. హృదయంలో తడిని ఆర్పివేస్తుంది. మనిషి పగటి కలలకు తల తాకట్టుపెట్టి తలలేని మొండెంగానో క్షణానికో ముఖాన్ని మార్చుకుంటూనో చపలచిత్తుడై చరిస్తున్నాడు. ఎవడో పారబోసిన దుఃఖంలో ఈదులాడుతూ ఊపిరాడక మనిషి ఉక్కిరిబిక్కిరైపోతున్నాడు. వస్తువ్యామోహంలో పడి హృదయాన్ని ఊడిగపు ఊట చెలిమనుచేసి అస్తిత్వాన్ని అంగడి సరుకును చేస్తున్నాడు. సైద్ధాంతిక అవగాహనలేదు. శాస్త్రీయ దృక్పథం లేదు. జుగుప్సాకరమైన ఓ స్తబ్దతలో నిశ్శబ్ద గాయమై పోతున్నాడు. జీవితమంటే ఓ సంఘర్షణ, సంవేదన, పోరాటం, ప్రతిఘటన, విషాదం, దుఃఖం, ఓ గెలుపు ఓ ఆనందంగా భావించే సత్యాన్ని మరచిపోయాడు. మానసిక ఆనందం కూడ వస్తురూపంగానే భ్రమిస్తూ, వ్యాపార లావాదేవీగా ఆలోచిస్తూ బయట ప్రపంచంలో వెతుక్కుంటున్న వ్యాపార సంస్కృతిలోకి మనిషి జారిపోతున్నాడు. నవ నాగరికతా మెరుపులు మన మూల సంస్కృతిని మనిషిలోంచి నెట్టివేస్తూ జీవితంలో పూరించలేని ఖాళీలను సృష్టిస్తున్నాయి. నేడు మనిషి వేటంతా ఆనందాన్వేషణే! అయితే ఈ క్రమంలో అనుకోని దుఃఖాన్ని కొని తెచ్చుకుంటున్నాడు. ఈ సందర్భంలో మనిషి ఆలోచనారహిత శిలాప్రతిమలా, సజీవత లోపించిన ఓ యంత్రంలా అమానుషమైన ఆర్థిక వేటే అన్ని సమస్యలకు పరిష్కారంగా భావిస్తున్నాడు. తెలియని కోరికలు, తీరని కోరికలు సంకెళ్లుగా మారిపోతున్నాయి. మూస బతుకే జీవితపరమార్థంగా భావించే కృత్రిమ రొంపిలో ప్రశాంతతను వెతుక్కుంటూ తననుతాను తెలుసుకోలేక దారితప్పిన దీనావస్థలో సమాజం కొట్టుమిట్టాడుతోంది. మనిషి బలహీనతను సొమ్ముచేసుకునే వ్యూహంలో మతం, రాజకీయం మూఢ విశ్వాసాలను, అత్యాశలను ఎరగా వేస్తున్నాయి. మతం, రాజకీయం మాయలో అనునిత్యం మనిషి గాయమవుతూనే వున్నాడు. మనిషితనంలోంచి మాయమవుతూనే వున్నాడు.

మనిషి సుఖాల సుందర వనాలని చేరిన చోటల్లా దుఃఖాల అశోకవనాలై చెరపడుతున్నాయి. స్వచ్ఛతతోకూడిన మనశ్శాంతి నిచ్చే నిర్మలత్వం ఎక్కడ వుంది? మనిషిని వెంటాడుతున్న వేటాడుతున్న సమస్యలేవి? ఆ సమస్యలను సృష్టిస్తున్న వ్యవస్థాగత శత్రువులెవరు? వారు బయట ఉన్నారా? లేక మనలోనే వున్నారా? మనచుట్టూ మనం ఎందుకు శత్రువులను తయారుచేసుకొంటున్నాము? అంతటా స్వచ్ఛత ఎందుకు లోపిస్తుంది? కల్తీ అంతటా తలెత్తి ఎందుకు విస్తరిస్తుంది? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే సమాధానం కనిపిస్తుంది. మనలో నానాటికీ పెరిగిపోతున్న అత్యాశతో కూడిన దోపిడీతత్వం, ఆధిపత్యధోరణి, విజ్ఞతకు మించిన విలువలకోసం ప్రాకులాడడం, పైరవీలు మనిషి గౌరవానికి పాచికలుగా ఉపయోగపడడం, వ్యవస్థమీద ఆధిపత్యం వహిస్తున్న మతం, రాజకీయం పడగ నీడల్లో సాహిత్యం తలదించుకుని బతకడం.

మనిషి సృష్టించుకున్న అరువది నాలుగు కళల్లో అరువది మూడు కళలు వినోదాన్ని విలాసాన్ని కలిగించేవే. ఒకే ఒక్క కళ ''సాహిత్యం'' మాత్రమే వికాసాన్ని కలిగించేది. చైతన్యాన్ని పెంపొందించేది. ఇది ఒక సృజనాత్మకమైన విశిష్ట కళ. దీనిని లోచూపులేని కవులు, పేరుప్రఖ్యాతుల కోసం వెంపర్లాడే కవులు దీనినొక ప్రత్యేకమైన పావుగా వాడుకున్న కవులు/ రచయితలు విశిష్టమైన ఈ కళను నికృష్టంగా మార్చిపేశారు. దీనిని పాఠకుల నుండి దూరం చేశారు. దీనికి కారణం ప్రాచీన ఛాందస ఆధునిక కవులే కాదు అనుభూతి, ఆలోచనలు లేని... తడి లేని కవిత్వం రాస్తున్న ఆధునిక వచన కవులు కూడా బలమైన కారణంగా చెప్పుకోవచ్చు. అందుకే నేటి తెలుగు కవిత్వం పట్ల పెదవి విరుపులు, అలసత్వాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. వర్తమాన సంక్షోభ సమాజాన్ని వ్యక్తీకరించే కవితా సృజన ఇది కాదు అని పించే విధంగా నిరుత్సాహంగా నేటి సాహిత్యం వెలువడుతుంది. అందుకే పాఠకులకు కవిత్వం మీద నమ్మకం పోయింది. చెప్పిన విషయాన్నే పాతపడ్డ అంశాలనే కొత్త అభివ్యక్తితో మార్చి మార్చి చెప్పకపోవడం వస్తు వైవిధ్యం లేకపోవడానికి బలమైన కారణంగా కనిపిస్తుంది. మత, రాజకీయ ధనార్జనా దివిటీల చుట్టూ కవితా హృదయాలు పరిభ్రమించినంత వరకు కలిమిలేములు తప్ప వెలుగునీడలు జీవితాల్లో వ్యక్తం కావు.

ఈ దేశం ఎందుకు మనిషితనానికి తిలోదకాలిస్తుంది? సాంస్కృతిక దోపిడీకి గురవుతుంది? అంటే జన సాహిత్యం పట్ల జనానికి ఆదరణ తగ్గడమే బలమైన కారణంగా చెప్పుకోవచ్చు. నేటి సాహిత్య ఛాయల్ని పరిశీలించినట్లయితే, నిశితంగా అవగాహనించుకున్నట్లయితే మనం మన సంస్కృతిని రక్షించుకుంటున్నామో? భక్షించుకుంటున్నామో? తేలిగ్గా గ్రహించవచ్చు. నేటికీ మనం ప్రాచీన ఔన్నత్యాన్ని, అధికార దాహాన్ని, రాజు, రాణుల తలు/ కవులు/ విమర్శకులు అతి స్వల్పస్థాయిలో తమ పూర్తి కాలాన్ని ఆయా సాహిత్య ప్రక్రియలకు వినియోగిస్తున్నట్లు తోస్తుంది. దీనిక గల బలమైన కారణం సాహిత్యంలో బతుకుతెరువు లేకపోవడమే! సాహిత్యాన్ని ఆదరించేవారు లేకపోవడమే. సామాజిక హితవు కోరే సాహిత్యం, చైతన్యాన్ని రేకెత్తించే సాహిత్యం సృజన చేయబడుతున్న సాహితీవేత్తల బతుకుతెరువును గూర్చి ఆలోచించవలసిన కర్తవ్యం ప్రభుత్వం మీద ఉంది అంటే ప్రజల మీద కూడా వుంది. సాహితీవేత్తలు వెలువరించే విలువైన పుస్తకాల్ని కొని ప్రోత్సహించవలసిన ధర్మం నేటి పరిపాలకుల మీద వుంది. సాహిత్యం మీద లోతైన అధ్యయనానికి, సృజనకు ప్రత్యేక ఉపాధి వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు కిమ్మనకుండా కూర్చున్నారు.

నేటి ప్రాపంచిక పరిస్థితులను, ప్రపంచీకరణ దృష్టితో అవగాహనించుకునే సాహిత్య అధ్యయనం ఎంతైనా అవసరమనే సత్యాన్ని పాలకులు గుర్తించాలి. ఆ దిశలో సాహిత్య మథనం జరగాలి.

కొంతమంది మేధావులు సాహిత్యం పుస్తక రూపంలో ప్రచురించడం దండగ; దాన్ని అంతర్జాలంగా వుంచవచ్చును. కంప్యూటర్ యుగంలో అంతర్జాలానికి వున్న ప్రాముఖ్యత పుస్తకాలకు లేదు అంటూ ఒక వాదాన్ని తెరపైకి తెస్తున్నారు. సాహిత్యానికి పుస్తక ప్రచురణంతో శాశ్వతత్వం అంతర్జాలంలో వుంచిన దానికి రాదు. నేడు దేశాలమధ్య వున్న పోటీతత్వాలు అయితేనేమి, కుట్రలు కుతంత్రాలతో కూడిన ఆధిపత్య ధోరణులయితేనేమి సాఫ్ట్‌వేర్‌ను సర్వనాశనం చేసే వైరస్ కనిపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్న విషయం లోక విదితమే! అట్టి పరిస్థితుల్లో అంతర్జాలం యొక్క శాశ్వత తత్వాన్ని ఆలోచించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అందుకే మంచి విలువైన గ్రంథాల ప్రచురణకు ప్రభుత్వం శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అంతర్జాలం వడిగల వ్యాప్తికి దోహదపడుతుంది. ఉన్నట్లుండి సడిలేక చస్తుంది కూడా!

హద్దుల్లేనిది, అనంతమైనది, యుగాలు గడిచినా దాని ఆద్యంతం చూసినవారు ఎవరూ లేనిది సాహిత్యం వొక్కటే! అందుచేత సాహిత్యంలో అనంతాన్వేషణ అవసరమనేది నిర్వివాదాంశం. మారే కాలంతో సాహిత్యం మారాలి. కాలరీతుల్ని సాహిత్యం పట్టుకోగలగాలి. వర్తమాన సంక్షోభ సమాజాన్ని వ్యక్తీకరించగలగాలి. సాహిత్య మొక్కటే ప్రజాసంబంధమైన భాష మాట్లాడుతూ, మనుషుల్ని కలిపే మానవత్వాన్ని పెంచుతుంది. కనుక అటువంటి చిరాయువునిచ్చే దినుసు 'దార్శనికత'గల సాహిత్యం సృజనచేయాలటే సాహితీవేత్తలు తమ పూర్తి కాలాన్ని సాహిత్యంలో ఇంకించాలి, సాహిత్యంగానే మొలకెత్తాలి.

హద్దుల్లేనిది, అనంతమైనది, యుగాలు గడిచినా దాని ఆద్యంతం చూసినవారు ఎవరూ లేనిది సాహిత్యం వొక్కటే! అందుచేత సాహిత్యంలో అనంతాన్వేషణ అవసరమనేది నిర్వివాదాంశం. మారే కాలంతో సాహిత్యం మారాలి. కాలరీతుల్ని సాహిత్యం పట్టుకోగలగాలి. వర్తమాన సంక్షోభ సమాజాన్ని వ్యక్తీకరించగలగాలి. సాహిత్య మొక్కటే ప్రజాసంబంధమైన భాష మాట్లాడుతూ, మనుషుల్ని కలిపే మానవత్వాన్ని పెంచుతుంది. కనుక అటువంటి చిరాయువునిచ్చే దినుసు 'దార్శనికత'గల సాహిత్యం సృజన చేయాలంటే సాహితీవేత్తలు తమ పూర్తి కాలాన్ని సాహిత్యంలో ఇంకించాలి, సాహిత్యంగానే మొలకెత్తాలి. అటువంటి సాహిత్య సృజనకు ప్రభుత్వం ఒక పెద్ద ప్రయోగశాల కావాలి అంటే ప్రభుత్వానికి సాహిత్యం యెడల చిత్తశుద్ధి ఉండాలి.

ప్రజాస్వామ్యం నేడు ప్రజ్వరిల్లుతోంది. ప్రజల భాష సాహిత్య భాషగా, ధీరోదాత్తులైన సామాన్య ప్రజల చుట్టే సాహిత్యం తిరగాలి, అనువాద సాహిత్యం పాలకవర్గాల సొంత సాహిత్యం కాకూడదు. గ్రాంథిక భాష పాలకవర్గాల సొంత భాష కాకూడదు. శ్రామికవర్గ సంస్కృతి, వర్గ చైతన్యం కావ్యాలై శోభిల్లాలి. దోపిడీ విధానాన్ని తూర్పారబట్టాలి... రాజకీయ అధికార వారసత్వం కాకూడదనే సత్యం, ఆర్థికోన్నతులే శాసనకర్తలవుతారనే నమ్మకం, రాజకీయమైన ప్రాపుగలవారు, ఉన్నతోద్యోగంలో వున్నవారే సాహితీవేత్తలనే విశ్వాసాన్ని పటాపంచలు చేసే మేధో సంపత్తి లౌకికవాద బీజాలై విస్తరించే భావజాలం రావాలి. మతం, రాజకీయం, సాహిత్యంలో రాజ్యమేలుతున్న దోపిడీ, ఆశ్రిత పక్షపాతం అరాచకవాదం అంతరిస్తేనే నిజమైన ప్రజాస్వామ్యం మూడు పూలు ఆరు కాయలై వెలుగొందుతుంది.

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి,
9948774243

కవిత్వం

నాకు
కవిత్వం కేవలం కవిత్వం కాదు
సగం శబ్దం సగం నిశ్శబ్దం
శబ్దమేమో బతుకు ఏడుపులోంచి
ఎగిసి పడుతున్న ఎక్కిళ్ళు!
నిశ్శబ్దమేమో బతుకు చేతగానితనంలోంచి
వ్యక్తమవుతున్న మౌనం!

నాకు
కవిత్వం కేవలం కవిత్వమే కాదు
సగం భాష సగం శ్వాస.
భాషేమో
నన్ను నేను ప్రకటించుకునే తండ్లాట,
శ్వాసేమో
నన్ను నేను పాతరేసుకునే దొంగాట.

నాకు
కవిత్వం కేవలం కవిత్వం కూడా కాదు
సగం బతుకు సగం చావు.
బతుకేమో
ఆశల పల్లకీలో పలవరింత,
చావేమో
ఓటమి అంచుల్లో ఉదాసీనత.

నిజానికి నాకు
కవిత్వం కేవలం కవిత్వం మాత్రమే కాదు.
సంక్షోభ కాల ప్రవాహంలో
ఒడ్డుకు చేర్చే తెరచాప.
బతుకు సమరంలో
నిలబెట్టే లంగరు.

- వారాల ఆనంద్, 9440501281

స్త్రీల కవిత్వానికి ఆహ్వానం

రోజురోజుకీ స్త్రీలపై అత్యాచారాలు, అణచివేత పెచ్చుపెరిగిపోతున్నది. రోడ్లమీదే కాదు, కార్యాలయాల్లో, బహుళజాతి కంపెనీల్లో... ఒక్కచోటేమిటి? ఇవ్వాళ స్త్రీలపై వివక్ష కొత్త కొత్త రూపాల్లో ప్రత్యక్షమవుతున్నది. అందుకే మునుపెన్నడూ లేనంతగా స్త్రీ చైతన్యవంతం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. స్త్రీవాద కవిత్వమే కాదు, స్త్రీల కవిత్వం కూడా తగ్గిపోయింది. పురుషాధిక్యత పెరిగి స్త్రీ శక్తి తరిగిపోతున్న వేళలో తిరిగి కవిత్వం పుంజుకోవలసి ఉంది. సమాజంపై ఏమాత్రమైనా దాని ప్రభావం పడుతుందని ఆశ. సినిమాలు, టీవీలు, పత్రికలు, వ్యాపార ప్రకటనలు, ఫ్యాషన్ పరేడ్‌లవంటి కొత్త సంస్కృతి స్త్రీ అంగడి సరకు కోసమే అన్నట్లు చూపుతున్నాయి. మార్కెట్‌కి స్త్రీ ఉపయోగపడే సాధనంగానే చూడటం బాధాకరం. అశ్లీల, చౌకబారు ఫొటోలు అంతటా రాజ్యమేలుతున్నాయి. కట్టూ బొట్టూ కొత్త తరహాకి మారుతున్న వేళ స్త్రీ తన అస్తిత్వాన్ని చేజార్చుకుంటున్నది. సమాజంలో సగానికి పైగా శ్రమని ధారపోస్తూ నిరంతరం కష్టాలు, నష్టాలతో కునారిల్లుతున్నది. అడవిలో, పాలాల్లో, ఫ్యాక్టరీల్లో, ఆఫీసుల్లో, మెట్రో నగరాల్లో అన్ని చోట్ల ఆమె శ్రమని పాందుతూనే లైంగిక హింసకు తట్టుకుని నిలబడి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుని నిలబడగలిగేలా చేయవలసి ఉంది. మారిన పరిస్థితుల్లో స్త్రీల గురించి స్త్రీలే రాయవలసి ఉంది. ఆంధ్రభూమి 'సాహితి'లో ఒక వారం పేజీ నిండా స్త్రీల కవితలు వేయదలిచాం. ఈనాటి అవసరం గుర్తించి ప్రత్యేకంగా రాసిన కవితలకు స్వాగతం. కవయిత్రులూ, మీదే ఆలస్యం! మీ రచనలు ఫిబ్రవరి 15లోగా మాకు అందాలి.

ఎడిటర్

'సాహితి', ఆంధ్రభూమి దినపత్రిక, 36, ఎన్‌డి రోడ్, సికిందరాబాద్ - 03.
email: sahiti@andhrabhoomi.net

అవీ చూపులంటే...

చూపులు ఎంత గొప్పవే,
అవి నింగిలో
ఎంతెంత ఎత్తులకైనా ఎగురగలుగుతాయి.
తమకెదురైన మేఘాలను
ఉయ్యాలలుగా చేసుకొని
ఎంతసేపైనా ఊగగలుగుతాయి.
మండుతున్న నిప్పుల మీద
మట్టిలో నడిచినట్టు
అలవోకగా నడవగలుగుతాయి.
మంచుగడ్డల మీద
గంటలకొద్ది పొర్లుతున్నా
వాటికి జివ్వుమనిపించదు.
జలపాతాల పై అంచుల మీద
కూర్చుని
వాటితోపాటు
కిందికి దూకగలుగుతాయి.
రివ్వున వీచే గాడ్పులతోపాటు
సునాయాసంగా తరలిపోతాయి.
ఇంతటి బహుముఖ సమర్థత వున్న
చూపులపైన
ప్రశంసలు కురిపిస్తుంటే
అవి సవినయంగా ఇలా అన్నాయి -
"నింగిలోకి ఎగరగలుగుతాం.
నిప్పులపైన నడవగలుగుతాం.
మంచుగడ్డలపైన పొర్లగలుగుతాం.
జలపాతాలతోపాటు దూకగలుగుతాం.
గాడ్పులతోపాటు తరలిపోగలుగుతాం.
ఇన్ని శక్తులు మాకున్నా
నేలలోకి చొరబడి చూడలేం.
అదీ మా అశక్తత."
అలా అంటున్న చూపుల మాటలు
వింటుంటే
నాకనిపించింది
ఎంతటి ప్రజ్ఞావంతులకైనా
ఏదో ఒక లోపముంటుందేమో అని.

- సి. నారాయణరెడ్డి

అనువాదపు త్రాసులో హిందీ కవిత

**పాద్దు పొడవక ముందే ఎవరో కలల మీద తట్టిలేపారు
లేచి తలుపు తీస్తే సరిహద్దు ఆవలివైపు నుండి అతిథులు
కొందరు లోపల అడుగుపెట్టారు
ముఖాలన్నీ విన్నవీ చదివినవే
కాని, వారి కళ్ళలో మాతం ఏదో దైన్యం
కాళ్ళకు నీళ్ళిచ్చి, ఆవరణలో ఆసనాలు వేసి కూర్చోబెట్టాను
పెద్ద పెద్ద తందూర్ రోటీలు వారి ఆకలి ముందుంచాను
వచ్చిన నా అతిథులు గత సంవత్సరం
వారు పండించిన బెల్లం... పొట్లం కట్టుకొచ్చారు
కళ్ళు తెరచి చూస్తే ఇంట్లో ఎవరూ లేరు
చెయ్యి పెట్టి చూస్తే తందూర్ ఇంకా చల్లారనే లేదు
పైగా పెదాలకంటుకున్న తీపి ఇంకా అంటుకుపోతూనే ఉంది
బహుశా కలేమో- అవును కలే అయి ఉంటుంది
సరిహద్దు మీద నిన్న రాత్రి కాల్పులు జరిగాయని విన్నాను
అవును నిజమే! నిన్న రాత్రి సరిహద్దు మీద
కొన్ని కలల హత్య జరిగిందని విన్నాను"**

ఇది హిందీ కవి గుల్జార్ కవిత. ''సునా హై కల్ రాత్ సర్‌హద్‌పె కుచ్ ఖాబోంకా ఖూన్ హు ఆ హై'' అని గుల్జార్ అన్న మాట భారత, పాకిస్తాన్‌ల మైత్రీ సంబంధాల మీద తిరుగులేని వ్యాఖ్య! తీవ్రవాద సమస్యతో ఉక్కిరిబిక్కిరవుతున్న సామాన్య ప్రజానీకపు ఆర్తిని గుల్జార్ తనదైన, సరళమైన శైలితో కవిత్వీకరించారు. హిందీ నుండి తెలుగులోకి అనువదింపబడిన కవుల ప్రసక్తి రాగానే, మనకు కవి ఆజ్ఞేయ గుర్తుకొస్తారు. రఘువీర్ సహాయ్ గుర్తుకొస్తారు. హరివంశ్‌రాయ్ బచ్చన్, బాబా నాగార్జున్, ఆలోక్ ధన్వా, డా.కేదార్‌నాథ్ సింగ్, అశోక్ వాజ్‌పాయ్, చంద్రకాంత్ దేవ్‌తాలె, సురేశ్ ఉపాధ్యాయ్, రాజేశ్ జోషి, నరేంద్రరాయ్, తరిత్‌కుమార్ వంటి అగ్రశ్రేణి హిందీ కవులెందరో గుర్తుకొస్తారు. వీరివే కాక ఎంతోమంది హిందీ కవుల కవిత్వం తెలుగులో వెలుగులోకి వచ్చింది. అందుకు ఎంతోమంది కృషి చేశారు. ఆలోక్ ధన్వా రచన 'బుడగలూ- గాలి పడగలు' కవితలో కొన్ని చరణాలు చూడండి.

*"... ప్రపంచంలోకెల్లా అతి పలుచనైన కాగితం ఎగరడానికి
ప్రపంచంలోకెల్లా అతి అందమైన రంగుల ఆట వస్తువు కదలడానికి
నన్ను రెండు వెదురు పుల్లలు ఆకాశం అంచులు తాకడానికి
ఈలలు, చప్పుళ్ళు, కేరింతలు, తుళ్ళింతలతో
చిన్నారుల ఒక సునిత ప్రపంచం మేల్కొనడానికి
సీతాకోక చిలుకల రంగుల ప్రపంచం ఆవరించడానికి
పూలను దాటేస్తూ శరద్రుతువు వచ్చేసింది-"*

ఇది చిన్న పిల్లల మనస్తత్వం, గాలి పటాలెగరేయడంలో వారి ఉత్సాహాల, కోలాహలాలతో హిందీ కవి ఆలోక్ ధన్వా తయారుచేసి, సాహిత్యాకాశంలో ఎగరేసిన ఒక గొప్ప గాలి పటం! తెలుగు పాఠకులు కూడా ఈ అనువాదాన్ని ఎంతగానో ఆదరించారు. కవిత్వం పేరిట నిజాలకు మసిపూసి మారేడు కాయ చేయకుండా అంతర్జాతీయ సభల్లో సైతం వాస్తవాల్ని ప్రకటించే కవి రఘువీర్ సహాయ్. 'స్వేచ్ఛకు ముఖమేదీ' అని ప్రశ్నిస్తూ ఇలా అంటారు.

*"హత్యలు, దోపిళ్ళు, రక్తప్రవాహాలే
నేటి భారతీయ సంస్కృతి ప్రతిబింబాలు
దోపిడీ, ఈ నేలను.. లోపలి మట్టి పొరల దాకా చీల్చింది
పొరల మధ్య ఒక మొలక ఉంది- రండి
దాన్ని మనం చేతుల్తో పై కెత్తుదాం మట్టితో సహా -*

సురేశ్ ఉపాధ్యాయ సమకాలీన హిందీ కవులలో ముఖ్యమైనవారు. వ్యంగ్య కవిత వింటే వీరి నోటే వినాలి. ఎవరూ ఊహించని విషయాన్ని ఇతివృత్తంగా ఎన్నుకుని, ఎవరూ ఊహించనంత బలంగా చెప్పగలరు. ''కవి స్వగతం'' కవిత ప్రారంభ వాక్యాలు గమనించండి.

*"మీరేమనుకుంటున్నారు? మేమేం పెద్ద తెలివిగల వాళ్ళమని
మా దగ్గర గీతాలు, గజళ్ళు, గేయాలు, పద్యాలు కుప్పలు తెప్పలుగా
ఉన్నాయని అనుకుంటున్నారా? అలాంటిదేం లేదండి బాబూ
మమ్మల్నిక్కడికి ఆహ్వానించి సన్మానిస్తారంటే
ఏవో నాలుగు విరిగిపోయిన వాక్యాలు కట్టగట్టుకొచ్చాం
మీరంతా నవ్వుతున్నారంటే, ఎగిరి గంతేస్తున్నారంటే
అందులో అంతంత గూఢార్థాలేమున్నాయోనని
మాకు మేమే జుట్టు పీక్కుంటున్నాం
నాలుగు కవితలు జేబులో వేసుకుని నిగ్గనేది లేకుండా
దేశమంతా తిరుగుతుంటాం.
నన్నెవరో అడిగారు సాహిత్య విలువలు గల కవితేదైనా చదవమని
చెవిలో పువ్వు పెట్టుకున్న వాడిలాగా కనిపిస్తున్నానా?
నా గొయ్యి నేనే తవ్వుకుని నన్ను నేనే పూడ్చి పెట్టుకోవాలా చెప్పండి?"*

వీరందరికంటే భిన్నంగా చంద్రకాంత్ దేవ్‌తాలె అనుభూతి కవిత్వం రాస్తారు. స్త్రీ పురుషుల కలయికను ఉదాత్తంగా, మహోన్నతంగా చిత్రించిన పద చిత్రం ''హానీమూన్'' కవిత.

*"ఇద్దరూ అతురతతో ఉన్నారు
చంద్రుని పాడితో చేసిన పానీయం
ఒకరికొకరు తాగించాలని!
ఇక ఎప్పుడు ఏమవుతుందో ఆ ఈశ్వరుడికే ఎరుక
చంద్రుడు సుఖంగా సురక్షితంగా ఆకాశంలో ఉన్నాడు
వారిద్దరికీ మధ్య జరుగుతున్న టగ్-ఆఫ్-వార్‌లో
తన ప్రమేయమేదీ లేదన్నట్లు-
గాఢ నిద్రలోకి జారింది అలిసిపోయిన సముద్రం
వాళ్ళిద్దరు - వాళ్ళిద్దరు నిద్రపోయ్యారు
జంట శీలల వలె నగం ఇసుకతో కప్పబడి,
నగం వెనెట్లో మెరిసిపోతూ-"*

ఒక నిబద్ధతతో మంచి కవిత్వం రాసి, కవులుగా గుర్తింపు పొందేవారు ఏ కాలంలోనైనా తక్కువే ఉంటారు. వారు ఏ హడావుడి చేయకపోయినా వారి కవిత్వం జనానికి ఆలస్యంగానైనా అందుతుంది. నిజమైన కవితా ప్రేమికులు వెతుక్కుని చదువుకుంటారు. ఇక అధికారం, డబ్బు, పలుకుబడి, హోదా, రాజకీయం అడ్డం పెట్టుకుని కవులుగా చలామణి అయ్యేవాళ్ళు సహజంగా ఎక్కువగా ఉంటారు. వాళ్ళు తాము మహాకవుల మని శిష్యులతో ప్రచారం చేయించుకుంటూ ఉంటారు. ప్రచారం సాగినంత కాలం వారి పేరు ప్రచారంలో ఉంటుంది. కార్టూన్ కవిత్వం రాసి రాసి, కార్టూన్‌లుగా మిగిలిపోయే పత్రికా కవులూ ఉంటారు. కవిత్వ బలం లేకపోతే వారి వాక్యాలు కార్టూన్‌ల లాగా కూడా నిలబడవు. అసలైతే కార్టూన్ బలమైన ప్రక్రియ. నిజానికి ఇలాంటి వారి వాక్యాలు కార్టూన్‌తో పోల్చడం దండగ! అన్యాయం కూడా!!

ప్రముఖ హిందీ కవి కన్వర్ నారాయణ్ వీటిలో మొదట చెప్పిన అరుదైన రకానికి చెందినవారు. ఆయన ''చూపు'' అనే కవిత ప్రారంభ వాక్యాలు గమనించండి.

*"వేల వేల సంవత్సరాల నుంచి
తెగని, ముడివడని అదే పాత లెక్కలా
మనిషి అనేక రకాల పరిష్కారాలకు ఎదురౌతున్నాడు
కూడబడి, తీసివేయబడి, గుణించబడి, హెచ్చవేయబడి..
జవాబు శూన్యమయ్యే గణితం
మనిషి జీవితం!"*

డాక్టర్ కేదార్‌నాథ్‌సింగ్ పర్యావరణ నేపథ్యంగా ''సజీవ దహనం'' శీర్షికన కవిత రాస్తూ అంటారు.

*"వడగంి చెట్టును కోస్తున్నాడు
చల్లని అడవి గర్భంలో బతికి బతికి
అతడా నిర్ణయానికి వచ్చాడు
ఊగిపోయే కొండానికీ, వీగిపొయ్యే వ్రేళ్ళకూ మధ్య
పక్షి గూడును పడగొట్టే ఇనుప రంపం పరపరా నడుస్తోంది
ఉరకలు వేసే ఉడుత క్షణకాలం మెరిపించిపోయే తోకా
ప్రశాంతతలో నిశ్చింతగా పులి పిల్లలు పెట్టే గురకా
తెగుతున్నాయి. కాండంలో పడుతున్నాయి గతంలో
వడగంి మానును కోస్తూనే ఉన్నాడు
మాను మధ్యలోంచి ఎక్కడో...
పక్షి ఆక్రోశిస్తూనే ఉంది"*

సామాజిక సమస్యలతోపాటు కవులు ఈనాడు వైజ్ఞానిక విషయాల గూర్చి, సమస్యల గూర్చి సృజనాత్మక రచనలు చేయాల్సి ఉందన్న విషయాన్ని డా. కేదార్‌నాథ్‌సింగ్ వంటి కొంతమంది కవులు గుర్తుచేస్తున్నారు. ఇలా ఆలోచిస్తున్నవారు తెలుగు కవుల్లో ఎంతమంది ఉన్నారు?

కేవలం భాషా పాండిత్యం ఉన్నంత మాత్రాన వారు కవులుగా నిలబడలేరని, తగినంత ఊహాశక్తి, దాన్ని వ్యక్తీకరించగల మేధాశక్తి, వైజ్ఞానిక పరంగా కొత్త కోణం, హేతుబద్ధమైన కొత్త చూపు, అందులో మళ్ళీ తీవ్రత ఉంటేనే ఈ సంక్షిష్ట సమాజంలో మొదటి వరుసలో నిలబడగలిగే కవులుగా, రచయితలుగా ఎదగగలరని గత అర్ధశతాబ్ది కాలం రుజువు చేసింది. ఇది అన్ని భాషా సాహిత్యాల్లో వచ్చిన మార్పు. అదే అనువాదాల్లో కూడా కనిపిస్తోంది. ఈ వ్యాసంలో ఉదహరించిన వారు భాషా పండితులు కారు. వేర్వేరు చదువులు చదివి, విభిన్న శాఖలలో, వృత్తులలో పనిచేస్తున్నవారు.

ఒక రకంగా ఇటీవలి కాలంలో అనువాదాల అన్వేషణ ఎక్కువయ్యింది. వాటికి ఆదరణా ఎక్కువే అయ్యింది. అందుకు కారణం కొత్త భావాలకోసం, కొత్త వ్యక్తీకరణలకోసం పెరిగిన తపన. తహతహ. మరీ తెలుగు కవిత్వం విషయానికొస్తే, కవిత్వం పలుచబడి, ప్రక్రియల యావ ఎక్కువై కీర్తికండూతి పెరిగి, కవిత్వ నిజాయితీ తగ్గి.. ఎన్నో కారణాలవల్ల కవిత్వ పాఠకులు అనువాదాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంతవరకు సంతృప్తి చెందుతున్నారు. అలాగని తెలుగులో మంచి కవిత్వం అసలే రావడం లేదని కాదు.

- దేవరాజు మహారాజు
devaraju.maharaju@gmail.com

చిట్కాలు

★ చర్మం తెల్లగా, మృదుత్వం కలిగి ఉండాలని ఆశించేవారు ఇంట్లోనే చిన్న చిన్న చిట్కాలతో మంచి ఫలితం పొందవచ్చు. చెంచాడు నిమ్మరసంలో కాస్త తేనె, మూడు చుక్కల గ్లిజరిన్ కలిపి పెదాలకు తరచూ రాసుకుంటే నలుపుదనం క్రమేపీ అదృశ్యమవుతుంది.

★ ముఖ భాగం పొడిబారినట్లు అనిపిస్తే చెంచాడు తేనెలో కాసింత సోయా పిండి, కొబ్బరి పాలు కలిపి ఆ మిశ్రమాన్ని బాగా పట్టించాలి. ఇలా కొన్ని రోజుల పాటు రాసుకుంటే ముఖం కాంతివంతమవుతుంది.

★ నాలుగు చెంచాల తేనెలో మూడు చెంచాల కొబ్బరి నూనె బాగా కలిపి తలకు మర్దనా చేసుకుంటే పొడిబారిన జుట్టుకు మంచి పరిష్కారం లభిస్తుంది.

★ శరీరంపై గాయాలు, కాలిన మచ్చలు అంతరించాలంటే కొన్ని రోజుల పాటు తేనె రాయాలి. స్నానం చేసే ముందు శరీరానికి తేనె పట్టించి ఓ పావు గంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం సరికొత్త అందాలను సంతరించుకుంటుంది.

★ లేత వేపాకులను,మెంతులను కలిపి రాత్రివేళ నీటిలో నానబెట్టి, ఉదయాన్నే మెత్తగా రుబ్బి తలకు పట్టించి గంట సేపయ్యాక కుంకుడు కాయలు లేదా షాంపూతో తలస్నానం చేస్తే చుండ్రు సమస్య నివారణ అవుతుంది.

★ బాదం పప్పును చూర్ణంలా చేసి రోజ్‌వాటర్‌లో కలిపి, ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడ భాగానికి రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే చర్మానికి నిగారింపు వస్తుంది.

అడవిబిడ్డలకు అభయ హస్తం

ఒకప్పుడు కొండకోనల్లో స్వేచ్ఛగా విహరించే ఆ అడవిబిడ్డలకు ప్రభుత్వ చట్టాలు ప్రతిబంధకంగా మారాయి.. చెట్లను నరికేస్తూ, వన్యప్రాణులను వధిస్తూ స్వతంత్రంగా బతికిన వారు నేడు జీవనోపాధి కోసం హస్తకళలను ఆశ్రయించారు.. కొద్దిపాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకుని నేడు మనుగడ సాగిస్తున్నారు. అవిద్యతో, ఆర్థిక సమస్యలతో అవస్థలు పడుతున్న గిరిజనుల జీవితాల్లో ఓ యువతి వెలుగులు నింపింది. రాజస్థాన్‌లోని 'రంతాంబోర్ పులుల సంరక్షణ కేంద్రం' ప్రాంతంలో వందలాది గిరిజన కుటుంబాలు నేడు వన్యప్రాణుల వేటకు స్వస్తి పలికి స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపుతున్నాయి. ముంబైకి చెందిన దివ్య కందాల్ (29) ఈ అడవిబిడ్డల జీవన విధానంలో అనూహ్యమైన మార్పులను తెచ్చారు. వృత్తిరీత్యా పోషకాహార నిపుణురాలైన దివ్య ముంబై నుంచి తన మకానును సవాయ్ మధోపూర్‌కు మార్చి అనేక విషయాల్లో గిరిజనులను చైతన్యవంతం చేశారు. 'రంతాంబోర్ పులుల సంరక్షణ కేంద్రం' వల్ల గిరిజనులు గతంలో వలే అడవుల్లో సంచరించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో దివ్య ఇక్కడ 'ధోంక్ క్రాఫ్ట్' పేరిట ఓ వ్యాపార కేంద్రాన్ని తెరిచి గిరిజనులకు ఉపాధి కల్పించారు.

దివ్య కందాల్

తాను చదువుకునే రోజుల్లో మధ్యప్రదేశ్‌లోని అటవీ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించినపుడు అక్కడి పులుల సంరక్షణ కేంద్రాల వల్ల గిరిజనులు ఉపాధికి దూరం కావడాన్ని దివ్య గమనించారు. అడవులు, వన్యప్రాణుల పరిరక్షణ చట్టాలతో పలు ఆంక్షల కారణంగా గిరిజనుల పరిస్థితి పూర్వంలా లేదని ఆమె గుర్తించారు. పర్యాటక రంగంలో అడవిబిడ్డలను భాగస్వాములుగా చేస్తేనే వారి బతుకుల్లో మార్పు తథ్యమని ఆమె భావించారు. ముంబైలోని ఓ ప్రముఖ బహుళ జాతి సంస్థలో అయిదేళ్లపాటు పోషకాహార నిపుణురాలిగా పనిచేసినా, ఆ వృత్తి ఆమెకు సంతృప్తినివ్వలేదు. ఆ ఉద్యోగాన్ని వదులుకుని 2009లో ఈమె సవాయ్ మధోపూర్‌కు చేరుకుని 'ధోంక్ క్రాఫ్ట్' పేరిట వ్యాపార సంస్థను ప్రారంభించారు. ఇందులో గిరిజనులను భాగస్వామ్యం చేసి, లాభాలను వారికి కూడా ఇవ్వాలని నిర్ణయించారు. హస్తకళలను బాగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని, ఫలితంగా గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆమె భావించారు. కుట్లు, అల్లికలు, ప్రింటింగ్, కొన్ని సంప్రదాయ హస్తకళల్లో వారికి శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు అటవీ గ్రామాల నుంచి ఎంతోమంది గిరిజనులు హస్తకళలపై ఆసక్తి చూపారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు కల్పిస్తే మరింత ఎక్కువ మందికి స్వయం ఉపాధిలో శిక్షణ ఇప్పించాలని ఈమె భావిస్తున్నారు. హస్తకళలు నేర్చుకున్నాక గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగైంది. కొన్ని కుటుంబాల్లో యువతులు సమీప పట్టణాల్లో చదువుకుంటున్నారు.

కాగా, హస్తకళల పేరిట నాణ్యత లేని వస్తువులను విక్రయించే దుకాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయని దివ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీల్లో తయారైన వస్తువులను గిరిజనులు రూపొందించినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ పర్యాటకులను కొందరు మోసం చేస్తున్నారని ఆమె ఆరోపిస్తున్నారు. పర్యాటకులను తీసుకువచ్చే ట్రావెల్ ఏజెంట్లు కూడా భారీగా కమీషన్లు దండుకుంటూ వంచనలకు పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యల వల్ల ఈ ప్రాంతానికి చెడ్డపేరు వస్తుందని ఆమె అంటున్నారు. సవాయ్ మధోపూర్‌లో ఉంటున్నందున తాను విలాసవంతమైన జీవనానికి దూరమైనప్పటికీ, గిరిజనుల సంక్షేమం కోసం పని చేయడం ఎంతో ఆత్మసంతృప్తిని కలిగిస్తోందని దివ్య చెబుతున్నారు.

లైంగిక నేరాలకు కొత్త చట్టాలతో చెక్!

మహిళలపై హింస, లైంగిక నేరాలను నిరోధించే దిశగా పలు రాష్ట్రాలు కొత్త చట్టాలకు, ప్రత్యేక విభాగాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాయి. ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచారం ఘటన తర్వాత మహిళలకు భద్రతపై భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు కమిటీలను నియమించింది. మహిళల్లో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు కరాటే వంటి యుద్ధవిద్యల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాయి. లైంగిక నేరాలపై దృష్టి సారించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని గోవా ప్రభుత్వం నిర్ణయించింది. బస్సుల్లో, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడేవారిని కనిపెట్టేందుకు ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

నేరగాళ్లపై నిఘా ఉంచేందుకు, కేసుల విచారణ త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఈ కొత్త వ్యవస్థలో ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ న్యాయస్థానాల్లో కేసులను వీలైనంత త్వరగా విచారించేలా హైకోర్టు కూడా తగు సూచనలు చేస్తుంది. లైంగిక నేరాలపై పరిస్థితిని సమీక్షించేందుకు ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 6 వరకూ ఓ గంట సేపు సంబంధిత అధికారులు సమావేశమవుతారని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరికర్ ప్రకటించారు.

కేరళలో ప్రత్యేక చట్టం..

మహిళల పట్ల సమాజంలో గౌరవం పెంచేందుకు, భద్రతపై వారిలో నమ్మకం కలిగించేందుకు త్వరలో కొత్త చట్టాన్ని రూపొందించనున్నట్లు కేరళ ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవలి కాలంలో మహిళలపై హింస, అత్యాచారాలు పెరిగిన నేపథ్యంలో పదునైన చట్టం అవసర మని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశగా 2013-14లో ప్రతి జిల్లాలో కనీసం ఒక పంచాయితీని 'మహిళలు, చిన్నారులకు క్షేమకరమైన ప్రాంతం'గా తీర్చిదిద్దుతారు. ■

ఖాన్ పేరే పరేషాన్!

సూపర్ స్టార్ అయిన తమ హీరో కూడా దిలీప్ కుమార్ లాంటి 'తెర పేరు' పెట్టుకుంటే ఇంత గొడవ వుండకపోనంటారు- షారూఖ్ ఖాన్ అభిమానులు. పాకిస్తాన్ అంత రంగిక శాఖామాత్యుడు షారూఖ్ విషయమై లేని ఆపదలు వూహించి, మొసలి కన్నీరు కార్చడం కేవలం ప్రజల్ని ప్రధాన సమస్య నుంచి ఏమార్చడానికేనని అందరికీ తెలుసు. షారూఖ్ ఓ ప్రకటన చేస్తూ తన పేరులోనూ, ఒక టెర్రరిస్టు పేరులోనూ 'ఖాన్' వుండటం చేతనే ఈ అవస్థ వచ్చిందని ఇండియాలో కూడా తనని కొందరు అపార్థం చేసుకునే ప్రమాదం వున్నదనీ- వివరించాడు... విచారించాడు.

'నా భార్య హిందూ, ఆమె పేరు గౌరి. పిల్లలు ఆర్యన్ ఖాన్, సుహానాలు. వీళ్లకి నేను పెట్టుకున్న పేర్లు చూడండి. మా నాన్నగారు మీర్ తాజ్ మహమ్మద్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. మా అమ్మ లతీఫ్ ఫాతిమా నేను దిలీప్‌కుమార్ లాంటి నటుడ్ని అవ్వాలని కోరుకుంది. నాకిక్కడేం తక్కువ? నేను పాకిస్తాన్‌కి ఎందుకు పోవాలి?'-అంటూ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. లోగడ అమెరికాలో షారూఖ్‌ఖాన్‌కి తన పేరు వల్లనే ఎంతో అవమానం జరిగింది. పేరులో పెన్నిధి ఉందో లేదో గానీ, పేరుతోనే ఎంతో ప్రమాదం ఏర్పడింది 48 ఏళ్ల ఈ మహా గ్లామర్ నటుడికి!

'గీతగాళ్ల' అశ్వమేధ యాగం!

''గుట్టుమెక్కేశాడ్రా'' అంటారు- బాగా 'మందు' పట్టించేసినవాడిని. అసలు 'మందు' అన్న మాటకి అర్థమే మారిపోయింది. తమిళనాడులోని తాటి, ఈత కల్లు గీతగాండ్ర సంఘం- తమ హక్కులపై పోరాటానికి, అశ్వమేధ యాగానికి పలు కార్యక్రమాలు తయారుచేసుకున్నాయి. రామాయణ, భారతాల్లో రాజులు చేసినట్లు అభివర్ణించబడ్డ అశ్వమేధయాగాన్ని ఈ కల్లు కార్మికులు ఫిబ్రవరి 28న చేస్తారుట! ఈ ఉద్యమంలో ఓ (యాగ) అశ్వాన్ని కొత్త సచివాలయ భవన సముదాయం ముందు వదిలిపెడతారు. అది అక్కడ్నుంచి సెయింట్ జార్జి కోట దాకా- జైత్రయాత్ర మొదలెడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వ సచివాలయం జార్జి కోట భవనాలలోనే పనిచేస్తున్నది. ఈ యాగాశ్వాన్ని ఎవరు అడ్డుకుంటే వారితో- గీత కార్మిక సంఘాల ప్రతినిధులు మాటల యుద్ధం చేయడానికి రంగంలోకి దూకుతారు. ఈ వాద, ప్రతివాదాల తంతు ప్రజాస్వామికమైన, శాంతియుతమైన పంథాలోనే నడుస్తుంది. ధైర్యం వుంటే గుజ్జాన్ని పట్టుకోమన్న- ఈ నూతన ఉద్యమ సరళి ఇంకా ఇతర ఉద్యమాల్ని కూడా ఆకర్షిస్తుందేమో?... చూడాలి మరి..!

veeraji@sify.com

పెద్దల ఆవేశం - పిల్లలకు శాపం

'టక్ టక్ టక్' అని కర్రల శబ్దంతోపాటు కాలింగ్ బెల్ మోగటంతో తలుపు తెరిచాను, గుమ్మంలో నా కొలీగ్ శార్వరి. ''హాయ్! శార్వరీ'' అంటూ పలకరిస్తుంటే వాళ్ళబ్బాయ్ పన్నెండేళ్ళ శరత్ ''నమస్తే... ఆంటీ!'' అంటూ రెండు చంకల కింద ఊతంగా ఉన్న కర్రల మధ్య నుంచి బేలన్సు చేసుకుంటూ చేతులు జోడించి నమస్కరించాడు. పుల్లల్లాగా ఉన్న రెండు కాళ్ళూ కర్రల మధ్య వేళ్ళాడుతున్నాయి. ఒక్క ఉదుటున గుమ్మంలోంచే ఆ పసివాడ్ని అక్కున చేర్చుకున్నాను. వాడి తల మీద ముద్దుపెట్టిన నా పెదవుల నుంచి ఓ 'ఆశీర్వాదం', కళ్ళ నుంచి జలజలా కన్నీళ్ళు వాడి తలపై 'అక్షింతలు'గా కురిశాయి. ''నన్ను చూసి బాధపడుతున్నరా? ఆంటీ!'' చివ్వన తలెత్తి నా ముఖంలోకి చూసిన వాడి నోటినుంచి వెలువడ్డ మాట 'బాణమై' నా గుండెను చీల్చింది. 'లేదు నాన్నా.. లేదు.. నీకేం బంగారు తండ్రివి.. నిన్ను చూసి బాధెందుకు? గర్వపడతాను. ఇవి ఆనంద బాష్పాలు. అవునూ! సెవెంత్ కామన్ ఎగ్జామ్స్‌లో 'క్లాస్ ఫస్ట్' వచ్చావని అమ్మ చెప్పింది. నీకేం 'గిఫ్ట' కావాలో చెప్పు' అంటూ వాడి ఫీలింగ్స్‌ని డైవర్టు చేద్దామని ప్రయత్నిస్తుంటే, ''వీడివన్నీ ముదురు మాటలు. సిగ్గుతో ఛస్తున్నాను, నువ్వేం బాధపడకు మీనా!'' అంటున్న శార్వరి కేసి చూసి ''స్టాపిట్.. శార్వరీ! స్టాపిట్!'' అంటూ పెద్దగా అరిచాను. నా చూపుకే శక్తి ఉంటే శార్వరి మాడి మసయ్యేది. తల్లిమాటలకి దెబ్బతిన్న పావురంలా విలవిల్లాడాడు శరత్. ''నాన్నా.. శరత్! అక్క కంప్యూటర్ రూమ్‌లో ఉంది. నువ్వు కూడా అక్కతో పాటు గేమ్స్ ఆడుకో'' అంటూ ఆ పసివాడ్ని పక్కరూమ్‌లోకి పంపి, 'శార్వరీ.. నీకు మతిగాని పోయిందా? మీ అశ్రద్ధకి పసివాడు మూల్యం చెల్లిస్తున్నాడు, ఇంకా బుద్ధి రాలేదా? ఏం మాట్లాడుతున్నావ్?'' అని ఆమెతో నా కున్న చనువు కొద్దీ మందలింపుగా అన్నాను. శార్వరి నా 'కొలీగ్' మాత్రమే కాదు, నాకు డిగ్రీ వరకూ 'క్లాస్‌మేట్' కూడా. 'ఏం చెప్పనే నా బాధ! ఇదంతా వాడి పూర్వ జన్మ పాపం, నా ఖర్మ'' అని నుదురుకొట్టుకుంటున్న శార్వరితో 'శార్వరీ.. ఆపు! నీ తల్లి మనసు ఇంత కఠినంగా మారిందేమిటి? పసివాడి నెత్తిన పాపాల మూట పెట్టి చేతులు దులుపుకోకు. ఆ భారానికి వాడు ఇంకా కుంగి కుదించుకుపోతాడు. శారీరకంగా కాకపోయినా వాడ్ని మానసికంగానైనా ఎదగనీయ్. మీ భార్యాభర్తల నిర్లక్ష్యానికి, బద్ధకానికి, పసివాడి బతుకు బండలు చేశారు. దానికి పూర్వజన్మ పాపమంటూ కర్మసిద్ధాంతాన్ని జోడించి తప్పించుకోవద్దు'' అంటూ నా ఆవేదనను వెళ్ళగక్కాను.

''పిల్లల్ని కంటాం గానీ, వాళ్ళ రాతల్ని కంటామా?'' అంటూ ముతక సామెతని అడ్డం పెట్టుకుని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల అలసత్వాన్ని, మీదుమిక్కిలి బద్ధకాన్ని పెంచుకుంటూ పసివాళ్ళ భవితని 'పణంగా' పెడుతున్నారు. ఏ పాపం ఎరుగని ఆ పసివాళ్లు- కళ్ళు లేక కొందరు, కాళ్ళు చేతులు చచ్చుబడి మరికొందరు, మానసిక వికాసం కొరవడి నిస్తేజంగా సుదీర్ఘ జీవన యాత్రలో కాలాన్ని నెడుతున్నారు.

మరికొందరు తల్లిదండ్రులు మితిమీరిన కఠినత్వంతో, క్రమశిక్షణ పేరుతో పిల్లలకు పెట్టే హింసలు వర్ణనాతీతం. దాని ఫలితం ఆ పసివాళ్ళని జీవితాంతం వెంటాడుతూ మానసిక, శారీరక అంగవైకల్యాన్ని ప్రసాదిస్తుంది. మా బంధువుల్లో ఒకామె తన కూతురు చెప్పిన పని సరిగా చెయ్యలేదని గట్టిగా చెంపమీద కొట్టిన దెబ్బ ఫలితం- కర్ణభేరి పగిలి ఆ అమ్మాయి శాశ్వతంగా చెవిటితనంతో బాధపడటం మేం చూస్తున్నాం. పసివాళ్ళపై తమ ప్రతాపాన్ని చూపే కొందరు తల్లిదండ్రులు పిల్లల చేతులు మెలిపెట్టడం, తలమీద గట్టిగా కొట్టటం, గరిట కాల్చి వాతలు పెట్టటం వంటి కఠిన శిక్షలతో క్రమశిక్షణ నేర్పాలని చూసినందుకు, ఆ శిక్షలు పిల్లల్ని శారీరక, మానసిక అంగవైకల్యానికి గురి చేయటం సభ్య సమాజంలో కొన్ని సంఘటనలే.

కొన్ని ఇళ్ళల్లో భార్యాభర్తలు ఎక్కువగా మాట్లాడుకోకుండా అతి ముభావంగా, ఆచి తూచి మాట్లాడుకుంటారు. ఆ ప్రభావం వాళ్ళ పిల్లల మానసిక స్థితిపైబడి, వాళ్ళు మానసిక వికాసం కోల్పోయి భవిష్యత్‌లో 'బుద్ధి మాంద్యం'తో బాధపడటం జరుగుతుంది. అలాంటివాళ్ళు ఇతరుల చేత ఆట పట్టించబడి అవహేళనకి గురవుతుంటారు. భవిష్యత్‌లో దీనికి తగిన మూల్యం ఆ తల్లిదండ్రులే చెల్లించుకుంటారు.

ఏ దంపతులైనా పిల్లల్ని కనటమే ఓ ఘనకార్యంలా, తాము చేసే మహత్తర త్యాగంలా భావించకూడదు. ఆ పిల్లలు భూమిపై పడ్డ నాటినుంచీ వాళ్ళ శారీరక, మానసిక ఎదుగుదలకి తమవంతు బాధ్యతని ఎంతవరకు సక్రమంగా నిర్వర్తించగలుగుతున్నామనే అన్న అంశాన్ని తరచూ విశ్లేషించుకుంటే మంచిది.

అంతేగాకుండా ఉన్నంతలో వాళ్ళ భవిష్యత్తుకి పునాదులు వేయటంలో ఎంతవరకు సఫలీకృతులమవుతున్నామని తమని తాము ప్రశ్నించుకోవాలి. అంతేగానీ 'విత్తు' నాటడమే మనం చేసే ఘనకార్యం. ఆపై- 'నారు పోసినవాడు నీరు పోయకేం చేస్తాడ'ని భారమంతా భగవంతునిపై వేసి కర్మ సిద్ధాంతానికి కట్టుబడిపోయి, తేడా వస్తే 'అంతా మన ఖర్మ' అనుకుని తృప్తిపడేవాళ్ళు పిల్లల్ని కనటానికి ఎంత మాత్రం అర్హులు కారు. బాధ్యతలు పట్టని వాళ్ల పిల్లల్ని కనకూడదు. కొద్దిమంది అలాంటి వాళ్ళు పిల్లల్ని కనకపోయినా దేశానికేం లోటులేదు. తల్లిదండ్రులు తమ అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని అవిటితనం రూపంలో పసివాళ్ళకి ఆస్తిగా పంచకుంటే అదే పదివేలు!

-భువనగిరి శేషమాంబ

అందానికి శత్రువు.. వత్తిడి

అందంగా, ఆకర్షణీయంగా కనబడాలనుకునేవారు ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలంటే కొన్ని ముఖ్య సూత్రాలను విధిగా పాటించాలి. ఎక్కువ విశ్రాంతి, తగిన నడక, వ్యాయామం ఎంతో అవసరం. మానసిక ఆందోళనలకు దూరంగా ఉండడం, ఏ మాత్రం సమయం దొరికినా విశ్రాంతి తీసుకోవడం అవసరం. అలసట ఎప్పుడూ ముఖంలో కనిపిస్తుంది. అందుకే ఎంత అందంగా అలంకరించుకున్నప్పటికీ మానసికంగా విశ్రాంతి పొందలేకపోతే అందంగా కనిపించడం సాధ్యం కాదు. మానసిక వత్తిడిని అరికట్టేందుకు నడక అద్భుతంగా పనిచేస్తుంది. నడక కండరాల ఉద్రిక్తతను తగ్గించి ఉపశమనాన్నిస్తుంది. మనస్సును ఏకాగ్రతతో ఆలోచించేలా చేస్తుంది. మానసిక వత్తిడిని నివారిస్తుంది. ఉద్యోగ సంబంధమైన వత్తిడుల నివారణకు ప్రతిరోజూ నడక, యోగా, నవ్వడం, సంగీత శ్రవణం, పుస్తక పఠనం ఉత్తమ సాధనాలు. అందాన్ని కాపాడుకోవటానికి మానసిక ప్రశాంతం ఎంతో ఉపయోగపడుతుంది. అందానికి మానసిక ఒత్తిడే శత్రువుగా చెప్పవచ్చు. అందుకే మనసులో ఎలాంటి ఆలోచనలకు తావివ్వకూడదు. వత్తిడి సమయంలో విశ్రాంతి ఎంతో అవసరం. కాఫీ, టీ తాగడం మానేయండి. ఇది చాలా మంచిది కూడా. నిద్ర పోయే ముందు వీటి జోలికి వెళ్లరాదు. కాఫీ, టీలకు బదులుగా గోరువెచ్చని పాలుగానీ, మంచినీళ్ళుగాని తాగాలి.

నిత్యం కొంతసేపు నడకను అలవాటు చేసుకుంటే అది మహిళల సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. నీరు ఎక్కువగా తాగితే శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చు. కాల్షియం, విటమిన్-బి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు త్వరగా నిద్రవచ్చేలా చేస్తాయి. వేడినీళ్ళ స్నానం కూడా సేదతీరేలా చేస్తుంది. శరీరంతో పాటు మనసు కూడా తగిన విశ్రాంతి పొందుతుంది.

-నల్లా నరసింహమూర్తి

'కాంక్రీటు వనం'లో పచ్చదనం పరవళ్లు!

పట్టణీకరణ పుణ్యమాని జనావాసాలు 'కాంక్రీటు వనాలు'గా మారుతున్న నేటి కాలంలో పచ్చదనం, పూల పరిమళాలు దూరమై పోయాయని దిగులు చెందేవారికి- 'ఇంటీరియర్ గార్డెనింగ్' ఎంతో ఊరటనిస్తోంది. వరండాలో, డైనింగ్ హాలులో, మెట్ల పక్కన, బెడ్ రూమ్‌లో.. ఇలా ఎక్కడ కాస్త స్థలం ఉన్నా పొందికగా కుండీల్లో పలురకాల మొక్కలు పెంచుకోవచ్చు. ఇళ్లలో పెంచుకునేందుకు నేడు పలు రకాల 'బోన్సాయ్' మొక్కలే కాదు, విభిన్న రంగులలో విరబూసే పూల మొక్కలు, ఎన్నెన్నో క్రోటన్స్ వెరైటీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. మన అభిరుచులకు అనుగుణంగా పలు రకాల మొక్కలను సరఫరా చేసే 'ఇంటీరియర్ గార్డెనింగ్' నిపుణులు నేడు మనకు అందుబాటులో ఉన్నారు. మనం కాస్త ఆసక్తి చూపితే చాలు... కుండీల్లో ఎదిగే మొక్కలతో, గుబాళించే పూలతో ఇళ్లంతా కొత్త అందాలు పరచుకుంటాయి. ●

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
మంగళవారం
5, ఫిబ్రవరి
2013

శేర్చుకుందాం

జ్ఞానజ్యోతి విజృంభమాణముగ నోజన్ విష్ణు విద్యాది దే
వానీ కాత్మ దశావళిం దవిలి నీవారంగ వారిం గళా
జ్ఞాన ప్రౌఢుల జేయుటన్ వెలయగా సర్వజ్ఞ శబ్దంబు దా
నీ నామాంకముగా విధించె నిగమానీకంబు సర్వేశ్వరా !

భావం: సర్వేశ్వరా! జ్ఞానజ్యోతి విజృంభిస్తున్న విధంగా విష్ణువు సరస్వతి ఇత్యాది దేవతల అంతరంగాలతో కూడి నీవు వాళ్లను కళలలూనూ జ్ఞానంలోనూ ప్రౌఢులను చేయడం వల్ల వేదాలు నీ పేరుగా సర్వజ్ఞ శబ్దాన్ని విధించాయి. ఈ పద్యం కూడా శివపారమ్యాన్ని చెప్తున్నదే. సర్వదేవతలను కళాజ్ఞాన ప్రౌఢులను చేస్తున్న వాడు ఈశ్వరుడేనని, అందువల్లే ఆయనకు 'సర్వజ్ఞ' డనే పేరని వేదాలంటున్న వంటే ఇతర దైవాలకంటే కూడా అధికుడనే అర్థం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

5 **శ్రీ లత**

గాలితాకిడికి రాలిపోయే దిరిశెన పువ్వు గుర్తుకొచ్చేది వసంతకు. ఒక్కొక్కసారి జీవన ప్రవర్తన ఇంత సున్నిత మనస్తత్వంలో ఎలా బ్రతుకుతుందో అని భయపడేది కూడా.

ఆ భయం ఇప్పుడూ కలిగింది.

''ఎవరతను? చెప్పు! మాట్లాడి ముహూర్తాలు పెట్టుకుందాం'' అంది రెండు రోజులాగి. కుదుటపడ్డాక చెబుతుందిలే అని ఆ తరువాత ఆగి, ఆగి ఎన్నిసార్లు అడిగినా అదే సమాధానం మౌనం కూడా జీవనకు బహిర్గత పరచలేదు. రోజురోజుకీ పేషెంట్‌లా మారుతున్న జీవనను సైకియాట్రిస్ట్ డాక్టర్ గౌరీదేవి దగ్గరకు తీసుకెళ్లింది బలవంతంగా. కౌన్సిలింగ్‌లో జీవన ఏం చెప్పిందో తెలీదు.

డాక్టర్ మాత్రం ''అమ్మాయి షాక్‌లో వుంది. తనంతట తాను ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. తను గాఢంగా 'పెంచుకున్న' ఓ నమ్మకం దెబ్బతిన్నట్లుంది. తననిప్పుడే కదిలించకండి. అయితే తనను నేను అబార్షన్‌కు ఒప్పించాను... ముందు ఆ పని చేయించండి. ఏం జరిగింది, ఎలా జరిగింది, ఎందుకు జరిగిందంటూ ఇప్పుడాలోచించడం, ఆరా తీయడం మానేయండి. గైనకాలజిస్ట్ దగ్గరకు తీసుకెళ్లింది.

జీవనను టెస్ట్ చేసిన డాక్టర్ ''సారీ.. ఈ అమ్మాయికి అబార్షన్ చేయడానికి వీలుకాదు, పెద్ద ప్రాణానికే గండం'' అని చెప్పింది.

అక్కడే కుప్పకూలిపోయింది వసంత మనసు.

జీవనలో ఎలాంటి స్పందనా లేదు.

ఇంకేం చేయాలో అర్థంకాని పరిస్థితిలో గర్భం మోసేందుకే సిద్ధమయింది జీవన.

డాక్టర్ గౌరీదేవి సలహా మేరకు జీవనతో లాంగ్ లీవ్ పెట్టించి ఉన్న ప్రదేశం మార్చేసి పరిచయం వున్నవాళ్లను దూరంగా వుంచి నెలలు నిండాక కాన్పు చేయించింది వసంత. కాన్పు అయ్యాక బిడ్డను మిషనరీ వాళ్ళకు అప్పగించాలనే ఆలోచన కూడా జీవనకు చెప్పింది.

జీవన మౌనం అంగీకారంగా తోచింది.

⁘

''మీ అమ్మాయికి పాప పుట్టింది''

అనగానే ఈ లోకంలోకి వచ్చింది వసంత.

ఆ విషయం పట్టించుకోకుండా ''మా అమ్మాయి ఎలా ఉంది'' ఆత్రంగా అడిగింది వసంత.

''బావుంది.. కుట్లు వేస్తున్నారు'' అని నర్స్ చెప్పి వెళ్లిపోయింది.

మళ్ళీ కుర్చీలో కూలబడిపోయింది వసంత. అప్పటిదాకా తన కూతురికి బిడ్డ బయటపడి ప్రాణాపాయం తప్పితే చాలనుకున్న వసంతకు ప్రాణం మిగిలాక 'బ్రతికేదెలా?' అనే ప్రశ్న సమస్యగా నిలిచింది.

అంతే మనిషి, ఎదురుగా ఉన్న గొయ్యిలో పడకుండా దూకగలిగితే చాలనుకుంటాడు మొదట. దూకాక ముందున్న నుయ్యిని చూసి బిత్తరపోతాడు. ''అయ్యో ఇక్కడ నుయ్యిందని తెలిస్తే అసలా గొయ్యి చుట్టూనే బ్రతుకంతా తిరిగి, వెనక్కి మళ్లీ మళ్ళీ గొయ్యి దూకి వచ్చి దాని అంచునే ప్రశాంతంగా నిద్రపోతాడు. అదే మరణం. అయితే అంతమం వరకూ తెలీదు. తనెన్ని గొయ్యిలు దాటినా మళ్లీ మళ్లీ విశ్రాంతి పొందేది ప్రారంభించిన గొయ్యి ఒడ్డునే అని. అది తెలిస్తే జీవన రహస్యం తెలిసి, బ్రతుకుమీద ఆరాటం పోరాటం విడిచి అస్థిత్వం కోల్పోతాడనే సృష్టి రహస్యం కాబోలు. ఇది, ఎందుకో ఎన్నేళ్ళు జీవితపు సూతిగట్టున తిరిగినా, అప్పుడప్పుడూ జారిపడి కొచ్చినా, తన విశ్రాంతికిది చోటుకాదని, ఆఖరి శ్వాస విడిచే ముందువరకూ తెలుసుకోవడానికి ప్రయత్నించడేమో!

తన బిడ్డ జీవితపుకొసమీద జీవనం నిర్మించుకోలేదనీ, ఏ భయంకరమైన లోయలోకో జారిపోతుందనీ, తను దిక్కులు పిక్కటిల్లేలా అరిచినా, పేగులు తెగేలా తన కడుపు చీల్చుకున్నా అక్కడే పుట్టి అక్కడే పెరిగిన తన బిడ్డ ఆచూకీ కూడా తెలియకుండా పోతుందని, సమాజం తన బిడ్డను చంపి గోతిలో పూడ్చి కుళ్ళగొట్టి, వాసన రాకుండా పైన పూలు చల్లుతారనే అనిపించింది.

ఆలోచిస్తుండగానే భుజం తట్టినట్లనిపిస్తేవెనక్కి తిరిగి చూసింది.

ఆవిడ ''మీ అమ్మాయా? అనడిగింది లేబర్ రూమ్‌వైపు చూపిస్తూ 'ఏం కంగారు పడుతున్నారా?' అని కూడా అడిగింది.

తలూపింది వసంత.

''నా పేరు ఆండాళు, పక్క రూమ్‌లో మా కోడలువుంది. అయినా భలేవారే 'మురిపించని వాడు మొగుడు కాదు, ఏడిపించనివాడు బిడ్డ కాదు' అనీ బిడ్డను కనేప్పుడు నెప్పులు పడని తల్లుంటుందటండీ. అదుగో చూడండీ మూడు రోజుల్నుంచీ నెప్పులు పడుతూంది నా కోడలు. అంత మాత్రం చేత నేనేమయినా దిగులు పడ్డానా? లేదే? తీరిగ్గా కంటుందిలే తొందరేవిటి? అనుకున్నానంతే తొందరపడి ముందు కన్నవాళ్ళ బిడ్డలంతా ఏం ఉద్ధరించార్ట? కాస్త లేటుగా కన్నంత మాత్రాన ఏం ఆగిపోతుందటా? అని నిర్ధారించేసుకున్నాను...'' అంటూ తన ధోరణిలో వసంతను ఓదార్చటానికి ప్రయత్నించింది. వసంత మాట్లాడలేదు. తన దిగులు తన బిడ్డ కాన్పు గురించి కాదనీ అసలా గర్భమే తన గుండెలో పెరిగిన దిగులనీ చెప్పలేదు.

ఆండాళు.. ఏమో... మాట్లాడుతూ ఓదార్చుతున్నట్లుగా భావిస్తుంటే ఆపలేదు.

ప్రతిదానికీ తలూపుతూ ఉండిపోయింది. చాలాసార్లు మౌనం... జరిగి దాన్ని భరించడానికి శక్తినిస్తుందని నమ్ముతుంది వసంత.

కానీ బాధ తెలియకపోయినా.. పంచుకోవాలని ప్రయత్నిస్తున్న సాటి స్త్రీ మనస్తత్వం అర్థమయి అడ్డుకోవాలనిపించలేదు.

అసలు విషయం చెబితే అదే ఓదార్పు... హేళనగా.. వెక్కిరింతగా మారి ఈసడింపును బయటపెడుతుందని తెలుసు వసంతకు. జాలినీ ఈసడింపునూ భరించే శక్తి చిన్నతనం నుంచి వసంతలో లేదు. మొదటినుండీ తన మనసులో ఆత్మగౌరవానికే అగ్రపీఠం వేసింది. ఏ బాధ కలిగినా ఆమెకున్న ఆత్మగౌరవం ఆ బాధా సంద్రంనుండీ తెప్పలా తేలి తనకు బయటపడేందుకు సహాయం చేస్తుంది.

ఇప్పుడు వసంతలో ఉన్న భావం అదే. ఆ మౌనంలో ఉన్నప్పుడే... మాట్లాడి.. మాట్లాడీ.. వెళ్లిపోయింది ఆండాళు. వసంత చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది.

-ఇంకావుంది



రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

136

పెనుశిలలు రువ్వాడు. వృక్షాలు పెకలించి, ఆ రాక్షసుడి మీదికి విసరాడు. వాడి తలపైన ముష్టిఘాతలతో కొందల పడజేశాడు. దుందుభీ కూడా వెనకాడలేదు. వాలి వృక్షాన్ని తన కొమ్ములతో క్రుమ్మి నొవ్వజేశాడు. వాలి క్రోధావేశుడయాడు. అచలమొక్కటి పెకలించి దుందుభి పైకి రువ్వాడు. వాలి విసరిన కొండ గురి తప్పింది. రక్కసుడు వేరొక గిరి వేశాడు. ఈ గతి పరస్పరం చాలా తడవు పోరాడారు. ఈ తీరుగా వాలి దుందుభులు నూరేళ్లు భీకరంగా యుద్ధం చేశారు. ఆపైన వాలి తన వాలంతో ఆ రాక్షసుణ్ణి పట్టి, విడువక గిరగిర త్రిప్పి త్రిప్పినేలపై కొట్టాడు. వాడి మర్మస్థానాల్లో పొడిచి చంపివేశాడు. అయినా వాలిక్రోధం ఉపశమిల్లలేదు. ఆవేశంతో దుందుభి కళేబరాన్ని బలం కొలది తన్నాడు. ఆ విధంగా తన్నడం వల్ల దుందుభి కన్నులనుంచి ముకుపుటాలనుంచి, వక్త్రం నుంచి కర్ణరంధ్రాలనుంచి నెత్తురు ఓడుతూ- ఇంద్రుడి వజ్రాహతికి గిరితీరున- ఒక ఆమడ దవ్వు పోయి పడింది. గైరిక ధాతువులతో కలిసిన నిరరాకారాలయి ఆ రక్త బిందువులు మతంగ పర్వతం మీద పడ్డాయి. అక్కడ తీవ్ర తపం చేసుకొంటున్న మతంగ మహర్షి కోపాతిరేకంతో ఈ విధంగా చేసినవాడు మతంగ పర్వతం దరి దాపులకిపోస్తే మృత్యువాత పడతాడు'' అని ఘోరంగా శపించాడు. వాలి ఈ పర్వతం ఎక్కడు కనక నేను ఈ ఋశ్యమూకాచలంమీద నిశ్చితంగా, వెరపు సుంతయినా లేక వసిస్తున్నాను. అది అట్లుండనివ్వు.

ఈ దుందుభి మృతదేహాన్ని ఒకయోజనందూరం మీటి పడవేయడం ఘనభజ శక్తి యుతుడు వాలికి తప్ప మరొకరికి సాధ్యం కాదు. కనుక ఇప్పుడు నువ్వు ఈ రాక్షసుడి కళేబరాన్ని అంతకంటె అధిక దూరం పడవేయకుంటే నీ శక్తిని నేను విశ్వసింపలేను'' అని వచించాడు.

శ్రీరామచంద్రుడు సుగ్రీవుడిమాటలు విన్నాడు. అల్లల్లన నవ్వాడు ''సుగ్రీవా! ఆ రక్కసుడి కళేబరం ఎక్కడ పడివుందో చూపించు. ఆ కళేబరాన్ని అవలీలగా అలవోకగా మీటి నీ సందేహానికి ఎడము లేకుండా చేస్తాను'' అని వినమధురంగా బదులు పలికాడు.

సుగ్రీవుడు దుందుభి శవం పడి ఉన్న తావు రామచంద్రుడికి చూపాడు. అంత శ్రీరాముడు మేరు మందరాల ఆకారంగా వున్న ఆ దేహాన్ని చూసి దానిని చేతితో తాకనైనా తాకలేదు. పాదాంగుష్ఠంతో మీటి వేశాడు. ఆ కళేబరం పది యోజనాల దూరం పోయి అక్కడ పడింది. అప్పటికి శ్రీరాముడి వరశక్తి సుగ్రీవుడికి తెలిసిరాలేదు.

అందువల్ల రాఘవుడితో ''ఈ కళేబరం వాలి మీటి పడగొట్టినపుడు రక్తమాంసాలతో సాంద్రమై వుంది. ఈనాడు ఎండకు ఎండి పోయి ఎముకల గూడు మాత్రంగానే వుంది. కనుక నీ బలం వాలి బలంకన్నా అధికం అని నమ్మలేకున్నాను. వాలి బలపరాక్రమాలు విను- పెనుకొండల్ని పూబంతుల మాడ్కి పట్టి ఎగురవేసేవాడు. చతుస్సముద్రాలలోను స్నానమాడి మహాదేవుడి చరణ ద్వయం మీద శిరం వాల్చుతాడు. వాయువేగాన్ని అతిశయించిన వేగంతో జలధులన్నీ దాటి ఏతెంచుతాడు. ఇంద్రుడు తన తనయుడైన ఆ వాలికి హేమ మాల ఒకటి ఒసగి దానిని అన్ని వేళలా ధరించమన్నాడు. ఆ మాల నీ మెడ నుండ నిన్నెప్పుడూ గెలువజాడు అని చెప్పాడు. ఈ తాళవృక్షాలని పరికించు. ఈ సప్త తాళ వృక్షాలని వాలి తన కరాలతోఒక్కటిగా పట్టి, వాటి ఆకులన్నింటినీ ఒక్కసారిగా రాల్చగలడు. ఇంద్రుడు మొదలైన దేవతలు ఎవరూ ఈ తాళవృక్షాలలో ఒక్కదానినైనా కదల్పలేదు. రఘురామా! నువ్వు ఈ ఏడు తాడిచెట్లనీ ఒక్క బాణం దూసుకొనిపోయే విధంగా ప్రయోగించినట్టు అయితే నీ శక్తి వాలి శక్తికంటె అమేయం, అధికం అని విశ్వసిస్తాను. ఓ రామప్రభూ! ఈ సప్త తాళములను ఒక్క శరంతో తెగవేయగల లావుగల పురుషుడి చేతిలో వాలి మరణిస్తాడని నాకు 'మరుత్తు' అనే మునీంద్రుడు తెలిపాడు'' అని వాకొన్నాడు.

సుగ్రీవుడి మాటలు ఆలకించి రఘురాముడు దరహాసం చేసి కరుణాపూరిత మనస్కుడై శ్రీరాముడు సుగ్రీవుని చూశాడు

-ఇంకావుంది

మంగళవారం, 5 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ దశమి రా.11.39
నక్షత్రం: అనూరాధ మ.03.10
వర్జ్యం: సా.06.22 నుండి 07.51 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):** ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలుండవు.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్యం కలుగవచ్చు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** మానసికాందోళనతో ఉంటారు. ఆకస్మిక ధన నష్టం కలిగే అవకాశముంది. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం. విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో ఉంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టం రావచ్చు.కుటుంబంలో మార్పు కోరుకుంటారు. దైవ ప్రార్థన చేయాలి.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్త పడాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఫలిస్తాయి.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** క్రొత్త కార్యాలు పారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు. జాగ్రత్త అవసరం.

మంచిమాట

శివతత్త్వసారము

''కైలాస శిఖరవాసీ- పార్వతీ దేవికి భర్త- సమస్త దేవతలలో ఉత్తముడు- శాస్త్రాలలో వర్ణితమైన రూపంగలవాడూ- నిర్గుణుడు అయినటువంటి గుణరూపుడూ, వేద శాస్త్రాదులలో తమ మహిమల గానం కలిగినవాడూ, విష్ణు బ్రహ్మాదులలో నిత్య స్తుతి నొందువాడూ, భక్తవత్సలుడూ, ఆనంద స్వరూపుడూ అయిన శివుని ఆవాహనం చేస్తున్నాను'' అంటూ శివపురాణంలోని శ్లోక భావాన్ని మననం చేసుకుందాం. ఇక, మనకు అన్నింటా విజయమే.

శివస్తుతి: శివం అనే మాటకి శుభం- క్షేమం- మంగళం- శాంతి- మోక్షం అని అర్థాలుగా మన వాడుకలో వున్నాయి. ఇవన్నీ కూడా శివుని యొక్క వచనాలవలన సిద్ధిస్తుంటాయి. శివుని కీర్తించే పదాలు కేవలం కర్తకి మాత్రమే కాక- శ్రోతలకీ- జగతికీ- ప్రకృతికీ- శాంతినీ, శుభాన్ని కూడా ప్రసాదిస్తుంది. అందుకే శివ పదాలకు అర్పణంగా వ్రాసుకున్న శివ పదాలను, వివిధస్థాయిలలో సంకీర్తనను యజ్ఞాలుగా నిర్వహిస్తున్నారు. అనేకానేక సంస్థలు ఆయా నగరాలలో, పట్టణాలో జరిపిన యజ్ఞ ఫలాలు క్రమంగా విస్తరిస్తున్నాయి.

పరాత్పరుడైన సదాశివుని తత్త్వం అనంతం- అపారం- అద్వితీయం. స్మరణతో, అర్చనతో, ఆ భోళాశంకరుని- అనుగ్రహం పొంది జీవితాన్ని సుసంపన్నం చేసుకునే సాధనలన్నింటినో, మన మహర్షులు అందజేశారు.

శివపురాణంలో సూత పౌరాణికులు శౌనకాది మహర్షులకు నైమిశారణ్యంలో శివ మహిమలను, లీలలను వివరిస్తూ, శివతత్త్వాన్ని ప్రతిష్ఠించారు. శ్రీ వ్యాస మహర్షి శివ తత్త్వ విషయమై సనత్కుమారుని ప్రశ్నించగా, సనత్కుమారుడు వ్యాసునకు శివతత్త్వ సారాన్ని బోధిస్తూ, నైమిశారణ్యంలో బ్రహ్మ ఆజ్ఞ చేత దివ్య తపోదీక్షలు నిర్వహించిన షట్కులముల మహర్షులకు వాయుదేవుడు ప్రత్యక్షమై పాశుపతయోగాన్ని వివరించాడు అని చెప్పారు.

పాశుపత వ్రతఫలం సులభంగా అందరికీ అందాలని, వాయుదేవుడు మహిమాన్వితమైన శివుని ఎనిమిది నామాలను తెలియజేశాడు. అనంతుడైన ఈశ్వరుని నామాలుకూడా అనంతమే మరి. కాని, సాధకులకు యిక్కడొక విషయాన్ని తెలియజేయాలి. అదేమంటే మంత్ర రహస్యాలతో కూడిన యీ ఎనిమిది పేర్లను నిరంతరం మననం చేయడం, వీటితో శివుని అర్చించడం- పాశుపతవ్రతం చేసిన ఫలాన్ని ఇస్తుంది. ఈ వృత్తాంతం శివపురాణం వాయువీయ సంహితలో చెప్పబడింది.

ఈశ్వరుని ఎనిమిది నామాలు

1.శివాయనమః 2.మహేశ్వరాయ నమః 3.రుద్రాయ నమః 4.విష్ణవే నమః 5.పితామహాయ నమః 6.సంసార వైద్యాయ నమః 7. సర్వజ్ఞాయ నమః 8. పరమాత్మనే నమః

ఇవి ఈశ్వరుని యొక్క ఎనిమిది నామాలు. ప్రతి సాధకుడు కూడా ప్రతి నిత్యం యీ ఎనిమిది నామాలతో - భావ పుష్పాలతో పూజిస్తే- శివానుగ్రహం కలుగుతుంది. ఇందు యే మాత్రము సందేహము లేదు. మిథ్యయైన జగత్తునుఅర్థం చేసుకొంటూ శాశ్వతమైన ఈశ్వరుని గురించి తెలుసుకుంటూ బుద్బుద ప్రాయమైన ఈ నరజన్మనుసార్థకం చేసుకోవాలి. శివా అని అనగానే బోళాశంకరుడు పరమ సంతోషంతో మన కోరికలు ఈడేర్చేవానిగా తెలుసుకొని నిత్యమూ శివనామాన్ని స్మరణం చేసుకొందాం.

-మల్లాది నరసింహమూర్తి

● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరడావులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

వృతాసురుడు

14

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 7

1		2				3
				4		
5			6			
		7				
8		9			10	11
12				13		
			14			

మాటాట

ఆధారాలు: అడ్డం

1. అరవై సంవత్సరాలునిండటం
4. అత్త
5. రాక్షసుల తల్లి
6. పాలను నీటిని వేరుచేసేది
9. సూర్యుడు
10 దర్పం తోడిది
12. స్నానం , ఉండే చోటు
14. కటిసూత్రం

నిలువు

1. అడ తుమ్మెద
2. పుష్పము
3. కర్ణేంద్రియములు
4. నిట్టూర్పు వాయువు
7. హిందిలో నాలుగుఅణాలు
8. పాఠకుడు, పదివేలాడు
11. పండితుడు
13. మాసము

మాటాట - 6 సమాధానం

1 చి	శ	2 క్ష	డు			3 ఠిం
వ		హ్లం		4 ది	రి	జ
5 కి	బి		6 వీ	డు		ర్కిం
		7 కు		ర్తు		
8 వ		9 ధా	వ్వె		10 క్కా	11 వ
12 స్వ	ఏ	రు		13 ఫిం		న్నా
తి			14 ఱం	శే	వా	ని

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కొత్తగా

వీడియోకాన్ -విటి71

ఐదు వేల లోపు పెట్టుబడితో ఐదు వేళ్ల మధ్య ఆండ్రాయిడ్ టాబ్లెట్‌ను విష్టుచక్రంగా తిప్పాలన్న ఆశ, ఆలోచన -మధ్యతరగతి బడ్జెట్ కుర్రాళ్లకు సహజంగానే ఉంటుంది. అలాంటి వాళ్లను దృష్టిలో పెట్టుకునే అడ్వాన్స్‌డ్ ఆండ్రాయిడ్ టాబ్లెట్‌ను భారత మార్కెట్‌కు తీసుకొచ్చింది వీడియోకాన్ -విటి71 పేరిట. 800X480 రిజల్యూషన్‌తో ఏడు అంగుళాల స్క్రీన్, ఆండ్రాయిడ్ 4.0 (ఐస్‌క్రీమ్ శాండ్‌విచ్), 1.2గిగాహెడ్జెస్ ప్రాసెసర్, 512 ఎంబి రామ్, 3,200 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం, 4జిబి అంతర్గత స్టోరేజ్ సామర్థ్యం, వైఫి 802.11 బి/జి/ఎన్, హెచ్‌డి ఎంఐ పోర్ట్, ముందుభాగంలో విజిఎ కెమెరా, 32జిబి వరకూ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి వీలుగా మైక్రో ఎస్‌డి కార్డ్ స్లాట్, 3జిని సపోర్ట్ చేయగల సామర్థ్యం దీని స్పెసిఫికేషన్లు.

హీరో..

వ్య(యు)వ సాయం!

‘ఆకాశ’మే హద్దు!!

చదువుకు ‘ఆకాశ’మే హద్దు. మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అందరికీ అతి తక్కువ ధరకే అందుబాటులోకి తెచ్చే బృహత్తర అక్షర యజ్ఞానికి నాంది ప్రస్తావనే ఆకాష్ టాబ్లెట్. అక్షరాస్యుల సంఖ్య అంతంతమాత్రమైన భారత్‌ను విద్యా భారతంగా, విజ్ఞాన సోపానంగా మార్చే మూడోతరం టెక్నాలజీ మరింత వేగంగా అందుబాటులోకి రాబోతోంది. అక్షరాభ్యాసం నుంచి అనంతమైన విద్యా పరిశోధనల వరకూ అరచేతిలో టెక్నాలజీని అందించే ఆకాష్ టాబ్లెట్ మూడో వర్షన్ కంప్యూటర్ మార్కెట్‌కు రావడమే ఆలస్యం.

‘ఒక ఐడియా జీవితాన్ని మారుస్తుందా?’ ఏమో, ఎంతవరకూ నిజమో తెలీదుకానీ, ఆ క్యాప్షన్‌తో వచ్చిన అడ్వర్‌టేజ్‌మెంట్ మాత్రం ఐడియా మొబైల్ కంపెనీ వ్యాపారాన్ని మార్చిపడేసింది. అచ్చంగా అలాంటి క్యాప్షన్‌నే బలంగా నమ్ముతోంది -డేటావిండ్ కంపెనీ. ఒక్క టాబ్లెట్ -ప్రపంచ విద్యా వ్యవస్థనే కొంతపుంతలు తొక్కిస్తుందని. ఏమో.. అసాధ్యం అన్న పదానికి అర్థం చెరిపేస్తున్న ప్రస్తుత సాంకేతిక యుగంలో ఏమైనా జరగొచ్చు.

పర్సులో పాకెట్‌మనీ పదిహేను వందలుంటే? లగ్జరీ కుర్రాడైతే ఫ్రెండ్‌తో త్రీస్టార్ హోటల్‌కి డిన్నర్ ప్లాన్ చేస్తాడు. మధ్యతరగతి కుర్రాడైతే బ్రాండెడ్ జీన్స్‌మీద కన్నేస్తాడు. అదే బడ్జెట్ పద్మనాభం అయితే, ఇంట్లోకి కావాల్సిన నిత్యావసరాలు కొందామనుకుంటాడు. అదే పదిహేను వందలతో -స్కూలు పిల్లాడికి ‘ఆధునిక సాంకేతిక పుస్తకం’ కొనివ్వవచ్చన్న ఆలోచన తడితే.. -సారీ, టాబ్లెట్ అంత చీప్‌గా ఎక్కడ దొరుకుతుందని అనుకోకండి. ‘ఆకాష్’ సిరీస్‌లో వస్తున్న టాబ్లెట్లు ఇలాంటి అనుమానాలను ఎప్పుడో పటాపంచలు చేశాయి. ఆకాష్ ఫస్ట్ జనరేషన్ మూడువేల ధరలో అందితే, పని సామర్థ్యాన్ని పెంచుకుని మార్కెట్‌కు వచ్చిన ఆకాష్ 2 -ప్రభుత్వ సబ్సిడీతో పదిహేను వందలకే దొరికింది, దొరుకుతుంది. తాజాగా ఆకాష్-3తో డేటావిండ్ సంచనాలు సృష్టించబోతోందట. ఆకాష్-3ని ఉత్పత్తి చేస్తున్న డేటావిండ్ పార్టనర్‌గా భారత ప్రభుత్వం -విద్యార్థులకు సగం ధరకే ఈ టాబ్లెట్‌ను సైతం అందించే ఆలోచనకు పదునుపెట్టింది. కేంద్రానికి తట్టిన ఈ ఆలోచన పూర్తిగా ఆచరణలోకి వస్తే -రెండున్నర కోట్ల స్కూలు పిల్లలు ఇక పలకా పుస్తకాలను ఇంట్లో వదిలేసి -సంచిలో థర్డ్ జనరేషన్ ఆకాష్ టాబ్లెట్ వేసుకుని స్కూలుకెళ్లడం ఖాయం. సంప్రదాయ విద్యా విధానాన్ని సాంకేతిక పరికరాలతో అనుసంధానించే ఆలోచనలు వేగవంతం అవుతున్నాయని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

థర్డ్ జనరేషన్‌లో వస్తున్న ఆకాష్ టాబ్లెట్ సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయొద్దంటున్నారు నిపుణులు. సిమ్ కార్డు స్లాట్, అత్యంత వేగవంతమైన ప్రాసెసర్, అత్యంత ధారణ శక్తితో అటు ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్, ఇటు లినక్స్ విధానంలో పని చేయగల సామర్థ్యంతో థర్డ్ జనరేషన్ వస్తుందట. అంతేకాదు, సిమ్‌కార్డు స్లాట్ ఉండటంతో దీన్ని చదువుకోసం ఉపయోగించే టాబ్లెట్‌గానే కాకుండా, మొబైల్ ఫోన్‌గానూ వాడుకోవచ్చని అంటున్నారు. వాస్తవానికి టాబ్లెట్ ధర 2,263 రూపాయిలు. సగం భారాన్ని ప్రభుత్వం భరించి విద్యార్థులకు రూ. 1130లకే అందించే ఆలోచన చేస్తోంది. కనీసం 50 లక్షల ఆకాష్ -3 టాబ్లెట్లు తొలివిడతగా విద్యార్థులకు అందించాలన్న లక్ష్యాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం ఇంత భారాన్ని భరించేందుకు సిద్ధపడటంలో అంతరార్థం లేకపోలేదు. విద్యా వ్యవస్థను క్రమంగా సాంకేతిక కోణానికి అనుసంధానం చేయగలిగితే -ఏటా పుస్తకాల ముద్రణ కోసం వెచ్చిస్తోన్న కోట్ల రూపాయల ధనం, ఆమేరకు వనరులు వృధాకాకుండా ఉంటాయన్నదే అసలు ప్రణాళిక. ఈ ఆలోచన కనుక సక్రమంగా అమలైతే, -వచ్చే ఐదారేళ్లలో దేశంలోని ప్రతి విద్యార్థీ లోకాస్ట్ టాబ్లెట్‌కు ఓనరై ఉంటాడన్నది నిజం. అందుకే -‘భారత విద్యా విధానంలో కొత్తశకం ఆవిష్కరణకు ఆకాష్ పునాధి రాయి కావొచ్చు’ అంటున్నాడు కాన్సన్ మౌద్గల్య. ముంబయి ఐఐటిలో ‘నియంత్రణ విధానం మరియు విద్యా సాంకేతికత’ విభాగంలో పాతికేళ్ల అనుభవం ఉన్న ఈ ప్రొఫెసర్ -ఆకాష్ టాబ్లెట్ కోసం సాఫ్ట్‌వేర్ రూపొందించిన బృందంలో ముఖ్య భూమిక పోషించాడు. ‘ఆకాష్ టాబ్లెట్ కోసం రూపొందించిన ప్రాసెసర్ చాలా శక్తివంతమైనది. ఎంత? అంటే ఒక జనరేషన్ కిందటి వరకూ కంప్యూటర్లలో ఉపయోగించిన ప్రాసెసర్ కంటే శక్తివంతమైనది, వేగవంతమైనది కూడా’ అన్నది మౌద్గల్య చెప్తోన్న మాట.

ఆకాష్ టాబ్లెట్ కోసం ఎన్నో ప్రణాళికలూ సిద్ధమవుతున్నాయి. ఇందులో మొదటిది -అచ్చు పుస్తకాలను ఈ-బుక్స్‌గా మార్చే పని. దీనివల్ల ప్రభుత్వానికి భారం తగ్గుతుంది. సమయం కలిసొస్తుంది. వనరుల వృధా నియంత్రించబడుతుంది. ఇంకా ఎన్నో లాభాలు. విద్యార్థుల కోసం ఏటా పుస్తకాలను ముద్రించే బాధ ఉండదు. అలాగే 32 భారతీయ భాషల్లో విద్యా సంబంధమైన వీడియోలను సైతం సిద్ధం చేస్తున్నారు. ఈ టాబ్లెట్ కంప్యూటర్ గొప్పతనం -కేవలం యంత్రంగా పని చేయడమే కాదు. విద్యార్థుల్లోని సృజనకు పదును పెడుతుంది. దాన్ని మనం ఎంతగా వినియోగించుకుంటే అంతగానూ ఉపయోగపడుతుంది. అంతకుమించిన రీతిలో సరికొత్త ఆలోచనలను పాదుకొల్పుతుంది.

భారతదేశంలో సమాచార సాంకేతిక విప్లవం అనూహ్యంగా వేళ్లూనింది. అసలు అందుకోగలుగుతాయా? అన్న గ్రామీణ ప్రాంతాలు సైతం పట్టణాలను అధిగమించే రీతిలో టెక్నాలజీ రంగంలో కొత్తపుంతలు తొక్కుతున్నాయి. టెక్నాలజీనే ఆలంబనగా చేసుకుని విద్యార్థిలోకం అనూహ్యంగా కెరీర్‌ను నిర్మించుకుంది. ఇప్పటి వరకూ ఐపాడ్ సర్వేస్‌లతో సాధ్యంకాని కంప్యూటర్ ఆధారిత ప్రోగ్రామ్‌లను నిర్మించుకునే అవకాశాన్ని ఆకాష్ నిబిడీకృతం చేసుకున్న టెక్నాలజీ అందిస్తోంది. ఇప్పటి వరకూ ఇంత విస్తృతంగా ఉపయోగపడే కంప్యూటర్ మనకు అందుబాటులోకి వస్తుందా? అని కలల్లోనే గడిపిన విద్యార్థులకు ఇక ఇది మనకు అందడమే ఆలస్యమన్నట్టు వ్యవహారాలు, ఒప్పందాలు చకచకా సాగుతున్నాయి. కేవలం స్కూల్లో చెప్పిన దాన్ని ఇంట్లో ప్రాక్టీస్ చేయడమెలా? అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థికి, ఈ మూడో తరం కంప్యూటర్ సరికొత్త ఆసక్తిని, ఉత్సాహాన్ని కల్పిస్తుందనడంలో సందేహం లేదు. అయితే, విద్యార్థుల స్థాయిని బట్టి టెక్నాలజీ ఉండాలి. అది వారికి అటు పాఠ్యాంశాల విషయంలోనూ, విద్యాపరమైన అంశాల్లోనూ పరిణతిని పెంపొందించుకునేదిగా ఉండాలి. ఈ కంప్యూటర్‌ను ఉపయోగించుకునే సాంకేతిక సంపత్తి దేశంలోని పాఠశాలలకు ఉందా? ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ఘనంగా ప్రచారంలోకి తెస్తున్న ఆకాష్‌ను సద్వినియోగం చేసుకోగలిగే మౌలిక సదుపాయాలు ఎన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయి. విద్యారంగంలో ఎంతగా ఎదిగినా ఇంకా వేలాది స్కూళ్లలో నేలమీదే కూర్చుని చదువుకునే పరిస్థితే ఉంది. ఈ నేపథ్యంలో భారతీయ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవడం అంత సులభసాధ్యం కాదు. అయితే, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు తీసిపోకుండా ఆర్థికంగానూ విరాజిల్లుతున్న భారత్‌కు నిధుల కొరత లేదు. నిపుణులైన సిబ్బంది కొరత అంతకంటే లేదు. ఉన్న లోపమల్లా దాన్ని సరైన గాడిలో పెట్టకపోవడమే. ఈ నైపుణ్యం సీమాంతరాలకు పోకుండా మనకే ఉపయోగపడేలా చేసుకునే ఏర్పాట్లను కొనసాగించకపోవడమే.

ఈ పరిస్థితులను అధిగమించగలిగితే -భారత విద్యా విధానం సాంకేతిక పుంతలు తొక్కడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు ఆకాష్ పునాదిరాయి కాకపోదు.

విజయం

ఎంత దూరమో.. అంత దగ్గర!!

-వాసిలి వసంతకుమార్,
drvaasili@yahoo.co.in
Cell: 9393933946

ఉద్యోగం రావటం పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. అలాగే వృత్తి జీవనంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ఉద్యోగం పోవటమూ అంతే సులభం. కాలేజీ కాంపస్ నుండి డిగ్రీ చేత బట్టుకుని- కమ్యూనికేషన్ స్కిల్స్‌తో- బయటపడగలిగితే పాతిక వేల జీతం. టెక్నికల్ స్కిల్స్‌తో తెలివిగా వ్యవహరించగలిగితే పాతికేళ్లుగా యాభైవేల జీతం. ఓ అయిదేళ్లు నిలదొక్కుకోగలిగితే లక్ష జీతం గారంటీ. కాని ఇన్ని గారంటీల నడుమ పని వత్తిడి ఇంతా అంతా కాదు..

"Sometimes the hearts sees what is invisible to the eye" అంటాడు జాక్సన్ బ్రౌన్ జూనియర్. అంటే కొన్ని సమయాల్లో కళ్ళతో చూడలేని వాటిని హృదయంతో చూడగలమని. అలాగే సమయానికి హృదయంతో చూడగలిగితే సక్సెస్ సాధ్యమే అని అర్థం. మొత్తానికి ‘టైమ్ ఫర్ సక్సెస్’లో హృదయావిష్కారం జరగాలి. దృశ్యాలను చూడటానికి కళ్లుంటే చాలు! ఆ దృశ్యాలను ఆవిష్కరించుకోగలగటానికి హృదయం ఉండే తీరాలి!! నిజానికి లిమిటెడ్ ప్రపంచంలో మనం ఉంటూ లిమిట్ అయిపోతున్నది మనం. అందుకే కళ్లతో చూసినదాన్నే వాస్తవం అనుకుంటున్నాం.. మన దృష్టి సోకనిదాన్ని అవాస్తవం అంటున్నాం. ఈ దృష్టి దోషం మనదే కదా! కాబట్టి లిమిటేషన్ అనేది కళ్లకే కానీ హృదయానికి కాదు.

గాలికి రూపం లేదు అయినా దాని ఉనికిని మనం ఆవిష్కరించుకోగలుగుతున్నాం కదా! విజయానికి కూడా తొలిదశలో రూపురేఖలు ఉండవు. అయినా సంకల్పంతో దర్శనమవుతుంటుంది. పర్ఫామెన్స్‌తో సక్సెస్ సాంద్రత పెరుగుతుంది. ఫలితాలతో సక్సెస్ ఉనికి వెల్లడవుతుంది. అసలు మనదైన రీతిలో దూసుకుపోగలిగితే- కార్య నిర్వహణ పరంగా- ఎటువంటి లిమిటేషన్స్ ఉండవు. చిరు ఆటంకాలు ఎదురుగా అవి మనల్ని సంకుచితం చేయలేవు... మనల్ని విఘ్నపరచలేవు. మనం విస్తృతం అవుతున్న కొద్దీ మన లిమిటేషన్స్ చెరిగిపోతుంటాయి. ఇక ఆటంకాలకు అవకాశమే ఉండదు. అందివచ్చిన అవకాశాలను నిర్వహించగల సామర్థ్యం ఉన్నప్పుడు అననుకూల దృక్పథం వెంటపడదు. అనుకూల దృక్పథంతో ఆచరణాత్మకం కాగలిగితే ఏ ఆటంకాలు, కష్టాలు మనల్ని తిరోగమనపరచవు. ఇటువంటి వ్యక్తిత్వంతోనే మనం సక్సెస్‌ఫుల్ పర్సన్స్ అవుతాం.

రైట్ థింగ్... రైట్ టైమ్.. రైట్ వే

గోడకున్న గడియారాన్ని చూసుకుంటూ... చేతికున్న రిస్ట్‌వాచ్ చూసుకుంటూ- కార్యమగ్నమయితే- సక్సెస్ తలనొప్పి వ్యవహారమవుతుంటుంది. మానసికంగా సంసిద్ధం కాకపోతే కార్య నిర్వహణలో జాప్యం కాలనాగు అవుతుంటుంది. ఫలితం మనకే వస్తుంటుంది. చేసిన పని అరకొరగా తయారవుతుందే తప్ప ఎఫెక్టివ్ అనిపించదు. ప్రభావం చూపని పనితో అసంతృప్తే మిగులుతుంది. కాలాన్ని కంట్రోల్ చేయటం ఎంత ముఖ్యమో చేస్తున్న పనిపై కంట్రోల్ ఉండటమూ అంతే అవసరం. నియంత్రణ సాధ్యం కానినాడు రైట్‌థింగ్, రైట్ టైమ్, రైట్ వే అనేది సాధ్యం కాదు... సక్సెస్ పరంగా సద్యఃఫలితం అన్నది సాధ్యం కాదు. చేసే పని సరియైనది కావాలి.. సరియైన సమయంలో చేయాలి.. సరియైన విధానాన్ని అనుసరించాలి- ఈ మూడింటితో ఏదిరాంగ్ రూట్‌లోకి వెళ్లినా- అపమార్గం పట్టినా- కష్టానికి తగ్గ ఫలితం లభించదు.. శ్రమ వృధా అవుతుంది.. సంఘర్షణ, ఘర్షణ స్వంతమవుతుంది. కాలం హరించుకపోతుంటుంది. ఫలితంగా ఒత్తిడికి లోనవుతుంటాం.. బిజీ అయిబందీ అయిపోతుంటాం.. గతి తప్పి ఫెయిల్యూర్స్ బాటన పడతాం.. అసలు జీవితమే నియంత్రణ లేనిది అవుతుంది. ఈ సమయంలో ‘మేక్ టైమ్ ఫర్ సక్సెస్’ అన్న పదంపై మనసు లగ్నమయితే విజయ రహస్యం తెలిసినట్లే! సమయానికి సక్సెస్‌కు ఉన్న లింక్ అర్థమైనట్లే! సక్సెస్‌కు ఎన్ని వందల సూత్రాలున్నప్పటికీ అసలైన సూత్ర రహస్యం ఇదే!

గుప్పెడంత కాలం

ప్రస్తుతం మనం హైర్-ఫైర్ సంస్కృతిలో ఉన్నాం. ఏ మాత్రం కాస్త తెలివితేటలున్నా చక్కగా మాట్లాడగల నైపుణ్యం ఉన్నా ఉద్యోగం రావటం పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. అలాగే వృత్తి జీవనంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ఉద్యోగం పోవటమూ అంతే సులభం. కాలేజీ కాంపస్ నుండి డిగ్రీ చేత బట్టుకుని- కమ్యూనికేషన్ స్కిల్స్‌తో- బయటపడగలిగితే పాతిక వేల జీతం. టెక్నికల్ స్కిల్స్‌తో తెలివిగా వ్యవహరించగలిగితే పాతికేళ్లుగా యాభైవేల జీతం. ఓ అయిదేళ్లు నిలదొక్కుకోగలిగితే లక్ష జీతం గారంటీ. కాని ఇన్ని గారంటీల నడుమ పని వత్తిడి ఇంతా అంతా కాదు.. కాలంతో పోటీపడలేకపోతే స్ట్రెస్ తప్పదు. గడియారంలోని చిన్న ముల్లుతో పోటీపడటం ఒకప్పటి మాట. ఇప్పుడు పెద్ద ముల్లుతో పోటీపడలేకపోతే ‘ఫైర్’ అన్న పదం గుడ్లురుముతుంటుంది. వృత్తి జీవనంలో ఏ మాత్రం అలసత్వం చూపినా మరునాడు హెచ్‌ఆర్ పిలుపుతప్పదు. కాబట్టి సక్సెస్ పరంగా కాలం పగ్గాలు మన చేతిలో లేకపోతే సంపాదన ఉంటుందే తప్ప సంతృప్తి మిగలదు. ఆ అసంతృప్తి వృత్తి జీవనంతో ప్రతీ సక్సెసే ఒక ఫెయిల్యూర్ అనే అనిపిస్తుంటుంది. పైగా అసంతృప్తి అనేది ప్రొఫెషనల్ లైఫ్‌లో నిరంతరం అవుతుంటే దాన్ని లాంగ్ టర్మ్ ఫెయిల్యూర్ అనే చెప్పుకోవలసి ఉంటుంది. కాబట్టి ఫెయిల్యూర్స్ స్థానంలో లాంగ్‌టర్మ్ సక్సెస్ సాధ్యం కావాలంటే ‘టైమ్ - కారెక్టర్’ సఖ్యతగా ఉండాలి.. వ్యక్తిమత్వం వ్యక్తిత్వం స్నేహం చేయగలగాలి.

కహానీ

సంతోషం

వచ్చే జన్మంటూ ఉంటే నన్ను అర్థం చేసుకునే వాళ్ళింట్లో పుట్టించు దేవుడా! -ఇంట్లోవాళ్లకు గట్టిగా వినిపించేట్టుగానే అన్నాడు రవి. రిబాక్ షూ మీద రవికి ఆశ. కొనుక్కుందామంటే ఇంట్లో వాళ్లు పట్టించుకోవడం లేదు.. కోపానికి అదీ కారణం! ఇలాంటి ఇంట్లో పుట్టడం వల్ల తనలాంటి ప్రతిభావంతుడికి సంతోషమనేది లేకుండా పోయిందని మరికొంత కోపం. -‘అరే ఇంజనీరింగ్ చదివే కొడుకు ఎలా ఉండాలి. కాలేజీలో ఒక్కొక్కడు ఎంత స్టయిల్‌గా ఉంటున్నాడు. నేనేమన్నా డబ్బున్నోడి కొడుకులా కారు కొనివ్వమన్నానా? మనకంత సీన్ లేదని తెలుసు. మంచి డ్రెస్సు, షూ అడిగానంతే కదా?’. ఈ మాటలన్నీ స్వగతంగా అంటున్నట్టుగా రవి గట్టిగానే అంటున్నాడు. రవి ఎంత మొత్తుకున్నా తండ్రి మాత్రం అవేమీ పట్టించుకోకుండా టీవీ చానెల్‌ను ఆసక్తిగా చూస్తున్నాడు. తండ్రి కూర్చున్న సోఫా వద్దకు వచ్చి పక్కనే కూడలబడ్డాడు రవి. టీవీలో రతన్ టాటాపై ప్రత్యేక కార్యక్రమం వస్తోంది. రతన్ టాటా ఇంట్లో పుట్టే అదృష్టం ఉంటేనా?....’ అంటూ తండ్రికి వినిపించేట్టుగా మళ్లీ అన్నాడు రవి.

దేశంలో సంపన్నతకు టాటా మారుపేరు. సంపన్నత కన్నా టాటా పేరుకే ఎక్కువ ప్రాచుర్యం... యాంకర్ చదువుకుంటూ పోతోంది తెలుగునే ఇంగ్లీష్‌లా. అదృష్టం అంటే టాటాదే కదా? అనుకున్నాడు రవి. ఎంత ఏడ్చినా తండ్రిని ఒప్పించడం సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చి తానూ వినసాగాడు. రతన్ టాటా దాదాపు 50 ఏళ్లపాటు టాటాల సామ్రాజ్యానికి నాయకత్వం వహించారు. ఆ సామ్రాజ్యం విలువ ఐదులక్షల కోట్లు. 75 ఏళ్ల వయసులో రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. సాధారణంగా రిటైర్ అయ్యే వారిలో రేపటి నుంచి ఎలా అనే దిగులు కనిపిస్తుంది. కానీ ఆయన మాత్రం పాతికేళ్ల యువకుడిగా ఉత్సాహంగా ఉన్నారు. ‘అయినా మనలాంటి కుటుంబరావులకు దిగులు కానీ లక్ష్మీపుత్రుడు ఆయనకేం’ అనుకున్నాడు రవి స్క్రీన్‌మీద చూపు తిప్పకుండానే. -రిటైర్మెంట్ తరువాత ఏం చేయాలనుకుంటున్నారు’ టాటాకు యాంకర్ సంధించిన ప్రశ్న. ‘లైఫ్ బిజీతో చాలా కోరికలు నెరవేర్చుకోలేకపోయాను. ఇప్పుడు వాటి పనిబడతా’ అంటూ చిర్నవ్వుతో చెప్పుకుపోతున్నారు టాటా. ‘నీకేం బాసూ.. లక్షల కోట్లు. ఏ కోర్కెనైనా క్షణాల్లో నెరవేర్చుకుంటావ్’ రవి మనసు రన్నింగ్ కామెంట్రీ చేస్తోంది. ‘చిన్నప్పుడు పియానో నేర్చుకునే వాడిని. ఏడేళ్ల వయసులోనే బిజీగా ఉండి ఆపేశాను. ఇప్పుడది నేర్చుకోవాలని అనిపిస్తోంది. నా పెట్స్‌కు నేనంటే ఎంతో ప్రేమ. ఇప్పుడిక వాటితో ఆడుకుంటా. లైఫ్ బిజీతో దూరమైపోయిన చిన్న చిన్న సంతోషాలన్నీ ఇప్పుడు తీర్చేసుకుంటా. నాకిప్పుడు చాలాటైం దొరుకుతుంది’ అంటూ రతన్ టాటా చెప్పుకుపోతుంటే రవికి బుర్ర తిరిగింది. అంతా గమనిస్తున్న తండ్రి గట్టిగా నవ్వేశాడు. ‘సంతోషమంటే రెబాక్ షూ, బ్రాండెడ్ జీన్స్ మాత్రమే కాదురా కుర్రకుంకా. చాలా ఉంటాయ్..’ అంటూ రవి భుజం తట్టాడు.

-మురళి

విచిత్రాలు... నివాస్

కమలహాసను చూపినట్టి ‘విశ్వరూప’మెంతలే.. తమిళతల్లి కన్నెరకు రంగులన్ని వెలిసెలె!!

యువతరం కోసం ఈ వారం నుంచి మళ్లీ ‘యువ’ ప్రారంభమైంది. జ్ఞాపకాలో, అనుభవాలో, అల్లరో, ఆనందమో.. ఏ అంశంమీదనైనా పాఠకులతో మీ ఫీలింగ్స్ పంచుకోవాలని అనిపిస్తే -ఈ పేజీకి రాసి పంపించండి. బావుంటే తప్పక ప్రచురిస్తాం. రచనలు పంపాల్సిన చిరునామా..

ఎడిటర్,
ఆంధ్రభూమి దిన పత్రిక
36, సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్

మీ మాట

కొన్ని చిత్రాలను చూస్తే మళ్లీ చూడాలనిపిస్తుంది. ఇంకొన్ని చిత్రాలను చూస్తే ఏదో కటి మాట్లాడాలనిపిస్తుంది. ఆ మాటలు కొంటెగా ఉండొచ్చు. కవ్వింపుగానూ ఉండొచ్చు. కరుణతో ఉండొచ్చు. కప్పు కాఫీ తాగిన ఫీలింగూ కలిగించొచ్చు. వారం వారం అలాంటి చిత్రాలు ఇక్కడ దర్శనమిస్తాయి. సరదాగా కార్డుమీద క్యాప్షన్ రాసి పోస్టు చేయండి. బావున్నవాటిని ప్రచురిస్తాం.

అలరించిన మాట కచేరీ..

సాక్షి టివి రోజూ అర్ధరాత్రి 12 గంటలకు ప్రవాస భారతీయుల సౌకర్యార్థం 'వేదిక' కార్యక్రమాన్ని ప్రసారం చేస్తోంది. ఇందులోకి వచ్చే ప్రముఖ వ్యక్తితో వారు ఫోన్ లైవ్‌లో ప్రశ్నలడగవచ్చు. ఈ ప్రక్రియలో భాగంగా జనవరి 25న నటుడు తనికెళ్ల భరణి పాల్గొన్నారు. ప్రశ్నలడగడం, సమాధానాలు చెప్పడం అన్నది ఎప్పుడూ జరిగేదే! అవన్నీ కొన్ని సందర్భాలలో మొక్కుబడిగా జరిగిపోతూ వుంటాయి. కానీ ఆనాటి 'వేదిక' అలా కాకుండా పాల్గొన్న భరణి ఎలాంటి శషభిషలూ లేకుండా మనస్ఫూర్తిగా ఇంకా చెప్పాలంటే నాభి నుంచి నేరుగా మాట్లాడినట్లుంది. ఇంకో విశేషమేమిటంటే, భరణితోపాటు ఆనాటి కార్యక్రమ నిర్వాహకుడు, పాల్గొన్న కాలర్స్... అందరూ కూడా ఎంతో మమేకమై పాల్గొన్నారు. ఒక రకంగా ఇది భరణి మాటకచేరీలాగా అలరించింది.

భరణి అంతకుముందు రచయిత, నటుడూ, లఘు చిత్రాల దర్శకుడూ అయినా, ఇటీవలొచ్చిన 'మిథునం' దర్శకుడిగా ఇంటింటి పేరై నిలిచారు. సహజంగానే ఆ అంశమే ప్రధానంగా 'వేదిక'కు వేదికైంది. ఎక్కువగా మనిషిలోని నకారాత్మక అంశాలకే అధిక ప్రాధాన్యతిస్తూ కళారూపాన్ని అందించి పబ్బం గడుపుకుంటున్నా సంధికాలంలో పరిస్థితుల్ని బట్టి వచ్చిన అనివార్య మార్పుల్లోని అంశాన్ని సకారాత్మకంగా చూపిస్తూ అందర్నీ ఒప్పించే రీతిలో తీసిన 'మిథునం' ప్రయత్నం మెచ్చుకోతగ్గది. 'మిథునం' చిత్రం ఆరంభానికి నేపథ్యం, అందులో బాలసుబ్రహ్మణ్యాన్నే పాత్రధారిగా ఎంచుకోవడం, షూటింగ్ ప్రాంతం నిర్ధారణ, పాటలు పెట్టాల్సిన అవసరం గురించీ.. అన్నిటినీ నిజాయితీగా చెప్పుకొచ్చారు.

చిత్రాన్ని పాజిటివ్ స్పిరిట్‌తో తీసినట్లే ఇటీవల అందరూ చిన్న సినిమాలకు థియేటర్లు దొరకకపోవడానికీ, పెద్ద చిత్రాలు కావాల్సినదానికన్నా ఎక్కువ థియేటర్లు దొరకడానికీ కూడా అర్థవంతంగా సకారాత్మకంగా చెప్పడం ప్రశంసనీయం. ఇలాంటి చిత్రాలకు తగిన కెపాసిటీ థియేటర్లే భరణి చెప్పినట్లు కావాలి. అలాగే పెద్ద చిత్రాలకి వాటి పరిధీ, వ్యయం రీత్యా ఆరంభకాలంలోనే పరిస్థితులకు తగ్గట్లు థియేటర్ల అవశ్యకత ఉంది. భరణి చాలాచోట్ల తనకున్న హాస్య స్ఫోరక త్వాన్ని కూడా చక్కగా ప్రదర్శించారు. ఓ ప్రేక్షకుడు "ఏమిటండీ మీ సినిమా 'నెట్'లో దొరకడంలేదు?" అని అడిగితే "మాకు థియేటర్లు దొరకడంలేదు, మీకు నెట్ దొరకడంలేదు"అని సరదాగా అన్నారు. అలాగే మరో ప్రేక్షకుడు 'మా ఖతర్‌లో మీ చిత్రం విడుదల కాలేదు' అంటే దానికి అనునయంగా ఆయన మీ 'ఖతార్'ను 'ఖాతర్' చేస్తాం. త్వరలో విడుదల ప్రయత్నాలు చేస్తాం అని చమత్కరించారు.

బాపుకిటీవల 'పద్మశ్రీ' వచ్చినందుకు అభినందిస్తూ బాపురమణల సాంస్కృతిక సంస్కారాన్ని ఉదాహరణ పూర్వకంగా వివరించారు. తొంభై దశకాల్లో బాపు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి పుస్తకం' చిత్రంలో భరణిది పురోహితుని పాత్ర. స్క్రిప్టులో ఉన్న మాటలతోపాటు మధ్య మధ్య ఏవైనా అనువైన శ్లోకాలు చెప్పండి అని రమణ తనికెళ్లకు సూచించారు. ఆ ప్రకారంగానే భరణి నటించారు. చిత్రీకరణ అనంతరం పదివేల రూపాయల చెక్కు అందించారు భరణికి. అప్పట్లో అది భరణికి పెద్ద మొత్తమే! ఇదిలా వుంటే, మేకప్ తీసి ఆ ప్రదేశాన్నుంచి నిష్క్రమించేముందు రమణగారు మరో పదివేల రూపాయల నగదు ఇచ్చారట. ఇదెందుకని ప్రశ్నించిన భరణితో 'మధ్యలో స్క్రిప్టులో కూడా శ్లోకాలు అందించి సాయపడ్డారుగా... అందుకు' అన్నారట. రావాల్సిన ఎమోల్టేరాని సందర్భాలలో ఇలా ఇంతటి సందర్భాలు రావడం మహా అరుదు కదా! కానీ ఆఖర్లో ఓ ప్రశ్నకు భరణి చెప్పిన సమాధానం... "సమాజంలో జరుగుతున్న వాటికంటే సినిమాల్లో చాలా తక్కువ చూపిస్తున్నారు" అని అన్నారు. వాటి నిజానిజాల మాట అటుంచి అవాంఛితమైనది చూపి "ఇది అసలు కన్నా తక్కువే" అని అనడం సమంజసం కాదు. ఎందుకంటే తెరపై చూపిన అలాంటి వాటి ప్రభావం నిజంగా జరిగినదానికన్నా ఎక్కువ వుంటుంది. అందుకే కళాకృతుల్లో చూపేదానిపట్ల సంబంధితులు ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రేక్షకులు కూడా ఎంతో అంకితభావంతో ఇందులో పాల్గొన్నారనడానికి మరో ఉదాహరణ... 'మిథునం'లో ఓ చోట వ్యాసపీఠాన్ని తిరగేసి చూపాం కదా? అనడం. దీన్ని తనికెళ్ల భరణి ఖండించలేదు కూడా.

* * *

ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే తప్పనిసరిగా అభిప్రాయ వ్యక్తీకరణకు అవకాశం వుండాలి. అయితే అందరూ జరుగుతున్న అన్ని అంశాలపైనా అభిప్రాయాలు వ్యక్తం చేయలేరు. అందుకే సంబంధిత అంశాలలో నిష్ణాతులైన వ్యక్తులను సమీకరించి విషయాల్ని తెలియజేస్తున్నారు. అన్నింటిలోనూ న్యాయకోణం దృశ్యాదృశ్యంగా ఉన్నా, కొన్నింటిలో ఈ కోణాన్ని ప్రత్యేకంగా స్పృశించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి న్యాయపర చర్చకు అవకాశమున్న వాటినే ప్రత్యేకంగా తీసుకుని అవగతపరిచే ప్రయత్నం నిస్సందేహంగా చేస్తోంది 'లా పాయింట్' (సాక్షి టివిలో ఫిబ్రవరి 1 రాత్రి 9 గంటలకు వచ్చినది). ఆనాటి కార్యక్రమంలో 'బాలలు - నేరాలు' అంశాన్ని తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఢిల్లీ ఘోర దురంతంలో కూడా నిందితుల్లో మైనర్ ఉన్నాడన్న సంగతి అందరికీ తెలిసిందే! ఈ నేపథ్యం దృష్ట్యా ఈ చర్చకింకా ప్రాధాన్యత సంతరించుకుంది.

నేర రహిత సమాజాన్ని తయారుచేయడం అందరి లక్ష్యం అవుతున్న తరుణంలో బాల నేరస్థుల సంఖ్య పెరగడం ఆందోళనకరం. అన్ని రంగాల్లోనూ పెరుగుదల క్షీణిస్తూంటే విచిత్రంగా బాలనేరస్థుల విభాగంలో ఈ సంఖ్య పెరుగుతూ వస్తూ ఉంది. ఇది గతేడాది 33 శాతం వుంటే అదిప్పుడు 36 శాతం అయింది. బాల నేరస్థుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ మూడవస్థానంలో ఉంది. అసలు బాలనేరస్థులుగా పరిగణించడానికి కొలబద్ద అయిన వయసు పద్దెనిమిదిగా నిర్ణయించడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే పెరిగిన సమాచార ప్రవాహంవల్ల పదహారు నుంచి పద్దెనిమిది ఏళ్ళ వారికి వారేం చేస్తున్నారో వారికి తెలియదన్న వాదనను ఎవరూ అంగీకరించరు.

ఈ విషయాన్ని ఈ చర్చ అర్థాంతరంగా చేసింది. అందుకే ఈ చర్చలో వక్తలు చెప్పినట్లు బాలనేరస్థులుగా వారిని విభజించేముందు వయసు నేపథ్యంగా తీసుకున్నా, మానసిక పరిణతి తదితర అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. దీంతో పాటు ఈ చర్చ మరో చక్కటి అంశాన్ని రేఖామాత్రంగా చర్చించింది. బాలనేరస్థుల సంఖ్య సాధ్యమైనంత తగ్గడానికి చట్టాల పటిష్టీకరణతో పాటు కుటుంబ వ్యవస్థ, విద్యా వ్యవస్థ, చట్ట వ్యవస్థల సంస్కరణ చెయ్యాలి. అది చెయ్యకపోతే మిగతా అంశాల్లో నెలకొల్పే కొత్త పద్ధతులేవీ కలిసిరావు. కార్యక్రమం వీలైనంతవరకూ తెలుగులోనే సాగితే బావుంటుంది. అయితే పిలుచుకొచ్చిన అతిథులందరికీ తెలుగుతో సన్నిహిత పరిచయం లేకపోయినందువల్ల ఆంగ్ల వాక్యాలు సుదీర్ఘంగా దొర్లినా, కార్యక్రమ నిర్వాహకుడు దానికి సముచిత తెలుగు అనువాదం సమగ్రంగా చెయ్యాలి. అప్పుడిలాంటివి తమ పరిపూర్ణ లక్ష్యానికి చేరువవుతాయి.

-అన్వేషి

సుదీర్ఘ ప్రసారంతో కట్టిపడేస్తున్న 'మహాదేవి'

జీ తెలుగులో ప్రతిరోజూ (సోమ - గురు) ఉదయం 9 గంటల నుండి 9.30 ని.ల వరకు ప్రసారమౌతున్న భక్తిరస ధారావాహిక 'మహాదేవి' వీక్షకులను కట్టిపడేస్తుంది. నేడు ప్రతి ఛానల్‌లో డజన్లకొద్దీ డబ్బింగ్ సీరియల్స్ ప్రసారమౌతున్న తరుణంలో కన్నడ డబ్బింగ్ సీరియల్ అయినప్పటికీ ఏ మాత్రం తెలుగు నేటివిటీకి తీసిపోకుండా అచ్చ తెలుగు సీరియల్‌లా వీక్షకులను ఆకట్టుకోవడంలో 'మహాదేవి' విజయం సాధించిందనే చెప్పాలి.

ఆధ్యాత్మికత కరువైపోతున్న తరుణంలో భక్తిరస ప్రధానంగా దాదాపు రెండేళ్ళు పైబడినా నిత్య నూతనంగా మహాదేవి వీక్షకులను ఆకర్షించడం గమనార్హం. 'వరాలను యిచ్చే శంఖం' కోసం ఆరాటపడే దుష్టశక్తులకు మహాదేవికి మధ్య జరిగే పోరాటం యితివృత్తంగా నడిచే ఈ సీరియల్‌లో పాత్రలన్నీ చాలా చక్కగా పరిధిమేరకు, చక్కని మాటలతో హావభావాలతో నటనను పండిస్తున్నాయి. ఎన్ని ఎపిసోడ్స్ నడుస్తున్నా ఎక్కడా సాగతీత ధోరణి ప్రేక్షకులకు కలగకపోవడం విశేషం!

జీ తెలుగు సీరియల్ ప్రసారాల్లో మహాదేవి విశిష్ట ప్రాచుర్యం పొందుతుంది. ఈ సీరియల్‌కి కాంటెస్ట్ నిర్వహిస్తున్న దానిని ప్రేక్షకులు మహాదేవి ప్రసాదంగా భావించడం జరుగుతుంది. సీరియల్ తీసే విధానం అచ్చంగా వెండితెరను పోలి ఉండడం వలన విశేషంగా వీక్షకులు తిలకిస్తున్నారు. గతంలో సాయంకాల సమయంలో ప్రసారమైన ఈ సీరియల్ టైమ్ మారినా కూడా అదే ఆదరణ లభించడం గమనార్హం!

అమ్మవారిగా పాత్రధారులు మారినప్పటికీ వారందరూ ఏ మాత్రం తీసిపోని నటనను కనబరచడంతో మహాదేవి విశేష ఆదరణను చూరగొంటుంది. జీ తెలుగు భక్తిరస సీరియల్స్ ప్రసారంలో ఎప్పుడూ నిండు ఆదరణ పొందిందనడానికి నిదర్శనంగా 'షిర్డిసాయి' 'మహాదేవి'లు నిలుస్తాయి. ఈ సీరియల్ విషయంలో డబ్బింగ్ పట్ల.. మాటల రచన లపట్ల.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌పట్ల జీ తెలుగు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

-బాసు

సరైన సమయంలో...

ఆర్టిస్టుకి ఒకోసారి ఎన్నిసార్లు ఎదురుచూసినా అవకాశం రాదు. అలా ఒకవేళ వచ్చినా అవి నచ్చక వాటిని వినియోగించుకోలేరు. అలాంటి పరిస్థితులన్నిటినీ దాటేసిన నటి నేహా ధూపియాకి ఇప్పుడో టివి కామెడీ షో 'నేతాంకీ'లో న్యాయనిర్ణేతగా వ్యవహరించే అవకాశం వచ్చింది. 2004లో వచ్చిన 'జూలీ'తో తగిన గుర్తింపు పొందిన నేహాకీ మధ్య పెద్దగా అవకాశాలు లేవు. ఆమధ్య వచ్చిన 'సింగ్ ఈజ్ కింగ్'లో కూడా నేహా పోషించిన పాత్రేం గొప్పదికాదు. ఇలాంటి సమయంలో 'నేతాంకీ' వచ్చి నేహా కెరీర్‌ని కాంతివంతం చేసింది.

ఇక్కడంతా మనిష్టం

సినిమాల్లో అయితే వస్త్రధారణ దగ్గర్నించీ బోల్డన్ని షరతులతో పని చేయాల్సి వుంటుంది. ఇక్కడ కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. ఇష్టమైన డ్రెస్సుల్ని జడ్జిగా వేసుకోవచ్చు. అందులోనూ నేను న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నది ఓ హాస్య కార్యక్రమానికి కనుక చెప్పలేనన్ని నవ్వులు పువ్వుల్ని పక్కవారితో పంచుకోవచ్చు. ఇక నా సహ న్యాయనిర్ణేతగా నటుడు తుషార్‌కపూర్ వున్నారు కనుక ఆ నవ్వుల ప్రవాహం సాగిపోతూనే ఉంటుంది అంటున్నారు నేహా.

ఇప్పుడలాంటివన్నీ మామూలే!

ఒకోసారి తలచుకుంటే ఆశ్చర్యమేస్తూ వుంటుంది. నేను ఆ రోజుల్లో 'జూలీ' చిత్రంలో నటించినప్పుడు అందులోని కొన్ని సాన్నిహిత్యపు సన్నివేశాలకీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కానీ ఇప్పుడలాంటివి అనేక చిత్రాల్లో సర్వసామాన్యమైపోయాయి. అయినా ఎవరూ కిక్కురుమనడం లేదు. ఎందుకో మరి అంటూ అభిప్రాయం వ్యక్తపరిచారు నేహా ధూపియా.

మొక్కుబడి హాస్య కార్యక్రమాలు

తెలుగువాళ్ళకు హాస్యప్రియత్వం ఎక్కువ. అలాగని సాహిత్యంలో చూస్తే తెలుగు హాస్య నవలలుగానీ, కథలుగానీ పెద్దగా కనిపించవు. పోటీలు పెట్టినా ప్రతిస్పందన వుండదు. అదే నాటకాలు గానీ, సినిమాలు గానీ అయితే విరగబడి చూస్తారు. విద్యాధికులకు హాస్యంపట్ల చులకనభావం వున్నా సామాన్య పాఠకులు గాని, సామాన్య ప్రేక్షకులుగానీ హాస్యం పట్ల ఎక్కువ మక్కువ చూపుతారు. సినిమాల్లో అయితే కథానాయకుడికంటే ఎక్కువగా హాస్యనటుడికే ప్రాధాన్యత ఎక్కువ. ప్రేక్షకాదరణతో తారాపథానికెగసిన హాస్యనటులు ఎందరో వున్నారు. తొలినాళ్ళలో కస్తూరి శివరావు, రేలంగి, రాజబాబు ఇప్పుడు బ్రహ్మానందం. వీరికున్నంత ప్రేక్షకాదరణ మరెవరికీ లేదంటే ఆశ్చర్యం లేదు. పెద్ద హీరోలు సైతం వీళ్ళ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. వీరు లేకపోతే డిస్ట్రిబ్యూటర్స్ కూడా వెనుకడుగు వేసేవారు. వీరు నటించిన హాస్య సన్నివేశాల కోసం సినిమాలను మళ్లీ మళ్లీ చూసేవారు. బయట, మిత్రుల మధ్య వాటి గురించి చెప్పుకుని ఆనందించేవారు.

హాస్యనటులకున్న క్రేజ్‌ను ఆధారం చేసుకుని వాళ్ళను హీరోలుగా పెట్టి సినిమాలు తీయడం ఒక ఎత్తు. కేవలం హాస్య చిత్రాల హీరోలుగా కొందరు తయారుకావడం మరో ఎత్తు. తొలినాళ్ళలో చంద్ర మోహన్ హాస్య హీరోగా వస్తే, రాజేంద్రప్రసాద్ మాత్రం ఎవరూ అందుకోలేని ఎత్తుకు ఎదిగాడు. వీరుగాక నరేష్, శివాజీ, అల్లరి నరేష్‌లు కూడా హాస్య హీరోలుగా ముందుకొచ్చారు. ఇక హాస్యనటులకు కొదవలేకుండా పోయింది. ఈ రోజు తెలుగు చిత్ర పరిశ్రమలో వున్నంతమంది హాస్యనటులు వేరే భాషల్లో ఎక్కడా కనిపించరు. ఇంత మంది వున్నా ఎవరి ప్రత్యేకత వారిది. ఆ ప్రత్యేకతల ఆధారంగా జనాలు వాళ్ళను అభిమానిస్తుంటారు.

హాస్య సన్నివేశాల పట్ల వున్న మోజును మార్కెట్ చేసుకోవడానికి ఆడియో కంపెనీలు కేవలం హాస్య సన్నివేశాలను విడిగా రికార్డ్ చేసి సిడిలుగా అమ్మడం మొదలుపెట్టారు. 'ఆనందో బ్రహ్మ' పేరిట బ్రహ్మానందంతో మొదలుపెట్టి అందరి హాస్యనటుల పేరుతో సిడిలు వెలువరించి డబ్బులు చేసుకుంటున్నారు.

ఇక టివి కార్యక్రమాల్లో పండుగల పూట హాస్య కార్యక్రమాలను ప్రసారం చేయడం దూరదర్శన్‌కు ఒక ఆనవాయితీగా వుండింది. రాను రాను హాస్య నటులతో జోక్స్, స్కిట్స్, ప్రహసనాల మాదిరి కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేసేవారు. మొట్టమొదటిసారిగా సినిమాల్లోని హాస్య సన్నివేశాలను గుదిగుచ్చి 'హాస్య రంజని' పేరిట కొత్తగా ప్రసారం చేసిన ఘనత మాత్రం ఈటివికే దక్కుతుంది. కేబుల్ టివి చూడని వాళ్ళు సైతం ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుండి ప్రారంభమయ్యే ఈ అరగంట కార్యక్రమం కోసం ఎదురుచూసేవారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజాదరణను చూసి దాదాపుగా అన్ని ఛానెళ్ళు ఏదో ఒక సమయంలో సినీ హాస్య సన్నివేశాలను ప్రసారం చేస్తున్నాయి. ఉత్తరాది న్యూస్ ఛానెళ్ళు 'కామెడీ సర్కస్' పేరిట సోనీలో ప్రసారమయ్యే హిందీ ప్రహసనాలను తిరిగి ప్రసారం చేస్తుంటాయి. మన తెలుగు న్యూస్ ఛానెళ్ళు మాత్రం హాస్య సన్నివేశాలను ఏదో ఒక సమయంలో ప్రదర్శిస్తూ వుంటాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సినిమా హాస్యం కోసం ఏకంగా కొత్త ఛానెల్ తెరవడం 'జెమినీ కామెడీ' పేరిట రోజంతా ప్రసారం చేసే ఈ సినీ హాస్య సన్నివేశాలను చూసి ఆనందించని వారెవ్వరు? రిపిటీషన్ అయినా, ఎంతగా తమిళ వాసన వేసినా ఈ ఛానెల్‌ను చూడకుండా ఉండడం కష్టం.

హాస్యం పట్ల తెలుగువాడికి ఉన్న మక్కువను

చూసి తెలుగు సినిమాలను ప్రదర్శించే ప్రతి వెబ్‌సైట్‌లో తెలుగు కామెడీ సీన్లను ప్రత్యేకంగా ప్రదర్శించడం విశేషం. ఈ రోజు కంప్యూటర్ ముందు కూచొని నెట్‌లో 'తెలుగులో కామెడీ సీన్స్' అనీ, లేదా 'తెలుగు కామెడీ వీడియోస్' అని క్లిక్ చేస్తే చాలు. కుప్పతెప్పలుగా సైట్లు వచ్చి పడుతున్నాయి. కొత్త సినిమా సన్నివేశాలతో సహా వచ్చేస్తున్నాయి.

ఇదంతా ఎందుకు చెప్పుకొస్తున్నానంటే, ఈమధ్యనే దూరదర్శన్ వారు సినీ హాస్య సన్నివేశాలతో 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారు. అందరికంటే ఆలస్యంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం, అందరికంటే నాసిరకంగా తయారుకావడం దీని ప్రత్యేకత. హాస్యం వుండే సన్నివేశాలను ప్రసారం చేయాలి కానీ, హాస్యనటులు వున్న ఏ సన్నివేశాన్నయినా కాదని ముందు గ్రహించాలి. ఇందులో వచ్చే హాస్య సన్నివేశాలను బట్టి వచ్చే శని, ఆదివారాల్లో ఏ సినిమా చూపిస్తారో ఊహించవచ్చు. మంచి ఎంపిక, ఎడిటింగ్‌ల ఆవశ్యకతను ముందు గుర్తించాలి. మిగతా ఛానెళ్ళలో ఇలాంటి కార్యకమాలు ఎలా వస్తున్నాయో చూసి, ఈ కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా రూపొందించుకోవచ్చు. పట్టుదల, పోటీతత్వంతో పాటు మనుషుల్లో సృజనాత్మకత కూడా ఉన్నప్పుడే ఆ చానెల్ కార్యక్రమాలు బాగుంటాయి. సినీ ఆధారిత కార్యక్రమాలను రూపొందించేటప్పుడు బుర్రనుపయోగించ నక్కర్లేదనుకుంటే, ఇలాంటి అవకతవక కార్యక్రమాలే వస్తాయి. చాలావరకు ఇతర ఛానెళ్ళలో రోజూ ఒక అరగంట ఈ సినీ హాస్య సన్నివేశాలకు కేటాయిస్తుంటే, బోలెడన్ని సినిమాలు వున్న దూరదర్శన్ వారానికొక రోజు, అదీ శనివారం తొమ్మిది గంటలకు ప్రసారం చేయడం ఏం బాగాలేదు. వీలయితే ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు ఒక అరగంట కేటాయిస్తే దూరదర్శన్‌కు ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుంది. డిష్, కేబుల్ వాళ్ళకు మాత్రమే ఈ కార్యక్రమ వేళలు అందుబాటులో ఉంటాయి. వాళ్ళకు ఇంతకంటే మంచి ప్రోగ్రాం చూడటానికి అవకాశాలున్నాయి. అందుకని ఈ కార్యక్రమాన్ని ఎంటెన్నా ప్రేక్షకుల కోసం శని, ఆదివారాల్లో మూడు గంటలకు కానీ, లేదా రాత్రి 7.30కుగానీ ప్రసారం చేస్తే బాగుంటుంది. ఇదే కార్యక్రమం హిందీలో అనగా హిందీ చిత్రాల హాస్య సన్నివేశాలతో 'హాసీ కె గోల్ గప్పె' పేరిట ప్రతి గురువారం 8.30కు డి.డి ఉర్దూలో వస్తున్నది. డి.డి ఉర్దూ ఛానెల్, చెన్నై దూరదర్శన్‌లో వచ్చే ఈ హాస్య కార్యక్రమాలు 'సప్తగిరి'

కంటే బాగుండడం వాళ్ళ అదృష్టం, మన దురదృష్టం. మొత్తానికి 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' కార్యక్రమంలో వ్యాఖ్యాతగా అనంత్ ప్రెజెంటేషన్ ఒక్కటే బాగుండడం చెప్పుకోదగ్గ విశేషం.

-కె.పి.అశోక్‌కుమార్

సాదా సీదాగా 'సై అండ్ సై'

జీ తెలుగు ప్రతి మంగళవారం రాత్రి 9.30 ని.లకు 'సై అండ్ సై' అంటూ సరికొత్త షోను ప్రారంభించింది. డాన్స్ షోను సింగిల్ షోను మిక్స్ చేసి రూపొందించిన షో ఫార్మేట్ కొత్తగా అనిపించినా షో మాత్రం ఆద్యంతం చాలా డల్‌గా నడుస్తుంది. జీ తెలుగులో ప్రతి సోమ, మంగళవారాల్లో ఇదై టైమ్‌లో 'ఆట' వరస సిరీస్‌లతో వేడెక్కించిన ఓంకార్ వెండితెరవైపు చూడడంతో కొత్త బ్యానర్‌కి 'సై అండ్ సై' అనే అవకాశం చిక్కింది.

షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'అకుల్' వ్యాఖ్యానం మరింత నీరసం తెప్పిస్తుంది. సమయస్ఫూర్తిగా.. హుషారుగా వ్యాఖ్యానం చేయాలని ఎంత ఆరాటపడుతున్నా అది పండక పోవడం గమనార్హం! యిప్పటికే 'పెళ్ళినాటి ప్రమాణాలు' సీరియల్‌లో సీరియస్ పాత్రతో గుర్తింపు తెచ్చుకోవడంతోపాటు 'జీ కుటుంబ అవార్డ్'లో తనదైన ముద్రతో డాన్స్ పెర్‌ఫార్మెన్స్ యిచ్చి ఏకంగా దర్శకుడు క్రిష్‌చేతనే పాదాభివందనం అందుకొన్న 'అకుల్'ని షోకి వ్యాఖ్యాతగా ఎన్నుకోవడం సబబే అయినా అంతగా రక్తికట్టించలేకపోతున్నాడు.

షోలో మూడు గ్రూపుల మధ్య పోటీ నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రూప్‌లోనూ సింగర్స్, డాన్సర్స్ వుంటారు. మొదటి గ్రూపు కొరియోగ్రాఫర్ భరత్.. రెండో గ్రూపు చిన్నకోడలు యామిని... మూడో గ్రూపు సింగర్ కమ్ మ్యూజిక్ డైరెక్టర్ హేమచందర్ మెంటర్స్‌గా వ్యవహరిస్తూ పార్టిసిపెంట్స్‌ని



ఉత్సాహపరుస్తున్నారు. అయితే మొదటి గ్రూపు వారు డాన్స్ చేస్తే రెండో గ్రూపు పాట పాడుతుంది.. యిలా షో రకరకాలుగా రౌండ్స్ పెడుతుంది. భరత్.. యామిని.. హేమచందర్‌లతో షోకి కొత్త లుక్ వచ్చినా ముగ్గురూ సాఫ్ట్ కావడంతో షో డల్‌గా నడుస్తుంది. ఎందుకంటే యిప్పుడు షోలంటే డిష్యుం... డిష్యుంలు ఉండాలి. అవే షో ప్రొమోలకు... షోకి కిక్‌నిస్తాయి.

యిక జడ్జి విషయానికొస్తే షో ఫార్మెట్ ప్రకారం సింగింగ్‌ని జడ్జి చేయడానికి ఎల్.ఆర్.ఈశ్వరిని, డాన్స్‌ని జడ్జి చేయడానికి శివశంకర్ మాస్టర్‌ని పెట్టారు. వీరుకూడా సాఫ్ట్. దాంతో 'సై అండ్ సై' హాట్ హాట్‌గా కాకుండా సాదాసీదాగా నడిచేస్తుంది. ముందు ముందు ఏమైనా హీటెక్కించే ప్రయత్నాలు నిర్వాహకులు చేస్తారేమో చూడాలి. జడ్జిలు.. మెంటర్స్ యిచ్చే పాయింట్స్‌ని వేల రూపాయల్లోకి మార్చడం కొసమెరుపు.

-బి.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

బుధవారం 6, ఫిబ్రవరి 2013

ఆరోగ్యం

నాణ్యమైన పసుపు రుచి కొంచెం చేదుగా, కారంగా ఉంటుంది. వేడి చేసే తత్వం పసుపులో అధికం. విష లక్షణాలను బయటకు వెడలగొట్టడం దీని ప్రధాన కర్తవ్యం. ఆహార పదార్థాలకు రంగు, రుచి, సువాసనలు కలుగజేయడం, వాటిలో దోషాలను రూపుమాపడం, అవి సులభంగా జీర్ణమయ్యేలా చూడటం పసుపు లక్షణం.

తల్లిపాలలో దోషాలేమైనా ఉంటే వాటిని పసుపు నివారిస్తుంది. పసుపు కొమ్మును బాగా అరగ దీసి నాలుకకు రాస్తే, జ్వరంతో ఉన్నవారికి కొంత ఉపశమనం కలుగుతుంది. కడుపులోని విషపురుగులను నిర్మూలించి, జీర్ణశక్తిని ఇది కలిగిస్తుంది. రక్తహీనతను తగ్గించి ఆరోగ్య పుష్టిని, శరీరానికి కొంత బలాన్ని సమకూరుస్తుంది.

పెద్దఉసిరి వరుగును ఎండబెట్టి పొడి చేసి దానికి సమానంగా పసుపు కలిపి, ప్రతి రోజూ తీసుకుంటే మధుమేహానికి అద్భుత చికిత్సగా పనిచేస్తుంది. పసుపునకు నాలుగు రెట్లు పెరుగు కలిపి తింటే కామెర్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. వ్యాధి తీవ్రతను బట్టి, రోగనిరోధక శక్తిని బట్టి మోతాదు ఉండాలి. అజీర్తిని పోగొట్టి, కడుపులో మంటను, పైత్యాన్ని తగ్గించే చక్కని ఔషధం పసుపు. ఇది అరుచిని పోగొట్టి, సకాలంలో ఆకలిని కలిగిస్తుంది.

-లక్ష్మీ సువర్చల

కోరల్లేని చట్టమేనా?

ఆసేతు హిమాచలం ఆందోళనలతో అట్టుడికిపోయింది.. ఎవరి ప్రోద్బలం, ప్రమేయం లేకుండానే యువతీ యువకులు పల్లె నుంచి ఢిల్లీ దాకా వీధుల్లోకి వచ్చి దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.. పోలీసులు లాఠీలతో దండెత్తినా వెన్ను చూపలేదు.. దేశంలో మున్నెన్నడూ కనీవినీ ఎరగని రీతిలో కొన్ని వారాల పాటు మహోద్యమం ఉప్పెనలా సాగింది.. ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచారం ఘటన తర్వాత భారత్‌లో మహిళ భద్రతపై అంతర్జాతీయ స్థాయిలోనూ విస్తృత చర్చ జరిగింది.. మహిళలపై లైంగిక నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు, శిక్షలను మరింత కఠినతరం చేసేందుకు సరికొత్త శాసనాలు చేయాలంటూ మహిళా ఉద్యమ నేతలు, మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు... ఒక్కరేమిటి దేశం యావత్తూ ఆవేశంతో ఊగిపోయింది.. ఉవ్వెత్తున సాగిన ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదు. లైంగిక హింస నిరోధానికి, ప్రస్తుత చట్టాలను సమీక్షించి వాటికి తగిన మార్పులు సూచించేందుకు కేంద్రం నియమించిన జస్టిస్ వర్మ కమిటీ పలు సిఫార్సులతో నివేదిక సమర్పించింది. ఈ సిఫార్సులను పరిశీలించాక కేంద్ర మంత్రిమండలి సలహాపై తాజాగా రాష్ట్రపతి 'క్రిమినల్ లా (సవరణ) ఆర్డినెన్స్-2013' (లైంగిక నేరాల నిరోధక ఆర్డినెన్స్)ను ఆమోదించారు. ఇది తక్షణం అమల్లోకి వచ్చింది. కాగా, దేశ ప్రజల ఆకాంక్షలను ఈ ఆర్డినెన్స్ ప్రతిఫలించడం లేదని మహిళా ఉద్యమ సంస్థలు, కొన్ని విపక్ష రాజకీయ పార్టీలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. జస్టిస్ వర్మ కమిటీ చేసిన కొన్ని కీలక సిఫార్సులను పక్కనపెట్టి 'కోరల్లేని ఆర్డినెన్స్'ను ఆమోదించడం తమను వంచించడమేనని మహిళా సంఘాలు విరుచుకుపడుతున్నాయి. కొద్ది రోజుల్లో పార్లమెంటు సమావేశాలు జరుగనుండగా ఆదరాబాదరగా ఆర్డినెన్స్ జారీ చేయడం అర్థరహితమని కొన్ని విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ ఆర్డినెన్స్ ప్రజాస్వామ్యానికి, పారదర్శకతకు విరుద్ధంగా ఉందన్న వాదనలు జోరందుకుంటున్నాయి. వర్మ కమిటీ సిఫార్సులను యథాతథంగా అమలు చేసేలా చట్టం రూపొందించేవరకూ ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని మహిళా సంస్థల నేతలు స్పష్టం చేశారు. అత్యాచార కేసుల్లో నిందితులకు మరణశిక్ష విధించాలని వర్మ కమిటీ సిఫార్సు చేయకున్నా దాన్ని ఆర్డినెన్స్‌లో చేర్చడం ఏమిటని మహిళా ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు.

అత్యాచార కేసుల్లో నిందితులైన ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు శాఖ, సైనిక బలగాల సిబ్బందిపై కఠిన శిక్షలుండాలన్న వర్మ కమిటీ సిఫార్సును విస్మరించడం పట్ల కూడా నిరసన ధ్వనులు చెలరేగుతున్నాయి. సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టా'న్ని సమీక్షించాలన్న కీలక సిఫార్సును ఆర్డినెన్స్‌లో ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందని మహిళా నేతలు దుమ్మెత్తి పోస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు నిర్విరామ కసరత్తు చేసి, ప్రజల నుంచి వచ్చిన సుమారు 80 వేల సూచనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాక వర్మ కమిటీ ఎంతో నిజాయితీగా చేసిన సిఫార్సులను కేంద్రం పూర్తి స్థాయిలో పట్టించుకోక పోవడం సరికాదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రపతి ఆమోదంతో చట్టబద్ధత లభించిన 'క్రిమినల్ లా (సవరణ) ఆర్డినెన్స్-2013' ప్రకారం తీవ్రమైన అత్యాచార కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించే అవకాశం ఉంది. అత్యాచారం ఫలితంగా బాధితురాలు మరణించినా, అచేతనావస్థకు చేరినా 20 ఏళ్ల వరకూ జైలు శిక్ష, తీవ్రమైన కేసుల్లో మరణశిక్ష విధిస్తారు. అయితే, మరణశిక్ష వద్దంటూ మహిళా సంఘాలు పెద్ద ఎత్తున సూచనలు చేయడంతో ఈ విషయమై జస్టిస్ వర్మ కమిటీ ఎలాంటి సిఫార్సు చేయలేదు. మరణశిక్షలతో తిరోగమన దిశగా అడుగులు వేసినట్లవుతుందని కమిటీ భావించింది. కమిటీ సిఫార్సు చేయకపోయినా మరణశిక్షలు విధించాలన్న అంశాన్ని ఆర్డినెన్స్‌లో చేర్చడం గమనార్హం.

ఆర్డినెన్స్ ప్రకారం 'అత్యాచారం' అనే పదాన్ని 'లైంగిక దాడి'గా పరిగణించాల్సి ఉంటుంది గనుక మహిళలపై జరిగే అన్ని రకాల లైంగిక నేరాలూ 'అత్యాచారం' కిందే వస్తాయి. మహిళల వెంటపడినా, వేధించినా, అనుచితంగా అసభ్యకరంగా ప్రవర్తించినా, వ్యభిచారంలోకి నెట్టినా, దంపతుల ఏకాంత దృశ్యాలను రహస్యంగా చూసినా, చిత్రీకరించినా లైంగిక నేరమే అవుతుంది. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా పోలీసు అధికారి మాత్రమే నమోదు చేయాలని, 18 ఏళ్ల లోపు మహిళలు నిందితుని సమక్షంలో విచారణకు హాజరు కానక్కర్లేదని, బాధితురాలి వాంగ్మూలాన్ని ఆమె నివాసంలోనే నమోదు చేయాలని వర్మ కమిటీ చేసిన కొన్ని సిఫార్సులను ఆర్డినెన్స్‌లో చేర్చారు. యాసిడ్ దాడిలో ఆత్మరక్షణ కోసం నిందితుడిని హతమార్చిన పక్షంలో బాధితురాలి చర్యను ఆత్మ రక్షణ హక్కుగా పరిగణిస్తారు. కాగా, మహిళలపై పురుషులు కూడా లైంగిక దాడి ఆరోపణలు చేసేందుకు ఆర్డినెన్స్‌లో అవకాశం కల్పించడం విడ్డూరంగా ఉందని మహిళా నేతలు విమర్శిస్తున్నారు. యాసిడ్ దాడుల్లో బాధితులు కోలుకునేందుకు నష్టపరిహారం ఇవ్వాలన్న సిఫార్సును పట్టించుకోలేదు.

'ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసేలా ఆదరాబాదరాగా ఆర్డినెన్స్‌ను తేవాల్సిన అవసరం ఏమిటి? కొద్ది రోజుల్లో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతుండగా కేంద్ర మంత్రిమండలి ఇంత తొందరగా ఆర్డినెన్స్ తేవడం ఎందుకు? వర్మ కమిటీ సిఫార్సులపై తగిన దృష్టి సారించకుండానే ఎవరిని సంతృప్తపరచడానికి ఈ ప్రయత్నాలు?'-అని అఖిల భారత అభ్యుదయ మహిళా సంఘం (ఎఐపిడబ్ల్యుఎ) కార్యదర్శి కవితా కృష్ణన్ ప్రశ్నించారు. నెల రోజుల పాటు కష్టపడి కమిటీ సిఫార్సులు చేయగా, కేవలం కొద్ది గంటల సమయంలోనే వాటిని పరిశీలించి ఆర్డినెన్స్ జారీ చేయడం సమంజసంగా లేదని ఆమె ధ్వజమెత్తారు. ఆర్డినెన్స్ విషయమై తాము ఉద్యమం చేయక తప్పదని కవిత స్పష్టం చేశారు.

'ప్రజాస్వామ్య బద్ధంగా పార్లమెంటులో బిల్లు తేవాలే తప్ప హడావుడిగా చేసే ఆర్డినెన్స్‌తో ప్రయోజనం ఉండదని, ప్రజల మనోభావాలను, ఆకాంక్షలను ప్రభుత్వం తెలుసుకుని తీరాల'ని ప్రముఖ సామాజిక కార్యకర్త ఫరా నఖ్వీ విజ్ఞప్తి చేశారు. ప్రజలు కోరుకుంటున్న అంశాలపై వర్మ కమిటీ చేసిన సిఫార్సులను ఉద్దేశ పూర్వకంగా విస్మరించడం దారుణమని మరికొందరు మహిళా నేతలు ఆరోపిస్తున్నారు.

భార్యలపై భర్తలు చేసే లైంగిక హింస, పోలీసు శాఖతో పాటు సాయుధ దళాల్లో అత్యాచార నిందితులను సాధారణ శిక్షాస్మృతి పరిధిలోకి తేవడం, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టంపై సమీక్ష వంటి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకపోడం సరికాదని మానవ హక్కుల కార్యకర్త, ప్రముఖ న్యాయవాది బృందా గ్రోవర్ విమర్శించారు. ఏ మాత్రం పారదర్శకత లేని రీతిలో యుద్ధ ప్రాతిపదికపై కేంద్ర మంత్రిమండలి ఆర్డినెన్స్‌ను జారీ చేయడం వెనుకు అసలు ఉద్దేశాలేమిటో అర్థం కావడం లేదని ఆమె విస్మయం వ్యక్తం చేశారు.

జాడలేని కీలక సిఫార్సులు ఇవీ..

★ భార్యల ఇష్టానికి విరుద్ధంగా భర్తలు చేసే లైంగిక హింసను- 'వైవాహిక అత్యాచారాలు'గా పరిగణించాలి.

★ దేశ నరిహద్దు రాష్ట్రాల్లో 'సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టా'న్ని (ఎఎఫ్‌ఎస్‌పిఎ) సవరించాలి. అత్యాచారాలకు, లైంగిక దాడులకు పాల్పడే సైనిక సిబ్బందిపై విచారణకు ఎలాంటి అనుమతులు అక్కర్లేదు.

★ లైంగిక నేరాల కేసుల్లో సహకరించని ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం ఐదేళ్ల జైలు శిక్ష విధించాలి. (జైలు శిక్షను ఏడాదికి పరిమితం చేస్తూ ఈ సిఫార్సును పాక్షికంగా ఆమోదించారు.)

★ లైంగిక నేరాలకు సంబంధించి ఆరోపణలున్న నాయకులను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించరాదు.



పురైతో అలనాటి మోము!

వెనకటికి చందమామ కథ ఒకటుంది. నలుగురు మిత్రులకు నాలుగు రకాల సంజీవినీ మంత్ర విద్యలు తెలుసు. వారికి ఒకచోట చితాభస్మం కనబడుతుంది. వెంటనే వాళ్లలో ఒకడు దాన్ని కంకాళంగా మారుస్తాడు. రెండోవాడు దానికి చర్మం, కండ సమకూరుస్తాడు. మూడోవాడు ఊపిరిపోస్తాడు. నాలుగోవాడు అదొక పెద్దపులి అని తెలిసీ దానికి చైతన్యం కలిగిస్తాడు. ఆనక ఏమయిందో వేరే చెప్పక్కరలేదు. ఇదిలా ఉండగా, ఇటీవల ఇంగ్లండ్‌లోని న్యూ పోర్ట్‌కి దగ్గరగా ఓ పాడుబడ్డ కోటలో రాతి శవపేటికలో ఒక కంకాళం దొరికింది. అది రెండు వేల ఏళ్ల నాటి రోమన్ యోధుడిదనిపించింది. ఎందుకంటే ఈ కంకాళం ప్రాచీన కేర్లియాన్ శిథిల కోటకి దగ్గరలో దొరికింది.

ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో అపరాధ పరిశోధనలో పుర్రెకు జీవకళ తీసుకువచ్చే ప్రక్రియ జరుగుతూనే ఉంది. రెండువేల ఏళ్ల నాటి అతి పురాతనమైన పుర్రెకు జీవకళ తేవడం ఇదే తొలి

సారి. ఆ పుర్రెకు నరాలు, కండ అన్నీ పెట్టి- కన్నూ ముక్కూ తీర్చిదిద్ది ఒక ముఖాకృతి వచ్చేలా తలకాయని- పుష్కలంగా వున్న కేశ సంపదతో సహా ఒక చిత్తరువు తయారుచేశారు సైంటిస్టులు. ఈ తలకాయకి ఒత్తయిన, నల్లని ఉంగరాల జుత్తు వుంది. చూడగా చూడగా- హాలీవుడ్ సినిమా తార- సిల్వర్‌స్టర్ స్టాలోన్ లాగా- బ్రిటీష్ నటుడు రిచర్డ్ బర్టన్ (ఎలిజబెత్ టేలర్ భర్త) లాగా వుందిట ఆ ముఖం. ఒక బలిష్టమైన రోమన్ యోధుడి శిరస్సు- బహుశః అతనికి 40 ఏళ్ల వుండొచ్చు. యుద్ధంలో అలిసి, విశ్రాంతి తీసుకుంటున్నవాడేమో- ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉంది 'మోము'. దాన్ని చూసి అందరూ అచ్చెరువు పొందారు.

ఈ రోమన్ యోధుని అవశేషాలు దొరికి 18 ఏళ్లు అయింది. న్యూపోర్ట్ యూనివర్సిటీలో ఒక కట్టడం పనిలో నిమగ్నమైన కార్మికులకు ఈ రాతి పేటిక, అందులో మానవ అవశేషాలూ దొరికాయి. పెన్నీ వేల్స్‌కి చెందిన- పరిపోషక శాస్త్రవేత్త- ఏళ్ల తరబడి కష్టపడి ఈ చిత్రాన్ని పూర్తి చేశాడు. ఇది క్రీ.పూ. రెండొందల నాటి వ్యక్తిదై వుంటుందని సైంటిస్టుల నమ్మకం.

''ఏమో? కురుక్షేత్రంలో తప్పితే- మన అర్జునుడిదో, కర్ణుడిదో అవశేషాలు దొరుకుతాయేమో?'' అన్నాడు ఓ భారతమాత పుత్ర రత్నం. ''కానీ మనవాళ్లు ఖననం కాదు- దహనం కదా చేస్తారు. పైగా - చితాభస్మాన్ని కూడా- దూర దూర నదుల్లో తీసుకెళ్ళి కలిపేస్తారు. అంచేత- నో చాన్స్!''అన్నాడో నిరాశావాది.

నమ్ము- నమ్మకపో- రోమన్ యోధుడి చిత్రపువు మాత్రం వుంది. దీన్ని ప్రస్తుతం- కార్డియాన్ మ్యూజియంలో వుంచారు. 'టెలిగ్రాఫ్' విలేఖరి దీన్ని చూసి- ఈ కథ రాశాడు.

veeraji@sify.com

ఆదరించే కూతురుంటే అదృష్టమే మరి..

బాపు సినిమా 'మిష్టర్ పెళ్లాం'లో భార్యాభర్తలు ఇద్దరూ సమానమే. కాకపోతే భర్త కొద్దిగా 'ఎక్కువ' సమానం అనిపించారు ముళ్లపూడి వారు. అలాగే, సంతానంలో ఇద్దరూ సమానమే అంటున్నా, కొడుకు కొద్దిగా 'ఎక్కువ' సమానం. మన ఆస్తికి వారసుడు, తలకొరివి పెట్టి, ఏడాదికోసారి ఆబ్దీకం పెట్టే బాధ్యత మన శాస్త్రాలు కొడుక్కే ఇచ్చాయి కాబట్టి. ప్రభుత్వం ఆడపిల్లకి ఆస్తి హక్కు ఇచ్చినా అది ఆచరణలో అమలు జరుగుతున్న దాఖలాలు లేవు. అయితే- కన్నవాళ్లను ఆడపిల్లలే బాగా చూసుకుంటున్నారని పలు సర్వేలు ఘోషిస్తున్నాయి. జీవిత చరమాంకంలో తండ్రైనా, తల్లయినా అమ్మాయి దగ్గరే! దీనికి మా విమల ఒక ఉదాహరణ.

విమల, నేను నూజీవీడు ఎలిమెంటరీ స్కూల్లో కలిసి చదువుకున్నాం. నాన్న బదిలీపై తిరువూరు వచ్చేటప్పుడు నన్ను పట్టుకుని ఏడ్చేసింది. ఆ తరువాత వారానికో కార్డు రాసేది. దాని ఉత్తరాలు నాకో టానిక్కు.. ప్రతి మంగళవారం ఎన్నో కబుర్లు మోసుకొచ్చేది ఆమె ఉత్తరం. అందులో సాంబయ్య మాష్టారి క్లాసులు, 'భూకైలాస్'లో ఎన్టీఆర్ నటనా వైదుష్యం, ఎర్రనీళ్ళు (నూజీవీడులో మా చిన్నతనంలో ఒక పంతులుగారు పదిమైళ్ళ దూరం నుంచి వీటిని సీసాలలో తెచ్చి పదిపైసలకు అమ్మేవారు) బిందె రేటు పంతులుగారు పెంచారనీ, పనిమనిషి కొడుకు అమీర్ ముద్దొస్తున్నాడని, దొడ్లో కాసే చిక్కుళ్ళు సందులో అందరికీ పంచిపెడుతున్నానని.. ఇలా ఎన్నో విషయాలు రాసేది. నేను అప్పుడప్పుడు జవాబిచ్చేదాన్ని. అలా మా స్నేహం... భర్త, పిల్లల నుంచి- కొడుకు, కోడలు వచ్చినా సాగిపోతోంది.

విమల భర్త పోయి రెండు నెలలైంది. ఉంటున్న ఇల్లు చిన్న కొడుకు తీసుకుని పెద్దాడికి పాతిక లక్షలకి చెక్కు ఇచ్చాడు. వాడు మాట్లాడకుండా చెక్కు తీసుకున్నాడు. తన అన్నయ్య వెంట పుట్టింటికి వెళ్ళిన విమలను తీసుకురమ్మని ఏ కొడుకూ ఫోన్ చెయ్యకపోవడం... చివరికి విమలే ఒంటరిగా ఢిల్లీలో వున్న పెద్ద కొడుకు దగ్గరికి చేరడం.. 'ముష్టి పాతిక లక్షలిచ్చి ఇల్లు కాజేశాడు.. నిన్ను చూసుకోవలసింది చిన్నోడే'-అని పెద్దాడు అనడంతో చిన్నాడి దగ్గరికి చేరుకోగా, 'నలభై సంవత్సరాలు ఇక్కడే వున్నావు. ఇక దేశ రాజధానిలో హాయిగా గడపక- అప్పుడే ఎందుకు వచ్చావ'ని చిన్నోడు అడగడంతో ఆమె మనోవేదనకి గురైంది.

పెద్దోడు అన్నమాటలు చెబుదామంటే మళ్ళీ వాళ్ళిద్దరిమధ్య గొడవలు వస్తాయని ఆమెకు భయం. ఈ విషయం నాకు ఫోన్లో చెప్పి బాధపడింది. ఆ తర్వాత కొన్ని రోజులకు కూతురు స్వాతి దగ్గరికి చేరింది. భర్తపోయిన పన్నెండో రోజున- 'నాకు ఆస్తి వద్దమ్మా, నువ్వు ఎక్కడైనా సుఖంగా వుండడమే నాకు ముఖ్యం. అన్నయ్యల దగ్గర నీకు ఇబ్బందులు ఎదురైతే నా దగ్గరికి వచ్చేయి. అంతేగానీ కొడుకు దగ్గరే ఉండాలనే ఆలోచనలు చెయ్యకు' అందట స్వాతి.

'చిన్నకోడలు నా నగల విషయం ఎత్తింది.. తల్లినగలు ఆడపిల్లలకే అని అన్నాను. మీరెప్పుడూ కూతురు, కోడలు సమానమే అంటారుగా అని కోడలి ఎత్తిపొడుపు మాటలు. కొడుకు, కూతురు నాకు సమానమే.. కానీ, కొడుకులిద్దరికీ ఆస్తి రాశాను. మరి కూతురి విషయం ఏమిటి? అని అడిగేసరికి కోడలు ముఖం మాడ్చుకుంద'ని విమల రాసింది.

'ఎక్కడున్నా ఏదోఒక మాట మీద నాకు కూతురంటే ఎక్కువ ప్రేమని... అదెలా? ఇష్టమైతే ఆస్తిలో వాటా ఇచ్చేదాన్నిగా.... అనగానే కొడుకులు తప్పుకోవడం.. ఇలా రెండు నెలలు ఇద్దరి దగ్గరా ఇదే విషయం... అందుకే నేను స్వాతి దగ్గరికి వెళ్లిపోతున్నానే.. ఆస్తి ఇప్పకపోయినా నా నగలైనా దానిక్తే నాకు కొద్దిగా తృప్తి ఏమంటావు?' ఇదీ విమల వాదన.

విమల నిర్ణయం సరైనదే అని నేను చెప్పాను. అల్లుడు చాలా మంచివాడు. తన దగ్గర చదువుకున్న స్టూడెంట్‌కి చ్చారు స్వాతిని. అతడికి గురుభక్తి ఎక్కువ. కాబట్టి విమలకి మిగిలిన జీవితం ప్రశాంతంగా సాగుతోంది.

'పది లక్షలు కూతురికిచ్చివుంటారు' ఇవీ కోడళ్ళ మాటలు.

తిరుపతి, శ్రీశైలం, సింహాచలం, భద్రాచలం అన్ని దేవాలయాలకీ చెక్కులు పంపుతూ 'ఈ విషయం నువ్వు ఎవరికీ చెప్పకు...' అని భర్త అన్నపుడు ఆ విషయాన్ని రహస్యంగా వుంచడం తప్పయింది. ఇప్పుడు నేను పది లక్షలు ఇచ్చి కూతురి దగ్గర వుంటున్నానని నా కొడుకులు బంధువులతో చెప్పుకుని బాధ పడడం మామూలైంది. 'మేం ఎంత బాగా చూసినా ఆవిడ ప్రాణమంతా కూతురిమీదేన'ని కోడళ్ళు తాము మంచివాళ్లమన్నట్లు మాట్లాడుతున్నారు..'-అని ఫోన్ చేసింది విమల.

తండ్రి వున్నపుడు ఓ విధంగా, అతను మరణించాక మరోలా మారిపోయే కొడుకులకన్నా కూతురే నయం.. ఆడపిల్లకి పెళ్లి చేసి పంపేసి, ఆమెను పరాయిదానిగా భావించకండి. కొడుకులతో సమానంగా చదివించండి. ప్రేమను కూడా సమంగా పంచండి. ఏమో..? రేపు ఎవరు మనకి ప్రశాంత జీవితం అందిస్తారో? ఇదీ వర్తమానంలో చాలా ఇళ్ళల్లో పరిస్థితి.

-అపర్ణా దీక్షిత్

ఇదేం న్యాయం?

మరమరాలు

-శారదా అశోకవర్ధన్

''వెంకటేష్ ఏమిట్రా అలా దిగాలుబడి కూర్చున్నాడు, ఎప్పుడూ ఎంతో హుషారుగా తిరుగుతూ, గలగలా మాట్లాడేవాడు'' అంది హనుమాయమ్మ దీనంగా కూర్చున్న కొడుకుని చూసి మనవడితో. ''అదే నానమ్మా, అసలే కరెంటు బిల్లులు ఓ పక్క కాల్చేస్తున్నాయా మనుషులని. డబుల్ డబుల్ బిల్లులు వేసి, దానికి తోడు కిందటి నెల బిల్లు కట్టినా, 'అకౌంట్స్ ఆఫీసర్' అని రాయలేదని ఆ చెక్కును తిరిగి పంపించకుండా బ్యాంకుకో లేకపోతే నాన్నకో కనీసం ఫోనులో నైనా చెప్పకుండా, ఆ చెక్కుని అన్నాళ్ళూ వాళ్ల దగ్గరే పెట్టుకుని, ఇప్పుడొచ్చిన డబుల్ బిల్లుకి జత చేసి, ఫైనుతో సహా మూడు వేల చిల్లర కట్టమన్నారట''- ప్రతి అక్షరం నొక్కి పలుకుతూ చెప్పేడు మనవడు రాహుల్. ''ఏం జరిగిందో నాకు అర్థం కాలేదురా.. సరిగ్గా చెప్పు'' అంది హనుమాయమ్మ. ''అదే నానమ్మా.. మనం వాడిన యూనిట్ల ప్రకారం బిల్లు నాలుగు వందల యాభై అయింది. దాన్ని రెట్టింపు చేశారు కాబట్టి తొమ్మిది వందలయింది. కిందటి నెల బిల్లు పంథొమ్మిది వందలట.. ఇలాగే రెండింతలు కలిపి! దానిమీద చెక్కు చెల్లదని రెండొందలు ఫైను! అన్నీ కలిపి మూడు వేలకు బిల్లొచ్చిందని బాధపడుతున్నారు నాన్నగారు. 'ఒక్కసారిగా మూడు వేలు కరంటు బిల్లుకే పోతే వచ్చిన జీతంలో మిగిలిన ఖర్చులకు డబ్బెలా సరిపోతుంది. అందులోనూ తప్పు మనం చేస్తే శిక్ష మనం అనుభవించొచ్చు. చెక్కుమీద 'అకౌంట్స్ ఆఫీసర్' అని రాయలేదు.. పొరపాటే. మరి వాళ్ళు చెక్కెలా తీసుకున్నారు? రశీదెలా ఇచ్చారు? చెక్కు తిరిగి ఎందుకు పంపలేదు? ఈ విషయాలన్నీ బ్యాంకులో తెలుసుకుని, ఆ తరవాత వాళ్ళ డిపార్ట్‌మెంట్‌కెళ్లి అక్కడ తన తప్పు 'ఆ పేరు రాయకపోవడమే కానీ, మీరు చెక్కునెలా తీసుకున్నారని ఎంత వాదించినా వినక- ఏ పేరూ లేని చెక్కుని వాళ్ళెలా తీసుకున్నారో చెప్పక, అధికారం వుంది కదా! అని ప్రజలని పురుగుల్లా తీసిపారేస్తూ చేస్తున్న పనులు చాలా ఘోరం! ఇవన్నీ ప్రభుత్వం పట్టించుకోదేం?' అడిగింది హనుమాయమ్మ. ''వాళ్ళకి పాపం తీరికా లేదు, ఓపికా లేదు. న్యాయాన్యాయాల విచక్షణా లేదు. అవతలివాడు నష్టపోతే వాళ్లకే మిటి? పస్తులుంటే వాళ్ళకేమిటి? పైపెచ్చు చెక్కు చెల్లనందుకు- ఇక ఏడాది పాటు మనదగ్గరి నుంచి క్యాష్ తప్ప చెక్కులు తీసుకోరట! ఇవన్నీ కనుక్కోవడానికి రానూ పోనూ ఆటోకి వంద రూపాయలు, రెండు గంటల సమయం పట్టిందట. అందుకే ఇలా దిగాలు పడి కూర్చున్నారు నాన్నగారు' అన్నాడు రాహుల్. ''అవున్రా.. మొన్న ఉషాకు మారి వాళ్ళకి కూడా ఇలాగే జరిగిందట. పైగా తనూ పిల్లలూ ఎవరూ ఇంట్లో వుండరు కదా! ఆ సమయంలో కరంటు వాళ్ళొచ్చి పక్కింటివాళ్ళు చెబుతున్నా వినక కనెక్షన్ కట్ చేసేసి వెళ్లిపోయారట. ఇంటికొచ్చాక ఆ కాగితాన్నీ పట్టుకుని ఆఫీసుకెళ్ళి తిరిగి కనెక్షన్ ఇవ్వడానికి చార్జీలు కట్టాక, అప్పుడు టైమయిపోయిందని మర్నాడు కనెక్షనిస్తామన్నారట. ఆ రాత్రంతా కొవ్వొత్తులే దిక్కట! ఇవేం రూల్సు? చెప్పేవాడు లేడూ, వినేవాడూ లేడు.. ఎలాగ బాబూ..' నెత్తీ నోరూ కొట్టుకుంది హనుమాయమ్మ. ''అంతేనా? బజారుకెళ్లి కందిపప్పు, మినప్పప్పు, నూనె, ఇతర సరుకులూ కొనొచ్చేసరికి వెయ్యి నోటు చెల్లిపోయింది- అంది హనుమాయమ్మ గారి కోడలైన మిసెస్ సుధా వెంకటేష్ అపుడే బజారు నుంచి సరుకులు కొనితెస్తూ. ''అవునే.. ఒక పక్క వస్తువుల ధరలు ఇలా మండిపోతున్నాయ్.. అంతెందుకు? నిన్ను నువ్వు మీ అమ్మా వాళ్ళింటికెళ్ళావా? నేనేదో ఉల్లిపాయల సాంబారు పెడదామని బుట్టలో చూస్తే ఉల్లిపాయలు లేవు. పనిమనిషిని పంపించి కిలో ఉల్లిపాయలు తెమ్మని పంపిస్తే, 'కిందటి వారం పదిహేను రూపాయలున్న ఉల్లిగడ్డలు ఇప్పుడు ఇరవై అంటమ్మా'' అంటూ తెచ్చింది. ఇలా ప్రతి వస్తువు ధర పెరిగిపోవడం, పైపెచ్చు కరంటు బిల్లుల గోల... ఏమిటో ఈ బతుకులు, ఎలా బతకాలో ఏంటో?'' అంటూండగానే సుశీల వచ్చింది ఆదరాబాదరాగా.



సుశీల హనుమాయమ్మ కూతురు. నాలుగు వీధుల అవతల ఆమె ఇల్లు. ''అమ్మా.. ఇది విన్నావా? వచ్చే నెల పదిహేనో తారీఖునుంచి 'ఆధార్ కార్డ్' లేకపోతే గ్యాసు బండకు వెయ్యి తీసుకుంటారని పేపర్లో వచ్చింది. టీవీలోనూ చూపించారు. మనకింకా పోస్టులో ఆధార్ కార్డులు రాలేదు కదా! మీకు పోస్టులో వస్తుందని చెప్పారు కదా? ఇంతవరకూ రాకపోతే ఎవర్నడగాలో తెలీదు. ఇలా ప్రకటనలు మాత్రం ఇచ్చేస్తున్నారు. ప్రతి దానికీ డబ్బులు కట్టెయ్యాలి? ఇదేం న్యాయం? అని ఎవరూ అడగరా? ప్రభుత్వం పట్టించుకోదా? మళ్లా అందరూ ప్రజల కోసమే వున్నట్టు మాటలు'' అంది. ఈ మాటలు విని వెంకటేష్ ఈసారి గుండె చేతిలో పట్టుకున్నాడు- తనకి 'ఆధార్ కార్డ్' ఇంకా రాలేదన్న విషయం గుర్తుకు వచ్చి.





'పచ్చబొట్ల' మాటున పొంచి ఉన్న క్యాన్సర్!

విభిన్న రంగుల్లో, వినూత్న డిజైన్లలో శరీరంపై 'పచ్చబొట్లు' వేయించుకోవడం ఆధునిక యువతలో వేలం వెర్రిగా మారడంతో చర్మ సంబంధ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'టాటూ సెంటర్ల'పై ఎలాంటి నిఘా లేనందున ప్రమాదకరమైన రసాయనాల వాడకం పెరిగిపోతోందని ఢిల్లీలోని బిఎల్‌కె ఆస్పత్రికి చెందిన ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ డిజెఎస్ తులా అంటున్నారు. పచ్చబొట్లు వేసేందుకు వాడుతున్న ఇంకుల్లో కొన్ని రసాయనాల వల్ల క్యాన్సర్ సోకే అవకాశాలున్నాయి. నీలిరంగు ఇంకులో కోబాల్ట్, అల్యూమినియం, ఎరుపురంగు ఇంకులో మెర్క్యురిక్ సల్ఫైడ్, మరికొన్ని ఇంకుల్లో లెడ్, క్రోమియం, నికెల్, టైటానియం వంటి లోహాలు ప్రమాదకరమైనవని గుర్తించారు. పచ్చబొట్లు వేసే పనిముట్లను సరిగా శుభ్రం చేయనందున హెచ్‌ఐవి, హెపటైటిస్-బి, సి, చర్మసంబంధ క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ. పచ్చబొట్లు వేయించుకున్న అందరికీ క్యాన్సర్ వస్తుందని భావించనక్కర్లేదని, అయితే- కొన్ని ఇంకుల వల్ల చర్మకణాలు, కండరాలు దెబ్బతింటాయని నిపుణులు తేల్చారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే నాసిరకం ఇంకులను నియంత్రించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
బుధవారం
6, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

సురలన్ మర్త్య సమూహిగా మనుజులన్ శోభిల్లు బృందారకో
త్కరముంగా ఘను నల్పు నల్పుని ఘనుంగా బుణ్య పాపాళిచే
దిరుగన్ వైచుచు నీ మహా మహిమ ప్రీతి బద్ధ జాండంబులం
దరయన్ జీవుల నింద్ర జాలములుగా నాడించు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! మీ మహామహిమ దేవతల్ని మనుష్యులుగాను, మనుష్యుల్ని దేవతలుగాను, గొప్పవాణ్ణి అల్పునిగాను, అల్పుని గొప్పవాణ్ణిగాను పుణ్య పాపాలచేత అటుఇటు కిందికి పైకి తిరుగవేస్తూ బ్రహ్మాండాలలోజీవులందర్నీ ఇంద్రజాలంలో లాగా ఆడిస్తుంటుంది. జీవులకుఉత్తమ అధోగతులు వారి వారి పాపపుణ్యాల చేత కల్గడం అన్నది ఈశ్వర శాసనం. దాని ప్రకారమే ఓడలు బండ్లుగాను, బండ్లు ఓడలుగాను మారుతుంటాయి.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

6 **శ్రీ లత**

''మీరు రూమ్‌లోకి వెళ్ళొచ్చు. మీ అమ్మాయిని 5వ నంబరులోకి షిఫ్ట్ చేశాం'' అని నర్స్ చెప్పేసరికి తడబడుతూ లేచి రూమ్ నెంబరు చూసుకుంటూ తలుపు నెట్టింది వసంత.

''జీవన! తన కూతురు! తనూ ఇలాగే అరచీ ఏడ్చి పేగులు తెంచి శరీరాన్ని చీల్చి ఇచ్చిన జన్మ ఇప్పుడు అచ్చం తనలాగా తనూ తన బిడ్డకు జన్మ నిచ్చి అలసి సొలసి పడుకుంది.

ప్రకృతి చక్ర పరిభ్రమణంలో తల్లే కూతురు కూతురే తల్లి, ఇలా ఈ చక్రాన్ని నడిపేది తల్లీ కూతుళ్లే. ఇందులో పురుష ప్రమేయం లేదు. స్త్రీనే మొదటిసారి కూతురు, మరోసారి తల్లి తర్వాత మరో కూతురు మళ్లీ ఆ కూతురే తల్లి.

ఇందులో కొడుకు ప్రసక్తి లేదు. ప్రకృతి అంటే 'ఉత్పత్తి' (ప్రొడక్టివిటి) జన్మనిచ్చేది. అందుకే స్త్రీయే ప్రకృతి, ప్రకృతే స్త్రీ తన కూతుర్ని తల్లిని చేసిన, మరో కూతుర్ని చూడాలనిపించింది వసంతకు.

చప్పుడు కాకుండా తలుపు వేసి ఉయ్యాల దగ్గరకు నడచింది.

చిగురాకుల పొత్తిళ్లలో పసిమొగ్గ ఒత్తిగిలి నట్లు కనులు మూసుకొని పెదవులు ముడుచుకుని ఉంది పాప.

మెల్లగా చెయ్యి చాచి పాపను అందుకోబోయింది వసంత.

చప్పుడుకు కళ్లుతెరిచి, మెల్లగా బెడ్‌మీద చేతులు ఆన్చి లేవడానికి ప్రయత్నించింది జీవన. ఎంత మాత్రం వీలుకాలేదు. ఆన్చిన చేయి జారి నడుం కదిలి కలుక్కుమంది. ''అమ్మా'' అంది అప్రయత్నంగా.

ఉలికిపడింది వసంత.

తన కూతుర్ని అమ్మను చేసిన బిడ్డకంటే తనను అమ్మను చేసిన బిడ్డ పిలుపే ముందుగా గుండెను తాకిందేమో. ఉయ్యాల దగ్గర నిలుచున్న వసంత ఒక్క ఉదుటున జీవన దగ్గరకు వచ్చేసి ''అయ్యో అప్పుడే లేవడానికి ప్రయత్నిస్తున్నావేంటి? పడుకో! పడుకోవాలి. సరిగా పడుకో'' అంటూ దిండు సరిచేసి ఎత్తిన భుజాలను దిండు మీద ఆన్చింది.

''అమ్మా'' అని పిలిచి ఉయ్యాలవైపు చూపు తిప్పింది జీవన.

''ఏంట్రా'' అడిగింది వసంత.

''పాపా? బాబా?'' ఎంతో మరుపు కళ్ళల్లో...

''ఎవరయితేనే'' వసంత అంది ఆ గొంతులో ముక్తసరి.

''ఒక్కసారి చూడాలని..'' అంది జీవన.

''ఎందుకు?'' వసంత అడిగింది.

''ఇన్నాళ్ళు నా కడుపులో ఉన్న ఆ రూపం ఎలా ఉందోనని'' అంది జీవన.

''ఎలా ఉంటేనేం? మనం పెంచుకోవాలను కోవడం లేదుగా'' అంది కినుకగా వసంత.

''ఒక్కసారి చూసేసి ఇచ్చేస్తానమ్మా'' జీవన గొంతులో ఏడుపు జీర తీగలా సాగింది.

''చూశాక ఇచ్చేయలేవు జీవనా'' అర్థం చేసుకుంటూ అంది వసంత.

కొమ్మన్నట్లు విలవిలలాడింది వసంత గుండె.

''ఇవ్వగలనమ్మా మనసు రాయి చేసుకుంటాను. ప్లీజ్''

''అప్పుడు చేసుకునే రాయి ఇప్పుడు చేసుకో, మనసు ఓసారి స్రవించాక గడ్డకట్టడం కష్టం'' అంది వసంత జీవన బెడ్‌షీట్ సరిచేస్తూ....

ఎలాగయినా జీవన ఆలోచన కొనసాగకూడదనేది వసంత ప్రయత్నం.

''ఇంత కఠినం ఎలా అయ్యావమ్మా నువ్వు'' జీవన నమ్మలేనట్లుగా అంది.

''నా కూతురి భవిష్యత్తు కోసం'' స్థిరంగా చెప్పింది.

''నేనూ నా బిడ్డ భవిష్యత్తు కోసం కఠినం అవుతానమ్మా'' అంది జీవన మొండిగా.

''బాలింతవు, ఇప్పుడు టెన్షన్స్ పెట్టుకోకూడదు. డెలివరీ అయ్యాక ఎవరనేది కూడా తెలుసుకోకుండా మిషనరీ వాళ్ళకు ఇచ్చేయాలనీ ముందే అనుకున్నాం మరి నువ్వు ఒకసారి చూడాలంటు న్నావు. చూశాక నీ మనసుకో రూపం ముద్రించబడి దానికోసం నిన్ను పిచ్చిదాన్ని చేస్తుంది. పుట్టగానే బిడ్డ చనిపోయిందనుకో''అంది వసంత జీవన తల నిమురుతూ..

''కానీ... ఒక్కసారి...ప్లీజ్.. అమ్మా.. ప్లీజ్'' అంది జీవన తను అడగాల్సింది అడక్కముందే గొంతు పూడుకుపోయింది.

డాక్టర్స్ టీమ్ వచ్చింది చెకప్‌కు వసంత పక్కకు జరిగింది.

''ఏమ్మా స్టిచెస్ పెయిన్‌గా ఉన్నాయా?'' డాక్టర్ స్టెత్ తీస్తూ అడిగింది.

''లేదు.. ఆహా కొంచెం ఉంది'' కన్‌ఫ్యూజింగ్‌గా చెప్పింది.

''ఏదీ ఇంతకూ నీ కూతురేది? ఫీడింగ్ ఇస్తున్నావా?'' అని అడిగింది.

''కూతురా?... అంటే పాప పుట్టిందా తనకు'' తెలిసిపోయిందో నిజం. తను ఇన్నాళ్ళు కణం కణం కూర్చిన జీవం ఓ పాప.

''ఉయ్యాల్లో.. ఉయ్యాల్లో ఉంది'' గబగబా చెప్పేసింది.

నువ్వు చెప్పకపోయినా నాకు తెలిసిపోయింది అన్నట్లుగా వసంత వేపు చూసింది. వసంత మొహం అసహనంగా ఉంది.

''సిస్టర్ బేబీని తెండి'' ఫీడింగ్ వచ్చిందో లేదో చూద్దాం'' అని సిస్టర్‌కు ఆర్డర్ వేసి ''ఏదమ్మా బ్రెస్ట్ చూపించు'' అంది జీవనను.

జీవనకు సిగ్గు ముంచుకొచ్చింది. రూమ్‌లో ఉన్నవాళ్ళ వైపు ఇబ్బందిగా చూసింది.

''ఓకె మీరు కాస్త బయట వెయిట్ చేస్తారా!'' వాళ్ళను రిక్వెస్ట్ చేసింది డాక్టర్. వాళ్ళందరూ బయటికెళ్ళి తలుపు దగ్గరకేశారు.

నర్స్ బిడ్డను తెచ్చి డాక్టర్ చేతికిచ్చింది. డాక్టరు కాలూ చెయ్యి కదిలించింది. కనురెప్పలు ఎత్తి చూసింది, తొడమీద మెల్లగా తట్టింది.

పాప కేర్ కేర్‌మని ఏడవగానే జీవన గుండెల్లో ఏదో వత్తిడి ప్రవహించి బ్రెస్ట్ బరువయ్యింది. ఏదో ఉధృతం నిపుల్స్ పగిలిపోతాయనిపించింది.

''బేబి ఓకేనమ్మా బావుంది. కానీ ఫీడింగ్ సరిగా ఉందా?'' అని చూసింది.

''మిల్క్ ప్రొడ్యూస్ అవుతుంది. ఏదీ బేబీకి ఇవ్వు'' అంది బేబిని సిస్టర్‌కు అందిస్తూ.

సిస్టర్ బేబీ చిన్ని నోరు తీసుకొచ్చి జీవన బ్రెస్ట్ కానిచ్చింది.

ఇంతవరకూ ఏ స్పర్శా ఎరగని ప్రాంతమది. స్నానం చేసేప్పుడు పొరపాట్న చెయ్యి తగిలితే ఉలిక్కిపడి వదిలేసి సిగ్గుపడిపోయి మళ్లీ చెయ్యి తగలకుండా చూసుకున్న అవయవం అది.

-ఇంకాఉంది

137

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

''సుగ్రీవా! ఆ తాళ వృక్షాలను నాకు శీఘ్రమే చూపవలసింది'' అని అన్నాడు. అప్పుడు సుగ్రీవుడు శ్రీరాముడిని శీఘ్రంగా తోడ్కొని పోయి ఆ తాడులను చూపించాడు. శ్రీరాముడు అసదృశమూ, అశని సంకాశమూ అయిన నిశితాస్త్రాన్ని సంధించి ఆకర్ణాంతం తివిచి ఒక్కసారిగా రావణుడి కంఠనాళాలు అనే త్రాళ్లు తెగత్రెంచిన రీతిని ఆ సప్త తాళ వృక్షాలను తెగకొట్టాడు. వక్రాలై వున్న ఆ తాడి చెట్లు గాడిపారి అవనిపై త్రెళ్లిపడినాయి. శ్రీరాముడు ప్రయోగించిన శరం చెంతనున్న గిరిని దాటి, దారుణిలోదూరి, పాతాళలోకం చేరి, వేగాతివేగంగా మరలివచ్చి రాముడి తూణీరంలో తనయథాస్థానంలో నిలిచింది.

అంత ఆకాశవీధిలో ఎగిరిపోతున్న ఒక విమానం నుంచి అతులిత రవం ఒకటి ఈ గతి వినవచ్చింది.

''ఓ పరమేశ్వరా! రామా! నేను మహేంద్రుడి కొలువులో వుంటాను. నా పేరు కరుణావతి. దూర్వాసోముని తెలియక నిందించిన కారణంగా ఆ మహర్షి కుపితుడై శపించాడు. నాకు శాప విమోచనం అయి ఈ తాళ తరువుల రూపం తొలగిపోయింది. నీకు కృతజ్ఞతలు తెల్పుకొంటూ అమరేంద్రపురికి అరుగుతున్నాను'' అని పలికి స్వర్గలోకానికి వెళ్లిపోయింది.

అప్పుడు శ్రీరాముడు ప్రయోగించిన శరం తిరిగి వచ్చి అమ్ముల పొదిలో ప్రవేశించడం చూసి సుగ్రీవుడు నివ్వెరపోయాడు. సప్తపాతాలలోను కల మూలాలు(వేరులు) సప్తాశ్వమండలాలను ఆచ్ఛాదించు పత్రాలయిన సప్త తాళాలను ఒకే ఒక అస్త్రంతో శ్రీరాముడు కూలగొట్టాడు. నా సంశయం తీరింది. వాలి రాఘవుడి చేతిలో మృతి చెందుతాడు. ఒక కపిరాజ్యం ఏమిటి? ముల్లోకాలనే ఏలగలను? అని తనలో తాను తలపోశాడు. కపితీరులు ఆనందించారు.

పిమ్మట సుగ్రీవుడు ఇనవంశ తిలకుణ్ణి పొడగాంచాడు. ఇనవంశ దినమణికి రవితనయుడు సుగ్రీవుడు కరాలు జోడించాడు. ''దేవా! రామా! నీభౌతిక రూపం చూసి నీ అంతశ్శక్తి భావింపలేకపోయాను. పశుబుద్ధిని అయాను. నేను ఇనజుడిని. నీవు ఇనవంశజాతుడివి అని సమబుద్ధితో చూశాను. అపరాధిని అయాను. ఈ లోకాలకు నువ్వే పాలకుడివి. నన్ను పాలించు. బంటుగా ఏలు. నా శత్రువైన వాలిని తెగటార్చు. నా శోకాన్ని తొలగించు'' అని వాపోయాడు.

అప్పుడు రామచంద్రుడు సుగ్రీవుడిని దయ దృష్టితో వీక్షించాడు. మన్నించాడు. సుగ్రీవుడితో ''వెంటనే నీవు పోయి వాలితో పోరాడుతూ వుండు. ఒక కోలతో అవలీలగా వాలిని చంపి కపిరాజ్య పదవికి నిన్ను పట్టం కడతాను. వెరవకు'' అని వచించాడు. అప్పుడు సుగ్రీవుడు ఉప్పంగిపోయాడు. నలుడు, నీలుడు, హనుమంతుడు, మహాబలశాలి తారుడు- నలుగురూ తనతో నడచి ఏతెంచ యుద్ధ సన్నద్ధుడై వెడలాడు. వారి వెనుక రామలక్ష్మణులు చనుదెంచి కిష్కింధా నగరానికి ఆవల కల వనంలోదాగి వుండి సుగ్రీవుడిని ప్రోత్సహించి పంపారు.

వాలి సుగ్రీవుల పోరు

సుగ్రీవుడు కిష్కింధా నగరం వాకిట నిలచాడు. ఉద్గ్రుడై ఆర్చి పేర్చాడు. తనతో పోరాడ తడయక రా అని వాలిని పిలిచాడు. గజ బృంహితాన్ని విని అలిగే సింహం మాదిరి ఆగ్రహించి, శివచరణారవింద పూజారి నిరతుడు, రావణుడిని కంఠాల్ని పట్టి సముద్రంలో ముంచి, మించిన వాలి వచ్చి సుగ్రీవుడితో తలపడ్డాడు.

అవక్ర విక్రములు ఆ వాలి సుగ్రీవులు పూర్వ పశ్చిమ సముద్రాలు పోరాడే క్రియ పోరాడారు. ఇర్వురూ సమాన జవాటోపం కలవారు. సమకోపులు, సమప్రతాపులు. ఏక రూపులు. ఆ ఇర్వురూ అనోన్యం ఇలానువులు, జంఘాలు, వృక్షాలు, జఘనాలు చిత్ర విచిత్రంగా చీల్చి చెండాడాలని ద్వంద్వ యుద్ధం చేస్తున్నారు. శ్రీరాముడు వింట శరం సంధించి ప్రయోగించ యత్నించి ఆకస్మికంగా ఆగిపోయాడు. ఆ ఇర్వురినీ పరిశీలించాడు.

-ఇంకాఉంది

బుధవారం, 6 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ ఏకాదశి రా.09.16
నక్షత్రం: జ్యేష్ఠ ఉ.11.30
వర్జ్యం: లేదు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధన నష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
బంధు, మిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధన చింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభముంటుంది.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.దైవ ప్రార్థన చేస్తారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువచేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోని వారు జాగ్రత్తగా నుండుట మంచిది.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ధన లాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ఋణబాధలు తొలగిపోతాయి.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీరు చేసే పనిలో జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది.

మంచిమాట

సత్యమహిమ

సత్యము యొక్క మహిమ మహా అద్భుతమైనది. సత్యానికి సాటియైనది ఎక్కడను ఏదియు లేదు. సత్యమువలన సకలము సిద్ధించును.

సత్యమునకు కట్టుబడి రాజ్యాన్ని భార్యాబిడ్డలను కోల్పోయాడు హరిశ్చంద్రుడు. ఆయన ఈనాడు సత్యహరిశ్చంద్రునిగా అందరి ప్రశంసలు అందుకొంటున్నాడు. నాడు నేడు అన్న తేడా లేక ఎప్పుడూ ఎంతో గొప్ప విలువను కలిగి ఉండేది సత్యమే అన్నది అక్షరసత్యం. సత్యమహిమను గురించి శ్రీ బుద్ధ భగవానులుగారు తమ శిష్యులకు చెప్పిన కథను ఇలా ఉంది. ''సత్యము తప్పనివాని మాట అగ్నికూడా జవదాటలేడనేందుకు ఉదాహరణ ఈ కథ'' అంటూ ఆయన ఈ కథ చెప్పాడు.

''పూర్వం ఒకానొక అడవిలో ఒక పెద్ద బూరుగ చెట్టు వుండేది. ఆ చెట్టుపై అనేక పక్షులు గూళ్లు కట్టుకుని నివసించుచున్నవి. అందు ఒక గూటిలో వెలిచెపిట్ట పెంటితో కాపురం చేయుచున్నది. దాని కడుపున నాకప్పుడొక పిల్ల బోధిసత్త్వుని అంశవలన పుట్టినది. దాని తల్లిదండ్రులు దానికి మెత్తగా నుండుటకై గడ్డి వేసి పరుండబెట్టిరి. దానికెన్నో తోబుట్టువులున్నవి. దానికి ఇంకను రెక్కలు రాలేదు. బోధిసత్త్వుని అంశవల్ల పుట్టిన పిల్ల దాని జన్మాంతర సంస్కారమువలన అహింసమీదికే పోసాగింది. తన తల్లిదండ్రులు తన కాహారముగా మాంసం తెచ్చి పెట్టగా ఆ పిల్ల తినేదికాదు. అందుచే అవి మ్రిరిపళ్ళు, చిగుళ్ళు మొదలైనవి తెచ్చి ఇచ్చెడివి. తక్కిన పిల్లలన్నియు మాంసాహారమును తినుటచే తొందరగా రెక్కలు పెరిగి పుష్టిగా పెరుగుచున్నవి. అది మాత్రము ఎన్నాళ్లయినను బలుపు లేక బక్కచిక్కియే వుండెడిది.

ఇంతలో వేసవి కాలం వచ్చినది. ఎండలు మండిపోవుచున్నవి. ఆ యెండలకు పచ్చగడ్డి భగ్గుమని మండుచున్నది. చెట్లు ఒకదానికొకటి రాపాడుకొనుటవలన నిప్పు పుట్టినది. అదే దావాగ్ని. అడవి నిప్పు అన్నమాట. అడవి మృగములు అటు ఇటు ఎటుపడితే అటు పరుగెత్తుచున్నవి. అయిననూ పాపం అవన్నీ దావాగ్నికి ఆహుతి యగుచున్నవి. నలుమూలల నిప్పంటుకున్నప్పుడు ఏమైనా ఏమి చేయగలవు? ఆ మంటలకు గాలి తోడైనది.

ఇదంతా గమనించిన పక్షులన్నియు రెక్కలు వచ్చి ఎగురగల్గినవన్నియు ఎగిరిపోయినవి. వేటి ప్రాణరక్షణనవి చేసుకొన్నవి. ఇక మిగిలినదొక పిట్టయే. అది పాపము ఎగురలేదుకదా, నిప్పు మంటలు నాలుకలవలె చాపుచూ దగ్గర దగ్గరకు వచ్చుచుండెను. దానికేమి చేయుటకును తోచలేదు. ఇక అగ్నిహోత్రునే ప్రార్థించుట ఉత్తమమనుకొన్నది.

''ఓ అగ్నిహోత్రుడా మహానుభావా! నీవు సర్వభక్షకుడవు. అయినను దయాయుడవు. నా తల్లిదండ్రులుకూడా నన్నొదిలిపోయిరి. నాకు ఎగురుటకు రెక్కలు రాలేదు. నేను చిన్నప్పటినుండి దేని మాంసం తినకుందునేని, నాకహింసయే పరమ వ్రతమగునేని ఓ అగ్నిదేవా! నా మాట ప్రకారము నీవు వెనుకకు తగ్గుము. నాకోరిక మన్నించి నన్ను రక్షింపుము'' అని సత్యవాక్యముతో ప్రార్థించెను. దాని సత్యవాక్య మహిమచే అగ్నిహోత్రుడు ప్రీతుడై తన జ్వాలలను సంహరించుకొనెను. ఆ రీతిగా దావాగ్నికూడా మంత్రపు కట్టు కట్టినట్లాగిపోయినది. అది సత్యవాక్కు మహిమ. మాటలు రాని పక్షి పిల్ల 'సత్యమహిమ' వల్ల మంటలనుండి తనను తాను రక్షించుకొన్నది. ఇదియే సత్యమహిమ అంటే.

-చాడా మునిశేఖర్ రెడ్డి

● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరఠావులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

వృతాసురుడు 15

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 8

మాటాట - 7 సమాధానం

మాటాట

ఆధారాలు:
అడ్డం
2.ఏటికి ఇది పనికిరాదంటారు
5. తుల్యం
7. నెల
8. ఓ ప్రధాన పంట
10. అవరోధం
11. ఈ నదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది అన్నాడు శ్రీ శ్రీ
14. ఇత్తడిని దీనిలా భ్రమింపచేసేవారుంటారు
15. సాలెపురుగు

నిలువు
1. తోడు
3. పోతుయే
4. ఉరిశిక్ష అమలు పరిచేవాడు
6. తలకిందులైన ఇనుపడేగ
9. ఆహ్వానం
10. అబద్ధం
12. తలుపువేసాక పెట్టవలసింది
13. పల్లకి

sanjeeveni@andhrabhoomi.net

సంజీవని

11
ఆంధ్రభూమి
బుధవారం
6, ఫిబ్రవరి
2013

మోతాదు మించొద్దు

ద్రవపదార్థాలుగా ఉన్న మందులను వాడేటపుడు కొంత జాగ్రత్త తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే దగ్గుమందు లాంటివి అయితే కొద్ది పరిణామం ఎక్కువైనా సరే ఏమీ కాదు. కాని చిన్నపిల్లలకు జ్వరానికి ఇచ్చే మందులు మాత్రం కొద్ది పరిమాణం ఎక్కువైనా సరే అది మరొక రోగానికి కారణం కావచ్చు నని వైద్యులు అంటున్నారు. కనుక ఈ మందులు ఇచ్చేటపుడు వైద్యుడు చెప్పినదానిని తుచ తప్పకుండా పాటించి తీరాలి. దానికోసమే తయారైన నిర్ణీత పాత్రలను ఉపయోగించి మందును సేవించటం మంచిదని వైద్యులు చెపుతున్నారు. చెంచాలు వాడమన్నపుడు టేబులు స్పూన్‌కు, టీస్పూను వీటిల్లో ఏది చెప్పుతున్నారో దానిని సరిగ్గా గుర్తుంచుకొని మాత్రమే మందులను వాడాల్సిఉంటుంది.

అసూయ- అనర్థానికి మూలం

క్రిరణ్, రావంత్ బాల్యం నుంచి మంచి స్నేహితులు. తొలి నుంచి కిరణ్, రావంత్ కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకునేవారు. ఇద్దరు పేరున్న కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇద్దరికి వేర్వేరు మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. అయితే రావంత్ కంపెనీ, కిరణ్ కంపెనీకంటే ఎక్కువ జీతం ఇవ్వడానికి సమ్మతించింది. దీంతో కిరణ్ తట్టుకోలేకపోయాడు. డిప్రెషన్‌కు గురై ఆత్మహత్య చేసుకున్నాడు.

లక్ష్మీకాంతమ్మ పెళ్ళయిన పదేళ్ళకే భర్తను కోల్పోయింది. ఉన్న ఒక బాబును శ్రద్ధగా పెంచి పెద్ద చేసింది. మంచి చదువు చెప్పించి, ఉద్యోగం వచ్చింది. పెళ్లి చేసింది. బాల్యం నుంచి కొంగు పట్టుకుని తిరిగే కొడుకు పెళ్ళవగానే తనకు దూరమవుతున్నట్టు భావించింది. ఏదో ఒక రకంగా కోడల్ని వేధించడం ప్రారంభించింది. ఆఖరికి కోడలు గృహహింస కేసు పెట్టడంతో తల్లీకొడుకు కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చింది. అవమానం తట్టుకోలేని కొడుకు బాగా కృంగిపోయాడు.



మన సమాజంలో చాలామంది ఈర్ష్య, ద్వేషం పెంచుకుని అనర్థాలు కొని తెచ్చుకుంటుంటారు. కోపం, ఆవేశంతో రగిలిపోతుంటారు. పగ, ప్రతీకారమంటూ కష్టాల పాలవుతుంటారు. ఈ ప్రతికూల భావాలు, ఉద్వేగాలు మనిషిని నిలువునా దహించి వేస్తాయని గ్రహించరు. దీనివల్ల ఇంట, బయట ఎదురయ్యే సమస్యలను గుర్తించరు. తమ లోపాలను కప్పి పుచ్చుకుని ఎదుటివారిని నిందించేందుకు సాకులు వెదుకుతుంటారు. ఆఖరికి ఆరోగ్యం పాడుచేసుకుని, అనుబంధాలను పాడుచేసుకుని కుమిలిపోతుంటారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదని ఈర్ష్యాపరులు, ద్వేషస్వభావులు గుర్తించాలి. భారతీయ తాత్వికులు అందించిన మానవతా విలువలను వంట బట్టించుకోవాలి. అందుకై ముందుగా ఈర్ష్య, ద్వేషాలకు కారణాలు, వాటి ఫలితాలు అధిగమించే మార్గాల పట్ల అవగాహన పెంచుకోవాలి.

అభద్రతే అసలు కారణం

సాధారణంగా ఆత్మన్యూనత, అభద్రతా భావం ఉన్నవారిలో ఈర్ష్యాద్వేషాలు వ్యక్తమవుతుంటాయి. దీన్నొక వ్యక్తిత్వ లేదా ప్రవర్తనా లోపంగా భావించవచ్చు. తాము కోరుకున్నది చేజారిపోతుందన్న భావం, తమకు ఇష్టమైనది దక్కనే అనుమానం ఈర్ష్య, ద్వేషాలకు కారణమవుతాయి. ప్రేమికులు, స్నేహితులు, దంపతులు సహోద్యోగులు, తల్లీ పిల్లలు, ఇతర వ్యక్తులమధ్య ఈర్ష్య తలెత్తడానికి కోల్పోతామన్న భయమే అంతర్లీనంగా పనిచేస్తుంటుంది. భయం, ఆందోళన, పిరికితనం, సిగ్గు, బిడియం, ఆతృత, అనుమాన స్వభావుల్లో ఈ తత్వం ఎక్కువగా ఉంటుంది. అర్థంలేని భావాలు, అసంబద్ధ ఆలోచనలు ప్రతికూల ఉద్వేగాలను పెంచి పోషిస్తుంటాయి.

ఎక్కువగా ఈర్ష్యాద్వేషాలకు గురయ్యేవారు సులభంగా మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. మానసిక ఒత్తిడివల్ల, మనోశారీరక రుగ్మతల పాలవుతుంటారు. వీరు ప్రతిదానికి భయపడటం, ఇతరుల్ని భయపెట్టడం చేస్తుంటారు. వీరిలో ప్యారనాయిడ్ (అనుమాన)తత్వం పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నిరంతరం మనసులో కుమిలిపోడంవల్ల డిప్రెషన్‌తో బాధపడవలసివస్తుంది. దీనివల్ల వ్యక్తిగత, వృత్తిపర సామర్థ్యాలు క్షీణిస్తాయి. తరచు అనారోగ్యం ఆవహిస్తుంటుంది. కొన్ని దీర్ఘకాలిక జబ్బులు, రోగాలు తిరగబెడుతుంటాయి. రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, ఆస్థ్మా లాంటి రుగ్మతలు ప్రకోపిస్తాయి.

అలాగే అన్ని రకాల సంబంధాలు దెబ్బతింటాయి. అత్తా-కోడళ్ళు, తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు, సహోద్యోగులు గొడవలుపడే పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఈర్ష్యపరులు అనవసర ఆరోపణలు, విమర్శలు చేయడంవల్ల అనుబంధాలు కుంటుపడుతుంటాయి.

స్నేహ సంబంధాలు, సామాజిక సంబంధాలు దెబ్బతింటాయి. మంచి పేరు మంటగలిసే ప్రమాదముంది. కీర్తి ప్రతిష్ఠలు దిగజారే అవకాశాలు ఉన్నాయి. కలిసికట్టుగా పనిచేయాల్సిన ఉద్యోగులు, సమూహాల మధ్య కలతలు చెలరేగే ప్రమాదముంది. కొన్ని సందర్భాలలో ప్రేమ వైఫల్యం, దాంపత్య సమస్యలు తలెత్తవచ్చు. ఈర్ష్య, ద్వేషం వల్ల మానసిక, శారీరక, సామాజిక సమస్యలు ఎన్నో తలెత్తుతుంటాయి. కాబట్టి ప్రతివారు ఈ లోపాలను అధిగమించడానికి ప్రయత్నించాలి.

అవగాహన పెంచుకోవాలి

ప్రతి వ్యక్తి తన పట్ల, సామాజిక పరిస్థితుల పట్ల అవగాహన పెంచుకోవాలి. తన శక్తి, సామర్థ్యాలను గుర్తించాలి. తామెందుకు ఇతరుల్లా రాణించలేకపోతున్నామో తెలుసుకోవాలి. స్వీయ గౌరవం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. సమగ్ర విషయ సేకరణ అలవర్చుకోవాలి. ఎదుటివారిని గుర్తించాలి. తనలోని ప్రత్యేకతలు చాటుకోవాలి.

ఇతరులతో పోల్చుకోవడం మానాలి. ప్రతికూల ఉద్వేగాలకు దూరంగా ఉండాలి. స్వీయ లక్షణాలు, ప్రయోజనాలను గుర్తించాలి. సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలి. వాస్తవికంగా ఆలోచించాలి. దృష్టి కోణం మార్చుకోవాలి. క్షమాగుణం అలవర్చుకోవాలి. ఆధ్యాత్మికత పెంచుకోవాలి. ప్రేమ, అనురాగం, జాలి, కరుణ, దయ, క్షమ లాంటి మానవీయ గుణాలను ఆవిష్కరించాలి. తానెవరికీ పోటీకానని, తనకెవరూ పోటీకాదని విశ్వసించాలి. ఈర్ష్య, ద్వేషం లాంటి ప్రతికూల భావాలను విడనాడాలి.

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి
Psychologist
nbsreddi@gmail.com
18-4-111/2, రైల్వే కాలనీ,
తిరుపతి - 517 501.

సోరియాసిస్‌పై నిర్లక్ష్యం తగదు

మానసిక, శరీర ఒత్తిడి నేటి నవీన యుగంలో ఎక్కువ కావడంతో 'సోరియాసిస్' వంటి చర్మ వ్యాధుల బారిన చాలామంది పడుతున్నారు. మొదట్లో చర్మవ్యాధే కదా అని నిర్లక్ష్యం చేయటం డాక్టర్ సలహా తీసుకోకపోవటంవలన ఈ వ్యాధి మరింత జటిలమై మానసికంగా బాధిస్తుంది. సోరియాసిస్‌ను నిర్లక్ష్యం చేయకుండా ఆరంభంలోనే హోమియో చికిత్స తీసుకొని ఉపశమనం పొందవచ్చును. ఈ వ్యాధి ఎక్కువగా ముంజేతి వెనుక భాగం, మోకాలు ముందు భాగం, తల, వీపు, ముఖం, చేతులు, పాదాల దగ్గర ఎక్కువగా కనిపిస్తుంది.

కారణాలు

కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్‌వలన, వంశపారంపర్యంగా, మానసిక ఒత్తిడివలన, చర్మం పొడిబారడాన్ని నిర్లక్ష్యం చేయడం వలన, అధికంగా ఆల్కహాలు, పొగత్రాగడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గి సోరియాసిస్ వచ్చును.

లక్షణాలు

-ఈ వ్యాధి సోకిన వారిలో చర్మం పొలుసుల మాదిరిగా రాలిపోతుంది.

-చర్మం దళసరిగా మారడం, నొప్పి రావడం జరుగును.

-నీటి బుడగల వంటి పొక్కులు వచ్చి నీరు వంటి ద్రవం కారుతూ ఉండును.

-దురద, మంట రాత్రి వేళల్లోఅధికంగా ఉండును.

-కొందరిలో ఎండ తీవ్రత, ఎక్కువగా ఉన్నప్పుడు 'సోరియాసిస్' తీవ్రత ఎక్కువగా అనిపించును.

-కొందరిలో శీతాకాలంలో చర్మం పొడిబారిపోయి పొలుసులుగా రాలిపోతూ మంట, దురదగా అనిపించును.

జాగ్రత్తలు

-ఆల్కహాలు, పొగ త్రాగటం, ఫాస్ట్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్స్ తీసుకోవటం మానివేయాలి.

-పౌష్టిక ఆహారం తీసుకోవాలి

-తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా విటమిన్ 'సి' ఉన్నవి తీసుకోవాలి.

-వ్యాయామం, యోగ నిత్యం చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.

-మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి. కనీసం రోజుకు నాలుగు లీటర్లు తీసుకోవటంవలన చర్మం పొడిబారకుండా ఉండి, పొలుసులు రాలకుండా ఉండును.

చికిత్స

సోరియాసిస్ లాంటి చర్మ వ్యాధులకు హోమియో వైద్యం ఒక వరం లాంటిది. హోమియో వైద్యంలోకి వ్యక్తి యొక్క శరీరక మానసిక లక్షణాలను మరియు వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స చేయడం జరుగుతుంది. కావున ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్‌లేకుండా సులభంగా జరుగును.

మందులు

గ్రాఫైటీస్:

చర్మం పొడి బారిపోయి, పగుళ్ళు దళసరిగా

మారడం, చర్మం నలుపురంగులోకి మారడం, దురద ఎక్కువగా ఉండి నీరులాంటి రసి కారుతూ ఉండును. వీరు మలబద్ధకంతో బాధపడుతుంటారు. ఇటువంటి లక్షణాలుండి ఊబకాయం తోడైనవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

సల్ఫర్:

సోరియాసిస్‌కు ఇది ప్రధానమైన మందు. ఇది గొప్ప 'యాంటిసోరిక్' రెమిడీ. చాలారోజుల నుండి వ్యాధితో బాధపడుతుండేవారికి ఈ మందు వాడిన ప్రయోజనం. వీరి చర్మం పొడిబారిపోయి, దురద, మంటగా ఉంటుంది. వీరు చర్మం నుండి రక్తం కారుతున్నా కూడా గోకడం మాత్రం ఆపరు. దురద తీవ్రత ఉదయం వేళ చాలా ఎక్కువగా ఉంటుంది. వీరుచర్మ వ్యాధితో పాటుగా మలబద్ధకంతో బాధపడుతుంటారు. వీరు చర్మ వ్యాధులకు పూత మందులు ఎక్కువగా వాడుతారు. వీరి మానసిక స్థాయి లక్షణాలను గమనించినట్లు అయితే వీరికి స్నానమంటే చిరాకు, స్నానంచేసిన వీరికి హాయిగా ఉండదు. ఇంకా బాధలు ఎక్కువ అయినట్లు అనిపించును. వీరు ఉదయం అల్పాహారం తీసుకున్నా మరలా 11 గంటలకే ఆకలి బాధతో నీరసించిపోవుట గమనించదగిన లక్షణం, బాధలు తగ్గి తిరిగి మాటి మాటికి కనిపిస్తున్నట్లు అయితే ఈ మందు బాగా పని చేయును.

నైట్రోమోర్:

ఈ మందు రోజూ వాడుకునే ఉప్పు నుండి తయారవుతుంది. శరీర పోషణలో ఉప్పు ప్రధాన ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఉప్పు తక్కువయితే శరీర పోషణలో మార్పు వస్తుంది. ఎక్కువ తీసుకుంటే ఒంటికి నీరు పడుతుంది. నిరాశ, నిరుత్సాహానికి గురైన వారికి ఇది మంచి మందు. దుఃఖం మూలంగా అనారోగ్యానికి గురైనప్పుడు ఈ మందు చాలా బాగా పనిచేస్తుంది. మానసిక స్థాయిలో వీరు దుఃఖంతో కృంగిపోయి ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు. ఓదార్పును వీరు సహించలేరు. ఇటువంటి లక్షణాలు ఉండి 'సోరియాసిస్‌తో' బాధపడేవారికి ఈ మందు ముఖ్యమైనది.

లైకోపోడియం:

చర్మం పొడిబారిపోయి దురదగా మంటగా ఉంటుంది. ఈ రోగికి సాయంత్రం వేళలో బాధలు ఎక్కువగా ఉంటాయి. వీరు మలబద్ధకంతో బాధపడుతుంటారు. వీరికి దాహం ఎక్కువ. వీరు చూడటానికి సన్నగా ఎండుకుపోయినట్లు కనిపిస్తారు. అజీర్తి, గ్యాస్, ఎసిడిటి, మూత్రావయవాల వ్యాధులకు తరచూ బాధపడుతుంటారు. వీరి మానసిక స్థాయి లక్షణాలను గమనించినట్లయితే నిజ జీవితంలో అచి తూచి అడుగువేస్తారు. సామర్థ్యం ఉన్నా నిర్ణయం సరిగా తీసుకోలేరు. పనులను తట పటాయిస్తూ వాయిదా వేస్తూ కాలక్షేపం చేస్తారు. ఇటువంటి లక్షణాలు ఉండి సోరియాసిస్‌తో బాధపడేవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

ఆర్సినికమ్ ఆల్బ్:

చర్మం పొడిబరిపోయి ఉంటుంది. దురద, మంట ఎక్కువగా వచ్చును. చలికాలంలో మరియు మధ్యరాత్రిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండును. వీరి మానసిక స్థాయిలో తన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా మరియు ఒక వరుస క్రమంలో ఉండాలనుకుంటారు. వీరికి వేడి నీటితో స్నానం చేసిన ఉపశమనంగా ఉంటుంది. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు ప్రయోజనకారి.

అలాగే, పెట్రోలియం, సెపియా, రస్‌టాక్స్, సైలీషియా, హెపార్ సల్ఫ్, థైరాయిడినం వంటి మందులను లక్షణ సముదాయం అనుసరించి డాక్టర్ సలహా మేరకు వాడుకొని 'సోరియాసిస్' నుండి ఉపశమనం పొందవచ్చును.

డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
సెల్‌నెం. 9440229646
హోమియోఫిజిషియన్, అంజనా హోమియోక్లినిక్ ఇం.నెం. 7-1-62/1
శ్రీదేవి థియేటర్ వెనుక, బస్‌స్టాండురోడ్
హన్మకొండ, వరంగల్-506001
E-mail: drpsreedhar@ymail.com

చీలమండ వెనుక నొప్పా?

టెండాన్లు అనేవి కండరాలను ఎముకలతో జత చేసే నిర్మాణాలు. ఎకిల్లిస్ టెండాన్ అనేది కాలి మడమకు ఎగువన ఉంటుంది. పిక్కల కండరాన్ని, మడమ ఎముకనూ (క్యాల్‌కేనియస్) కలిపి ఉంచుతుంది. శరీరంలోని టెండాన్లలో ఇది పెద్దదే కాకుండా బలమైనది కూడా. ఎకిల్లిస్ టెండాన్ సహాయంతో మనం మునివేళ్లమీద శరీరపు బరువును ఉంచి లేవగలుగుతాము. అంటే, దీనివల్లనే మనం నడవగలుగుతామన్నమాట. ఇది వాపునకు గురైనప్పుడు గాని, లేదా కుంచించుకుపోయినప్పుడుగాని ఏర్పడే స్థితిని ఎకిల్లిస్ టెండినైటిస్ అంటారు.

ఆయుర్వేదంలో ఎకిల్లిస్ టెండాన్‌ని స్నాయు రజ్జువుగా చెబుతారు. దీనిలో శోథ ఏర్పడినప్పుడు దానిని వాత దోష వికృతిగా భావించి చికిత్స చేయాల్సి ఉంటుంది.

ఎకిల్లిస్ టెండినైటిస్ మూడు దశల్లో ప్రాప్తిస్తుంది. పెరిటినోనైటిస్, టెండినోసిస్, పెరిటినో- టెండినోసిస్‌లు అనేవి. మొదటి దశలో పరుగెత్తడం వంటి కార్యకలాపాలు చేస్తున్నప్పుడుగాని, చేసిన తరువాతగాని నొప్పివస్తుంది. దీనిని అశ్రద్ధ చేస్తే యాక్టివిటి మొదలవ్వడంతోనే నొప్పి ప్రారంభమవుతుంది. దీనిని కూడా నిర్లక్ష్యం చేస్తే విశ్రాంతిగా ఉండే స్థితిలో కూడా టెండాన్‌లో నొప్పి వస్తుంది. రెండవ దశలో క్షీణత లేదా డీజనరేషన్ చోటుచేసుకుంటుంది. దీనిలో లక్షణాలు పెద్దగా కనిపించవు. అయితే, పిక్కల్లో గట్టి బుడిపెలాంటి వాపు తయారయ్యే అవకాశం ఉంది. మూడవ దశ మొదటి రెండు దశలూ కలిగిన స్థితి. దీనిలో టెండాన్‌లో నొప్పి, వాపు రెండూ కనిపిస్తాయి. దీనిని అశ్రద్ధ చేస్తే టెండాన్ పిగిలిపోయే అవకాశం ఉంటుంది.

కారణాలు

ఈ వ్యాధి లేదా స్థితి సరైన పద్ధతిలో శిక్షణ పొందని క్రీడాకారుల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా రన్నింగ్, జాగింగ్ చేసే వారిలోను, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టెన్నిస్ వంటివి ఆడేవారిలోను, డాన్స్ చేసేవారిలోను ఇది కనిపించే అవకాశం ఉంది. అలాగే పాదాన్ని తరచుగా వినియోగించే వృత్తిపనివారిలోనూ ఎక్కువే. అప్పుడప్పుడు ఆటలాడేవారిలోను, గుర్తువచ్చినప్పుడు వ్యాయామాలు చేసేవారిలోను ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. కండరాల్లో ఫ్లెక్సిబిలిటీ లేకపోవడంవల్ల ఇలా జరుగుతుంది.

ఎకిల్లిస్ టెండాన్‌లో శోథ ఏర్పడటానికి అనేక రకాల కారణాలు దోహదపడతాయి. అలవాటు లేకుండా ఎక్కువ దూరాలు పరుగెత్తడం లేదా మరీ ఎక్కువ వేగంతో పరుగెత్తడం చేస్తే టెండాన్‌లో శోథ తయారవుతుంది. అలాగే వ్యాయామం చేస్తూ హఠాత్తుగా గుట్టలు ఎక్కడం వంటి కష్టమైన పనులను ఎక్సర్‌సైజ్ రొటీన్‌లో చేర్చితే కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాయామాలను ఆపిన తరువాత తిరిగి మొదలెట్టినపుడు ఎక్కువ మోతాదుల్లో లేదా ఎక్కువ వేగంతో వ్యాయామాలు చేయడం కూడా దీనికి కారణంగా నిలుస్తుంది. పోతే హఠాత్తుగా కాలి పిక్కలను బిగపట్టాల్సి రావడం (ఉదాహరణకు, ఘాట్ రోడ్డు మీద ఎగువకు సైకిల్ తొక్కడం), కాలి పిక్కల కండరాలను ముడిచే అలవాటు లేకపోవడం వంటివాటివల్లకూడా ఇది ప్రాప్తించవచ్చు. ఈ వ్యాధిని తీవ్రతరం చేయడానికి అనేక అంశాలు దోహదపడతాయి. ఉదాహరణకు, పాదరక్షలు సరైన సైజు వాటిని ధరించకపోవడంగాని లేదా అరిగిపోయి ఎగుడుదిగుడుగా ఉన్నవాటిని ధరించడం గాని



దీనికి దారితీయవచ్చు. ఏదైనా వ్యాయామం చేయబోయే ముందు వార్మ్ అప్ లేదా స్ట్రెచింగ్ చేయకపోవడంవల్లకూడా ఎకిల్లిస్ టెండాన్‌లో వాపు జనించే అవకాశం ఉంది. అలాగే, వ్యాయామం చేసిన తరువాత విశ్రాంతి (కూల్‌డౌన్) తీసుకోకపోవడంవల్లగాని, వ్యాయామాలు సరైన రీతిలో అభ్యాసం చేయకపోవడంవల్లగాని ఈ వ్యాధి కలుగవచ్చు. కొంతమందికి పుట్టుకతోనే పాదం లోపలికి ఒరిగి ఉంటుంది. దీనిని ప్రానేషన్ అంటారు. దీనివల్ల పాదంలోని సహజమైన ఒంపు (ఆర్చ్) దెబ్బతిని బల్లపరుపుగా మారుతుంది. దీని ఫలితంగా టెండాన్ మీద ఒత్తిడి పెరిగి ఎకిల్లిస్ టెండినైటిస్ ప్రాప్తిస్తుంది. దీర్ఘకాలంపాటు ఎథిలిటిక్స్ ఆడేవారిలో కూడా క్రమంగా పాదం బల్లపరుపుగా తయారై (ఫ్లాట్ ఫుట్), ఈ వ్యాధి ప్రాప్తించవచ్చు.

కొంతమంది మహిళలు ఎత్తు మడమల చెప్పులను, బల్లపరుపుగా ఉండే పాదరక్షలను మాటిమాటికి మారుస్తుంటారు. ఇలాంటివారిలో ఎకిల్లిస్ టెండినైటిస్ ప్రాప్తించే అవకాశాలు ఎక్కువ. ఎత్తు మడమలకు కాలి పిక్కల కండరాలు అలవాటు పడి కురచగా మారతాయి. బల్లపరుపుగా ఉండే పాదరక్షలు ధరించినపుడు ఇవి భూమికి సమాంతరంగా సాగాల్సి ఉంటుంది. దీనితో టెండాన్ మీద అదనపు ఒత్తిడి పడి నొప్పి బయల్దేరుతుంది. దీనిని నివారించాలంటే హైహీల్స్‌వాడేవారు ప్రతిరోజు, ఉదయం రాత్రివేళల్లో యోగ వంటి స్ట్రెచింగ్‌కు సంబంధించిన వ్యాయామాలు చేయాలి.

లక్షణాలు

ఎకిల్లిస్ టెండాన్ అనేది మడమ ఎముక (క్యాల్‌కేనియస్)తో కలిసే చోట నొప్పిగా ఉంటుంది. అలాగే ఈ కూడికకు రెండంగుళాల ఎగువన ఒత్తిడి కలిగిస్తే నొప్పిగా ఉంటుంది. వైద్య పరిభాషలో దీనిని టెండర్‌నెస్ అంటారు. నొప్పి ఉదయం లేచిన తరువాత ఎక్కువగా ఉంటుంది. టెండాన్‌లో వెచ్చదనం పెరిగేకొద్దీ కొయ్యబారినట్లు ఉండటం తగ్గుతుంది. అంటే, ఉదయం బిగదీసుకుపోయినట్లు ఉండి పాదాన్ని ఉపయోగించడం మొదలెట్టిన తరువాత నొప్పి, స్టిఫ్‌నెస్ వంటివి తగ్గుతాయన్నమాట. అయితే, మరీ ఎక్కువగా నడవటం, నిలబడటం, బరువులు మోయటం వంటివి చేస్తే నొప్పి తిరిగి వచ్చేస్తుంది. పరుగెత్తడం, జాగింగ్‌వంటివి చేస్తే నొప్పి స్వస్థానంలోనే కాకుండా ఇతర భాగాలకు ప్రసరిస్తుంది కూడా. ఎకిల్లిస్ టెండాన్ ఉన్న భాగంలో గమనిస్తే వాపు కనిపిస్తుంది.

పరీక్షలు

బాధితుడి ఇతివృత్తం వ్యాధి నిర్ణయంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇంతకుముందే కాలులో నొప్పి ఉండటం, లేదా కాలు బలహీనంగా ఉండటం, కొత్తగా ఏదైనా వ్యాయామాన్ని గాని లేదా ఆటనుగాని మొదలెట్టడం వంటివాటి గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. రోజువారిగా వాడే పాదరక్షలను కూడా పరీక్షించాల్సి ఉంటుంది.

అలాగే చేతివేళ్ళతో స్పర్శించి కాలులో నొప్పి, బుడిపెలు, వాపు, వేడి, కండర క్షీణత (ఎట్రోఫి) వంటివి ఉన్నాయేమో పరీక్షించాల్సి ఉంటుంది. అలాగే మోకాళ్ళు, మడమ జాయింటు, పాదాలు మొదలైన వాటిల్లో కదలికలు ఏ స్థాయిలో ఉన్నాయన్నది చూడాలి. మడమలు, పాదం, చీలమండ జాయింటు అన్నీ ఒకే వరుసలో ఉన్నాయో లేదో చూడాల్సి ఉంటుంది.

అలాగే బాధితుడిని బోర్లా పడుకొని మోకాలువద్ద ముడవమని చెప్పాలి. పిక్క కండరాలను గట్టిగా పట్టుకొని పిండాలి. ఎకిల్లిస్ టెండాన్ ఆరోగ్యంగా ఉన్న సందర్భాల్లో ఈ పరీక్ష చేయడంవల్ల పాదం లోపలికి ముడుచుకుంటుంది. ఇవే కాకుండా ఇతర పరీక్షలుకూడా ఉపయోగపడతాయి. ఉదాహరణకు ఎక్స్‌రే తీయించి చూస్తే ఈ వ్యాధి ఉనికి తెలియకపోయినప్పటికీ టెండాన్‌లో క్యాల్షియం స్ఫటికలు పేరుకుపోతే తెలుస్తుంది. అలాగే ఎంఆర్ఐ, స్కానింగ్ ద్వారా టెండాన్ లోపల ఏ మేరకు దెబ్బతిన్నదో, క్షీణత లేదా డీజనరేషన్ ఏ స్థాయిలో జరిగిందో తెలుసుకోవచ్చు.

చికిత్స, సూచనలు, సలహాలు

ఈ సమస్యతో బాధపడేవారికి సమస్య మరింత పెరగకుండా సాంత్వన కలిగించడం ముఖ్యం. విశ్రాంతి, శీతల చర్యలు (మంచుగడ్డలను లేదా ఐస్ బ్యాగ్స్‌ను ప్రయోగించడం) ఆసరా కోసం పట్టీలుధరించడం, నొప్పిగా ఉన్న భాగాన్ని ఎత్తులో ఉంచడం అనేవి చేస్తే సాంత్వన లభిస్తుంది.

విశ్రాంతి:ఎకిల్లిస్ టెండినైటిస్‌ను కలిగించే పనులు, వ్యాయామాలు వంటివి మానేసి ఈత వంటి ఇతర ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. ఇటువంటి తేలికపాటి వ్యాయామాలవల్ల టెండాన్ మీద అదనపు ఒత్తిడి పడకుండా ఉంటుంది.

ఆర్థోసిస్:రోజువారీగా ధరించే బూట్లలోను, వ్యాయామాలు, ఆటలు గట్రా ఆడేప్పుడు ధరించే పాదరక్షల్లోనూ ప్రత్యేకంగా రూపొందించిన ఇన్‌సోల్స్‌ను అదనంగా అమర్చుకోవాలి. వీటివల్ల పాదాల భంగిమ సరిగా ఉండి, అడుగులు సక్రమంగా పడతాయి. అవసరమైతే చంక కర్రలను, సాగే గుణం కలిగిన క్రేప్ బ్యాండేజీలను వాడవచ్చు.

ఇతర చికిత్సా పద్ధతులు: కండరాలను సాగదీస్తూ చేసే స్ట్రెచింగ్ వ్యాయామాలు దీనిలో మంచి ప్రయోజనాన్ని ఇస్తాయి. స్నేహం (ఔషధసిద్ధ తైలాన్ని ప్రయోగించడం), స్వేదం (వేడి కాపడాలను పెట్టడం) అభ్యంగ చికిత్స (మసాజ్)వీటివల్ల రక్తప్రసరణ పెరిగి రిలీఫ్ లభిస్తుంది.

మహాయోగరాజ గుగ్గులువంటి శమన ఔషధాలు నొప్పిని, వాపును క్షేమంగా, సైడ్ ఎఫెక్ట్ లేకుండా తగ్గిస్తాయి. వీటిని వైద్య సలహా మేరకు వాడుకోవచ్చు.

-డాక్టర్ చిరుమామిళ్ల మురళీమనోహర్
murali manoharch@hotmail.com
రక్ష ఆయుర్వేదిక్ సెంటర్,
స్టేట్‌హోం ఎదుట,
సారథీ స్టూడియో రోడ్,
అమీర్‌పేట, హైదరాబాద్ - 500 073.

తల్లి అజాగ్రత్త.. శిశువుకు నష్టం

మనదేశంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో కొత్తగా గర్భం దాల్చే స్త్రీలు కొన్ని అపస్థలకు లోను అవుతున్నారు. ఏది చేయాలో ఏది చేయకూడదో చెప్పేవారు కరువౌతున్నారు. దీనివల్ల గర్భస్థశిశువు కు తీసుకోవలసిన జాగ్రత్తలలో అవగాహన లేనందువలన పుట్టే శిశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. పుట్టిన శిశువులో జన్యులోపాలు, అవయవాల వంకర, సరైన బరువు ఇట్లాంటివి లేక శిశువులు అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి కారణం గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం కారణమే. ఇపుడున్న అల్ట్రాసౌండు స్కానింగు లాంటి ఆధునిక వైద్య సదుపాయాలతో శిశువుపుట్టకముందే అంటే గర్భంలో ఉన్నపుడే ఏమేమి లోపాలున్నాయో తెలుసుకొని వాటినుంచి తల్లి బిడ్డల ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. అసలు గర్భిణిగా ఉన్నపుడు ప్రతినెలా వైద్యుని సంప్రదించినపుడు బిడ్డ ఎదుగుదలతోపాటుగా బిడ్డలో ఉంటే లోపాలను తెలుసుకొని వాటిని నివారించే పద్ధతులు ఇపుడున్నాయి. సాధారణంగా గర్భస్థశిశువు

వాడాల్సిన మందులు వాడకపోవడం కాని తల్లి మద్యం సేవించటం కాని, గర్భం దాల్చినపుడు ఏదైనా ఇన్ఫక్షన్లు సోకడం తల్లి ఉన్న వ్యాధులు బిడ్డకు సంక్రమించడం, బిడ్డకు కావాల్సిన ఆక్సిజను అందకపోవడం లాంటివాటితో పాటు వాతావరణ కాలుష్యం కూడా బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. కనుక ఇపుడున్న ఆధునిక వైద్యసదుపాయాలన్నిటిని పట్ల అవగాహనను గర్భిణీలకు కలిగించాలి. దానితో పాటుగా బిడ్డఎదుగుదలను బిడ్డ ఆరోగ్యాన్ని గర్భంలో ఉన్నప్పటినుంచీ తెలుసకుని తల్లీ బిడ్డల క్షేమాన్ని కాపాడాలి.

శారీరక శ్రమ తగ్గితే సమస్యలే..

నేడు అన్ని రంగాలలోనూ కంప్యూటర్ల వాడకం ఎక్కువై పోయింది. దానితో ఎక్కువ పనిగంటలు ఒక దగ్గర కూర్చోవడమే అటు ఇటు కదిలే పనేమీ లేకుండా పోయింది. ఇది కేవలం ఉద్యోగస్థులకే కాదు పిల్లల్లోనూ వీడియోగేమ్స్ ఆడటం, నెట్‌లో చూడడం ఎక్కువైపోయింది దానితో వారిలో కూడా శారీరక శ్రమ తగ్గిపోయింది. దీనివల్ల మోకాళ్ల నొప్పులు గణనీయంగా పెరుగుతున్నాయి. కొద్దికాలం తర్వాత మోకాలు చిప్పల మార్పిడి చేయాల్సి కూడా రావచ్చు అని వైద్యబృందాలు అభిప్రాయపడుతున్నారు. ఇదేకాకుండా ఒకే కుర్చీల

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఇష్టారాజ్యం కొనసాగుతున్నది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) అధ్యక్షుడు శ్రీనివాసన్ అండదండలు పుష్కలంగా ఉన్న అతను భారత క్రికెట్‌ను శాసిస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో చటేశ్వర్ పుజారాకు అవకాశం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

ధోనీ ఆడిందే 'ఆట'

టీమిండియా కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు మరింత జోరందుకున్నాయి. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో అద్భుత ప్రతిభ కనబరచి, ఆతర్వాత రంజీ ట్రోఫీలోనూ రాణించిన చటేశ్వర్ పుజారాను సెలక్టర్లు వన్డే సిరీస్‌కు ఎంపిక చేసినప్పటికీ, అతనికి ఒక్క అవకాశం కూడా ఇవ్వకుండా తన తాన్ని నెగ్గించుకున్నాడు. ధోనీకి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసన్ మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌ను ఇండియా సిమెంట్స్ దక్కించుకుంది. ఈ కంపెనీ శ్రీనివాసన్‌ది. చెన్నై సూపర్ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్న ధోనీకి అతని సంపూర్ణ మద్దతు ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఇండియా సిమెంట్స్‌లో ధోనీకి ఉపాధ్యక్ష పదవిని కూడా శ్రీనివాసన్ కట్టబెట్టాడు. వీరిద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని రుజువు చేయడానికి మరో సాక్ష్యం అనవసరం. బిసిసిఐ అధ్యక్షుడి మద్దతు ఉన్నది కాబట్టే ధోనీపై ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నా, అతనిపై చర్యకు సెలక్టర్లు సాహసించడం లేదు. మూడు ఫార్మెట్స్‌కు వేరువేరుగా కెప్టెన్లు ఉండాలన్న ప్రతిపాదనను అటకెక్కించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను కోల్పోయిన భారత్, అతి కష్టం మీద టి-20 సిరీస్‌ను డ్రా చేసుకుంది. వన్డే ఇంటర్నేషనల్ సిరీస్‌ను వైవసం చేసుకొని పరువు నిలబెట్టుకుంది. కానీ, విశ్వవిజేతగా నిలిచిన జట్టు ఈమాత్రం విజయాలకే పొంగిపోవాల్సిన అవసరం లేదు. ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ధోనీ ఇంకెంతగా ఏక పక్ష నిర్ణయాలు తీసుకుంటాడో చూడాలి.

ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా తెరపైకి వచ్చిన పిచ్ వివాదం మరోసారి భగ్గుమనే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది. పిచ్‌ను పూర్తిగా స్పిన్నర్లకే అనుకూలంగా తయారు చేయాలన్న ధోనీ సూచనపై కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ క్యూరేటర్ ప్రబీర్ ముఖర్జీ అభ్యంతరం వ్యక్తం చేసిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు అందరికీ తెలిసినవే. ఇంగ్లాండ్‌తో ఈడెన్‌లో జరిగిన మూడో టెస్టుకు ముందు ఈడెన్ గార్డెన్స్ మైదానం తీరుతెన్నులు ఎలావుండాలనే విషయంపై సూచనలిచ్చిన ధోనీకి ప్రబీర్ తగిన సమాధానమే ఇచ్చాడు. బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధికారులు ధోనీకి అండగా నిలిచినా అతను వెనక్కు తగ్గలేదు. అన్ని పిచ్‌లు ఒకే విధంగా ఉండవనే ప్రాథమిక సూత్రాన్ని ధోనీ తెలుసుకోవాలని ప్రబీర్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దుమారాన్నే రేపాయి. ప్రబీర్‌కు వ్యతిరేకంగా క్యాబ్ తీసుకున్న నిర్ణయం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆరోగ్య సమస్యలను ఉటంకిస్తూ ప్రబీర్ దీర్ఘకాల సెలవుపై వెళ్లనున్నట్లు క్యాబ్‌కు ఓ లేఖ పంపడం చర్చనీయాంశమైంది. 1985 నుంచి ఈడెన్ గార్డెన్స్ క్యూరేటర్‌గా వ్యవహరిస్తున్న క్యూరేటర్ ముఖర్జీని కాదని, టీమిండియా-ఇంగ్లాండ్ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా పిచ్‌ను తయారు చేయాల్సిందిగా ఈస్ట్‌జోన్ గ్రౌండ్ అండ్ పిచ్ కమిటీ ప్రతినిధి ఆశిష్ భౌమిక్‌కు ఈ బాధ్యతను అప్పగిస్తూ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) తొలుత నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆతర్వాత తలెత్తిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రతిపాదనను విరమించుకుంది. బిసిసిఐ తనను తొలగించనున్నట్లు సమాచారం అందుకున్న వెంటనే 83 ఏళ్ల ప్రబీర్ తీవ్రంగా స్పందించాడు. సెలవుపై వెళుతున్నట్లు క్యాబ్‌కు లేఖరాశాడు. భౌమిక్ నియామకం తనను అవమానించడమేనని అతను అభిప్రాయపడ్డాడు. పిచ్ గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తానంటూ క్యాబ్ అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా తనను బెదిరించాడని ముఖర్జీ వెల్లడించాడు. పిచ్ గురించి క్రికెట్ సంఘం అధ్యక్షుడికిగానీ, ఆటగాళ్లకుగానీ మాట్లాడే హక్కు లేదని స్పష్టం చేశాడు. కానీ దాల్మియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించాడు. రెండు దశాబ్దాలకుపైగా సేవలు అందించిన తనకు దాల్మియా ఇచ్చిన గుర్తింపు ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలావుంటే, ప్రబీర్‌ను తప్పించిన క్యాబ్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. వెంటనే వచ్చి విధుల్లో చేరాల్సిందిగా అతనికి వర్తమానం పంపి మరీ ఆహ్వానించింది. ప్రబీర్‌తో తమకు ఎలాంటి విభేదాలు లేవని, సమస్యను చర్చించి పరిష్కరించామని దాల్మియా ప్రకటించాడు. ఫలితంగా అప్పట్లో వివాదానికి తెరపడింది.

మొత్తం మీద ఈ వివాదం రాజుకోవడానికి వెనుక ధోనీ హస్తం ఉన్నదనేది స్పష్టం. కోల్‌కతా పిచ్‌పై వివాదం తలెత్తడానికి ప్రధాన కారకుడు ధోనీనే. అతనే వివాదానికి బీజం వేశాడు. కోల్‌కతాలోనూ స్పిన్ ట్రాక్‌నే తాను కోరుకుంటున్నానని ముంబయి మ్యాచ్ ముగిసిన వెంటనే ధోనీ బహిరంగంగానే చెప్పాడు. అయితే, ధోనీ డిమాండ్‌ను ప్రబీర్ తోసి పుచ్చాడు. ఏ రెండు పిచ్‌లు ఒకే రీతిలో ఉండవని, స్వతఃసిద్ధమైన లక్షణాలకు విరుద్ధంగా పిచ్‌ను మార్చడం వల్ల సమస్యలు తలెత్తుతాయని ప్రబీర్ స్పష్టం చేశాడు. అంతే... ధోనీ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఒక క్యూరేటర్ తనకు హితవు పలకడం ఏమిటంటూ మండిపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న క్యాబ్ అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా రంగంలోకి దిగాడు. ప్రబీర్‌ను తప్పించి, అతని స్థానంలో మరో క్యూరేటర్‌ను నియమించడం మినహా ధోనీని సంతృప్తిపరిచే మార్గం మరొకటి లేదన్న విషయాన్ని బిసిసిఐ అధికారుల చెవినవేశాడు. బోర్డు కూడా ఆఘమేఘాలపై స్పందించి, ఈస్ట్‌జోన్ గ్రౌండ్ అండ్ పిచ్ కమిటీ ప్రతినిధి ఆశిష్ భౌమిక్‌కు ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ని తీర్చిదిద్దే బాధ్యతను అప్పగించింది. ఈ పరిణామాలన్నీ అభిమానులను ఆగ్రహానికి గురి చేశాయి. సర్వత్రా నిరసన వ్యక్తమైంది. చివరికి క్యాబ్, బిసిసిఐ ప్రబీర్ ముందు తల వంచక తప్పలేదు. నిజానికి ప్రబీర్ అంకిత భావానికి అంతా జేజేలు పలకాల్సిందే. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు మొదలు కావడానికి కొద్దికాలం ముందే అతని భార్య, కుమార్తె వారం రోజుల వ్యవధిలో మృతి చెందారు. గత ఏడాది మే 25న 31 ఏళ్ల కుమార్తె మరణించింది. దీనిని తట్టుకోలేకపోయిన 73 ఏళ్ల అతని భార్య గుండె పోటుతో మృతి చెందింది. భార్య, కుమార్తెలను పోగొట్టుకున్నప్పటికీ, ప్రబీర్ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. తన భార్య మరణించిన మరుసటి రోజే అతను మళ్లీ ఈడెన్ గార్డెన్స్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఈ స్టేడియంలో అతనికి ఉన్న అనుబంధం అలాంటిది. కానీ, ఇలాంటి అనుబంధాలకు అర్థం కూడా తెలియని క్యాబ్, బిసిసిఐ అధికారులు నిర్దాక్షిణ్యంగా అతనిని తొలగించి అవమానించారు. రెండు దశాబ్దాలకుపైగా అతను చేసిన సేవలకు గొప్పగా కృతజ్ఞత చూపారు. బిసిసిఐ, క్యాబ్‌తో ఘర్షణ పడిమరీ ప్రబీర్ తన పంతం నెగ్గించుకున్నాడు. కానీ, ఇప్పుడు అతను క్యూరేటర్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. అంతేకాదు... అతని మాదిరి తెగింపు ఉన్న క్యూరేటర్లు ఉంటారని అనుకోవడానికి కూడా వీలులేదు. బిసిసిఐ అడుగులకు మడుగులొత్తే క్యూరేటర్లపై ధోనీ ఎంత ఒత్తిడి తెస్తాడో వేచిచూడాలి. ఆస్ట్రేలియాను దెబ్బతీయడానికి 'స్పిన్'ను ఆయుధంగా మలచుకోవాలని అనుకుంటున్న అతను, తనకు నచ్చిన విధంగా పిచ్‌లను తయారు చేయించుకునే అవకాశాలే ఎక్కువ. అతని వైఖరి మరోసారి వివాదానికి తావిచ్చే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది. ధోనీ వ్యవహార శైలిని మార్చడానికి బిసిసిఐ అధికారులు ప్రయత్నించాలి.

- శ్రీహరి

పాపకార్న్

రానా వివాదం..

ఇంగ్లాండ్ జట్టు 1987లో పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు చేదు అనుభవాన్ని ఎదుర్కొంది. అంపైర్ షకూర్ రానా పాక్‌కు అనుకూలంగా నిర్ణయాలు ప్రకటించడం వివాదానికి దారి తీసింది. ఇంగ్లాండ్ ఆటగాడు మైక్ గాటింగ్ అతనితో విభేదించాడు. చిలికిచిలికి గాలివాన రీతిలో ఇద్దరూ కొట్టుకునే పరిస్థితి నెలకొంది. చివరికి రానా తీరు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) దృష్టికి వెళ్లింది. సిరీస్‌లకు ఆతిథ్యం ఇచ్చే దేశాలకు చెందిన అంపైర్లు ఉండడం వల్లే ఇలాంటి వివాదాలు తలెత్తుతున్నాయని గ్రహించిన ఐసిసి నిబంధనలను మార్చేసింది. టెస్టుల్లో తటస్థ అంపైర్లు ఉండాలని ఆదేశించింది. వన్డేల్లో ఒక స్థానిక అంపైర్ ఉంటే, ఒక తటస్థ అంపైర్ ఉండాలి. రానా పుణ్యమాని అంపైర్ల ఏక పక్ష నిర్ణయాలకు చాలా వరకు తెరపడింది.

సాకర్ టెన్నిస్..

పాత ఆటలతో బోరు కొడితే కొత్త ఆటలు తెరపైకి వస్తాయి. అలాంటి కొత్త ఆటే 'సాకర్ టెన్నిస్'. కొలంబియాలోని బొగోటాలో స్విట్జర్లాండ్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ ఒక ఎగ్జిబిషన్ గేమ్‌లో ఆడి, సాకర్ టెన్నిస్‌కు కొత్త ఊతమిచ్చాడు. సెలబ్రిటీలు చొరవ తీసుకుంటే, ఇలాంటి ఆటలు అతి తక్కువ కాలంలోనే విశ్వవ్యాప్తమవుతాయి. టెన్నిస్ కోర్టులో ఫుట్‌బాల్ ఆడడమే 'సాకర్ టెన్నిస్' ప్రత్యేకత. నెట్‌కు అటూఇటూ నిలిచి ఆటగాళ్లు గోల్స్ చేయడానికి ప్రయత్నించడం ఆసక్తికరంగా ఉంటుంది.

ప్రిన్స్‌స్టన్ అదృష్టం..

పారిస్‌లో జరిగిన 1960 ఒలింపిక్స్‌లో అమెరికా లాంగ్ జంపర్ మెయర్ ప్రిన్స్‌స్టన్‌ను రన్నరప్‌గా ప్రకటించారు. ఇందులో వింత లేకపోయినా, అతను ఫైనల్ జంప్ చేయకుండానే పతకం అందుకోవడం విశేషమే. సిరాకస్ యూనివర్శిటీలో చదువుతున్న అతను క్వాలిఫయింగ్ జంప్స్‌ను సమర్థంగా పూర్తి చేశాడు. అయితే, ఫైనల్ జంప్‌ను ఆదివారం నిర్వహించారు. క్రైస్తవ మత విశ్వాసాలను అనుసరించి ఆదివారం విశ్రాంతికే కేటాయించాలి కాబట్టి, ఫైనల్ జంప్‌లో పాల్గొనరాదని వర్శిటీ అధికారులు అతనిని ఆదేశించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రిన్స్‌స్టన్ ఫైనల్ జంప్ చేయలేదు. అయితే, అంతకు ముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా అతనికి రజత పతకాన్ని అందచేశారు. అత్త మీద కోపం దుత్తమీద చూపిన చందంగా యూనివర్శిటీ అధికారులపై ఆగ్రహాన్ని లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్‌పై దాడి చేసి మరీ ప్రదర్శించుకున్నాడు ప్రిన్స్‌స్టన్. తుది జంప్‌లోనూ పాల్గొంటే స్వర్ణం తనకే దక్కేదని, వర్శిటీ అధికారుల ఆదేశం వల్ల అది చేజారిందనీ అతని వాదన.

మిసైల్ కార్!

మామూలు కార్లను నడిపిడే మజా ఏముంటుందని అనుకున్నాడో ఏమోగానీ ఇండియానాపోలిస్‌కు చెందిన 44 ఏళ్ల పాల్ స్టెండర్ ఏకంగా మిసైల్ కార్‌తో రోడ్లపై దూసుకెళుతున్నాడు. 1967 మోడల్ చవర్లెట్ కారుకు పైన క్షిపణిని ఉంచి, దానిని ఇంజన్‌తో అనుసంధానం చేశాడు. అత్యంత వేగవంతమైన కార్ల తయారీలో ఎంతో నైపుణ్యం సంపాదించిన ఇండీ బాయిస్ సాయంతో స్టెండర్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోలేని అతని చవర్లెట్ ఇప్పుడు 300 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో పరుగులు తీస్తున్నది. దీనికి 'జెట్-ఇంపాలా 67' అని పేరు కూడా పెట్టాడు స్టెండర్.

- సత్య

'గౌరవ' ఘర్షణలు!

లిల్లీ వర్సెస్ మియందాద్

మోరేను వెక్కిరిస్తూ మియందాద్ కుప్పిగంతులు

భజ్జీ వర్సెస్ సైమండ్స్

క్రికెట్ మైదానంలో ఘర్షణలు కొత్తకాదు. చిరకాల ప్రత్యర్థులు తలపడినప్పుడు పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుంది. క్రీడాకారులు మైదానంలో ఎప్పుడు బాహాబాహీకి దిగుతారోనన్న భయం అటు అంపైర్లను, ఇటు అభిమానులను వేధిస్తూ ఉంటుంది. భారత వికెట్‌కీపర్ కిరణ్ మోరేను వెక్కిరిస్తూ జావేద్ మియందాద్ వేసిన కుప్పిగంతులను ఎవరూ మరచిపోలేరు. ఆస్ట్రేలియా పేసర్ డెన్నిస్ లిల్లీతోనూ మియందాద్ ఘర్షణకు దిగడం అప్పట్లో సంచలనం సృష్టించింది. లిల్లీని కొట్టడానికి బ్యాట్ ఎత్తిన మియందాద్‌ను అంపైర్లు అడ్డుకొని పరిస్థితిని చక్కదిద్దారు. సైమండ్స్, హర్భజన్ సింగ్ వివాదం కొంతకాలం క్రితం పతాక శీర్షికలకు చేరింది. భజ్జీ హిందీలో ఊత పదమైన తిట్టు 'మాకీ..' అని అంటే, దానిని సైమండ్స్ 'మంకీ'గా అర్థం చేసుకున్నాడు. మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశాడు. చివరికి సచిన్ తెండూల్కర్ వంటి సీనియర్లు జోక్యం చేసుకోవడంతో వివాదానికి తెరపడింది. క్రికెట్ మైదానంలో వివాదాలకు, ఘర్షణలకు, ఆధిపత్య పోరాటాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అయితే, ఘర్షణలు గౌరవానికి ప్రతీకలంటూ ఆస్ట్రేలియా మాజీ వికెట్‌కీపర్ ఆడం గిల్‌క్రిస్ట్ కొత్త భాష్యం ఇచ్చాడు. తలపడుతున్న రెండు జట్ల క్రికెటర్లకూ ఒకరిపై మరొకరికి గౌరవం ఉంది, వారి శక్తిసామర్థ్యాలను గుర్తించినప్పుడే ఆధిపత్యం కోసం సర్వశక్తులు ఒడ్డి పోరాడతారు. ఈ పోరాటాలే తరచు ఘర్షణలకు దారి తీస్తాయి. బలహీనమైన ప్రత్యర్థిని ఢీకొంటున్నప్పుడు ఎవరూ మాటామాటా పెంచుకోరు. ఉద్రిక్త వాతావరణానికి తావే ఉండదు. మైదానంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినా, బలమైన జట్టు ఆటగాళ్లు పట్టించుకోరు. పైగా సరదాగా తీసుకుంటారు. ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి, సహనం కోల్పోయేది సమవుజ్జీలుగా ఉన్న జట్ల ఆటగాళ్లే. అందుకే, ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ జట్ల మధ్య యాషెస్ సిరీస్ జరిగినా, భారత్-పాకిస్తాన్ జట్లు తలపడే ఏ స్థాయి మ్యాచ్‌లు జరిగినా యావత్ వాతావరణం వేడెక్కిపోతుంది. క్రికెటర్ల మధ్య సహజంగానే ఆధిపత్య పోరాటానికి తెరలేస్తుంది. క్రికెట్ మైదానం యుద్ధ భూమిని తలపిస్తుంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న ఉద్రిక్తత ఏ క్షణంలోనైనా బద్దలుకావచ్చన్న అనుమానం అందరినీ, ప్రతి క్షణం భయాందోళనలకు గురి చేస్తుంది. రెండు సమవుజ్జీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగే సమయాల్లో తలెత్తే ఉద్రిక్తతలను, ఆటగాళ్ల మానసిక సంఘర్షణను పరిగణలోకి తీసుకుంటే, గిల్‌క్రిస్ట్ వ్యాఖ్యలు నిజమేనని అంగీకరించాల్సి వస్తుంది. అయితే, ఘర్షణలు గౌరవానికి ప్రతీకలంటూ అతను బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు ఎలాంటి పరిణామాలకు కారణమవుతాయోనన్న అనుమానం వ్యక్తమవుతున్నది. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాల్సిన క్రీడాకారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ, క్రీడాస్ఫూర్తికి తిలోదకాలిచ్చి, మైదానాలను యుద్ధ భూములుగా మార్చడాన్ని సమర్థిస్తే, భవిష్యత్తులో అరాచకాలు మరింతగా పెరుగుతాయనడంలో సందేహం లేదు. క్రికెట్ ఒక్క రంగానికే దీనిని పరిమితం చేయడానికి వీలు లేదు. క్రికెట్ ఘర్షణలు చాలా పరిమితం. అదే సాకర్ విషయానికి వస్తే దారుణాలు జరిగిపోతాయి. ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఆటగాళ్లు మైదానంలో ఏ చిన్న గొడవకు దిగినా, ఇరు జట్ల అభిమానులు స్టేడియాలను ధ్వంసం చేసేస్తారు. ఒకరిపై ఒకరు దాడులకు దిగుతారు. తొక్కిసలాట జరగడం, వందల సంఖ్యలో ప్రేక్షకులు, అభిమానులు ప్రాణాలు కోల్పోవడం తరచు వింటున్న వార్తలే. ఒకరితో మరొకరు తీవ్రంగా పోటీపడడం వేరు... తిట్ల దండకాన్ని ఎత్తుకొని, బాహాబాహీకి దిగడం వేరు. విజయం కోసం సర్వశక్తులు ఒడ్డి పోరాడడం వేరు... అదే విజయం కోసం అడ్డదార్లు వెతుక్కొని, ప్రత్యర్థి ఆటగాళ్లను హేళన చేయడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసి గెలుపొందాలని కోరుకోవడం వేరు. ఘర్షణలే గౌరవానికి తాత్కారణాలైతే, సాకర్ మ్యాచ్‌ల సందర్భంగా తలెత్తే హింసను కూడా అదే దృష్టితో చూడాలి. సమర్థించాలి. అది కూడా క్రీడా రంగానికి మంచి చేసే పరిణామమేనని సర్దుకుపోవాలి. అది సాధ్యమా? క్రీడలకు ఉపకరించే అంశమా? గిల్లీ లాంటి సీనియర్ ఆటగాళ్లే ఇలాంటి ప్రకటనలిస్తే, ఇప్పటికే పరుధులుదాటి, నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తున్న క్రీడాకారులకు పట్టపగ్గాలుంటాయా? బాధ్యతారాహిత్యంతో చేసే కొన్ని వ్యాఖ్యలు విపరీత పరిణామాలకు దారితీస్తాయన్న విషయాన్ని సెలబ్రిటీలు గుర్తుంచుకోవాలి. సామాన్యుడు ఏం మాట్లాడినా ఫరవాలేదుగానీ, సెలబ్రిటీలుగా ముద్రపడిన వారు ఏ మాత్రం నోరు జారినా గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయి. క్రీడా మైదానాలు సమరాంగణాలుగా మారతాయి. క్రీడారంగం తన అస్తిత్వాన్నే కోల్పోతుంది. గిల్‌క్రిస్ట్ చేసిన వ్యాఖ్యలను, అతను చెప్పిన కొత్త భాష్యాలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. మరోసారి ఎవరూ ఇలాంటి ప్రకటనలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

హానోవర్ యువరాణి కారొలిన్ కుమార్తె చార్లొట్ కాసిరాగికి షోజం పింగ్ అంటే వల్ల మాలిన అభిమానం. పారిస్‌లో జరిగిన ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆమె సంప్రదాయ దుస్తులతో హాజరై అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

కళ్లు తెరవకుంటే పతనం తప్పదు!

లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్

నిజ నిర్ధారణ కమిటీ మాత్రమే డోపింగ్‌మకిలి నుండి సైక్లింగ్‌ను బయటపడేస్తుందని వివాదస్పద సైక్లిస్టు లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్పష్టం చేస్తున్నాడు. చేతులు ముడుచుకు కూర్చుని ఉంటే ఈ క్రీడను పాతాళంలోకి పడదోయడమేనని అంతర్జాతీయ సైక్లింగ్ సమాఖ్య (యుసిఐ) నుండి జీవిత కాల నిషేధాన్ని ఎదుర్కొంటున్న ఆర్మ్‌స్ట్రాంగ్ అంటున్నాడు. ప్రస్తుత వివాదానికి తాను కేంద్ర బిందువుగా మారాననీ, అయితే డోపింగ్ కేవలం ఒక వ్యక్తికి, ఒక జట్టుకు పరిమితమైన అంశంగా భావించకూడదని అతని అభిప్రాయం. నెపాన్ని ఒక వ్యక్తిపై వేసినంత మాత్రాన సంక్షోభానికి పరిష్కారం లభించదని తేల్చిచెప్తున్నాడు. డోపింగ్‌ను పారదోలడం.. సైక్లింగ్, ఇతర అన్ని క్రీడల మనుగడకు సంబంధించిన విషయమని స్పష్టం చేస్తున్నాడు. కాగా, నిజ నిర్ధారణ కమిటీని వేయాలని ఎంతో కాలం క్రితమే యుసిఐ అధ్యక్షుడు ప్యాట్ మెక్‌క్విడ్‌ను కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని అన్నాడు. అతను తనను తాను రక్షించుకునేందుకు దుర్బలంగా ప్రవర్తించాడని ఆర్మ్‌స్ట్రాంగ్ ధ్వజమెత్తాడు. ప్రొఫెషనల్ రైడర్లలో ప్రతీ తరంలోనూ డోపీలు ఉన్నారని, క్షమాభిక్ష పెడితేనే వారు ధైర్యంగా బయటకు వచ్చి తమ తప్పులను ఒప్పుకుంటారని స్పష్టం చేశాడు. అయితే, ఈ చర్యను ప్రపంచ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (వాడా) పర్యవేక్షించాలని కోరాడు. కాగా, ప్రస్తుత సంక్షోభం వల్ల సైక్లింగ్ అంతం అవనప్పటికీ ఆదరణ మాత్రం తగ్గుతుందని తెలిపాడు. ఇప్పటికే కొందరు స్పాన్సర్లు వైదొలగడం, కొన్ని రేసులు రద్దకావడం జరిగాయని పేర్కొన్నాడు. ఒక దశాబ్దం పాటు ఈ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నాడు. కాగా, సైక్లింగ్ చరిత్రలోనే అత్యంత వ్యవస్థీకృత డోపింగ్‌కు పాల్పడటంతో ఆర్మ్‌స్ట్రాంగ్‌పై అమెరికా డోపింగ్ నిరోధక సంస్థ (యుఎస్‌ఎడిఎ) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అతనిపై వచ్చిన ఆరోపణల విషయంలో యుసిఐ చూసీచూడనట్లు వ్యవహరించిందని విమర్శలు వచ్చాయి. ఇక యుఎస్‌ఎడిఎ, వాడా కలిసి నిజ నిర్ధారణ కమిటీని వేయడం, డోపీలను మన్నించాలని భావిస్తుండటం తదితర అంశాలపై యుసిఐ గుర్రుగా ఉంది.

చిట్కాలు

★ గుప్పెడు గులాబీ రేకలను శుభ్రంగా కడిగి వేన్నీళ్లలో బాగా మరిగించాలి. ఈ నీళ్లు చల్లారాక ముఖానికి రాసుకుంటే చర్మానికి నిగారింపు వస్తుంది.

★ కొన్ని బీన్స్ తీసుకుని మెత్తగా రుబ్బి అందులో కాస్త పెరుగు కలిపి చర్మానికి బాగా మర్దనా చేయాలి. పావుగంట తర్వాత శుభ్రమైన నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మెరుస్తుంది.

★ చెంచాడు పెరుగులో కొద్దిగా బత్తాయి రసం కలిపి ముఖభాగానికి బాగా పట్టించాలి. ఇలా చేస్తే చేతులతో పాటు ముఖచర్మం కోమలంగా మారుతుంది.

★ బాదం నూనెతో రోజూ ఉదయం పూట కొద్దిసేపు ముఖానికి మర్దనా చేసుకుంటే నల్లటి మచ్చలు, మొటిమలు అదృశ్యమవుతాయి.

★ కళ్ల కింది భాగంలో బాదం నూనెను వేళ్లతో సున్నితంగా మసాజ్ చేసుకుంటే నల్లటి వలయాలు తొలగిపోతాయి.

★ రోజూ విధిగా కాసింత బాదం పప్పు తింటే గుండెకు బలం చేకూరుతుంది.

★ నానబెట్టిన బాదం పప్పును ముద్దగా చేసి అందులో పచ్చిపాలను కలిపి ముఖానికి బాగా పట్టించాలి. ఇలా చేస్తే పొడిచర్మం ఉన్నవారికి ఫలితం కనిపిస్తుంది.

★ రాత్రి పడుకునే ముందు బాదం నూనెతో పావుగంట సేపు మసాజ్ చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే దురదలు వంటి చర్మ సంబంధ సమస్యల నుంచి బయట పడొచ్చు.

★ తలకు రాసుకునే హెన్నాలో గుడ్డుసొన కూడా కలిపితే మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

అమ్మాయిలు ప్రేమించి తీరాలా..?

'రేఖా.. ఆ వెంకట్ నీ కోసం పడి చస్తున్నాడే.. పాపం వాణ్ణి కొంచెం కనికరించవే..'అంది నీలిమ. 'నాకు రేఖ ఐ లవ్ యూ చెప్పకపోతే దేవదాసునై పోతానని వెంకట్ అన్నాడే..' వంత పాడింది రోజా. 'రేఖా.. వెంకట్ నీ వెంట పడుతున్నాడని నువ్వు గొప్ప అందగత్తెవని ఫీలయిపోకు.. నీలిమ, రోజా, నేనూ- మొదట మా వెంటపడ్డ రమేష్, శంకర్, మోహన్‌లను అసహ్యించుకున్నా- నిత్యం వాళ్లు చేసే కామెంట్లను భరించలేక వారిని బోయ్ ఫ్రెండ్స్‌గా యాక్సెప్ట్ చేశాం.. వాళ్లిప్పుడు మాకు బాడీ గార్డుల్లా ఉంటూ క్యాంటీన్ ఖర్చులు, సినిమా ఖర్చులు భరిస్తున్నారు.. తరచూ ఏదో ఒక సందర్భంగా గిఫ్ట్‌లు కొని ఇస్తున్నారు.. ఇంటర్మీడియట్ వరకూ మనకి ఎలాంటి ఫ్రీడమ్ లేదు.. ఇపుడు ఇంజనీరింగ్‌లో చేరాక ఎంజాయ్ చేస్తున్నాం.. వెంకట్‌ను బోయ్‌ఫ్రెండ్‌గా అంగీకరిస్తే నీకు తిరుగుండదు.. మాకూ తలనొప్పి తగ్గుతుంది.. స్టూడెంట్ లైఫ్‌లో కొన్ని మధుర జ్ఞాపకాలనైనా ఉంచుకో.. నువ్వు 'ఊ' అంటే వెంటనే వెంకట్‌కి మెసేజి పంపుతా.. ఆలోచించి వెంటనే చెప్పు..' అని ఉపన్యాసం ముగించింది 'కాలేజీ బ్యూటీ'గా అందరూ పిల్చుకునే సరోజ.

రేఖ, నీలిమ, రోజా,సరోజ ఇంజనీరింగ్‌లో కొత్తగా చేరారు. వేర్వేరు ప్రాంతాలకు చెందినవారైనప్పటికీ వీరు మంచి స్నేహితులుగా మారారు. నీలిమ, సరోజ హాస్టల్‌లో ఉంటున్నారు. రేఖ, రోజా తల్లిదండ్రులతో కలిసి ఉంటూ రోజూ బస్సులో కాలేజీకి వస్తుంటారు. ఓ రోజు కాలేజీ నుంచి ఇంటికి వచ్చాక ఏడుస్తున్న రేఖను చూసి ఆమె తల్లి మంజుల ఆందోళన చెందింది. గుచ్చి గుచ్చి అడిగే సరికి కూతురు అసలు విషయం చెప్పింది. ప్రతి రోజూ తనను సరోజ, నీలిమ, రోజా ఆటపట్టిస్తున్నారని, వెంకట్‌ను బోయ్‌ఫ్రెండ్‌గా యాక్సెప్ట్ చేయకపోతే స్నేహానికి 'గుడ్ బై' చెప్తామని బెదిరిస్తున్నారని రేఖ తన తల్లికి వివరించింది. కూతురి మాటలు విన్నాక మంజుల నిర్ఘాంతపోయింది.

చదువుకోడానికని కాలేజీకి వెళుతున్న యువత ఇలా ప్రేమల పేరిట, ఫ్రెండ్‌షిప్‌ల పేరిట అతిగా ఊహించుకుని కాలాన్ని వృథా చేయడం మంజుల లాంటి వాళ్లకు విస్మయం కలిగించవచ్చు. గంటల తరబడి క్యాంటీన్లలో, పార్కుల్లో కాలక్షేపం చేస్తున్న వారిని ఏమనాలి? వీరంతా చదువుకునేందుకే కాలేజీలకు వెళుతున్నారా? నేటి కాలంలో సినిమాలు, టీవీలు, ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల ప్రభావంతో యువత తాము కూడా గొప్పగా ఉండాలని భావించడం వల్లే ఈ పెడ ధోరణులు ప్రబలిపోతున్నాయి. కట్టుబొట్టు, వస్త్రధారణ, మాటలు.. ఒకటేమిటి..? అన్నింట్లోనూ పాశ్చాత్య పోకడలే.. అనుకరణకే పెద్దపీట.. ఇవన్నీ మనకు అంత అవసరమా? అని ఎవరూ ఆలోచించడం లేదు. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి తిరగడం, ఒక్కోసారి కుళ్లు జోకులేసుకోవడం, తమను సినిమాల్లోని హీరో హీరోయిన్లుగా పోల్చుకోవడం.. ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును వృథా చేయడం.. ఈ దృశ్యాలు నేటి కళాశాలల్లో సర్వ సాధారణం.

నేడు కళాశాల జీవితంలో శ్రద్ధగా చదువుతున్న వారి శాతం తక్కువేనని చెప్పొచ్చు. కాలేజీ రోజుల్లోనే జల్సాలకు, వ్యసనాలకు అలవాటు పడిపోయి కొందరు చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంకొందరు చదువు పూర్తయ్యాక ఏదో ఒక ఉద్యోగంలో చేరాక తమకు ఆర్థిక స్వతంత్ర్యం వచ్చిందన్న భావంతో తల్లిదండ్రులను సైతం పట్టించుకోవడం లేదు. వయసు మీరుతున్నా మరికొందరు యువతీ యువకులు పెళ్లిళ్ల ప్రసక్తే తేవడం లేదు. ఎక్కడ పడితే అక్కడ క్లబ్‌లు, పబ్‌లు, రిసార్టులు వెలుస్తున్నందున యువత విలాసాలకు, వ్యసనాలకు లోటు లేకుండా పోతోంది. అమూల్యమైన కాలేజీ జీవితాన్ని వృథా చేసుకుంటున్నామన్న స్పృహ లేనందున వ్యసనాలకు అలవాటుపడే వారు నేరాలకు సైతం తెగిస్తున్నారు.

****

నా మిత్రుడు లక్ష్మణరావు ఓ రోజు మా ఇంటికి వచ్చి, ఇంజనీరింగ్ కాలేజీల బాగోతం అంతా చెప్పి తన కుమార్తె రేఖకు ఎదురైన సమస్యకు పరిష్కారం చూపాలని కోరాడు.

'రేఖను వేధిస్తూ వెంట పడుతున్న వెంకట్‌కు ముందుగా వార్నింగ్ ఇస్తే సరి' అని నేను సలహా ఇచ్చాను.

'వాడికి వార్నింగ్ ఇచ్చినా, పోలీసులకు కంప్లయింట్ చేసినా ఫలితం లేదు' అన్నాడు లక్ష్మణరావు. నేను ఆశ్చర్యపడి 'ఎందుకని?' అన్నట్లు క్వశ్చిన్ మార్కు ముఖం పెట్టాను.

'ఆ అబ్బాయి ఓ రాజకీయ నాయకుడి బావమరిది కొడుకు. డబ్బు, పలుకుబడి బాగా ఉన్నవాడు. ఊరకనే స్కాలర్‌షిప్ ఇస్తున్నారని కాలక్షేపం కోసం ఇంజనీరింగ్‌లో చేరాడు. నిత్యం బైకుపై షికార్లు చేయడం, అమ్మాయిల వెంట పడడం తప్ప మరో పని లేదు' అన్నాడు లక్ష్మణరావు.

'కాలేజీల్లో వ్యాపించిన 'ప్రేమ' అనే ఈ అంటువ్యాధికి సరైన మందు లేదు, అమ్మాయిని ధైర్యంగా నిలబడమని ముందుగా చదువు పూర్తి చేయమను. ప్రేమా గీమా అంటే చదువు మాన్పిస్తామని రేఖకు, ఆమె స్నేహితురాళ్లకు గట్టిగా చెప్పు. ఇదే విషయాన్ని ఆ జులాయి వెధవకూ చెప్పు..' అని ఉచిత సలహా ఇచ్చాను. అయితే- సమస్యకు సరైన, శాశ్వతమైన పరిష్కారం మాత్రం చెప్పలేనందుకు బాధ పడ్డాను.

- మహాభాష్యం నరసింహారావు

మహమ్మారిలా నోటి క్యాన్సర్

పొగాకు, ధూమపానం కారణంగా ప్రపంచం మొత్తమ్మీద భారత్‌లోనే నోటి క్యాన్సర్ భీతిగొలిపే స్థాయికి చేరుకుంది. 86 శాతం నోటి క్యాన్సర్ కేసులు మన దేశంలోనే నమోదైనట్లు జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంస్థ తాజాగా ప్రకటించింది. ఏటా 75 నుంచి 80 వేల మంది కొత్తగా నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు తేల్చారు. పొగాకు నమలడం వల్ల అత్యధిక శాతం కేసులు నమోదవుతున్నాయి. నోటి క్యాన్సర్‌తో బాధ పడుతున్న వారిలో ధూమపానం వల్ల 14 శాతం మంది, పొగాకు నమలడం వల్ల 26 శాతం మంది ఉన్నారు. పొగాకు ఉత్పత్తుల వల్ల ఏటా 1.5 లక్షల మందికి క్యాన్సర్, 4.2 మిలియన్ల మందికి గుండె సంబంధ వ్యాధులు, 3.7 మిలియన్ల మందికి ఊపిరితిత్తుల వ్యాధులు ఏటా సోకుతున్నాయి. దీంతో నోటి క్యాన్సర్‌కు భారత్ నిలయంగా మారిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో 65 శాతం క్యాన్సర్ వ్యాధులకు పొగాకు కారణమవుతోంది. ఏటా 5.6 మిలియన్ల మంది క్యాన్సర్‌తో మృత్యువాత పడుతున్నారు. పొగాకు వాడడం అనూహ్యంగా పెరగడంతో నోటి క్యాన్సర్‌కు సంబంధించి ప్రపంచ సగటు కంటే- రెండు రెట్లు కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయి. 2008లో ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వల్ల 7.6 మిలియన్ల మంది మరణించారు. ఆసియా ప్రాంతంలోని పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా కనిపిస్తుండగా, మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. కాగా, పొగాకు కారణంగా విజృంభిస్తున్న వ్యాధుల నివారణకు మన ప్రభుత్వం ఏటా 300 బిలియన్ల రూపాయలను ఖర్చు చేస్తున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడడం లేదు. పొగాకు కారణంగా మన దేశంలో రోజుకు సుమారు 2,500 మంది మరణిస్తున్నారని పలు ఆరోగ్య సంస్థలు ప్రచారం చేస్తున్నప్పటికీ ఫలితం కానరావడం లేదు. ■

జైల్లో కోడి పందాలు!

కోడి పందాలు ఆడేవాళ్లని తీసుకుపోయి సెల్‌లో పడేస్తారు పోలీసులు. కానీ, జైలు గదిలోనే కోడిపందాలు ఆడేవారిని తీసుకుపోయి ఎక్కడ పడేయాలి? ఈ సమస్య ఎదురైంది మెక్సీకన్ పోలీసులకి. మన దేశంలోని చాలా జైళ్లలో మాఫియా ప్రభావంతో ఖైదీలకు సెల్‌ఫోన్లు, గంజాయి, బ్రాందీ, విస్కీ సీసాలూ వగైరా దొరుకుతాయ్ గానీ కోడి పుంజులు దొరికినట్లు ఇంతవరకు రిపోర్టు రాలేదు. మెక్సికో పోలీసులు ఇదే ఆశతో చెట్యుమాల్ నగరంలోని పెద్ద జైలులో దాడులు చేశారు. వాళ్లకి ఆయుధాలు, మత్తు ద్రవ్యాలు, కండోమ్‌లు దొరకలేదు గానీ, ఓ 'సెల్'లో 'మొసలి' ఒకటి దొరికింది. ఇంకా పోలీసులు అక్కడ గాలించగా 28 కోడి పుంజులు దొరికాయి. 'కొక్కొరోకో' మంటూ

నృత్య సరళిలో అటూ, ఇటూ అవి తిరుగాడటంతో- ఖైదీలను నాలుగు పీకి మరీ- ''ఇవెక్కణ్నించిరా, వచ్చాయ్?'' అని అడిగితే- ''సరదాకి బాస్! కోడి పందాలు ఆడుదామని తెప్పించుకున్నాం! మరేటి తోచుద్దేటి?'' అన్నారుట. ''సరే! ఈ మొసలి దేనికి ?''అంటే- ''ఓ! అదా? అది మా 'పెట్'! మా ఫ్రెండ్, మాతో ఆటలాడుద్ది'' అన్నరుట 'గుండెలు తీసిన బంటులు'-లాంటి ఆ ఖైదీలు. మొసలిని బైటికి తరిమేశారు పోలీసులు. కానీ అది జైలు లోపలికి ఎలా వచ్చిందో? వాళ్లకి తలలు బ్రద్దలుకొట్టుకున్నా అర్థంకాలేదు. జైలు గోడల ఇవతల ఓ మాయాప్రపంచం వున్నట్లే- జైలు గోడల మధ్య మరో వింత ప్రపంచం వుంటుంది బ్రదర్!

బ్లాక్‌మెయిల్ చేసే వైరస్!

జర్మనీలో ఓ కొత్త రకం బెడద వచ్చిపడింది. ఇంట్లో కంప్యూటర్ డెస్క్‌టాప్ మీదికి- సిస్టమ్ తెరవంగానే ''ఈ కంప్యూటర్ మీద మీరు, పిల్లలు అసభ్య, అశ్లీ, నిషిద్ధ చిత్రాలను చూస్తున్నారు'' అంటూ ఓ బొమ్మని చూపెడుతోంది. ఈ అపరాధానికి రుసుము- నూరు 'యూరో'లు అంటూ, అది కంప్యూటర్‌ని ''లాక్ చేసేస్తుంది''- అంటే సిస్టమ్ కదలదన్నమాట. ''ఇదెక్కడి దారుణం?''అంటూ చాలామంది పోలీసుల్ని శరణుజొచ్చారు. ''మీ కంప్యూటర్‌ని ఈ మాయ వైరస్‌నుంచి ఏదేనా ఏంటీ వైరస్ ప్రోగ్రామ్‌తో కాపాడుకోండి''అని సెక్యూరిటీల మీద-కంప్యూటర్ల తీరుమీద- రీసెర్చి చేసే- రిక్ ఫెర్గూసన్- 'ఈ 'చిత్రం' గురించి మొదటిసారి వినడం''-అన్నాడు. జర్మన్ కాపీరైటు యాక్ట్ అధికారుల తరపున- జర్మనీ అంతర్ పరిరక్షక సంస్థవారు ఈ 'బ్లాక్‌మెయిల్' సొమ్ము వసూలు చేస్తున్నారన్నమాట! జాగ్రత్త! మీ డెస్క్‌టాప్ మీదికి 'పాప్‌అప్స్' రాగలవు. దీనికి విరుగుడు యాంటీ వైరస్ కూడా వస్తుంది లెండి!

veeraji@sify.com

సబ్బు నురగలపై 'రంగుల ప్రపంచం'!

వంట పాత్రలను శుభ్రం చేయడం ఎవరికైనా విసుగొచ్చే పనే. ప్రతి నిత్యం 'రొటీన్'గా సాగిపోయే ఈ పనిలో కష్టం తప్ప కొత్తదనం ఏముంటుంది? అయితే- 58 ఏళ్ల జానెథామస్‌కు మాత్రం వంట పాత్రలను సబ్బు నురగతో శుభ్రం చేయడమంటే ఎంతో సరదా. కళాత్మకత, సృజనాత్మకత ఉంటే ఎలాంటి పనిలోనైనా అద్భుతాలు ఆవిష్కరించవచ్చని ఈమె నిరూపిస్తోంది.

బ్రిటన్‌లోని ఈస్ట్ ఐరిషైర్‌లో కిల్మార్నక్‌కు చెందిన ఈమెకు ఫొటోగ్రఫీ అంటే ఎనలేని మమకారం. ఈమె సబ్బు నురగలపై కెమెరా గురిపెట్టి 'ఇంద్రధనుస్సు'లను ఆవిష్కరిస్తుంది. మామూలుగా అయితే వంట పాత్రలను తోమినపుడు సబ్బు నురగను ఎవరమూ పట్టించుకోం. ఆ నురగల్లో 'రంగుల ప్రపంచాన్ని' పట్టుకుని అద్భుతమైన ఫొటోలు తీస్తూ జానె అందరినీ అబ్బుర పరుస్తోంది. సబ్బు నురగల్లో రంగురంగుల దృశ్యాలను ఫొటోల రూపంలో భద్రపరిచేందుకు ఈమె అధునాతన లెన్స్‌ల కెమెరా, చేతిలో రిమోట్, ఫ్లాష్‌కు బదులు వెలుగునిచ్చే చిన్న దీపాలను వాడుతుంది. సబ్బు నురగల్ని దగ్గర నుంచి తదేకంగా పరిశీలిస్తే ఎన్నెన్నో రంగులు, వింత వింత ఆకారాలు కనిపిస్తుంటాయని ఈమె చెబుతోంది. వినూత్న రంగుల్లో విభిన్న దృశ్యాలను కెమెరాలో బంధించడం వింత అనుభూతి కలిగిస్తుందని ఈమె అంటోంది. సాధారణ విషయాల్లో అసాధారణ దృశ్యాలు దాగి ఉంటాయని భావించే ఈమె ప్రకృతిని, పరిసరాలను నిత్యం గమనిస్తుంటుంది.

వివిధ రకాల సబ్బు నురగల్లో విభిన్న రంగులు,వింత దృశ్యాలను నిశితంగా పరిశీలిస్తే ఎవరైనా చూడవచ్చని జానె చెబుతోంది. దీపం నుంచి వచ్చే వెలుతురు పడే తీరును బట్టి సబ్బు నురగలపై రంగులు, దృశ్యాలు ఏర్పడుతుంటాయని ఈమె వివరిస్తోంది. సబ్బు నురగ చిక్కగా ఉన్నపుడు, పలచగా ఉన్నపుడు రకరకాలుగా నురగలు ఏర్పడి అద్భుత దృశ్యాలు కనిపిస్తుంటాయని ఈమె వివరిస్తోంది. పలు రకాల షాంపూలతో ఏర్పడే నురగల నుంచి కూడా అద్భుత దృశ్యాలను సృష్టించడం జానెకు అలవాటు. ●

'కార్పొరేట్' పీఠాలపై మహిళలు తక్కువే..

అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన అవకాశాలు దక్కుతున్నాయని మన పాలకులు ఎంతగా గొప్పలు చెబుతున్నా, కార్పొరేట్ సంస్థల్లో మాత్రం కీలక స్థానాల్లో స్త్రీల సంఖ్య తక్కువగానే ఉంటోంది. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ సంస్థల్లో మహిళలు కీలక స్థానాల్లో ఉన్నది కొద్ది శాతమే అయినప్పటికీ, మన దేశంలో ఈ పరిస్థితి ఇంకా తక్కువ స్థాయిలోనే ఉందని తాజా అధ్యయనంలో తేటతెల్లమైంది. కార్పొరేట్ కార్యాలయాల్లో, బహుళ జాతి సంస్థల్లో ఇంకా పురుషుల ఆధిపత్యం నిరాటంకంగా కొనసాగుతోంది. భారతీయ కంపెనీల్లోని కీలక స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం 5 శాతాన్ని మించకపోవడం గమనార్హం. దేశంలోని 11 శాతం కార్పొరేట్ సంస్థలు మాత్రం తమ కార్యాలయాల్లో 30 శాతం మంది మహిళలు కీలక స్థానాల్లో ఉన్నట్లు చెబుతున్నాయి. మహిళలకు కీలక ఉద్యోగాలు ఇచ్చేందుకు తమకు ఎలాంటి ప్రతిబంధకాలు లేవని 64 శాతం కార్పొరేటు సంస్థలు చెబుతున్నాయి. అయితే, నియామకాల విషయంలో మాత్రం కీలక స్థానాలకు సంప్రదాయ బద్ధంగా పురుషులనే ఎంపిక చేయడం ఆనవాయితీగా మారుతోంది. కీలక పోస్టుల్లో నియామకాలకు లింగ వివక్ష అనాదిగా ఓ సమస్యగా మారుతోంది. ఈ విషయాన్ని పలు కార్పొరేటు సంస్థలు సైతం అంగీకరిస్తున్నాయి. మేనేజర్ స్థాయి పోస్టులకు మహిళల్ని ఎంపిక చేసి తాము 'రిస్క్'ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేమని 19 శాతం కార్పొరేట్ సంస్థలు అంటున్నాయి. ఇటీవలి కాలంలో వచ్చిన పరిణామాల ఫలితంగా నేడు కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ పాలకమండళ్లలో మహిళలను నియమించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కీలక పోస్టులకు అర్హులైన మహిళలను ఎంపిక చేయడం అంత సులభమేమీ కాదని కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు అంటున్నారు.

నాయకత్వ లక్షణాలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు కొంతమంది మహిళలు ఆసక్తి చూపడం లేదని 14 శాతం కార్పొరేట్ యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఇతరులతో తగినంతగా పరిచయాలు లేకపోవడం, పెట్టుబడుల్లో వెనుకబడి ఉండడం, సీనియర్ అధికారుల గురించి తెలుసుకోలేక పోవడం, వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొనలేక పోవడం వంటివి మహిళల పాలిట ప్రతిబంధకాలుగా మారాయన్న వ్యాఖ్యానాలు లేకపోలేదు. లింగ వివక్షతో పాటు అనాదిగా వస్తున్న విధానాల వల్ల చాలా సంస్థలు మహిళలకు కీలక బాధ్యతలను అప్పగించేందుకు జంకుతున్నాయి. అయితే, మహిళల్ని ఎంపిక చేసే పద్ధతుల్లో ఇంకా మార్పులు రావల్సి ఉందని కార్పొరేట్ నిపుణులు అంటున్నారు. ఈ విషయంలో కొన్ని బహుళ జాతి సంస్థలు ముందడుగు వేసి మహిళలను కీలక స్థానాలకు ఎంపిక చేస్తున్నాయి. మన దేశంలో చాలా ఐటి సంస్థల్లో మధ్య వయస్కులైన మహిళలు చాలా తక్కువ మంది కనిపిస్తుంటారు. అనుభవం-నైపుణ్యం వంటి విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ, 35 నుంచి 40 ఏళ్ల లోపు మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు కొన్ని ఐటి సంస్థలు ముందుకు వస్తున్నాయి. కనీసం పది శాతం కీలక స్థానాల్లో మహిళలను నియమించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రయత్నిస్తున్నట్లు ఆ సంస్థలు చెబుతున్నాయి. ■

దీక్షతో శిఖరాగ్రానికి..!

జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. కష్టాలు, కన్నీళ్ళతో ఎంతోమంది స్త్రీలు జీవనయానం సాగిస్తున్నారు. ఎంతో కొంత శ్రమించి, జీవితాన్ని మనకి నచ్చినట్లు మలచుకోలేమా? అని కొంతమంది మాత్రమే ఆలోచిస్తారు. సంకల్పబలం ఉంటే ఏదీ అసాధ్యం కాదని అహ్మదాబాద్‌కి చెందిన గంగాబెన్ వనియా నిరూపిస్తోంది. కూలిపనులు చేసే తల్లిదండ్రులు గంగాబెన్‌ని తొమ్మిదో తరగతి వరకు చదివించారు. చదువు ఆపేసిన వెంటనే పెళ్లి చేయడంతో గంగాబెన్ ఒక పాపకి తల్లి అయింది. కూలిపనులు చేసే ఈమె భర్త తాగుడుకి బానిసై, ఇంటికి రూపాయి కూడా ఇచ్చేవాడు కాదు. అలా నాలుగేళ్ల పాటు బాధలను ఓర్చుకుంటూ భర్త మారుతాడేమో? అని ఈమె ఎదురుచూసినా ఫలితం దక్కలేదు. దాంతో గంగాబెన్ పాపతోపాటు పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులకు భారం కాకూడదని భావించి కూలిపనికి వెళ్ళేది. ఆమెకి రోజుకి అరవై రూపాయలు ఇచ్చేవారు. కూలిపనులు చేస్తూనే మరోవైపు తాపీ మేస్త్రీ పనితనాన్ని ఈమె గమనిస్తుండేది. కొద్ది రోజుల్లోనే తాపీమేస్త్రీగా మారింది. దీంతో ఈమె రోజువారి ఆదాయం రెండు వందల రూపాయలకు చేరుకుంది. తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి, చేతివృత్తులలో శిక్షణ ఇచ్చే మహిళా హౌసింగ్ ట్రస్ట్ (ఎంహెచ్‌టి)లో చేరింది. ప్లాస్టరాఫ్ పారిస్, పెయింటింగ్, డిజైనింగ్ వంటి విభాగాలలో శిక్షణ తీసుకుని చక్కటి డిజైన్లలో ఇళ్ల నిర్మాణం చేస్తూ మంచి పేరు తెచ్చుకుంది. దీంతో ఈమె పేరు సమీప గ్రామాల్లోనూ వ్యాపించింది. ఆదాయాన్ని పొదుపు చేస్తూ తన కుమార్తెను చక్కగా చదివించుకుంటోంది గంగాబెన్. ఈమె కుమార్తె ఇప్పుడు డిగ్రీ చదువుతోంది.

గంగాబెన్ 2003లో గృహ నిర్మాణ రంగంలో కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తింది. మిగతా కాంట్రాక్టర్లలాగా మరీ అధిక మొత్తం కాకుండా తనకు కొద్దిగా లాభం ఉండేలా ఇళ్లు నిర్మించి ఇస్తూ అందరికీ చేరువైంది. ఈమె నైపుణ్యం, నలుగురికి ఉపయోగపడే తత్వాన్ని గమనించిన ఎంహెచ్‌టి సంస్థ ఇతర మహిళలకు తాపీ పనుల్లో శిక్షణ ఇచ్చేందుకు గంగాబెన్‌నే నియమించింది. ఒకరోజు శిక్షణ ఇస్తే రెండు వందల ఏభై రూపాయలను ఆ సంస్థ చెల్లిస్తోంది. గంగాబెన్ కూడా తనకి తెలిసిన విద్యను సులభ పద్ధతిలో బోధిస్తూ ఎంతోమంది అభాగ్యులు స్వతంత్రంగా బతికేందుకు చేయూతనిస్తోంది.

- దుర్గాప్రసాద్

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
గురువారం
7, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

ఘనుపై యేచి దశాసనుండు బలిమిం గైలాస శైలేంద్ర మె
త్తిన నద్దానవనాథు ద్రొక్క నతడర్థినణ మ్రొక్కినం గాచి ప్రా
క్తన శౌర్యాధికుచేసి దుష్టనణపంగా శిష్ట రక్షింప రం
జనతో నెప్పుడు వేచియుండు భవదాజ్ఞ శక్తి సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! పదితలల రావణాసురుడు విజృంభించి బలంతో కైలాస పర్వతాన్ని భుజంతో పైకి ఎత్తుగా ఈశ్వరుడు ఆ రాక్షసుణ్ణి త్రోక్కి వేశాడు. దాన్తో నిరహంకారుడై అతడు ప్రార్థించి శివునకు మొక్కగా మళ్లీ అతనికి పూర్వ శౌర్యం ఇచ్చినాడీశ్వరుడు. నీ ఆజ్ఞాశక్తి దుష్టుల్ని శిక్షించటానికి శిష్టుల్ని రక్షించటానికి ఎపుడూ సిద్ధంగా ఉంటుంది. ఎంతటి భక్తుడైనా అహంకరిస్తే వాని అహంకారాన్ని అతెంచి వేయగలవాడీశ్వరుడు. ఎలాంటి వాడైనా పశ్చాత్తాపంతో స్తుతిస్తేవాడికీ వరాలూ ఇవ్వగల స్వభావం ఈశ్వరునిది.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

7 **శ్రీ లత**

చిన్న చిన్న పూల రేకులు విచ్చుకుని లేలే తగా చుట్టుముట్టి మళ్లీ మొగ్గలా ముడుచుకుపోతే కలిగే మెత్తని ఒత్తిడిని ఒళ్ళంతా ఝల్లంతా పాకిన జలదరింత. ఆ రేకులు మళ్లీ విచ్చుకుని మళ్ళీ ముడుచుకుంటున్నప్పుడు పులకరింతలు ఒక దాని తరువాత ఒకటి శరీరాన్ని అల్లల్లా వ్యాపిస్తూ అణువణువునూ ఉత్తేజితం చేస్తూ ఆ తీపిని భరిం చలేక నర్స్ చేతిని వెనక్కి నెట్టి దిండుకు తల ఆన్చి వెనక్కి వాలింది. నైటికి బటన్స్ పెట్టుకుంది" అది జరక్కపోతే బావుండు అనుకుంది మనసులో.

''ఏమ్మా జీవన ఇలా మొండికేస్తే ఎలా? పాప ఫీడింగ్ మొదలెడితే కానీ పాలు ఉత్పన్నం కావు. లేలే ముందు పాలివ్వు, నువ్వు పూర్తిగా పాలిచ్చేవ రకూ నేనిక్కడే కూర్చుంటాను'' ఇంచుమించు గదిమినట్లుగా అంది.

వసంత నిస్సహాయంగా చూస్తుంది. వద్దన లేదు, ఇమ్మనలేదు. నిమిత్తమాత్రురాలయింది.

నర్స్ పాపను ఒళ్ళోకి ఇచ్చింది.

పెట్టుకున్న నైటీ బటన్ తీసింది. డాక్టర్ వైపు చూసింది.

డాక్టర్ పురమాయిస్తున్నట్లు చూసింది.

నర్స్ పాప పెదాలను దగ్గరకు తేగానే అలవా టయిన పాప అలాగా తడిమి పట్టుకుని చిన్ని చిన్ని పెదాలతో నిప్ చెయ్యసాగింది.

ప్రాణాలు తోడేస్తున్నట్లు నరాల్లో రక్తం అంతా ఒక్కచోట చేరుతున్నట్లు మెదడుకు మైకం కమ్ము తున్నట్లు, ఒళ్ళంతా చెమట పట్టి ఊపిరి బిగపట్టి బయట ప్రపంచంలో ఇంకేం జరుగుతుందో కూడా తెలీకుండా ఒళ్ళుమరిచి, పాప పెదాల్తో ఒత్తి నపుడల్లా కంపిస్తూ, వదిలినపుడల్లా ఊపిరిపీ లుస్తూ అదో జగత్తుగా అదో ఆస్వాదనగా, అదో మరో జన్మగా, అదో ప్రకృతి రహస్యంగా అదో విడవలేని స్వర్గంలా'' అచ్చంగా అలాగే ఉన్న ప్పుడు ఆ అనుభూతి ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసి నట్లు ఆగిపోయింది.

ఉలిక్కిపడి తత్తరగా కళ్ళు తెరిచింది.

నర్స్ పాపను వసంతకందించింది. ఏది జర క్కూడదో అది జరిపించి తన డ్యూటీ ముగించు కుని, జరగబోయేదానికి కర్తగా మారి.

''వెల్ జీవనా! కొందరు మొదటి కాన్పులో పిల్లలకు బ్రెస్ట్ ఇవ్వడానికి ఎంతో మొండికేస్తారు. నువ్వూ అలానే అనుకున్నాను. కానీ యూ ఆర్ వెరీ కోపరేటివ్ గళ్. ఆల్ ద బెస్ట్'' జీవనను చూసి నవ్వి పాప బుగ్గమీద చిటికేసి వెళ్లిపోయింది.

వసంత పాపను ఉయ్యాల్లో పడుకోబెట్టి వెనుదిరిగేసరికి జీవన వెక్కి వెక్కి ఏడుస్తుంది. వెక్కిళ్ళ శబ్దం కూడా బయటకు రాకుండా గుండె మాత్రం ఎగిసిపడుతూంది.

వసంత చటుక్కున జీవన దగ్గరికొచ్చి ''ఏం గుర్తొచ్చింది?'' అని అడక్కుండా అనునయానికి సిద్ధపడింది.

''ఏంట్రా! ఈ ఉద్వేగం ఏంటి? అసలు నువ్వి ప్పుడు ఏడవకూడదు. ఇప్పుడు తల నెప్పి వచ్చిం దంటే జీవితమంతా పోదు. కంట్రోల్ చేసుకో

అంది మెల్లగా.

అమ్మ గుండెలకు తల ఆన్చింది. కొద్ది కొద్దిగా వేదన తగ్గుతూ తగ్గుతూ కునుకు పట్టింది. అలాగే నిద్రలోకి జారిన జీవనను దిండు మీదకు చేర్చి పాప దగ్గరకు వెళ్ళింది వసంత.

తలుపు వేసిన చప్పుడుకు కళ్ళు తెరిచింది జీవన.

మెల్లగా జీవన ఊయల వైపుతల తిప్పి చూసింది.

రెండు అరచేతులూ పిడికిలి బిగించి కళ్ళు మూసుకుని చిరు పెదవులు మెత్తగా కదిలిస్తూ ఎవరో మహాముని పసిబిడ్డ ఆకృతిదాల్చి ఉయ్యాల్లో పడుకుని దీర్ఘ తపస్సులో మునిగి పోయి మనసులో మంత్రాలు ఉచ్ఛరిస్తుంటే ఆ గమకం పెదవుల్ని కదుపుతున్నట్లుంది.

''ఈ పాపను వదిలేయాలా? మా అమ్మ నన్ను వదిలేస్తుంది అని పాపకు తెలిస్తే ఏవం టుంది? వదిలేకయూడదని తపస్సు చేస్తుందా?''ఏం వరం కోసం తపస్సు చేస్తున్నావు పాపా? అడిగింది మెత్తగా.

ఆ పాప చెప్పను పొమ్మన్నట్లుగా నిర్లక్ష్యంగా ఉండిపోయింది.

పాపను ఒక్కసారి మళ్ళీ ఒక్కసారి ఒళ్ళోకి తీసుకోవాలనిపించింది. బలవంతంగా లేచి కూర్చుంది. అతి కష్టంమీద బెడ్‌మీద నుండి రెండు కాళ్ళూ జరిపి కింద మోపింది. లేచి నిలబ డడానికి సాధ్యం కాలేదు.

కుప్పగా రక్తం జారింది.

ఒక్కడుగు... ఒక్కడుగు వేస్తే పాప అందు తుంది. అతి కష్టంమీద ఒక్కడుగు నేలను రాస్తూ జరిపింది. లోలోపల ఏదో తెగినట్లుగా మంట... రెండు కండరాల మధ్య నరం తెగి మళ్లీ ఉప్పెనగా రక్తం.

జీవనకు అవేవీ బాధగా లేవు ఒక్కడుగు వేసి వంగి ఉయ్యాల్లో పాపనందుకుంది. అందుకునేట ప్పుడు లేలేత పాప చేతిలో ఇమడకుండా జారి పడబోయింది. గాభరాగా పాపను గుండెకు హత్తుకుని అలాగే రెండడుగులు వెనక్కి వేసింది.

మళ్లీ రక్తం కుప్పగా, తడిపేస్తూ అవేవీ పట్టించుకోలేదు జీవన.

వంగి గుండెలకానించుకున్న పాపవేపు చూసింది.

పాప అలాగే కళ్ళు మూసుకుని పిడికిళ్ళు బిగించి జరిగేదేమీ తెలియదన్నట్లుగా దీర్ఘ తప స్సులో ఉంది.

''దేనికోసం తపస్సు చేస్తున్నావు?'' అడి గింది జీవన మెత్తని పెదవులు పాప నుదుటికి అద్ది...

జీవన పెదవులు తాకగానే పాప తలతి ప్పుతూ జీవన మొహంలో పెదవులతో దేనికో సహా తడమసాగింది.

జీవనకు చెప్పకుండా అర్థం అయ్యింది.

''దొంగా'' అని నవ్వుతూ నైటీ బటన్స్ తీస్తుంటే దూరమయిన తల్లిపెదవులు స్పర్శకై పిడికిళ్ళతో గాల్లో వెతుకుతూంది పాప. ఆ పిడి కిళ్ళు గుండెలకి తాకి ధమరుకాన్ని మోదుతున్న మహాశక్తిలా అణువణువునూ నిద్రలేపి చను కట్టు గట్టిపరిచి, చనుకట్టుపై నరాల్ని ఉబ్బించి విపరీతమైన తీపి బాధను జీవన గురి చేసి తలను హారు చేసి మెదడును చిద్రం చేయసా గాయి. ఒళ్ళంతా చెమటలు పట్టి ఒక్కసారిగా మెదడు టెన్షన్‌కు గురై శరీరం రోమాంచితమై చెవు ల్లోంచి వేడి ఆవిరి సాగుతున్నట్లు ఒకటే వేడి.

''దీనికి పరిష్కారమొక్కటే... దీనికి పరిష్కార మొక్కటే! ఈ బాధను తగ్గించగల శక్తి బ్రహ్మకు కూడా లేదు. ప్రపంచ మేధావులవల్ల కాదు. ఎవరి వల్లా కాని ఈ బాధ చిన్నారి చిట్టి చిట్టి లేలేత పెద వుల వల్లే సాధ్యం'' అని జీవన మెదడుకు ప్రకృతి సందేశం అందింది.

-ఇంకావుంది

రంగనాథ రామాయణం

138

శ్రీపాద కృష్ణమూర్తి

ఆ సోదరుల వదనాలు, రదనాలు, వాలాలు, బాహువులు, అధరాలు, ఉదరాలు, ఊరువులు, పార్శ్వాలు, వక్షాలు, కాళ్లు, వ్రేళ్లు, చూపులు, వేషములు, భాషలు కని- ఇతను వాలి, ఇతను సుగ్రీవుడు అని ఏర్పరించడం అలవికాక అచ్చెరువంది శరం ప్రయోగిస్తే ఎవరు మరణిస్తారో అని బాణం ప్రయోగిం చక మిన్నకున్నాడు.

అంత సుగ్రీవుడు వాలి ముష్టిఘాతాలకి కడునొచ్చి, బలం నశించి, వాలికి భీతిల్లి దేహం అంతా గుల్ల తిత్తి అయి ''శ్రీరాముడిని ఎందుకు నమ్మాను చాలు. పదివేలుపచ్చె. వచ్చిన త్రోవ తొక్కక తప్పదు. వాలం మెడ పైన వేసుకొని, అలసి సొలసి, ప్రక్కలు చూస్తూ పరుగెత్తి వచ్చి ఋశ్యమూక పర్వతం ఎక్కాడు. ఆ అచలంపైన విలపిస్తూకూర్చు న్నాడు. అప్పుడు రామలక్ష్మణులు అక్కడకు చేరుకొన్నారు. సుగ్రీవుడు రాముణ్ణి కని తల వ్రేలాడ వేసుకొని ''రామప్రభూ! నిన్ను నమ్మి వాలిని మార్కొని అసమాన బలంతో పోరాడే నన్ను ఉపేక్షించావు. నన్ను రక్షింపలేకపో యావు. చూస్తూ మిన్నకున్నావు. ప్రసిద్ధి కాంచిన సూర్యవంశంలో జన్మించి ఇటువంటి అధర్మం చెయ్యడం నీకు తగునా? నీ సత్యం, నీలావు నమ్మి నేను వాలితో పోరాడాను. అంతే కాని ఆ వాలి ఎక్కడ? నేనెక్కడ? అతడితో ఆలం చెయ్యడం ఎక్కడ? ఈ రీతిగా బ్రతికి రావడం ఎక్కడ? ఏ భాగ్యంవల్లనో ఈ విధంగా ఈ పర్వతాగ్రాన్ని చేరగలిగాను. లేకుంటే బ్రతికి రావడం ఎక్కడ? నిన్ను విశ్వ సించడంవల్ల వైరిచే నాకు భంగపాటులు, నగు బాటులు తప్పలేదు'' అని నిట్టూర్చాడు.

అంత శ్రీరాముడు ''రవితనయా! సుగ్రీవా! నువ్వు ఆత్మలో ఈ అనుమానం పొందడం ఏమిటి? అక్కటా! నావల్ల తప్పు లేశమున్నూ లేదు. శత్రువుకి నిన్ను ఒప్పగిం చుతానా? ఒక్కమాట విను. విశ్వమోహన రూపులయిన అశ్వనీ దేవతల వైఖరి- నీకు, వాలికి రూప రేఖలు సమములై వేరు చేయ లేక బాణం ప్రయోగించ వెరచాను. నువ్వు ఇది కీడుగా ఎంచవద్దు. నా అస్త్రం అమోఘం. కనుక ఇప్పుడు ఈ గజ పుష్పమాల కంఠంలో తాల్చి కిష్కింధకు చని వాలితో యుద్ధం చేస్తూ వుండు. ఏ మాత్రం బెదరకు. సుంతయినా కొంకకు. నేను నేడు వాలిని నిశ్చయంగా సంహరిస్తాను'' అని ధైర్యం నూరిపోశాడు. లక్ష్మణుడిని పిలిచి గజ పుష్పమాల తెప్పించి సుగ్రీవుడి కంఠంలో అలంకరింపజేశాడు. ఆ మాలను ధరించిన సుగ్రీవుడు- చుక్కలు పెన గొన్న చంద్రుడా- బారులుతీరి ఎగిరే బలాకం తోడి సాయంకాలాకాశమా- అనే విధంగా మెరసిపోయాడు. శ్రీరాముడూ, తానూ, లక్ష్మ ణుడూ యుద్ధ సన్నద్ధులు అవుతూ నీల, నల, తార, హనుమంతులు ప్రక్కల కొలిచి రాగా, సుగ్రీవుణ్ణి తోడ్కొని, బహువిధ వనాలు, పద్మా కరాలు, ఆసక్తితో కనుగొంటూ చని చని అగ్ని మాడ్కి ప్రకాశించే సప్త జనాహ్వయులని పేరు మోసి ముసుల ఆశ్రమాలు వీక్షించారు. పిమ్మట సిరుల విలసిల్లే కిష్కింధ చేరి, వెను కటి మాదిరి వాలితో పోరు సల్పు. బల్లిదుడు అయిన వాలిని అవశ్యం తెగటారుస్తాను'' అని సుగ్రీవుడిని ప్రోత్సాహపరిచి పంపారు. రామ లక్ష్మణులు అక్కడ ఒక చెట్టు మాటున వున్నారు.

అంత సుగ్రీవుడు కిష్కింధ గుహలు పగిలే గతి ఘోషించి, తనతో ఘోర సమరం సల్పు వాలిని ఎలుగెత్తి పిలిచాడు. వాలి సుగ్రీ వుడి పెనుబొబ్బలు విని మిక్కిలి కుపితుడు అయాడు. వీడు మానక ఒక మగవాడివలె భుజశక్తితో పొంగుతూ వున్నాడు. ఇక వీడిని సైరించుట లగ్గు కాదు. ఈసారి సుగ్రీవుణ్ణి చంపివేస్తాను'' అని నిశ్చయించుకొన్నాడు.

తార సుగ్రీవుడితో పోరవద్దని వాలిని అడ్డగించుట

అతి సత్త్వసంపన్నుడు వాలి సుగ్రీవుడితో యుద్ధం చెయ్యడం కోసం బయలుదేరాడు. అప్పుడు వాలి సతి తార అతడిని కనుగొని ''దేవేంద్ర తనయా! ఏ ఆలోచన చేయక ఊరక సుగ్రీవుడిపైకి కయ్యానికి పోతున్నావు ఎందుకు? అతడు ఇంతకుముందే నీతో పోరి, చావు తప్పి పారిపోయాడు.

-ఇంకావుంది

గురువారం, 7 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ ద్వాదశి రా.06.56
నక్షత్రం: మూల ఉ.09.50
వర్జ్యం: ఉ.08.22 నుండి 09.50 వరకు
తిరిగి సా.06.49 నుండి 08.18 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** ఆరోగ్యం గూర్చి జాగ్రత్త పడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశ యాన ప్రయత్నాలు సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):** ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫల మవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తిక రంగా లేనందున మానసికాందోళన చెందు తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికా రులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. అన్నింటా జాగ్రత్తగా అవసరం.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలన మేర్పడే అవకా శాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎల ర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాస ముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభా లను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలి స్తాయి. సూక్ష్మవిషయాలను గ్రహిస్తారు.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవు తాయి. నూతన కార్యాలు ప్రారంభించుట మంచిదికాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచ నలను కలిగి వుంటారు. బంధు, మిత్రులు గౌర విస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకు టారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. ఉత్సాహంగా ఉంటారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. భయాందోళ నలు దూరమవుతాయి. కుటుంబంలో మన శ్శాంతి లోపిస్తుంది. బంధు, మిత్రులతో వైరమే ర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధ లనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశ ముంటుంది.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయా ణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి. విదేశయాన ప్రయ త్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.

మంచిమాట

దేహమే దేవాలయం

జీవుడే దేవుడు అను వేద ప్రమాణానుసారం సృష్టిలో ఉండే ప్రతి జీవి దేహం ఒక దేవాలయమే. ప్రతి జీవి కూడా పరబ్రహ్మమే అయితే ఇక్కడ మానవులు మినహా ఇతర ప్రాణులకు ఈ విషయం అనుభవంలోకి రాలేదు. ఎందుకంటే వాటికి పుట్టుక తోనే విచక్షణగా జ్ఞానం లేకుండా పుడతాయి. అదే బలహీనతను ఆసరా చేసుకొని మానవుడు ఇతర జీవులపట్ల తనకున్న విచక్షణాజ్ఞానాన్ని ఆసరా చేసుకుని మానవుడు తన స్వార్థం కోసం తన వశంలోకి తెచ్చుకొని ప్రయోజనాన్ని పొందుతున్నాడు. ఇదే విషయాన్ని శృతి జ్ఞానహీనః పశుభిస్సమానః అంటే జ్ఞానంలేని ప్రతి వ్యక్తి పశువుతో సమానమని అర్థం. ఇక్కడ జ్ఞానం అంటే ఏమిటని విచారిస్తే చతుర్వేదములనుండి గ్రహించబడిన నాలుగు మహా వాక్యములు అంటే- నాలుగు వేదాలసారం. 1.అహం బ్రహ్మర్షి= నేనే పరబ్రహ్మను, 2.అయమాత్మా బ్రహ్మ = నా ఆత్మయే బ్రహ్మ అంటే దేవుడు. 3.ప్రజ్ఞానం బ్రహ్మ = విశేషణమైన జ్ఞానమేది కలదో అదియే బ్రహ్మ. 4.తత్వ మసి=ఏదైతే దేవుడు పరబ్రహ్మము ఉన్నదో అది నీవే అయి ఉన్నావు? పై నాలుగు మహా వాక్యములు నీవే భగవంతుడవు అనే నగ్న సత్యాన్ని ముందుంచినా, సము ద్రము తలాపున ఉంచుకొని చేప నీళ్లకు ఏడ్చినట్లుగా, మనం జ్ఞాన స్వరూపులం అయి వుండి కూడా నాకు సుఖం లేదు, శాంతి లేదు అని బాధపడుతూ ఆ సుఖం శాంతిని పొందటానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా, మనం పొందే సుఖం పరావర్తన సుఖం అంటే మన నుండి ఉద్భవించిన సుఖం అదే జ్ఞానం. మనం మరచిపోయినం దువలననే ఒక్క మానవ జీవితానికే ఇంత బాధ్యత, తద్వారా ఇన్ని అనర్థాలు, బాధలు దుఃఖాలు, భయాలు కలుగుతున్నాయి.

ఇది అనుభూతిలోకి రావడానికి 1.వేద వాక్యముపై విశ్వాసముంచి తద్వారా ఆ ఆత్మీభూత స్థితి (మన సహజ స్థితి)లో ఉండుట. 2.శ్రుతి ప్రమాణాన్ని ఆచరించి అను భూతి పొందిన మహాత్ముల పాదాలు ఆశ్రయించడమే. పై మార్గములో ఒకటవ మార్గము కొంత ప్రయాసతో కూడుకొనినటువంటిది. రెండవ మార్గం చాలా సులభ మైన, సురక్షితమైన మార్గం. ఈ రెండవ మార్గాన్ని గూర్చి కొంత విచారణ అవసరం. అసలు మహాత్ములు, ఋషులు అంటే ఎవరు? సృష్టి ఆరంభంలో తొలుత దేహధా రణ చేసి తద్వారా ఈ ప్రపంచ రూప కల్పనకు మూలపురుషులు ఋషులే. అందుకే ఇది ఋషి పరంపర (వరుస) మనమంతా వారి సంతతి వారమే కావున, మన పేరున అర్చన చేసుకొనేటప్పుడు మన గోత్రం అడుగుతారు పూజారి. అప్పుడు మనం అంగీ రస మహాముని గోత్రం గౌతమ ఋషి గోత్రమని చెపుతుంటాం. అంటే ఇక్కడ మనం వాడే పేర్లు ఋషులవే. మానవ జాతి అంతా ఋషి సంతతే. ఇదే మన భార తీయ సంస్కృతి. శ్రుతి చెప్పినట్లు (వేదం చెప్పినట్లు) నడిచేవాడు మానవుడు. మతి చెప్పినట్లు నడిచేవాడు వానరుడు. మహర్షులు మంచిని ఆచరించి తన స్వార్థానికి కాకుండా, వారి జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసి లోక కళ్యాణ నిమిత్తం వారి జీవితాల్ని గడపడం మనం చూస్తూనే ఉన్నాం. వారు పొందే ఆనందాన్ని అందరూ పొందాలనేదే వారి కోరిక. అందుకే కాబోలు ప్రవచనాల ద్వారా హోమాల ద్వారా యాగాలద్వారా సంకీర్తనల ద్వారా నిస్వార్థ విగ్రహ ప్రతిష్ఠనల ద్వారా శాంతిని మనకు అందజేస్తున్నారు.

ఒక వ్యక్తి ఏ కులస్థుడైనా, మతస్థుడైనా ఉచ్ఛ జాతి వాడైనా లేక నీచ జాతివాడైనా అతనివద్దకు మనం వెళితే మనకు తెలియకుండానే మనం అతని వద్ద ఉన్నంతసేపు ఒత్తిడులనుండి విముక్తులమై శాంతంగా ఉండగలిగితే, అతను నిస్వార్థ జీవన విధా నావలంబుడై ఉంటే అతడే మహర్షి. మహాత్ముడు, సాధువు, భగవంతుడు. అలాంటి సాధువుల చేతులు మంచి పనులే చేస్తాయి. కాళ్లు లోక కళ్యాణ నిమిత్తమే నడు స్తాయి. కనుల ద్వారా చల్లని చూపు. ప్రతి జీవిని తనవలె చూచే ఉత్తమోత్తమ ఆలో చన వారి మనస్సులో నిరంతరం కదలాడుతుంది. ఇదే అసలైన మన భారతీయ సంస్కృతి. భారతీయులందరూ ఇలానే నడుచుకోవాలి.

-వులాపు బాలకేశవులు

వృతాసురుడు

16

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 9



మాటాట

ఆధ్దారాలు: అడ్డం
2. మిత్రుడు
4. అనవాలు
6. ఊపిరి
7. గుర్తుం పోటికి తగిలించేది
9. మందుడు
10. కాలం
12. కూర
13. వ్యాయామం

నిలువు
1. గుడిముందు తలలు
3. స్త్రీల కంటికి అందం
5. కుమార్తె
8. పండితుడు
9. చిత్రకారుని కుంచె
10.ఆపద
11. మామిడిచెట్టు

మాటాట - 8 సమాధానం

1 అ			2 ఎ	3 డు	ర	4 శ
5 స	మా	6 నం		న్న		లా
రా		7 మ	సం		8 ప	రి
		ని		9 పి		
10 అ	డ్డు		11 వ్వ	లు		12 గ
న్న		13 మ్మ		14 పు	త్త	డి
15 కిం	తు	నా	భం			యు



అత్యాచారాల నిరోధానికి ఆర్డినెన్స్..

పీడ విరగడయినట్టేనా?

ఢిల్లీలో వైద్య విద్యార్థినిపై ఆరుగురు దుండగులు సామూహికంగా అత్యాచారం జరిపిన సంఘటన దేశాన్ని ఒక కుదుపు కుదిపింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ అత్యాచార సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఒక విప్లవాన్ని సృష్టించింది. రాజ్యవ్యవస్థపైన ప్రజలు తిరుగుబాటు జెండా ఎగురవేశారా అనిపించేట్టుగా లక్షల మంది జనం రాష్ట్రపతి భవనం వైపు దూసుకువెళ్లారు. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వల్ల కొన్ని దేశాల్లో తిరుగుబాటు చెలరేగినట్టు అత్యాచారం ఘటనతో దేశ ప్రజల్లో తిరుగుబాటు వస్తుందా? అన్నంత తీవ్రత ప్రజల్లో కనిపించింది. ఢిల్లీలో అత్యాచారాలు నిత్యకృత్యమే కానీ ఈసారి జనం వాటిని సహించేది లేదని తిరగబడ్డారు. ప్రభుత్వం తీవ్రంగా స్పందించక తప్పని పరిస్థితి ఏర్పడింది. రోజు రోజుకు పెరిగిపోతున్న అత్యాచారాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని కోరుతూ కేంద్రం జస్టిస్ వర్మ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. పలు మహిళా సంఘాలతో, మేధావులతో, సంఘ సేవకులతో చర్చించిన తరువాత వర్మ కమిషన్ ఒక నివేదికను ఇచ్చింది. అత్యాచారాల నివారణకు తీవ్రస్థాయిలో చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని వర్మ కమిషన్ సూచించింది. అత్యాచారాల కేసుల్లో ఉరిశిక్ష విధించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. విచారణ పేరుతో కాలయాపన చేయడం, సాక్ష్యాలు లేవు అంటూ కేసులు కొట్టివేయడం కాదు తక్షణం ఉరితీయండి అని యువత ఉద్యమించింది. అయితే వర్మ కమిషన్ పలు తీవ్రమైన శిక్షలను సూచించినప్పటికీ ఉరి శిక్షను సమర్థించలేదు. అత్యాచారం వంటి సంఘటనలకు ఉరి శిక్షను వర్మ కమిటీ సిఫారసు చేయలేదు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒక అడుగు ముందుకు వేసి అత్యాచారం జరిపిన వారికి ఉరి శిక్ష విధించే విధంగా ఆర్డినెన్స్‌ను రూపొందించింది. ఈ ముసాయిదాకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. లైంగిక నేరాల ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి కూడా ఆమోదం తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో అధికారిక సమాచారం ప్రకారం 2009-11 మధ్య దేశంలో మొత్తం 68వేలకు పైగా అత్యాచార నేరాలు జరగగా, వాటిలో నేర నిరూపణ జరిగి శిక్ష పడింది కేవలం 16వేల కేసుల్లో మాత్రమే. విచారణలో అలసత్వం, సాక్ష్యాలు లేకపోవడం వంటి వివిధ కారణాలతో తప్పించుకునే కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. దాదాపుగా 20శాతం కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయి. నిజానికి అత్యాచారం జరిగిన ప్రతి సంఘటన నమోదు కావడం లేదు. కుటుంబ పరువుపోతుంది, అమ్మాయి భవిష్యత్తు నాశనం అవుతుంది, కేసులు ఎదుర్కోలేం అనే రకరకాల భయాలతో పోలీస్ స్టేషన్ వరకు వెళ్లరు. నమోదు అవుతున్న కేసులో తక్కువ అంటే వాటిలో శిక్షలు పడే కేసులు మరీ తక్కువ. వర్మ కమిషన్ పీటన్నింటిని పరిశీలించి పలు మార్పులు సూచించింది. ఢిల్లీ సంఘటనతో చలించిన సోనియాగాంధీ సైతం ఆర్డినెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అందుకే వర్మ కమిషన్ సిఫారసు చేయకపోయినా ప్రజల డిమాండ్ మేరకు అత్యాచారం కేసుల్లో ఉరి శిక్షకు సైతం కేంద్రం అంగీకరించింది. అత్యాచారం సంఘటనలో బాధితురాలు మరణిస్తే ఈ ఆర్డినెన్స్ ప్రకారం ఉరిశిక్ష విధించడానికి అవకాశం ఉంటుంది. ఉరిశిక్ష వంటి శిక్ష వల్ల అత్యాచారం జరిపినప్పుడు సాక్ష్యాలు లేకుండా చేయడానికి హత్య చేసే అవకాశం కూడా ఉందని, అలాంటి సమయంలో ఈ శిక్ష నిందితుల కన్నా బాధితులకు ఎక్కువ నష్టం కలిగిస్తుంది అనేది ఉరిశిక్షను వ్యతిరేకించిన వారి వాదన. అయితే మహిళలకు భద్రత లేకుండా పోతోంది ఉరిశిక్ష వంటి తీవ్రమైన శిక్ష ఉంటే తప్ప పరిస్థితిలో మార్పు రాదు అనేది దీనిని సమర్థించే వారి వాదన. మరోవైపు అనేక చట్టాల మాదిరిగానే ఈ ఆర్డినెన్స్‌ను సైతం దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని వాదించే వారు కొందరు. ఒక అత్యాచారం సంఘటన దేశాన్ని ఒక కుదుపు కుదపడమే కాకుండా ఏకంగా ఒక ఆర్డినెన్స్ రూపకల్పనకు దోహదం చేయడం విశేషం. అయితే ఈ చట్టంలోను కొన్ని లొసుగులు ఉన్నాయని కొందరు నిపుణులు విమర్శిస్తున్నారు. అదే విధంగా ఈ నెల 21 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండగా ఉభయ సభల్లో చర్చించి అందరి సలహాలను తీసుకుని చట్టాన్ని తీసుకువస్తే బాగుండేదని, హడావుడిగా ఆర్డినెన్స్‌ను తీసుకురావడం ఎందుకన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఈ చట్టం దేశ చరిత్రలోనే ఇది అరుదైన సంఘటన. చట్టాలతో మార్పు వస్తుందా? ఈ ఆర్డినెన్స్ మహిళలకు భద్రత కల్పిస్తుందా? సమస్యలు సృష్టిస్తుందా? అంటే కాలమే సమాధానం చెబుతుంది. కేవలం చట్టాలతో మార్పు రాదు, వాటితో పాటు ఆలోచనా విధానంలో మార్పు రావాలి. స్త్రీ పురుషులు సమానులు అనే భావన పెరిగే విధంగా విలువలతో కూడిన విద్య అవసరం.

ప్రజల్లో నమ్మకం పెంచాలి

సమాజంలో అనేక నేరాలు జరుగుతున్నాయి. కఠినమైన శిక్షలు లేకపోవడం తదితర కారణాల వల్ల నేరాలకు అంతులేకుండా పోతోంది. ప్రజల్లో నమ్మకం కలిగేలా నేరస్థులకు తగిన విధంగా శిక్షలు విధించాలి. నేరస్థుల పట్ల ప్రభుత్వం కానీ, సమాజం కానీ జాలి చూపాల్సిన అవసరం లేదు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను స్వాగతిస్తున్నాను. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ ఆర్డినెన్స్ వల్ల దేశవ్యాప్తంగా ప్రజల్లో నమ్మకం పెరిగింది. ఢిల్లీలో గ్యాంగ్‌రేప్‌కు గురైన 'నిర్భయ' కేసును దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో అలాంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకున్నది. ఈ సంఘటన తర్వాత వేగంగా కదిలిన కేంద్ర ప్రభుత్వం జస్టిస్ జె.ఎస్. వర్మ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కూడా బాగా పనిచేసి యుద్ధప్రాతిపదిక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర మంత్రి వర్గం అన్ని కోణాల్లో ఆలోచించి, సమగ్రమైన ఆర్డినెన్స్‌ను రూపొందించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించింది. రాష్ట్రపతి కూడా వెంటనే ఈ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలియచేయడంతో దేశప్రజల్లో ప్రభుత్వ చర్యల పట్ల నమ్మకం కుదిరింది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించేలా ఆర్డినెన్స్‌ను రూపొందించారు. అందుకే ఈ ఆర్డినెన్స్ పట్ల జాతీయ స్థాయిలో మంచి ఆదరణ లభించింది. ఈ ఆర్డినెన్స్‌తో నిర్భయ కేసులో నిందితులకు కఠినమైన శిక్ష పడుతుందనడంలో సందేహం లేదు. తీవ్రమైన నేరాలకు పాల్పడ్డవారికి ఉరిశిక్ష విధించకుండా, సాధారణ శిక్షలు మాత్రమే విధించేలా ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి భారత్ అంగీకరించలేదు. నేరాన్నిబట్టి తీవ్రమైన నేరాలకు పాల్పడ్డ నేరస్థులకు ఉరిశిక్ష విధించాల్సిందేనని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచానికి ఈ విషయాన్ని స్పష్టంగా తెలియచేసింది. నిర్భయ కేసులో నిందితులు ఉరిశిక్షకు అర్హులే. అదే దిశలో విచారణ జరుగుతోంది. క్రూరమైన నేరాలకు పాల్పడ్డవారికి వీలున్నంత ఎక్కువ శిక్ష పడాల్సిందే. ఆసిడ్ దాడుల కేసుల్లో కూడా ఈ సూత్రాన్నే వర్తింప చేయాలి. ఆసిడ్ దాడుల సంఘటనలను ఒకసారి పరిశీలిస్తే, దాడులకు పాల్పడ్డవారి మనస్సు ఎంతో కఠినంగా ఉంటుందని స్పష్టమవుతుంది. దాడికి గురైన మహిళలు, అమ్మాయిలు అనేక ఇక్కట్లకు గురవుతుంటారు. శారీరక మానసిక మార్పులు జరగడంతో సమాజంలో స్వేచ్ఛగా తిరగలేని స్థితికి చేరతారు. అమ్మాయిలు, మహిళలపట్ల క్రూరంగా ప్రవర్తించేవారిపట్ల శిక్షలు కూడా కఠినంగానే అమలు చేయాలి. అత్యాచారాలు వేర్వేరు రకాలుగా ఉంటాయి. సాధారణ అత్యాచారాలు, ఉద్దేశపూర్వకంగా చేసే అత్యాచారాలు, హింసకు గురిచేసి చేసే అత్యాచారాలు, అత్యాచారానికి పాల్పడి, సదరు మహిళను హత్య చేసే నేరస్థులు కూడా మన సమాజంలో ఉన్నారు. క్రూరమైన నేరాలకు పాల్పడేవారికి ఉరిశిక్షనే తగిన శిక్ష అనడంలో సందేహం లేదు. మహిళలపై అత్యాచారం, హింస తదితర నేరాలకు పాల్పడేవారిపై విచారణ చేసేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి. నేరం జరిగిన ఆరునెలల్లో శిక్షఖరారయ్యేలా వేగంగా విచారణ చేయాలి. విచారణ చేసే పోలీసు అధికారులు కూడా వేగంగా విచారణ జరపాలి. సాక్షులకు పూర్తి రక్షణ కల్పించాలి. సాక్షులకు అవసరమైతే రవాణా సౌకర్యం కల్పించాలి.

- జస్టిస్ బి. సుభాషణ్‌రెడ్డి, లోకాయుక్త, ఆంధ్రప్రదేశ్.

మహిళలకు రక్షణ కల్పిస్తాం

రాష్ట్రంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసింది. మహిళా రక్షణపై సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళల రక్షణ, అత్యాచారాలకు పాల్పడే నిందితులకు కఠిన చర్యలు పడేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన మహిళా రక్షణ ఆర్డినెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి చర్చించాం. మహిళా సంక్షేమ, న్యాయవిభాగం, పోలీసు విభాగం తదితర రంగాలకు చెందిన ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో తాజా ఆర్డినెన్స్‌పై ప్రాథమికంగా చర్చించాం. త్వరలోనే మరింత విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో ఇప్పటికే మహిళా సంక్షేమం, రక్షణలకు సంబంధించి చట్టాలున్నాయి. వీటిని సమర్థతగా అమలు చేస్తూనే కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ఏ విధంగా ఉపయోగించాలో, కేసులు ఏ విధంగా నమోదు చేయాలో చర్చించాం. మహిళల రక్షణకు రాష్ట్రం ఇప్పటికే అనేక చట్టాలు చేసింది. అత్యాచారాలకు గురైన మహిళలకు సహాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా రక్షణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాజధానిలోనూ, జిల్లా స్థాయిల్లోనూ సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. అత్యాచారాలకు పాల్పడుతున్నవారు, మహిళలపై హింసకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు ఇప్పటికే ఉన్న చట్టాలను పూర్తిగా ఉపయోగిస్తున్నాం. ఆసిడ్ దాడుల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నాం. కేసులు త్వరగా పరిష్కరించడంలో ప్రాక్టికల్‌గా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. పోలీసులు సకాలంలో కేసు నమోదు చేయకపోవడం, నిందితులను అరెస్ట్ చేయకపోవడం, చార్జీషీటు దాఖలు చేయడంలో జాప్యం జరగడం తదితర బలహీనతలు ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రస్తుతం గట్టిగా ప్రయత్నిస్తున్నాం. ఒకవైపు నిందితులకు శిక్షపడేలా చూస్తూ, మరోవైపు బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకారం ఇస్తున్నాం. ప్రత్యేక మహిళా పోలీసు స్టేషన్ల సంఖ్యను పెంచేందుకు, మహిళలపై జరిగే అత్యాచారాలు తదితర కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టుల సంఖ్య పెంచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ కోణంలోనే ఆలోచించి, అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మహిళా ఉద్యోగులు, మహిళాకార్మికులపై పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు ఉండకుండా ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. ఈ తరహా కేసుల విచారణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు అయ్యాయి. అయితే ఈ కమిటీల పనితీరు మరింత మెరుగుపరిచేందుకు ఇప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కమిటీల్లో అర్హులైన వారిని, మహిళ పట్ల గౌరవం ఉండేవారిని ఏరికోరి కమిటీల్లో నియమించేందుకు ప్రయత్నిస్తున్నాం. గృహహింస కేసులను పరిశీలించేందుకు ఆర్డీఓలను, మహిళా సంక్షేమం ప్రాజెక్ట్ డైరెక్టర్లను ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమించాం. ఈ వ్యవస్థలో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. హింసకు గురైన మహిళలకు ఆర్థికంగా చేయూత ఇవ్వడంతో పాటు ఇతరత్రా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. కౌమార బాలికల కోసం గర్ల్‌చైల్డ్ ప్రొటెక్షన్ స్కీం ప్రారంభించాం. చిన్నప్పటినుండే పిల్లల్లో నైతిక విలువలు పెంచేందుకు తల్లిదండ్రులు కూడా యత్నించాలి.

- చిరంజీవి చౌదరి, కమిషనర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సంక్షేమం.

చట్టాలు చేయడం కన్నా

అమలు ముఖ్యం

మహిళలపై లైంగిక హింసను అరికట్టేందుకు కేంద్రం తెచ్చిన ఆర్డినెన్సును స్వాగతిస్తున్నాను. మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలను నిరోధించేందుకు కేంద్రం ప్రస్తుతం ఉన్న చట్టానికి సవరణలు తీసుకురావడం సామాన్యమైన విషయం కాదు. కాని ఆర్డినెన్సులో ప్రతిపాదించినట్లుగా కొత్త చట్టంలో శిక్షలు ఎంత కఠినంగా ఉన్నాయనేదాని కంటే, దీనిని ఎలా అమలు చేస్తారనే అంశంపై దృష్టి సారించాలి. మహిళలపై జరిగే అన్ని రకాల లైంగిక నేరాలను నిర్వచించారు. జస్టిస్ వర్మ కమిషన్ చేసిన కీలకమైన సిఫార్సులను కేంద్రం ఆమోదించింది. పార్లమెంటు సమావేశాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఆర్డినెన్సు ఎందుకనే చర్చ అసంబద్ధం. ఎటూ పార్లమెంటులో దీనిపై చర్చ జరుగుతుంది. కొత్త చట్టాలను తొందరగా తీసుకురాకపోతే, ఎందుకు తీసుకురాలేదని, ఆర్డినెన్సు రూపంలో తెస్తే, పార్లమెంటులో చర్చించకుండానే ఎందుకు తొందరపడ్డారనే చర్చ అనవసరం. ఢిల్లీలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం భారతీయ సమాజాన్ని కదిలించింది. ఈ సందర్భంగా ప్రజల్లో వెల్లువెత్తిన నిరసనలను కేంద్రం పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన జస్టిస్ వర్మ కమిటీని నియమించి ఆర్డినెన్సును తెచ్చింది. కొన్ని దేశాల్లో కొన్ని లైంగిక నేరాలకు బెత్తెంతో కొడతారు. ఈ కేసుల విచారణ వెంటనే ముగుస్తుంది. బెత్తంతో కొట్టడం వల్ల ఆ మనిషి మృతి చెందడు. కాని రెండు నెలలు బాధపడతాడు. మళ్లీ అటువంటి నేరం చేయాలనే సంకల్పం రాదు. పైగా ఆ వ్యక్తి సామాజిక హోదాను కోల్పోతాడు. లైంగిక నేరాలను కొన్ని దేశాలు తీవ్రంగా భావించి ఇటువంటి శిక్షలు విధిస్తాయి. మన దేశంలో ఈ తరహా శిక్షలకు తావులేకపోయినా, కొత్త చట్టంలో వేధించడం, రహస్యంగా ఆడవాళ్లను చూడడం, చేతులతో సైగలు చేయడం, వెంటపడడం లాంటి నేరాలకు శిక్షలు కఠినంగానే ఉన్నాయి. ఈ తరహా కేసుల్లో చట్టాలు బలంగా ఉండడం కంటే త్వరితగతిన న్యాయస్థానాల్లో కేసు విచారణ జరిగి శిక్షలు పడాలి. ఒక్కరోజులోనే ఏ కేసు విచారణ పూర్తి కాదు. మహిళలపై అత్యాచారాలు చేసే దుండగులు రాత్రికి రాత్రి ఆ నేరాలు చేయరు. గతంలో నుండి ఈ నేరగాళ్లు అనేక చిన్న నేరాలు చేస్తుంటారు. అప్పుడే ఈ కోవకు చెందిన నేరగాళ్లపై చట్టాన్ని ప్రయోగిస్తే, పెద్దనేరాలను నిరోధించవచ్చు. హైదరాబాద్‌లో కార్ల అద్దాలకు నలుపు కవర్లు తొలగిస్తామని చెప్పి పోలీసులు కఠినంగా అమలు చేశారు. దీనివల్ల సత్ఫలితాలు వచ్చాయి. లైంగిక నేరాలను నిరోధించేందుకు భద్రత పెంచాలి. మహిళా పోలీసులను పెద్ద సంఖ్యలో నియమించాలి. మహిళా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయాలి. సామాజిక పోలీసింగ్‌ను పటిష్టం చేయాలి. కేవలం చట్టాల వల్లనే నేరాలను అరికట్టలేం. సమాజంలో కూడా మహిళల జోలికి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయని, సభ్యత, సంస్కారంతో వ్యవహరించాలని, వెకిలి చేష్టలకు పాల్పడితే చట్టాలు ఊరుకోవనే అవగాహనను పెంపొందించాలి. త్వరితగతిన కేసుల విచారణ, శిక్షల ఖరారు వల్ల కచ్చితంగా సమాజంలో మంచి మార్పు వస్తుంది. చట్టరూపం దాల్చిన జస్టిస్ కమిటీ సిఫార్సులను అమలు చేయాల్సిన బాధ్యత రాజ్యాంగంలోని అన్ని వ్యవస్థలపై ఉంది.

- డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్
లోక్ సత్తా అధినేత, ఎమ్మెల్యే

విమర్శలు సరికాదు

అత్యాచారాలను నిరోధించేందుకు, కారకులైన దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆర్డినెన్స్‌ను స్వాగతిస్తున్నాను. ఇదేదో హడావుడిగా తయారు చేసిన ఆర్డినెన్స్ అనడం ఎంతమాత్రం సరికాదు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు పరిస్థితి ఏమైందో అందరికీ తెలిసిందే. గత 10 ఏళ్లకు పైగా ఆ బిల్లుకు మోక్షం లభించలేదు. అలసత్వం అయితే ఈ సమస్య కూడా చల్లబడిపోయి దీనికీ మహిళా బిల్లుకు పట్టిన గతే పడుతుంది. మైనర్ బాలికలు కూడా దారుణంగా అత్యాచారాలకు గురవుతున్న దుర్భర పరిస్థితులు మన సమాజంలో నెలకొన్నాయి. వీటిని అరికట్టేందుకు తప్పకుండా కఠిన చట్టం అవసరం. ముందైతే కేంద్రప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఆర్డినెన్స్‌ను తెచ్చింది. దీనికి అందరం సంతోషించాల్సిందే. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించే ఏ ప్రభుత్వమైనా ఇంత వేగంగా స్పందిస్తుంది. అయితే ఏదో చర్చ జరిగి, అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఆర్డినెన్స్ తీసుకువద్దామంటే అంత సమంజసం కాదని నా అభిప్రాయం. ఒకవేళ అవసరమైతే ఈ ఆర్డినెన్స్‌కు భవిష్యత్తులో మరిన్ని మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. అత్యాచారాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో మన అందరికీ తెలిసిందే, ఈ పరిస్థితిలో ఇంకా చర్చలు అంటే అర్థం లేదు. ముందైతే ఆర్డినెన్స్ అమల్లోకి వస్తే మహిళలకు కొంత భరోసా ఉంటుంది, నిందితులు కూడా భయపడతారు. ప్రస్తుత పరిస్థితిలో ఇది చాలా ఉపయోగమని భావిస్తున్నాను. మరో విషయం ఏమంటే అత్యాచారం కేసుల్లో అవసరమైతే మరణశిక్ష విధించాలన్న డిమాండ్ చాలా వర్గాల నుంచి వస్తోంది. దీనిని కూడా నేను స్వాగతిస్తున్నాను. అంత కఠిన శిక్షలు ఉన్నప్పుడే కొంత భయం ఏర్పడుతుంది. అత్యాచార నిందితులకు యావజ్జీవ శిక్ష వరకు అమలు చేసే విధంగా ఆర్డినెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దీనికి ముందు ముందు మరిన్ని మార్పులు చేర్పులు చేసుకునేందుకు వీలుంది. కాకపోతే శిక్షల విధింపు విషయంలో రేప్, గ్యాంగ్ రేప్, మైనర్ బాలికలపై అత్యాచారం, గర్భిణిలపై అత్యాచారం వంటి కేసులకు విడివిడిగా ఆర్డినెన్స్‌లో పేర్కొని ఉంటే బాగుండేది. ఎందుకంటే కొన్ని క్లాజ్‌లు సరిగ్గా లేకపోతే నిందితులు స్వల్ప శిక్షలు పడి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది. కేసు తీవ్రతను బట్టి శిక్షల విధింపు ఉంటే ఈ ఆర్డినెన్స్ మహిళలకు ఎంతో ఉపయోగం. ఏదైనా ఇంత త్వరగా అత్యాచారాల నిందితులకు శిక్షల విధింపు కోసం ఆర్డినెన్స్ అమల్లోకి రావడం అభినందించ దగ్గ విషయం. ఎంతో కొంత ముందుకెళ్లినందుకు అంతా హర్షించాల్సిందే.

- సౌమ్యా మిశ్రా, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్

శిక్షతోపాటు నివారణ

చర్యలు ముఖ్యం

మహిళలపై అత్యాచారాల కేసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం హడావుడిగా ఆర్డినెన్స్ జారీ చేసిందే తప్ప ఆలోచనతో ఆర్డినెన్స్ జారీ చేసినట్టు కనిపించడం లేదు. జస్టిస్ జెసి వర్మ చేసిన సిఫార్సులకు ఆర్డినెన్స్‌లో పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. నేరం జరిగాక నేరస్థులకు శిక్ష విధించడంపైనే ఆర్డినెన్స్ దృష్టి కేంద్రీకరించింది. ఈ ఆర్డినెన్స్‌లో మహిళల రక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి నిర్ణయాలు లేకపోవడం పెద్దలోటుగా చెప్పుకోవచ్చు. రేప్ వంటి దారుణాలకు పాల్పడే వారిని శిక్షించేందుకే కాదు, అలాంటి సంఘటనలను నివారించేందుకు కూడా సమగ్రమైన చట్టం ఉండాలి. ఇప్పటికే ఉన్న శిక్షలు పెంచడంలో చూపిన తపన నేర నివారణా చర్యలు తీసుకోవడంలో చూపించకపోవడం పెద్ద వెలితిగా పేర్కొనవచ్చు. ఢిల్లీలో గ్యాంగ్‌రేప్‌కు గురైన నిర్భయ కేసులో నిందితులను శిక్షించేందుకు ఈ ఆర్డినెన్స్ తీసుకువచ్చారా అంటే అదీ లేదు. నిర్భయ కేసు నిందితులకు కొత్త చట్టాలను వర్తింపచేసే అవకాశం లేదు. అత్యాచార నేరాలకు మరింత స్పష్టత నిర్వచించడం, ఇప్పటికన్నా కఠిన శిక్షలు వేయడం నేరచట్టాల సవరణ ఆర్డినెన్స్ 2013లో ప్రధానమైన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. అత్యాచారంతో పాటు బాధితురాలు జీవితాంతం అచేతనంగా జీవించే దుర్దశకు గురిచేసినా కనీసం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జీవించి ఉన్నంత కాలం జైల్లో ఉండే శిక్ష లేదా మరణ శిక్ష విధించేందుకు వీలుగా ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డ వారిలో ఒక్కొక్కరికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జీవితాంతం జైలు శిక్ష, బాధిత వ్యక్తికి పరిహారం చెల్లించే శిక్ష విధించవచ్చు. పోలీసు అధికారులు, సైనిక సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు లైంగిక అత్యాచారానికి పాల్పడితే కనీసం పదేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జీవితఖైదు విధించవచ్చు. మహిళలు తమపై అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చేస్తే, సదరు పోలీసులు అధికారులు కేసు నమోదు చేయకపోవడం కూడా నేరంగానే భావించేందుకు ఆర్డినెన్స్ అవకాశం కల్పించడం చెప్పుకోదగ్గ విశేషం. అలాంటి పోలీసు అధికారులకు ఏడాది జైలు లేదా జరిమానా లేదా రెండూ విధించేందుకు వీలుంది. ఆసిడ్ దాడి లేదా ఇతర హానికరమైన ద్రవాలతో దాడి చేసిన వారికి కనీసం పదేళ్ల జైలు, లేదా యావజ్జీవ శిక్ష, 10 లక్షల దాకా జరిమానా వేసి, ఆ జరిమానాను బాధితురాలికి అందించేందుకు వీలు కల్పించారు. ఆసిడ్ దాడికి పాల్పడ్డవారికి ఐదేళ్ల నుండి ఏడేళ్ల వరకు శిక్ష వేసేందుకు వీలు కల్పించారు. మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే విధించే శిక్షను రెండేళ్ల నుండి ఐదేళ్లకు పెంచారు. మహిళలను వేధిస్తే ఏడాది నుండి మూడేళ్ల వరకు శిక్ష, లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల కారాగార శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. మహిళను బహిరంగంగా వివస్త్రను చేసి అవమానిస్తే మూడేళ్ల నుండి ఏడేళ్ల వరకు శిక్ష, జరిమానా విధించవచ్చు. మహిళల ప్రైవేట్ చర్యలను చూడటం, చిత్రించడం కూడా నేరంగా పరిగణించి, మూడేళ్ల వరకు శిక్ష విధించవచ్చు. కిందిస్థాయి మహిళా ఉద్యోగులతో సంపర్కం జరిపితే ఐదేళ్ల వరకు శిక్ష విధించవచ్చని పేర్కొన్నారు. మహిళలు, మైనర్ బాలికలను అక్రమ రవాణా చేసినా పదేళ్ల నుండి జీవితాంతం జైలు శిక్ష విధించేందుకు వీలు కల్పించారు.

- మాడభూషి శ్రీధర్, న్యాయ నిపుణులు.

లొసుగులు లేకుంటే బాగుండేది

మహిళలపై లైంగిక హింసను అరికట్టేందుకు రూపొందించిన ఆర్డినెన్స్‌లో లొసుగులు ఉండటం వల్ల ఆశించిన లక్ష్యం నెరవేరదనే చెప్పవచ్చు. ఇంతకాలానికైనా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఆర్డినెన్స్ చట్టం కాకముందే సవరించే దిశగా యోచించాలని కోరుకుంటున్నాం. ఆ దిశగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి ప్రతిపక్ష పార్టీలు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ముందుకు రావాలి. ప్రధానంగా ఈ ఆర్డినెన్స్‌లో ఉన్న లొసుగు చిన్న దేమి కాదు, ప్రధానమైంది, కీలకమైందని కూడా భావిస్తున్నాం. అత్యాచారం జరగడం వల్ల అయితేనేమి, లైంగికంగా జరిగిన దాడి వల్ల అయితేనేమి పరిభాష ఏదైనా మహిళలపై జరిగిన హింసను హత్యాయత్నంగానే పరిగణించాలి. అయితే ప్రస్తుతం ఆర్డినెన్స్‌లో దీనికి సూత్రీకరణ వేరే విధంగా ఉంది. లైంగిక దాడికి గురైన బాధితురాలు మరణించినా లేక అచేతన స్థితిలో ఉంటేనే కఠిన శిక్షకు జస్టిస్ వర్మ సిఫారసు చేశారు. బాధితురాలు మరణించిన పక్షంలోనే దానిని తీవ్రమైన నేరంగా పరిగణించి మరణశిక్ష విధించవచ్చని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. లైంగిక దాడి లేక అత్యాచారంలో బాధితురాలు మరణించినా. అచేతనంగా ఉంటే ఒక రకమైన శిక్ష, అలాంటిది ఏమి లేకపోతే తేలికపాటి శిక్షలు ఉండాలని ఆర్డినెన్స్‌లో పరోక్షంగా పేర్కొన్నట్టే. అంటే ఇది ఒక రకంగా మహిళలపై అత్యాచారాలు చేసే వారికి తగిన జాగ్రత్తలను సూచించినట్టేనని భావించాలి. అంటే అత్యాచారం చేయవచ్చు, కానీ సదరు మహిళ మరణించడం కానీ, అచేతనస్థితికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోండని సూచించినట్టు అవుతుంది. అంటే ఆత్యచారం చేసినా ఫర్వాలేదు కానీ, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అంత కఠిన శిక్షలు ఏమి ఉండదని ప్రభుత్వమే పరోక్షంగా సూచించినట్టుగా ఆర్డినెన్స్‌లో పేర్కొనడం పెద్ద తప్పిదం. అత్యాచారానికి గురైన బాధితురాలు ఏ స్థితిలో ఉన్నా, నేరస్థునికి శిక్

కట్టిపడేసిన 'కన్యాశుల్కం'

ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పివిఆర్ బాలుర మైదానంలో ఎన్‌టిఆర్ కళా పరిషత్ 14వ వార్షికోత్సవాలు 16 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగాయి. అందులో భాగంగా 14 నాటకాలు, ఏడు నాటికలు, ఆరు పద్య నాటకాలు, ఐదు సంగీత నృత్య రూపకాలను ప్రదర్శించారు.

ప్రధానంగా మహాకవి గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకాన్ని కళా పరిషత్ ప్రత్యేక ప్రదర్శనగా ఏర్పాటు చేసింది. సినీనటులు రాళ్ళపల్లి, శ్రీ దీక్షిత్,

అల్లరి సుభాషిణి, మీనా, కళ్యాణ్, సోమాదిత్య, జివి నారాయణ, దీపక్ ప్రసాద్, ఎస్ఎం భాషా, హైమావతి, గిరీశం పాత్రధారిగా ఉత్తేజ్, మధురవాణిగా ఝాన్సీ నటించి అందరి మన్ననలను అందుకున్నారు. ప్రధానంగా ఆధునిక దృశ్యకావ్యంగా వర్ణిస్తున్న గురజాడ కన్యాశుల్కం నాటకరాజాన్ని ఆధునిక పద్ధతుల్లో (థియేటర్ -360)లో ప్రదర్శించారు. ఎనిమిది వేదికల మీద వివిధ సందర్భాల్లో సన్నివేశాలకు అనుగుణంగా ప్రదర్శన జరిగింది. నాటి ఒంటెద్దు బండిని కూడా నాటక ప్రదర్శనలో మమేకం చేసిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది.

కన్యాశుల్కం నాటికలో బాల్య వివాహాల రద్దు, వితంతు వివాహాలను ప్రోత్సహించటం, కళావంతులను

సంసారులుగా చేయటం, రాజకీయాల్లో మోసం చేసే పాత్ర, ఇంగ్లీష్‌మోజుపై ఉన్న పాత్రలు హైలైట్‌గా నిలిచాయి. ఈనాటి కలో 65 ఏళ్ల వృద్ధుడు వృద్ధుడు 12 ఏళ్ల అమ్మాయిని పెళ్ళి చేసుకునేందుకు గ్రామాలకు బయలుదేరతాడు. కాని ఆయన్ను ఆట పట్టించేందుకు ఒక అబ్బాయికి ఆడవేషం వేయించి పెళ్ళి చేయిస్తారు. తీరా పడక గదిలోకి వెళ్ళిన తరువాత ఆ అబ్బాయి వేషాన్ని మొత్తం తీసివేసి బయటకు వచ్చే సంఘటనలు కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ విషయంలో రాళ్ళపల్లి అందరినీ ఆకట్టుకున్నారు. రామప్పగారి పంతులు కోర్టుకు వచ్చేవారిని ఏవిధంగా పీడించి నగదు వసూలు చేసే విషయంపై దీక్షిత్ వ్యవహరించారు. కోర్టుకు వచ్చే కక్షిదారులను మభ్యపెడుతూ వారిని మోసం చేస్తుంటారు. ఈ సన్నివేశం కూడా ప్రేక్షకులను అలరించింది. అదేవిధంగా రాజకీయాల్లో ప్రజలను మోసం చేసే గిరీశం పాత్ర కూడా అందరినీ ఆకట్టుకుంది. గిరీశం లాంటి ఆషాడభూతులను కఠినంగా శిక్షించాలనే సన్నివేశం ప్రేక్షకులను అలరించింది.

ఎప్పటికప్పుడు రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చుకోవటం వంటి అంశాలపై ఉత్తేజ్ పాత్ర బాగుంది. 1897-96లో ఇంగ్లీష్ భాషపై మోజు ఎక్కువగా ఉండేది. దీంతో బ్రాహ్మణ కుటుంబంలోని వారు వేదవిద్యలను వదిలివేసి ఇంగ్లీషువైపు పరుగులు తీసే అంశాన్ని కూడా క్షుణ్ణంగా ప్రేక్షకులకు నటులు వివరించడంలో సఫలీకృతులయ్యారు.

ఎన్‌టిఆర్ కళాపరిషత్‌లో ఎన్‌టిఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రముఖ సినీనటుడు మాగంటి మురళీ మోహన్‌కు అందచేశారు. నీతి నిజాయితీలకు పట్టాభిషేకం పేరుతో 18 మందికి శ్రీభారతీయుడు పురస్కారాలను అందచేశారు. మొత్తంమీద 16రోజులపాటు జరిగిన కళాయజ్ఞం ఆద్యంతం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.

వైణిక సార్వభౌముడు.. చిట్టిబాబు

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పుష్య బహుళపంచమి రోజున త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలను సంగీత కళాకారులందరూ ఘనంగా జరుపుకున్నారు. ఇదే సందర్భంలో వీణ చిట్టిబాబును కూడా తల్చుకుని, ఆయనకు నీరాజనాలు అర్పించడం ఆనవాయితీ. చిట్టిబాబు ఏటా 'తిరువయ్యా ర్'కి వెళ్లి అక్కడ శ్రీ త్యాగరాజ స్వామి వారి సమాధి వద్ద జరిగే ఉత్సవాలలో వీణ వాయించి వచ్చేవారు. 1996 ఫిబ్రవరి 9వతేదీన కచేరీ చేసి వచ్చి తన స్వర యాత్రను ముగించారు. 59 ఏళ్ళ బ్రతికిన ఆయన, సుమారు 50 ఏళ్ళపాటు వీణా వాయిద్యం తోడిదే లోకంగా బ్రతికారు. దేశ, విదేశాలలో వేనవేల కచేరీలు చేశారు. హాంగ్‌కాంగ్‌లో జరిగిన 'ఆసియా సంగీతోత్సవాలలో' ఏకైక భారతీయ ప్రతినిధిగా హాజరైన గొప్పదనం ఆయనదే! అంతేకాదు, గురువుగారైన ఈమనిశంకర శాస్త్రిగారు జీవించి ఉండగానే 'కళాప్రపూర్ణ' బిరుదును పొందిన ఘనుడు ఆయన. దూరదర్శన్‌లో కళాకారులపై నిర్మించిన 'సాధన' అనే టెలీ సీరియల్‌లో ఒక భాగం చిట్టిబాబుపై చిత్రీకరించడం చెప్పుకోవలసిన అంశం!

చల్లపల్లిరంగారావుగారి గారాల పట్టి చిట్టిబాబు. ఆయన అసలు పేరు 'హనుమాన్లు'. తండ్రిగారు ఒకనాడు వీణ వాయిస్తూండగా (వర వీణా మృదు పాణీ అనే గీతం) అలా వాయించకూడదు అంటూ ఎలా వాయించాలో వాయించి చూపించాడట హనుమాన్! ఆడుకుంటూ ఆడుకుంటూ వచ్చి వాయించి తుర్రుమని వెళ్లిపోయాడట! అలవోకగా వాయించి చూపిన తన పుత్రుని ప్రతిభకు ముగ్ధుడైన రంగారావుగారు ప్రముఖ వైణికుడైన 'పట్రవాడ ఉప్పాకయ్య' వద్ద శిష్యునిగా చేర్చారట! అప్పుడు వారుండేది పిఠాపురంలో. ఆ తరువాత కాకినాడలో ఉండే ఇయ్యాని అప్పలాచార్యుల వద్ద చేర్చారు. 1948లో అంటే హనుమాన్లకు పట్టుమని పన్నెండేళ్ళైనా నిండక ముందే పిఠాపురంలో కచేరీచేసి ప్రముఖుల ప్రశంసలనందుకున్నాడు. తరువాత రంగారావుగారు తన కొడుకును మద్రాసుకు తీసుకువెళ్ళి ఈమని శంకర శాస్త్రిగారి వద్ద చేర్చారు!

మద్రాస్‌లో ఈమని శంకర శాస్త్రిగారి దగ్గర నేర్చుకుంటూ ఉండగానే సినిమా వారితో పరిచయం కలిగింది. భానుమతి తమ చిత్రం 'లైలామజ్ను'లో చిన్న వేషానికై ఒక అందమైన పిల్లవాడి కోసం చూస్తూండగా, హనుమాన్లుని చూడటం, తీసుకోవడం జరిగింది. ఇంత అందంగా ఉన్నాడు హనుమాన్లేమిటి? ఇంట్లో అందరూ పిలిచే ముద్దపేరును 'చిట్టిబాబు' పేరునే టైటిల్స్‌లో వేద్దాం అందట భానుమతి! అలా ఆ పేరే కాలక్రమేణా స్థిరపడిపోయింది! 19 50-60ల మధ్య చాలా సినిమా పాటలకు చిట్టిబాబు వీణ బిట్లను వాయించడం, అవెంతో పేరు పొందడం జరిగింది.

చిట్టిబాబు 1960లో తొలిసారిగా మద్రాసులోని ప్రసిద్ధ సభయైన 'కృష్ణగానసభ'లో తన కచేరీని వినిపించి, శ్రోతల మన్ననలు పొందారు. తరువాత ఎన్నో ఆహ్వానాలు, ఎన్నెన్నో కచేరీలు! ఒక దశలో ఆయన కచేరీకి టిక్కెట్లు కూడా దొరకని పరిస్థితి! ప్రజల్లో అంతటి ఆదరణ పొందిన ఆయనకు 1967లో మైసూర్ మహారాజుగారు 'వైణిక శిఖామణి' బిరుదునిచ్చి సత్కరించారు. తిరుపతి దేవస్థానం వారు 'సప్తగిరి సంగీత విద్వన్మణి' బిరుదునిచ్చి, ఆస్థాన విద్వాంసుడిగా కూడా చేశారు. కృష్ణగానసభవారు 'సంగీత చూడామణి' బిరుదును ప్రదానం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీవారు 'కళా ప్రపూర్ణ'ను (1964) కేంద్రనాటక సంగీత అకాడమీ అవార్డును ఇచ్చారు. ఇదిలా ఉండగా కంచి కామకోటి పీఠాధిపతివారి ద్వారా ఆస్థాన విద్వాంసులుగా నియమింపబడి సన్మానాన్ని అందుకున్నారు. 1993లో తమిళనాడు ప్రభుత్వం 'కలై మామణి' అనే అత్యుత్తమమైన బిరుదునిచ్చి సత్కరించింది. ఇంకా ఆయన 'వైణిక సార్వభౌమ, వీణాగాన ప్రవీణ, గంధర్వ కళానిధి, వైణిక సామ్రాట్, వైణికరత్న, తంత్రీ విలాస్, కళారత్న వంటి పురస్కారాలనందుకున్నారు. 'ఉన్నమ్‌పోల్ ఒరువన్, దిక్కట్ట పార్వతి, రాఘవ వైభవం' చిత్రాలకు సంగీతాన్ని సమకూర్చి అవార్డులు అందుకున్నారు.

ఇంతటి గొప్ప కళాకారుడు మన తెలుగువాడై, తమిళనాడువెళ్లి అక్కడి ప్రజల చేత నీరాజనాలందుకోవడం మనందరికీ గర్వకారణం! త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాల్లో చిట్టిబాబును గుర్తుచేసుకోవడం కళాకారులకు ముఖ్యంగా వీణాగాన ప్రవీణులకు, సాధకులకు సముచితం! సమంజసం!

-ఎం.నాగలక్ష్మి

అలరించిన నాట్య 'నిధి'

భారతీయ కళల్లో భరతనాట్యానిది విశిష్ట స్థానం. భగవదారాధనకు అంకితమైన ఒకనాటి ఈ నృత్య కళాకారిణులను అందుకే 'టెంపుల్ డ్యాన్సర్స్' అనేవారు. భరతనాట్యంలోని 'భ' అంటే భావం. 'ర' అంటే రాగం లేదా సంగీతం. తన అంటే తాళం. ఇక నాట్యం అంటే నృత్యం, అభినయం అని చెప్పవచ్చు. అటువంటి అద్వితీయ నాట్య ప్రక్రియను అలవోకగా ప్రదర్శించి ఆహూతుల చేత కరతాళ ధ్వనులందుకున్న కళాకారిణి జి.శ్రీనిధి (హైదరాబాద్). ఆమె తన అద్భుత నాట్య కౌశలంతో శుక్రవారం (జనవరి 25) విశాఖలో కళాభారతి ఆడిటోరియంలో హంసగమనియై అద్వితీయ రీతిలో నర్తించి సెహభాష్ అనిపించుకుంది. విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం 'నందికొల్లు' అంశంలో కైలాస విలాసంతో మొదలయింది. నందికేశ్వరుడు జతి శబ్దం పలుకుతుండగా, ఈశ్వరుడు తాండవం చేసే అంశాన్ని శ్రీనిధి అనితర సాధ్యమైన రీతిలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అడయార్ కె.లక్ష్మణ్ నృత్యరీతులను సమకూర్చారు. నృత్త నృత్యాంశాలను ప్రాముఖ్యం కలిగిన పదవర్ణాన్ని రెండవ అంశంగా ప్రదర్శించారు. 'చలమేల చేసావయ్యా చక్కని మా రంగయ్యా' అంటూ రంగనాథ స్వామి వర్ణనను శ్రీనిధి తననాట్య విన్యాసాలతో కళ్లకు కట్టింది. అలాగే శ్రీకృష్ణుని బాల్యాన్ని శ్రీనిధి తన నాట్య చమత్కారంతో ఆహూతుల ముందు

ఆవిష్కరించింది. 'నందనందన గోపాల'లో శ్రీకృష్ణుడు వెన్న దొంగిలించడం, శకటాసుర వధ వంటి అంశాలను అందియల రవళితో అభినయ ఝరితో అభినయించి చూపరుల చేత 'ఓహో' అనిపించుకుంది. అదేవిధంగా 'నవరస శ్లోకం', 'మయూర నృత్యం' వంటి అంశాలను అలవోకగా ప్రదర్శించి నాట్యంలో తనది అందె వేసిన చేయని నిరూపించుకుంది. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యుడు అవసరాల రుక్మాజీరావు నట్టువాంగం అందించగా, గాత్రం కె.సంగీత కళ, వేణువు యు.వెంకటేష్, వయొలిన్ ఎం.నీలాద్రిరావు, మృదంగం టి.ఎన్.చైతన్య, ఆహార్యం సుధ అందించిన కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

-డిపి

నాద యోగికి ఘన నివాళి

త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 150 మంది శాస్త్రీయ గాత్ర వాద్య సంగీత కళాకారులతో 'త్యాగరాజ ఆరాధనోత్సవాలు' గత నెల 31న కళాభారతిలో ప్రారంభమయ్యాయి. ముందుగా ముఖ్య అతిథి కాకినాడకు చెందిన గానకళ పత్రిక ప్రధాన సంపాదకుడు మునుగంటి శ్రీరామమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కచేరీలను ఏర్పాటుచేసిన ట్రస్టు సభ్యులను అభినందించారు.

ఆధ్యాత్మిక సాధనకు గురువైన నారదుని, సంగీత సాధనకు గురువైన త్యాగరాజ స్వామి ప్రాధాన్యతను తెలిపే 'గురువేల ఎటువంటి' కృతితో కచేరీ ప్రారంభమయింది.

కచేరీలలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ సంగీత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మండపాక శారద బృందం 'త్యాగరాజ నారదీయం' పేరిట చేసిన కచేరీ ప్రేక్షక శ్రోతల అభినందనలు అందుకుంది. ఈ కచేరీని శారద, లలితా చంద్రశేఖర్, డాక్టర్ ద్వారం వి.కె.జి.త్యాగరాజు, పారుపల్లి సత్యనారాయణ, వై.భావన, ఎం.శ్రీలతలో నిర్వహించగా వయొలిన్‌పై వేదవతి గణేష్, మృదంగంపై మండపాక నాగలక్ష్మి, ఘటంపై ఎం.సూర్యప్రసాదరావు వాద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ఆరాధన ట్రస్టు నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ పి.వి.సి.శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఇక కార్యక్రమంలో రెండవ రోజున త్యాగరాజ ఆరాధన మిన్నుంబింది. 'జగదానంద కారక' అంటూ 'కృతిరత్న పంచకం' త్యగరాజ ఆరాధనగా కొనసాగుతూ విచ్చేసిన ఆహూతులను పులకింపజేసింది. చిన్నా పెద్దా అంతా ఈ కార్యక్రమంలో సరిగమల సుస్వరాలు పలికించారు. ఈ సందర్భంగా కళాకారులు జగదానందకారక, గౌళ రాగంలో 'దుడుకుగా', ఆరభిలో 'సంధించేసే', వరాళిలో 'కనకన రుచిరా', శ్రీరాగంలో 'ఎందరో మహానుభావులు' కీర్తనలు పరవశింపజేశాయి. కళాకారులు ఐ.వి.ఎల్.శాస్త్రి, మృదంగ విద్వాంసుడు ముళ్లపూడి శ్రీరామమూర్తి, ఆలమూరి సుధారాణి, పంతుల రమ వంటి సంగీత కళాకారులు కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ట్రస్ట్ ట్రస్టీ జి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పి.వి.సి.శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఇక కార్యక్రమంలో మూడవ రోజు కచేరీలు ఉదయం తొమ్మిది గంటల నుండి మొదలై కళాభారతి ఆడిటోరియంలో సంగీత ఝరులు కురిపించాయి. నాటి కార్యక్రమం పదమూడు గంటలపాటు సాగి సుస్వరాల విందునందించింది. నాడు మొత్తం అరడజను కచేరీలు జరిగి సంగీత ప్రియుల దాహార్తి తీర్చింది.

డాక్టర్ వి.రామనరసింహం, కామేశ్వరి, ప్రభావతి, తేజస్విని, స్వప్నమాధురి, రోజారాణి, లక్ష్మి శ్రీనివాస్ మధురిమలొలికించారు. ఎ.సూర్యపాక బృందం వేణుగానంతో సమ్మోహితుల్ని చేసింది. ఇక కర్ణాటక సంప్రదాయ శాస్త్రీయ కృతి సౌరభాన్ని పంతుల గోపాలరావు ఆవిష్కరించారు. రఘు నాయక (హంసధ్వని), అనురాగము లేని (సరస్వతి), ఆరగింపవే (తోడి)కృతులు భక్తి తత్వాన్ని చాటి చెప్పాయి. కె.ఉదయలక్ష్మి 'బాగాయనయ్య' (చంద్రజ్యోతి), గుడివాడ జానకీ రమణ 'వాసుదేవయని' (కళ్యాణి), 'ఫణిపతసాయి' (ఝుంకార ధ్వని) కృతుల్ని ఆలపించారు. సీనియర్ కళాకారిణి జలజాక్షి శ్రీ నారద (కానడ) లాలీ లాలీ (కేదార) కీర్తనల్ని వినిపించారు. ద్వారం దుర్గాప్రసాద్ కమాన్ కదలికల్లో వయొలిన్ అద్భుతంగా పలికి ఆహూతుల మనసులు ఆనంద డోలికల్లో మునిగిపోయాయి. ట్రస్టు సభ్యులు జి.ఆర్.కె.ప్రసాద్ సారథ్యంలో డాక్టర్ పి.వి.సి.శర్మ, శ్రీపాద వెంకన్న వ్యాఖ్యానం అందించారు.

నాలుగవ రోజు వీణ, వయొలిన్, గాత్ర కచేరీలు మిన్నుంటాయి. శాస్త్రీయ సంగీత కళాకారులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ పంతుల రమ వయొలిన్‌పై కృతులను మధురంగా పలికించి ప్రేక్షక, శ్రోతలను పులకింపజేశారు. మృదంగ విద్వాంసుడు ముళ్లపూడి శ్రీరామమూర్తి తన ప్రతిభతో ఆకట్టుకున్నారు. కస్తూరి కమల దీప్తి అమృతమయంగా కృతులను ఆలపించారు. టి.పద్మిని తన వీణానాద పటిమను చూపారు. ఐ.లక్ష్మి వీణపై సహకరించారు. మండపాక సిహెచ్.సన్యాసిరావు వయొలిన్‌పై కృతులను రాకయుక్తంగా పలికించారు.

-దుర్గాప్రసాద్ సర్కార్

టీవీ మీడియాతో గుర్తింపు

ఒక సాధారణ విద్యార్థిగా, కాలేజీలో నాటకాలు, మైమ్ ప్రదర్శించే నాకు టివి మీడియా ద్వారా ఎంతో గుర్తింపు తెచ్చింది. మొగలిరేకులు సీరియల్‌లో ఈశ్వర్ పేరు తెలియనివారుండరు అనుకుంటున్నాను. ఆ క్యారెక్టర్‌లో నటించింది నేనే అని ఎంతో గర్వంగా, ఆనందంగా చెప్పుకుంటున్నాను అని నటుడు పవన్‌సాయి తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. చిన్నతనంనుండి నటనలో ఉత్సాహం వున్నా ఏనాడూ ఊహించని విధంగా అవకాశం నన్ను వరించింది. నేను వెస్లి కాలేజీ విద్యార్థిని. 2005 సంవత్సరంలో ఇంటర్‌మీడియెట్ చదువుతున్నపుడు అనుకోని విధంగా ఒక యాడ్ ఫిలింలో అవకాశం వచ్చింది. ఇక అప్పటినుండి నాలో కొత్త ఆశలు ప్రారంభమైనాయి. కాలేజీలో వన్ యాక్ట్ ప్లే, మైమ్, ఏకపాత్రాభినయంలు ప్రదర్శించాను. తోటి విద్యార్థులు, మిత్రులు నన్ను బాగా పొగిడారు. ఆ పొగడ్తలకు పొంగిపోయి వేషాల కోసం వేట ప్రారంభించాను. కొన్ని సందర్భాలలో తప్పనిసరియై నడుచుకుంటూ వెళ్లాను. అప్పట్లో ఒక డాక్యుమెంటరీ ఫిలిం చేసాను. ఆ తరువాత చక్రవాకం సీరియల్‌లో చిన్న అవకాశంవచ్చింది. 'ఎన్నో రోజులు తిరిగి తిరిగి ఎంతో కష్టపడితే ఇంత చిన్న అవకాశమా...' అని నిరుత్సాహపడలేదు. ఆ అవకాశం గోల్డెన్ ఛాన్స్‌గా భావించాను. ఒక సందర్భంలో నేను కూడా మోసపోయి డబ్బు ఖర్చు చేసి వేషం కోసం తిప్పలు పడి చేతులు కాల్చుకున్నాను. మనం అమాయకంగా వుంటే మనల్ని మోసం చెయ్యడానికి మన వెనకాలే కనపడకుండా తిరిగేవాళ్ళతో జాగ్రత్తగా వుండాలి అనుకున్నాను. ఆ తరుణంలో నాకు ధైర్యం చెప్పి నా అమాయకత్వాన్ని పోగొట్టి నాలో కొత్త చైతన్యాన్ని కలిగించింది నా భార్య మాధవి అని గర్వంగా చెప్పాడు పవన్ సాయి. నన్ను ప్రోత్సహించి నాలో కొత్త ఉత్తేజాన్ని కలిగించింది నా భార్య. 'అయ్యో.. చెప్పడం మర్చిపోయాను, మాది లవ్ మ్యారేజి..' అన్నాడు కొంత సిగ్గుపడుతూ. కాలేజీలో ఆమె నా జూనియర్. ఆ తరువాత 'తీరం' సీరియల్‌లో అవకాశం వచ్చింది. ప్రధాన పాత్ర విలన్‌గా నటించి కొంత పేరు సంపాదించుకున్నాను. అవకాశం వున్నప్పుడు మధ్య మధ్యలో నాటకాలు, టెలిఫింలు చేసాను. వేషాల కోసం మళ్లీ వేట ప్రారంభించాను. అప్పట్లో శ్రీకాంత్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'మొగలి రేకులు' సీరియల్ ఆఫీసుకు వెళ్ళాను. నా గురించి చెప్పుకొని ఫొటోలు ఇచ్చి అవకాశం వున్నప్పుడల్లా వాళ్ళ ఆఫీసుకు వెళ్తుండేవాడిని. ఒకరోజు శ్రీకాంత్ ప్రొడక్షన్స్ ఆఫీసు నుండి ఫోన్ వచ్చింది. ఆనందంతో ఎగిరి గంతులు వేసాను. ఎంతో ఆశపడి వెళ్తే నాక చిన్న క్యారెక్టర్ ఇచ్చారు. అయినా నేను నిరుత్సాహపడలేదు. ఆ కంపెనీలో ఆ చిన్న అవకాశమే మహద్భాగ్యంగా భావించాను.



సుమారు ఒక సంవత్సరం వేచి చూసాను. మళ్లీ ఆ ఆఫీసునుండి ఫోన్ వచ్చింది. ఏదో చిన్న క్యారెక్టర్ ఇస్తారు అనుకొని వెళ్ళాను. నా ఊహలు, ఆలోచనలు తారుమారైనాయి. సెల్వస్వామి కొడుకుగా ఈశ్వర్ పాత్ర ఇచ్చారు. ఆ రోజు నా జీవితంలో నిజమైన పండగ రోజు. ప్రతిరోజు షూటింగ్‌కి వెళ్తూ రాత్రికి ఇంట్లో టివిలో నా క్యారెక్టర్ చూసుకుంటూ ఎంతో సంతోషాన్ని పొందుతున్నాను. నేను నిరుత్సాహపడకుండా, పడిపోకుండా నన్ను ప్రోత్సహించిన మంజులా నాయుడుగారికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను. నటన అనే శిఖరాన్ని ఎక్కడానికి ప్రయత్నించి ఇప్పుడే మొదటి మెట్టు ఎక్కాను అని ఆనాడు అనుకున్నాను అని పవన్‌సాయి అన్నారు.

కాలగమనంలో రోజులు గడిచిపోతున్నాయి. మొగలి రేకులు సీరియల్ 1000 ఎపిసోడ్‌లు పూర్తి అయ్యింది. పెద్ద ఫంక్షన్ చేశారు. ఆ రోజు మంజులానాయుడు మేడమ్ నాకు ఫోన్ చేసి ఫంక్షన్‌కు రమ్మన్నారు. ఆ ఫంక్షన్‌లో ఎంతో సరదాగా మేడమ్‌తో సాటి నటీనటులతో ఎంజాయ్ చేశాను. మంజులా నాయుడుగారిని అర్థం చేసుకోవడం చాలా కష్టం అని ఆ రోజే నేను అనుకున్నాను. ఆమెలో కోపం కనిపించదు. ఎప్పుడూ నవ్వుతూ వుంటారు. అందరితోను సరదాగా మాట్లాడుతారు అని పవన్‌సాయి అన్నారు. ఆ తరువాత మధ్య మధ్యలో ఇతర చానల్స్‌లో కూడా అవకాశాలు వచ్చాయి. గత సంవత్సరం మాటివిలో సరదాల ఉగాది కార్యక్రమంలో పాల్గొన్నాను. మంచుపల్లకి, ఆకాశగంగ సీరియల్స్‌లో నటించాను. క్యారెక్టర్ చిన్నదైనా గుర్తింపు ఇచ్చాయి. ఇటీవల ఒక సినిమాలో హీరోగా అవకాశం వచ్చింది. 'ఫ్యూర్ లవ్' అనే సినిమాలో నన్ను హీరోగా సెలెక్ట్ చేసుకున్నారు. రాజు కుంపట్ల దర్శకత్వంలో తలకల రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తి అయ్యింది అని పవన్ సాయి చెప్పారు.

నాకు సినిమాలలో ఎన్ని అవకాశాలు వచ్చినా టివి మీడియాను మాత్రం వదలను. 'మొగలి రేకులు' సీరియల్‌తోపాటు మరొక అద్భుత అవకాశం 'ముద్దబిడ్డ' సీరియల్. ఈ సీరియల్ రథసారధి ప్రభాకర్ గారు ఫోన్ చేసి ఆఫీసుకు పిలిపించారు. అమాయకంగా వుండే కాశి పాత్ర చెయ్యమని అడిగారు. ఈ పాత్ర కూడా నా టాలెంట్ నిరూపించుకోవడానికి మంచి అవకాశం. ఈ సీరియల్‌లో అమాయకంగా వుండే పాత్ర మంచివాడిగా మారి గతం తెలుసుకొని రాజావాసిరెడ్డి పాత్రలో కనిపిస్తాను. ప్రస్తుతం ఈ సీరియల్ నా ఇమేజ్ పెంచింది. నా వ్యక్తిగతంగా ఆలోచిస్తే నాకు గేమ్స్ అంటే చాలా ఇష్టం. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ ఆడతాను. నేను ఏ పని చేస్తా నన్నా నా తల్లిదండ్రులు ఏనాడు నాకు అభ్యంతరం చెప్పలేదు. ఏ చానల్‌లో ఏ సీరియల్ చేసినా నాకు ప్రోత్సాహం లభించింది. ఇటీవల జీ తెలుగు చానల్ కుటుంబం అవార్డు లభించింది. నట సాగరంలో ప్రయాణిస్తున్న ఒక చిన్న నటుడిని. నన్ను ప్రోత్సహించిన మంజుల నాయుడుగారికి సర్వదా ఋణపడి వుంటాను. నన్ను ఒక కుటుంబ సభ్యుడిగా ధైర్యం చెప్పి ప్రోత్సహిస్తున్న సెల్వస్వామి పాత్రధారి రవివర్మకు, శంకర్ పాత్రధారి మధుసూదన్‌రావుకు, గోమతమ్మ పాత్రధారి శృతికి, మునెమ్మ పాత్రధారి నాగమణికి, డిజిపి ఆర్.కె.నాయుడు పాత్రలోను, మున్నా పాత్రలోను ద్విపాత్రాభినయం చేస్తున్న సాగర్‌కు, శ్రీకాంత్ ప్రొడక్షన్స్ యూనిట్‌లో అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు అన్నారు పవన్ సాయి. నేను సాధించుకున్న ఈ విజయాలన్నిటికి తెరవెనుక వుండి నన్ను ప్రోత్సహిస్తున్న నా ప్రేయసి, జీవిత భాగస్వామి, నా భార్య మాధవి. కళామతల్లి ముద్దుబిడ్డగా ఈ నట జీవన ప్రయాణంలో నేను పడిపోకుండా పట్టుకొని నటుడిగా నడిపిస్తున్న మహానుభావులు ఎందరో... అందరికీ నా మనస్సుమాంజలి అన్నారు పవన్ సాయి.

-కశ్యప

అంతలేదు! IV లో...

చెన్నై

ఆంధ్రభూమి
శుక్రవారం 8
ఫిబ్రవరి 2013

మాస్ కథల మూస బాటలో

మన సినిమా

ఇప్పుడు భారతీయ సినిమా చిత్రమైన జంక్షన్‌లో నిల్చుంది. ఎటు ప్రయాణిస్తే మంచిది, లేదా ఏ దారి పడితే లాభం, ఏ బాటలో నడిస్తే క్షేమం, అసలు కళావికాసం ముఖ్యమా, కాసులే అవసరమా? మప్పడం సులువు, తిప్పడం కష్టం అన్న రీతిగా, జనాలకు కోరి కోరి, మాస్ మసాలాలు రుచి చూపించిన ఫలితంగా, ఇవాళ చక్కెర కూడ చేదు అన్నట్లు పరిస్థితి తయారైంది. దీంతో మంచి సినిమాలు తీయాలనుకునే దర్శకులు రకరకాల సందేహాలతో కొట్టుమిట్టాడుతున్నారు. సినిమా ఆవిర్భావం కేవలం ఒక విధమైన కుతూహలంతో, ఉత్సాహంతో ప్రారంభమైంది. ఒక కొత్త ఆవిష్కరణ జనాలకు చూపాలన్న కోరిక తప్ప మరేమీ లేదు ఆనాడు. టాకీ నుంచి మూకీకి వచ్చే వరకు ఇదే తరహా. డేరా థియేటర్లు నడిపేటప్పుడు ఇదే ఆలోచన. ఖర్చుకు తగిన రాబడి వచ్చిందా లేదా అన్న ఆలోచన చాలా కనీస స్థాయిలో వుండేది. రాను రాను సినిమా నిర్మాణం ఊపందుకున్నాక, సహజంగానే అన్ని రంగాల్లో వచ్చిన ఆలోచనాధోరణి మార్పులే సినిమా రంగం లోనూ చోటు చేసుకున్నాయి. వ్యాపార విస్తరణ దిశగా సినిమా అడుగులు వేయడం ప్రారంభించింది. కేవలం వ్యక్తిగత వ్యాపారంగా వున్న సినిమా కాస్తా, పరిశ్రమగా మారడం ఊపందుకుంది. ఈ ప్రభావం సినిమాలపై పడి, రెండు విధాల సినిమాలుగా విభజన ప్రారంభమైంది. ఆర్ట్ ఫిలిం, కమర్షియల్ ఫిలిం అన్న గీతలు కనిపించాయి. సినిమాను ఇంకా కళావికాస సాధనంగా, జనచైతన్య కళగా భావించిన వారు అడపాదడపా ఆ తరహా సినిమాలను తీస్తూ వచ్చారు. వ్యాపారంగా భావించిన వారు ప్రేక్షక జనాన్ని తాత్కాలికంగానైనా రంజింపచేసి, దినసరి అలసటను పోగొట్టే సాధనంగానే చూసినవారు, ఆ తరహా సినిమాల వెంటే నడిచారు. చిత్రమేమిటంటే ప్రభుత్వాలు, అవార్డులు అన్నీ ఆఫ్‌బీట్ లేదా, ఆర్ట్ సినిమాలనే వరిస్తూ వచ్చాయి.

ఇలాంటి దశలో సినిమా నిర్మాణం రాను రాను ఖరీదైన వ్యవహారంగా మారిపోవడంతో, ఆర్ట్ సినిమాల నిర్మాణం తగ్గుముఖం పట్టింది. ఒక వేళ తీసినా, వీలయినంత తక్కువ బడ్జెట్‌లో తీసి, వాటిని ఏ ఫిలిం ఫెస్టివళ్లకో అవార్డుల కోసం పంపడం తప్ప, థియేటర్లలో విడుదల చేసే వ్యవహారం తగ్గుముఖం పట్టింది. అంటే ఇటువంటి సినిమాల సృజన కర్తలు, కేవలం తమ తపన తీర్చుకోవడానికి తప్ప, జనానికి చేరువ చేసే ఉద్దేశాన్ని మెల్ల మెల్లగా విరమించుకుంటూ వచ్చారు.

ఇంతలో మరో మార్పు వచ్చింది. పూర్తిగా ఆర్ట్ సినిమాలా కాకుండా, అలా అని మరీ వాణిజ్యపోకడలు పోకుండా, మధ్యే మార్గంగా సినిమాలు తీయడం. ఇవి కొంతవరకు విజయం సాధించాయి. సినిమా పట్ల ప్రేమ, తపన అదే సమయంలో సంస్కృతి, సమాజం, మానవ సంబంధాల పట్ల విలువ వున్న దర్శకులు, మూసలో కొట్టుకుపోకుండా ఇలాంటి సినిమాలు తీయడం ప్రారంభించారు. ఏడాదికి ఒకటి లేదా రెండు వంతున వచ్చిన ఇటువంటి సినిమాలను జనం ఫరవాలేదనే రేంజ్‌లో ఆదరించడం ప్రారంభించారు.

అయితే అదే సమయంలో సినిమా పరిశ్రమలో బోలెడు వ్యాపారాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. కార్పొరేట్ సంస్థలు రంగప్రవేశం చేసాయి. బ్యాంకులు రుణాలివ్వడం ప్రారంభించాయి. కేవలం సినిమా అతి కొద్ది మంది వ్యవహారంలా కాకుండా, మిగిలిన పారిశ్రామిక రంగంతో చెట్టాపట్టాలు వేసుకునే స్థాయికి విస్తరించింది. ఇటు ప్రకటనలు, అటు టీవీ, ఇవన్నీ సినిమాతో మమేకమయ్యాయి. థియేటర్లు కాస్తా మల్టీప్లెక్స్‌లుగా మారాయి. లక్షలు కోట్లయ్యాయి. సినిమా నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిపోయింది. టీవీ ఛానెల్స్, పైరసీ పోటును తట్టుకుని నిల్చోవడానికి సినిమా కొత్త పుంతలు తొక్కింది. పెట్టిన ఖర్చును వారం రోజుల్లో రాబట్టుకోవడానికి వీలయిన ఏ ఒక్క మార్గమూ విడిచిపెట్టలేదు. ఉరిమి ఉరిమి మంగళం మీద పడినట్లు, ఇదంతా ఆఫ్‌బీట్ లేదా ఆర్ట్ సినిమాల మీదకు వచ్చింది. ఈ తరహా సినిమాలు తీయాలన్నా, అసలు ఆ ఆలోచన చేయాలన్నా భయపడే పరిస్థితి ఏర్పడింది. మరోపక్క, బాలీవుడ్‌లో వంద కోట్ల వసూళ్లు, ప్రాంతీయ భాషల్లో దగ్గర దగ్గరా వంద కోట్ల కలెక్షన్లు సుసాధ్యమయ్యాయి. చిత్రమేమిటంటే సినిమా ప్రపంచం ముందుకు దూసుకుపోతుంటే, ప్రేక్షక జనం అభిరుచి మాత్రం వెనక్కు వెళ్తూంది. ఒక

ప్పుడు మంచి సినిమాలను ఆదరించిన జనం, మాస్ మసాలా సినిమాలను మాత్రమే ఆదరించడం ప్రారంభించారు. దబాంగ్, బిజినెస్‌మాన్ లాంటి, తాత్కాలిక రంజక సాధకాలే జనానికి పడుతున్నాయి.

ఈ పరిస్థితి ఇలా వున్నా, సినిమాను ప్రేమించే దర్శకులకు మాత్రం ఇంకా తపన తీరకపోగా, మరింత పెరుగుతోంది. తాము అనుకున్న విషయాలను అనుకున్నట్లు, అద్భుత దృశ్య మాధ్యమాలుగా చిత్రీకరించడంలో అస్సలు రాజీ పడకూడదన్న కోరిక వారిలో బలమవుతోంది. జనాలు రెండున్నర గంటలు కూర్చుని, జీవిత వాస్తవాలను యథావిధిగా చిత్రీకరిస్తే చూడగలరా అన్న సందేహం లేకుండా నమ్మిన బాటలో వెళ్లి అభాసవుతున్నారు. విశ్వనాథ్ 'స్వరసంకల్పం', 'శుభప్రదం' మణిరత్నం 'కడలి' ఇలా ఎన్నో...ఇలాంటి వన్నీ అలాంటి సంకల్ప సంభవాలే. ఇవన్నీ జనానికి నచ్చలేదు. నచ్చుతాయని అనుకునే వారు తీసారు. నచ్చే అవకాశం వుండేది. కానీ తీయడంలో వారు రాజీపడలేదు. గతంలో కన్నా మరింత సహజంగా తీయాలనుకున్నారు. తమ మేధస్సు, ఆలోచనాపరిధి పెరిగిన మేరకు సినిమాను, కథకు దృశ్యరూపంగా తీయాలనుకున్నారు తప్ప, దాన్ని ప్రేక్షకుల దారిలోకి మళ్లించడానికి ఇష్టం వచ్చినట్లు, కుదించి, ఇరికించి, బిగించాలని అనుకోలేదు. కానీ ఇప్పుడు జనం ఆ దిశగా ఆలోచించే స్థితిలో కానీ, స్క్రీన్‌పై జీవితం యథావిధిగా పరుచుకున్న తీరును ఆస్వాదించే స్థితిలో కానీ లేరు.

ఇప్పుడు దర్శకులు రాజీ అన్నా పడాలి. తీయడమన్నా మానేయాలి. ఇక భారతీయ సినిమా తెరపై ప్రయోగాలు చేసే పరిస్థితి లేదు. నాటక రంగం దిగాలు పడింది. సినిమాపై కూడా డ్రామాలు, మెలోడ్రామాలు మాయమయ్యాయి. ఇక మరే కళా సాధనం వుంది ఆదుకోవడానికి? కళాతపస్సు చేసే వారి ఆర్తి తీర్చడానికి?

- సాహితి

యు దేర్ యు దేర్...

ఈవారం రెండు సినిమాలు విడుదలయ్యాయి. మణిరత్నం 'కడలి', బొమ్మరిల్లు భాస్కర్ 'ఒంగోలు గిత్త'. రెండు సినిమాలు ప్రేక్షకులను పూర్తిగా నిరాశపర్చాయి. దీంతో పండగ హడావుడి సద్దుమణిగిన నేపథ్యంలో బాక్సాఫీసు మరోసారి ఊపందుకుంటుందని అనుకుంటే, డీలా పడినట్లయింది. గడచిన వారాల్లో విడుదలైన సినిమాలన్నీ కూడా సోసోగానే మిగిలాయి. సంక్రాంతి సినిమాలు 'నాయక్', 'సీ.వా.సి.చె' ఇంకా వీలయినన్ని థియేటర్లను అంటిపెట్టుకునే వున్నాయి. రెండింటిలో సీ.వా.సి.చె కలెక్షన్లు బెటర్.

రివ్యూలు
II, III లో

జోడీ అదిరింది

బిజినెస్‌మన్ సినిమా ఆడియో ఫంక్షన్ భారీగా జరిగింది. ఆ సంగతి పక్కన పెడితే హీరో సిద్ధార్థ ఫుల్ సూటులో, హీరోయిన్ సమంత మాంచి శారీలో ఫంక్షన్‌కు హాజరై, ఆద్యంతం పక్కపక్కనే వుండి, జనాల కళ్లను పక్కకు తిప్పనివ్వలేదు. ఇటీవల సమంత తన మనసు దోచిన బాయ్‌ఫ్రెండ్ వున్నాడని అంగీకరించిందంటూ వార్తలు వినరావడం, అదే సమయంలో సిద్ధార్థనే ఆ ఫ్రెండ్ అంటూ గ్యాసిప్‌లు వెలువడ్డం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఈ గెటప్‌లతో పక్కపక్కనే నిల్చోవడం, వారి హావభావాలు, సమంత సిగ్గులు గమనించి, ఇది ఆడియో ఫంక్షనా, లేక పెళ్లి రిసెప్షనా అన్న కామెంట్లు మెల్లమెల్లగా వినిపించాయి. ఏదైనా సమంత ఎప్పటికీ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షనే.

టాలీ టాక్

- 'చిత్ర'

ద్వితీయం దాటేనా?

అలా మొదలైందితో మాంచి సక్సెస్‌ఫుల్ లేడీ డైరక్టర్‌గా కెరియర్ ప్రారంభించారు నందినీరెడ్డి. రెండవ సినిమా ఏకంగా సిద్ధార్థ-సమంత జోడీగా తెరకెక్కించారు. సాధారణంగా దర్శకుల్లో చాలా మందిని పట్టి పీడించిన ద్వితీయ విఘ్నాన్ని నందిని ఎలా దాటుతారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీ అభిమానులు. సునీల్, నిత్యామీనన్ లాంటి పెద్ద నటులు కూడా ఈ సినిమాలో దర్శనమివ్వబోతున్నారు. సమంత గోల్డెన్ లెగ్ సినిమాను కాపాడుతుందా? అన్న సంగతి అలా వుంచితే, ఈ సినిమాకు హిందీలో హిట్టయిన బ్యాండ్ బాజా బారాత్ ఆధారమని చిన్న టాక్ వినిపిస్తోంది ఫిలిం సర్కిళ్లలో. వెడ్డింగ్ ప్లానర్స్ అనే ఇంగ్లీషు సినిమా ఆధారంగా వచ్చిన ఆ సినిమా బాలీవుడ్‌లో పెద్ద హిట్‌గా నిలిచింది. అది నరే, ఇంతకీ ఆ హిందీ సినిమాను నాని హీరోగా తీయాలని ఓ నిర్మాత కొన్నట్లు తెలిసింది. ఇప్పుడు అతగాడి పరిస్థితి ఏమిటన్నది అసలు ప్రశ్నగా ఫిలిం సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలా మొదలైందా? మేడమ్ రెండో సినిమా?

మురో రుజువు

తమిళ నటుడు ప్రభు మన సినిమా వాళ్లకి ఎందుకు నచ్చేసాడో తెలియదు కానీ, గడచిన ఏడాది రెండేళ్ల కాలంలో బోలెడు సినిమాల్లో వేషాలేసేసాడు. వాటిలో విజయం సాధించిన సినిమాలను లెక్కించాలంటే ఒక చేతి వేళ్లు కూడా ఎక్కువే. పైగా దారుణమైన ఫ్లాప్‌లయిన సినిమాలను లెక్కించాలంటే ఎన్ని వేళ్లూ చాలవు. చంద్రమోహన్, పరుచూరి వెంకటేశ్వరరావు, చలపతిరావు ఇత్యాదులందరూ మన టాప్ హీరోలకు తండ్రులుగా ఆనడం లేదు. వారి చూపంతా పర భాషానటులపైనే వుంది. దీంతో ప్రభును పెట్టుకోకతప్పడం లేదు. అవి బాక్సాఫీసు దగ్గర టపా కట్టకతప్పడం లేదు. ఇంకెన్ని సినిమాలో ఇలా..చూడాలి మరి.

జోడీ అదిరింది

బిజినెస్‌మన్ సినిమా ఆడియో ఫంక్షన్ భారీగా జరిగింది. ఆ సంగతి పక్కన పెడితే హీరో సిద్ధార్థ ఫుల్ సూటులో, హీరోయిన్ సమంత మాంచి శారీలో ఫంక్షన్‌కు హాజరై, ఆద్యంతం పక్కపక్కనే వుండి, జనాల కళ్లను పక్కకు తిప్పనివ్వలేదు. ఇటీవల సమంత తన మనసు దోచిన బాయ్‌ఫ్రెండ్ వున్నాడని అంగీకరించిందంటూ వార్తలు వినరావడం, అదే సమయంలో సిద్ధార్థనే ఆ ఫ్రెండ్ అంటూ గ్యాసిప్‌లు వెలువడ్డం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఈ గెటప్‌లతో పక్కపక్కనే నిల్చోవడం, వారి హావభావాలు, సమంత సిగ్గులు గమనించి, ఇది ఆడియో ఫంక్షనా, లేక పెళ్లి రిసెప్షనా అన్న కామెంట్లు మెల్లమెల్లగా వినిపించాయి. ఏదైనా సమంత ఎప్పటికీ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షనే.

యాభై సరే లాభం సంగతేమిటి?

నాయక్.. సీతమ్మవాకిట్లో... సినిమాల గ్రాస్ కలెక్షన్లు యాభై కోట్లను దాటాయని వార్తలు నెట్‌లో తెగ హడావుడి చేస్తున్నాయి. అయితే సీ.వా.సి.చె సినిమా సంగతి అలా వుంచితే, నాయక్ సినిమాకు కొన్ని చోట్ల ఇంకా బయ్యర్లు బ్రేక్ ఈవెన్‌కు రాలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజమెంత వుందో అన్న సంగతి అలా వుంచితే, కాస్త హడావుడి చేయగలిగితే మన హీరోల సినిమాలు 50 కోట్ల మార్క్‌ను దాటడం పెద్ద కష్టం కాదని తేలింది. ఇలాంటపుడు నిర్మాత కాస్త జాగ్రత్త పడి ఖర్చును 30దగ్గర ఆపగలిగితే లాభాలే లాభాలు. కానీ యాభై వస్తుందని యాభై అయిదు ఖర్చు చేసే, చేయించే పరిస్థితిలో వుంది తెలుగు సినిమా పరిశ్రమ. త్వరలో రాబోయే బాద్‌షా ఖర్చు కూడా యాభైకి దాటేసిందని టాక్. సీ.వా.సి.చె., నాయక్‌ల ఖర్చు కూడా యాభై పైనే అన్నారు. బయ్యర్లకు ఎక్కువ మొత్తాలకు అంటగట్టేందుకు యాభై దాటిందని టాక్ పుట్టిస్తున్నారో, నిజంగానే ఖర్చు యాభై దాటుతోందో నిర్మాతలకే తెలియాలి.

వెన్నెల
ఆంధ్రభూమి
శుక్రవారం 8 ఫిబ్రవరి 2013

★ కడలి

తారాగణం:
గౌతమ్‌కార్తీక్, తులసి, అర్జున్,అరవింద్‌స్వామి, మంచు లక్ష్మి, అర్జున్ తదితరులు

సంగీతం:
ఎ.ఆర్.రెహమాన్

నిర్మాతలు :
మణిరత్నం, మనోహర్‌ప్రసాద్

దర్శకత్వం:
మణిరత్నం

కడలిలో ఈతకాదు మునకే!

ఎన్ని వున్నా అయిదోతనం ముఖ్యమని అనేవారు స్త్రీ అలంకరణ విషయంలో. ఆ సంగతి ఎలా వున్నా, సినిమాకు కూడా ఎన్ని హంగులు వున్నా, కథ జన రంజకంగా చెప్పలేకపోతే ఫలితం శూన్యం. మణిరత్నం లాంటి దిగ్దర్శకుడు తాజాగా తీసిన 'కడలి' సినిమాదీ ఇదే తరహా. రాజీవ్ మీనన్ అద్భుతమైన ఛాయాగ్రహణం, మణిరత్నం చేయి తగిలి అద్భుతంగా కనిపించే సన్నివేశాలు, హాలీవుడ్ స్థాయి క్లయిమాక్స్, అర్జున్, అరవింద్ స్వామి తదితరుల విశిష్ట నటన, ఆస్కార్ విజేత రెహమాన్ నేపథ్య సంగీతం, ఇన్ని అమరినా, ఫలితం అంతంత మాత్రం. మణిరత్నం ఒక్కడే కాదు, మేధావి తనం ముదిరిపోయిన దర్శకులందరితో ఇదే తరహా సమస్య వస్తుందేమో? తాము అనుకున్న కథను, అనుకున్న శైలిలో చిత్రీకరించడంలో రాజీపడరు. కానీ జనం కూడా తాము చూడాలి అనుకున్న రీతిలో వుంటే సినిమా చూడగలరు తప్ప, లేకుంటే చూడరు అన్న పాయింట్ ఈ దిగ్దర్శకులకు గుర్తుండదు. దాంతో సినిమా బాక్సాఫీస్ వద్ద బకెట్ తన్నేస్తుంది. ఒక డబ్బున్న యువకుడు, దేవుడి సేవలో తరించాలనుకుని, శిక్షణ పొంది, కోస్తా తీర గ్రామానికి వచ్చిన నేపథ్యంలో, ఓ అనాథ కుర్రాడ్ని చేరదీస్తాడు. అసలు సినిమా కథలో ఇది కేవలం ఒక చిన్న భాగం. కమర్షియల్‌గా ఫ్లెచ్ కావాలంటే స్క్రీన్‌పై ఏ మేరకు వుండాలి. మహా అయితే అయిదు నిమిషాలు. పోనీ చర్చి ఫాదర్‌గా శిక్షణ పొందే సమయంలో కీలకమైన వైరానికి సంబంధించిన అంశం ఇమిడి వుండాలనుకుంటే మరో అయిదు నిమిషాలు. కానీ ఇది మణిరత్నం సినిమాలో అంతకు రెట్టింపుగా వుండడమే కాదు, సామాన్య ప్రేక్షకుడి దృష్టిలో, 'ఇంత సోది' అవసరమా? అనిపిస్తుంది. ఇదొక్కటే కాదు, దాదాపు సినిమా అంతా ఈ తరహా 'సాగదీత' లేదా 'విస్తృతినే నడుస్తుంది. దీనికి తోడు నేటి విటీని, సహజత్వాన్ని తెరకెక్కించడం వరకు ఫరవాలేదు కానీ, ద్విభాషా చిత్రంగా రూపొందిస్తున్నామని మరచిపోతే మరీ ప్రమాదం. సినిమా ఆద్యంతం ఇద్దరు కలుసుకున్నపుడల్లా 'స్తోత్రమ్' అని పలకరించుకోవడం ఇదే తరహాకు చెందుతుంది.

ఇంతకీ కడలి కథేంటంటే, దేవుడు, సైతాన్‌ల మధ్య వైరం. ఇద్దరూ (అరవింద్, అర్జున్) చర్చి ఫాదర్‌లుగా శిక్షణ కోసం వచ్చినవారే. వచ్చిన నేపథ్యాలు వేరు. దారిద్ర్యం నుంచి తప్పించుకోవడానికి వచ్చినవాడు సైతాన్. డబ్బుండీ, మంచి ఆశయంతో వచ్చిన వాడు దేవుడు. సైతాన్ చెడ్డ పనులను దేవుడు బయటపెట్టడంతో, అతగాడ్ని స్కూలు నుంచి బయటకు పంపుతారు. దాంతో సైతాన్ దేవుడిపై పగపెంచుకుంటాడు. సైతాన్ పేరు బెర్గుమన్, దేవుడి పేరు ఫెర్నాండో. ఇదిలా వుంటే తండ్రి ఫలానా అని తెలియడమే కానీ, దగ్గరకు వెళ్లలేని స్థితిలో పుట్టినవాడు థామస్ (గౌతమ్ కార్తీక్). చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో, అల్లరి చిల్లరగా పెరుగుతాడు. అలాంటి వాడిని దారిలోకి తెచ్చి సాకుతాడు బెర్గుమన్. అయితే అనుకోకుండా ఫెర్నాండో జీవితంలోకి మరోసారి వస్తాడు బెర్గుమన్ . రావడమే కాదు, కృతజ్ఞత

అనేది లేకుండా బెర్గుమన్ జీవితాన్ని అతలాకుతలం చేసి,జైలు పాలుచేస్తాడు. అది చాలక థామస్‌ను తన దారిలోకి తెచ్చుకుని, మరో సైతాన్‌గా తయారుచేయాలనుకుంటాడు. అనుకోకుండా థామస్ పోయి..పోయి, బెర్గుమన్ తన అత్తతోనే అక్రమసంబంధం పెట్టుకుని కన్నకుమార్తె బీ..అంటే బీట్రీస్ (తులసీనాయర్)తో ప్రేమలో పడతాడు. ఇంతలో జైలు నుంచి వచ్చిన బెర్గుమన్ ఎలా గోలా థామస్‌ను మంచి మార్గంలోకి తేవాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందన్నది మిగిలిన కథ.

ఇలాంటి కథను తన స్టయిల్‌లో, ఏ చిన్న డిటయిల్ కూడా మిస్ కాకుండా తెరకెక్కించాడు మణి. అయితే మణి స్టయిల్‌ను తట్టుకోవచ్చు, కానీ ఎంత బైబిల్ లేదా క్రిస్టియానిటీ కథను తెరకెక్కించినా, సామాన్య జనాలను అస్సలు దృష్టిలో వుంచుకోని వైనాన్ని తట్టుకోలేం. ఆఖరికి ఒక్క హీరో పేరు తప్ప, మరెవ్వరి పేరు, జనాలకు నాలిక తిరగదు. గుర్తుంచుకోవడానికి అంతసులువు కాదు. అది కాక ప్రతి పాత్రకు ఓ విశిష్టత, నోరు తిరగని సైకాలజీ పదాలు. టప్ మని పడే పంచ్‌లకు అలవాటైన ప్రేక్షకులకు, డెప్త్, బేస్ వున్న డైలాగులు. దీంతో సినిమాతో ప్రేక్షకుడు ప్రయాణం సాగించడం కష్టమవుతుంది. దీనికి తోడు రెహమాన్ కథను విని, ఇలా సంగీతం అందించాలని రెహమాన్ ముందే డిసైడ్ అయి పోయినట్లుంది, దాంతో ఒక్క పాట మినహా మిగిలినవి ఆకట్టుకుంటే ఒట్టు. నేపథ్యసంగీతం మాత్రం వైవిధ్యంగా, అద్భుతంగా వుంది. సినిమాలో మణిరత్నం దర్శకత్వ ప్రతిభకు అద్భుతమైన తోడు, రాజీవ్ మీనన్ ఛాయాగ్రహణం. మణిరత్నం సవివరమైన స్క్రిప్ట్‌ను తట్టుకుని జనం సినిమా చూడగలిగితే అది కేవలం రాజీవ్ మీనన్ ప్రతిభే. సినిమా ఆద్యంతం, దానికి తోడు కడలిలో క్లయిమాక్స్ విషయంలో అతగాడు మంచి ఛాయాగ్రహణాన్ని అందించాడు. ఇదికాక కథలో కూడా కీలకమైన రెండు విషయాల్లో అసంతృప్తి వదలదు. దేవుడు సైతాన్‌ల మధ్య పగకు కారణాన్ని బలంగా చూపలేదు. సైతాన్‌ను స్కూలు నుంచి వెలివేసిన తరువాత అతగాడికి వచ్చిన కష్టాలను, దాని కారణంగా రగిలిన పగను చూపాల్సింది. అదే విధంగా అంత నీచుడైన సైతాన్ క్లయిమాక్స్‌లో మారిపోవడం కూడా బలంగా లేదు.

నటీనటుల విషయానికి వస్తే, అరవింద్ స్వామి పాత్రను చాలా లోప్రొఫైల్‌లో చిత్రీకరించారు. బహుశా దేవుడు సాత్వికుడు, ఆడంబరాలు, హడావుడి లేనివాడు అని చూపడానికేమో? అర్జున్‌కు మాత్రం అన్ని షేడ్స్ వున్న పాత్ర లభించడంతో దున్నేసాడు. తన అనుభవం, అంతా స్క్రీన్‌పైకి తెచ్చాడు. కొత్త హీరో హీరోయిన్లు సోసోనే. అందునా హీరోయిన్‌ను స్క్రీన్‌కు ఎలా సరిపోతుందని భావించాడో మణిరత్నం. సినిమా ప్రారంభంలో చిన్న బుడ్డోడి చేత కూడా అద్భుతమైన నటన రాబట్టిన దర్శకుడు, ఈమె నుంచి మాత్రం ఆ పని సాధించలేకపోయాడు. మంచులక్ష్మి చేయడానికి పెద్దగా ఏమీ లేదు. ఇలాంటి సినిమాను చూడక్కర్లేదా..చూడాలా అంటే చూడాలనే చెప్పాలి. ఎందుకంటే, మానవసంబంధాలు, కళ్లముందు కదిలే అత్యంత సహజమైన జీవన సౌందర్యాన్ని యథావిధంగా స్క్రీన్‌పై చూడాలనిపించేవారు చూడాల్సిందే.

- వి.ఎస్.ఎన్

'గిత్త'కుమ్మేసింది

చదవేస్తే వున్న మతిపోయిందట. బొమ్మరిల్లు, పరుగు లాంటి సినిమాలు తీసిన దర్శకుడి భాస్కర్ వైనం అలాగే వుంది. ఆరెంజ్ వంటి హై లీ అడ్వాన్స్‌డ్ సినిమా తీసి బొర్లాపడ్డా, కనీసం కాస్త సింపతీ అయినా దక్కింది. అతగాడి ఐడియాలజీ జనానికి ఎక్కలేదని సరిపెట్టుకున్నారు. అలాంటి భాస్కర్ దారిమార్చి పక్కా మాస్ సినిమా తీస్తున్నాడని తెలిసి ఎలా వుంటుందో అని ఆసక్తిగా ఎదురుచూసారు. దీనికి తోడు 'కందిరీగ'లాంటి కుర్రాడు రామ్ హీరో..పైగా ఒంగోలు గిత్త అన్న మాంచి మాస్ టైటిల్. దాంతో అంచనాలు పెరిగిపోయాయి. తీరా సినిమా చూస్తే, ఎవరు చేసే పని వారు చేయాలి. ఎవరు తీసే సినిమా వారు తీయాలి అన్న నిరాశే మిగిలింది.

మిర్చియార్డ్ రాజకీయాల నేపథ్యంలో కథ అల్లుకున్నారు. చైర్మన్ ఆదికేశవులు (ప్రకాష్‌రాజ్) మంచి ముసుగు వేసుకున్న నీచుడు. మంచిగా పుట్టాలి లేదా..మంచివాడన్న పేరన్నా తెచ్చుకోవాలి. అప్పుడు ఏం చేసినా చెల్లుతుంది అన్న సిద్ధాంతంలోంచి తయారైనవాడు. అలాంటి వాడి కారణంగా నలుగురిలో నగుబాటుకు గురై అజ్ఞాతంలోకి వెళ్తాడు బంగార్రాజు (ప్రభు). తండ్రికి జరిగిన అవమానం తెలిసి, మార్కెట్ యార్డ్‌ను సాధించాలనే కలతో యార్డ్‌కు వస్తాడు పన్నెండేళ్ల దొరబాబు అలియాస్ వైట్ (రామ్). వయసు పెరిగిన కొద్దీ మార్కెట్‌లో మంచి పేరు, నమ్మకం సంపాదిస్తాడు. యార్డ్ చైర్మన్ గిరీ మీద కన్నేసి, ఆదికేశవులతో బేరం పెట్టుకుని, అతగాడి కూతురితో నిశ్చితార్థం చేయించుకుంటాడు. వైట్ ఎవరో కాదు బంగార్రాజు కొడుకని తెలిసిన ఆదికేశవులు అతగాడిని అంతం చేయాలని ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. కానీ మంచి వాడన్న ముసుగు తీయకూడదు. ఈ తరహా యుద్ధంలో చివరకు ఏమయిందన్నది మిగిలిన కథ.

కథను ఆర్డర్‌లో చెప్పుకున్నపుడు కాస్త ఫరవాలేదనిపిస్తుంది. కానీ స్క్రీన్‌పై చూస్తుంటే, మిర్చి ఘాటు కుర్చీ కిందకు వచ్చి, గిత్త కుమ్మడానికి వస్తున్నంత భయం వేస్తుంది. దర్శకుడు భాస్కర్ మాస్ సినిమా అంటే తమిళ సినిమా అనుకున్నట్లుంది. ప్రభు క్యారెక్టర్, దాని వ్యవహారాలు అచ్చం తమిళవాసనే. పైగా ప్రకాష్‌రాజ్ పాత్రను వైవిధ్యంగా తీర్చిదిద్దాడనుకుంటే, రీలు కోసారి అతగాడి నగ్నరూప సందర్శన జుగుప్స కలిగిస్తుంది. అన్నింటికి మించి మాస్ సినిమాకు ఆయువుపట్టయిన హీరో క్యారెక్టర్‌ను కానీ, హీరో కనిపించే సన్నివేశాలను కానీ సక్రమంగా డతిన్ చేయడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. పైగా కిషోర్‌దాస్‌ను హీరోతో పాటు సమాంతరంగా నడిపించాడు. అతగాడి ఫేస్ చూడగానే టీవీలో అర్ధరాత్రి షోలే గుర్తుకువస్తాయి. పైగా రమాప్రభ చేయిపట్టుకున్న సీన్, రమాప్రభ ఆ వయసులో మెలికలు తిరిగే వ్యవహారం చూసి తల పట్టుకోవడం తప్ప చేసేదేమీ వుండదు. ఇక హీరోయిన్ కృతికర్బందా అందంగా వున్నా, ఆమె పాత్ర రూపకల్పనను దర్శకుడు గాలికి వదిలేసాడు. కూర్చో అంటే..కూర్చోడం, నిల్చో అంటే నిల్చోడం. ఆమెతో హీరో ఆడుకోవడం కాదు, ఆ పాత్రతో దర్శకుడు ఆడుకున్నట్లుంది. సాధారణంగా రామ్ పాత్రలు పవన్‌కళ్యాణ్ స్టయిల్‌లో సాగుతాయి. ఈ సినిమాలో రవితేజ పంథాను పుణికిపుచ్చుకున్నట్లుంది. హీరోయిన్‌ను కలిసిన ప్రతిసారీ అదే కాలేజీ, కాలవ, వంతెన. కనీసం సీన్ సీన్‌కు వైవిధ్యం చూపించాలన్న సంగతిని కూడా దర్శకుడు విస్మరించినట్లుంది. వైవిధ్యం అనుకుని, విలన్ ఇంటి ముందు హీరో ఏర్పాటు చేసిన కళాజాత, ప్రేక్షకులను థియేటర్ బయటకు నడిపిస్తుంది. రఘుబాబు అండ్ కో కామెడీ గందరగోళంగా వుంది తప్ప క్లిక్ కాలేదు. ఆలీ కూడా డిటో. వీటన్నింటికి తోడు సినిమాకు జివి ప్రకాష్ కుమార్ సంగీతం పెద్ద మైనస్. మామూలుగానే జీవీ స్టయిల్ పాటలు తెలుగు సినిమాలకు అంతగా నప్పవు. మాస్ పాటలంటే, అతగాడూ తమిళ సినిమాల స్టయిల్‌నే ఫాలో అయిపోయాడు. దీంతో కుర్ర హీరో అయినా పెద్దగా వైవిధ్యమైన నృత్యాలు చేయడానికి అవకాశం లేకపోయింది. ఎ. వెంకటేష్ ఫొటోగ్రఫీ, మార్తాండ్ వెంకటేష్ ఎడిటింగ్ రెండూ సాదాసీదాగానే వున్నాయి. పోరాట సన్నివేశాల్లో రామ్ ఎనర్జీ లెవెల్స్ ఎలివేట్ అయ్యేంత బలం కనిపించలేదు. ఇటీవలి చిత్రాల్లో వినిపిస్తున్న పంచ్, ఫన్ నిండిన డైలాగులు ఈ సినిమాలో మచ్చుకు కూడా వినిపించవు.

ఇన్ని అవలక్షణాలున్న సినిమా, రెండు సంగతులు స్పష్టం చేస్తుంది. హీరో రామ్ సినిమా స్క్రిప్ట్‌ను ఏమాత్రం తెలియకుండానే, చూడకుండానే సినిమా చేసి వుండొచ్చు. కుటుంబ, మానవ సంబంధాల సినిమాలు తీయడం కన్నా మాస్ సినిమా తీయడం మరింత కష్టం అని దర్శకుడు భావించి వుండడని.

మొత్తం మీద హీరో రామ్ కెరియర్‌ను కుమ్మేసింది ఒంగోలు గిత్త.

- రాజ్‌దేవ్

★ ఒంగోలు గిత్త

తారాగణం: రామ్, కృతి కర్బందా, ప్రకాష్‌రాజ్, ప్రభు, జె.వి. ఆలీ, ఆహుతి ప్రసాద్, రఘుబాబు, అజయ్, అభిమన్యు సింగ్ తదితరులు

సంగీతం: జి.వి. ప్రకాష్‌కుమార్, మణిశర్మ

నిర్మాత: బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్

దర్శకత్వం: భాస్కర్

ఫరవాలేదనిపించే యాక్షన్ థ్రిల్లర్

పార్కర్ ప్రధాన పాత్రధారిగా డొనాల్డ్ వెస్టలేక్ రచించిన 'ఫ్లష్ ఫైర్' అనే నవల ఆధారంగా రూపొందించిన అమెరికన్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమే 'పార్కర్'. పార్కర్ హీరోగా ఇరవై నవలలు వచ్చాయి.మొదటిసారిగా పార్కర్ 1962లో తీసిన'ది హంటర్'లో కనిపిస్తాడు. తర్వాత 1967లో 'పాయింట్ బ్లాంక్', 1999లో 'పే బాక్' చిత్రాలు వచ్చాయి. రచయిత తన మొత్తం నవలలు సినిమాలుగా రావాలన్న కోరికతో, విడి నవలల హక్కులు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. 2008లో ఆ రచయిత చనిపోవడంతో రచయిత మిత్రుడైన లే అలెగ్జాండర్‌కు, రచయిత భార్య ఈ నవల హక్కులను అమ్మివేయడంతో ఇది చిత్రంగా రూపుదాల్చింది. పార్కర్ అనే దొంగ తన ముఠాతో డబుల్ క్రాస్ చేయబడడం, అతను ప్రతీకారం తీర్చుకోవడమనే ఇతి వృత్తంతో ఈ సినిమా తయారైంది.

పార్కర్ ప్రొఫెషనల్ దొంగ. బీదవాళ్లు, అమాయకుల జోలికి పోడు. అతని యజమానియైన హార్ల్, అయిదు గురు ముఠా చేసే దోపిడీలో సహకరించమని పంపుతాడు. మెలాండర్, కార్ల్‌సన్, రోస్, క్రోల్-వీరు ఎవరో తెలియకపోయినా వారితో కలిసి పనిచేయాల్సి వస్తుంది. వాళ్ల దోపిడీ సక్సెస్ అవుతుంది. ఆ డబ్బులో వాటా ఇవ్వడానికి ఇష్టంలేని ముఠా పార్కర్ అడ్డు తొలగించుకోవాలనుకుని పిస్తోలుతో కాల్చి చెరువులో పడవేస్తాడు. ఒక రైతు కుటుంబం అతడ్ని రక్షించి ఆసుపత్రిలో చేరుస్తారు. కాస్త ఓపిక రాగానే పోలీసులకు దొరక్కుండా అక్కడినుండి తప్పించుకుంటాడు. తనను మోసగించిన మెలాండర్‌ను పట్టుకోవడానికి-వారు ఫ్లోరిడాలో దొంగతనం చేయనున్నారని తెలుసుకుని అక్కడకు వెళ్తాడు. మెలాండర్ ముఠా పార్కర్ బతికున్నాడని గ్రహించి హార్ల్ కూతుర్ని, పార్కర్ గర్ల్‌ఫ్రెండ్ క్లెయిర్‌ను కిడ్నాప్ చేయమని క్రోల్‌ను పంపిస్తారు.

వారి బారినుండి అతి కష్టంమీద క్లెయిడ్ తప్పించుకుంటుంది. దాంతో హార్ల్, పార్కర్‌ను తన గర్ల్ ఫ్రెండ్‌తో ఎక్కడికైనా పారిపొమ్మని సలహా ఇస్తాడు. దానికి పార్కర్ తిరస్కరించి ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు.

పార్కర్ ఫ్లోరిడాకు డానియెల్ పేరుతో వస్తాడు. అక్కడ రియల్ ఎస్టేట్ ఏజెంటుగా విఫలమైన లెస్లీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటుంది. రియల్ ఎస్టేట్ పేరిట రూడ్రిగో వున్న ఇంటి గురించి డానియెల్ ఎంక్వైరీ చేస్తున్నాడని, డానియెల్ అతని మారుపేరని ఆమె కనిపెడుతుంది. నిజానికి మెలాండర్, రొడ్రిగో పేరుతో వ్యవహరిస్తున్నాడనీ-అక్కడ యాభై మిలియన్ డాలర్ల విలువ చేసే నగల దొంగతనం ప్లాన్‌లో ఉన్నాడని పార్కర్ గుర్తిస్తాడు. లెస్లీ కమిషన్ పద్ధతిన పార్కర్‌కు సహకరిస్తానంటుంది. నగల వేలం పోటీని భగ్నం చేసి ఆ నగలను దోచుకున్న మెలాండర్ ముఠానుండి, పార్కర్-లెస్లీ దొంగిలిస్తారు. పార్కర్ ఉనికిని పసిగట్టి వచ్చిన మెలాండర్ ముఠాలోని ఒక్కో వ్యక్తిని దారుణంగా పార్కర్ చంపేస్తాడు. అతని గాయాలకు కట్లు కడుతున్న గర్ల్ ఫ్రెండ్ క్లెయిర్‌ను చూసిన వెస్లీకి పార్కర్ మీద పెంచుకున్న ఆశలు అడియాశలవుతాయి. ఆరు నెలల తర్వాత చికాగో వెళ్లిన పార్కర్, మిలాండర్‌ను నియమించిన మాఫియా బాస్‌ను చంపేస్తాడు. ఒక సంవత్సరం తర్వాత కొరియర్‌లో వచ్చిన వేలాది డాలర్ల బహుమానంతో లెస్లీ ఉక్కిరి బిక్కిరి అవడంతో సినిమా ముగుస్తుంది.

పార్కర్ అనే ఈ యాంటీ హీరో పాత్రకు యాక్షన్ స్టార్ జేసన్ స్టాంథమ్ చక్కగా సరిపోయాడు. సీరియస్‌గా సాగే ఈ చిత్రానికి రిలీఫ్‌గా వచ్చిన లెస్లీ పాత్రలో జెన్నిఫర్ లోపెజ్ బాగా నటించింది. పాత్రోచితంగా నయినా ఆమెను ఎక్స్‌పోజ్ చేయడానికి దర్శకుడు వెనుకాడలేదు. జెన్నిఫర్ లోపెజ్‌ను ఎంపిక చేయడం ద్వారా సినిమాను నిలబెట్టడానికీ, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి చేసిన ప్రయత్నం ఫలించిందనే చెప్పాలి.

-కె.పి.

★ పార్కర్

తారాగణం: జేసన్ స్టాంథమ్, జెన్నిఫర్ లోపెజ్, మైకేల్ చిక్లీస్, వెండల్ పియర్స్

నిర్మాతలు : లే అలెగ్జాండర్

దర్శకత్వం: టేలర్ హాక్‌ఫోర్డ్

రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

శుక్రవారం 8-2-2013

శ్రీ నందన, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి : బహుళ త్రయోదశి సా.04.45

నక్షత్రం : పూర్వాషాఢ ఉ.08.17

వర్జ్యం : మ.03.48 నుండి 05.18 వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)

విదేశయాన ప్రయత్నం సులభమవుతుంది. కుటుంబ కలహాలకు తావీయరాదు. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంది. పిల్లలతో జాగ్రత్తవహించుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగంలోని వారికి ఆటంకాలెదుర వుతాయి. ఆరోగ్యంగూర్చి ప్రత్యేక శ్రద్ధఅవసరం.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.)

స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది.

నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.

మిథునం (మృగశిర 3,4పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యంగూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండానుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష)

అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రు బాధలుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ, మర్యాదలు అధికమవుతాయి. అద్భుత శక్తిసామర్థ్యాలను పొందగలుగుతారు. కుటుంబంలో అభివృద్ధితోపాటు ఆకస్మిక ధనలాభముంటుంది.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.)

స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగానుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.)

నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధన లాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపులభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు, సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి. మనోధైర్యాన్ని కలిగియుంటారు. శుభవార్తలు వింటారు.

తుల (చిత్త 3,4పా., స్వాతి, విశాఖ 1,2,3పా.)

విదేశయాన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవకాశముంటుంది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టాన్ని అధిగమిస్తారు. ఈరోజు ముఖ్యమైన వ్యక్తిని కలుస్తారు.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ)

బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్తవహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విషయంలో మిక్కిలి శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతోపాటు, మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తవహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

ప్రయత్నకార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధన లాభముంటుంది.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.)

గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయప్రయాసలుంటాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తవహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.)

ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధివుంటుంది.

ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. అనవసర వ్యయప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృథాప్రయాణాలెక్కువగా ఉంటాయి. స్త్రీలమూలకంగా ధన లాభముంటుంది.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి)

అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు.

ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు. ●

ముడి కుదరని ముగ్గురు డేవిడ్‌ల కథ

కథకేం మహా భేషుగ్గా ఉంది. కానీ ఎక్కడో తిరకాసు? ఆఖరి నిమిషం వరకూ అర్థం కాని బ్రహ్మ పదార్థం అది. ఆలోచించగా ఆలోచించగా అర్థమయ్యింది ఒక్కటే - ఏమేవో కథల్ని రాసేసుకొని.. వాటన్నింటినీ కలగాపులగం చేసేసి.. స్క్రీన్‌ప్లేతో ఒక్క సినిమాగా చేశారన్నది. కాకపోతే - ఏ కథ ఆ కథగా చూసుకుంటే ఫర్వాలేదనిపిస్తుంది గానీ - ఓ కథ కాస్త.. మరోకథ కాస్త.. ఇలా విడగొట్టి గజిబిజి గందరగోళం చేసేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రేక్షకుడి పరిస్థితి - సమస్యా పూరణంలో అవధాని లాంటిది. అసందర్భ ప్రేలాపనలా.. ఫలానా ప్రశ్న అడిగినప్పుడు గంట మోగిందా? లేదా? తలపై పువ్వు పడిందా లేదా? అన్న ప్రశ్నకి సరైన సమాధానం రాబట్టడం లాంటిదే. ఏ కథ ఎంతవరకూ గుర్తు పెట్టుకున్నామన్నది ప్రేక్షకుడి ఆలోచనా ధోరణినిబట్టి ఉంటుంది. ఇది ప్రయోగమా? అందామంటే.. అటువంటి దాఖలాలేం లేవు. వెరసి - బెజాయ్ నంబియార్ ఏదో చెప్పాలన్న తాపత్రయం కనిపించిందని మాత్రం అనిపిస్తుంది.

ఇది ముగ్గురు 'డేవిడ్'ల కథ. ఒక డేవిడ్ (నీల్ నితిన్ ముఖేష్) లండన్ వాసి. కాలం 1975. మరో డేవిడ్ (వినయ్ విర్మానీ) ముంబై తాలూకు. కాలం 1999. ఇంకొకడు (విక్రమ్) గోవా. కాలం 2010.

1975 కథ ప్రకారం - లండన్ డేవిడ్ -మాఫియా డాన్ ఇక్బాల్ ఘనీ పుత్రరత్నం. ఇక్బాల్‌కి లెక్కలేనంత మంది శత్రువులు. వారికి తోడు ఇండియన్ ఇంటెలిజెంట్ ఏజెంట్లు. 'అగర్ ఘనీ కో మార్నా హై. తో డేవిడ్ కో మార్నా జరూరీ హై'.. అన్న డైలాగ్‌తో ఇక్బాల్‌నీ.. డేవిడ్‌నీ చంపేందుకు శత్రువులు ప్లాన్ చేస్తారు. డేవిడ్ చుట్టూ జరిగిన సంఘటనలూ.. డేవిడ్ ప్రేయసిని అతని తమ్ముడు పెళ్లి చేసుకోవటం. ఆఖరికి ఘనీ చనిపోవటం - ఇవన్నీ ఒక ఎపిసోడ్.

ముంబై డేవిడ్ కథ. తండ్రి (నాజర్) చేసే సమాజ సేవ అంటే అతడికి ఇష్టం ఉండదు. ఒక అక్క, చెల్లెలు. డేవిడ్ స్వతహాగా గిటారిస్ట్. సంగీత ప్రపంచంలో ఎన్నెన్నో మెట్లు ఎక్కాలని అతడి ఆశ. మ్యూజిక్ ట్యూషన్స్ తీసుకుంటూంటాడు. లారాదత్తా.. ఆమె కొడుకు అతడి శిష్యులే. చివరికి యుఎస్ వెళ్లేందుకు ఛాన్స్ వస్తుంది. కానీ -

★ డేవిడ్

తారాగణం: నీల్ నితిన్ ముఖేష్, వినయ్ విర్మానీ, చియాన్ విక్రమ్, టబు, సారిక, నాజర్, లారాదత్తా, శీతల్ మీనన్, శ్వేతా పండిట్ తదితరులు

దర్శకత్వం: బెజాయ్ నంబియార్

ఒక రాజకీయ నాయకురాలి కుట్ర వల్ల డేవిడ్ తండ్రి అవమానాల పాలవుతాడు. ముంబై మాఫియా డాన్ రాజకీయ నాయకురాలి పన్నాగం గురించి చెప్తాడు. ఆమెని చంపి పగ తీర్చుకోవాలనుకుంటాడు డేవిడ్. ఆఖరికి - అతడి జీవితం ఏ తీరానికి చేరిందన్నది మరో ఎపిసోడ్.

గోవా డేవిడ్ - వృత్తిరీత్యా చేపలు పట్టేవాడు. కానీ ఎప్పుడూ తండ్రి ఆత్మతో మాట్లాడుతూ..

రివ్యూ

ముగ్గురూ ఎక్కడ కలుసుకున్నారన్నది ముగింపు.

1975 కథ కాబట్టి - ఆయా సన్నివేశాలన్నీ బ్లాక్ అండ్ వైట్‌లో కనిపిస్తాయి. నీల్ నితిన్ ముఖేష్ కేరెక్టర్‌పై దర్శకుడు పెట్టిన శ్రద్ధ మిగిలిన ఇద్దరు డేవిడ్‌లపై కూడా పెట్టి ఉంటే కథ మరోవిధంగా ఉండేదేమో?! 1999 డేవిడ్‌గా వినయ్ విర్మానీ నటన ఫర్వాలేదు.

ఇక 2010 కథలో విక్రమ్ కాస్తంత హాస్యాన్ని పంచాడు. నటనాపరంగా చూస్తే అందరూ సీనియర్ నటులే కాబట్టి.. ఎన్నిక పెట్టడానికేం లేదు. సారిక.. నాజర్ అతిథి పాత్రలు. అంతగా ప్రాధాన్యత లేదు. నాజర్ 'షేవింగ్' సీన్ బాగుంది. రాత్రి వేళ పడవలో పాట.. బాగున్నప్పటికీ.. గోవా డేవిడ్ కేరెక్టర్‌ని తీర్చిదిద్దటంలో కాస్తంత శ్రద్ధ పెడితే బాగుండేది. ఎప్పుడూ తాగుతూండటం మినహా చేసిందేం లేదు. అండర్ వరల్డ్ డాన్ ఇక్బాల్ కథలో ఉన్న పట్టు.. రాన్రాను మిగతా కథల్లో జారిపోయింది.

ఏ కథకి ఆ కథ చూస్తే ఫర్వాలేదనిపించినా.. వీటన్నింటినీ మధ్యమధ్య కలపటం.. క్లైమాక్స్‌లో 'డేవిడ్'లందరికీ ఏదోవిధంగా సంబంధం ఉన్నట్టు చూపటానికి పడిన కష్టం తెలుస్తూనే ఉంది. ఒక్కో సందర్భంలో పకడ్బందీగా ఉన్నట్టు అనిపిస్తుంది. మరోసారి పేలవంగా నిస్సారంగా అనిపిస్తుంది. మొత్తానికి ఈ 'డేవిడ్'లకి బలయ్యేది మాత్రం గొలియాతనే ప్రేక్షకుడే.

దర్శకత్వంలో ఎంచటానికేం లేదు. బెజాయ్ నంబియార్ తన ప్రతిభను చూపెట్టాడు. సంగీతం మైనస్.

-బిఎన్కే

వెన్నెల ఆంధ్రభూమి
శుక్రవారం 8 ఫిబ్రవరి 2013

హీరో కోసం... హీరోచేత... హీరో ఎంపిక చేసిన నాశిరకం కథలతో ఎక్కడ సినిమాలు విడుదలవుతాయి అంటే ఠక్కున ఏమాత్రం తడుముకోకుండా చెప్పవచ్చు 'తెలుగు చిత్ర పరిశ్రమలో' అని. ఫలానా హీరోగారి వారసుడు అనగానే కథతో సంబంధం ఉండదు. కథనం అక్కరలేదు. శ్రావ్యమైన సంగీతంతో అవసరం లేదు. కేవలం ఇది ఫలానా హీరోగారి వారసుని సినిమా అంతే వెర్రివెంగళప్పలుగా ప్రేక్షకులు చూసి తీరాల్సిందే అనుకుంటారు నిర్మాత, దర్శకులు. దీనిఫలితమే చరిత్ర కలిగిన అతి పెద్ద మన చిత్ర పరిశ్రమ తీవ్రమైన కష్టనష్టాల్లో కూరుకుపోవడానికి ప్రధాన కారణం.

హీరో సినిమాలే పరిశ్రమకు జీరో!

తరమీద విలన్ అడుగుతాడు హీరోని...'ఎవర్రా నువ్వు' అని అంతే ఇంకే ముంది వెంటనే మన హీరోగారు తన బాబాయ్...తాతాయి...ముత్తాత పేర్లు చెబుతూనే గాల్లో ఎగిరిపోయి పదిమంది రౌడీలను... తల వెంట్రుక కూడా కదలకుండా చితక్కొట్టేస్తాడు. వీటిని కూడా పాపం ప్రేక్షకులు ఇబ్బందికరంగా చూస్తూ చప్పట్లు కొట్టాలి. లేదా ఇదే మన తెలుగు సినిమాస్థాయి అనుకుని తలపట్టుకోవాలి. మనకి వారసత్వహీరోలు అవతార పురుషులు. తెరపై ఏదైనా చేసేస్తారు. అవసరమైతే సింగిల్ హాండ్‌తో వందమందిని ఈజీగా తన్నేసి వెంటనే అర్ధనగ్న హీరోయిన్‌తో విదేశాల్లో పాటలు పాడేసుకుంటారు. ఇక్కడ హీరోగారి తల చెదిరినా డైరక్టర్ ఏ మాత్రం ఒప్పుకోడు ఎందుకంటే హీరోగారి కోసమే కథలాంటి కథకాని... కథలేని కథను డైరక్టర్ నాలుగు సినిమాలని చక్కగా అతికించి తయారుచేసుకుంటాడు. ప్రపంచ చిత్ర పరిశ్రమలో ఎక్కడైనా సరే కథకి ఏ హీరో పాత్ర సరిపోతుందని చాలా సీరియస్‌గా ఎంపిక చేసుకుంటారు. కానీ

ఇక్కడ అలా కాదు. 'హీరో'గారు కథని ఓకే అంటే చాలు పనైపోతుంది. కాస్త ఇమేజ్... వారసత్వ అర్హత ఉంటే హీరోబాబే హీరోయిన్‌ని కూడా ఎంపిక చేస్తాడు. ఈ పరిశ్రమలో తెరపై పాత్ర కనిపించదు. హీరోగారే ఆద్యంతం మనకి కనిపిస్తాడు. ఎటువంటి అద్భుతమైన చిత్రాలు వచ్చాయి తెలుగులో.. కృష్ణ, ఎన్టీఆర్, నాగేశ్వరరావు, శోభన్ బాబులు తమ ఇమేజ్‌ని పక్కనపెట్టి కథ నచ్చి నటించారు. ఇప్పుడు మన హీరోలకి కేవలం ఇమేజ్ మాత్రమే ముఖ్యం. 'కథకి అవసరం అంద

వికారంగా ఉండాలి నటించమంటే 'నో' అంటారు. అందుకే ఇక్కడ హిట్లు దూరమవుతూ డబ్బింగ్ సినిమాలకి తెలుగు ప్రేక్షకులు నీరాజనాలు అర్పిస్తున్నారు. రంగం, నా పేరు శివ చిత్రాలే ఉదాహరణ. తమిళ చిత్రపరిశ్రలో హీరో ఇమేజ్ కంటే పాత్రకి ప్రాధాన్యమిస్తారు. ఇమేజ్ చట్రం నుండి తెలుగు హీరో బయటికి రావడం లేదు. కథలు కూడా పరిశ్రమలోని దగ్గరి వారు రికమెండ్ చేస్తే వింటారు. ఈ మధ్య ఓ వారసత్వ హీరోగారు అన్నారు 'వంద కథలు విన్నాను. ఏదీ నచ్చలేదు. ఈ కథ నచ్చింది అందుకే ఒప్పుకున్నాను' అని. తీరా సదరు హీరోగారు ఎంతో మెచ్చుకున్న కథతో విడుదలైన సినిమా అట్టర్ ఫ్లాప్ అయింది. ఇందులో కథే ముంది, ఇంత దిక్కుమాలిన కథతో ఇంతవరకు ఏ సినిమా కూడా రాలేదన్నారు ప్రేక్షకులు. నేను వందలాది కథలు వింటున్నాను అని చెప్పుకోవడం మన వాళ్లకి ఫ్యాషన్‌గా మారింది. అందుకే మనకి జాతీయ మార్కెట్లో అవార్డులు రావు. మనని మనమే పొగుడుకోవాలి. సినిమా ఎంత దరిద్రంగా ఉన్నా 'ఆహా ఓహో' అంటూ టీవీ చానల్స్‌లో సొంత డబ్బా కొట్టుకుని సంతృప్తి పడాలి. వీళ్లని అవార్డుల పేరిట ఆనందపరచడానికి 'నందులు' మన పెరట్లోనే ఉన్నాయి. కొనుక్కునే వారికి కొనుక్కున్నంత. 'శివపుత్రుడు' సినిమాలో విక్రమ్ చేసిన పాత్ర కానీ, 'మృగం' సినిమాలో ఆది పినిశెట్టి చేసినపాత్రకానీ, 'వాడు వీడు'లో విశాల్ చేసిన పాత్రకానీ మనవాళ్లు చేయగలరా?

మనవాళ్లకి సినిమా అనగానే పాత్రల నటనతో కానీ, సహజత్వంతో కానీ సంబంధం ఉండదు. డప్పుల శబ్దాలతో కూడిన కర్ణ కఠోర సంగీతం, విదేశాలు, అశ్లీల అసభ్య పాటలు, బూతు మాటలు, సినిమా ప్రారంభంనుండి చివరి వరకు హీరోగారి సొంత డబ్బా... ఇదీ పరిస్థితి. ఇదే మన తెలుగు సినిమా ఫార్ములా. అందుకే ప్రేక్షకులు తిరిగి చూడకుండా తిరస్కరిస్తున్నారు. కథ ఎలాగూ ఉండదు పోనీ పొరపాటున ఉన్నా తెరకెక్కించడం చేతకాదు. ఇక్కడ అందరు హీరోల బాడీలాంగ్వేజ్, సంభాషణ విధానం ఒకేలా ఉంటుంది. ఒకరిని ఒకరు అనుకరించేహీరోలే. కానీ పాత్రో తమదైన బాణీలో ఇమిడిపోయేవారు లేరు. మరో విచిత్రం ఏమిటంటే మన తెలుగు సినిమా కథలన్నీ దాదాపుగా అర్ధనగ్న ప్రేమలాంటి ప్రేమకథలచుట్టూ తిరుగుతాయి. హీరో కుటుంబానికి మరేం పని ఉండదు. హీరోకి కూడా ఏ పనీ పాటు ఉండదు. ఎంతసేపూ హీరో ప్రేమని బతికించుకోవడం కోసమే కుటుంబ సభ్యులు అహర్నిశలు శ్రమిస్తారు.

సమాజంతో సంబంధం లేకుండా ఉన్నా..ఏ పనీ చేయకపోయినా చదవకపోయినా, లెక్చరర్‌ని తిట్టినా, కొట్టినా, తాగి క్లబ్‌ల చుట్టు అమ్మాయిల చుట్టు తిరుగుతున్నా మన తెలుగు హీరో కుటుంబం ఎంతో మురిసిపోతుంటుంది. దీన్నే విడుదలకు ముందు నిర్మాత, డైరక్టర్లు 'ఇది పక్కా మాస్ సినిమా.. మీ ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తారు' అని చెబుతారు. అసలు దేన్ని ఎంజాయ్ చేయాలి. కమల్‌హాసన్, మాధవన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'సత్యమే శివం'. ఓ 'నాయకుడు' లాంటి సినిమా మనవాళ్లనుండి ఆశించగలమా? ఈ గాల్లో ఎగిరిపోయి అందరినీ బాదేసే దృశ్యాలు అనుకరణలు, వారసత్వ గొప్పలు చెప్పుకోవడం లేకుండా ఇమేజ్ పక్కనపెట్టి కథలో పాత్రలు కనిపిస్తేనే ఇక ముందైనా తెలుగులో మంచి చిత్రాలు ఆశించవచ్చు.

-కోనె సతీష్‌కుమార్

మీ వ్యూస్

'విశ్వరూపం' బాగుంది

కమల్‌హాసన్ నటించిన విశ్వరూపం అదిరింది. సినిమా తీసిన విధానం చాలా బాగుంది. ఫ్లాష్‌బ్యాక్‌లోని సన్నివేశాలు చూస్తుంటే నిజంగానే మన కళ్లముందు జరిగినట్లుగా చాలా సహజంగా అనిపించాయి. అందరూ చాలా బాగా నటించారు. ముఖ్యంగా కమల్‌హాసన్, రాహుల్‌బోస్, పూజాకుమార్ వాళ్ల పాత్రలకు కుదిరారు. అక్కడ వాళ్ల పాత్రలే కనపడ

డ్డాయి తప్ప వాళ్లు కనపడలేదు. కానీ శేఖర్‌కపూర్ పాత్రకు పెద్ద ప్రాధాన్యం ఉన్నట్టు అనిపించలేదు. అతడిని ఆ పాత్రకి ఎందుకు తీసుకున్నారో అర్థంకాలేదు. ఇలాంటి సినిమాను రూపొందించిన కమల్‌హాసన్, వాళ్ల బృందాన్ని అభినందించాలి.

- సి.శ్రావణ్, హైదరాబాద్

మిథునం- దంపతులు

ఈ సినిమాను జంటగా వెళ్ళి చూశాము. ఇది మన అందరి కథ. విదేశాలలో పిల్లలు ఉన్న పెద్దవాళ్ళ కథ. ఈ వ్యధను చక్కగా చూపించే ప్రయత్నం బాగా చేశారు. కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. అతిగా భోజనం విషయం బాగులేదు. ఇక్కడ పెద్దవాళ్ళు బ్రతుకుటకు మాకు తెలిసిన పెద్దావిడ చెప్పిన సూత్రం. సద్దుబాటు ఉండాలి- పరిశోధన వద్దు. ఇది పాటిస్తే ఇక్కడ ఉన్న పెద్దలకు జీవితం మధురం.

- శిష్ట లక్ష్మీనరసింహమూర్తి, హైదరాబాద్

సందేశాత్మక చిత్రం 'నాయక్'

నాయక్‌లో చెర్రి నటన హైలేట్. డాన్సులు, ఫైట్లు సహజత్వానికి బహుదూరంగా వున్నా నేటి యువతను ఆకర్షించడానికి ఇంకా కావాలి. బ్రహ్మానందానికి సరైన హాస్యంతో కూడిన పంచ్ డైలాగులుంటే అతని హావభావాలు కడుపుబ్బ నవ్వించగలవు. ఈ సినిమా సక్సెస్‌కు ముఖ్యకారణాలలో హాస్యం ఒకటి. నాయక్ చిత్రంలో యితర హాస్య నటులందరూ కూడా దుమ్ము దులిపారు. ఇకపోతే సినిమా ఎలావున్నా కొన్ని సన్నివేశాలు సామాజిక న్యాయాన్ని సూచిస్తూ ప్రభుత్వాలకు కనువిప్పు కలుగచేసేలా వున్నాయి. కొందరు విద్రోహులు చిన్నపిల్లలను అంగవిలురుగాచేసి ముఖ్య సెంటర్లలో ముష్టి ఎత్తించడం, వయసుకు రాని ఆడ పిల్లలను (వచ్చినవారిని కూడ) ఎత్తుకెళ్ళి, మత్తు ఇంజక్షనులిచ్చి వ్యభిచార కూపంలోకి దించడం, హీరో యీ సంఘవిద్రోహులను తుదముట్టించడం, ఈ సన్నివేశాల చిత్రీకరణ, సంభాషణలు చూపరులకు ఆకట్టుకునేవిగా వున్నాయి.

- ఎన్.రామలక్ష్మి, సికిందరాబాదు

రామ్‌చరణ్ యాక్టింగ్ బావుంది

ఆరెంజ్, రచ్చ సినిమాలు ఫ్లాప్ అవడంతో ఎంతో నిరాశతోవున్న మెగాస్టార్ అభిమానులను ఎంతగానో అలరించే సినిమా 'నాయక్'. వి.వి.వినాయక్ ప్రయోగాల జోలికిపోకుండా తనదైన పంధాలో ఫక్తు కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను అందించడం విశేషం. రామ్‌చరణ్ తేజ్ యాక్టింగ్ చాలా బావుంది. అయితే నాయక్ పాత్రలో మరింత గట్టిగా ఎమోషన్స్ పండిస్తే ఇంకా బాగుండేది. ఇంటర్వెల్‌వరకూ నడిచిన సస్పెన్స్ ఒక్కసారిగా విడిపోవడంతో ద్వితీయార్ధం కాస్త చప్పబడినట్లు అనిపించింది. ఇక్కడే వినాయక్ స్క్రీన్‌ప్లేలో మరింత జాగ్రత్త తీసుకోవాల్సింది. అయితే క్లైమాక్స్‌ముందు వచ్చే కామెడీ సన్నివేశాలు మళ్ళీ సినిమాను ట్రాక్‌లో పడేస్తాయి. అన్ని కత్తిపోట్లకు గురైన నాయక్ తిరిగి ఎలా బ్రతికాడో లాజిక్‌కు అందదు. అయితే వినాయక్ స్టైల్ డైరెక్షన్‌లో

రామ్‌చరణ్‌తేజ యాక్టింగ్, హుషారైన పాటలు, అనాధలను విలన్ చెరనుండి విడిపించే సన్నివేశాలు సినిమా ఎక్కడా బోరుకొట్టకుండా సాగింది. లైలా...లైలా పాటకు రామ్‌చరణ్ స్టెప్పులు అదిరాయి. ఇంట్రడక్షన్ ఫైట్ సింప్లీసూపర్బ్. మొత్తం మీద అభిమానులకేకాక అందరినీ హుషారెక్కించే చిత్రం 'నాయక్'.

- సిహెచ్.సాయిబుుత్విక్, నల్గొండ

పాత చిత్రాలకు రంగులద్దండి

యన్టీఆర్, ఎఎన్ఆర్, శోభన్, కృష్ణ, కృష్ణంరాజుల తొలితరం చిత్రాలలోని ఆణిముత్యాలతోపాటు అంతకుపూర్వం నిర్మించిన చలనచిత్రాలు, అందులో నటించిన కథానాయకుల గూర్చి మా తరానికి తెలియాలంటే అప్పటి చిత్రాలను ఇప్పటి సాంకేతిక పరిజ్ఞానంతో వర్ణ చిత్రాలుగామార్చి మళ్ళీ విడుదల చేస్తే, అలాచేసిన నిర్మాతలకు ఆదాయం చేకూరడంతోపాటు నేటితరానికి నాటి క్లాసిక్స్ గొప్పతనం, అందులోని కళాత్మక కథాసంవిధానం, సామాజిక స్థితిగతులను అర్థంచేసుకుని విశ్లేషించుకొనే అవకాశంకూడా కలుగుతుంది కదా!

- కూర్మాచలం వేంకటేశ్వర్లు, కరీంనగర్

లే మిజరబుల్స్

విక్టర్ హ్యూగో రచించిన 'లే మిజరబుల్స్' ఆంగ్ల నవల ఆధారంగా నిర్మించిన చిత్రం రివ్యూ చదివాను. రచన ఎలావున్నా, మూలం చెడకుండా అద్భుత సంగీత దృశ్యకావ్యంగా మలచారని రివ్యూలో విశదీకరించారు. ఈ సినిమాను తెలుగులో రెండుసార్లు నిర్మించారు. ఈ సందర్భంలో ఓ సంఘటన పేపర్లో చాలా సంవత్సరాల క్రితం చదివినది గుర్తుకువచ్చింది. అదేమంటే నిర్మాత, దర్శకుడు విఠలాచార్య అక్కినేని నాగేశ్వరరావుగారితో 'బీదలపాట్లు' చిత్రం నిర్మించారు. అందులో అందరు నటులు అద్భుతంగా నటించినా ఎందుకనో చిత్రం పరాజయంపాలైంది. నిర్మాతకు విపరీతమైన ఆర్థిక నష్టం జరిగింది. దీనికి బాధ్యత వహిస్తూ హీరో నాగేశ్వరరావుగారు వద్దన్నా వినకుండా తానుతీసుకున్న పారితోషికాన్ని పేపర్లో చుట్టి హైద్రాబాదు రైల్వేస్టేషనులో మద్రాసువెళ్ళే రైల్లో కూర్చున్న విఠలాచార్యకు అందజేసారుట.

- ఎన్.ఆర్.లక్ష్మి, సికింద్రాబాద్

హ్యాట్రిక్ కొట్టిన ప్రిన్స్ మహేష్

2011 సెప్టెంబర్‌లో దూకుడు, 2012 జనవరిలో బిజినెస్‌మేన్‌లతో హిట్లుకొట్టి, ఇప్పుడు 2013 సంక్రాంతికి 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు'తో మరో సూపర్‌హిట్‌తో హ్యాట్రిక్ హిట్స్ కొట్టిన ప్రిన్స్ మహేష్ అభినందనీయుడు. ఇహ ఈ చిత్రానికి ఇంత మంచి ఫీల్ రావటానికి ప్రధాన కారకుడు దర్శకుడు శ్రీకాంత్. తర్వాత క్రెడిట్ నిర్మాత దిల్‌రాజుకి ఇవ్వవచ్చు. చాలా కాలం తర్వాత రక్తపుచుక్క లేకుండా ఒక్క చక్కని కుటుంబ కథాచిత్రం రావటం ఎంతైనా ఆహ్వానించదగ్గ విషయం. గుహన్ కెమెరావర్క్ కనులవిందుగా వుంది. మణిశర్మ నేపథ్య సంగీతం, మిక్కీజెమేయర్ సంగీతం ఆకట్టుకున్నాయి. ఇహ గణేష్‌పాత్రో మాటలు హృదయాల్ని హత్తుకున్నాయి. నటీనటుల విషయానికి వస్తే వయసుకి తగిన పాత్రలో వెంకటేష్ హుందాగా నటించాడు. తన ఇమేజ్‌కి కాస్త విభిన్నమైన సబ్జెక్ట్‌ని డేరింగ్ అండ్ డాషింగ్‌గా ఎంచుకుని, కమర్షియల్ ఎలిమెంట్స్ సమపాళ్ళలో లేకున్నాగానీ చిత్రానికి ఆయువుపట్టుగా నిలిచి ప్రాణంపోశాడు ప్రిన్స్ మహేష్ తన సహజ సిద్ధమైన నటనతో.

ఇలాంటి క్లీన్ మూవీని అందించిన దర్శకుడు, నిర్మాత లతోబాటు చిత్రాన్ని బ్రహ్మాండంగా ఆదరించి కలెక్షన్లవర్షం కురిపించి, ముందుముందు ఇలాగే రక్తపు మరకలు లేని మంచి చిత్రాలువస్తే చూడటానికి మేము సిద్ధమే అని చాటిన తెలుగు సినీప్రేక్షకులు కూడా అభినందనీయులే.

- షేక్ అబ్దుల్ మజీద్, ముదినేపల్లి

హింసకు సెన్సార్ చెక్ పెట్టాలి

ఇటీవల కాలంలో కర్నాటకలో విజయం సాధించిన 'దండు పాళ్యం' తెలుగులో అనువాద చిత్రంగా వస్తోంది. దాంతో హింస, పైశాచికత్వ ధోరణి కలిగి వుంది. గతంలో ఒక న్యూస్‌పేపర్‌లో లోగోచూస్తే (కాన్సెప్ట్) 18 మహిళలను హత్య చేస్తూ, ఆ హత్య చేసేటప్పుడు వారి ఆక్రందనలకు హీరో ఆనందం పొందటం, ఆ ఆనందంకోసం 18 హత్యలు చేయటం ఇతివృత్తం. ఇలాంటి సినిమాలను బ్యాన్ చేయాలి. లేదా అధిక కట్స్‌తో సెన్సార్ విడుదలకు అనుమతి ఇవ్వాలి. ఇటీవల ఢిల్లీలో జరిగిన సంఘటన సినిమా తీస్తే మేం ముందుకు వస్తామని హీరోయిన్లు ప్రకటించడం దురదృష్టకరం. సందేశాత్మక సినిమాలని నటించాలి తప్ప ఇలాంటి ఇతరుల మనోభావాలు దెబ్బతీస్తాయి.

- అయినం రఘురామారావు, ఖమ్మం

'ఎన్‌టిఆర్ నటనా తపస్సు'

4-1-2013 శుక్రవారం వెన్నెలలో 'ఎన్‌టిఆర్ నటనా తపస్సు' బి.కె.ఈశ్వర్ అందించిన వ్యాసం చదివి క్రమశిక్షణ ఏమిటో ఎన్‌టిఆర్ దగ్గర నేర్చుకోవలసిందే. నాటి తారలు అనే కన్నా నేటి తారలు అనడం సబబు. నేటి తారలు షూటింగ్‌లో తమకు కనీస సౌకర్యాలు కలుగుతున్నాయా! వేళకు తిండి దొరుకుతుందా? హోటల్ సౌకర్యాలు తృప్తిగా వుంటున్నాయా! అనే ధ్యాసే తప్ప నటనలోని అంతర్లీనం గ్రహించలేకపోతున్నారు. నటనలోని దృశ్యాలపైన అవగాహన కూడా లేకుండా షూటింగ్ టైమ్‌లో ఏ కాస్ట్యూమ్స్ వేసుకొనాలో ఇవి ఆలోచిస్తున్నారు. యన్.టి.రామారావు తన గొప్పతనాన్ని భక్తి భావాన్ని ప్రదర్శించి నట జీవితంలో అయన ఈ అనుభవం గుర్తింపు కలగాలి అది ఎన్‌టిఆర్ తపస్సు.

- ఎం.ఎం, ముద్దనూరు

'తీసేవాళ్లు- చూసేవాళ్లు'

సినిమాలను తీసేవాళ్లకి భాష, సంస్కృతుల పట్ల గాఢమైన అభిమానం కలిగి వుండి భావోద్వేగాలను అర్థవంతంగా, సున్నితంగా విశిష్టమైన పాత్రల ద్వారా, బలమైన సన్నివేశాలతో, పాత్రోచితమైన సంభాషణలతో, జిగిబిగిగా తీయగలిగే సామర్థ్యం ఉండి 'ధనాత్మక' దృక్పథం ఉన్నప్పటికీ కళాత్మక దృక్పథం తప్పనిసరిగా ఉండితీరాలి. చూసేవారికి కూడా అటువంటి దృక్పథమే ఉండాలి. నటుల అభినయాన్ని అభిమానించాలే గాని నటులను మాత్రం కాదు! చాలాకాలంనుండీ 'తీసేవాళ్లు-చూసేవాళ్లు' సరిగ్గాలేరు. అన్నీ వికృతమైన పోకడలు వున్న సినిమాలే (పేర్లతో సహా) కొత్తవి అన్న కారణంగానో, 'అభిమాన నటులు' ఉన్నారన్న కారణంగానో చూస్తున్నారు! కొత్త సినిమాలు తిరిగి ఎప్పుడయినా విడుదలయ్యే అవకాశాలు దాదాపుగా ఉండవు! కళాఖండాలు కలకాలం నిలిచి ఉంటాయి- ధ్రువతారలు లాగా. 'కళా'ఖండాలు ముక్కచెక్కలయిన అద్దపు ముక్కలు! ఏవి కావాలో ఇక ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

- ఎన్.మధుసూదనరావు, హైదరాబాద్

కడలి

గతంలో గీతాంజలి, అంజలి, దళపతి, రోజా వంటి అత్యున్నత స్థాయిలో చిత్రాలు తీసి భారతీయ సినిమా ఖ్యాతిని ఖండ ఖండాలకు వ్యాపింపజేసిన మణిరత్నం దర్శకత్వంలో ఎన్నో భారీ అంచనాలను మోసుకొంటూ వచ్చిన 'కడలి' ప్రేక్షకులను తీవ్రంగా నిరాశ పరచింది. ఈ సినిమాకు ఏ.ఆర్.రహ్మాన్, రాజీవ్ మీనన్ వంటి ఎందరో గొప్ప సాంకేతిక నిపుణులు పనిచేసి చక్కని ప్రతిభకనబరచినా పేలవమైన కథ, ఆకట్టుకోని కథనం వలన సినిమా అస్సలు బాగోలేదు. ఒక దశలో సినిమాను ఎటువైపు నడిపించాలో దర్శకుడికి అర్థంకాలేదనిపిస్తుంది. మీసాల దొర, ఫాదర్ శ్యాంల పాత్రలు ఒక్కటే కాస్త బాగున్నాయి. హీరో, హీరోయిన్ పాత్రలు డ్యూయెట్లకే పరిమితమయ్యాయి. గౌతం, తులసిలు నటనలో ఇంకా ఆ ఆల దశలోనే వున్నారు. సినిమా ఆద్యంతం సీరియస్‌గా సాగి రిలీఫ్ అనేది లేకుండాపోయింది. అధిక భాగం సన్నివేశాలు బలంలేక చప్పగా సాగిపోయాయి. ఆకట్టుకునే కథనం లేకుండా కేవలం సాంకేతిక పరిజ్ఞానంతో ప్రేక్షకులను రెండున్నర గంటలపాటు కుర్చీలో కూర్చోబెట్టాలనుకోవడం దర్శకుని దుస్సాహసం అని చెప్పవచ్చు. శ్రీరామకృష్ణ యొక్క కలం వెలవెలపోయింది. చాలాచోట్ల లిప్ సింక్రనైజేషన్ కుదరక ఇబ్బంది పెట్టింది. ఫొటోగ్రఫీ అద్భుతంగా వుంది. సంగీతం ఎప్పటిలాగే విందు భోజనంలా కమ్మగా వుంది. మొత్తంమీద నలభైలో పడిన క్రికెటర్‌కు టి-20 టీమ్‌యొక్క బాధ్యతలు అప్పగిస్తే ఫలితం ఎలా వుంటుందో కడలి సినిమా కూడా అలానే వుంది.

- ఎం.కనకదుర్గ, తెనాలి

అచ్చతెలుగు సినిమా

ఆంధ్రభూమి వెన్నెల అనుబంధంలో 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' సినిమా రివ్యూ చదివి స్ఫూర్తిపొంది ఆ సినిమా చూశాను. వెన్నెలలో సమీక్షలాగే ఆ సినిమా కూడా ఎంతో అందంగావుండి హృదయంలో ఆనందపు జల్లులు కురిపించింది. పెద్దోడు-చిన్నోడు పాత్రలను బ్యాలెన్స్ చేసిన విధానం హర్షణీయం. అందరినీ పలుకరిస్తూ ఆనందంగావుంటే సమాజమెంతో బాగుంటుంది అన్న సందేశాన్ని ప్రకాష్‌రాజ్ పాత్ర ద్వారా చక్కగా చెప్పించారు. లబ్బప్రతిష్ఠలైన కవులచేత అత్యుత్తమ సాహిత్యం రాయించి వాటికి వీనులవిందైన సంగీతం అందించడం ఒక ప్లస్ పాయింట్. మణిశర్మ నేపథ్య సంగీతం అద్భుతంగా వుంది. నాకంతా అలాగే ముందుగా తెలిసిపోతుంటాయి అని అమాయకంగా మాట్లాడుతూ అంజలి చేసిన సహజసిద్ధమైన నటన మనస్సులలో చెరగని ముద్రవేసింది. రక్తపాతాలు, బాంబు బ్లాస్టింగులు, బూతు కూతలు, వాయిద్యాల ఘోష, హీరోహీరోయిన్ల అసభ్య నృత్యాలు, కమెడియన్ల వెకిలిచేష్టలు లేకుండా ప్రతి ఫ్రేములో తెలుగుదనం ఉట్టిపడేలా అందరూ తెలుగు నటులతో తీసిన అచ్చతెలుగు సినిమా 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' సినిమాను ఆదరించి, మంచి తెలుగు సినిమా తీయడానికి నిర్మాతలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై వుంది.

- సిహెచ్.సాయిబుుత్విక్, నల్గొండ

మళ్ళీ విడుదల చేయండి!

ఒక చిత్రం ఒకనాడు పరాజయం పొందినంతమాత్రాన నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. అప్పుడు దానిని ప్రేక్షకులు అందుకొనే స్థితిలోకూడా వుండకపోవచ్చు కదా! అనుకోవాలి. 'చంద్రహారం', 'కాడెద్దులు- ఎకరం నేల', 'వాల్మీకి'లాంటి చిత్రాలు మళ్ళీ విడుదలచేసేందుకు చిత్ర నిర్మాతలు ముందుకు రావాలి. కాలానుగుణంగా వచ్చిన మార్పుల వలన వాళ్ళకు మళ్ళీ కాసుల పంటలు పండవచ్చుకదానని ఎందుకు అనుకోరు?

- కూర్మాచలం వేంకటేశ్వర్లు, కరీంనగరం

**'మీ వ్యూస్'కు

వెన్నెల ఆంధ్రభూమి IV
శుక్రవారం 8 ఫిబ్రవరి 2013

ఈపాట గుర్తుందా?

తెలుగుసినిమా అంటే మంచి పాటకు చిరునామా. పాటలు లేకుండా సినిమా చూడలేకపోవడం అన్న అభిరుచి ఇప్పటికీ అలాగే నిలిచివున్నా, సాహిత్యపు విలువలు మాత్రం నానాటికీ తీసికట్టవుతున్నాయి. కొత్త పాటలు బాగులేవని గొంతు చించుకోవడం కన్నా, పాత పాటల్లోని మాధుర్యాన్ని ఓసారి గుర్తు చేసుకోవడమే ఈ శీర్షిక ఉద్దేశం. పాఠకులు కూడా తమకు గుర్తున్న మంచి పాటలను కార్డుపై రాసి పంపించవచ్చు. బాగా పాపులర్ అయిన పాత పాటల కన్నా, మరిచిపోతున్న మంచిపాటలను గుర్తుచేయడం ముఖ్యం.

ఈ కోవెల నీకై వెలిసింది
ఈ వాకిలి నీకై తెరిచింది
రా దేవి తరలి రా నా దేవి తరలిరా
ఈ కోవెల నీకై వెలిసింది
ఈ వాకిలి నీకై తెరిచింది
రా స్వామి తరలి రా నా స్వామి తరలిరా

దేవత గుడిలో లేకున్నా
దీపం పెడుతూ ఉన్నాను
దేవత గుడిలో లేకున్నా
దీపం పెడుతూ ఉన్నాను
తిరునాళ్ళెపుడో రాక తప్పదని
తేరును సిద్ధంచేశాను
దేవుడు వస్తాడని
రోజూ పూవులు ఏరి తెస్తున్నాను
దేవుడు వస్తాడని
రోజూ పూవులు ఏరి తెస్తున్నాను
రేపటికోసం చీకటి మూసిన తూరుపులాగా
ఉన్నాను
తూరుపులాగా ఉన్నాను

ఈ కోవెల నీకై వెలిసింది
ఈ వాకిలి నీకై తెరిచింది

నీరు వచ్చే ఏరువచ్చే ఏరుదాటే ఓడ వచ్చే
నీరు వచ్చే ఏరువచ్చే ఏరుదాటే ఓడ వచ్చే
ఓడ నడిపే తోడు దొరికే ఒడ్డుచేరే రోజు వచ్చే
ఓడ చేరే రేవువచ్చే నీడ చూపే దేవుడొచ్చే
ఓడ చేరే రేవువచ్చే నీడ చూపే దేవుడొచ్చే
రేవులోకి చేరేలోగా దేవుడేదో అడ్డువేసే
ఆ దేవుడేదో అడ్డువేసే

ఈ కోవెల నీకై వెలిసింది
ఈ వాకిలి నీకై తెరిచింది
రా దేవి తరలిరా నా స్వామీ తరలిరా
రా దేవి తరలిరా నా స్వామీ తరలిరా

ఈ పాట మీకు తెలుసా?
ఏ సినిమాలోది?
గీత రచయిత ఎవరు?
సంగీత దర్శకుడు ఎవరు?
మాకు తెలియచేయనక్కరలేదు..
మీరు గుర్తు చేసుకుంటే చాలు..
తెలియకుంటే, వివరాలు వచ్చేవారం ఇక్కడే.

గతవారం పాట
సినిమా : ఆత్మీయులు
సంగీతం : ఎస్.రాజేశ్వర్‌రావు
రచన : దాశరథి

నీ ఆశ.. అడియాస!

''కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిరసనగా పద్మభూషణ్ పురస్కారాన్ని తిరస్కరిస్తున్నాను. సముచితమైన గౌరవం ఇవ్వాలనుకుంటే భారతరత్న ప్రకటించాలి''... ఈ మాటలు గాయని యస్.జానకి నోటివెంట రావడం నిజమో కాదో అనే సంశయం ఆమెను అభిమానించే అసంఖ్యాక అభిమానులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. పాలఘాట్‌కి దగ్గరలోవున్న శ్రీకృష్ణపురంకు ఒక వివాహ సందర్భంగా విచ్చేసిన జానకిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారం గురించి విలేఖరులు అడిగిన స్పందనకు ఆమె ఇచ్చిన సమాధానం విని అభిమాన జనం నిశ్చేష్టులయ్యారు. దక్షిణాది సినీ రంగంలో 55 సంవత్సరాలుగా కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వంనుండి తగినంత గుర్తింపు రాలేదని, దక్షిణాది రాష్ట్రాల సినీ కళాకారులకు 'పద్మ' పురస్కారాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు ఆమె విమర్శించడం కేవలం యాధృచ్ఛికమా లేక నిజమైన అభిప్రాయమా అనేది సంశయమే!

1938లో గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించిన శిష్ట్లా జానకి వారణాసి బలరామయ్యవద్ద శిష్యరికం చేసి చిరుప్రాయంలోనే లతామంగేష్కర్, పి.లీల, జిక్కి, పి.సుశీల పాటలు వేదికలపై పాడుతుండేది. తన 19వ ఏట మద్రాస్ వచ్చి ఏవిఎం స్టూడియోలో గాయనిగా 9 నెలలు పనిచేశాక 1957లో ''విదియన్ విలయాట్టు'' తమిళ చిత్రంలో సంగీత దర్శకులు టి.చలపతిరావు జానకితో ఒక పాట పాడించడంతో ఆమె చిత్ర రంగానికి పరిచయమయ్యారు. అనుపమ చిత్రాల తిలక్ జానకి చేత ఎంఎల్ఏ చిత్రంలో రెండు పాటలు పాడించారు. అలా తెలుగులో జానకి ఘంటసాలతో పాడిన మొదటి పాట ''నీ ఆశ యడియాస..చేజారే మణిపూస'' 04-04-1957న రికార్డు అయ్యింది. అప్పటికే తెలుగులో పి.లీల, జిక్కి, పి.సుశీల స్థిరపడడంతో జానకికి ఆశించినన్ని అవకాశాలు రాలేదు. వాంప్‌లకు, క్లబ్ డాన్స్‌లకు, హాస్య నటీమణులకు పాటలు పాడుతుండేది. నేను హైస్కూల్‌లో చదువుతుండగా (1962) కందుకూరులో నటీమణి రాజసులోచనతో ఒక నాట్య ప్రదర్శన ఏర్పాటు జరిగింది. అది కళాదర్శకులు టి.వి.ఎస్. శర్మగారి వూరు. చిత్తూరు నాగయ్యకు సన్మానం, పి.బి.శ్రీనివాస్, జానకిలతో సంగీత విభావరి ఆ కార్యక్రమంలో భాగం. వర్షాభావం చేత ఆ కార్యక్రమం రద్దయింది. కానీ ఆ పాటల రిహార్సల్స్‌కు నేను హాజరయ్యాను. పి.బి.శ్రీనివాస్ పేరు కొంత మందికి తెలిసినా, జానకి పేరు అంతగా తెలియదు. రాజసులోచన, నాగయ్యలకోసం జనం ఎగబడ్డారే కాని జానకి కోసం కాదు. తదనంతర కాలంలో (70-80 దశకాల్లో) జానకి మంచి పాటలు పాడి పేరుతెచ్చుకుంది. స్వయంగా జానకి మితభాషి. అటువంటి జానకి పద్మ పురస్కారాన్ని తృణీకరించడం విచారకరమైన విషయమే!

'భారతరత్న' పురస్కారాలు 1954నుండి కేవలం 41 మందికే లభించాయి. కారణం అది మన దేశ అత్యున్నత పురస్కారం. కళలను ప్రోత్సహిస్తూ 1998లో యం.యస్.సుబ్బలక్ష్మికి; 2001లో లతా మంగేష్కర్‌కి; 2008లో భీమ్‌సేన్ జోషికి ఈ పురస్కారాలు భారత రాష్ట్రపతి ప్రదానం చేసారు. యం.యస్.సుబ్బలక్ష్మికి 1954లో పద్మభూషణ్ 1975లో పద్మవిభూషణ్ లభించిన 23 సంవత్సరాలకి గానీ భారతరత్న వరించలేదు. లతామంగేష్కర్‌కి 1969లో పద్మభూషణ్ 1999లో పద్మవిభూషణ్ లభించిన 2 సంవత్సరాలకి గానీ భారతరత్న వరించలేదు. భీమ్‌సేన్ జోషికి 1985లో పద్మభూషణ్, 1999లో పద్మవిభూషణ్ లభించిన 9 సంవత్సరాలకి గానీ భారతరత్న వరించలేదు. సంగీత చక్రవర్తులు మంగళంపల్లి బాలమురళీకృష్ణకు 1991లో; ఆశాభోంస్లేకు 2008లో; పండిట్ జస్‌రాజ్, హరిప్రసాద్ చౌరాసియాలకు 2000లో పద్మ విభూషణ్ లభించినా వారికి భారతరత్న పురస్కారం ఇంకా దక్కలేదు. ఏసుదాస్, పి.సుశీల, మన్నాడే, ఇళయరాజా, యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఖయ్యాంలు ఇంకా పద్మభూషణ్ వరకే పరిమితమయ్యారు. తమిళ గాయకుడు టి.ఎం.సౌందర్‌రాజన్, గాయని చిత్ర, హిందీ చిత్ర గాయకులు మొహమ్మద్ రఫీ, మహేంద్రకపూర్, హృదయనాథ మంగేష్కర్‌లు పద్మశ్రీ పురస్కారాలకే పరిమితమయ్యారు. కనీసం పద్మశ్రీ పురస్కారం కూడా అందుకోని జానకి ఏకంగా భారతరత్న పురస్కారానికి వువ్విళ్ళూరడం అత్యాశకాక మరేమనాలి? పద్మ పురస్కారాలు ఇవ్వడానికి అవసరమైన మార్గదర్శకాలు జానకికి తెలియకనా లేక అక్కసు వెళ్లగక్కే అవకాశం వచ్చిందని ఆక్రోశంతో చేసిన ప్రకటన ఇది?? ఇళయరాజా పుణ్యమా అని 80, 90దశకాల్లో జానకి ఎక్కువ పాటలు పాడగలిగింది కానీ, లేకుంటే ఆమె స్వరం కొన్నిరకాల పాటలకే పరిమితమై ఉండేదన్నది వాస్తవం కాదా.???

ఏదిఏమైనా ఈ ప్రకటనతో జానకిపై సంగీతాభిమానులకున్న గౌరవం సన్నగిల్లిందనే వాస్తవం! సత్యదూరం కాదు!!. వివిధ దక్షిణాది భాషల్లో, హిందీలో దాదాపు పదిహేను వేలు పైగా పాటలు పాడిన జానకికి నాలుగు జాతీయ పురస్కారాలు, ముప్పైపైగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు,. కలైమామణి బిరుదు దక్కాయి. ఆమె పాడిన పాటలు కొన్ని తరాలవరకు వెలుగు చూస్తూనే వుంటాయి. ముఖ్యంగా జానకి ఆలపించిన పాటలు- నీ లీల పాడేద దేవా (మురిపించే మువ్వలు); పగలే వెన్నెలా (పూజాఫలం); నీలి మేఘాలలో (బాలమరదళ్ళు); నరవరా ఓ కురువరా (నర్తనశాల); ఆడదాని వోరచూపులో (ఆరాధన); పగలైతే దొరవేరా (బంగారు పంజరం); వల్లభా ప్రియవల్లభా (శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణుకథ); ఏ దివిలో విరిసిన పారిజాతమో (కన్నె వయసు); గున్న మామిడి కొమ్మమీద (బాలమిత్రుల కథ); ఆరనీకుమా ఈ దీపం (కార్తీక దీపం); గోవుల్లు తెల్లన (సప్తపది); పట్టి తెచ్చానులే పండువెన్నెల్ని (ఆత్మబంధువు) వైవిధ్య భరితమైనవి. ఈ వయసులో జానకి హుందాగా వుంటే ఆమె మీద గౌరవభావం పెరుగుతుంది. అనుచిత వ్యాఖ్యలవల్ల ఆమె గౌరవం దెబ్బతింటుందే కాని మరొకటి కాదు.

- ఆచారం షణ్ముఖాచారి

లతామంగేష్కర్ 'లవ్ స్టోరీ'

ప్రసిద్ధ గాయని లతామంగేష్కర్- పేరుప్రఖ్యాతులు సంపాదించడానికి ముందు అంటే తొలిరోజుల్లో పెద్ద కుమార్తెగా కుటుంబ భారాన్నంతా తనే నిర్వహించవలసి వచ్చేది. ఆ విధంగా ఆర్థికపు సమస్యలన్నీ తనొక్కతే ఎదు

ర్కొనేది. అందువల్లే తన వివాహం గురించి ఆలోచించకుండా, కుటుంబంకోసం కష్టాలుపడుతూ ఉండేదని చిత్ర పరిశ్రమలోనివారు అనుకుంటూ ఉంటారు. అది కొంతవరకూ నిజమేకానీ, ఆ తర్వాతైనా ఆమె ఎందుకు పెళ్లిచేసుకోలేదనడానికి ఆమె సన్నిహితులు ఓ చిన్న 'ప్రేమకథ'ను కారణంగా చెబుతూ ఉంటారు. అదేమిటంటే, ఆమె ఆ రోజుల్లో ప్రసిద్ధ సినీ గాయకుడు కె.ఎల్.సైగల్‌ను 'సైలెంట్'గా ప్రేమిస్తూ ఉండేదట.

తనకు గాయనిగా పేరొచ్చాక, అప్పుడు తన ప్రేమను ఆయనకు వ్యక్తంచేయాలని అనుకున్నదేమో! అప్పుడప్పుడే సినిమా పాటల్లో బృంద గానాలనుంచి 'సోలో' పాటకు వచ్చే దశలో ఒక రోజు తన సంపాదనతో రేడియో కొనుక్కుని ఉత్సాహంగా ఇంటికి వచ్చింది. రేడియో ఆన్ చేస్తే అప్పుడే వార్తలు వస్తున్నాయి. ఆమె ముందుగా విన్నది సైగల్, మరణవార్త! ఆమెకు అదో షాక్! అందుకే ఆ తర్వాత ఆమె పెళ్లి సంగతి 'మరచిపోయిందని' సన్నిహితులు చెబుతూ ఉంటారు!

- బి.కె.ఈశ్వర్

1963 సవతి కొడుకు

1963 ఫిబ్రవరి నెలలో ఎన్.టి.రామారావు కథానాయకునిగా 6-2-63న పెంపుడు కూతురు, 19-2-63న వాల్మీకి, 22-2-63న సవతి కొడుకు మూడు చిత్రాలు విడుదలయ్యాయి.

నవీన చిత్ర పతాకంపై, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించి వై.రంగారావు రూపొందించిన చిత్రం 'సవతి కొడుకు'

'సవతి కొడుకు' చిత్రానికి తొలిసారిగా సంగీత దర్శకత్వ బాధ్యతలు సత్యం చేపట్టారు. టి.వి.రాజు పర్యవేక్షణ చేశారు. ఛాయా గ్రహణాన్ని జానకిరామ్, నృత్యం వి.జె.శర్మ, స్టంట్స్ సాంబశివరావు అండ్ పార్టీ, శబ్ద గ్రహణం వి.శివరామ్, చిత్రానికి రచన బైరాగి.

వెంకయ్య (గుమ్మడి) భార్య కొడుకు శేషు (ఎన్టీఆర్)ను కని మరణిస్తుంది. వెంకయ్య లక్ష్మిని రెండో పెళ్లి చేసుకుంటాడు. శేషును కన్నబిడ్డలా పెంచమని కోరుతాడు. లక్ష్మి (హేమలత)కు శేఖర్ (బ్రహ్మం) అనే మగబిడ్డ పుడతాడు. పిల్లలిద్దరినీ ప్రేమగా పెంచి పెద్ద చేస్తుంది లక్ష్మమ్మ. చిన్న వాడు శేఖర్ చదువులో చురుకుగా ఉంటాడు.

శేషుకు చదువు సరిగా అబ్బకపోవడంవల్ల తండ్రి అతన్ని వ్యవసాయంలో పెడతాడు. లక్ష్మి అన్న సుబ్బరాజు (చదలవాడ), అతని భార్య పిచ్చమ్మ, సుశీల (వాసంతి), చల్‌మోహన్ (రేలంగి) వారి సంతానం.

సుశీలను పట్నంలో చదువుతున్న శేఖర్‌కిచ్చి పెళ్లి చేయాలని, కొడుకు చల్‌మోహన్‌కు ఎక్కువ కట్నం ఇచ్చే సంబంధం చేసుకోవాలని సుబ్బరాజు ఆశ. సుబ్బరాజు చెల్లెలు కూతురు లలిత (గిరిజ), చల్‌మోహన్ ప్రేమించుకుంటారు. శేషు భార్య జానకి (జానకి) అనుకూలవతి, వారికొక కూతురు. జానకి తల్లిదండ్రులు సిఎస్ఆర్, లక్ష్మీకాంతమ్మ దురాశపరులు. పట్నంలో వున్న శేఖర్ ఒక నాటకాలమ్మాయి లీల మోహంలో పడి మందుకు బానిసై వ్యసనపరుడౌతాడు.

తండ్రి వెంకయ్య ఆ బెంగతో మరణిస్తూ ఆస్తి అంతా పెద్ద కొడుకు పేరు రాస్తాడు. చల్‌మోహన్ ఓ నాటకం ఆడి లీల గుట్టు తెలియజేసి శేఖర్‌ను ఆమె వ్యామోహంనుంచి తప్పిస్తాడు. పల్లెటూరు చేరిన శేఖర్ అన్నతో విభేదించి తల్లిని తీసుకుని వేరుకాపురం పెడతాడు. తల్లి, తమ్ముడు దూరమయినందుకు కుమిలిపోతున్న శేషు మీద, దురాశాపరుల చెప్పుడు మాటలు విని గొడవకు దిగుతాడు శేఖర్. చివరకు అతనికి బుద్ధి వచ్చి నిజం తెలుసుకుని అన్నగారి కాళ్లు పట్టుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

మానసిక సంఘర్షణతో కూడిన పెద్దకొడుకు శేషు పాత్రను ఎంతో ఉన్నతంగా, వైవిధ్యంగా పోషించారు హీరో ఎన్టీఆర్. తల్లి ఇల్లు విడిచి వెళ్లిన కారణంగా అనురాగవతి అయిన భార్యను నిరాదరించే సన్నివేశాల్లో, తమ్ముడుపట్ల వాత్సల్యాన్ని ప్రదర్శించే సన్నివేశాల్లో, తల్లిపట్ల ఆవేదన పడే తనయునిగా చిత్రానికి తన నటనతో నిండుతనం తెచ్చారు ఎన్టీఆర్.



1962లో పి.ఎ.పి వారి 'కులగోత్రాలు' చిత్రంలో గెస్ట్ పాత్ర పోషించిన బ్రహ్మం రెండవ కథానాయకుడుగా ప్రాధాన్యత గల పాత్ర పోషించడం విశేషం. హుషారైన ససరారే పాటలో స్టెప్స్ వేసినా, అందంగా వున్నా, ఇతనికి తరువాత అంతగా అవకాశాలు రాలేదు.

ఈ చిత్రంలో మొత్తం పది పాటలున్నాయి. ''ఈ దేశం ఆంధ్రుల దేశంరా (ఘంటసాల బృందం), 'అమ్మా నీ ప్రాణమే పోసినావే' (ఘంటసాల కోరస్), అరె పాలపొంగులా వయసేమో నీ లేత చెమల తళుకే (ఘంటసాల, కె.జమునారాణి), 'ఏమి సొగసు ఆహా ఏమి వగలు' (మాధవపెద్ది, కె.రాణి), 'ససస సారె గగగ గారె' (ఘంటసాల, ఎస్.జానకి), 'నయనాల నీలాలో నీవే కదా జాబిలి' (పి.సుశీల ఘంటసాల) 'ఆనాటి హాయి ఏమాయెనో' (ఘంటసాల), 'ఆనాటి హాయి ఏమాయనో' (సుశీల), 'నాలో నిండే చీకటి, చీకటియే జగాన' (పి.బి.శ్రీనివాస్)

బైరాగి రచన చేసిన ఈ పాటల్లో ససస సారె హుషారుగా సాగుతుంది.

'నయనాల నీలాలో' చిత్రీకరణ ఆహ్లాదంగా ఉంటుంది. చిత్రం చివరలో రిపీట్ అవుతుంది.

చిత్రంలో హేమాహేమీల్లాంటి నటులున్నప్పటికీ, 'సవతి కొడుకు' చిత్రం మాత్రం సక్సెస్ సాధించలేదు. 'ససస సారె అంటూ ఘంటసాల పాడిన పాట ఆ రోజుల్లో రికార్డు సృష్టించింది.

-సి.వి.ఆర్.మాణిక్యేశ్వరి

అబద్ధం

ట్విట్టర్‌లూ - ఫేస్‌బుక్‌లూ వచ్చేసి - బతుకుల్ని నాశనం చేసేస్తున్నాయా? ఏవో కొన్ని వార్తలూ కథనాలూ ఆ మాటని కొంత నిజమనీ.. ఇంకొంత అబద్ధమనీ తేల్చినప్పటికీ.. సోషల్ నెట్‌వర్క్ ప్రభంజనంలో 'సెలబ్రిటీలు' మాత్రం కొట్టుకు పోతున్నారు. ఏ 'రూమర్' ఎటు నుంచీ ఎక్కడ్నుంచీ మొదలవుతుందో తెలీదు. క్లైమాక్స్‌లో అది 'నిజం'గా చెలామణి అవుతోంది. బాలీవుడ్‌లో ఈ చోద్యం మరీనూ. తాజాగా- హృతిక్ రోషన్ వీటి బారిన పడ్డాట్ట. దాంతో - ఉన్న నిజాల్ని మాత్రమే రాయండి. లేనిపోనివి పెట్టకండి.. అంటూ ప్రాధేయ పడ్డాడు. ఏదో ఒక షూటింగ్‌లో ఏదో ఒక చిన్న సంఘటన జరుగుతుంది. దాన్ని చిలవలుపలవలు చేసేసి.. ఉన్న పళంగా ఈ భూగోళం బద్దలై పోతుందన్నంత ఆర్భాటం చేసేస్తున్నారనీ.. సెలబ్రిటీ అన్నత్వాత ఇటువంటివి సహజమే అయినప్పటికీ.. వాటికి మెరుగులు దిద్ది పోస్ట్ చేయటం వల్ల 'మా మనోభావాలు' దెబ్బతింటున్నాయని వాపోయాట్ట.

అంతా లేదు!

ఒక్కోసారి విపరీతమైన పబ్లిసిటీ లేనిపోని తలనొప్పి తెచ్చిపెడుతుంది. 'మర్డర్-3' చిత్రంలోనూ ఇదే తంతు. అదితి రావ్ హైదరీ నటించిన ఈ చిత్రానికి మొదట్నుంచీ 'ఏరోటిక్' టాక్ వచ్చేసింది. దాంతో ఈ సినిమా ఎక్కడ 'కుటుంబ సమేతంగా' అన్న ట్యాగ్ దూరమవుతుందేమోనని - అదితి ఈ చిత్రం గురించి మరో పబ్లిసిటీ మొదలెట్టేసింది. కథ అద్భుతం. ప్రేమపాళ్లు చాలా. అనుబంధాలూ ఆప్యాయతలూ ఎలా ఉండాలో చూపించిన సినిమా. 'మర్డర్' అంటే క్రైం స్టోరీగా భావిస్తారెవరైనా? కానీ - సెక్స్ పాళ్లు అతి తక్కువగా.. అనుబంధాల రీళ్లు ఎక్కువగా ఉన్న సినిమా ఇది. విశేష్ భట్ ఈ చిత్రాన్ని ఎంతో అందంగా మలిచాడు. న్యూయార్క్‌లో చదువుకున్నప్పటికీ భారతీయ సంస్కృతి పట్ల అతడికెంతో అభిమానం. ఆ నేపథ్యంలో కథని అల్లుకున్నాడు అంటూ ప్రచారం ప్రారంభించింది. చూద్దాం. ఈ పబ్లిసిటీ ఎంతవరకూ లాభిస్తుందో?! 'మర్డర్' ప్లాన్ సక్సెస్ అవుతుందా? లేక ప్రేక్షకుల్ని 'మర్డర్' చేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

'నో'!!

'కంపెనీ'లోని చందూ - 'సాథియా'లోని ఆదిత్య కేరెక్టర్లు నడిచొస్తే ఎలా ఉంటుంది? వివేక్ ఒబెరాయ్ ఆయా పాత్రల్లో జీవించాడన్న సంగతి తెలిసిందే. 'జయంతభాయ్ కీ లవ్‌స్టోరీ' చిత్రంలో ఆ కేరెక్టర్లు మళ్లీ కనిపించనున్నాయి. ఈ సినిమాలో 'గ్యాంగ్‌స్టర్'గా నటించనున్న వివేక్ మాటల్లోనే - ఫిల్మ్ మేకర్ తరుణ్ 'నీ కోసం పర్‌ఫెక్ట్ స్క్రిప్ట్ తయారుచేశాం' అని చెప్పాడు. వినీల్ మార్కన్ రచించిన ఆ స్క్రిప్ట్ వింటే నన్ను నేనే మర్చిపోయా. నిజ జీవితంలో ఎంతో సింపుల్‌గా ఉంటాను. ఆ కేరెక్టర్‌కీ 'రీల్' కేరెక్టర్‌కి మధ్య వొదిగిపోయే పాత్ర అది...' అంటూ ఏవేవో చెప్పేశాడు. ఆ సంగతి పక్కనబెడితే - వివేక్‌ని భార్యా విధేయుడంటారట కొంతమంది. ఎందుకంటే- తన సతీమణి ప్రియాంకకి ఏ విషయంలోనూ 'నో' అని చెప్పలేదట. యాదృచ్ఛికంగా ఈ 'లవ్‌స్టోరీ'లోనూ జయంత్ తన భార్యకు 'నో' అని చెప్పడట. ఈ సినిమా హిట్ కావటానికి ఇదో సెంటిమెంట్ కలిసొచ్చిందిట. వివేక్ ఒబెరాయ్ సరసన నేహ శర్మ నటిస్తోండగా, ఫిబ్రవరి 15న విడుదల కాబోతోందీ సినిమా.

ముంబై టాక్

-బిఎన్

కొరివితో తలగోక్కోవటం అంటే ఇదే?!

న్యూఢిల్లీ నగరం 'రేప్' అన్న మాటతో అట్టుడికిపోతోంటే - ఎవరి అభిప్రాయాలు వాళ్లవే అయినప్పటికీ - తమ నిర్ణయాలను జనం నెత్తిన రుద్దేందుకు ప్రయత్నిస్తే.. ఇక అంతే! ఇండో-కెనడియన్ శృంగార తార సన్నీ లియోన్ ఉన్నట్టుండి సమస్యల సుడిగుండంలో చిక్కుకొంది. 'రేప్ ఈజ్ నాట్ క్రైం. ఇట్స్ ఎ సర్‌ప్రైజ్ సెక్స్'... ట్విట్టర్‌లో ఆ తార పోస్ట్‌చేసిన ఈ మాట సంచలనం సృష్టించింది. దీంతో పుంఖానుపుఃఖాలుగా తిట్ల పంచాంగం మొదలైంది. సున్నితమైన అంశాల పట్ల 'కామెంట్' చేయకుండా ఉండటం అన్నంత ఉత్తమం మరొకటి లేదనీ.. అప్పటికీ జ్ఞానోదయం కాక.. ఈ కామెంట్ 'ఇడియట్' అని అన్నదెవరు? ఎప్పటికి ఎదుగుతారు?! అంటూ ట్విట్టర్‌లో మరో కామెంట్. 'రేప్'ని సమర్థించటమే తప్పు.. పైపెచ్చు అది 'నరైనదేనంటూ' మరో తప్పు- ఇలా సన్నీలియోన్ పద్మవ్యూహంలో ఉండిపోయింది. కొంతమంది 'సన్నీ' ట్విట్టర్‌ని 'బ్లాక్' చేసేయమని సలహా ఇచ్చారు. మరికొంతమంది తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేశారు. దాంతో జనప్రభంజనాన్ని తట్టుకోలేక - ట్విట్టర్‌లో ఆ పేజీని 'బ్లాక్' చేసేసింది. అయినప్పటికీ - ఆమె వాక్ప్రవాహాన్ని మాత్రం 'బ్లాక్' చేయలేక పోయారు. తాజాగా 'రాగిణి ఎంఎంఎస్-2'లో నటిస్తోన్న ఈ పోర్న్‌స్టార్ 'వొళ్లు' దగ్గరుంచుకోక పోయినా ఫర్వాలేదు- మాటల్ని మాత్రం కొంచెం దాచుకొంటే మంచిదంటున్నారు సన్నిహితులు.

కుర్రకారుకి నానో కార్ల నజరానా!

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్‌కి మోటార్ కార్లను బహుమతులుగా ఇవ్వడం గొప్ప సరదా. లోగడ ఎం.పీలకు తలా ఓ కారు ఇస్తానంటూ ప్రకటించాడు. అట్లాగే నేడు ఆటల్లో ప్రతిభ చూపిన హైస్కూలు పిల్లలకి- (డ్రైవింగ్ లైసెన్సుల కోసం అర్జీ పెట్టుకుంటే ఇస్తారో ఇవ్వరో గానీ) 'నానో' కార్లు పంచి పెట్టేశాడు.

''అబ్బ! నానోనా?'' అనకుండా పిల్లలు ఎగిరి గెంతేసి అందుకున్నారు. నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీలలో నాసిక్ బాలిక అంజానా దాంక్‌కి మూడు బంగారు పతకాలొచ్చాయ్. ఆ అమ్మాయి పదిహేడు సంవత్సరాలకన్నా చిన్నది కనుక- కోచ్ ఆమెను నానో కారెక్కించి గ్రౌండు చుట్టూ తిప్పాడు. ''నేను ఈ అమ్మాయికి డ్రయివింగ్‌లో కూడా ట్రైనింగ్ ఇవ్వాలి కాబోలు'' అనుకున్నాడు. మొత్తం ఈ పోటీలలో 260 మంది వివిధ రాష్ట్రాలకి చెందినవారు పాల్గొన్నారు. వాళ్లందరికీ క్యాష్ వోచర్లు యిచ్చాడు-సి.ఎం. వాళ్ల ఊళ్లకు పోయి, ఆ రశీదులు చూపెడితే- బైసికిల్స్ యిస్తారు. ములాయం గారి పార్టీ గుర్తు సైకిలు అన్నమాట తెలుసు కదా? ఇక మహారాష్ట్ర బాలిక అపూర్వా ఘార్గే, కేరళా నుంచి చిత్రా, ఒరిస్సాకి చెందిన దుతీ చంద్‌లకి- బంగారం, దాంతోపాటూ 'నా నో'లు కూడా దొరికిపోయాయి. ''సైకిళ్లను యివ్వాలన్న నిర్ణయం నాన్నగారిది''- అన్నాడు ఈ యువ ముఖ్యమంత్రి. ములాయం అత్యుత్తమ క్రీడాకారులయిన టీనేజర్స్‌కి 21 వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని కూడా ప్రకటించాడు. కేరళ అమ్మాయి చిత్రా పి.యు. నాలుగు బంగారు పతకాలను సాధించింది. దినభత్యం మీద బతుకులాగే ఒక కార్మికుడి కుమార్తె ఆమె. ''నాన్నకి కారు, అమ్మకి ఈ నగదు యిస్తే- ఎంత గొప్పగా వుంటుందో?'' అంటూ సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బు అయిపోయింది. ''మా అక్క పెళ్లికి పైకం లేదు అని నాన్న బెంగతో వున్నాడు. ఇప్పుడిక బెంగలేదు, ఈ పైకంతో అక్క పెళ్లి బ్రహ్మాండంగా చేస్తాం'' అన్నదా చిన్నారి. నానో కార్లు ఎలాగోలా చెలామణీ కావాలి కదా! ఇక సైకిళ్లా? అవి అందరికీ కావాలి. సో..! సమాజ్‌వాదీ పార్టీ జిందాబాద్!

కొసవిరుపు...

కాఫీలు తెగ తాగేవారి జాబితాలో జర్మనీస్టులు వుంటారు, ''డేంజర్ గురూ!'' అనే వాళ్లుంటారు గానీ- ఓ కొత్త పరిశోధన- కాఫీని- మూడు నుంచి ఐదు కప్పుల దాకా హాయిగా గ్రోలితే- డయాబెటిస్ వ్యాధి- అల్జీమీర్స్ వ్యాధీ రాకుండా వుండొచ్చునట! అతిగా తాగితే- నిద్ర లేమి పీడిస్తుందని కొందరంటారు. అందుకే బెర్నాడ్ షాగారు- ''ఏ కప్పాఫ్ టీ!'' అన్నారు.

అవీ..ఇవీ..అన్నీ..
- వీరాజీ
veeraji@sify.com

చిట్కా

★ 'బాడీ లోషన్లను అధిక ధరలను కొనకుండా ఇంట్లోనే తయారు చేసుకుని వాడవచ్చు. చిన్న చిన్న నబ్బు ముక్కలను మూడు చెంచాల నిండా తీసుకుని, వాటిని పావుకప్పు నీళ్లలో వేడి చేసి, నాలుగు చెంచాల ఆలివ్ నూనె, చెంచాడు గ్లిజరీన్‌ను బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే నునుపుదనం వస్తుంది.

★ కప్పుడు రోజ్ వాటర్‌లో చెంచాడు బొరాక్స్ పొడిని, రెండు చెంచాల వేడి ఆలివ్ నూనెను బాగా కలపాలి. ఇందులో లావెండర్ వాటర్‌ను కాస్త వేసి శరీరానికి రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

★ మూడు చెంచాల రోజ్ వాటర్‌లో రెండు చెంచాల నిమ్మరసం, చెంచాడు గ్లిజరీన్ కలిపి ఓ సీసాలో పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ మిశ్రమాన్ని రాసుకుంటే శరీరానికి నిగా రింపు వస్తుంది.

★ బార్లీ పిండి, మినప్పిండి, నిమ్మరసం కలిపి రాసుకున్నా మచ్చలు అంతరిస్తాయి.

★ పాలమీగడలో కాస్త పసుపు వేసి ముఖానికి రాసుకుంటే కాంతివంతమవుతుంది.

★ కొబ్బరి నూనెలో ఆలివ్ నూనె, నిమ్మ రసం కలిపి ముఖానికి రాసుకుని కొంత సేపు ఆరబెట్టాలి. ఆ తర్వాత శనగపిండి లేదా నలుగుపిండిని రాసుకుని స్నానం చేస్తే చర్మానికి మృదుత్వం వస్తుంది.

'పాట' గొంతు నొక్కేశారు..!

ఒకే జలపాతానికి అడ్డుకట్ట వేశారు... విహరించే స్వేచ్ఛా వాయువుల్ని బంధించారు.. ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగే గానానికి ఆంక్షల కళ్లెం వేశారు.. మత ఛాందసవాదుల భయానికి ఆ చిన్నారుల పాట మూగబోయింది.. సంగీతం, గానం మన సంస్కృతిలో భాగమే అయినా మతపెద్దల ఆగ్రహం ఫలితంగా ఆ బాలికలు పాటకు దూరమయ్యారు.. సంగీత పోటీల్లో అద్భుత ప్రదర్శనలిచ్చి అందరినీ రంజింపజేసిన జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక బాలికల రాక్ బ్యాండ్ బృందం మతపెద్దల 'ఫత్వా'కు తలొగ్గి మౌనంగా నిష్క్రమించింది. కాశ్మీర్‌లో పదో తరగతి చదువుతున్న బాలికలు నోమా నజీర్, ఫరా దీబా, అనీకా ఖలీదాలు గత ఏడాది చివర్లో జరిగిన సంగీత పోటీల్లో అపూర్వ ప్రదర్శన ఇచ్చి అందరి దృష్టినీ ఆకర్షించారు. 'ప్రగాష్' (వెలుగు) పేరిట ఈ ముగ్గురూ కాశ్మీర్‌లో రాక్ బ్యాండ్‌ను ఏర్పాటు చేసి, పలు అవార్డులను కైవసం చేసుకున్నారు. గాయని, గిటారిస్టు నోమా నజీర్, డ్రమ్ము వాయించే ఫరా దీబా, మరో గిటారిస్టు అనీతా ఖలీదా పేర్లు కాశ్మీర్‌లో మార్మోగుతుండగా మత ఛాందసవాదులు మాత్రం అసంతృప్తితో రగిలిపోయారు. సంగీతం ఇస్లాంకు విరుద్ధమని, బాలికల బృందం ఇకపై ఎలాంటి ప్రదర్శనలు ఇవ్వరాదని అక్కడి మతపెద్ద బషీరుద్దీన్ కొద్ది రోజుల క్రితం 'ఫత్వా' జారీ చేయడం సంచలనం సృష్టించింది. ఈ ఫత్వాకు భయపడి తమ రాక్ బ్యాండ్‌ను రద్దు చేస్తున్నట్లు బాలికలు ప్రకటించారు.

మతపెద్దల ఆదేశాలను గౌరవించి తాము సంగీతానికి, గానానికి దూరమవుతున్నట్లు బాలికలు స్పష్టం చేశారు. 'పాటలు పాడడం ఇస్లాంకు వ్యతిరేకం, దీనివల్ల సమాజానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు, అందుకే పాటలు పాటవద్ద'ని తాను ఫత్వా జారీ చేసినట్లు మతపెద్ద బషీరుద్దీన్ సమర్థించుకున్నారు.

ఈ ఫత్వాను ఛాందస వాదులు గౌరవిస్తుండగా, ప్రజాస్వామ్య సంస్థల ప్రతినిధులు, మహిళా హక్కుల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాక్ బ్యాండ్‌ను నిలిపివేయాలంటూ ఇదివరకే ఇంటర్నెట్‌లో కొందరు హెచ్చరించారు. బాలికలను చంపేస్తామని ఇంకొందరు బెదిరించారు. దుర్భాషలు, బెదిరింపులు, ఫత్వాల నేపథ్యంలో తాము పాటకు దూరం కావడమే ఉత్తమమని బాలికలు భావించారు. 'మా పాటలు కొందరికి నచ్చలేదన్న సంగతి మాకు తెలియదు, మతపెద్దల మనోభావాలను గౌరవించేందుకే పాటలకు స్వస్తి చెప్పాం, బెదిరింపులకు భయపడి మాత్రం కాదు, ఇక్కడ సంగీతానికి చోటు లేదు, ఎవరైనా స్వేచ్ఛగా పాడాలంటే కాశ్మీర్‌ను వదిలి పెట్టి మరో ప్రాంతానికి వెళ్లాల్సిందేనా?'- అని ఆ బాలికలు ఆవేదనను వ్యక్తం చేశారు.

కాగా, మత ఛాందసవాదంతో జారీ చేసిన ఫత్వాను బాలికలు పట్టించుకోనవసరం లేదని, వారు స్వేచ్ఛగా పాడుకోవచ్చునని కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అర్థం లేని ఫత్వాల వల్ల ఇస్లాం మతానికి చెడ్డ పేరు వస్తోందని, సంగీతం అనేది కాశ్మీర్ సంస్కృతిలో ఒక భాగమని ప్రతిపక్ష పి.డి.పి అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ బాలికలకు మద్దతు ప్రకటించారు.

తాలిబన్ల ప్రభావంతోనే కొందరు ఇలాంటి ఆంక్షలు విధిస్తూ కాశ్మీర్‌లో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారని కొన్ని విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిఒక్కరికీ పాడుకునే హక్కు ఉందని, మతం ముసుగులో ఆంక్షలు విధించడం దారుణమని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మమతాశర్మ సైతం విమర్శించారు. లింగ వివక్ష లేదని చెబుతూనే మరోవైపు బాలికల ప్రాథమిక హక్కులను అడ్డుకోవడం మతపెద్దల ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతోందని ఆమె ఆరోపించారు. పాటలు నచ్చకపోతే వినడం మానేయ్యాలే తప్ప, మతం ముసుగులో ఆంక్షలు విధించడం తగదని బీజెపి ఎంపీ నజ్మాహెప్తుల్లా తీవ్రంగా విమర్శించారు.

బాలికల స్వేచ్ఛను అడ్డుకోవడం ఇస్లాంకి విరుద్ధమని పలు మహిళా ఉద్యమ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఫత్వాకు మద్దతుగా కొందరు, వ్యతిరేకిస్తూ మరికొందరు మాట్లాడుతున్నందున కాశ్మీర్‌లో మత రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. కాగా, ఆన్‌లైన్‌లో బాలికలను బెదిరించారన్న అభియోగంపై ఐటి చట్టం కింద పోలీసులు కేసు నమోదుచేశారు. ఇప్పటికి ఆరుగురు ఫేస్‌బుక్ ఖాతాదారులను నిందితులుగా గుర్తించినట్లు మిగతా వారి గురించి ఆరా తీస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ■

పిల్లలు పలు రకాల వ్యాధులకు గురికావడానికి ఇంటి బయట తినే 'జంక్ ఫుడ్' కారణమని వైద్య నిపుణులు ఎంతగా హెచ్చరిస్తున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. పిజ్జాలు, బర్గర్లకు అలవాటు పడిన పిల్లలు ఇంట్లో అమ్మ చేసిన కమ్మనైన వంటలను సైతం వద్దంటున్న పరిస్థితి నేడు కనిపిస్తోంది. జంక్ ఫుడ్ వల్ల చిన్నారుల్లో ఊబకాయం సమస్య తప్పదని వైద్యులు చాలాకాలంగా హెచ్చరిస్తునే ఉన్నారు. నేటి ఆధునిక యుగంలో ఆలుమగలిద్దరూ ఉద్యోగాలు చేయక తప్పని పరిస్థితుల్లో రెడీమేడ్‌గా దొరికే ఆహార పదార్థాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఈ కారణంగానే తల్లిదండ్రులు పిల్లలకు పిజ్జాలు, బర్గర్ల వంటివి

'జంక్'తూ తింటే అనారోగ్యమే మరి!

అలవాటు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని కొనకుండా ఉండాలన్నా పిల్లలు ససేమిరా అంటున్నారు. కేవలం మన దేశంలోనే ఏటా సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల మేరకు జంక్ ఫుడ్ తయారీ సంస్థలు వ్యాపార లావాదేవీలను జరుపుతున్నాయి. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించేందుకు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు శ్రద్ధ చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. స్కూళ్లలో జంక్ ఫుడ్ తినడాన్ని నిషేధించాలని, టీవీల్లో వీటికి సంబంధించిన ప్రకటనలను నిలిపి వేయాలని వైద్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

టీవీ కార్యక్రమాల సందర్భంగా వచ్చే జంక్ ఫుడ్ ప్రకటనలు పిల్లలపై విపరీతంగా ప్రభావం చూపుతున్నాయి. టీవీల్లో గేమ్ షోలు, కార్టూన్ షోల సందర్భంగా జంక్ ఫుడ్ ప్రకటనలను ఉద్దేశ పూర్వకంగానే వేస్తున్నారు. దీంతో వాటిని తినాలన్న ఆసక్తి చిన్నారుల్లో అధికమవుతోంది. తీపి, ఉప్పు, కొవ్వు మోతాదుకు మించి ఉండడం వల్ల జంక్ ఫుడ్ తినడం వల్ల పిల్లల్లో ఊబకాయం, బద్ధకం, ఇతర అనారోగ్యకరమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. జంక్ ఫుడ్ వినియోగం ప్రమాదకర స్థాయికి చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. ●

పండగొచ్చింది

-తెలికిచర్ల క్షేమాంకర్

కొత్త సంవత్సరం వచ్చినప్పటి నుంచి ఎదురుచూస్తున్న భోగి పండగ రానే వచ్చింది. పిల్లలు నాని, అమ్ములు తలంటుపోసుకుని కొత్త బట్టలు కట్టుకుని తయారయ్యారు. వారి తల్లిదండ్రులైన వంశీ, సుధ కూడా గబగబా తయారవుతూ ఏమైనా సరే- ఈ మూడు రోజులూ పండగ ఆనందాలు అస్సలు మిస్ అవ్వకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. పొద్దున్నే హరిదాసు సంకీర్తనలతో మంగళప్రదంగా మొదలయ్యింది భోగి పండుగ.

భోగి మంటలు, రంగవల్లులు, గొబ్బిళ్ళు అందంగా కనువిందు చేస్తున్నాయి. అందమైన ఆడపిల్లలు పట్టుపరికిణీలు కట్టుకుని, పూలజడలు వేసుకుని నగలతో అందంగా అలంకరించుకుని గొబ్బి పాటలు పాడుతున్నారు. ఒకటే సందడి. మరో పక్క రంగవల్లుల పోటీ జరుగుతోంది. వయసుల వారీగా తమకు కేటాయించిన స్థలంలో రంగు రంగుల ముగ్గులు వేస్తున్నారు అమ్మాయిలు.

చూస్తుండగానే మధ్యాహ్నమైపోయింది. కడుపులో ఆకలి కరకరమంటుంటే 'అమ్మా! ఆకలేస్తోంది. ఈ వేళ పండగ కదా.. స్పెషల్‌గా 'పిజ్జా' తింటా మమ్మీ' గారంగా అడిగింది అమ్ములు. 'సరే... మీ సంగతి తెలిసే పొద్దునే పిజ్జా ఆర్డర్ చేశాను. ఇంకో పది నిముషాల్లో వచ్చేస్తుంది. వేడివేడిగా తిందురుగాని' అంది సుధ. 'ఏమండీ మనం మాత్రం ఈ బొబ్బట్లు, బూరెలు, అరిసెలు, సున్నుండలు తిందాం. అన్నం రోజూ వుండేదే కదా! అందుకే వండలేదు. సరేనా?' గారంగా సుధ అంటుంటే కాదనలేక అరిసెల డిష్ ముందుకు లాక్కున్నాడు వంశీ.

మధ్యాహ్నం అంతకంటే సందడి. పిల్లలిద్దరూ హాసీ ఆడుకుంటుంటే వంశీ, సుధ కాసేపు కునుకు తీసి లేచారు. టీవీలో 'పాండవ వనవాసం' సినిమా చూస్తూ మైమరచిపోయారు. ఇంక సాయంత్రం సరేసరి. గుడులు- గోపురాలు, మరో పక్క భోగిపళ్ల పేరంటాలు. పట్టుచీరలు కట్టుకుని ముత్తైదువల హడావుడి. కిందపడ్డ రేగుపళ్ళు ఏరుకుంటూ చిన్నపిల్లల సందడి.

'ఏమండీ! భోగి పండుగ చాలా ఆనందంగా గడిచిపోయింది కదూ..' రాత్రి నిద్రపోతూ వంశీతో సంతోషంగా అంది సుధ. 'అవును సుధా! ప్రతీ సంవత్సరం ఇంత ఆనందాన్ని వదులుకుని నానా హైరానా పడి కిక్కిరిసిన రైళ్ళలో ప్రయాణించి ఆ పల్లెటూరు పోయేవాళ్ళం. పండగ నాలుగు రోజులు అయిపోగానే మళ్ళీ మనం హైదరాబాదు చేరుకోవడం- ఎంత నరకంగా వుండేవి ఆ ప్రయాణాలు. ఈ సంవత్సరం మాత్రం మనం చాలా మంచి పని చేసాం. హాయిగా మనింట్లోనే పండగ ఎంతో ఆనందంగా వుంది. సంక్రాంతి, కనుమ కూడా ఇలాగే సందడిగా జరుపుకోవాలి. మళ్ళీ పొద్దున్నే లేవాలి. ఇక పడుకో..' దుప్పటి ముసుగు పెడుతూ అన్నాడు వంశీ.

పొద్దున్నే కొత్తచీర కట్టుకుని చక్కగా ముస్తాబై హాల్లోకి వచ్చిన సుధ. 'సంక్రాంతి నిజంగా కొత్త కాంతిని తెచ్చిందండీ మన ఇంటికి' అంది వంశీతో. అప్పటికే నాని, అమ్ములు, వంశీ చక్కగా తయారై సోఫాలో సెటిలైపోయారు. సంక్రాంతి బొమ్మల కొలువులు. ఎంత అందంగా వున్నాయో బొమ్మలన్నీ. మరోప్రక్క గాలిపటాలు ఎగరేస్తూ సందళ్ళు. కొమ్మదాసర్ల కవ్వింతల కథలు, బుడబుక్కల వాళ్ళ ఢమరుక నాదాలు, మధ్యమధ్యలో చతురోక్తులు. ఆటలు, పాటలు. కాగా, భోజనం మెనూలో మాత్రం చిన్న తేడా. 'భోగిరోజు బూరెలు, బొబ్బట్లు, అరిసెలు తిన్నాం కదా. ఈ రోజు పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి'' అని సుధ అనగానే మరో మాట లేకుండా సరేనన్నాడు వంశీ.

కాసేపయ్యాక ఎవరి హడావుడిలో వాళ్ళుండగా నెమ్మదిగా వంశీ బయటకెళ్ళిపోయాడు. పిల్లలు కూడా పిజ్జాలు, బర్గర్‌లు అనకుండా ఇంట్లో ఉన్న వాటితోనే అడ్జస్ట్ అయిపోయారు. మరి అన్నం, కూరల జోలికి పోలేదెవరూ. అసలు సుధ వండితే కదా? ఒక చక్కటి సినిమా చూడడంతో సంక్రాంతి రోజు రాత్రి కూడా హాయిగా, హుషారుగా గడిచిపోయింది.

'ఈ వేళ పిండివంటల స్పెషల్ ఏమిటోయ్?' పొద్దున్నే హుషారుగా అడిగాడు వంశీ. కనుమ రోజు మినుము తినాలండీ. అందుకే గారెలు, ఆవడలు. వాటితోపాటు వెజిటబుల్ బిర్యానీ, సరేనా?



- ముద్దుగా అంటున్న సుధని చూస్తూ తినబోయే రుచులని తలచుకుని ఆనందపడిపోయాడు వంశీ. పిల్లలు అంతకన్నాను. వెజిటబుల్ బిర్యానీ అనగానే మురిసిపోయారు. కనుమ పండగ అంటే చెప్పేదేముంది? బసవన్నలు, ఎడ్ల పందాలు, అమ్మవారి పూజలు, నైవేద్యాలు, సిరిమాను తీర్థాలు, ప్రభలు.. అబ్బ.. ఎంత సందడి? ఎన్నెన్ని సంబరాలు? పిల్లల ఆనందం అంతా ఇంతా కాదు.

గాలిపటాలు, బసవన్నలని చూసి నాని ఎంత హుషారైపోయాడో, పేరంటాలు, రంగవల్లులు, గడిచిపోయాయి. మర్నాడు సోమవారం వంశీ ఆఫీసుకీ, పిల్లలు స్కూలుకీ వెళ్లాలి. అబ్బ.. మళ్ళీ రొటీన్ అనుకుంటూ నిద్రకు ఉపక్రమించారు వంశీ అండ్ ఫ్యామిలీ.

మర్నాడు వంశీ, పిల్లలు వెళ్ళగానే 'హమ్మయ్యా' అనుకుంటూ బద్ధకంగా సోఫాలో కూలబడింది సుధ. ఈ వేళ ఏ పనీ చేయాలనిపించడంలేదు. మూడు రోజులూ పండగ సందడితో గడిచిపోయామేమో, ఈ రోజు మరీ బద్ధకంగా వుంది. కానీ తప్పదు కదా! నైవేద్యాలు పెట్టుకుంటాం -అంటూ పనిమనిషి కూడా ఈ రోజు రానంది. గదులు ఊడ్చి, బట్టలుతకాలి. వంట చేసి పిల్లలకి లంచ్ బాక్స్ పంపించాలి. అమ్మో! తలుచుకుంటేనే ఇంత పనా? అని భయంగా ఉంది.

ఇంక లేద్దాం అనుకుంటూండగానే ఫోను మోగింది. 'హలో' అనగానే అవతల రమ గొంతు సంతోషంగా వినిపించింది. 'ఏంటి సుధా విశేషాలు. ఎలా వున్నావు. చాలా రోజులయింది కదా మనం మాట్లాడుకుని. పండగ హడావుడిలో వుంటారేమో అని ఈ మూడు రోజులు ఫోను చేయలేదు. అమెరికా నుండి అమ్మా వాళ్ళింటికి- మురమళ్ళ వచ్చి నాలుగు రోజులయ్యింది!' గలగలా మాట్లాడేస్తున్న రమ మాటలు వినగానే ఎగిరి గంతేయాలనిపించింది సుధకి. 'హాయ్ రమా! ఎలా వున్నావే. మీ వారు రవీ, పిల్లలూ కూడా వచ్చారా? అబ్బ. ఎన్నాళ్ళయ్యిందే నిన్ను చూసి' చిన్ననాటి స్నేహితురాలలు రమ మాటలు విన్న ఆనందాన్ని దాచుకోలేక పోతోంది సుధ.

'ఏంటి సుధా! పండక్కి అమ్మా వాళ్ళింటికి రాలేదా? మేమయితే దూరంగా వున్నాం. ప్రతీ సంవత్సరం రావటానికి వీలవదు. నీకేమే. హైదరాబాదులోనే కదా వుంటారు. సంక్రాంతికయినా మన వూరు రావాలనిపించలేదా?' కొంచెం వింతగా, కొంచెం నిష్ఠూరంగా వినిపించింది రమ గొంతు. ''వద్దామనే అనుకున్నామే. కానీ వంశీ, పిల్లలు అక్కడికి రామనేశారు. 'పవర్ కట్' అని అస్తమానూ పల్లెటూర్లలో కరంటు తీసేస్తున్నారు కదా. మరి భోగి ఆనందాలు, సంక్రాంతి సంబరాలు, కనుమ సందళ్ళు ఎక్కడ చూడలేకపోతామేమోనని వాళ్ళ భయం''-

సుధ సంజాయిషీ విచిత్రంగా అనిపించింది రమకి. 'కరెంటుకీ, పండుగ సంబరాలకీ లింకేమిటి?' ఆలోచిస్తూ అంది రమ.

''ఆ! నీకు చెప్పనే లేదు కదూ రమా. ఈ సంక్రాంతి ఎంత ఆనందంగా గడిచిందో తెలుసా? ప్రతీ సంవత్సరం నెలముందే రైలుకి రిజర్వేషన్లు చేయించుకుని ఏ గోదావరో, గౌతమో ఎక్కి నానా కష్టాలు పడి మురమళ్ళ వచ్చేవాళ్ళమా. ఆ పల్లెటూరు.. దుమ్ము, ధూళి, గొబ్బిళ్ళంటూ పేడ కంపు, తెల్లారకుండానే హరిలో రంగ హరీ అంటూ హరిదాసు కీర్తనలతో కలత నిద్దర్లు. ఊరంతా భోగి మంటల దగ్గర చేరి గోల గోల. ఇంక ఇంట్లో అంటావా? అరిసెలు, సున్నుండలు, బొబ్బట్లు, పులిహోర, చక్కెర పొంగలి అంటూ అమ్మ పొద్దున్నుంచి సాయంత్రం వరకూ వంటింటికే అంకితం అయిపోయి మాతో మాట్లాడే తీరిక కూడా వుండేది కాదు. కానీ ఈసారి అలా కాదు రమా. పండగ ఎంత సంబరంగా చేసుకున్నామో తెలుసా. కొత్తబట్టలు, భోగిమంటలు, భోగిపళ్ళు, హరిదాసులు, కొమ్మదాసర్లు, గంగిరెద్దులు, రంగవల్లులు, గాలిపటాలు ఎడ్ల పందాలు అన్నీ... అన్నీ వున్నాయి తెలుసా? ఇంకా పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి, గారెలు, బూరెలు, అరిసెలు, సున్నుండలు.. ఇంకా ఎన్నెన్ని వెరైటీలో తెలుసా? ఓహ్... ఏమి రుచులు.. ఇంకా...''

''ఆపవే సుధా..' అంటూ ఆ వాక్ప్రవాహానికి అడ్డుకట్టవేసింది రమ. అంత సిటీలో.. అందులో జూబ్లీ హిల్స్ లాంటి పోష్ లొకాలిటీలో వున్న మీరు ఇవన్నీ చూసి ఆనందించారంటే నన్ను నమ్మమంటావా? అందులో నువ్వు గారెలు, బూరెలు, అరిసెలు, బొబ్బట్లు చేసావంటే నేను నమ్మాలి. అంతేనా?' రమ మాటలకి పకపకా నవ్వింది సుధ. కాసేపటి వరకూ అలా నవ్వుతూనే వుండిపోయింది. సుధ అంతలా ఎందుకు నవ్వుతోందో, తనన్న మాటల్లో అంత నవ్వు వచ్చే విషయం ఏముందో అర్థంకాక ఆలోచిస్తూండిపోయింది రమ.

'పిచ్చి రమా! నీ మాటలు వింటూంటే నవ్వు కాక మరేమిటి? నిజంగా మేము పండగ సంబరాలు ఎంజాయ్ చేసాం. కానీ నువ్వనుకుంటున్నట్లు జూబ్లీ హిల్స్ కాలనీలో కాదు. ఆ కాలనీలో... మా ఇంట్లో.. మా హాలులో నుంచి కాలు కదపకుండా. ఇంకా అర్థం కాలేదా మొద్దూ. పండగ మూడు రోజులూ టీవీ ప్రోగ్రాములు నువ్వు చూడలేదా? భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులూ టీవీ నటీనటులు, యాంకర్లు కలిసి పండగ సంబరాలని మన నట్టింట్లోనే తెచ్చారు కదా. మగవాళ్లు పంచెలు, కండువాలు, ఆడవాళ్లు పట్టుచీరలు, పట్టు పరికిణీలు, ఓణీలు, నగలు, పూలజడలు సంప్రదాయ బద్ధంగా ధరించి ఎంతో సందడి చేశారు.

ఇంకా రంగవల్లులు, భోగిమంటలు, భోగిపళ్ళు, సంక్రాంతి తీర్థాలు, బుడబుక్కలవాళ్ళు, కొమ్మదాసర్లు, గంగిరెద్దులు, పేరంటాలు, బొమ్మల కొలువులు, ఎడ్లపందాలు, ఆటలు, పాటలు, పిండివంటలు అన్నీ.. టీవీలోనే. సుధ మాటలు వింటున్న రమకి ఒక్కసారిగా మతిపోయింది. ఇప్పటివరకూ సుధ వర్ణించిన పండగ సందడంతా టీవీలోనా? అనుకుంటూ ''మరి.. పిండివంటలు?'' అని అడిగింది

'అదీ చెప్పబోతున్నానే రమా. స్వగృహ, సురుచి, అభిరుచి, రుచి, వంటిల్లు లాంటివి వుండగా మనకి పిండివంటలకి లోటేమిటి? మన పల్లెలో చేసుకునే పిండి వంటలు, చిన్నప్పటి అమ్మ చేతి పిండి వంటల రుచులు అన్నీ అక్కడే దొరుకుతున్నాయి. టీవీ షోలు మధ్య విరామాల్లో వంశీ అర్జంటుగా స్వగృహ ఫుడ్స్‌కి వెళ్ళి ఆ రోజు మేం ఏమేమి కోరుకున్నామో అన్నీ తెచ్చేసేవారు. ఇంక అక్కడ దొరకని వెజిటబుల్ బిర్యానీ లాంటి వాటికి స్పెషల్ ఫుడ్ కోర్టులున్నాయి కదా. హాయిగా పండగ సంబరాలు చూస్తూ సోఫాల్లో పడుకుని కాలు కదపకుండా వాటినన్నింటినీ ఆరగించడమే మా పని. చూశావా! ఇల్లు కదలకుండా.. కాదు కాదు... హాలు కదలకుండా మేం పండగ ఎంత బాగా ఎంజాయ్ చేసామో?''- సుధ ఇలా మాట్లాడుతూనే వుంది. అక్కడ మురమళ్ళలో ముక్కనుమ రోజున టీవీలో బొమ్మల కొలువు ప్రోగ్రాం చూస్తూ మొబైల్ ఫోను చెవికి ఆనించుకుని అలా శిలా ప్రతిమలా కూర్చుండిపోయింది రమ. అవును టీవీల పుణ్యమా అంటూ పట్టణాలలో కూడా నిజంగానే పండగొచ్చింది. ■

తెలికిచర్ల క్షేమాంకర్,
ఇంటి నెం. 68-10-1/జె,
వశిష్ట వారి వీధి, సెకండ్ లేన్,
ఐడిఎల్ కళాశాల వద్ద, విద్యుత్ నగర్, కాకినాడ-3.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
శనివారం
9, ఫిబ్రవరి
2013

శేషకుండాం

తమకం బెత్తిన నాత్మజం గడు మదాంధ వ్యాప్తి నేకాంత వ
క్షమునం దెవ్వరు గానకుండ గవయంగా బోయి నీ బాణ ఘా
తమునం బడ్డభవుండు ద్రెళ్లెననినం దాదప్ప వర్తింపలో
కమునం దెవ్వరి కింక నిన్ను నెఱుగంగా వచ్చు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! మోహితుడై మదాంధుడై ఏకాంతంలో తన ఆత్మజనే కలువబోయిన బ్రహ్మ ఆయన తప్పుగా ప్రవర్తించాడు.కాబట్టి - నీ బాణ ఘాతంతో నరుకబడి నాటంటే ఇక లోకంలో నిన్ను తెలిసికోవడం ఎవరి వల్ల ఔతుంది.

బ్రహ్మ కే నీ సంగతి తెలియలేదు. ఇక ఇంకెవ్వరు తెలసుకోగలరు? ఇక మానవులు ఏపాటి?

కాని బ్రహ్మ సైతం శివక్రోధానికి గురయ్యాడుకదా. ఎందుకంటే తప్పు చేసినాడు కదా. అంటే తప్పుచేసినవారు ఎవరైనా సరే శివక్రోధానికి గురికావాల్సిందే. శివాజ్ఞను పాటించాల్సిందే నని ఈ పద్యభావం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

8 **శ్రీ లత**

మెల్లగా పాపను గుండెకానించుకుంది.

ఆబగా పాప నోరు తెరిచి గుండెంతా తడిమి వెతికి మెత్తగా చప్పరించసాగింది. ఆ మెత్తని బాధానివారణకు జీవనకు గుండెలదిరి కళ్ళు విచలితమై క్రింది పెదవి నొక్కి పట్టి

''అమ్మా... అమ్మా... అమ్మా.. అమ్మా...' అని మనసు మైమరుస్తూ అలాగే.. కాసేపు... ఇంకాసేపు.. ఇంకాసేపు.. అలాగే ఉంటే బావుండు అనుకునేంతలో పాప చిరు పెదవుల కదలిక ఆపింది.

జీవన నీళ్ళు కారిన చెంపలు తుడుచుకుంటూ పాప వేపు చూసింది.

పాప ఇప్పుడు బోసి నవ్వు నవుతోంది. కాళ్ళు చేతులూ కదిలిస్తుంది. ''మ్మ..మ్మ.. మ్మ..మ్మ..'' అని శబ్దం రాకుండా రెండు పెదవులు అదిమి పిలిచింది. ఆ పెదవులపైన ముద్దు పెట్టింది జీవన.

మానసిక నిశబ్దం! పరిపూర్ణమైన శాంతి సంగమం తెలీని స్త్రీకి బిడ్డ ఇచ్చిన సుఖాన్వేషణా నిధి. ఫలదీకరణం తెలియని పూవుకు పుప్పొడి రేపిన సవ్వడి. పురుషడెరుగని ప్రకృతి పసితనం ఇచ్చిన పరమావధి.

ఆనందం! మనసుకు!

సుఖం! శరీరానికి.

''నేనేదైనా మానసిక వైకల్యానికి గురౌతున్నానా'' అనుకుంది.

''ఓ మానసిక వైద్యుడి అవసరం మీకు కలుగకపోతే.. మానసిక వైకల్యానికి గురౌతున్నావా అనే అనుమానం మీకెప్పుడూ రాకపోతే మీరు అభివృద్ధికర ఆలోచనలు చేయడం లేదని అర్థం'' అనే కొటేషన్ గుర్తొచ్చింది.

''నా తపస్సు ఇంతకీ.. నా తపస్సు ఇందుకే నీకే ఆనందం ఇచ్చేందుకే నా ప్రాణాన్ని నిలపమని వేడేందుకే... అని పాప గుప్పెళ్ళ భాషలో అమ్మకు బోల్డు కబుర్లు చెప్పింది. సృష్టిలో ఏది మమ్మేలియా జాతి తల్లీ బిడ్డలకూ బంధం వేసి ముడేస్తుందో ఆ ముడిక్కడ పడిపోయింది. ఇది చిక్కుముడి. విప్పడం ఎవరివల్లా కాదు. ప్రకృతి పారవశ్యంతో ప్రాణానికి ప్రాణానికి వేసే ముడి, శబ్దం లేని భాషలో ''అమ్మా.. అమ్మా నీకు నేను ఆనందాన్నిస్తాను. నాకు నువ్వు ప్రాణాన్నిచ్చినందుకు'' అని కూడా చెప్పేసింది పాప.

''దొంగా..'' అంటూ పాపకు ముద్దెట్టి పాపను ఇంకోవైపు తిప్పి మరో గుండెను విప్పి అమృతం పట్టి సజీవం చేసేందుకు సిద్ధమవుతుండగా వినిపించింది వసంత గొంతు.

''అయ్యయ్యో! ఏవయింది నీకు నేల మీద ఆ రక్తం ఏవిటీ. నైటీ అంతా రక్తం ఏవిటీ. నా బిడ్డకి, సిస్టర్.. కొంచెం డాక్టర్‌ను పిలవండి. నా కూతురికి బ్లీడింగ్ ఎక్కువగా ఉంది అమ్మో.. అమ్మో ఎంత నెత్తురు.. నాకే కళ్ళు తిరుగుతున్నాయి. నేనెప్పుడూ చూళ్ళేదిలా... భగవంతుడా నా బిడ్డకేం కాకుండా చూడు.. అని గబగబా జీవన దగ్గర కొచ్చి జీవన చేతిలోని పాపను లాక్కుని ఉయ్యాలలో వేసినంత పని చేసి జీవన వారిస్తున్నా పట్టించుకోకుండా జీవనను దిండు మీద పడుకోబెట్టి...

''సాయిబాబా, షిర్డీ సాయిబాబా, స్వామీ అయ్యప్పా.. నాకెవ్వరూ లేరు నాయనా నా బిడ్డ తప్ప. నా బిడ్డకేం కాకుండా చూడు తండ్రి. ఈ రక్తం ఏవిటమ్మా! కనకదుర్గమ్మ తల్లీ, తల్లి బాధ నీకూ తెలుసు. నా బిడ్డను కాపాడు తల్లీ...'' తనేం మాట్లాడుతుందో తెలీకుండానే మాట్లాడుతూనే ఉంది వసంత. జీవన ''ఏం లేదు'' అని సైగ చేసినా అసలు పట్టించుకోలేదు. ఉయ్యాల్లో పాప ఏడ్చింది. జీవన అటువైపు చూసింది ఆత్రంగా!

''ఉండవే మహా తల్లీ! నా బిడ్డ ప్రాణం పోయేలా ఉంది. నా బిడ్డ పోయాక ఇక నువ్వు ఉన్నా పోయినా ఒకటే'' అని ఒక విసురు విసిరింది. తన బిడ్డ దగ్గరకు చేరింది.

''అమ్మా'' అని గట్టిగా వారించి ''నాకేం కాలేదమ్మా'' అని అంటూనే నిస్తేజంగా అయిపోసాగింది జీవన. మసక కమ్ముతున్న చూపుతో ఊగుతున్న ఉయ్యాలవైపే చూడసాగింది. ఊగుతూ... ఊగుతూ.. ఉయ్యాల ఆగినట్టైంది.

వసంత కేకకు హడావిడిగా వచ్చిన నర్స్ జీవనను చూసి ''ఓవర్ బ్లీడింగ్ అయినట్లయింది'' అని డాక్టర్‌ను పిలవడం వెంటనే బ్లీడింగ్ కంట్రోల్ కావడానికి ఇంజెక్షన్స్, సెలైన్ అన్నీ అరేంజ్ చేయడమో జరిగాయి. హడావిడిలో వసంతను కూడా బయటికి పంపేశారు.

:::::

ఏవయిందండీ మీ అమ్మాయికి? వరండాలో నిలబడ్డ వసంతను అటుగా పోతూ ఆగి అడిగింది ఆండాళు. ''ఒక్కగానొక్క బిడ్డమ్మా. తండ్రి చిన్నప్పుడే పోతే గుండెలమీద పెంచుకున్నాను. అదే జీవం అదే ప్రాణం అనుకున్నాను. ఆయనతోపాటే పోవాల్సింది. ఇదుగో ఈ బిడ్డత కోసం ఆగాను, ఇప్పుడీ బిడ్డకిలా అవడం నేను తట్టుకోలేకపోతున్నానమ్మా'' ఎంతో డిగ్నిఫైడ్‌గా తొణక్కుండా ఉండే వసంత.. తనకు తెలియకుండా పొంగి పొరలి పోసాగింది.

''ఏమయిందమ్మా ఇంతకీ'' అడిగింది ఆండాళ్ళు.

''మరేం లేదు, లక్ష్మణంగా డెలివరీ అయ్యింది కానీ ఉన్నట్టుండి లేచి నడవడంతో కుట్లు తెగి ఓవర్ బ్లీడింగ్ అయింది. కాసేపు చూసుకోకపోతే పెద్ద ప్రాణానికే ముప్పు వచ్చేది'' అప్పుడే వచ్చి నర్స్ చెప్పింది.

''అమ్మా ఎంత గండం వచ్చి పడిందీ'' ఆవిడ జాలిపడిపోయింది.

''ఆ ఫర్వాలేదు కానీ ఇంకా స్పృహలోకి రాలేదు, పైగా వీక్‌గా ఉంది కూడా'' అని చెప్పేసి వెళ్లిపోయింది.

''బగవంతుడా నువ్వు ఉన్నావయ్యా'' దేవుడితో రాజీకొచ్చేసి ఒప్పేసుకుంది దేవుడి ఉనికిని.

''భలేవారు.. ఎంతయినా తల్లనిపించారు. ఈ మాత్రానికే కంగారు పడ్డారా'' అంది ఆండాళు, వసంత పడే కంగారు జీవన ఆరోగ్యం గురించి మాత్రమే కాదనీ.. భవిష్యత్తు గురించి కూడా అనీ.. ఆండాళుకు అర్థంకాక.. వసంతను బిడ్డను అతిగా ప్రేమించిన తల్లులిలాగే చిన్న చిన్న విషయాలకు కంగారు పడిపోతారు కాబోలు అని అంచనా వేసుకుంది.

రెండు గంటలు గడిచాకగానీ వసంతను లోపలికి రానివ్వలేదు డాక్టర్లు, అప్పటిదాకా పక్క రూమ్ ఆండాళు వసంతను ఓదార్చుతూనే ఉంది డాక్టర్ వెళ్ళాకలోపలికి వెళ్లి.

''జీవనా! నా తల్లీ ఎలాగున్నావురా? నీకేవయినా అయితే నే బ్రతకలేనే అమ్మా'' అని కూతురి తలకు మొహం ఆనించి ఏడ్చేసింది.

''ప్లీజ్ మీరు టెన్షన్ పడి ఆవిడ్ని డిస్టర్బ్ చేయకండి. ఇప్పుడే రెస్ట్‌లోకి వెళ్లింది తను'' అని సున్నితంగా హెచ్చరించింది నర్స్. అప్పుడు గుర్తొచ్చింది. వసంతకు తనెంత హంగామా చేస్తూందో. జీవన తల నిమిరి నుదిటిమీద ముద్దు పెట్టుకుంది.

-ఇంకావుంది

139 **రంగనాథ రామాయణం**

శ్రీపాద కృష్ణమూర్తి

ఇంతలోనే మరల నీతో పోరాడవచ్చినా డంటే నీ కంటె అధికం అయిన సహాయం లేకుండా వచ్చి వుండడు. అదీకాక వానరాధిపా! నాతో మన అంగదుడొకమాట చెప్పాడు.

దశరథరాముడు పని పెట్టుకొని తండ్రి ఆనతిని వనవాసానికి వచ్చాడు. అక్కడ అతడు తన సహధర్మచారిణిని కోల్పోయాడు. ఆమె కోసం అన్వేషిస్తూ ఆ రాముడూ అతని తమ్ముడూ ఋశ్యమూకాద్రికి వచ్చి సుగ్రీవుడిని బంటుగా స్వీకరించాడు. నిన్ను సంహరిస్తానని బాస చేశాడట. ఆ రఘురాముడు పద్మనాభుడు- విష్ణుమూర్తి. వైరం వహించి అతడిని గెల్వ ఎవరికీ శక్యం కాదు. కనుక సుగ్రీవుడికి రాజ్యం ఒసగి, నీవు పోయి అతడితో సంధి కావించుకోవలసింది. నా మాట ఆలకించు. నీకిది సమ్మతం కాకుంటే పౌరుషం విడిచి, ముని వృత్తి కైకొని ప్రాణాలు కాపాడుకొనవలసింది'' అని బతిమాలింది.

అప్పుడు వాలి కుపితుడై ''తారా! విను. నా వంటి పరాక్రమశాలికి పత్నివయి వుండి యింత భయపడడం ఏమిటి? ఎంతటి బశాలినైనా ఓడించి, ఆజిలో నేను జయాన్నే పొందుతాను. అంతేకాని వైరికి నేను ఎన్నడూ ఓడను. శత్రువు ఏతెంచి కయ్యానికి కాలు త్రవ్వుతున్నప్పుడు ధైర్యం కోల్పోయి సంధికి సమ్మతించడం వీర ధర్మం అనిపించుకోదు. నలిన లోచనా విను. ననువంటి పరాక్రమవంతుడిని కాక రాముడు సుగ్రీవుడిని చేపట్టాడు. రాముడు నీతిమంతుడు కాడు. కనుక అతడితో పొత్తు ఉచితం కాదు. సుగ్రీవుడికి దిక్కులేక రాముడి బంటు అయాడు. నేను సంధి కోరడం అవివేకం. ధర్మపరుడు అయితే రాముడు నన్ను ఊరక ఎందుకు హతమారుస్తాడు. నీ మాటలు చెల్లవు. ఆ సుగ్రీవుణ్ణి వజ్ర ప్రహారాల వంటి నా ముష్టి ఘాతాలతో నేల కూల్చి వస్తాను. భీతిల్లకు. మరలిపోవలసింది'' అని తారను వీడ్కొలిపాడు.

అనంతరం వాలి తన్ను చుట్టుకొన్న కాల పాశాలు లాగిన రీతిగా- లావు, వెరవు, చలము, తెగువ ఉత్కంఠం కాగా- బయల్వెడలాడు. సముద్రాలు ఘోషించాయి. భూమి కంపించింది. కొండలు ఒడ్డగిల్లాయి. కిష్కింధ ఘూర్జిల్లిందా అన్నట్లు గర్జించాడు. ఏతెంచి, సుగ్రీవుణ్ణి భయపెట్టి ఉద్రగ్రుడై ఈక్రియ వచించాడు.

''ఇంతకు పూర్వమే నాతో పోరాడి, చావు దెబ్బలుతిని, ఓడిపోయి, పారిపోయావు. సిగ్గు మాలి మరల వచ్చావా? ఏతెంచితేనేమిలే- యముడి నోటికి నిన్ను ఉత్రువడియం చేస్తాను. బెదరకు. చెదరకు. బీరాలు పలుకకు. వదరకు. ఒకింత సేపు నిలు. చాలు. నేను యుద్ధంలో నా ముష్టిఘాతాలతోనీ ప్రాణాలు తీస్తాను'' అంటూ ఉరుమని పిడుగుతో ఉల్లసం ఆడే తన కఠిన ముష్టి హతితో పరుగిడి వచ్చి- సుగ్రీవుణ్ణి పొడిచాడు. ఆ ఘాతానికి సుగ్రీవుడు రక్తం క్రక్కుకొని అంతలోనే అల్లన తెలివి తెచ్చుకొని, ధీరుడై వాలితో ''అన్నవు. పూజనీయుడవు అని ఇన్నాళ్లు సైరించాను. అంతేకాని కయ్యానికి నేను వెనుకంజ వేయను. వెనుకటి సుగ్రీవుణ్ణి కాను. అరసి చూసి పోరాడు. వాలీ! నిన్ను ఇప్పుడే అవశ్యం తెగటార్చి, వానర రాజ్యాన్ని నేను పాలిస్తాను. అని అలిగి ఒక సాలవృక్షం పెరికి బలాతిశయంతో వాలిపై విసిరాడు. ఆ దెబ్బకు వాలి కంపించిపోయి, పుడమిపై పడి మూర్ఛిల్లాడు. అంతలోనే తేరుకొన్నాడు. గర్వంతో దుర్వారుడు అయాడు. ధీరుడు అయాడు. శూరుడు అయాడు. దేవతలు ఉప్పొంగిపోగా- సుగ్రీవుడి మీద ఒక శైలం గిరవాటు వేశాడు. సుగ్రీవుడు అదరిపోక వాలంతో వాలిని కొట్టినాడు. వాలి పాదాలతో సుగ్రీవుణ్ణి తన్నాడు. సుగ్రీవుడు తన ఖర నఖాలతో వాలి శరీరాన్ని వ్రచ్చాడు. అంతతో తనయక అంతకంతకు బలాలు పెరిగి, చెలగి పోరు సల్పుతున్నారు. అంగాల నుంచి రక్తాలు స్రవింప అన్యోన్యం దూటుతూ దాటుతూ యుద్ధం కావిస్తూ వుండగా సుగ్రీవుడు చాలానొచ్చి, లావు దక్కి, సంగర భూమిలో చిక్కి, బెదరి దిక్కులు చూస్తూ వుండడం శ్రీరాముడు అవలోకించాడు.

-ఇంకావుంది

శనివారం, 9 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ చతుర్దశి మ.02.43
నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.06.51,
శ్రవణం రా.తె.05.35
వర్జ్యం: మ.02.38 నుండి 03.45 వరకు

• **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):**
ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

• **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):**
మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రుబాధలు తొలగిపోతాయి.

• **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):**
వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు.

• **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):**
అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు.

• **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):**
కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది.

• **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):**
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు.

• **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):**
కుటుంబంలో చిన్న చిన్న గొడవలువచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు.

• **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):**
రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి.

• **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):**
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు.

• **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):**
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి.

• **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):**
తలచిన కార్యాలకు అటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది.

• **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనార్యో బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది.

మంచిమాట

ఆత్మ సాక్షాత్కారం

జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ఘడియలో ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అంతవరకూ జీవితం అంధకార బంధురంగా కొనసాగుతుంది. మిడిమిడిజ్ఞానంతో 'మన రాత ఇంతే' అనుకుంటూ కాలం వెళ్ళదీసేవాళ్ళను గమనిస్తూనే ఉంటాం.

ఇలాంటి సంఘటనను భాగవతంలో కంసుడు ఒక చోట వివులీకరిస్తాడు. యశోదకు జన్మించిన యోగమాయను తీసుకొని వసుదేవుడు కారాగారమునకు వచ్చి దేవకి ఒడిలో ఉంచిన అనంతరం ద్వారపాలకులు నిద్ర లేస్తారు. శిశువు ఏడుపును విన్న ద్వారపాలకులు విషయాన్ని వెంటనే కంసునికి చేరవేస్తారు. కంసుడు భయకంపితుడై 'ఇపుడు నా ప్రాణమును కబళించు దారుణమైన మృత్యువు జన్మించింది' అంటూ కారాగారానికి బయలుదేరాడు.

దేవకి కరుణ స్వరముతో 'సోదరా! దయచేసి ఈ స్త్రీ శిశువును సంహరింపకుము. భవిష్యత్తులో ఈ శిశువు నీ కుమారునికి భార్య కాగలదు అని నేను మాట ఇస్తున్నాను. అంతేకాక భవిష్యవాణి ప్రకారం నిన్ను చంపువాడు పురుషుడు కదా.. కనుక ఈ స్త్రీ శిశువును చంపగలదు' అంటూ ప్రార్థేపడింది.

క్రూరత్వాన్ని నింపుకున్న కంసుడు దేవకి దేవప్రార్థనలను వినిపించుకోలేదు. పసికందును ఆమె నుండి బలవంతంగా లాక్కొని రాతిపై విసిరికొట్టుటకు ప్రయత్నిస్తాడు. సహజ లక్షణాలను మనిషి వదులుకోడన్నదానికి కంసుడు ఉదాహరణ- తన వ్యక్తిగతమైన తృప్తి కొరకు సకల సంబంధములను వదులుకొనగల క్రూరుడైన సోదరుడిగా వినుతికెక్కాడు. పసికందు కంసుని చేతులనుండి ఆకాశమునకు ఎగసి అష్ట బాహువులతో, పట్టుపీతాంబరములతో, పుష్పమాలలతోను అలంకృతయై ఎనిమిది హస్తములయందును చాప, ఖడ్గ, ఘంటా, శంఖ, చక్ర గదా కవచములను ధరించి ఉండెను. ఆ దేవి కంసుని చూసి ''ఓరీ దుర్మార్గుడా! నీవు నన్నెట్లు చంపగలవు? నిను చంపు శిశువు నాకన్నా ముందే ఈ జగతిలో జన్మించింది. దీనురాలగు నీ సోదరి యెడల క్రూరముగా ప్రవర్తింపకుము'' అని పలికెను.

మాటలు విన్న కంసుడు భయభ్రాంతుడయ్యాడు. మెల్లగా కనికరము ఆయన్ను ఆక్రమించింది. వెంటనే కారాగార నిర్బంధంలోనున్న వసుదేవుడు, దేవకిని, బంధ విముక్తులను చేశాడు. తాను చేసిన తప్పులను క్షమించమని వేడుకొన్నాడు.

అతనికి జ్ఞానోదయమైంది. ఏదియును మనంతటమనం చేసుకోలేము. ఇదంతయూ దైవాజ్ఞ. ఇదే మాటల్ని తన సోదరి దేవకీదేవితో వివరిస్తాడు. ''ప్రియ సోదరీ, దేవకీ! నీవు సాధ్వివి. దయామతివి. నన్ను దయచేసి క్షమింపుము. నావలన కలిగిన నీ సంతానము దుర్మరణమునకు దుఃఖింపకుము'' - ఇలా వివరిస్తూ...

ప్రతి ఒకరి జీవిత కర్మలన్నీ జన్మకు పూర్వమే నిర్ణయింపబడతాయని వివరిస్తాడు. వాస్తవమునకు నేను దానికి కర్మను కాను. ఇవన్నియూ పూర్వమే నిర్ణయింపబడిన సంఘటనలు. మనకు ఇష్టము లేనప్పటికిని పూర్వమే నిర్ణీతమైన ఒక పథకం ప్రకారం మనము పని చేయక తప్పదు. దేహము అంతము కాగానే, ఆత్మయును మరణించునని లోకులు అపోహ పడుతున్నారు. ఆ అపోహవలన భౌతిక సిద్ధాంతమును లోకులు అంగీకరిస్తున్నారు. నేను, అత్యంత నీచాత్ముడను. మీరు మహా మహితాత్ములు. కనుక నన్ను కరుణించి క్షమింపుడు'' అని ప్రార్థించాడు.

కంసుడికి జ్ఞానోదయం కలిగింది. ఆ ఘడియలు రావటానికి ఎంతో సమయం తీసుకుంది. తనను వధించే శిశువు జన్మిస్తాడని, ఆ శిశువు జన్మించగానే తాను వధిస్తే పీడ విరగడవుతుందని ఎంతో ప్రయత్నం సాగిస్తాడు. కానీ ప్రయత్నాలు వికటించాయి. భగవానుడు ఏది చేయాలనుకుంటాడో అదే చేసి తీరతాడన్న జ్ఞానం కలగడంలో చివరకు శరణుజొచ్చాడు.

ప్రతి జీవితమూ అంతే. ఆత్మసాక్షాత్కారం కలిగేవరకూ తనే కర్త కర్మక్రియ అనుకుంటాడు. ఆత్మ సాక్షాత్కారం కలిగినపుడు- ఇదంతా భగవానుని లీలలని తలంచి ఆయన చరణారవిందములను శరణుజొచ్చుటనే కర్తవ్యంగా భావిస్తారు.

-చెన్నా రామమూర్తి

వృతాసురుడు 17

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 10



మాటాట - 9 సమాధానం



మాటాట

ఆధారాలు:
అడ్డం
1.బురద
3. జంట
5. పతి మధ్య ఓ అక్షరంతో స్త్రీ
8. కీర్తి
9. పిల్లలు కాకపోతే ఎవరు చేస్తారండి
11. మందు
13. మంగళ సూత్రం
14. భీతి

నిలువు
2. చెట్ల ముళ్ళ మంద
3. హద్దు
4. వలపు
6. దీనికిలోకం దాసోహంట
7. పెండ్లి
10. మత్తు
11. సమానము
12. తపస్సు చేసేమునికి ముందుగా ప్రత్యక్షమయ్యేది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

nudi@andhrabhoomi.net

నుడి

నిర్వహణ: **డా.సామల రమేష్‌బాబు** - ncharithra@gmail.com Cell: 9848016136

కుదురు మాటలు (క్రియాధాతువులు Verbal Bases)

చిందు = ఒలుకుట
చినుకు = వర్షించుట
చినుఁగు = వస్త్రాదులు బద్దలగుట
చిన్నవోవు = ఖిన్నుండగుట
చిప్పిలు = ఉబుకుట
చింపు = మీటుట
చిముడు = అతిపాకము చేతఁ జెడిపోవుట
చిమ్ము = మీటుట
చిరుఁగు = వస్త్రాదులను భిన్న మౌట
చిరుతలువారు = మిక్కిలి తేజస్సు జూచుటచేతఁ గన్నులు చెదరుట
చిఱుము = చిదుకునట్టులు చేయుట
చిఱచిఱలాడు, చిఱుముఱ్ఱాడు = కోపవికారమునొందుట
చిలుకు, చిల్కు = మథించుట, ప్రోక్షించుట
చిలకరించు = ప్రోక్షించుట
చివుకు = శిథిలమౌట, అనఁగాఁబ్రాఁతగిలు, ఫలాదులాస్వాదించుట.
చివ్వు = చెక్కుట
చీకాకుపడు, చీదరిపడు = వ్యాకులుండగుట
చీదు = చీమిడి పోవునట్లు చేసికొనుట
చీరు = బద్దలు చేయుట
చీఱు = పిలుచుట
చీలు = వెదురు మొదలైనవి బద్దలగుట
చీవు = చెక్కుట
చుట్టు = వేష్టనసేయుట

-శ్రీ వేదం పట్టాభిరామయ్య శాస్త్రి 200 ఏళ్ళ క్రితం రచించిన 'ఆంధ్ర ధాతుపాఠ / ధాతుమాల' నుంచి

పాఠశాలనుంచి పారిపోయిన తెలుగు భాష

తెలుగు నేర్పే విధానం కొంప ముంచింది. ఇంగ్లీషు మీడియం తప్ప దిక్కులేదనే పరిస్థితి తెచ్చింది. తెలుగు నేర్పడం అంటే పదహారో శతాబ్దానికి ముందు వచ్చిన పద్యాలు నేర్పడమేనని, భాషనేర్పడం అంటే సాహిత్యం నేర్పడమనేటటువంటి పద్ధతిలోనే ఈ రోజుకు కూడా తెలుగు ఉంది. ఆధునిక తెలుగు భాష పాఠశాలల్నించి ఎప్పుడో పారిపోయింది. కళాశాలల్నించి వెళ్లిపోయింది. యూనివర్సిటీల్లో ఎక్కడో చూరు పట్టుకొని వేళ్లాడుతోంది పాపం. ఈ రోజు నిజమైన తెలుగు భాష ఎక్కడుంది అంటే ఇదిగో తెలుగు భాషోద్యమ సమాఖ్యల దగ్గరో, పత్రికల దగ్గరో, వ్యక్తుల దగ్గరో ఔత్సాహికుల దగ్గరో మిగిలింది. ఎక్కడ ఉండాలో అక్కడ లేదు. తెలుగు భాష ఎందుకు నాశనమైపోయింది?

మనము భాషను ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడ వెతుక్కోవలసి ఉంది. ఈ పోగొట్టుకున్న చోటు మన బడి. మన తరగతి గది. పరిపాలనా భాషగా, అధికార భాషగా ప్రభుత్వాలు చేయాల్సిన పని ప్రభుత్వాలు చేయాలి. కాని బోధనా భాషగా, పాఠశాలలో భాషాబోధన ఎలా ఉంది? బోధనా భాష పట్ల ప్రభుత్వాల తాత్విక దృక్పథం ఏమిటి? భాషను బోధిస్తున్న వాళ్లు ఎవరు? కర్క్యులం ఏమిటి? పాఠ్య పుస్తకాలు ఏమిటి? ఏ భాషను నేర్పి పిల్లల్ని ఏం చేస్తున్నాం? అనేది చాలా పెద్ద విషయం.

అసలు భాషను ఎందుకు బోధిస్తారు? ప్రపంచ వ్యాప్తంగా భాషా బోధనకు సంబంధించిన ఫిలాసఫీ ఏమిటీ? అని చూచినపుడు అంతర్జాతీయంగా ఉన్న ధోరణులకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ధోరణులకు కొట్టొచ్చినంత తేడా కనబడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా భాషను ఎందుకు నేర్పుతారంటే- బిడ్డ ఒక పరిసరంలో పెరుగుతాడు. ఒక జ్ఞానాన్ని సంపాదించుకొని పాఠశాలలోకి ప్రవేశిస్తాడు. ఆ పరిసర జ్ఞానము, ఆ బిడ్డకు అప్పటికే ఉన్న సామర్థ్యాలు, ఈ రెండింటి కొనసాగింపుగా చదువును ప్రారంభించి తాము నేర్చుకున్న దాన్ని మళ్లీ పరిసరాలకి, అనుభవాలకి అన్వయించడమే విద్యకు సారం. భాష అందుకు నేర్పుతారు. ప్రపంచంలో పీసా అనే ఒక పరీక్ష ఉంది. ఈ పరీక్ష ప్రపంచ వ్యాప్తంగా 8వ తరగతి స్థాయి పిల్లలకు పెడతారు. దీన్ని రెండు అంశాల్లోపెడతారు. ఒకటి భాష. రెండవది గణితం. ఆ భాషలో తాను స్వంతంగా ఎంత చదవగలడు. దాన్ని చదివి ఎంతవరకు జీర్ణించుకోగలడు. దాన్ని ఎంత తార్కికంగా చర్చించగలడు. దానికి భిన్నంగా ఏం ఆలోచించగలడు. దాన్ని అవసరమైతే సంగ్రహించగలడా? ఇంకా అవసరమైతే విపులీకరించగలడా? అనేటటువంటి సామర్థ్యం ఉంటే తప్ప అతను ఏ సబ్జెక్టులోనైనా రాణించడం అనేది సాధ్యంకాదు- అనేది ఒక ప్రమాణం. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా మనం చూడవచ్చు. అందువల్లనే మాతృభాషతో నేర్పటం చూస్తున్నాం. ఎందుకంటే స్థానికంగా అప్పటికే అతను ఎంతో నేర్చుకొని వచ్చాడు. అందులో వాడు చాలా కార్యకలాపాలు చేయగలుగుతున్నాడు కాబట్టి, ఆ చేయగలిగినదానికి కొనసాగింపుగా బడిలోకి వచ్చాక చదువులో చేయాలి కాబట్టి, ఆ పరిసరాలకి ఆ అనుభవాలకి నేర్పుతున్న దాన్ని అన్వయించుకోవాలి కాబట్టి. అన్వయించుకోవాలంటే వాడికి ఆ భాష మాధ్యమంగా ఉపయోగపడాలి కాబట్టి, మాతృభాష అనేటటువంటి వాతావరణంలోంచి, సంస్కృతిలోంచి వాడు వచ్చాడు కాబట్టి, ఆ కల్చర్ నుంచే ఆ వాతావరణం నుంచే పెంచుకుంటూ పోయి ఆ తరువాత ఇంకెక్కడకో ఇంకెక్కడకో తీసుకెళ్లవచ్చు అని చెప్పి, ఆ విధంగా పెరిగిన విద్యార్థి సృజనాత్మకంగా వ్యవహరించగలడు.

దీనికి భిన్నమైన అవగాహనలోకి వెళ్లాక భాష కాస్తా ఖూనీ అయింది. భాష ఖూనీ అయిందానికి భాషోద్యమకారులు బాధపడవచ్చు. కాని చదువులు ఖూనీ అయినాయనేది అసలు విషయం. పిల్లవాడు అన్యాయమైపోయాడనేది అంతకంటే ముఖ్యమైన విషయం. అసలు చదువే మొత్తం డొల్లగా మారిందనేది అసలైన విషయం. ఇంటర్మీడియెట్‌లో సంస్కృతం చదువుకోవటంవల్ల తెలుగుకు నష్టం వచ్చిందనుకుంటున్నాం. తెలుగుకు నష్టం వచ్చిందనేదానికన్నా పిల్లవాడికి నష్టం వచ్చింది. పిల్లవాడు ఆలోచించే వయసులో సొంతంగా ఏదైనా చదివే వయసులో, దేన్నైనా ప్రశ్నించేదానికి అవకాశం ఉన్న దశలో వీటన్నిటిని తుంచేసే దుర్మార్గమిది. రాష్ట్రం మొత్తంమీద ఒక కోటి ముప్ఫై నాలుగు లక్షల మంది పిల్లలు స్కూళ్ళలో చదువు తుండగా అందులో 80లక్షలమంది తెలుగు మీడియంలోను, ఓ యాభై లక్షలమంది తెలుగు ద్వితీయ భాషగానూ చదువుతున్నప్పుడు తెలుగుకు ఏమైంది? హైదరాబాదులో ఉన్న ఒకటో రెండు దిక్కుమాలిన స్కూళ్ళు తప్ప తెలుగు నేర్పని స్కూళ్ళు లేవు. ఇంత పెద్ద ఎత్తున తెలుగు నేర్పుతున్న పాఠశాలలు ఉన్నా తెలుగుకు ఏమైంది?

ఈమధ్యకాలంలో ఈ ధోరణి పూర్తిగా మారిపోయింది. మేము మంచి విద్య- పేదలకు అందించాలి. అంటే ఆంగ్ల విద్య అందిస్తామని ఇప్పుడు అంటున్నారు. పేద పిల్లలకు కూడా మంచి ప్రాథమిక విద్య అందించాలని అనుకుంటన్నామని అంటే ప్రాథమిక విద్యలో ఒకటో తరగతి నుండి ఇంగ్లీషు మీడియం తొందరలోనే పెట్టాలనుకుంటున్నామని ఈమధ్య ఒక ప్రభుత్వ ప్రముఖుడు చెప్పాడు. మంచి విద్య అంటే ఇంగ్లీషు మీడియంలో విద్య అనే ధోరణి వచ్చేసింది. అట్లానే కింది పేదవర్గాల నుంచి మాకు కూడా ఇంగ్లీషు మీడియం ఎందుకివ్వరు అనే డిమాండ్ ముందుకు వస్తోంది. మధ్యతరగతి వర్గం నుంచి చదువు అంటే ఇంగ్లీషు చదువు అన్నా, అప్పుడది కింది వర్గాలకు కూడా వెళ్లిపోయి మీరు చదివే ఇంగ్లీషు మీడియం మాకు కూడా కావాలనే డిమాండు ముందుకు వచ్చింది. ఇదిపుడు రాజకీయ డిమాండుగా ముందుకు వచ్చింది. దానికనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా ఆ లైనులోకే వెళ్లిపోయాయి. దీంతో పాటు మేధావి వర్గం కూడా అదేవిధంగా ఆలోచించాల్సి వచ్చింది. వామపక్ష పార్టీలు కూడా తెలుగు మీడియం పాఠశాలలు ఉండాలని చెప్పగలిగే ధైర్యం ఉన్న పరిస్థితిలో లేరు.

ఈ డిమాండు పెద్ద ఎత్తున ముందుకు రావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - మొదట తెలుగు మీడియంలో ఉన్న గురుకుల పాఠశాలల్ని కాస్తా ఇంగ్లీషు మీడియంలోకి మార్చివేసింది. ఆ తరువాతే 6,500 హైస్కూళ్ళలో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టింది. మొన్నటికి మొన్న 357 మోడల్ హైస్కూళ్ళు రాష్ట్రానికి వస్తే మోడల్ హైస్కూళ్ళు మొత్తం ఇంగ్లీషు మీడియంలోనే ఉండాలని చెప్పటమే కాకుండా, అందులో పాఠం చెప్పేవాళ్ళు ఇంగ్లీషు మీడియంలో చదివినవాళ్లే ఉండాలని, తెలుగు మీడియం చదివినవాళ్ళు అసలు పనికిరారని, భూప్రపంచంలో ఎవరూ పెట్టని నిబంధన పెట్టింది. తమిళనాడు, కేరళ రెండు రాష్ట్రాల్లో మోడల్ హైస్కూళ్లలో తమిళం, మలయాళం మీడియం పెట్టుకున్నారు. ఇంగ్లీషు మీడియంలో పెట్టుకోలేదు. మిగతా ఉత్తర భారత దేశంలో హిందీ మీడియంలోనే మోడల్ స్కూళ్ళు పెట్టుకున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం పట్టుపట్టి రెండు సెక్షన్లూ ఇంగ్లీషు మీడియంలోనే ఉండాలనే దశకు వెళ్లిపోయింది. ఈ రూపంలో విద్య రెండుగా విడిపోయింది. పేదోళ్ల విద్య, ధనవంతుల విద్య అని ఇందులో వర్గ దృక్పథం వచ్చేసింది. పెద్దోళ్ల చదువు అంటే ఇంగ్లీషు చదువు, చిన్నోళ్ల చదువు అంటే తెలుగు చదువు అనేటటువంటి ఒక గీత కూడా బాధాకరంగా వచ్చింది. ఈ సందర్భంలో అసలు పిల్ల వాడు ఏమైపోతున్నాడు?

ఇంగ్లీషు మీడియం పిల్లలైనా, తెలుగు మీడియం పిల్లలైనా గత పదేళ్ల ముందరి పిల్లలకు- ఇప్పటి పిల్లలకు తేడా ఏమిటి? గత ఇరవై ఏళ్ళ పిల్లలకు ఇప్పటి పిల్లలకు తేడా ఏమిటి?

పిల్లలకి దాదాపు ఈ రోజు ఏ సబ్జెక్టూ రాదు. పిల్లలు స్వంతంగా ఏమీ ఆలోచించలేరు. స్వంతంగా ఏమీ రాయలేరు. మేధమేటిక్స్‌ను కూడా గుడ్డిగా కంఠస్థం చేసే పరిస్థితి వచ్చింది. పరీక్షల కోసరంగా ముక్కున కంఠతా పెట్టిచ్చి ఆబ్జెక్టివ్ టైపు కొశ్చన్స్‌నే రెడీ చేయించి, మార్కులు తెప్పించి, రిజల్ట్స్ తెప్పించి ఇదే చదువు అనుకునే పరిస్థితిని ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్ళు తెప్పిస్తే వాళ్లను చూసి ఇప్పుడు గవర్నమెంటోళ్లు కూడా 99 శాతం తెచ్చాం, 100 శాతం తెచ్చాం అనే ధోరణికి వెళ్లిపోయారు.

అసలు చదువు ఎక్కడ ఉంది గనుక? టీచింగ్ పోయింది. కోచింగ్ మిగిలింది. పాఠాలు పోయినాయి, పరీక్షలే మిగిలినాయి. ఈ రకమైన పరిస్థితి రావడానికి ఒక కీలకమైన కారణం ఇంగ్లీషు మీడియమే. అందులో సందేహం లేదు. అందులో ముఖ్యమైన కారణం ఏమంటే ఇంగ్లీషు అంటే ఏందో తెలియనివాళ్ళు, ఇంగ్లీషు ఎందుకు చెప్పాలనో తెలియనివాళ్ళు, ఇంగ్లీషు ఏ పద్ధతిలో చెప్పాల్నో తెలియనివాళ్ళు ఇంగ్లీషు చెప్పడం. ఒక అవసరంగా ఇంగ్లీషు ఈ రోజు తన్నుకు వచ్చింది. ఒక డిమాండుకు ఇంగ్లీషు కావాలని అంటున్నారు. అయితే దురదృష్టం ఏమంటే భారత దేశంలో ఇంగ్లీషు చెప్పడం ఎవరికీ చేతకాదు. ఇంగ్లీషు మాతృభాషగా లేనివారు ఇంగ్లీషు ఎలా నేర్చుకుంటారు, వారికి ఇంగ్లీషు ఎలా నేర్పాలి అని ఈ దేశంలో ఏ పరిశోధనా జరగలేదు.

ఇంకో విషయం తెలుగు మీడియంలో చదవాలంటే కావలసిన సామగ్రి కావాలి గదా. మన పత్రికల్లో చెత్త రాజకీయాలు తప్ప ఏముంటున్నాయి. ఏదైనా మంచి పుస్తకం చదవాలి అంటే దొరకాలి కదా. ఇవాళ ఇంగ్లీషులో వస్తున్న కథల పుస్తకాలు చూడండి. షేక్స్‌పియర్ మొత్తం పుస్తకాల్ని 'షేక్స్‌పియర్- నో ఫియర్' అంటూ మోడరనైజ్ చేసి, ఆధునిక ఆంగ్ల భాషలో పిల్లలకు ఉపయోగపడే విధంగా తెచ్చి పిల్లలకు అందజేస్తున్నారు. ఆ విధంగా మీరు తిక్కన సాహిత్యాన్ని తెస్తారా? ఆ పాత కాలంలో 13వ శతాబ్దంలో రాసిన తిక్కన తెలుగు పాఠాన్ని చదవమంటే పిల్లవాడు చదువుతాడా? ఎందుకు చదువుతాడు? ఇప్పుడుకూడా తెలుగు అదేవిధంగా ఉంటే ఏ విధంగా చదవడం సాధ్యమవుతుంది. ఇంకో విషయం తెలుగు నేర్పే విధానం కొంప ముంచింది. ఇంగ్లీషు మీడియం తప్ప దిక్కులేదనే పరిస్థితి తెచ్చింది.

తెలుగు నేర్పడం అంటే పదహారో శతాబ్దానికి ముందు వచ్చిన పద్యాలు నేర్పడమేనని, భాషనేర్పడం అంటే సాహిత్యం నేర్పడమనేటటువంటి పద్ధతిలోనే ఈ రోజుకు కూడా తెలుగు ఉంది. ఆధునిక తెలుగు భాష పాఠశాలల్నించి ఎప్పుడో పారిపోయింది. కళాశాలల్నించి వెళ్లిపోయింది. యూనివర్సిటీల్లో ఎక్కడో చూరు పట్టుకొని వేళ్లాడుతోంది పాపం. ఈ రోజు నిజమైన తెలుగు భాష ఎక్కడుంది అంటే ఇదిగో తెలుగు భాషోద్యమ సమాఖ్యల దగ్గరో, పత్రికల దగ్గరో, వ్యక్తుల దగ్గరో ఔత్సాహికుల దగ్గరో మిగిలింది. ఎక్కడ ఉండాలో అక్కడ లేదు. తెలుగు భాష ఎందుకు నాశనమైపోయింది?ఈ రోజు భాష నేర్పడానికి సంబంధించి అత్యద్భుతమైన ఆధునిక ప్రయోగాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి. ఈ రోజు తమిళనాడుకు వెళ్ళండి. తమిళనాడు పాఠశాలల్లో తమిళం ఏ విధంగా నేర్పుతున్నారో చూడండి. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ పద్ధతిలో కేవలం 6 నెలలకి పిల్లవాడు చిన్న చిన్న పుస్తకాలు, పదాలు చదవగలుగుతున్నాడు. రెండేళ్ల అయ్యేటప్పటికి పిల్లవాడు తమిళం పుస్తకాలు ధారాళంగా చదవగలుగుతున్నాడు. భాష నేర్పే విషయంలో ఆధునిక పద్ధతులు వచ్చినయ్. వాటిని మన తెలుగు పండితులు పట్టించుకోరు. వీళ్లెప్పుడో మాంధాతల కాలపు తెలుగు 'అట జనికాంచె' అనే దగ్గరే ఉన్నారు. 'ఇటజని కాంచితే గదా'! ఇప్పుడున్నటువంటి పరిస్థితి తెలుసుకోవాలిగా. ఆ రకమైన పరిస్థితి లేదు. ఆధునిక భాషను, ఈ రోజు వ్యవహారిక భాషను బలంగా నేర్పాలి. ఇంకా మాట్లాడేటట్లయితే మనరాష్ట్రంలో ఎన్ని ప్రాంతాలున్నాయి? ఇన్ని ప్రాంతాలకు ఒకటవ తరగతిలో ఒకటే వాచకం ఉండాల్సిన అవసరం ఏంది? శ్రీకాకుళం జిల్లాలో ఉండే పిల్లవాని పరిసరాలు చిత్తూరు జిల్లా తంబళ్లపల్లిలో ఉండే పిల్లవాని పరిసరాలు ఒకటేనా? వాళ్లవాళ్ల పరిసరాలకు దగ్గరగా ఉండేటట్లుగా 3వ తరగతి వరకు వాచకాలు తయారు చేసి, నాల్గవ తరగతి నుంచి మెయిన్ స్ట్రీమ్‌లోకి తీసుకురాలేమా? నేను ఈ మాట చెప్పటం లేదు. కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ - ఎన్‌సిఇఆర్‌టి వాళ్లే చెప్పారు. వాళ్లు చెప్పటమేంది? రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సిఇఆర్‌టి కూడా అదే మాట రాసుకొని ఉంది. దీనికనుగుణగా విద్యా శాఖలో ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా? సరికొత్త ధోరణులు ఏమంటే ఉపాధ్యాయ సంఘాలు కూడా రాజకీయాల్లో వచ్చి చేరాయి. వ్యవహరించాల్సిన అవసరం ఉపాధ్యాయ సంఘాలకు వచ్చిపడింది. అన్నిటికంటే ముందు మీరు పనిచేసే స్కూల్లో ఓ యాభయ్యో, వందో పుస్తకాలు పెట్టి, పిల్లల్ని చదివించే ప్రయత్నం చేయవచ్చు కదా. మనందరి కాలంలో చిన్నప్పుడు స్కూల్లో లైబ్రరీ ఉండేది కదా. ఈ రోజు ఏ పాఠశాలలోనైనా, హైస్కూలులోనైనా ఆ పరిస్థితి ఉందా. నేను ఆరవ తరగతి నుండి డిగ్రీ దాకా 37 ఏళ్లపాటు తెలుగు అధ్యాపకుడిగా పనిచేశా. నేను కాలేజీలో ఇంటర్మీడియెట్ విద్యార్థుల్ని టెక్స్ట్‌బుక్స్ కాకుండా ఇతరమైన పుస్తకాలు ఏమైనా చదివారా అనే అడిగేవాడిని. ఒక్కరంటే ఒక్కరైనా వేరే పుస్తకాలు చదివామని చెప్పలేదు. చదవకుండా భాష ఎట్లా వస్తుంది? అప్పుడు నేనేం ప్రయోగం చేశానంటే- ఓ 150 పుస్తకాలు నా దగ్గర పెట్టుకుని, రెండేళ్ల కోర్సు పూర్తి అయ్యేప్పటికి ప్రతి ఒక్కరు 50 లేక 60 పుస్తకాలు నా దగ్గర పెట్టుకొని, రెండేళ్ల కోర్సు పూర్తి అయ్యేప్పటికి ప్రతి ఒక్కరు 50 లేక 60 పుస్తకాలు పిల్లలు చదివే విధంగా చేశా. నేను గర్వంగా చెప్పగలను. నా దగ్గర చదివిన పిల్లలవాడు తెలుగులో చక్కగా తర్ఫీదు పొందాడని. తెలుగుపై అంతో ఇంతో అభిమానం వారికి ఉంటుందని.

నిర్మాణాత్మకమైన అటువంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రతి పాఠశాలలో పిల్లలు చదువగలిగే చదువగలిగేటటువంటి పుస్తకాలు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

- వి.బాలసుబ్రహ్మణ్యం
ఆం.ప్ర. శాసనమండలి సభ్యులు
9490098912

భాషా విస్తరణలో 'గళ్ళ నుడికట్టు!'

"ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్" అని తెలుగు భాషని విదేశీ ప్రముఖులు సైతం వేనోళ్ళ పొగిడారు. ప్రపంచ భాషలన్నింటిలో అందమైన లిపిగా మన 'తెలుగు'ని కొనియాడారు! ఎంతో ఘన చరిత్ర కలిగిన మన భాష తెలుగువారందరికీ అమ్మ సమానం.

నాటినుండి నేటివరకు మన మాతృభాషాభివృద్ధికి ఎందరో మహానుభావులు కృషి చేశారు. ఏ మాతృభాష అయినా ఆయా భాషల్లోని ఆరోగ్యమైన సాహిత్యంమీదే ఎక్కువగా ఆధారపడి వుంటుంది.

సాహిత్యం చప్పగా వుంటే భాష మృతమౌతుంది. సాహిత్యం బావుంటే భాష కూడా వెలుగుతుంది. చౌకబారు సాహిత్యంతో పాఠకులు విసుగెత్తి ఇతర భాషా సాహిత్యాన్ని చదవడం అలవర్చుకుంటారు. తద్వారా భాష అనేది నెమ్మదిగా మృగ్యదశకి చేరుకుంటుంటుంది. నాటి నుండి నేటివరకు మన మాతృభాషాభివృద్ధికి చాలామంది మహామహులు నడుం కట్టి, కలం పట్టారు. కమ్మని సాహిత్యాన్ని పండించారు. తరతరాలకు తరగని గనిలాంటి సాహిత్యాన్ని అందించారు. మన తెలుగు భాష చేసుకున్న గొప్ప అదృష్టం ఏమిటంటే గొప్ప సాహిత్య భాండాగార సంపద లెక్కలేనంతగా తెలుగులో వుంది! లెక్కలేనన్ని పద్యాలు, ఖండకావ్యాలు, పీఠికలు, చరిత్రలు, కవితలు, కథలు, నవలలు, బొమ్మలు, కార్టూన్లు, వ్యాసాలు ఇలా... ఎన్నో వివిధ రూపాలుగా తెలుగు సాహిత్యంలో నిక్షిప్తమై వున్నాయి.

ఒక్క దురదృష్టం ఏమిటంటే మన తెలుగు రచనలు చాలా తక్కువగా ఇతర భాషల్లోకి అనువాదం అవుతున్నాయి!?

ఏ కొందరో పేరు కోసం రచిస్తున్నా చాలామంది మాత్రం కేవలం మన తెలుగు భాష మీద అభిమానంతోనే రచనలు చేస్తున్నారు. కొందరు ఈ రచనా వ్యాసంగాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. ఇంకొందరు ప్రవృత్తిగా కూడా ఎంచుకున్నారు.

రచనలు పాఠకులని అలరిస్తాయి. శైలి, శిల్పంతో ఆయా రచనల్ని చదివిస్తాయి. తదుపరి ఆలోచింపజేస్తాయి. శ్రావ్యమైన, అలతి అలతి పదాలతో పాఠకుల్లో మార్పుని, భాషపై అభిమానాన్ని పురికొల్పేవి ఎక్కువగా రచనలే! ఒక కథగానీ, గల్పికగానీ, కవితగానీ చదివి ఆలోచిస్తారు. అంటే ఆలోచించే స్థాయికి పురికొల్పేది ఒక్క రచన మాత్రమే. అది అక్షరాల కదంబం. పదాల శుభారంభం. వాక్య నిర్మాణాల సంరంభం!!

ఇక్కడో విషయం గురించి చెప్పాలి. తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలంటూ ప్రభుత్వం చాలా ఖర్చుచేసి గత సంవత్సరం డిసెంబర్‌లో నిర్వహించిన ఆ సభలు అంతగా ఎవర్నీ కదిలించలేకపోయాయి. అందుకు ముఖ్య కారణం ప్రాంతీయ విభేదాలు కావచ్చు లేదా మరో కారణం కావచ్చు. చాలామంది రచయితలు, కవులు, చిత్రకారుల్ని విస్మరించారనే వాదనలున్నాయి!?

మన తెలుగు భాషలో వున్నన్ని టీవీ చానళ్ళు, పత్రికలు వేరే ఏ భాషలో కూడా లేవని ఒక సర్వే అంచనా కూడా వుంది. లెక్కలేనన్ని దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలున్నాయి. ప్రాంతీయ వాదంతో కూడా కొన్ని కొత్త కొత్త పత్రికలు పుట్టుకొచ్చాయి. తద్వారా మాండలికాల్లో కూడా రచనలు ఊపందుకున్నాయి. వివిధ అస్తిత్వాలు కూడా సాహత్య రంగాన కృషి చేస్తున్నాయి. అన్ని పత్రికలు తెలుగు భాషాభివృద్ధికే కృషి చేస్తున్నాయా అంటే అది సమాధానం లేని ప్రశ్నే!!?

ఎందుకంటే అపుడపుడూ పత్రికల్లో కూడా 'తెంగ్లీష్' వ్రాతలు పూతలౌతున్నాయి గాబట్టి అడ్వటైజ్‌మెంట్లతో కేవలం వ్యాపార దృక్పథంతోనే పత్రికలు వెలిసాయేమో అన్పిస్తుంది. ఈ విషయం ప్రక్కన పెడితే దిన, వార, పక్ష, మాస త్రైమాసిక పత్రికల్లో, ఆదివారం అనుబంధాల్లో 'గళ్ళనుడికట్టు' అనేటటువంటి పజిల్స్ ప్రచురితమౌతుంటాయి.

ఈ నుడికట్టు గళ్ళని రూపొందించేది అందరూ రచయితలు కాదు. ప్రత్యేకించి కొందరే వీటి రూపకర్తలుగా ప్రాచుర్యం పొందారు. సాహితీ రంగంలో ఈ గళ్ళనుడి కట్టుదో భిన్న సృష్టి. పాఠకులని ఎక్కువగా అలరించడంలో గళ్ళనుడికట్టు పుటయే ముఖ్యమైనది. పాఠకులు పుస్తకం తెరిచి చాలామటుకు ఈ గళ్ళని పూరించడానికి పూనుకుంటుంటారు. వీటిని పూరించడంలో ఒకరకమైన భాషాభిమానం పెరుగుతుంది పూరిస్తున్న పాఠకుడిలో. ప్రక్కనే వుండే అడ్డం, నిలువు ప్రశ్నలని చదివి జవాబులని గళ్ళలో పూరించడం ఈ గళ్ళనుడికట్టు ప్రత్యేకత. వీటిని పూరించడంవలన మెదడుకి మంచి మేత దొరుకుతుందని చాలామంది అభిప్రాయం.

"మెదడుకి విశ్రాంతి కావాలంటే కార్టూన్ నెట్‌వర్క్ ఛానల్ చూడాలి, మెదడుకి చురుకుదనాన్ని ఆపాదించాలంటే ఈ గళ్ళనుడికట్టుని పూరించాలని" చాలామంది విజ్ఞుల అభిప్రాయం. కొన్ని పత్రికలవాళ్ళు ఈ పజిల్స్‌ని క్లుప్తంగా నింపినవారికి నగదు రూపేణా బహుమతులు కూడా ప్రకటిస్తున్నారు. అంతటి విశిష్ట స్థానాన్ని సంతరించుకుంది ఈ గళ్ళ నుడికట్టు! గళ్ళ నుడికట్టు లేకుండా మార్కెట్లో ఏ పత్రికా కన్పించదు! ముఖ్యంగా వీటిలోని ప్రశ్నలు తెలుగు భాషకి సంబంధించిన, వ్యతిరేక పదాలు, వ్యాకరణం, అలంకారాలు, ఛందస్సే గాకుండా రాజులూ, రాజ్యాలూ, నాటి నేటి కవులు, రచయితల గురించి, కరెంట్ అఫైర్స్, రాజకీయ సామాజికాంశాలు, కళలు, సినిమా వంటి విభిన్న రంగాలకు సంబంధించినవన్నీ ప్రశ్నలతో ఈ గళ్ళ నుడికట్టుని ఆయా రచయితలు ఎంతో పకడ్బందీగా రూపొందిస్తుంటారు. ప్లస్, మైనస్ డబ్బాలతో రకరకాల డిజైన్లలో కూడా ఈ పజిల్స్ ప్రచురితమౌతున్నాయి.

ఈ గళ్ళ నుడికట్టు అతి ముఖ్యంగా తెలుగు భాషా వికాసానికే అని ఖచ్చితంగా చెప్పగలం. వీటిని రూపొందించే ప్రముఖ రచయితల్లో ముందుగా సుధామగారు, పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు, నిశాపతిగారు, అదృష్ట దీపక్‌గారు, గొరుసుగారు, వాడ్రేవు ఉమాశంకర్‌గారు, కైపు ఆదిశేషారెడ్డిగారు, కన్నేజు లక్ష్మీకాంతంగారు మొదలగువారి పేర్లు తరుచుగా వివిధ పత్రికల్లో దర్శనమిస్తుంటాయి. వీటిని పూరించడం ఎంత కటువో.. రూపొందించడం కూడా అంతకంటే కష్టమైన పనే!

వాటిల్లో అడిగే ప్రశ్నలకి జవాబులని తెలుగులోనే ఆలోచించేలా చేస్తాయవి. భాషా విస్తరణలో ఈ గళ్ళు ఎంతో విశిష్ట స్థానాన్ని అందుకున్నాయి. సాహితీ రంగంలో వీటిదో వినూత్న కోణం. ఈ కోణం ఆవిష్కరణతో తెలుగు భాష పాఠకులకి మరింత దగ్గరవుతుందనడంలో ఏమాత్రమూ సందేహం లేదు.

తెలుగు భాష కోసం కృషి చేస్తున్న ఆయా రచయితల్ని, కవుల్ని గుర్తించాలి. వాళ్ళకేం మణులూ, మాణిక్యాలేం ఇవ్వాల్సిన అవసరం ఎంతనూ లేదు. ఎందుకంటే రచయితలూ, కవులే మణులు. వారి ఆలోచనలే మాణిక్యాలు. ఆ మణి మాణిక్యాలే భవిష్యత్తులో తెలుగుని వెలిగించడం ఖాయం! వివిధ పత్రికల్లో కృషిచేస్తున్న ఆయా రచయితల్ని మునుముందైనా సభల్లో గుర్తించాలి. భాషాభ్యుతి పథంలో 'గళ్ళ నుడికట్టు' ఎంతో ప్రశస్తమైందని అందరూ గమనించాలి.

-హుమాయున్ సంఘీర్
8143616342

ఇంకా బానిస చదువేనా?

కాలం ఎప్పుడు నిలకడగా ఉండదు. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజపు పోకడలూ మారుతూ ఉంటాయి. విద్య సమాజంలో భాగంగా, సమాజానికి దన్నుగా, సమాజానికి అద్దం పట్టేదిగా ఉంటే సమాజంలో వచ్చే మార్పులకు తగ్గట్టు విద్య ఉంటుంది. విద్య, దాని ద్వారా జరిగే పరిశోధనలవల్ల పుట్టుకు వచ్చే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సమాజ మార్పులను, ఉత్పత్తిని వేగిరపరుస్తాయి. అంటే సమాజం-విద్య విడదీయరానివిగా ఉండేటట్టు ఆయా జాతులు తమవి అయిన విద్యా విధానాన్ని అనుసరిస్తాయి. అలాంటి సమాజంలో మారుతున్న కాలానికి, కొత్తగా వచ్చే భావాలకు తగ్గట్టు విద్యా విధానాలను ఎప్పటికి అప్పుడు మెరుగుపరచుకుంటాయి. అంతేకాకుండా విద్య ద్వారా ఆయా సమాజాల భాష, జీవన విధానం, సాంప్రదాయం, మతం, సాంస్కృతిక వారసత్వాన్ని తరువాత తరాలకు అందజేస్తాయి.

అంటే కొత్తగా వచ్చే ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ జాతి ప్రయోజనాలకు వాడుకొనేందుకు మానవ వనరులను తయారుచేసుకోవటంతోపాటు భాష, సాంస్కృతిక వారసత్వ కొనసాగింపు కూడా విద్యలో భాగంగా ఉంటాయి. ఇది తమ కాళ్ళమీద తాము నిలబడే జాతి, ఆత్మాభిమానం గల జాతి పాటించే పద్ధతులు. భారత ఉపఖండంలో తప్పించి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని జాతులు పాటించే విధానం ఇది.

సమాజం ముందు పోకలో ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్య, దానికి పునాదులు వేసే ప్రాథమిక విద్యను గురించి చాలా జాగ్రత్తగా ప్రణాళికలు వేసుకుంటాయి. దానికి తగ్గట్టు పిల్లల తొలి చదువులు ఉంటాయి. మరయితే ఇప్పుడు మన పిల్లలు చదివే చదువులు ప్రపంచం అంతటా పాటించే పద్ధతుల్లో సాగుతుందా లేక పెడదారిన పోతుందా అని చూడాల్సిన అవసరం ఉంది.

భారతదేశానికి తెల్లదొరలు రాక మునుపువరకూ విద్య అనేది సాంప్రదాయ ముసుగులో కొనసాగుతూ వచ్చింది. చదువు అంటే వేదాలు, పురాణాలు, ఇతిహాసాలే తప్ప జన జీవితానికి పనికివచ్చే సంగతులు కానీ, జనాన్ని ముందుకు నడిపే చేవ కానీ అప్పటి వి

కొత్త పుస్తకం

సాహితీ ప్రక్రియల్లో బహుళ జనాదరణ పొందిన నాటికలంటే ఎవరైనా ఇష్టపడతారు. రంగస్థలంపై కళ్ల ముందు కళాకారులు ఆవిష్కరించే దృశ్యాలు మన మన సులపై చెరగని ముద్ర వేస్తాయి. బాల సాహిత్యంలో నాటికలు అరుదుగా కనిపిస్తుంటాయి. సామాజిక సమ స్యలపై పిల్లలకు సరైన అవగాహన కలిగేలా రచయిత సుఖమంచి కోటేశ్వరరావు 'బాలానంద లహరి' పేరిట ఆరు నాటికలను అందుబాటులోకి తెచ్చారు. జాతీ యతా భావం, కుటుంబ వ్యవస్థ, మంచి గుణాలు, సమాజ సేవ వంటి అంశాలను చిన్నారులు సులభంగా అర్థం చేసుకునేలా ఈ నాటికలను తీర్చిదిద్దారు. సృజనా త్మకత, కళలపై ఆసక్తి పెంచేందుకు 'బాలానంద లహరి' దోహదం చేస్తుందని రచయిత ఆకాంక్షిస్తున్నారు. నాటి కల ద్వారా ప్రస్తుత సమాజంలో లోటుపాట్లు పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా రచయిత చేసిన ప్రయత్నం అభినందనీయం.

మీకు తెలుసా..?

- వర్షపు నీటి చుక్క బరువు ఎంతో ఊహించగలరా? (సుమారు 0.02 గ్రాములు)
- అయస్కాంతాన్ని వేడి చేస్తే దాని శక్తి తగ్గిపోయి బలహీనపడుతుంది.
- ''కివీ'' అనే జీవి పక్షి జాతికి చెందినదే అయినా దానికి రెక్కలు లేవు.
- గవద బిళ్ళలు రావడానికి ముఖ్య కారణం- వైరస్.
- మెదడును పూర్తిగా తొలగించినా సజీవంగా ఉండగలిగే జీవి-తాబేలు.

- ఆంధ్రప్రదేశ్‌లో బాలానంద సంఘాలు స్థాపించిన తొలి మహిళ రేడియో అక్కయ్య- న్యాయపతి కామేశ్వరి.
- ఎలక్ట్రాన్‌కు నామకరణం చేసిన శాస్త్ర వేత్త- జాన్సన్ స్టోనీ.
- సాలీడు రక్తం పారదర్శకంగా ఉంటుంది.
- ప్రతి మనిషికి, జంతువుకు కాలర్‌బోన్స్ ఉంటాయి. కానీ, గుర్రానికి కాలర్‌బోన్ అసలు ఉండదు.
- పదిహేడు వేల రకాల రంగులను చూడగల శక్తి మన కళ్ళకు ఉంది.
- మనం రోజూ శ్వాస ద్వారా పీల్చే గాలితో వేయి బెలూన్లను నింపవచ్చు.

- ఎ.రాంబాబు

అన్నదానం కథ



ఒకప్పుడు దేవుపల్లిలో దేవయ్య అనే కిరాణా వ్యాపారి ఉండేవాడు. అతడి కొట్లో దొరకని వస్తువు ఉండదు. అందుకే ఆ ఊరి జనమంతా తమకు కావలసినవన్నీ అక్కడే కొనుక్కునేవారు. ఈ క్రమంలో దేవయ్య బాగా ఆర్జించాడు. అయితే మాత్రం ఏం లాభం? అతడు పరమ పిసినారి. ఎంగిలి చేత్తో కాకిని తోలడు. ఊళ్ళో ఎన్నడూ ఏ మంచి కార్యక్రమానికీ పైసా విరాళం ఇచ్చిన పాపానపోలేదు. అందుకే అతడంటే అందరికీ ఏవగింపు.

గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా పేదలకు అన్నదానం చెయ్యాలని సంకల్పించారు ఉత్సవ బృందం సభ్యులు. తలొకరు తలా చెయ్యి వేస్తేనే కదా ఏ కార్యమైనా జరిగేది. దేవయ్య పైసా విదల్చడని తెలిసికూడా ఉండబట్టక అతడివద్దకెళ్ళారు ఉత్సవ కమిటీ సభ్యులు. 'దానాలన్నింటిలో అన్నదానం మహత్తరమైంది. ఆకలితో అలమటించే వ్యక్తిలో దేవుడుంటాడు. అతడి క్షుద్బాధని తొలగించగలిగితే మనం దైవసన్నిధికి చేరుకోగలుగుతాం. మీరీ ధర్మకార్యంలో తప్పకుండా పాలుపంచుకోవాలి''అన్నాడు వచ్చినవారిలో ఓ పెద్దమనిషి.

అయితే, దేవయ్య దగ్గర ఆ సూక్తులు చెవిటివాడి ముందు శంఖనాదమే అయింది.

ఇలాఉండగా, ఓరోజు సరుకులు కొనుగోలు చేసేందుకు పట్నం వెళుతూ పనిముగించుకుని రావడానికి రెండ్రోజులు పడుతుందని అంతవరకు కిరాణాకొట్టు జాగ్రత్తగా చూసుకోమని దేవయ్య భార్యకి చెప్పాడు.

తల ఊపుతూ 'అలాగే' అంది అర్ధాంగి ధనలక్ష్మి.

దేవయ్య పట్నం వెళ్ళి సరుకులు కొని ఎడ్లబండిలో వేసుకుని తిరిగొస్తుండగా, మార్గమధ్యంలో దొంగలు దాడిచేసి అతడివద్దనున్న డబ్బు, సామగ్రిని దోచుకెళ్ళారు.

ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోవడంతో బిక్కమొహం వేసుకుని ఉత్త చేతుల్తో తిరిగొచ్చాడు దేవయ్య. తీరా ఇంటికొచ్చేసరికి తలుపుకి తాళం పెట్టి ఉంది. 'నాన్నకి ఒంట్లో బాగోలేదని తెలిసి పిల్లలతో మా పుట్టింటికెళుతున్నాను, ఈలోగా మీరొస్తే తిన్నగా అక్కడికొచ్చేయండి' అని ధనలక్ష్మి రాసిపెట్టిన చీటీ తలుపుపై అంటించి ఉంది.

దాన్ని చూసేసరికి దేవయ్యకి తిక్కరేగింది. తను వచ్చేంతవరకు ఆగకుండా వెళ్ళిపోయినందుకు భార్యమీద పీకలదాకా కోపం వచ్చింది. రాత్రంతా ఎడ్లబండి తోలుకుంటూ రావడం వల్ల బడలికగా ఉంది. పైగా ఆకలితో పేగులు ఆర్చుకుపోతున్నాయి. చూస్తే చేతిలో చిల్లిగవ్వలేదు. ఊళ్ళో ఎవరినైనా అప్పు అడగడానికి మన సొప్పడం లేదు. అడిగినా ఎవరూ ఇవ్వరని తెలుసు. అందుకే 'దేవుడా!'అంటూ తిన్నగా అత్తవారింటికి పయనమయ్యాడు. దారిలో ఓ గ్రామంలో పేదలకు అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిసి బండిని ఆపి అక్కడకెళ్ళాడు. క్షుద్బాధ భరించలేక అటూ ఇటూ చూసి తనకు తెలిసిన వాళ్ళెవరూ లేరని నిర్ధారించుకున్నాక ఆకు తీసుకుని పంక్తిలో కూర్చున్నాడు. సుష్టుగా భోంచేసి బ్రేవుమని త్రేన్చాడు. కడుపు మంట చల్లారగానే అతడికి జ్ఞానోదయమైంది. అన్నదానం మహిమ అర్థమైంది. గతంలో తాను ఇటువంటి మంచి కార్యక్రమాలకి పైసా కూడా విదల్చనందుకు సిగ్గుపడ్డాడు.

ఆ రోజు నుంచి ఊళ్ళో ఏ కార్యక్రమం జరిగినా అడిగి మరీ చందాలివ్వసాగాడు. అతడిలో వచ్చిన ఈ మార్పుకు జనమంతా ఎంతగానో సంతోషించారు. ఎవరికైనా కడుపునిండా అన్నంపెట్టి సంతోషపెట్టవచ్చుగానీ, ధన ధాన్యాలిచ్చి సంతృప్తిపరచలేమని దేవయ్య తెలుసుకున్నాడు. అన్నం పరబ్రహ్మ స్వరూపం కదా!

- దూరి వెంకటరావు

వీకెండ్ క్విజ్-449

వీరిద్దరూ ఎవరు?

మీ జవాబులను కార్డుపై రాసి పంపించండి. సరైన సమాధానాలు రాసిన వారిలో ఒకరిని డ్రాలో ఎంపిక చేసి రూ. 100 బహుమతి అందిస్తాం.
చిరునామా: సిసింద్రి, ఆంధ్రభూమి దినపత్రిక, 36, నరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

క్విజ్-448 సమాధానాలు

- ప్రముఖ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్
- రాష్ట్ర మాజీ మంత్రి శంకరరావు

విజేత

ఉరందూర్ పద్మావతి,
ఇంటి నెం. 6-12-21,
కనక భూషణం లే అవుట్,
తిరుపతి- 517 507

సరైన సమాధానాలు రాసిన వారిలో కొందరు

కొప్పర్తి ప్రసాద్, హైదరాబాద్
మ్యాదం మంజులాదేవి, హైదరాబాద్
పి.భార్గవి, బాల్కంపేట
కంభంపాటి గోపాలకృష్ణ, మర్రిపూడి
మాదిరెడ్డి రవీంద్రనాథ్‌టాగూర్, బాల్కంపేట
అంబటి ఎ.నాయుడు, కొత్తగూడెం
టి.భారతి, హైదరాబాద్
తూపిలి లీలావతి, తిరుపతి
టి.నాగూర్, తిరుపతి
మ్యాదం నిఖిల్, హైదరాబాద్
పాలడుగు నరోజిని, మోతీనగర్
చిగురుపాటి పద్మజ, బోరబండ
నగరపు వెంకటలక్ష్మి, కూకట్‌పల్లి
మల్లంపాటి నాగేశ్వరరావు, భర్తిపూడి
మన్నె నుశీల, ఈతేరు
బెల్లంకొండ భాగ్యలక్ష్మి, భర్తిపూడి
కనమర్లపూడి వెంకట పుల్లారావు, చీరాల
రాజోలి శరణ్య, బోరబండ
ఆకు రాజరాజేశ్వరి, భర్తిపూడి
మునునూరి చెంచమ్మ, ములుకుదురు
గవిని సంజీవమ్మ, అప్పికట్ల
రాజోలి బాలాదిత్య, హైదరాబాద్
సి.విక్రమ్, హైదరాబాద్
కందిగట్ల జయశ్రీ, హైదరాబాద్
టి.వినీత, బోరబండ
ఉరందూర్ దయాచారి, వి.కోట
యు.లత, వి.కోట
నగరపు వెంకటరావు, హైదరాబాద్
కొప్పర్తి కె.మేహిత్, హైదరాబాద్
డి.వంశీ, భువనగిరి
దాసారపు సంధ్య, భువనగిరి
పి.వరశురామయ్య, పూళ్ళ
కె.వెంకటయ్య, జనగామ
బి.పద్మ, సికింద్రాబాద్
ధరణి శ్రీనిజ, హైదరాబాద్
రాజోలి కిరణ్, మోతీనగర్
చేకూరి పద్మావతి, భరత్‌నగర్
ఆర్.సంజయ్‌కుమార్, హైదరాబాద్
ఆర్.విజయ్‌కుమార్, హైదరాబాద్
మార్గం శరత్‌బాబు, హైదరాబాద్
శ్రీమాన్ శ్రీకాశ్యప, సింహాచలం
ఎం.జి.కె.శ్రీకాంత్, ముగ్గళ్ళ
ఎం.సౌందర్య సుధ, ముగ్గళ్ళ
ఉలాపు బాలకేశవులు, గిద్దలూరు
నేమాన వి.సత్యనారాయణ, విశాఖపట్నం
నేమాన సుభాష్‌చంద్రబోస్, మధురవాడ
పి.అమరమయూరి, గిద్దలూరు
మహమ్మద్ యూసుఫ్, హైదరాబాద్
ఎన్.మనోహర్, అదిలాబాద్,
పిల్లా సత్యవతి, పెడన
పి.రాంబాబు, విశాఖపట్నం
బి.వరలక్ష్మి, గునుపూడి
బూది సత్యనారాయణ, నల్లవారితోట
సర్ది హారతి, పాలకొల్లు
సి.వి.వి.బాలాంజనేయులు, విజయవాడ
ఎన్. శంకర నారాయణ, రాజానగరం
పి. అలివేలు మంగ, విజయనగరం
ఆర్. రాధా మాధవి, రాజమండ్రి
రౌతు జయ, నరసన్నపేట
ఆర్. విజయ భాస్కర్, కాకినాడ
ఎం. అప్పారావు, వీరఘట్టం
నాగం ఇందిర, మహబూబ్‌నగర్
కె. ఆదిలక్ష్మి , మధురవాడ, విశాఖ
పి. సూర్యలింగం, తుని
జె. నాగరత్నం, తణుకు

చిత్రలేఖనంలో అవార్డుల పంట

చదువులోనే కాదు, చిత్రకళలోనూ తన అసాధారణ ప్రతిభను చాటుతూ ఎన్నెన్నో అవార్డులను, నగదు పురస్కారాలను మేఘన సాయి సొంతం చేసుకుంటోంది. పరిసరాలపై అవగాహన, జాతీయతా భావం, పోటీతత్వం, సృజనాత్మకత వంటి మంచి గుణాలుంటేనే చిత్రకళలో అద్భుతాలు సాధించవచ్చని ఈమె నిరూపిస్తోంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లో శ్రీ విద్యాంజలి హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి తన కుంచెను ఎప్పటికప్పుడు పదును పెడుతూ విభిన్న రీతుల్లో 'రంగుల ప్రపంచాన్ని' ఆవిష్కరిస్తోంది. ఇటీవల 'సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్' (సిసిఆర్‌టి, న్యూఢిల్లీ) నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న ఈమె విశేష ప్రతిభ చూపి స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత సాధించింది. ఈమె సృష్టించిన 'గాలిపటాలు' పెయింటింగ్ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. 2012 అక్టోబర్ నుంచి ఫిబ్రవరి 2020 వరకూ ఏడాదికి 12,600 రూపాయల స్కాలర్‌షిప్ పొందేందుకు ఈమె ఎంపికైంది.

ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలు, 12 అవార్డులు, రాష్ట్ర స్థాయిలో రెండు రజత పతకాలు, పలు అవార్డులను మేఘన సాయి దక్కించుకుంది. నగర, జిల్లా స్థాయి పోటీల్లో సుమారు పాతిక అవార్డులను సాధించింది. బేగంపేటలోని కేంద్రీయ విద్యాలయం ఆర్ట టీచర్ బి.శశిభూషణ రావు శిష్యరికంలో ఈమె చిత్రకళలో మెళకువలను తెలుసుకుని వందలాది పెన్సిల్ స్కెచ్‌లు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్రీటింగ్ కార్డులు వంటివి రూపొందించింది. తల్లిదండ్రులు డి.రామకృష్ణ రాజు, శిరీషా రాణి ప్రోత్సాహమే తన విజయానికి కారణమని ఈమె చెబుతోంది. గత ఏడాది 'రసమయి' సంస్థ ఈమెను ఉగాది పురస్కారంతో సత్కరించింది. రాజమండ్రికి చెందిన 'విశ్వ కళాదర్శిని' 2008లో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో పాల్గొని 'నేషనల్ సూపర్ కిడ్' అవార్డును, బంగారు పతకాన్ని మేఘన సొంతం చేసుకుంది. 2011లో ఢిల్లీకి చెందిన అవంతిక గ్రూప్ ఆఫ్ కాంటెంపరరీ ఆర్టిస్ట్స్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు, 2012లో అదే సంస్థ నుంచి రజత పతకం, పలు సంస్థలు నిర్వహించిన పోటీల్లో అవార్డులను ఈమె సాధించింది.

కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ 2012లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో 5 వేల రూపాయల నగదు బహుమతి, హైదరాబాద్‌లో భూగర్భ జల విభాగం నిర్వహించిన పోటీలో 5వేల రూపాయలను, ఫ్రెండ్స్ ఫుట్ వేర్ (విజయవాడ) నిర్వహించిన పోటీలో రజత పతకం, కొత్తగూడెంలోని కల్చరల్ క్లబ్ నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో రజత పతకాన్ని ఈమె కైవసం చేసుకుంది. మేఘన జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల శ్రీ విద్యాంజలి హైస్కూల్ యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కంప్యూటర్ ఇంప్రూవ్‌మెంట్

అర్థాల ఆట



కింద ఇచ్చిన తెలుగు పదాల అర్థాల ఆధారంగా ఆంగ్ల పదాలతో గడులు నింపాలి.

ఆధారాలు

అడ్డము	నిలువు
1. గోనె నంచి	1. రత్నము
3. మంచు	2. గజము
5. కళ	4. కాపలా
8. రెమ్మ	6. గాలి
9. కల్పిత కథ	7. రంగు
11. గబ్బిలము	8. మెలిక
13. ప్రయత్నించు	10. పచ్చికబయలు
14. శబ్దము	12. తేనెటీగ

గత వారం సమాధానాలు

అడ్డము : 1. CRANE 3. BUN 5. BIG 8. TOOL 9. LOVE 11.PEN 13.END 14. LANCE
నిలువు : 1.CAN 2. EXIT 4. NIECE 6. LOT 7. COW 8. TRADE 10. ZEAL 12. LIE

-కైపు ఆదిశేషారెడ్డి

అమృతత్వం

సూర్యశ్రీ

స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన ప్రజ్ఞ తండ్రిని అడిగింది.

''నాన్నా.. ! మొన్న మనం విన్న రామాయణం ప్రవచనంలో దేవుడ్ని నమ్మి అనుసరించేవాళ్ళకి అమృతత్వం లభిస్తుందని చెప్పారు కదా. అమృతత్వం అంటే ఏమిటి?''

''అమృతత్వం అంటే మరణం లేకపోవడం. ఎందుకు ఈ ప్రశ్న వేసావు?'' ప్రజ్ఞను తండ్రి అడిగాడు.

''ఆయన చెప్పింది తప్పు నాన్నా.. మా సంస్కృతం టీచర్ తండ్రి గొప్ప రామభక్తుడు. కానీ వారం క్రితం ఆయన పోయారుట.''

ప్రజ్ఞ తండ్రి చిన్నగా నవ్వి వెంటనే ప్రజ్ఞని గిచ్చాడు.

''అబ్బా? ఎందుకు నన్ను గిచ్చావు?''

''నేను గిచ్చింది నిన్ను కాదు. నీ ఇంటిని.''

''నా ఇల్లా? నాకు అర్థం కాలేదు.''

''నువ్వు నీ శరీరంలో ఉంటున్నావు దేవుడు నీ మనసు, ఆత్మ భూలోకంలో జీవించడానికి నిన్ను ఈ శరీరంలో ప్రవేశపెట్టాడు. నిజమైన నువ్వు ఈ శరీరపు ఇంట్లో నివసిస్తున్నావు.''

''ఓ..! కానీ నాకు ఆ సంగతి తెలీడం లేదే? నీకెలా తెలుసు?'' ప్రజ్ఞ ప్రశ్నించింది.

''హిందూ సనాతన ధర్మం ఈ సంగతి చెప్పడం వల్ల తెలిసింది. ప్రతి మనిషి ఎవరికివారు ఈ సంగతిని తెలుసుకోవాలని కూడా మన మతం చెప్తోంది. అందుకే మనం దేవుడ్ని ప్రార్థించడం, మనసులో సదా స్మరించడం. హిందువుగా పుట్టిన ప్రతీవారి జీవిత లక్ష్యాన్ని అమృతత్వం అని ఆ ప్రవచనం చెప్పిన వ్యక్తి చెప్పారు. అమృత తత్వం లభిస్తే అప్పుడే మనకి ఎన్నడూ చావు లేదని, ఓ ఇంట్లోంచి అంటే ఓ శరీరంలోంచి ఇంకో శరీరం లోకి మారుతున్నామన్న సంగతి బోధపడుతుంది.''

''ఇళ్ళు మారినట్లుగా అన్న మాట.''

''అవును. ఇల్లు కొంతకాలం తర్వాత శిథిలమైపోతే ఆ ఇంట్లోని వాళ్ళు కూడా శిథిలం కారుగా. ఇంకో ఇంట్లోకి మారతారు. అలాగే పాత శరీరం తప్పనిసరిగా శిథిలం అయి తీరుతుంది. రాముడు, కృష్ణుడు లాంటి కొందరు అవతార పురుషుల శరీరాలు కూడా శిథిలం అయినా అందులోని పరమాత్మ ఎలా శిథిలం కాదో అలాగే మనలోని ఆత్మ కూడా శిథిలం కాదని, మనం సదా ఉంటామని చెప్పడమే అమృతత్వం అంటే.''

స్కూల్ డేకి ప్రజ్ఞ హిందూ వేదాంతం మీద మాట్లాడిన మాటలు విన్న న్యాయ నిర్ణేత ఆమెని అభినందిస్తూ చెప్పాడు.

''ప్రతి హిందువూ నేర్చుకోవాల్సిన విషయం ఇది.''

-మల్లాది వెంకట కృష్ణమూర్తి



ధ్వని సహాయంతో చూడడం

చేసి చూద్దాం

ఒక పిజ్జా పెట్టెను తీసుకోవాలి. కార్డు బోర్డును తీసుకుని ఒక అంగుళం వెడల్పు గల ముక్కను కత్తిరించాలి. ఈ కార్డు బోర్డు ముక్కతో వృత్తాకారం, త్రిభుజాకారం, చతురస్రాకారపు వస్తువులుగా మలచాలి.

పెట్టెను తెరచి దానిలో ఈ వస్తువులను కింది భాగంలో టేపు సహాయంతో కదలకుండా అతికించాలి. ఈ వస్తువులను పెట్టెలో ఉంచిన తరువాత పెట్టె మూత ఎటువంటి ఇబ్బంది లేకుండా మూయడానికి వీలుగా ఉండాలి.

ఈ వస్తువు ఒకదాని లోపల గాజుగోళీని ఉంచాలి. ఇప్పుడు పెట్టెను మూతతో మూసివేసి మీ స్నేహితుడికి ఇవ్వాలి. గోళీ తిరిగే తిరుగుడును బట్టి అది ఏ ఆకృతిగల వస్తువులో తిరుగుతున్నది మీ స్నేహితుడిని చెప్పమని అడగాలి. మీ స్నేహితుడు పెట్టెను తీసుకుని కుదుపుతాడు. జాగ్రత్తగా చెవివద్ద పెట్టెను ఉంచి గోళీ కదలికల ధ్వని వింటాడు. ఆ ధ్వని శైలినిబట్టి అది ఏ ఆకృతిగల వస్తువులో తిరుగుతున్నది చెప్పగల్గుతాడు.

చెవులు వినే ధ్వనులు నరాలు సంకేతాలుగా మార్చి మెదడుకు పంపుతాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించే మెదడు ధ్వని ఏయే ఆకారాల్లో వస్తువు తిరుగుతున్నదో పసిగట్టగల్గుతుంది. వేగము, వస్తువు తిరిగే ఘన పరిమాణమును బట్టి ఏయే కోణాల్లో గోళీ తిరుగుతున్నదో తెలుసుకోవడం సాధ్యం అవుతుంది.

గోళీ కార్డుబోర్డు గోడలతో పొందే అభిఘాతాలు ఒకొక్కప్పుడు విశ్లేషణలో మెదడును తప్పుత్రోవ పట్టించే అవకాశం ఉంటుంది. మెదడు మొత్తం సమాచారం సేకరించిన తరువాత గోళీ ఏ ఆకృతిగల వస్తువులో తిరిగినదో చెప్పగల్గుతుంది.

- సి.వి.సర్వేశ్వరశర్మ

ఆటోగ్రాఫ్

విక్రం సరభాయ్

ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త

నేను గీసిన బొమ్మ



ఎన్. దీప్తి, గుడివాడ

బి. కుసుమ సాహితి, కశింకోట, విశాఖ జిల్లా



యంత్రపాటి గాయత్రీ ప్రసాద్, నాయుడుపేట

ఎం. సతీష్, నర్సంపేట

దొంతుల దినేష్‌కుమార్, హైదరాబాద్

కె. మౌనిక, విశాఖపట్నం

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

ఆదివారం 10, ఫిబ్రవరి 2013

క్యారట్ సలాడ్

కావలసినవి

- క్యారట్ 3
- ఉల్లిపాయ 1
- పచ్చిమిర్చి 3
- పండుమిర్చి 3
- ఉప్పు ..... తగినంత
- నిమ్మరసం ..... 1 టీ.స్పూ.
- మిరియాల పొడి ... 1/4 టీ.స్పూ.

తయారు చేసేదిలా

క్యారట్ చెక్కు తీసి సన్నగా చీలికల్లాగా కట్ చేసుకోవాలి లేదా లావుగా తురుముకోవాలి. పచ్చిమిర్చి, పండుమిర్చిని సన్నగా వాలుగా కట్ చేసుకోవాలి. ఉల్లిపాయను నిలువుగా, సన్నగా కట్ చేసుకోవాలి.

ఒక గిన్నెలో క్యారట్ తరుగు, పచ్చిమిర్చి, పండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు నిమ్మరసం, మిరియాల పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టి వెంటనే లేదా కొద్దిగా చల్లబరిచి సర్వ్ చేయాలి. కావాలంటే కొత్తిమీర వేసుకోవచ్చు.

కాప్సికం, కార్న్ ఫ్రైడ్ రైస్

కావలసినవి

- అన్నం ..... 3 కప్పులు
- కాప్సికమ్ ముక్కలు ..... 1 కప్పు
- కార్న్: పచ్చిబఠానీలు ..... 1/2 కప్పు
- ఉల్లిపాయ 1
- పచ్చిమిర్చి 4-5
- అల్లం వెల్లుల్లి ముద్ద ..... 1 టీ.స్పూ.
- పసుపు ..... 1/4 టీ.స్పూ.
- కారం పొడి ..... 1/2 టీ.స్పూ.
- గరం మసాలా పొడి ..... 1/4 టీ.స్పూ.
- లవంగాలు 4
- యాలకులు 3
- దాల్చిన చెక్క ..... చిన్న ముక్క
- షాజీర ..... 1/4 టీ.స్పూ.
- ఉప్పు ..... తగినంత
- నూనె ..... 3 టీ.స్పూ.
- కొత్తిమీర ..... 2 టీ.స్పూ.
- నెయ్యి ..... 1 టీ.స్పూ.

చేయండి ఇలా

ముందుగా బియ్యం కడిగి పొడిపొడిగా ఉండేలా వండుకోవాలి. కాప్సికమ్ కట్ చేసి లోపలి గింజలు తీసేసి అంగుళం సైజు ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇందులో లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, షాజీరా వేసి కలిపి స్వీట్ కార్న్ గింజలు, పచ్చి బఠానీలు, కాప్సికమ్ ముక్కలు వేసి నిదానంగా వేయించాలి. అవి కాస్త మెత్తబడ్డాక పసుపు, కారం పొడి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి మరో రెండు నిమిషాలు వేపాలి. ఇప్పుడు అన్నం, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. రెండు నిమిషాలు వేపిన తర్వాత గరం మసాలాపొడి, కొత్తిమీర, నెయ్యి వేసి కలిపి దింపేయాలి. పెరుగు పచ్చడితో వేడిగా సర్వ్ చేయాలి.

మసాలా ఫ్రైడ్ ఇడ్లీ

కావలసినవి

- ఇడ్లీ పిండి ..... 4 కప్పులు
- పచ్చికొబ్బరి తురుము ..... 1/2 కప్పు
- పుట్నాల పప్పు ..... 5 టీ.స్పూ.
- పచ్చిమిర్చి 2
- పెరుగు ..... 5 టీ.స్పూ.
- ఉప్పు ..... తగినంత
- ఉల్లిపాయ ..... 1 చిన్నది
- పసుపు ..... 1/4 టీ.స్పూ.
- కారం పొడి ..... 1 టీ.స్పూ.
- ధనియాల పొడి ..... 1 టీస్పూ.
- గరం మసాలాపొడి ..... 1/4 టీ.స్పూ.
- ఎండు కొబ్బరి పొడి ..... 3 టీ.స్పూ.
- కొత్తిమీర ..... 2 టీ.స్పూ.
- పచ్చిమిర్చి 2
- కరివేపాకు ..... 2 రెబ్బలు
- ఆవాలు, జీలకర్ర ..... 1/4 టీ.స్పూ.
- నూనె ..... 4 టీ.స్పూ.

వండే విధం

ముందుగా ఇడ్లీ పిండితో చిన్నవిగానీ, పెద్దవిగానీ ఇడ్లీలు చేసుకోవాలి. తర్వాత వాటిని చాకుతో చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పచ్చి కొబ్బరి, పుట్నాల పప్పు, పచ్చిమిర్చి

ముక్కలు, పెరుగు, తగినంత ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. చెంచాడు నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక కొబ్బరి పచ్చడిలో కలుపుకోవాలి. పాన్‌లో మిగిలిన నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ, కరివేపాకు వేసి దోరగా వేయించాలి. ఇందులో పసుపు, కారం పొడి, ధనియాల పొడి, గరం మాసాలా పొడి, వేసి కొద్దిగా వేపాలి. తర్వాత కొబ్బరి పొడి, సన్నగా తరిగి కొత్తిమీర వేసి మరో రెండు నిమిషాలు వేపి కట్ చేసుకున్న ఇడ్లీ ముక్కలు, తగినంత ఉప్పు వేయాలి. మొత్తం మసాలా అంతా ఇడ్లీ ముక్కలకు పట్టేలా కలుపుతూ రెండు నిమిషాలు వేపి దింపేయాలి. తర్వాత కొబ్బరి పచ్చడి సర్వ్ చేయాలి. కొత్తగా ఇడ్లీలు చేయకున్నా మిగిలిపోయిన ఇడ్లీలతో ఇలా కొత్తరకం వంటకం చేయొచ్చు. మసాలాలో ఇడ్లీలను ఎక్కువసేపు వేపితే గట్టిపడతాయి.

బ్లూ లగూన్

కావలసినవి

- ద్రాక్షరసం ..... 1/4 కప్పు
- బ్లూ కురేసో ..... 2 టీ.స్పూ.
- కూల్ డ్రింక్ ..... 1/4 కప్పు
- నిమ్మరసం ..... 1 టీ.స్పూ.
- ఐస్ ముక్కలు ..... సరిపడా

ఇలా చేయాలి

ఈ పానీయం చేయడానికి పొడుగాటి గ్లాసు ఉంటే

బాగుంటుంది. ముందుగా బ్లూ కురేసో (సూపర్ మార్కెట్లు లేదా బేకరీ సామాన్లు దొరికే షాపుల్లో దొరుకుతుంది) వేయాలి. తర్వాత ఐసు ముక్కలను వేయాలి. దానిపైన ద్రాక్ష రసం పోయాలి. తర్వాత మార్కెట్‌లో లభించే ఏదైనా కూల్ డ్రింక్ పోసి నిమ్మరసం వేయాలి. స్ట్రాతో మెల్లిగా కలిపి వెంటనే సర్వ్ చేయాలి.

కొబ్బరి, సేమ్యా కేసరి

కావలసినవి

- సేమ్యా ..... 1 1/2 కప్పు
- పంచదార ..... 1/2 కప్పు
- కండెన్స్ మిల్క్ ..... 1/2 కప్పు
- కొబ్బరి పొడి ..... 1/4 కప్పు
- కేసర్ రంగు ..... చిటికెడు
- యాలకుల పొడి ..... 1/2 టీ.స్పూ.
- కిస్మిస్ ..... 2 టీ.స్పూ.
- బాదం పప్పు 4
- నెయ్యి ..... 4 టీ.స్పూ.

వండండి ఇలా

పాన్‌లో మూడు చెంచాల నెయ్యి వేడి చేసి సేమ్యా దోరగా వేయించాలి. ఇందులో రెండు కప్పుల నీళ్ళు పోసి ఉడికించుకోవాలి. సేమ్యా ఉడికిన తర్వాత పంచదార, కండెన్స్ మిల్క్, యాలకుల పొడి వేసి కలపాలి. పంచదార కరిగిన తర్వాత సగం తీసి వేరే పాన్‌లో వేయాలి. ఒక దాంట్లో కేసర్ రంగు, కిస్మిస్ వేసి నిదానంగా ఉడికించాలి. ఇంకో భాగంలో కొబ్బరి పొడి వేసి కలుపుతూ ఉడికించాలి. ఒక గిన్నెకు లోపలంతా నెయ్యి రాయాలి. అడుగున సన్నగా కట్ చేసుకున్న బాదం పప్పు ముక్కలు వేయాలి. సేమ్యా పూర్తిగా ఉడికి దగ్గర పడుతున్నప్పుడు తీసి ముందుగా అడుగున కొబ్బరి కలిపిన సేమ్యా వేసి గరిటతో అద్దాలి. దానిపైన కేసర్ వేసిన సేమ్యా వేసి ఒత్తాలి. పూర్తిగా చల్లార్చిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి. కేక్‌లా ముక్కలు కట్ చేసి వేడిగా కాని, చల్లగా కాని సర్వ్ చేయొచ్చు.

క్యారట్, ఉల్లి దోశ

కావలసినవి

- మినప్పప్పు ..... 1 గ్లాసు
- బియ్యం ..... 3 గ్లాసులు
- మెంతులు ..... 1/4 టీ.స్పూ.
- కందిపప్పు ..... పిడికెడు
- ఉప్పు ..... తగినంత
- క్యారట్ తురుము ..... 1/4 కప్పు
- ఉల్లి తరుగు ..... 1/4 కప్పు
- కొత్తిమీర ..... 3 టీ.స్పూ.
- జీలకర్ర ..... 1 టీ.స్పూ.
- పచ్చిమిర్చి 5
- అల్లం ..... అంగుళం సైజు ముక్క
- నూనె ..... 1/4 కప్పు

ఇలా వండాలి

మినప్పప్పు, బియ్యం కడిగి నీళ్లుపోసి మెంతులు, కందిపప్పు వేసి నాలుగైదు గంటలు నానబెట్టాలి. తర్వాత సన్నగా తరిగిన, పచ్చిమిర్చి, అల్లం కలిపి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. ఈ పిండిలో జీలకర్ర, ఉప్పు వేసి కలిపి కనీసం ఆరు గంటలు మూత పెట్టి పులవడానికి వదిలేయాలి. ఒక గిన్నెలో ఉల్లి తరుగు, క్యారట్ తురుము, కొత్తిమీర తరుగు వేసి కలుపుకోవాలి. పెనం వేడి చేసి అరచేతి వెడల్పుగా దోశలు వేసుకుని పైన ఉల్లి, క్యారట్ మిశ్రమం పలుచగా వేసి అంచుల వెంబడి నూనె వేసి మూత పెట్టాలి. నిదానంగా ఉడికిన తర్వాత మడిచి తీసేయాలి. ఇష్టముంటే రెండో వైపు కూడా కాల్చుకోవచ్చు. అలా చేస్తే దోశ మృదువుగా ఉండదు.

కాలీఫ్లవర్, మెంతి పకోడీలు

కావలసినవి

- కాలీఫ్లవర్ ముక్కలు - 1 కప్పు
- శనగపిండి - 2 కప్పులు
- ఉల్లిపాయ ముక్కలు - 1/2 కప్పు
- కరివేపాకు - 2 రెబ్బలు
- మెంతికూర - 1/4 కప్పు
- పసుపు - 1/4 టీ.స్పూ.
- కారం పొడి - 1 టీ.స్పూ.
- గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ.
- ధనియాల పొడి - 1 టీ.స్పూ.
- అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
- ఉప్పు - తగినంత
- నూనె - వేయించడానికి

తయారు చేసేదిలా

కాలీఫ్లవర్ చిన్న చిన్న ముక్కలుగా విడదీసి కట్ చేసి ఉప్పు వేసి మరిగించిన నీళ్లలో వేసి పెట్టాలి. ఇలా చేయడంవల్ల అందులో ఏవైనా పురుగులుంటే నశించిపోతాయి. తర్వాత వాటిని జల్లెట్లో వేసి ఉంచుకోవాలి. ఒక గిన్నెలో జల్లించిన శనగపిండి తీసుకుని అందులో కడిగి సన్నగా కట్ చేసిన మెంతికూర, కరివేపాకు, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పసుపు, కారం పొడి, అల్లం వెల్లుల్లి ముద్ద, గరం మసాలా పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. చివరిలో తగినంత ఉప్పు, ఉడికించిన కాలీఫ్లవర్ ముక్కలు వేసి కలపాలి.

తగినన్ని నీళ్లు వేసి మరీ పలుచగా కాకుండా, మరీ చిక్కగా కాకుండా బజ్జీల పిండిలా కలపాలి. బాణలిలో నూనె వేడి చేసి ఈ పిండితో పొడి పొడిగా పలుచగా పకోడీలు వేయాలి. రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకూ వేయించి తీసుకోవాలి. ఇష్టముంటే ఒక కోడి గుడ్డు కొట్టి అందులో కలపొచ్చు.

బొబ్బర్లు, కార్న్ సలాడ్

కావలసినవి

- ఉడికించిన బొబ్బర్లు ..... 1/2 కప్పు
- ఉడికించిన స్వీట్ కార్న్ ..... 1/4 కప్పు
- క్యారట్ ముక్కలు ..... 3 టీ.స్పూ.
- ఉల్లిపాయ ముక్కలు ..... 2 టీ.స్పూ.
- టమాటా ముక్కలు ..... 2 టీ.స్పూ.
- కొత్తిమీర ..... 2 టీ.స్పూ.
- నిమ్మరసం ..... 1 టీ.స్పూ.
- చాట్ మసాలా పొడి ..... 1/2 టీ.స్పూ.
- మిరియాల పొడి ..... 1/4 టీ.స్పూ.
- ఉప్పు ..... తగినంత

ఇలా చేద్దాం

బొబ్బర్లు, స్వీట్‌కార్న్ విడివిడిగా కొద్దిగా ఉప్పు వేసి ఉడికించుకొని జల్లెట్లో వేయాలి. ఒక బౌల్‌లో బొబ్బర్లు, కార్న్ గింజలు, చిన్నగా కట్ చేసుకున్న లేదా తురుముకున్న క్యారట్, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసిన ఉల్లిపాయ, టమాటా ముక్కలు, సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా పొడి, మిరియాల పొడి, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టి వెంటనే లేదా కొంచెం చల్లబరిచి సర్వ్ చేయాలి.

మిర్చి కుర్మా

కావలసినవి

- పెద్ద సైజు మిరపకాయలు 8
- ఉల్లిపాయ 1
- అల్లం వెల్లుల్లి ముద్ద ..... 1 టీ.స్పూ.
- పసుపు ..... 1/4 టీ.స్పూ.
- కారం పొడి ..... 1 టీ.స్పూ.
- ధనియాల పొడి ..... 1 టీ.స్పూ.
- గరం మసాలా పొడి ..... 1/4 టీ.స్పూ.
- కొబ్బరి పొడి ..... 3 టీ.స్పూ.
- గసగసాల పొడి ..... 1 టీ.స్పూ.
- పెరుగు ..... 1/4 కప్పు
- టమాటాలు 2
- ఉప్పు ..... తగినంత
- నూనె ..... 3 టీ.స్పూ.

ఇలా చేయాలి

పచ్చిమిరపకాయలను తొడిమలు తీసేసి అంగుళం సైజు ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో పెరుగు, కొబ్బరి పొడి, గసగసాల పొడి, ధనియాల పొడి, గరం మసాలా పొడి వేసి కలుపుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన లేదా గ్రైండ్ చేసుకున్న ఉల్లిపాయ వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేయించి

చాలి. ఇందులో పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం పొడి వేసి కొద్దిసేపు వేపి, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. నిదానంగా మగ్గనివ్వాలి. పచ్చిమిర్చి ముక్కలు కాస్త మెత్తబడ్డాక పెరుగు మిశ్రమం, కప్పుడు నీళ్ళుపోసి కలిపి తగినంత ఉప్పు కూడా వేసి మూతపెట్టాలి. పచ్చిమిర్చి, మసాలా మొత్తం కలిపి ఉడికి నూనె తేలుతున్నప్పుడు దింపేయాలి. ఈ కూర చపాతీ, పులావ్, బిర్యానీలకు బావుంటుంది.

- జ్యోతి వలబోజు

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
ఆదివారం
10, ఫిబ్రవరి
2013

సేర్చుండ్రాం

పలు జన్మంబుల గూడ బద్ద భవశుంభ ద్ఘోర దుష్కర్మ రా
సులు పై గూలి సమస్త జీవులు వెసన్ శోషించుచున్ బెద్ద దు
ర్బలులై చిక్కిన దగ్ధవాపహరణార్థం బొప్ప బద్మోద్భవ
ప్రళయం బొక్కొక్క మాటు సేయుదు తుదిన్ భావింప సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా ! అనేక జన్మలలో పేరు కొనిపోయిన సంసార రాక్షసుని భయంకర దుష్కర్మరాశులు మీద పడగా జీవులందరూ శుష్కించి బలరహితులై చిక్కుపడిపోగా వారి సంసారాన్ని తొలగించుటకు చివరకు ఒక్కొక్కసారి నీవు బ్రహ్మ ప్రళయాన్ని కల్గిస్తావు. ఇక్కడ ప్రళయం కల్గించడం కూడా శివానుగ్రహంలో ఒక భాగంగా కవి చెప్తున్నారు.

దుష్కర్మలు మీద పడినపుడు సంసారాన్ని తొలగించడం ఈ ప్రళయ కల్పన ఒక్కొక్కసారిశివుడను సరించే మార్గం అన్నమాట. పద్మోద్భవ ప్రళయం అంటే బ్రహ్మప్రళయం. ఈ ప్రళయాలు నాల్గు రకాలు. అవి 1. నిత్యప్రళయం, 2.బ్రహ్మప్రళయం, 3. ప్రాకృత ప్రళయం, 4. అత్యంతిక ప్రళయం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

౨ **శ్రీ లత**

మూసీ తెరుస్తున్న కళ్ళను పూర్తిగా తెరిచి ''నాకేం కాలేదు'' అన్నట్లు సైగ చేసింది జీవన. ఉయ్యాల్లో పాప ఏడ్వడంతో కళ్ళతోనే పాప వైపు సైగ చేసింది తీసుకోమన్నట్లు.

''ఏడవనీ, దాని మూలంగానే నా బిడ్డకీ కష్టం'' కొంచెం కినుకగా అంది వసంత.

''కాదు... కాదు'' అన్నట్లు తల అడ్డంగా ఊపింది జీవన.

''అవును దాని మూలంగానే అది కడుపులో ఏ ముహూర్తంలో పడిందో అప్పట్నుంచీ నా బిడ్డకు కష్టాలూ, కన్నీళ్ళు. అయిన వాళ్ళందర్నీ ఒదులుకుని దానికోసమే ఈ మద్రాసుకు వచ్చి మరీ ఒంటరిగా ఉండాల్సొచ్చింది. అసలు... అసలు... ఈ రోజే మిషనరీ వాళ్ళకు అప్పజెప్పేస్తానుదాన్ని నా బిడ్డకు పట్టిన శని పోతుంది'' అంది కొంచెం దురుసుగానే. తన బిడ్డమీద మమకం తననేదయినా మాట్లాడేలా చేస్తోందని గమనించింది జీవన.

''అమ్మా నీకు నేను శనినా?'' అడిగిందిజీవన మెత్తగా!

''నువ్వెలా శనివవుతావురా? నువ్వు నా వరాల పట్టివి'' అంది వసంత.

''నీ బిడ్డ నీకు శని కానప్పుడు, నా బిడ్డ నాకు.... శని...ఎలా అవుతుం..ద..మ్మా''' అని అంటూనే నిద్రలోకి జారుకుంది. నిద్రలోకి వెళ్ళేముందు కూడా ఉయ్యాలవైపే చూస్తూ కళ్ళు మూసుకుంది. వసంత కాసేపలా జీవన మొహంలోకి చూస్తూండిపోయింది. తన కూతురేదో పెద్దదయిపోయినట్లూ నిన్నటికీ ఈ రోజుకీ ఎంతో ఎదిగిపోయినట్లు, ఆ ఎదుగుదల తనకు కూడా అందని స్థాయిలో సాగుతున్నట్లు అనిపించింది. మెత్తగా తల నిమిరింది.

తన కూతురికీ... తన కూతురికి పుట్టిన కూతురికీ పోలికెక్కడిది!

తన కూతురు.. తనూ.. తన భర్తా అన్యోన్యంగా చేసిన దాంపత్యంలో అనురాగంగా పుట్టింది, అపురూపంగా పెరిగింది.

ఈ కూతురు.. కూతురేమో తండ్రివరో తెలియకుండా.. రేపు సమాజపు ప్రశ్నకు.. వేయబోయే తెల్లమొహంలా నిర్వికార నిశ్శబ్దంగా పుట్టింది.

కానీ జీవన తన బిడ్డకూ.. ఈ బిడ్డకూ పోలిక తెస్తుందేవిటీ... జీవన తనను తల్లి చేసి తన భవిష్యత్తును వెలిగించింది.

ఈ బిడ్డ జీవనను తల్లిని చేసి జీవన భవిష్యత్తును చీకటి చెయ్యబోతూంది. మరి జీవనలో ఆ ఛీత్కారం రాకుండా బిడ్డపట్ల మమకారం వస్తుందేమిటి?

భయం వేసింది... భయం. తన కూతురు తనను దాటి వెళ్లిపోతున్నట్లూ, తనను 'నిన్న'ను చేసి తాను 'రేపు' వైపు సాగుతున్నట్లూ ఏదో పొద్దుగుంకిన భావన గుండెల్లో కదిలి భయం వేసింది.



''ఈ మొండిపిల్ల మొండితనానికి తోడు, పిచ్చి మమకారం తోడయితే ఇక అగ్నికి వాయువు జత కలిసినట్లయి బ్రతుకు బుగ్గపాలవుతుందేమో''నని భయం వేసింది.

''నో తననలా కానివ్వదు. ఎంత కఠినంగానయినా ప్రవర్తించి తన బిడ్డ భవిష్యత్తును కాగడాల వెలుతుర్లో నడుపుతుంది. మిణుగురు పురుగుల వెంట పరిగెత్తనీయదు. చేతులు కాలినా కనీసం మందయినా వేయగలుగుతుంది. తనేవయినా తెలివి తక్కువదా ఏమిటి? తన బిడ్డను, బిడ్డ బారినుండి రక్షించగలరు''అనుకుంది. ఉయ్యాల్లో పాప ఏడ్చినా రెండు మూడుసార్లు క్రీగంట చూసిందేగానీ, ఎత్తుకోకుండా ఊరడించకుండా, కనీసం కదలకుండా అలా కూర్చుండిపోయింది. ఎంతసేపుందో అలా తనకే తెలియదు.

జీవన గాఢనిద్రలో ఉంది ఇంజక్షన్ ప్రభావంతో...

కరెంటు పోయింది..

చీకట్లోపాప గొంతు నరాలు తేలేలా అరుస్తూనే ఉంది. అరుపుకూ వసంతకు నుదుటన చెమట పెరుగుతూనే ఉంది. పాప అలా ఏడుస్తూనే ఉంది ప్రశ్నగా. వసంత అలా కూర్చునే ఉంది సమాధానంలా ఎంతోసేపు.

పాపగొంతు తడారిపోతున్నట్లుగా అనిపించి, లేచి ఉయ్యాల దగ్గరకువెళ్లి పాపను తీసుకుని మెల్లగా హాస్పిటల్ హెడ్‌ను కలవడానికి వెళ్లింది.

⁂

అరగంటకోసారి నర్స్ వచ్చి చూసి వెళ్తూంది. సాయంత్రానికి జీవనకు స్పృహ వచ్చింది. తల దగ్గరే కూర్చున్న వసంత జీవనకు దగ్గరగా వంగి

''ఎలా ఉందిరా?'' అడిగింది ఆత్రంగా!

''నువ్వేమీ కంగారు పడకమ్మా! కాస్త నీరసంగా ఉందంతే'' అని సెలైన్ ట్యూబ్ చూస్తూ ''సెలైన్ ఎందుకు పెట్టారమ్మా'' అడిగింది మెత్తగా.

''ఓవర్ బ్లీడింగ్ వల్ల నువ్వు వీకయ్యావని అంతే మరేం లేదు'' అంది ఓదార్పుగా!

''అదేం అయ్యుండదు నువ్వే కంగాళీ చేసేసి నా కూతురు నీరసంగా ఉంది అని పెట్టించ్చుంటావ్'' అంది అమ్మ వేపు టీజింగ్‌గా చూస్తూ!

''నేను చెప్తే డాక్టర్స్ వింటారేమిటీ? పేషంట్‌కేది అవసరమో అది చేస్తారు'' అంటూ సెలైన్ పెట్టిన చోట చెయ్యి మీద రాస్తూ ఉండిపోయింది.

జీవనకేదో సడెన్‌గా గుర్తొచ్చి ఉయ్యాలవైపు చూసింది. అక్కడ ఉయ్యాల లేదు.

''అమ్మా పాపను నర్స్ తీసుకెళ్లిందా స్నానానికి'' అడిగింది అమ్మను గబగబా, ఆ అడగడంలో ఏదో అనుమానం పొడచూపింది.

''ఏమో నేను చూళ్ళేదు'' అంది వసంత.

నువ్వు చూడకపోవడమేమిటమ్మా! నీకు చెప్పకుండా ఎలా తీసుకెళ్ళింది?'' అడిగింది జీవన.

''ఏమో! కళ్ళు మూసుకుపడుకో నీకసలే నీరసంగా ఉంది'' అని అనునయించబోయి చెయ్యి నుదుటన వేసింది. ఆ చెయ్యి అలాగే నొక్కి పట్టి...

''అమ్మా పాపేది? నిన్నే అడిగేది. పాపేది అంటున్నాను'' ఇంకాస్త టెన్షన్ పడుతూ అడిగింది.

''చెప్తే విను జీవనా! మనం ఇక్కడికెందుకు వచ్చాం? డెలివరీ అయ్యాక పాపను మిషనరీ వాళ్ళకు ఇచ్చేద్దామనే కదా! అందుకు వాళ్ళను ఎంతో కన్విన్స్ చేసి ఒప్పించాం కదా! కానీ నువ్వందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నావ్... అందుకే...'' ఆగిపోయింది.

''ఆ... అందుకే.. అందుకే... చెప్పమ్మా అందుకే... ఏం... చేశావ్? ఆ ఏం చేశావమ్మా'' నుదటిమీద చెయ్యి జరిపేస్తూ అడిగింది.

''హాస్పిటల్ హెడ్ పర్మిషన్‌తో పాపను మదర్‌కు అప్పచెప్పి వచ్చాను'' అంది వసంత గబగబా.

''ఛ'' చెయ్యి విదిలించింది జీవన. సెలైన్ వైపు కదిలింది. చటుక్కున వంగి పైప్ కదలకుండా పట్టుకుంది వసంత.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

140

అమోఘాస్త్రంచే వాలి కూలుట

సుగ్రీవుడు అవస్థచూసిసి రాఘవుడు ఇప్పుడు వాలిని నేను చంపకుంటే వాలి సుగ్రీవుణ్ణి వధించడం తథ్యం'' అని తలచాడు. నారి ధ్వనింపజేశాడు. ఆ టంకార ధ్వనికి సముద్రాలు ఏడూ అల్లకల్లోలం అయాయి. చతుర్ద భవనాలు కంపించిపోయాయి. భూమండలం క్రక్కదలింది. వింట ఒక అమోఘాస్త్రాన్ని తొడగాడు. ఆ కర్ణాతమూ నారిని తెగదీశాడు. అనుపమ బలశాలి అయిన వాలిపైన ఆ అమోఘ శరాన్ని ప్రయోగించాడు. ఆ బాణ ప్రయోగానికి సూర్యకాంతులు మాసిపోయాయి. ఆకాశవీధిలో అగ్ని జ్వాలలు చెలరేగాయి. గరుడోరగ గంధర్వామరులు అదరిపోయారు. తన కుమారుడు సుగ్రీవుణ్ణి రక్షించుకొనడం కోసం, పగవాడైన వాలిని శిక్షించడం కోసం సూర్యుడు ఈ అమోఘాస్త్రమై ఏతెంచాడోఅనే విధంగా తపనుడి పుత్రుడైన యముడు తన తమ్ముడు సుగ్రీవుణ్ణి ప్రోచుట కోసం తన చేతి దండాన్ని వాలిమీదకి ప్రయోగించాడో అన ఆ శరం మహావాయువేగంతో రివ్వుమంటూ దూసికొని వచ్చి వాలి వక్షస్థలంలోనాటుకొంది. వెంటనే దర్పం నశించి వాలి నేలకూలాడు. దిగ్గజాలతోను, పర్వతాలతోను, దరుల తోనూ ధరణి కంపించే విధంగా వాలి రొమ్మున దిగబడిన బాణం ఉరవడితో భూమిలో ప్రవేశించింది.

అంత వానరేశ్వరుడు వాలి, దశాందుభిని సంహరించిన అతిబలశాలి వాలి- రక్తసిక్తాంగుడై- అవని గూలిన పుష్టితా శోక వృక్షమా అన- ప్రళయకాలంలో కాంతులు మాసిపోయి ఇలపై వ్రాలిన ఇనుడా అన, అవశుడై ఆ అమ్ముతో అతనిపై పడిపోయాడు. అప్పుడు శ్రీరాముడు వాలి పడి వున్న చోటుకి ఏతెంచాడు. అప్పటికే సుగ్రీవుడు వాలిమీద పడి బోరు బోరున ఏడవసాగాడు. వచ్చిన శ్రీరామున్ణి వాలి కనుగొన్నాడు. మది లోక్రోధం అతిశయించింది. శ్రీరాముడితో ''ఓరామా! ధరణిలో నిన్ను అందరూ ధర్మాత్ముడు అని ప్రశంసిస్తారు. బహిరింద్రియ నిగ్రహం, అంతరింద్రియ విజయం, సత్యం, సమదృష్టి, నీతి సౌజన్యం, సామనస్యం అనుకంప ఇత్యాది సద్గుణరాశివై అలరారుతూ నలుదెసలా పొదలిన నీ కీర్తి పొల్లుగా చేసి, సుగ్రీవుడితో నేను పోరాడుతూ వున్నప్పుడు నువ్వు నడుమచొచ్చి నన్ను ఏయవచ్చా? నేను ఎన్నడూ నీకు అపకారం చేసి ఎరుగను. నా మదిలో నీకు కీడయినా తలపోయలేదు. నీకు శత్రువునూ కాను. నా మదిలో నీకు కీడయినా తలపోయలేదు. నీకు శత్రువునూ కాను. అన్యోన్యం ఎరుగనైనా ఎరుగం. ఇన వంశోత్తమా! రాజులు శరభాలనో, సింహాలనో, పులులనో, అడవి పందులనో, లేళ్లనో వేటాడుతారు కాని కోతులను ఎవ్వరు ఎక్కడా వేటాడటం ఎరుగము- సుగ్రీవుడు నేను అన్నదమ్ములం. కఠినాత్ములమై సోదర వాత్సల్యం చంపుకొని విరోధులం అయాము. ఇంతకీ నువ్వు నన్ను సంహరించడానికి కారణం ఏముంది? కుందేళ్లు, లేళ్లు, కూర్మాలు, అడవి పందులు, ఏదు పందులు, ఉడుములు వంటివి భక్ష్యాలు కాని కోతులను చంపి లోకంలోఎవరైనా తింటారా? మాటున పొంచి వుండి, ఈ గతి నన్ను హత మార్చడం ఏ ధర్మం? రాజధర్మమా? వేయేల? నువ్వూ నా అనుజుడు సుగ్రీవుడు ఇక నా రక్తమాంసాలు అనుభవించండి. వితతకీర్తితో లోకవిఖ్యాతుడైన దశరథ మహారాజు ఆజ్ఞ ఏత మౌనివై వనాల్లో వసింప చనుదెంచి, జీవహింసకి సంశయింపవైతివి. ఒక వేళ మేము ఏ తప్పుఅయినా ఒనర్చినట్టయితే రాజయిన భరతుడు మమ్ము శిక్షింపతగునుగాని, పని కట్టుకొని శిక్షించడనికి నువ్వు భూపతివా? నన్ను ఎవరి ఆజ్ఞచే చంపావు? ఇది ధర్మం అని నేను భావింపను.

ఇక నీ పత్నిని అపహరించిన నీచ రావణుణ్ణి తెగటార్చి వచ్చి, నువ్వునాకన్నా బలహీనుడైన సుగ్రీవుడితో నెయ్యం వనర్చావు. లోకంలో అమాయకుడవు అయినావు. ఈ సీతాపహరణం విషయం నువ్వు నాకు తెల్పి వుంటే నీ దేవిని నేను సాధింపనా?

-ఇంకాఉంది

ఆదివారం, 10 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
హేమంత ఋతువు, పుష్యమాసం

తిథి: బహుళ అమావాస్య మ.01.04
నక్షత్రం: ధనిష్ఠ రా.04.53
వర్జ్యం: ఉ.09.28 నుండి 11.01 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
ప్రయత్నం మేరకు స్వల్ప లాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శతృబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. బంధు, మిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కఠిన సంభాషణవల్ల ఇబ్బందుల నెదుర్కొంటారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
అనుకోకుండా కుటుంబంలో కలతలేర్పడే అవకాశముంది. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. చెడు సహవాసం వైపు వెళ్ళకుండా వుంటే గౌరవం దక్కుతుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

మంచిమాట

మంచితనం

మనం మనమనుకున్నది జరగకపోతే- అంతా నా కర్మ ఏం చేస్తాం అని అంటాము. కానీ కర్మ అనేది రెండు రకాలు. సుకర్మ దుష్కర్మ. పైన చెప్పినమాట దుష్కర్మ కిందకు వస్తుంది. ఏనాడో చేసిన పాపం ఇంకా వెంటాడుతోంది అంటాము. అదే ఈ దుష్కర్మ. అలాగే ఏనాడో ఏ జన్మలోనో పుణ్యం చేసుకునుంటుంది అని అంటాము. అదే ఈ సుకర్మ. మనం చేసుకున్న చిన్న పాపమైనా అది జన్మ జన్మలకూ వెంటాడుతుంది. ఈ దుష్కర్మవలన ఏ జన్మలో చేసిన పాపమైనా అనుభవించక తప్పదు. ఒకసారి ధృతరాష్ట్రుడు, శ్రీకృష్ణునితో కృష్ణా! అందరూ నీ దివ్య మంగళ స్వరూపాన్నీ, ఈ లోకాన్ని చూడగలుగుతున్నారు. నేను నా దివ్య దృష్టితో పరిశీలించగా, నా నూరుజన్మల పూర్వంలో ఏ జీవికీ హాని చేసిఎరుగను. కాని నాకు ఈ దృష్టి లోపం ఏవిధంగా కలిగింది? అని ప్రశ్నించగా, అప్పుడు శ్రీకృష్ణుడు మామా! నీవు నీ దివ్యత్వంతో నూరు జన్మల క్రితమే చూసుకొంటివి. కాని నూటైదు జన్మల క్రితం నీవు ఒక పురుగును వినోదానికై దాని రెండు కళ్లూ తుంచావు. అందుకే ఆనాడు నీవు చేసిన దుష్కర్మకు ఈనాడు నీవు ఫలాన్ని అనుభవిస్తున్నావు అని పలికాడు.

అలాగే మనం ఏదైనా మంచి పని చేస్తే జన్మ జన్మలకీ అది నిలిచిపోతుంది. దాని ఫలితం ప్రతీ జన్మకీ అనుభవించవచ్చు. ఒక బోయవాడు. తనకి ఆ రోజు అడవిలో దొరికిన మాంసాన్ని తీసుకువచ్చి తన భార్యా బిడ్డలకు పెట్టేవాడు. క్రమంగా అతని కొడుకుకి ఆ జంతువులను, పక్షులను చంపటం మంచిదికాదని అనిపించి ఈ విషయం తన తండ్రికి చెప్పాడు. కానీ మనం వీటిపైనే ఆధారపడి ఉన్నాం కదా. వీటిని తినక తప్పదు అని చెప్పాడు. తండ్రి తండ్రి మాటను లక్ష్యపెట్టక చిన్న వయసులోనే ఆ అడవి వదిలేసి, మాంసాహారాన్ని త్యజించి, శాఖాహారం తింటూ తన జీవితమంతా ఒక పాడుబడ్డ శివాలయంలో శివుని ఆరాధిస్తూ, ఎవరినీ హింసించక కాలం గడిపాడు. అలాగే మంచి కొడుకై, భర్తయై, తండ్రియై, తరువాత కొంతకాలానికి శరీరాన్ని విడిచాడు. ఆ మంచితనం కారణంగా మరు జన్మలో యువరాజుగా పుట్టాడు. అలాగే పెరిగి పెద్దవాడై ఆ రాజ్యానికి రాజై తన ప్రజలను ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. ధర్మం నాలుగు పాదాలమీద నడచుకునేట్టు చూశాడు. ఆ కాలంలో అలాంటి రాజు లేడు అని అనిపించుకున్నాడు. తరువాత కొంతకాలానికి మరణించాడు. అప్పుడు ఆ రాజు నీ పేరు ఎంతకాలం ఉంటుందో, అన్ని వేల సంవత్సరాలు నీవు స్వర్గంలో ఉండవచ్చు అని చెప్పాడు. అలాగే అన్ని సంవత్సరాలు ఉన్నాడు. ఆ తరువాత తను స్వర్గంలో ఉండే కాలం అయిపోనుండటం గమనించి, ఆ రాజు భూలోకంలోకి వెళ్లి తన పేరు తెలిసిన వారెవరైనా ఉన్నారేమో అని ఒక నదీ ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడ ఒక హంస కనిపించింది. ఆ రాజు ఆ హంసను తన పేరును గురించి అడుగగా- నాకు తెలిసి ఆ పేరు గల రాజును ఎరుగను. నాకన్న పెద్దదియైన ఆ ఏనుగును అడుగు అని చెప్పింది. ఆ రాజు ఆ ఏనుగును సమీపించగా, అపుడా ఏనుగు నాకు ఆ రాజు ఎవరో తెలియదు. నాకన్నా పెద్దదైన ఆ తాబేలును అడుగు అన్నది. రాజు ఆ తాబేలును అడుగగా, నాకు ఆ పేరు గల రాజు గురించి తెలుసు. మా తల్లి నాకు ఆ విషయం గురించి చెబుతూ వుండేది. ఆయన చాలా మంచివాడు. ప్రజల సుఖ సౌఖ్యాలను పట్టించుకొనేవాడు. కాని ఆయన మరణించి చాలా కాలం అయ్యింది అని తెలిపింది. వెంటనే ఆ రాజు స్వర్గానికి తిరుగు ప్రయాణమై అక్కడ మళ్లీ అర్హత సంపాదించుకున్నాడు. అలా తను చేసిన చిన్న మంచి పనికి ఇలా రాజుగా జన్మించి ఎన్నో సుఖాలను అనుభవించి చివరికి స్వర్గానికి చేరుకున్నాడు.

అందుకే మనం చేసే ఏ చిన్న పనియైనా, అది మంచిదైనా, చెడ్డదైనా దాని ఫలితం మాత్రం చాలా పెద్దదై జన్మజన్మలకీ నిలిచి ఉంటుంది.

-పులాపు బాలకేశవులు

వృతాసురుడు

18

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 11



మాటాట

ఆధారాలు:
అడ్డం
1. బండి
3. ఓ నది, ద్రాక్ష
5. శంఖం
8. గట్టు
9. ఆండ
11. గ్రుడ్డు
13. వేడుక
14. బుద్ధునికి సంబంధించిన వనం

మాటాట - 10 సమాధానం

నిలువు
2. లోహాలను ఆతకడానికి వాడే పదార్థం
3. పవిత్ర జంతువు
4. ఆ పాదమస్తకం చూసుకోగల దర్పణం
6. ఆత్రగానికి గది మట్టు
7. రామకృష్ణ పరమహంస పత్ని
10. ఇది ముదిరి ఊసరవెల్లి అయ్యిండట
11. సౌందర్యం
12. బావుల నీళ్ళు పారించి పండించే పాలం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

అక్షర

పరిచయం..

అన్నీ వేదాల్లో ఉన్నాయట అని చెబితే, నమ్మేసే కాలం కాదిది. ఏదైనా సవివరంగా, ససాక్ష్యాధారంగా చెప్పాల్సిందే. తలకు తట్టింది చెప్పేద్దామన్నా, బుర్రకు తోచింది రాసేద్దామన్నా కుదరదు. వేదాలు, భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు' అనే పేరిట ఎస్ వేణుగోపాల్ కాస్తా స్థూలంగానైనా మన వేదాల వైనాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేసారు. అయితే ఇదే మంత చిన్నాచితకా వ్యవహారం కాదు. కాదని రచయితకూ తెలిసే వుంటుంది. అందుకే తనకు తెలిసిన దానిని మాత్రం పాఠకులతో పంచుకునే ప్రయత్నం చేసారు తప్ప, అక్కర్లేని లోతులకు పోయి, భంగపడలేదు. తనకు తెలిసిన విషయాలను, కాస్త ఆసక్తికరమైన రీతిలో పేర్చుకుంటూ వెళ్లి, వాటికి అనువైన మకుటాలను వుంచి, వ్యాసాలుగా అందించారు. పనిలో పనిగా వ్యాసాల్లో సందర్భోచితంగా చిన్న చిన్న పిట్టకథలను అందించడం బాగుంది. చదివే పాఠకులకు రిలీఫ్‌గా వుంటుంది. హిందూ సంస్కృతి పట్ల ఆసక్తికలవారు చదువుకుని, తమకు తెలిసిన విషయాలను నిర్ధారించుకోవడం వరకు పనికివస్తాయివి.

వేదాలు భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు
-ఎన్.వేణుగోపాల్
వెల: రూ.80/-
ప్రతులకు: సుధా ప్రచురణాలయం,
(బ్లూమూన్ ట్రావెల్స్)
9000 500 400, 6684 94 74
విశాలాంధ్ర బుక్‌హౌస్
నవోదయ బుక్‌హౌస్
గోపాల్ బుక్‌హౌస్

ఆధ్యాత్మిక మార్గంలో ఆనందసోపానం

బెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రభాత రంజన సర్కార్ 'ఆనందమార్గ' సంస్థను స్థాపించారు-అవధూతిక ఆనందమిత్ర ఆచార్యా ఈ సంప్రదాయానికి చెందిన యోగిని. ఆమె 'బియాండ్ సూపర్ కాన్షస్‌మైండ్' అనే గ్రంథం రాశారు. దానిని జమలాపురం విఠలరావు తెలుగులోనికి అనువదించారు. ఇది అమూర్తమైన (అబ్‌స్ట్రాక్ట్) అంశం కాబట్టి కథవలె నవలవలె చదివే అవకాశం ఉండదు. పైగా ఇందులోని పంచ కోశములూ మనస్సులోని నాలుగు చైతన్య స్తరములు సామాన్యులకు అందుబాటులో లేవు. కాకుంటే పరమానందం ప్రతివానికీ కావాలి కదా! కాని అది ఎలా లభిస్తుందో తెలియదు.

ఆధ్యాత్మిక మార్గంలో ధ్యానానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. అరవిందుడు సుప్రో అన్నా సర్కార్ బియాండ్ సుప్రో అన్నా ఇవన్నీ ధ్యాన మార్గాలే. మనము చేసే పనులన్నీ పంచ జ్ఞానేంద్రియ పంచ కర్మేంద్రియములను ఉపయోగించే చేస్తున్నాము. అవి మనస్సుతో కలిసి ఈ క్రియా కలాపమంతా నిర్వహిస్తున్నది. అంటే జాగృతమనస్సు యొక్క లక్షణం ఇదే. పగలు రాత్రి నిద్ర జాగృతి సుషుప్తి అనే తేడా లేకుండా మనస్సు తన పని తాను చేసుకుంటూ పోతున్నది. దానిని అదుపు చేయడం కష్టం. మదమెక్కిన గుర్రాన్ని స్వాధీనం చేసుకునే రౌతుయొక్క శిక్షణ వంటిది. జాగృత మనస్సును అర్ధ చేతనావస్థలోనికి తీసుకుని రావచ్చు. ఇంతవరకు ఇబ్బంది లేదు. ఆ తర్వాతనే సాధకుని నైపుణ్యం తెలుస్తుంది. ఇసుక పర్రను తొలగిస్తే అడుగున నీటి చెలమ బయటపడినట్టు మనస్సుకు ఆవతల ఆనంద చైతన్యం ఉంటుంది. దీనిని పొందటమే నిశ్చల ఆనందం. యోగులు భిన్న భిన్న మార్గాల ద్వారా ఈ ఆనందాన్వేషణ చేశారు. ఇది బయట ఎక్కడో వెతక్కరలేదు. మన లోలోపలే ఉన్నది. ఈ సత్యాన్ని ఋషులు గ్రహించారు. ఆధునిక యుగంలో రమణమహర్షి, అరవిందుడు, ప్రభుపాద స్వామి వంటివారు ఈ చైతన్యాన్ని గుర్తించి వారి వారి భాషలో పరిభాషలో వివరించారు. బెంగాల్ రాష్ట్రానికి చెందిన శ్రీ ప్రభాత రంజన సర్కార్ 'ఆనందమార్గ' సంస్థను స్థాపించారు-అవధూతిక ఆనందమిత్ర ఆచార్యా ఈ సంప్రదాయానికి చెందిన యోగిని. ఆమె 'బియాండ్ సూపర్ కాన్షస్‌మైండ్' అనే గ్రంథం రాశారు. దానిని జమలాపురం విఠలరావు తెలుగులోనికి అనువదించారు. ఇది అమూర్తమైన (అబ్‌స్ట్రాక్ట్) అంశం కాబట్టి కథవలె నవలవలె చదివే అవకాశం ఉండదు. పైగా ఇందలి పంచ కోశములూ మనస్సులోని నాలుగు చైతన్య స్తరములు సామాన్యులకు అందుబాటులో లేవు. కాకుంటే పరమానందం ప్రతివానికీ కావాలి కదా! కాని అది ఎలా లభిస్తుందో తెలియదు. ఐస్‌క్రీం వల్ల, సినిమా థియేటర్ వల్ల, హోటళ్ల వల్ల, లైంగిక ప్రవృత్తివల్ల సంతోషం లభిస్తుందనే భ్రమతో మనస్సు ఉంటుంది. ఇదే మాయ. ఒక కోతి కల్లు తాగింది. దానిని తేళ్లు కుట్టాయి. ఇక దాని స్థితి ఎలా ఉంటుంది? శాఖాచంక్రమణం చేసే కోతి మనస్సుకు సంకేతం. తేళ్లు ఇంద్రియ వాంఛలు. వీటిని అధిగమించడం ఎలాగో ఈ గ్రంథంలో వివరించారు. అన్నమయ కోశంనుండి ఆనందమయ కోశానికి సాగించే ప్రయాణాన్ని బౌద్ధులు నిర్వాణం అంటారు. జైన్‌లు సటోరి అన్నారు. కాథలిక్కులు యూనియోమిస్టిక్ అన్నారు. భారతీయులు విశ్వాత్మానుభవం అన్నారు. ఇందుకు చేయవలసిందేమిటి? ముందుగా ఈ శరీరానికేమీ కాదు అనే భావాన్ని అవగాహనలోకి తెచ్చుకోవడం. 'ఒక యోగిని ఒక రాజు కర్రతో కొట్టాడు. ఎవరో యోగిని చూచి నీవు కుంటివాడివైనావే అంటే! లేదు నా కాలు కుంటిదయింది' అని యోగి జవాబిచ్చాడని గ్రీకుల గ్రంథంలో ఉంది. అంటే దేహాన్ని దేహిని విడదీసి చూడడం అంటే ఇదే-

అతి చేతన మనసుకు ఆవల
-మూలం:
అవధూతిక ఆనంద మిత్ర ఆచార్య.
తెలుగు సేత: జమలాపురం విఠల్‌రావు,
వెల: రూ.75/-,
ప్రతులకు బి.జ్ఞానదేవ, 504-ఎ,
మహేశ్వర టవర్స్, రోడ్‌నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్ 500034.
సెల్: 9000020369

ఒక కుండను తీసుకునిపోయి చెరువులో ముంచాము. అప్పుడు చెరువులోని నీరూ కుండలోని నీరూ ఒకటే అయినా కుండ మాత్రమే అడ్డంగా ఉన్నది. ఇదే మన శరీర స్థితి. ఆనంద చైతన్యాన్ని అందుకోవటానికి సాధన అవసరం. అప్పుడు ఈ మనోన్మనీ దశనుండి సాధకుని విశ్వ చైతన్యంలో లీనమవుతాడని ఈ గ్రంథంలో వివరింపబడింది. ''ఈ ప్రపంచంలో చాలామంది ఇంద్రియ సుఖాలకోసం నానా అగచాట్లు పడుతున్నారు-ఆ ప్రయత్నంలో వారు సంతృప్తులవుతున్నారా, అని ప్రశ్నిస్తే విఫలురవుతున్నారని సమాధానం వస్తుంది. అద్దంపై మసక ఉంటే ప్రతిఫలనం స్పష్టంగా ఉండదు. అనిశ్చల సరస్సులో చంద్రుని ప్రతిబింబమూ అస్పష్టంగానే ఉంటుంది. మనస్సు మసకపడితే ప్రతిబింబం స్పష్టంగా ఉండదు సర్వోచ్ఛస్తరం దర్శింపలేము'' (పుట: 130. ఆత్మజ్ఞానము అనే అధ్యాయం). అందుకు ఏమి చేయాలో కూడా ఈ గ్రంథంలో సాధనా క్రమాన్ని సాధకుల కోసం వివరించారు. మంత్రము అందుకు ఉపయోగపడుతుందని సూచించారు. సజెస్టోపీడియా అనే టెక్నిక్ ద్వారా బల్గేరియా దేశంలో మనస్సును విశ్రాంతపరిచి స్పాంజ్ నీటిని పీల్చినట్లు మనస్సు ద్వారా అప్రయత్నంగా విదేశీ భాషలను బోధిస్తున్నారని ఈ గ్రంథంలో సూచించారు. ఇంకా స్వప్నాలు హిప్నోసిస్ కూడా సహాయకారులే.

భారతదేశంలో కొందరు నర్తనాన్ని మరికొందరు పెద్ద పెద్ద వాద్యాలను మ్రోగించడం ద్వారా శరీరాన్ని అలసటకు లోను చేసి భౌతిక చేతనావస్థనుండి అర్ధ చేతనను అధిగమిస్తున్నారు. పాశ్చాత్యులు వేడినీళ్లలో కూర్చోవటం, లేదా మంచు గడ్డల మధ్య కూర్చోవటం కాళ్లను (చలన రహితంగా) కట్టివేయటం, కళ్లకు గంతలు కట్టుకోవడం ద్వారా శరీరాన్ని మనస్సును నిష్క్రియం చేసి అతిమానస స్థితిని అధిగమించే సాధన జరుపుతున్నారట. ఇదొక విశిష్ట భావయానం. భాష- విషయం గహనమైనవి.

దానికి తోడు బెంగాలీ యోగిని రచనను తెలుగులోకి తేవడం అంటే ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. ఐనా జమలాపురం విఠలరావు ఎంతో నేర్పుతో మూలంలోని భావానికి ఏమాత్రం తేడా రాకుండా తెలుగులోనికి తీసుకుని రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదొక సిద్ధాంత గ్రంథం. సంక్లిష్టమైనది. ఐతే ఆనందం అక్కరలేదు అనే వారు ఎవరుంటారు? అందుకే అందరూ ముందుగా చదవాలి. కొందరైనా సాధన చేయాలి. అప్పుడు శరీరములోని ఐదు కోశములూ మనస్సులోని నాలుగు పొరల గూర్చిన తత్వం బోధపడుతుంది. ఆనంద మార్గ సాధకులకు ఈ చిరుపొత్తము కరదీపిక.

-ముదిగొండ శివప్రసాద్

'క్షితిజం'
కథల సంపుటి
రచన: పెద్దాడ వెంకటేశ్వర్లు
వెల: రూ. 100/-
ప్రచురణ:
తెలుగు సాహితీ సదస్సు,
కాగజ్‌నగర్, 504296

ప్రతులకు: 1. పెద్దాడ రుక్మిణి, 1-16-15/ఎ,
బాలాజినగర్, సీతాపతి రోడ్,
సిర్పూర్ కాగజ్‌నగర్ 504296
2. పి.ఎన్.రామకృష్ణ,
120ఎ జనప్రియ హైవెన్స్, బ్లాక్-5,
లాలాపేట ఫ్లైఓవర్ దగ్గర,
సికింద్రాబాద్ 500017

- హాస్యంలో రంగరించిన -

సజీవ జీవిత చిత్రణలు

కథలకు తోడుగా కొన్ని వ్యంగ్య రచనలను జోడించి ఈ సంకలనం ప్రచురించారు. కథలలో వస్తు వైవిధ్యం ఉంది. సమకాలీన జీవిత చిత్రణ కూడా ఉంది. చెప్పే విషయానికి కొంచెం హాస్యం కలిపి చెప్పడం రచయిత ప్రత్యేకత.

'వినాయకం - వాచీ రిపేరు' కథలో పాత కాలపు గడియారాన్ని అవతల పారెయ్యడం మంచిదని సూచిస్తారు. అందుకు భిన్నంగా 'భోషాణం' కథలో పాతకాలపు భోషాణం ఏ విధంగా లక్షల విలువచేసే స్థాయికి వచ్చిందో వర్ణిస్తారు.

మారుతున్న సామాజిక స్థితులను ప్రతిబింబించే కథ 'దత్తత'. ఇందులో ఒక పాప 'తాతా బామ్మలను ఎక్కడినుంచైనా తెచ్చుకుందామా?' అని అడగడం ఆశ్చర్యంగా ఉంటుంది. సహజత్వానికి దగ్గరగా రచయిత చూపిన పరిష్కారం బాగుంది.

ఉపకారం చేసిన వాళ్లను ఎన్నటికీ మరువకూడదనే సందేశం 'ఋణం తీర్చుకోవడం ఇలా' కథలో కనిపిస్తుంది. క్షమా గుణం అలవరుచుకోవడం మంచిదని కొందరు అంటుంటారు. చిన్న చిన్న విషయాలలో అది మంచిది కావచ్చు గానీ అన్నిటికీ అది అన్వయించదు. ఎవరైనా ద్రోహం తలపెట్టినప్పుడు వాడి అంతు చూడమని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఉపదేశించాడు. 'మరో రకం ప్రతీకారం' కథలో ఈ సంగతిని మరింత విపులంగా చెప్పడం కనిపిస్తుంది. సంఘటనలన్నీ ఆసక్తికరంగా ఉన్నాయి.

'ఆకలి వర్సెస్ సత్తు' కథ మొత్తం ఆకలి చుట్టూ తిరుగుతుంది. ఆకలి దహించుకు పోతూ పైకి బింకంగా కనపడే విద్యార్థి పాత్ర చిత్రణ జాలి గొలుపుతుంది. పస్తులున్నవాడికి దయతో ఇంత ఆహారం సమకూర్చిపెట్టి ఆదుకున్న వాచ్‌మెన్‌లు కనుమరుగవుతున్న మానవ సంబంధాలను గుర్తు చేస్తారు.

'కలోపనిషత్తు' కథలో ఇంద్రియ నిగ్రహం అనే అంశం మీద ఆసక్తికరంగా ఒక కొత్త రకం కథారూపం ఇవ్వడం కనిపిస్తుంది. ఇందులో కామధేనువును ఒక పాత్రగా ప్రవేశపెట్టారు.

ఉద్యోగ రీత్యా బదిలీ అయినప్పుడు పాత పరిచయస్తులను వదిలి పెట్టవలసి రావడం బాధగా ఉంటుంది. దానికితోడు కొత్త చోట ఎట్లా ఉంటుందోనన్న ఆందోళన. 'క్షితిజం' కథలో ఇదే కథా వస్తువు. ముగింపులో రచయిత చేసిన విశ్లేషణ బాగుంది.

మిగతా వాటిలో హాస్య రచనలు కొన్ని ఉన్నాయి. సామాజిక అంశాలతో ఉన్న కథలకు తోడుగా విమర్శిస్తూ చేసిన వ్యంగ్య రచనలూ ఉన్నాయి.

పాఠకుడిని ఆలోచింప చేయగల శక్తి రచయితలో ఉంది. అయితే కొన్ని చోట్ల అనవసరంగా సాగదీయడం స్పష్టంగా తెలుస్తున్నది. ఈ సంకలనంలోని కథలలో ఎనిమిది 'రచన' మాసపత్రికలో ప్రచురించబడగా మరో అయిదు ఆకాశవాణిలో ప్రసారం చేయబడినవి.

-మూర్తి వెంకటేశ్వర శాస్త్రి

శుభప్రదం
శాస్త్రీయ దృక్పథం
(హేతు నిబద్ధ ఆస్తిక వాదం)
డా.ఎం.రామమూర్తి
వెల: రూ.30/-
ప్రతులకు: బాలాజీ మెడికల్స్
అల్లూరు, ఎన్.పి.ఎన్.
నెల్లూరు జిల్లా
9866 44 5052
9492 52 1445



ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకం
రచన: ప్రొ.పెదారపు చెన్నారెడ్డి
వెల: రూ.20/-
ప్రతులకు: సంచాలకులు
ప్రచురణల విభాగం,
పొట్టిశ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ -
500 004.

సమకాలీన సాహితీ వ్యాసాలు

అమ్మంగి వేణుగోపాల్ కవి, నాటక కర్త, సంపాదకులే కాదు మంచి విమర్శకుడు కూడా. ఒక దిన పత్రికలో సాహిత్య కాలమ్ నిర్వహించినప్పుడు రాసిన వ్యాసాలు, వివిధ సందర్భాలలో పత్రికలకు రాసిన సాహిత్య వ్యాసాలు, సదస్సులు- అభినందన సంచికలకోసం రాసినవి ఇలా అన్నింటిని గలిపి పుస్తక రూపంలో తీసుకువచ్చారు. ఈ వ్యాసాలు ఆయా సాహిత్య సందర్భాలలో విమర్శకుడికి కలిగిన స్పందనను తెలియజేస్తాయి.

ఇందులో వున్న వ్యాసాలను వ్యక్తులు, పుస్తకాల మీద వచ్చిన విమర్శగా భావించవచ్చును. వ్యక్తులలో కవులు, రచయితలు, విమర్శకులు, పరిశోధకులు అంతా వున్నారు.

ఒక వ్యక్తి జీవితాన్ని- జీవితకాల కృషిని తెలియజేయాలంటేనే ఒక గ్రంథం తయారవుతుంది. విశ్వవిద్యాలయాల్లో కవులు, రచయితల జీవితం- సాహిత్యాన్ని వివరించే సాహిత్య గ్రంథాలు పరిశోధనలో భాగంగా వెలువడుతూనే వున్నాయి. చిట్టాపద్దుల్లా తయారైన ఇలాంటి పుస్తకాలు అసంతృప్తినే మిగిలిస్తాయి. సాహిత్య అకాడమీ లాంటి సంస్థలు వేసే పుస్తకాలు ఒకింత మెరుగు. అలాంటిది ఒక ప్రముఖుడి గురించి ఒక కాలమ్‌లో సాధ్యమైనంత సమగ్రంగా వివరించడం చాలా కష్టమైన పని. కాని అమ్మంగి వారు ఆ పరిమిత స్థలంలోనే ఆయా వ్యక్తుల జీవిత చిత్రణను చాలా సమర్థవంతంగా నిర్వహించిన విధానం ''కొండ అద్దమందు...'' సామెతను గుర్తుకుతెస్తుంది. బయోడేటా లాంటి వర్ణనకు భిన్నంగా వాళ్ళ కృషిని- గొప్పదనాన్ని తెలియజేసిన విధానం బాగుంది. వీటన్నింటికంటే- మొత్తంగా ఆ రచయిత విశిష్టతను, ప్రత్యేకతను నిష్పక్షపాతంగా విశ్లేషించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా కాళోజీ కవిత్వం గురించి విశ్లేషిస్తూ ''పాక్షికంగా గేయ లక్షణం, కొంత జానపద రీతి, మరికొంత వ్యంగ్యం వీటన్నింటితో పాటు తెలంగాణ మాండలిక తేజస్సు, రాజకీయాలను ప్రజాకీయాలుగా మార్చే గాంధీ తపస్సు, వీటన్నింటి సమాహారమే కాళోజీ కవిత్వం''అని చెబుతారు. అలాగే దాశరథి వ్యక్తిత్వాన్ని వివరిస్తూ ''స్థిరమైన జీవికలేకపోవడం, విప్లవ భావాలతో మమేకం కాలేకపోవడం, ఆరోగ్యం దెబ్బతింటూ వుండటం వంటి కారణాలు దాశరథిని ఉద్యమానికి దూరం వుంచాయి'' అంటారు. ఆయా వ్యక్తుల జీవితాన్ని- సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనంచేస్తే తప్ప ఇలాంటి నిర్ధారణకు రాలేరు. మూడుముక్కల్లో ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, సాహిత్య కృషిని అంచనావేయడంలో విమర్శకుడు చూపిన ప్రతిభ అద్భుతం. ఇంకా విచిత్రమేమిటంటే గోపీచంద్, గురజాడ, బిరుదురాజు, తిరుమల రామచంద్ర, డా.ఆదినారాయణ, సదాశివలపై రెండు మూడు వ్యాసాలు రాసినా, ప్రతి వ్యాసంలో ఒక కొత్త కోణాన్ని విభిన్నమైన దృష్టితో ఆవిష్కరించడం కనిపిస్తుంది. అంపశయ్య అనే చైతన్య స్రవంతి నవలకు ''మనోయాత్ర'' పేరిట రాసిన ముందుమాట, ''ఊపిరికి ఊపిరి పోరుపాటలు రాపిడి గద్దర్'' అంటూ గద్దర్ ప్రత్యేక సంచికకు రాసిన వ్యాసం శీర్షికలు ఎంత ఔచిత్యవంతంగా వున్నాయో, విశ్లేషణ కూడా అంత ఆసక్తికరంగా రూపొందింది. ''పథేర్ పాంచాలి''అనే బెంగాలీ నవల, కమలాదాస్, ఇక్బాల్ అనే ఇతర భాషాకవుల గొప్పదనాన్ని తెలియజేసే వ్యాసాలు కూడా ఇందులో వుండటం విశేషం. స్త్రీవాద, దళితవాద, ప్రాంతీయ వాదాలకు సంబంధించిన రచయితలను, పుస్తకాలను సంయమనంతో, సానుకూల దృక్పథంతో, విమర్శనాత్మకంగా వివరించిన తీరు బాగుంది. ముఖ్యంగా కొత్త గోలకొండ కవుల సంచికలు, జులూస్ మరియు 'ఎలనాగ కవి తాశక్తి' వ్యాసాలు రచయిత ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయి. నాటకకర్త కూడా అయిన ఈ విమర్శకుడు నాటకాలపై ఒకటే వ్యాసం రాయడం ఆశ్చర్యం. ''మా భూమి'' సినిమాపై రాసిన వ్యాసం కొత్త విషయాలను తెలియజేస్తుంది. శ్రీశ్రీ సదస్సులో పత్ర సమర్పణ చేసిన అమ్మంగివారు సమగ్ర తెలుగు వాఙ్మయ సూచి సదస్సును, సిరిసిల్లా తెలంగాణ రచయితల వేదిక సభలను పూర్తిగా కవర్ చేసి ఆ వివరాలను వ్యాస రూపంలో అందజేశారు.

క్లుప్తత, స్పష్టతలతో కూడిన విశ్లేషణలు అమ్మంగి వేణుగోపాల్ విమర్శా వ్యాసాలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. మొత్తానికి విమర్శలో క్లుప్తతను, పఠనీయతను సాధించిన అతికొద్దిమందిలో అమ్మంగి ఒకరు. సమగ్ర అధ్యయనం, సరియైన అవగాహన, సానుకూల దృక్పథం విమర్శకుడికి వుండాల్సిన లక్షణాలని అమ్మంగివారు మరోమారు నిరూపించారు. వీరి విమర్శ మిత్ర సమ్మతంగా వుంటుంది. వివరణాత్మకములు, సమాచారాత్మకములు, విశ్లేషణాత్మకములైన ఈ విమర్శా వ్యాసాలు సాహిత్య పాఠకులకే కాకుండా సామాన్యులకు సైతం ఆసక్తికరంగా వుండి మూలగ్రంథ పఠనం వైపు పురిగొల్పుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

సాహిత్య సందర్భం
- సమకాలీన స్పందన
(సాహిత్య వ్యాసాలు)
డా.అమ్మంగి వేణుగోపాల్,
జయమిత్ర,
హైదరాబాద్- నల్లగొండ.
వెల: రూ.200/-;
పేజీలు: 372;
ప్రతులకు:
అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలు.

-కె.పి.అశోక్‌కుమార్

బతుకుబాటలో విజయగీతాలాపన

వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవడానికి మనస్ఫూర్తిగా నిర్ణయం తీసుకుని, మనని మనం విశ్లేషించుకుని, లోపాలను సరిదిద్దుకుని ఒక క్రమబద్ధమైన పద్ధతిలో విజయానికి వ్యూహాలను తయారుచేసుకుంటూ, విజయసంకేతాలను గుర్తిస్తూ గమ్యాలను చేరుకునేలా ఈ పుస్తకం దిశా నిర్దేశం చేస్తుంది. 19 అధ్యాయాలలో అంశాలను వర్గీకరించి, ప్రతి అంశాన్ని చక్కగా వివరించారు.

సాధారణంగా ప్రతి వ్యక్తి అందంగా నలుగురిని ఆకట్టుకునేలా కనిపించడానికి ఎంతో ప్రయత్నం చేస్తుంటాడు. దానికి ఎన్నో తిప్పలు పడుతుంటాడు. యుక్తవయస్సులో అయితే మరీను. అలా కనిపించడానికి అనేక రకాల సౌందర్య సాధనాలను వాడుతుంటాడు. రంగు తక్కువైతే ఎక్కువవడానికి, లావయితే సన్నబడటానికి, పొట్టి అయితే హైహీల్స్‌తో ఎత్తుగా కనబడడానికి ఇంకా ఇలా ఎన్నో చేస్తుంటాడు. మరి అలా తన వ్యక్తిత్వం గురించి, దాన్ని మరింత అందంగా యోగ్యంగా ఉన్నతంగా పలువురు ప్రశంసించేలా ఉండడానికి ప్రయత్నం చేస్తాడా? తను ఉన్న స్థానాన్నుంచి మరింత ఉన్నత స్థితికి చేరడానికి ప్రయత్నాలు చేస్తాడా? ఇలా భౌతికంగానే కాకుండా వ్యక్తిత్వపరంగా కూడా నలుగురు మెచ్చుకునేలా ప్రయత్నాలు చేయడం చాలా ముఖ్యం. మన వ్యక్తిత్వాన్ని మరింత మెరుగుపరిస్తే మన విజయాలు మరిన్ని పెరిగి అత్యంత ఉన్నత స్థానానికి చేరుకుంటాం. అలా.. విజయానికి కావలసినన్ని సూత్రాలను వొంటబట్టించుకోవడానికి... మారే పద్ధతులను తెలుసుకోవడానికి... గెలిచే సమయం కోసం... సమయం మించిపోకుండా... సమగ్రమైన ప్రణాళిక, ప్రయత్నం, పరిశ్రమ చేసి ఫలితం సాధించేలా మీ వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడానికి ఏం చేయాలి? అలాంటి ప్రశ్నలకు సరైన సమాధానం, కావలసిన సూత్రాల విశదీకరణ, సమగ్ర కార్యాచరణ పద్ధతులు అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించిన పుస్తకం డా.వాసిలి వసంతకుమార్ తన వ్యక్తిత్వ వికాస పుస్తక శ్రేణిలో వ్రాసిన కొత్త పుస్తకం 'టైమ్ ఫర్ సక్సెస్' -'బుక్ ఆఫ్ స్ట్రాటజీస్'

''టైమ్ ఫర్ సక్సెస్''-'బుక్ ఆఫ్ స్ట్రాటజీస్' దీని టైటిల్ చూసి ఇంగ్లీష్ పుస్తకం అనుకునే ప్రమాదం వుంది. కాని, ఇది ఈ రోజు రేపు విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని, వాళ్లు రోజూ మాట్లాడుకునే భాషలో, వాళ్లకు చక్కగా అర్థమయ్యేటట్లు రాసారనుకోవచ్చు.

టైమ్ ఫర్ సక్సెస్!
బుక్ ఆఫ్ స్ట్రేటజీస్
-డా.వాసిలి వసంతకుమార్
వెల: రూ.100/-
ప్రతులకు: యోగాలయ,
ప్లాట్ నెం.90, కృష్ణ ఎన్‌క్లేవ్,
ఎం.డి.ఫారమ్ రోడ్, తిరుమలగిరి,
సికింద్రాబాద్ - 500 015.
93 93 93 39 46

వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవడానికి మనస్ఫూర్తిగా నిర్ణయం తీసుకుని, మనని మనం విశ్లేషించుకుని, లోపాలను సరిదిద్దుకుని ఒక క్రమబద్ధమైన పద్ధతిలో విజయానికి వ్యూహాలను తయారుచేసుకుంటూ, విజయసంకేతాలను గుర్తిస్తూ గమ్యాలను చేరుకునేలా ఈ పుస్తకం దిశా నిర్దేశం చేస్తుంది. 19 అధ్యాయాలలో అంశాలను వర్గీకరించి, ప్రతి అంశాన్ని చక్కగా వివరించారు. కొంచెం దృష్టిపెట్టి చదివితే పాఠకుడిలో సమాంతరంగా తన వ్యక్తిత్వం గురించి విడమరిచి తనే చదువుకున్నట్టు అనిపిస్తుంది. దాంతో తప్పకుండా పుస్తకంలో ఇచ్చిన సలహాలను, సూచనలను సులభంగా స్వీకరించే సౌలభ్యం ఉంది.

రచయిత పుస్తకంలోని శీర్షికలు, రచనా శైలి సూటిగా పాఠకుడి మనసును తాకేట్టు రాయగలిగారు.. ఉదాహరణకు -'ఛేంజ్ అంటే ఛాలెంజ్ ', 'వ్యక్తిత్వం బహులక్షణ సమన్వితం', 'మనంగా ఉంటూ సామాజికం కావాలి', 'మానసిక మాంద్యం పనికిరాదు', 'వర్తమాన వెలుగులు సరిపోవు', 'నిరీక్షణలో సమీక్షలు', 'సోమరితనంతో సూర్యోదయమా', 'ఉపేక్షిస్తే కాలం క్షమించదు', 'స్టడీ అవర్స్+ఫన్‌టైం=హాపీ డేస్' ఇంకా ఇలాంటివే మరెన్నో. ప్రశ్నలు మనవే సమాధానాల మనవేనని, సంశయాలన్నీ ఉపద్రవాలేనని, సంసిద్ధమైతే సరిదిద్దుకోగలమని రచయిత వివరించారు. ఆశ ఒక్కటే జీవిత వైకల్యాన్ని జయించగలుగుతుందని దానికి పక్కా ప్రణాళిక ఎలా తయారు చేసుకోవాలో, పరిమిత జీవితంలో ప్రతి గంట విలువైనదేనని ఇచ్చిన వివరణ చాలా ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నవారు తప్పక చదవాల్సిన పుస్తకం అని చెప్పవచ్చు. చిరు ప్రణాళికల వివరణ, సమయ వినియోగ పద్ధతి వంటివి ఈ పుస్తకాన్ని ఓ సక్సెస్ గైడ్‌లా తీర్చి దిద్దాయని చెప్పవచ్చు.

అయితే ఈనాడు వస్తున్న వ్యక్తిత్వ వికాస పుస్తకాల పరంపరలో ఇది కూడా ఒకటి కాకుండా కొంచెం విలక్షణమైన విషయ వివరణ ఇవ్వడంలో డాక్టర్ వాసిలి విజయం సాధించారనే చెప్పవచ్చు. 'మన సుపడి మారాల్సిందే' అని రచయిత మొదటి అధ్యాయంలో చెప్పినట్టు పాఠకుడు చదవడం మొదలుపెడితే ఈ పందొమ్మిది అధ్యాయాల పఠన ప్రయాణంలో విజ్ఞానం, కాలజ్ఞానం, వ్యక్తిత్వ జ్ఞానం మమేకమై సుదూరంగా అనిపించిన గమ్యాలు సమీపంగానే ప్రత్యక్షం చేసుకోగలడని సక్సెస్‌వైపు సమయ సారథ్యం వహించి స్వంతం చేసుకోగలడు.

-మూర్తి

తెల్ల కాగితం
-సతీష్‌కుమార్ యశస్వి
వెల: రూ.110-
ప్రతులకు: వైగిరిజావతి, శ్రీ నిలయం
1-21-5/ఎ, కడకట్ల, తాడేపల్లిగూడెం - 534 101
088 18 22 1596, 800 800 1942

వైవిధ్య ప్రయత్నం

కవిత్వం ఒక్కటే తీరని దాహం కాదు. రాసిన దాన్ని కాస్త వైవిధ్యంగా పుస్తక రూపంలో చూసుకోవాలన్నది కూడా ఇప్పుడు కొత్తగా దాహార్తి అయిపోయింది యువకవులకు. ఈ తరహా దాహార్తి తీరకుంటే, రాసిన అక్షరాలు ఊరుకోవు. రాసి రంపాన పెడతాయి. అలా వచ్చిన, వస్తున్న పుస్తకాల్లో ఒకటి 'తెల్లకాగితం'. ఏదో ఒక స్నేహ కలానికి అంటించుకోకుండా, కొత్త భావనలు స్పృశించే ప్రయత్నం చేసాడు కవి సతీష్ కుమార్ అలియాస్ యశస్వి. కవిత్వంలో భావాల సంగతి ఎలా వున్నా, కొన్ని కొత్తగా వినిపించే పదాల ప్రయోగాలున్నాయ్ కవితల్లో. అవి బాగున్నాయ్ కూడా. ...'చెట్టే చిత్తరువై, జ్ఞాపకంగా మిగిలాక'..., 'నా ఏడుపు ఘోష వేరు, ఆమె లాలించే భాష వేరు..', '..ఎదురు చూపు గుమ్మానిది..బెదురు చూపు ఆమెది', 'పేపర్లో చావు వార్త చదవాలని లేదు, నిద్రలేస్తూనే, నిట్టూర్పులతో జట్టు కట్టాలని లేదు.', 'అక్షరాలు అనుభూతుల్ని మాత్రమే మిగల్చాలి..అక్షరాలు మనలోకి కరిగి, స్వచ్ఛమైన తెల్ల కాగితం మిగలాలి..కవిత్వం మన అంతరాళాల్లోకి ఇంకి, లోకమంతా తెల్లకాగితమవ్వాలి'..., 'అలంకారాలు లేని అక్షరాలకు వ్యాపకశక్తి ప్రసాదించిన వాడు..', ఇలా చాలా..అంటే చాలా.

కానీ ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయాలు కొన్ని మిగిలేవున్నాయి. కవి ముందు తన బలహీనతలు కొన్ని వదులుకుంటే మంచిదేమో అనిపించింది పుస్తకం చదువుతుంటే. ఆది, అంత్య ప్రాసల కోసం పాకులాట, ఈ రోజు కనీసం ఒక కవిత యినా రాసి తీరాలన్నట్లుగా బలవంతంగా కక్కే ప్రయత్నం విరమించాలి. భావాలను, అక్షరాలను స్వేచ్ఛకు వదిలేసి ఎగరనివ్వాలి. ఆ ఎగిరేతీరును ఒడిసిపట్టి, కవితలుగా బంధించగలగాలి. అక్కడ చందోబంధనాల నిబంధనాల జోలికి పోవద్దు.

అదే విధంగా పుస్తకాన్ని వైవిధ్యంగా తీర్చిదిద్దాలన్న తపనతో ఒక పక్క తెల్లగా వదిలేసారు. రెండో పక్క కవితలను ఒక్క పుటలో 'ఇరికించారు' దాని బదులు ఆ తెల్లకాగితాన్ని కూడా వాడుకుని బాగా మేకప్ చేసి వుంటే బా

సుందర క్షేత్రం 'శృంగేరి'

ప్రతి వ్యక్తీ విజ్ఞానవంతుడు, జ్ఞానవంతుడు కావాలంటే సరస్వతీ మాత అనుగ్రహం కావాలి. సకల విద్యామతల్లి ఆ శారదాంబ అనుగ్రహాన్ని ఎందరెందరో మహనీయులు పొందారు. ఆ తల్లి దీవెనలతో జగద్విఖ్యాతి పొందారు. యాదేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ, శక్తిరూపేణ, శాంతి రూపేణ, శ్రద్ధారూపేణ, కాంతి రూపేణ,లక్ష్మీ రూపేణ, దయారూపేణ, మాతృ రూపేణ సంస్థితాః

నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

సమస్త కోటియందూ బుద్ధి, శక్తి, శాంతి శ్రద్ధా,కాంతి, లక్ష్మి దయాగుణాలతో మాతృరూపంలో ఏ దేవత దర్శనమిస్తుందో ఆమే సరస్వతీ మాత. ఆవిడే శారదాంబ.

'కుపుత్రో జాయేతక్వచ దపి కుమాతా న భవతి' అన్నారు జగద్గురువు ఆదిశంకరాచార్యులవారు. ఈ లోకంలో చెడ్డ కొడుకులుంటారు కానీ, చెడ్డ తల్లి మాత్రం ఉండదు. అమ్మ అంటే లోకమాత, పరమ పావని. అలాంటి త్రిభువన జనని ఎన్నోచోట్ల ఎన్నో రూపాల్లో వెలసి అందర్నీ ఆదుకుంటూ ఉంది. ఆ అమ్మలగన్న అమ్మ సకల విద్యాధి దేవతగా నెలకొన్న దివ్య క్షేత్రం 'శృంగేరి'. సహ్యాద్రి పర్వత పంక్తుల్లో పచ్చని ప్రకృతి బడిలో ప్రశాంత వాతావరణంలో తనువుపులకింప చేసే శిల్ప కళా వైభవంతో అలరారుతున్న సుందర క్షేత్ర 'శృంగేరి'. కర్నాటక రాష్ట్రం చిక్కమగళూరు జిల్లాలో తాలూకా కేంద్రంగా విలసిల్లుతున్న ఈ దివ్య క్షేత్రం తుంగ భద్రా నది ఒడ్డున అలరారుతోంది. శ్రీమద్రామాయణం, స్కాందపురాణంలోని సహ్యాద్రి ఖండాలలో శృంగేరికి సంబంధించిన ప్రస్తావనలున్నాయి. ఒకప్పటి విభాండన మహర్షి ఆశ్రమ వాటికయే నేటి శృంగేరి అని ఆ ప్రస్తావనల ద్వారా అవగతమవుతుంది. విభాండన మహర్షుల వారి కుమారుడే ఋష్యశృంగుడు. ఆ ఋషి కుమారుడు పేరుమీదే ఈ క్షేత్రానికి శృంగ గిరి అనే పేరు వచ్చింది. అదే కాల క్రమంలో శృంగేరిగా రూపాంతరం చెందింది. నిత్యహోమాలు, యజ్ఞ యాగాదులతో నిత్యం విలసిల్లే మహా పుణ్యక్షేత్రమిది. శృంగేరిలో శారదాంబ అమ్మవారిని సాక్షాత్తు జగద్గురు ఆది శంకరాచార్యులవారు నెలకొల్పారు. ఆయన తన జ్ఞానయాత్రలో భాగంగా లోకసంచారం చేస్తూ ఈ ప్రదేశానికి రావడం జరిగింది. ఇక్కడి ప్రకృతి రమణీయతతో పాటు ఆయనను ఆకట్టుకున్న తాత్విక సత్యం ఒకటుంది. మండుటెండలో మిట్టమధ్యాహ్నం వేళ కాలుతున్న బండమీద అల్లాడుతున్న ఓ నిండు గర్భిణి అయిన మండూకం (కప్ప)కి ఎండ తగలకుండా ఓ నాగుపాము పడగవిప్పి గొడుగు పడుతోంది. తాను ఆకలిగా ఉన్నానన్న సంగతి సైతం మరిచి కదలలేకపోతున్న ఆ కప్పకి తన పడగతో గొడుగుపట్టిన ఆ పాము దయార్ద్ర హృదయానికి ఆదిశంకరాచార్యులవారు పరవశించిపోయారు. ఇది ఖచ్చితంగా ఆ స్థల మహాత్మ్యమేనని ఆయనకు ఆ సందర్భంలో బోధపడింది. అదే ఆయన తన మొత్తం జీవిత కాలంలో మూడొంతుల కాలం ఈ క్షేత్రంలోనే గడపడానికి కారణమైంది. పాము, కప్పల దృశ్యం ఆదిశంకరాచార్యుల వారి అద్వైత ఆవిర్భావానికి అనువైన ఆలోచనకు ప్రేరణ కలిగించింది. ఈ నేపథ్యంలోనే ఆర్ష సంస్కృతిని అజరామరంగా చేయడానికి అనుకూలంగా విద్యాపీఠాన్ని, విద్యాదేవి ఆలయాన్ని నిర్మించాలన్న సంకల్పం ఆయనకు కలిగింది. ఈ సందర్భంలోనే దేశంలో నలు దిశలా నాలుగు వేదాలకీ ప్రతీకలుగా నాలుగు ఆమ్నాయ పీఠాల్ని నిర్మించాలన్న నిర్ణయానికి పునాది ఏర్పడింది. వాటిలో శృంగేరి పుణ్యక్షేత్రం మొదటిది దక్షిణామ్నాయం శారదపీఠం. ఇక్కడి శారదా మాత లలితాంబ. త్రిభువన జనని. శ్రీదక్షిణామూర్తి స్వరూపిణి. అమ్మవారు చిమ్ముద్రాధారిణిగా చిరునవ్వులు చిందిస్తూ ఉంటుంది. ఆ తల్లి నాలుగు చేతులా శుకము, జపమాల, అమృత కలశం, పుస్తధారణియై దర్శనమిస్తుంది. అమ్మవారి చేతిలోని పుస్తకం విజ్ఞాన సర్వస్వం. జపమాలలోని తులసీ ఫలాలు ప్రపంచంలోని అన్ని భాషలలోని వర్ణాలకు ప్రతీకలుగా సప్తవర్ణ రంతమై శోభిల్లుతుంటాయి. అమృత కలశం జ్ఞాన దాహార్తిని తీర్చే దివ్య సుధ. తల్లి ధరించిన రూపం వెనుక అద్వైతం ఉంది. ఆర్ష సంప్రదాయమూ ఉంది. అన్నింటినీ మించి ఆధ్యాత్మిక చింతనలో యావద్భారత జాతి గర్వించదగిన దార్శనికత దాగి ఉంది. ఈ క్షేత్రంలో అమ్మవారిని సేవించుకున్నవారికి సుఖ సంతోషాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలతోపాటు జ్ఞాన సంపద, వివేచన, తాత్విక చింతనలు కూడా సిద్ధిస్తాయి. అన్నింటినీ మించి మానసిక ప్రశాంతత, స్థిర చిత్తం, కార్య సాధనా సామర్థ్యాలను ప్రసాదించే అమృత స్వరూపిణి ఆ తల్లి. శారదాదేవి ఆలయం పక్కన వున్న శివునికి విద్యా శంకరుడని వ్యవహరిస్తారు. అమ్మవారు పార్వతీమాత. ఈ ఆలయం చుట్టూ 12 రాశి స్తంభాలున్నాయి. మధ్యలోని పద్మములో సూర్యుడున్నాడు.స్తంభాలపై చెక్కబడి ఉన్నాయి. ఏ రాశిలో సూర్యుడుంటే ఆ రాశి స్తంభంపై తొలి సూర్య కిరణాలు పడతాయి. ఇలాంటి వాస్తు విజ్ఞానం దేశంలోని ఏ పుణ్య క్షేత్రంలోను కనిపించదు. శారదామాత ఆలయం బయటవైపున గోపురం పై భాగంలో కార్తవీర్యార్జునుడు దర్శనమిస్తాడు. ఎవరైనా సరే ధన, కనక, వస్తు, వాహనాది విలువైన వస్తువుల్ని పోగొట్టుకున్నవారు కార్యవీర్యార్జునికి మొరపెట్టుకుంటే చాలు తప్పకుండా వారికి దొరుకుతాయని భక్తుల విశ్వాసం అలాగే ఇదే ప్రాంగణంలో గరుడు, ఆంజనేయ, జనార్దన స్వామి వార్ల మందిరాలున్నాయి.

శృంగేరిలో దేవి శారదాంబ ఆలయం ఎంతటి పవిత్రమైనదో ఇక్కడి శారదా పీఠం కూడా అంతే ప్రసిద్ధమైంది. ఈ పీఠాన్ని దర్శించకుండా శృంగేరి తీర్థయాత్ర పరిపూర్ణం కాదు. ఇక్కడ గురుపరంపర పన్నెండు వందల సంవత్సరాలుగా అప్రతిహతంగా కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం శారదా పీఠానికి పీఠాధిపతిగా పరమ పూజ్య శ్రీ భారతీ తీర్థులవారు వ్యవహరిస్తున్నారు. ఆయన ముప్పై ఆరవ గురు పీఠాధిపతులు.

ఆలయానికి సమీపంలోని తుంగభద్రా నదీ తీరంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు కొలువుతీరి వున్నాడు. ఆ స్వామి ఈ క్షేత్రానికి క్షేత్రపాలకుడు. దీనికి సమీపంలోనే విద్యాతీర్థ సేతువు దర్శనమిస్తుంది. దానిని దాటివెడితే అదే 'హళే శృంగేరి' అంటే పాత శృంగేరి. ఈ క్షేత్రంలోనే దత్తాత్రేయ పీఠం దర్శనమిస్తుంది. హళే శృంగేరిలో వున్న ఆలయం చిన్నదే అయినా చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. విద్యారణ్య స్వాముల వారికి గురుదీక్ష ఇచ్చిన వారు పదవ పీఠాధిపతి అయిన విద్యాతీర్థులవారు. అందుకే తుంగ భద్రా నదిపై నిర్మించిన వంతెనకు విద్యాతీర్థ సేతువు అనే పేరుపెట్టారు. ఇక్కడ శారదా విద్యాపీఠం ఆర్ష విద్య, ఆధ్యాత్మిక సేవలకు మాత్రమే పరిమితం కాకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపట్టింది. దేశం నలుమూలలా విస్తరించిన సంస్కృత పాఠశాలల్లో అత్యధిక శాతం ఈ పీఠానికి చెందినవారే. శారదా ధన్వంతరి వైద్యశాల, సంచార వైద్యశాలలు, భోజన శాల, యాత్రికుల సౌకర్యార్థం ఈ పీఠం నడుపుతోంది. కాశీలోని గంగానదిలో స్నానం చేసి, విశాలాక్షి, అమ్మవారిని పూజించి, శృంగేరిలోని తుంగభద్రానదిలో నీరుతాగి శారదాదేవిని పూజిస్తే అనంతమైన పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.

-దాసరి దుర్గాప్రసాద్

సెల్: 8977676085

నిండు గర్భిణితో వున్న కప్పకు నీడనిస్తున్న నాగదేవత

పూజలందుకుంటున్న సరస్వతీమాత

ఆలయం వద్ద బారుల తీరిన భక్తులు



శృంగేరిలో దేవి శారదాంబ ఆలయం ఎంతటి పవిత్రమైనదో ఇక్కడి శారదా పీఠం కూడా అంతే ప్రసిద్ధమైంది. ఈ పీఠాన్ని దర్శించకుండా శృంగేరి తీర్థయాత్ర పరిపూర్ణం కాదు. ఇక్కడ గురుపరంపర పన్నెండు వందల సంవత్సరాలుగా అప్రతిహతంగా కొనసాగుతూ వస్తోంది.

పర్వదినాల పరమార్థం ఇదే...

అన్ని మతాల వారికి కొన్ని పవిత్ర దినాలుంటాయి. ఆయా రోజులలో వారు పూజాదికాలు జరుపుకొంటారు. సంబరాలు చేసుకొంటారు. మహమ్మదీయులకు మూడు ముఖ్యమైన పండుగలు అవి మొహర్రం, బక్రీద్, రంజాన్. ఇవికాక మిలాదున్నబీ మహమ్మద్ ప్రవక్త జన్మదినం కూడా జరుపుకొంటారు. క్రైస్తవులకు మూడు ముఖ్యమైన పర్వ దినాలు. క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ- వాటిలో క్రిస్మస్ క్రీస్తు జన్మదినంగా జరుపుకొంటారు. గుడ్‌ఫ్రైడే ఆయన సిలువ వేయబడిన దినం. ఇది విచారకరంగా పవిత్ర దినంగా, ముస్లిముల మొహర్రం జరుపుకొంటున్నట్లు జరుపుకొంటారు. క్రీస్తు పునరుద్ధానం గుడ్‌ఫ్రైడే మూడవరోజు క్రీస్తు సమాధి నుండి లేచి వచ్చిన రోజున భక్తిప్రపత్తులతో జరుపుకొంటారు.

కాని హిందువుల విషయానికి వస్తే పండుగలు లెక్కకు మిక్కుటంగా ఉన్నాయి. చైత్ర మాసంలో ఉగాది, శ్రీరామనవమి, వరహ జయంతి వస్తాయి. వైశాఖ మాసంలో అక్ష తదియ, బలరామ జయంతి, శంకర జయంతి, నృసింహ జయంతి, హనుమజ్జయంతి జరుపుకొంటారు. వీటిలో అన్నిటిని అందరూ జరుపుకోరు. జ్యేష్ఠ మాసంలో వచ్చే ముఖ్యమైన పండుగలు ఏరువాక పూర్ణిమ, వట సావిత్రీ వ్రతం. ఇక ఆషాఢంలో పూరిలో జగన్నాథ రథయాత్ర వైభవంగా జరుగుతుంది. యావద్భారతం నుండి భక్తులు ఈ రథాన్ని లాగడానికి ఆసక్తిగా వస్తారు. హరిశయనైకాదశి ఈనెలలో వస్తుంది. ఈనెలలో వచ్చే ఇతర పండుగలలో ముఖ్యమైనది గురుపూర్ణిమ. ఇది వ్యాస భగవానుని జన్మదినం. చాతుర్మస్య వ్రతం ఆచరించే యోగులు ఈనెలలోనే కార్యక్రమం ఆరంభిస్తారు. ఇక శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమనాడు పవిత్రమైన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరుగుతుంది. ఇది కొందరే ఆచరించినా అందరూ అదేరోజున సామాజికపరంగా సంబరంగా 'రాఖీ' పండుగగా జరుపుకొని అన్నాచెల్లెళ్లు అనుబంధాలను నెమరువేసుకొంటారు. బాద్రపద మాసంలో వినాయక చవితి అతి ముఖ్యమైన పండుగ. ఔత్తరాహులు దీనిని వినాయక నవరాత్రులు లాగా జరుపుతారు. ఇది తెలంగాణాలో బాగా ప్రాచుర్యంలో ఉన్న పండుగ. హైద్రాబాద్‌లో నిమజ్జనం విషయం అందరికీ తెలిసిందే! ఋషి పంచమి, వామన జయంతి కూడా ఈనెలలోనే సందర్భపడతాయి. వీటితోపాటు చనిపోయిన పెద్దలను స్మరించుకొని పవిత్ర కార్యక్రమాలు ఆచరించే మహాలయ అమావాస్య ఈనెల చివరలో వస్తుంది.

ఆశ్వయుజ మాసంలో దసరా పండుగ సరేసరి. చేసుకొనే వాళ్లకు తొమ్మిది రోజులు పండగే! ఆచరించే వాళ్లకు తొమ్మిది రోజుల పూజాదికాలు, వ్రతాలు. అన్నికాకపోయినా అందరూ జరుపుకొనేవి మహానవమి, విజయదశమి. కొన్నిచోట్ల జమ్మిచెట్టువద్దకు వెళ్లే ఆచారం ఉన్నది. ముందురోజున కార్యాలయాల్లో వస్తు సామగ్రికి అలంకారాధికాలు జరుపుతారు. దసరా ముగిసిన మరికొద్ది రోజుల్లోనే మరో పెద్ద సంబరం ఈనెలలోనే వస్తుంది. అదే 'దీపావళి' ఉత్తర భారతంలో దివాలిగా జరుపుకొంటారు. దీపావళి కాని విజయదశమి కాని అధర్మంపై ధర్మానికి విజయ సంకేతంగా జరుపుకొంటారు. ఈ విధంగా చూస్తే పవిత్రంగా ఆచరించే దినాలకన్నా సంబరంగా జరుపుకొనే దసరా, దీపావళి అశ్వయుజ మాసానికి తలమానికం వంటివి. కార్తికంలో నాగులచవితి వంటి కొన్ని పర్వాలు పాటిస్తాము. మార్గశీర్షంలో మంచుగాలులు దేశాన్ని తడుపుతుంటాయి. ఈ మాసంలో సుబ్రహ్మణ్య షష్టి జరుపుకొంటారు. దీన్ని స్కంద షష్టి అని కూడా అంటారు. ఇదేగాక గీతాజయంతి, దత్తాత్రేయ జయంతి కూడా వస్తాయి.

పుష్యమాసంలో చెప్పుకోదగ్గ పర్వదినం ముక్కోటి ఏకాదశి. దీనినే వైకుంఠ ఏకాదశి అంటాము. ఈరోజున స్వామి వారి వైకుంఠ ద్వారాలు తెరచి ఉంటారని ప్రతీతి. భోగి పండుగ మంటలు వేసి సంబరం చేసుకొంటే, మకర సంక్రమణం నాడు పవిత్రంగా పెద్దలకు తరుణ విధులు నిర్వహిస్తారు. మాఘ మాసంలో సూర్య సంబంధమైన రథసప్తమి పర్వదినం ముత్తయిదువలు ముఖ్యంగా భక్తితో జరుపుకొంటారు. కొన్ని పిండి వంటలు చేసుకొనే పండుగలు కాగా మరికొన్ని ఉపవాస దినాలు. భీష్మ ఏకాదశి కూడా ఈనెలలోనే వస్తుంది. పాల్గుణ మాసంలో వచ్చే ముఖ్యమైన పవిత్ర పర్వదినం శివరాత్రి. వైకుంఠ ఏకాదశిలాగా ఇది కూడా ఉపవాస ప్రధానమైన దినం. ముస్లిములు కూడా ఉపవాసం పాటించే పద్ధతి ఉన్నది. ఈనెలలో కామ దహనం జరుగుతుంది. దీనినే హోళీ లేక రంగుల పండగ సంబరంగా జరుపుకొంటారు.

ఈ విధంగా ఇన్ని పండగలను హిందువులు జరుపుకొంటారు. ఇందులో ఒక్క ఉగాది తెలుగువారికి మాత్రమే సంబంధించినది. ఒక విధంగా చూసే ఆశ్వయుజ మాసం ప్రధాన పండుగల నెలగా చెప్పుకోవచ్చు. సంబరాలు సంతోషంగా మిక్కిలి ఆనందంగా జరుపుకొనే దసరా, దీపావళి ఈనెలలోనే రావడం దీనికి కారణం.

కృష్ణభగవానుడు గీతలో ''మాసానాం మార్గశీర్షోహం'' అంటాడు. ఆయన దృష్టిలో మార్గశిర మాసం లో మాసాలరారాజు అయి ఉండవచ్చు. స్వామి అభిప్రాయాన్ని అందరూ అర్థం చేసుకోలేము. మనకు అవగాహన లేని ఎన్నో విషయాలు ఉండవచ్చు. పక్షులలో గరుత్మంతుణ్ణి నేను అని కూడా స్వామివారు శెలవిచ్చారు కదా! ఏదిఏమయినా ఈ పండుగలు సామాజికపరంగా ప్రాశస్త్యం సంతరించుకొన్నాయి. మహారాష్ట్రలో తిలక్ మహాశయుడు గణేశ నవరాత్రుల ద్వారా ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను ఉద్దీపన చేసిన విషయం మరచిపోలేము. ఇలా కలుసుకోవడం, పరస్పరం శుభాభినందనలు తెలుపుకోవడం ద్వారా బంధం దృఢతరమవుతుంది. ఏది లేనివారు ఆ ఒక్కరోజయినా పప్పూ, పరమాన్నం చేసుకొని ఉన్నా దానితో సంతోషంగా ఉండిపోతారు. ఈ విధంగా మన పండుగలకు పవిత్రత, దానితోపాటు ఆనందోత్సాహాలు పెనవేసుకొని ఉన్నాయి.

-కాకుటూరి సుబ్రహ్మణ్యం

ఆపదలను పారద్రోలే తల్లి

ఈ వారం బార్హతం శతకంలోని రెండవదైన భుజగశిశుభృతా స్తుబకములోని మిగిలిన శ్లోకాలనుచూద్దాం...

14. అమర నృపతి నాసాకం కుసుమిత వనవాటీషు।
భగవతి తవ విశ్రాంతే స్సజయతి సమయః కోపి॥
15. అమర తరువర చ్ఛాయా స్వయి ముహురుపవిశ్య త్వం।
శచి కృతి జన రక్షాయై మనసి వితనుషే చర్చాం॥
16. కిము వసు వితరాణ్యస్మై సుమతి ముత దదా న్యస్మై।
క్షమతమ మధవాముష్మి న్బలమురు ఘటయానీతి॥
17. హరి తరుణి కదా వామే వినమదవన చర్చాసు।
స్మరణ సమయ ఆయాస్య త్యమల హృదయ రంగేతే॥
18. శచి భగవతే సాక్షాత్తే చరణ కమల దాసోహం।
19. నయది తవ మనోదాతుం స్వయమయి లఘువే మహ్యం।
ఉపవన తరు కర్ణేవా వదమ దభిమతం కర్తుం॥
20. నిజ విషయ మతి శ్రేష్ఠం విపది నిపతి తంత్రాతుం।
స్వకిలమపి సదధ్వానం గమయితు మపథే శ్రాంతం॥
21. అఖిల భువన సమ్రాజ్ఞి ప్రియ తరుణి భవత్వేవ।
మతిబల పరిపూర్ణోదయం గణపతిమని రాధేయః॥

ఓ ఇంద్రాణీదేవీ! అల్పుడనైన నాకు స్వయంగా చెప్పడానికి నీకు ఇష్టం లేకపోతే ఉపవనంలో ఉండే ఈ చెట్టు చెవిలోనన్నా చెప్పవమ్మా! ఆపదలో పడి ఉన్న అతి శ్రేష్ఠమైన నా భారతదేశాన్ని రక్షించడానికి, వంకర మార్గాలను పట్టిపోయి అలిసిపోయిన నా కులాన్ని సన్మార్గంలో పెట్టడానికి నీవు ఈ గణపతిమునిని బుద్ధి పరిపూర్ణునిగా వించు.

22. నకిము భవతి శందేశే గతివతి కలుషే కాలే।
తవ భజన మఘం సద్యో హరిహయ లలనే జేతుం॥
23. త్రిజగతి సకలం యస్య ప్రభవతి పృథులే హస్తే।
స బహుళ మహిమాకాలో మమ జనని విభూతిస్తే॥

ఓ ఇంద్రాణీదేవీ! సుఖప్రదమైన ఈ దేశంలో, కలుషితమైపోయిన ఈ కాలంలో నీకు పూజచేయడంవల్ల పాపాలు వెంటనే తొలగిపోవా ఏమి? అమ్మా, ఈ ముల్లోకాలూ కాలం చేతిలో బందీయే. ఐతే, ఎంతో మహిమ కలిగిన ఆ కాలం కూడా నీ లీలా విభూతియే కదా!

24. అనవరత గళ ద్భాష్పాం భరత వసుమతీం త్రాతుం।
వితరతు దయితా జిష్ణో ర్గణపతి మునయే శక్తిం॥

ఓ ఇంద్రాణీదేవీ! ఎల్లవేళలా కన్నీరు కారుస్తూ ఉన్న ఈ భారత భూమిని రక్షించడానికి ఈ గణపతి మునికి శక్తినివ్వు.

25. భుజగ శిశుభృతా ఏతాః కవి గణపతి నా గీతాః।
విదధుత ముదితాం దేవీం విభుధపతి మనోనాథాం॥

గణపతిముని గానం చేసిన ఈ భుజగశిశుభృతా వృత్తాలు ఇంద్రాణీ దేవికి ప్రీతిని కలుగజేయుగాక!

బార్హతం శతకంలోని రెండవదైన భుజగశిశుభృతా స్తుబకం ఇక్కడితో పూర్తి అయింది.

ఇహతు వసుమతీ లోకే స్మర మమ విషయం పూర్వం॥

తల్లీ! పుష్పవన వాటికలలో ఇంద్రుడితో కలసి నీవు విశ్రాంతిని పొందే సమయం ఎంతో గొప్పది. ఆ అమర వృక్షాల నీడలో కూర్చుని నీవు మనస్సులో పుణ్యజనులను ఎలా రక్షించాలీ అని ఆలోచిస్తున్నావులా ఉంది. ఆ పుణ్య జనులకు ధనమిస్తావా? జ్ఞానమిస్తావా? లేక అధిక బలాన్నిస్తావా?- ఏమివ్వాలని ఆలోచిస్తున్నావు? నీపై ఎంతో భక్తితో ఉన్న వారి రక్షణ విషయంగా నీవు చేసే చర్చలలో నా గురించి నీ మదిలో ఆలోచించే సమయం ఎపుడొస్తుందీ? నేను సాక్షాత్తూ నీ పాదాలకు దాసుడను. అందువల్ల ఈ భూలోకంలో నా విషయాన్ని మొదట స్మరించు.

పర్యాటకులకు కరదీపిక

లోకంలో యాత్ర చేయడం సర్వసాధారణం. యాత్రచేయకపోయినా మనకు తెలిసిన వారెవరైనా యాత్రచేసి వచ్చారంటే వారిని పలుకరించి యాత్రావిశేషాలు తెలుసుకోవడమూ సాధారణమే. అలానే రచయిత్రి వరంగల్లు జిల్లాలో ముఖ్యమైన యాత్రావిశేషాలు అన్నీ తెలుసుకొని తన పెనిమిటి సాయంతో ప్రతిచోటకు వెళ్లారు. వెళ్లిన ప్రతిచోట చారిత్రక కథనాలు, స్థల పురాణాలు అడిగి మరీ తెలుసుకొన్నారు. అక్కడున్న గ్రంథాలలోని విషయాలను ఇపుడు ఉన్న పరిస్థితులను చక్కగా తెలుసుకొన్నారు. తాను తెలుసుకొన్న విశేషాలు, తాను పొందిన అనుభూతులను తనవారితో పంచుకోవాలని ఉవ్విళ్లూరారు. అనుకొన్నదే తడువుగా పుస్తకరూపంలో తాను చూసి తెలుసుకొన్నవిషయాలన్నీ పాఠకులముందుంచారు. ''యాత్రాదీపిక వరంగల్లు జిల్లా'' అని పుస్తకానికి పేరుపెట్టినా వరంగల్లు జిల్లానే కాక చుట్టు ప్రక్కల ప్రదేశాలను అక్కడ ఉండే విశేషాలను కూడా వివరించారు. తానుచూసిన ప్రదేశాల వివరాలు ఈ పుస్తకంలో ఇస్తూ ఆయా ప్రదేశాలకు ఎలా వెళ్లాలి, ఏఏ రవాణాసదుపాయాలున్నాయి. అక్కడ ఉన్న వసతులు ఎలాంటివో గూడా తెల్పారు. అంతేకాదు కొన్ని కొన్ని దేవాలయాలు శిథిలావస్థలో ఉండడానికి కారణాలేమిటో కూడా వివరించారు. తాను చూసినప్రదేశాలలోని ముఖ్యమైన గుళ్లు , అందులోని దేవతామూర్తులకు సంబంధించిన చిత్రపటాలను కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు. వరంగల్లు యాత్రను చేయాలనుకొన్నవారికి ఈ యాత్రాదీపిక కరదీపికలా పనిచేస్తుంది. ఈ పుస్తకాన్ని చేతబట్టుకొని చూసి రావాల్సిన ప్రదేశాలను ఏ ఇబ్బందిలేకుండా చూసిరావచ్చు. ఈచిరుపొత్తం చదువుతుంటే ఆ యా ప్రదేశాలు చూసిన అనుభూతి కలిగిలా సరళసుందరమైన భాషలో, ప్రతి ప్రదేశాన్ని దగ్గరుండి చూపుతున్నట్లుగా రచన సాగించారు. దర్శనీయ స్థలాలన్నింటి గురించిన చారిత్రకాధారాలను తెలిపే ఈ పొత్తం అందరూ చదివితీరాల్సిందే.

-చరణ శ్రీ

యాత్రాదీపిక - వరంగల్లు జిల్లా, రచన: పి.ఎన్. ఎమ్. లక్ష్మి. మూల్యం : రూ. 60/-లు

ప్రతుల ప్రాప్తిస్థానం: పి. ఎన్. ఎమ్. లక్ష్మి, బి. 391, శ్రీ కృష్ణా నగర్

యూసఫ్ గూడా చెక్‌పోస్టు, హైద్రాబాదు-500 045. మరియు విశాలాంధ్ర ,

నవోదయ బుక్ హౌస్ , కరవాణి: 9866001629

వధువుకు వల్లెవాటు వేస్తారెందుకు?

★ పెండ్లిలో వధువుకు వల్లెవాటు వేస్తారెందుకు?

-వి.నాగలక్ష్మి, విజయవాడ

-వివాహమనేది ఒక యజ్ఞదీక్ష వంటిది. దీనిలో వధూవరులిద్దరూ 4 1/2 రోజులు దీక్షాధారులై వుండాలని సూత్రకారులు నిర్ణయించారు. దీక్షలో భాగంగా వధువు రెండు వస్త్రాలను ధరించాలి. రెండవ వస్త్రంగా వల్లెవాటు అనేది ప్రాంతీయాచారంగా రూపొందింది.

★ సిద్ధపురుషుడు, అవతార పురుషుడు, అవధూత- ఈ ముగ్గురికి తేడాలు ఏమిటి?

-చిలకం వేణుగోపాలమ్, అనంతపురం

-మంత్రసిద్ధిని గాని, యోగ సిద్ధిని గాని సాధించినవాడు సిద్ధపురుషుడు. విష్ణువు మొదలైన దేవతలు స్వేచ్ఛపూర్వకంగా మానవ శరీరాన్ని ధరించి వస్తే, ఆయన అవతార పురుషుడు. యతీశ్వరులలో సాధన దశను దాటి, జీవన్ముక్త స్థితిని అందుకోవటం ద్వారా సమస్త బంధాలను దులిపివేసుకొన్న మహనీయుడు అవధూత.

★ సింధు నదీ తీరవాసులనే హిందువులని పిలిచారు తప్ప, మన దేశీయులు అంతా మతమనేదే లేని ఆర్యులని విన్నాను. నిజమేనా?

- కుప్పా వేంకట కృష్ణమూర్తి

-గంజి నాగేశ్వరరావు, హైదరాబాదు

-మతము అంటే అభిప్రాయము అని అర్థం. ఒక వ్యక్తికి కొన్ని ఉన్నత మైన అభిప్రాయాలు ఏర్పడి, వాటిని అతడు ప్రచారం చేస్తే ఆ భావాలు నచ్చిన వాటిని ఆచరించేవారు అతని మతం వారవుతారు. హిందూ మతం అలాంటిది కాదు. అది సాక్షాత్తుగా బ్రహ్మముఖం నుంచీ వెలువడిన వేదాలలోని ప్రబోధాలను ఆచరించేది. ఒక విధంగా అది ఒక వ్యక్తిమీద ఆధారపడి లేదు. కనుక అది మతం కాదు. అంతవరకు సత్యమే. ఇకపోతే ఆర్యులు అంటే పూజ్యులు అని మాత్రమే అర్థం. ఆర్యులనే జాతి లేదు. మన దేశాన్ని విభజించి పాలించటంకోసం దాన్ని విదేశీయులు సృష్టించేసారని ఇప్పుడు నిస్సందేహంగా నిరూపణ అయిపోయింది.

★ 64 కళలు అంటే ఏవి? చాలాచోట్ల వెతికాను. దొరకలేదు.

-గంజి నాగేశ్వరరావు, హైదరాబాదు

-గ్రంథాలయాలలో సూర్యరాయాంధ్ర నిఘంటువు అని వుంటుంది. దానిలో ఈ పట్టిక వుంది. చూసుకోండి.

★ "శుక్లాంబరధరం విష్ణు"అనే శ్లోకంతో గణపతి ప్రార్థన చేస్తున్నారు. కానీ అవి విష్ణుస్తుతి లాగా వుంది కదా! ఇది ఎలా కుదురుతుంది?

-కోళ్ళపూడి కేనయ్య, బాపట్ల

-ఇక్కడ ''విష్ణుం''అనే పదానికి సర్వవ్యాపకుడు అని అర్థం. 32 గణపతులలో ఒక గణపతి యొక్క ధ్యాన శ్లోకం ఇది. ★

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :
కుప్పా వేంకట కృష్ణమూర్తి
ఇంటి నెం. 11-13-279, రోడ్ నెం. 8,
అలకాపురి, హైదరాబాద్-500 035.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

సోమవారం 11, ఫిబ్రవరి 2013

చిట్కా

★ పెరుగులో కాస్త గ్లిజరీన్ కలిపి రాత్రి నిద్రించేముందు పెదాలకు రాసుకుని, మరు నటి రోజు ఉదయాన్నే చన్నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే పెదాలపై నల్లరంగు తగ్గుతుంది. అవి పొడిబారడం ఆగుతుంది.

★ కొత్తిమీర లేదా పుదీనా ఆకుల రసాన్ని నిమ్మరసంలో కలిపి పెదాలకు రాసుకుంటే అవి నిగారింపును సంతరించుకుంటాయి.

★ ప్రతి రోజూ ఉదయాన్నే పెదాలను తేనెతో మర్దనా చేసుకుంటే నలుపుదనం తగ్గడమే గాక అవి నునుపుగా, తేమగా ఉంటాయి.

★ జాజికాయ పొడిలో కాస్త వెన్న, తేనె కలిపి ఆ మిశ్రమాన్ని పెదాలకు గట్టిగా రాసుకోవాలి. ఇలా కొన్ని రోజులు క్రమం తప్పకుండా చేస్తే పెదాలు మెరుస్తాయి.

★ కొబ్బరి పాలలో కాస్త వెన్న చేర్చి పెదాలకు రాసుకున్నా అవి మృదువుగా మారతాయి.

★ పచ్చిపాలలో గులాబీ రేకల్ని గంటసేపు నానబెట్టి, ఆ తర్వాత ఆ పాలను పెదాలకు రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

★ స్వచ్ఛమైన తేనెను కాస్త వేడి చేసి పెదాలకు రాసుకుని అరగంట తర్వాత శుభ్రంగా కడిగేసుకోవాలి. కొన్ని రోజులు ఇలా చేస్తే పెదవులు తళతళ మెరుస్తుంటాయి.

నిజ జీవితంలో....

అపోహలు - యథార్థాలు

ఫాస్ట్‌ఫుడ్స్‌లో పౌష్టికత ఉందనే అపోహలు చాలామందిలో ఉన్నాయి. ఇడ్లీ, పూరీ, చపాతీల్లో ప్రొటీన్లు, పీచు చాలా ఎక్కువగా ఉంటాయి. అవి తినడం మంచిదే. వాటిని శుభ్రమైన రీతిలో తయారు చేయడం అవసరం. వేపుడు పదార్థాలు వీలయినంతవరకు భుజించవద్దు.

గోధుమ రంగు రొట్టె తెల్లని రొట్టెకన్నా బలవర్ధకమైనది. ఇది అపోహ మాత్రం కాదు- యథార్థం. తెల్లని రొట్టెను మైదాతో తయారుచేస్తారు. పిండిని బాగా రిఫైన్ చేస్తారు. ఏ మార్పు చెందించని గోధుమ పిండితో గోధుమ రంగు రొట్టె తయారవుతుంది. అందుకే ఇందులో పౌష్టికత ఎక్కువగా ఉంటుంది. కాల్చిన రొట్టెలో తక్కువ కాలరీలు ఉంటాయనే అపోహ ఉంది. రొట్టెను కాల్చడం వలన దానిని తిన్నవారికి సులువుగా జీర్ణం అవుతుంది. కాల్చడం వలన అది కాలరీల విషయంలో ఏ విధంగానూ నష్టానికి గురి కాదు.

పళ్లరసంలో కాలరీలు ఉండవు. భారీకాయులు ఎంత కావాలంటే అంత పళ్లరసం తాగవచ్చు. ఈ విధమైన అపహాస్యాల్లో కొంతమందికి ఉంది. ఒక గ్లాసుడు పళ్లరసంలో సగటున 200 కాలరీలు ఉంటాయి. రెస్టారెంటులో ఇటువంటి పళ్లరసాలు తాగితే ఆ రసంలో పంచదార (గ్లూకోజు) కలుపుతారు. ఒక చెమ్చాడు పంచదారలో 20 కాలరీలు ఉంటాయి.

పళ్లరసం తాగడం కన్నా రోజూ పళ్లు తినడం మంచిది. వాటిలో పీచు బాగా ఉంటుంది. పీచు పదార్థం బాగా ఉంటే ఆ ఆహారంలోని పౌష్టికతను మన శరీరం గరిష్టంగా పీల్చుకోగల్గుతుంది.

చెరకు రసం

చెరకు రసం కామెర్ల రోగికి మంచిది. చెరకు రసమే కాదు ఏ ఇతర పండ్ల రసమైనా ఒకే విధంగా ఉపకరిస్తుంది.

అందులో వున్న షుగర్స్, కార్బోహైడ్రేట్సు తక్షణం మనిషికి శక్తిని ఇస్తాయి. సాధారణంగా ఇళ్ళలో చెరకురసం తీయరు. పట్టణాల్లో రోడ్డు పక్కన చెరుకుగడల నుండి రసం తీసి అమ్ముతూ ఉంటారు. ఈ రసం మీద ఈగలు, ఇంకా ఇతర కీటకాలు వాలుతూ ఉంటాయి. అంటే ఈ చెరకు రసం కలుషితం అయ్యే అవకాశం హెచ్చు. అందుచేత చెరకుగడను కొరుకుతూ రసం పీల్చడం ఎంతో మంచిది.

రాత్రిపూట పుచ్చకాయ తినకూడదని ఒక అపోహ ఉంది. తాజా పుచ్చకాయను ఎప్పుడైనా తినవచ్చు. కాకపోతే ఈ పండు తినడం వలన మూత్రం ఎక్కువ అవుతుంది. రాత్రి తింటే నిద్రాభంగం అవుతుంది. మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది.

పాలతో నిమ్మపండు తింటే డయేరియా పట్టుకుంటుందనే అపోహ ఉంది. నిర్భయంగా నిమ్మ పండ్లతో పాలు తాగవచ్చు. మహా అయితే ఈ పండ్లు పాలను విరగ్గొట్టవచ్చు. అదయినా కడుపులో పాలు విరగవచ్చు. దానివల్ల హాని ఏమీ జరగదు.

విటమిన్లు

ఎక్కువగా విటమిన్లు తీసుకుంటే ఆరోగ్యం పెరుగుతుంది. రోగం తగ్గి కోలుకొంటున్నప్పుడు విటమిన్లు ఎక్కువగా తీసుకుంటే కొంత ప్రయోజనం ఉండవచ్చు. అటువంటి సమయాల్లో మల్టీ విటమిన్లు ఉపయోగించుకోవచ్చు.

ఒకసారి శరీరానికి కావలసిన విటమిన్లు లభిస్తే ముఖ్యంగా విటమిన్లు, బి1, బి2, సిలు అధికమైతే అవి నీరుడుతోపాటు శరీరం నుండి విసర్జించబడతాయి. 'ఎ' మరియు 'డి' విటమిన్లు కావలసిన స్థాయికి మించి శరీరానికి అందితే అవి శరీరంలో నిల్వ ఉంటాయి. ఇవి కొంత స్థాయిని మించి తీసుకుంటే శరీరానికి మంచిది కాదు.

ఆల్కహాలు తాగితే గుండెకు చెరుపు చేస్తుంది. నిజమే. అధికంగా ఆల్కహాలు తాగడం కచ్చితంగా హానికరం. గుండెకు సంబంధించి కొద్దిగా ఆల్కహాలు తాగడం ఉత్తమం అని పరిశోధనలలో వెల్లడయ్యింది. ఈ కొద్ది ఆల్కహాలు గుండెకు పోయే రక్తనాళాలు పెద్దవి అయ్యేటట్లు చేసి రక్తప్రసరణం చక్కగా జరిగేటట్లు చేస్తుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.

అయితే, ఆల్కహాలు తాగమని వైద్యులు సిఫార్సు చేయరు. ఎందుకంటే ఆల్కహాలు శరీరంలోని ముఖ్యమైన అవయవాలైన లివరు వంటి వాటిని దెబ్బ తీస్తుంది. అందుకే ఆల్కహాల్ తాగితే తగిన మోతాదులోనే తాగాలి. క్షేమదాయకమైన హద్దు ఎంత? అనేదానిని ఇంకా నిర్ణయించలేదు. ధూమపానం చేసే వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ. ధూమపానం చేయనంత మాత్రాన ధూమపానం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు రావని భావించనవసరం లేదు.

ధూమపానం చేసేవారున్న గదిలో ఉంటూ, వారు వదిలే పొగ పీల్చడంవల్ల ధూమపానం చేయకపోయినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఎక్కువ. ఇటువంటివారిని 'పాసివ్ స్మోకర్స్' అంటారు. ధూమపానం చేసే వారిని 'యాక్టివ్ స్మోకర్స్' అంటారు.

సిగరెట్టు పొగలో వెయ్యి పదార్థాలు ఉంటాయి. అందులో కొన్ని తారు, కార్బన్ మోనాక్సైడ్, నికోటిన్ మొదలయినవి. ధూమపానం చేసేవారు దమ్ము దమ్ముకూ మధ్య వదిలే

పొగలో ఇవి ఎక్కువ గాఢతలో ఉంటాయి. అంతేగాక, సిగరెట్ల పొగలో నైట్రోసెమైన్స్ 50 రెట్లు అధికంగా ఉంటాయని ఇటీవల పరిశోధనలలో వెల్లడయ్యింది.

నైట్రోసెమైన్స్ అనేవి క్యాన్సర్ రోగకారకాలు. అందుకే సిగరెట్టు కాల్చేవారికన్నా ఆ పొగ తగిలేవారికి ఎక్కువ ప్రమాదం అని గుర్తించాలి.

మగబిడ్డ

మగబిడ్డ పుట్టకపోవడానికి తల్లే కారణం అనే అపోహ ఉంది. ఆడ, మగ బిడ్డ పుట్టడానికి తల్లి లేదా తండ్రి పాత్ర అంతంత మాత్రమే. మగా? ఆడా? అనేది నిర్ణయం కావడంలో వారి ప్రమేయం ఏమీ ఉండదు. జీవశాస్త్రం అనుసరించి పుట్టేబిడ్డ సెక్సు నిర్ణయం క్రోమోజోమ్స్‌పై ఆధారపడి ఉంటుంది. తండ్రి విడుదల చేసిన వీర్యాన్ని తల్లి అండం ఆమోదించి ఫలదీకరణం చెంది పిండంగా మారుతుంది.

వీర్యంలోని క్రోమోజోమ్స్ పుట్టే బిడ్డ ఆడ, మగ అనేది నిర్ణయిస్తాయి. మగ బిడ్డను కనలేదని తల్లిని నిందిస్తారు. ఇది చాలా అన్యాయం. దురదృష్టం. ఇటువంటి నిందలు ఇప్పటికి కొన్ని కుటుంబాలలో వినిపిస్తూనే ఉంటాయి.

బిడ్డ బొద్దుగా ఉంటే ఆరోగ్యంగా పెరుగుతాడని కొంతమంది అపోహ. బిడ్డ ఎదుగుదలకు బాగా సహకరించే వయసు 2 నుండి 3 సంవత్సరాలు మరియు 7 నుండి 11 సంవత్సరాలు.

ఈ వయసులో బిడ్డ బొద్దుగా ఉంటే ఆరోగ్యంగా ఉండడు సరికదా అధిక బరువువల్ల తరువాత వయసులో 'రికెట్స్' వ్యాధి, గుండె జబ్బులు సులువుగా వచ్చే అవకాశం ఉంటుంది.

బరువు తగ్గాలి

బరువు తగ్గడానికి ఉపవాసాలు మంచిదని కొంతమంది అపోహ పడుతూ ఉంటారు. తిండి తగ్గించి చేసే ఉపవాసాలు శరీరం బరువు తగ్గేందుకు కొంత సహకరిస్తాయి . ఉపవాసం పూర్తి కాగానే ఆపురాపురుమంటూ తినడం వల్ల బరువు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

అధిక కొవ్వు, ప్రొటీన్లు లేని ఆహారం రెండు పూటలా తినవచ్చు. దీనికి తోడుగా క్రమం తప్పకుండా శరీర వ్యాయామం చేయడం వలన శరీరం బరువు తగ్గుతుంది.

అధిక బరువుగల వ్యక్తులు మాత్రమే కాదు ఉపవాసాలు ఉండేది. అనారోగ్యం వచ్చినపుడు 'లంకణం దివ్యౌషధం' అనే భావంతో రోగికి ఏమీ పెట్టరు. అటువంటి సందర్భాలలో రోగికి డీహైడ్రేషన్ వల్ల అనారోగ్య ప్రమాదం త్వరత్వరగా ఎదురుకావచ్చు.

ఏ రకమైన అధిక వ్యాయామమైనా సరే శరీరానికి మంచిదని కొంత మంది అపోహ. వ్యాయామం అనేది నిస్సందేహంగా శరీరానికి మంచిదే. అయితే మంచి, చెడు వ్యాయామాల మధ్య గీత చాలా సన్నగా ఉంటుంది.

ఉదాహరణకు 'జాగింగ్' చాలా మంచి వ్యాయామం. అయితే సరియైన పాదరక్షలు లేకుండా రఫ్‌గా ఉండే ప్రదేశాల్లో జాగింగ్ చేస్తే పాదాలలో, మోకాలులో ఫ్రాక్చర్ అయ్యే ప్రమాదం ఉంది. అతి ఎప్పుడూ ఏ విషయం లోను మంచిది కాదు. అధికంగా జాగింగ్ చేస్తే ఆ వ్యక్తికి- 'జాగర్స్ ఎనీమియా' అనే పరిస్థితి వస్తుంది.

ఒకసారి శరీరానికి 'షుగర్' వ్యాధిమస్తే దానిని అదుపు చేసుకునే యాజమాన్య పద్ధతులు పాటించాలి. సాధారణంగా మధుమేహం నయం కాదు. ఆహార నియమాలు, వ్యాయామం మధుమేహం అదుపునకు సహకరిస్తాయి.

గర్భంతో ఉన్నపుడు కొంతమంది స్త్రీలలో షుగర్ కన్పించి ఆ తరువాత అది కన్పించకపోవచ్చు. ఒత్తిడివల్ల షుగర్ కన్పించి ఒత్తిడి తగ్గగానే అది కన్పించకపోవచ్చు.

-సి.వి.సర్వేశ్వర శర్మ

గుడ్లగూబ ఖరీదు.. లక్ష రూపాయలు!

అవీ..ఇవీ..అన్నీ
- వీరాజీ

లూథియానా దగ్గరి గ్రామం- మధోపురిలో ఓ పెద్ద నీలగిరి చెట్టుకి వేలాడుతున్న గాలిపటపు కొక్కెం- దారినపోయే వందలాది మందిని ఎంతగానో ఆకర్షించింది. ఆ గాలిపటంలో ప్లాస్టిక్ కొక్కేనికి- ఓ గుడ్లగూబ ఇరుక్కుంది. అది విలవిలలాడుతూ వుంటే కొంతమంది భూతదయాపరులు- 'కేప్' అంటే- కేర్ ఫర్ ఏనిమల్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థకి ఫోన్ చేశారు. వాళ్ళొచ్చి నానా తంటాలుపడి- ఆ గుడ్లగూబని ఎట్టకేలకు రక్షించారు.

గుడ్లగూబ నిజానికి- గుడ్లగూబయేగానీ-

గద్ద కనుగుడ్లలాంటి- ఎర్రని మెరిసే కనుగుడ్లు వుంటాయి దానికి. దాని తలకి అటూ, యిటూ-

కుచ్చులుంటాయి. చాలా అపురూపం యీ 'గూబ'. దాన్ని బ్లాక్ మార్కెట్‌లో- మంత్ర విద్యనేర్చి- చేతబడులు, వగైరా చేసేవాళ్లు అవసరమయితే-లక్ష రూపాయలు లేదా యింకా ఎక్కువ సొమ్ముమిచ్చి మరీ కొంటారు. కానీ, దీన్ని మొదట చూసిన- తల్వీందర్ సింగ్, భూపేందర్ సింగ్ ద్వయానికి - ఈ విచిత్రమైన పక్షిని పట్టి అమ్ముకోవాలన్న కోరిక కలగలేదు. కేవలం భూతదయతోనే దాన్ని కాపాడి- 'కేప్' ప్రతినిధుల మన్నన పొందారు.

గాలిపటాల సీజన్‌లో - వాటికి ప్లాస్టిక్ కొక్కేలు పెట్టి ఎగరవేయటం మొదలెట్టిన దగ్గర్నుంచీ పక్షుల కాళ్లు లేదా వాటి రెక్కలు కొక్కేలకి చిక్కుకున్న సంఘటనలు ఎక్కువైనాయి. ఈ గుడ్లగూబ ఎలాగో బతికింది గానీ- చాలా పిట్టలు మాత్రం చచ్చిపోతుంటాయి. అంచేత- ప్లాస్టిక్ కొక్కేల వాడకాన్ని నిషేధించమని 'కేప్' సంస్థ అధికారులు గాలిపటాలు ఎగరవేసే పిల్లలకి విజ్ఞప్తి చేసి- ఈ గుడ్లగూబని వన్యమృగ సంరక్షణాలయానికి సురక్షితంగా బట్వాడా చేశారు!

veeraji@sify.com

పిల్లల ఎదురుగా గొడవలు పడకండి..!

''తెల్లారింది.. అప్పుడే ఏదో ఒక గొడవ.. ఏంటి విషయం?' కొడుకు విశ్వాత్మను అడిగింది జయమ్మ.

'ఎవరో ఫోన్ చేసేరు. నాన్న ఫోనెత్తగానే పెట్టేసేరు. అత్తయ్యే అలా చేసిందని నాన్న తిట్టడం.. మామ్మ నాన్నకి అష్టోత్తరం..' అంటూ పకపకా నవ్వుతూ అన్నాడు.

'అయినా.. మీ నాన్న ఫోనెత్తగానే అత్తయ్య కట్ చెయ్యడం తప్పే కదా....'!

''అసలు ఫోన్ చేసింది అత్తయ్య కాదు.. నేనే.. సెల్ నుంచి ల్యాండ్‌లైన్‌కి చేసి నాన్న తీయగానే కట్ చేశాను'' అన్నాడు.

'ఎందుకలా చేసేవు?'' ఆశ్చర్యంగా అడిగింది.

''ఇప్పుడు జరిగేది చూడు.. నీకే తెలుస్తుంది'' అన్నాడు.

అత్తయ్య వంటింట్లోకి రాగానే ''మామ్మా.. స్కూల్లో ఫంక్షన్‌కి ఏభై రూపాయలు తెమ్మన్నారు టీచర్‌గారు... నాన్ననడిగితే ఇవ్వడం లేదు'' అన్నాడు దీనంగా. 'వెధవ... వాడికి ఆత్మస్తుతి, పరనింద బాగా అలవాటైపోయింది' అంటూ ఓ 50 రూ. నోటు మనవడికిచ్చింది. మామ్మ వెళ్లిపోయాక తల్లితో అన్నాడు విశ్వాత్మ. వాళ్ళిద్దరూ కబుర్లుచెప్పుకుంటున్నప్పుడు అడిగితే 'ఇరవై చాలు' అంటూ ఇద్దరిదీ ఒకేమాట. అదే వాళ్ళమధ్య గొడవ వుంటే కసితో అడిగినంత ఇచ్చేస్తారు. వాడు చెప్పింది విని తెల్లబోయాను. పెద్ద వాళ్ళ మధ్య గొడవ పెట్టి అనుకున్నది పొందాలని- పదేళ్ళ వెధవకి ఆరాటం.. ఇంట్లో పెద్దల మధ్య గొడవలు పిల్లలు చెడిపోవడానికే.. వాళ్ళ వీక్‌నెస్ కనిపెట్టేడు.. ఇలాంటి చోట పెరిగితే వీడు పెద్దయ్యాక ఎలా తయారౌతాడో?- బాధగా అనుకుంది జయమ్మ. విశ్వాత్మ స్కూలుకి వెళ్లాక అత్తగారిని, భర్తని కూర్చోపెట్టి కొడుకు చేసిన పని చెప్పింది. అపరాధ భావంతో తలొంచుకున్నారు ఆ ఇద్దరూ. 'మీరే కాదు మామయ్య గారు కూడా తరచుగా గొడవ పడుతున్నారు.. ఆలోచిస్తే వాళ్లమధ్య గొడవలకి వీడే కారణం అని పిస్తోంది. అందుకే వాడిని మావాళ్ళింటికి పంపేద్దామనుకుంటున్నాను'-అంది జయమ్మ. ఇక నుంచి జాగ్రత్తగా వుంటామని ఇద్దరూ ఒకేసారి అన్నారు. తానెన్ని చాడీలు చెప్పినా ఇంట్లో గొడవలు లేవు.. ఏం జరిగిందోనని విశ్వాత్మకి అర్థం కాలేదు. పిల్లల ఎదురుగా పెద్దలు గొడవలు పడితే ఎటువంటి పరిస్థితి ఎదురౌతుందో తెలిసిందిగా. పేరెంట్స్ కూడా పిల్లల ఎదురుగా ఎప్పుడూ గొడవ పడకుండా ఉండాలి.

-జ్యోతిర్మయి

'పీచు ఆభరణాల'కు భలే గిరాకీ!

దిండ్లు, పరుపులు, తివాచీల తయారీకే ఇన్నాళ్లూ పరిమితమైన కొబ్బరి పీచుతో నేడు ఆకర్షణీయమైన ఆభరణాలను, అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. కొబ్బరి తోటలకు ప్రసిద్ధి చెందిన కేరళలో పీచు పరిశ్రమ ఇపుడు కొత్తపుంతలు తొక్కుతోంది. పీచుతో పూలగుత్తులు, కంఠాభరణాలు, చెవి రింగులు, ఉంగరాలను సైతం ఆకట్టుకునేలా రూపొందించడంతో వాటికి డిమాండ్ పెరిగింది. సహజ సిద్ధమైన పూల మాదిరి పీచుతో చేసే పుష్పగుచ్ఛాలు విభిన్న రంగుల్లో లభిస్తున్నాయి. వీటి ధర 75 నుంచి 100 రూపాయలు పలుకుతోంది. ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉండడంతో పీచుతో చేసే అలంకరణ సామగ్రికి మంచి ఆదరణ లభిస్తోందని కేరళలోని పీచు మార్కెటింగ్ సమాఖ్య (కాయర్ ఫెడ్) మేనేజింగ్ డైరెక్టర్ కెఎం మహమ్మద్ అనిల్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీటికి దేశీయంగా, అంతర్జాతీయంగా గిరాకీ కనిపిస్తోందని, జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నబార్డు) సహకారంతో పలు రకాల ఉత్పత్తులకు రూపకల్పన చేసినట్లు ఆయన చెప్పారు. సృజనాత్మకత ఉట్టిపడేలా పీచుతో చేసే వస్తువుల్ని వాణిజ్యపరంగా పెద్ద ఎత్తున ఎగుమతి చేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన వివరించారు. పీచుతో తయారు చేసే వివిధ ఆభరణాలకు 750 నుంచి వెయ్యి రూపాయల వరకూ ధర పలుకుకోంది. పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండా తయారు చేసే ఈ ఉత్పత్తులకు విస్తృతంగా మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నారు. నాణ్యత విషయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అంతర్జాతీయ మార్కెట్‌లో వీటిని విక్రయించేందుకు 'కోయర్ ఫెడ్' ఇప్పటికే పలు ప్రణాళికలను సిద్ధం చేసింది.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
సోమవారం
11, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

సుమహత్పద్మ భవాండ పంక్తుల లయ క్షోభప్రతాపంబుతో
నిమిషార్ధంబున గ్రాంచి పెంపెనగు నీ నేత్రానల జ్యోతి య
య్యమ మీనాంక జలంధర త్రిపుర దైత్యాలిన్ విజృంభించి భ
స్మముగా జేయుట నిశ్చయింద నిది దాశౌర్యంబె సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా అరనిమేష మాత్రసమయంలో గొప్ప వైన బ్రహ్మాండాల నన్నింటినీ ప్రళయ కాలపు అల్లకల్లోలంతోనూ, శౌర్యం తోనూ కాచి వృద్ధి పొందే నీ కంటి మంటి వెలుగు యముడు, మన్మథుడు, జలంధరుడు, త్రిపురాసురులను విజృంభించి బూడిద చేయడం అది కచ్చితంగా నీ శౌర్యమే.

ఈ పద్యంలోని యమమీనాంకులు దేవతలు కాగా తక్కిన ఇద్దరు జలంధర త్రిపురులు అసురులు జలంధరుడు శివునితోను యుద్ధంచేసినవాడు. అర్జునుని లాగా ప్రచ్ఛన్న రూపంలో ఉన్న శివునితో కాకుండా శివునితో ప్రత్యక్షంగానే యుద్ధం చేసినవాడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

10 **శ్రీ లత**

వసంత వైపు నుంచి మొహం విసురుగా తిప్పుకుని ఎడం మోచేయి కళ్ళమీద పెట్టుకుంది. మోచేయి కిందనుంచీ ధారాపాతంగా కన్నీళ్ళురా సాగాయి. శబ్దం లేకుండా వచ్చే ఆ కన్నీళ్ళను కాసేపు చూసి...

''జీవనా! వాస్తవంలోకి రామ్మా! జరిగింది ఏమిటీ? ఎందుకు? అనేవి నాకు తెలియకుండా జరగడాన నీకు నేను ఉపయోగపడలేకపోయాను. జరగబోయే వాటితోనయినా నా ప్రమేయం నీ జీవితానికి ఉపయోగపడవచ్చు. అందుకే కొన్ని నిర్ణయాలు నాకు వదిలేయ్ జీవనా'' అంది మెత్తగా చెవి దగ్గరగా జరిగి. వసంతకు సమాధానం చెప్పడానికి ఇష్టంలేక విసురుగా అటువైపు తిరిగి పడకుంది. ఆ విసురుకు సెలైన్ పైప్ ఊడింది. ఆ పైప్ మళ్ళీ పెట్టాలని ప్రయత్నిస్తూ ''వీక్‌గా ఉన్నావు, ఇలాంటప్పుడు టెన్షన్ పడకూడదు, నా మాట వినవూ'' అని బుజ్జగించబోయింది.

''నా కొద్దు'' అని పైప్ విసిరేసి అటువైపు తిరగబోయి నడుంలో కలుక్కుమనడంతో ''అమ్మా'' అని అటు తిరిగి పడుకుంది.

''వసంత అర్థం చేసుకున్నట్లుగా చూసింది. అప్పుడే లోపలికి వచ్చిన నర్స్‌తో ''సెలైన్ ట్యూబ్ పోయిందమ్మా కాస్త సరి చేస్తారా?'' అనడిగింది మెత్తగా.

''ఏవిటండీ మీరిలా తీసేస్తే ఎలా?'' అంటూ సెలైన్ పెడుతూంటే...

''తను తీసేయలేదు అదే జారిపోయింది'' అంటూ సమర్థించింది.

నర్స్ వెళ్లాక అమ్మ వైపు తలైనా తిప్పకుండా, అటే పడుకుని మెల్లగా తనకు తెలియకుండా నిద్రలోకి జారుకుంది జీవన. తలదగ్గర నుంచి లేచి వచ్చి కాళ్ళ దగ్గర కూర్చుని అరికాళ్ళు అరచేతులతో రబ్ చస్తూ కూర్చుంది వసంత.

మళ్లీ అరగంట కాకముందే ఉలిక్కిపడి లేచి

''అమ్మా! పాప ఏడుస్తుందేమో'' అంది జీవన.

''లేదు ఏడవదు పాపను బాగా చూసుకుంటారు వాళ్ళు'' అంటూ తల నిమిరింది. బాందూ మేళం వాయిస్తుంటే ముడుచుకుపోయినట్లుగా అయిపోసాగింది జీవన మొహం.

గుండెల్లో ఏదో మెత్తని అలికిడి. మెత్తని గుండెల గట్టిపడి బరువెక్కుతున్న భావన. ఆ బరువును మోయలేక మెడ నరాలు తెగిపోతాయేమో అనిపించి తల వెనక్కి విరిచింది. దిండు మీద అటూ ఇటూ కదిల్చింది అనీజీగా. అమ్మ తల నిమురబోయింది.

అమ్మ చెయ్యి తోసేసి...

''అమ్మా నాకెందుకో పాపను చూడాలనిపిస్తుంది'' అంది.

''ఎందుకు?'' మెత్తగానే అడిగింది వసంత.

''అప్పటికే బరువెనక్కిన గుండెలు సలపడం మొదలెట్టాయి. ప్రెజర్‌ను అదిమిపెట్టినట్లు ఒకటే ఒత్తిడి. ఏదైనా విస్ఫోటనం జరిగే ముందు లోలోపల శక్తులు తెచ్చే ఒత్తిడి. ఆ శక్తికి జీవన కళ్ళు బాధతో బరువెక్కాయి. తలబద్దలైపోబోయే ముందు నిశ్శబ్దం. గుండెలు విచ్చుకునేముందు ఫెటిల్లుమంటాయేమో అనిపించేంత బాధ. నీ నివారణ ఎలా... ఎలా.. ఎలా'' జీవనకు అర్థంగాక అనీజీ అయిపోసాగింది. ఆ అనీజీలో పాప చిన్ని చిన్ని లేలేత పెదవులు గుర్తొచ్చాయి. బిగించిన పిడికిళ్ళ తాకిడికి గుర్తొచ్చింది. ఆ పెదవులు తన గుండెల్ని తడుముతూ ఆ గుప్పెళ్ళు హృదయాన్ని మోదుతూ ఆ బాధను మరింత ఎక్కువ చేసి...

''అమ్మా...' అని అనకముందే ఉప్పెనా పాలు గుండెల్లోంచి పొర్లుకొచ్చి ఎదనంతా చిత్తడి చేస్తూ తడుపుతూ, తడుపుతూ తమతోపాటు బాధనూ రిలీజ్ చేస్తూ జారసాగాయి.

''అమ్మా పాపకు పాలివ్వాలని.. ఉంది'' అంది జీవన వసంత అర చెయ్యిని గట్టిగా పట్టుకుని.

''పాప ఇక్కడ లేదు కదమ్మా'' అంది వసంత అనునయంగా. డాక్టర్ టాబ్‌లెట్స్ వాడమన్నారు పాలబాధ లేకుండా'' అంది.

''వద్దు! అమ్మా పాపకు పాలిచ్చేటపుడు చాలా ఆనందంగా ఉంటుంది కదూ'' అడిగింది వసంత బేలగా.

''అవును'' అంది వసంత.

''ఏ ప్రపంచంలో ఉన్నామో కూడా తెలీదు కదూ'' అని అడిగింది వసంతను.

''అవును'' అంది మళ్ళీ వసంత.

ఫ్రాయిడ్ తల్లీ కొడుకులు మధ్య ఉండే ఆనందం ఇదే అన్నాడా, దాన్ని మనం లైంగికానందంగా అర్థం చేసుకున్నామా? లైంగికమో అలైంగికమో, ఆనందం, స్పందన, సుఖం మాత్రం తప్పకుండా ఉంటాయి పాలిచ్చేటప్పుడు తల్లికీ బిడ్డకీ మధ్య. ఈ ఆనందమే భర్తమీద నుండి ఆడవాళ్ళకు బిడ్డమీదకూ, తల్లిమీద నుండి మగవాళ్ళకు భార్య మీదకూ అనురాగమై ప్రవాహం చెందుతుందేమో.

''అమ్మా నాకు.. నాకు పాప కావాలమ్మా. ప్లీజ్ పాపను తీసుకురామ్మా. ప్లీజ్... ప్లీజ్...'' అంటూ గడ్డం పట్టుకుంది. వసంత కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఏం చెప్పాలో అర్థంగాక గొంతు పూడుకుపోయింది. ఏదయినా చెబ్దామంటే అసలు మాటలు కూడా మరిచిపోయి కూతురి తలను గుండెలకు హత్తుకుని తనూ చిన్న పిల్లలా ఏడ్చేయడం మొదలెట్టింది. అమ్మ ఏడుపుతో తన గుండెల్లోనే గడ్డకట్టిన దుఃఖం కరిగి అమ్మతో గొంతు కలిపింది.

''ఎందుకు? ఎందుకు నాచురాలిటీని మనిషి అంత గాఢంగా అణిచివేసుకుంటాడు. దానికి సంస్కారమనీ, సంస్కృతీ, సంప్రదాయం, మర్యాద. గౌరవం అనీ పేర్లు పెట్టుకుని సెల్ఫ్ శాటిస్‌ఫాక్షన్ పొందుతుంటాడు.

ప్రతిదానికోసం కారణం చెబుతూ వాదనలో గెలుస్తూ సాగుతూ.. సాగుతూ... అంతమవుతూ అమ్మలోంచి వచ్చి అమ్మలోకి వెళ్ళలేక అసహాయంగా చితిమంటలలో తనూ తన ఆలోచనలూ, ఆశయాల్లో పేలాల్లా పేలిపోతుంటే నిరాశగా నివురు కప్పుకుంటూ నిశ్శబ్దమయిపోతూ...

అంతేకానీ ఎంత అనుభవమొచ్చినా ఈ మొండి మానవ జన్మ మనసును మాత్రం పెంచుకోదు! అని తెలిసిన జీవిత సత్యం వసంతనే ముందుగా ఓడార్చింది. వసంత తేరుకుని జీవన తల పైకెత్తి నుదుటమీద ముద్దు పెట్టుకుని కళ్ళనీళ్ళు తుడిచి కళ్ళల్లోకి చూసింది.

''తీసుకొస్తావా'' అని కళ్ళతో బేలగా అడిగింది.

''కొత్త బట్టలు తీసుకొస్తావా? పిండి వంటలు చేసిపెడతావా? ఆటబొమ్మలు కొనిస్తావా? పూలజడలు అల్లిపెడతావా? కష్టపడయినా సరే నన్ను చదివిస్తావా? మనస్సైన మనిషితో పెళ్ళికి అంగీకరిస్తావా? అనడిగితే తల్లయినా మురిసిపోతూ తలూపుతుంది. బిడ్డ కోరినవి తీర్చడానికి జీవితాన్నే పణంగా పెడుతుంది.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం

141

శ్రీపాద కృష్ణమూర్తి

సీతను అపహరించిన రావణుణ్ణి నేను వెనుక నా వాలరోమాలతో బంధించి సముద్రాలన్నిటా ముంచి, కరుణించి విడిచి పుచ్చాను. నేను ఆతత బలశాలినని, అసమాన పరాక్రముణ్ణి అనీ సుగ్రీవుడు ఎరుగును. నన్ను చంపదలచిన వాడవు నన్ను పిల్చి, నా ఎదుట నిల్చి, ఈ దొసగు నీవల్ల పొసగింది అని మందలించి, చంపలేకపోయినావేమిటి? చలముపట్టి చెట్టు చాటున దాగి వుండి నన్ను తున్మినావు. తలపోసి చూడగా రాజధర్మం ఈ విధంగా వుంటుందా?'' అని వాక్రుచ్చాడు.

రామ వసుదేశుడు వాలి మాటలు ఆకర్ణించాడు. ''వనచరోత్తమా! నువ్వు ఈ కరణి మాటాడరాదు. కపికులంలో జనించావు. కపులతో పెరిగి పెద్దవయావు. చంచలబుద్ధివీ అయినావు. ధర్మశాస్త్ర సూక్ష్మాలు తెలియక నన్ను తప్పుపట్టి, నాపైకి నెపం నెట్టి పలుకుతున్నావు. ఇది ధర్మమార్గం కాదు. నువ్వు అడిగిన ప్రశ్నలకు నేను సముచితంగా ప్రత్యుత్తరాలు ఒసగుతాను. సావధానంగా వినుఅన్న తనకు తమ్ముడైన వాడిని కుమారుడుగా చూడాలని ధర్మవిదులుచెపుతారు. ఓ వాలీ! నువ్వు మేరమీరావు. అపరాధం చెయ్యని నీ తమ్ముణ్ణి కిష్కింధనుంచి వెళ్ళగొట్టావు. కోడలు వరుస అయిన అతని భార్య రుమను చెరపట్టి బల్మితో భోగిస్తున్నావు. కామాంధుడవై కన్ను కానక ఇట్టి పాపకర్మ ఒనరించే వాడు శిక్షార్హుడు కాడా? పామరుడివలె ప్రవర్తించావు.

ఆ విషయం అలాగున వుండనివ్వు. సుగ్రీవుడు నీకు తమ్ముడు. నిక్కమే. మరి అతడు నాకు మిత్రుడు. నా మిత్రుడికి వైరివి అయావు కనుక నాకూ శత్రువవు అయావు. కనుక నిన్ను నేను వధించడం దోషంకాబోదు. నిర్మల హృదయులై వేటాడే వ్యక్తులు ఒకచోట ఉచ్చు పన్ని, మరొక చోట వేటాడుతారు.

మాటున వుండే వేటాడుతారు, జంతువుల్ని. అది నేరం కాదు. పాపం కాదు. అధర్మం కాదు. తరచరుడవైన నిన్ను కూల్చడం ఎగ్గు కాదు. అతులిత బాహాశక్తితో జగతికి పతి అయిన భరతుడి ఆజ్ఞవల్ల అడవులకు ఏతెంచాము. దుర్మార్గులైన రాక్షసుల్ని దుష్టమృగాలను పరిమార్చుతూ వుంటాము. నీ తమ్ముడి భార్యను కైకొన్న పాతకుడివి. కనుక నిన్ను చంపాను. రాజ దండితుడు నారక బాధపొందడు. ఇంక నా అమోఘాస్త్ర నిహతిచేత కిల్బిషం పోయి స్వర్గలోక సుఖం పొందుతావు'' అని వక్కాణించాడు.

రఘురాముడి వాక్కులు వాలి విని, కనులు మూసుకొని, వశం తప్పి కొంత తడవు ఉన్నాడు. అనంతరం తెలివివచ్చి రామ చంద్రుణ్ణి వీక్షించి ఈ చందంగా వచించాడు.

''శ్రీరామా! సద్గుణధామా! రాక్షస విరామా? నా సతి తార నేడు దేవరవారి శౌర్యం తెలిపి, కయ్యానికి పోవలదని వారించింది. కాని నేను దుష్టబుద్ధి పాటించి, విధి ప్రేరేప సమరానికి వచ్చి యిటు పుడమిపై వాలిపోయాను. జడముసై ఏవో దుర్భాషలు పలికాను.

మన్నింప వేడుతున్నాను. తారకోసం నేను చింతించడం లేదు. నా తనయుడైన అంగదుడికోసం పరితపిస్తున్నాను. ఇకపై నా భార్య, నా సుతుడు ఏమయిపోతారో? ఇటువంటి దురవస్థ పాలవుతానని తెలియలేకపోయాను'' అని చెప్పి తర్వాత మూగవాడి పగిది శోకమోహాలు అనే జలధిలోమునిగి మూర్ఛిల్లాడు.

అంత వాలి మరణించిన వార్త అంతఃపురంలో అగ్నిలా వ్యాపించింది. తార మొదలైన వనితలు వాలి నేల కూలిన వార్త వజ్రమై తమ గుండెల నాట శోకిస్తూ పరుగు పరుగున కిష్కింధ వెడలి ఏగుదెంచడం వానరులు కాంచి, వాలి రాముడిచే వసుధపై కూలి అసువులు బాశాడు. అక్కడకి మీరు ఎందుకు వెడతారు? పోయిన ప్రమాదం. ఈ అంగదుడిని పట్టి ఏమి చేయగలరో? దాయవారిని ఎన్నడూ మనమున నమ్మతగదు. ఈ అంగదుడి చేత కపిరాజ్యం ఏలిద్దాము. మతిమంతులైన వానరులు మనకు వున్నారు. అక్కడికి పోవద్దు'' అని వారింప యత్నించారు.

-ఇంకాఉంది

సోమవారం, 11 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ పాడ్యమి ఉ.11.44
నక్షత్రం: శతభిషం రా.04.27
వర్జ్యం: ఉ.11.57 నుండి 01.31 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధన నష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ పనులు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అనారోగ్య బాధలు అధికమవుతాయి. దైవ ప్రార్థనలు చేస్తారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
ఆకస్మిక ధననష్టంపట్ల జాగ్రత్త అవసరం. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.అనుకొన్న పనులు పూర్తవుతాయి.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. దైవ ప్రార్థన చేయాలి.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులచే గౌరవింపబడుదురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆర్థిక చింత యుండదు. శుభవర్తమానం వస్తుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా వుంటారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. తీర్థయాత్రలకువెళ్తారు.

మంచిమాట

మనసు - జ్ఞానము

మనస్సు మిక్కిలి చంచల స్వభావము కలిగినది. సర్వకాల సర్వావస్థలయందును ఏదో ఒక విషయంపై చింతిస్తునే ఉంటుంది. ఒక్క క్షణమైననూ విశ్రాంతిగా యుండదు. ఒక విషయమునుండి మరియొక విషయమునకు అతి త్వరగా మారిపోతుంటుంది. లోకంలో మనోవేగానికి మించిన వేగము మరియొకటి లేదు. ఇటువంటి చంచల స్వభావముగల మనస్సును యథేచ్ఛగా విడిచిన యెడల, ఇంద్రియములకు అధీనమై, కామక్రోధాదులను బలపరచి అహంకార మమకారములను వృద్ధి చేసి, మనలను పాపపు త్రోవల నడిపించి అధోగతి పాలు చేస్తుంది.

మనస్సు మలినమైనచో స్థిరత్వము యుండదు. వాసనాదూషితమైన మనస్సు చంచలత్వమునకు లోనై ఆత్మావలోకనం సిద్ధించదు. మనస్సు చంచల స్వభావమును కల్గియుండుటవలనల స్థిరత్వమును కోల్పోయి వివేచనా శక్తిని, ధారణాశక్తిని కోల్పోయి అంతర్ దృష్టికి విముఖతమగుచున్నది. ఆ కారణంవల్ల మనము సరైన పద్ధతిలో ఆధ్యాత్మిక చింతనను చేయలేము. అందువల్ల మనము మనో నిగ్రహాన్ని బాగా అలవర్చుకోవాలి. సరైన పద్ధతిలో 'మనోనిగ్రహాన్ని' సాధించకల్గితే అదే మనపాలిటి దివ్యశక్తియై, భక్తి, జ్ఞాన, వైరాగ్య భావాలను కల్పించి మనల్ని దివ్యమైన 'ఆత్మజ్ఞాన మార్గము'న పయనించేటట్లు చేసి, శాశ్వతమైన ముక్తిని ప్రసాదింపచేస్తుంది.

''సర్వే మనో నిగ్రహ లక్షణాం తాః'' -వ్యాస భగవానుడు సర్వ వ్యవస్థలయందును, సర్వకాలములయందును 'మనస్సు'ను నిగ్రహించుకొనుట అనే లక్షణము అత్యంత ఉత్తమమైనది అయి వున్నది. ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనకు 'మనస్సు' నిశ్చలంగా ఉండుట అత్యంత అవసరము. మనస్సు స్వాధీనమైన క్షణంలో కలిగే ఫలితం మనిషికి సమగ్ర వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

ప్రతికూల పరిస్థితులలో కూడా అతడు విజయం సాధిస్తాడు. స్వాధీనమైన మానసిక పరిస్థితి ప్రశాంతతకు, ఆ ప్రశాంతత మనశ్శాంతికి దారితీస్తుంది. మనశ్శాంతి ఆనందానికి దారితీస్తుంది. సంతోషంగా ఉండే వ్యక్తి ఇతరులనుకూడా సంతోషపరచగలుగుతాడు. జీవితంలోని బాధల్ని జయించటానికి, ఎదుర్కోవడానికి కావలసిన పూర్తి ధైర్యం, శక్తి కలుగుతుంది. అప్పుడే అతని జీవితంలో ఆనందం, సంస్కృతి, క్రమశిక్షణ వంటి మంచి లక్షణాలు, మానవ సంబంధాలు వెలుగుతాయి.

మనస్సు స్వాధీనమైన మనిషికి అతనిలో దాగి వున్న ఉన్నత, దైవ స్వభావం వంటి మంచి లక్షణాలన్నీ శక్తులుగా బయటికి వస్తాయి. నెమ్మదిగా ఉత్తమ గుణాలతో ఉన్నత స్థితికి ఎదుగుతాడు. మనిషి ఏరంగంలో అభివృద్ధిని సాధించాలన్నా మనస్సును స్వాధీనం చేసుకోవడం అవసరం. సుఖాలు, అధికధనం వంటి కోరికలను వదులుకుంటే తప్ప మనం మనస్సును పూర్తిగా నియంత్రించలేము.

''కామం, క్రోధం మొదలైన ఈ బలమైన మనోవికారాల దృష్టిని ప్రాపంచిక విషయాలమీద ఉంచినంత కాలం అవి మనకు శత్రువులలాగా ప్రవర్తిస్తాయి. అయితే వాటిని భగవంతునివైపు మరల్చినపుడు అవే మనకు గొప్ప స్నేహితులుగా మారి, మనల్ని భగవంతుని వద్దకు చేరుస్తాయి. కోరికలన్నింటినీ ఇదే విధంగా దారి మళ్లించి సరైన త్రోవలో పెట్టాలి. ఈ మనో వికారాలను మట్టుపెట్టలేము కానీ వాటికి మంచితనాన్ని నేర్పించవచ్చునని'' శ్రీ రామకృష్ణులు చెప్పారు.

అందువల్ల ఎల్లపుడు మన హృదయ పీఠమున భగవంతుని స్వరూపమును నిల్పుకుని మంచి మనస్సుతో ధ్యానిస్తూనే వుండవలెను. మౌనవ్రతములో చేసే ధ్యానము నిర్మలమై నిశ్చలమై త్వరితగతిని ఆత్మజ్ఞానమును పొందటానికి దోహదకారి అవుతుంది. ఇందువల్ల బ్రహ్మానందం కలుగుతుంది.

-నల్లా నరసింహమూర్తి

వృతాసురుడు

19

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 12

మాటాట - 11 సమాధానం



మాటాట

ఆధారాలు:

అడ్డం
2. వీర్యగాడు
5. టి. వీ
7. ధర్మ
8. వేగం
9. ఉపకారం
10. చెయ్యి
12. ఆరాటం, ఉత్కంఠ
14. తెర

నిలువు
1. మోక్షేచ్ఛ
3 పఠనము
4. మనిషి ప్రతికించేది ఇదేనట
6. బార్తీగింజలు
7. విలాసం , శృంగారపు కదలిక
10. క్రీడ
11. తల్లి
13. కవిత్రయ మధ్యముడు

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003



తీరు మారని ఈజిప్టు

ముర్సీపై భగభగలు

ఈజిప్టు ప్రజల కలలు కల్లలవుతున్నాయి. ఆదుకుంటాడనుకున్న ముర్సీ గొడ్డలిపెట్టుగా మారడంతో కథ తలకిందులైంది. హోస్నీ ముబారక్ నిరంకుశ పాలననుంచి విముక్తమయ్యామన్న ఆశ కూడా లేకుండా ముర్సీ అంతకుమించిన అహంకారాన్నే ప్రదర్శిస్తున్నాడు. ప్రజా నిరసనను అర్థం చేసుకుని వారిని ఆదరించాల్సింది పోయి మట్టుబెట్టేందుకు సైన్యాన్ని పురమాయిస్తున్నాడు. కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహానికి ఇంతకుమించిన నిదర్శనం కావాలా? ప్రభుత్వ దాడిలో మరణించిన ఓ వ్యక్తి బొమ్మతో ఈజిప్టు ప్రజల అగహావేశానికి ఇది నిలువెత్తు పతాకం!

సడలిన పట్టు

» సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత అగ్రరాజ్యం హోదాను కోల్పోయిన రష్యాకు పూర్వ వైభవాన్ని సంపాదించి పెడతానంటూ అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ చేసిన హామీలు నీరుగారిపోతున్నాయి. అంతర్గత కుమ్ములాటలు పెచ్చరిల్లాయి. అనేకానేక సమస్యలు రష్యాను చుట్టుముట్టి వేధిస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు మార్గదర్శకం చేసిన రష్యా ఇప్పుడు కల్లోల కడలిగా మారింది. పుతిన్‌పై ప్రజలు ఉంచిన నమ్మకం క్రమంగా తెరమరుగవుతున్నది. రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేస్తానని ప్రకటించి, ఒకసారి ప్రధానికి, మరోసారి అధ్యక్షుడికి సర్వ హక్కులను కట్టబెట్టి, ఆ హోదాల్లో తానే తిష్టవేసిన పుతిన్‌ను కొంతమంది అగ్ర నేతల ఎదుగుదల భయపెడుతున్నది. ముఖ్యంగా ప్రధాని డిమిత్రీ మెద్వెదెవ్, ఉప ప్రధాని డిమిత్రీ రొగజిన్‌లకు ప్రజల్లో పెరుగుతున్న మద్దతు పుతిన్‌ను ఆందోళనకు గురి చేస్తున్నది. కొడిగడుతున్న ప్రాభవానికి కొత్త ఊపిరి పోయడానికి, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించి, రష్యాకు తిరుగులేని నేతగా కొనసాగడానికి అవసరమైన అన్ని మార్గాలను పుతిన్ అన్వేషిస్తునే ఉన్నాడు. రాజకీయంగా అతను నిలదొక్కుకుంటాడా? లేక గొర్బచెవ్, బోరిస్ ఎల్సిన్ వంటి అగ్ర నాయకుల మాదిరిగానే క్రమంగా కనుమరుగై నిష్క్రమిస్తాడా అన్నది రానున్న కాలమే తేల్చాలి. అయితే, పుతిన్ మంత్రాంగమో లేక వైరి వర్గం వ్యూహమో తెలీదుగానీ, ప్రధాని మెద్వెదెవ్ అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ సుమారు గంట నిడివిగల ఒక వీడియో టేప్ యూట్యూబ్‌లో దర్శనమిచ్చింది. ఈ యూట్యూబ్ ఖాతా ఉప ప్రధాని రొగజిన్ పేరుమీద ఉండడం రష్యా యావత్తు చర్చనీయాంశమైంది. మెద్వెదెవ్, రొగజిన్‌లను ఒకే దెబ్బతో ఇరుకున పెట్టడానికి పుతిన్ చేసిన ప్రయత్నంగానే చాలా మంది ఈ టేపును అభివర్ణిస్తున్నారు. తనకు యూట్యూబ్ అక్కౌంట్ లేనేలేదని, ఎవరో ఉద్దేశపూర్వకంగా తనను అప్రతిష్టపాల్జేయడానికి ప్రయత్నిస్తున్నారని రొగజిన్ స్పష్టం చేయడం పుతిన్‌పై అనుమానాలు పెరగడానికి కారణమవుతోంది. మెద్వెదెవ్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో నాటో కూటమితో కుమ్మక్కయ్యాడని, అప్పటి లిబియా తిరుగులేని నేత మోమర్ గడాఫీపై దాడులకు సహకరించాడని తేల్చి చెప్పడమే ఆ వీడియో టేపు లక్ష్యం. రష్యా మిలటరీ అధికారులకు మెద్వెదెవ్ ఆదేశాలు జారీ చేయడం నుంచి, వారితో చర్చలు జరపడం, నాటో దళాలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించడం వరకూ అనేకానేక అంశాలను అందులో ఉన్నాయి. మెద్వెదెవ్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది వేసవిలోనూ ఇలాంటి టేపు ఒకటి విడుదలైంది.

2008లో జార్జియాపై రష్యా యుద్ధానికి దిగిన సమయంలో మెద్వెదెవ్ చేపట్టిన చర్యలను ఆ టేపులో వివరించారు. ఒక పథకం ప్రకారమే మెద్వెదెవ్ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం జరుగుతున్నదని, తాజా టేపు ఉద్దేశం కూడా ఇదేనని విశ్లేషకులు అంటున్నారు. మెద్వెదెవ్, రొగొజిన్‌లను ఒకేసారి దెబ్బతీయడానికి తాజా వీడియోను అస్త్రంగా ఉపయోగించారన్న వాదన బలంగా వినిపిస్తున్నది. వీరిపై కుట్ర పూరిత ఆరోపణలు చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది? వారికి ప్రజల్లో ఉన్న మద్దతును దెబ్బతీస్తే ఎవరికి ప్రయోజనం? అనే ప్రశ్నలకు సమాధానాన్ని వెతుక్కుంటే వినిపిస్తున్న ఒకే ఒక పేరు పుతిన్. వ్యూహాత్మకంగా ఇద్దరు మేటి నేతలను అప్రతిష్టపాల్జేసి లాభపడాలని పుతిన్ ప్రయత్నిస్తున్నాడన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పాలనపై పట్టుకోల్పోతున్న పుతిన్ తన ప్రతిష్టను పెంచుకోవడానికి చేసిన ప్రయత్నమే టేపు రూపంలో దర్శనమిచ్చిందని చాలా మంది నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ ఆరోపణలు, విమర్శల్లో నిజానిజాలు ఎలావున్నా, మెద్వెదెవ్, రొగొజిన్‌లకు ఉన్న మంచి పేరును తుడిచిపెడితేనే ప్రజలకు దగ్గరవుతానని పుతిన్ ఆలోచిస్తున్నాడన్న వాదన క్రమంగా బలపడుతున్నది.

ఈ వ్యవహారం ఆ ఇద్దరితోపాటు పుతిన్ ప్రతిష్టను కూడా దిగజార్చే ప్రమాదం లేకపోలేదు. పుతిన్ తాను తీసుకున్న గోతిలో తానే పడతాడా లేక తన కంటే మెరుగైన నాయకుడు రష్యాలో లేడన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగిస్తాడా అన్న ప్రశ్నకు ప్రజా నిర్ణయాలే సమాధానం చెప్తాయి. అప్పటి వరకూ టేపు వ్యవహారం చిదంబర రహస్యంగానే మిలిగిపోతుంది.

- బిఎల్

సిరియాలో గందరగోళం!

» దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ అంపశయ్యపై రోజులు లెక్కిస్తున్న నేపథ్యంలో సిరియా భవిష్యత్తు గందరగోళంగా మారింది. ప్రతిపక్ష నేతలంతా ఒకే చోట చేరి, అసద్ మరణ వార్త కోసం ఎదురుచూస్తున్నారన్నది తిరుగులేని సత్యం. అధ్యక్షుడు మంచం పట్టాడు. ప్రభుత్వం ఉన్నా ఏమీ చేయలేని దుస్థితి. పేరుకు 71 మంది సభ్యులతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం నడుస్తున్నా, అధికారం యావత్తు సైన్యం చేతిలోనే ఉంది. పాలన కుంటుపడింది. నిరుద్యోగం, ఆర్థిక మాంద్య పరిస్థితులు సిరియాను పట్టిపీడిస్తున్నాయి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిరసనలు, ధర్నాలు, దాడులతో సిరియా యుద్ధ భూమిని తలపిస్తోంది. ఆందోళనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు నిత్యకృత్యమయ్యాయి. లిబియా సర్వాధికారి మోమర్ గడాఫీ పతనం తర్వాత అక్కడి పరిస్థితులను చక్కదిద్దడానికి అమెరికా, దాని మిత్ర దేశాలు నడుం బిగించాయి. లిబియా జనాభా ఆరు కోట్లు. లిబియా విస్తీర్ణంలో సిరియా పదో వంతు కూడా ఉండదు. కానీ, జనాభా మాత్రం లిబియాకు కనీసం నాలుగు రెట్లు అధికం. చిన్న భూభాగంలో, మితిమీరిన జనాభా ఉండడం వల్ల తలెత్తే సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ పరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా, ఎంత అభివృద్ధి చేసినా, వాటి ఫలాలు కనిపించే అవకాశాలు లేవు. అభివృద్ధి ఒక అడుగు ముందుకేస్తే, సమస్యలు నాలుగు రెట్లు ముందుకు వెళతాయి. ఆకలి, నిరుద్యోగం ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేస్తాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో, అస్తిత్వం కోసం ఉద్యమ బాట పట్టక తప్పదు. దుర్భర జీవితాన్ని సాగించే

బదులు, వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేయడం వల్ల సమస్యలకు ఎంతోకొంత పరిష్కారమైనా లభిస్తుందన్న నిర్ణయానికి సిరియా ప్రజలు ఎప్పుడో వచ్చేశారు. అసద్ అనారోగ్యం వారి సమస్యలను మరింతగా పెంచింది. పాలన సజావుగా సాగకపోవడంతో, ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. అసద్ మరణిస్తే, తక్షణమే అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష నాయకులు ఎదురుచూస్తున్నారు. ఈ పరిణామాలు సహజంగానే సిరియాలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాయి. అసద్ మళ్లీ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వచ్చి పగ్గాలు చేపట్టే అవకాశాలు దాదాపు లేవు. ఈ నేపథ్యంలో సిరియా మళ్లీ గాడిలో పడడానికి దశాబ్దాలు పట్టినా ఆశ్చర్యం లేదు.

- మైత్రేయి

సిఐఎకు గులాం!

ఉగ్రవాద పోరులో వంతపాడిన 54 దేశాలు

కిడ్నాప్‌లు, వేధింపులు, చిత్రహింసలకు సహకారం

మంటగలిసిన మానవహక్కులు

» కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకార చర్యగా అమెరికా ఉగ్రవాద పోరుకు దిగడం... అల్‌ఖైదా మూలాలను పెకలించేందుకు, లాడెన్‌ను అంతమొందించేందుకు పలు దేశాల్లో ఏళ్ల తరబడి పాగా వేయడం... పదేళ్ల అనంతరం పాకిస్తాన్‌లో లాడెన్‌ను అత్యంత రహస్యంగా జరిగిన ఆపరేషన్‌లో అంతమొందించడం... ఇదీ ప్రపంచానికి తెలిసిన నిజం. అయితే ఉగ్రవాద పోరు పేరుతో జరిగిన చర్యల్లో ప్రపంచానికి తెలియని మరెన్నో రహస్యాలు ఇటీవల వెలుగుచూశాయి. అల్‌ఖైదాను సమూలంగా మట్టుబెట్టేందుకు అమెరికా నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫ్ అమెరికా (సిఐఎ) ప్రపంచాన్ని జల్లెడ పట్టింది. విస్తృత స్థాయిలో, అనూహ్య రీతిలో ఆయా దేశాల్లోకి చొరబడిన సిఐఎకు అనేక దేశాలు సలాం చేశాయి. తమ భూభాగాన్నీ, గగనతలాన్నీ స్వేచ్ఛగా వాడుకోనిచ్చాయి. తమ పౌరుల రహస్య విచారణకు అనుమతినిచ్చాయి. అనుమానం వచ్చిన ఏ ఒక్కరినీ సిఐఎ వదిలిపెట్టలేదు. ఏ దేశమైనా, ఏ జాతీయుడైనా సరే - నిర్బంధంలోకి తీసుకోవడమో, అవసరమనిపిస్తే కిడ్నాప్ చేయడమో చేసింది. వారినుంచి నిజాల్ని రాబట్టేందుకు చేయాల్సిన పనులన్నీ చేసింది. అత్యంత కీలకమైన, ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే - సిఐఎకు ఆయా దేశాలు రహస్యంగా మద్దతు పలకడం. వాస్తవాలు తెలుసుకునే క్రమంలో, ఉగ్రవాద మూలాలు పెకలించే ఊపులో ఉన్న సిఐఎ - కొంతమంది అమాయకులనూ నిర్బంధించింది. చిత్రహింసలకూ గురిచేసింది. ఆయా దేశాల్లో, ఆయా పాలకుల మద్దతుతో మానవ హక్కులు యథేచ్ఛగా ఉల్లంఘనకు గురికావడమే ఉగ్రవాద పోరు వెనుకనున్న చీకటి కోణం. అయినా ఆయా దేశాలు కిమ్మనకపోవడం తాజాగా వెలుగుచూసిన నిజం. ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రపంచవ్యాప్తంగా 54 దేశాలు సిఐఎకు గులాములయ్యాయి.

ఓపెన్ సొసైటీ జస్టిస్ ఇనిషియేటివ్ (ఓఎస్‌జెఐ). న్యూయార్క్‌కు చెందిన మానవ హక్కుల సంస్థ. అమెరికాపై ఉగ్రవాద దాడి అనంతరం సిఐఎ చేపట్టిన రహస్య కార్యకలాపాలు, ఏయే దేశాలు రహస్యంగా మద్దతు పలికిందీ, ఈ మొత్తం వ్యవహారంలో మానవ హక్కులు ఎలా మంటగలిసిపోయాయో బట్టబయలు చేసింది. 'గ్లోబలైజింగ్ టార్చర్' పేరుతో విడుదల చేసిన 213 పేజీల నివేదిక సిఐఎ చర్యల్లోని చీకటి కోణాన్ని ప్రపంచానికి చాటి సంచలనానికి తెరలేపింది. సిఐఎ డైరెక్టర్‌గా జాన్ బ్రెన్నన్‌ను నియమించేందుకు అధ్యక్షుడు ఒబామా మొగ్గుచూపుతున్న సమయంలో ఈ నివేదిక వెలుగుచూడటం విశేషం.

మానవ హక్కుల ఉల్లంఘనకు అప్పటి అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ యంత్రాంగంలోని ఉన్నతాధికారులు కూడా బాధ్యులేనని ఓఎస్‌జెఐ నిర్ధయంగా బయటపెట్టింది. అంతే కాదు, ఉగ్రవాద అంతం పేరుతో సామాన్యులను నిర్బంధించి చిత్రహింసలపాలు చేసినందుకు ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఆయా ప్రభుత్వాల పూర్తి సహకారం లేనిదే సిఐఎ అంత లోతుగా చొచ్చుకు పోలేదన్నది ఓఎస్‌జెఐ వాదన. సిఐఎ చర్యలవల్ల తమ తమ దేశాల్లో భారీ స్థాయిలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘన నేరం నుంచి ఆయా ప్రభుత్వాలు తప్పించుకోలేవని స్పష్టం చేసింది.

సిఐఎకు అత్యంత రహస్యంగా సహకరించి, గులాములైన దేశాల్లో ముఖ్యంగా పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్, ఈజిప్టు, జోర్డాన్ దేశాలున్నాయని ఓఎస్‌జెఐ బయటపెట్టింది. ఆయా దేశాల్లో ఉన్న రహస్య జైళ్లలో ఏళ్ల తరబడి 'అనుమానిత' వ్యక్తులను సిఐఎ నిర్బంధించి తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసిందని నివేదికలో పేర్కొంది. ఓఎస్‌జెఐ బయటపెట్టిన జాబితాలో ఉన్న ఐర్లాండ్, ఐస్‌లాండ్, సైప్రస్ వంటి దేశాలు తమ గగనతలాన్ని, ఎయిర్‌పోర్టులను ఎప్పుడుపడితే అప్పుడు వినియోగించేందుకు అనుమతినిచ్చి సిఐఎకు పూర్తిస్థాయి మద్దతు పలికాయి. మరో దేశం కెనడా 'కోవర్ట్' మద్దతులో మరో అడుగు ముందుకేసింది. గగనతలాన్ని వాడుకునేందుకు అనుమతినివ్వడంతోపాటు తమ జాతీయుడ్ని సిరియా తీసుకువెళ్లి విచారించేందుకు ఏమాత్రం అడ్డుచెప్పలేదు. అక్కడ అతడ్ని ఏడాదిపాటు నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేశారని ఓఎస్‌జెఐ బయటపెట్టింది. అనుమానితులను అత్యంత రహస్యంగా విచారించే దేశాల్లో సిరియా ఒకటని తేల్చింది. 15మంది స్వదేశీయులను కాబూల్ తీసుకువెళ్లి విచారించేందుకు అనుమతినిచ్చి ఇరాన్ కూడా సిఐఎ చర్యలకు వంతపాడింది. తాలిబన్ల అంతం పేరుతో అఫ్గాన్‌లో అమెరికా దళాలు అడుగుపెట్టిన అనంతరం జరిగిన ఈ చర్యతో తాము అమెరికా గుప్పిట్లో చిక్కుకుంటున్నామన్న విషయాన్ని ఇరాన్ గ్రహించిందని నివేదికలో పేర్కొన్నారు. సిఐఎ చర్యలకు కొన్ని దేశాలు ఏమాత్రం వంతపాడలేదనే విషయం కూడా ఓఎస్‌జెఐ పరిశోధనలో వెల్లడైంది. స్వీడన్, ఫిన్లాండ్ దేశాలు సిఐఎ చర్యల్లో పాలుపంచుకుంటే, నార్వే పాత్రపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. అలాగే మధ్యతూర్పు దేశాల్లో చాలామటుకు సిఐఎకు మద్దతు తెలిపితే, ఇజ్రాయెల్ పాత్ర లేకపోవడం విశేషం. ఓఎస్‌జెఐ బయటపెట్టిన దేశాల జాబితాలో చాలామటుకు యూరోపియన్ దేశాలే ఉన్నాయి. వీటిల్లో ముఖ్యంగా జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా వంటివి జాబితాలో చోటుచేసుకోగా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, హంగేరీ దేశాలు సిఐఎ చర్యలకు వంతపాడిన దాఖలాలు కనిపించలేదు. సిఐఎకు జార్జియా తన వంతు మద్దతు పలికితే, రష్యా పాత్ర లేదని తేల్చింది. పోలాండ్, లిథువేనియా, రొమేనియా వంటి దేశాలు తమ భూభాగంలో ఏకంగా రహస్య జైళ్లనే ఏర్పాటుచేశాయి. బ్రిటన్ అయితే సిఐఎ అడుగులకు మడుగులొత్తింది. ఒక వ్యక్తి కుటుంబం మొత్తాన్ని విచారణ జరిపేందుకు పూర్తిగా సహకరించింది. కుటుంబ సభ్యులతో సహా సమీ అల్-సాదీ అనే వ్యక్తిని సిఐఎ లిబియా తీసుకెళ్లి అక్కడ చిత్రహింసలకు గురిచేసింది.

ఉగ్రవాద పోరులో చోటుచేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి అటు అమెరికా, సిఐఎకు సహకరించిన దేశాలు రహస్యాలను తొక్కిపెట్టినా, ఏదో ఒక రూపంలో అవి బయటపడుతూనే ఉన్నాయని ఓఎస్‌జెఐ వెల్లడించింది. రహస్య నిర్బంధానికి గురైన బాధితుల గోడు వినేందుకు అమెరికా కోర్టుల ద్వారాలు మూసివేసినా, ప్రపంచవ్యాప్తంగా వీటికి సంబంధించిన కేసులను ఆయా దేశాల్లోని కోర్టులు విచారణ జరుపుతున్నాయని పేర్కొంది. అమెరికా ఆదేశాలతో సిఐఎ చేపట్టిన రహస్య చర్యలకు చరమగీతం పాడాలని, ఇప్పటికీ కొనసాగుతున్న రహస్య జైళ్లను మూసివేయాలని, తీవ్రస్థాయిలో చోటుచేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘనపై క్రిమినల్ విచారణ చేపట్టాలని ఓఎస్‌జెఐ అమెరికాను డిమాండ్ చేసింది. వీటిపై విచారణకు స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని కూడా డిమాండ్ చేసింది. వేధింపులకు పాల్పడిన ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులను విచారించి బయటపెట్టాలని సూచించింది. అలాగే రహస్య విచారణకు అమెరికాయేతర ప్రభుత్వాలు చరమగీతం పాడాలని పేర్కొంది. అలాగే భవిష్యత్తులో జరగబోయే ఉగ్రవాద నిరోధక చర్యల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందని ఓఎస్‌జెఐ పేర్కొంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా ఆ దేశానికే కాదు, యావత్ ప్రపంచానికే ప్రమాదం. ఉగ్రవాద మూలాలను సమూలంగా పెకలించాల్సిన బాధ్యత ప్రతి దేశంపైనా ఉంది. అమెరికాపై దాడి అనంతరం ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందేనని ప్రతి దేశమూ శపథం చేసిన విషయం విదితమే. అయితే ఉగ్రవాదుల ఏరివేత పేరుతో సామాన్య పౌరులను చిత్రహింసలకు గురిచేసి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడటమే 'ఉగ్రవాద పోరు' మిగిల్చిన విషాదం.

- మోహన్

అమెరికా రహస్య విచారణకు నిదర్శనాలివి. అనేక దేశాల్లో ఏర్పాటుచేసుకున్న వైమానిక స్థావరాలు. విచారణలో భాగంగా వినియోగించిన ఇనుప సంకెళ్ల ఆనవాళ్లు.

అవును నిజమే..!

బిల్ లాడెన్‌ను పట్టుకోవడానికి అనేక దేశాలపై ఒత్తిడి తేవడంతోపాటు అఫ్గాన్, పాకిస్తాన్‌లో అనేకమందిని అత్యంత దారుణంగా, హేయమైన పద్ధతుల్లో 'విచారించిన' మాట నిజమేనన్న విషయాన్ని అమెరికా రక్షణమంత్రిగా పదవీ బాధ్యతలు విరమించనున్న జాన్ పెనట్టా అంగీకరించారు. 'డార్క్ జీరో థర్టీ' సినిమా ప్రివ్యూ సందర్భంగా మాట్లాడిన పెనట్టా ఈ సినిమాలో చూపించినంతగా కాకపోయినా మొత్తంమీద లాడెన్ ఆచూకీ తెలుసుకునేందుకు అనేకమందిని చిత్రహింసలు పెట్టిన మాట వాస్తవమేనని అంగీకరించడం సంచలనాన్ని రేకెత్తించింది. అంతకుముందే మొత్తం 54 దేశాలపై పెత్తనం చెలాయిస్తూ వారిని తన దారికి తెచ్చుకునేందుకు అమెరికా పన్నిన కుయుక్తుల కథనాల నేపథ్యంలో ఈ వాస్తవాలు అగ్రరాజ్య ఆధిపత్య ధోరణికి అద్దం పడుతున్నాయి.

లిఫ్ట్

నాముందు మోకరిల్లి
పైకి చేరాలనో
కిందికి పోవాలనో
ఎవరో ఒకరి
ఎదురుచూపులే

తయారై వచ్చాక
ఎవరికి వారు నమ్మకంతో
నాకు బంధీలవుతారు

ఎలా కావాలంటే అలా చేరుస్తున్నా
ఎప్పుడో ఎక్కడో ఆగిపోయాక
సరిహద్దుల్లో ఉండని సహనం

ఎవరు నానుండి విడిపిస్తారో
ఎప్పుడు బయటపడతారో
ఎవరి ప్రయత్నాలు ఏపాటివో
బయటపడ్డాక
నిర్జీవమైన మొహాలు
నిర్లిప్తమైన గుంపులో కలిసిపోతాయి వెంటనే

విలువ తెలిసేదల్లా
ప్రాణం పోయాకనే
అందరి ప్రార్థనలూ అప్పుడు
వెంటనే జీవం లేచి రావాలనే.

- ముకుంద రామారావు, 9908347273

శక్తివంతమైన కవిత్వం...

రచయిత పరివర్తనతోనే సాధ్యం

తెలుగు సాహిత్యం, ఆధునికత్వం, నవ్యత్వం అనే దశల్లో వృద్ధి చెందింది. అది పురాణ ఇతిహాస సాహిత్యం, ప్రబంధ సాహిత్యం, దేశి సాహిత్యం, ఆధునిక (ప్రగతి) సాహిత్యం అనే రూపాల్లో వెలువడింది. కవిత్వ రీతుల్లో దాన్ని ప్రబంధ కవిత్వం, ఆధునిక కవిత్వం, నవ్య కవిత్వం, నవ్య సంప్రదాయ కవిత్వం, సమకాలిక కవిత్వం అంటున్నాం. ప్రాచీన క్లాసిక్ తత్వంతో కూడిన ఆధునిక రచనను నవ్యసంప్రదాయక కవిత్వం అన్నారు.

ఆధునికంగా భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, నవ్య సంప్రదాయ కవిత్వం, సమకాలిక కవిత్వం బడుగువర్గ కవిత్వం వచ్చాయి. అభ్యుదయ కవిత్వంలో తీవ్ర రూపం దాల్చినది నగ్న కవిత్వం. ఇంకా జాతీయ పునరుజ్జీవన, దేశభక్తి, రాష్ట్ర భక్తి, సంఘ సంస్కరణ ప్రాతిపదికన కొంత కవిత్వం వెలువడింది.

సమకాలం అంటే అస్తిత్వ ఉద్యమాల కాలం. దానిని 1990 నుంచి గణుతించారు. ఆ కాలంలో సరికొత్త సాహిత్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అవి అభ్యుదక కవిత్వానికి కాస్త భిన్నంగా ఉన్నాయి. అవి ఏవనగా దళితవాద, స్త్రీవాద, మైనారిటీవాద, ప్రాంతీయవాద కవిత్వాలు. ఇవి అసమానతలను తొలగించడానికి ఏర్పడ్డ వివిధ కవిత్వ ధోరణులు. అవి వాస్తవికతను, నగ్నతను, తీవ్రమైన తిరుగుబాటును వెలిబుచ్చాయి.

ఆయా కవిత్వాలు మానవాళికి కొంత మేలు చేశాయి. ఆనందం కల్గించాయి; వినోదం ఇచ్చాయి. కాని సామాజిక మార్పు కలగలేదు. దానికి నిదర్శనం ఈనాటి సంక్షోభం, అనిశ్చిత, అభద్రతా భావం, ఆందోళన, ధనదాహం, పోటీతత్వం, పరుగులు ఉరుకులు, వల్లమాలిన వినోదాలు. కొంత మానసిక వికాసం కనిపించినా, అది మానసిక ఉల్లాస స్థాయిలో ఆగిపోతోంది.

అందుచేత సంపూర్ణ మానసిక వికాసాన్ని కల్గించే కవిత్వం వెలువడాలి. మనిషిలో, మనసులో మార్పు తీసికొని రావాలి. ఆలోచింపజేయడంతో ఆగిపోకుండా, అనుదిన జీవితంలో ప్రకాశించాలి. వినోదం, ఉల్లాసం, ఆత్మతృప్తిని మించి మెదడు కణాల్లో మార్పును తేవాలి. కవిత్వంలో ప్రేమ- కళ- చైతన్యం- వాదం- విప్లవం అనే బలీయమైన అంశాలను సమన్వయపరిచే శక్తి మార్పు కవిత్వానికి ఉండాలి. గ్రూపు కవిత్వాలు, విభేద కవిత్వాలు గాక పరివర్తనా కవిత్వం వెలువడాలి. రచయిత పరివర్తన చెందాలి, పాఠకుని పరివర్తింపజేయాలి. ఆ ప్రభావం సమాజంమీద పడాలి. అంత శక్తివంతంగా ఉండాలి. ఒక సినిమా పాట ప్రభావం శ్రామికుని వరకు జాలువారినట్లు మార్పు కవిత్వం సమాజాన్ని ప్రభావితం చేయాలి, పరివర్తన కల్గించేదిగా విశుద్ధి చెందాలి.

వస్తు, రూప, ప్రక్రియ నిర్ణయంలో కవికి పూర్తి స్వేచ్ఛ వుందని వేరే చెప్పనవసరం లేదు. అయితే కవిత కల్గించే ప్రభావం మున్ముందుగా దృగ్గోచరమై ఉండాలి. మార్పు కవిత్వపు స్వభావం రూపురేఖలు ఇప్పుడే నిర్ధారించలేము. దీనికి తాత్విక పునాది అవసరం. సృజనత్వం గల తత్వదర్శకుడు కొన్ని కవితలు వెలువరించిన మీదట, స్పందన తెలిసిన మీదట, విమర్శలు సాక్షాత్కరించిన మీదట దాని హృదయం, ఆకృతి నిశ్చయాత్మక స్థితిని చేరుకోగలవు. కాకపోతే మార్పు కవితా గుణ లక్షణాలలో కొన్ని చేర్పుల గూర్చి చర్చించుకోవచ్చు.

మనిషిలో, మనసులో మార్పు తీసుకొచ్చేలా సంపూర్ణ మానసిక వికాసాన్ని కల్గించే కవిత్వం వెలువడాలి. ఆలోచింపజేయడంతో ఆగిపోకుండా, అనుదిన జీవితంలో ప్రకాశించాలి. వినోదం, ఉల్లాసం, ఆత్మతృప్తిని మించి మెదడు కణాల్లో మార్పును తేవాలి. కవిత్వంలో ప్రేమ - కళ - చైతన్యం - వాదం - విప్లవం అనే బలీయమైన అంశాలను సమన్వయపరిచే శక్తి మార్పు కవిత్వానికి ఉండాలి. గ్రూపు కవిత్వాలు, విభేద కవిత్వాలు గాక పరివర్తనా కవిత్వం వెలువడాలి. రచయిత పరివర్తన చెందాలి, పాఠకుని పరివర్తింపజేయాలి. ఆ ప్రభావం సమాజంమీద పడాలి. అంత శక్తివంతంగా ఉండాలి.

కవిత్వానికి ప్రధాన లక్షణాలైన వస్తుభావ రూపాలకు అదనంగా ప్రవర్తనాశీలత అనే అంశాన్ని చేర్చుకోవచ్చు. ఆరాధన, ప్రణయం, ప్రీతి, ప్రియత్వం, స్వేచ్ఛ, స్మృతి, ఆత్మాశ్రయత, మృదు పదభంగిమ, ఆంతరంగిక ఆసక్తి మున్నగునవి హృదయ కుహరంలో సావధానత చెందాలి, వాటి సమ్యక్‌రూప సాంద్రత కవిత్వంలో ప్రతిఫలించాలి. మార్క్సిస్టు సాహిత్య విమర్శనాదృష్టి ఆర్థిక సమత్వం, కమ్యూన్ నిర్మాణానికి ముందు చేకూరాలన్నది. ఆ క్రమంలో పరివర్తనాశీలతను జోడించాల్సి వుంది.

అస్తిత్వం సచేతన చైతన్యం కోరుతోంది. సచేతన చైతన్యం సమగ్ర సామాజిక చైతన్యం కావడానికి పరివర్తనా కవిత్వ పుటుషోదయ అరుణ కిరణాలు ప్రసరించాలి. అభ్యుదయ కవిత్వ దర్శనంలో సామాజికాంశం బలంగా ప్రతిబింబించింది. అది మార్పు అంచులను తాకింది. ఆ ప్రతిబింబం వినూత్న కవిత్వంతో రసాయనీకరణ చెంది మెదడు కణాలను మార్చాలి. 'ప్రాహ్లాద కవిత్వం' ఆహ్లాదంగా ముందడుగు వేసింది. దానికి పాత గంధపు వాసన లేకుంటే పరివర్తన శక్తిని సంతరించుకోగలదు. రసాత్మకత, రమణీయార్థ ప్రతిపాదిత కావ్య ప్రధాన లక్షణాలు నేటి పరిస్థితులలో దానికి పరివర్తనాశీలత చేర్చడం అవసరం. అపుడు శబ్దం, రసం, రమణీయత, పరివర్తన కావ్యయుక్త లక్షణాలు కాగలవు. కావ్యం మార్పు తెచ్చేది, ప్రవర్తన చేకూర్చేది, ఆంతరంగిక విప్లవం కలిగించేది, మనస్తత్వం మార్చేది, మహోన్నతమైంది కాగలదు.

మానసిక పరివర్తనవల్ల అహంభావంపాలు తరుగుతుంది. ఉద్రేకాల విజృంభణ తగ్గుతుంది, కుల భావన సన్నగిల్లుతుంది, మతం మత్తు వదులుతుంది, వివేకం ఉదయిస్తుంది.

''కళాసృష్టి పారమార్థిక సత్యంకాదు. ఇది ప్రతిబింబానికి ప్రతిబింబం. కళాసృష్టి కూడా ప్రయోజనకారి. అంటే మానవుని పరమార్థ సిద్ధికి వినియోగపడాలి. అందుకు తప్ప ఇది తనకు తాను పరమార్థంకాదు. కాబట్టి సాహిత్యాదికం పరమార్థ బోధకంగా ఉండాలి కాని తానే పరమార్థమైనట్లుగా తనయందే సర్వం లీనమై పోయేటట్లు ఉండకూడదు. అంటే ధర్మోపదేశం కావాలి'' 'జేగంటలు' లో జి.వి.కృష్ణారావు పలుకులివి. కళ ధర్మాచరణకు, శీల నిర్మాణానికి ప్రేరణనివ్వాలి.

అనుకరణం, ధర్మ ప్రతిపాదన, రామణీయకత ప్లాటో సాహిత్య విమర్శలో ప్రముఖాంశాలు. సహృదయునికంటే రమణీయకతత్వ విచారపరుడు ఉత్తమోత్తముడు.

ఇలా పరివర్తనా కవిత్వపు అత్యవసరత ద్యోతకమవుతోంది.

''ఇతర మార్గాలన్నింటినీ తిరస్కరించినపుడే నీ సొంత మార్గాన్ని కనుక్కోగలవు.''

''చచ్చిన గతంతో ఉన్నంతకాలం భవిష్యత్తు లేదు.''

''నిజమైన గురువు ఎవరైనా ఉంటే అతడు మిమ్ములి తనసుండి విముక్తుల్ని చేస్తాడు.''

''వెళ్లిపోయాక తనవెనుక గంపెడు గందరగోళం వదిలినవాడే ప్రవక్త'' అని 'యుజి' చెప్పగా రాజశేఖర్ రాశాడు.

ఇవి భాగాలుగా, చమత్కారయుక్తంగా ఉన్నా ఆంతరంగిక మార్పును సూచిస్తున్నాయి.

మనసు మిథ్య, మనసు ప్రమాదకారి, మనసు నిర్మాణాత్మకమైంది, మనసు గతానుభవయుతం అనే పార్శ్వభాగాలు కళాకారుని అవగాహనలో ఉండవలసినవి.

- జల్లి శ్రీరఘుపతిరావు, 9441634533

రంగులెపుడు...

రంగులెపుడు తొలిసారి పరిచయమయ్యాయో జ్ఞాపకముందా
చిననాటి బొమ్మలమీదనో, మేఘాల మీదనో, అమ్మ చీరల మీదనో, పూల మీదనో
రంగులెలా తొలిసారి ఆశ్చర్యపరిచాయో నిద్రాణంగానైనా కలలు మిగిలాయా

పసుపూ, ఎరుపూ, నీలం, వాటితో తెలుపూ, నలుపుల వేల ఆటలు
ఒక్కో పేరుతో అలవాటుపడిపోవటానికి ముందు
ఏ రహస్యలోకాల సందడి చేసాయో కాస్తయినా సజీవంగా వినిపిస్తున్నాయా

అపుడపుడూ విస్మయపరుస్తూనే ఉన్నాయి రంగులు నన్ను
వ్యాకులతలూ, తడబాట్లూ, భయాలూ చీకటిలోకి విసిరినప్పుడు
బాల్య స్నేహితుల్లా సేదదీరుస్తూనే ఉన్నాయి
సఖుడా, ఆగిపోవటం మృత్యువు, ప్రవాహమే జీవితమని వెన్నుతడుతూనే ఉన్నాయి

దైవానికి దయలేదనీ, ఆయనకు మాటలు రావనీ ఎవరైనా అన్నపుడల్లా?
వెలుతురు ఆయన దయ అనీ, రంగులు ప్రేమభాషణ అనీ చెప్పాలనిపిస్తూనే వుంది

మనకు రంగులు వెలిసిపోవటం ఎపుడు మొదలయిందో వెనుదిరిగి చూసావా
చిననాటి పుస్తకాలతోపాటు
వాటిలో దాచుకొన్న నెమలీకనీ జీవితంలోంచి విసిరేసిన క్షణాలలో
మనలోంచి మాయమైన అమాయకత్వాన్ని ఎపుడైనా తడుముకొన్నావా

తెల్లనికాంతీ, కాంతిలోంచి కాంతిలోకి ఎగిరే రంగుల పక్షులూ ఎటు వెళ్ళిపోయాయో,
ధూళిమేఘాల చాటున జీవితమెలా వెలిసిపోయిందో ఎపుడైనా బాల్యాన్నడిగి తెలుసుకొన్నావా.

- బివివి ప్రసాద్, 9032075415

కవి జన్మ

ఆగిన చోటనే
పదం అల్లడం మొదలుపెట్టాలి
మాటల దండ
తెగిన క్షణాన్నే
జీవన కఠోర వాస్తవాల
ఊర్ధ్వంధ్రావిష్కరణకు
ఏర్పాట్లు సాగాలి

అరచేయి అంటుకున్నా సరే
ఆర్పాలి
ఉదాత్త అక్షరానికి
అఖండ దీపం వెలిగించాలి
అనవసరాలన్నీ అవసరాలై
అవసరాలన్నీ అనవసరాలై
మెడకు చుట్టుకుంటున్న

వాక్యం కూలబడిన వేళ
బలమైన శీర్షికతో
బలపరీక్ష పెట్టాలి

విషయం
గందరగోళంలో పడిన తావున
ప్రతి చెట్టు ఆకుని పరించాలి

బోధి సత్యం
బోధపడేవరకు
లక్ష్యశుద్ధి లోపంతో
రెపరెపలాడే భావదీపం

హింసాత్మక, మరణ
సాదృశ్య సందర్భాన
కవిత్వమొక్కటే కాపాడుతుంది

సరిగ్గా,
పాళీ చిట్టిన చోట
ఒక కొత్త కవి
జన్మెత్తుతాడు!

- దాసరాజు రామారావు
9618224503

రచనలకు ఆహ్వానం

సాహిత్య పురస్కారాల నిమిత్తం గుంటూరు జిల్లా రచయితల సంఘం స్వీయ కథ, కవితా సంపుటాలను ఆహ్వానిస్తోంది. 2012 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31లోపు ప్రచురింపబడిన కథ, కవిత సంపుటాలకు చెందిన నాలుగు ప్రతులను మార్చి 31లోగా పంపించాలి. కవిత్వం, కథ ప్రక్రియల్లో ఒక్కొక్క సంపుటికి ఐదువేల రూపాయల పురస్కారంతో పాటు సాహిత్యకారుల్ని సత్కరించనున్నది. చిరునామా: ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా రచయితల సంఘం, గ్రంథాలయం వద్ద, దాచేపల్లి - 522 414, గుంటూరు జిల్లాకు రచనలు పంపించాలని ఓ ప్రకటనలో పేర్కొంది.

'శిలకోల'కు రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం -2012 సంవత్సరానికి మల్లిపురం జగదీష్ కథా సంకలనం 'శిలకోల' ఎంపికైనట్లు నిర్వహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద రూ.11,000 నగదు, జ్ఞాపిక, పురస్కార పత్రం అందజేయబడతాయి. ఈ నెల 17న సిరిసిల్లలో జరిగే కార్యక్రమంలో పురస్కార ప్రదానం చేయనున్నట్లు రంగినేని ట్రస్టు నిర్వహకులు వెల్లడించారు.

గొప్పవారిని కించపరచడమూ భేషజమే

స్పందన

సాహితి శీర్షిక క్రింద ప్రచురించిన ''భేషజపు చక్రబంధంలో రచయితలు'' (ది.28.1.13) అనే రచనకు స్పందన. భేషజం అంటే మందు. భిషక్ అంటే వైద్యుడు. ఈ రెండు సంస్కృత పదాలు తెలుగులో భేషజం అనే మాటను గర్వం, అహంకారం, డాబుదర్పానికి వాడతారు. దీనికి కారణం ఏమిటో తెలియదు. దీనిని మత్తు మందు అని రచయిత కూడా అంగీకరించారు. ఇలాటి మత్తు మందుకి ఎవరు బానిసలో రజాహుస్సేన్‌గారు సోదాహరణంగా వివరించారు. ముందుగా ఈయన బాణం వీరేశలింగంగారిపై ఎక్కుపెట్టబడింది. వీరేశలింగంగారు సంఘ సంస్కరణకి తానే ఆద్యుడనని తన వంటివారు గతంలో ఎవరూ లేరని ఎక్కడా చెప్పలేదు. స్వామినేని ముద్ద నరసింహంగారు రచించిన ''హిత సూచని'' అనే గ్రంథం హుస్సేన్‌గారు చదివితే ఆ గ్రంథం నుండి ఏయే విషయాలు వీరేశలింగంగారు అనుకరించారో చెప్పవద్దా? కేవలం ''అనేక సామాజికాభ్యుదయ కార్యక్రమాల్ని ప్రణాళికా బద్ధంగా పేర్కొన్నారు. అంతేకాదు సమాజంలోని మూఢ విశ్వాసాలను మంత్ర విద్యలను ఖండించారు'' అంటే చాలదు. వీరేశలింగంగారు వితంతు వివాహాలు జరిపించడానికి బ్రహ్మసమాజ మతాన్ని అభిమానించడానికి హితసూచని ఆధారమా? ''వీరేశలింగం అప్పటికే హితసూచనిని క్షుణ్ణంగా చదివి ఉన్నారు'' అని అన్నారు. ఈ విషయం ఎలా చెప్పగలిగారు? హిత సూచని అను పేరులో వీరేశలింగంగారు హిత దొంగిలించి తన సంస్థకు హితకారిణి అని పేరు పెట్టారు కాబోలు. వితంతు వివాహాలు పూర్వమే ఉన్నాయని తాను కొత్తగా జరిపించడం లేదని అందుకు ప్రమాణాలు కూడా పంతులుగారు చూపించారు. ఒకవేళ ఆయన హిత సూచనిలోని విషయాలు అమలుచేసినా అది భేషజం క్రింద రాదు. నేటి మాటలలో చెప్పాలంటే కాపీ చేశారని చెప్పాలి. తరువాత శేషేంద్రశర్మ ప్రస్తావన చేశారు. శేషేంద్ర సంప్రదాయ మరియు ఆధునిక కవితతు వారధి వంటివాడు. ఆయనకు వేదాలు తెలుసు. ఉపనిషత్తులు తెలుసు. రామాయణ భారత భాగవత గ్రంథాలు తెలుసు. పూర్వ కవుల ప్రతిభ ఎరిగినవాడు. సంప్రదాయ కవితలోను ఆధునిక కవితలోను సిద్ధహస్తుడు. రచయితలకి పూర్వ సాహిత్యంపై మంచి అవగాహన ఉండాలి. ఈ లక్షణాలు లేని రచయితల అభిప్రాయాలతో శేషేంద్ర వంటివారు ఎలా ఏకీభవిస్తారు? ఇది భేషజం కాదు, ఉన్నమాట. వడ్డెర చండీదాస్ నవల, సంగీతం గురించి ప్రస్తావించారు. చాలమంది సంగీత విద్వాంసుల కంటే చండీదాస్ ఘనుడని హుస్సేన్‌గారు అంగీకరించారు. చండీదాసు ఏ విధంగా తనను పొగడుకొన్నది చెప్పలేదు. ఇక్కడ కేవలం అనుసరించిన మార్గం అన్నారు కానీ, అది అర్థం కావడం లేదు. మరీచిక నవల విషయంలోను, శివారెడ్డిగారి విషయంలోను రాసిన విషయాలు భేషజాలే. శివారెడ్డిగారు అరవైలో ఇరవైఏళ్ల వాణ్ణిలా ఉన్నాను అని చెప్పడం భేషజమే. ఎనభై ఏళ్లవారు ఎవరైనా అలా చెబితే హర్షిస్తారు. అరవై ఏళ్లవయసు అంటే ఈ రోజులలో వృద్ధాప్యం కాదు. ఈ రచనలో మరొక ముఖ్య విషయం పరిశీలించాలి. సినిమాలు మనకి ప్రమాణం కాదు. సినిమా ఎలా తీస్తే ధనం వస్తుందో ఆలోచించి అలా తీస్తారు. దానవీరశూరకర్ణ సినిమా మహాభారతాన్ని మార్చివేసిందంటే బాగుండదని మహాభారతాన్ని కొత్తకోణంలో చూపించారు అన్నారు. మహాభారతాన్ని కొత్తకోణంలో చూపించడానికి ఉమర్ ఆలీషాగారికీ హక్కు ఉంది. కొండవీటి వెంకట కవికీ హక్కు ఉంది. మనది ప్రజాస్వామ్యం, సెక్యులర్ రాజ్యం. అనగా హిందూ దేవతలను ఇష్టం వచ్చినట్లు చిత్రీకరించవచ్చు. ఇష్టం వచ్చినట్లు తిట్టవచ్చు. ఇక్కడ ఉమరాలీషా గారి 'మహాభారత కౌరవ రంగము' అను గ్రంథంలోని విషయాలు కొండవీటి వారు సంగ్రహించి పేరు తెచ్చుకున్నారని చెప్పాలి. ఇది భేషజం ఎలా అవుతుంది? దీనిని గ్రంథచౌర్యం అందాం. మన పూర్వకవులు తమకవిత్వం ఏ విధంగా ఉంటుందో గ్రంథాదిని వివరించి ఆ విధంగా వ్రాసి చూపారు. ఇందుకు సుమతీ శతకకర్త ఉదాహరణ. ఆధునిక కవులలో తిలక్ కూడా అలా చేశాడు. ఇలాటివి భేషజాలు కావు. ఆయా కవుల ఆత్మవిశ్వాసాలు. చివర ''నాకు అవకాశం లేదు కాని సూరీడులా వెలిగిపోగలను. ఆకాశంలో చంద్రుడిలా వేళ్లాడగలను'' అన్న భేషజం మన కవులలో కళాకారులలో తక్కువేం కాదు'' అన్నారు. ఇలాంటి కవులను గాని సంగీత విద్వాంసులను గాని నేను ఎక్కడా చూడలేదు. రజాహుస్సేన్‌గారి దృష్టిలో ఎవరైనా ఉన్నారేమో తెలియదు.

- వేదుల సత్యనారాయణ, 9618396071

ఉదాత్త రచనలతోనే సాహిత్య ధర్మం

నిబద్ధ కవిత్వాన్ని చదువుతున్నప్పుడు, కొన్ని అంశాలను గమనించవచ్చు. ప్రధానంగా నిబద్ధత అనేది వస్తువు. సిద్ధాంతం అనే రెండు నిర్మాణ పరికరాల మధ్యలోని స్థిరాంశం. పై రెండు అంశాలకు మధ్య స్థిరమైన దార్శనిక పరిధిని ఒకదాన్ని నిబద్ధత ప్రేరేపిస్తుంది. నిబద్ధతని గురించి ఆలోచిస్తున్నప్పుడు - నిబద్ధాంశాలతో వైయక్తికానుకలనంకన్నా సమూహ చైతన్యం ఎక్కువగా ఉంటుంది. కాని నిబద్ధ సాహిత్యం వైయక్తిక ప్రతిభ వలన ఉదాత్త ప్రతిఫలాలను చూస్తుంది. ఇదే సాహిత్యానికి ఒక ధర్మాన్ని ఆపాదించి నిలబెడుతుంది.

నిబద్ధ దర్శనం వెనక కొన్ని ప్రేరక శక్తులుంటాయి. జీవితంలో ప్రకృతి గతాంశాలు అననుభూతమై పార్శ్వభాగంగా నిలబడ్డప్పుడు పరిపూర్ణత్వాన్ని అపేక్షించి సాధించే దిశలో నిబద్ధత ప్రాథమిక శక్తిని కూర్చుకుంటుంది. కవితా నిర్మాణంలో కళాకారులు ఒక పార్శ్వంలో నిలబడి సందర్భాన్ని అందులోని వాతావరణాన్ని సాధిస్తారు. అయితే సందర్భంలో నిష్పన్నమైనా కాకపోయినా ప్రతి సందర్భంలోనూ రెండు పాత్రలు ఉంటాయి. రెండు అస్తిత్వాలుంటాయి. ఈ పాత్రలు రెండూ సమానధర్మం, గుణం, ప్రతిపత్తి కలిగినవే అయినా అనుభవంలో రసనిష్పత్తి సమాంతరంగా ఉండదు. మూర్తామూర్తాలలో నిబద్ధ సాహిత్యంలోని రెండు వస్తువులు సమానగుణం కలిగినవే అయినా వీటి అనుభవికనిష్పత్తులు వేరు. ఒకటి అనుభూత ద్రవ్యంగా ఉంటే మరొకటి అనుభోక్తగా ఉంటుంది. ఈ సందర్భంలో అనుభూత ద్రవ్యం ఆత్మ చైతన్యానికి లోనైతే నిబద్ధత కనిపిస్తుంది.

నిబద్ధ సాహిత్యం కేవలం సిద్ధాంత వస్తుగతాంశాలకు చెందినదే అయితే పాఠకుడు ఏ కవిత్వం చదివినా అందులోకి వెళ్లిపోవాలి. అందువల్ల నిబద్ధ రచనలోనూ సృజన ధర్మం సృజనశీలుర ప్రతిభ గుర్తించాలి. సమాజగతమైన వర్తన పార్శ్వానికి ఉన్న ప్రాధాన్యతవల్ల సృజన గుర్తింపబడదు. కాని వ్యక్తీకరణలో నిబద్ధ సామగ్రిని చేర్చేది సృజన భాగమే. ఆధునిక తెలుగు కవిత్వంలో నిబద్ధ సాహిత్య రూపాలు ఎక్కువే. ఈ కోవలో ఓల్గాలాంటివారి దార్శనిక, నిబద్ధల గూర్చి స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. సుమారు 1972 నుండి రాసినవిగా కనిపించే ఈ కవితల్లోని కవితలు సుమారు 48 ఓల్గా 'కవితలు కొన్ని'గా అందించారు. ప్రాతిపదికంగా కనిపించే నినాదంకన్నా విధానమే ఎక్కువ. అననుభూత జీవన పరిపూర్ణత్వాన్ని అపేక్షించే దశలోని తిరస్కారం సున్నితంగా ఇందులో కనిపిస్తుంది. భాషాముఖంగా అధివాస్తవంగా కనిపించే కొన్ని ఖండికల్లోనూ ఈ వాస్తవ స్పర్శ, అన్వేషణ ఉన్నాయి. నిబద్ధ రచనం ప్రధానంగా సమూహాత్మ, స్థల కాలాల పూర్ణస్పర్శలేకపోవడం, సమానాశంస, స్వీయోద్దీపన, స్థితిగతాంశతోపాటుగా వామపక్ష ఉద్యమ పార్శ్వంలో రాసిన రెండు కవితలు, కొన్ని అనువాదాలు నిర్మాణగతంగా ఒక మాత్రా బద్ధగేయం ఇందులో ఉన్నాయి.

నిబద్ధ దర్శనం వెనక కొన్ని ప్రేరక శక్తులుంటాయి. జీవితంలో ప్రకృతి గతాంశాలు అననుభూతమై పార్శ్వభాగంగా నిలబడ్డప్పుడు పరిపూర్ణత్వాన్ని అపేక్షించి సాధించే దిశలో నిబద్ధత ప్రాథమిక శక్తిని కూర్చుకుంటుంది. కవితా నిర్మాణంలో కళాకారులు ఒక పార్శ్వంలో నిలబడి సందర్భాన్ని అందులోని వాతావరణాన్ని సాధిస్తారు. అయితే సందర్భంలో నిష్పన్నమైనా కాకపోయినా ప్రతి సందర్భంలోనూ రెండు పాత్రలు ఉంటాయి. రెండు అస్తిత్వాలుంటాయి.

జీవితం ఒక సార్థకత కలిగిందని దానికి కొన్ని పార్శ్వాలున్నాయని కలలున్నాయని, ఆ కలల సాఫల్యమే జీవన పూర్ణత్వమని ఓల్గా కవిత్వం నమ్ముతుంది. ఈ కలలు వాస్తవంలోని ఆశలే. ఈ ఆశల ప్రతీకాత్మకత ఇందులో ఎక్కువగా కనిపిస్తుంది. జీవన పూర్ణత్వమంటే కలలు (ఆశలు) సాకారమవటం. ఆ కలలకు ఆకారం నిద్ర. దానికి ఆధారం, సందర్భం రాత్రి. అందువల్ల ఈ కవిత్వంలో 'రాత్రి' అనే పదం అనేక నిబద్ధోద్వేగాలకు ప్రతిరూపంగా నిలుస్తుంది. సుమారు పన్నెండు వరకు 'రాత్రి' అనే పదం పరిధిలోకి కవితలున్నాయి.

'రాత్రం'టే నీకు నిద్రావస్థ / నాకు భగ్న స్వప్నం''- (70)

''నా రాత్రులను వేధించి వెంటాడే ప్రశ్న/ రాజకీయంలో (ప్రతీ రాత్రీ హోరాకిరి తప్పదు''- (43- రాజకీయ రాత్రులు)

''మగత నిదరల చిరు దర హాసంలో/ ప్రతీ రాత్రీ ఒక స్వప్న గుచ్ఛం'' (చిన్ననాటి రాత్రులు)

'ఈ రాత్రి తెల్లవారకూడదు/ ఎన్నటికీ ఓటమి భయం/ పట్టపగలులా నను తాకకూడదు''- (విజయోత్సవ రాత్రి)

ఈ భాగాల్లో జీవితంలోని అనేక సందర్భాల అనుకలనం ఉంది. ఈ పరిధిలో ఆలోచిస్తే ఆశా జీవితం, వాస్తవ జీవితానికి మధ్య బాహ్యాంతశ్చేతనల సమాహార సారంగా తేడాని గమనించిది.'రాత్రి' కలలకు ఆ రకమైన ఆశకు ఆకారంగా, వెలుగు, పగలు, అనిద్రావస్థ. ఉదయం ఇవన్నీ అసంపూర్ణత్వాన్ని ప్రతిపాదించేలా కనిపిస్తాయి. తన అస్తిత్వాన్ని కోల్పోవడం. జీవితంలో కేవల పార్శ్వంగా అనుకలనాశంగా ఉండే స్థాయినుండి తనను తాను వ్యక్తపరచుకోవడం కనిపిస్తుంది. ఈ సంపుటిలో సమాజాన్ని అధ్యయనం చేసిన కవితలూ ఉన్నాయి. సామాజిక వృద్ధి వికాసం వ్యక్తి చేతనలను మార్చలేదనే బాధని వ్యక్తంచేసిన కవిత 'హింస'. అందమైన భావ చిత్రాలు చెప్పడంలో కవయిత్రిలోని సృజనశీలత సౌందర్యాత్మకమైంది. పఠితల హృదయాలకు స్వీయ ఉద్దేశాన్ని మాత్రమే కాకుండా ఉద్వేగాన్ని, ఉధృతిని అందించడంలో ఈ వర్ణన (Discription) ఉదాత్తంగా కనిపిస్తుంది. ఓల్గా కవిత్వంలో నిబద్ధ పార్శ్వం వర్గశత్రువుకు ప్రతిగా నిలబడే నినాదం లాంటిది కాదు. సాపేక్షంగా జీవిత పూర్ణత్వాన్ని ఆ సాధనలోని రెండు పార్శ్వాలను ప్రేరేపించేది. ప్రశ్నించినా నిర్వచించినా ఆ భావన సుస్పష్టంగా కనిపిస్తుంది. సమాజంలోని బాధ్యతను విస్మరించడాన్ని, కుటుంబ భారాన్ని వదిలేయడాన్ని ఓ స్త్రీ గొంతుకతో నినదించిన భాగాలు ఉన్నాయి. ముద్ద కోసం గాదు యుద్ధానికోసం బతకాలని నేర్పుతానని ధీరత్వాన్ని ప్రదర్శిస్తుంది. ప్రధానంగా ఈ కవిత్వంలో ఆకట్టుకునే మరో అంశం భాష ఏ గొంతుతో కవిత్వం రాస్తే ఆ పరిధిలోని, ప్రతీ కలని వాడటం పై భాగంలోని 'పురుగు కొరికిన పత్తికాయ'లాంటి అనేకచోట్ల సందర్భోచితంగా కనిపిస్తాయి. 'మాతృత్వం' కవిత శబ్ద లాఘవాన్ని బాగా వాడుకున్న కవిత.

కొన్ని పదబంధాలు ఉద్వేగంకోసమే సృజించినా భాషా పటిమకు ప్రాతినిధ్యం వహిస్తాయి. 'శరీర శకలాలు (44) అవ్యక్తభోగం (15) భావాంధకారం దేహపు నెరెలు (45) కాలుష్యాంధకారం (45) ఫలదీకరణ ప్రయోగ యజ్ఞం (44) నీరస నిస్తేజ నాడీ మండలం (66) ఇలా చాలా పదాల్ని ఎత్తి రాయొచ్చు. స్వేచ్ఛ, రాత్రి పగలు, స్వప్నం లాంటి పదాలకు అర్థ సంబంధంగా ఈ సంపుటిలో ఉదాత్త జీవనం ఉంది. అనువాద కవితే అయినా 'స్వేచ్ఛా గీతం' ఓల్గా కవిత్వానికి నేపథ్యం లాంటిది.

- ఎం.నారాయణశర్మ, 9177260385

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

మంగళవారం 12, ఫిబ్రవరి 2013

చిట్కాలు

★ చర్మం పొడిబారుతోందని బాధపడే వారు రోజూ ఉదయాన్నే శరీరానికి బాగా వేప నూనె రాసుకుంటే మంచిది. వేప పొడిలో కాస్త పసుపు, పెరుగు కలిపి, ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే మొటిమల సమస్య తీరుతుంది.

★ వేప పొడిలో కాస్త ఆలివ్ నూనె కలిపి శరీరానికి రాసుకున్నా మంచి నిగారింపు వస్తుంది, చర్మం తేమను సంతరించుకుంటుంది.

★ గోరు వెచ్చని నీటిలో కాస్త తేనె, తాజా వేప ఆకులు వేసి స్నానం చేస్తే చర్మ సంబంధ సమస్యలు దూరం అవుతాయి. వేప పొడిలో పెరుగు, గులాబీ రేకల పొడి, నిమ్మరసం కలిపి రాసుకుంటే చర్మం మృదువుగా మారుతుంది.

★ వేప ఆకుల ముద్దలో కాస్త పసుపు కలిపి చర్మానికి రాసుకుంటే మచ్చలు క్రమంగా అంతరించి పోతాయి. వేప ఆకులతో కీర దోస ముక్కలను కలిపి పేస్టులా చేసుకుని ముఖానికి పట్టిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

★ వేప ఆకుల ముద్దను తలపై మాడుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రంగా తలంటుకోవాలి. తరచూ ఇలా చేస్తే శిరోజాలు ఒత్తుగా పెరిగి నిగనిగ లాడుతుంటాయి. వేప ఆకుల ముద్ద జుట్టుకు మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

★ ఎండలో తిరిగి వచ్చినపుడు ముఖం కమిలిపో యినట్లు అనిపిస్తే, ఫ్రిజ్‌లో ఉంచిన పాలను రాసుకో వాలి. ఇలా చేస్తే ముఖానికి తాజాదనం వస్తుంది.

★ తేనెలో ముంచిన దూదితో మొటిమలపై నున్ని తంగా రాస్తే అవి క్రమంగా అంతరించి పోతాయి.

వయ్యారాల 'వల'!

పెళ్లి పందిట్లో అమ్మమ్మలు, నానమ్మలు మీ బుగ్గ గిల్లుతూ మిమ్మల్ని ఆట పట్టిస్తున్నారా? 'ఏం టమ్మాయ్! అమ్మవైనా.. అందంలో ఐశ్వర్యారాయ్‌నే మించిపోతున్నావే..!' అంటూ మీ ఆడపడుచులు, వదినలు మీపై ఛలోక్తులు విసురుతున్నారా? పచ్చని పందిట్లో పెళ్లయినా, మరో శుభ కార్యమైనా ఇలాంటి సర సాలు, సరదాలు మన ఆచారం.. ఈ ఆచా రాన్ని కొనసాగించే అద్భుతమైన మనో ల్లాసాన్నిచ్చేది ఏమిటి? దానికి కారణం అందమైన అతివలా? వారు ధరించిన నిగనిగ లాడే నగల వన్నెలా? వారు వేసుకునే దుస్తులా? సంబరాల వేళ సంతోషాలకు కారణాలేమైనా, నేటి ఆధునిక కాలంలో మహిళల అందాన్ని మరింతగా ద్విగుణీకృతం చేసేది మాత్రం ఒకటుందని ఒప్పు కునే మాటొకటుంది. అదే 'జాలరి వల' మాదిరి కనిపించే 'నెట్టెడ్ క్లాత్' సోయగం! మగువల మనసు దోచుకుంటున్న తాజా ఫ్యాషన్ నెట్టెడ్ క్లాత్! విందైనా-వినోదమైనా, పెళ్లైనా-పేరంటమైనా సందర్భం ఏదైనా... నేటి ఫ్యాషన్ ప్రపంచమంతా నెట్టెడ్ క్లాత్ తళతళలే! చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలంతా ఈ రకం దుస్తులను ధరిస్తున్నారు. నేడు పెళ్లిళ్లలో పట్టుచీరల సోయగాలు అంతగా కనిపించడం లేదు. ఎటు చూసినా నెట్టెడ్ దుస్తులే.

అతివలకు అందంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని ఇవి రెట్టింపు చేస్తున్నాయి. రూపు, రంగు ఏదైనా సరే అద్భుతమైన కాంతిని ఇనుమడింపచేస్తూ, ఎంతటి వయసువారికైనా సరే, చక్కగా శరీరాకృతిలో కలిసిపోవ టమే కాకుండా సందర్భానుసా రంగా ధరించేందుకు నెట్టెడ్ దుస్తులు ఎంతో తేలికైనవి, నాణ్యమైనవి. ముఖ్యంగా దక్షిణ ఉత్తర భారతంలో ధరించే సాంప్రాదయకమైన లంగా వోణీలు, చీరలు, లేహం గాలు, గాగ్రాచోళీ- దుపట్టా వంటి పెళ్లి దుస్తులు ఈ నెట్టెడ్ క్లాత్‌లోనే దర్శనమిస్తున్నాయి. అనార్కలి మోడల్, వెరైటీ డిజైనర్ వేర్‌లో డ్రెస్సులు, ఎంబ్రా యిడరీ కుందన్ జరీ వర్క్‌తో చీరలు అందరినీ అలరిస్తున్నాయి. నెట్టెడ్ క్లాత్‌తో చాలా లాభాలు న్నాయి. కన్నులకి చూడముచ్చటగా ఉండడంతో పాటు దర్జాగా కనిపిస్తాయి. సౌకర్యంతోపాటు సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తాయి.

ఎక్కువగా ముదురురంగులో సిల్వర్ స్టోన్ వర్క్‌తో నైలాన్, మెష్, పాలిస్టర్, షిమ్మర్, జాక్వార్డ్ వంటి వెరైటీ నెట్టెడ్ క్లాత్‌తో హెవీ, లైట్ ఎంబ్రాయిడరీతో తయారుచేయబడి రెడీమేడ్‌గా అందుబాటులో ఉంటున్నాయి. భారతీయత ఉట్టిపడేలా ఉంటూనే నూతనత్వంతో చీరలు డిజైన్ చేస్తున్నారు. ఒకే రకం అని కాకుండా డిజైనర్ నెట్ శారీస్‌తోపాటు బెనారస్ నెట్ శారీస్, డిజైనర్ షైనింగ్ నెట్ శారీస్, హెవిచికెన్ వర్క్ నెట్ శారీస్, స్టోల్ నెట్ శారీస్, డిజైనర్ షిఫాన్ నెట్ శారీస్ కూడా సందడి చేస్తున్నాయి.

నిజానికి నెట్టెడ్ క్లాత్ చూడటానికి మామూలుగా ఉన్నా, ఆ క్లాత్‌కి వన్నె తెచ్చేది దాని మీద జరిగే ఎంబ్రాయిడరీ వర్క్, రంగు రంగుల రాళ్లు, వివిధ పద్ధతులలో జరీ లేసుల కలయిక. ముఖ్యంగా సిల్వర్ కుందన్ పొదిగిన పనితనం వల్లే కాంతులీనుతాయి. అన్ని డిజైన్లు కాకున్నా చాలామటుకు మెషిన్‌పైనే చేస్తారు. నెట్టెడ్ క్లాత్‌కు వున్న విశేషమైన గుణం- ఎంతటి భారీ డిజైన్ అయినా సరే తనలో ఇముడ్చుకుని ఒదిగిపోయేలా చేస్తుంది.

ఏ ఫ్యాషన్ వచ్చినా ముందుగా మనకు తెలియచేసేది సెలెబ్రిటీలే. వారు ఎక్కడున్నా తళుక్కుమంటూ కొత్త ఫ్యాషన్‌ను మన ముందుకు తీసుకువచ్చి పరిచయం చేస్తారు. అందుకు ఫ్యాషన్ షో మంచి ఊతం ఇస్తుంది. గత కొంతకాలంగా ఏ ఫ్యాషన్ షో చూసినా మనకు ఈ రకమైన ఎత్నిక్ వేర్ దర్శనమిస్తున్నది. ఫ్యాషన్ నిపుణులు నీతా లుల్లావంటి వారు 2011 ఆగస్టులో మన రాష్ట్ర సోయగమైన కళంకారి నైపుణ్యంతో నెట్టెడ్ క్లాత్‌ని ఉపయోగించి ఫ్యాషన్ వీక్ నిర్వహించారు.

గత ఏడాది ఆగస్టులో లాక్మె సంస్థ నిర్వహించిన వింటెర్-ఆటం ఫ్యాషన్ షోలో నీతా లుల్లా నెట్టెడ్ క్లాత్‌ని ఉపయోగించి బ్రైడల్ ఎత్నిక్ వేర్‌లో భార తీయత ఉట్టిపడేలా 'రాదాస్ కలెక్షన్' పేరుతో ప్రద ర్శించారు. ఇక దుపట్టాల విషయానికి వస్తే సృజనా త్మకతకు అంతే లేదు. డ్రెస్సు ఏదైనా సరే దుపట్టా మాత్రం నెట్టెడ్ క్లాత్‌లోనే లభ్యమౌతున్నాయి. ఇక ఆరు నుంచి పదేళ్ళ వయసు ఆడపిల్లలకి వారి తల్లులు మరీ మురిపెంగా ఈ దుస్తులని ఎంపిక చేస్తున్నారు. ఫ్రాకులు, చిన్న చిన్న లంగా వోణీలు, గాగ్రాచోలీ, లెహంగా దుపట్టా వంటివి వారిని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. పసిపాపల డ్రెస్సులకైతే సృజ నకు అంతే లేదు. వెరైటీకి విరామం లేదు. పూటకో కొత్త ఫ్యాషన్ పుట్టుకొస్తూనే ఉంది. ఇక నెట్టెడ్ టాప్స్ కాలేజీ అమ్మాయిలను ఆశ్చర్యిపరిచాయి. జీన్స్ అయినా లెగ్గింగ్ అయినా నెట్టెడ్ టాప్‌తో అదిరిపోయే అందాన్ని ఇస్తున్నాయి. నిత్యం ధరించేలా సులభంగా, సౌకర్యంగా ఉంటున్నాయి. ఈ దుస్తుల ఎంపిక ఎంత కష్టతరమో..? బోలెడన్ని రకాల రంగులు, డిజైన్ల హొయలు చూస్తే మరి మతిపోతుంది కదా...! అందుకే ఎంపిక కష్టతరం మరి.. అయితే- వీటి సంరక్షణ మాత్రం ఎంతో సులభం.. డ్రైవాష్‌కి ఇస్తేసరిపోతుంది. పెద్దగా శ్రమ అవసరం లేదు.

తాజాగా కాటన్ క్లాత్‌పై సిల్వర్ త్రెడ్ ఎంబ్రాయిడరీ ట్రెండ్ వచ్చినా, ఇంకా నెట్టెడ్ హంగామా మాత్రం తగ్గలేదు. అవి కాటన్ అవ డంతో అమ్మాయిలు కేవలం వాటిని కాలేజీ వేర్, కంపెనీ మీటింగ్స్ లేదా క్యాజువల్ వేర్‌గా ధరిస్తు న్నారు. కాబట్టి నెట్టెడ్ క్లాత్‌కి ఇప్పటికైతే ఏ మాత్రం మోజు తగ్గలేదనే చెప్పొచ్చు. ఈ జోరు ఎప్పటివ రకు కొనసాగుతుందో వేచి చూడాల్సిందే.

-రాణీ సంధ్య

రూ. కోటి కాజేశారు..!

వెయ్యీ, లక్షా కాదు ఏకంగా కోటి రూపా యల మొత్తాన్ని విడివిడి మొత్తాలుగా- లాగేశారు ఓ వ్యాపారస్తుని ఖాతాలోనుంచి. ఈ తస్కర కిలాడీలు ముంబైకి చెందినవారే. 'ఇ-బ్యాంకింగ్' సదుపాయాన్ని వాడుకొని, ఓ సౌందర్య పోషక ద్రవ్యాల కంపెనీ బాస్- అంకుర్ కొఠారే ఖాతానుంచి 12 లక్షలు, 5 లక్షలు- 15 లక్షల కిత్తాలుగా పైకం లాగించేశారు. ఆయన మొబైల్ మీదికి ఈ మొ

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

త్తాలు 'హుష్ కాకి' అయిపోతున్నట్లు- ఎస్.ఎం.ఎస్‌లు వచ్చి పడ్డాయి. రెండో మెస్సేజ్ చూసుకుని గుండెలు బాదుకుంటూ ఆ వ్యాపారి బ్యాంకు వారికి- ''నా ఖాతాని బిగించండి- మహాప్రభో!'' అంటూ వేడుకున్నాడు. ఆ బ్యాంకు వారు మహాఘనులు. ముందు పోలీసులకి ఫిర్యాదు చేసి- దాని కాపీ ఒకటి - ''అట్టుకురాండి'' అన్నారుట. ఇతని ఖాతా నుంచి ఎత్తేసిన కోటి రూపాయల్నీ- దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో వున్న 12 బ్యాంకు ఖాతా లలో 'జమ' అయ్యేలా- కిలాడీలు క్యాష్ బది లీలు చేసుకున్నారట. ఈ సందర్భంగా, ఓ నిందితుడు 'చిక్కాడు'. అతణ్ణి నాలుగు పీకితే మరో పదకొండు మంది పేర్లు కక్కేడు. బ్యాంకుల వాళ్లు 'ఇ-బ్యాంకింగ్' చెయ్యండోయ్'' అంటూ ఇ-మెయిల్స్‌తో వెంట పడతారు. ఆ వివరాలు లీక్ అయితే ఇదీ ప్రమాదం. 'బిగించండి' అన్నపుడు మొదటే బిగిస్తే బాగుండేది కదా?! ఊహూఁ... బ్యాంక్ డిగ్నిటీకి భంగం కదా?

జై టాక్సీ..! జై ఆటో..!

ముంబైలో టాక్సీ డ్రయివర్ల సంఘం ఓ క్రొత్త ప్రతిపాదన పెట్టింది. ''ప్రయివేట్ కార్లు రోడ్డు పక్కన పార్క్ చేయడంవల్ల మా బేరాలు పోతున్నాయి, ప్రయాణీకులు యిబ్బంది పడుతున్నారు. కనుక రోడ్డు పక్కన కేవలం 'క్యాబ్స్', 'ఆటోస్' మాత్రం నిల్చోవాలి. ప్రయివేట్ కార్లా? వేరే స్టాండులో - సందులో చూసుకోవాలి'' - అంటూ కేంద్రం పంపిన ఒక పరిశీలక సంఘం ముందు- టాక్సీ సంఘం నాయకుడు - ఏ.యల్.ఖాద్రోస్ గట్టిగా వాదించి ప్రతిపాదనలు కూడా అందజేశాడు. వాళ్లేమంటారు? ప్రతిపాదనలు, ప్రొటెస్ట్‌లు అందుకొనే పోస్టాఫీసులే కదా- ఇలాంటి సంఘాలు.. అంతే మరి. ''సరే'' అంటూ వినతులు అందుకున్నారు.

veeraji@sify.com

శిశువులకు వరం 'తల్లిపాల బ్యాంకు'

తల్లిపాలు లభించక అనారోగ్యానికి లోనయ్యే శిశువులను కాపాడేందుకు వినూత్న తరహాలో ఉత్తర భారత్‌లో 'మిల్క్ బ్యాంక్'లను ప్రారంభించారు. రాజస్థాన్‌లోని మేవార్, కోల్‌కతలోని ప్రముఖ ఆస్పత్రుల్లో వీటిని ప్రారంభించారు. తల్లిపాలను సేకరించి 'మిల్క్ బ్యాంకు'ల్లో భద్రపరిచి అవసరమైన శిశువులకు అందిస్తున్నారు. 'దివ్య మదర్స్ మిల్క్ బ్యాంకు'గా వీటిని వ్యవహరిస్తున్నారు. 'మా భగవతి వికాస్ సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ ఉత్తర అమెరికాలోని ఓ సంస్థ సహకారంతో వీటిని ఏర్పాటు చేసింది. ఈ తరహా మిల్క్ బ్యాంకులు ఇప్పటికే ముంబై,పూణె, సూరత్‌ల్లో నడుస్తుండగా, త్వరలో ఉదయ్‌పూర్‌లో ఏర్పాటు చేయబోతున్నారు. తల్లిపాలు లభించక రాజస్థాన్‌లోని మేవార్ ప్రాంతంలో శిశు మరణాలు అధిక సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయి. రాజస్థాన్‌లో సుమారు 42 శాతం మంది శిశువులు తల్లిపాలు లేక రోగాల బారిన పడుతున్నారని అధికారులు గుర్తించారు. తల్లిపాలను అందుబాటులో ఉంచడం వల్ల 22 శాతం వరకూ శిశు మరణాలను తగ్గించగలిగారు. వైద్యుల సిఫారసుల మేరకు తాము ప్రతి రోజూ 60 మంది దాతల నుంచి ఆరు లీటర్ల వరకూ పాలను సేకరిస్తున్నామని 'మా భగవతి వికాస్ సంస్థాన్' ప్రతినిధులు చెబుతున్నారు. తల్లిపాలను సేకరించడం చిన్న విషయం కాదని, ఆరోగ్యవంతులై తగిన శారీరక సామర్థ్యం ఉన్న మహిళలు మాత్రమే పాలను ఇవ్వగలుగుతారని మేవార్ మిల్క్ బ్యాంకుకు చెందిన డాక్టర్ ఆరెకె అగర్వాల్ అంటున్నారు. దేశ వ్యాప్తంగా శిశువులకు తల్లిపాలు అందాలన్న సంకల్పంతో తాము కృషి చేస్తున్నామన్నారు. ప్రసవం తర్వాత కొద్ది రోజుల వరకూ కొందరు బాలింతలు శిశువులకు పాలిచ్చే పరిస్థితి ఉండదని, ఇటువంటి సమయంలో తమ బ్యాంకు ఆదుకుంటుందని అగర్వాల్ చెప్పారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసిన తర్వాతే దాతల నుంచి పాలను సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరుస్తామని డాక్టర్ జయశ్రీ మండ్కర్ వివరించారు. ఇలా భద్రపరిచే పాలను ఆరు నెలల వరకూ శిశువులకు వాడవచ్చని ఆమె తెలిపారు. ■

పేరుకు బాలలే.. నేరాలు పెద్దవే..!

హత్యలు, అత్యాచారాల వంటి తీవ్ర నేరాల్లో బాలలు (జువైనల్స్) నిందితులుగా నమోదవుతున్న కేసుల సంఖ్య దేశ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచార ఘటన యావత్ జాతిని కుదిపివేయగా, ఈ కేసులో 18 ఏళ్ల నిండని మైనర్ బాలుడు నిందితుడు కావడంతో సరికొత్త చర్చకు తెరలేచింది. 'బాలల న్యాయ చట్టం' (జువైనల్ యాక్ట్) ప్రకారం 18 ఏళ్లు నిండని వారు నేరాలకు పాల్పడితే వారిని బాల నేరస్థులుగానే పరిగణిస్తున్నారు. బాలలు అంటే ఎవరు? వారి వయసు ఎంత? శిక్షలు విధించేటపుడు నేర తీవ్రతనా? వయో పరిమితినా? దేన్ని ప్రాతిపదికగా తీసుకోవాలనే ప్రశ్నలు సుప్రీం కోర్టును సైతం సంకట పరిస్థితిలోకి నెట్టేశాయి. బాల నేరస్థులకు సంబంధించి 'జాతీయ నేర నమోదు సంస్థ' (ఎన్‌సిఆర్‌బి) చెబుతున్న గణాంకాలు అందరినీ ఆందోళన కలిగించేలా ఉన్నాయి. 2001- 2010 కాలంలో మైనర్ నేరస్థుల్లో సుమారు 50 శాతం మంది 16 నుంచి 18 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. వీరు 63.9 శాతం నేరాలకు పాల్పడ్డారు. 34 శాతం అత్యాచార కేసుల్లో మైనర్లే నిందితులుగా ఉన్నారు. తల్లిదండ్రుల నిర్లక్ష్యం, కుటుంబ పరిస్థితులు, చెడు వ్యసనాల ఫలితంగా అనేక మంది

బాలలు నేరాలకు అలవాటు పడుతున్నారు. వీరిలో 70 శాతం మంది సిగరెట్లు, బీడీలు కాల్చడం, చోరీలు చేయడానికి అలవాటు పడ్డారు. బడి మానేసిన పిల్లలే ఎక్కువగా నేరాల వైపు ఆకర్షితులవుతున్నారు. కొందరు హత్యలు, అత్యాచారాలకు సైతం తెగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి గత ఏడాది 59 అత్యాచార కేసుల్లో మైనర్లు నిందితులుగా ఉన్నారు. బాల నేరస్థులపై కేసుల్లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ తర్వాత నాలుగో స్థానంలో ఆంధ్ర ప్రదేశ్ నిలిచింది. తీవ్రమైన నేరాల్లో బాలల ప్రమేయం ఉండడం ఆందోళన కలిగిస్తోందని సామాజిక వేత్తలు అంటున్నారు.

వయసుతో సంబంధం లేకుండా నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, మన రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో బాల నేరస్థుల్లో 13 నుంచి 18 ఏళ్లలోపు వారే ఎక్కువ మంది ఉన్నారని తాజా అధ్యయనంలో తేలింది. చదువు మానేసిన బాలలు నిర్మాణ రంగంలో, హోటళ్లలో దినసరి కూలీలుగా ఉపాధి పొందుతున్నారు. చెడు సావాసాలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం ఫలితంగా వీరిలో ఎక్కువ మంది నేరాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రుల కలహాల కారణంగా కొందరు ఇళ్ల నుంచి పారిపోయి ఒంటరి జీవితానికి అలవాటు పడుతూ అరాచకాలకు తెగిస్తున్నారు. కుటుంబ వ్యవస్థ బాగుంటేనే బాలలు నేరాల జోలికి పోకుండా ఉంటారని నిపుణులు అంటున్నారు. ■

ఇరుగు, పొరుగులతో జాగ్రత్త..

మా పక్క ఫ్లాట్‌లోకి మధ్యప్రదేశ్ నుంచి బదిలీపై వచ్చిన తెలుగు వాళ్లే వచ్చారు. ఇక్కడికి రాగానే తమ కుటుంబంలో అందరికీ ప్రాణం లేచి వచ్చినట్లయ్యిందని ఆ ఇంటి ఇల్లాలు సుమిత్ర సంతోషంగా అంది. నాలుగైదు రాష్ట్రాల్లో ఉండడం వల్ల సుమిత్రకు వచ్చినంతగా ఆమె పిల్లలిద్దరికీ తెలుగు అంతగా రాదు. ఆ పిల్లలు 'ఆంటీ.. ఆంటీ..' అంటూ తరచూ మా ఇంట్లోకి చొరవగా వస్తుంటారు. సుమిత్ర భర్త సెంట్రల్ గవర్నమెంట్‌కు చెందిన విభాగంలో పని చేస్తుంటాడు. ఊరికి కొత్త కావడంతో మొదటి పది రోజులూ సుమిత్రను నేనే బజారుకు, మార్కెట్‌కి తీసుకెళ్లి ఇంటికి కావల్సిన వస్తువులు కొనడంలో సాయం చేశాను. ఇక్కడి నుంచే నాకు అసలు తిప్పలు మొదలయ్యాయి. ఏవైనా వస్తువులు అమ్మేవారు వీధిలోకి వస్తే సుమిత్ర నన్ను పిలవడం, ఎంత ముఖ్యమైన పని ఉన్నా మొహమాటంతో కాదనలేక ఆమెతో వెళ్లడం, బేరమాడి వస్తువులు కొనడం ఆమెకి మామూలైంది. ఒక్కోసారి ఆమె వద్ద తగినంత డబ్బు ఉండేది కాదు. అపుడు నేనే మిగిలిన డబ్బు సర్దాల్సి వచ్చేది. అయితే, సుమిత్ర ఆ డబ్బు తిరిగి ఇచ్చేది కాదు. మొదట్లో- పాపం.. మర్చిపోయిందేమోనని అనుకునే దాన్ని. కానీ, అలా నాలుగైదు సార్లు జరిగాక ఆమె నైజం నాకు బోధ పడింది. పరిచయాన్ని ఇలా ఉపయోగించుకుంటోందని అర్థమయ్యాక ఆమెపై సదభిప్రాయం సన్నగిల్లింది.

మన ఇరుగు, పొరుగుల్లో సుమిత్ర లాంటి వాళ్లు కొంతమంది ఉంటారు. పక్కపక్కనే ఉంటున్నపుడు మాట సాయం, అప్పుడప్పుడు చేబదుళ్లు పరస్పరం తప్పవు. ఇది తప్పు కూడా కాదు. అయితే, తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించకుండా అమాయకత్వం నటించడం మాత్రం సహించలేనిది. నా క్లాస్‌మేట్ మాధవి- ఆమె పక్కింట్లో ఉండేవాళ్లకి- మధ్యవర్తిగా హామీ ఉండి 'ఫ్రిజ్' కొనిపించింది. వాళ్లు రెండు వాయిదాలు కట్టి ఊరుకున్నారు.

మాధవి కుటుంబం ఊళ్లో లేని సమయంలో వారు ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికో వెళ్లిపోయారు. మహానగరంలో వారెక్కడ ఉంటున్నారో తెలియక మాధవి దిగాలు పడింది. పక్కింటి ఆయన ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడన్న విషయం కూడా మాధవికి తెలియదంటే నమ్ముతారా? చచ్చినట్లు మిగిలిన వాయిదాల డబ్బు చెల్లించి, భర్త చేత చీవాట్లు తినడం మాధవి వంతయ్యింది. అందుకే- ఇరుగు పొరుగు వాళ్ల గురించి తెలుసుకోకుండా డబ్బు వ్యవహారాల్లో తలదూర్చడం మంచిది కాదు. అయితే, ఇరుగు పొరుగుల్లో అందరూ సుమిత్ర, మాధవి లాంటి వాళ్లే ఉంటారని కాదు. ఇంట్లో భర్త, పిల్లలు లేని సమయాల్లో మహిళలు పక్కింటి వాళ్లతో పరిచయాలు పెంచుకోవడం అవసరమే. కానీ, ఆ పరిచయాలు దుర్వినియోగం కారాదు. మో సం చేసే అవకాశం ఉందని తెలిశాక వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

మా బావగారు ఉంటున్న అపార్టుమెంటులో ఒకావిడ పదేళ్లుగా అక్కడే ఉంటున్నా ఎవరినీ పలకరించదు, ఎవరైనా మాట్లాడినా ముక్తసరిగా జవాబు ఇస్తుంది. అక్కడ ఏ ఫంక్షన్ జరిగినా ఆమె వెళ్లదు. ఆమె భర్త, కొడుకు కూడా ఇంతేనట. మరీ ఇలా మానవ ప్రపంచానికి దూరంగా ఉండడం సరికాదు, అలాగని పరిచయస్థులతో నిత్యం రాసుకుని పూసుకుని తిరగడమూ మంచిది కాదు. మారుతున్న కాలానికి తగ్గట్లుగా స్నేహంగా మెలగాలి. ఇంకోరకం మనుషులుంటారు.

పక్కింట్లో ఏం జరిగినా తెలుసుకుని, చిలవలు పలవలుగా వర్ణించి అడిగిన వారికీ, అడగని వారికీ చెబుతుంటారు. ఇంట్లో పనివాళ్లను, డ్రైవర్లను పిలిపి ఇతరుల విషయాలను సేకరిస్తుంటారు. ఆ సమాచారం నలుగురికీ చెబితే కానీ వారికి నిద్ర పట్టదు. ఇతరుల వ్యక్తిగత విషయాలపై సిగ్గు లేకుండా మాట్లాడేస్తూ చిక్కుల్లో పడతారు. నలుగురుండే చోట రకరకాల మనస్తత్వాలున్నవారు ఉంటారు. అందరినీ అనుమానించనక్కర్లేదు.

ఆత్మీయంగా పలకరించే వారిని దూరం చేసుకుంటే- మనం కష్టాల్లో ఉన్నపుడు మనవైపు చూసే వాళ్లే ఉండరు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎలా భిన్న మనస్తత్వాలతో ఉంటారో ఇతరులు కూడా అలాగే ఉంటారని భావించాలి. తప్పు చేస్తే ఇంట్లో పిల్లల్నైతే మనం దండిస్తాం. అదే ఇరుగు, పొరుగు వారి విషయంలో అలా చేయలేం. గనుక పరిచయాలు, స్నేహాల విషయంలో ఆచితూచి అడుగేయాలి. సమస్య వచ్చినపుడు బాధ పడడం కన్నా- ముందు జాగ్రత్తలు తీసుకోవడం అన్ని విధాలా ఉత్తమం.

- వై.భారతి

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
మంగళవారం
12, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

అతి దక్షుండగు దక్షుడీ జగములో యాగంబు సల్లక్షణ స్థితిగా జేయుచు నుండి నిన్ను మది నుద్దేశింపమింప జేసి తా హతుడయ్యెన్ మది నట్టి కార్యముల పొందై యుండునే కర్తస్మృతితో జేయని దుర్మదుండు మనునే? భావింప సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! మిక్కిలి నేర్పరి అయిన దక్షుడు సలక్షణంగా యజ్ఞం చేస్తుండగా ఈశ్వరుడవైన నిన్ను ఆయన ఉద్దేశింపకుండా చేసినందువల్ల హతుడైనాడు. అట్లాంటి కార్యాలు(శివుని లక్షింపని కార్యాలు) ఔచితీమంతాలవుతాయా? కర్త అయిన నీ అనుజ్ఞతో చేయని దుర్మదుడు మన్నుతాడా? దక్షుడు ఒకసారి యజ్ఞాన్ని చేస్తూ సర్వదేవతలను పిలిచి, శివపార్వతులను ఆహ్వానించకుండా ఉండిపోతాడు. కాని దక్షుని కూతురైన పార్వతి దేవి శివుని అనుమతి తీసుకొని పిలవకపోయిన తన తండ్రే గదా అనివిశ్వసించి, ఆ యజ్ఞానికి వస్తుంది. కాని అక్కడ దక్షుడు కాని మరెవరూ ఆ పార్వతిని ఆదరించరు దానితో ఆమె యోగాగ్ని సృష్టించుకొని అందులో దగ్ధమవుతుంది. ఇది తెలుసుకొన్న శివుడు ఆఘమేఘాలపై బయలుదేరుతాడు. తన జటనుంచి వీర భద్రుడిణ్ణి సృష్టిస్తాడు. ఆ వీర భద్రుడు పార్వతిని అవమానించినవారిని సంహరిస్తాడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

11 **శ్రీ లత**

కానీ పెళ్లి కాకుండానే 'బిడ్డను' తెచ్చిపెడ తావా? అంటే ఆ తల్లి పిచ్చిదయిపోతుంది. జీవనా! ఆ పని చేయడం సభ్య సమాజం అనబడుతున్న ఈ మనుషుల గుంపులో ఏ తల్లికీ సాధ్యం కాని విషయం జీవనా!'' అని బుజ్జగించ బోయింది.

తల అడ్డంగా ఊపి అసహనంగా వసంతవైపు చూసి సమాజం గురించీ... సభ్యతల గురించి నాకు తెలియదు. కానీ ప్రస్తుతం నాకు పాప కావాలమ్మ అంది మొండిగా.

ఇంతలోకి పక్క రూమ్‌లోంచి అండాళు వెడుతూ లోపలికి తొంగి చూసింది. వీళ్ళిద్దరి పరిస్థితి తనకు అర్థం కావడానికి అవకాశం లేదు కనుక. మామూలు పలకరింపు ధోరణిలో...

''ఏమండీ మీ మనవరాలు ఎలా ఉంది? మా కోడలూ మీ అమ్మాయీ ఒకేసారి కన్నారు సుమా జంట లక్ష్మీదేవులను'' అంది సరసంగా. వసంత బలవంతంగా నవ్వింది.

''అదేమిటీ? మీ అమ్మాయికి సెలైనూ అవీ పెట్టారు పాపం లేచి కూర్చుని పాలు ఎలా ఇవ్వగలుగుతుందీ?'' అడిగింది సింపతీగా!

''భగవంతుడా వదిలేలాలేదు'' అని లోపల గొణుక్కుని పైకి మాత్రం...

''మా అమ్మాయి కాస్త నీరసంగా...'' అనేలోపే

''లేదు! నా పాప లేదు పాలివ్వడానికి'' అంది జీవన. బొమ్మను పోగొట్టుకున్న చిన్న పాప ఆర్తిలా ఉంది గొంతు.

''ఏం ఏమయింది పాపం! అయో నాకు తెలీక మిమ్మల్ని పలకరించి బాధపెట్టాను. ఎప్పుడు జరిగిందిది?'' అంది ఎంతో బాధగా.

''ఏమిటిది?'' కన్‌ఫ్యూజింగ్‌గా అంటూ చూసింది వసంత.

''అదే పాపం! పాప చనిపోవడంగా అర్థం చేసుకుందని అనిపించి అందుకు సమాధానంగా చటుక్కున లేచి కూర్చుని.

''మా పాప చనిపోలేదు! ఉంది... ఉందీ.. ఎక్కడో ఉంది'' అంది గాభరాగా.. తను చేతులు తిప్పుతూ ఆదుర్దాగా మాట్లాడడంలో ఏదో తేడా కనిపించింది వసంతకు.

''జీవనా! ట్రై టు కంట్రోల్ యువర్ సెల్ఫ్'' అని ''అవునండీ పాప ఉంది. ఇప్పుడే అలా బయటకు తీస్కెళ్ళారు'' అంది సందర్భాన్ని తేలిక చెయ్యడానికి ప్రయత్నిస్తూ!

''పాప ఉందీ అంటారు. ఇద్దరూ అదోలా ఉన్నారు. మరి, మీ అమ్మాయివి కళ్ళు ఏడ్చిన ట్లుగా ఉన్నాయి. రూమ్‌లో ఉయ్యాల లేదు. ఏవిటీ ఈ అర్థంకాని పరిస్థితీ?'' అంటూ ఆవిడ అనవసరంగా కన్‌ఫ్యూజ్ అయిపోసాగింది. అసలు చుట్టుపక్కలు జరిగే అన్ని విషయాలూ వివరంగా తెలియకపోతే ఆండాళుకు తన జీవితం నిరర్థకం అనిపిస్తుంది.

జీవనెందుకో డిస్టర్బ్ అయినట్లు అసహనంగా అటూ ఇటూ చూసింది.

''చూడండీ! మీకు అన్ని విషయాలూ చెప్పి తీరాలన్న కండీషన్ మాకేవీ లేదు కదండీ. మీ పని

మీద మీరు వెళితే బావుంటుందేమో'' అంది చాలా అసహనంగా వసంత. పక్కవాళ్ళ గురించీ పట్టించుకోకుండా ఉండే పరిస్థితి ఏర్పడింది. అయినా మీ పాప ''ఉంటే' నాకేం, ''ఛస్తే'' నాకేం ఏదో కాస్త స్నేహంగా అడిగానంతే'' అనేసి విసురుగా వెళ్ళిపోయింది.

కోపంగా ఆవిడ వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయిన జీవన, వసంత ఊహించలేని విధంగా ఖాళీ సెలైన్ బాటిల్ ఊడబీకి గుమ్మంకేసి విసిరేసింది. అది భళ్ళున పగిలి రూమంతా ముక్కలు చిమ్మింది. వసంత బిత్తరపోతూ జీవనవైపు చూసింది. ఊగుతున్న సెలైన్ స్టాండు విసురుగా ధన్‌మంటూ కిందపడిపోయింది.

''చూడమ్మా పాప ఛస్తే నాకేంటి అంటూందీ రాక్షసి'' అంది చిన్న పిల్ల కంప్లయింట్ చేస్తున్నట్లు.

శబ్దానికి ఇద్దరు నర్స్‌లు, హెడ్‌నర్స్, ఆయా పరుగెత్తుకొచ్చారు. రూమంతా పడిన గాజు ముక్కలూ, కిందపడిన సెలైన్ స్టాండు చూసేసరికి వాళ్ళకు చికాగ్గా అనిపించింది. లోపలికి రావడానికి గాజు ముక్కలు గుచ్చుకుంటాయనిపించి గుమ్మం అవతలే నిలబడి.

''ఏమయింది మేడమ్'' హెడ్‌నర్స్ అడిగింది.

''ఏం లేదు! అనుకోకుండా నా చేయి జారి బాటిల్ కిందపడి'' అని అంటూండగానే...

''ఏదో విసిరేసిన శబ్దం వినిపించింది'' అడిగింది అసిస్టెంట్ నర్స్ వసంత ఏదో అనబోయే లోపు....

''నేను విసిరేసా'' జీవన చెప్పేసింది.

''హాస్పిటల్‌లో ఇలాంటి న్యూసెన్స్‌లు క్రియేట్ చేస్తే అదర్ పేషెంట్స్ డిస్టర్బ్ అవుతారని మీకు తెలీదా? మీకంతగా సీసాలూ అవీ పగలగొట్టే హాబీ ఉంటే ఇంటికెళ్ళాక చెయ్యండిలా, ఇంకోసారి ఇలా జరిగితే బావుండదు'' అని కఠినంగా వార్నింగిచ్చింది హెడ్‌నర్స్.

''సారీ! ఇంకోసారి ఇలా జరక్కుండా చూసుకుంటాను'' అంది వసంత.

''ఏం కాదు ఇంకోసారి, ఇంకోసారి కూడా ఇలాగే విసిరేస్తా, 'నా పాప చచ్చిపోయింది?' అని ఎవరైనా అడిగితే'' అంది తలతిక్కగా జీవన.

''పాప చనిపోవడం ఏవిటీ? పాప బేబీకేర్‌లో ఉంది. మీ అమ్మగారే కదా మిమ్మల్ని, పాపను చూసుకోవడం ఒక్కరికీ వీలుకావడం లేదని రిక్వెస్ట్ చేస్తే అందులో ఉంచాము' అంది హెడ్ నర్స్.

''ఆ ఒక్కమాట జీవన ముఖంలో ప్రశాంతతను విప్పార్చుతూ ముఖాన్ని విశాలం చేసింది''.

ముడిపడిన కనుబొమ్మల్ని విప్పదీసింది, కళ్ళలోని ఎర్రజీరల్ని చెరిపేసింది. బిగించిన వెంట్రుకల్ని అల్లల్లా వదిలేసి, బరువైన శరీరాన్ని విహంగం చేసి, ఆశల రెక్కలు విప్పుకుని ఝుమ్మంటూ సాగే పక్షిలా ఏదో హాయి జీవనలో కదిలింది.

అప్పటివరకూ పడిన టెన్షన్‌పోయి, హాయిగా కనురెప్పలు వాలి మనసుకు ప్రశాంతతను పరిచాయి

వసంత మెల్లగా లేచి జీవనకు బెడ్‌షీట్ కప్పి నర్స్‌ను కాసేపు జీవనను చూసుకొమ్మని రిక్వెస్ట్ చేసి బయటకు నడిచింది.

వసంతను చూస్తూనే డాక్టర్ గౌరీదేవి గుర్తుపట్టి ''రండి! ఎలా ఉంది మీ అమ్మాయి'' అనడుగుతూ ఛైర్ చూపించింది కూర్చోమన్నట్లుగా....

''అమ్మాయి'' డెలివరీ అయ్యింది, పాప పుట్టింది'' అంటూ కుర్చీలో కూర్చుంది వసంత.

''ఓ.. కంగ్రాచ్యులేషన్స్! ఎనీ హూ మీ ప్రాబ్లమ్ సాల్వ్ అయ్యిందన్నమాట'' అందావిడ రిలాక్స్‌గా నవ్వుతూ...

-ఇంకాఉంది

142 రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

తార ప్రలాపించుట

అప్పుడు తార నయము తలచి, ఆ వానరులను పలు పర్యాయాలు దూషించి ''రాజ్యం ఎందుకు? అడ్డుతొలగండి. నేను నా పతి వాలిని చూడాలి. అది నా ధర్మం. నేను ఆ వాలి సతిని. తారను తొలగిపోండి'' అని క్రోధంతో ఉరిమి, తీవ్ర దుఃఖంతో గుండెలపై మోదుకొంటూ పరుగిడి వచ్చింది. తార ఏతేరీ తరిని తారహారాలు తెగి నేల రాలాయి. కుచశాటి తొలగింది. వేణీభరం వీడింది. అధరాలు వణకాయి. ఆ వేగానికి ఆ తార తూలి పడింది. పద్మదళాలనుంచి మధువు తొరగిపడిన కరణి ఆమె కనుదమ్ముల నుంచి అశ్రు బిందువులు- నేరేడు పండ్లవలె- రాలి పడ్డాయి. ఆమె అతి వేగంగా పరుగెత్తివచ్చి- తీవ్రంగా వీచిన వాయువేగానికి తూలిపడే పూలతీగవలె ఆ వాలిపైన పడింది. దుఃఖం పొంగి పొర్లగా ఈ విధంగా ప్రలాపించింది.

''వానర కులాధీశ్వరా! సకల సురాసురల లోను అసమాన సత్త్వుడివి. అలవోకగా వింధ్యాది గిరులను పెరుకగల బిరుదు మగడవు. స్వర్గపాలకుడై, సకల దేవతలకు అధిపుడైన కులశైలాలను ఛేదించిన ఇంద్రుడి కుమారుడవు. 'కోలంబు'డనే గంధర్వవీరుణ్ణి మట్టు పెట్టిన రణకోవిదుడవు. అంతటి బలవంతుడివి ఒక మానవుడి చేత ఈ రీతి మడిసినావు. ఏమని అంటాను? సుగ్రీవుడు తన తావు చాలక నిన్ను గెలువ శ్రీరాముణ్ణి తోడుగా తెచ్చుకొన్నాడు. నేడు ఆలము చెయ్యవద్దు అని బతిమాలాను. శ్రీరాముడు విష్ణుమూర్తి. ఆ వంక పోకు. ఆ రాముణ్ణి జయించలేమని చెప్పాను. ఆ రాముడు భీమపరాక్రముడు, కోదండ విద్యాపారంగతుడు. నీ బిరుదు ఏపాటి? రాముడు నిన్ను హతమార్చవచ్చిన నీ పాలి మృత్యువు అని ఎరుక చాలమి ఈ గతి శ్రీరాముడి చేత అరడి పడ్డావు. దేవదానవులు క్షీరాబ్ధిని త్రచ్చి త్రచ్చి అలసిపోయి విడిచి పెట్టడం వీక్షించి, వాసుకిని మందరాద్రికి చుట్టి సముద్రాన్ని మధించిన భుజద్వయం నేడు పెనుధూళిలో కూరుకొనిపోయిందా? అతిలోక బలుడు ధనుజాధిపుడు రాముణ్ణి నీ దృఢముష్టితోపట్టి, వాలరోమాలతో కట్టి వార్ధులలో ముంచిన నీ వాలం ధూళిలో కలిసిపోయిందా? నీలకంఠుడి శ్రీచరణ పద్మం మీద తేటిలాగ వ్రాలు నీ తల కటిక నేలపై పొరలవలసి వచ్చిందా? ఏమని వాపోవను? హృదయేశ్వరా! నిన్ను విడిచి జీవించలేను. నీ వెన్నుదన్ని వస్తాను. నీవున్న లోకంలోనే వుంటాను. దుఃఖాల పాలయాను. నాకు ఇకపై గతి ఎవరు? ఓ ఇంద్రత నయా! నీ కన్నకొడుకు అంగదుణ్ణి చూసి వలవలపొక్కుతున్నాను. వాడు అంగాలకి దుమ్ము అంటుకుపోయి నీ వూరువుల మీద పడి పొరలుతున్నాడు. శోకతప్తుడు ఆ అంగదుణ్ణి ఒక్కమారు కన్ను తెరచి చూడవా? నీ రొమ్ము పయిని తొడలపైని వుంచుకొని శిరము మూర్కొని, వాడి ముద్దు చెక్కిళ్లు పుణికి, ముద్దులు పెట్టి నీ గారాబు పట్టిని చేర దీయవేమయ్యా?'' అని దుఃఖిస్తూ తార సుగ్రీవుణ్ణి కని ''ఏమయ్యా నీకన్నుల చల్లవడ్డయా? ఎదుట నిలిచి, ఎదిరించి వాలి ముందర నిల్వజాలక, పలుమారులు దిక్కులేక, పందవై పారిపోయి, రఘురాముణ్ణి తోడ్కొని వచ్చి, అసహ విజయాన్ని చేపట్టి కిష్కింధ కైకొన్నావు. నీ పగ తీరిందా? నీ కోరిక నెరవేరింది. కపిరాజ్య పదవిని వేడకతో అనుభవించు. ఇనవంశతిలకుడితో సఖ్యం నెరపకు నీకు ఈ హనుమంతుడు తోడయినాడా? పలుమారులు నీకు వెరవులు కరపనల, నీల, తారులు ముగ్గురూ ఉన్నారు లేవయ్యా'' అని పలుగతుల వాపోయింది.

అనంతరం రఘురాముడిని కనుగొని ''జనినాథా! ఈ వాలిని చంపావు. దేనికి? నిన్ను అరణ్యాలకి వెళ్లగొట్టమని నీ తండ్రికి వాలి కరపినాడా? నీ రాజ్య వైభవం సమస్తమూ కొల్లగొట్టుకొన్న భరతుడా ఈ వాలి? నీ భార్యను అపహరించుకొని పోయిన దుష్ట దనుజుడు రావణుడా ఈ వాలి? అకారణ వైరం పూని వాలిని చంపటం ధర్మమా? నీ వంటి సుకృతికి నీ బోటి విభుడికి, నినువంటి కారుణ్య శరధికి ఇది తగునా?

-ఇంకాఉంది

మంగళవారం, 12 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ విదియ ఉ.10.48
నక్షత్రం: పూర్వాభాద్ర రా.04.28
వర్జ్యం: ఉ.10.51 నుండి 12.27 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
రాజకీయ రంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురి చేస్తుంది. వీలైనంత వరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరం మేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తుల జోలికి వెళ్లరాదు.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణ బాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు ప్రారంభించుట మంచిది కాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించుట మంచిది.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ధనవ్యయం అయ్యే అవకాశం. మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొంటారు.

మంచిమాట

శరీరతత్త్వం

పరీక్షిత్తు మహారాజు ధీరోదాత్తుడు. ప్రజల్ని కన్నబిడ్డలుగా చూసేవాడు. కాలం కలిసిరాలేదు. విధి వక్రించింది. పరీక్షిత్తు మహారాజుకు తక్షకునివల్ల ఏడు రోజుల్లో మరణం. ఇది మునిపుత్రుని శాపం. దీనికి తిరుగులేదు. అడ్డుపడడం బ్రహ్మకైనా సాధ్యం కాదు. శుక మహర్షిని తనకు ఈ ఏడు రోజుల్లో భగవంతుని కథా వైచిత్రాలను ఎరుకపరచమని కోరాడు. శుక మహర్షి మహారాజుకు భాగవతం కూలంకషంగా వివరించాడు. అపుడు పరీక్షిత్తు యొక్క అనేకమైన సందేహాలను భాగవతం, అష్టాదశ పురాణాల నుండి తార్కాణాలతో వివరంగా తెలియచెబుతాడా మహర్షి.

ఈ సందర్భంలో మహారాజుకు ఒక సందేహం కలుగుతుంది. ''మునివర్యా! భగవంతుని స్వరూప గుణ నిర్గుణాలను విశదీకరించి మీరు చెబుతుంటే ఆనందంగా ఉంది. మహానుభావా! ఈ పురాణగాథలు వింటూంటే చావు భయం పూర్తిగా తొలగిపోయింది. అయినా దేహమే దేవాలయం అంటారే! ముప్పై మూడు కోట్ల దేవతలు ఆ దేహంలో ఉన్నారంటారే! వారెవరు? వారి గురించి వివరంగా తెలియజేయండి మహానుభావా! అంటూ ప్రాధేయపడ్డాడు.

రాజా! శరీరతత్వం అర్థమైతే ఈ సంసార సాగరం నుంచి తరించగలవు నాయనా! ఈ శరీరం ఒక కట్టె. ఇందులో జఠరం రూపంలో అగ్ని ఉంది. అందుకే మానవుడు సదా అగ్నిదేవుని పూజిస్తుంటాడు. ఈ అగ్ని ఒక్క మానవులలోనే కాదు సకల జంతు జీవరాశులలో వాటి జఠరంలో జీవాగ్నిగా ఉంది. అందువల్లనే జీవ జాలం తినే పదార్థాలన్నింటినీ ఈ జఠరం (అగ్ని) జీర్ణం చేసి ద్రవరూపంలో శరీరం మొత్తం వ్యాపింపజేస్తుంది. ఆ ద్రవమే రక్తం. ఇది జీవ పదార్థం. జీవి బ్రతకడానికి ఇది అత్యంత ముఖ్యం. జీవన గతికి ఇది ఇంద్రియంగా వుంటుంది. ఆ ఇంద్రియం నుంచి బీజం. ఈ బీజంవల్లనే పునరుత్పత్తికి అవకాశం. అందువల్లే జంతుజాలాల పుట్టుక. ఏ విధంగా సముద్ర గర్భంలో బడబాగ్ని నిక్షిప్తమై, నిగూఢమై ఉంటుందో, ఆ విధంగా ప్రతి జీవి శరీరంలో అగ్ని వుంటుంది. ఆ అగ్ని వేడి శరీరమంతటా వ్యాపించి వుంటుంది. ఈ శరీరపు అగ్నినే ప్రాణమంటారు. వేడి వున్నంతవరకూ ప్రాణముంటుంది. ఆ వేడివల్లనే ఆరోగ్యంగా ఉండగలుగుతుంది ప్రతి జీవి. ఈ వేడి సమతుల్యంలోగాక హెచ్చుతగ్గులుంటే ఆరోగ్య భంగం అనివార్యం. రోగాలు ప్రాప్తిస్తాయి. శరీరం వడలుతుంది. ఆ వేడి అణిగిపోతే ప్రాణం నిలువదు. శరీరం చల్లబడితే మరణమే. ఆ వేడి మందగించితే అజీర్ణం కలుగుతుంది. అజీర్ణమే సమస్త వ్యాధులకు మూలం. అందుకే ప్రతి జీవి అజీర్ణం కలుగకుండా జాగ్రత్తపడాలి. దీనికి సరైన ఆహారం భుజించడం ఒక్కటే దారి. సరైన అన్నాహారాలు జఠరాగ్నిని సంరక్షిస్తాయి. జఠరాగ్ని రక్షింపబడితే ఆరోగ్యం బాగుంటుంది. ఆరోగ్యవంతులైనవారికి రోగాలు ప్రాప్తించవు. రోగరహితులు చిరకాలం జీవిస్తారు.

సూర్యచంద్రులు నేత్రాలలో, వాయువు ముక్కులో, అగ్ని ఉదరంలో, సరస్వతి నాలుకపైన, మహేశ్వరుడు నాలుక మొదట్లో, పరమాత్మ హృదయంలో, ఇలా ముప్పై మూడు కోట్ల దేవతలు ప్రతి శరీరంలో ఆవాసమేర్పరచుకున్నారు. అందుకే దేహమే దేవాలయం అన్నారు. ఈ దేవతలందరికీ అన్నమే నైవేద్యం. సకల దేవతా స్వరూపమైన దేహాన్ని ఆరోగ్యంగా వుంచాలంటే సరైన ఆహారం తీసుకోవాలి. ఆహారం గుర్తుచేయడానికే ఆకలి ఉద్భవించేది. ఆకలిగొన్న వారికి ఆహారం తప్ప వేరే ఏమీ రుచింపదు కదా! భోజనాన్ని కోరేవారికి ఒక అర్హత కావాలి. తనకు అన్నం కావాలనుకునేవాడు ఇతరులకు భోజనం పెట్టి వుండాలి. ఒక గింజను దానం చేస్తే దేవతలు దాన్ని వేయింతలుగా చేసి ప్రతిఫలంగా ఆ దాతకు ఇస్తారు. ఏ దానం చేయని బ్రాహ్మణులు సహితం వేదపఠనంవల్ల భగవంతునికి ప్రీతి కలిగించి అనంతమైన ఫలితాలు పొందుతారు. అందులో అన్నదాన ఫలం కూడా ఉంటుంది.

-గుండ్లపల్లి శివకుమార్

వృతాసురుడు

20

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 13



మాటాట

ఆధారాలు:
అడ్డం
2. ధర్మామీటర్ లోని ద్రవరూప ఖనిజం
5. తీగ
7. కుల, లేక గ్రామ బహిష్కరణమే
8. సిగ్గు
9. వేయి కి బహువచనం
10. కప్పు
12. లక్ష్యం
14. దేశ ప్రథమ పౌరుడు

మాటాట - 12 సమాధానం



నిలువు
1. గో మూత్రం
3. ఓ దిక్కు, ఉత్తరం ఇటుయితే అది అటు
4. మెలిక, ముడి
6. బొట్టు
7. కిరణం, ప్రకాశం
10. తారతమ్యం
11. తరువాత
13. రిమ్మ, ఉపశాఖ

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కొత్తగా

ప్రాజెక్టు గ్లాసెస్

గాడ్జెట్ ప్రపంచంలో ఈ ఏడాది కొన్ని అద్భుతాలు చూడటం ఖాయమంటున్నారు సాంకేతిక నిపుణులు. ప్రధానంగా గూగుల్ నుంచి వస్తున్న ప్రాజెక్టు గ్లాసెస్. కష్టం లేకుండా కళ్లకు పెట్టుకున్న అద్దాలనే స్క్రీన్ చేసుకుని కావాల్సిన సమాచారాన్ని చదువుకునే అవకాశం కల్పించే గాడ్జెట్టే ఇది. ముఖారవిందాన్ని మరింత పెంచే డిజైన్‌తో కళ్లద్దాలు ధరించడమే కాదు, గ్లాసెస్ మీదే మనకు కావాల్సిన సమాచారాన్ని చూసుకోవచ్చన్న మాట. అంతర్జాలానికి ప్రాజెక్టు గ్లాసెస్ అనుసంధానమైన ఉంటుంది కనుక, మిత్రుల నుంచి వచ్చే మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు లేదా వాతావరణ సమాచారం.. ఇలా దేన్నైనా కళ్ల ముందున్న కంటి అద్దాల మీదే చూసుకోవచ్చు. ఇందులో అమర్చే చిన్న కెమెరాతో నచ్చిన దృశ్యాన్ని ఫొటో తీసుకోవచ్చు. మెచ్చిన సన్నివేశాన్ని వీడియో చేసుకోవచ్చు. ప్రయోగ దశల్లో ఉన్న ఈ గాడ్జెట్‌ను, మార్కెట్‌కు ఎప్పుడొస్తుందో వేచి చూద్దాం.

నిడివి తక్కువ.. నెగడెక్కువ

యువతరం ప్రస్తుతం షార్ట్ ఫిల్మ్స్ నిర్మాణాన్ని హాబీగా మార్చుకుంటున్నారు. తీసిన చిత్రాన్ని రూపాయి ఖర్చులేకుండా పదిమంది ముందూ ప్రదర్శించేందుకు టెక్ మీడియా సైతం బలమైన సాయుధంగా మారడంతో -షార్ట్ ఫిల్మ్స్ నిర్మాణంలో కుర్రాళ్ల ఉత్సాహం ఉరకలేస్తుంది. హిట్టు ఫట్టు తార తమ్యాలు లఘు చిత్రాలకు అంటవు కనుక -చెప్పదలచుకున్న పాయింట్‌ను సూటిగా, స్పష్టంగా చూపేందుకే కుర్ర దర్శకులు ప్రయత్నిస్తున్నారు.

దృశ్యం సమాజానికి దర్పణం కావాలి. అప్పుడే సమకాలీనత ద్యోతకమవుతుంది. డాక్యుమెటరీ అయినా, పూర్తి నిడివి చిత్రమైన సమాజాన్ని ఏదోక కోణంలో ప్రతిబింబించేదే. అందులోని గుణ దోషాలను, వ్యక్తుల మధ్య రాగద్వేషాలను కళ్లకు కట్టినట్టుగా పరోక్ష పాత్రల ద్వారా తెరపైకి తెచ్చేదే. కథ బలంగా ఉండి కథనంలో పట్టుంటే సినిమాకు నిడివితో సంబంధం లేదు. లఘు చిత్రమైనా పెద్ద సినిమాలతో పోటీపడి జాతీయంగా, అంతర్జాతీయంగా రాణిస్తుంది. దైనందిన జీవితంలో చూసే దృశ్యాలకు అనేక కోణాల్లో స్పందిస్తాం. కొన్నిసార్లు ప్రతిస్పందిస్తాం. ఆ స్పందన, ప్రతిస్పందన మనలోని అంతర్లీన భావాలకు, భావనలకు అద్దం పడతాయి. కొందరికి ఈ స్పందన అప్పటికే పరిమితమైతే, ఇంకొందరి హృదయాలను తొలిచేస్తుంది. తమ సృజననూ ఆవిష్కరించాలన్న తపనకు దారితీస్తుంది. అలాంటి సృజనాత్మకతే నేటి యువతలో ఉత్తుంగమవుతోంది. ఓ తరంగంలా సామాజిక స్పృహతో కూడిన లఘు చిత్రాల ఆవిష్కరణకు దారులు తీస్తోంది.

⁂

పరీక్షల్లో ఎన్నో కథలు రాస్తున్నాం. చదువుకున్న పాఠాన్ని కథగా మలచి ప్రొఫెసర్‌ను మెప్పించే ప్రయత్నం చేస్తున్నాం. అలాంటిది -మనసుకు నచ్చిన దృశ్యం కంటిముందు ఆవిష్కృతమైతే కథగా కెమెరాలోకి ఎక్కించేందుకు ఎందుకు కష్టపడాలి? నా దృష్టిలో అక్కడ రాసే కథకూ, ఇక్కడ తీసే కథకూ పెద్ద తేడా ఏమీ ఉండదు. లక్షలాది మెదళ్లకు తోచే ఆలోచనా దృశ్యాన్నే మేం కెమెరాకు ఎక్కిస్తున్నాం కనుక -కచ్చితంగా మంచి పేరే తెచ్చుకుంటుంది. నేను తీసే లఘు చిత్రాల గురించి ఇంతకంటే ఎక్కువగా చెప్పేదేం లేదు.

లఘు చిత్రాలతో సామాజికాంశాల మీద బాణాలు ఎక్కుపెడుతున్న ఓ యువ దర్శకుడు, ఇంజనీరింగ్ విద్యార్థి చెప్పిన మాటలివి. కోట్లాది యువతరం మెదళ్లకు ప్రేరణ కలిగించే విధంగా లఘు చిత్రాలను శరపరంపరగా ప్రయోగిస్తున్న కుర్ర దర్శకుల మాటల్లో భావనలు కూడా ఇవే. తాజా ట్రెండ్‌ను గమనిస్తే -లఘు చిత్రాల మోజులో కుర్రతరం మునిగి తేలుతుంది. మనసుకు తట్టిన దృశ్యరూపాన్ని వెండితెర మీద ఆవిష్కరించాలంటే -అందుకు అనుభవాన్ని లఘు చిత్రాల నుంచి మూటగట్టుకునే ప్రయత్నం చేస్తుంది. నిడివి తక్కువ సినిమాతోనే లక్షలాది జనం మెదళ్లలో నెగడు పుట్టించిన బాలాజీ మోహన్ లాంటి కుర్ర దర్శకులే ప్రేరణగా -యువతరం ప్రస్తుతం షార్ట్ ఫిల్మ్స్ నిర్మాణాన్ని హాబీగా మార్చుకుంటున్నారు. తీసిన చిత్రాన్ని రూపాయి ఖర్చులేకుండా పదిమంది ముందూ ప్రదర్శించేందుకు టెక్ మీడియా సైతం బలమైన సాయుధంగా మారడంతో -షార్ట్ ఫిల్మ్స్ నిర్మాణంలో కుర్రాళ్ల ఉత్సాహం ఉరకలేస్తుంది. హిట్టు ఫట్టు తారతమ్యాలు లఘు చిత్రాలకు అంటవు కనుక -చెప్పదలచుకున్న పాయింట్‌ను సూటిగా, స్పష్టంగా చూపేందుకే కుర్ర దర్శకులు ప్రయత్నిస్తున్నారు. -'సినిమా నాకొక పిచ్చి. అది నేరవేర్చుకోవడానికి -ముందు హ్యాండీకామ్ పట్టుకున్నా. నేనేం చెప్పదలచుకున్న పాయింట్‌లోనే దశ్యాలనే చిత్రీకరించా. ఇక్కడ ఎడిటింగ్, రీరికార్డింగ్ లాంటి వాటిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. పదిమందిలో ఆలోచన రెకెత్తించే సన్నివేశాల సమాహారమే -సినిమాగా మలచుకున్నా. దానికి మిత్రులు, బంధువుల నుంచి ప్రశంస వచ్చింది. రెండుమూడు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శనకు అర్హత సంపాదించింది. ఆ ఆనందం -మరిన్ని లఘు చిత్రాల నిర్మాణానికి ప్రోత్సాహమైంది. ఒకవిధంగా చెప్పాలంటే మూడు గంటల్లో చెప్పదలచుకున్న జీవితాన్ని మూడే మూడు నిమిషాల్లో చెప్పగలిగిన షార్ట్ ఫిల్మ్ కూడా ఉన్నాయి. అలాంటివి మరింత ప్రేరణ ఇస్తున్నాయి. మరిన్ని లఘు చిత్రాలకు కథా వస్తువులు అవుతున్నాయి కూడా' అంటున్నారు లఘు చిత్రాలపై ఆసక్తిని ప్రదర్శిస్తున్న కుర్రాళ్లు.

ఒకప్పుడు లఘు చిత్రాల నిర్మాణం కాలేజీ విద్యార్థులకు హాబీగా ఉండేది. వాటిద్వారా తమ ఆలోచనలను వ్యక్తీకరించే వారు. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా లఘు చిత్రాల నిర్మాణం కూడా అన్ని రంగాల మాదిరిగా కెరీర్‌ను పెంపొందించుకునే వేదికగా మారింది. మనసు స్పందిస్తే అది సందేశానికి తావిస్తుంది. మనసులోని భావన దృశ్యమైతే తెరపై బలమైన సందేశాన్ని ఇవ్వడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అలాంటి ఆలోచనలే -సామాజిక సందేశాలతో కూడిన డాక్యుమెంటరీలకు ఊపిరి పోస్తున్నాయి. 'నాకు డాక్యుమెంటరీలు తీయడం ఒకప్పుడు హాబీ. ఇప్పుడది నా కెరీర్' అంటూ ఓ విద్యార్థి వ్యక్తం చేసిన అభిప్రాయం ప్రస్తుత సమాజానికి డాక్యుమెంటరీల నిర్మాణం కెరీర్‌గా మారుతుందనడానికి ఉదాహరణ కాకపోదు.

విద్యార్థి దశ సంపాదనకు ఆస్కారం ఇచ్చేది కాదు. మరి ఆ దశలో డాక్యుమెంటరీలు తీయడం సాధ్యమా? అన్నది పెద్ద ప్రశ్న. సృజన ఎక్కడుంటే మద్దతు అక్కడుంటుంది. కొత్త ఆలోచనలు పుట్టుకొస్తే వాటికి ఆలంబనగా నిలిచేందుకు ముందుకొచ్చే వ్యక్తులూ ఉంటారు. ఈ యువ లఘు చిత్రాల సృష్టికర్తలకు స్పాన్సర్ల కొదవ లేదు. ఇలా ఎవ్వరూ ముందుకు రాకపోయినా తమ ఆలచోనలకు తెర రూపం ఇవ్వడానికి తలా కొంత వేసుకుని నిర్మించేందుకూ విద్యార్థులు వెనకాడటం లేదు. కెమెరా ఒక చోటనుంచి, మరో పరికరం ఇంకోచోటి నుంచి తెచ్చుకోవడంతో పాటు సందేశాన్ని బలంగా వ్యక్తీకరించే నటీనటులు కూడా ఎలాంటి పారితోషికం లేకుండా నటించేందుకు ముందుకొస్తున్నారు. ఇవన్నీ ఇలాంటి ఆలోచనలు కలిగిన విద్యార్థులకు ఆసక్తినే కాదు, కెరీర్‌గా ఎంచుకోవాలన్న ఆసక్తినీ కలిగిస్తున్నాయి. తాజా పరిస్థితులను బట్టిచూస్తే లఘు చిత్ర నిర్మాణం ఇప్పుడొక పరిశ్రమగా మారింది. అతి సూక్ష్మ స్థాయినుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ తమ ఆలోచనలను విస్తరించేందుకు ఔత్సాహికులకు ఇది బలమైన సృజనాత్మక వేదిక. తక్కువ వ్యవధిలో ఎక్కువ గాఢత కలిగిన సందేశాలు ఇవ్వడం అనేది డాక్యుమెంటరీల ద్వారానే సాధ్యమౌతుందన్న విషయం ఇప్పటికే స్పష్టమైంది. ఇక తొలిసారి డాక్యుమెంటరీలతో ముందుకొచ్చే వారికి ప్రోత్సాహ కరవుండదు.

నేల నలుచెరుగులా విస్తరించిన మీడియా అందరికీ అవకాశాన్ని ఇస్తుంది. పదునైన సందేశాలకు బలమైన కథలకు సమకాలీన అంశాలకు దర్పణం పట్టే ఇతివృత్తాలకు ప్రచార పరంగా ఇబ్బంది లేదు. ఈ బాధ్యతను మీడియా భుజాన వేసుకుని మరీ చేస్తుంది. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే స్పందనలు, ప్రతిస్పందలు వెల్లువెత్తుతున్నాయంటే మీడియా ప్రభావం ఎంతగా డాక్యుమెంటరీల ప్రచారంలో ఉందో స్పష్టం చేసేదే. మామూలు చిత్రాలకు ప్రచారం కోసం పోస్టర్లు వేయాలి. మూడు గంటల నిడివి చిత్రానికి కథాపరంగా బలం ఉండే అవకాశం ఉండదు. ప్రస్తుతం నానో టెక్నాలజీ అంతటా విస్తరిస్తున్నట్టుగా ఈ డాక్యుమెంటరీలు కూడా నానో అంత పదునైన సందేశాన్ని అతి స్వల్ప వ్యవధిలోనే అందిస్తున్నాయి. సామాజికాంశాల పట్ల స్పృహ పెంచుకుంటున్న నేటితరం యువతకు -షార్ట్ పిల్లులే భావ వ్యక్తీకరణ ఆయుధాలు అవుతున్నాయి. ఇదో ట్రెండ్!

హీరో..

చమ్మక్.. చందా!

నచ్చని విషయాలు నెత్తిన రుద్దితే -ఇంట్లోంచి పారిపోయే కుర్రతరాన్ని చూశాం, చూస్తున్నాం, చూస్తుంటాం. -'పదిహేడేళ్లకే పెళ్లేంటి?' అంటూ ఇంట్లో అమ్మానాన్నల ప్రతిపాదనను వ్యతిరేకించి కోల్‌కతా నుంచి పారిపోయిన చందా జవేరి -పాతికేళ్లు ప్రపంచాన్ని చదివి కోటీశ్వరురాలిగా ఎదిగడం లాంటి సంఘటనలు అరుదు. ఇంట్లోంచి పారిపోయిన జవేరి -ఒంటరి ప్రపంచంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. ఉన్నత చదువులు అభ్యసించాలన్న లక్ష్యాన్నే ధైర్యంగా మలచుకుని -ఒక్కో మెట్టూ ఎదిగే ప్రయత్నం చేసింది. బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టే సమయానికి చందా వద్ద ఉన్న ఆస్తి -అమ్మానాన్నలు చేయించిన డైమండ్ చెవి కమ్మలు మాత్రమే. ఎయిర్‌వేస్ విమానం ఎక్కేసి బ్రిటన్‌లో డేవిడ్, కారెన్ అనే వృద్ధ దంపతులను కలిసింది. అంతకు కొద్దిరోజుల ముందు -డేవిడ్ దంపతులు కోల్‌కతా వచ్చినపుడు జవేరి వారికి సాయపడింది. కొద్ది రోజులు వాళ్ల సాయం తీసుకున్న చందా -స్వతంత్రంగా బతకాలన్న ఆలోచనతో 98ఏళ్ల లెస్లీ అనే వృద్ధురాలికి హౌస్ అసిస్టెంట్‌గా చేరింది. లెస్లీనుంచి సాయంగా 30వేల డాలర్లు అందుకున్న జవేరి, హార్వార్డ్ వర్శిటీలో ఉన్నత చదువులు పూర్తి చేసింది. -కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో -నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ లినస్ పౌలింగ్ దర్శకత్వంలో బయోకెమిస్ట్రీలో పరిశోధన పూర్తి చేసింది. జవేరిలో పట్టుదల, తెగువ అర్థం చేసుకుని లినస్ అవకాశమిచ్చాడు. పరిశోధన పూర్తైన తరువాత లినస్ ఆమెకు 70వేల డాలర్లు ఆర్థిక సాయం చేయడంతో -సొంతంగా కంపెనీని స్థాపించే పనిలో పడింది చందా. అలా ఆమె ఏర్పాటు చేసిన కంపెనీ ప్రస్తుతం 100 మిలియన్ డాలర్ల టర్నోవర్ చేస్తోందట. పైసా లేకుండా ప్రపంచంలోకి అడుగు పెట్టి -తెగువతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన చందా జవేరి -ఈ తరానికి ఎప్పటికీ మార్గదర్శకురాలే. అంతేకాదు, ఆమె -హీరో కూడా.

విజయం

సక్సెస్‌కు సమీపంగా....

-వాసిలి
వసంతకుమార్,
drvaasili@yahoo.co.in
Cell: 9393933946

సామాజికం కాగలిగిన తెలివితేటలుంటే మనలది సోషియల్ ఇంటలిజెన్స్ అవుతుంది. ఒక విధంగా ఇటువంటి సామాజిక వర్తనాన్నే నైతిక వర్తనమూ అంటుంటాం. అయినా అప్పుడప్పుడూ మతం, కులం, గోత్రం సామాజిక వర్తనంపై ప్రభావం చూప ప్రయత్నిస్తుంటాయి. వాటి ఆక్షేపణలు మనపై పెత్తనానికి ప్రయత్నిస్తుంటాయి.

పర్సనాలిటీ.. నో షార్ట్‌కట్స్ ఇంతకీ సక్సెస్‌కు కావలసిన వ్యక్తిత్వం ఏమిటి? వర్క్ హార్డ్- కష్టపడటం, బిసినెస్- మంచితనంతో వ్యవహరించటం, నో షార్ట్ కట్స్- దగ్గిర మార్గాల కోసం ప్రాకులాడకుండటం.. ఈ మూడింటి తత్వం ఒంటబడితే మనలో నిలకడ సాధ్యమవుతుంది.. పట్టుదల సడలకుంటుంది. ఈ ఎరుకనే 'సైన్స్ ఆఫ్ గుడ్ కారెక్టర్' అని చెప్పుకోవచ్చు. అసలు కష్టం, మంచితనం, సులభ మార్గాలు అనే పదాలు వింటుంటే జీవితాన్ని యధాతథంగా అంగీకరించాల్సిందే అనిపించటం లేదూ! మనం ప్రపంచ పౌరులం కాబట్టి ప్రాపంచిక జ్ఞానాన్ని ఔదలదాల్చాల్సిందే! ప్రపంచ రీతిని కాదనలేం కదా!? దాపరికాలు లేకుండా వర్తించాలన్నా ధైర్యస్థులం కావలసిందే! తెలివితేటలతో పాటు కలుపుకుపోయే మనస్తత్వమూ ఉండాలి. నవ్వుతూ బ్రతకాలిరా.. అన్నట్టు స్మైలింగ్ ఫేస్ మన స్వంతం కావాలి. అరువు తెచ్చుకున్న నవ్వు వికటిస్తుంది. కాబట్టి ఎరువు కాని నవ్వు మనది కావాలి. ప్రేమించే గుణం మన స్వభావంలో ఉండాలి. దయాగుణం, క్షమాగుణం మనలో ఉంటే మనం సోషియల్ బీయింగ్స్, సక్సెస్‌ఫుల్ పర్సన్స్ అవుతాం. సామాజికం కాగలిగిన తెలివితేటలుంటే మనలది సోషియల్ ఇంటలిజెన్స్ అవుతుంది. ఒక విధంగా ఇటువంటి సామాజిక వర్తనాన్నే నైతిక వర్తనమూ అంటుంటాం. అయినా అప్పుడప్పుడూ మతం, కులం, గోత్రం సామాజిక వర్తనంపై ప్రభావం చూప ప్రయత్నిస్తుంటాయి. వాటి ఆక్షేపణలు మనపై పెత్తనానికి ప్రయత్నిస్తుంటాయి. అవసరార్థం ఒక్కోసారి ఇటువంటి సమాజానికి అనుకూలంగా ప్రవర్తించాలనుకున్నా అది సంపూర్ణంగా సాధ్యం కాదు. పోనీ ఈ రీతిన సామాజికం కావాలనుకున్నా అటువంటి అంశ ఎంతో కొంత మన స్వభావంలో లేనిదే ఇలా మహావృక్షంలా ఎదగటం సాధ్యం కాదు. కాబట్టి వ్యక్తిత్వం- కారెక్టర్‌తో జీవితం ఆనందమయం కావటం ఎంత అవసరమో అర్థవంతమూ, సంపూర్ణమూ కావటం అంతే ముఖ్యం. మన జీవితం గుడ్‌లైఫ్ అనిపించుకుంటే సరిపోదు... సక్సెస్‌ఫుల్ లైఫ్ అనీ అనిపించుకోగలగటం నీడ్ ఆఫ్ ది అవర్.

ప్రభావాలతోనే కారెక్టర్

సామాజిక జీవనంలో మన వ్యక్తిత్వం ప్రతిఫలిస్తుందనుకున్నాం కదా! ఇంతకీ కారెక్టర్ అనేది కుటుంబ వాతావరణంలో పెరిగి పెద్దదవుతుందా? తరగతి గదిలో కూర్చోబెట్టి బోధిస్తే అందుబాటులోకి వస్తుందా? వయసు పెరుగుతున్న కొద్దీ అనుభవాలే కారెక్టర్‌ను దిద్దితీర్చుతాయా? అసలు మనం స్వయం ప్రతిపత్తిగల వ్యక్తులం, సక్సెస్ ఫుల్ పర్సన్స్ అవుతున్నాం అంటే క్లాస్‌రూం, ఫామిలీ, సొసైటీల ప్రభావం మనపై ఉన్నట్లే.

కుటుంబ వాతావరణంలో పిల్లలు అమ్మలానో, నాన్నలానో ఎదగాలని అనుకుంటారు... అంటే వారి గమ్యం, లక్ష్యం అమ్మలా వ్యవహరించటం, నాన్నలా బాధ్యత వహించటం. పాఠశాల చదువుల ప్పుడు త్వరత్వరగా చిన్న తరగతుల నుండి ఎగబ్రాకి కాలేజీలోనో, యూనివర్సిటీలోనో అడగుపెట్టాలని ఉంటుంది. సమాజంలో గౌరవ ప్రతిష్ఠలున్న పెద్ద మనుషులను చూసి వారిలా తామూ పెద్ద మనుషులమై పోవాలనుకోవటం సహజం. ఇలా సమాజం, విద్యారంగం, కుటుంబం సక్సెస్ పరంగా ప్రభావం చూపుతుంటాయి. మొత్తానికి అన్నివిధాలా 'ఎదగటం' అన్నదే గమ్యం.. ఎదగటానికి 'పరిశ్రమించటమే గమనం. ఆరోహణపై దృష్టి ఉన్నంతకాలమూ అప్పుడప్పుడూ పడ్డా, జారినా పెద్ద లెక్కలోకి రాదు.

కారెక్టర్ వర్సెస్ ఇంటలెక్ట్

ఇలా చదువుకుంటూ పోతుంటే మనం వీరావేశంతో మోటివేట్ అవుతుంటాం. అయితే వాస్తవానికి అనుకున్నట్టుగా అన్నీ జరుగుతుండవు. అందుకే 'థింగ్స్ డిడ్ నాట్ గో యూజ్ ప్లాన్' అన్న మాటను వింటుంటాం. దాదాపు తొంభై తొమ్మిది శాతం మంది నుండి ఇటువంటి మాటలే వినవస్తుంటాయి. అంటే వీరిలో సక్సెస్‌ఫుల్ పర్సన్స్ లేరనా? ఉన్నారు... అయినా ఆ సక్సెస్ సైతం శాటిస్‌ఫాక్షన్ ఇవ్వటం లేదు. ఈ అసంతృప్తికి కారణం తమకు అందిన సక్సెస్ సకాలంలో అందకపోవటం అయినా కావొచ్చు లేదా సాను కూల సక్సెస్ అయినా కాకపోవచ్చు లేదా తాము అనుకున్న రీతి సక్సెస్ అయి ఉండకపోవచ్చు.

ఇటువంటివారికి సక్సెస్ అనేది కొండ మెట్లెక్కటం అనిపించదు.. మోకాలి పర్వతం ఎక్కటంలా అనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే మెట్లు లేని కొండరాళ్లను దాటుకుంటూ అధిరోహించటం అవుతుంది. వీరి దృష్టిలో సక్సెస్ అనేది ఏటవాలుగా ఉన్న మెట్లెక్కి శిఖరం చేరుకోవటం కాదు... నిటారుగా అవరోధాలనే మెట్లుగా చేసుకుంటూ శిఖరం అధిరోహించటం. సక్సెస్ అనేది స్వీపర్ అవుతుంటే- ఇటువంటివారు ఆశావహ దృక్పథంతోను, పట్టువిడవని తత్వంతోను, సామాజిక అవగాహనతోను దృష్టిని కేంద్రీకరించి పట్టుదలగా పరిశ్రమించటం, పరిక్రమించటం మనం గమనించవచ్చు. వీరిని గమనిస్తుంటే 'కారెక్టర్ ఈజ్ ఇంపార్టెంట్ యాజ్ ఇంటలెక్ట్' అన్న విషయం బోధపడుతుంటుంది.

కహానీ

అర్జున్

అర్జునా.. నీకేం కనిపిస్తుంది! అని ద్రోణుడు అడిగినప్పుడు, పిట్ట కన్ను తప్ప తనకేమీ కనిపించడం లేదని సమాధానమిచ్చాడు అర్జునుడు. ఇది ద్వాపరయుగం నాటి అర్జునుడి కథ. ప్రస్తుత కాలపు అర్జున్‌ను అతని మాస్టర్ ఇదే ప్రశ్న అడిగితే, సమాధానమేమీ చెప్పకపోయే వాడు. కారణం -ప్రశ్నలు కూడా వినిపించుకోలేనంతగా పనిలో లీనమవుతాడు. మన కథలో -అర్జున్ తీరు మొదటి నుంచీ అంతే. చదువు పూర్తికాగానే క్యాంపస్ సెలక్షన్స్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. లక్ష్యం తప్ప అతనికేమీ పట్టదు. పట్టించుకోడు... పట్టించుకోవాలనే ఆసక్తీ ఉండదు. తన బృందంలో అర్జున్ ఉండటం అదృష్టమని బృంద నాయకుడు చాలాసార్లు స్వయంగా అర్జున్‌తోనే చెప్పాడు. ఆ మాట అర్జున్‌కు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఉత్సాహం అతనికి అప్పగించిన పనిలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఆఫీసులో వాతావరణం ఉత్సాహంగా ఉంది.

కంపెనీకి నాలుగు ప్రాజెక్టులు వస్తేనే కళకళలాడుతుంది. ఉద్యోగుల పరిస్థితి బాగుంటుంది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టును విజయవంతం చేసినందుకు యాజమాన్యం కొందరికి ప్రమోషన్లు ఇచ్చింది. ఆ ప్రాజెక్టులో కీలక పాత్ర తనదే. జాబితాలో తొలి పేరు తనదే ఉండి తీరుతుంది అనుకున్న అర్జున్‌కు -మేనేజిమెంట్ నిర్ణయం ప్రకటించిన తరువాత అసలేం జరిగిందో అర్థం కాలేదు. బృంద నాయకుడిని యాజమాన్యం ఆకాశానికెత్తేసింది. తన పేరును ప్రస్తావించే వారే లేరు. ఎక్కడో పొరపాటు జరిగిందని అనుకున్నాడు అర్జున్. కాదు మోసం జరిగిందని గ్రహించాడు. మనసు అసంతృప్తితో రగిలిపోతోంది. కానీ ఎవరికీ చెప్పలేదు. విషయం తెలిసిన సీనియర్ ఒకరు భుజంపై చేయి వేసి పద.. క్యాంటిన్ వరకూ వెళ్లొద్దామని ఆప్యాయంగా పిలిచాడు. ఏమీ మాట్లడకుండా సీనియర్ వెంటే క్యాంటిన్‌కు వెళ్లాడు. అర్జునుడు పిట్ట కన్ను మాత్రమే కనిపిస్తుందనే కథ చిన్నప్పుడు విన్నావు కదూ? అని సీనియర్ ప్రశ్నిస్తే, వినడమే కాదు ఆ కథ నాపై తీవ్రమైన ప్రభావం చూపింది. లక్ష్యాన్ని తప్ప దేన్నీ పట్టించుకోవద్దనే జీవిత పాఠం నేర్పిన కథ అది అని అర్జున్ సమాధానమిచ్చాడు. అయినా అసందర్భంగా ఇప్పుడా విషయం ఎందుకు? అని మనసులోనే ప్రశ్నించుకున్నాడు. అర్జున్ మనసు భావాన్ని అర్థం చేసుకున్న సీనియర్ ఈ విధంగా హితోపదేశం చేశాడు. ద్వాపరకాలం అర్జునుడు కాబట్టి పిట్ట కన్నుపై మాత్రమే గురిపెట్టి చుట్టుపక్కల ఉన్న దుర్యోధన బృందాన్ని పట్టించుకోలేదు. కానీ ఇది కలికాలం. పిట్ట కన్నుపై మాత్రమే గురిపెడితే సరిపోదు. నువ్వు బాణం వేసేప్పుడు నీకాళ్ల కింద గొయ్యి తవ్వే వాళ్లు ఉంటారు. ద్వాపరకాలం నాటి అర్జునుడికి ఈ సమస్య లేదు. పని చేస్తున్నది తానే అని నీకు నువ్వు చెప్పుకోవాలి. లేదంటే ఏ దుర్యోధనుడో దాన్ని తన ఖాతాలో వేసుకుంటాడు. ఎవరికి వారే మార్కెటింగ్ చేసుకునే కలికాలమిది అన్నాడు సీనియర్.

-మురళి

విచిత్రాలు... నివాస్

గుజరాత్‌లో నరేంద్రుడే కుర్రకారు ఐకానట.. కమలంలో మొండిఘటం కాబోయే ప్రధానట

Cutest Proposal by A Boy

Boy: Can you please close your eyes for a moment?
Girl: Ok, Done
Boy: Thanks, What a darkness isn't it?
Girl: Yeah
Boy: That is my life without you.

జ్ఞాపకాలో, అనుభవాలో, అల్లరో, ఆనందమో.. ఏ అంశం మీదనైనా పాఠకులతో మీ ఫీలింగ్స్ పంచుకోవాలని అనిపిస్తే -ఈ పేజీకి రాసి పంపించండి. బావుంటే తప్పక ప్రచురిస్తాం. రచనలు పంపాల్సిన చిరునామా..

ఎడిటర్,
ఆంధ్రభూమి దిన పత్రిక
36, సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్

ఎ'సెన్స్

ఏడాదికి ఒక్కసారైన ఇలాంటి ఆనందాలు రుచి చూడకపోతే జీవితం చప్పగా సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే సంప్రదాయ బాకో డా లామా (బురద స్నానం)లో పడి బ్రెజిల్ యువత సర్వం మర్చిపోయినట్టు కనిపిస్తోంది. 1986లో ఇద్దరితో ప్రారంభమైన ఈ కార్నివాల్‌ను బ్రెజిల్ వాసులు ఉత్సహంగా జరుపుకుంటున్నప్పటి చిత్రం.

'ఖతర్నాక్ కామెడీ షో'

సినిమా పేర్లని టి.వి షోలకు వాడుకోవడం కొత్త కాదు కానీ, ఇంకా ఆ సినిమా రాకుండానే ఆ పేరుతో (జబర్దస్త్) టివి షో జబర్దస్త్ ఫిబ్రవరి 7న ఈటివిలో రాత్రి 9.30కి ఆరంభమైంది. టివి అనే వినోద వ్యాపారానికి అన్నిరకాల రసాల్ని ఆసాంతం వాడుకునే వీలుంది కనుక హాస్యరసం ప్రధానంగా కామెడీ షోలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆ పక్కీలో హిందీ టీవీలో అనేక కామెడీ షోలూ స్కిట్‌లూ వచ్చేసాయి. ఆ ధోరణిలో 'జబర్దస్త్' తయారైంది. ఈ పేరుకు ఉప శీర్షికగా 'ఖతర్నాక్ కామెడీ షో' అని పెట్టారు. ఇలా రెండు వ్యతిరేకార్థ (ఖతర్నాక్ - భయంకరమైన కామెడీ - హాస్యం) పదాలను గుదిగ్రుచ్చి వాడడం ఓ ఫాషనై కూర్చుందిప్పుడు. సినిమా ప్రచారాల్లో కూడా 'వైలెంట్ లవ్ స్టోరీ' అంటూంటారు. ఒకటి ఉన్మాదానికి పరాకాష్ఠ (హింస), మరొకటి (ప్రేమ) సున్నితత్వానికి సంకేతం. మరి హింసాత్మక ప్రేమంటే భావం ఏమిటి? అలాగే హాయిగా నవ్వుకోడానికి వీలైనది హాస్యం కాగా అందుకు విరుద్ధంగా భయం భయం భావనలు పెద్ద స్థాయిలో కలిగించేది 'ఖతర్నాక్' తత్వం. ఈ రెండింటికీ ఇందులో ముడిపెట్టారు. దాని అర్థం ఏమిటా అని షో చూస్తే కొంతవరకూ బోధపడింది. అదేమిటంటే... ఇందులో పాల్గొన్న ఆరు టీములూ తమ బృందాలతో హాస్య గల్పికలు ప్రదర్శిస్తారు. వాటిల్లో ఉత్తమమైనది ఏదో కార్యక్రమ న్యాయ నిర్ణేతలు నిర్ణయిస్తారు. వారికి ఉత్తమ ప్రదర్శనాదళం పురస్కారం చేస్తారు. దాంతో పాటు దళనాయికలు చెప్పే జోక్‌ని బట్టి బెస్ట్ జోక్‌నీ నిర్ధారణ చేస్తారు. ప్రదర్శించిన వాటిలో ఎక్కువ భాగం అసభ్యత ఆలంబనగా చేసుకుని కల్పించిన హాస్య కదంబాలే కావడం బాధాకరం. మరి టైటిల్ (ఖతర్నాక్)కు న్యాయం చెయ్యాలన్న ఉద్దేశంతోనో ఏమో ఇంతటి తీవ్రస్థాయి హాస్యకేంద్రాన్ని తీసుకున్నారనిపిస్తోంది. అయితే ఇలా హాస్యానికి ఈ మాదిరి కోటింగ్ ఇచ్చినవి ఎక్కువ కాలం నిలవవు. ఒక బృందంలో రేడియో జాకీగా వ్యవహరించిన వ్యక్తికి ప్రసార సమయంలో అత్యవసరంగా ప్రకృతి పిలుపునకు వెళ్ళవలసి వస్తుంది. కానీ రేడియోలో కాలర్స్ వెళ్ళనివ్వరు. ఆ పరిస్థితిలో అతని స్పందన అతన్ని వెళ్లనివ్వకుండా చేసిన శ్రోతల హడావిడీ ఒక హాస్య ప్రహసన ఇతివృత్తం. అలా బహిర్భూమిని బేస్ చేసుకుని సృష్టించిన హాస్యం ఆస్వాదించడం కష్టం. కానీ ఇందులో అది ప్రదర్శించిన కళాకారుడు, పక్కన సహకరించిన నటులూ అందరూ మంచి టైమింగ్‌తో చేయడం బాగున్నా ప్రధాన 'విషయం' మనస్ఫూర్తిగా ముందుకెళ్లనివ్వడం లేదు. వాస్తవానికి ఇందులో నటుడు జయప్రకాష్ రెడ్డినీ దర్శకుడు పోసాని కృష్ణమురళిని అచ్చంగా అనుకరించి న్యాయనిర్ణేత నాగేంద్ర బాబు ప్రశంసలు కూడా పొందారు. అలాగే ఇంకో టీమ్ చంద్ర క్లినిక్ పేరిట చిరకాలంగా పిల్లలు పుట్టని వృద్ధ దంపతుల విషయంలోనూ కావాల్సినన్ని 'ఖతర్నాక్' మాటల్ని యథేచ్ఛగా వాడేసారు (వయసులో ఉన్నప్పుడు...) కానీ ఇందులోనూ భాషని వ్యక్తం చేయడానికి నృత్య భంగిమల ద్వారా చూపడం బాగుంది. అయితే పంచ్ డైలాగ్‌గా ఉపయోగించిన పిల్లలు పుట్టాలంటే... అంటూ ప్రయోగించినది సభ్యతా పరిధిని దాటేసింది. ధనాధన్ ధన్‌రాజ్ టీమ్ పేరిట నటుడు ధన్‌రాజ్ ఇంకొకరి భార్యని టివి యోగాసనాలు పేరిట భర్త ఎదురుగుండానే

తీసుకుని వెళ్ళడం సరదాగా నవ్వుకునేదే అయినా ఎంచుకున్న అంశం అభ్యంతరకరంగా ఉంది. ఇదే ఆనాటి ఉత్తమ ప్రదర్శన పురస్కారాన్ని కైవసం చేసుకుంది. నల్ల వేణు టివి యాంకర్ కష్టాలు పైన చెప్పుకున్న అసభ్యతా అంశాలకు దూరంగానే ఉన్నా న్యాయనిర్ణేతలే వ్యాఖ్యానించినట్లు వేణు వంటి స్థాయికల కళాకారుడినుంచి ఇంకా ఉన్నత విభాగ హాస్యాన్ని ఎదురుచూస్తారు. రోలింగ్ రఘు టీమ్ ద్వారా చేసిన హైటెక్ బిచ్చగాడి పోకడలు బావున్నాయి. బిచ్చం ఇచ్చే మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ ట్రాన్స్‌ఫర్ చెయ్యచ్చని చివర్లో చెప్పడం కొసమెరుపు. జోకుల్లో ఉత్తమమైనదిగా ఎంపిక చేసిన (మనిషి హఠాత్తుగా పోతే మంచిదా? ఆగి ఆగి చస్తే మంచిదా..) భావ వ్యక్తీకరణ పరంగా బావుంది. నల్ల వేణు చెప్పిన కాలెండర్ జోక్ తిరిగి ఇందాక అనుకున్న అవాంఛిత ధోరణిలోనే సాగింది. ఇది గతంలోనే వేణు పలు సందర్భాలలో ప్రదర్శించినది కూడా. కొత్తదనానికి వెళ్తే బావుండేది.

న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన రోజా, నాగేంద్రబాబుల సామర్థ్యానికి వంక పెట్టడం కాదు కానీ, ఇలాంటి హాస్య ప్రధాన షోలకి ఒక హాస్య నటుడికో, నటికో భాగస్వామ్యం కల్పిస్తే బావుండేది. చూసిన యాంకర్స్‌నే చూసి చూసి విసుగెత్తిన వారికి అంతగా చూడని వ్యాఖ్యాత్రి దీనికి వ్యాఖ్యాత్రి కావడం... ఆమెకూడా చలాకీగా చేయడం ఓ.కె. టివి వ్యాఖ్యాతల పాట్లు చెప్తున్నపుడు ఆమెపైనే కెమెరా కేంద్రీకరించిన విధానం సమయోచితంగా ఉంది. ప్రదర్శన ముందు, అనంతరం కళాకారులు చేసిన నృత్యాలూ బావున్నాయి. ముఖ్యంగా రచ్చ.. టైటిల్ సాంగ్‌కు నృత్యం చేసిన కళాకారుడు మంచి ప్రతిభ కనపర్చారు. ఆఖర్లో అందరూ కలిసి 'డార్లింగే... ('మిర్చి' చిత్రంలోనిది) పాటకు కదం కదపడమూ ఆకట్టుకుంది.

మనకున్న హాస్య కళాకారులలో ప్రతిభ విషయంలో పేచీ లేదు కనుక ఎంచుకునే అంశాలు సైతం అందరూ ఆమోదించేవి తీసుకుంటే 'జబర్దస్త్...' పేరుకు తగ్గట్లు జబర్దస్తుగా వుంటుంది. రాబోయే గురువారాల్లో ఈ విధానాన్ని అనుసరిస్తారని ఆశిద్దాం.

-అన్వేషి

నో ఏజ్ బార్..

డాన్స్ చేయడం కేవలం యువతరం సొత్తే కాదు.. ఎవరైనా చెయ్యచ్చు అంటూ ఎబిసిడి (ఎనీ బడీ కెన్ డాన్స్) పేరిట ఓ సినిమా వచ్చేసిందిప్పుడు. మరి ఆ స్ఫూర్తితోనో ఏమో కానీ ప్రముఖ నృత్య కళాకారిణి గీతాకపూర్ 'ఇండియాస్ డాన్సింగ్ సూపర్ స్టార్' పేరిట ఓ నృత్య ప్రధాన వాస్తవ కార్యక్రమాన్ని రూపొందించే పనిలో ఉన్నారు. ఇందులో ప్రత్యేకత గీతాకపూర్ మాటల్లోనే....

ఏ వయసు వారైనా సరే...

''ఫలానా వయసువారే ఇందులో అభ్యర్థులుగా పాల్గొనాలనే ఆంక్షలేవీ లేవు. ఏ ఏజ్ వారైనా, సింగిల్‌గానైనా, జంటలుగానైనా పాల్గొవచ్చు. బృందాలకీ ఈ డాన్స్ షో వెల్‌కమ్ చెప్తోంది. సో... బి రెడీ టూ పార్టిసిపేట్...

నేనెందుకు లేనంటే...

అవును నాతోపాటు సహ న్యాయనిర్ణేతగా 'డాన్స్ ఇండియా డాన్స్'లో ఉన్నా రెమో డిసొజా దర్శకత్వంలో వచ్చిన ఎబిసిడిలో దాదాపు పై షోలో పాల్గొన్న వారంతా భాగస్వామ్యం వహించారు. కానీ నేను లేను. బహుశా రెమోతో ఈ మధ్య కాంటాక్ట్‌లో లేక పోవడమేమో. అయినా ఆ చిత్రాన్ని నేనో ప్రేక్షకురాలిగా చూసి ఎంజాయ్ చేస్తా. చిత్రం బాగా వచ్చిందని అంటున్నారు. ఆ రకంగా నాకు చాలా గర్వంగా ఉంది అన్నారు గీతాకపూర్.

తెలుగుదనం లోపించిన తెలుగు సీరియల్స్!

కుబుల్ టీవీలో వచ్చే వినోదాత్మక ఛానెళ్ళలో చాలామటుకు సీరియల్స్ కుటుంబ సంబంధాలను దెబ్బతీసేవిధంగా పగలు, ప్రతీకారాలతో నిండిపోయాయి. అత్తా - కోడళ్ళ మధ్య వైరంతో కూడిన సీరియల్ లేని ఛానెల్ లేదంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. సహజంగానే అత్తాకోడళ్ళు అంటే క్యాట్ అండ్ మౌజ్‌లా కనిపించే ఆధిక్యతా పోరాటమే కనిపిస్తుంది. ప్రతి అత్త కోడలిని శత్రువుగా చూస్తే, ప్రతి కోడలు అత్తను ప్రత్యర్థిగానే చూస్తుంది. పిల్లలలో ఇదే ఆలోచనా ధోరణి చిన్నప్పటినుండి పెంచి పోషింపబడుతుంది. ప్రతి ఇంట్లో అత్తాకోడళ్ళ మధ్య ఎన్ని అభిప్రాయ భేదాలున్నా చివరకు వాళ్ళు కలిసి సహజీవనం చేయకతప్పదు. కానీ వాళ్ళ అంతరాంతరాల్లో దాగి వున్న కోపం, కసిని ఈ సీరియల్స్ రూపంలో ప్రసారం చేస్తున్నారు. ఒకరిపై ఒకరు చేసే ఆధిపత్య పోరాటం ఇరువర్గాలను మానసికంగా సంతృప్తిపరుస్తుంది. అందుకనే ఆడవాళ్ళింతా ఆ సీరియల్స్‌ను విరగబడి చూస్తున్నారు. దాంతో వైవిధ్యం కోసం పగలు, ప్రతీకారాలతో పక్కబ్బంది క్రైమ్ స్టోరీలా వాటిని తీర్చిదిద్ది యువత ఆలోచనలను విషపూరితం చేస్తున్నారు. ఇలాంటి సీరియల్స్ హిందీ ఛానెళ్ళలో, తమిళ ఛానెళ్ళలో ప్రసారం అయితే వెంటనే వాటి తెలుగు అనువాదాలు మన టీవీల్లో ప్రసారం కాక తప్పదు.

సీరియల్స్ తీయడానికి మన తెలుగులో ఎన్నో మంచి నవలలు ఉన్నాయి. జనరంజక ధోరణిలో వుండే పాపులర్ సాహిత్యం బోలెడంత వుంది. అయినా ఏ నిర్మాతకూ తెలుగు సాహిత్యం వైపు చూసే దృష్టి, ఓపిక, తీరిక వుండవు. ఎంతసేపు, ఇతర భాషా అనువాదాల వైపు చూడటమే. కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు మనకంటే భిన్నంగా వున్న హిందీ సీరియల్స్ కూడా మన దగ్గర విజయవంతం కాగలుగుతున్నాయి. ఓవర్ యాక్షన్‌తో ఎబ్బెట్టుగా కనిపించే తమిళ అనువాదాలు కూడా ఆదరణ పొందగలుతున్నాయి. కాని మన ఒరిజినల్ తెలుగు సీరియల్స్ మాత్రం ఎక్కడా కనిపించడంలేదు.

ఒక భాషా ఛానెల్ ఇతర భాషా ఛానెళ్ళను కూడా ప్రారంభించినప్పుడు మూలభాషలోని సీరియల్స్, ఇతర కార్యక్రమాలను అనువదించి యథాతథంగా ప్రసారం చేసుకోవడం వ్యాపారరీత్యా వారికి సులువు, లాభం కూడా. ఈటీవీ, జెమినీ, జీటీవీలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. స్టార్‌లు కాస్త పాతబడ్డ సీరియల్స్‌ను ప్రసారం చేసుకోవడానికి 'స్టార్ ఉత్సవ్'ను ఉపయోగిస్తున్నారు. ఎక్కువగా ప్రజాదరణ లేని స్టార్ ఉత్సవ్‌ను డిడి డైరెక్ట్ డిష్‌లో వేయడం ద్వారా ఆ డిష్ వున్న ప్రేక్షకులకు ఈ చానెల్ చేరువ కాగలిగింది. అలాగే దూరదర్శన్‌లో వచ్చిన సీరియల్స్, ఇతర కార్యక్రమాలను ప్రసారం చేసుకోవడానికి డిడి- ఇండియా, డిడి భారతి వుండనే వున్నాయి.

దూరదర్శన్ జాతీయ కార్యక్రమాల్లో చోటుచేసుకున్న తెలుగు సాహిత్యం మిగతా భాషావాళ్ళతో పోలిస్తే చాలా తక్కువనే చెప్పాలి. వేయి పడగలు, అమరావతి కథలు తప్ప పెద్దగా ఏవీ కనిపించవు. నిజానికి దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్ళు మాత్రమే ప్రాంతీయ భాషా సాహిత్యాలకు పెద్ద పీట వేస్తున్నాయని చెప్పాలి. నవీన్ రాసిన 'బాంధవ్యాలు' నవలను అక్కినేని కుటుంబరావు దర్శకత్వంలో 250 ఎపిసోడ్లుగా మలచి దూరదర్శన్‌లో ప్రసారం చేశారు. వీరివే 'సంకెళ్ళు' నవల జెమినీ టీవీలో జితేందర్ దర్శకత్వంలో 13 ఎపిసోడ్లుగా వచ్చి విజయవంతం అయింది. వాసిరెడ్డి సీతాదేవి 'బొమ్మరిల్లు' సీరియల్ దూరదర్శన్‌లోనే వచ్చింది. ఎవరూ సాహసించని 'కొమురం భీం' సీరియల్‌ను కూడా ప్రసారం చేసిన ఘనత దూరదర్శన్‌కే దక్కుతుంది.

సీరియల్స్ కాకుండా ప్రముఖ రచయితల కథలనుకూడా టెలిప్లేలుగా సింగిల్ ఎపిసోడ్స్‌గా మార్చి ప్రసారం చేయడం దూరదర్శన్ ప్రత్యేకత అని చెప్పాలి. వీటన్నింటిలో 'భమిడిపాటి రామగోపాలం కథల'ను చిన్నితెరకెక్కించిన విధానం బాగుంది. సుత్తివేలు ప్రధాన పాత్రధారిగా కొనసాగే ఈ కథలు

మంచి హాస్య, వ్యంగ్యాలతో కూడుకుని వుండటంవల్ల ప్రజాదరణ పొందగలిగాయి. వీటిని ఎన్నిసార్లు ప్రసారం చేసినా బోర్ అనిపించదు. హాయిగా, సరదాగా చూడటానికి బావుంటాయి. యర్రంశెట్టి సాయి కథలు కూడా అంతే. అయితే ఇందులో పాతవేవో, కొత్తవేవో తెలియకుండా వరుసగా ప్రసారం చేసుకుంటూనే పోవడం దూరదర్శన్ ప్రత్యేకత. జనవరి 29 నుండి ఇప్పటివరకు ప్రఖ్యాత రచయితల కథల టెలిప్లే సింగిల్ ఎపిసోడ్స్ ఉదయం 8.30 నుండి 9 వరకు ప్రసారం చేస్తున్నారు. ఇందులో మొదటగా విశ్వనాథ సత్యనారాయణ కథను ప్రసారం చేశారు. అది అంతక్రితమే సాయం ప్రసారాల్లో వచ్చింది. 1.2.13 ఉదయం వాకాటి పాండురంగారావు రాసిన 'ముల్లు' కథ ఆధారంగా నిర్మించిన టెలిప్లే ప్రసారం చేశారు. వైవాహికేతర సంబంధాల ఆకర్షణ, దానివల్ల కుటుంబంలో జరిగే ఘర్షణను ఈ ఎపిసోడ్ చిత్రీకరించింది. 2.2.13 ఉదయం కూడా అదే ఎపిసోడ్‌ను మళ్ళీ ప్రసారం చేయడం ఆశ్చర్యాన్ని, విసుగును కలిగించింది. కామెడీ ఎపిసోడ్లను మాత్రమే మళ్ళీమళ్ళీ ప్రసారం చేస్తే చూడగలం కానీ సీరియస్ టాపిక్‌తోవున్న ఎపిసోడ్లను 24 గంటల్లోనే మళ్లీ చూడాల్సి రావడం ఎంత చికాకనిపిస్తుందో చెప్పలేము. ముందే అన్నీ ప్లాన్డ్‌గా వుంచుకుని ప్రసారం చేస్తారా? లేక ఆ సమయానికి చేతికి అందిన ఏదో ఒక కేసెట్‌ను వేసేస్తే సరిపోతుందనుకుంటున్నారా? ఇంత నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా ప్రవర్తించడం ఒక్క దూరదర్శన్‌కే చెల్లుతుంది. ఏది చేసినా, ఎవరు చూడొచ్చారులే అన్న నిర్లక్ష్యమే ఎక్కువగా కనబడడం విచారకరం.

26 జనవరి తర్వాత దూరదర్శన్ కార్యక్రమ ప్రసారాల్లో మార్పు వచ్చినట్లుగా కనిపిస్తుంది. ఉదయం 8 గంటలకు 'ఆణిముత్యాలు' శీర్షికన ప్రసారమయ్యే పాత సినిమా సీరియల్ తిరిగి అదే రోజు సాయంత్రం 5.30కు ప్రసారమయ్యేది. దీన్ని ఎత్తివేసి 'తెలుగు విజయం' ప్రసారమవుతున్నది. రాత్రి 9.30కు ప్రసారమయ్యే వార్తలు 9 గంటలకు, తొమ్మిది గంటలకు ప్రసారం కావాల్సిన బైస్కోపు 9.15కు ప్రసారమవుతున్నది. అలాగే 'పూతరేకులు' కూడా వెనుకకు జరిగింది. ఇంకా కనిపించని మార్పులు ఏమున్నాయో తెలియదు.

ఖుషీ ఖుషీగా నవ్వుతూ కార్యక్రమంలో వరుసగా ప్రసారం చేసిన 'కాంచనమాల కేబుల్ టివి' చిత్ర హాస్య సన్నివేశాలను చూస్తే, ఆ సినిమాను 3.2.13 ఆదివారం నాలుగు గంటలకు ప్రసారం చేయడం పెద్దగా ఆశ్చర్యం అనిపించలేదు. ఈ చిత్రం సాయంత్రం ఆరు గంటలకు అయిపోగానే వేరే ఛానెళ్ళు వెతుకుతూ అనుకోకుండా చెన్నై దూరదర్శన్ చూడగా జెమినీ గణేశన్, అంజలీదేవి నాయికా నాయకులుగా నటించిన ఒక తమిళ జానపద చిత్రం ప్రసారమైంది. ఇందులో చిత్తూరు నాగయ్య, కన్నాంబ, మీనాకుమారి లాంటి తెలుగు నటీనటులు కనిపించడంతో తప్పకుండా ఇదేదో తెలుగు చిత్రానికి రీమేక్ అనిపించింది. చాలా ఆసక్తికరంగా గడిచిన ఆ గంటసేపు చిత్రం నేను ఎన్నో ఏళ్ళ నుండి వెతుకుతున్న 'స్వర్ణమంజరి' తమిళరూపం కావడం బోలెడంత ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా వేసింది.

సప్తగిరిలో ప్రసారమయ్యే కార్యక్రమాలు చాలావరకు పునఃప్రసారం అవుతూనే వుంటాయి. వాటిని ఎప్పుడు ఏ సమయంలో ప్రసారం చేస్తున్నారో ముందే తెలియజేస్తే ప్రేక్షకులు తమ వీలును బట్టి చూసుకొనే అవకాశముంటుంది. 'మంచి కుటుంబం' కార్యక్రమం ఆదివారం 8 గంటలకు వస్తుందని తెలుసు. కాని అది ముందుగా శనివారం రాత్రి పది గంటలకు ప్రసారమవుతున్నదని తెలియదు. ఇప్పుడిప్పుడే రెండు రోజుల ప్రసారం గురించి తెలియజేస్తున్నారు. 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' శనివారం 9.15 ప్రసారమవుతున్నది. తిరిగి దీన్నే సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇస్తున్నారు. ఈ విషయాన్ని మొదటి ప్రసారం కాగానే తెలియజేస్తే బాగుంటుంది కదా! మధురగీతాలు, రంగోళి, సాహితీ తోట, తెలుగింటి అమ్మాయిలకు మాత్రమే రెండు ప్రసారాల వేళలను తెలియజేస్తున్నారు. ఒక నాటకం కానీ, సీరియల్ కానీ, ఇతర కార్యక్రమాలు ఏవైనా ప్రసారం చేస్తున్నప్పుడు మధ్యలో, చివరలో అది ఏమిటో తెలియజేయడం అన్ని ఛానెళ్ళలో కనిపిస్తుంది.

ఇంత చిన్న విషయాన్ని దూరదర్శన్ ఎందుకు పట్టించుకోదో అర్థం కాదు. చాలామంది అనుకోకుండా ఆ ఛానెల్ మధ్యలోంచి చూస్తూ, ఇంట్రెస్టింగ్‌గా వుంటే అలా చూస్తూనే వుండిపోతారు. ఇంతకీ తాము ఏం చూస్తున్నారో తెలియజేయాల్సిన బాధ్యత దూరదర్శన్‌కు లేదా? టెలిప్లే ముగిసిన తర్వాత ఫలానా రచయిత రాసిన, ఫలానా కథ ఆధారంగా రూపొందించిన నాటకం మీరు ఇంతవరకు చూశారని తెలియజేసినా బాగుంటుంది. ఇవన్నీ పక్కనబెట్టి దూరదర్శన్ సమర్పణ అని పెద్దగా వేసుకోవడంవల్ల ఒరిగేదేమీలేదు.

-కె.పి.అశోక్‌కుమార్

గతం వద్దు...

జరిగిపోయినదాని గురించి తీవ్రంగా ఆలోచించడం కన్నా భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకోడానికీ, అందుకు తగిన ఆచరణాత్మక కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేయడానికే ఎక్కువగా మనిషి ఇష్టపడాలి అన్న సామాన్య సూత్రాన్ని తు.చ తప్పకుండా నటి సరాఖాన్ పాటిస్తోందని ఆమె ఇటీవల కొన్ని విషయాలపై స్పందించిన తీరుని బట్టి అనిపిస్తోంది.

'బిదాయీ', 'బిగ్‌బాస్'ల ద్వారా చిన్నతెర ప్రేక్షకుల్ని విశేషంగా ఆకర్షించిన సరా ప్రస్తుతం 'బాజీమెహమాన్ నవాజీకీ'లో తిరిగి తన సత్తా ప్రదర్శించనుంది. విశేషమేమంటే ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే అతిథుల శ్రేణిలో సరా మాజీ భర్త అలీ మర్చెంట్ కూడా వుండడం. అతన్ని చూసి అవాక్కైన సరాని మాట్లాడించడానికి మీడియా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. 'నా గతాన్ని గురించి మాట్లాడడానికి నేనిష్టపడను..' అన్న ఒక్క వాక్యమే ఆమె నోటి వెంట వచ్చింది. మరి పలుకే బంగారమా?

గంగతో వస్తున్న రాంబాబు

'కాణీ ఖర్చు లేదు, కాలం వేస్టు కాదు, కష్టం మర్చిపోయే సిస్టమ్ నవ్వు రా' అని ఒక కవి అన్నట్టు.. చూసే కళ్లు, ఆస్వాదించే మనసు ఉంటే ఈ ప్రపంచమంతా ఆనందమయమే.. ఆ ఆనందాన్ని మోసుకురావడానికి ఓ నవ్వుల గ్యాంగ్‌ని వెంటేసుకొని 'గంగతో రాంబాబు' వచ్చేశాడు. గతంలో 'మై నేమ్ ఈజ్ మంగతాయారు' 'కృష్ణావతారాలు' వంటి కామెడీ సీరియల్స్‌ని అందించిన జీ ఛానెల్ 'గంగతో రాంబాబు' సీరియల్‌ని ఫిబ్రవరి 11 నుండి ప్రసారం చేస్తోంది. ప్రతిరోజూ రాత్రి 10.30 ని.లకు రోజూ ఒక కొత్త ఎలిమెంట్‌తో, నిత్యం మన చుట్టూ జరిగే కరెంట్ ఎఫైర్స్‌ని హాస్యప్రధానంగా అందించనుంది. ఓ టీవీ కళాకారుడిగా రాంబాబు పాత్ర, బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడుతూ వంటింటి క్వీన్‌గా అతని భార్య గంగ పాత్రలతోపాటు.. నా అందం అరకిలో మందం అనుకొనే బి.టి. సుందరి, చెట్టుకింద కూడా స్థానం దొరకని ప్లీడర్‌గా రామ్‌పితానీ, అందరినీ అలరించే రేడియో జాకీ, శ్రీకాకుళంలో యాసలో మాట్లాడుతూ నవ్వుల్ని పూయించే గంగ తమ్ముడు సత్తిపండు, మరింకెంతోమంది. ఈ నెల 11 నుండి ఈ సీరియల్ ప్రసారమవుతోంది. *

ఇంటింటా

★ గుప్పెడు పుదీనా ఆకులు, ఒక టమాటా, నాలుగు కీరా దోస ముక్కల్లో కాస్త ఉప్పు, మిరియాల పొడి కలిపి, మిక్సీలో వేసి జ్యూస్‌లా చేసుకుని తాగితే మేని రంగు మెరుస్తుంది. రక్తశుద్ధి కూడా జరుగుతుంది. మొటిమల వంటి చర్మ సంబంధ సమస్యలు దూరమవుతాయి.

★ చెంచాడు పుదీనా పొడిలో రెండు చెంచాల సోయా పిండి, కాస్త తేనె కలిపి ముఖానికి గట్టిగా పట్టించాలి. ఇందులో సోయా పిండి బదులు పాలపొడిని కలుపుకోవచ్చు. ఇలా చేస్తే శరీరానికి నిగారింపు వస్తుంది.

★ పుదీనా పొడిలో కాస్త శనగ పిండి, టమాటా గుజ్జు, నిమ్మరసం, పాలను కలిపి చర్మానికి రాసుకుంటే మచ్చలు తొలగిపోతాయి.

★ నాలుగు చెంచాల వేపాకు పొడిలో రెండు చెంచాల తేనె, కాస్త బియ్యం పిండి లేదా శనగ పిండి, నిమ్మరసం కలిపి పేస్టులా చేసుకుని శరీరానికి ప్యాక్‌లా వేసుకుంటే చర్మం మృదుత్వంతో కాంతివంతమవుతుంది.

★ ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించే టపుడు కాసిన్ని పాల చుక్కలు వేస్తే అవి త్వరగా వేగడమే గాక మంచి రుచి కూడా వస్తుంది.

★ క్యారట్ దుంపలు తాజాగా ఉండాలంటే ఉప్పు కలిపిన నీటిలో ఉంచాలి.

★ కాకరకాయ ముక్కలకు నిలువుగా గాట్లు పెట్టి అందులో కాస్త గోధుమ పిండి, పెరుగు, ఉప్పు కలిపిన ముద్దను పెట్టి నూనెలో వేపితే కూరకు మంచి రుచి వస్తుంది.

ఆడే వయసులో అమ్మతనం..!

యుక్త వయసు రాకుండా గర్భం దాల్చడం తల్లి, శిశువుకు ఎంత మాత్రం క్షేమకరం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్నా పలు దేశాల్లో చిన్నారి బాలికలు ప్రసవిస్తున్న సంఘటనలు వెలుగు చూస్తునే ఉన్నాయి. మైనర్ బాలికలను గర్భవతుల్ని చేయడం లైంగిక నేరంగానే పరిగణించాలని చట్టాలు ఘోషిస్తున్నా ఇలాంటి అకృత్యాలు కొన సాగుతునే ఉన్నాయి. అభం శుభం తెలియని బాలికలపై కామవాంఛలు తీర్చుకునే వారిని కఠినంగా శిక్షించాలని ప్రపంచ వ్యాప్తంగా మహిళా ఉద్యమ సంస్థలు, మానవ హక్కుల సంఘాలు చిరకాలంగా ఉద్యమిస్తునే ఉన్నాయి. అయినా, ఎక్కడో ఒకచోట బాలికలు బాలింతలవుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మెక్సికోలోని జాలిస్కో ప్రాంతంలో తొమ్మిదేళ్ల డాఫ్నే ఆడశిశువుకు జన్మనివ్వడం చర్చనీయాంశమైంది. ఈమెకు సిజేరియన్ శస్త్రచికిత్స చేసి శిశువును బయటకు తీశారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగానే ఉన్నారని వైద్యులు ప్రకటించారు. కాగా, ఈ బాలిక ఇక ముందు గర్భం దాల్చకుండా వైద్యులు మరో ఆపరేషన్ చేశారు. డాఫ్నే తల్లి నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే సంతాన నిరోధక శస్త్రచికిత్స చేయడం మరో వివాదానికి దారి తీసింది. 17 ఏళ్ల బోయ్‌ఫ్రెండ్ కారణంగానే డాఫ్నే గర్భం దాల్చిందని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు నెలల క్రితమే తనతో కలిసి వేరే ప్రాంతానికి వచ్చేయమని ఈ బాలికపై వత్తిడి తెచ్చిన బోయ్‌ఫ్రెండ్ ప్రస్తుతం కన్పించకుండా పోవడంతో పోలీసులు గాలిస్తున్నారు. డాఫ్నే తల్లి కావడానికి ఆమె సవతి తండ్రి కారకుడన్న ఆరోపణలు కూడా రావడంతో అతడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, గత ఏడాది కొలంబియాలో పదేళ్ల బాలిక ప్రసవించింది. ఆ ప్రాంతంలోని ఓ తెగలో బాలికలు తల్లులుగా మారడం చాలాకాలంగా జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఈ తెగను పరిరక్షించేందుకు అక్కడి ప్రభుత్వం కొన్ని ప్రత్యేక హక్కులు, స్వేచ్ఛ కల్పించడంతో బాలికలు గర్భవతులవుతున్నారని వైద్య నిపుణులు అంటున్నారు.

చిన్నారి బాలికలు తల్లులవుతున్న విషయం ఈనాటిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. 1939లో పెరూలో అయిదేళ్ల బాలిక లీనా మెడినా ఓ శిశువుకు జన్మనిచ్చింది. అత్యంత పిన్న వయసులో లీనా తల్లి కావడం ఇప్పటికీ ఓ రికార్డుగా మిగిలిపోయింది. ఈ సంఘటనకు సంబంధించి లీనా తండ్రిని పోలీసులు అరెస్టు చేసినా, తగిన సాక్ష్యాధారాలు లేనందున అతడిని విడిచి పెట్టారు. అయితే, లీనా బిడ్డకు తండ్రి ఎవరన్న విషయాన్ని పెరూ ప్రభుత్వం ప్రకటించలేదు. మన దేశ రాజధాని ఢిల్లీలోని విక్టోరియా జనానా ఆస్పత్రిలో 1932లో గుర్తు తెలియని ఆరేళ్ల బాలిక ప్రసవించినట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. 1934లో ఉక్రెయిన్‌లోని ఖార్కోవ్‌లో ఆరేళ్ల బాలిక ఓ ఆడశిశువుకు జన్మనిచ్చి పురిట్లోనే కన్నుమూసింది. ఆస్ట్రేలియాలో 2010లో పన్నెండేళ్ల బాలిక ప్రసవించింది. ఈమె గర్భవతి కావడానికి కారకుడైన సమీప బంధువును పోలీసులు అరెస్టు చేసి లైంగిక నేరాల చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించారు. బ్రిటన్‌లో అత్యంత పిన్న వయసులో తల్లయిన బాలికగా 2002లో ఎమీ క్రోహ్రాస్ట్ (12) ఓ బిడ్డకు జన్మనిచ్చి రికార్డు సృష్టించింది.

11 ఏళ్ల వయసులో కవలలకు తల్లి!

అర్జెంటీనాలో తాజాగా ఓ 11 ఏళ్ల బాలిక కవల పిల్లలను ప్రసవించింది. ఈమె మరికొద్ది రోజుల్లో 12వ జన్మదినోత్సవం జరుపుకోవాల్సి ఉండగా తల్లిగా మారడం సంచలనం సృష్టించింది. గర్భస్థ శిశువులను నెలలు నిండక ముందే సిజేరియన్ ఆపరేషన్ చేసి బయటకు తీశారు. ఈమెకు గర్భం రావడానికి కారకుడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. పోలీసులు మాత్రం మరో ఇద్దరు యువకుల కోసం గాలిస్తున్నారు. కాగా, ఈ బాలిక పిన్ని (14) కూడా మూడు నెలల ముందు ప్రసవించడం చర్చనీయాంశమైంది.

అనేక దేశాల్లో ఇలాగే అతి చిన్న వయసులోనే గర్భం దాల్చిన బాలికల సంఖ్య వందల్లోనే ఉంది. ఏదో అనారోగ్యం కారణంగా పొట్ట భాగం పెరుగుతోందని భావించడం తప్ప, నెలలు నిండిన వరకూ వీరు గర్భవతులన్న విషయాన్ని కుటుంబ సభ్యులు సైతం గమనించలేక పోయారు. లోక జ్ఞానం లేని వయసు కావడంతో ఆ బాలికలు కూడా తాము గర్భం దాల్చామన్న సంగతి తెలుసుకోలేక పోయారు. సవతి తండ్రులు, కుటుంబ సభ్యులు, పరిచయస్థులు కామవాంఛలు తీర్చుకోవడం వల్లే బాలికలు గర్భవతులైన ఉదంతాలు కోకొల్లలు. ఆరోగ్య పరిస్థితి సహకరించక పోవడం వల్ల ప్రసవ సమయంలో లేదా ఆ తర్వాత చిన్నారి తల్లులు అనారోగ్యంతో మరణిస్తున్నారు. ■

బడుల్లోనే వేధింపులు..!

బాలికలపై అధిక శాతం లైంగిక వేధింపులు పాఠశాలల్లోనే చోటు చేసుకుంటున్నాయని మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అమెరికాలోని ప్రభుత్వ స్కూళ్లలో బాలికలపై లైంగిక నేరాలు అధికంగా ఉన్నట్లు సాక్షాత్తూ అక్కడి విద్యాశాఖ గతంలోనే ఓ నివేదిక విడుదల చేసింది. *2004*లో జరిగిన ఓ అధ్యయనం ప్రకారం అమెరికాలోని ప్రభుత్వ స్కూళ్లలో దశాబ్ద కాలంలో *2,90,000* మంది చిన్నారులు లైంగిక దాడులకు గురయ్యారు. కొన్ని సంఘటనల్లో మగ టీచర్లే నిందితులైనప్పటికీ, వారిని విధుల నుంచి తప్పించడం తప్ప కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. చాలా సంఘటనల్లో నిందితులకు శిక్షలు పడనందున బాలికలపై లైంగిక నేరాలు తగ్గడం లేదని విద్యారంగ నిపుణులు అంటున్నారు. ఇక, భారత్‌లోనూ బాలికలు ఇంటాబయటా పలు రకాల వేధింపులకు గురవుతున్నారని మానవ హక్కుల సంస్థలు పేర్కొంటున్నాయి. ఇటీవల ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచార ఘటన నేపథ్యంలో మహిళలు, బాలికల భద్రత కోసం కఠిన చట్టాలను రూపొందించాలని నిరసనలు వెల్లువెత్తాయి. బాలల హక్కుల రక్షణకు ఇప్పటికే పలు చట్టాలున్నా వాటిని పూర్తి స్థాయిలో అమలు పరచడం లేదన్న విమర్శలున్నాయి. బాలికలకు భద్రత కల్పించేందుకు, నిందితులను సకాలంలో శిక్షించేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని 'హ్యూమన్ రైట్స్ వాచ్' సంస్థ గతంలో ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించింది. లైంగిక దాడులకు గురైన బాలికలకు ఆదుకోవడంలోనూ వైఫల్యాలు కన్పిస్తున్నాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. లైంగిక నేరాలపై చాలామంది బాధితులు ఫిర్యాదులు చేయనందున వాస్తవ గణాంకాలు లభించని దుస్థితి మన దేశంలో నెలకొంది. సమాజంలో కట్టుబాట్లు, కుటుంబ పరువు, పలు రకాల వత్తిడులు, పోలీసుల నిర్లక్ష్యం వంటి అనేక కారణాల వల్ల ఫిర్యాదులు చేసేందుకు చాలామంది ఇష్టపడడం లేదు. పాఠశాలలు, అనాథాశ్రమాల్లో బాలలపై లైంగిక నేరాలు జరుగుతున్నాయని ఢిల్లీకి చెందిన బాలల హక్కుల సంస్థ ప్రతినిధి అనూజ గుప్తా చెబుతున్నారు. పిల్లల బాగోగులను చూడాల్సిన వారే అకృత్యాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయని ఆమె అంటున్నారు. అనాథ పిల్లలకు రక్షణ ఉండాల్సిన చోటే భద్రత లేకపోవడం దారుణమని 'హ్యూమన్ రైట్స్ వాచ్' దక్షిణాసియా ప్రాంత డైరెక్టర్ మీనాక్షి గంగూలీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణకు *2012*లో కేంద్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని రూపొందించినా అది అమలవుతున్న తీరు అంతంతమాత్రంగానే ఉందని ఆమె ఆరోపిస్తున్నారు. లైంగిక నేరాలకు సంబంధించి కింది స్థాయి పోలీసు అధికారుల్లో తగిన అవగాహన లేనందున, చాలా కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తున్నారని మీనాక్షి అంటున్నారు. చాలా కేసుల్లో శిక్షలు పడకపోవడం, ఏళ్ల తరబడి కోర్టు విచారణలు కొనసాగడంతో న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు ఆసక్తి చూపడం లేదు. దీంతో బాలికలపై లైంగిక నేరాలు తగ్గుముఖం పట్టడం లేదు.

లైంగిక ఆరోపణలతో స్కూల్‌కు తాళాలు!

అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ పాఠశాలను లైంగిక కార్యకలాపాల ఆరోపణలతో మూసివేశారు. పిల్లల్లో కామచేష్టలు పెరిగిపోతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పాఠశాలను మూసివేస్తున్నట్లు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ పాఠశాలలో పిల్లలంతా అయిదేళ్ల వయసు లోపు వారే. పాఠశాలలో టీచర్ల పర్యవేక్షణ లోపించడంతో కొందరు పిల్లలు కామ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తల్లిదండ్రులు గమనించారు. టీచర్లు తరగతి గదుల్లో లేనపుడు విద్యార్థులు శారీరకంగా దగ్గరవుతూ కామ ప్రవృత్తితో ప్రవర్తిస్తున్నారట! అయితే, పాఠశాల మూసి వేయడానికి వేరే కారణాలున్నాయని, పిల్లల్లో లైంగిక ప్రవర్తన కారణం కాదని స్కూలు యాజమాన్యం వాదిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా టీచర్లు లేనందున ఈ స్కూల్‌లో కొన్ని అకృత్యాలు జరుగుతున్నట్లు కాలిఫోర్నియాలోని సంక్షేమ సర్వీసుల విభాగం అధికారులు అంటున్నారు. పాఠశాలను నిర్వహిస్తున్న మత సంస్థపైన, ప్రిన్సిపాల్‌పైన, ఓ టీచర్‌పైన కోర్టులో ఫిర్యాదులు చేశారు. ఈ కేసుల సంగతెలా ఉన్నా, లైంగిక ప్రవర్తన కారణంగా తమ పిల్లల చదువులు మాత్రం దారి తప్పాయని కొందరు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మాధవ సేవే మానవ సేవ!

అవీ.. ఇవీ.. అన్నీ..

- వీరాజీ

చెన్నై సమీపంలోని నంగనల్లూర్‌ని చిన్న కాంచీపురం అని కూడా పిలుస్తారు. ఆ వూళ్లో చాలా దేవాలయాలున్నాయ్. అక్కడ ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కనిపిస్తారు. మూడో ఆదివారం వచ్చిందంటే చాలు- లోకల్ రైలులో ఓ 30 మంది అబ్బాయిలూ, అమ్మాయిలూ బిలబిలా రైలెక్కేస్తారు. వాళ్ల దగ్గర గునపాలూ, పారలూ, గమేలాలూ లాంటి కూలిపనికి పనికొచ్చే సామగ్రి, లంచ్ బాక్సులు కూడా వుంటాయి. వీళ్లు సమీపంలోని దేవాలయానికి చేరుకుని-అక్కడ బావి, కొలను వగైరాలు వుంటే పూడికలు తీస్తారు. గుడి మెట్లు- పెరడు శుభ్రం చేస్తారు. చెత్తాచెదారం తట్టలకెత్తి దూరంగా పారబోసి వస్తారు. నెలకి లక్ష రూపాయల ఆదాయం వుండే ఈ యువ దళంలో ఎనిమిది మంది యువతులున్నారు. వీళ్లు 2011లో 'సన్' (సూర్య) సంస్థలో కలిశారు. సన్ అంటే సిరుతొండార్ (ఎస్) యుళవర (యు) నార్పన్ (ఎన్) సంఘం. మాధవసేవ ద్వారా మానవసేవ చేయాలన్న సంకల్పంతో చందాలు వేసుకుని-కాంచీపురం ఏకాంబరేశ్వర ఆలయ కొలనును బాగుచేశారు. గుడి పెరడునూ, చెరువునీ- మూడుమాసాలు కష్టించి బాగుచేశారు. సూర్య సభ్యురాలు, సత్యభామా యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ముత్తులక్ష్మి చెప్పింది ఇలా- 'శివాలయాలు ఆలనా పాలనా లేకుండా వుంటాయి. నెలకో 'పేద' గుడిని ఎంచుకుని శ్రమదానం చేస్తాం. దేవుడి సన్నిధిలో సేవలు చేసి, మన ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల్ని, మానవత్వాన్నీ కాపాడాలన్నదే మా నిర్ణయం.' 'ఏ ఆలయానికి వెళ్లాలన్న విషయాన్ని ప్రతి నెలలో తొలి ఆదివారం నిర్ణయిస్తాం. మేం దేవుడి కూలీలం. కొన్ని సంస్థల వలే మేం చందాలు, డొనేషన్లూ వసూలు చేయం. మా సేవ- మా ప్యాకెట్ మనీ- అంతే! పారా, పలుగూ, చీపురూ, తట్టా, బుట్టా ఇవే మా పూజాసామగ్రి.' అని ఆమె చెబుతోంది.

ఇట్లా వీళ్లు యిప్పటికి- పన్నెండు దేవాలయాల్ని శుభ్రం చేసి- తళతళా మెరిసేలా దైవకళని పునరుద్ధరించారు. ''నిజంగా ఇటువంటి యువతీ యువకులు- మరో వంద బృందాలు వుంటేనా? స్వర్గం నుంచి దేవతలు కిందికి దూకి రారా?'' అంటారు పెద్దలు.

veeraji@sify.com

రేపు 'శతకోటి ప్రజాగళం'!

ఓవైపు 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ప్రేమికులు సంబరాల్లో మునిగి తేలేందుకు సిద్ధపడుతుండగా- మరోవైపు ఇదే రోజున 'శతకోటి ప్రజాగళం' పేరిట పెద్ద ఎత్తున మహిళలు నిరసన తెలిపేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికలపై హింస, లైంగిక నేరాలు పెచ్చుమీరుతున్నందుకు నిరసనగా వివిధ దేశాల్లో స్త్రీలు ఎక్కడికక్కడ భారీగా ప్రదర్శనలు జరపాలని ప్రఖ్యాత నాటక రచయిత్రి, హక్కుల కార్యకర్త ఈవ్ ఎన్‌స్లర్ ఇదివరకే పిలుపునిచ్చారు. ఈ పిలుపునకు భారత్‌తో పాటు సుమారు 150 దేశాల్లోని మహిళా సంఘాలు, మానవ హక్కుల సంస్థలు, విద్యార్థి సంఘాలు స్పందించి, 'శతకోటి ప్రజాగళం' నిరసనకు మద్దతు ప్రకటించాయి. విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో కనీసం ఒకరు ఏదో ఒక రూపంలో హింసను ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితులను నివారించేందుకు పాలకులపై తీవ్ర స్థాయిలో వత్తిడి తేవాలని మహిళా ఉద్యమకారులు నిర్ణయించారు. నిరసన సందర్భంగా పాటలు పాడాలని, నృత్యాలు చేయాలని, నినాదాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. వీలైతే పురుషుల మద్దతు కూడా తీసుకోవాలని నిర్ణయించారు. 'శతకోటి ప్రజాగళం'తో మహిళల్లో పోరాట పటిమ పెరుగుతుందని, పాలకుల నిర్లక్ష్య ధోరణిలో కొంతైనా మార్పు వస్తుందని ఉద్యమకారులు భావిస్తున్నారు. ■

ఆల్ ఈజ్ వెల్..!

మరమరాలు

-శారదా అశోకవర్ధన్

ఎవరికీ పట్టదా? ఇదేం ప్రభుత్వమండీ? ఒక పక్క పలు సంక్షేమ కార్యక్రమాలన్నీ మీ కోసమేనంటూ తెగ ప్రచారం చేస్తూనే మరో పక్క ముక్కు పిండి బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. దీపాలు వెలగకపోయినా తరచూ పెంచేస్తున్న కరంటు బిల్లులు, అంబరాన్ని తాకుతున్న బియ్యం ధరలు, పప్పులూ, చింత పండూ, మిరపకాయలూ, ఉల్లిగడ్డలు కొనలేని పరిస్థితులు సాధారణ, మధ్య తరగతి జనాలను బెంబే లెత్తిస్తున్నాయి. అతి చవకగా దొరికే దొండ, బెండ వంటి కూరల ధరలు జనం నడ్డి విరిచేస్తూంటే, ఆ నడ్డి విరుపులూ, దెబ్బలూ భరించలేక జనం పెట్టే పెడబొబ్బలు నేతలకు వినబడడం లేదా? ఆధార్ కార్డ్ లేకపోతే నాలుగు వందల పన్నెండు రూపాయల గ్యాస్ సిలిండర్‌ని వెయ్యి రూపాయలిచ్చి కొనుక్కోండి, లేకపోతే మానుకోండి- అని చెప్పడం ప్రజలమీద ప్రభుత్వానికుండే నిర్లక్ష్య ధోరణిని వ్యక్తం చేస్తోంది. ఇక వచ్చేస్తోంది ఎండాకాలం! ఎండలు దంచేస్తాయ్! పవర్ కట్లు ప్రాణాలు తీసేస్తాయ్! ఏసీలూ గీసీలూ వున్నా దండగే! చేతిలోని డబ్బులు నీళ్లలా కరిగిపోతూ, మనని పిచ్చివాళ్ళను చేస్తాయ్. సరైన తిండి లేక ఆసుపత్రి పాలవుతూ, ఆ మందుల ఖర్చులూ భరించలేక ప్రజలు విల విల కొట్టుకుపోతూంటే, ప్రభుత్వ నేతలు పూర్తిగా పట్టించుకోకుండా 'అంతా బాగానే ఉంది' అంటూ ఉపన్యాసాలు దం చేస్తూ సంబరాలూ, సంతర్పణలూ చేసుకుంటున్నారు. ఏ ఖర్చు ముందు పెట్టాలో? ఏ ఖర్చు తరువాత పెట్టాలో? కూడా తెలీకుండా వ్యవహరిస్తున్నారు.



ఏ మనిషికైనా ముందు కావలసినది కూడూ గుడ్డ కదా! దాహం తీర్చడానికి గొంతెండిపోకుండా తాగే నీరు అత్యవసరం. అందుకు కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయడం, ఆ దిశగా వనరులను సమీకరించుకోవడం, కావలసిన నిర్మాణాత్మక కార్యక్రమాలను చెయ్యడం ప్రభుత్వం వారి ప్రథమ బాధ్యత కాదా? ఒక పక్కన జనం చస్తుంటే- సన్నాయి వాయించుకుంటూ కూర్చుని, 'నేను కళాకారుణ్ణి'ని చెప్పుకుంటే ఎవరైనా హర్షిస్తారా? ఏది ముందో, ఏది వెనకో ఒక పద్ధతిలో అమర్చుకోవాలి కదా! అదే కదా ప్రణాళిక అంటే అర్థం. అన్ని అవసరాలూ ముఖ్యమూ, అవసరమే. ఏ అవసరమయినా, తిండీ, గుడ్డా, ఆరోగ్యం, గూడు తరువాతే కదా! ఆటా, పాటా, రాతా, కూతా, కళా, కాంతీ అంతా! జనం ముఖ్య అవసరాల కోసం ఛస్తుంటే, నిమ్మకి నీరెత్తినట్టు ప్రవర్తిస్తూ వుంటే ఎలా?

'ఈసురోమని మనుజులుంటే
దేశమేగతి బాగుపడునోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుజులోయ్'

-అన్న మహాకవి గురజాడ వారి మాటలు ఎంత అక్షర సత్యాలు! అర్జంటుగా ప్రభుత్వ నేతలు కళ్లు తెరవాలి. ప్రజల సమస్యలు పట్టించుకోవాలి. అంతే గానీ, తమకి హోదా, డబ్బూ అన్ని సౌకర్యాలూ వున్నాయని పేదోడి గోడు పట్టించుకోక 'ఆల్.. ఈజ్.. వెల్' అంటే ఎలా? అంది నన్ను చూసి మా పక్కింటి అరుణ. ''నిజమే కదా.. ఆవిడ మాటలు?'' అనుకుంటూ 'అవునమ్మా...' అన్నాను ఆలోచనల్లో మునిగిపోతూ! ●

గులాబీలతో గృహశోభ

పూలంటే ఇష్టం లేనిదెవరికి..? సృష్టిలో ఎన్ని పూలున్నా రోజాలదే అగ్రస్థానం.. గులాబీల గుబాళింపులుంటే గృహమే స్వర్గనీమ.. ఏటా ఫిబ్రవరి వచ్చిందంటే చాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి ప్రేమికులందరి దృష్టి ఈ గులాబీలపైనే. ఈ నెల 14న 'వాలంటైన్స్ డే' సందర్భంగా ప్రేమికులు పరస్పరం గులాబీలను ఇచ్చి పుచ్చుకోవడం ఓ ఆనవాయితీ. గులాబీలు లేకుంటే 'ప్రేమికుల రోజు' లేదనే చెప్పాలి. మనసులో ఎన్నెన్నో భావాలున్నా- ఒక్క గులాబీతో ఎదుటివారిని ఇట్టే కట్టిపడేయవచ్చు. గులాబీ గుత్తులు లేనిదే ఎన్ని బహుమతులిచ్చినా ఏదో వెలితి ఉన్నట్లే.

గులాబీ మొక్కలు నాటేందుకు కూడా ఫిబ్రవరి అనువైన మాసం. వేడి వాతావరణం కొనసాగే వేసవిలో గులాబీ పరిమళాలే ప్రతి హృదయానికీ ఉపశమనం. ఇంట్లో ఖాళీ స్థలం ఉన్నా లేకున్నా పొందికగా పెంచుకునేందుకు నేడు ఎన్నెన్నో రకాలు, ముళ్లు లేని గులాబీ మొక్కలు సైతం అందుబాటులో ఉన్నాయి. బాల్కనీలో, మెట్ల పక్కన, కిటికీల వద్ద, పడక గదిలో.. ఇలా ఎక్కడైనా చిన్న చిన్న కుండీల్లో గులాబీ మొక్కలు పెంచుకోవచ్చు. విభిన్న రంగుల్లో, వివిధ సైజుల్లో పూసే గులాబీలతో ఇంటిని నందనవనంగా మార్చుకోవడానికి మనకు కొంచెం ఆసక్తి, శ్రద్ధ ఉంటే చాలు. పాదులాల ఇంటిపైకి అల్లుకునే గులాబీ రకాలతో పరిసరాలు సువాసనల్ని సంతరించుకుంటాయి. సుమారు వెయ్యేళ్ల క్రితమే గులాబీ మొక్కల పెంపకం ప్రారంభమైందని చరిత్ర చెబుతోంది. ఆ సువాసనలు కలకాలం మనల్ని రంజింపజేస్తునే ఉంటాయి.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
బుధవారం
13, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

జగతీ చక్రము పాదఘట్టన సదృశ్యంబై ప్రవర్తింపగా
గగనంబంతయు బాహు మండల సమ్రగవ్యాప్తులం దద్భుతం
బుగ ఘూర్ణిల్ల నజాంత్య వేళల సముద్భూతాంగ హారావళుల్
నిగుడం బొంగి నటింతు తాండవ మహానృత్యంబు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా జగన్మండలం నీ పాదఘట్టనల చేత నశించగా ఆకాశమంతా నీ బాహు మండలం సంపూర్ణంగా వ్యాపించడం చేత ఆశ్చర్యకరంగా తిరుగుడు పడగా ప్రళయ కాలంలో పైకి లేచిన నీ శరీరం మీది హారావళులు నిక్కునట్లుగా నీవు తాండవ మహానృత్యాన్ని నటిస్తావు. శివతాండవం చిదంబర సభలో జరుగుతుంది. అందుకే ఆయనను చిత్ సభాపతయే నమః అనీ నమస్కరిస్తారు. ఉపనిషత్తులు చెప్పిన పంచ ఆకాశాలలో ఐదవది చిదాకాశం. కథగా చెప్పుకోవడం కన్నా కూడా ఈ తాండవ నటరాజు ప్రతీకాత్మక మూర్తి సంసారానికి ప్రళయం కల్గిస్తూ చిదాకాశంలో ఆనంద ప్రాప్తిని కల్గించే ఈ శ్వరమూర్తి ఇది.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

12 **శ్రీ లత**

''లేదండీ అసలు సమస్య ప్రారంభమయింది'' చెప్పింది కాస్త దిగాలుగా.

''ఏమిటి ప్రాబ్లమ్?'' ఆసక్తిగా అడిగింది.

''జీవకు ప్రెగ్నెన్సీ ఎవరివల్ల వచ్చిందో తెలియడంలేదు. అడిగినా తను చెప్పడం లేదు, అని మీకు చెప్పినపుడు ఎక్కువగా వత్తిడి చేయవద్దు, అని చెప్పారు. ఇష్టం లేకపోతే అబార్షన్ చేయించమని సలహా ఇచ్చారు. అందుకు ఒప్పుకుంది. మీ మాట ప్రకారమే డాక్టర్‌ని కలిస్తే జీవన ఆరోగ్య రీత్యా అబార్షన్ పెద్ద ప్రాణానికే ముప్పు అని చెప్పింది. బిడ్డకు జన్మనివ్వడం తప్పనిసరి కనుక జీవన భవిష్యత్తు దృష్ట్యా ఆ బిడ్డను మిషనరీ వాళ్ళకు ఇవ్వాలనుకున్నాం'' చెప్పడం ఆపింది వసంత. నుదుటికి చెమటలు పట్టాయి. మనవరాలు పుట్టిందంటూ డాక్టర్‌కు స్వీట్స్ తేవాలిసింది పోయి, మనవరాలిని తన బిడ్డ నుంచి వేరు చేయాలంటే, ఏం చేయాలనే విషయం అడగడానికి వచ్చిన అమ్మమ్మ తను తప్ప ఇంకెవరూ వుండరనే గిల్టీనెస్ వల్ల కాబోలు, తలెత్తి డాక్టర్ కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది.

''చెప్పండి! ప్రాబ్లమ్ ఏమిటిప్పుడు? అనునయంగా అడిగింది గౌరీదేవి. ఒక్కోసారి గుండెల్లోంచి మాటలు ఊటలుగా ఉబికి ఎవరయినా వినేవాళ్ళుంటే ఆపకుండా గలగలా బోలెడన్ని కబుర్లు చెప్పేయాలనిపిస్తుంది.

కానీ ఒక్కోసారి శబ్దాలు గడ్డకట్టిపోయి గొంతు దాటిరావు. అదే స్థితి వసంతకు ఏర్పడింది.

చెప్పండి! ఫరవాలేదు, నేనేమీ అనుకోను. ఒక డాక్టర్ దగ్గర మీ సమస్యలు చెప్పుకోలేకపోతే ఇంకెవరితోనూ మీరు చర్చించలేరు'' అంది గౌరీదేవి. ఆ మాటలు వసంతలో కొద్దిలో కొద్ది ఆలోచనను చేకూర్చి మాటలను బయటకు నెట్టాయి.

''జీవన బిడ్డ కోసం మొండికేస్తుంది, పాలు పట్టాలని కూడా ఆశ పడుతూంది. పాపను ఇవ్వమని బలవంతపెడుతోంది. చాలా ఆందోళనగా, అలజడిగా ఉంది. ఎంతో నిబ్బరంగా ఉండే జీవన ఇలా ప్రవర్తించడం ఇదే మొదటి సారి'' చెప్పింది వసంత.

''పోనీ, బిడ్డను కొన్నాళ్ళు జీవన దగ్గర వుంచి చూద్దామా?'' అడిగింది డాక్టర్.

''డాక్టర్‌గారూ.... మీరు సైకియాట్రిస్ట్, మనుషుల సైకాలజీ స్పష్టంగా అర్థం చేసుకోగలరు'' అంది కంగారుగా. తనను కంగారు పెట్టే విషయం డాక్టర్‌కు తెలిసీ అలా ఎందుకు సలహా ఇస్తుందో అర్థంకాక.

''దేని గురించి మీరు కంగారు పడుతున్నారు? సమాజం గురించా?''

''అవును! పెళ్ళికాని నా కూతురికి గర్భం రావడం తల్లిగా నేను సమర్థించుకోగలనేమోగానీ, సమాజం వ్యతిరేకిస్తుంది. అది పొరపాటున జరిగినా, గత్యంతరం లేక జరిగినా పెళ్ళికాని అమ్మాయి బిడ్డకు జన్మనివ్వడానికి అర్హురాలు కాదని చెబుతుంది. అలాంటప్పుడు జీవన దగ్గరే బిడ్డను ఉంచడం ఎంతవరకు సమంజసం అంటారు?'' ప్రశ్నించింది వసంత.

''అంటే జీవనను కన్యగా సమాజానికి చూపించి పెళ్ళి చేయాలనా మీ ఆలోచన!''

''కన్య అంటే సరయిన అర్థం ఎలా అన్వయించుకోవాలి డాక్టర్? పెళ్ళికి ముందు పురుష స్పర్శ లేని అమ్మాయి అనుకుంటే... ఈ రోజుల్లో కన్యలుగా ఎంతమంది ఉండగలుగుతున్నారు? పెళ్ళి నాటికి ఎంతమంది కన్యలుగా ఉండగలుగుతున్నారని ప్రశ్నించుకుంటే నెగెటివ్ సమాధానమే వస్తుంది. నా కూతురికి పెళ్ళి కాలేదు కాబట్టి కన్య అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నేనీవిధంగా భావించి జీవనకు భవిష్యత్తు ఏర్పరచాలనుకోవడంలో ప్రతి తల్లికీ వుండే స్వార్థం నాకూ ఉంది'' వివరించింది వసంత అర్థం చేసుకోమన్నట్లుగా...

''నిజమే! కానీ మీ అమ్మాయికి గర్భం ఎలా వచ్చిందో తెలుసుకోకుండా బిడ్డను విడిచిపెట్టడం జరిగితే, రేపు ఆ ప్రేమించినతనో, మోసం చేసినతనో వస్తే... మీ అమ్మాయి పరిస్థితి ఏమిటో ఆలోచించారా?'' ప్రశ్నించింది డాక్టర్... ఇది సమాజపు సైకాలజీలో ఒక భాగమేనన్నట్లు.

''అది కాదు డాక్టర్! మళ్ళీ పెళ్ళి అనే విషయం గురించిన ఆలోచన ఇప్పుడు వదిలేద్దామనిపిస్తుంది. ప్రస్తుతం నా ముందు నిలిచిన సమస్య పాపను జీవన నుంచి దూరం చేయడం! ఇందులో పాపకీ, జీవనకీ ఇద్దరికీ ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా నిర్ణయం తీసుకోవాలి. కాబట్టి పాప మిషనరీ ఆధ్వర్యంలో ఉంటే.. పెళ్ళి కాకుండా పుట్టిన పాపగా సమాజం చేత పీడింపబడకుండా మిషనరీ శ్రద్ధతో మంచి జీవితాన్ని పొందగలుగుతుంది. జీవన పెళ్ళి చేసుకున్నా, చేసుకోకపోయినా, ''ఎవరితోనో తిరిగి బిడ్డను కన్నది'' అనే అపవాదునుంచి తప్పించిన దాన్నవుతాను. తల్లిగా ఈ నిర్ణయం సరైనదేనని భావిస్తున్నాను'' చెప్పింది వసంత.

''అందుకు జీవన ఒప్పుకుంటుందా?''

అదే సమస్య ఇప్పుడు ''పాప పుట్టకముందు ఒప్పుకుంది, ఇప్పుడు పాపే కావాలని గొడవ చేస్తోంది''.

''పాప తనతో ఉండటంవల్ల జరిగే నష్టాల గురించి తనతో మీరు చర్చించలేదా?'' అడిగింది డాక్టర్.

''డెలివరీకి ముందే ఇవన్నీ ఆలోచించాం, తను ఒప్పుకుందికూడా! ఇప్పుడు పాపను చూశాక, పాపకు ఒకసారి ఫీడింగ్ ఇచ్చాక అంతకుముందు తీసుకున్న నిర్ణయాలన్నీ మరచిపోయింది. అసలు తన ప్రవర్తన కూడా ఎంత మాత్రం నిబ్బరంగా లేద . పూర్తిగా బేలగా మారిపోయింది''.

''అంటే ఎలా ప్రవర్తిస్తుంది?''

''పాప ఏదని ఎవరైనా అడిగితే ఆందోళన పడిపోతోంది. పాపను తీసుకరమ్మని మొండిపట్టు పడుతోంది. ఏదైనా నచ్చచెబుదామని ప్రయత్నించినా వినే స్థితిలో లేదు'' బాధగా చెప్పింది వసంత.

''కన్సల్టింగ్ అవర్స్ అయ్యాక నేనొచ్చి జీవనతో మాట్లాడతాను. మీరీ లోపల ఎలాంటి ఆందోళనా జీవన ముందు వ్యక్తం చేయకుండా మామూలుగా ఉండండి''.

''ఓ.కే. డాక్టర్ మీ ఇష్టం.. మీరే పరిష్కారం చూపించాలి'' అని చేతులెత్తి నమస్కరించింది.

''ఇట్స్ మై డ్యూటీ'' అన్నా.. జీవన సమస్య తనకు డ్యూటీగా కాక బాధ్యతగా తోచింది గౌరీదేవికి.

జీవనను కలిసి ఆ అమ్మాయి ఆలోచన తెలుసుకోవాలనే ఉత్కంఠ కూడా కలిగింది.

-ఇంకాఉంది



రంగనాథ రామాయణం

143 **శ్రీపాద కృష్ణమూర్తి**

నీ జ్ఞానం జానకితోనే పోయిందా? రామా! నేడు నా పుణ్యం ఈ విధంగా వుంది. ఏమి చేస్తాను? విధిని ఏమని నిందిస్తాను? నా నాథుడు వాలిని బాసి నేను జీవించలేను. నన్ను కూడా తెగటార్చవయ్యా!'' అంటూ ఉరమున, మోమున ఎడనెడ మోదుకొంటూ, వాలిని పేర్కొంటూ ప్రలాపించింది.

అంత హనుమంతుడు తారను సమీపించి ''తల్లీ! నువ్వు తెలియని ధర్మనియమాలు వున్నాయా? కానున్నది కాక మానదు. ఇటువంటివి దైవనిర్ణయాలు, విధి బలీయం అని ఎరుగున్నావు. ఈ విధంగా విలపించడం తగదు- ఎంతటి పరాక్రమవంతుడికైనా కాలం దురతిక్రమం, వాలికి మరణకాలం ఆసన్నమయింది'' అని ఆ మతిమంతుడు హనుమంతుడు అనునయ వచనాలు పలికాడు.

నిజంగా అప్పటికి ఇంకా వాలి అసువులు కోల్పోలేదు. కనులు విప్పాడు. ఇంతింత తన రాక తార విలపింపడమూ, అంతకన్న ఎక్కుడుగా అంగదుడు వాపోవడమూ చూశాడు.

వాలి సుగ్రీవుడికి హేమదామమిచ్చుట

వాలి సుగ్రీవుణ్ణి కనుగొన్నాడు. ''శ్రీరామ చంద్రుడి వల్ల జగద్విఖ్యాతంగా నీ పగ సాధించుకొన్నావు. రాజన్యుల కృప, మైత్రి ఎల్లవేళలా నమ్మరానివి. గర్వంతో ఉప్పొంగి చెడిపోకు. ఏమరుపాటు చెందక ప్రవర్తించు. రామచంద్రుకి ఒసగిన మాట ఇటుపైన మదిలో ఆలోచించు. నీ వదినె తారని గౌరవించు. అంగదుడింక నీ తనయుడే. ఆ ఇరువురినీ మరువకు- పూర్వం దుందుభి పుత్రుడు మాయావి నాతో సమరం చేసిన పుడు నా చేతిలో మృతి చెందాడు. ఇంద్రుడు అందుకు మెచ్చుకొని నాకు ఈ స్వర్ణమాల బహూకరించాడు. ఈ హేమ మాలను నువ్వు అన్ని వేళలా ధరించు. ఈ వానర రాజ్య పదవికి ఇది లాంఛనమై అలరారుతుంది. నీకు విజయం చేకూరుస్తుంది.

ఈ అంగదుడు చూడు. నా కోసం కన్నీరు మున్నీరుగా అవుతున్నాడు. వీడి శోకాన్ని వారించు. నావలె గారాబంగా చూడు. నన్ను మరపించు. ఈ తార సుషేణుడి పుత్రి. ఈ తార ధీసార సుమా! ఈమె చెప్పినట్లు ప్రవర్తించు. మంత్రాలోచనలో ఈమె సాటిలేనిది. ఇకపై నీకు మేలు కలుగుతుంది. నేను చేసిన ఎగ్గులు అన్నీ మరచిపో. ఇంక నా మేన అసువులు నిలవవు. ఈ హేమ మాలికా రత్నాన్ని కైకో'' అని వాకొంటూ దుశ్శరమైన శోకంతో అనంతగ్రీవుడు అయిన సుగ్రీవుణ్ణి చేరరమ్మని పిలిచాడు. సుగ్రీవుడు రామ విభుడి అనుజ్ఞతో అతి భక్తిపరుడై ఆ కడాని దండను తాల్చాడు.

అనంతరం వాలి తన నందనుణ్ణి అంగదుణ్ణి కనిదయతో ''కుమారా! శోకింపకు. నీ చిన్న నాన్న సుగ్రీవుడు వుండగా నీకే కొదువా కలుగనీయడు. ఏ లోటూ రానీయడు. సుగ్రీవుడు నిన్ను నా కన్నా లాలించగడు. ఈ సుగ్రీవుడు ఎక్కడెక్కడ పరాక్రమం ప్రదర్శిస్తాడో అక్కడక్కడ నువ్వు అగ్రేసరుడవై నిలు. నీకు చిరకీర్తి లభిస్తుంది. అనంత భోగభాగ్యాలు నీకు లభిస్తాయి. నిన్ను కిష్కింధకు పట్టాభిషిక్తుణ్ణి కావించే భాగ్యానికి నేను నోచుకోలేదు. ఇంక అమర పురికి అరుగుతున్నాను'' అని వచించాడు.

పిమ్మట రఘురాముడిని ప్రీతితో చూసి ''శ్రీరామచంద్రా! నేనూ సుగ్రీవుడూ ఘోరంగా పోరాడుకోగా తుదిని నాకు మేలే జరిగింది. నా భార్య తార, తనయుడు అంగదుడు ఏమైనా నేరాలు చేసినట్టయితే మన్నించు. సుగ్రీవుడి వెనుక అంగదుణ్ణి రాజుని కావించు.

''వేదశాస్త్రాదులన్నీ వెదికి చూసినా నిన్ను ఎవరూ కనలేరు. ఆది మధ్యాంతరహితుడివి. వాచామగోచరుడివి. నా ప్రాణవశాసన సమయంలో సర్వేశ్వరుడవు నీవు నాకు అగుపడుతున్నావు. నా జన్మ చరితార్థం అయింది. పరమ పావనా! నా ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్నాయి. బాధ దుర్భరంగా వుంది. నువ్వు ప్రయోగించిన ఈ అమోఘ శరాగ్ని నువ్వే పెరికివెయ్యి'' అని వేడుకొన్నాడు.

-ఇంకాఉంది

బుధవారం, 13 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ తదియ ఉ.10.19
నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.తె.04.59
వర్జ్యం: మ.02.17 నుండి 03.55 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):** బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలు దూరమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** కోపాన్ని అదుపులోనుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవ ధ్యానం అవసరం. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. దైవ ప్రార్థన చేయాలి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది. ప్రయత్న కార్యాలు విఫలమవుతాయి.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచి వుంటారు.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడే ప్రమాదం ఉంది. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఉన్నా దైవ ప్రార్థనతో దూరం చేసుకొంటారు.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు సఫలమవుతాయి.వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులచే గౌరవింపబడుదురు. విందులు, వినోదాల్లో పాలొంటారు. ఆర్థిక చింత యుండదు.

మంచిమాట

పరిష్వంగం

ఈ పరిష్వంగములు వివిధ రకాలుగా గలవు. తల్లిదండ్రులు, భార్యాభర్తలు, ప్రేయసీ ప్రియుడు, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, సంతానము, మనుమలు మధ్య వివిధ సందర్భాలలోతారసపడుతాయి. మన పురాణాలో పలుచోట్ల ఈ అంశములు కన్పించును.

మహాభారతమున విశ్వామిత్ర మహర్షి బ్రహ్మర్షి కోసం తపస్సు చేయుచుండగా ఇంద్రుడు ఈ మౌని ఘోర తపస్సును మేనక అనే దేవ వేశ్యను పంపి భంగం చేయును. మనసు మరుడు (మన్మధుడు) వశం చేసుకొనగా, కోరిక (బాణాలు రూపంలో) అతనిని బాధించును-తపము మాని మేనకతో సంసార జీవితం గడిపిన ఫలితంగా ఒక ఆడ శిశువుకు జననమిచ్చి ఎటువారటు వెళ్ళిపోతారు. ఆ పసి బిడ్డను కణ్వమహర్షి తన కన్నబిడ్డలా పెంచి పెద్ద చేస్తాడు. యుక్తవయస్కురాలైన పుడు మహర్షి లేనపుడు దుష్యంత మహారాజు ఆశ్రమమును దర్శించి ఆమె అందచందాలకు గుణగణాలకు మెచ్చి, గాంధర్వ వివాహము చేసుకొని తన రాజ్యమున కేగును. కొంతకాలం గడిచిపోతుంది.

దుర్వాసుని శాపం వలన ఒప్పందం మరచిపోతాడు. ఆమె గర్భం దాల్చి ఒక మగపిల్లవాడికి జన్మనిస్తుంది. మహర్షి పెళ్లి అయిన ఆడపిల్లను ఎంతకాలం ఇంట వుంచుకోకూడదని భర్త దగ్గరకు పంపును. ఆమె దుష్పంతుని నిండు కొలువు నందు కలిసి తన ప్రేమ వివాహము విషయము సభలో అందరి ముందు మహారాజునకు విన్నవించెను. అతడు ఆమెను గుర్తించక ఆ బిడ్డ తన బిడ్డ కాదని తక్షణమే వెళ్ళిపోవలసినదిగా ఆజ్ఞ చేస్తాడు. అప్పుడు దుష్యంతునిద్దేశించి ఓ రాజా! ఈ బిడ్డడు ఒక దీపం నుండి మరొక దీపం వెలిగించినట్లుగా నీ యొక్క రూపు రేఖా విలాసాలు గల్గియుండెను. ఈతడిని స్వీకరించు ఈ శిశువును నీవు గాఢంగా పరిష్వంగం (కౌగిలించు) చేసినట్లయిన నీకు నీ సంతానమును ప్రేమారగ దగ్గిరకు తీసిన ఆనందం గల్గునని వివరించును.

దానినే మనవారు వాడుక భాషలో రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అని అంటారు. ఎంతైనా అది రక్త సంబంధం కదా అని అంటారు. నీళ్ళు పల్లానికి పారుతాయి, నిజం దేవుడెరుగును అని పలు రకాల సామెతలు తెలుగు భాషలో ఎన్నో గలవు.

రామాయణంలో హనుమంతుడు సీతాన్వేణ చేసి జానకీదేవి జాడను, శ్రీరామునికకందిస్తాడు- సీతా శోక నివారకుడుగా, శ్రీరాముని ప్రియభక్తుడిగా మనకు విశదపరుచును, హనుమద్భక్తికి మెచ్చి చూడు హనుమా! నీకు నేనేమిచ్చి సంతోషపెట్టగలను. రా! ఇలా రా! నా మనసారా ప్రేమ పరిష్వంగం ఇస్తాను అని అన్నాడు. హనుమంతుడది మహాభాగ్యంగా భావించి ఆయన శ్రీరాముని కౌగిలిలో వదిగిపోతాడు.

భాగవతంలో గోపికలు శ్రీకృష్ణుని ఎడల అపరిమిత ప్రేమానరాగాలు చూపిస్తారు- వారిహృదయానుబంధాలు సదా నల్లనయ్య మీదనే నింపుతారు. ఆ ఘనయమునా నదీ తీరములో పండు వెన్నెలలో వెండి సైకతముల మీద, మధుర వేణు గానము విని, విహరించి తన్మయత్వములౌతారు. భాగవతం నందు బమ్మెర పోతనా మాత్యుడు భ్రమరగీతికలు అద్భుత రసానుభూతిని కల్గునట్లుగా వ్రాసి వాసికెక్కును. ఆ శ్రీకృష్ణుడి కౌగిలింత కొరకై క్షణక్షణము తపించిపోయిరి. భార్యాభర్తలగు నలదమయంతులు వియోగం చెంది కొంత కాలము అనంతరం కలిసికొందురు.

ఇలానే శ్రీరాముడు ఉత్తర రామాయణంలో వాల్మీకి ఆశ్రమంలో పుట్టి పెరుగుతున్న లవకుశలను చూసి వారిని గాఢాలింగనము చేసుకొని పుత్రప్రేమను పొందుతాడు. ఇలా పలు సందర్భాలలో మనకు పరిష్వంగ సంఘటనలు కన్పించును.

-లక్కరాజు శ్రీనివాసరావు

వృతాసురుడు

21 బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 14

మాటాట - 13 సమాధానం



మాటాట

ఆధారాలు:

అడ్డం

1. అంచె
4. అపురూపము
5. శివాలయంలో గర్భగుడిచెదురుగా
6. నామము
9. ఎముకల సారం
10 మహాప్రస్థానం
12. బట్ట
14. పలుమబడి

నిలువు

1. కొత్తది
2. యుద్ధం
3. కృష్ణుని పెంచిన తండ్రి
4. కనాత, కేక
7. తామర పువ్వు
8. లలాటం
11. ఇది చుట్టిగానీ పెద్దలు కొందరు రాయడంమొదలుపెట్టరు
13. దేవళము

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

sanjeevani@andhrabhoomi.net

సంజీవని

11
ఆంధ్రభూమి
బుధవారం
13, ఫిబ్రవరి
2013

పొడిచర్మం గలవారికి... ముడతలు తగ్గించే లేపనం

కావాల్సిన పదార్థాలు: అశ్వగంధ వేర్ల చూర్ణం అరచెంచా, అతిమధురం వేరు చూర్ణం అరచెంచా, గులాబీ రేకుల పొడి అరచెంచా, బాదంపప్పుల పొడి అర చెంచా, మంజిష్ఠ వేరు చూర్ణం పావు చెంచా, పాలమీగడ తగినంత, ఆవనూనె తగినంత!

తయారీ, వినియోగం: ఒక పాత్రలో వీటిని తీసుకోండి. అశ్వగంధ వేర్ల చూర్ణం అరచెంచా, అతిమధురం వేరు చూర్ణం అరచెంచా గులాబీ రేకుల పొడి అరచెంచా, బాదం పప్పుల పొడి అర చెంచా, మంజిష్ఠ వేరు చూర్ణం పావు చెంచా, పాలమీగడ తగినంత, ఆవనూనె తగినంత. అన్ని టినీ కలిపి పేస్టులాగా చేసుకోండి. దీనిని ముదురు రంగులో కనిపించే మందపాటు చర్మపు ముడతల మీద పూసుకొని రుద్దుకోండి. తరువాత అరగంటాగి స్నానం చేయండి ఇలా కొంతకాలంపాటు చేస్తే ముదురు రంగు ముడతలు తగ్గుతాయి.

మానసిక వైఫల్యం.. వృత్తికి కళంకం

చిత్తూరు జిల్లాలో ఒక పట్టణంలో ముగ్గురు బాధ్యతాయుత వ్యక్తులు అసంబద్ధంగా వ్యవహరించి ఔరా! అనిపించారు. తమ మానసిక వైఫల్యాలతో వృత్తి ధర్మాలకు తిలోదకాలిచ్చారు. జబ్బులు, రోగాలు బాగు చేయాల్సిన డాక్టరు పూజలు, పునస్కారాలంటూ తిరగడం ప్రారంభించాడు. సంసార సుఖాలను త్యాగం చేసి జప తపాలు అలవర్చుకున్నాడు. ఇరవై ఏళ్ళుగా పరిచయమున్న ఒక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు తన జాడ్యం అంటించాడు. ఇంట, బయట తలెత్తే సమస్యలను మహిమలతో పరిష్కరించవచ్చని నమ్మించాడు. అయితే ఆ ప్రయత్నం వికటించి డాక్టరు మెడకు చుట్టుకున్నది. డాక్టరు పూజలవల్లే తన కుటుంబంలో కలహాలు పెరిగాయని న్యాయవాది భావించాడు. తన కొడుకు కోడలి మధ్య వివాదాలకు, తన శరీరంలో ముదురుతున్న రుగ్మతలకు డాక్టరే కారణమని అనుమానపడ్డాడు. శవాల నుంచి తీసిన నూనె, శ్మశానం నుంచి తెచ్చిన బూడిద కలిపి తన ఇంటిపై చల్లేందుకు ప్రయత్నించాడంటూ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. డాక్టర్ వద్ద వున్న కీళ్ళనొప్పులకు వాడే నూనె, శూర్ణాలకు క్షుద్రపూజలకు వాడే సామగ్రిగా పేర్కొన్నాడు. ఫిర్యాదుచేసిన వ్యక్తి అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కావడంతో పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ డాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నాడు. విషయం తెలిసిన మిత్రులు మధ్యవర్తిత్వం నెరిపి సమస్యను సర్దుబాటు చేశారు. అయితే డాక్టర్ ముడుపులు చెల్లించనిదే వదిలిపెట్టేది లేదని ఎస్ఐ భీష్మించుకున్నాడు. పోలీసుల మొక్కులు చెల్లించి డాక్టర్ బయటపడ్డాడు.

ఈ సంఘటన పరిశీలిస్తే కొందరు ఉన్నత స్థాయి వ్యక్తుల్లోని మానసిక వైఫల్యాలు అర్థమవుతాయి. ఇందులో డాక్టర్ పర్వర్షన్ (విచలన) రుగ్మతతో బాధపడుతున్నాడు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్యారనాయిడ్ సైకోసిస్ (అనుమానం) రుగ్మతకు గురయ్యాడు. పోలీసు అధికారి అవినీతి మత్తులో విచక్షణ కోల్పోయాడు. వీరిలో డాక్టర్, న్యాయవాది దీర్ఘకాలిక ఒత్తిళ్ళవల్ల మానసిక రుగ్మతల పాలయ్యారు. వీరికి తప్పనిసరిగా మానసిక చికిత్స, కౌన్సెలింగ్ అందివ్వాలి. కాగా పోలీసు అధికారి ప్రవర్తనా లోపం. ఇతన్ని పై అధికారులే దారిలో పెట్టాలి. అయితే మన సమాజం, చట్టాలలో మానసిక సమస్యలకు సరైన ప్రాముఖ్యత లేదు. ఎవరైనా మరొక వ్యక్తిని గాయపరిస్తే పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళం తప్పనిసరి. అదే మానసిక స్థితి బాగా లేని వారిని గుర్తించి డాక్టర్ వద్ద పరీక్షలు చేయించాలన్న చట్టం ఎక్కడ వుందో తెలియదు. వృత్తి, ఉద్యోగం, ఉన్నత స్థాయి వ్యక్తుల మానసిక స్థితి సమస్యగా గుర్తించాలి. చాలామంది ఉన్నత స్థాయి వ్యక్తుల్లో కనిపించే విపరీత ధోరణులకు రుగ్మతలే కారణమని గుర్తించాలి. వెంటనే చికిత్స చేయించడానికి ప్రయత్నించాలి.

కుటుంబం, వృత్తి, ఉద్యోగాలను ప్రభావితం చేసే రుగ్మతలు చాలా ఉన్నాయి. బాలికను బలవంతం చేసిన బడిపంతులు, స్వీపరుపై ఆఫీసరు అత్యాచార యత్నం లాంటివి రుగ్మతగానే భావించాలి.

ఇలాంటివారు మితిమీరిన శృంగార కాంక్షలతో రగిలిపోతుంటారు. కొందరు పర్వర్షన్ రుగ్మతతో బాధపడుతుంటారు. ప్రియురాలిపై యాసిడ్ పోసేవారు, గొంతుకోసేవారిని ఉన్మాదులు (మ్యానిక్)గా పరిగణించాలి. అనుమానపు జబ్బు ఉన్నవారు ఇంట బయట సమస్యలను సృష్టిస్తుంటారు. స్కిజోఫ్రెనియా రోగగ్రస్తులు లేనిపోని భ్రమలు, భ్రాంతులకు గురై విపరీత చర్యలకు పాల్పడుతుంటారు. అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ ఉన్నవారు చెప్పిందే చెప్పి, చేసిందే చేసి, చేయమంటూ వేధించే ప్రమాదముంది. శాడిస్టులు అకారణంగా ఎదుటివారిని, క్రింది ఉద్యోగులను వేధించి, సాధించి ఆనందిస్తుంటారు. భయం, ఆందోళన, ఫోబియాలున్నవారివల్ల చుట్టూ ఉన్నవారికి సమస్యలు ఎదురవుతుంటాయి. డిప్రెషన్ రోగులు నిరాశ, నిస్పృహతో తల నొప్పిగా తయారవుతారు. మానసిక ఒత్తిళ్ళవల్ల కోపం, ఆవేశం, ఉద్వేగ లోపాలు తలెత్తుతుంటాయి. అలాగే వ్యక్తిత్వ, ప్రవర్తనా లోపాలు ఉన్నవారు వృత్తి ధర్మాలకు తిలోదకాలు ఇస్తుంటారు. కాబట్టి ఎవరికివారు తమ మానసిక స్థితిపట్ల అవగాహన పెంచుకోవాలి. అవసరాన్ని బట్టి సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి
Psychologist
nbsreddi@gmail.com
18-4-111/2, రైల్వే కాలనీ,
తిరుపతి - 517 501.

ఇన్‌ఫెక్షనూ కారణమే...

ప్రస్తుత కాలంలో అనేకమంది మూత్రంలో మంట సమస్యతో బాధపడుతున్నారు. వేసవి కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి కారణం శరీరంలోని నీటి శాతం తగ్గిపోయి లవణాల గాఢత పెరిగి కిడ్నీలో రాళ్లు మరియు యూరినరి ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్స్ (యుటిఐ) ఏర్పడే అవకాశం ఉండటమే.

మానవ శరీరాన్ని సురక్షితంగా కాపాడే విషయంలో మూత్ర పిండాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. శరీర ద్రవాల్లోని లవణాల సమతుల్యత కాపాడి శరీరంలోని నీటి పరిమాణాన్ని తగ్గకుండా చూస్తూ జీవకార్య నిర్వహణలో పేరుకునే కాలుష్యాన్ని విసర్జిస్తాయి. ఇలాంటి విధులు నిర్వర్తించే కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురైనప్పుడు మూత్రంలో మంట వస్తుంది.

కారణాలు

చాలా కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి మూత్రావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్ యూరినరి ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ (యు.టి.ఐ), మూత్ర పిండాల్లో రాళ్ల ఏర్పడటం, మూత్రకోశంలో ఇన్‌ఫెక్షన్, నీరు తగినంతగా తాగకపోవడం, ఆహారపు అలవాట్లు, కొన్ని జన్యుపరమైన ఇన్‌ఫెక్షన్లవలన మూత్రంలో మంట వచ్చును.

లక్షణాలు

-మూత్ర విసర్జన మంటతో కూడి ఉండుట.

-పొత్తికడుపులో నొప్పి రావడం. మూత్రం ఎక్కువసార్లు చేయడం

-మూత్రం రంగు మారడం, వేడిగా, ఎరుపుగా రావటం.

-పిల్లల్లో ఈ సమస్యను ఎదుర్కొనేవారు మూత్రము పోయాలంటేనే భయపడిపోయి, ఏడుస్తుంటారు. నీరసం, జ్వరం లాంటి లక్షణాలుండును.

పరీక్షలు

సి.యు.ఇ (కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్), వి.డి.ఆర్.ఎల్, ఎక్స్‌రే- కె.యు.బి పరీక్షల ద్వారా మూత్రములో మంటకు కారణం తెలుసుకోవచ్చును.

జాగ్రత్తలు

-మద్యం ఇతర మత్తుపానీయాలు సేవించకూడదు. టీ, కాఫీలు మానేయాలి.

-మాంసాహారం తగ్గించాలి.

-పొగాకు ఉత్పత్తుల వినియోగం, దూమపానం త్యజించాలి.

-ఫాస్ట్‌ఫుడ్స్, మసాలాలు నూనె పదార్థాలు, ఉప్పు ఎక్కువగా వాడటం వంటివి తగ్గించాలి. వీటిని వీలైతే పూర్తిగా మానుకుంటే మంచి ప్రయోజనం పొందవచ్చును.

-సాత్వికాహారం తీసుకోవాలి.

-తగినంత నీరు తాగాలి. కనీసం రోజుకు 4 లీటర్ల నీరు త్రాగాలి.

-ద్రవపదార్థాలు, పండ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

చికిత్స

వ్యాధి నిర్ధారణ జరిగిన ప్రారంభ దశలో హోమియో మందులను వాడితే శస్త్ర చికిత్స నుండి నివారణ పొందవచ్చును.

మందులు

లైకోపోడియం:

మూత్ర విసర్జన మంటతోకూడి, మూత్రం ఇటుక రంగులో వుంటుంది. ఈ పర్సనాలిటీ వ్యక్తులు చూడటానికి సన్నగా కనబడుతారు. వీరు దైనందిన జీవితంలో ఆచి తూచి అడుగు వేస్తారు. మానసిక స్థాయిలో కొంచెం భయస్తులు. భయంవలన సామర్థ్యం వున్నా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తారు. ఇలాంటి వ్యక్తులకు ఈ మందు ముఖ్యమైనది.

బెర్బెరీస్ వల్గారిస్:

ఎడమ కిడ్నీ వైపు నొప్పి ప్రారంభమై ముందుకు వ్యాపించును. నొప్పి మంటతో కూడి భరించలేకుండా ఉంటుంది. ఇలాంటి లక్షణాలు ఉండి, మూత్రం మంటతో బాధపడేవారికి ఈ మందు ఆలోచించదగినది.

ఎపిస్:

ఇన్‌ఫెక్షన్‌కు గురై మూత్ర విసర్జన బాధాకరంగా ఉంటుంది. మూత్రం పోసే సమయంలో మంట, చురుక్కుమని గుచ్చుకున్నట్లు నొప్పితో బాధపడటం వంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

టెరిబెంథైనా:

మూత్రం నల్లగా ఉండి చుక్కలు చుక్కలుగా వస్తుంది. మూత్రం తరచుగా ఎక్కువ సార్లు పోస్తూ వుంటారు. మూత్రం ఎరుపు రంగులో ఉండి మంటగా అనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఈ మందు వాడుకోదగినది.

కాంథారిస్:

మూత్రం వచ్చినట్లుగా అనిపించుట, మూత్రం చుక్కలు చుక్కలుగా వస్తూ చురుక్కుమనిపించుట, మూత్రం తరచుగా ఎక్కువసార్లు పోస్తూంటారు. మూత్రం పోసే సమయంలో మంట తీవ్రంగా వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఈ మందు వాడి ప్రయోజనం పొందవచ్చును.

ఈ మందులే కాకుండా హైడ్రాంజియా, నక్స్‌వామికా, తూజా, మెర్కురియస్, ఫాస్ఫారస్, టాబాకమ్ వంటి మందులను లక్షణ సముదాయమును పరిగణనలోకి తీసుకుని వైద్యం చేసిన యెడల మూత్రంలో మంట సమస్య నుండి విముక్తి పొందవచ్చును.

డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
సెల్‌నెం. 9440229646
హోమియోఫిజిషియన్, అంజనా హోమియోక్లినిక్ ఇం.నెం. 7-1-62/1
శ్రీదేవి థియేటర్ వెనుక, బస్‌స్టాండురోడ్
హన్మకొండ, వరంగల్-506001
E-mail: drpsreedhar@ymail.com

ఇది ఓ చర్మ సంబంధిత వ్యాధి

ఎకాంతోసిస్ నైగ్రికాన్స్ అనేది ఒక చర్మ సంబంధ సమస్య. చర్మపు ముడతలు, పల్లాలు ముదురు రంగులో వెల్‌వెట్ మాదిరిగా మందంగా తయారవటం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. వ్యాధి ప్రభావానికి లోనైన చర్మం దళసరిగా మారడమే కాకుండా చెడు వాసన కూడా వస్తుంటుంది. ఈ వ్యాధిలో సాధారణంగా చంకలు, గజ్జలు, మెడ వెనుక చర్మపుముడతలు నలుపుగా, మందంగా తయారవుతుంటాయి.

సాధారణంగా అధిక బరువు కలిగిన వ్యక్తుల్లోనూ, షుగర్ వ్యాధిగ్రస్తుల్లోనూ ఈ లక్షణం కనిపిస్తుంటుంది. చిన్నతనంలో ఈ లక్షణాలు కనిపిస్తుంటే, పెద్దయిన తరువాత షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. చాలా చాలా అరుదైన ఎకాంతోసిస్ నైగ్రికాన్స్ అనేది అమ్లాశయపు క్యాన్సర్‌కి గాని లేదా కాలేయపు క్యాన్సర్‌కి గాని హెచ్చరిక లక్షణంగా కనిపించవచ్చు. ఈ లక్షణం కనిపిస్తున్నప్పుడు సాధారణంగా దీనికి దారితీసే వ్యాధి స్థితిని సరిదిద్దితే సరిపోతుంది.

లక్షణాలు

చంకలు, గజ్జలు, మెడలోని చర్మపు ముడుతలు, పల్లాలు ముదురు రంగులోకి మారతాయి మందంగా, వెల్‌వెట్ గుడ్డ మాదిరిగా తయారవుతాయి

ఈ మార్పులు వెంటనే కాకుండా నెమ్మదిగా, కొన్ని నెలలు, సంవత్సరాలపాటు చోటుచేసుకుంటాయి.

వ్యాధి ప్రభావానికి గురైన చర్మం నుంచి చెడు వాసన వస్తుంటుంది. కొద్దిగా దురదగా కూడా అనిపిస్తుంటుంది.

కారణాలు

ఇన్సులిన్ హార్మోన్‌ని శరీరం వినియోగించుకోలేకపోవటం (ఇన్సులిన్ రెసిస్టెన్స్): క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్) ఇన్సులిన్ హార్మోన్‌ని విడుదల చేస్తుందన్న సంగతి తెలిసిందే. ఇన్సులిన్ అనేది షుగర్‌ని శరీరం వినియోగించుకోవడానికి సహాయపడుతుందన్న సంగతి కూడా తెలిసిందే. ఒకవేళ ఈ ఇన్సులిన్ శరీరం గుర్తించలేకపోతే దానిని ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. దీనివల్ల చర్మం ముడతలు మందంగా, నలుపుగా తయారవుతాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ వల్ల ముస్ముందు కాలంలో షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది.

అధిక బరువు:

స్థూలకాయుల్లో చర్మం ముడతలు మందంగా నల్లగా తయారవుతాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కి ప్రధాన కారణం అధిక బరువు. స్థూలకాయం షుగర్ వ్యాధికి ఒక ముఖ్యమైన ప్రేరకం.

హార్మోన్ సమస్యలు:

అండాశయాల్లో నీటి బుడగలు పెరగటం, థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గటం, కిడ్నీల మీద ఉండే ఎడ్రినల్ గ్రంథులు వ్యాధిగ్రస్తం కావటం వంటి కారణాలవల్ల చర్మపు ముడతలు మందంగా, నల్లగా తయారవుతాయి.

మందులు:

సంతాన నిరోధక మాత్రలు, కార్టికోస్టీరాయిడ్ మందులు, నియాసిన్ వంటి మందుల వాడకం వల్ల కూడా చర్మపు ముడతలు నల్లగా మందంగా తయారై ఎకాంతోసిస్ నైగ్రికాన్స్ రావచ్చు.

క్యాన్సర్:

శరీరపు అంతర్గ భాగాల్లో పెరిగే కాన్సర్ కణితులవల్ల కూడా చర్మం మీద ముడతలు నల్లగా మందంగా తయారవుతాయి. ఆమాశయం, పెద్దప్రేగు, కాలేయానికి సంబంధించిన క్యాన్సర్లలో ఇలాంటి లక్షణం కనిపిస్తుంటుంది.

ప్రేరకాలు (రిస్కులు):

అధిక బరువు, వంశపారంపర్యత, జన్యువులు.

పరీక్షలు, నిర్ధారణ

ఈ వ్యాధిని నిర్ధారించడానికి కొంత సమాచారాన్ని మీరు డాక్టర్‌కి ఇవ్వాల్సి ఉంటుంది. ఉదాహరణకు:

-మీ కుటుంబంలో నలుపుదనంతోకూడిన మందపాటి చర్మం ముడతలు ఉన్నాయా?

-మీ కుటుంబంలో షుగర్ వ్యాధి ఉందా?

-మీకు అండాశయానికి, లేదా థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన సమస్యలు ఉన్నాయా?

-మీరు ఇతర వ్యాధులకు ఏవన్నా మందులు వాడుతున్నారా? ఎప్పుడైనా స్టీరాయిడ్ మందును వాడాల్సిన అవసరం వచ్చిందా?

-ఈ లక్షణాలు ముందుగా ఎప్పుడు మొదలయ్యాయి?

-సమయం గడిచే కొద్దీ ఇవి తీవ్రతరమవుతున్నాయా?

-మీ శరీరంలో ఏ భాగాలు వ్యాధి లక్షణాలను ప్రదర్శిస్తున్నాయి?

-మీకు గాని లేదా మీ కుటుంబంలో ఇతరులకు ఎవరికైనా గాని క్యాన్సర్ వచ్చిన ఇతివృత్తం ఉందా?

ఆయుర్వేద చికిత్సా వ్యూహం

చికిత్సల ఉద్దేశ్యం

-లక్షణాలను కలిగించే అంతర్గత వ్యాధిని ముందుగా గుర్తించి అదుపులో ఉంచటం.

-చర్మం ఎబ్బెట్టుగా కనిపించకుండా మచ్చల గాఢతను తగ్గించటం

-ఆహారంలో మార్పులు చేర్పులను సూచించటం

-ఒకవేళ అధిక బరువు కలిగి ఉంటే బరువు తగ్గేలా ఆహార, విహార, ఔషధాపరమైన చికిత్సలను సూచించటం

చర్మంమీద నలుపు రంగు మందపాటి

వైద్య సలహాతో వాడుకోవాల్సిన ఔషధాలు

పంచతిక్తఘృత గుగ్గులు, మహామంజిష్టాది క్వాథం, మహా భల్లాతక రసాయనం, అమృత భల్లాతక లేహ్యం, లంకేశ్వర రసం, అరగ్వధాది ఉద్వర్తనం (నలుగు)

-డాక్టర్ చిరుమామిళ్ల మురళీమనోహర్
murali manoharch@hotmail.com
రక్ష ఆయుర్వేదిక్ సెంటర్,
బ్లేవ్‌హోం ఎదుట,
సారథీ స్టూడియో రోడ్,
అమీర్‌పేట, హైదరాబాద్ - 500 073.

కీళ్లనొప్పులకు హోమియో

వేధించే కీళ్ళనొప్పులకు హోమియో వైద్యం చక్కని దారి చూపుతుంది. వ్యాధి లక్షణాలను, వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోనికి తీసుకుని మందులను ఎన్నుకొని వైద్యం చేసిన కీళ్ళ నొప్పుల సమస్యలను నయం చేయవచ్చును. వాటిల్లో

కొన్ని మందులను గురించి తెలుసుకొందాం.

బెంజోయిక్ యాసిడ్

గౌట్ కోసం వాడదగిన ఔషధాలలో ఇది ప్రత్యేకం. గౌట్‌లో కనిపించే అన్ని లక్షణాలకు ఇది పరమౌషధం. కిడ్నీ సరిగ్గా పనిచేయకపోవడం (రీనల్ ఇన్‌సఫిషియెన్సీ), కిడ్నీలోని నెఫ్రాన్‌లలో యూరిక్ యాసిడ్ వడపోత సరిగ్గా జరగకపోవటంతో మూత్రంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటంవల్ల మూత్రం గాఢంగా, భరించలేని వాసనతో, ముదురు రంగులో ఉంటుంది.

మెర్కుసాల్:

గనేరియా, సిఫిలిస్‌ల్ని అణగదొక్కడం వల్ల ఆర్థరైటీస్ వస్తే ఇది వాడాలి.

ఆక్టియా స్పెకేటా:

ముఖ్యంగా చిన్న కీళ్ళు అంటే. వేళ్ల మధ్యన ఉండే కీళ్ళు, అరచేతిలో, పాదాలలో ఉండే ఎముకల మధ్యనుండే కీళ్ళు విపరీతమైన నొప్పితో వాచిపోయి ఉన్నప్పుడు, మణికట్టు కీళ్లు (రిస్ట్ జాయింట్స్) ఎక్కువ నొప్పితో ఉన్నప్పుడు ఈ మందులు ఇచ్చినట్లయితే తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది.

కాల్చికమ్:

నొప్పులు ముఖ్యంగా పెద్ద కీళ్ళలో వస్తాయి. మోకాళ్లు, మోచేతులు, భుజాలు, నడుము భాగాలలో నొప్పులు వస్తుంటాయి. యూరిక్ ఆసిడ్ క్రిస్టల్ కీళ్ళలో కాకుండా ఎముకల పైపొరలపై ఏర్పడటంవల్ల కండరాలు నొప్పితో బిగుసుకుపోతాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు ఈ మందులు ఇచ్చినట్లయితే ఉపశమనం కలుగుతుంది.

ఈ మందులే కాకుండా రూటా, బ్రయోనియా, ఆర్నికా, లెడంపాల్, ఏపిస్ ,కాల్కేరియాకార్బ్, సల్ఫర్, కాలికార్బ్, హైపరికం, మాగ్‌ఫాస్, సింఫైటినం, కాల్కేరియాఫ్లోర్, లైకోపోడియం వంటి మందులను లక్షణ సముదాయమును పరిగణనలోకి తీసుకొని వైద్యం చేసినయెడల కీళ్ళనొప్పుల నుండి విముక్తి పొందవచ్చును.

ఈ లక్షణాలు మీలో ఉన్నాయా?

ప్రతి వ్యక్తి స్వీయ విశ్లేషణ ద్వారా తమ లోపాలను గుర్తించాలి. వాటిని అధిగమించేందుకు కృషి చేయాలి. ఈ క్రింది అంశాలను పరిశీలించి తమలోని సానుకూల దృక్పథాన్ని అంచనా వేసుకోవచ్చు.

➢నలుగురిలో కలిసి పని చేయగలను.

➢ప్రతికూల పరిస్థితులోను బాధ్యతలను స్వీకరిస్తాను.

➢ఇతరులతో విజయాన్ని పంచుకోగలను.

➢లక్ష్యాలు ఏర్పరచుకుని సాధించేందుకు కృషి చేస్తాను.

➢నామీద నాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది.

➢నేను సవాళ్ళను స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటాను.

➢సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయాలు వెదుకుతాను.

➢లేదు, కాదని నిర్మొహమాటంగా చెప్పగలను.

➢సమూహాన్ని ప్రభావితం చేయగలనేర్పు నాలో ఉంది.

➢ఇతరుల్లోని గొప్పదనాన్ని గుర్తించగలను.

➢ఇతరుల మాటల్ని సహానుభూతిలో వినగలను.

➢నా మిత్రులంతా నన్ను ధైర్యవంతుడంటుంటారు.

➢ప్రతికూల పరిస్థితుల్లో అవకాశాలు అన్వేషిస్తాను.

➢నన్ను, నా పరిసరాలను అర్థం చేసుకోగలను.

పై లక్షణాలు మీలో ఎన్ని, ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించాలి. లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి.

సానుకూల దృక్పథం అభివృద్ధి పరచుకోవడంలో ఆత్మపరిశీలన అవసరం. తమ మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి. తమలో తాము మాట్లాడుకోవాలి. అవసరమైనప్పుడు ప్రాథమిక సూత్రాలను పరిశీలించాలి. స్వీయ గౌరవం పెంపొందించుకోవాలి. పరిపూర్ణ వ్యక్తిత్వం, ఆరోగ్యం పెంపొందించుకోవాలి. అవసరాన్ని బట్టి మార్పును స్వీకరించాలి. అయితే తమను తాము అతిగా ఊహించుకోవడం మంచిది కాదు. అలాగే క్రమశిక్షణ, అతి నియంత్రణ, ఒక్కోసారి మానసిక రుగ్మతలకు దారితీయవచ్చు. స్వార్థం పెరిగినా ప్రమాదమే. ప్రేరణ కలిగించని లక్ష్యాలు, ప్రోత్సాహం దొరకని పరిసరాలపట్ల జాగ్రత్త వహించాలి. అమావాస్య రోజు చంద్రుడు లేకున్నా నక్షత్రాలను చూసి సంతోషించడం నేర్చుకోవాలి. ఉన్నంతలో తృప్తి చెందడం, అవసరమైనదానిని సాధించడం నేర్చుకోవాలి. అవరోధాలను అవకాశాలుగా స్వీకరించి సాగిపోవాలి.

పీసీబీ 'పిల్లిమొగ్గలు'

జకా అష్రాఫ్

క్రికెట్ ఆడే దేశాలన్నీ పాకిస్తాన్‌లో పర్యటించడానికి ససేమిరా అంటున్నాయి. శ్రీలంక క్రికెటర్లపై ఉగ్రవాదుల దాడి జరిగిన తర్వాత ఏ ఒక్క జట్టూ పాక్ పర్యటనకు వెళ్లలేదు. చివరికి బంగ్లాదేశ్ సైతం పాక్ టూర్‌కు ససేమిరా అంటున్నది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో? ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పాక్‌లో పర్యటించడం ఆటగాళ్ల ప్రాణాలతో చెలగాటం ఆడడమే నని వివిధ దేశాల క్రికెట్ బోర్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ జట్లను ఆకట్టుకోవడానికి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) విశ్వప్రయత్నాలు చేస్తున్నది. సుమారు నాలుగేళ్లుగా స్వదేశంలో ఒక్క సిరీస్ కూడా జరగకపోవడంతో పీసీబీ ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయింది. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో కలిసి ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కూడా చేజార్చుకుంది. నష్ట పరిహారాన్ని సంపాదించుకున్నా, స్వదేశంలో మ్యాచ్‌లు జరిగినప్పుడు ఇతరత్రా మార్గాల ద్వారా అందే భారీ మొత్తాలను కోల్పోయింది. ముంబయి దాడుల తర్వాత పాకిస్తాన్‌తో పాకిస్తాన్ ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు తెరదించడంతో పీసీబీ కష్టాలు మరింతగా పెరిగాయి. ఎన్నో ప్రయత్నాలు, వేడికోళ్ల అనంతరం పాక్ జట్టుతో క్రికెట్ సిరీస్‌లకు భారత్ అనుమతించింది. అయితే, ఆ జట్టు మన దేశంలో టి-20, వన్డే ఇంటర్నేషనల్స్ ఆడి స్వదేశానికి వెళ్లేవెళ్లక ముందే, సరిహద్దులో పాక్ సైనికులు తెగబడ్డారు. దాడులకు ఉపక్రమించి, కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పాక్ క్రికెటర్లలో ఎవరికీ స్థానం దక్కలేదు. అంతే గాక, హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) టోర్నమెంట్‌లో పాల్గొనడానికి వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహించాల్సిన తొమ్మిది మంది పాకిస్తాన్ హాకీ క్రీడాకారులను భారత ప్రభుత్వం వెనక్కు పంపింది. వారు పాల్గొన్న మ్యాచ్‌లను అడ్డుకొని తీరుతామని శివసేన, భజరంగ్ దళ్ హెచ్చరించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. మహిళల ప్రపంచ కప్‌లో పాల్గొనడానికి వచ్చిన పాక్ క్రికెట్ జట్టుకు కూడా ముంబయిలో దాదాపు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీనితో ఆ జట్టు ఆడాల్సిన అన్ని మ్యాచ్‌లను ముంబయి నుంచి కటక్‌కు తరలించారు. ఇలాంటి సంఘటనలేన్నో పాక్ క్రీడా రంగాన్ని, ప్రత్యేకించి క్రికెట్‌ను సమస్యల వలయంలోకి నెట్టాయి. అధ్యక్షుడి హోదాలో ఇజాజ్ బట్ తీసుకున్న ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు కొత్త అధ్యక్షుడు జకా అష్రాఫ్ మెడకు చుట్టుకున్నాయి. పీసీబీకి కొత్త జవసత్వాలను అందించి, ఆర్థికంగా బలోపేతం చేయడానికి అష్రాఫ్ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి కరాచీలోని జాతీయ స్టేడియం పక్కనే ఒక ఐదు నక్షత్రాల హోటల్‌ను నిర్మించాలని పీసీబీ నిర్ణయించింది. విదేశీ క్రికెటర్లను ఆకర్షించడంతోపాటు, భద్రతపై వారికి నమ్మకం కల్పించేందుకు పీసీబీ సంధిస్తున్న అస్త్రం ఇది. అవాంత్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బాధ్యతలు అప్పచెప్పింది. ఈ ప్రయత్నం సఫలమైతే, స్టేడియానికి ఆనుకొనే బస ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని, కాబట్టి క్రికెటర్ల భద్రతకు వచ్చే ప్రమాదం ఏమీ ఉండదని ప్రపంచానికి చాటిచెప్పాలని పీసీబీ యోచిస్తున్నది. అయితే, ఈ ప్రయత్నాలను క్రికెట్ ఆడే దేశాలు ఎంత వరకూ నమ్ముతాయన్నది అనుమానమే. క్రికెటర్లు భయాన్ని వీడి పాక్ పర్యటనకు క్యూ కడతారని అనుకోవడం అత్యాశే. భారత్‌తో జరిగిన సిరీస్‌ను ప్రపంచానికి చూపిస్తూ, త్వరలోనే తమ దేశంలో టీమిండియా పర్యటిస్తుందని అష్రాఫ్ తెగ ప్రకటనలు గుప్పించేస్తున్నాడు. భారత ప్రభుత్వం, క్రికెట్ బోర్డు ఈ విషయంలో సానుకూలంగా ఉన్నాయని అంటున్నాడు. కానీ, అష్రాఫ్ ప్రకటనల్లో నిజం ఏమాత్రం లేదనేది వాస్తవం. ఒకవేళ పాక్‌కు టీమిండియా వెళ్లినా మిగతా జట్లు మాత్రం వెళ్లనుగాక వెళ్లవు.

- శ్రీహరి

గోల్‌కీపర్‌పై దాడి..

ఓ సాకర్ వీరాభిమాని రెచ్చిపోయాడు. ప్రత్యర్థి జట్టు గోల్‌కీపర్‌పై దాడికి దిగాడు. ఫలితంగా నాలుగు నెలల జైలు శిక్షను అనుభవించనున్నాడు. గాలింహామ్‌లో వైకాంబ్, గిలింహామ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఓ యువకుడు భద్రతా సిబ్బంది కళ్లుగప్పి మైదానంలోకి పరుగులు తీశాడు. గిలింహామ్ అభిమానిగా ప్రకటించుకున్న అతను వైకాంబ్ గోల్‌కీపర్ జోర్డాన్ ఆర్చర్‌పై దాడి చేశాడు. క్షణాల్లో తేరుకున్న భద్రతా సిబ్బంది అతనిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. దాడికి పాల్పడిన ఆ వీరాభిమానికి కోర్టు నాలుగు నెలల జైలు శిక్ష విధించింది. సాకర్ వీరాభిమానులు ఎంతకైనా తెగిస్తారని అనేకానేక సందర్భాల్లో రుజువైంది. తాజా సంఘటన క్రీడాకారుల భద్రతపై ఆందోళనను మరింత పెంచుతున్నది.

అలరించిన 'నైపుణ్యం'

డానియల్ చోప్రా

పార్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్)కు హాజరైన దేశవిదేశీ ఆటగాళ్ల మధ్య సరదాగా సాగిన 'నైపుణ్యం' పోటీలు ప్రేక్షకులను అలరించాయి. హెచ్ఎస్‌బీ సామాజిక సేవా కార్యక్రమాలకు నిధులను సమీకరించడానికి ఏర్పాటు చేసిన ఈ పోటీల ద్వారా సమకూరిన 25,000 డాలర్లు సమకూరడం విశేషం. ఆటగాళ్లను అంతర్జాతీయ, భారతీయ జట్లుగా విభజించారు. ఫ్లాప్ షాట్, బంకర్ షాట్, చిప్, లాంగ్ పుట్ విభాగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఒక్కో జట్టులో ముగ్గురు చొప్పున ఆటగాళ్లు పోటీపడ్డారు. అంతర్జాతీయ జట్టుకు మైఖేల్ క్యాంప్‌బెల్, డానియల్ చోప్రా, తావర్న్ విరాత్‌చంత్ బరిలోకి దిగగా, భారత్‌కు శివ్ కపూర్, గగన్‌జిత్ భుల్లార్, అనిర్బాన్ లాహిరి ప్రాతినిథ్యం వహించారు. హోరాహోరాగా సాగిన అన్ని విభాగాల్లోనూ ఇరు జట్ల ఆటగాళ్లు సమవుజ్జీగా నిలిచారు. చివరికి రెండు జట్లు చెరి ఆరు పాయింట్లు సంపాదించగా పోటీ 'టై' అయింది. ఫలితం తేల్చడానికి నిర్వహించిన 'టై బ్రేకర్'లో లాహిరిపై చోప్రా ఆధిపత్యాన్ని ప్రదర్శించడంతో అంతర్జాతీయ జట్టు గెలిచింది. మొత్తం మీద ఈ ప్రదర్శన ఆసాంతం పోటీపోటీగా సాగినప్పటికీ, ఆటగాళ్లంతా సరదాగా తమ అనుభవాలు పంచుకున్నారు. గోల్ఫ్‌లో తమ నైపుణ్యానికి పదును పెట్టుకున్నారు. పనిలోపనిగా ఒక సామాజిక కార్యక్రమానికి తమ వంతు సాయం చేశారు. జీపీఎల్‌లో ప్రవేశపెట్టిన ఈ వినూత్న ప్రయోగం ఇతర టోర్నీలకు ఆదర్శప్రాయంగా నిలిచే అవకాశాలు లేకపోలేదు.

పాపకార్న్

బహ్రెయిన్‌లో క్రికెట్!

బహ్రెయిన్ క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు చురుగ్గా అమలవుతున్నాయి. బహ్రెయిన్ ఒలింపిక్ కమిటీతో ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఎసిసి) అధికారి, శ్రీలంక మాజీ క్రికెటర్ రమేష్ రత్నాయకే ఇటీవల జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. బహ్రెయిన్‌లో క్రికెట్ అభివృద్ధికి ఎసిసి అధికారిగానే కాకుండా, ఒక మాజీ ఆటగాడిగా కూడా తన వంతు సాయం చేస్తానని రమేష్ హామీ ఇచ్చాడు. రమేష్ లంక తరపున 23 టెస్టులు, 70 వన్డే ఇంటర్నేషనల్స్ ఆడాడు. క్రికెట్‌లో ఫాస్ట్ బౌలర్‌గా అతని అనుభవం బహ్రెయిన్ యువ ఆటగాళ్లకు ఉపయోగపడనుంది.

ఇదీ ఒక పోటీనే!

ఇసుక బస్తాలు మోయడం, నీళ్లలో నడవడం, బురదలో పాకడం, సబ్బు పూని జారేలా చేసిన గోడను ఎక్కడం వంటి అంశాలతో ఒక క్రీడను రూపొందించడం విచిత్రం. ఈ క్రీడకు మడ్ అండ్ అబ్‌స్టికల్ సిరీస్‌గా నామకరణం చేశారు. వీటిలో జాతీయ సాయి పోటీలు కూడా జరుగుతుండటం గమనార్హం. త్వరలో అన్ని దేశాల్లో ఈ పోటీలు జరిగి అంతర్జాతీయ టోర్నీని నిర్వహించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. అమెరికాలోని కాలిఫోర్నియాలో మెరెల్ డౌన్ డర్టీ నేషనల్ మడ్ అండ్ అబ్‌స్టికల్ చాంపియన్‌షిప్ సందర్భంగా హాలోవీన్ 10కె బురద పరుగులో తొలి పిట్‌ను పూర్తి చేసిన మిల్లా ఆస్టిన్.

మనసు మారింది!

అమెరికా స్టార్ జిమ్నాస్ట్ అలీ రైస్మన్ మనసు మార్చుకుంది. లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన రైస్మన్‌కు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. ఆతర్వాత ఆమె విరామం లేకుండా 40 ప్రధాన నగరాల్లో సుడిగాలి పర్యటన చేసింది. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను కలిసే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. బోస్టన్ బ్రూయిన్స్, విన్నీపెగ్ జెట్స్ మధ్య ఎన్‌హెచ్ఎల్ హాకీ మ్యాచ్‌ని తిలకించడానికి వెళ్లిన రైస్మన్‌కు గౌరవ సూచకంగా 'పంక్' (హాకీ స్టిక్)ను కిందపెట్టి క్రీడాకారిణులంతా ఆమెకు అభివాదం చేశారు. రియో ఒలింపిక్స్ నాటికి తాను ఫిట్‌నెస్‌తో ఉంటానో లేదోనన్న అనుమానం వ్యక్తం చేసిన ఆమె, అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేసింది. వైఫల్యాలతో అభిమానులను నిరాశ పరచడం కంటే, ఫామ్‌లో ఉన్నప్పుడే వైదొలగితే మేలని పలు సందర్భాల్లో ఆమె వ్యాఖ్యానించింది. అయితే, రైస్మన్ ఇప్పుడు మనసు మార్చుకుంది. అంతర్జాతీయ కెరీర్‌ను కొనసాగించాలని ఆమె నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని అధికారికంగా ఇంకా ప్రకటించకపోయినా, జిమ్నాజియంలో దర్శనమిస్తూ, ఫిట్‌నెస్ కోసం కసరత్తు చేస్తూ ఆమె కనిపించడం ఈవార్తలకు బలాన్నిస్తోంది. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాలని అనుకుంటున్న రైస్మన్ ఎంత వరకూ రాణిస్తుందో చూడాలి.

పునియాకు 'జింక్' చేయూత

భారత స్టార్ డిస్కస్ త్రోయర్ కృష్ణ పునియా రెండేళ్ల పాటు అమలులో ఉండే ఒప్పందంపై హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌తో సంతకం చేసింది. మరో రెండేళ్లలో జరగనున్న ఆసియా క్రీడలతో పాటు వివిధ అంతర్జాతీయ మీట్స్‌లో మరింత మెరుగైన ప్రదర్శనతో రాణించడానికి, పతకాలు సాధించడానికి ఈ స్పాన్సర్‌షిప్ ఆమెకు ఉపయోగపడుతుంది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన పునియా లండన్ ఒలింపిక్స్‌లో దారుణంగా విఫలమైంది. అయితే, అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడానికి మెరుగైన శిక్షణ అవసరమని ఆమె ఎంతోకాలంగా వాదిస్తున్నది. హిందుస్థాన్ జింక్‌తో కుదిరిన ఒప్పందం ఆమె కలలను సాకారం చేయనుంది.

వేటు పడింది

కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కష్టంగానీ, దానిని సగంలోనే తుంచేసుకోవడం చాలా సులభం. ఈ విషయాన్ని నిరూపించింది భారత ఫాస్ట్ బౌలర్ ప్రవీణ్ కుమార్‌పై వేటు ఉదంతం. అందరితోనూ గిల్లికజ్జాలు పెట్టుకొని, తోటి ఆటగాళ్లపై నోరు పారేసుకున్న ప్రవీణ్ తగిన మూల్యం చెల్లించుకున్నాడు. అతనిపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) వేటువేసి, క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించేది లేదని చెప్పకనే చెప్పింది. అంతర్ రాష్ట్ర విజయ్ హజారే టోర్నమెంట్‌లో పాల్గొనరాదం టూ బిసిసిఐ జారీ చేసిన ఆదేశాలు ఒక రకంగా ప్రవీణ్ కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేశాయి. ఎప్పుడూ కస్సుబుస్సులాడుతూ, చిరాకు ప్రదర్శిస్తూ, ఘర్షణలకు దిగుతూ ప్రవీణ్ వివాదాల్లో తన ప్రవర్తన కారణంగానే ఇప్పుడు సమస్యల్లో చిక్కుకుంటున్నాడు. అతని మానసిక స్థితి సరిగ్గా లేదని అంపైర్లు అభిప్రాయపడుతున్నారంటే, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్ ట్రోఫీలో భాగంగా ఒఎన్‌జిసి తరపున ప్రవీణ్ కుమార్ ఇన్‌కం టాక్స్‌తో మ్యాచ్ ఆడిన ప్రవీణ్ వైఖరిపై బిసిసిఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ మ్యాచ్‌లో ఇన్‌కం టాక్స్ బ్యాట్స్‌మన్ అజితేష్ అగర్వాల్‌కు ఓ బౌన్సర్‌ను సంధించాడు. నిబంధనల ప్రకారం భుజాల కంటే ఎక్కువ ఎత్తులో దూసుకెళ్లిన బంతులను నోబాల్స్‌గా ప్రకటించాల్సి ఉంటుంది. ఇదే విషయాన్ని అంపైర్‌ను అగర్వాల్ ప్రశ్నించాడు. అయితే, ప్రవీణ్ కుమార్ మధ్యలో జోక్యం చేసుకొని, అగర్వాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. నోటికొచ్చినట్టు తిట్టిపోశాడు. ఈ పరిణామం పట్ల దిగ్భ్రాంతి చెందిన ఫీల్డ్ అంపైర్లు అతనిపై మ్యాచ్ రిఫరీ ధనంజయ్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ మానసిక సంయమనాన్ని కోల్పోయాడంటూ బిసిసిఐకి రాసిన లేఖలో ధనంజయ్ సింగ్ పేర్కొన్నట్టు సమాచారం. కాగా, ప్రవీణ్ కుమార్‌పై చర్య తీసుకుంటారా అన్న ప్రశ్నకు బిసిసిఐ ముఖ్య పాలనాధికారి రత్నాకర్ శెట్టి సరైన సమాధానం ఇవ్వకపోయినా, అతనిపై నిషేధం విధించడంతో బోర్డు ఆంతర్యం స్పష్టమైంది. ఇది బోర్డు అంతర్గత వ్యవహారమని, వివరాలు వెల్లడించడం సాధ్యం కాదని రత్నాకర్ ప్రకటించిన తర్వాత బోర్డు జారీ చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం విశేషం. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లోనూ ప్రవీణ్ కుమార్ ఇదే తరహాలో ప్రేక్షకులను తూలనాడాడు. వారితో వాగ్వాదానికి దిగాడు. చివరికి అధికారులు కల్పించుకొని, ప్రేక్షకుల నుంచి ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ప్రవీణ్ కుమార్ ఈ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నదని ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. జాతీయ జట్టులో స్థానం లభించనందుకు అతను మానసిక ఒత్తిడికి గురై, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని కొందరి అభిప్రాయం. అతని మానసిక పరిస్థితి బాగాలేదని, ప్రతి చిన్న విషయానికీ ఉద్రేకపడుతున్నాడని కొంతమంది వెన కేసుకొస్తున్నారు. అయితే, బోర్డు ఈ వాదనలను పట్టించు కోలేదు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదని గతంలో పలుమార్లు హెచ్చరించిన అధికారులు ఆ విషయాన్ని చేతల్లో చూపారు. విజయ్ హజారే టోర్నమెంట్ తర్వాత కూడా ప్రవీణ్ కెరీర్ కొనసాగుతుందా అన్నది అనుమానంగానే కనిపిస్తున్నది. అతనికి జాతీయ జట్టులో మళ్లీ స్థానం లభించ డం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.

సచిన్ తెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడు, అతనికి పోటీనివ్వగల సత్తావున్న బ్యాట్స్‌మన్ వినోద్ కాంబ్లి వంటి ఎంతోమంది భారత మేటి ఆటగాళ్లు క్రమశిక్షణ రాహిత్యం కారణంగానే కెరీర్‌ను నాశనం చేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యారు. విదేశీ ఆటగాళ్ల సంఖ్య ఈ జాబితాలో భారీగానే దర్శనమిస్తుం ది. ఎన్నో ఉదంతాలు ఉన్నప్పటికీ, మైదానంలో ఒళ్లు మరచి ఇష్టానుసారంగా ప్రవర్తించడం క్రికెటర్ల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుంది. ప్రవీణ్‌పై వేటు పడిన సంఘటనను ఒక పాఠంగా తీసుకొని యువ ఆటగాళ్లు జాగ్రత్త పడాలి. క్రీడా స్ఫూర్తిని పా టిస్తూ, 'జంటిల్మన్ గేమ్'గా క్రికెట్ ఉన్న మంచి పేరును నిల బెట్టే ప్రయత్నం చేయాలి.

వన్డేలకు ఆద్యుడు..

ఆస్ట్రేలియాలో పేరొందిన నైన్ నెట్‌వర్క్ అధినేత కెర్రీ ప్యాకర్ *1976*లో టీవీ హక్కుల కోసం పోటీపడినా ఫలితం లేకపోయింది. దీనితో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డుపై ఆగ్రహించిన అతను డబ్ల్యుఎస్‌సి పేరుతో కొత్త టోర్నమెంట్‌ను స్వయంగా నిర్వహించాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ టోనీ గ్రెగ్ అతనికి సహకరించాడు. బ్యాట్స్‌మెన్ రంగురంగుల దుస్తులు, హెల్మెట్లు ధరించి ఆడిన డే/నైట్ మ్యాచ్‌లకు విశేష ఆదరణ లభించింది. ఇప్పటి వన్డే ఇంటర్నేషనల్, టి-*20* టోర్నీలకు ప్యాకర్ సిరీసే మూలం. డబ్ల్యుఎస్‌సి ఘన విజయం కావడంతో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు దిగి వచ్చింది. ఆతర్వాతి సిరీస్ ప్రసార హక్కులను నైన్ నెట్‌వర్క్‌కు అప్పచెప్పింది.



సున్నాకే 4 వికెట్లు..

ఇంగ్లాండ్‌తో *1952* జూన్ *5* నుంచి *9* వరకూ లీడ్స్‌లో జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఒక దశలో పరుగుల ఖాతా తెరవకుండానే నాలుగు వికెట్లు కోల్పోయింది. పంకజ్ రాయ్, దత్తా గైక్వాడ్, మాధవ్ మంత్రి, విజయ్ మర్చెంట్ ఒకరి తర్వాత మరొకరికిగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ మ్యాచ్‌ని భారత్ ఏడు వికెట్ల తేడాతో చేజార్చుకుంది.

- సత్య

డేర్ డెవిల్స్‌కు ముస్తాక్ సేవలు?

పాకిస్తాన్ మాజీ టెస్టు స్పిన్నర్ ముస్తాక్ అహ్మద్ ఈఏడాది జరిగే ఆరో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఢిల్లీ డేర్ డెవిల్స్‌కు సేవలు అందించనున్నాడు. అతను బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కరాచీ నుంచి పిటిఐకి ఫోన్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ముస్తాక్ తెలిపాడు. ఢిల్లీ ఫ్రాంచైజీ తనను సంప్రదించిందని అన్నాడు. ఒకటిరెండు రోజుల్లో తన నిర్ణయం వెల్లడిస్తానని వారికి చెప్పినట్టు ముస్తాక్ పేర్కొన్నాడు. ఇటీవల ఇంగ్లాండ్ జట్టుతో కలిసి ముస్తాక్ భారత్‌లో పర్యటించాడు. ఆ జట్టుకు బౌలింగ్ సలహాదారుగా వ్యవహరించాడు. టీమిండియాను స్వదేశంలో ఓడించి ఇంగ్లాండ్ సిరీస్ కైవసం చేసుకోవడంలో ముస్తాక్ కీలక పాత్ర పోషించాడు. అతని మార్గదర్శకంగా ఐపిఎల్‌లో రాణించవచ్చని డేర్ డెవిల్స్ ఫ్రాంచైజీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే ముస్తాక్‌కు ఆఫర్ ఇచ్చిందని సమాచారం. ఐపిఎల్‌లో ఈసారి కూడా పాకిస్తాన్ క్రికెటర్లలో ఎవరికీ స్థానం లభించని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముస్తాక్ బౌలింగ్ కన్సల్టెంట్ పేరుతో భారత్‌కు వస్తే, శివసేన, భజరంగ్ దళ్ తదితర సంస్థలు ఏ విధంగా స్పందిస్తాయన్నది ఆందోళన కలిగిస్తోంది.

బాబోయ్.. ఇంత డబ్బా!

ఐపిఎల్-6 వేలంలో 3.5 కోట్ల రూపాయలు పలకడంపై తాను ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని ముంబయి ఆల్‌రౌండర్ అభిషేక్ నాయర్ అన్నాడు. బుధవారం నుండి జరిగే ఇరానీ ట్రోఫీపై దృష్టి నిలిపినందున ఈ అంశంపై ఎక్కువగా ఆలోచించట్లేదని చెప్పాడు. ఐపిఎల్ ముగిసిన తర్వాతే ఈ విషయం పట్టించుకుంటానని అన్నాడు. ఏ ఫ్రాంచైజీ తరపున ఆడాలో తేలినందున నిశ్చింతగా ఉంటానని తెలిపాడు. పుణే వారియర్స్ తనపై కనబరిచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నాడు. ఈ నెల 16 నుండి ఆస్ట్రేలియా, భారత్ 'ఎ' మధ్య జరిగే మూడు రోజుల ప్రాక్టీసు మ్యాచ్‌కు తనను మొదటి ఎంపిక చేయకపోవడం నిరాశ కలిగించిందని అన్నాడు. అయితే, చివరికి మళ్లీ ఎంపిక చేయడం ఆనందం కలిగించిందని చెప్పాడు. సెలక్టర్ల నిర్ణయానికి న్యాయం చేస్తానని స్పష్టం చేశాడు. కాగా, ఇటీవల ముగిసిన రంజీ ట్రోఫీలో నాయర్ 950 పరుగులు చేశాడు. అతను మీడియం పేస్ బౌలింగ్ కూడా చేయగలడు. ఐపిఎల్ గత సీజన్‌లో కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ తరపున ఆడిన నాయర్‌ను ఈ సీజన్‌లో పుణే వారియర్స్ 3.5 కోట్లకు సొంతం చేసుకుంది.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ప్రేమ గొప్పదే..
కానీ, దానికంటే
జీవితం ఎంతో గొప్పది

నిప్పును ఆర్పేందుకు నీరుంది..
ప్రేమను ఆపేందుకు
ఏముంది..?

అద్దం లాంటిది
హృదయం,
చేజారితే
శూన్యం..!

ఆంధ్రభూమి

గురువారం 14, ఫిబ్రవరి 2013

ఈ జగమే ప్రేమమయం..

మనిషి హృదయం ప్రేమకు నిలయం. ప్రేమ లేని జీవితం నిష్ఫలం, నిరర్థకం! అలా అని మనిషికి మాత్రమే ప్రేమ ఉంటుందని కాదు, ఈ విశ్వమంతా ప్రేమమయమే! పక్షిజంటల ప్రేమ కువకువలు, పాము జంటల ఆలింగన నృత్యాలు- ప్రేమ మనిషికి మాత్రమే సొంతం కాదని చెప్పక చెబుతున్నాయి. పూవు-తుమ్మెద, నింగి- నేల.. ప్రకృతి-పురుషుడు.. కలువ, నెలరేడు- ప్రేమ కలయికలు కవుల వర్ణనలే అయినా స్త్రీ, పురుష కలయికలను సూచిస్తూ.. తద్వారా ప్రేమకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. 'ప్రేమ లేని మనిషినే కాదు, ప్రేమ లేని విశ్వాన్నే మనం ఊహించలేం' అని ఈ లోకానికి చాటి చెబుతున్నాయి.

'ప్రేమ' అనే మాట ఈ రోజు కొత్తగా పుట్టింది కాదు. సృష్టి ప్రారంభం నుంచే ప్రేమ జాడలున్నాయి. మన పురాణాలను, ప్రబంధాలను, చరిత్ర గ్రంథాలను తిరగేస్తే ఎన్నో అద్భుత ప్రేమ కథలు, అమర ప్రేమ కథలు మన కళ్ళముందు సాక్షాత్కరిస్తాయి. శివుడిని ప్రేమించిన పార్వతి... వేంకటేశ్వరస్వామిని ప్రేమించిన పద్మావతి.. కృష్ణుడిని ప్రేమించిన రుక్మిణి.. సలీంను ప్రేమించిన అనార్కలి, మజ్నూని ప్రేమించిన లైలా, మహా రాణాప్రతాప్‌ను ప్రేమించిన రాణీ పద్మిని తదితరుల కథలన్నీ ప్రేమ ఔన్నత్యాన్ని, పవిత్రతను చాటి చెప్పినవే! వేశ్యా వృత్తి చేసుకునే లకుమ అనే ఓ అందమైన స్త్రీ శ్రీకృష్ణదేవరాయలను ప్రేమించి, తన ప్రేమవల్ల అతడు రాచకార్యాలను పక్కన పెడుతున్నాడని తెలిసి- దేశం కోసం తన ప్రేమనే కాదు, ప్రాణాన్నే త్యాగం చేసింది. ఇవన్నీ సువర్ణాక్షరాలతో చరిత్ర పుటలకెక్కిన ప్రేమకథలు. అలనాటి ప్రేమ కావ్యాల్లో అయినా, ఒకప్పటి సినిమాల్లో అయినా ఒక అనుభూతి, ఒక తాదాత్మ్యకత, హృదయావిష్కరణ ఉండేవి. కేవలం హావభావ ప్రదర్శనలతో, మనసును హత్తుకునే మాటలతోనే గొప్ప ప్రేమభావాన్ని వ్యక్తం చేసేవాళ్ళు. అందుకే వాళ్ళు కలిసి వున్నప్పుడు సంతోషించి, విడిపోయినప్పుడు బాధపడి... ప్రేమ కోసం అమరులైనప్పుడు దుఃఖించి పాఠకులు, ప్రేక్షకులు కూడా ఆ ప్రేమ సన్నివేశాలలో లీనమైపోయేవాళ్ళు! అదీ- ప్రేమ అంటే! వాళ్ళూ ప్రేమికులు అంటే!

ఇక, ఈ రోజుల్లో కుర్రకారుకి 'ప్రేమ' అన్నది ఒక ఫ్యాషన్ అయిపోయింది. 'లవ్' అన్నమాట పెదవుల అంచున ఎప్పుడూ ఆడే ఒక ఊతపదం అయిపోయింది. రేడియో జాకీలు, టీవీ యాంకర్లు వగలు పోతూ అబ్బాయిలను, అమ్మాయిలను- 'నీకు గర్ల్ ఫ్రెండ్ లేదా?', 'నీకు బోయ్‌ఫ్రెండ్ లేడా?' అని అడిగి, అలా లేకుంటే 'అయ్యో..! అదేంటి?' అని పబ్లిక్‌గానే అడిగేస్తూ యంగ్ జనరేషన్‌ను రెచ్చగొట్టేస్తున్నారు. బుద్ధిమంతులైన కుర్రకారు కొందరు ఉన్నా- వాళ్ళకు సిగ్గుపడే పరిస్థితి కల్పిస్తున్నారు. నలుగురు పెద్దవాళ్ళు ఒక దగ్గర చేరినప్పుడు, అందులో ఒకరు మాటల సందర్భంలో ఈ మధ్యనే మా అమ్మాయి లేక అబ్బాయి పెళ్ళి అయిందని చెప్పగానే, 'లవ్ మ్యారేజా..? అరేంజ్‌డ్ మ్యారేజా?' అని అడుగుతున్నారు. 'అరేంజ్‌డ్ మ్యారేజ్' అని ఒక వేళ అవతలి నుంచి సమాధానం వస్తే! 'ఆశ్చర్యంగా ఉందే..! ఈ రోజుల్లో కూడా అరేంజ్‌డ్ మ్యారేజా? చాలా రేర్!' అని పిల్లలముందే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

ప్రేమ అనేది రెండు మనసుల మధ్య అనుకోకుండా ఏర్పడే ఒక మధురానుభూతి అన్న అందమైన భావానికి బదులు- ఓ 'సామాన్యమైన పని' అన్న స్థితికి దిగజారిపోయింది. టీవీలు, సినిమాలు ప్రతిరోజూ ఇంటా బయటా 'ప్రేమ, ప్రేమ' అంటూ అదేపనిగా ఊదరగొట్టేస్తుండడంతో పాఠశాల విద్యార్థులు సైతం 'ఐ లవ్ యూ' అంటున్నారు.

ప్రేమలు అంటే ఇప్పుడు అర్థాలు మారిపోయాయి. రెండు హృదయాల కలయిక అన్న అర్థం మారిపోయి, రెండు శరీరాల కలయిక అన్న చౌకబారు అర్థం యువత మనసులో స్థిరపడిపోతోంది. 'ప్రేమ'ను 'శృంగారా'నికి పర్యాయపదంగా అనుకుని చెట్ల చాటునా, గుట్టలవెనకా చేరి పెళ్ళికిముందే అన్ని అనుభవాలను చవిచూస్తున్నారు. ఇతరులు గమనిస్తున్నారని తెలిసినా అసభ్యంగా, అసహ్యంగా ప్రవర్తిస్తున్నారు. మోజు తగ్గిపోయాక, అది 'ప్రేమ' కాదని తెలిసి అప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుని తలలు పట్టుకుంటున్నారు. తల్లిదండ్రులకు తల వంపులు తెస్తున్నారు.

ఈనాటి మోడ్రన్ యూత్ లవ్‌స్టోరీ ఇక్కడితో ఆగిపోయినా పరిస్థితి కొంతలో కొంత నయం అన్నట్టుగా ఉండేదేమో! కానీ, అలా కాకుండా ఇంకో డేంజర్ జోన్ వైపు నడుస్తుండటమే అందరికీ ఆందోళన కలిగిస్తూ ఉంది. 'ప్రేమ ఎంత మధురం!' అన్న రోజులు పోయి, ప్రేమ అనేది విచ్చలవిడితనంగా వికృత రూపాన్ని సంతరించుకుంటోంది. మోజు తీరడం వల్లనో, ప్రేమను నిరాకరించడం వల్లనో కొందరు యువకులు ఉన్మాదులుగా మారి అమ్మాయిలపై దాడులు చేస్తున్నారు, వారి ప్రాణాలు తీస్తున్నారు. ఇప్పటి ప్రేమ కోరుకుంటున్నది త్యాగాన్ని కాదు స్వార్థాన్ని. తనకు దక్కనిది మరెవరికీ దక్కకూడదనో, పెళ్ళి ప్రసక్తి తెస్తే అడ్డంకి తొలగించుకోవడానికో నిర్దాక్షిణ్యంగా చంపి... యువతుల నిండు జీవితాల్ని నాశనం చేస్తున్నారు.

'ప్రేమ' అనే రెండక్షరాలలో రెండు మనసుల కలయిక, రెండు జీవితాల సహజీవనం నిండుగా, నిర్మలంగా ఉండి.. అది విశ్వప్రేమగా వ్యాప్తి చెందాలి. ప్రేమ అన్నమాట పెదాల నుంచి వచ్చే ఊతపదంగా గాక, గుండెలోతుల్లో నుంచి వచ్చే జీవన మంత్రం కావాలి. 'ప్రేమించటం తప్పు' అని ఆనాడు కానీ ఈనాడు కానీ ఎవరూ అనటం లేదు. ఆ ప్రేమ కేవలం ఆకర్షణతో కూడిన శారీరక సంబంధం కాక, అనుభూతి ప్రధానమైన హృదయ సంబంధమైనది కావాలి. 'వాలు చూపులు, ఎదురు చూపులు, సామీప్యాలు, విరహబాధలు, పునఃసమాగమాలు, మూగ మనసులు, అందమైన శరీర భాషలు.. వీటన్నింటితో కూడుకున్న ప్రేమ సున్నితమైనది, భావప్రధానమైనదీ అయి హుందాగా, గౌరవప్రదంగా, సహజ సిద్ధంగా ఉంటుంది. ఇలాంటి ప్రేమలు ఇప్పుడు ఎక్కడ కనిపిస్తున్నాయి?

నేటి అల్ట్రామోడ్రన్ సినిమా సంస్కృతిలో ప్రేమ ఎలా ఉంటుందంటే- ఓ అబ్బాయి, ఓ అమ్మాయి ఎక్కడో అనుకోకుండా కలుసుకుని కాసేపు 'ఒరేయ్.. ఒరేయ్' అని తిట్టుకుని ఆ తర్వాత అమాంతం ప్రేమలో పడిపోయి పార్కులు, ట్యాంక్‌బండ్లు, బీచ్‌ల వెంట తెగ తిరిగేస్తారు. నడిరోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం అన్న ఆలోచనే లేకుండా డ్యూయెట్లు పాడేసి.. అక్కడే వాటేసుకుని, గాఢంగా ముద్దులు పెట్టుకుని.. ఆ తర్వాత ఏ గెస్ట్ హౌస్‌లోనో, హోటల్ రూమ్‌లోనో హాయిగా గడిపేస్తారు. నేటి సినిమాలు 'ప్రేమంటే ఇదే' అని కుర్రకారుకు ఇలాంటి 'వల్గర్ లవ్ లెసెన్స్' నేర్పుతుంటే- సమాజంలో ప్రేమ పవిత్ర, నైతిక విలువలు దిగజారకుండా ఎలా ఉంటాయి? ఈ పద్ధతి మారాలి. ఇలాంటి చౌకబారు చేష్టలవల్ల యువతకు తప్పుడు సంకేతాలు వెళ్లిపోతాయి. అవి వాళ్ళ భవిష్యత్తును బుగ్గిపాలుచేస్తాయి. సాంకేతికంగా సమాజం ఎంత ముందుకు వెళ్ళినా.. ప్రేమ విషయంలో మాత్రం వెనక్కు వెళ్లి, మళ్ళీ ఆ పాత రోజులే వస్తే బాగని అనిపిస్తుంది. చరిత్ర పునరావృతమౌతుందన్న మాటలు నిజం కావాలని అనిపిస్తుంది. ప్రస్తుత పెడ ధోరణులను యువత అధిగమించగలిగితే- ప్రేమ విషయంలో అప్రతిష్ట తొలగిపోయి, ప్రేమకు మళ్లీ మంచి రోజులు వస్తాయి.

- కొఠారి వాణీ చలపతిరావు

పాశ్చాత్య పోకడలు మనకేల?

ప్రేమ- రెండక్షరాల మధురిమ, రెండు హృదయాల సరిగమ. కానీ, నేటి ప్రేమలు ఆధునికత ముసుగులో పెడదారులు పడుతున్నాయి. విదేశీ భావజాలం యువతలో విచ్చలవిడితనాన్ని, వితండవాదాన్ని ప్రోత్సహిస్తున్నది. విదేశీ విష సంస్కృతిలో భాగమే 'ప్రేమికుల దినం'. అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం వల్ల జరిగే 'వాలెంటైన్స్ డే' వెనుక రెండు రకాల కుట్రలు ఉన్నాయి. యువతను సాంస్కృతికంగా, నైతికంగా నిర్వీర్యం చేయటం మొదటిదయితే, సామ్రాజ్యవాద దేశాలు ఆర్థికంగా బలపడడం అనే వ్యాపార దృక్పథం రెండవ కారణం. 'వాలెంటైన్స్ డే' పేరిట మీడియాలో విపరీతంగా ప్రకటనలు గుప్పించి బహుళ జాతి సంస్థలు తమ మార్కెట్‌ను అన్ని దేశాల్లోనూ పెంచుకుంటున్నాయి. టీవీ చానల్స్ స్పెషల్ ప్రోగ్రామ్స్ అంటూ రేటింగ్‌ను పెంచుకుంటాయి. బొకేలు, గిఫ్ట్‌ల కొనుగోళ్లతో షాపులన్నీ బిజీ, హోటళ్ళు- సినిమా హాళ్లలో రద్దీ. జల్సాగా ఎంజాయ్ చేయాలంటే బోలెడు ఖర్చు చేయాలి... ఇవీ వాలెంటైన్ డే ప్రత్యేకతలు.



అసలు భారతదేశానికి ప్రేమంటే చెప్పాల్సిన అవసరమే లేదు. మన పురాణ కాలంలోనే గొప్ప ప్రేమికులు అనేకమంది ఉన్నారు. ప్రేమలో ఓడిపోయి, మరణించిన విదేశీయుల తద్దినాలను 'వాలెంటెన్స్ డే' అని ఓ పర్వదినంగా జరుపుకోవాల్సిన అగత్యం మనకు లేదు. పదహారు వేల మంది గోపికల ప్రేమకు నోచుకున్న శ్రీకృష్ణుడి జన్మదినం మనకు నిజమైన 'ప్రేమికుల దినం'. అర్జునుడు - సుభద్ర, ప్రద్యుమ్న-రతీదేవి, సాంబుడు-లక్ష్మణ, అనిరుద్ధుడు-ఉషకు పరిణయాలు జరిపించి, వారి ప్రేమలను విజయవంతం చేసిన శ్రీకృష్ణభగవానుడు- నిజమైన ప్రేమకు ప్రతీక.

కాగా, విదేశీయుల్ని అనుకరించడం మన దేశంలో ఒక ఫ్యాషనైపోయింది. పాశ్చాత్య జీవన విధానంలో భోగలాలసత, విచ్చలవిడితనం, హడావుడి ఎక్కువ. జీవితాల్లో కోల్పోయే విషయాలు అప్పుడప్పుడు గుర్తుకొచ్చి ప్రేమాభిమానాలు చూపించుకునే ప్రయత్నం వారు చేస్తారు. 'వివిధ దినాలు' జరుపుకోవడం వెనుక విదేశీయుల అసలు ఉద్దేశం అదే. అందుకే- తల్లిరోజు, తండ్రి రోజు, స్నేహితుల రోజు, పెళ్లిరోజు, పెళ్లాం రోజు... అంటూ జరుపుతూ ఉంటారు. ఏనాడూ తల్లిని ఆదరించని వాళ్లు కనీసం 'మదర్స్ డే'నాడైనా ఆదరిస్తాడనే ఆశతో అలా సరి పెట్టుకున్నారు. విచక్షణతో వ్యవహరించి విదేశీ భావ దాస్యాన్ని మనం తొలగించుకుందాం. సంస్కృతి పరిరక్షణలో మన పాత్రను పోషిద్దాం.

-సామల కిరణ్

టీచరా? రాక్షసా?

యు.కె.జి, ఎల్.కె.జి. చదివే పసిపిల్లల్ని కూడా ఎంతో నమ్మకంతో- తల్లిదండ్రులు ట్యూషన్ పేరిట టీచర్ల యింటికి- ఎంతో ధైర్యంగా పంపిస్తారు. కానీ, ఈ మధ్య కొంతమంది టీచర్లు అభం శుభం ఎరుగని పిల్లల్ని- అత్యంత భయానక హింసలకి గురిచేయడం- తరచుగా జరుగుతున్న సంఘటనలే.

మరీ దారుణంగా- కాన్పూరులోని ఒక ప్రయివేటు స్కూలులో పనిచేసే టీచరమ్మ- తన యింట ట్యూషన్‌కి పంపబడ్డ ఏడు సంవత్సరాల పిల్లవాడికి- తన తల్లిసాయంతో- పట్టకారు కాల్చి వొళ్లంతా వాతలు పెట్టింది. ట్యూషన్



అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

క్లాసులో ఆ బుడతడు- ఉగ్గబట్టుకోలేక- లాగు తడిపేసుకున్నాడు. అది ఆమె శుభ్రమయిన గదికి కళంకం తెచ్చిందంటూ- ఆవేశంతో ఆ పిల్లవాణ్ని పైశాచికంగా హింసించింది.

ఈ టీచర్‌గారి తల్లి- ఒక నాల్గవ తరగతి గవర్నమెంట్ ఉద్యోగిని. కూతురితో - ''వీడ్ని కదలకుండా పట్టుకోవే- వాతలుపెట్టి బుద్ధిచెప్తా'' అంటూ, ఎర్రగా కాల్చిన పట్టకారుతో ఆ చంటి వాడి మొహం, బుగ్గలు, పిర్రలు, పొట్ట, తొడలు, వీపు-యిట్లా శరీరమంతటా- 17 చోట్ల వాతలు పెట్టింది.

నాజిరాబాద్ పోలీసులు యీ సంగతి తెలిసి నిలువునా నీరైపోయారు. ఈ టీచరమ్మతో పాటు వాళ్లమ్మపైన పోలీసులు హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేసుకుని, లోతుగా దర్యాప్తుచేస్తున్నారు. ట్యూషన్లకు పిల్లల్ని పంపే తల్లిదండ్రులు- కాస్త సదరు టీచర్ కాండక్టు కూడా తెలుసుకుని ఆ పనిచేయాలి. ఆడవారిలో అమ్మని మాత్రమే చూసే అమాయకులు ఇక ఇతర విషయాలూ ఆలోచించాలేమో?

veeraji@sify.com

చదువుల తల్లికి వందనం

జ్ఞానానికి,కళలకు అధి దేవత అయిన సరస్వతీ దేవి అనుగ్రహం పొందేందుకు హిందువులు ఏటా మాఘశుద్ధ పంచమి రోజున 'వసంత పంచమి'ని జరుపుకోవడం ఆనవాయితీ. సరస్వతీ దేవి ఇదే రోజున జన్మించిందని దీన్ని 'శ్రీ పంచమి'గా కూడా వ్యవహరిస్తారు. భారత్‌తో పాటు నేపాల్, బంగ్లాదేశ్‌ల్లోనూ సరస్వతీ మాతను ఇదే రోజున ఆరాధిస్తారు. సంప్రదాయ బద్ధంగా జరుపుకునే ఈ ఉత్సవంలో 'పసుపు పచ్చ' రంగుకు విశేష ప్రాధాన్యం ఉంటుంది. పసుపు రంగు దుస్తులను ధరించి పూజలు చేసి, అదే రంగులో వండిన ప్రసాదాలను దేవికి నైవేద్యం పెడతారు. ముఖ్యంగా ఉత్తరాదిలో ఈ పండగను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. కొత్తగా బడుల్లో చేరే పిల్లలకు ఈ రోజున అక్షరాభ్యాసం చేయిస్తారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల చేత సరస్వతీ దేవికి పూజలు చేయిస్తారు. పలకా బలపాలను, పుస్తకాలు, పెన్నులను సరస్వతి చిత్రపటం ముందు ఉంచి, చదువులో బాగా రాణించాలని కోరుకుంటూ విద్యార్థులు ప్రార్థిస్తారు. సరస్వతీ దేవి కరుణిస్తే జీవితంలో అనుకూల ఫలితాలతో ఘన విజయాలు సొంతమవుతాయని హిందువుల విశ్వాసం. ఉత్తరాదితో పోల్చితే 'వసంత పంచమి'ని పశ్చిమ బెంగాల్, ఒడిషాల్లో విభిన్నంగా జరుపుకుంటారు. బెంగాల్‌లో విద్యార్థులే కాకుండా అన్ని వయసుల వారూ ఈ పండగను సంప్రదాయ రీతుల్లో జరుపుకుంటారు. మిగతా దేవతల మాదరి సరస్వతీ మాతకు నిత్య పూజలు జరిగే ఆలయాలు ప్రపంచ వ్యాప్తంగా చాలా తక్కువ. ఈ కారణంగానే ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల్లో సరస్వతీ పూజకు ప్రాధాన్యం ఇస్తారు. మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో బాసర వద్ద 'జ్ఞాన సరస్వతి' ఆలయం, తమిళనాడులోని తంజావూరు జిల్లా కుత్తనూర్‌లోని సరస్వతి ఆలయాలు చారిత్రక ప్రాధ్యాన్యం కలిగి ఉన్నాయి. సామూహిక అక్షరాభ్యాసాలు, ఆరాధనలతో పాటు ఈ పండగ సందర్భంగా సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహిస్తారు. వసంత పంచమి రోజున పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో గాలిపటాల పండగను ఘనంగా నిర్వహిస్తారు. గాలిపటాల విన్యాసాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీ సంఖ్యలో ఇక్కడికి చేరుకుంటారు. రాబోయే వసంత రుతువును స్వాగతించే సందర్భం ఇది.

అశ్లీలం.. అసలే వద్దు..!

'వాలెంటైన్స్ డే' సందర్భంగా స్వేచ్ఛా లోకంలో విహరించే ప్రేమికులు అశ్లీల సందేశాలకు, అసభ్యకర ఫొటోలకు దూరంగా ఉండాలని ఆస్ట్రేలియాలోని ఐటి రంగ నిపుణులు సున్నితంగా హెచ్చరిస్తున్నారు. ప్రేమను తెలిపేందుకు ఎన్నో మంచి మార్గాలున్నందున 'అశ్లీల' పోకడలకు యువత దూరంగా ఉంటే ఎలాంటి సమస్యలూ ఉండవని వారు పేర్కొంటున్నారు. 'వాలెంటైన్స్ డే'ను పురస్కరించుకుని పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, ఖరీదైన హోటళ్లలో డిన్నర్లు ఇవ్వడం 'పాత చింతకాయ పచ్చడి' అని ఆస్ట్రేలియాలోని యువతీ యువకులు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా 'ప్రేమికుల రోజు'న మొబైల్ ఫోన్లలో అశ్లీల సందేహాలు పంపడానికే వీరు మొగ్గు చూపుతున్నారు. ఇ-మెయిల్స్, సామాజిక వెబ్‌సైట్లలో అశ్లీల సందేశాలు, అసభ్యకర ఫొటోలు పంపేందుకు ఇలా యువత పోటీ పడడం మంచి పరిణామం కాదని 'మెకాఫీ' సంస్థ ప్రతినిధి సీన్ డ్యూకా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో మూడో వంతు యువత అశ్లీల పోకడలను ఆశ్రయించడం వల్ల ముస్ముందు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన అంటున్నారు. సుమారు ఏభై శాతం మంది ఆస్ట్రేలియన్లు స్మార్ట్ ఫోన్ల ద్వారా వ్యక్తిగత సందేశాలను, ఇ-మెయిల్స్, ఫొటోలను పంపుతున్నారని తాజా అధ్యయనంలో తేలింది. ప్రేమికుల మధ్య ఎపుడైనా విభేదాలు పొడసూపితే అశ్లీల సందేశాలు, అసభ్యకర ఫొటోల వల్ల హాని జరిగే అవకాశాలున్నాయని సీన్ డ్యూకా హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత, లైంగిక అంశాలపై సందేశాలు పంపుకోవడాన్ని ఓ సరదాగా భావించడం సరికాదన్నారు. ఈ సందేశాలు, ఫొటోలు ఇతరులకు చిక్కితే ప్రేమికులకు కీడు తప్పదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇవి వెబ్‌సైట్లలోకి ఎక్కితే వాటిని వెనక్కి తీసుకోవడం ఎవరి తరమూ కాదంటున్నారు. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు వంటివి ఇచ్చిపుచ్చుకునేముందు ప్రేమికులు ముందూ వెనకా ఆలోచించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. 'మెకాఫీ' నిర్వహించిన సర్వేలో భాగస్వామి అనుమతి లేకుండా సందేశాలను, ఫొటోలను ఇతరులకు అందుబాటులో ఉంచమని అతి కొద్ది మంది మాత్రమే చెప్పారు. వంచించిన సందర్భాల్లో మాత్రం ఇలాంటి వాటిని బయట పెడతామని 20 శాతం మంది నిర్మొహమాటంగా తెలిపారు. పెళ్లికి నిరాకరించడం, ఇతరులతో పరిచయాలు వంటి సందర్భాల్లో - ప్రేమికుల మధ్య విభేదాలు ఏర్పడి, 'ఆన్‌లైన్'లో బెదిరింపులు తప్పడం లేదని అధ్యయనంలో నిపుణులు గుర్తించారు.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
గురువారం
14, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

అమరేంద్రాబ్జ భవాళి కెన్న దుది నీవాదిం బ్రసాదించు న
ర్థము సిద్ధించు చునుండు గాని సుర మాత్రం గోరిన స్వీరికా
ర్యము సిద్ధింప దనేక మార్గముల బ్రారంభించిరే నిశ్చయా
ర్థముగా నీవ సమస్త కర్తవగుటం దర్కింప సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! ఇంద్ర బ్రహ్మాదులకు నీవు మొదట ప్రసాదించిన ప్రయోజనమే సిద్ధిస్తుంది. కాని, నీవే సమస్త కర్తవు కావడం చేత సురత్వమే కోరి అనేక మార్గాలలో ప్రారంభించిన వీళ్లకి కార్యం సిద్ధించదు. సర్వేశ్వరానుగ్రహం వల్ల నే సమస్తమూ సిద్ధిస్తుంది.సురత్వ మాత్రం చేత ఏదీ సిద్ధించదు. సురత్వమన్నది దేనికీ కర్త కాదు. అది దేన్నీ చేయలేదు. సమస్తాన్ని కర్త కచ్చితంగా సర్వేశ్వరుడే. అందువల్ల దేవతలు ఎన్ని మార్గాలలో కార్యాలను ప్రారంభించినప్పటికీ అది సిద్ధించదు. కేవలం ఈశ్వరుడు ప్రసాదిస్తేనే అది సిద్ధిస్తుంది. సమస్త కర్తృత్వం ఈశ్వరునిదే ఇతరులు నిమిత్త మాత్రులు. దైవత్వం చేతనే ఏదీ సిద్ధించదు. దేవదేవుడే అన్నింటికీ మూలం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

13

శ్రీ లత

వసంత హాస్పిటల్ గదిలోకి వచ్చేసరికి జీవన బెడ్‌మీద బాసిపట్టు వేసుక్కూర్చుంది!

జుట్టంతా రేగి కళ్ళు ఎర్రబడి విచలితంగా చూస్తున్నాయి. ఇద్దరు నర్సులు, ఆయా నిలబడి ఉన్నారు.

''మర్యాదగా నా పాపను నాకివ్వండి! నా పాపను నా నుంచి దూరం చేశారని ఏ పోలీసు స్టేషన్లో కంప్లయింటిచ్చినా ఇమ్మీడియెట్‌గా మిమ్మల్ని అరెస్టు చేస్తారు. మీ హాస్పిటల్ పర్మిషన్ రద్దు చేస్తారు!'' అని బెదిరిస్తోంది జీవన.

''మీ అమ్మగారొచ్చాక తీసుకొస్తానమ్మా! కాస్త ఓపికపట్టు'' వాళ్ళు ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నారు.

''నేను కన్న నా బిడ్డను ఇవ్వడానికి అమ్మా రావాలంటారేంటి?''

గదమాయిస్తోంది. వసంత లోపలకు అడుగు పెట్టగానే టక్కున వాదన ఆపేసింది.

''చూడమ్మా! పాపను తెమ్మంటే వీళ్ళు వినడంలేదు. నువ్వయినా చెప్పు''

చిన్నపిల్లలా వసంతకు కంప్లయింట్ చేసింది. ఆ మాట్లాడే తీరులో ఏదో స్పష్టమైన మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వసంత గమనించినా గమనించనట్లుగా...

''జీవనా! నువ్వలా మొండికేస్తే ఎలా?'' అనునయంగా అంది.

''నీకే చెప్పేది పాపను తెమ్మను'' ఈసారి పెద్దగా అరిచింది. జీవన ప్రవర్తన మొండితనం నుండి పిచ్చితనం వైపు మళ్లుతోందనిపిస్తోంది వసంతకు. మౌనంగా వెళ్ళి పాపను తీసుకుని వచ్చింది. పొత్తిళ్ళలో పాపను చూడగానే జీవన మొహం ఆనందాన్ని పులుముకుని పొద్దు తిరుగుడు పువ్వయింది. వసంత ఏం మాట్లాడకుండానే పాపను జీవన చేతుల్లో ఉంచింది. పాపను ఒళ్ళో పడుకోబెట్టుకోబోయి చెయ్యి జార్చింది జీవన.

''అలా కాదుండు, పడేస్తావ్! నేను పడుకోబెడతా'' అంటూ పాపను పొందికగా జీవన ఒడిలో పడుకోబెట్టింది వసంత. ఆ పడుకోబెట్టడంలో పాప తల జీవన ఎదను తాకి ఉలిక్కిపడింది. అమ్మ శరీర స్పర్శను గుర్తుపట్టిన పాప తడమసాగింది. జీవనకు అర్థం కాలేదు.. పాప ఎందుకలా చేస్తుందో! అమ్మవైపు చూసింది.

'పాలివ్వు' అంది వసంత ప్రశ్నార్థకమైన జీవన మొహం చూసి.

అమ్మవైపు కృతజ్ఞతగా చూసింది జీవన.

తల్లి బిడ్డను అందరికన్నా అధికంగా ప్రేమించడానికి కారణం.. బిడ్డకు పాలిచ్చేటప్పుడు తను పొందే అపరిమిత ఆనందంకోసం! తల్లిదండ్రి మమకారంతో ఇవ్వలేనిదీ, అన్నదమ్ములు ఆప్యాయతతో ఇవ్వలేనిదీ, భర్త ప్రేమతో అందివ్వలేనిదీ... చిన్ని చిన్ని చేతుల్తో, చిట్టి నోటితో బోసి నవ్వులతో తను కన్న పాపాయి ఇవ్వగలుతుంది! అనే విషయాన్ని మరోసారి గుర్తుచేసింది వసంత మెదడు.

ఫ్రాయిడ్ ఏ వైపు నుంచి చూసి తల్లి బిడ్డల సంబంధాన్ని నిర్వచించాడో అన్నదాన్ని వదిలేస్తే, బిడ్డకు పాలివ్వడంలో తల్లి శారీరకంగా మానసికంగా అద్భుతమైన ఆనందాన్ని పొందగలుగుతుందనేది సృష్టిలో వెల్లడైన రహస్యం! అనే పాయింట్ మళ్లీ వసంతను కుదిపింది.

ఆ ఆనందం జీవన తనక్కూడా ఇచ్చింది కాబట్టి ఇపుడు జీవన ఆనందాన్ని అర్థం చేసుకోగలిగింది వసంత. ఈ సమాజం కోసం ప్రకృతి సమాజాన్ని చీల్చే శక్తి తనకు లేదనిపించింది. అందుకే మౌనంగా చూస్తుండిపోయింది.

ఆ తర్వాత నాలుగు రోజులూ వసంత జీవనతో ఏ వాదన చేయలేదు. వాదన చేయడం, దాన్ని వితండంగా మార్చడం అనవసరమనుకుంది. వీలయినంతవరకు తన అయిష్టాన్ని మౌనంగా వ్యక్తం చేయసాగింది. తల్లి బాధ జీవనకు అర్థమవుతున్నా. ఆ బాధ తగ్గాలంటే పాపను వదులుకోవాలి కాబట్టి ఆ బాధను తగ్గించే ప్రయత్నమే చెయ్యలేదు. అన్నీ తెలిసిన తల్లికన్నా, ఏమీ తెలీని తన బిడ్డే తనకు అపురూపమనిపించింది. ఇక్కడా 'అమృతనమే' గెలిచింది! తనకు తెలీకుండానే తానే పాపలో విలీనమై పాపకు సేవకురాలయింది వసంత. కఠిన పాషాణాన్నయినా కరిగించి దాసోహం చేయించుకోగల శక్తి పసితనానికి ఉన్న వరం అనిపించి, ఆ వరానికి తాను ఒదిగిపోవడంతో పాపమీద ఎనలేని శ్రద్ధా, ఆప్యాయతా పెరగసాగాయి. అప్పటివరకు జీవన నుంచి పాపను వేరు చేయడానికి ప్రయత్నించిన తన 'అమ్మ' మనసు పాపను విడిచి వుండలేని స్థితికి చేరుకుంది.

జీవనకూ అమ్మలోనూ మార్పు స్పష్టంగా అర్థం కాసాగింది.

⁘⁘⁘

డిశ్చార్జ్ అవుతూ పాప బర్త్ నోట్ ఫిలప్ చేస్తూ ఫాదర్స్ నేమ్ కాలమ్ దగ్గర ఆగిపోయింది జీవన.

ఎవరిపేరు రాస్తుందోనని వసంత ఆసక్తిగా చూడసాగింది.

''త్వరగా పూర్తిచేయండి మేడమ్! ఇంకో ఇద్దరు డిశ్చార్జ్‌కు రెడీగా ఉన్నారు'' అంది హెడ్ నర్స్, అదొక్కటే వదిలేసి మిగిలిన కాలమ్స్ పూర్తిచేసి ఇచ్చింది.

''సరిగా చూసుకోండి మేడమ్ తండ్రి పేరు రాయలేదు'' అంటూ తిరిగిచ్చిందావిడ.

''ఆ'' అని చిన్నగా తెరిచిన నోరు మూయకుండానే వెనక్కి నడుచుకుంటూ వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగొచ్చి 'తండ్రి పేరు రాయాలంటున్నారండీ' అంది.

''ఈజిట్ లీగల్ కండీషన్?'' కోపంగా అడిగింది జీవన.

''నో.. నో... బట్ ఇది తప్పనిసరి ఫార్మాలిటీ కదా!'' ప్రపంచంలో ఎనిమిదో వింతను చూస్తున్నట్టుగా జీవన వైపే చూస్తూ చెప్పింది హెడ్‌నర్స్.

''ఈ ఫార్మాలిటీ నేను మేనేజ్ చెయ్యదల చుకోలేదు'' నిక్కచ్చిగా చెప్పింది జీవన.

''ఎందుకు? ఎందుకు? మేడమ్?'' ఆసక్తిగా అడిగిందావిడ.

''ఎందుకంటే, నాకు నిజంగా నా పాప తండ్రి పేరు తెలీదు'' అంది.

''మీరూ...'' మధ్యలోనే ఆగింది.

''బ్రోతల్ హౌస్ నుంచి రాలేదు, మంచి సంప్రదాయ కుటుంబం నుంచే వచ్చాను''.

''మరి...''

రేప్ చెయ్యబడలేదు''

''మరి...?''

-ఇంకావుంది

144 రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

అప్పుడు శ్రీరాముడి ఆజ్ఞను తలదాల్చి ఆ దివ్యశరాన్ని నీలుడు పెరికివేశాడు. అప్పుడు ఆ వాలి తన బాహ్యగతులు బంధించాడు. మరలిన ప్రాణవాయువుతో మనస్సుని సంధించాడు. పరంతపుడైన శ్రీరాముడి శ్రీమూర్తిని మనమున నిలుపుకొని బ్రహ్మానందపరుడయి, బ్రహ్మరంధ్రము ద్వారా అసువులు విడిచిపెట్టేశాడు. అంత తారాదికాంతలు ఆ వాలిపైన పడి గోలుగోలున ఏడ్వసాగారు.

అప్పుడు అంగద సుగ్రీవులు, అక్కడి వానర ముఖ్యులు 'హా వాలీ! వానర సార్వభౌమా! ప్రాణాలు విడిచావా?'' అని విలపింపదొడగారు. అంత లక్ష్మణుడు సుగ్రీవాదుల్ని పరామర్శించి, ''అంజేయా! నీవింత దివ్యాంబరాలు, పూలమాలలు, గంధసారాదులు తెప్పించు. ఒక శిబికను కూడా తెప్పించు. వానరులు లక్ష్మణుడు చెప్పినట్టు చేశారు.

వనచరులు అందరూ ఆ ప్రదేశం సమీపించారు. సుగ్రీవుడు తార ముస్సగు వానరాంగనల రోదనలు ఉపలాలనలతో వారించాడు?

అనంతరం శ్రీరాముడి అనుమతి పొందివాలికి పరలోకవైదిక క్రియలు జరిపారు. ఆ దశరాత్రి శేషకృత్యాలు యథాశాస్త్రంగా నిర్వర్తించారు. మరునాడు పరిశుద్ధులు అయారు. సుగ్రీవుడు తాను, అంగదుడు, హనుమంతుడు రామచంద్రుని సందర్శింప చనుదెంచారు.

అందరికీ పరమానందం కలిగే పగిదిని రామచంద్రుడు ''మీరింక నా ఆజ్ఞను మీర వద్దు. కిష్కింధను అలంకరించండి. కపిరాజ్య సింహపీఠానికి సుగ్రీవుణ్ణి అభిషిక్తుణ్ణి కావించండి. వాలి సుతుడు అంగదుడికి యువరాజ పట్టం కట్టండి'' అని వానరులందరూ హర్షించేటట్టు సముచిత రీతిని వాక్రుచ్చాడు.

అంత వానర దళ వాయులు తడయక కిష్కింధా నగరానికి అరుదెంచారు. నగరాన్ని మనోహరంగా అక్షిపర్వంగా అలంకరించారు. రత్న విదర్థికలు నిర్మించారు. ద్వారాలకి రంభాతరు స్తంభాలు కట్టారు. పన్నీరు చల్లి వీధుల ఇండ్ల ముంగిళ్ల రంగవల్లులు తీర్చిదిద్దారు. అంతఃపురాన్ని, కొలువు కూటాన్ని కన్నుల పండుగుగా కైచేశారు. నదీనద సముద్ర పవిత్రజలాలు, మంగళద్రవ్య సముదాయాలు తెప్పించి, మంగళవాద్యాలు ప్రతిధ్వనులీనగా పుణ్యాంగనామణులు సందడుల అటు ఇటు పర్వులిడి ఆయా శుభంకర కర్మలు పూర్తి చేశారు.

అంత పుణ్యాహవాచన పురస్సరంగా సింహచర్మంతో అలంకరించిన సింహపీఠంపైకి కపి సింహం అయిన సుగ్రీవుణ్ణి ఆసీనుణ్ణి చేసి ప్లవంగ తీరులు- దేవేంద్రుడి వైఖరిగా పుణ్య లగ్నంలో సుగ్రీవుణ్ణి అభిషిక్తుణ్ణి కావించారు. మహసత్త్వుడయిన అంగదుడికి మహావైభవంగా యువరాజు పట్టం కట్టారు. అంతిపురిలో వేడుకలు కొనసాగాయి. నీలుడు, తారుడు, ఆంజనేయుడు, ఇతర బంధుజనులు, హితులు సుగ్రీవ కపిరాజుని సందర్శించి సత్కృతులు సలిపారు. అన్యవానర యోధులు హస్తి పద్మాలు ముకుళించి, సుగ్రీవుడి బిరుదములు గొంతెత్తి పాడారు.

అంత సుగ్రీవుడు అనంత సంపదలతో పెంపొంది, వనచరులతో వడిగా ఏగుదెంచి రత్నరాసులు కాన్కవెట్టి, ఆ శ్రీరాముడి చరణారవిందాలకి సాగిలి ప్రణామం ఒనరించాడు. కరాలు జోడించాడు. కడు ప్రీతితో నిలిచాడు. బ్రహ్మానందభరితుడై ''రామచంద్ర విభూ! ఇక్కడ వుండడం ఏమిటి? ఇక నా నగరానికి వచ్చేయవలసింది'' అని ప్రార్థించాడు.

అప్పుడు రాముడు 'మౌనివృత్తి పూనిన తాపసులు పురాలలో వసింపతగదు. కనుక కిష్కింధకి రాను. ఇప్పుడు ఆషాఢమాసం అడుగుమోపింది. ఇది వైరులపై దండు వెడలిపోవ అనువైన కాలం కాదు.

ఈ వర్షాకాలం అంతా నేను మాల్యవంతంపైనే వసింపగలను. సూర్యతనయా! నీవు వెడలి కిష్కింధలోనే వుండు. శరత్కాలం ప్రవేశించిన వెంటనే వైరిపై ఎత్తి పోదాము'' అని వచించి సుగ్రీవుణ్ణి వీడ్కొలిపాడు.

-ఇంకావుంది

గురువారం, 14 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ చవితి ఉ.10.21
నక్షత్రం: రేవతి రా.తె.05.58
వర్జ్యం: సా.05.29 నుండి 07.09 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్త పడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. మీరు చేసేపనుల్లో లాభం వస్తుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. ఋణబాధలు తొలగిపోతాయి. ఆరోగ్యం మెరుగవుతుంది.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. ఉత్సాహంగా ఉంటారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బందిపడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఫలిస్తాయి.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
కొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతివిషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు.

మంచిమాట

'శ్రీ పంచమి' విశిష్టత

మాఘశుద్ధ పంచమిని 'శ్రీపంచమి' అంటారు. ఈ దినం మహాసుప్రసిద్ధమైన పర్వదినం. దేవీభాగతం, బ్రహ్మాండ పురాణం వంటి పురాణాలలో ఈ శ్రీ పంచమిని గురించి విశేషంగా చెప్తున్నాయి. సకలవిద్యా స్వరూపిణి అయిన పరాశక్తి 'సరస్వతీ దేవి'గా జన్మదినంగా చెప్తారు.

శ్రీపంచమి విద్యారంభ దినమని, వాగ్దేవిని ఆరాధించి, అక్షరాభ్యాసం చేయాలని బ్రహ్మవైవర్త పురాణంచెప్తుంది. విద్యాదానం జ్ఞానదానమేనని అన్న దానం తర్వాత ఈవిద్యాదానానికే ప్రాముఖ్యత ఉందని అంటారు. సరస్వతీ దేవి శాంత మూర్తియై ఒకచేత వీణ, మరోచేత పుస్తకం, జపమాల, అభయ ముద్రలను ధరించి వుంటుంది. ఈ మూర్తి విద్య, జ్ఞాన, బుద్ధులకు ప్రతీక. ఈ జ్ఞాన ప్రదాయిని కరుణతోనే విద్యాప్రాప్తి, జ్ఞానప్రాప్తి కలుగుతుందని పురాణ వచనం.

విద్యచేత వినయం, వినయం చేత జ్ఞానము, జ్ఞానము చేత ధనం, ధనం చేత అధికారము సంప్రాప్తిస్తాయి. ఎవ్వరిచే దొంగిలించబడనిది, నలుగురికి పంచగల శక్తి విద్యకు మాత్రమే ఉంది. సమాజంలో విద్య కలిగినవాడు ధనవంతుని కన్నా, సంఘంలో గొప్పవాడని, ఎక్కడివెళ్లినా బతకకలుగుతాడని శతకకారులు చెప్పడంకాదు నిత్యమూ ఎదురయ్యే విషయమే.

సరస్వతీ ఆరాధన వల్ల వాక్సుద్ధి వస్తుంది. మనిషికి మాటేప్రాణం కనుక ఈ దేవిని ఆరాధించి మనిషి సద్బుద్ధిని పొందుతాడు. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. అందుకే ఈ దేవిని శివానుజ అనీ పిలుస్తారు. సరస్వతీ దేవిని పూర్వం అశ్వలాయనుడు ఆరాధించి ఆ తల్లి కటాక్షం పొందాడని అంటారు. సరస్వతీ దేవి ఆరాధించే విధానం 'సరస్వతీ రహస్యోపనిషత్' అనే గ్రంథం తెలియపరుస్తోంది.

''వాగేశ్వరీ, వాగ్వాదినీ, మహాసరస్వతి, సిద్ధసరస్వతి, నీలసరస్వతి, ధారణ సరస్వతి, పరాసరస్వతి, బాలాసరస్వతి'' ఇలా అనేక నామాలు గల ఈ వాగ్దేవి 'సామాంపాతు సరస్వతి' అనే మకుటంతో ఉన్న శ్లోకాలతో పఠించడం వల్ల శారదాదేవి సంతోషించి అపార జ్ఞాన రాశిని ప్రసాదిస్తుందని పెద్దలుచెప్తారు.

అదిలాబాద్ జిల్లాలో గోదావరి తీరాన బాసర క్షేత్రంలో వెలసిన జ్ఞాన సరస్వతీని ఆరాధిస్తూ ఇక్కడే వేద వ్యాసుడు తపం ఆచరించాడట. అమ్మవారి సాక్షాత్కారం పొంది అమ్మ అనుగ్రహంతోనే వేద విభజన, మహాభారతాది పురాణాలను రచించాడని అంటారు. ఈ అమ్మ దగ్గర అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలకు అమ్మకరుణతో జ్ఞాన రాశులు అవుతారని పెద్దల నమ్మకం. ఈ రోజున సరస్వతీ దేవిని తెల్లని పూలతో పూజించాలి. అమ్మవారిని శ్వేత వస్త్రాలతో కాని, పసుపు పచ్చ వస్త్రాలతో కాని అలంకరించాలి. అమ్మ వారికి తెల్లని రంగులో ఉన్న క్షీరాన్నాన్ని, నేతి పిండివంటలను, చెరకును, అరటి పండ్లను, నారికేళాన్ని నివేదన చేస్తే మంచిఫలితాలు వస్తాయని అంటారు. కుల మత భేదాలు లేకుండా ప్రపంచమంతా సరస్వతీ దేవిని పూజిస్తున్నప్పటికీ మాఘ మాసంలో వచ్చే ఈ పంచమి తిథి ప్రత్యేకత సంతరించుకొంది. ఈ రోజున బాసర క్షేత్రాల వంటి సరస్వతీ ఆలయాల్లో విశేష పూజలు అర్చనలు జరుపుతారు.

పుష్య, మాఘ ద్వయంతో కూడిన ఆదివారం రోజున శ్రీపంచమి వస్తే, ఆరోజున సూర్యారాధన వల్ల కోటి గ్రహణ స్నానపుణ్య ఫలం లభిస్తుంది.

చరణ శ్రీ

మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరతావులకు

వృతాసురుడు

22

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 15

1	■	■	2	3	■	4
5	■	6	■	■	■	■
■	■	7	■	■	8	■
■	■	■	■	9	■	■
10	■	■	11	■	■	12
■	■	13	■	14	■	■
15	■	■	■	■	■	■

మాటాట

ఆధారాలు:
అడ్డం
2. శాంతిభద్రతలు నశించిన పరిస్థితి
5. రుధిరము
7. కత్తి
8. తువ్వాలు
10. మెడ
11. శత్రువు
14. హాలీడే
15. ముల్లు

నిలువు
1. పెళ్లిలో వధువుకు పుట్టింటి వారిచ్చే కానుక
3. చంద్రుడు, ప్రభువు
4. మన్మథుడు
6. మోము
9. పదకొండు అడ్డంతో మొదలయ్యే ఓ లీపి పదార్థం
10. బంతి
12. భర్త
13. వేడి

మాటాట - 14 సమాధానం

1మా	పు	2క	ము	■	■	3సం
త	■	ణా	■	4మ	రు	డు
5సం	ది	■	6పే	పు	■	డు
■	■	7క	■	పు	■	■
8మ	■	9మ	ళ్ల	■	10స్త్రీ	11స్త్రీ
12డు	కూ	లు	■	13ప్లే	■	కా
రు	■	■	14ను	డి	కా	రం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

హడలెత్తిస్తున్న 'ఆధార్'!

ఆధార్ పేరు చెబితేనే జనం హడలిపోతున్నారు. ప్రతి చిన్న అంశానికీ ఆధారే ఆధార మంటూ ప్రభుత్వం తేల్చి చెబుతుండడం, గ్యాస్ కూడా ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నట్లు కేంద్ర ఆయిల్ సంస్థలు ప్రకటించడంతో జనంలో అయోమయం నెలకొంది. దీనిపై వివరణ ఇచ్చేందుకు అధికారులు, ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలు కూడా ప్రజల ఆందోళనను తగ్గించలేకపోతున్నాయి. దీంతో ఆధార్ నంబరు పొందేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. ఇది దళారీల పాలిట వరంగా మారిపోయింది. ఆధార్ నంబర్ కోసం ప్రజలు ముందుకు రావాలని, రానున్న కాలంలో అంతా 'ఆధార'మేనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్ల క్రితం ఆధార్ నమోదు కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించారు. ప్రారంభంలో కోట్లాది మంది ఆధార్ నంబర్లకోసం దరఖాస్తు చేసుకోగా, మిగిలినవారు తరువాత చేసుకోవచ్చన్న అభిప్రాయంతో వెనుకంజ వేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన నగదు బదిలీ పథకానికి ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నట్లు ప్రకటించడం, ముందుగా స్కాలర్‌షిప్పులు, జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనాలకు ఆధార్ అనుసంధానంతో అమలు చేయాలని నిర్ణయించడం, తరువాత దశలో సబ్సిడీ గ్యాస్‌కు కూడా ఆధార్‌ను వర్తింపచేస్తామని చెప్పడంతో ప్రజల్లో ఆందోళన ఒక్కసారిగా ప్రారంభమైంది. కేవలం ఆధార్‌ను నమోదు చేసుకుంటే చాలదని, బ్యాంకు ఖాతాలు కూడా ఉండాలన్న మెలిక పెట్టడంతో విద్యార్థులు, పింఛనుదార్లలో ఆందోళన పెరిగిపోయింది. ఇక ఫిబ్రవరి 15 నుంచి ఆధార్ ఉన్న వారికే సబ్సిడీ గ్యాస్ అందుతుందని, లేనివారు ఒక్కో సిలిండర్‌కు పూర్తి ధర 1030 రూపాయలు చెల్లించాల్సిందేనని జాతీయ స్థాయిలో ఆయిల్ సంస్థలు స్పష్టం చేయడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ప్రవేశపెడుతున్నట్లు చెబుతున్నప్పటికీ ఆ రెండు జిల్లాల్లో కూడా ఆధార్ నమోదు కార్యక్రమం పూర్తికాకపోవడం, లక్షలాది మంది ఇంకా ఆధార్‌ను నమోదు చేసుకోకపోవడంతో సబ్సిడీ గ్యాస్ అనేక మందికి హుళక్కేనన్న ప్రచారం కూడా ఎక్కువైంది. అయితే ఫిబ్రవరి డెడ్‌లైన్ ఉండదని, కేంద్రానికి లేఖ రాసామని చెప్పుకొస్తున్న మంత్రులు, ముఖ్యమంత్రి ప్రకటనలు ప్రజలకు ఎక్కడం లేదు. కేంద్రం నుంచి ఇంకా తమ లేఖలకు సమాధానం రావాలని ఒకసారి, అసలు డెడ్‌లైనే లేదని ఇంకొకసారి వస్తున్న ప్రకటనలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేంద్రానికి లేఖ రాశామని ఒకసారి ముఖ్యమంత్రి చెప్పగా, మరోసారి ఆ అవసరం లేదని, నిర్ణయం తమ పరిధిలోనే ఉంటుందని చెప్పడం ప్రజల్ని అయోమయంలో పడేస్తోంది. దీంతో ఆధార్ నమోదు కోసం ఒక్కసారిగా ప్రజలు కేంద్రాలకు తరలివచ్చారు. ప్రతి నమోదు కేంద్రంలో వందల సంఖ్యలో ప్రజలు బారులు తీరడంతో తోపులాటలు, పైరవీలు ప్రారంభమయ్యాయి. వెయ్యి రూపాయలు చెల్లిస్తే క్యూ ముందు వరుసలో నిల్చునే అవకాశం, ఐదొందలిస్తే కొద్దిగా దగ్గర ఉండే అవకాశాలు కల్పించేందుకు దళారులు రంగ ప్రవేశం చేయడం, అక్కడి అధికారులు, ఉద్యోగులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆధార్ నమోదు అక్రమాలకు నిలయంగా మారిపోయింది. ఫిబ్రవరి డెడ్‌లైన్ కాదని ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో స్పష్టం చేసినా ప్రజల్లో ఆందోళనకు తెరపడలేదు. ఆధార్ కోసం అర్రులుచాచే వారి సంఖ్య ఎంతమాత్రం తగ్గడం లేదు.

డెడ్‌లైన్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రజలకు ఊరట కలిగించకపోవడానికి కారణం ఆయిల్ సంస్థల యాజమాన్యాలేనన్న ప్రచారం ఎక్కువవుతోంది. ప్రధానంగా ప్రభుత్వం నుంచి సూచనలు వెళ్తున్నప్పటికీ, రెండు దఫాలుగా ఆయిల్ సంస్థలను ఆహ్వానించి ప్రభుత్వం సమీక్షించినప్పటికీ ఇంకా ఆయిల్ సంస్థలు మాత్రం ఆధార్ ఉంటేనే సబ్సిడీపై గ్యాస్ అందిస్తామని చెబుతుండడం గమనార్హం. గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు వినియోగదారుల ఇళ్లకు వెళ్లిన సమయంలో కూడా ఇదే అంశాన్ని చెబుతుండడం వినియోగదారుల ఆందోళనకు కారణంగా కనిపిస్తోంది. అయిల్ సంస్థలను నియంత్రించడం, ఆధార్ కేంద్రాలను మరిన్నిటిని తెరచి ప్రజలకు వీలైనంత త్వరలో కార్డులు అందేలా చూడకపోయినట్లయితే రాబోయే రోజుల్లో కూడా ప్రజల్లో ఆందోళన తప్పదు.

ఆందోళన అక్కర్లేదు

సంక్షేమ కార్యక్రమాల అమల్లో 'ఆధార్' గురించి రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అర్హులకు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రతి ఒక్కరికి విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్) ఇవ్వాలన్న ఉద్దేశం వెనుక ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా వినియోగం కావాలన్న తపన ఉంది. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు అర్హులకు చేరడం లేదని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అనేక పర్యాయాలు పేర్కొన్న విషయం ఈ సందర్భంగా మనం గమనించాలి. కోట్లాది రూపాయలు సంక్షేమ కార్యక్రమాల కోసం విడుదల చేస్తున్నాం... ఈ నిధులు చాలావరకు దళారులకు చేరుతున్నాయని రాజీవ్‌గాంధీ బాధపడ్డారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ ప్రజల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు అసలైన లబ్దిదారులకు అందించేందుకు రాజీవ్‌గాంధీ చేసిన ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని నిర్ణయించాయి. ఈ కారణంగానే యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటి ఆఫ్ ఇండియా (యూఐడిఎఐ) ద్వారా భారతీయ పౌరులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం ప్రారంభమైంది. ఆధార్ సంఖ్యను ఆధారం చేసుకుని మొదటి దశలో జాతీయ ఉపాధి హామీ పథకం, సంక్షేమ పింఛన్ల పంపిణీ, విద్యార్థులకు ఫీజుల పంపిణీకి శ్రీకారం చుట్టాం. చౌకదుకాణాల ద్వారా ఇచ్చే నిత్యావసర సరకులకు దీన్ని తర్వాత వర్తింపచేస్తాం. నిత్యావసర సరకుల పంపిణీకి బయోమెట్రిక్ విధానాన్ని పది జిల్లాల్లో వెయ్యి దుకాణాల్లో పైలట్ ప్రాతిపదికన అమలు చేయబోతున్నాం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధార్ కార్డులు జారీచేసే విషయంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం జరిగింది. అన్ని జిల్లాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతోంది. వంటగ్యాస్ సబ్సిడీ కోసం ఆధార్ నెంబర్లను ఇవ్వడానికి 2013 ఫిబ్రవరి 15 చివరిరోజు అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ ప్రక్రియ పూర్తికాలేదు. అందువల్ల ఫిబ్రవరి 15 రోజును గ్యాస్ సబ్సిడీకి చివరిరోజుగా భావించాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం తరపున ప్రజలకు నేను పూర్తిగా హామీ ఇస్తున్నాను. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆధార్ వ్యక్తిగతమైన విశిష్ట సంఖ్య కావడం వల్ల అందరూ ఆధార్ నెంబర్ తీసుకోవాల్సిందే. కేవలం మన రాష్ట్రంలోనే కాదు.. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఆధార్ కార్డుల జారీ ప్రక్రియలో మన రాష్ట్రాన్ని ఆదర్శమైన రాష్ట్రంగా మారుద్దామని ప్రయత్నిస్తున్నాం. జూన్ వరకు ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని భావిస్తున్నాం. ఆగస్టు చివరి వరకు ఆధార్ నెంబర్లు ఇవ్వడం పూర్తి చేయాలని భావిస్తున్నాం. వాస్తవంగా ఆలోచిస్తే, మూడేళ్ల క్రితమే మన రాష్ట్రంలో ఆధార్ కార్డులు ఇవ్వడం ప్రారంభమైంది. ప్రజలు పెద్దగా ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించలేదు. ఇప్పుడు వంటగ్యాస్ సరఫరా, చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరకుల సరఫరా, పింఛన్ల జారీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వడం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితర పథకాలను ఆధార్‌తో ముడిపెట్టడంతో ప్రజల్లో సహజంగానే ఆందోళన చెలరేగింది. ఆధార్ నెంబర్ల ప్రకియ పూర్తయిన తర్వాతనే దీన్ని వేర్వేరు పథకాలకు వర్తింపచేస్తాం.

- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
పౌర సరఫరాల శాఖ మంత్రి.

పటిష్టంగా ఉండాలి

ప్రతి భారతీయుడికి ఆధార్ నెంబర్ (విశిష్ట గుర్తింపు సంఖ్య-యూనిక్ ఐడెంటిటీ నెంబర్) ఉండాల్సిన అవసరం ఉంది. ఆధార్ నెంబర్లను జారీ చేసే ప్రక్రియ లోపభూయిష్టంగా ఉంది. స్పష్టమైన ఒక విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. మనదేశంలో ప్రస్తుతం ఒక్కో అవసరానికి ఒక్కో కార్డు జారీ అవుతోంది. చౌకదుకాణం కోసం రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌గా మరో కార్డు, ఓటర్ గుర్తింపుకోసం ఇంకోకార్డు, చిరునామా కోసం మరోకార్డు.. ఇలా ఒక్కో పనికి ఒక్కో రకమైన కార్డులు ఉన్నాయి. వీటన్నింటిని క్రోడీకరించి బహుళ ప్రయోజనం (మల్టీపర్పస్) కోసం ఆధార్ కార్డును ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అమెరికాలో (యుఎస్ఏ) ప్రతి ఒక్కరికి 'సామాజిక భద్రత సంఖ్య' (సోషల్ సెక్యూరిటీ నెంబర్-ఎస్ఎస్ఎన్) ఉంటుంది. సోషల్ సెక్యూరిటీ చట్టం కింద అమెరికాలో ఇస్తున్న ఈ కార్డు తొమ్మిది నెంబర్లు కలిగి ఉంటుంది. అమెరికా పౌరులతో పాటు శాశ్వతంగా అమెరికాలో ఉండేవారికి, తాత్కాలిక ఉద్యోగం చేస్తున్న వారికి సోషల్ సెక్యూరిటీ నెంబర్‌ను ఇస్తున్నారు. అమెరికాలో ఇస్తున్న ఎస్ఎస్ఎన్ బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడుతోంది. అలాగే భారత్‌లో కూడా ఇదే విధానం అమలు చేస్తే బాగుంటుంది. హడావుడిగా ఆధార్ నెంబర్లను ఇచ్చే విధానం స్థానంలో పటిష్టమైన విధానంలో ఆధార్ కార్డులు జారీ ప్రక్రియ చేపడితే బాగుండేది. ఆధార్ నెంబర్‌కు చట్టబద్ధత ఉన్నా లేకపోయినా, బయోమెట్రిల్, ఐరిష్‌లను ఉపయోగించి ఒక వ్యక్తికి ఒకే నెంబర్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. అయితే ప్రభుత్వానికి ఈ అంశంలో విశాలదృక్పథం ఉండాలి. కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం కొన్ని పథకాలకు మాత్రమే దీన్ని ఉపయోగించేందుకు నిర్ణయిస్తే, పెద్దగా ప్రయోజనం చేకూరకపోవచ్చు. ఆధార్ నెంబర్ ఇచ్చే ముందు సదరు వ్యక్తికి సంబంధించిన సమస్త సమాచారం అందులో పొరదర్శకంగా పొందుపరిస్తే సత్ఫలితాలు వస్తాయనడంలో సందేహం లేదు.

ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. ఒక పర్యాయం ఒక వ్యక్తి తన వివరాలను ఎన్‌రోల్‌మెంట్ చేసుకుంటే ఆధార్ నెంబర్ వస్తుందన్న గ్యారంటీ లేదు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడిఎఐ) సమర్థతగా పనిచేయడం లేదనిపిస్తోంది. ఈ సంస్థ తొలుత విడుదల చేసిన బ్రోచర్‌ను పరిశీలిస్తే, విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా తీసుకోవాల్సి అవసరం ఏమీ లేదని పేర్కొన్నారు. దాంతో ప్రజలు ఆధార్‌ను తేలికగా తీసుకున్నారు. యూఐడిఎఐ ఉన్నతాధికారులకే ఈ అంశంపై సరైన అవగాహన లేదని స్పష్టమవుతోంది. విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు అనేక సంస్థలను (వివిధ శాఖలు, బ్యాంకులు, నిరుద్యోగులు, ప్రైవేట్ సంస్థలు) తదితరులను భాగస్వామ్యం చేస్తున్నారు. దాంతో ఈ వ్యవహారంలో జవాబుదారీతనం కనిపించడం లేదు. ఎన్‌రోల్ అయిన అందరికీ ఆధార్ నెంబర్ ఎందుకు రావడం లేదో ఈ సంస్థ స్పష్టమైన ఒక ప్రకటన జారీ చేస్తే బాగుండేది. సాంకేతిక కారణాలు అని తప్పించుకునేందుకు యూఐడిఎఐ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు అనేక సంక్షేమ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల కోసం ఆధార్‌ను ఆధారం చేసుకుంటోంది. యూఐడిఎఐ అధికారుల చర్యల వల్ల ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. జవాబుదారీతనం లేకపోవడం పెద్దలోటుగా చెప్పుకోవచ్చు. ఈ లోటును సరిదిద్దకపోతే ఇదో ప్రహసనంలా మారుతుందనడంలో సందేహం లేదు.

- వి. హనుమంతరావు
సీనియర్ న్యాయవాది.

ప్రభుత్వం రూల్సు పెడుతుంది.. మేము నోరుమూసుకుని పాటించాలా?

మనం ఉన్నది ప్రజాస్వామ్యంలోనా? రాచరిక యుగంలోనా అని ఎప్పటికపుడు అనిపిస్తుంది. ప్రభుత్వమే అధికారికంగా 80 శాతం మందికి మాత్రమే ఆధార్ కార్డుల నమోదు జరిగిందని, 70 శాతం మందికి ఇప్పటికే ఆధార్ నెంబర్‌ను అందించడం జరిగిందని 50 శాతం మందికి కార్డులు ఇప్పటికే చేరాయని చెబుతోంది. అంటే ఏమిటి? సగం మందికి కార్డులు అందలేదని, ఐరిష్ తీసుకోనివారు కనీసం 20 శాతం జనాభా ఉన్నారని, 30 శాతం జనాభాకు ఆధార్ నెంబర్ అందలేదనే కదా... అన్నీ తెలిసి రాత్రికి రాత్రి ఆధార్ నెంబర్‌ను బ్యాంకుకు ఇవ్వమని, ఆధార్ నెంబర్‌ను గ్యాస్ ఇవ్వమని అంటున్నారు, మరో రెండు రోజులు పోతే పోలీసు స్టేషన్‌కు కూడా ఇవ్వమని చెప్పేలా ఉన్నారు. ఆధార్ ఇంకా రాలేదంటే స్టేషన్‌కు తీసుకువెళ్లి కూర్చేబెట్టేలా ఉంది ప్రభుత్వ విధానం. కార్డులే ఇవ్వకుండా, కనీసం కార్డులు తీసుకుందామంటే అందుకు సౌకర్యాలు లేకుండా, సౌకర్యాలు కల్పించినా, అవి ఎక్కడ ఉన్నాయో మానవ మాత్రుడికి కూడా తెలియకుండా చేస్తున్న ప్రభుత్వాన్ని నిందించడం నా ఉద్దేశం కాదు, ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వం అనేది పాలకులు మరిచిపోతున్నారు. రూల్స్ ప్రభుత్వం నిర్ణయిస్తుంది, ప్రజలు నోరుమూసుకుని పాటించాల్సిందే అన్న చందంగా పాలకులు వ్యవహరించడం ఏం సబబు? ప్రజాపాలనను మరింత సున్నితంగా మార్చేందుకే రూల్స్ ఉండాలి తప్ప, ప్రజలను గందరగోళ పరచడానికి కాదు, మీకు చెప్పాల్సిన అవసరం లేదనేది రాచరిక పాలకుల భావన, కాని నేడు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం, ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ఈ పాలకులపై లేదా. సమాచార హక్కు అంటున్నారు. ఇదేనా సమాచార హక్కు అంటే... ఏదీ చెప్పకుండా ఎవరికీ చెప్పకుండా అన్నీ రహస్యంగా చేయడమేనా... ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలి... ప్రజాకంటక పాలన కాకుండా, ప్రజానుకూల పాలన అందించాలి.

-ఎన్. మాలతి, గృహిణి

అర్హత లేనివారికి అప్పగించారు

కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు ఆధార్‌ను సైతం అవినీతిమయంగా మార్చింది. ఆధార్‌ను ప్రారంభించేప్పుడే మేం హెచ్చరించాం. అసెంబ్లీలో జరిగిన చర్చలో అర్హత లేని వారికి ఆధార్ కార్డుల కాంట్రాక్టు అప్పగిస్తున్నారని చెప్పాం. ఇతర రాష్ట్రాల్లో కన్నా ఆధార్‌కు ఇక్కడ ఎక్కువ చెల్లిస్తున్నారు, అర్హత లేని ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని చెప్పాం, అయినా మా మాటలను పట్టించుకోకుండా ముడుపులు పుచ్చుకుని ఆధార్ కాంట్రాక్టులు ఇచ్చారు. ఇప్పుడు దాని పర్యవసానం ప్రజలు అనుభవించాల్సి వస్తోంది. ఆధార్ కార్డుల నమోదు సక్రమంగా సాగలేదు. కేవలం 70 శాతం మంది మాత్రమే ఆధార్ నమోదు చేయించుకున్నారు. నమోదు చేయించుకున్న వారిలో 50 శాతం మందికి మాత్రమే కార్డులు అందాయి. అధికారులను అడిగితే మేం పోస్టాఫీసులకు పంపించేశామని చెబుతున్నారు. ప్రజలకేమో రాలేదు. అన్నింటికీ ఇప్పుడు ఆధార్ ఉండాల్సిందే అనే నిబంధన విధించారు. గ్యాస్‌కు ఆధార్‌ను లింక్ చేయడం వల్ల ఒక్కసారిగా ఆధార్ కార్డు కేంద్రాలపై జనం ఒత్తిడి పెరిగింది. రోజుకు ఐదు వందల మంది కన్నా ఎక్కువ మంది వివరాలను వారు నమోదు చేసుకోలేని పరిస్థితి. మరోవైపు ప్రజలేమో వేలాది మంది ఆధార్ నమోదు కేంద్రాలకు వస్తున్నారు. తొక్కిసలాట, చివరకు లాఠీచార్జ్ వరకు పరిస్థితి వెళ్లింది. దీన్ని ఆసరాగా తీసుకుని దళారీలు ఐదు వందల రూపాయల నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తూ ఆధార్ కార్డులు ఇస్తున్నారు. ఉచితంగా నమోదు చేసుకోవలసిన దానికి ఐదు వందల నుంచి వెయ్యి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు పెన్షన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాలన్నింటికి ఆధార్‌ను అనుసంధానం చేస్తామని అంటున్నారు. ప్రజలందరికీ సక్రమంగా ఆధార్ కార్డులు ఇచ్చిన తరువాత ఈ నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది కానీ ముడుపులకు ఆశపడి ఆధార్‌ను అస్తవ్యస్థంగా మార్చి ప్రజలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఆధార్ అవకతవకలపై ఫిర్యాదులకు స్పందన లేదు, అధికారుల నుంచి వివరణ లేదు. పోలీస్ స్టేషన్లో ఎరువులు, విత్తనాలు అమ్మించారు, చివరకు ఆధార్ పరిస్థితిని ఇలా చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నింటిలోనూ అవినీతే ఆధార్‌ను సైతం వదిలిపెట్టలేదు. రాష్ట్ర జనాభాకు, ఆధార్ కార్డులకు, రేషన్ కార్డుల సంఖ్యకు ఒకదానికొకటి సంబంధం లేకుండా ఉంది. కాంగ్రెస్ అవినీతి, అసమర్థ పాలనకు ఆధార్ అద్దం పడుతోంది. ఆధార్ అక్రమాలను నివారించాలి, అర్హత గల సంస్థలకే ఆధార్ బాధ్యత అప్పగించాలి. ప్రతి ఒక్క కుటుంబానికి ఆధార్ కార్డులు జారీ అయిన తరువాతనే గ్యాస్ వంటి పథకాలను అనుసంధానం చేయడంపై నిర్ణయం తీసుకోవాలి. ఆధార్ కార్డులు అందరికీ పంపిణీ చేయకుండా వివిధ పథకాలను ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల ప్రజలు నష్టపోతారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనం వారికి అందకుండా పోతుంది. దీన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి.

- గాలి ముద్దు కృష్ణమనాయుడు
టిడిపి శాసన సభాపక్షం ఉప నాయకుడు

అందరికీ కార్డులిచ్చాక..

ఆధార్ నెంబర్ ఇవ్వడానికి అభ్యంతరం ఏముంటుంది.. ఎటొచ్చి కార్డు లేకనే నానా అగచాట్లు పడుతున్నాం, ఆధార్ కేంద్రాలు ఎక్కడ తెరిచారో ఎవరికీ తెలియదు, సహజంగా పోస్టాఫీసులు వంటిచోట వాటిని ఏర్పాటు చేసి ఉంటే తేలికగా గుర్తించి ప్రతి ఒక్కరూ వెళ్లి వాటిని తీసుకోవానికి ఇబ్బంది పడరు. ఏళ్ల తరబడి ఐరిష్ తీసుకున్నా, ఆధార్ కార్డులు రావడం లేదు, అంటే అవి వస్తాయో, రావో కూడా తేలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో వలస తక్కువగా ఉంటుంది. ఏళ్ల తరబడి చిరునామాలు, మనుషులూ మారరు, కాని పట్టణవాసుల కష్టాలే వేరు, రెండేళ్లు గడచినా వెంటనే ఇళ్లు ఖాళీ చేయమంటారు, అసలు ఇల్లు దొరకడమే కష్టం, దొరికినా దానికో చిరునామా ఉండదు, చిరునామా ఉన్నా ఆధార్ కార్డు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. లక్షలాది మందికి హైదరాబాద్ వంటి నగరంలో ఆధార్ లేదు, ప్రతి పౌరుడికీ ఆధార్ నెంబర్‌ను జారీ చేసిన తర్వాత ఎలాంటి నిబంధనలు అమలు చేసినా, దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు, ఆధార్ తీసుకోవాలంటే కూడా అంత తేలికైన విషయం కాదు, స్థానిక చిరునామా ధృవపత్రం ఉండాలంటున్నారు. స్థానిక నివాస ధృవపత్రం ఎవరు ఇవ్వాలి, ఇటీవల పోస్టాఫీసుల్లో జారీ చేసిన ధృవపత్రాలను కూడా అంగీకరించడం లేదు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే లక్షలాది మందికి ఆయా సంస్థలు ఇచ్చే కార్డులను కూడా ఆమోదించడం లేదు. రేషన్ కార్డులు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో ఎంత మందికి రేషన్ కార్డులు ఇచ్చారు. రేషన్ కార్డు సంపాదించడం అంటే ఉద్యోగం సంపాదించడంలా ఉంది. పోనీ పాస్‌పోర్టు తీసుకుందామనుకుంటే దానికీ ఇప్పుడు గిరాకీ పెరిగిపోయింది. ఏళ్ల తరబడి పాస్‌పోర్టు కూడా రావడం లేదు. ఇన్ని సమస్యల మధ్య ఆధార్‌కు ఐరిష్ ఇవ్వడమే కష్టంగా ఉంది. తీరా ఇచ్చాక కార్డు రావడం మరింత దారుణంగా ఉంది. ఇప్పటికైనా సౌకర్యంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తే సగం ఆందోళన తగ్గుతుందని భావిస్తున్నా.

-శ్రీనివాసరావు, ప్రైవేటు ఉద్యోగి

అకౌంట్లతో అనుసంధానం

రాష్ట్రంలో ఉన్న అన్ని కుటుంబాల పేర్లతో అకౌంట్లు ప్రారంభించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ నెంబర్లను, బ్యాంకు అకౌంట్లతో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్టు తరహాలో తొలుత ఐదు జిల్లాల్లో (తూర్పు గోదావరి, అనంతపురం, చిత్తూరు, రంగారెడ్డి, హైదరాబాద్) దీన్ని అమలు చేస్తున్నాం. ఈ జిల్లాల్లో ఇప్పటికే రెండుకోట్ల కస్టమర్ల పేర్లతో సేవింగ్స్ బ్యాంక్, ఫైనాన్స్ ఇంక్లూజన్ పూర్తయింది. అయితే ఈ నెంబర్లతో ఆధార్ నెంబర్ల అనుసంధానం ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ జిల్లాల్లో నగదు బదిలీ పథకం అమలు ప్రారంభమైంది. ఈ పథకం విజయవంతం అయితే ఇతర జిల్లాలకు కూడా దీన్ని వర్తింపచేస్తాం. ఈ అంశంలో గ్రామీణ బ్యాంకులతో పాటు, వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు కూడా సంయుక్తంగా కలిసి పనిచేస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో అన్ని కుటుంబాల పేర్లతో బ్యాంకు అకౌంట్లు ప్రారంభించడం మొదలుపెట్టాం. బ్యాంకర్లందరం కలిసి వేగంగా పనిచేస్తున్నాం. అవసరమైనచోట్ల కొత్త బ్యాంకు శాఖలు ప్రారంభం అవుతున్నాయి. అయితే సిబ్బంది కొరత కొన్ని ఇక్కట్లను తెచ్చిపెడుతోంది. బ్యాంకు శాఖలు ప్రారంభించేందుకు వీలులేని కుగ్రామాల్లో బిజినెస్ కరస్పాండెంట్లను ఏర్పాటు చేస్తున్నాం. వీరిద్వారా నగదు పంపిణీ, నగదు వసూలు చేసేందుకు ఏర్పాట్లు జరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగులు, రైతులు, కూలీలు, వృత్తిపనివారు తదితరుల పేర్లతో బ్యాంకుల్లో అకౌంట్లు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే బ్యాంకు అకౌంట్లు ఉన్నవారికి వారి అకౌంట్ నెంబర్లతో ఆధార్ నెంబర్లను అనుసంధానం చేయడం కొనసాగుతోంది. బ్యాంక్ అకౌంట్లు కొత్తగా ప్రారంభించేవారికి వారి ఆధార్ నెంబర్లను పరిగణనలోకి తీసుకుని అకౌంట్లు ప్రారంభించాలని ఆదేశాలు అందాయి. వీటిని అమలు చేస్తున్నాం. ఆధార్ పేమెంట్ బ్రిడ్జి (ఎపిబి)కి సిద్ధమవుతున్నాం. బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ నెంబర్లు, ఎన్‌సిపిఎల్‌ను అనుసంధానం చేస్తూ, ఆధార్ ఆధారిత నగదు బదిలీ పథకం (ఆధార్ ఎనేబుల్ పేమెంట్) విధానాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. తీవ్ర వాద ప్రాబల్యం ఉన్న 16 జిల్లాల్లో ప్రజల పేర్లతో బ్యాంకు అకౌంట్లు ప్రారంభించేందుకు ఒక స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకోవడం జరుగుతోంది. వీరి అకౌంట్లకు కూడా ఆధార్ నెంబర్లను అనుసంధానం చేసేందుకు ఏర్పాట్లు జరిగాయి.

మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం గ్రామాల్లో మహిళా స్వయం సహాయ గ్రూపులు (ఎస్‌హెచ్‌జి) ఏర్పాటయ్యాయి. గ్రామాల్లోని మహిళలంతా స్వయం సహాయక మహిళా గ్రూపుల్లో చేరేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి మహిళా గ్రూపుకు రుణాలు ఇవ్వాలన్న ఉద్దేశంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎస్‌హెచ్‌జిలలో చేరని మహిళల కోసం 2012-13 నుండి 2014-15 వరకు దాదాపు 45 వేల స్వయంసహాయ గ్రూపులను ప్రారంభించాలని ప్రతిపాదనలున్నాయి. వివిధ పథకాలకు 'ఆధార్'ను ఏ విధంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తే, అందుకు అనుగుణంగా పనిచేసేందుకు మేము (బ్యాంకులు) సిద్ధంగా ఉన్నాం.

ఎస్. వెంకటేశ్వరరెడ్డి,
ప్రధాన కార్యదర్శి, గ్రామీణ బ్యాంకుల అధికారుల జాతీయ సమాఖ్య.

చట్టబద్ధత లేదు

ఆధార్ కార్డుకు ఎలాంటి చట్టబద్ధత లేదు. ఇది కేవలం పేరు, చిరునామా ధృవీకరణ మాత్రమే. ఇది పౌరసత్వానికి గుర్తింపు పత్రం కాదు. భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర సేవలను పొందేందుకు ఈ కార్డు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం అంటోంది. అలాంటి సేవలను పొందేందుకు ఇంతకుముందు ఎలాగు రేషన్‌కార్డులు ఉన్నాయి. అలాంటప్పుడు మళ్లీ ఆ

‘కూచిపూడి’కి తళుకులద్దిన బాలు

అసంఖ్యాకంగా గుంటూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రేక్షక జనావళి ఎదుట తన 55 మంది శిష్యబృందంతో వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికపై 3గంటల పాటు నవరసభరిత నాట్యవిన్యాసంతో నటరాజుకు నృత్యాభిషేకం చేసి అబ్బురపర్చారు గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ నాట్య కళాకారుడు, నాట్య విశారద ఎన్ బాలు. ఇటీవలి కాలంలో గుంటూరు నగరంతో పాటు రాష్ట్రంలోని ప్రసిద్ధ పట్టణాలు, న్యూఢిల్లీ, బెంగళూరు, చెన్నైలలో వ్యక్తిగతంగా, తన శిష్యబృందంతోనూ లెక్కకుమిక్కిలిగా నాట్యప్రదర్శనలు ఇవ్వడమేకాక పలు నృత్య రూపకాలను ప్రదర్శిస్తూ కూచిపూడి సంప్రదాయ నాట్యకళ ప్రచారానికి శక్తివంచన లేకుండా పాటుపడుతున్నారు నాట్యాచార్య బాలు. తన తండ్రి, అప్పటి ప్రముఖ నాట్యాచార్య ఎన్ కనకాచారి నాలుగు దశాబ్దాల క్రితం స్థాపించిన ‘నృత్య కళాభారతి’ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన బాలు కేవలం కూచిపూడి సంప్రదాయ నృత్యాంశాలే కాకుండా జనసామాన్యాన్ని జాగృతపర్చే జానపద నృత్యాల్లో తన శిష్యులను చూడచక్కనైన కళాకారులుగా తీర్చిదిద్ది జాతీయస్థాయిలో అవార్డులు పొందేలా చేశారు. బి.ఎ, బి.ఇడి పట్టభద్రుడైన బాలు ఎన్నో నృత్య రూపకాలకు నృత్యదర్శకత్వం వహించి శెహభాష్ అనిపించుకున్నారు. సినీ నృత్య దర్శకుల చేత ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ప్రశంసలందుకున్న ఆయన 26 సంవత్సరాలుగా నాట్యకళోపాసన చేస్తున్నారు. 5 ఏసంతాల ప్రాయంలోనే తొలిగురువైన తండ్రి కనకాచారి వద్ద అంకితభావంతో నిరంతర సాధన చేసి అనంతరం నాట్యాచార్యులు చింతా ఆదినారాయణ శర్మ, కాజా వెంకట సుబ్రహ్మణ్యం వద్ద ఈ రంగంలో ఎన్నో మెళకువలు తెలుసుకుని గురువుల గౌరవాన్ని నృత్యకళావేదికలపై ఇనుమడింపజేస్తున్నారు. ఇటీవల ‘తానా’ నిర్వహించిన అంతర్జాతీయ నాట్య పోటీల్లో బాలు శిష్యురాలు వై దీప్తి ఉత్తమ కళాకారిణిగా అవార్డునందుకుని విద్యనేర్పిన తన గురువుకే కాకుండా గుంటూరు నగరానికి ఖ్యాతిని తెచ్చిపెట్టారు. మోహినీ భస్మాసుర, శివతాండవం, భక్తరామదాసు తదితర నృత్య నాటికల్లో ప్రధాన పాత్రలు పోషించడమే కాకుండా జాతీయ సమైక్యత, సమగ్రతలను చాటిచెప్పాలనే ఆశయంతో భారతీయ నృత్యామృతంలో విలక్షణమైన పాత్రను పోషించి అందరి మెప్పు పొందారు. ఇన్నాళ్లు, ఇన్నేళ్లుగా నిరంతర నాట్యసాధన చేస్తూ కూచిపూడి నృత్యరీతుల ప్రచారం కోసం నిర్విరామంగా శ్రమిస్తున్న బాలు గుంటూరు నగరంలోని అనేక విద్యాసంస్థల్లో డ్యాన్స్ మాస్టర్‌గా సేవలు అందిస్తున్నారు. వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులను నాట్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. సోమవారం ‘కళతో తన అనుభవాలను పంచుకుంటూ.. ఏ రంగంలో, మరే వృత్తిలో లేని ఆనందం, తృప్తి నాట్యరంగంలో లభిస్తుందని బాలు సంతోషం వ్యక్తం చేశారు. మనదేశానికి వెలకట్టలేని కీర్తిప్రతిష్టలను తెచ్చిపెట్టిన కూచిపూడి నృత్య రీతుల ప్రచారం కోసం తన జీవితాన్ని అంకితం చేసి నట్టు పునరుద్ఘాటించారు. ప్రచారం కోసం కాకుండా నటరాజమూర్తికి నిత్య నృత్య నీరాజనాలర్పించడమే ఏకైక ధ్యేయంగా తమ నృత్య కళాభారతి పక్షాన అనేక నృత్య రూపకాలను రూపొందిస్తున్నామని ఆయన వివరించారు.

శివాష్టకాన్ని నయానందకరంగా అభినయిస్తున్న బాలు బృందం

- పివి గౌరీశంకర్, గుంటూరు.

మయూర కళాపరిషత్ నాటికల పోటీలు

సందేశాత్మకాలు

సిఎస్ రావును సత్కరిస్తున్న దృశ్యం

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం పట్టణంలో గత 9 సంవత్సరాలుగా రసజ్ఞ ప్రేక్షకులను అలరింపచేస్తోన్న మయూర కళాపరిషత్ దశమ వార్షికోత్సవం సందర్భంగా 10వ రాష్ట్ర స్థాయి నాటిక పోటీల సందర్భంగా సుప్రసిద్ధ రంగస్థల, చలనచిత్ర రచయిత సిఎస్ రావును పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వాణిజ్య ప్రముఖులు నందుల రాజు సౌజన్యంతో తొలిరోజు ఘనంగా సత్కరించారు.స్వర్గీయ శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దేశ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఆర్కిటెక్ట్ బుద్ధవరపు సతీష్ నిర్మించిన శ్రీబుద్ధవరపు మహాదేవుడు కళావేదికపై ఈ ప్రదర్శనలను నిర్వహించారు. తొలిరోజు శుభారంభ సభ తదనంతరం పశ్చిమగోదావరి జిల్లా తోలేరు, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర నాటక కళాపరిషత్ బృంద సభ్యులు మామిడిపల్లి సత్యన్నారాయణ రచించిన, వివిఎన్‌మూర్తి దర్శకత్వం వహించిన ‘యమపురిలో ఒక రోజు’ నాటిక ప్రదర్శన జరిగింది. తదనంతరం కాకినాడ ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ బృంద సభ్యులు భారతుల రామకృష్ణ రచన, బి కమలాకర్ దర్శకత్వంలో ‘ఇల్లే స్వర్గం’ నాటికను ప్రదర్శించారు. రెండో రోజు కళావర్షిణి హైదరాబాద్ వారు కాటా సుబ్బారావు రచన, జెట్టి హరిబాబు దర్శకత్వంలో ‘మనిషి మంచోడే’ నాటికను ప్రదర్శించారు. అనంతరం శ్రీలక్ష్మి నృసింహ కళామండలి హైదరాబాద్ నటీ నట బృందం గోవిందరాజుల నాగేశ్వరరావు రచన, దర్శకత్వంలో ‘అదే నేనైతే’ నాటికను ప్రదర్శించారు. న్యూస్టార్స్ మోడరన్ థియేటర్ విజయవాడ బృంద సభ్యులు స్వర్గీయ రాచకొండ విశ్వనాథ శాస్త్రి మూలకథ, ఎమ్ చౌదరి నాటకీకరణ, దర్శకత్వంలో ‘పిపీలికం’ నాటిక ప్రదర్శన జరిగింది. గంగోత్రి పెదకాకాని నటీనట బృందం విద్యాధర్ మునిపల్లె రచన, నాయుడు గోపి దర్శకత్వంలో ‘గమనం’ నాటికను ప్రదర్శించారు. ప్రదర్శిత నాటికలలో పాత్రధారులు తమ తమ పాత్రలలో రాణించారు. న్యాయనిర్ణేతగా సుప్రసిద్ధ కవి, విమర్శకులు, సినీ గేయరచయిత అదృష్టదీపక్ వ్యవహరించారు.

మయూర కళాపరిషత్ 10వ రాష్ట్ర స్థాయి నాటిక పోటీల అనంతరం అక్కిరాజు శ్రీనివాస్ బృందం భక్తి సంగీత విభావరిని అందించి, ఆహూత ప్రేక్షకులను సమ్మోహపరిచింది. ప్రత్యేకించి శివునిపై భక్తి గీతాలు ఆలపిస్తున్న సమయంలో మరిన్ని పాటలు పాడాలని ప్రేక్షకుల నుండి విజ్ఞప్తులందాయి. శ్రీషిరిడీసాయిబాబా కీర్తనలు, కనకదుర్గమ్మ అమ్మవారి కీర్తనలు, శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తిగీతాలు, శ్రీరామ, శ్రీకృష్ణులపై ఆలపించిన గీతాలు రసరమ్యంగా, భక్తిభావాన్ని ప్రోదిచేసే రీతిలో సాగాయి. బృంద సభ్యులు అందించిన వాద్య సహకారం, శ్రీనివాస్ గాత్రానికి వన్నె తెచ్చాయి.

ఉత్తమ ప్రదర్శనగా గంగోత్రి పెదకాకాని వారి ‘గమనం’

మయూర కళాపరిషత్ యాజమాన్యాన మూడు రోజుల పాటు నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి నాటికల పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా గంగోత్రి పెదకాకాని వారి ‘గమనం’ నాటిక ఎంపికయ్యింది. ఆదివారం రాత్రి శ్రీబుద్ధవరపు మహాదేవుడు కళావేదికపై ముగింపు సభతో పాటు బహుమతీ ప్రధానోత్సవ సభ జరిగింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఆపు-దూడ బ్రాండ్ బియ్యంతో రాష్ట్రంలోనే అత్యుత్తమ రైస్‌మిల్లర్‌గా ఎంపికైన, కాకినాడ శ్రీఅల్లూరి సీతారామరాజు కళావేదిక అధ్యక్షులు సత్తి కృష్ణా రెడ్డి ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కమీషనర్ ఎమ్ జీవరత్నం, రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కెవివి సత్యన్నారాయణ, చిలుకూరి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిలుకూరి వీరవెంకట సత్యన్నారాయణ, మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి రావు, జిఆర్‌సి మోడరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బులుసు శివశంకర శాస్త్రి, శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ ట్రస్ట్ సభ్యులు, అడ్వకేట్ గాలింకి చిట్టిబాబుతో పాటు పరిషత్ న్యాయనిర్ణేత అదృష్టదీపక్ ఈ సభలో పాల్గొన్నారు. రామచంద్రపురం పట్టణంలో నిర్వహించే ఈ పరిషత్ నిర్వహణకు తాను పూర్తి స్థాయి సహాయ సహకారాలందిస్తానని, పరిషత్ నిర్వహణ చేస్తున్న అప్పలాచార్యర్‌కు తాను తోడు ఉంటానని సభికుల హర్షధ్వానాల మధ్య పారిశ్రామికవేత్త సత్తి కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. పలువురు వక్తలు ప్రసంగించిన అనంతరం బహుమతీ ప్రదానం జరిగింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా న్యూస్టార్స్ మోడరన్ థియేటర్స్ విజయవాడ వారి ‘పిపీలికం’, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి ‘మనిషి మంచోడే’ నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ నటవర్గంగా ‘గమనం’ నాటిక నుండి విశ్వం, విజయ పాత్రధారులు నాయుడు గోపి, టి లక్ష్మి ఎంపికయ్యారు. ‘మనిషి మంచోడే’ నాటికలో నారాయణ పాత్రధారి కొల్లా రాధాకృష్ణ ఎంపికయ్యారు. ‘అదే నేనైతే’ నాటికలో సావిత్రి పాత్రధారిణి ఎస్ జ్యోతి, ‘ఇల్లే స్వర్గం’ నాటికలో ప్రదీప్ పాత్రధారి ఎమ్ సాయికృష్ణలు ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు. కన్సొలేషన్ బహుమతులను ‘గమనం’ నాటిక నుండి గుమ్మడి నాగేశ్వరరావు, ‘పిపీలికం’ నాటిక నుండి కె కుమార్ రాజా, పి మోహనేశ్వరరావు, వి పెద్దిరాజు, కె నాగరాజు, కె అశోక్ కుమార్, ‘మనిషి మంచోడే’ నాటిక నుండి జిఎస్ చలపతి, ‘ఇల్లే స్వర్గం’ నాటిక నుండి ఎన్ శివప్రసాద్, కె సతీష్, ‘యమపురిలో ఒక రోజు’ నాటిక నుండి పి గంగాధర రావు అందుకున్నారు. ఉత్తమ రంగాలంకరణ ‘ఇల్లే స్వర్గం’, ఉత్తమ సంగీతానికి ‘పిపీలికం’, ఉత్తమ ఆహార్యానికి ‘యమపురిలో ఒక రోజు’ ఎంపికయ్యాయి. ఉత్తమ రచనగా ‘గమనం’ నాటిక రచయిత విద్యాధర్ మునిపల్లె, ఉత్తమ దర్శకత్వానికి ‘పిపీలికం’ దర్శకులు ఎమ్ఎస్ చౌదరి ఎంపికయ్యారు. కళాపరిషత్ న్యాయ నిర్ణేత, కవి, విమర్శకులు, సినీగేయరచయిత అదృష్టదీపక్ తన తీర్పును పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి శృంగారం వేంకట అప్పలాచార్యర్ ద్వారా సభకు తెలియపరిచారు.

- శృంగారం వేంకట అప్పలాచార్యర్

సంస్కృత హరికథకు ఆద్యురాలు

దేవతల అనుగ్రహం పొందడానికి చెప్పబడిన కళను గానంగా చెప్పేవారు. శ్రీహరి కథను గానం చెయ్యడంవల్ల ఈ కళకు ‘హరికథ’ అని వాడుకలోకి వచ్చింది. గానంలోను నృత్యంలోను నాటకీయంగా చెప్పడమే హరికథ మధ్యమధ్యలో హాస్యపు సన్నివేశాలతో పిట్టకథలతో చమత్కారంగా చెప్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని అందించడం హరికథ చెప్పే భాగవతార్ల సమయస్ఫూర్తి. ఎడమ చేతిలో చరతలు పట్టుకొని లయబద్ధంగా నృత్యం చేస్తూ ఆంగిక, వాచికాభినయంతో చెప్పడం చాలా కష్టతరమైన ప్రక్రియ. ఈ కళకు పితామహుడు శ్రీ ఆదిభట్ల నారాయణదాసు. 17వ శతాబ్దంలో మహారాష్ట్రలో పరమభక్తుడైన భక్తతుకారం హరికథలు చెప్తూ కాలక్షేపం చేసేవారని చరిత్ర చెపుతోంది. ఈ కళను మహారాష్ట్రలో ‘అభంగము’ అని తమిళనాడులో ‘కాలక్షేపం’ అని ఆంధ్ర దేశంలో ‘హరికథ’ అని వాడుకలోకి వచ్చింది. ఈ కళకు తెలుగు నేలపై జీవం పోసి బహుళ ప్రచారంలోకి తెచ్చిన శ్రీ నారాయణ దాసును హరికథా పితామహుడిగా గుర్తించారు.

ఆయన శిష్యుల వంశ పరంపరలోని కళాకారిణి శ్రీమతి ఉమామహేశ్వరి. ఇప్పటివరకు సుమారు 1400పైగా ప్రదర్శనలు ఇచ్చిన ఈమె దేశం నలుమూలలా పర్యటించి ఎన్నో సత్కారాలు, అవార్డులు, బిరుదులు అందుకున్నారు. ఒక్కసారి ఈమె బాల్య జీవితాన్ని తిరగదోడితే 1960 సంవత్సరంలో కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో శ్రీ లాలాజిరావు, సరోజిని దంపతులకు జన్మించారు. ఈమె తండ్రి శ్రీ లాలాజిరావు వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం ఆస్థాన నాదస్వర విద్వాంసులు. చిరుప్రాయంలోనే తండ్రి దగ్గర కర్ణాటక గాత్ర సంగీతంలో శిక్షణ తీసుకున్నారు. 1975లో కపిలేశ్వర పురంలోని శ్రీ శర్వారాయ హరికథ పాఠశాలలో చేరి శిక్షణతోపాటు సాధన చేశారు. అచిరకాలంలోనే హరికథ కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనేక ప్రదర్శనలు ఇచ్చారు. డాక్టర్ నటరాజ రామకృష్ణ శిష్యబృందంలో చేరి ఆంధ్ర నాట్యాన్ని నేర్చుకున్నారు. తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, తాను నేర్చుకున్న కళలో నైపుణ్యం పొందాలని ఆశించాడు. ఆ తరుణంలో సంస్కృతం నేర్చుకున్నాడు. పురాణ గాథలలోని శ్లోకాలను సాధన చేశారు. సంస్కృత భాషలో హరికథను గాత్ర సంగీతాలను మేళవించి ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుని సంస్కృత భాషలో ప్రథమ హరికథ కళాకారిణిగా పేరు తెచ్చుకున్నారు. 1985లో మధ్యప్రదేశ్ ఉజ్జయినీలోని కాళిదాసు అకాడమి ఆధ్వర్యంలో సంస్కృత భాషలో ఈమె ప్రదర్శన ప్రేక్షకుల నీరాజనం పలికారు. ఆ తరువాత శ్రీశైలం, వేములవాడ, అన్నవరం, భద్రాచలం, తిరుమల, తిరుపతి దేవస్థానాలలో ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో సత్కారాలు పొందారు.

‘హరికథ గాన ప్రవీణ’, ‘అభినవ మాతంగి’, ‘చిత్రకథ సరస్వతి’ అనే బిరుదులు అందుకున్నారు. 1986 నుంచి నాలుగు సంవత్సరాల పాటు మద్రాస్ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో హరికథలో నాటకీయంగా శిక్షణ ఇచ్చారు. 1987లో ఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చి అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ ద్వారా సత్కారం అందుకున్నారు. 1989లో బద్రినాథ్‌లో 1200వ శంకర జయంతి సందర్భంగా ఆదిశంకరాచార్యపై ప్రయోగాత్మకంగా హరికథలో ప్రదర్శన ఇచ్చి అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రశంసలు అందుకున్నారు. న్యూయార్క్‌లో తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చి ‘హరికథా కళావాహిణి’ బిరుదు అందుకున్నారు. సంస్కృతంలో మొదటి హరికథ కళాకారిణిగా 1997లో ‘లింకా బుక్ ఆఫ్ గిన్నెస్ రికార్డ్స్’ పేరు నమోదు చేసుకోగలిగారు. మలేషియాలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు 1993, 1996, 1999లలో అమెరికాలో జరిగిన వేద మహాసభలలో, 1996లో కెనడా, సింగపూర్, ఇండోనేషియా దేశాలలో ప్రదర్శన ఇచ్చారు. ఇంతటి అనుభవం, ప్రావీణ్యత వున్న ఈమె రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుకు అర్హురాలే అని కొంతమంది వక్తలు వ్యాఖ్యానించారు.

శ్రీమతి ఉమామహేశ్వరి తన బాల్య జీవితంలోని అనుభవాలను గుర్తుచేస్తూ ‘కోట సచ్చిదానంద శాస్త్రిగారు ప్రవచనం చేసిన మహాభారతం హరికథ నాలో స్ఫూర్తిని ఇచ్చింది’ అని అన్నారు. ఇప్పటివరకు సంస్కృతంలో 600కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. గతంలో అప్పటి రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ శంకర దయాళ్ శర్మ చేతులు మీదుగా సన్మానాలు అందుకున్నారు.

హరికథ పితామహుడు శ్రీ ఆదిభట్ల నారాయణదాసు మునిమనవరాలు ఉన్నత చదువుల చదివి ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీమతి అఖిల ఈమె దగ్గర గత రెండు సంవత్సరాలుగా హరికథలో శిక్షణ తీసుకుంటూ ఏ మాత్రం బిడియం లేకుండా హరికథలో ప్రదర్శన ఇస్తున్నది అంటే ఆ కళ పట్ల ఆమెకు వున్న గౌరవమే. గత సంవత్సరం ఏప్రిల్‌లో కృష్ణగానసభ ఆధ్వర్యంలో జరిగిన హరికథ సప్తాహంలో ఈమె ప్రదర్శనసాటిలేనిదిగా నిలిచింది. ప్రభుత్వం ప్రోత్సహించి సహకరిస్తే ఈ హరికథ కళలో ఒక పాఠశాల ఏర్పాటుచేసి ఉచితంగా శిక్షణ ఇస్తానని ఉమామహేశ్వరి తెలిపారు.

-కశ్యప



రెప్పపాటులో మారే భారీ సెట్టింగులు..

అదే ‘సురభి’వారి ‘కనికట్టు’

ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నగరానికి చెందిన రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నాలుగు రోజుల పాటు జరిగిన సురభి నాటకోత్సవాలు అతి వైభవంగా ముగిశాయి. ‘మాయాబజార్’ను రంగస్థల ప్రియులు ఊహించని విధంగా కొత్త కొత్త హంగులు, సినీ సెట్టింగులకు తీసిపోని విధంగా సురభి శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి కళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. కనురెప్పపాటులో మారే భారీ సెట్టింగులు, అద్భుతమైన ఎఫెక్ట్స్‌తో మాయాబజార్ నాటకాన్ని ఆశ్చర్యం గొలిపే రీతిలో కనువిందుగా ప్రదర్శించి, ఆహూతులను మైమరింపజేశారు. అతిథులు శ్రీనివాసరావు, జ్యోత్స్న, అబ్రహం జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాదంగీర్ సాయి, ఆయన సతీమణి హైమవతి, సుబ్బారావు, విక్రంగౌడ్, పత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు. సురభి వేంకటేశ్వర నాట్య మండలి నిర్వాహకుడు పద్మశ్రీ ఆర్.నాగేశ్వరరావు (బాబ్జీ) పర్యవేక్షణలో ఎ.మనోహర్ దర్శకత్వంలో మల్లాది వెంకట కృష్ణ శర్మ రచించిన మాయాబజార్ నాటక ప్రదర్శన జరిగింది. శశిరేఖా పరిణయం నేపథ్యంగా సాగే ఈ కథ ఆద్యంతం ఆహ్లాదంగా సాగింది.

నారదుడు బలరాముని సతీమణి రేవతీదేవి వద్దకు వెళ్ళి శశిరేఖను అభిమన్యునకు ఇచ్చి వివాహం చేయడం కంటే దుర్యోధన సార్వభౌముని కుమారుడు లక్ష్మణ కుమారునికి ఇచ్చి వివాహం చేయడం ఉత్తమమని చెప్పి రేవతీదేవి మనసు మార్చి కలహ బీజం నాటుతాడు. దీని ప్రభావంతో సుభద్ర అభిమన్యుని తీసుకుని పుట్టినిల్లు విడిచి వదిలి వెళ్ళిపోతుంది. అరణ్యంలో ప్రయాణిస్తున్న వారిని భీమసేనుని పుత్రుడు ఘటోత్కచుడు తారసపడి, వారికి జరిగిన అవమానం తెలుసుకుని, కౌరవులకు గర్వభంగం చేసి, శశిరేఖా అభిమన్యులకు వివాహం చేయించేందుకు ప్రతిన పూని, ద్వారకకు చేరి, శ్రీకృష్ణుని దర్శించి, అతని సలహా మేరకు శశిరేఖను తన ఇంటికి చేరుస్తాడు. తన మాయాజాలంతో శశిరేఖ రూపం దాల్చి, అనుచరులతో కౌరవులను, బంధువర్గాన్ని అల్లరి పెట్టి, పరాభవించి, శశిరేఖాభిమన్యుల వివాహం జరిపించడంతో కథ ముగుస్తుంది.

ఘటోత్కచుని ఆహార్యం, గుహ, మాయాయుద్ధం, మాయాబజార్ వింతులు, పండువెన్నెల సెట్టింగు వంటి దృశ్యాలు ఆహూతులను సంభ్రమాశ్చర్యాలను కలిగించాయి. బలరాముని బావమరింది రైవతకుడు హావభావ నటనతో కడుపుబ్బ నవ్వించాడు. సెట్ మారిన ప్రతిసారి ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో కళాభారతి ఆడిటోరియం మార్మోగింది.

ఆద్యంతం ఆహ్లాదం భక్తప్రహ్లాద

‘భక్తప్రహ్లాద’ నాటక ప్రదర్శనకు కూడా ఆధునిక హంగులు జోడించి, ఔరా అనిపించుకున్నారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచన, ఆర్.నాగేశ్వరరావు (బాబ్జీ) దర్శకత్వం, నిర్వహణలో భక్తప్రహ్లాద నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. శాపగ్రస్తులైన జయవిజయులు భూలోకంలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మిస్తారు. దానవులైన వీరు యజ్ఞ వాటికలను ధ్వంసం చేస్తూ దేవతలను హింసిస్తారు. శ్రీ మహావిష్ణువు వరాహావతారమున హిరణ్యాక్షుని వధిస్తాడు. తమ్ముని మృతితో కోపించిన హిరణ్యకశిపుడు బ్రహ్మ కోసం ఘోర తపస్సు చేసి మెప్పిస్తాడు. ఆయన ద్వారా వరం పొందుతాడు. హిరణ్యకశిపుడు ఇంద్రలోకాన్ని ఆక్రమించి, వారిని బాధిస్తాడు. విద్యనభ్యసించడం, హరినామస్మరణ మానని తనయుడు ప్రహ్లాదుని అనేక విధాల చిత్రహింసలకు గురిచేయడం, చివరకు శ్రీ మహావిష్ణువు స్తంభం నుండి ఉగ్రనరసింహరూపాన ప్రత్యక్షమై హిరణ్యకశిపుని వధించడంతో కథ ముగుస్తుంది. బ్రహ్మ ప్రత్యక్షం, ప్రహ్లాదుని హింసించే సెట్స్ ఆహూతులను అబ్బురపరిచాయి.

నేత్రపర్వం జైపాతాళ భైరవి నాటకం

కనురెప్పపాటులో మారే భారీ సెట్టింగులు, అద్భుతమైన ఎఫెక్ట్స్‌తో శ్రీ రచన, దర్శకత్వం, పద్మశ్రీ ఆర్.నాగేశ్వరరావు నిర్వహణలో శ్రీ వెంకటేశ్వ నాట్యమండలి సురభి కళాకారులు పాత్రోచిత హావభావ నటనతో ‘జై పాతాళ భైరవి’ నాటకాన్ని నేత్రపర్వంగా ప్రదర్శించారు. ఉజ్జయిని నగర మహారాజు కుమార్తె ఇందుమతిని, ఉద్యానవన తోటమాలి శాంతమ్మ కొడుకు తోటరాముడు ప్రేమిస్తాడు. మహారాజు తోటరాముని బంధిస్తాడు. కుమార్తె ఇందుమతి విడిచి పెట్టమని కోరగా, తన స్థాయికి తగిన వాడుగా ధనవంతుడవై వస్తే వివాహం చేస్తానని షరత్తువిధిస్తాడు. సమస్త భూమండల సార్వభౌమత్వం కోసం క్షుద్రశక్తులను ఆశ్రయించిన నేపాళ మాంత్రికుడు, తారసిల్లిడం, తోటరాముడు, మాంత్రికుని మోసబుద్ధిని తెలుసుకొని యక్షిణి చెప్పిన ఉపాయం ప్రకారం మాంత్రికుని బలి ఇచ్చి పాతాళభైరవి అనుగ్రహంతో రాజ్యానికి చేరుకుని మహారాజుకు కనిపిస్తాడు. తన కుమార్తెను తోటరాముడికిచ్చి వివాహం చేయడానికి అంగీకరిస్తాడు. రాజకుమారిని వివాహం చేసుకున్న తోటరాముడు పాతాళభైరవిని దేవికి సమర్పించి కృతజ్ఞత తెలుపుతాడు. ఆద్యంతం సురభి కళాకారులు నటనా నైపుణ్యంతో ఆహూతులను అలరించి కరతాళ ధ్వనులందుకున్నారు.

-గున్న కృష్ణమూర్తి

వాగ్గేయకారులకు 12 గంటల

నృత్య నీరాజనం

పత్రం, పుష్పం, ఫలం, తోయం ...ఎవరు ఏ విధంగా కొలిచినా భక్తితో స్వీకరిస్తాను అని గీతాచార్యులు చెప్పినట్టు నృత్య కళాకారులు ఏకధాటిగా 12గంటలపాటు భక్తిపూర్వకంగా సద్గురువులు వాగ్గేయకారులకు నృత్యాంజలి ఘటించిన కార్యక్రమం నెల్లూరులో మహాగణపతి అంటూ తొలుత వరసిద్ధి వినాయకుని కొలిచి తరంగం, అలరిపు, జతిస్వరంతో వాగ్గేయకారులకు నృత్యాంజలి ఆహూతులను కట్టిపడేసింది. నటరాజమూర్తికి చక్కటి అభినయ విన్యాసాలతో నృత్యాభిషేకం చేశారు నెల్లూరు నగరంలో టౌన్‌హాలులో గురుకృప కళాక్షేత్రం విద్యార్థినులు. ఆంధ్రరాష్ట్రంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలో నాట్యప్రదర్శనలిచ్చి అశేష అభిమానులను సంపాదించుకున్న గురుకృప కళాక్షేత్రం విద్యార్థినులు మరో మారు తమ నాట్య కౌశలంతో వందలాది ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు సురభి గాయత్రి పర్యవేక్షణలో కళాక్షేత్రం విద్యార్థినులు 150 మంది ఉదయం 8గంటలనుంచి రాత్రి 8గంటలవరకు 12 గంటలపాటు నిర్విరామంగా వాగ్గేయకారుల వివిధ కీర్తనలకు నృత్యం చేసి ప్రేక్షకులను సమ్మోహనం చేశారు. సుప్రసిద్ధ వాగ్గేయకారులు నాదబ్రహ్మ సద్గురు త్యాగరాజస్వామి, శ్యామశాస్త్రి, దీక్షితులు, అన్నమాచార్యులు, నారాయణతీర్థులు, జయదేవుడు, రామదాసు, క్షేత్రయ్యల కీర్తనలకు విద్యార్థినులు చేసిన నృత్యాభినయానికి ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అలరిపు, కౌతం, తరంగం, పుష్పాంజలి, గణేష పంచరత్నం, శ్యామల దండకం, నటరాజ అంజలి, శివకౌతం, జాలరి నృత్యం, మణిపూరి సంగీతానికి నృత్యం, కోలాటం, జతిస్వరం, కాళికౌతం, నాటకురంజి, తిల్లాన, దశావతారాలు, మరకతమణిమయ చేలా, కేరళ సంగీతానికి నృత్యం, భామా కలాపం, బృందావన తిల్లానా, శబ్దం, కృష్ణంవందే జగద్గురం, నవరాగమాలిక, జయదేవుని అష్టపది, శివాష్టకం శివతాండవం, జతస్వరం, మహిషాసుర మర్ధిని, అష్టలక్ష్మీ వైభవం, శివపదం, లంబాడీ నృత్యం వంటి పలు కీర్తనలకు ఒకదాని వెంట మరొకటి విద్యార్థినులు నృత్యం చేశారు. విద్యార్థినుల నృత్యానికి శైలజా వాణిశ్రీ, నిర్మల, లక్ష్మి, కామాక్షి గాత్రం అందించారు. హరి ప్రసాద్ మృదంగం, లోకేష్ వయోలిన్, గాయత్రి నట్టువాంగంతో సహకరించారు. ఈసందర్భంగా నృత్య గురువు, గురుకృప కళాక్షేత్రం వ్యవస్థాపకులు సురభి గాయత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన శాస్త్రీయ నృత్యాన్ని భావి తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

నృత్యనీరాజనం పేరిట త్యాగరాజకృతులకు అభినయం చేస్తున్న కళాకారులు

-బి ఉదయభాస్కర్

ఆంధ్రభూమి
శుక్రవారం 15
ఫిబ్రవరి 2013

IV

ప్రియకి పెళ్లి?

పెళ్ళిళ్ల

'షాడో'లో తాప్సీ

'లోకల్ విలన్లు' ఎక్కడ?

ప్రకాష్‌రాజ్

ముఖేష్‌రిషి

తెలుగు సినిమా కథల్లో- హీరోతో సమాన ప్రాధాన్యత వున్న విలన్ పాత్రలను సృష్టించటం మనకు ఆనవాయితీగా వున్నదే.

అందుకే ఎస్.వి.రంగారావు, ముక్కామల, రాజనాల, నాగభూషణం, రావుగోపాల్‌రావు వంటి హేమాహేమీలను పెట్టి విలన్ పాత్రలు సృష్టించారు. వాళ్ళకున్న పాప్యులారిటీనిబట్టి వాళ్ళ పక్క కమేడియన్స్‌ని పెట్టి ప్రేక్షకులకు బోర్ కొట్టకుండా వాళ్ళకోసం ప్రత్యేక ట్రాక్‌లో కామెడీని వ్రాయించి చిత్రాలు నిర్మించారు.

నాగభూషణం పక్కన- అల్లు రామలింగయ్య, అలాగే రావుగోపాల్‌రావు పక్కన కామెడీ పాత్రలు పెట్టి 'విలన్' పాత్ర రొటీన్‌గా అనిపించకుండా, బోర్ కొట్టకుండా 'కామెడీ ట్రాకులు' పెట్టారు. రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, పద్మనాభం, చదలవాడ కుటుంబరావు, వంగర వెంకట సుబ్బయ్య వంటి వారు ఈ విలన్‌లకు తోకమ్మటి నారాయణల్లా వుండేవారు.

అయితే కోట శ్రీనివాసరావు వచ్చేప్పటికి, ఆయనది కొత్త రకం విలనీ- ఇది పండటానికి బ్రహ్మానందం వంటి వారిని 'హాస్యబ్రహ్మ' జంధ్యాల ప్రవేశపెట్టారు. అలా రంగంమీదకి వచ్చినవారే- సుత్తివేలు, వీరభద్రంలాంటి వాళ్ళు.

అయితే ఫ్యాక్షన్, బ్యాగ్రౌండ్ చిత్రాల కథలకోసం ఇతర భాషల విలన్‌లు తెలుగు చిత్ర రంగంలోకి నిర్మాతలు తెచ్చారు.

'ప్రతిఘటన' చిత్రంలో విలన్ పాత్ర ధరించిన చరణ్‌రాజ్‌ని తెలుగు రంగానికి తెచ్చారు నిర్మాతలు. 'ఝాన్సీ' పాత్ర ధరించిన విజయశాంతి అతన్ని కిరాతకంగా గండ్ర గొడ్డలితో సంహరించటంతో, తెలుగులో కొత్త విలన్‌లు రంగప్రవేశానికి 'ఫ్యాక్షన్' చిత్ర కథలో రాజకీయ నేపధ్యాలు, అవకాశం కల్పించినట్లయ్యింది.

రాంగోపాల్‌వర్మ తీసిన 'శివ' చిత్రంలో దుష్ట భూమిక ధరించిన రఘువరన్ కేవలం కళ్ళల్లో క్రౌర్యం, విలనీ ప్రదర్శించాడు. నాజర్ ముస్లిం అయినా మణిరత్నం తీసిన 'బొంబాయి'లో అడ్డు బొట్లు పెట్టుకుని బ్రాహ్మణుడిగా కొత్త అవతారం ఎత్తాడు. సూపర్ హిట్లయిన- 'పోకిరి', 'అతడు', 'నాయకుడు'వంటి చిత్రాల్లో - 'రామదాసు' చిత్రంలో తానీషాగా వైవిధ్యాన్ని ప్రదర్శించి, రాజసం ఉట్టిపడేట్టు నటించాడు. వీళ్ళు దక్షిణాది నుంచి వచ్చిన విలన్లు.

సోనూసూద్

షాయాజీ షిండే

కోట శ్రీనివాసరావు లాంటి మంచి విలన్ల స్థానే - షియాజీ షిండే, మహారాష్ట్ర స్టేజీ నటుడు- 'అతడు'- (రాజకీయ నాయకుడు), 'పోకిరీ'లో పోలీస్ ఆఫీసర్- 'దుబాయ్ శీను'లో ప్రేమికుడుగా నటించి, రఘుబాబు ప్రోత్సాహంతో, ఆడవాళ్ళచేత తన్నులు తినే వరకు వెళతాడు. 'అరుంధతి' చిత్రంలో దుష్టశక్తులను కట్టడి చేసే 'అన్వర్' పాత్రలో రాణించాడు. కాని ఈయన తన డైలాగులు తాను స్వంతంగా చెప్పుకునే తెలుగు స్వచ్ఛత లోపించి వుంటుంది.

హిట్స్ పరంగా చూడగానే, మంచి కేరక్టర్ ఫిట్‌నెస్ వున్న విలన్‌గా కనిపించే మరో నటుడు ఆశిష్ విద్యార్థి... ఈయన మాతృభాష మరాఠీ. మరాఠీ రంగస్థలం నుంచి వచ్చిన ఈయన 'విక్రమ్' చిత్రం ద్వారా తెలుగులోకి వచ్చాడు. 'పోకిరి' చిత్రం ఆల్‌టైం రికార్డ్ హిట్ కావటానికి ఈయన విలనీ బాగా తోడ్పడింది. పోలీస్ ఆఫీసర్లు ఇంత దుర్మార్గులుంటారా అనిపించేట్టు కేవలం- కళ్ళతో, ముఖ కవళికలతో, పళ్ళు కొరకటంతో సాధించాడు. మళ్ళీ ఇంతలో విలన్ 'నరసింహ' అనే చిత్రంలో మెత్తటి స్వభావంగల పాత్రను ధరించాడు. 'అలామొదలైంది' చిత్రంలో 'కిడ్నాపర్'గా ఈయన నటన ఎవరూ నటించలేరనిపిస్తుంది.

అందరు విలన్లు ఒక ఎత్తయితే 'పరేష్‌రావల్' 'క్షణక్షణం' చిత్రంలో నటించిన గజదొంగ పాత్ర, ఒక్కటీ ఒక ఎత్తు! 'మనీ' చిత్రంలో భార్యను హతమార్చే ప్రయత్నాలు విఫలం కావటంతో ఈయన నటన ఎంతో నవ్విస్తుంది. 'శంకర్‌దాదా' చిత్రంలో చిరంజీవి ఈయనతో 'లింగం మామా'అని పిలుస్తూ ఆటలు పట్టిస్తూ, ఫూల్‌ని చేస్తుంటే, ప్రేక్షకులు ఈ విలన్ కామెడీని ఆనందించారు. చాలా క్యాజువల్‌గా, ఎఫర్ట్‌లెస్‌గా నటించటం నిజంగా ఈయన ప్రతిభను చెప్పక చెబుతుంది.

ఫ్యాక్షనిస్టుగా 'ఇంద్ర' చిత్రంలో చిరంజీవితో 'ఢీ అంటే ఢీ' అని నటించిన ఫ్యాక్షనిస్టు పాత్రధారి 'ముఖేష్ రుషి'. 'ఒక్కడు' చిత్రంలో తన కొడుకు తన యింటినే శత్రు నిర్మూలనకు అడ్డాగా వాడుకోవటం తెలియని పోలీస్ ఆఫీసర్‌గా పాత్రకు న్యాయం చేశాడు. జూనియర్ ఎన్టీఆర్ తండ్రిగా 'బృందావనం'లో ఈయన నటన మరపురాదు. జయప్రకాష్‌రెడ్డి- ఫ్యాక్షనిస్టు లీడర్‌గా వుంటే- అతన్ని ఎదుర్కోడానికి ముఖేష్ రుషి లాంటి వారు అవసరమే. మగధీర సినిమా కోసం దేవ్‌గిల్, అరుంధతి కోసం సోనూ సూ ద్‌ను తీసుకువచ్చారు. ఇలా మన హీరోల కోసం పరాయి విలన్లను తీసుకురావడం మామూ లైపోయింది. కొత్త విలన్లుగా మనవాళ్లను వెదికి పట్టుకోవడం మానేసారు. మనవాళ్లు విలన్లుగా ప్రారంభించినా, కొన్నాళ్ల తరువాత హీరోలయి పోదామని తహతహలాడడమే బహుశా ఇందుకు కారణంమేమో? మోహన్‌బాబు, శ్రీహరి, శ్రీకాంత్, గోపీచంద్ వీరంతా ఇదే తరహా కదా. అదే పక్క రాష్ట్రపు విలన్లయితే, అక్కడితో ఆగుతారనేమో? ఏది ఏమైనా ఇలా ఇలా విలన్లు అంతా బయటివారయితే మరి, తెలుగు 'లోకల్ టాలెంట్'కి అన్యాయం జరిగినట్టే.

-ఎం.డి.సౌజన్య

ట్రేడ్‌టాక్...

ఈ వారం మరోసారి బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిసింది. అన్నీ కుదిరితే కోట్లు కురిపించగల మరో హీరోగా ప్రభాస్ అవతరించాడు. మిర్చి సినిమా మాస్ జనాలను అలరించి, నిర్మాతకు కలెక్షన్ల పంట పండించింది. తొలివారం రికార్డు కలెక్షన్లు సాధించింది. నీతమ్మ వాకిట్లో, నాయక్ సినిమాలు వీకెండ్‌లో బాగానే వున్నాయి. విశ్వరూపం కూడా ఎ సెంటర్లలో బాగానే వసూళ్లు సాధిస్తోంది.

ఈ వారం సినిమాలు

కళ్లు-ఒళ్లు

కళ్లు, ఒళ్లు కెమేరాకు అప్పగిస్తే చాలు, యాభైయ్యో, అరవయ్యో చేతిలో పడిపోతాయని, అదే నటనని అనుకుంటున్నట్టుంది బొద్దు భామ రిచా గంగోపాధ్యాయ. తెలుగు, తమిళ భాషల్లో కలిపి అరడజను సినిమాల అనుభవం వచ్చేసినా, ఇంకా నటనలో డిగ్రీ చేతికందలేదు. మంచి అందచందాలు, దక్షిణాది జనాలకు నచ్చే బొద్దందాలు వున్నా, నటనలో కాస్తయినా పరిపక్వత లేకుంటే కొనసాగడం కష్టమని ఈ అమ్మడికి తెలియచెప్పేదెవరో?

లారెన్స్‌కు ఇక నో ఛాన్స్?

'రెబల్' గొడవ లారెన్స్ తెలుగు కెరియర్‌కు గండికొట్టేలా వుంది. ఈ వ్యవహారంలో లారెన్స్ మొండికేయడంతో, తెలుగు సినిమాకు చెందిన సంఘాల ద్వారా అతగాడిని బ్యాన్ చేసే ప్రమాదం వుందని వార్తలు వినివస్తున్నాయి. అదే జరిగితే 'ముని -3' ముప్పులో పడుతుంది. ఆ తరువాత మరే సినిమాను తీయడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చు. ఆ ..అయినా 'రెబల్' ఫలితం చూసాక, ఆ తలకాయ నొప్పులు తెలిసాక కూడా, బ్యాన్ చేయకపోయినా, లారెన్స్‌ను దగ్గరకు తీసే ధైర్యం ఎవరికి వుంటుంది?

తలలూపారా లేదా?

సినిమా పాటలు హాట్ స్టఫ్‌లా మారిపోయాయి. సినిమా ఆడినన్ని రోజులు వినబడితే చాలు, ఆ తరువాత కాలానికి నిలవ కపోయినా ఫరవాలేదు అన్నదే ప్రధాన వ్యవహారం అయిపోయింది. దీంతో పాటల్లో కొత్తదనం లేకున్నా, మూడు నాలుగు సినిమాలు కలిపి, మళ్లీ కొత్త కథ అల్లినట్లు, నాలుగైదు ట్యూన్లు అటు ఇటు చేసి, కొత్త పాటలు అందించడమే కర్తవ్యమైపోయింది. దీంతో పాటలు క్యాచీగా వున్నాయని శ్రోతలు, ఆదరిస్తున్నారని సినిమా వాళ్లు ఆనందిస్తున్నారు. ఈ ఫార్ములాతో పరిశ్రమలో నెగ్గుకువస్తూ, హాట్ ఫేవరెట్‌గా వున్న మ్యూజిక్ డైరక్టర్ దేవీశ్రీప్రసాద్. కేవలం శ్రోతలను అలరించడమే తప్ప, ప్రయోగాలకు పోయి, ఆల్బమ్‌ను టాప్ టెన్‌కు దూరం చేసుకోవడం అతగాడికి ఇష్టం వున్నట్లు లేదు. అందుకే థమన్‌తో పోటీని ఎదుర్కుని నిలబడగలిగాడు.

టాలీ'టాక్ - 'చిత్ర'

ఇదో టైపు పబ్లిసిటీ...!

సినిమాలు విడుదలైన తరువాత వాటిని ఎత్తడం కోసం పడే పాట్లు ఇన్నీ అన్నీ కావు. రకరకాల వార్తలు పుట్టించి, వాటిని ప్రచారంలోకి తెచ్చి, తద్వారా ఈ సినిమాకు జనాల్ని రప్పించే ప్రయత్నాలు ఎన్నో. సినిమా బాగుంటే కదా, ఆ దర్శకుడికి మరో అవకాశం వస్తుంది అన్నది ప్రేక్షకుల భావన. దీన్ని అవకాశంగా తీసుకుని, సినిమా విడుదలయిన రెండు రోజులకే, ఫలానా హీరో లేదా, ఫలానా బ్యానర్‌లో ఈ దర్శకుడి సినిమా అని ఓ ఫీలర్‌నో, వార్తనో వదులుతారు. ఢమరుకం తరువాత శ్రీనివాసరెడ్డికి, మిర్చి తరువాత కొరటాల శివకు ఇలాంటి ఆఫర్‌లు వచ్చేసాయి. వీటి సంగతి సరే కానీ, సాధారణంగా ఇలా వచ్చే ఆఫర్లలో చాలా వరకు తెరకెక్కిన దాఖలాలు లేవు.

వెన్నెల ఆంధ్రభూమి
శుక్రవారం 15 ఫిబ్రవరి 2013

మాస్ 'మిర్చి'



ఇప్పుడు మన తెలుగు సినిమాలకు అన్నింటికీ ఒకటే సబ్జెక్ట్. సరదా సరదా సంగతులు. ఉన్నట్లుండి మలుపు. ఆపై ఫ్లాష్‌బ్యాక్. చివరకు సుఖాంతం. వీటి నడుమ కాస్త మంచి కామెడీ, భారీ ఫైటింగ్‌లు, కళ్ల కింపైన నృత్యగీతాలు. సినిమా అంటే కాస్త వినోదం, మరి కాస్త రిలీఫ్ అన్న వ్యవహారానిదే పైచేయి కావడంతో, ఆ తరహా సినిమాలు తీసేందుకే దర్శకులు, చేసేందుకే హీరోలు ఇష్టపడుతున్నారు. దర్శకుడిగా మారిన రచయిత కొరటాల శివ కూడా తన తొలి సినిమాకు ఇటువంటి లైన్‌నే ఎంచుకుని, కాస్త నవ్యతను జోడించి, హిట్ కొట్టే ప్రయత్నం చేసారు. పగ పెంచుకోవడం కన్నా, వీలైతే ప్రేమను పంచితే మంచిదన్నది ఈ సినిమాలో నవ్యమైన పాయింట్. దాన్నే దర్శకుడు 'ప్రేమిస్తే తిరిగి ప్రేమను పొందే అవకాశం వుంది' అన్న ఆశాభావ ధోరణిగా ప్రవేశపెట్టాడు. ఇలాంటి పాయింట్‌తో వచ్చిన సినిమానే 'మిర్చి'. కథ కన్నా, కథనాన్ని, కథానాయకుడిని నమ్ముకుని సినిమాను తెరకెక్కించాడు.

రెండు కుటుంబాల నడుమ ఏర్పడిన కక్షలు, రెండు గ్రామాల మధ్య గొడవలుగా మారడంతో, కలత చెందిన దేవా (సత్యరాజ్) వాటిని తగ్గించే ప్రయత్నంలో భాగంగా భార్య (నదియా)కు కూడా దూరమవుతాడు. ఆ దశలోనే ఉడుకు నెత్తురు వున్న కొడుకు జై (ప్రభాస్)ను, మరదలు వెన్నెల (అనుష్క)తో పెళ్లి ఆపేసి మరీ, ఇంటి బయటకు పంపుతాడు. అలా ఇంటి నుంచి ఇటలీ చేరిన జై అనుకోకుండా, తన కుటుంబంతో కక్షలు వున్న ఇంటికే చెందిన మానస (రిచా)తో పరిచయం పెంచుకుంటాడు. తనను తండ్రి నెట్టేసినా, కక్షలు, కార్పణ్యాలు మారలేదని తెలిసి, ఈసారి రూటు మార్చి, ప్రేమతో పగవారిని జయించాలని వారింటనే చేరతాడు. చివరకు అతగాడు తను అనుకున్నది సాధించాడా లేదా అన్నది మిగిలిన కథ.

వినగానే రొటీనే అనుకున్న కథను దర్శకుడు శివ కాస్త డిఫరెంట్‌గా తీయగలిగాడు. ముఖ్యంగా హీరోను ప్రథమార్ధంలో 'కూల్ కుర్రాడు'గా, ద్వితీయార్ధంలో 'యాంగ్రీ యంగ్‌మన్'గా చూపి, ఇటు యూత్, ఫ్యామిలీలను, అటు మాస్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేసాడు. ఇరు భాగాల్లో ఇద్దరు హీరోయిన్లను తీసుకురావడమే కాకుండా, పాత్రల్లో వైవిధ్యం తీసుకొచ్చేందుకు చూసాడు. అనుష్కను అల్లరి అమ్మాయిగా, రిచాను ఆలోచనలు గల అమ్మాయిగా ప్రెజెంట్ చేయగలిగాడు. గ్యాప్ ఫిల్లర్లుగా బ్రహ్మానందాన్ని, సత్యం రాజేష్‌ను వాడుకున్నాడు.

దర్శకుడు ఇంత తెలివితేటలు ప్రదర్శించినా, స్క్రిప్ట్ కొంచెం సాగిందన్న ఫీలింగ్ అక్కడక్కడ కలగడానికి ఒకటే కారణం. విషయంలో కొత్తదనం కరువై, తరువాత ఏం జరగబోతుందన్నది ముందే తెలిసిపోవడం. ఆ ఒక్క విషయంలో మరికాస్త జాగ్రత్త పడినా, ఆలోచన చేసినా ఇంకా బాగుండేది. సినిమా ప్రారంభంలో, మధ్యలో రెండు ఫైట్ల విషయంలో దర్శకుడు చేసిన కొత్త ఐడియా బాగుంది. పదే పదే నరుకుడు కొట్టుడు వ్యవహారాలకు విసిగిపోతున్న ప్రేక్షక జనానికి ఈ టైపు కొంచెం రిలీఫ్. చాలా విషయాల్లో కొత్తగా ఆలోచించిన దర్శకుడు కీలకమైన క్లయిమాక్స్ విషయంలో అలా ఆలోచించలేదెందుకో?

ఇలాంటి సినిమాకు దర్శకుడి కన్నా, అన్ని ఫ్రేమ్‌ల్లో తానై నిండిన హీరో ప్రభాస్ కష్టం ఎక్కువగా కనిపిస్తుంది. కేవలం కటౌట్ మాత్రమే కాదు, కరేజ్ కూడా వుందన్నట్లే, ఫిజిక్‌కు తగ్గట్లు, పాటలు, ఫైట్లు, సన్నివేశాల్లో మెచ్యూరిటీ కనబర్చాడు. అనుష్క అల్లరి ఆకట్టుకుంటే, రిచా అందంగా కనిపించింది. బ్రహ్మానందం, సుబ్బరాజు కాంబినేషన్, రఘుబాబు-సత్యం రాజేష్ కాంబినేషన్ రిలీఫ్ ఇచ్చాయి. సత్యరాజ్ హుందాగా వున్నాడు. పాత్ర పరిధి తక్కువైనా నదియా బాగానే వుంది. దేవీశ్రీప్రసాద్ ఆద్యంతం మాస్‌ను అలరించడమే పనిగా పెట్టుకోవడంతో సినిమాకు సంగీతం ప్లస్ అయింది. మాధి సినిమాటోగ్రఫీ నీట్‌గా వుంది. కొరటాల శివ తన తొలి సినిమా కాబట్టి దర్శకత్వంపైనా, ప్రెజెంటేషన్‌పైనా ఎక్కువ దృష్టి పెట్టినట్లుంది. అదే సమయంలో పంచ్ డైలాగుల కన్నా, డెప్త్ డైలాగులే రాయాలని అనుకున్నట్లుంది. అయినా ఒకటి రెండు డైలాగులు తళుక్కున మెరిసాయి. మిగిలినవి విని వదిలేయకుండా ఆలోచిస్తే బాగున్నాయనిపిస్తుంది.

-వి.ఎస్.ఎన్

★★ మిర్చి

తారాగణం:
ప్రభాస్, అనుష్క
రిచాగంగోపాధ్యాయ్, సత్యరాజ్
నదియా, బ్రహ్మానందం, రఘుబాబు
'సత్యం' రాజేష్, శ్రీనివాసరెడ్డి
సంపత్‌కుమార్, ఆదిత్యామీనన్

సంగీతం: దేవిశ్రీ ప్రసాద్
నిర్మాతలు: వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్
దర్శకత్వం: కొరటాల శివ

వినగానే రొటీనే అనుకున్న కథను దర్శకుడు శివ కాస్త డిఫరెంట్‌గా తీయగలిగాడు. ముఖ్యంగా హీరోను ప్రథమార్ధంలో 'కూల్ కుర్రాడు'గా, ద్వితీయార్ధంలో 'యాంగ్రీ యంగ్‌మన్'గా చూపి, ఇటు యూత్, ఫ్యామిలీలను, అటు మాస్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేసాడు. ఇరు భాగాల్లో ఇద్దరు హీరోయిన్లను తీసుకురావడమే కాకుండా, పాత్రల్లో వైవిధ్యం తీసుకొచ్చేందుకు చూసాడు. అనుష్కను అల్లరి అమ్మాయిగా, రిచాను ఆలోచనలు గల అమ్మాయిగా ప్రెజెంట్ చేయగలిగాడు.

రియాల్టీ షో!

ధారణంగా ఏదైనా టి.వి. కార్యక్రమాన్ని చూసి 'అబ్బా! అచ్చు సినిమాలా వుందే'...అని ప్రశంసలు కురిపించడం జరుగుతూ వుంటుంది జనకోటిలో. కానీ 'ఎబిసిడి...' విషయంలో ఈ సీను రివర్స్ అయింది. అచ్చుగుద్దినట్లు ఇది టి.వి. రియా ల్టీ షోలా వుందే...? అని అప్రయత్నంగా ప్రేక్షకులు అనుకుంటారు. అలా అనుకోడానికీ పలు కారణాలు ఉన్నాయి. ఈ చిత్ర దర్శకుడు రెమోడిసౌజా టి.వి. డాన్సు కార్యక్రమాలకి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. మిగిలిన వారిలో కూడా చాలామందిని డాన్స్‌షోల ద్వారా వీక్షకులు చూసినవారే. అన్నిటికీ మించి చిత్రంలో ప్రధాన పాత్రధారి ప్రభుదేవా ఇప్పటికీ ఎముక రహిత అద్భుతం (బోన్‌లెస్ మిరేకిల్)గా ఆధునిక నృత్యవిన్యాసాల్లో విశిష్టఖ్యాతి పొందిన వ్యక్తి. అందులోనూ చిత్రం కేంద్ర బిందువు డాన్సు చుట్టూనే తిరగడం... చిత్రానికిచ్చిన సంక్షిప్త నామం (ఎబిసిడి...)కి విస్తరణగా ఎనీబడీ కెన్ డాన్స్ (ఎవరైనా నృత్యం చెయ్యచ్చు) అని స్పష్టపరచడంతో చిత్రం మీద సామాన్య సినీ ప్రేక్షకులకు విపరీత ఆసక్తి కలిగింది. అయితే ఆ ఆసక్తిని తెరమీద ఆవిష్కరించడంలో దర్శకుడు విఫలమయ్యారు. అందుకు కారణం- మొత్తం దృష్టి అంతా డాన్సులు చూపించడంపైనే పెట్టారు తప్ప, ఏ కళారూపానికైనా 'కథ' అనే అంత స్నాతం వుండాలన్న మామూలు విషయాన్ని దర్శకుడు విస్మరించడం. డాన్స్ పోటీల్లో నెగ్గడానికి ఆడియన్స్‌ని ఇంప్రస్ (ఆకర్షించడం) చేయడం, ప్రధానమన్న వాదంలో ఉన్న జహంగీర్ డాన్సింగ్ కంపెనీ అధినేత జహంగీర్ (కె.కె.మీనన్)కీ, కాదు, నృత్యంలో భావం (ఎక్స్‌ప్రెషన్) ముఖ్యం అన్నది విష్ణు(ప్రభుదేవా)తత్వం. ఈ వాదాలతో వేరైన వారిద్దరులో ఎవరు చివరకు పైచేయిగా నిలిచారన్నది మిగిలిన కథ. ఈ ప్రక్రియలో నృత్యం మీద ఆసక్తివున్న యువతకు తన డాన్స్ ఎక్స్‌పీరియన్స్‌తో విష్ణు చేసిన కృషి, పరిష్టి తులనధిగమించడానికి ''ఎనీబడీ కెన్ డాన్స్''అన్న ప్రాతిపదికతో అందరూ అప్రయత్నంగా ఆనందానికి అనుగుణంగా కదం కదిపే సామాన్య విన్యాసానికీ పెద్దపీటవేయడం లాంటివి చోటుచేసుకున్నాయి. కథాస్ఫూర్తి కొంతవరకూ హాలీవుడ్ చిత్రం 'స్టెప్ అప్'అన్న వార్తలూ వున్నాయి. అది అయినా కాకపోయినా ఈమధ్య టి.వి.లో వస్తున్న వివిధ డాన్స్ కార్యక్రమాలు చూసిన ప్రేక్షకులకి, ఈమాదిరి నృత్యాలూ, ప్రదర్శన అనంతరం న్యాయనిర్ణేతలు చేసే వ్యాఖ్యానాలూ, అందుకు పాల్గొన్న అభ్యర్థుల విపరీత స్పందన తదితరాలు చూసి ఈ పోటీలో నెగ్గుకురావడం అన్నదానిపై ఒక 'అవగాహన' వుండనే ఉంది. ఈ అవగాహనా విధానాన్నే 'ప్యాకేజీ' అంటూ జహంగీర్ పాత్ర ద్వారా ఇందులో చెప్పించారు. అలాగే పేరొందిన విష్ణు దళంలోని 'డీ'పాత్రను లోబర్చుకుని అక్కడి కాన్సెప్టుని దొంగిలించి ప్రదర్శించేయడం వంటివి ఆనోటా ఈనోటా వినే ఉన్నాం. అయితే ఆ కోణంలో..అంటే అక్కడ జరిగే అనుచిత పంధాలు అంతర్గత అంశాలపై ఫోకస్ చేస్తే బావుండేది. అప్పటికే వారి దళంలోని చందు పాత్రధారి మాదకద్రవ్యాల వినియోగం వంటిపై అరకొరగా దృష్టిపెట్టినా అందులో స్పష్టతరాలేదు. ఇంకో అర్థంకాని విషయం ఏమిటంటే డాన్స్ భావం ప్రధానమన్న నమ్మకంగల విష్ణుదళం ప్రదర్శించిన నృత్యాల్లో కూడా.. జహంగీర్ పోకడలే (ఇంప్రస్ చేయడం..) కనపడడం. వీటిని వదిలేస్తే తారాగణంలో వారి ప్రధాన వ్యాపకం అయిన నృత్యంలో నిష్ణాతులు కనుక అందులో మనం వేలుపెట్టలేం. కానీ ఎంతటి నృత్య ప్రధాన చిత్రమైనా, సంభాషణలు చెప్పడానికి, భావ ప్రకటనకీ సరైన సామర్థ్యం వుండాలి. కానీ ఇందులో అది చాలామందిలో లోపించింది, కొన్ని సందర్భాలలో కీలకపాత్రధారి ప్రభుదేవా కూడా భావప్రకటనలో ప్రమాణాలకు సరిపోలలేదు. మిగిలినవారిలో జహంగీర్ పాత్రధారి, (కె.కె.మీనన్), రియా పాత్రధారిణి (లారెన్ గొట్టి- విదేశీ తార) బాగా నటించారు. ఆ భారీ శరీరంతో గణేష్ ఆచార్య (గోపీ పాత్రధారి) అలరించే స్టెప్స్ వేయడం నిజంగా గణేష్ మహిమే! చిత్రంలో ఓ సందర్భంలో డాన్స్ ప్రాముఖ్యాన్ని ప్రభుదేవా రోల్ ద్వారా సంభాషణాకర్త వెన్నెలకంటి సృష్టిలో సకల జీవరాసుల్లో నృత్యతత్వం ఉంది. (అలలు కదలడం, పక్షులు ఎగరడం) అన్నది చెప్పడం బావున్నా, దాన్నింకా వివరించే అవకాశం దర్శకుడు కలిగిస్తే బావుండేది.

ఈ సందర్భంగానే 'డాన్స్ ఈజ్ సైన్ ఆఫ్ లైఫ్' (కదలిక సజీవ తత్వానికి నిదర్శనం) అని చెప్పించారు. పాటల్లో 'మరణాన్నైనా ఓడించాలి, ఓడించైనా మరణించాలి'అన్నది స్ఫూర్తివంతంగా ఉంది. అలాగే చిత్రం ప్రారంభంలోనూ ఆఖర్లోనూ 'గణేశ్' ప్రతిమ, నేపథ్యం ఆధారంగా చిత్రించిన సన్నివేశాలు బాగున్నాయి. చిత్రం అయిపోయింది, వెళ్లిపోవచ్చు అనుకుంటున్న సమయంలో కూడా దర్శకుడు తనకు నృత్యం మీదున్న అమిత అనురక్తికి ముగింపుచెప్పడం ఇష్టంలేక, ఓ పక్క పాత్రల పాత్రధారుల, ఇతర సాంకేతిక సిబ్బంది పేర్లు వస్తున్నా గాయకుడు మనో పాడిన అరె...పోరా కోటిగాడా... అన్నది వచ్చింది. విరామ సమయం ముందు ప్రభుదేవా చేసిన నృత్య భంగిమలు ఆయనొక్కరే ప్రదర్శించగలిగినవి.

ఎంతటి నృత్య ప్రధాన చిత్రమైనా అన్ని అభిరుచుల ప్రేక్షకులకీ నచ్చాలంటే బిగువైన కథా అవసరమన్నది రెమో గుర్తుపెట్టుకుని వుంటే ఎబిసిడి.. ఎవ్వరిబడీ విల్ వాచ్ (అందరూ చూస్తారు) విభాగంలో నిల్చేది.

- అన్వేషి

ఎంతటి నృత్య ప్రధాన చిత్రమైనా, సంభాషణలు చెప్పడానికి, భావ ప్రకటనకీ సరైన సామర్థ్యం వుండాలి. కానీ ఇందులో అది చాలామందిలో లోపించింది, కొన్ని సందర్భాలలో కీలకపాత్రధారి ప్రభుదేవా కూడా భావప్రకటనలో ప్రమాణాలకు సరిపోలలేదు.

★ ఎబిసిడి

తారాగణం:
ప్రభుదేవా, కె.కె.మీనన్
సల్మాన్ యూసఫ్‌ఖాన్
గణేష్ ఆచార్య, ధర్మేష్ ఎలెందీ
లారెన్ గొట్టిలిచ్
మయూరీష్ వాడేకర్ తదితరులు.

సంగీతం: సచిన్-జిగర్,
నిర్మాత: పి.కె.షోల్,
కథ, దర్శకత్వం: రెమోడిసౌజా.

సస్పెన్స్ థ్రిల్లర్!

ఇరవై ఐదు చిత్రాల సుదీర్ఘ సంగీత ప్రయాణంలో విజయ్ ఆంథోనిని అభిమానించని తమిళ సంగీత ప్రియులు ఉండరంటే బహుశా అతిశయోక్తి కాదేమో. ఇన్నాళ్లూ తెర వెనుక సరిగమలతో ఆటలాడి - ఒక్కసారి ప్రేక్షకుల్ని పలకరించి వెళ్దామని 'నకిలి'గా అవతరించి నటనాపరంగా మరోసారి తనేమిటో నిరూపించాడు. సినిమాటోగ్రాఫర్‌గా విశేష అనుభవాన్ని గడించిన జీవ శంకర్ ఈ చిత్రంతో దర్శకుడిగా మారాడు. ఇన్ని ప్లస్ పాయింట్ల మధ్య చక్కటి స్క్రీన్‌ప్లేతో వచ్చిన ఈ థ్రైల్ థ్రిల్లర్ క్షణక్షణం సస్పెన్స్‌తో ముంచెత్తుతుంది. 'నోబడీ ఈజ్ పర్‌ఫెక్ట్' టాగ్ 'నకిలి'కి సరిపోయింది.

★★ నకిలి

తారాగణం:
విజయ్ ఆంథోని
సిద్ధార్థ్ వేణుగోపాల్
రూపా మంజరి, అనూయ
విభా తదితరులు

సంగీతం: విజయ్ ఆంథోని
నిర్మాతలు: ఎం.రాజశేఖర్
చిన్నబాబు అరిజెల
దర్శకత్వం: జీవ శంకర్

కార్తీక్ (విజయ్ ఆంథోని) తల్లి వేరొకరితో సంబంధం పెట్టుకోవటంతో తండ్రి ఆత్మహత్య చేసుకుంటాడు. తండ్రిని పోగొట్టుకున్న బాధలో ఉన్న కార్తీక్ తన తల్లినీ, ఆమె ప్రియుణ్ణి గుడిసెలో ఉండగా తగులబెట్టడంతో అతణ్ణి జైల్లో వేస్తారు. అక్కడే జీవిత పాఠాలను నేర్చుకొంటాడు. సత్ప్రవర్తన కారణంగా కార్తీక్‌ని శిక్షాకాలం పూర్తి కాకముందే విడుదల చేస్తారు. అక్కడ్నుంచీ బాబాయి ఇంటికి వెళ్తాడు. పిన్ని అతణ్ణి ఇంట్లోకి రానివ్వటానికి ఒప్పుకోకపోవటంతో దారితెన్నూ తెలీక బస్సులో వెళ్తూండగా.. ఆ బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిపోతుంది. తన పక్క సీట్లోని 'సలీం' మరణించటంతో అతడి స్థానంలోకి వెళితే ఎలా ఉంటుందని ఆలోచిస్తాడు. సలీం ఎంబిబిఎస్ చదవటానికి పట్నం వెళ్తూంటాడు. దాన్ని అవకాశంగా తీసుకొని మెడికల్ కాలేజీలో సలీంగా చేరతాడు కార్తీక్. అక్కడే అశోక్‌తో పరిచయం ఏర్పడుతుంది. అశోక్ (సిద్ధార్థ్ వేణుగోపాల్) విలాస పురుషుడు. అమ్మాయిల్ని తన చుట్టూ తిప్పుకుంటూంటాడు. అతడి ఫ్రెండ్ కిషోర్. అశోక్‌తో క్లోజ్‌గా ఉంటూ అతడికి అత్యంత సన్నిహితుడై.. అతడి గెస్ట్‌హౌస్‌లోనే ఉండిపోతాడు. అశోక్ - రూప మధ్య కొన్నేళ్లుగా ప్రేమ నడుస్తూంటుంది. అశోక్ చేసే కొన్ని పనులు రూపకి నచ్చవు. అతడు అమ్మాయిల్తో తిరుగుతూంటాడని తెలిసి కోపం పెంచుకుంటుంది. వీళ్లిద్దరికీ మధ్యవర్తిగా సలీం. కథ ఇక్కడే అనుకోని మలుపు తిరుగుతుంది. సలీం అసలు రూపం బయటపడుతుంది. దీంతో అశోక్‌కీ కార్తీక్‌కీ మధ్య జరిగిన ఘర్షణలో అశోక్ చనిపోతాడు. అతణ్ణి పాతిపెట్టి - ఇటు సలీంగా అటు అశోక్‌గా సమయానుకూలంగా నాటకం ఆడుతూంటాడు కార్తీక్. సలీం అశోక్‌గా ఎందుకు మారాడు? అసలు అశోక్ ఏమయ్యాడు? అని ప్రశ్నించిన అశోక్ ఫ్రెండ్‌ని సైతం చంపేస్తాడు కార్తీక్. చివరికి 'కార్తీక్ అలియాస్ సలీం' కథ ఏ మలుపు తిరిగిందన్నది క్లైమాక్స్.

కథంతా 'విజయ్' చుట్టూనే తిరుగుతుంది. పక్కబ్బందీ స్క్రీన్‌ప్లే కారణంగా డ్యూయెట్లు లేకపోయినా.. రొమాన్స్ లేకపోయినా.. ఫైట్స్ లేకపోయినా.. పాటలు అంతగా ఉండకపోయినా - కథలో లీనమై పోతాం. సస్పెన్స్ క్రైం థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి ఇదో చక్కెర గుళిక. కాకపోతే - విజయ్ ఆంథోనిలో ఎక్స్‌ప్రెషన్స్‌ని ఎక్స్‌పెక్ట్ చేయొద్దు. కథాపరంగా ఆ హావభావాలు అవసరం కాబట్టి అని సరిపెట్టేసుకుంటే - ఇంతకు మించిన 'సస్పెన్స్' మరొకటి ఉండదు. ఒక్కో సందర్భంలో ప్రేక్షకుడు కూడా 'సలీం'గా మారిపోతాడు. ఒక వ్యక్తి మరొకరి స్థానంలోకి వెళితే ఎదురయ్యే సమస్యలను కథలో చక్కగా ఇమిడ్చారు. ఇక్కడ ఒక వ్యక్తికాదు ఇద్దరు వ్యక్తుల్లోకి వెళతాడు కథానాయకుడు.

నటనాపరంగా - విజయ్ ఆంథోని, సిద్ధార్థ్ వేణుగోపాల్, రూప మంజరి.. అందరూ చక్కగా నటించారు. శుభం కార్డుకి ముందు 'టు బి కంటిన్యూడ్' అన్న మాటకి అర్థం ఏమిటో? దీనికి సీక్వెల్ ఉంటుందనా?

-సాహితి

రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **శుక్రవారం 15-2-2013**

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశిర ఋతువు, మాఘ మాసం
తిథి- శుద్ధ పంచమి ఉ.10.54
నక్షత్రం- అశ్విని పూర్తి
వర్జ్యం- రా.03.35 నుండి 05.12వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)

విదేశీయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధన నష్టం పట్ల జాగ్రత్తవహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదావేసుకుంటారు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.)

గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయప్రయాసలుంటాయి. వృధాప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధుమిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

మిథునం (మృగశిర 3,4పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.)

ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధన లాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధవహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధన నష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధాప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగానుండుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో సహనం వహించక తప్పదు.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.)

స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగానుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు వాయిదావేసుకోక తప్పదు.

తుల (చిత్త 3,4పా., స్వాతి, విశాఖ 1,2,3పా.)

అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లల పట్ల మిక్కిలి శ్రద్ధవహిస్తారు.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ)

ఆకస్మిక ధన నష్టంపట్ల జాగ్రత్తఅవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృధాప్రయాణాలు చేస్తారు. స్థాన చలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధన లాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణ బాధలు తొలగిపోతాయి. ధైర్య సాహసాలతో ముందుకు వెళ్తారు.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.)

ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందులు అధిగమిస్తారు. మీరుచేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్య సాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.)

ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదుచేస్తారు. సన్నిహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గుర్తింపు లభిస్తుంది. ధైర్యసాహసాలతో కొన్ని కార్యాలు నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి)

శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధన లాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

●

వాస్తవాల 'స్పెషల్'!

2008లో "A Wednesday" చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించిన నీరజ్ పాండే తాజాగా 'స్పెషల్ 26' అంటూ వచ్చేశాడు. ఇటీవలి కాలంలో బాలీవుడ్ కథాక్రమం కొద్దిగా మారింది. వెళ్తే - ఇస్తాంబుల్ లాంటి ఖరీదైన లొకేషన్లలో షూటింగ్. లేకుంటే.. కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్లటం. లేదూ- యధార్థ గాథల వెంట పరుగెట్టడం. ఈ రెంటినీ మిళితం చేసి 'స్పెషల్ స్టోరీ'గా అందించటానికి నీరజ్ పడిన తాపత్రయం కొంతవరకూ సక్సెస్ అయినట్టే. 1987 - క్రైం స్టోరీలు చదివేవారికీ - కేటుగాళ్ల కథలంటే ఇష్టపడే వారికి ఈ సంవత్సరం జ్ఞప్తికి ఉండి ఉంటుంది. ఈ మిస్టరీని ఛేదించటం ఇప్పటికీ సాధ్యపడలేదంటే -అదెంత పకడ్బందీ 'ప్లానో' అర్థమవుతుంది. ఏకంగా సిబిఐనే మోసం చేసిన కంత్రీగాళ్ల వాస్తవ సంఘటన అది. ఎటువంటి మాస్ మసాలా.. కామెడీ లేకుండా - ఎంతో సాదాసీదా సాగిపోతూనే ఉత్కంఠని కలిగించే కథ అది.

'స్పెషల్ 26' అంటే? - అజయ్ (అక్షయ్‌కుమార్) మోసం చేయటంలో దిట్ట. అతడి బృందంలో మరో ముగ్గురు. వీరి టార్గెట్ రాజకీయ నాయకులు.. వ్యాపారవేత్తలు. బ్లాక్‌మనీ ఎవరి దగ్గర ఉంటే వీళ్లు అక్కడ వాలతారు సిబిఐ అధికారులమంటూ. లేదా ఇన్‌కంటాక్స్ ఆఫీసర్లమంటూ. మొదటిగా ఒక ఎమ్మెల్యే ఇంటిని సోదా చేసి ఉన్నదంతా పట్టుకు పోతారు. అజయ్ బృందానికి రణవీర్ సింగ్ (జిమ్మీ షేర్‌గిల్) అనే ఇన్స్‌పెక్టర్ తోడ్పడతాడు. ఐతే - రణవీర్‌కి వారు నకిలీ అధికారులని తెలీదు. దీంతో ఆ ఎమ్మెల్యే పై అధికారులకు ఫోన్ కొడతాడు. రణవీర్‌నీ.. అతడితోపాటు ఉన్న లేడీ కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేస్తారు. రణవీర్‌కి వేరే మార్గం తోచదు. అసలైన సిబిఐ ఆఫీసర్ వసీమ్ ఖాన్ (మనోజ్ బాజ్‌పాయ్)ని కలుసుకొని తన బాధ వెళ్లబోసుకుంటాడు. ఈ కేసులో తనకి సహాయపడమంటాడు. ఒక నేరం చేసింతర్వాత ఎవరి ఊళ్లకి వాళ్లు వెళ్లిపోతూంటుంది అజయ్ బృందం. అప్పుడప్పుడు ఫోన్‌కాల్స్. సిబిఐ ఇన్వెస్టిగేషన్ ఇక్కడ్నుంచే మొదలవుతుంది. ఫోన్ టాప్ చేస్తారు. ఆఖరికి అజయ్ బృందం ఒక ఖరీదైన హోటల్‌లో స్టే చేసినట్టు తెలుస్తుంది. తర్వాత తాము చేయబోయే నేరానికి స్పెషల్ 26' కావల్సి ఉంటుందని 'సిబిఐ' రిక్రూట్‌మెంట్స్ పేరిట ఇంటర్వ్యూలకు కాల్‌ఫర్ చేస్తారు. ఇంటర్వ్యూకి కొంతమంది పోలీ సు అధికారులు కూడా హాజరవుతారు. ఇంటర్వ్యూలో 26 మందిని సెలెక్ట్ చేస్తాడు అజయ్. వారి ఆఖరి టార్గెట్ బొంబాయిలోని జ్యుయెలరీ షాప్. సిబిఐ ఆఫీసర్ వసీమ్ ఖాన్ పక్కాగా ప్లాన్ చేస్తాడు. ఎలాగైనా అజయ్‌ని పట్టుకోవాలని. చివరికి నేరస్థులు దొరికారా? లేదా? అన్నది క్లైమాక్స్.

ఎంచుకున్న కథాంశం 1987 కాబట్టి - ఏ మాత్రం పొరపాటు జరిగినా మొత్తం అభాసు పాలవుతుంది. ఈ విషయంలో శ్రద్ధపెట్టి కాస్ట్యూమ్స్ మొదలుకొని.. ఆనాటి కార్ల వరకూ.. లొకేషన్లు - ఇలా అన్నీ చక్కగా ప్లాన్ చేశాడు నీరజ్. వీటి మధ్య కాస్తంత తళుక్కుమనేలా - అజయ్ - ప్రియ ల ప్రేమ సన్నివేశాలు ఏ ఆర్భాటం లేకుండా హాయి గా చూసేట్టు ఉన్నాయి. ప్రేమని సున్నితంగా స్పృశిస్తూ.. క్రైం కథని సీరియస్‌గా నడిపించాడు. 'ఆస్‌లీ పవర్ దిల్ మే హోతా హై..' కాన్సెప్ట్‌తో క్లైమ్‌ని పండించాడు. ప్రత్యేకించి - ఇంటర్వ్యూ సన్నివేశాలు ఆకట్టుకొంటాయి. పంజాబీ స్టైల్‌లో సాగిన పాట 'గోరె ముఖ్‌డే పె జుల్ఫాన్ ది చావన్..' బాగుంది.

నటనాపరంగా అక్షయ్ కుమార్, అనుపమ్‌ఖేర్, కాజల్.. ఇలా ఎవరి నటన వారు ప్రదర్శించారు. సంగీతం ఫర్వాలేదు. నీరజ్ పాండే స్క్రీన్‌ప్లే బాగుంది. ఏదైనా పాత సినిమాకి వచ్చామా? అన్న భ్రమలోకి నెట్టేస్తాడు. అంతగా కథలో ఇన్‌వాల్వ్ చేయటానికి దర్శకుడు పడిన శ్రమ వృథా పోలేదు.

-బిఎన్కే

★★ స్పెషల్ 26

తారాగణం:
అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్
అనుపమ్‌ఖేర్, దివ్యదత్తా
జిమ్మీ షేర్‌గిల్
మనోజ్‌బాజ్‌పాయ్ తదితరులు

సంగీతం: చందన్ శర్మ
హిమేష్ రేషమ్మియా
ఎం.ఎం.కీరవాణి
సినిమాటోగ్రఫీ: బాబీ సింగ్
దర్శకత్వం: నీరజ్ పాండే

'లింకన్' రాజకీయ చతురతకు అద్దం!

గత కొద్దికాలం నుండి స్టీఫెన్ స్పీల్‌బర్గ్ దర్శకుడిగా ఎక్కడా కనిపించలేదు. 'కింగ్‌డమ్ ఆఫ్ ది క్రిస్టల్ స్కల్స్, టిన్ టిన్, వార్ హార్స్' లాంటి సినిమాలు వచ్చి నా అవేవీ స్పీల్‌బర్గ్ దర్శకత్వ ప్రతిభకు తగినవి కావు. చాన్నాళ్ళ తర్వాత ఈ 'లింకన్' చారిత్రాత్మక సినిమాతో మళ్ళీ క్లాసిక్ డైరెక్టర్‌గా మన ముందుకొచ్చాడు.

'లింకన్' చిత్రం అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహం లింకన్ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మింపబడింది. అబ్రహం లింకన్ మీద వచ్చినన్ని పుస్తకాలు ఏ చారిత్రిక వ్యక్తిమీద రాలేదు. అలాగని ఈ 'లింకన్' చిత్రం పూర్తిగా ఆయన జీవిత చరిత్ర కాదు. ఇది లింకన్ జీవితంలోని చివరి నాలుగునెలల జీవిత కాలానికే పరిమితమైంది. అమెరికన్ సివిల్ వార్ ముగిసిన తర్వాత బానిసత్వాన్ని రద్దు చేయడానికి 13వ సవరణను పాస్ చేయించడానికి లింకన్ పడిన పాట్లను ఈ సినిమాలో చిత్రీకరించారు.

1865 జనవరి సంఘటనలతో ఈ చిత్రం నిండివుంది. తిరిగి అధ్యక్షుడిగా ఎన్నిక అయిన లింకన్‌కు, ఉత్తర అమెరికా సివిల్ వార్‌లో గెలుస్తుందని తెలుసు. కాని అతని నిజమైన పోరాటం బానిసత్వంతోనే. కుట్ర చేసిన ముగ్గురు కమీషనర్లు వాషింగ్టన్‌కు వస్తుంటే, వారం రోజులలోనే వాళ్ళను లొంగదీసుకుంటాడు. దీనికంటె ముందు 13వ సవరణను పాస్ చేయించాలి. డెమొక్రాట్లు ఈ సవరణను అసహ్యించుకుంటుంటే, లింకన్ అనుయాయులైన రిపబ్లికన్‌లు దాన్ని ఆలస్యం చేద్దామనుకుంటారు. సివిల్ వార్ పూర్తయితే ఈ సవరణను ఆమోదించరని లింకన్‌కు బాగా తెలుసు. దక్షిణాది రాష్ట్రాలు దీన్ని అడ్డుకుంటాయి. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటీవ్స్‌లో లింకన్ చేసిన ప్రసంగం అనుకొని మార్పులనుతెస్తుంది. లింకన్ రకరకాలుగా అనగా సామ దాన భేద దండోపాయాల్ని ఉపయోగించి డెమొక్రాటిక్ సభ్యులను లొంగదీసుకోవడంలో రాజకీయ చతురతను కనబరుస్తారు.

యుద్ధంలో పాల్గొనడాన్ని వ్యతిరేకించిన లింకన్ భార్య, కుమారుడు- వారితో అతని సంబంధాలను చిత్రీకరించడంతోపాటు రిపబ్లికన్ పార్టీ లీడర్, తన ప్రత్యర్థులతో లింకన్ మెదిలిన విధానాన్ని కూడా ఇందులో చక్కగా చిత్రీకరించారు. సినిమా మొత్తం లింకన్ సమస్యలను ఎదుర్కొనే విధానాన్ని, దాన్ని అధిగమించే తీరును చూపుతుంది. ఈ విషయంలో లింకన్‌లో వున్న జాలి, నిజాయితీ, పట్టువిడుపుతనాన్ని ప్రదర్శించడంలో ఆయన కనబరచిన నేర్పును చక్కగా చూపగలిగారు. చివర్లో లింకన్ హత్యను పరోక్షంగా చెప్పి ముగించడం కంటే, ఈ సన్నివేశాన్ని తీసేసినా చిత్రానికి వచ్చిన నష్టమేమి లేదు.

ఈ చిత్రంలో లింకన్‌గా నటించిన డానియెల్ డే- లూయిస్ ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేశారనే చెప్పాలి. హావభావాలు, నడవడిక, ప్రవర్తనలో అచ్చు లింకన్‌లా నటించడానికి మేకప్ కూడా తోడ్పడింది. చిన్న పాత్ర అయినా డెమొక్రాట్ నాయకుడిగా టామీ లీ జోన్స్ మరచిపోలేని నటనను ప్రదర్శించారు. నాటకీయత, ఉద్వేగాలతో కూడిన ప్రతి సన్నివేశాన్ని పొరలుపొరలుగా అమర్చుకుని- దాన్ని సున్నితమైన హాస్యంతో మేళవించి టోనీ కుష్నర్ (మ్యూనిచ్ ఫేం) స్క్రీన్‌ప్లే తీర్చిదిద్దిన విధానం అమోఘం. స్క్రీన్‌ప్లేను యధాతథంగా తెరమీదకు మలచడంలో దర్శకుడిగా స్టీఫెన్ స్పీల్‌బర్గ్ చూపిన ప్రతిభ ప్రశంసనీయం. ఇప్పటికే ఈ సినిమా ఏడు గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు నామినేట్ చేయబడింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడుతో కలిసి పన్నెండు ఆస్కార్ అవార్డులకు నామినేషన్లు పొందగలిగింది. ఆద్యంతం సంభాషణలతో కూడుకున్న ఈ రాజకీయ చిత్రాన్ని ముందుజాగ్రత్తగా కొద్ది థియేటర్లలోనే విడుదలచేశారు. కాని ప్రేక్షకుల నుండి వచ్చిన అనూహ్య స్పందన, కలెక్షన్లను చూసి ఎక్కువ థియేటర్లలో విడుదల చేయగలిగారు. లింకన్ మీద వున్న అభిమానం, రాజకీయాలపై వున్న ఆస

★★ లింకన్

తారాగణం:
డానియెల్ డే-లూయిన్
సాల్లీ ఫీల్డ్, డేవిట్ స్తాతర్న్
జుసెఫ్ గార్డెన్- లెవిట్
టామ్ లీజోన్స్ తదితరులు

స్క్రీన్‌ప్లే: టోనీ కుష్నర్
ఫొటోగ్రఫీ: జామన్ కెమాస్కి
సహనిర్మాత- దర్శకత్వం:
స్టీఫెన్ స్పీల్‌బర్గ్

వెన్నెల
ఆంధ్రభూమి
శుక్రవారం 15 ఫిబ్రవరి 2013

మీ వ్యూస్

ఇకపై మల్టీస్టారర్స్ రావేమో...!

ఇటీవల విడుదలైన మల్టీస్టార్ సినిమా 'సీతమ్మవాకిట్లో....' చిత్రం బాగానే ఉన్నా వెంకటేష్ పాత్రకు జరిగిన అన్యాయం అసంతృప్తికి గురిచేసింది. ఇంచుమించు ఇదే కథాంశంతో వచ్చిన 'సంక్రాంతి' చిత్రమే దీనికన్నా బాగుందని మా బృందం ఏకాభిప్రాయం. వెంకటేష్ కాబట్టి తన పాత్రకు జరిగిన అన్యాయం చూస్తూ ఊరుకున్నాడు. మరొకరైతే పీకిపాకం పెట్టేవారు. వెంకటేష్ అనుభవం చూశాక మల్టీస్టారర్‌లో నటించడానికి హీరోలు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. ఈ సినిమా తర్వాత ఇకపై మల్టీస్టారర్స్ రావేమో అనిపిస్తోంది.

- చంద్ర, కాకినాడ

సహజత్వానికి దగ్గరగా...

శ్రీకాంత్, అక్ష నటించిన 'శత్రువు' కథాపరంగా ప్రేక్షకులకు నచ్చలేదు. 'శ్రీకాంత్' ఫైట్స్, పాటలు, డైలాగులకే పరిమితం కాదు. సహజత్వానికి దగ్గరగా నటించాడు. అక్షర ఫర్వాలేదు. మంచి మంచి పాత్రలువస్తే చేయగల సత్తా ఆమెలో వుంది. కథకి ఊపిరి కామెడీ... ఆ కామెడీ లేకపోవడం మైనస్.

- కాళహస్తి వెంకట శేషగిరిరావు, నెల్లూరు

రెండూ తప్పే...!

'లేత మనసులు' చిత్రంలో నటించిన బాలనటి బేబీ శ్రీదేవి అని ఒకరూ, బేబీ లత కాబోలు అని ఇంకొకరూ చెప్పారు. రెండూ తప్పే. ఆ బాలనటి కుట్టి పద్మిని. వయసొచ్చాక అక్కినేని చిత్రం 'అమాయకురాలు'తో సహా రెండు మూడు చిత్రాలలో కనిపించి మాయమైంది. తర్వాత తమిళ సీరియల్స్ కొన్ని నిర్మించింది. అవి చాలాకాలం క్రితం తెలుగులో కూడా వచ్చాయి. ఇప్పుడామె పత్తాలేదు.

- శుభ, కాకినాడ

అర్హులకే అవార్డులు...

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులు అర్హులకు అందటం పట్ల కమిటీకి అభినందనలు. ఏభై ఏళ్లక్రితం రాముడు-భీముడు సినిమాతో నిర్మాతగా మారి పదమూడు భాషలలో సుమారు నూటయాభై చిత్రాలు నిర్మించిన మూవీ మొఘల్ రామానాయుడు, సాంఘిక, పౌరాణిక, సందేశాత్మక చిత్రాలలో 'సాక్షి'నుండి 'శ్రీరామరాజ్యం'వరకు రాశి తక్కువైనా వాసిగల చిత్రాలకు దర్శకత్వం వహించి తెలుగుతెరపై తనదైన ముద్రవేసిన బాపు, బాల నటి నుండి అతిలోకసుందరిగా మన్ననలు పొంది తండ్రీ కొడుకులతోను హీరోయిన్‌గా నటించి బాలీవుడ్‌లోను సత్తాచూపిన శ్రీదేవి, ఆదమరచి నిద్రలో ఉన్న తన గొంతుతో చిన్నపిల్లలనుండి ముదుసలి వరకు తన గానామృతంతో ఓలలాడించిన జానకి వంటి దిగ్గజాలకు ఎప్పుడో ఈ అవార్డులు అందాలి. ఆలస్యంగా అందించినా అర్హులకే అందించటంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభిమానులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం

ఆలోచింపజేసింది

'వేటాడు-వెంటాడు' సినిమాకి ప్రేక్షకులు వెళ్ళడం తక్కువగానే వుంది. సంక్రాంతికి విడుదలైన నాయక్, సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టుకి జనాలు ఉన్నారు కాని ఎందుకో తమిళ సినిమాలు ఈమధ్య బాగుంటున్నాయి అని వెళ్ళి చూసా. 'తిరు' దర్శకత్వం వహించిన వేటాడు-వెంటాడు చూస్తున్నంతసేపు చాలా అద్భుతంగా వుంది. తరువాత తరువాత ఏం జరుగుతుందో అని ఆలోచింపచేసింది. ప్రతీ సన్నివేశం చక్కగా చిత్రీకరించారు. అందరి నటన బాగుంది. విశాల్ ఫైట్స్ చాలా బాగున్నాయి. ఇలాంటి కథలు తెలుగులో ఎందుకు రావడం లేదో అర్థంకావడంలేదు. ఇలాంటి సినిమాలు మొదటినుండి చూస్తేగాని అర్థంకావు.

- నాగేశ్వరరావు అందవరపు, కాశీబుగ్గ

టెక్నికల్ సినిమా!

మన తెలుగు సినిమా కథల్లో కొత్తదనం ఉండదు. ప్రేమకథలన్నీ ఒకేలా వుంటాయి. జనం చూస్తే ఏం చూడకుంటే ఏం. కేవలం కమర్షియల్ డబ్బుకావాలి. ఒకేసారి వందలాది థియేటర్లు సినిమాలను విడుదలచేసి వారంలోనే వాళ్ళకి డబ్బురావాలి. కాని తమిళ దర్శకుల తరహా వేరు. ప్రతి సినిమాల్లో ఏదో కొత్తదనాన్ని సృష్టిస్తారు. దానికి ఉదాహరణ గజనీ, రోబో, చంద్రముఖి లాంటి ఎన్నో సినిమాలు గజరాజు ఒక ఏనుగు కథ ఏనుగు దాడిచేసిన సన్నివేశం క్లైమాక్స్‌లో ఏనుగుల ఫైట్ వంటి వ్యవహారాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమా కేవలం మూడునాలుగు పాత్రలతో స్క్రిప్ట్‌ను బాగానే రూపొందించారు దర్శకుడు ప్రభుసాల్మన్. తొలి చిత్రమైన విక్రమ్‌ప్రభు (ప్రభుకొడుకు) లక్ష్మీమీనన్ బాగానే నటించారు. ఇదొక టెక్నికల్ సినిమా. ఫొటోగ్రఫీ, నేపథ్య సంగీతం కీలక పాత్ర పోషించింది. అడవి అందాలు, పాటలు, దృశ్యాలు ఆకట్టుకుంటాయి.

- మహమ్మద్ యూసుఫ్, కాజీపేట

ఇది ప్రభుత్వ లోపమే...!

'ఎందుకు రావాలి మన వాళ్లకి అవార్డులు!' వ్యాసంలో నగ్న సత్యాలే చెప్పారు. కానీ ఏజెంట్లను ఏర్పాటుచేసుకొని తమ గొప్పదనం చాటుకోడానికి బాపురమణలే కాదు చాలామంది ప్రతిభావంతులు ఇష్టపడని విషయం. అర్హులను ఎంపికచేయడానికి వివిధ రంగాల్లోని నిష్ణాతుల్ని నియమించి వారిద్వారా అర్హుల సమర్థతని కేంద్ర కమిటీకి అర్థమయ్యేట్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయిస్తే మనవాళ్లకి అవార్డులు రావచ్చు. బాపు, జానకి పేర్లను మన ప్రభుత్వంతోబాటు తమిళనాడు ప్రభుత్వం కూడా కేంద్ర కమిటీకి పంపింది. మనవాళ్లు లిస్టు పంపేసి చేతులు దులుపుకుంటే తమిళులు కమిటీకి వ్యక్తిగతంగా వివరించారు. అందుకే బాపు, జానకిలకు తమిళనాడు కోటాలో అవార్డులు లభించాయి. ఇది మన ప్రభుత్వ ప్రయత్న లోపమే.

- శాండీ, కాకినాడ

ప్రయత్నం మెచ్చతగ్గదే కానీ...!

తమిళనాడులో మాత్రమేకాకుండా మన తెలుగునాడులోనూ ప్రేక్షకులకి 30ఏళ్ళుగా సుపరిచితుడు అయిన విలక్షణ నటుడు కమల్‌హాసన్. తన కెరీర్ సంపాదనంతా పణంగాపెట్టి తీసిన భారీ ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వరూపం'. కథలో గ్రిప్ సరిగ్గాలేక ప్రేక్షకుల్ని ఆకట్టుకునే విధంగాలేదు. కథక్ డ్యాన్సర్‌గా, జిహాదీగా, రా ఏజెంట్‌గా 3 పాత్రల్నీ కూడా వైవిధ్యమైన రీతిలో సమర్థవంతంగా పోషించాడు కమల్. అయితే కథకుడిగా మెప్పించలేకపోయాడు. దర్శకుడిగా ఫరవాలేదనిపించాడు. సానువర్గీస్ ఫొటోగ్రఫీ ఫెంటాస్టిక్‌గా వుంది. శంకర్ -ఎహసాన్-లాయ్‌ల సంగీతం జస్ట్ ఓ మోస్తరుగా మాత్రమే వుంది. కమల్ భార్య నిరుపమగా పూజా నటన బాగుంది. అయితే కమల్ కథలో సరైన బిగి లేకుండా, 90కోట్లు ఖర్చు పెట్టి, ఏదో హాలీవుడ్ రేంజ్‌లో తీసినా, భారీగా తను చేసిన ఈ ప్రయత్నం మెచ్చదగ్గదే అయినా, ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చెయ్యటంలో విఫలం అయ్యాడు కమల్. దురదృష్టవశాత్తూ ఈ 'విశ్వరూపం' చిత్రానికి టిడిహెచ్ వివాదం, తమిళనాట నిషేధంలాంటి ఆటంకాలు ఎదురై ఓపెనింగ్స్‌తో సొమ్ముచేసుకునే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. కష్టాల్లో కూరుకుపోయిన కమల్ కోలుకోవాలి అని మనసున్న ప్రతి ఒక్కరూ కోరుకుందాం.

- షేక్ అబ్దుల్ మజీద్, ముదినేపల్లి

ఓ సాహసమే!

సినిమా అంటే వినోదం కోసమే. అసహజమైన కథతో సంబంధంలేకున్నా నాలుగు డ్యూయెట్లు ఓ పది ఫైట్లు రెచ్చగొట్టే డైలాగులు మసాలా.. హాలులో చప్పట్లు సూపర్ డూపర్ హిట్టు. తెలుగు సినిమా ముఖ చిత్రమిది. మతం పేరిట యుద్ధాల సిద్ధాంతాల వైరుధ్యంతో పోరాటాలు ప్రపంచంలో వున్నాయి. ఎందుకున్నాయి? వీటినిగూర్చి ఆలోచించే తీరుబడి, మేధస్సు ప్రేక్షకుల్లో వుండవు. ఈ నేపథ్యంలో కమల్ విశ్వరూపం తీయడం సాహసమే. రూపంలేని విశ్వరూపం అని సమీక్ష రాశారు. టెర్రరిజానికి, ప్రపంచ అశాంతికి రూపం వుండదు. కథ వుండదు.. కమల్ గతంలో గోవింద నిహలానీ ద్రోహిని తెరకెక్కించాడు. ఈనాడులోను చూపించాడు. విశ్వరూపం ప్రారంభంలో కథక్ నాట్యాచార్యుడిగా పదిహేను నిముషాలైనా అద్భుతంగా వుంది. నటనను తపస్సుగా భావించే కమల్‌లాంటి వారికే ఇది సాధ్యం. అమెరికా వేగవంతమైన జీవనశైలి ఓ అరగంట చూపించారు. అనుపమ వ్యవహారం.. విలువలులేని సమాజ పోకడ.. బాగుంది. ఆఫ్టన్ స్టాన్‌కొచ్చేసరికి ఎడారి జీవితం.. ముస్లిం ఫండమెంటలిజం, జిహాదీలు.. ఇదొక ప్రపంచం.. సగటు ప్రేక్షకునికి తెలీని ప్రపంచం. భారతీయత, అమెరికా ఆధునికత తాలిబన్ల వెనుకబాటు.. ఈ అంశాలతో ఫిల్మ్ తీయమంటే ఎవరైనా కమల్‌కు మించి ఈ స్థాయిలో తీయలేరు. సకల కళావల్లభన్ అతనికే సాధ్యం.

- జి.నవీన్‌చందు, భీమవరం

ఎందుకీ వేటా?

ధూమ్‌ధామ్‌గా రామ్‌చరణ్, మహేష్‌బాబుల సినిమాలు విడుదలైనను ఒక నెల లోపలనే అవీ చల్లబడ్డాయి. తర్వాత శ్రీకాంత్ శత్రువు, కమల్ విశ్వరూపం, విశాల్ వేటాడు-వెంటాడు, కన్నడ డబ్బింగ్ 'దండుపాళ్యం' విడుదలయ్యాయి. కానీ దీంట్లో ఏ ఒక్క సినిమా సరైన టాక్‌కు నోచుకోలేదు. కాని కమల్ 'విశ్వరూపం' మల్టీప్లెక్సులకు పరిమితమైన కొంచెం వివాదం చెలరేగిన ఈ సినిమా అనుకున్నంత ఆశించినంత గొప్పగా లేదు. ఆరోజుల్లో కోహరా, బీస్‌సాల్ బాద్, అవేకళ్లు థ్రిల్లర్ సస్పెన్స్ సినిమాలు విడుదలై ఎంతో సంచలనం సృష్టించాయి. తమిళ దర్శకులు వైవిధ్యమైన సినిమాలు తీసేందుకు ప్రయత్నిస్తూనే వున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ వైవిధ్యంగావున్నా దీన్ని డీల్‌చేయగల సత్తా దర్శకుడికి సరిపోలేదు. అయితే చివరిలో సస్పెన్స్‌ను పట్టివుంచడంలో దర్శకుడు కొంచెం విజయం సాధించాడు. నేపథ్య సంగీతం మంచి డెప్త్‌లో వినిపించింది. విశాల్ బాగా నటించడానికి ప్రయత్నించాడు. త్రిష బాగానే నటించింది. మనోజ్‌బాజ్‌పాయ్, జె.డి.చక్రవర్తి విలన్లుగా సహజంగానే నటించారు. ఎంత థ్రిల్లర్ సినిమా అయినా ప్రేక్షకులకు కావల్సింది వినోదం అది లేదు. యువన్‌రాజా సంగీతం పాటలు సోసో. యాక్షన్ సన్నివేశాల్లో జోరు తగ్గిన ఛేజింగ్ సీన్లు బాగున్నాయి.

- ఎం.హెచ్. కాజీపేట

ఇది కక్షసాధింపే...!

'విశ్వరూపం' నిషేధానికి తమిళ ప్రభుత్వ కక్షసాధింపే కారణం. ముస్లిం సంఘాలకు ముందుగానే చిత్రం చూపించి వారి సూచనలు పాటిస్తే నిషేధించవలసిన అవసరమే ఉండేది కాదని జయలలిత అనడం దిగ్భ్రాంతికరం. సెన్సారైన చిత్రంలో కుల సంఘాలు, మత సంఘాలు వేలుపెట్టి దీన్ని తొలగించండి. దాన్ని తొలగించండి అంటూ పోతే మిగిలేది ఫిలిం ముక్కలు తప్ప సినిమా కాదు. అలాంటప్పుడు ఇంక సెన్సార్ బోర్డు ఎందుకు? ఈ పద్ధతిని అలుసుగాతీసుకొని ఒక నటుని అభిమానులు వేరొక నటుని చిత్రంలో కోతలు సూచిస్తే వివాదాలకు అంతూపొంతూ ఉంటుందా? ఆ చిత్రం విడుదలై నచోట్ల నామమాత్రపు నిరసనలు తప్ప ప్రతిఘటనలు లేవే. మరి తమిళనాడులో నిషేధం ఎందుకు?

- చంద్ర, కాకినాడ

భేష్...భరణి!

స్వర్ణోత్సవ, వైవాహిక జీవితంలో జరుపుకున్న ఓ ముదుసలి జంట.. బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా తమదైన 'చిన్న'ప్రపంచంలో హాయిగా ఒకరికొకరుగా బతకడం అనే 'రమణీ'యానికి అద్భుతమైన స్క్రీన్‌ప్లే సృష్టించి తనదైన శైలిలో అందించిన తనికెళ్ల భరణి అభినందనీయుడు. భేష్...భరణి. ఎందుకంటే కథలు లేవంటూ సాకులు చెప్పుకుంటూ కోట్ల రూపాయలు విచ్చలవిడిగా ఖర్చుపెట్టి 'ఢమాల్' అంటున్న సినిమాలకు ఇది భిన్నం. చిన్న కథను ఎంత హాయిగా, రమణీయంగా తీర్చిదిద్దవచ్చో, మన చుట్టూ ఉన్న ప్రకృతినే క్లోజప్ షాట్స్‌లో సుందరంగా కళ్లకు అందిస్తూ మనస్సుకి హాయిని కలిగించింది. ఆరు పాటలు.. 4 ఫైట్లు నుండీ తెలుగు సినిమా బయటపడినా, ప్రేక్షకులు ఆదరిస్తారని నిరూపిస్తుందీ సినిమా! మరచిపోయిన మన మూలాలను, ఈనాటి తరానికి మరోసారి పరిచయంచేస్తుందీచిత్రం. థియేటర్ల కొరతఉన్నా రసజ్ఞులైన ప్రేక్షకులు ఊరుదాటివెళ్లి చూసి ఆనందిస్తారని, ఖర్చుకు వెనకాడరని నిరూపిస్తుందీ 'మిథునం'. దంపతులు ఇద్దరూ ఏ వయస్సులోనైనా ఎంత అన్యోన్యంగా ఉండవచ్చో నిరూపిస్తుందీ దృశ్యకావ్యం. బహుశా ఈ సినిమా చూసి చాలా జంటలు తమ వైవాహిక జీవితాన్ని మరింత అనురాగంతో బలపరుచుకోవచ్చు కానీ బాలు క్యారెక్టర్‌తో రాముడికి, సీత, సీతకు రాముడు మాత్రమే అన్పించారు. కానీ వాళ్లిద్దరూ కలసి కాపురం చేసింది ఎక్కడ?

- డాక్టర్ దుట్టా శమంతకమణి, విజయవాడ



ప్చ్...ఒంగోలుగిత్త!

బొమ్మరిల్లులాంటి అద్భుతమైన సినిమాను అందించిన దర్శకుడు పై క్రమంగా మాస్ టచ్, క్లాస్ మూవీలు అంటూ సినిమాలు తీసి పరాజయ భారంతో మాస్ మూవీ అంటూ క్లాస్ నటులను ఎంపిక చేసుకొని అసలు కథే లేని కథతో 'ఒంగోలుగిత్త'ను తీశాడు. సినిమా ఆద్యంతం అరవగోలే కన్పించింది. ఆకట్టుకోలేని మాటలు, వినసొంపుగా లేని పాటలు, ఇక మాట్లాడుకోవడానికి సైతం ఏమీకనిపించని కెమెరా, ఎడిటింగ్ పనితనం.. ఇందులో కాస్త ఊరటనిచ్చే విషయం కేవలం మణిశర్మ రీరికార్డింగే. ఎనర్జిటిక్ హీరో రామ్‌నటనలో తను కొత్తగా ఈ సినిమాలో సైతం చేసింది ఏమీలేదు. హీరోయిన్ కృతి మాత్రం అందంగా కనిపించింది. బొమ్మరిల్లు భాస్కరేనా ఈ ఓ...గిత్తను తీసింది అనుకుంటూ థియేటర్‌ను వీడే పరిస్థితిని కల్పించాడు

- ఎన్.రాజేష్, హైదరాబాద్

'నాయక్'హాస్యం పండింది

నాయక్ సినిమా కథ పాతకథే అయినా సినిమాలోని హాస్యం బాగా పండింది. ఈ సినిమా చాలా సినిమాల కాపీలా వుంది. వినాయక్ ఎంచుకునే కథల్లో కొత్తదనం లేకపోయినా వాటిల్లో హాస్యపుపాళ్లు ఎక్కువగా జోడించడంతో సినిమాలు హిట్టుకొడుతున్నాయి. సినిమాలో పాత్రలు చాలానే ఉన్నాయి. కొన్ని అనవసరం కూడానూ. ముఖ్యంగా అమలాపాల్ పాత్ర. ఆ పాత్ర లేకపోయినా సినిమాకి పెద్ద నష్టంలేదు. పైగా అమలాపాల్ మేకప్ ఏంబాగోలేదు, గత సిన్మాల్తో పోలిస్తే. సంగీతంకూడా బాగోలేదు. బీట్లుతప్ప మాట అర్థంకాదు. థమన్ సంగీతం అంటే ఇదేనేమో. ఛార్మి ఐటంసాంగ్ కూడా వేస్టే. శుభలేఖ..పాట రీమిక్స్, చిత్రీకరణ రెండూ అధ్వాన్నంగా వున్నాయి. రాంచరణ్ డ్యాన్స్‌లు ఇరగదీసాడు. ముఖ్యంగా లైలా ఓ లైలా పాటలో. మొత్తంమీద సినిమాలోని కథలో దమ్ములేకపోయినా బోలెడంత హాస్యం ఉంది.

'మీ వ్యూస్'కు
మీ అభిప్రాయాలను పంపవలసిన
మా చిరునామా : ఎడిటర్, వెన్నెల,
ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 500003

వెన్నెల ఆంధ్రభూమి IV
శుక్రవారం 15 ఫిబ్రవరి 2013

ఈపాట గుర్తుందా?

తెలుగుసినిమా అంటే మంచి పాటకు చిరునామా. పాటలు లేకుండా సినిమా చూడలేకపోవడం అన్న అభిరుచి ఇప్పటికీ అలాగే నిలిచివున్నా, సాహిత్యపు విలువలు మాత్రం నానాటికీ తీసికట్టవుతున్నాయి. కొత్త పాటలు బాగులేవని గొంతు చించుకోవడం కన్నా, పాత పాటల్లోని మాధుర్యాన్ని ఓసారి గుర్తు చేసుకోవడమే ఈ శీర్షిక ఉద్దేశం. పాఠకులు కూడా తమకు గుర్తున్న మంచి పాటలను కార్డుపై రాసి పంపించవచ్చు. బాగా పాపులర్ అయిన పాత పాటల కన్నా, మరిచిపోతున్న మంచిపాటలను గుర్తుచేయడం ముఖ్యం.

కుకు కుకు కుకు కుకు
కోకిలమ్మ పెళ్ళికి కోనంతా పందిరి
చిగురాకులు తోరణాలు చిరుగాలి సన్నాయి
డుడుం డుడుం డుడుం డుడుం
వసంతుడే పెళ్ళికొడుకు వనమంతా సందడి
పూలన్నీ తలంబ్రాలు పున్నమి తొలిరేయి

తుళ్ళి తుళ్ళి నిన్న మొన్న తునీగల్లె ఎగిరిన
పిల్లగాలి కొచ్చింది కళ.. పెళ్ళి కళ
తలపులన్నీ వలపులైన సోకులు విరిచూపులైన
పెళ్ళికొడుకు నవ్వితే తళ.. తళ తళ
పూలగాలితో రేగిన పుత్తడి పారాణిగా
చిలక పాట నెమలి ఆట కలిసి మేజువాణిగా
చిలక పాట నెమలి ఆట కలిసి మేజువాణిగా
అందమైన పెళ్ళికి అందరూ పేరంటాలే
అడవిలోని వాగులన్నీ ఆనందపు కెరటాలై

కుకు కుకు కుకు కుకు
కోకిలమ్మ పెళ్ళికి కోనంతా పందిరి
చిగురాకులు తోరణాలు చిరుగాలి సన్నాయి

కన్ను కన్ను కలుపుకున్న కన్నె మనసు తెలుసుకున్న
కనుల నీలి నీడలే కథ.ప్రేమకథ
బుగ్గలలో నిగ్గుతీసి సిగ్గులలో చిలకరించు
మొగ్గ వలపు విచ్చితే కథ.. పెళ్ళి కథ
ఇరు మనసులకొక తనువై ఇరు తనువులకొక మనువై
మనసులోని వలపులన్ని మల్లెల విరిపానుపులై
ఇరు మనసులకొక తనువై ఇరు తనువులకొక మనువై
మనసులోని వలపులన్ని మల్లెల విరిపానుపులై
కలిసి ఉన్న నూరేళ్ళు కలలుగన్న వెయ్యేళ్ళు
మూడుముళ్ళ వడినినాడు ఎదలు పూల పొదరిల్లు
కుకు కుకు కుకు కుకు
కోకిలమ్మ పెళ్ళికి కోనంతా పందిరి
చిగురాకులు తోరణాలు చిరుగాలి సన్నాయి
డుడుం డుడుం డుడుం డుడుం
వసంతుడే పెళ్ళికొడుకు వనమంతా సందడి
పూలన్నీ తలంబ్రాలు పున్నమి తొలిరేయి
కుకు కుకు కుకు కుకు
డుడుం డుడుం డుడుం డుడుం
కుకు కుకు కుకు కుకు
డుడుం డుడుం డుడుం డుడుం

ఈ పాట మీకు తెలుసా?
ఏ సినిమాలోది?
గీత రచయిత ఎవరు?
సంగీత దర్శకుడు ఎవరు?
మాకు తెలియచేయనక్కరలేదు..
మీరు గుర్తు చేసుకుంటే చాలు..
తెలియకుంటే, వివరాలు వచ్చేవారం ఇక్కడే.

గతవారం పాట

సినిమా : అండమాన్ అమ్మాయి
సంగీతం : కె.వి.మహదేవన్
రచన : ఆత్రేయ

కదిలించే హర్రర్!

2008లో స్పానిష్ భాషలో తీసిన 'మామా' అనే హర్రర్ లఘు చిత్రాన్ని పొడిగించి, అదే పేరుతో దర్శకుడు ఆండ్రెస్ మాచెట్టి తీసిన సరికొత్త చిత్రమే 'మామా'. వైవిధ్యంగా తీసిన 'అబ్‌నార్మల్ ఆక్టివిటీ, హౌస్ ఆఫ్ ది డెవిల్'లాంటి స్మాల్ బడ్జెట్ చిత్రాల కోవలోకి ఈ చిత్రం చేరిపోతుంది.

2008లో చెలరేగిన ఆర్థిక సంక్షోభంతో దివాలా తీసి పిచ్చెత్తిన జెఫ్రీ తన వ్యాపార భాగస్వాములను, తననుండి వెళ్ళిపోయిన భార్యను చంపి మూడేళ్ళ కూతురు విక్టోరియాను, ఏడాది పాప లిల్లీని తీసుకొని కారులో వేగంగా వెళుతుంటాడు. మంచుతో నిండిన రోడ్డుమీద వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి పక్కనున్న అడవిలోకి చెట్లను ఢీకొంటుంది. ఆ అడవిలో వున్న పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్ళి పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. చంపడానికి విక్టోరియా తలకు రివాల్వర్ ఆనించగా, ఒక నీడలాంటి అదృశ్య వ్యక్తి అతడ్ని బయటకు లాక్కెళ్ళి మెడ విరిచి చంపేస్తుంది. ఆ అదృశ్య వ్యక్తి పిల్లల్ని వేడికోసం ఫైర్ ప్లేస్ దగ్గర చేర్చి, తినడానికి చెర్రీ పండ్లను ఇచ్చి కాపాడుతుంది.

★★ మామా

తారాగణం:
జెస్సికా చాస్టెయిన్
నికొలాయ్ కోస్టర్ వాల్డా
మెగాన్ చార్ పెయింటర్
ఇసబెల్లా నెలిసా తదితరులు

ఎడిటింగ్: మైకెల్ కాన్‌రాయ్
ఫొటోగ్రఫీ: ఆంటోనియో రిస్ట్రా
దర్శకత్వం: ఆండ్రెస్ మాచెట్టి

అయిదేళ్ళ తర్వాత జెఫ్రీ తమ్ముడైన లుకాస్ ఆ పిల్లల్ని వెతికించగా, జంతువుల్లా ప్రవర్తించే ఆ పిల్లల్ని పట్టుకుని తీసుకువస్తారు. ఆ పిల్లలను డా.డ్రెఫస్ అనే సైకియాట్రిస్ట్ అజమాయిషీలో వుంచుతారు. ఆ పిల్లలువేసిన బొమ్మలను చూసి డా.డ్రెఫస్ 'మామా'అనే రహస్య వ్యక్తి పోషణలో వారు పెరిగారనీ, ఇప్పటికీ ఆమెతో మాట్లాడటం, ఆడలాడుకోవడం చేస్తుంటారని తెలుసుకుంటాడు. ఒక రాత్రి భార్యాభర్తలైన లుకాస్, అన్నాబెల్ శృంగారంలో వుండగా ఒక నీడలాంటి వ్యక్తి తలుపుదగ్గర కనబడటంతో భయపడి వెతకడం ప్రారంభించగా, మామా దాడి చేయగా లుకాస్ గాయపడి స్పృహతప్పి ఆసుపత్రి పాలవుతాడు. దాంతో అన్నాబెల్ ఆ పిల్లల సంరక్షణను స్వీకరిస్తుంది. తన ప్రేమతో విక్టోరియాకు చేరువ కాగలుగుతుంది. కాని లిల్లీ ఆమెను శత్రువుగానే చూస్తుంది. ఆమెకు వచ్చిన పీడ కలలు, 'మామా నీ పట్ల అసూయ పడుతుంది'అనే ఆత్మల హెచ్చరికతో డా.డ్రెఫస్ సహాయం కోరుతుంది.

మామా అని ఎవరూలేరనీ, అది విక్టోరియా ఏర్పరచుకున్న భ్రమ అని డ్రెఫస్ అనుకుంటాడు. కాని విక్టోరియాను హిప్నటైజ్ చేయగా తన కుమారుడి నుండి వేరుచేయబడిన దుఃఖిత తల్లి మామా అనీ, 19వ శతాబ్దంలో పిచ్చాసుపత్రిలో మగ్గిపోయిన ఎడిత్ ఆమేనే అని తెలుస్తుంది. దాంతో డ్రెఫస్ ఆ పిల్లవాడి తాలూకూ అవశేషాలను సేకరిస్తాడు. ఇటు మామా తాలూకూ గతం గురించి అన్నాబెల్‌కు పీడ కలలు వస్తుంటాయి. మామా నుండి పిల్లవాడ్ని వేరుచేసిన నన్స్ చేతిలో నుండి పిల్లవాడ్ని లాక్కొని, కొండ శిఖరంమీద నుండి దూకి ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. వాళ్ళు పైనుండి పడుతుండగా ఆ పిల్లవాడు జారిపోయి మొన తేలివున్న చెట్టు కొమ్మపై బడి చనిపోగా, మామా నీటిలో పడి చనిపోతుంది. ఆ పాప ఏమయిందో మామాకు తెలియకపోవడంతో, ఆ పాపకోసం వెతుకుతూ పాప బదులుగా విక్టోరియా, లిల్లీలను చేరదీసిందని అన్నాబెల్ గుర్తిస్తుంది. ఆసుపత్రిలో అపస్మారకంలో వున్న లుకాస్‌కు, జెఫ్రీ ఆత్మ కనిపించి అడవిలోని పాడుబడ్డ ఇంట్లోకి వెళ్ళి వెతకమని చెబుతుంది.

మామా గురించి పరిశోధించడానికి డా.డ్రెఫస్ అడవిలో వున్న పాడుబడ్డ ఇంట్లోకి వస్తాడు. ఆమె ఆత్మను ఫోటో తీయడానికి ప్రయత్నించగా, ఆమె విరుచుకుపడి చంపేస్తుంది. అతను కనిపించకపోవడంతో, అన్నాబెల్ అతని ఆఫీస్ వెతికి పిల్లల కేసుకు సంబంధించిన ఫైల్స్ ఎత్తుకొస్తుంది. అవి చూసి ఎడిత్, మామా ఒకరేనని తెలుసుకుంటుంది. లుకాస్ ఆస్పత్రినుండి వెతకడానికి అడవికి వస్తాడు. ఇంతలో పగబట్టిన మామా ఇంటిమీదకు దాడిచేసి అన్నాబెల్‌ను గాయపరిచి, పిల్లల యాంటీ జెన్ శరీరంలోకి ప్రవేశించి, పిల్లల్ని తీసుకుని పారిపోతుంది. స్పృహలోకొచ్చిన అన్నాబెల్, మామా పాపకు సంబంధించిన అవశేషాల బాక్స్‌ను తీసుకుని అడవిలోకి వస్తూ లుకాస్‌ను కలుసుకుంటుంది. ఈ దంపతులు వెతకగా కొండ శిఖరం మీద పిల్లలు, వాళ్ళ ఆత్మలను తీసుకుపోవడానికి వచ్చిన మామా కనిపిస్తారు. అన్నాబెల్ ఆ పాప అవశేషాలను చూపించగా ఆగ్రహంతో వున్న మామా శాంతించి, మానవాకారంలో కనిపించి దుఃఖిస్తుంది. లిల్లీ పిలుపుతో ఆగ్రహించిన మామా పిల్లల్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంది. లిల్లీ మామాతో వెళ్ళిపోవడానికి విక్టోరియాను పిలుస్తే వెళ్ళదు. మామా లిల్లీతో కలిసి కొండ శిఖరం మీద నుండి దూకుతుంది. గతంలో మాదిరిగానే వాళ్ళు మొనదేలిన చెట్టకొమ్మ మీద పడతారు. అంతే. వాళ్ళిద్దరూ సీతాకోక చిలుకల గుంపులా మారిపోతారు. కొండపైన లుకాస్, అన్నాబెల్ కౌగిట్లో వున్న విక్టోరియా చేతి మీద వాలిన సీతాకోక చిలుకను చూసి, అది లిల్లీయని గుర్తుపట్టడంతో సినిమా ముగుస్తుంది.

హర్రర్ సినిమా అంటే భయపెట్టడం, అరిచి కేకలుపెడుతూ పరుగెత్తడాలు, నరకడాలు, చంపడాలు లేకుండా రక్తాలు కురిపించి భీభత్సాలు చేయకుండా ప్రశాంతంగా, సున్నితంగా కథను డీల్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. పిల్లల్ని కేంద్రంగా చేసుకుని తీసిన హర్రర్ చిత్రాలలో జపాన్ చిత్రాలు పేరెన్నిక గలవి. ఈ సినిమా చూస్తుంటే 'గ్రడ్జ్, రింగ్' లాంటి సినిమాలు జ్ఞాపకం వస్తాయి. హర్రర్ సినిమాలను కూడా ఎంత కళాత్మకంగా తీయవచ్చో, ఈ సినిమా ద్వారా తెలుసుకోవచ్చు.

-అశోక్

పోలీస్‌స్టేషన్‌లో ఫాల్కే

భారతీయ చలనచిత్రానికి జరుగుతున్న నూరేళ్ల సంబరాల సందర్భంగా ముందుగా మన సినిమాకు ఆద్యుడైన దాదాసాహెబ్ ఫాల్కేకు స్మృత్యంజలి ఘటిద్దాం. ఆయన తన తొలి మూకీ కథాచిత్రం 'రాజా హరిశ్చంద్ర' తీయడానికి ఎదుర్కొన్న కష్టాల గురించి తెలుసుకుంటే, సినిమా అభిమానులెవరికైనా దిగ్భ్రమ కలుగుతుంది. ఉదాహరణకు- ఆ చిత్రంలో హరిశ్చంద్రుడు తన భార్య చంద్రమతికి శిరచ్ఛేదం చేసే సన్నివేశం ఒకటుంది. ఆ సీన్- అవుట్‌డోర్‌లో ఒకచోట చిత్రీకరిస్తున్నారు. అప్పుడు అటువైపుగా గస్తీకి వచ్చిన పోలీసులు అక్కడ హత్యాప్రయత్నం జరుగుతుందని అనుకుని, అక్కడున్న అందర్నీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వాళ్లపై కేసు నమోదుచేయడానికి సన్నాహాలు చేశారు. ''అది హత్యాప్రయత్నం కాదు.. షూటింగ్... మేం సినిమా తీస్తున్నాం మహాప్రభో'' అని తమ మేకప్పులవీ చూపించి, ఆ గెటప్పుల గురించి చెప్పి, సత్యహరిశ్చంద్రుడి కథను వాళ్లకు వివరించి, పోలీసు అధికారులను ఒప్పించేసరికి ఫాల్కేగారి తల ప్రాణం తోకకు వచ్చినంత పనైంది!

-బి.కె.ఈశ్వర్

చదువుకున్న అమ్మాయిలు

అన్నపూర్ణా పిక్చర్స్ నిర్మించిన ఐదవ చిత్రం చదువుకున్న అమ్మాయిలు. ఈ చిత్రం 1963వ సంవత్సరం ఏప్రిల్ 10న విడుదలైంది. డాక్టర్ శ్రీదేవి రాసిన 'కాలాతీత వ్యక్తులు' నవల నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావుకు బాగా నచ్చడంతో ఆ నవల ఆధారంగా చిత్రం నిర్మించాలని సంకల్పించారు. అయితే నవలలో కొన్ని మార్పులు చేయవలసిన అవసరం ఏర్పడి రచయిత్రిని పిలిపించి తన ఉద్దేశ్యాలను వివరించి సినిమాకు అనుగుణంగా స్క్రిప్టువర్క్ ప్రారంభించారు. కాని స్క్రిప్టువర్క్ పూర్తి కాకముందే రచయిత్రి శ్రీదేవి మరణించారు. మిగతా స్క్రిప్టువర్క్ ఎవరితో పూర్తిచేయించాలా అని ఆలోచనలోపడ్డ దుక్కిపాటికి రచయిత డా.దాశరధి ఇల్లిందల సరస్వతీదేవి, రమాదేవి పేర్లను సూచించారు. చదువుకున్న అమ్మాయిలు విద్యాభ్యాసంలో ఎదురయ్యే సమస్యలు. ఆ తర్వాత వైవాహిక జీవితాలలో ఎదురయ్యే సరికొత్త సమస్యలు ఆధారంగా ఏర్పడిన కథాంశం కాబట్టి బ్యాలన్స్ స్క్రిప్టువర్క్ ఎవరైనా రచయిత్రులతోనే రాయిస్తే బాగుంటుందనేది నిర్మాత అభీష్టం.

దాశరధి సూచించిన ఇరువురు రచయిత్రులతో కార్యరూపం దాల్చలేకపోవటంతో రచయిత త్రిపురనేని గోపీచంద్‌ను సంప్రదించారు దుక్కిపాటి. గోపీచంద్ సూచనపై స్క్రిప్టువర్క్ యద్దనపూడి సులోచనారాణితో రాయించాలని సంభాషణలు గోపీచంద్‌తో రాయించాలని సంకల్పించి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభించారు. అన్నపూర్ణా సంస్థ గతంలో నాలుగు చిత్రాలు మద్రాసులోనే నిర్మాణమయ్యాయి. ఈ చిత్రం ప్రారంభిద్దామన్న సమయంలో మద్రాసు వాహినీ స్టూడియోలో కార్మికులు సమ్మెకు దిగారు. సమ్మె పరిష్కారానికి దీర్ఘకాలం పట్టేలా వుందనుకొని హైదరాబాద్‌లో నిర్మిస్తే ఎలా వుంటుందన్న ఆలోచన కలిగింది. అప్పటి ప్రభుత్వ అధినేత కాసుబ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి తమ సహకారం అందిస్తామని భరోసాఇచ్చారు కాని నిర్మాణ వ్యయం మద్రాసులోకంటే అధికమయ్యేలా అనిపించినా గత్యంతరం లేక హైదరాబాద్‌లోనే నిర్మించాలన్న నిర్ణయించారు. నిర్మాణంలో పొదుపు పాటించాలన్న యూనిట్ నిర్ణయంతో ఈ చిత్రంలో ముఖ్య తారాగణం అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, కృష్ణకుమారి, ఇ.వి.సరోజ, ఇతర నటీనటులు కూడా హైదరాబాద్‌లోని సారధీ స్టూడియోలోనే బసచేసి నిర్మాతకు హోటల్ వ్యయం తగ్గించటంలో సహాయపడ్డారు. జర్నలిస్టు బి.ఏ.వి.శాండిల్య ఆధ్వర్యంలో అంతర్ కళాశాల పోటీలను నిర్వహించే సెవెన్ స్టార్స్ సిండికేట్ సాంస్కృతిక సంస్థ నిర్వహించిన ఇతర కార్యక్రమాలలోనూ అక్కినేని, సావిత్రి, దుక్కిపాటి, ఆదుర్తి సుబ్బారావులాంటి పెద్దలు పాల్గొనటంతో హైదరాబాద్‌లో సాంస్కృతిక వాతావరణం చిగురించింది. షూటింగ్ ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే సంభాషణల రచయిత గోపీచంద్ గుండెపోటుతో మరణించటంతో నిర్మాతకు మళ్ళీ కష్టాలు మొదలయ్యాయి. ఆత్రేయను సంప్రదిస్తే ప్రారంభ దశలోనే ఈ చిత్రానికి పనిచేసిన ఇద్దరు మరణించారు అన్న సెంటిమెంట్‌తో ఆత్రేయ సమ్మతించలేదు. ఇక గత్యంతరం లేక ఆ భారాన్ని నిర్మాత దర్శకుడు పంచుకొన్నారు. నటీనటులలో కూడా మార్పులు చేర్పులు జరిగాయి. మొదటగా సావిత్రిని అనుకొన్న పాత్రకు కృష్ణకుమారిని, కృష్ణకుమారిని అనుకున్న పాత్రకు సావిత్రిని నియమించారు. ఆ తర్వాత పాత్రలలో మార్పులు జరిగాయి. అక్కినేని సూచనమేరకు అప్పుడప్పుడే వర్ధమాన నటుడిగా వెలుగులోకి వస్తున్న శోభన్‌బాబును సావిత్రి భర్త పోలీస్ ఆఫీసర్ పాత్రకు బుక్‌చేసారు. ఇది శోభన్‌బాబు నటించిన పదవ చిత్రం. ఈ చిత్రం తరవాతనే శోభన్‌బాబు దశ తిరిగి వీరాభిమన్యులో టైటిల్ రోల్‌కు బుక్కయ్యారు.

సాంకేతిక విషయానికి వస్తే మద్రాసు మీద ఆధారపడకుండా రీరికార్డింగ్ మిక్సింగ్ సంగీత దర్శకుడు లోకల్ టాలెంట్ సహాయంతో నిర్వహించారు. మరాఠా గాయని ఆశాలత కులకర్ణి నేపథ్యగాయనిగా ఈ చిత్రం ద్వారా పరిచయం చేసారు. ఈ చిత్రంలోని పాటలలో దాశరధి రాసిన 'వినిపించని రాగాలే కనిపించని అందాలై..' అలాగే 'కిలకిల నవ్వులు చిలికినా.. పలుకును.. నాలో...' అలాగే ఆరుద్ర రాసిన 'ఆడవాళ్ళ కోపంలో అందముంటుంది' పాటలు సూపర్ హిట్ సాంగ్స్‌గా చెప్పుకోవచ్చు. ఈ చిత్రం కథా నిర్మాణంనుంచి షూటింగ్ పూర్తివరకు ఆటంకాలు ఎదుర్కొని విడుదలైంది. విడుదలైన కేంద్రాలలో నిర్మాతలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయారు. దానికి తోడు పద్మనాభం ఈ చిత్రంలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా నటించారు. ఇ.వి.సరోజ వెంటబడి వస్తూ వుంటే ఆమె కోపంతో కాలిచెప్పు తీసుకొని విసరగా పద్మనాభం మెడికల్ బ్యాగ్‌లో ఆ చెప్పును పెట్టుకుంటాడు. ఈ సీనును తమ వృత్తికి అవమానంగా భావించి రాష్ట్రంలోని మెడికల్ రిప్రజెంటేటివ్స్ కోర్టును ఆశ్రయించి, అలజడి సృష్టించారు. పాటల రచయిత దాశరధి బ్రహ్మచారులు నివసించే ప్రాంతం సీన్‌లో కన్పిస్తారు. మొత్తానికి అన్నపూర్ణా సంస్థ నిర్మించిన చిత్రాలలో నిర్మాణపరంగా అలాగే ప్రదర్శనపరంగానూ నిర్మాతలకు సంతృప్తి మిగల్చని చిత్రం చదువుకున్న అమ్మాయిలు.

-పర్చా శరత్‌కుమార్

ప్రియకి పెళ్ళి?

ఎట్టకేలకు - ప్రియాంక చోప్రా పెళ్లికూతురైంది. తండ్రి అస్వస్థత ఆమెని కృంగదీయటం.. మరోవైపు వేధిస్తున్న ఒంటరితనం ఆమెలో కలవరాన్ని పుట్టించాయిట (?). ఇక పెళ్లాడేసి జీవితంలోకి ఒక తోడుని ఆహ్వానించాలని నెమ్మదిగా 'హింట్' ఇవ్వటంతో ప్రియ మేనత్త ఆ భారాన్ని తనపై వేసుకొని సంబంధాలు చూట్టం మొదలుపెట్టింది. బాలీవుడ్‌లో నెం.1 స్థానానికి ఎదిగిన ప్రియకి వరుణ్ణి తేవటం అంటే మాటలా? ఏకంగా స్వయంవరమే జరగాలి. కానీ - అవేవీ లేకుండా ప్రియకి మంచి మొగుడు దొరికేశాట్ట. ఇంకెవరు? సాక్షాత్తూ ఆ పరమ శివుడే (?). 'మహాదేవి' సీరియల్‌లో పరమేశ్వరునిగా నటిస్తున్న మొహిత్ రైనా ఆ ఛాన్స్ కొట్టేశాడు. అతగాడు కూడా ఎన్నాళ్లుగానో సరైన జోడీ కోసం వెతుకుతున్నాట్ట. ఇంతలో ప్రియ మేనత్త కలగజేసుకొని 'ప్రియ' గురించి ప్రస్తావించటం.. పెళ్లిచూపులు గట్రా లేకుండానే సంబంధం ఖాయం చేసేసుకోవటం ఇట్టే జరిగిపోయాయి. ఐతే - ఇక్కడ ఇండస్ట్రీని ఒక సందేహం వెంటాడుతోంది. ప్రియకి మొగుడిగా ఏ వ్యాపారవేత్తో.. ప్రముఖ నటుడో వస్తాడనుకుంటే - ఈ బుల్లితెర కేరెక్టర్ ఎంటరవటం కాస్తంత ఇబ్బందిని కలిగించిందట. ప్రియాంక చోప్రాకి అతడు సరైన మ్యాచ్ కాదంటూ పరుష వాక్యాలు వచ్చాయి. అందుకే అంటారు? పెళ్లిళ్లు స్వర్గంలోనే నిర్ణయించబడతాయని. ఏమో?!

ట్రైయాంగిల్ డేటింగ్!

రణవీర్ సింగ్ - దీపికా పదుకొనె కొన్నాళ్లుగా ఎక్కడా కనిపించటం లేదట. ఈ 'మిస్సింగ్' తీగని కదిపితే డొంక దుబాయ్‌లో ఉన్నట్టు తేలింది. వీరిద్దరూ 'సీక్రెట్ డేటింగ్' చేస్తున్నట్టు భోగట్టా. సంజయ్ లీలా భన్సాలీ చిత్రం 'రామ్‌లీలా'లో మొట్టమొదటిసారిగా వీరిద్దరూ కలిసి నటిస్తున్నారు. దీంతో బాగా కెమిస్ట్రీ వర్కవుట్ అయి డేటింగ్ వరకూ వెళ్లి ఉంటుందన్నది తాజా సమాచారం. దీపిక దుబాయ్‌లో ఉంటే.. రణవీర్ తరచూ వెళ్లి వస్తున్నాట్ట. దీంతో కూపీ లాగితే దుబాయ్‌లోని ఓ నైట్‌క్లబ్‌లో వీళ్ళిద్దరూ దొరికారు. కానీ - ఒక్కటే సమస్య. ఈ సంగతి అనుష్క శర్మ (బాండ్ బాజా బారాత్‌లో వీరిద్దరి కెమిస్ట్రీ పండిందిట)కి తెలిస్తే పరిస్థితి ఏమిటన్నది. ఎందుకంటే - ఇప్పటి వరకూ రణవీర్ - అనుష్క డేటింగ్ వ్యవహారం పత్రికల వరకూ వచ్చింది. వాళ్లిద్దరూ కన్‌ఫర్మ్ కూడా చేశారా విషయాన్ని. మధ్యలో దీపిక రావటంతో ఈ ట్రైయాంగిల్ 'డేటింగ్' ఏ తీరానికి చేరుతుందన్నది ప్రశ్న.

ముంబై టాక్ -బిఎన్

మినహాయింపు?!

సెలబ్రిటీలంటే - సాక్షాత్తూ స్వర్గం నుంచీ దిగి వచ్చిన యక్షులే నన్నట్టు చూస్తారు. ఆ వ్యత్యాసాన్ని సెలబ్రిటీలు తరచూ చూపించటం కూడా తెలిసిందే. ఉండేందుకు ఫైవ్‌స్టార్ హోటల్ కావాలి. ఎక్కడికైనా సరే ఫ్లైట్ కావాలి.. ఇత్యాది సవాలక్ష కోరికల్తో నిర్మాతల్ని పీల్చి పిప్పి చేసేవారి శాతం తక్కువేం కాదు. కాకపోతే - ఈ వార్త వింటే ఎవరికైనా సందేహం రాక మానదు. ఎందుకంటే - అమీర్‌ఖాన్.. సంజయ్ దత్ 'టూ స్టార్' హోటల్‌లో స్టే చేయటం. రాజస్థాన్‌లోని ఒక కుగ్రామంలో రాజ్‌కుమార్ హిరానీ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ప్రతిరోజూ రాజస్థాన్ నుంచీ ఈ గ్రామాన్ని చేరుకోవటం కష్టం. ప్రయాణంలోనే చాలా సమయం వృధా అవుతుంది. దీంతో ఆ గ్రామానికి దగ్గర్లోని టూ స్టార్ హోటల్‌లో యూనిట్‌కి బస ఏర్పాటు చేశారు. ఇంకెవరి విషయంలోనో ఐతే పరిస్థితి వేరుగా ఉండేదేమో గానీ - అమీర్.. సంజయ్‌ల సంగతి ఇందుకు మినహాయింపు. వారిద్దరూ ఎంతో చక్కగా అడ్జస్ట్ అయిపోయార్ట. ఇంతకంటే నిర్మాతకి కావల్సిందేముంది? షూటింగ్ శరవేగంగా జరుగుతోందిట.

బాయ్‌ఫ్రెండేనా?

మొన్ననే బిపాసా బసు తన 34వ పుట్టినరోజు జరుపుకొంది. గోవాలో జరిగిన బర్త్‌డే ఫంక్షన్‌కి సన్నిహితులంతా విచ్చేశారు. ఎవరెవరు? అన్నది పక్కనబెడితే - ప్రియాంక చోప్రా మాజీ ప్రేమికుడు హర్మాన్ బవేజా ఈ ఫంక్షన్‌లో అటూ ఇటూ తిరుగుతూ హడావిడిగా కనిపించాట్ట. జాన్ అబ్రహాంతో తెగతెంపులు చేసుకొని ఒంటరితనాన్ని అనుభవిస్తున్న బిపాసాను హర్మాన్ ఓదారుస్తున్నట్టు వార్త. ఎంతో ఆర్భాటంగా జరిగిన ఈ ఫంక్షన్‌లో వీరిద్దరూ ఫొటోలకు తెగ పోజులిచ్చేశార్ట. మరో కడొస్తున్నాడు.. పక్కకి తప్పుకోమన్నట్టు - జాన్ అబ్రహాం.. షాహిద్ కపూర్.. రానా - ఇలాంటి 'మాజీ'ల సంఖ్య పెరగటంతో 'హర్మాన్' ఏ స్థాయి బాయ్‌ఫ్రెండో అర్థంకాక జనం ఇబ్బంది పడుతున్నార్ట. కాబట్టి - బిపాసా ఏదో ఒకటి చెప్పేస్తే సరి. లేకపోతే లేనిపోని టెన్షన్.

ఏ వర్సిటీ చూసినా..

ఇంతేనా?

స్టూడెంట్స్ లేదా స్టూడెంట్ లీడర్- ఓ స్టాఫ్ మెంబర్నో- ఓ అధ్యాపక వర్గ సభ్యుణ్నో పట్టుకుని నోరూ, చెయ్యీ చేసుకోడం, ఆపై లెక్చరర్లు, ఆఫీస్ సిబ్బంది 'పెన్ డౌన్' చేసెయ్యడం ఎక్కడా జరిగేదే. విద్యార్థి సంఘాలు, స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్- ఇదో ముక్కోణం. లోగుట్టు పెరుమాళ్లకెరుక! మహా రాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్- మరట్వాడా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ధనరాజ్ మానే ఆవేశంతో మాట్లాడుతూ, 'విద్యార్థి సంఘ నాయకుడు- నా అసిస్టెంట్‌పై, మరో ఆఫీసర్ పైన చెయ్యి చేసుకున్నాడు''- అన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు ప్రకాశ్ ఇంగ్లే- తానేమీ చెయ్యలేదని, రిజిస్ట్రార్‌గారే అలా కొట్టాడని అంటున్నాడు.

దీని వెనుక ఓ కథ వుంది. బి.ఎన్.కుర్తాడే గారని- బుద్ధిజమ్ శాఖలో- పాళీ భాషా శాఖ హెడ్'గారున్నాడు. ఆయన తన పుత్రికా రత్నం ఎం.ఏ. ఆన్సర్ షీట్‌లను కాస్త అటూ-ఇటూ మార్కులు వేసి సవరిస్తున్నాడన్నది ఆరోపణ. అదే బుద్ధిస్ట్‌గారు తన భార్యకి ఎం.ఫిల్. సంపాదించటంలో జోక్యం పెట్టుకున్నాడన్నది మరో ఆరోపణ. కుర్తాడేని సస్పెండ్ చేశారు. ఐతే, ఓ విద్యార్థి సంఘం పట్టుబట్టి అతణ్ని కాపాడింది.

అక్కడ మొదలైందీ ముసలం. వారేవా- వర్సిటీ!

ట్రౌజర్ల చట్టం పీడ వదిలింది..

ఫ్యాషన్లకు పెట్టింది పేరైన పారిస్ మహానగరంలో ఆడపిల్లలు మగాడిలా ట్రౌజర్లు, పంట్లాలూ ధరించాలంటే పోలీసుల అనుమతి వుండాలి. లేదంటే కేసులు తప్పవు. మగాళ్ల మాదిరి పొడుగు లాగులు ఆడాళ్లు ధరించరాదన్న నిషేధం ప్యారిస్‌లో 200 ఏళ్లుగా ఉంది. దీనిపై వనితా లోకం 'గుర్రు'మంటూనే వుంది. ఎలాంటి దుస్తులైనా ఓకే, కానీ- ప్యాంట్స్ మాత్రం 'నో' అంటూనే వున్నది చట్టం. 1892, 1909లో ఆ చట్టానికి మార్పులు చేశారు. ట్రౌజర్లు వేసుకోవాలంటే- అమ్మాయి సైకిలేనా ఎక్కాలి. లేదా గుఱ్ఱమయినా ఎక్కాలి. సైకిల్ రైడింగ్, గుఱ్ఱం స్వారీలు- అంతా అన్ని వేళలా చేయలేరు గదా! కాకపోతే- ఇటీవలే ఈ చట్టాన్ని గవర్నమెంట్ ఎత్తేసింది. ఇక సుదతీమణుల యిష్టం. పారిస్‌లో ఎన్నెన్ని కొత్త రకాల ప్యాంట్లూ, ట్రౌజర్లూ, జీన్స్ ప్యాంట్లూ కావాలన్నా ధరించి తిరుగాడవచ్చును. నవంబర్ 17, 1800 నుంచి అమలులో వున్న ఆంక్షలు ఎట్టకేలకు అటకెక్కేశాయ్!

veeraji@sify.com

చిట్కాలు

★ చర్మం కాంతివంతంగా ఉండాలని కోరుకునే వారు గంధం పొడిలో కాస్త తేనె, పాలు కలిపి ముఖం, మెడ, చేతులకు బాగా రాసుకుంటే ఫలితం కనిపిస్తుంది.

★ గంధంలో కొబ్బరి నూనె కలిపి, ఆ మిశ్రమాన్ని పాదాలకు బాగా మర్దనా చేసుకుంటే పగుళ్ల సమస్య దూరం అవుతుంది.

★ ఎండవేడి కారణంగా చర్మం కమిలిపోయినట్లు, నలుపుదనంతో ఉన్నట్లు అనిపిస్తే గంధం పొడిలో బొప్పాయి గుజ్జు, నిమ్మరసం, రోజ్ వాటర్ కలిపి శరీరానికి బాగా పట్టించాలి. అరగంట తర్వాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి.

★ గంధం పొడిలో కాస్త కొబ్బరి నూనె, బాదం నూనె కలిపి పేస్టులా చేసుకుని ముఖానికి 'ప్యాక్'లా వేసుకుని పావు గంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే చర్మం మంచి నిగారింపును సొంతం చేసుకుంటుంది.

★ గంధం పొడిలో కాస్త కర్పూరం, పసుపు కలిపి రాత్రి పడుకునే ముందు ముఖానికి బాగా పట్టించాలి. ఉదయాన్నే గోరు వెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

★ గంధపు చూర్ణంలో బాదం పొడి, కొబ్బరి నూనె కలిపి ముఖానికి తరచూ రాసుకుంటే మృదుత్వంతో పాటు చర్మం మిలమిల మెరుస్తుంది.

సవాళ్ల దారిలో..

ఆత్మరక్షణే ఆయుధం!

గడప దాటకూడదనే ఆంక్షలను అధిగమించి, విద్యావంతురాలైన నేటి మహిళ అన్ని రంగాలలో సమర్థవంతంగా విధులు నిర్వహించి 'భేష్' అనిపించుకుంటోంది. అయితే - ఆమె సమర్థతని మనస్ఫూర్తిగా మెచ్చుకునేది ఎందరు? కాలం ఎంత మారినా మహిళకు ఇంటా బయటా వివక్ష, హింస తప్పడం లేదు. దీంతో ఆత్మరక్షణ కోసం ఆమె ఆలోచించాల్సిన పరిస్థితులు తప్పడం లేదు.

ఒక ఉన్నత స్థానాన్ని మహిళ అధిరోహించిందంటే అందుకు మనస్ఫూర్తిగా ఆనందించి, అభినందించే వారికన్నా- ఆ స్థానాన్ని అందుకునేందుకు ఆమె ఎవరెవరిని ఆశ్రయించింది? ఎవరెవరికి ఏయే సేవలనందించింది? ఆ సహాయం చేసినవాడెవరో ఏమీ ప్రతిఫలం పొందకుండానే ఎందుకిస్తాడు? అంటూ నీచంగా విమర్శించేవారే ఎక్కువ. మరికొందరు ఆమె సామర్థ్యాన్ని, తెలివితేటల్ని మెచ్చుకోకపోగా అసభ్యంగా మాట్లాడుతూ లేనిపోని నిందలు మోపుతారు. ఇటువంటి వారిలో పురుషులను మాత్రమే అనవలసిన అవసరం లేదు. కొందరు సాటి స్త్రీలూ పాలుపంచుకుంటారు. కారణం ఒక్కటే- తాము సాధించలేని స్థానాన్ని మరొకరు సాధించారన్న అసూయ. అదే అటువంటి మాటలని, లేనిపోని నిందలని చేసే పాడు బుద్ధులని కొందరి మదిలో ప్రవేశపెడుతుంది.

నిజానికి ఆడవారికి పుట్టుక ముందు నుంచే కష్టాలు తప్పడం లేదు. తల్లి గర్భంలో అంకురంగా ఉన్నప్పుడే అంతం చేసే ప్రబుద్ధులు నానాటికీ ఎక్కువౌతున్నారు గానీ తగ్గుతున్న దాఖలాలు లేవు. అందుకు కారణం అమ్మాయి వేరొక ఇంటికి వెళ్తుంది కనుక ఆమెకు పుట్టిన దగ్గిరనుంచి ఖర్చుపెట్టడం దండగ కనుక మొదట్లోనే తుంచేస్తే సరిపోతుందనే దురాలోచన. ఇటువంటివారికి మరి తమలాగే అంతా ఆలోచించి మొదటే తుంచేస్తుంటే తమ కొడుక్కి భార్య ఎలా వస్తుంది? అనే ఆలోచన ఉండదు. ఎక్కడో పుట్టకపోతుందా? అనుకుంటారు. ఆ పరిస్థితి తమకు ఎదురైతే గాని తెలిసిరాదు.

ఓ తల్లికి కూతురు, కొడుకు వున్నా, కొడుకుని 'తిరక్కపోతే చెడతాడు' అనుకుంటూ విచ్చలవిడిగా వదిలెయ్యడం, కూతుర్ని అతి అమాయకంగా, అణకువగా వుండేలా పెంచడం చేస్తూంటారు. అమ్మాయికి మగవాడిని ఎదిరించి మాట్లాడే ధైర్యం కూడా లేకుండా పెంచుతారు. ఇప్పటికీ కొన్ని ఇళ్ళల్లో ఆడవారు మగవారు వస్తే తలుపు వెనక నిలబడి జవాబు చెప్పి పంపుతూంటారు. వారికి ఎదురుపడి మాట్లాడే ధైర్యం వుండదు.

దుర్మార్గులనుండి తమని తాము కాపాడుకునేందుకు పూర్వ కాలంలో ఆరంభమైన ఆ పద్ధతిని ఇప్పటికీ- మంచివాళ్ళు, మర్యాదస్తులు వచ్చినా అలాగే ఆచరిస్తున్నారు. అందుకు భిన్నంగా లోనికి పిలిచి కూర్చోపెట్టి మర్యాదగా మాట్లాడితే అటువంటి ఇళ్ళల్లోని వారు ''మగవాళ్ళకెదురుగా కూర్చుని సిగ్గు ఎగ్గు లేకుండా మగరాయుళ్ళా మాట్లాడుతోంది'' అంటూ ప్రచారం చేసేవారు కొందరైతే, లేనిపోని సంబంధాలు అంటకట్టి ప్రచారం సాగించేవారు ఇంకొందరు. ఇటువంటివారు ఈ కాలంలోనూ వుంటారా? అనుకుంటారు కొందరు సిటీల్లోనివారు. చాలా ప్రాంతాల్లో చాలా ఇళ్ళల్లో ఇప్పటికీ ఇలాగే జరుగుతోంది. అందుకు సందేహం, ఆశ్చర్యం అక్కర్లేదు.

ఇప్పటికీ ఎన్నో ఇళ్ళల్లో భార్యనిగాని, కూతుర్ని గాని అత్తవారింటికో, పుట్టింటికో వంటరిగా పంపడానికి వెనుకాడతారు. వారి వెంట వెళ్ళాల్సిందే ఎవరో ఒకరు. ఆ స్త్రీలూ అలాగే భయపడతారు. వారిని అని ప్రయోజనం లేదు. వారు పెరిగిన వాతావరణంలో, చుట్టూ వున్న మనుషుల మధ్య వారు ధైర్యంగా వుండలేరు. ఒంటరిగా వెళ్ళలేరు. ఇటువంటి అమాయకులని పసిగట్టి అల్లరిమూకలు ఎంతకైనా తెగించగలవు.

చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నవారికి కూడా ఇటువంటి దుండగులవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి కదా! అంటే ఆత్మస్థైర్యానికి బదులు, తల్లిదండ్రులు ''నువ్వు ఆడపిల్లవి. ఎవరితో ఎక్కువ స్నేహాలు పెట్టుకోకు, 'నీ చదువూ- నువ్వూ అన్నట్లుండు, ఇటూ అటూ దిక్కులు చూడకు'- అంటూ నీతి బోధలే ఎక్కువగా చేస్తూ పెంచుతారు. అలా పెరిగినవారికి ఎంత చదువులు చదివినా మనసులో భయం, బెరుకు పోవు. ఒక్కోసారి ఎదిరించాలని చూసినా సమయస్ఫూర్తి లేక ఓడిపోక తప్పదు.

అందుకే నేటి తల్లులు పిల్లల్ని చిన్నప్పటి నుంచీ మంచి భావాలు నూరిపోస్తూ మంచి కథలు చెప్తూ ఆత్మస్థైర్యాన్ని, ముందుచూపుని, సమయస్ఫూర్తిని అలవరచుకునే విధంగా పెంచాలి. మగ పిల్లవాడిని మహారాజులా కాక ఓ మంచి కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా పెంచగలగాలి. అందుకే చిన్నప్పటించీ రామాయణ, భారత, భాగవతాలు వినిపించి నీతిని బోధించాలి. ముప్పై, నలభై ఏళ్ళ క్రితం సుమతీ శతకం, వేమన శతకంలోని కొన్ని పద్యాలు పాఠ్య పుస్తకాలలో వుండేవి. అలాగే పెద్ద క్లాసులలోనూ, కళాశాల విద్యలోను రామాయణ, భారత భాగవతాది గ్రంథాలలోని ఒకటి, రెండు అధ్యాయాలు పాఠ్యాంశాలుగా వుండేవి. ఉదాహరణకి శ్రీకృష్ణరాయబారం, రుక్మిణీ కళ్యాణం, గజేంద్ర మోక్షం వగైరా ఎన్నో ముఖ్యమైనవి పాఠ్యాంశాలుగా వుండేవి.

అందుకే ఆనాటివారిలో తెలుగు భాష మీద అభిమానం, గౌరవంతోపాటు విద్యార్థులలో సత్ప్రవర్తన అలవడేది. వయసు ప్రభావంవల్ల అమ్మాయిలని చిలిపి మాటలు (సభ్యతగానే) అనే వారు తప్ప అసభ్యకరంగా మాట్లాడడం, అత్యాచారాలు జరిగేవి కావు.

ఆనాటి సినిమాలు కూడా మంచిని పెంచేవిగా వుండేవి. అసభ్యకరమైన పాటలు, మాటలు, ప్రవర్తనని రెచ్చగొట్టే విధంగా ఈనాటిలా వుండేవి కావు. అందుకే ఆనాడు ఎక్కడైనా ఎవరైనా ప్రేమించినా పెళ్లి చేసుకొని ఆ బంధానికి కట్టుబడి వుండేవారు గాని ఇప్పటిలా విచ్చలవిడిగా డేటింగ్‌లు, పబ్బులు, డ్యాన్సులు వంటివి లేవు. ఇవాళ పెళ్లి చేసుకుని, రేపు వదిలేసి మరొకరితో తిరగడాలూ లేవు.

ఈనాటి సినిమాలు, పాశ్చాత్య నాగరికతా ప్రభావం మన దేశ సంస్కృతీ సంప్రదాయాలని నానాటికి భ్రష్టుపట్టిస్తున్నాయనడం నిర్వివాదాంశం. మంచి కథాంశంతో సభ్యతగల మాటలతో, ప్రవర్తనలతో సభ్యత, సాంప్రదాయాలతో కూడిన వస్త్రధారణతో మంచి సందేశాన్నివ్వగల సినిమాలు మాత్రమే ప్రభుత్వ అనుమతిని పొందగలిగితే యువతరం ఇంతలా పేట్రేగిపోయే వారు కాదు. మద్యం, పబ్బులు, డేటింగ్‌లు వగైరాలను నిషేధిస్తే- అందుకు పాల్పడ్డవారిని కఠినంగా శిక్షిస్తే దేశం బాగుపడుతుంది. ప్రభుత్వాలు ఆదాయం వచ్చే దారులు చూస్తున్నాయి గానీ యువతరాన్ని మంచిదారుల్లో నడిపించే ఆలోచనలు, ప్రయత్నాలు లేవు.

సినీ అవార్డుల సభలంటూ- సినిమాల్లోకన్నా అధ్వాన్నంగా వస్త్రధారణతో అసభ్యపు డ్యాన్సులతో స్టేజ్‌మీద యువతరం గంతులేస్తుంటే అవి గొప్ప పాటలు, గొప్ప కొరియోగ్రఫీ, గొప్ప లిరిక్ (ఎంత అసభ్యంగా రాస్తే అంత గొప్ప) అంటూ మెచ్చుకుంటూ అవార్డులిస్తూండడం, అటువంటివారికి అభిమానులంటూ ఆడియన్స్‌లో విజిల్స్, కేరింతలు, యువతరం చెడిపోతున్నారనడానికి సినిమావారు ప్రోత్సాహాన్నందిస్తున్నారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? డబ్బే ముఖ్యమా? ఆ రచయితల, నిర్మాతల, దర్శకుల భార్యా పిల్లలు వీటిని చూసి ఆనందిస్తారా? వారూ ఆ కోవకి చెందినవారే అయితే ఆనందిస్తారేమో! సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నామనివారి మనస్సాక్షి వారికి చెప్పినా ఓ మొట్టికాయ వేసి అణగదొక్కుతారేమో డబ్బు యావలో పడి. ఇటువంటి దుర్మార్గపు, దుష్ట పరిస్థితుల్లో మహిళలు తమని తామే కాపాడుకునే ప్రయత్నం చేసుకోవాలి. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, సినిమాల్లోలాగా ఏ హీరోనో వచ్చి కాపాడుతాడని ఆశపవద్దు. ప్రభుత్వాలు కఠినంగా శిక్షించవు. ఆడవారిని రక్షించవు. కనుక అది జరిగే పని కాదు. మనని మనమే రక్షించుకోవాలి.

-ఆర్.ఎన్. హైమవతి

మనసు - మనువు

-దూరి వెంకటరావు



కట్టుకున్నవాడి చిటికినవేలు పట్టుకుని మెట్టినింటి గుమ్మం ముందు నిలబడింది శ్వేత. పేరుకు తగ్గట్టుగానే ఆ పిల్ల మనసూ స్వచ్ఛమైందే. కల్లాకపటం తెలియని మగువ.

హారతి పట్టి ఆత్మీయంగా లోపలకు ఆహ్వానించవలసిన వాళ్ళు ఆమడ దూరంలో ఆగిపోయారు.

శ్వేత హృదయం కలుక్కుమంది. తన రాక ఆ ఇంట్లో అందరికీ అప్రియమన్న సంకేతమందడంతో కన్నీటి పర్యంతమైంది.

దూరంగా నిలబడి చోద్యం చూస్తున్న చెల్లెలు సుశీల వంక ఎర్రగా చూశాడు వంశీ. సాటి ఆడపిల్ల అన్న సానుభూతైనా లేదా నీకు? అన్న అర్థం స్ఫురిస్తోందతడి కళ్ళల్లో.

శ్వేత తల్లి సత్యవతమ్మకి వారి ప్రవర్తన మింగుడు పడటం లేదు. అమ్మాయిని ఇష్టపడి చేసుకున్నారు. ఉన్నంతలో వాళ్ల కోరికల్ని తీర్చడం జరిగింది. మరెందుకీ అలకలు? ఇంకా దేని కోసం ఈ పెదవి విరుపులో బోధపడటం లేదు.

ఎవరి ప్రమేయం లేకుండానే ఇంట్లోకి అడుగుపెట్టారు వధూవరులు.

అత్తవారి నిరాదరణకు గురైన శ్వేత మౌనంగా రోదించింది. ఇంతకూ తను చేసిన తప్పేంటి? లోకంలో అందరిలాగే పెద్దల అంగీకారంతో వంశీ చేత తాళి కట్టించుకుంది. అయినవాళ్ళ ఆశీస్సులతో ఇల్లాలైంది. మరి తన పట్ల ఎందుకీ నిరసన? ఓ తియ్యటి పలకరింపు కోసం తహతహలాడుతోందామె మనసు.

మెట్టినింటివారి నిరాదరణకు గురై కంటనీరు నింపుకున్న కూతుర్ని చూడలేక వచ్చిన రోజే తిరుగు ప్రయాణానికి సిద్ధమైంది సత్యవతమ్మ. అయినా సరే, ఆవిణ్ణి ఉండమని ఎవరూ వత్తిడి చేయలేదు.

అత్తమామలు, ఆడపడుచు అంతా ఎవరి మానాన వారు తమ పనుల్లో లీనమైపోయారే తప్ప శ్వేతను పట్టించుకున్నవారెవరూ లేరక్కడ.

కన్నవారిని విడిచిపెట్టి వచ్చిన ఆడపిల్లకి అత్తవారింట్లో ఆదరణ కరువైతే అది నరకమే అవుతుంది. ఆ బాధ అనుభవించినవారికే అర్థమౌతుంది.

ఆ రాత్రి గదిలోకొచ్చిన శ్వేత తన వంక నిస్సహాయంగా చూసేసరికి చలించిపోయాడు వంశీ.

అర్ధాంగిని లాలనగా దగ్గరకు తీసుకుని ఆమె కళ్ళల్లోకి ఆర్తిగా చూస్తూ 'నువ్వేం దిగులు పడకు శ్వేతా, మా వాళ్ళ అభీష్టానికి వ్యతిరేకంగా నిన్ను చేసుకున్నందుకు వాళ్ళు తమ నిరసనను ఈ రకంగా వ్యక్తం చేస్తున్నారే తప్ప నీ మీద కోపంతో కాదు. నీ మంచితనంతో అందరి మనసుల్ని గెలుచుకోడానికి ప్రయత్నించు. అందుకు వ్యవధి అవసరమౌతుందేమో తప్ప- అది అసాధ్యం మాత్రం కాదు.'- ధైర్యం నూరిపోసాడు వంశీ.

మగడి మాటలతో శ్వేత మనసుకు రవంత ఊరట లభించింది.

తనకు ఎవరి సమస్యలతోనూ ప్రమేయం లేదన్నట్లు కాలం దాని పని అది చేసుకుపోతోంది.

కోడలు వంటగదిలోకి రానవసరం లేకుండా అన్ని పనులు తనే చేసుకుంటోంది వైదేహి.

ముకుందరావు కూడా ఆమె పట్ల ముభావంగా ఉంటున్నాడు.

సభ్యత కోసమైనా 'వదినా!' అని పలకరించలేదు సుశీల.

ఆ ఇంట్లో అంతా తనను వెలివేసారన్న భావన కలగడంతో శ్వేతకు ఏడుపొచ్చింది. అంతలోనే భర్త మాటలు స్ఫురణకు రావడంతో మొండి ధైర్యం తెచ్చుకుంది. అడిగినా, అడగకపోయినా ఎవరికి ఏం కావాలో తెలుసుకుని క్షణాల్లో అమర్చి పెట్టడం అలవాటు చేసుకుంది.

వదిన రాకతో సుశీలకు విరామం లభించింది. ఇల్లు ఊడ్చడం దగ్గరనుంచి అన్నీ పనులు శ్వేతే చేసుకుపోవడంవల్ల తనకు అసలు పనే లేకుండా పోయింది.

రోజులు దొర్లుతున్నాయి.

కోడలు పిల్ల అణకువ, మంచితనాన్ని గుర్తించారు ముకుందరావు దంపతులు. అయితే బెట్టు సడలించడమిష్టంలేక ఆమెతో అంటీ ముట్టనట్లే వ్యవహరించసాగారు.

వంశీ తన తమ్ముడి కూతుర్ని చేసుకోకపోవడంవల్లే అత్తయ్య తన పట్ల కినుక వహిస్తోందని తెలుసుకున్న శ్వేత మేనరికాన్ని కాదని తననే ఎందుకు చేసుకోవలసి వచ్చిందో చెప్పమని భర్తనడిగింది.

భార్య ఆరాటాన్ని గ్రహించి నోరు విప్పాడు వంశీ.

*****

వంశీ మేనమామ మహీధర్‌కి కొత్తవలసలో యాభై ఎకరాల పంట భూమితో పాటు పాతికెకరాల జీడిమామిడి తోటలున్నాయి. సిరిసంపదలకు కొదవలేదు. కావ్య ఒక్కగానొక్క కూతురవడంవల్ల అతి గారాబంగా పెరిగింది. క్షణాల మీద ఆ పిల్ల ఏం కోరితే అది తెచ్చిస్తాడు మహీధర్. అలా ఎంతో అల్లారుముద్దుగా పెరిగిన కావ్యకి వయసు తోపాటు అహం కూడా పెరిగింది.

ఇంటర్ పాసరైన కూతుర్ని పట్నం తీసికెళ్లి డిగ్రీ కాలేజీలో చేర్పించాడు మహీధర్. ఆమె ఉమెన్స్ హాస్టల్‌లో ఉండి చదువుకునేది. అక్కడ తన కిష్టమైన టీషర్టులు, జీన్ ప్యాంట్లు ధరించి తోటి విద్యార్థినుల ముందు తన ఆధిక్యతను చాటుకునేది. ఇరవై నాలుగు గంటలూ మొబైల్ ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని ఎవరెవరినో పలకరించేది. లింగ భేదం మరచి అందరితో రాసుకు పూసుకు తిరిగేది. అంతమాత్రాన తనని మరో రకంగా అనుకోడానికి లేదు. సొసైటీలో అందరితో క్లోజుగా మూవ్ అవడమే కల్చర్ అన్నది ఆమె భావన.

తల్లిదండ్రుల కోరిక మేరకు మొదట్లో వంశీ కావ్యనే పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అయితే ఆమె అభిరుచులు అతగాడికి నచ్చలేదు.

కావ్య మీద గల మమకారంతో ఆమె నడతను పట్టించుకునేవారు కాదు మహీధర్ దంపతులు.

ఆ పిల్ల తనకోడలైతే తమ్ముడి యావదాస్తి తనకే చెందుతుందన్న ఆశతో వంశీని పెళ్లికి ఒప్పించే ప్రయత్నం చేసింది వైదేహి.

ఇదిలా ఉండగా ఓ రోజు వంశీకి ఆ ఇంటి పురోహితుడైన పరమేశం ఒక సంబంధం తీసుకొచ్చాడు.

''మావాడికి కావ్యతో కల్యాణం జరిపించాలని మేం చూస్తుంటే ఆ సంబంధం, ఈ సంబంధం పట్టుకొస్తారెందుకు'' అంటూ మండిపడ్డాడు ముకుందం.

''నేను చెప్పిన పిల్ల ఎంతో గుణవంతురాలు. పైగా రూపవతి. డిగ్రీ వరకు చదువుకుంది. మన వంశీకి ఈడు-జోడు బావుంటుందని చెప్పాను. ఒక్కర్తే కూతురవడంవల్ల ముద్దు ముచ్చట తీరుస్తారు. తర్వాత మీ ఇష్టం'' అన్నాడు పరమేశం.

ఎలానూ వంశీ కావ్యని చేసుకోవడానికి ఇష్టపడటంలేదు. పరమేశం తను పట్టుకొచ్చిన సంబంధాన్ని తెగ పొగుడ్తున్నాడు. ఓసారి అమ్మాయిని చూస్తే ఏం పోయిందనిపించింది వైదేహికి. వాళ్ళు ఘనంగా పెళ్లి చేస్తానంటే మేనరికాన్ని వదులుకోవడంలో నష్టం ఏముంది? పైగా మేనరిక సంబంధాలు కలుపుకుంటే పుట్టబోయే పిల్లల్లో అవలక్షణాలు ఏర్పడతాయంటారు. కేవలం ఆస్తి కోసం అంత రిస్కు తీసుకోవడం కూడా మంచిది కాదనుకుని పెళ్లిచూపులకు ఏర్పాటు చేయమంది.

శ్వేతను చూసి చూడటంతోనే ఇష్టపడ్డాడు వంశీ.

అయితే ఆమె తండ్రి పెద్దగా కట్నకానుకలివ్వలేడని తెలిసి సంబంధం వదులుకోవాలనుకుంది వైదేహి. కొడుకు మాత్రం ఆ పిల్లనే తప్ప వేరెవ్వరిని చేసుకోనని భీష్మించుక్కూర్చోడంతో 'ఊ' కొట్టక తప్పింది కాదు.

అయిష్టంగానే వారిద్దరికి కల్యాణం జరిపించారు ముకుందరావు దంపతులు.

తన కూతుర్ని కాదని వైదేహి వంశీకి పై సంబంధం చేయడంతో మహీధర్‌కి అరికాలి మంట నెత్తికెక్కింది. మాటా మాటా అనుకోవడం వల్ల ఆ రెండు కుటుంబాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.

తన బిడ్డకి వంశీ కంటే గొప్ప సంబంధం చేసి వాళ్ళ కళ్ళు తెరిపించాలనుకున్నాడు మహీధర్. అంతే, ఆగమేఘాలమీద సంబంధం చూసి కావ్య 'వద్దు మొర్రో' అన్నా వినకుండా ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా బలవంతంగా కూతురి పెళ్లి జరిపించాడు.

*****

ఫోను మోగుతుంటే రిసీవరెత్తింది వైదేహి.

''నేను.. నీ తమ్ముణ్ణి..'' అన్నాడు మహీధర్.

ఉన్నట్టుండి తమ్ముడి గొంతు వినిపించేసరికి విస్తుపోయింది వైదేహి.

''ఇంతకాలానికి మేం మళ్ళీ గుర్తొచ్చామన్న మాట. ఫోనెందుకు చేసావో చెప్పు'' అంది నిష్ఠూరంగా.

''ఏం చెప్పమంటావ్. కావ్య చచ్చిపోయింది. నా బిడ్డ మనందర్నీ విడిచి వెళ్లిపోయింది. ఈ సంగతి మీకు చెప్పాలా? మానాలా? అనుకున్నాను. రక్త బంధం ఉండనివ్వడం లేదు'' అంటూ భోరున విలపించాడు మహీధర్.

''ఏంట్రా నువ్వంటున్నది?!... కావ్య చచ్చిపోవడమేంటి?... అసలేమైందిరా?'' కంగారుపడుతూ అడిగింది వైదేహి.

అంతలోనే ఫోన్ కట్ అయింది.

''ఎక్కడి నుంచి ఆ ఫోను'' అడిగాడు ముకుందం.

''మా తమ్ముడి దగ్గర నుంచి. కావ్య చచ్చిపోయిందట'' అతి కష్టంమీద అనగలిగింది వైదేహి.

''అదేంటి? మొన్నటిదాకా వాళ్ళంతా బావున్నారని విన్నాం. పిల్లకు పెళ్లి కూడా చేసాడు కదా! అంతలోనే ఇలా జరిగిందేంటి?'' విస్తుపోతూ అడిగాడు ముకుందం.

''వెళితేగానీ తెలీదు. పంతాలు పక్కన పెట్టి పదండి'' కళ్ళు వత్తుకుంటూ అంది వైదేహి.

ఇరువురూ కట్టుబట్టలతో ఆర్టీసీ కాంప్లెక్స్‌కి చేరుకున్నారు.

అనకాపల్లి బస్సు బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

ఆదరాబాదరా బస్సెక్కి కొత్తవలస చేరేటప్పటికి బాగా పొద్దుపోయింది. బస్సు దిగి మెల్లగా నడుచుకుంటూ మహీధర్ ఇంటికెళ్ళారు.

బయట లైటు లేదు. లోపల కూడా చిమ్మ చీకటిగా ఉంది.

తలుపు తోసుకుని 'తమ్ముడూ!' అంటూ లోపలకు అడుగుపెట్టింది వైదేహి.

భార్యననుసరించాడు ముకుందం.

వచ్చినవాళ్ళను చూసి బావురుమంది మరదలు మాణిక్యం.

గదిలో ఓ మూల కూర్చుని చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు మహీధర్.

తమ్ముణ్ణి ఆ స్థితిలో చూసిన వైదేహి చలించిపోయింది. ఆమె నోట మాట రావడం లేదు.

''ఇలా జరిగిందేమిటి బావా?'' అనునయంగా అడిగాడు ముకుందం మహీధర్ భుజం మీద చెయ్యి వేస్తూ.

''ఏం చెప్పమంటావ్? అంతా నా ఖర్మ!'' అంటూ నెత్తి బాదుకున్నాడు మహీధర్.

మరి నోరు పెగల్లేదు ముకుందానికి.

కాస్సేపటికి కళ్ళు తుడుచుకుని ''మీరు నా కూతుర్ని కాదన్నారన్న ఉక్రోషంతో దానికి మీ కంటే గొప్ప సంబంధం చేసి మీ అందరి కళ్ళు తెరిపించాలనుకున్నాను. అనుకోకుండా ఓ గొప్ప సంబంధం కుదిరింది. వరుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. తనకు ఆ పెళ్లి వద్దంది కావ్య. ప్రేమా దోమా.. అంటూ ఓ అనామకుణ్ణి చేసుకుంటానంది. దాని మాటలు వింటుంటే భగ భగ మండుతున్న నా హృదయం మీద బండెడు కర్రలు గుమ్మరించినట్లైంది. బలవంతంగా తన మెడలు వంచి తాళి కట్టించాను. పెళ్ళయ్యాక పరిస్థితులతో రాజీ పడకపోతుందా? అనుకున్నానే తప్ప ఇలా పురుగు మందు తాగి బలవంతంగా ప్రాణాలు తీసుకుంటుందని అనుకోలేదు. ఇది ఇంతకు తెగిస్తుందనుకుంటే అలా ఇష్టం లేని పెళ్లి చెయ్యకేపోదును'' అన్నాడు మహీధర్.

''ఎంత పని చేసావు బావా, ఏనాడూ కూతురి అభీష్టానికి వ్యతిరేకంగా నడవని నువ్వు తన పెళ్లి విషయంలో ఎందుకంత తొందరబడ్డావ్? మాట మాత్రంగానైనా మమ్మల్ని సంప్రదించి ఉంటే బావుండేది''.

''నిజమే నేను చేసింది తప్పే. నా దుందుడుకు చర్యవల్లే కావ్య చచ్చిపోయింది. కాదు, నా చేతులతో నేనే చంపేసాను. నా పాపానికి నిష్కృతి లేదు. నేనే కాదు నా కూతుర్ని కట్టుకున్నందుకు అల్లుడు కూడా ఆ పాపాన్ని అనుభవిస్తున్నాడు''.

మహీధర్ మాటలకు విస్మయంగా చూసారు ముకుందం దంపతులు. ''పిల్ల చావుకి అల్లుణ్ణి అనుమానించి వాడిని పోలీసులు లాక్కెళ్ళారు. అది ఆత్మహత్య చేసుకుందని చెప్పినా వినిపించుకోవడం లేదు. బెయిల్ మీద విడిపించినా దర్యాప్తు పేరుతో పోలీసులు అతణ్ణి వేధించుకుతింటున్నారు'' పశ్చాత్తాపంతో కొట్టుమిట్టాడుతున్నాడు మహీధర్.

వైదేహిలో అంతర్మథనం ఆరంభమైంది. లక్షలు తేలేదన్న కోపంతో లక్షణంగా వున్న కోడల్ని తాము లక్ష్యపెట్టకపోవడం దారుణమనిపించింది. కొడుకు అభీష్టానికి వ్యతిరేకంగా కావ్యని వాడికి కట్టబెట్టి ఉంటే ఇవాళ నా బిడ్డ గతి అంతే కదా! అనుకుంది. మనసులేని మనువు చెయ్యలేకే కావ్య ఇంతకు తెగించింది. పిల్లల మనసులు తెలుసుకోకుండా పెద్దరికం పేరుతో వాళ్ళకు ఇష్టంలేనివాళ్ళతో పెళ్ళిళ్లు జరిపిస్తే ఫలితాలు ఎంత దారుణంగా ఉంటాయో తెలిసొచ్చింది. ఇక నుంచైనా శ్వేత మనసుకు బాధ కలగనీయకూడదు. కొడుకు, కోడలు సంతోషంగా తమ కళ్ళ ముందు తిరుగుతూ ఉంటే అంతే చాలనుకుంది వైదేహి. ■

దూరి వెంకటరావు,
ఇంటి నెం. 25-10-30, కనకాంబ నిలయం,
దాసన్నపేట మెయిన్ రోడ్,విజయనగరం-2.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
శనివారం
16, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

అరమంగా స్ఫటభక్తి నాటకము భాషాంగ క్రియాంగాభిర
మ్యముగా జూపిన మెచ్చి నీవిల బలే యన్నంతకున్ యోగినే
హములన్ రూపులు నన్ను కొంచును న టుండై వచ్చి సంసార రం
గము లోనన్ బహురూప మాడు వెలయంగా జీవి సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! భక్తి అనే నాటకాన్ని వాగభినయంతో నూ, చేష్టాభినయం తోనూ ఎంతో రమణీయంగా చూడితే మెచ్చి నీవు బలే యనగా జీవి అనేక స్త్రీల గర్భాలలో జన్మిస్తూ నటుడుగా వచ్చి సంసారమనేరంగస్థలం మై అనేక వేషాలు వేస్తాడు. ఈ పద్యంలోని జీవి మాయామోహితుడు కాకపోవడం విశేషం. ఇతడు నాటక ప్రదర్శనంలోని నటుని లాంటి వాడు. సంసారాననే ఒక నాటకంగా భావించేవాడు. కనుక ఇతనికి కర్మబంధం లేదు. మళ్లీ మళ్లీ జన్మ ఎత్తినా సృష్టి రహస్యం తెలిసిన వాడు కావడం వల్ల శివుడు ఇతని వాగంగాభినయాలకు మెచ్చి బలే అంటున్నాడు. అది ప్రేరణగా తీసుకొని జన్మనెత్తడానికి అతడు భీతి చెందడం లేదు. సుకదుఃఖాదిక ద్వంద్వాలను తటస్థుడుగా చూడ గల్గిన మహాజీవి అన్న మాట ఇతడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

14 శ్రీ లత

''అయినా నా పాప తండ్రివరో తెలీదు?'' ఇవేమీ.. జరక్కుండా ఈ పాప నాకెలా పుట్టిందో..నాకు తెలీదు. ఐనా ఈ బిడ్డ నాది. నాది మాత్రమే.

పిచ్చెక్కినట్టుగా చూసింది నర్స్.

''తండ్రి సాక్ష్యం లేని బిడ్డ... గొణుక్కుంది నర్స్''

''ఎనీథింగ్ మోర్'' అగింది జీవన. ఇక నువ్వెళ్ళొచ్చు అన్నట్టుగా! వెళ్ళి ఫీజు కట్టి జీవనను రిలీవ్ చేసినా ఆమె టాక్సీ ఎక్కి గేటుదాటి వెళ్ళేవరకూ ఏదొక మూల నుంచి జీవనను చూస్తూనే ఉంది నర్స్. జీవన ముఖం ఆమె మనసులో ప్రింటయి పోయింది.

''నాకు పాప తండ్రి ఎవరో తెలీదు'' అనే జీవన సమాధానం నర్స్ మనసులో చాలా రోజులవరకు మారుమ్రోగుతూనే ఉంది'' షి ఈజ్ ఎ స్పెషల్! ఎంటైయిర్లీ డిఫరెంట్ ఉమెన్'' అని గుండెల మీద చెయ్యి వేసుకుని ఇంకో చేత్తో తన వెన్ను తానే పట్టుకుని చూసుకుంది.

''హా డేర్ షి ఈజ్..'' ఎంత ధైర్యం! ఒక ఆడది హత్య చేశానన్నా, దొంగతనం చేశానన్నా, పరిస్థితుల ప్రభావంవల్ల చెడిపోయానన్నా ఎప్పుడొకప్పుడు ఎవరో ఒకరు క్షమిస్తారేమో కానీ తన బిడ్డకు తండ్రివరో 'తెలీద'ని చెప్పిన స్త్రీని ఎవరైనా క్షమించగలరా? ఛస్తే క్షమించరు! మరి తనకెందుకు ఆమె మీద కోపం గానీ చులకనగానీ కలగలేదు?

ఎందుకంటే.... ఆమె ఆ విషయానికి సిగ్గు పడటం లేదు. భయపడటంలేదు. కంగారు పడటం లేదు. ఎంతో కాన్ఫిడెంట్‌గా తనకు తెలీని విషయం చెబుతూన్నట్టుగా సహజంగా, ఎంత సహజంగా అంటే కొమ్మమీద పాల పిట్టను పిలిచి పిట్టా పిట్టా గూటిలోని గుడ్డెవరికి పెట్టావే? అంటే తెలీదు అన్నంత సహజంగా! ఏవో కప్పిపుచ్చడాల్లాంటి కబుర్లు లేకుండా నిజాన్ని నిర్భయంగా చెబుతూ ఆ కళ్ళు ఇచ్చే ఎక్స్‌ప్రెషన్ నర్స్‌ను స్త్రీ విశ్వరూప సందర్శనం చేయించి సమ్మోహితపరచింది.

⁘

వసంత జీవన హాస్పిటల్ నుండి బయలుదేరి వెళ్లిపోయాక నలుగురు ఖరీదైన వ్యక్తులు ఆ హాస్పిటల్‌కువచ్చి. జీవన గురించీ వసంత గురించీ ఎంక్వయిరీ చేయడం... వాళ్ళు ఎక్కడికి వెళ్ళిందీ సరైన వివరం తెలియక నిరాశగా వెళ్ళిపోవడం గమనించింది హెడ్ నర్స్. కానీ ఆ వ్యక్తులు ఎవరో ఎందుకువచ్చారో.. వసంత.. జీవన.. పాప గురించిన వివరాలు ఎందుకు అడిగారో ఎంత ప్రయత్నించినా తెలుసుకోలేకపోయింది.

⁘

ఇంటికొచ్చాక... కాస్త కుదుటపడ్డాక జీవనతో పాపను వదిలివేయడం అనే విషయం చర్చకు తేవాలనుకుంది వసంత.

అందుకు తగిన సమయాన్ని ఎంచుకుని నిద్రపెట్టుకుని ఊపి నిద్రపుచ్చి... తలెత్తి చూసేసరికి వసంత తనవైపే చూస్తూండడం గమనించింది.

ఆమె మొహంలో ఏదో అసహనం!

జరగరానిదేదో జరుగుతున్నట్టు అయిష్టం.

స్తున్న జీవన ఎప్పుడూ నిద్రలేస్తుందా అని ఎదురు చూస్తూ కూర్చుంది. పాపను పెనవేసుకుని పడుకున్న జీవనను చూస్తుంటే ఏదో అలజడి వసంతలో రేగింది.

నిద్రలో కదిలిన పాపను.. తడుతూ జీవన లేచి పాపను ఒడిలోకి మలుచుకుని.. తొడమీద తల

ఆ అయిష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ లేచి జీవనను ఫ్లాస్క్‌లోని కాఫీ పోసి చేతికిచ్చింది. ఒడిలో నిద్రపోతున్న పాపను తీసి ఉయ్యాల్లో పడుకోబెట్టబోయింది.

''వుండనీ అమ్మా'' అంది జీవన మెత్తగా...

''వుండనీ, వుండనీ అంటే ప్రేమ పెంచుకుంటూ పోతే ఆ తర్వాత... విడిచి ఉండాలంటే కష్టమవుతుంది''

ఇప్పటిదాకా ఇరుగు పొరుగు పాపను గురించిన విషయం తెలీదు. ఎన్నాళ్లు దాచలేం మనమీ విషయాన్ని''

''విడిచి వుండటం ఎందుకు?'' అర్థం కానట్లుగా అడిగింది జీవన.

''విడవక ఏం చేస్తాం? పాపను పెంచుతావా? సమాజం అడిగే ప్రశ్నలకు ఏం చెబుతావు?'' కొంచెం గట్టిగానే అడిగింది.

''ఏమడుగుతుంది సమాజం?'' తల్లివైపు చూడకుండానే తాళం కప్పను అరచేతిపై గుండ్రంగా తిప్పుతూ అడిగింది.

''ఈ బిడ్డ ఎవరూ?'' అంటుంది.

''నా బిడ్డ అని చెబుతాను'' జీవన పటుత్వంగా సమాధానం చెప్పింది. అమ్మగా ఉండాలనుకుంటున్నాను.. తప్పా?

ఆవేశంతో ఉప్పెనలా దూకిన మాటలు వేగానికి అలసిపోయినట్లుగా ఆగి... వసంత వైపు జరిగి గడ్డం పట్టుకుని.. ''ఏమ్మా.. పాపను పెంచుకునే అర్హత, హక్కు నాకు లేవా'' అనడిగింది బేలగా...

అప్పటివరకూ పడిన ఉద్వేగం పాపమీద జీవనకు ఏర్పడిన ఆప్యాయతకు కొలమానంగా... పాపను విడిస్తే తను పడే ఆందోళనకు ఆదిపర్వంగా తోచింది వసంతకు. కానీ జీవన తన బిడ్డ కోసమే తను ఆలోచిస్తూంది కానీ.. తన గురించి కాదు. తన గురించి తల్లిగా... తల్లి ఆలోచించాలి.

అందుకే తనను తాను తమాయించుకోవడానికాదు... జీవననుకూడా సర్దుబాటుకు సిద్ధం చెయ్యాలనే తన సంకల్పం సడలనివ్వలేదు.

అన్నీ సమంజసమే. కానీ ప్రకృతిలోని జీవజాతులకూ... మానవులకూ భేదం ఉంది. అవే సాంఘిక జీవితం. సామాజిక కట్టుబాట్లు. ఇవి ఎవరో ఎవరి కోసమో నిర్ణయించినవి కావు. మనమే... మన కోసమే నిర్మించుకున్నాం.

అసలు తండ్రి లేకుండా బిడ్డను పెంచుకోవాలనే ఆలోచన ఎందుకు? బిడ్డకు తండ్రి లేకుండా చేయడమెందుకు?'' తండ్రివరో తెలియాల్సిన అవసరం, మిగిలిన జీవజాతులకు లేనట్లే మనిషికి కూడా లేకపోతే.. ఇక సాంఘిక జీవితం ఆటవిక వ్యవస్థకు గురై అస్తవ్యస్తమౌతుంది.. అవన్నీ తర్వాత.. అసలు విషయం... నువ్వు అతని పేరు ఎప్పడానికి ఎందుకు నిరాకరిస్తున్నావు? నిన్ను మోసం చేశాడనేమైనా ద్వేషిస్తున్నావా?'' అతనెవరో తెలిస్తే నిరీక్షించేందుకైనా అవకాశం దొరుకుతుంది కదా! మనసులో తర్జన భర్జన పడింది.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం 145

శ్రీపాద కృష్ణమూర్తి

శ్రీరాముడు మాల్యవంతము చేరుట

అనంతరం రామభద్రుడు తానూ, లక్ష్మణుడు మాల్యవంతం చేరుకొన్నారు. అక్కడ శ్రీరామచంద్రుడు కుసుమ కోమలి అయిన సీతాగుణాలు, ఆమె ప్రాణం, అతులిత రూప విలాసం తలపోస్తూ వారింపతరం కాని శోకార్తుడై వున్నాడు. అప్పుడు భూసుతను ఎడబాసి దుఃఖగ్రస్తుడయిన రామున్ని దుఃఖాలు పొదువుకొనే రీతిని దివిని రవిని ప్రకాశింపనీయక మేఘాలు కమ్ముకొన్నాయి.

రఘురాముడి వల్ల రావణుడి రాజ్యం ఈ గతి చలిస్తుందనే రీతిని విద్యున్నికాయాలు మేఘాల్లో వుండి చలింపసాగాయి. రవికుల రత్నం రావణాసురుడిపై దండెత్తి వెడుతున్నాడని దేవతలకి చెప్పుటకు ధాత్రి అరిగెనా అన వాయువులతో ధూళి నింగికి ఎగసింది. సమరాంగణంలో దైత్యుడు రామున్ని అణచివెయ్యమని యమధర్మరాజు తన కాలదండాన్ని రాముడికి ఒసగి పుత్తెంచాడా అన ఆకాశంలో ఇంద్రధనువు కనవచ్చింది. దేవతలు రామచంద్రుడికి సాయం ఒనర్చడం కోసం దండెత్తంగా భేరులు ఘోషించే విధంగా నింగి నిండా నిండి మేఘాలు భీకర ధ్వనులు చేస్తూ ఉరిమాయి.

ప్రాతృట్కాలం అనే పురుషుడు ఆకాశ లక్ష్మిని కూడా మెడలోని సరులు తెగి ముత్యాలు రాలిన కరణి తొలికారు చినుకులు పడ్డాయి. రామలక్ష్మణులు అనే జలదాలను కని దేవతలు అనే చాతకములు ఉప్పొంగిన విధంగా వినీల మేఘ పంక్తుల్ని కనుగొని నింగిని చాతక పక్షలు ఉబ్బదొడగాయి.

ధిమి ధిమి ధ్వనుల మద్దెలలుమ్రోగే పాటలు, దేవనదీమణులు నృత్యం ఆడే చందంగా మేఘుడు ఘుమ ఘుమధ్వనుల గర్జింప మయూరాలు పించాలు విప్పి క్రేంకారాలతో నాట్యం ఆడాయి. రాక్షసుల అంగాల పయిని రాముడి శరములు ఈ విధంగా గురిపెట్టబడతాయి అనే వైఖరిని పర్వతాగ్రాల మీద భీకర ఘోషలు వ్యాపించి అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. రావణుణ్ణి పరిమార్చేటపుడు రఘురాముడి మీద దేవతలు శరములు వూచి దివ్య పుష్పాలు ఈ విధంగా కురియిస్తారనేటట్టు అవనిపై వడగళ్లురాలాయి పంతం పట్టి ఆకాశ వాహినిలో స్నానమాడబోయిన నాగకన్యలు చని చని మరల పాతాళానికి తిరిగి వచ్చే పడిది వర్షాజలధారలు అందగించాయి. తమ కోసం అవ్వారిగా జలాలు సమర్పించిన 'ఘనుడి'ని వేనోళ్ల కొనియాడే మాదిరి మండూకాలు బెకబెకలాడజొచ్చాయి. కుండపోతగా వానలు కురిసాయి. ప్రావృట్కాలం లోకాలన్నిటా తన ప్రాభవాన్ని ప్రదర్శించింది.

క్రమక్రమంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశంలోని మేఘాలు అల్లనల్లన చెదరి, తొలగిపోయాయి. ఆదిత్య కిరణాలు సమస్త దిశలా వెలుగులు ప్రసరింపజేశాయి. రవి నిలిచి ప్రకాశింపజొచ్చాడు.

ధరణి నిష్కళంకమై తనరింది. కొలకుల తామరులు విచ్చుకొన్నాయి. పర్వతసానుతటాలని మదగజాలు కోరాడసాగాయి. రాత్రుల్లో నక్షత్ర కాంతులు పెంపొందాయి. చంద్రికా పేశల రశ్మిలో జగమంతా పాలతో ముంచెత్తినట్టు విలసిల్లింది.

సరోవరాలలో కాపురం వుండకోరి రాయంచలు ఏతెంచాయి. ఇంతలు తామర తూండ్లని మెచ్చుకొనదొడగారు. రాజనాల క్షేత్రాలు తామర తూండ్లని మెచ్చుకొనదొడగారు. రాజనాలక్షేత్రాలు, చెరకు తోటలు ఏపుగా పెరిగి, పండాయి. వృషభాలు ఖణిల్లని రంకె వేయమొదలుపెట్టాయి. నదీజలాలు పంకం తొలగి నిర్మలములయి తేటతేరాయి. పాంథులకి సాఖ్యం హెచ్చింది. ఆకసంలో తెల్లని మేఘాలు చరిస్తున్నాయి. నదుల్లో నీరు ఇంకసాగింది. ఇసుక తిప్పలు బయటపడసాగాయి.

ఆ రోజున హనుమంతుడు సుగ్రీవుడిని సమీపించి, వర్షాకాలం గడచి శరదాగమం అయింది. ఇంక రామకార్యం నెరవేర్చ పూనుకోవాలి. వారు, వీరు అనక వానరవీరుల నందరను రావించు'' అని గుర్తుచేశాడు.

-ఇంకాఉంది

శనివారం, 16 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ షష్ఠి ఉ.11.57
నక్షత్రం: అశ్విని ఉ.07.36
వర్జ్యం: సా.05.58 నుండి 07.42 వరకు
దుర్ముహూర్తం: ఉ.06.46 నుండి 08.18 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసివస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం బాధిస్తుంది. చిన్న విషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురి చేస్తుంది. పిల్లల పట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. ఔషధ సేవ అవసరం.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందుల నెదుర్కొంటారు. ఋణవిముక్తి లభిస్తుంది.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు. ధనలాభయగముంటుంది. అన్ని విషయాల్లో విజయాన్ని సాధిస్తారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
మానసికానందం లభిస్తుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. చెడు సహవాసంవైపు వెళ్లకుండా ఉంటే గౌరవం దక్కుతుంది. క్షణికావేశం పనికిరాదు.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు.

మంచిమాట

ప్రభాకర నమోస్తుతే

సూర్య భగవానుడు ప్రాణకోటికి ప్రత్యక్ష దైవం. కర్మసాక్షి. సమస్త జీవరాశికీ ప్రాణాధారమైన వెలుగును ప్రసాదించే తేజస్వి. కాల చక్రాన్ని తిప్పే విరాట్ పురుషుడు. సర్వజీవాళికి చైతన్యదాయకుడైన సూర్యుని ఆరాధించే పద్ధతి మన భారతీయ సంస్కృతిలో వేదకాలం నుంచీ ఆచారమై వస్తోంది. సూర్యారాధనకు ఇంత ప్రశస్తి ఉన్నందున సూర్యుడంటే ఎవరు? అనే ఓ ప్రశ్న ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. జలనిధికి సముద్రుడన్న పేరున్నట్లే వెలుగుల నిధికి సూర్యుడన్న పేరున్నది. జీవకోటికి ఈ రెండు నిధులూ అత్యవసరమైనవేనని వేరుగా చెప్పక్కర్లేదు. జలానికి జీవమని పేరు. నీరు లేక జీవితం లేదు. ఇకపోతే వెలుగు అఖిల విద్యలకూ మరో పేరు. 'విద్య' అంటే చదవటం, వ్రాయటం మాత్రమే కాదు. 'విద్య' అంటే జ్ఞానం అనే విశిష్టార్థం ఉంది. విశ్వ జ్ఞానం మనకు సూర్యుని వల్లే కల్గుతోంది. వెలుగు లేకపోతే అంతా అంధకారమే. చీకటి అజ్ఞానానికి, వెలుగు జ్ఞానానికీ ప్రతీకలు.

సూర్యుడికి మార్తాండుడు అనే మరో పేరుంది. మృతమైన బ్రహ్మాండాన్ని జీవింపజేయువాడుసూర్యుడు. ఇలా మృతమగు బ్రహ్మాండాన్ని జీవింపజేయునట్టి శక్తిగల సూర్యభగవానునికి జీవించియున్న మనిషి యొక్క ఆరోగ్యం కాపాటం పెద్ద శ్రమేమీ కాదు. ఈ కారణంగానే ''ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్''అంటారు. లోకంలో ఎవరే పని చేసినా, ఏ కాలంలో చేసినా గమనిస్తూ సాక్షిగా ఉంటాడు కనుక 'లోకసాక్షి' అని పిలుస్తారు. సూర్యుని కాంతి ప్రసారం లేని దినాన మన జీర్ణశక్తి మందగిస్తుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇలా జ్ఞాన; ఆరోగ్యాలకు ప్రధానుడైన సూర్యుని ఉపాసనకు మన దేశంలో విశిష్ట ప్రాధాన్యత ఉంది.

మకర సంక్రాంతినాడు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పటికీ సూర్యారాధనకు రథసప్తమియే ప్రశస్తమైన దినంగా భారతీయ ఋషులు నిర్ణయించి చెప్పారు. మాఘశుద్ధ సప్తమి రథ సప్తమి. ఇది సూర్య జయంతికి సంకేతం. మన్వాది విధిగా కూడా రథసప్తమికి సూర్య సంబంధం ఉండటం గమనార్హం. సూర్యునికి వివస్వంతుడనే పేరు కూడా ఉంది. వివస్వంతుని కుమారుడే వైవస్వతుడు. ఇతడు ఏడవ మనువు. అతని మన్వంతరానికి మొదటి తిథి రథసప్తమియే. ప్రస్తుతం జరుగుతూన్నది వైవస్వంత మన్వంతరమే. ఈ వైవస్వత మన్వాదియే భాగవతంలో సంవత్సరాదిగా పేర్కొనబడింది. దీనిని బట్టి ఒకప్పుడు మాఘ శుద్ధ సప్తమి ఉగాది (సంవత్సరాది) పండుగగా ఉండేదనటానికి ఎంతో ఆస్కారం ఉంది. ఉత్తరాయణ పుణ్యకాలంలో కూడిన మకర సంక్రాంతి సౌరమానానికి సంబంధించినదనీ, రథసప్తమి పర్వదినమేమో చంద్రమానానికి సంబంధించినదనీ పలు పురాణ వాఙ్మయాలు పల్కుతున్నాయి. సౌరపరంగా సప్తాశ్వుడైన సూర్యుడు చంద్రమానపరమైన రథసప్తమి తిథితో లంకె పెట్టుకొని సప్తవర్ణాలతో విరాజిల్లుతూంటాడు. శాస్త్రాలు కూడా సూర్య కిరణం ఏడు రంగుల సమ్మేళమని చెబుతున్నాయి. ఇందు ఒక్కొక్క రంగు ఒక్కొక్క రోగాన్ని హరించే దివ్య శక్తి సంయుతమై ఉంది. ఈ ఏడు కిరణాలను స్పందించునట్టి ఏడు నాడీ గ్రంథులు మన శరీరంలో ఉన్నాయి. దీనిని బట్టి ఒక్కొక్క రంగు ఒక్కొక్క కేంద్రాన్ని అదుపు చేస్తుందని అర్థం. ఎండలో కూచుని ప్రాణాయమం చేస్తే శరీరం ఎంతగానో చైతన్యవంతమవుతుందని చెప్పడం సత్యవిదితమే. మానవుడు తాను చేసిన ఏడు విధములైన పాపాలను బాపుకొనేందుకు రథసప్తమి రోజున సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి సూర్యుడికి ఇష్టమైన అర్కపత్రం (జిల్లేడు ఆకు) లేదా ఏడు చిక్కుడు ఆకులు, రేగు ఆకులు భుజంమీద, తలమీద పెట్టుకొని స్నానం చేస్తే ఏడు జన్మల పాపం కూడాపారి పోతుందనిఋషులు చెప్పారు.

ధనుర్మాసంలో పెట్టిన గొబ్బెమ్మల్తో చేసిన పిడకల్తో ఆవు పాలు పొంగించి, బియ్యం, బెల్లం వేసి పరమాణ్ణం తయారుచేసి సూర్యార్చనా అనంతరం నివేదించడం ఓ ఆచారంగా ఉంది. సూర్యుణ్ణి ఆరాధిస్తే కష్టాలు, దుఃఖాలు అధిగమించవచ్చునని ఆదిత్య హృదయం చెబుతోంది. ఆయన్ని ఆరాధించి ఆయురారోగ్యాలు పొందుదాం.

-ఎమ్.సి.శివశంకర శాస్త్రి

వృతాసురుడు 23

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 16

మాటాట

ఆధారాలు:
అడ్డం
1. అరటిపండే , హిందీలో తయారు చేయడం
3. చెప్పులు కుట్టే సూది
4. అన్న భార్య
8. పెద్దది కాదు
9. కోరిక
11. యుద్ధం
13. నడక
14. పడవలో సీతారామలక్ష్మణులను నదిదాటించినవాడు

నిలువు
2. పడవ
3. ఒట్టు
5. దెస
6.ఎక్కడం...నిచ్చెన
7.మంత్రి..
10. శివుని ఆజ్ఞలేనిదే కుట్టనిది
11. భార్య
12. వర్షము

మాటాట - 15 సమాధానం

1 అ			2 అ	3 ర్థా	చ	4 కిం
5 ర	క్ష	6 ము		జా		తు
ణం		7 శ్వ	ర్థం		8 కిం	డు
		ము		9 అ		
10 కం	టం		11 ఆ	ది		12 ద్ధ
డు		13 ర్జా		14 స్సే	ల	పు
15 కిం	టు	క	ము			డు

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

nudi@andhrabhoomi.net

నుడి

నిర్వహణ: **డా.సామల రమేష్‌బాబు** - ncharithra@gmail.com Cell: 9848016136

కుదురు మాటలు (క్రియాధాతువులు Verbal Bases)

చుట్టుముట్టు, చుట్టుకొను,
చుట్టవేయు = పరివేష్టించుట
చుఱుపుచ్ = కాల్చుట
చూచు = దర్శనము సేయుట
చూఁడు = కాల్చుట
చూపట్టు = అగపడుట
చూపెట్టుకొను, చూపట్టుకొను = ప్రతీక్షించుట, ఉపద్రవము రాకుండఁ జూచుచుండుట
చెక్కు = తక్షణము సేయుట, దోపుట, పయిపయి గాఁ ద్రవ్వుట, రత్నములు చెక్కెననియును
చెక్కుచెదురు = ఈషద్భంగమగుట
చెంగు = ఆట మొదలైన వానిలోఁ బరాభూతుఁడ గుట
చెంగలించు = ప్రకాశించుట
చెటాయించు(గ్రా) = విరోధమవుట
చెట్టవట్టు = వివాహమవుట
చెడు = కార్యవైకల్యమగుట
చెణకు, చెణుకు = స్పృశించుట
చెదరు, చెదురు = ఎగసి యంతటను బ్రసరించుట, దండు పరాభూతమగుట, కదలుట
చెందు = పొందుట
చెనయు = స్పృశించుట
చెప్పు = పలుకుట
చెమర్చు, చెమ్మటిలు, చెమ్మగించు = ఆర్ద్రమౌట
చెరువు = దోపుట
చెరుగు = చేటతోఁ దవుడు మొదలైనది విడఁజేయుట

-శ్రీ వేదం పట్టాభిరామ శాస్త్రి 200 ఏళ్ళ క్రితం రచించిన 'ఆంధ్ర ధాతుపాఠ / ధాతుమాల' నుంచి

11
ఆంధ్రభూమి
శనివారం
16, ఫిబ్రవరి
2013

ఉన్నత విద్య తెలుగులో ఉంటే ఉద్యోగాలు రావా?

ఈ సమస్యే భారతీయ భాషల ఉనికి పట్ల గొడ్డలి దెబ్బగా మారుతూ ఉంది. ఇతర దేశాలలో చాలా భాషల విషయంలో రాని ఈ పరిస్థితి మన భారతదేశంలోనే ఎందుకు వచ్చింది అనే ప్రశ్న మనం వేసుకోం. ప్రతిదానికీ ప్రపంచీకరణ జరిగిపోతూ ఉంది. ప్రపంచం అంతా ఒక చిన్న బుట్టలోనికి వచ్చింది. మనం ఎక్కడికి పడితే అక్కడికి పోవాలంటే ఏ దేశంలోనైనా ఉద్యోగం చెయ్యాలంటే తెలుగులో చదివితే ఏ ప్రయోజనం లేదు. ఇంగ్లీషు విద్య తప్ప నిసరి. ఇదీ ఈనాడు చిక్కుముడిగా నిలిచిన వాదం.

విద్యారంగాన్ని దాని తీరుతెన్నులను ఎవరు నిర్దేశిస్తున్నారు? ఇది ప్రభుత్వం చేతిలో ఉందా లేక ప్రైవేటు చేతిలో ఉందా లేక ప్రైవేటు పెట్టుబడిదారులు విద్యా రంగాన్ని శాసిస్తున్నారా?

ప్రైవేటు పెట్టుబడిదారులు వేరే వేరే వ్యాపారాలలోనికి పోకుండా విద్యా రంగంలోనికి ఎందుకు వస్తున్నారు?

ఇది తేలికగా సంపాదించుకోవడానికి వీలున్న రంగమా? ఇంజనీరింగ్ విద్య ప్రైవేటు హస్తగతం అయిన తర్వాత కుప్పకూలిన పరిస్థితికి కారణం ఎవరు ? డిగ్రీ విద్య బి.ఎస్.సి, బి.ఏ.,లు నామమాత్రావశిష్టంగా ఉండి బిటెక్ మయం అయిపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వాల విధానాలు ఎంత ముందుచూపుతో ఉన్నాయి?

ఈ ప్రశ్నలు అన్నింటికి సమాధానాన్ని వెదికే దిశలో విద్యా రంగ బుద్ధిజీవులు ఉంటే వీటికి సమాధానాలు దొరుకుతాయి. ఉన్నత విద్యలో దేశీయ భాషల మాధ్యమానికి ప్రోత్సాహం లభించడానికి కూడా ఈ సమాధానాలతో సంబంధం ఉంది.

తెలుగు గడ్డమీద ప్రభుత్వం నడవడానికి ప్రభుత్వేతర సంస్థలు అన్నింటిలోను పని నడవడానికి తప్పనిసరిగా కోట్ల కాకున్నా లక్షల సంఖ్యలో ఉద్యోగులు కావాలి. వీరు తెలుగులోనే పట్టం స్థాయి, స్నాతకోత్తర స్థాయి చదువులు చదువుకొని ఉద్యోగాలు చేయడం సాధ్యం కాదా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రూపు 1, గ్రూపు రెండు, మూడు, నాలుగు ఇలా ఇన్ని రకాల పరీక్షలు పెట్టి ఉద్యోగులను తీసుకుంటూ ఉంది. ఉద్యోగులను తయారుచేస్తూ ఉంది. ఇక్కడ పనిచేసే ఇన్ని లక్షలమందికి ఇక్కడే ఉద్యోగాలు వస్తున్నప్పుడు ఈ వ్యక్తులు అందరూ తెలుగులో డిగ్రీని ఇతర ఉన్నత విద్యలను చదువుకుంటే ఉద్యోగాలు రాకపోయే పరిస్థితి ఎందుకు ఉంటుంది. బిటెక్ చదువుకున్న ఎన్ని లక్షలమంది ఇక్కడ ఉద్యోగాలు పొందుతారో అంతమంది ఇక్కడ తెలుగు నేలపై ఉండి ఉద్యోగం చేసేటపుడు వారు చదివే బి.టెక్ అనేది తెలుగులో ఉంటే అతను చదువుకోవడంలో ఏమిటి ఇబ్బంది?

ఈ సంపూర్ణ వ్యాపార ధోరణిలో ఇంటర్ విద్యను తెలుగులో చెప్పవచ్చని ఎంసెట్ పరీక్షనూ పూర్తిగా తెలుగులో నిర్వహించవచ్చనీ, తర్వాత వైద్య విద్య చదివినా ఇంజనీరింగ్ విద్యనూ తెలుగులో చదివినా తెలుగు నేలలోనే ఎంతోమందికి అధిక సంఖ్యలో వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుందని ఈ వ్యాపార విద్యా సంస్థలు చెప్పవు అనలే చెప్పవు. కానీ వరుసగా వచ్చిన ప్రభుత్వాలలో కూడా విద్యా రంగంలో పనిచేసే బుద్ధిజీవులలో కూడా తెలుగు నేలలో ఉద్యోగాలు చేయడానికి తెలుగులో చదువు చాలు అని చెప్పే వ్యూహం విద్యార్థి ప్రపంచాన్ని నమ్మించగలిగే తెలివిడి కొరవడ్డాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు అన్ని భాషా ప్రాంతాలలోను ఈ వ్యాపార ధోరణి సాగుతూ ఉంది. విద్యా రంగాన్ని ప్రైవేటుపరం చేయడం దేశీయ భాషల ఉనికికి చావుదెబ్బగా మారే ప్రమాదాన్ని మనకు మనమే కొని తెచ్చుకుంటున్నాం.

తెలుగు రాని భాషాపరమైన మైనారిటీలు ఉంటే వారి వరకు ఇంగ్లీషు మాధ్యమాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వరాదా.

ముఖ్యంగా ఇంటర్ విద్య ప్రైవేటుపరం కావడం అనేది చాప కింది నీళ్ళలా జరిగిపోయింది. అప్పటిదాకా తెలుగు మాధ్యమంలో ఇంటర్ బోధన కొంత ఉండేది. ఎంసెట్ అనేది వచ్చిన తర్వాత ఈ పోటీ పరీక్షలకు విద్యార్థులను తయారుచేసే వ్యాపార సంస్థలు అవసరం అయినాయి.

వ్యాపారం చేసుకోవాలనుకునేవారికి ఇది కూడా మంచి రంగంగా అవకాశంగా కనిపించింది. పోటీ పరీక్షల్లో ఎంత మందికి సీట్లు తెప్పించాము అనేదే పెట్టుబడికి మొదటి మెట్టు. ఆదాయానికి అత్యధిక ప్రాధాన్యం ఉన్న అంశం.

ఈ మెట్టు అనేది రెండో దశకు దారి తీసింది. అదేమంటే ఇంటర్ స్థాయిలోనే మొదటి సంవత్సరం నుండే మెడిసిన్‌లోను, ఇంజనీరింగ్‌లోను సీటు వచ్చే దిశగా చదువు చెబుతాము అనే దిశగా సంస్థలు పెరిగాయి. దీనిలో పెట్టుబడి తారా స్థాయిలో పెట్టగలిగినవారికి తిరిగి రాబడి కూడా అంతే స్థాయిలో రావడం అనేది మంచి వ్యాపారానికి అవకాశం ఉన్న రిస్కులు అంతగాలేని రంగంగా కనిపించింది. క్రమంగా చిన్న చిన్న సంస్థలను వాటికన్నా పెద్ద పెద్ద సంస్థలు మింగేశాయి. ఇంటర్ విద్య క్రమంగా ఈ విధంగా ప్రైవేట్ పరం అయింది. పేరుకే ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ ఉంటుంది. కాని, విద్య అంతా ఈ సంస్థల చేతిలోనే ఉంది. పరీక్షలు ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఫలితాలు ప్రైవేటు సంస్థలకు వస్తాయి. తల్లిదండ్రులకు కావలసింది పిల్లల మార్కులు , తర్వాత వారికి సీట్లు రావడం. సంస్థలకు కావలసింది డబ్బులు.

ఈ సంపూర్ణ వ్యాపార ధోరణిలో ఇంటర్ విద్యను తెలుగులో చెప్పవచ్చని ఎంసెట్ పరీక్షనూ పూర్తిగా తెలుగులో నిర్వహించవచ్చనీ, తర్వాత వైద్య విద్య చదివినా ఇంజనీరింగ్ విద్యనూ తెలుగులో చదివినా తెలుగు నేలలోనే ఎంతోమందికి అధిక సంఖ్యలో వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుందని ఈ వ్యాపార విద్యా సంస్థలు చెప్పవు అసలే చెప్పవు. కానీ వరుసగా వచ్చిన ప్రభుత్వాలలో కూడా విద్యా రంగంలో పనిచేసే బుద్ధిజీవులలో కూడా తెలుగు నేలలో ఉద్యోగాలు చేయడానికి తెలుగులో చదువు చాలు అని చెప్పే వ్యూహం విద్యార్థి ప్రపంచాన్ని నమ్మించగలిగే తెలివిడి కొరవడ్డాయి.

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు అన్ని భాషా ప్రాంతాలలోను ఈ వ్యాపార ధోరణే సాగుతూ ఉంది. విద్య రంగాన్ని ప్రైవేటు పరం చేయడం దేశీయ భాషల ఉనికికి చావుదెబ్బగా మారే ప్రమాదాన్ని మనకు మనమే కొని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వాలు విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించే క్రమంలో ఉన్నాయి. ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించే దిశలోనూ ఉన్నాయి. 'దీనివల్ల ప్రమాణాలు పెరుగుతాయి, పోటీ పెరుగుతుంది' అనే వాదన ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకన్నా ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నాయి అనే వాదన కూడా ముందుకు వచ్చింది. కాని ఇది కొంతవరకే నిజం. కానీ కేవలం వ్యాపారం మాత్రమే చేసేవి అక్కడ కూడా చాలా ఉన్నాయి. అంతేకాదు ఐటీవల రెండు అమెరికా విశ్వవిద్యాలయాలు భారతీయ విద్యార్థులను ఎలా మోసం చేశాయో బాగా వెలుగులోనికి వచ్చింది. అవి రెండూ ప్రైవేటు విశ్వవిద్యాలయాలే. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు వ్యాపార దృష్ట్యా ప్రమాణాలు పాటించవచ్చు. కాని, అవి ఏ సబ్జెక్టులను చేపడతాయి. కేవలం ధనరూపంలో లాభాలు వచ్చే వాటినే చేపడతాయి. కాని ఫండ మెంటల్ సైన్స్ విషయంలో కాని మానవీయ శాస్త్రాల వైపు కాని సమాజ శాస్త్రాల వైపు కాని అవి చూడనన్నా చూడవు. వీటిని ఎవరు పట్టించుకోవాలి. ఇలా ఉన్నత విద్య ప్రైవేటు వ్యాపార రంగానికి పదిలివేయడం లాభనష్టాల దృష్ట్యా చూడడం జాతికి తీవ్రమైన నష్టాన్ని కలుగజేసే పరిణామం అవుతుంది అంతేకాదు. ఇది దేశీయ భాషల్లో శాస్త్రాలు అభివృద్ధి చెందడానికి కూడా పూర్తి అడ్డుకట్ట అవుతుంది.

జాతి నిర్మాణం చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుంది. జాతి నిర్మాణంలో పెట్టే అన్నింటికన్నా ముఖ్యమైన పెట్టుబడి జాతి పౌరులను ఉన్నత స్థితిలో విద్యావంతులను చేయడమే. ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల పెట్టుబడులకన్నా జాతి నిర్మాణం పైపుగా పెట్టే ఈ పెట్టుబడి చాలా ముఖ్యమైంది. ఈ నిజాన్ని ప్రైవేటు విద్యా సంస్థలు మాట్లాడవు. కాని సంక్షేమ రాజ్యంలో ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాలు జాతి నిర్మాణం చేసే దిశగా విద్యా రంగం ఉండాలనే పట్టుదల చూపాలి. ప్రభుత్వంలోని పాలకులకు ఈ దృష్టి లేకపోతే విద్యా రంగానికి చెందిన బుద్ధిజీవులు వారికి తెలిసేలా చేయాలి. దురదృష్టవశాత్తు ఈ రెండూ, అడుగులు వేయవలసిన దిశగా అడుగులు వేయడంలేదు.

- ఆచార్య పులికొండ సుబ్బాచారి
ద్రవిడ విద్యాలయం
9440493604

బాధ్యత తల్లితండ్రులదే

సమాజంలో పరిశోధకులు, మేధావులు చదువుకొన్నవాళ్ళు నాతో సహా సమాజంలో ఉన్న అందరికీ భాషను పరిరక్షించవలసిన బాధ్యత ఉంది. అందులోనూ తల్లిదండ్రులకు ఈ బాధ్యత మరీ ఎక్కువ. మన తల్లి భాషలో ఇతర భాషాపదాలు చేరితే భాష పరిపుష్టిని చెందుతుందంటారు. మన దగ్గర లేని పదాలు ఇతర భాష నుంచి తెచ్చుకొంటే తప్పులేదు కానీ మన భాష లోనే సరైన తెలుగు పదాలు ఉన్నప్పుడు ఇతర భాషలోని పదాలను వాడటం అనేది భాష కనుమరుగుపడంలోని మొదటి మెట్టు.

సాధారణంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం గురువుతో ఓం నమశ్శివాయః అని వ్రాయించే వారు. ఈ బీజాక్షరాలు వ్రాయించేటప్పుడు వారి మనస్సులో ఇవి నాటుకొని పోయేవి. మొట్టమొదటిసారిగా చేసే ఈ అభ్యాసాన్ని వాళ్లు మరిచిపోలేరు. కానీ నేటి ఆధునిక సమాజంలో పిల్లలకు ఏడాది దాటినప్పటినుండే ప్లే స్కూల్లో చేర్పించాలా, బేబి క్లాసులోనా, ఇంగ్లీషు నేర్పించే నర్సరీ స్కూల్లో అయితే వారి భవిష్యత్తుకు బాల్యం నుండే మంచి పునాది పడుతుందన్న తాపత్రయంతో స్కూళ్ల వేట కొనసాగించి రెండేళ్లు వచ్చేసరికి స్కూళ్ల ప్రవేశం కొరకు తర్ఫీదు మొదలుపెడ్తారు తల్లిదండ్రులు.

గోరుముద్దలు తినిపిస్తూ 'చందమామ రావే జాబిల్లి రావే' అన్న మాటలు మరచిపోయి 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' అనో, ఎ బి సిడిలను గుర్తించం, ఎ ఫర్ ఏపిల్ అనో బి ఫర్ బాల్ అనో వారి చిట్టి నోటితో పలికించడం కోసం నానా పాట్లు పడుతూ ఉంటారు. అలా అష్టకష్టాలు పడి తమ పిల్లలను ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో ప్రవేశానికి అర్హత సంపాదిస్తారు. ఇక అంతటితో చిన్నారులకు అసలు కష్టాలు మొదలవుతాయి.

నేటి ఆధునిక సమాజంలో మనం నిద్రలేచింది మొదలు ఉరుకులు పరుగులతో రోజు మొదలవుతుంది. ఎవరి పనులు వారివి. ఇంటిల్లిపాది మరలగూటికి చేరడం సాయంత్రం అవుతుంది. ఇంటిపనులు చక్కబెట్టుకొని, పిల్లలతో ఇంటిపాఠాలు చేయించి పడక ఎక్కుతారు. ఆ సమయంలో వారికి మనం కథలు చెప్పాలి. మన అవ్వ తాతలు, మన అమ్మా నాన్నలు మనకు ఒక వెయ్యి కథలైనా చెప్పి ఉంటారు. అందులో ఒక వందైనా మనకు ఇప్పుడు గుర్తుంటాయి. వాటిలో కొన్నింటినైనా మనం మన పిల్లలకు చెప్పాలి. దీని ప్రభావం ఉదయాన వారు దినసరి కార్యక్రమాలపై తప్పక ఉంటుంది. వారు ఆ కథలకు నాలుగు మాటలు చేర్చి తీరిక సమయాల్లో తమతోటి పిల్లలకు చెబుతారు. వారు వాళ్ల అమ్మమ్మనో నాయనమ్మనో తాతయ్యలనో అడిగి మరిన్ని కథలను చెప్పించుకొని తిరిగి వీరికి చెబుతారు.

పిల్లలు ఈ విధంగా తల్లి భాషలో మాట్లాడే పటుత్వాన్ని సాధిస్తారు. మన ఆచార వ్యవహారాలను తెలుసుకోగలుగుతారు. మనం ఎంతసేపు పిల్లల దగ్గర ఇంగ్లీషు రైమ్స్, ఇంగ్లీషు హిందీ భాషలలో రైమ్స్ చెప్పించుకోని మురిసిపోతూంటే, తెల్ల వాళ్ళు మన దగ్గర చందమామ కథలు, జానపద కథలు సేకరించి హారిపోర్టర్ లాంటి సినిమాలు నిర్మిస్తూ కోట్లను ఆర్జిస్తుంటే మనం నోళ్లను వెళ్ళబెట్టుకోని చూస్తూ ఉన్నాం. మన విద్యా విధానంలో ఇప్పుడు భారతీయ భాషలకంటే ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఎక్కువైంది. మనం నివశిస్తున్న ప్రాంతం ద్విభాష, త్రిభాష అయినప్పుడు పాఠశాలలో తెలుగు భాషను ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకోవడానికి విద్యార్థులు అంత ఆసక్తి చూపడంలేదు. తెలుగు కంటే సంస్కృతమో ఏ ఫ్రెంచ్ లాటిన్ భాషలో అభ్యసిస్తే పరీక్షల్లో ఎక్కువ మార్కులు వస్తాయనే భావంతో పరాయి భాషలను ఎన్నుకోడంలో మక్కువ చూపిస్తున్నారు.

ఒక దశలో విద్యార్థులు తెలుగును తీసుకోవడానికి మక్కువ చూపించినా తల్లిదండ్రులే ఎందుకొచ్చిన తెలుగురా అదేమన్నా కూడు పెడుతుందా నీడ ఇస్తుందా ఇతర భాషలను అభ్యసిస్తే భవిష్యత్తులో నువ్వు విదేశాలకు వెళ్లి బాగా సంపాదించుకొని రావచ్చు అని వారిని తెలుగుభాష పట్ల నిరాసక్తత ఏర్పడటానికి కారణభూతులవుతున్నారు. అందుకే ప్రభుత్వ పరంగా కొన్ని రాయితీలను ప్రకటించాలి. తెలుగును ఆప్షనల్ సబ్జెక్ట్‌గా స్వీకరించినవారికి వెయిటేజీ మార్కులను ఇతర సబ్జెక్టులకు సరిసమానంగా ఇవ్వాలి. ఈ విధంగా ప్రభుత్వ పరంగా కొన్ని చర్యలు తీసుకొన్నప్పటికీ తల్లి భాషను రక్షించవలసిన పూర్తి బాధ్యత తల్లి దండ్రులపైనే ఉంది.

సగిలి. సుధారాణి
9490428825

సొంత భాషతోనే ఏదైనా

పిల్లల చదువులో బోధనా భాషగా సొంత భాషను వాడాలా లేక ఇంగ్లీషును వాడాలా అనే దానిమీద వాదనలు, ప్రతివాదనలు చాలా కాలంగా జరుగుతున్నవే. తల్లి నుడిలోనే చదువు ఉండాలని ఒక వర్గం అంటుండగా, అక్కర్లేదు, మారుతున్న సామాజిక పరిస్థితుల్లో, అవసరాలకు తగ్గట్టు ఇంగ్లీషు మీడియంలో బోధన జరగాలని మరోవర్గం వాదిస్తుంది. భాషను కాపాడుకోవడం, స్వావలంబన, సంస్కృతి, మేధాతనం, వ్యక్తిత్వవికాసం లాంటి అంశాలు మొదటి వర్గానికి వాదనా వస్తువులు కాగా, ఉపాధి అవకాశాలు, మార్కెటింగు, గ్లోబలయిజేషను, ఆర్థిక అసమానతలు, కుల వివక్షత బాణాలు రెండో వర్గపు అమ్ముల పొదిలో ఉంటున్నాయి.

నిజం ఏమిటో తెలుసుకోవాలి అంటే ఆ అంశం మీద పరిశోధన జరగాలి. పరిశోధనల్లో తేలిన నిజం అనుభవంలో మరింత రుజువు అవుతుంది. సైన్సులో 'నిజా'నికి 'అభిప్రాయా'నికి మధ్య కచ్చితమయిన విభజన రేఖ ఉంటుంది. ఇక్కడ నిజం తెలియనంతవరకే అభిప్రాయానికి విలువ. 'ఇదీ నిజం' అని నిగ్గు తేలాక ఇక దాని మీద వాదనలు - తిరుగు వాదనలకు తావు ఉండదు. తెల్లటి కాంతిలో ఏడు రంగులు ఉంటాయి అనేది ప్రయోగ పూర్వకంగా తేల్చిన సత్యం. దీని మీద అభిప్రాయాలకు తావు లేదు.

తొలి చదువులు-32
-డా. పి.శ్రీనివాస తేజ
8500121314

శాస్త్రీయ అంశాలను ప్రస్తావించేటప్పుడు సాధారణ అంశాలను పరిశీలించినట్టు పైపైన తడిమితే సరిపోదు. తొలుత ప్రాథమిక పరిశీలన, ఆ తరువాత కొంత లోతు అవగాహనకు పోతూ పరిశోధనను తటస్థ దృష్టితో సాగించాలి. అప్పుడు కాని నిజం తేలదు. ముందుగా ఏర్పరచుకున్న ఇరుకు మనసుతో పరిశోధన మొదలుపెడితే ఆ పరిశోధన అంతా మన సులో ఉండే నమ్మకానికి అనుకూలంగా కట్టడి చేయడం మొదలవుతుంది. అప్పుడు వచ్చే ఫలితం నిజానికి దగ్గరగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కారణం ఏమిటి అంటే నిజం వేరు, నమ్మకం వేరు. నిజం నమ్మకంగా ఉండవచ్చు కానీ నమ్మకం నిజం కావాలని ఏమీ లేదు.

విద్యా విధానంపట్ల ప్రత్యేకించి బిడ్డలకు పునాదులు వేసే తొలి చదువుల్లో ఏ అంశాలను బోధించాలి అనే దానిపట్ల ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. ఇది ప్రాంతానికీ ప్రాంతానికీ, జాతికి జాతికీ మారుతూ ఉంటాయి. కానీ ఆ విద్యను పిల్లల్లో చొప్పించటానికి ఉపయోగించే బోధనా 'పద్ధతి'కి ఒక శాస్త్రీయ తీరు ఉంది. బిడ్డలకు తొలి చదువును ఏ భాషలో మొదలు పెట్టినా ఆ చెప్పే భాషమీద పట్టు ఉండాలి. తెలిసిన భాషలో పునాదులు వేసి దాని పునాదుల మీద ఎన్ని భాషలు అయినా, ఎన్ని శాస్త్రాలు అయినా నేర్పటం అనేది శాస్త్రీయ బోధనా పద్ధతి. తొలి చదువుల్లో స్వతహాగా అది అమ్మ భాషే అయి ఉంటుంది. అక్కడక్కడా తల్లి భాషే కాకుండా సమాజ భాష కూడా అయి ఉంటుంది. అయినా దీని కంటే తొలి పద్ధతే నూటికి నూరు పాళ్ళూ శాస్త్రీయం. రెండోది గుడ్డిలో మెల్ల. ఇది వేల కొద్ది పరిశోధనల్లో, అనుభవంలో తేలిన సత్యం. ప్రపంచం అంతా అనుసరిస్తున్న దారి. భాష మీద పట్టు లేకుండా చదివే బిడ్డలకు పుటుకతో వచ్చే తెలివి సామర్థ్యం, సృజనాత్మకత పాక్షికంగానే ఉపయోగంలోకి వస్తాయి అనేది కూడా అన్ని పరిశోధనలు తేల్చి చెప్పాయి. అగ్రవర్ణాల పిల్లలు ఆది నుంచి ఇంగ్లీషు మీడియంలో చదవటంవల్ల పైకి ఎగబాకుతున్నారు అనే వాదన ముందుకు తెచ్చి వారికిమల్లే దళితులకు కూడా ఎల్కేజీ నుండి ఇంగ్లీషు మీడియంలో చదువు చెప్పాలి అంటూ కొత్తగా కొద్దిమంది వాదన ముందుకు తెస్తున్నారు.

శాస్త్రీయ బోధనా పద్ధతులను కాదని తమ నమ్మకాలకు తగ్గట్టు బోధన ఉండాలి అనేది వీరి వాదన. ఇది మొండివాదన, పిడివాదన. మొండి వాదనకు కులం లేదా మతం సెంటిమెంటు జోడించి వాదనలు వినిపించటం వల్ల ఎదుటివారు ఎంత శాస్త్రీయంగా మాట్లాడినా అది సెంటిమెంటు సరి చెయ్యలేదు. ఈ సంగతిని ప్రభుత్వ బడుల్లో గత ఏడాది ప్రవేశపెట్టిన 'సక్సెసు' బడులు ఏ మేరకు సక్సెసు అయ్యాయో తెలుపకనే తెలిపాయి. అప్పటివరకూ తెలుగులో చదువుతున్న పిల్లల్ని ఆశ పెట్టి, టార్గెట్లు పెట్టి ఇంగ్లీషు మీడియంలోకి తోసిన పిల్లలు మూడు నెలలు లోపే దాదాపు తిరిగి తెలుగు మీడియంలోకి గోడకు కొట్టిన బంతిలా వెనక్కి వచ్చేసారు. మిగిలి ఉన్న ఆ కొద్ది పిల్లల భవిత రేపు జరిగే పదో తరగతి పరీక్షలు తేల్చనున్నాయి. కులం, డబ్బు, హోదా, తెలివి, ఖరీదు అయిన కార్పోరేటు విద్య, ఇలా అన్నిటి అంశాలలో అనుకూలంగా ఉన్న పిల్లలకే పరాయి భాషలో ప్రాథమిక విద్య పనికిరాదని పరిశోధనలు, అనుభవాలు తెలుపుతున్నాయి. కులం, సామాజిక వెనుకబాటు అనే కంతలో నుంచి శాస్త్రీయ బోధనా పద్ధతులను ఎగతాళి చేస్తున్నారు వారు ఆశించినట్టుగా నిజంగా దళిత ఎదుగుదల జరగాలి అంటే అందుకు తిరుగులేని ఆయుధం దళితులకు వారి సొంత భాషలో తొలి చదువులను మొదలుపెట్టడం. దాని ద్వారా మంచి ఇంగ్లీషు నేర్పటం. వీరి వాదన దళితులకు మేలు చేయక పోగా వారిని అత్యంత కీడులోకి నెట్టేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చాక కూడా వ్యవసాయం, చేతి పనులు, కుల వృత్తులలో ఉన్న పేద, దళిత, గిరిజన కుటుంబాల పిల్లలకు చదువు అందనిపండుగానే ఉండింది. అందుకు కారణం చదువుకొనే అవకాశాలు మెరుగుపడుతున్నప్పటికీ చదువులో భాష గుదిబండగా మారటం. అప్పట్లో ఒక పక్క ఇంగ్లీషు మీడియం, మరోవైపు తెలుగు పేరుతో గ్రాంథిక భాష రూపంలో ఉన్న సంస్కృత చదువులవల్ల ఈ వర్గాలకు చెందిన పిల్లలు బడి అంటే హడలిపోయి దాని వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉండింది. అంబేద్కరు పోరాట ఫలితంగా కలిపించిన రిజర్వేషను ఉద్యోగాలలోకి ఆయా వర్గాలను ఇముడ్చుకోవటానికి చదువుకున్నవారు దొరకని పరిస్థితులు ఆనాటివి.

గిడుగు రామ్మూర్తి లేవనెత్తిన 'వాడుక భాష ఉద్యమం' పుణ్యమా అని చదువులు దాదాపు వాడుక భాషలోకి దిగినాయి. అప్పటివరకూ చదువుకు దూరంగా ఉన్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల పిల్లలకే కాకుండా ఎగువ కులాలలోని నిరక్షరాస్య పిల్లలకు సయితం చదువు చేరువగా వచ్చింది. అంటే తల్లిదండ్రులకు చదువు లేకపోయినా పిల్లలు చదవటం అనేది చదువు వ్యవహారిక భాషలోకి దిగాక కానీ ఎక్కువ మొత్తంలో జరగలేదు. మరో మాటలో చెప్పాలి అంటే చదువు సొంత భాషలోకి వచ్చాకే ఆయా వర్గాల ప్రజలలో ఉద్యోగాలు అందుకొనే తొలి తరం తయారు అయింది.

దళితులతో సహా ఆయా సామాజిక వర్గాలలో తొలి తరంలో విద్యా, ఉద్యోగాలు పొందగలిగిన వారు ఎంతో కొంత సామాజిక మట్టును పెంచుకోగలిగారు. దీనివల్ల అప్పటి పేదలు, దళితులు వెనుకబడిన వర్గాలు, గిరిజనులలో వారి వారి స్థాయి మేరకు ఆర్థికంగా ఎదిగారు. అలా ఎదిగినవారు ఇప్పుడు తమ బిడ్డలకు ఇంకా మరింత మెరుగు అయిన విద్య, ఉపాధి కోసం ఎంత డబ్బు అయినా పెట్టి ఎగువ కులాలకు ధీటుగా చదువు చెప్పించటం కోసం కార్పోరేటు విద్య వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇపుడు దళితుల్లో ధనిక దళితులు, పేద దళితులు అనే రెండు వర్గాలు మనుగడలో ఉన్నాయి. ధనిక దళిత వర్గాల పిల్లలు ఇంగ్లీషు మీడియంలో ఎంతో కొంత రాణించటానికి కావాల్సిన కుటుంబ, ఆర్థిక వాతావరణ వెసులుబాటు ఉంటుంది. ఒక వేళ చదువులో రాణించకపోయినా ఆర్థిక స్థితికి ఢోకా లేదు కాబట్టి వారికి పోయేది ఏమీ లేదు. ఎటొచ్చీ పేద దళిత పిల్లలకే జరిగే నష్టం అంతా. ఈ ఇంగ్లీషుమాధ్యమమే చదవాలనే వాదనే కనుక అమలు అయ్యే పరిస్థితే వస్తే అది ఇప్పుడిప్పుడే చదువు బాట పడుతున్న తొలి తరం దళిత పిల్లలను పైకి రానీయకుండా మొగ్గలోనే తుంచటమే అవుతుంది. అయితే అది నేరుగా కాకుండా అందంగా కనిపించే ఇంగ్లీషు మీడియం గుదిబండను వారి మెడలో వేలాడదీయటం ద్వారా జరుగుతుంది.

అలనాడు సొంత భాషలో చదివి, రిజర్వేషను ఉపయోగించుకొని పైకి వచ్చిన ధనిక దళితుల పిల్లలకు పోటీ లేకుండా చేయటమే దళితులకు ఇంగ్లీషు మీడియం అనే వాదన. అంటే ఉన్న రిజర్వేషను కోటాలోనికి కొత్తగా వచ్చే పేద దళిత పిల్లలు రాకుండా అడ్డుకొనే కుట్రలో భాగమే దళితులకు ఇంగ్లీషు మీడియం వాదన. వారు గ్రహించాల్సింది ఏమిటి అంటే ఒక్క దళితులే కాదు. ధనికులు, ఎగువ కులాలు, వెనుకబడిన తరగతులు ఎవరు అయినా సరే తమ బిడ్డలకు పుట్టుకతో వచ్చిన తెలివితేటలు మొత్తం బయటికి వెలికి రావాలి అంటే అది తొలి చదువులు సొంత భాష ద్వారా జరిగినపుడే వీలు అవుతుంది.

(పూర్తి అయింది)

తెలుగులో 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థిని!

చాలామంది తెలుగులో మార్కులు ఎక్కువ రావనీ, తెలుగు అధ్యాపకులు తక్కువ మార్కులు వేస్తారనీ ఒక అపోహ ఉంది. హైదరాబాద్‌లో ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో కుమారి రావుల మంజుల అనే విద్యార్థిని బి.కాం (కంప్యూటర్) చదువుతోంది. ఈమెకు తెలుగంటే వల్లమాలిన మక్కువ. రోజుకి రెండు గంటలు తప్పకుండా తెలుగు చదువుతుంది. బి.కాం రెండో సంవత్సరంలో నూటికి నూరు మార్కులు సంపాదించిన మంజుల ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అగ్రశ్రేణిలో నిలిచింది. ఈమె పుట్టిన ఊరు ఇబ్రహీంపట్నం మండలంలో గల రాయపోల్ గ్రామం. ఈమె నాన్న నర్సింహా గొర్రెల కాపరి. మంజుల అమ్మ కూలి పనులు చేస్తుంది. మంజుల ఇంటి పనుల్లో కూడా సాయం చేస్తుంది. మంజుల బి.ఇడి చదివి ఉపాధ్యాయురాలు అవ్వాలని ఆశయంగా చెప్పింది. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే మార్కులు బాగా వస్తాయనో, సంస్కృతం తీసుకొంటే మార్కులు బాగా వస్తాయనో అనుకొనేవారికి- అది సరికాదంటోంది 'తెలుగు వెలుగు' కుమారి రావుల మంజుల.

రావుల మంజుల

-ద్వానా.

అమ్మ భాష

తే.గీ. శ్రీకరమగు తెలుగు సిరుల భాష
తరతరాల చరిత్ర వున్న తల్లి భాష
వేనయేండ్ల నుడుల వెలయు భాష
కమ్మనైన తెలుగు మన అమ్మ భాష

తే.గీ. ద్రావిడ నుడులందు తొలుత దక్ష భాష
విన 'ఇటాలియన్ ఈస్టు'గా అనిన భాష
అందచందాల పదముల అలరు భాష
కమ్మనైన తెలుగు మన అమ్మ భాష

తే.గీ. శాతవాహన రాజుల శౌర్య భాష
వేంగి చాళుక్య చోళుల విజయ భాష
కాకతీయుల ఘనకీర్తి గనిన భాష
కమ్మనైన తెలుగు మన అమ్మ భాష

తే.గీ

sisindri@andhrabhoomi.net

సిసింద్రి

12

ఆంధ్రభూమి

శనివారం
16, ఫిబ్రవరి
2013

సంగీతంతో పిల్లలకు మేలు

బడి ఈడు పిల్లలు సంగీతంపై మక్కువ చూపితే వారి మెదడు చురుగ్గా పనిచేస్తుందని మానసిక వైద్య నిపుణులు తాజా అధ్యయనంలో తేల్చారు. ఏడేళ్ల వయసు లోపు పిల్లలు సంగీతం వినేందుకు, నేర్చుకునేందుకు ఆసక్తి చూపితే వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలని కెనడాలోని కాంకోర్డియా విశ్వవిద్యాలయం మానసిక శాస్త్ర అధ్యాపకుడు ప్రొఫెసర్ వర్జీనియా పెన్హునె, మెక్‌గిల్ విశ్వవిద్యాలయానికి చెందిన రాబర్ట్ జె. జటోర్ అంటున్నారు. ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయసు అత్యంత సున్నితమైనదని, ఈ కాలంలో పలు ప్రభావాలకు లోనై మెదడులోని వ్యవస్థ ఒక రూపు దిద్దుకుంటుందని వారు గుర్తించారు. సంగీత పరికరాన్ని వాడాలంటే చేతులకు, కళ్లకు చక్కని సమన్వయం కుదరాలని, ఇది మెదడు పనితీరు వల్లే ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏడేళ్లలోపు పిల్లలు సంగీత సాధన చేస్తే ఆ ప్రభావం మెదడులోని సున్నిత భాగాలపై పడుతుంది. ఆరోగ్యకరమైన రీతిలో మెదడు ఎదిగేందుకు సంగీతం చక్కగా దోహద పడుతుంది.

దొంగ కథ

విజయపురి రాజ్యంలో అధికారులు అవినీతిపరులయ్యారు. కొలువులో చేరాలని వచ్చినవారి ప్రతిభా పాటవాలు కాక, ఎవరు లంచం ఇస్తే వారికే ఉద్యోగాలు ఇవ్వసాగారు. కొందరు యువకులు రాజు దృష్టికి ఈ విషయం తీసుకెళ్ళడానికి ప్రయత్నించి విఫలులయ్యారు.

తిమ్మరాజు అనే యువకుడు అధికారుల వైఖరితో విసిగిపోయాడు. తండ్రి కూడా చనిపోవడంతో తిండికి కటకటలాడాడు. రాజు మీద కోపం వచ్చింది. ఇక తాను దొంగగా మారడం తప్ప గత్యంతరం లేదనే నిర్ణయానికి వచ్చాడు. అయితే చిన్నచిన్న దొంగతనాలుచేస్తే లాభం లేదు. అంతఃపురంలో రాణుల బంగారు నగలు కుప్పలు గా వుంటాయి. ఒక్కసారి తెగించి వాటిని దోచుకుంటే హాయిగా జీవితం గడిచిపోతుందని ఆలోచించాడు.

అది వేసవికాలం. అమావాస్య రోజు. రాత్రి పది గంటల వేళ అంతా భోజనాలు చేసి నిద్రపోయే సమయం. తిమ్మరాజు అంతఃపురం గోడ ఎక్కి లోపలకు ఒక తాడు సహాయంతో దిగాడు. గోడ పక్కన చాలా పెద్దపెద్ద మొక్కలు గుబురుగా వుండడంతో లోపలి దృశ్యం చూడలేకపోయాడు. ఆ సమయంలో తోటలో ఎవరూ వుండరని అనుకున్నాడు. కానీ యువరాణి తన చెలికత్తెలతో కొలనులో జలకాలాడుతున్నది. వేసవి తాపం చల్లార్చుకోవడానికి చెలికత్తెలతో నీళ్ళలో ఆడుకుంటున్నది. కొందరు చెలికత్తెలు కొలనుచుట్టూ కాగడాలు పట్టుకుని వెలుగు చూపిస్తున్నారు.

తిమ్మరాజు పొదలలోనుంచి బైటకువచ్చాడు. కొలనులో జలకాలాడుతున్న యువరాణి, చెలికత్తెలు అతన్ని చూసి హడలిపోయారు. భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఈ హఠాత్ సంఘటనతో తిమ్మరాజు భయపడిపోయి, తాడుపట్టుకుని గోడ ఎక్కి పారిపోయాడు.

అంతఃపురం ఆవరణలోకి దొంగ ప్రవేశించాడనే సమాచారం తెలుసుకున్న రక్షక భటులు వచ్చి ఆ ప్రదేశమంతా గాలించారు.

దొంగ దొరక్కపోవడంతో మహారాజు విజయవర్మ ఆగ్రహించాడు. ఒక సామాన్యమైన దొంగ కోట గోడ ఎక్కి అంతఃపురంలోకి ప్రవేశించడం ఏమిటి? రక్షణ వ్యవస్థ ఏం చేస్తున్నది?-అని అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేశాడు. లంచాలు ఇచ్చి ఉద్యోగంలో చేరిన రక్షక భటులకు అంత సామర్థ్యం లేదని రాజు గ్రహించలేదు.

అంతఃపురంలోకి ప్రవేశించిన వాడిని పట్టుకోకపోతే తమ పరువుపోతుందని భావించిన అధికారులు, దొంగని ఎలాగైనా బంధించి రాజు ముందు ప్రవేశపెట్టి తమ సామర్థ్యం నిరూపించుకోవాలని అనుకున్నారు.

రాజ్యంలో వున్న అనుమానితులైన యువకులను, లోగడ చిల్లర దొంగతనాలు చేసి శిక్ష అనుభవించి వచ్చిన దొంగలను పిలిపించి చెలి

కత్తెల ముందు నిలబెట్టడం మొదలుపెట్టారు. ఎవరైనా దొంగని గుర్తిస్తారేమోనని ఆశపడ్డారు.

అయితే, ఈ తతంగం అంతా గమనించిన తిమ్మరాజు వూరునుంచి పారిపోయి అడవిలో కాలం గడపసాగాడు. అడవిలో జంతువులను వేటాడి తిని బతుకుతున్నాడు. కొంతకాలం తర్వాత తనను గుర్తించే కార్యక్రమం సద్దుమణిగినప్పుడు తిరిగి వెళ్ళాలని ఆలోచించాడు.

ఒకసారి విజయవర్మ అడవిలో వేటకు వెళ్ళాడు. ఒక జింకను తరుముతూ, తన సిబ్బందికి దూరంగా వెళ్ళి అడవిలో దారి తిప్పాడు. ఒక చెట్టుకింద నిలబడి దిక్కులు చూస్తుండగా, చెట్టుమీద వున్న చిరుత పులి రాజు మీదకు దూకింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన తిమ్మరాజు చిరుతను ఎదుర్కొని కత్తితో నరికి చంపాడు. విజయవర్మను చిరుత బారినుంచి రక్షించి ప్రాణం నిలిపాడు.

విజయవర్మ సంతోషించాడు.

''యువకుడా? ఎవరు నువ్వు ఈ అడవిలో ఎందుకు వున్నావు?'' అని అడిగాడు.

తిమ్మరాజు తన గురించి చెప్పాడు. రాజధానిలో అధికారులు లంచాలు తిని కొలువులో ఉద్యోగాలు ఇస్తున్నారనీ, తనదగ్గర ధనం లేకపోవడంతో ఉద్యోగం సంపాదించలేక, చెయ్యడానికి పని దొరక్క అడవిలో కాలక్షేపం చేస్తున్నానని చెప్పాడు. అంతఃపురంలో దొంగతనానికి ప్రయత్నించిన విషయం మాత్రం చెప్పలేదు.

''నీకు కొలువులో ఉద్యోగం ఇస్తాను. అడవిని వదిలిపెట్టి రాజధానికి తిరిగిరా!'' అన్నాడు విజయవర్మ.

''ప్రభూ! తమరు క్షమిస్తే తిరిగి వస్తాను.'' అన్నాడు తిమ్మరాజు.

''నువ్వు ఏం తప్పు చేశావు?'' అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు రాజు.

తిమ్మరాజు తాను అంతఃపురంలో దొంగతనం చేయబోయిన సంఘటనను వివరించాడు.

''పరిస్థితుల ప్రభావం వలన నువ్వు దొంగగా మారాలనుకున్నావు. ఆకలి మనిషితో ఎన్ని తప్పులైనా చేయిస్తుంది. రాజ్యంలో అధికార యంత్రాంగాన్ని నమ్మి పర్యవేక్షించకపోవడం నా పొరపాటే. ఇకనుంచి అవినీతికి తావులేకుండా ప్రతిభావంతులైన యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తాను. అవినీతి అధికారులను శిక్షిస్తాను. నువ్వు నా కళ్ళు తెరిపించావు.''-అని తిమ్మరాజుని మెచ్చుకున్నాడు విజయవర్మ. ఆ తర్వాత తిమ్మరాజు రాజుగారి కొలువులో ఉద్యోగిగా చేరి సమర్థుడిగా పేరు తెచ్చుకున్నాడు.

- వాణిశ్రీ

తెలుసుకోండి..

- బ్లీచింగ్ పౌడరులో ఉపయోగించే వాయువు- క్లోరిన్
- ఉష్ణోగ్రతను కేలరీ మీటర్‌తో కొలుస్తారు.
- ఐస్‌గడ్డ ఘన పరిమాణంగల నీటి

బరువు కంటే తేలిక గనుక అది నీటిలో తేలుతుంది.

- భాస్వరం తక్కువ ఉష్ణోగ్రతలో మండుతుంది గనుక నీటిలో నిలవ చేస్తారు.
- మానవునికి ప్రతి యాభయి నిముషాలకు వేయి ఘనపుటడుగుల గాలి అవసరం.
- ఆరోగ్యవంతుని గుండె నిముషానికి డెబ్బయి ఎనిమిదిసార్లు కొట్టుకుంటుంది.
- వెలుతురు వేగం సెకండుకు లక్షా ఎనభయ్యారు వేల మైళ్ళు.

- ఎ.రాంబాబు

వీకెండ్ క్విజ్-450

వీరిద్దరూ ఎవరు?

మీ జవాబులను కార్డుపై రాసి పంపించండి. నిరైన సమాధానాలు రాసిన వారిలో ఒకరిని ద్రాలో ఎంపిక చేసి రూ. 100 బహుమతి అందిస్తాం.
చిరునామా: సిసింద్రి, ఆంధ్రభూమి దినపత్రిక, 36, నరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

క్విజ్-449 సమాధానాలు

- విమోచ్‌పి నాయకుడు ప్రవీణ్ తొగాడియా
- భారత క్రికెటర్ సురేష్ రైనా

విజేత

ఎవిఎల్ నరసింహారావు,
ఇంటి నెం. 16-4-197,
ఫోర్ట్ రోడ్డు, వరంగల్-2.

సరైన సమాధానాలు రాసిన వారిలో కొందరు

కాకరపర్తి అన్నపూర్ణ, చీరాల
ఇనగంటి ఆదిలక్ష్మి, అప్పికట్ల
యం.ఎన్.అనిల్‌కుమార్, పెనుకొండ
దర్శి శైలజ, గిద్దలూరు
యస్.రేష్మాకరిష్మా, గిద్దలూరు
జి.రమణమ్మ, గిద్దలూరు
జి.లక్ష్మి, గిద్దలూరు
ఎన్.వెంకటలక్ష్మి, హైదరాబాద్
మక్కపాటి ఆందాలు, హైదరాబాద్
ఉలాపు వరలక్ష్మి, గిద్దలూరు
పి.అమరమయూరి, గిద్దలూరు
పగిడి అమృత, గిద్దలూరు
జి.విజయలక్ష్మి, గిద్దలూరు
డి.నవ్యత వైష్ణవి, గిద్దలూరు
డి.ఎ.మహేశ్వరి, గిద్దలూరు
పి.పరశురామయ్య, పూళ్ళ
మతుకుమల్లి లలిత, హైదరాబాద్
భారతుల శ్వేత, సికింద్రాబాద్
యం.నాగభూషణం, పెనుకొండ
ఈమేమన, శ్రీకాకుళం
ఎ.ఉజ్వలాదేవి, వరంగల్
గోనె మోహనలక్ష్మి, హైదరాబాద్
ఉలాపు జయంతి, గిద్దలూరు
గర్రె రమాదేవి, గిద్దలూరు
రెంటాల స్వర్ణలత, గిద్దలూరు
సాయిశ్రీ వన్సి, నల్గొండ
చంద్ర సుబ్బారావు, బాపట్ల
రాజోలి నరళ, హైదరాబాద్
మ్యాదం మంజుల, బోరబండ
కొనరాజు శివలింగ వరప్రసాదరావు, తెనాలి
మ్యాదం మేఘన, హైదరాబాద్
రాజోలి వీణ, బోరబండ
బెల్లంకొండ శ్రీనివాసరావు, భర్తిపూడి
కొండపాటూరి హైమావతి, గోపాపురం
కుర్రా మాధవరావు, భర్తిపూడి
కొనరాజు కుసుమకుమారి, తెనాలి
పోతురాజు గోపాలరావు, పొన్నూరు
మార్గం శరత్‌బాబు, హైదరాబాదు
నాగండ్ల సైదమ్మ, గోగులపాడు
లక్కింశెట్టి శివకుమారి, చినకొండ్రుపాడు
పాలడుగు పద్మజ, బోరబండ
ఇనగంటి భాస్కర్, అప్పికట్ల
చంద్ర వెంకయ్య, బాపట్ల
మ్యాదం శ్రీనివాస్, హైదరాబాద్
కాకరపర్తి మంజుల, చీరాల
కాకరపర్తి శ్రీలత, చీరాల
మన్నె నుశీల, తణకేరు
పాలడుగు నరోజిని, హైదరాబాద్
గుమ్మడి కుమారి, బోరబండ
మ్యాదం లక్ష్మి, మోతీనగర్
కన్నెకంటి భ్రమరాంబ, మోర్జంపాడు
ఉరందూర్ లత, వి.కోట
కాకరపర్తి సత్యవతి, చీరాల
కంభంపాటి గోపాలకృష్ణ, భర్తిపూడి
తుమ్మల అన్నపూర్ణ, హైదరాబాద్
చిగురుపాటి సుప్రియ, హైదరాబాద్
కందిగట్ల ప్రభాకర్, హైదరాబాదు
నగరపు వెంకటరావు, హైదరాబాద్
వి.రాము, యాదగిరిగుట్ట
మల్లెల వీరాంజనేయులు, మురికిపూడి
దాసారపు సంధ్య, భువనగిరి
దాసారపు రాధిక, భువనగిరి
ఎం.అభిజ్ఞారెడ్డి, గంభీరావుపేట
ఆళ్ళ నారాయణరావు, బాపట్ల
యర్రగోళం ఫణిరాజసింహా, కదిరి
ఎన్.వి.గిరి, తిరుపతి
ఎన్.నుజన్, తిరుపతి
సిహెచ్.అభినయ్, రాజాం
కోట ప్రసాదరావు, మైలవరం
పి.రుద్రప్రియ, హైదరాబాద్
ఎన్.హేమగిరి, తిరుపతి
ఎన్.తనుష్క, తిరుపతి
ఎన్.బాబారావు, తిరుపతి
పి.వంశీకిశోర్, పరకాల

సాహస బాలలు

తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎందరినో కాపాడిన బాలలు వారు. అందుకే సాహస బాలలుగా జాతీయ స్థాయి అవార్డులు పొందారు. వీరి సాహసాలతో మొత్తం 31మంది నిండు ప్రాణాలు నిలబడ్డాయి. ఈ సాహస బాలల్లో దుండగుల్ని ఎదురించిన ధైర్యవంతులు ఉన్నారు. అక్రమాల్ని, అన్యాయాల్ని అడ్డగించిన చిచ్చర పిడుగులు ఉన్నారు. 2012 జాతీయ సాహస బాలల అవార్డులకి ఎంపికైన వారిలో 18 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. ఒక బాలుడికి మరణానంతరం అవార్డును ప్రకటించారు.

అక్రమాలను అడ్డుకున్న ధీరులు..

కళ్లముందు జరిగే అన్యాయాన్ని సహించలేదీ పిల్లలు. తమవంతు పోరాటం చేసి సమయస్ఫూర్తి చూపించారు. ఢిల్లీకి చెందిన రేణు(17) చూపించిన సాహసం ఎంతోమంది బాలికల జీవితాల్ని చక్కదిద్దింది. తాను ఉంటున్న బాలల గృహంలో యజమాని, సిబ్బంది చేసే పాశవిక చర్యలను గమనించి చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా శిశుసంక్షేమ కమిటీ దృష్టికి తీసుకువెళ్లింది. తనిఖీకి వచ్చిన అధికారుల ముందు ధైర్యంగా సాక్ష్యం చెప్పింది. రేణుని గీతా చోప్రా అవార్డుకి ఎంపిక చేశారు. రాజస్థాన్‌కు చెందిన స్వప్నకుమారి మీనా (14) తనకు బాల్య వివాహం తలపెట్టిన తండ్రి పైనే ఫిర్యాదుచేసింది. జిల్లా మేజిస్ట్రేట్‌కి లేఖ రాసి తెగువను, చైతన్యాన్ని ప్రదర్శించింది.

దుండగులను ఎదిరించి...

కొందరు బాలలు దుండగులు, హంతకులతో ధైర్యంగా పోరాడిన సాహసవంతులుగా కీర్తి పొందారు. చత్తీస్‌గఢ్‌కి చెందిన ఆకాంక్ష గౌతే (16) ముగ్గురు దుండగులను పోలీసులకు పట్టించి 'బాపు గయధాని' అవార్డుకి ఎంపికైంది. తండ్రితో కలిసి ఇంటికి వస్తుండగా రెండు బైకులమీద వచ్చి దాడిచేసిన దుండగులను ఈమె కరాటే విద్యను ప్రదర్శించి మట్టికరిపించింది. వీరిలో ఒకడు పారిపోగా ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్‌చేశారు.

మేఘాలయాకి చెందిన స్ట్రిప్లీన్‌మెన్ మిలియం (9) ఓ హంతకుడి బారినుంచి తన సోదరిని కాపాడాడు. తల్లిదండ్రుల్ని పెద్ద సోదరిని హత్యచేసిన దుండగుడి బారినుంచి ఇతడు తన చిన్న క్కను రక్షించాడు. చుట్టుప్రక్కల వారిని నిద్ర లేపి హంతకుడు దొరికిపోయేలా చేశాడు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్ కనౌజియా (12) ధైర్యంగా దొంగల్ని ఎదిరించాడు. ఒక వేడుకకి హాజరై తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు ఉన్నట్టు బయటి నుంచే ఇతడు గుర్తించాడు. పవన్ గట్టిగా కేకలుపెట్టడంతో పాటు దొంగల్లో ఒకడిని గదిలోకి తోసేసి తలుపువేశాడు. మిగతావారు రాడ్లతో కొట్టినా ధైర్యాన్ని కోల్పోలేదు. చివరికి దొంగలు దొరికిపోయారు.

- సేకరణ: బొమ్మాన శ్రీనివాసరావు

రంగులు ఇష్టం

హెచ్చుతగ్గు స్వర ధ్వనులు

చేసి చూద్దాం

ఒక పొడవైన స్ట్రా తీసుకోవాలి. ఒక కొనకు రెండు అంగుళాల దూరంలో కత్తెర ఉపయోగించి స్ట్రాను పాక్షికంగా, అడ్డంగా కత్తిరించాలి. అంటే స్ట్రా రెండుముక్కలు కాకూడదు.

ఇప్పుడు చిన్న ముక్కను పొడవుముక్కకు లంబంగా పటములో చూపినట్లు వంచాలి. ఒక గ్లాసులో నీరు మూడవవంతు వరకు తీసుకోవాలి. స్ట్రా పొడవు భాగం ఈ గ్లాసు నీటిలో మునుగునట్లు అమర్చాలి.

చిన్న ముక్క స్వేచ్ఛా కొనను నోటిలో ఉంచుకుని గాలిని స్ట్రాగుండా ఊదాలి. చక్కని ధ్వని వినిపించే విధంగా పొడవు స్ట్రా భాగాన్ని నీటిలో ముంచుతూ సర్దుబాటు చేయాలి.



స్ట్రా చిన్నముక్క గుండా గాలిని ఊదినపుడు, ఒక గాలి సంచలనాన్ని మీరు ఉత్పత్తిచేశారు. ఈ గాలి సంచలనం పొడవైన స్ట్రాముక్క ఉపరి భాగం మీదుగా వెడుతూ ఈ ముక్కలోని గాలిని కంపింపజేస్తుంది. ఈ గాలి స్తంభం కంపనాలు ఒక ఈల వంటి ధ్వనిని పుట్టిస్తాయి.

స్ట్రా పొడవుభాగం నీటిలో కిందికి దింపేసరికి ఈ పొడవు భాగంలో ఉండే గాలి స్తంభం పొడవు తగ్గుతుంది. ఇది ఎక్కువ పిచ్‌గల స్వరాన్ని విడుదల చేస్తుంది. గాలి స్తంభం పొడవు ఎక్కువగా ఉంటే తక్కువ పిచ్‌గల స్వరం విడుదలవుతుంది. అంటే ఈ ప్రయోగంలో స్ట్రాగుండా గాలి ఊదుతూ పొడవు స్ట్రాభాగాన్ని నీటిలో పైకి కిందకు ముంచుతూ ఉంటే అందులోని గాలి స్తంభం పొడవు పెరిగి తరిగి తక్కువ, హెచ్చు స్థాయిల్లో స్వరధ్వనులు వెలువడుతాయి.

- సి.వి.సర్వేశ్వరశర్మ

ఎక్కువ తక్కువలు

ఇంద్రావతి అక్కకి పెళ్ళి కుదిరింది. ఆమె తండ్రి ఓరోజు తన భార్యతో కలిసి పెళ్ళి ఖర్చుకి బడ్జెట్‌ని వేయసాగాడు. ఆయన దగ్గర ఉన్న (సొమ్ము) డబ్బుకన్నా దాదాపు ఏభై మూడువేల అదనపు ఖర్చు కనపడింది. ఖర్చు ఎక్కడ తగ్గించాలా? అని మళ్ళీమళ్ళీ రాసుకున్నారు. ఇంద్రావతి తల్లిదండ్రులు ఇద్దరూ పరిశీలించసాగారు.

స్కూల్ నుంచి తిరిగి వచ్చిన ఇంద్రావతి తల్లిదండ్రుల సంభాషణను విని సలహా చెప్పింది.

''పనిమనిషికి చీర పెట్టడం దేనికి? దాన్ని కొట్టేయండి. దాని చెల్లెలికి కూడా బట్టలు వద్దు. మన వంట మనిషికి కూడా బట్టలు పెట్టవద్దు. ఐదారు వేలు ఖర్చు తగ్గుతుంది.''

''కానీ, వాళ్ళు ఎప్పటికన్నా ఎక్కువ పనిచేస్తారు. పదిరోజుల ముందునుంచే ఇంటికి చుట్టాలు రావడంతో వారికి పని పెరుగుతుంది కాబట్టి వాళ్ళకి తప్పనిసరిగా బట్టలు పెట్టాలి'' ఇంద్రావతి తల్లి చెప్పింది.

''మనతో పోల్చేస్తే వాళ్ళ స్థాయి ఎంత? వాళ్ళవాళ్ళకి బట్టలు పెట్టి వియ్యపురాలిలా గౌరవించాల్సిన అవసరం ఉందా?'' ఇంద్రావతి ప్రశ్నించింది.

ఇంద్రావతి తండ్రి వెంటనే కూతుర్ని అడిగాడు.

వారం క్రితం నీ చిటికెనవేలు విరిగింది. దాని వల్ల పెద్ద ఉపయోగం ఉండదు. బొటన వేలు అన్నివేళ్ళల్లోకి ముఖ్యమైంది. కాబట్టి చిటికెన వేలుకి నేను చికిత్స చేయించకుండా ఉండాల్సిందే. పదివేలు మిగిలేది. అది వృథా అయింది.''



ఇంద్రావతి వెంటనే తండ్రి వంక ఆశ్చర్యంగా చూస్తూ చెప్పింది.

''అదేమిటి? నా వేలు బాగుచేయించడం వృథా ఖర్చా?''

''కాదా? పనిమనిషి, వంట మనిషి ఎలా మన స్థాయికి చెందని వారో అలాగే నా చిటికెన వేలునీ బొటన వేలు స్థాయికి సరితూగేది కాదుకదా! అని ఇప్పుడు అనిపిస్తోంది.''

ఇంద్రావతి వెంటనే రోషంగా చెప్పింది.

''అదేమిటి నాన్నా అలా అంటావు? శరీరంలోని ప్రతీ భాగం మనకి ముఖ్యం అని మీకు తెలీదా?''

''అలాగే సమాజంలోని ప్రతీ వ్యక్తికూడా మన మనుగడకి ముఖ్యమే. శరీరంలోని ప్రతీ భాగం మన కోసం ఏదో ఓ పనిని ఎలా చేస్తోందో అలాగే సమాజంలోని ప్రతీ వ్యక్తి మనకోసం డైరెక్ట్‌గానో, ఇన్‌డైరెక్ట్‌గానో ఏదో ఓ పనిని చేస్తూంటాడు. వారది చేయకపోతే మనం చాలా ఇబ్బందులకి గురవుతాం. పనిలో ఎక్కువ, తక్కువలు అంటూ ఉండవు.''

''నువ్వు చెప్పింది నిజమే. వాళ్ళు ఆ పనులు చేయకపోతే మనం చాలా ఇబ్బందిపడాలి.'' ఇంద్రావతి ఒప్పుకుంది.

తన ప్రావిడెంట్ ఫండ్ నుంచి ఆయన ఏభై వేల రూపాయలు అప్పుతీసుకుని పెళ్ళిని జరిపించాడు.

-మల్లాది వెంకట కృష్ణమూర్తి

అర్థాల ఆట



కింద ఇచ్చిన తెలుగు పదాల అర్థాల ఆధారంగా ఆంగ్ల పదాలతో గడులు నింపాలి.

ఆధారాలు

అడ్డము

1. గొలుసు
3. కొవ్వు
5. పాచిక
8. అణువు
9. కొమ్ము
11. ముంజేయి
13. చాప
14. దురాశ

నిలువు

1. మార్జాలము
2. నఖము
4. ముల్లు
6. గుంపు
7. ప్రస్తుతము
8. హెచ్చరిక
10. ఔషధము
12. బురద

గత వారం సమాధానాలు

అడ్డము : 1. GUNNY 3. DEW 5. ART 8. TWIG 9. MYTH 11. BAT 13. TRY 14. NOISE
నిలువు : 1. GEM 2. YARD 4. WATCH 6. AIR 7. DYE 8. TWIST 10. LAWN 12. BEE

-కైపు ఆదిశేషారెడ్డి

ఆటోగ్రాఫ్

కోనేరు హంపి
ప్రముఖ చెస్ క్రీడాకారిణి

నేను గీసిన బొమ్మ

కె. మౌనిక, విశాఖ

తంగిరాల పద్మాకర, అంగూలు (ఒడిషా)

పి. వర్షిత, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా

ఎ. శ్రీధర్, రాజమండ్రి

దొంతుల దినేష్‌కుమార్, కుషాయిగూడ, హైదరాబాద్

ఎన్.ఎన్.ఎన్. దీప్తి, గుడివాడ

కె. సూర్యకాంత్, నర్సంపేట

కొబ్బరి ఇడ్లీ

కావలసినవి

బియ్యం - 5 కప్పులు
కొబ్బరి చిప్పలు - 4
వంట సోడా - 2 చెంచాలు
ఉప్పు - తగినంత

తయారు చేసేదిలా

బియ్యాన్ని శుభ్రంగా కడిగి ముందురోజు రాత్రి నానబెట్టాలి. ముందుగా కొబ్బరి తురుమును సిద్ధం చేసుకోవాలి. నానబెట్టిన బియ్యంలోని నీటిని పూర్తిగా తీసి వేసి కొబ్బరి తురుము కలిపి రవ్వ మాదరి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని నీళ్లు పోసి బాగా ఉడికించాలి. నీళ్లు కొద్దిగా ఉండగా వంట సోడా కలిపి ఈ పిండిని సుమారు పది గంటలపాటు అలాగే ఉంచాలి.

ఆ తర్వాత ఈ పిండిలో ఉప్పు కలిపి ఇడ్లీ ప్లేట్లలో పెట్టి కుక్కర్‌లో ఉడికించాలి. సాంబారు లేదా చట్నీతో వేడివేడిగా ఈ ఇడ్లీలను సర్వ్ చేయొచ్చు.

దహీ వడ చాట్

కావలసినవి

మినప్పప్పు ..... 1 కప్పు
పెరుగు ..... 3 కప్పులు
కారబ్బూందీ ..... 1/4 కప్పు
సన్న సేవ్ ..... 1/4 కప్పు
కొత్తిమీర ..... కొద్దిగా
స్వీట్ చట్నీ ..... 5 టీ.స్పూ.
జీలకర్ర పొడి ..... 2 టీ.స్పూ.
కారం పొడి ..... 1 టీ.స్పూ.
అల్లం ముక్క ..... చిన్నది
పచ్చిమిర్చి 2
ఉప్పు ..... తగినంత
పంచదార ..... 1 టీ.స్పూ.
నూనె ..... వేయించడానికి

చేయండి ఇలా

మినప్పప్పు కడిగి నీళ్లుపోసి రెండు గంటలు నానినివ్వాలి. తర్వాత జల్లెట్లో వేసి నీరంతా ఇంకిపోయాక అల్లం పచ్చిమిర్చి ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో తగినంత ఉప్పు వేసి కలిపి వేడి నూనెలో మధ్యలో చిల్లు పెట్టి వడల్లా వేపాలి. రెండు వైపులా బంగారపు రంగు వచ్చేవరకు కాల్చుకుని టిష్యూ పేపర్ మీద వేయాలి. అలా చేయడంవల్ల నూనె పీల్చుకుంటుంది. పెరుగులో పంచదార, తగినంత ఉప్పు వేసి గిలక్కొట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. సర్వ్ చేసే ముందు వేయించిన వడలను అడ్డంగా రెండు ముక్కలుగా కట్ చేయాలి. ప్లేట్లో ఈ ముక్కలను పెట్టి దానిపైన చిలికిన పెరుగు పోయాలి. కారం పొడి, జీలకర్ర పొడి వేయాలి. దానిపైన సన్న సేవ్, కారబ్బూందీ, సన్నగా తరిగిన కొత్తిమీర వేయాలి. చివరిగా స్వీట్ చట్నీ వేసి వెంటనే సర్వ్ చేయాలి.

సోయా చంక్స్ కుర్మా

కావలసినవి

సోయా చంక్స్ - 10-12
ఉల్లిపాయలు -2
టమాటా - 2
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
ధనియాల పొడి - 2 టీ.స్పూ.
గరం మసాలాపొడి - 1/4 టీ.స్పూ.
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
కొబ్బరి పొడి - 2 టీ.స్పూ.
గసగసాలు - 1 టీ.స్పూ.
నూనె - 3 టీ.స్పూ.
ఉప్పు - తగినంత

తయారు చేసేదిలా

రెండు గ్లాసుల నీళ్లు మరిగించి అందులో సోయా చంక్స్‌వేసి పెట్టాలి. చల్లారిన తర్వాత నీరంతా గట్టిగా పిండేయాలి. గసగసాలు కొద్దిగా వేయించి కొబ్బరితో కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఉల్లిపాయలు, టమాటాలు విడివిడిగా రుబ్బుకోవాలి.

పాన్‌లో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముద్ద వేసి పచ్చి వాసన పోయేవరకూ వేయించాలి. ఇందులో పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం పొడి వేసి కొద్దిసేపు వేయించి సోయా చంక్స్, ధనియాల పొడి వేయాలి. మొత్తం కలుపుతూ కొద్దిసేపు వేయించి టమాటా ముద్ద, కొబ్బరి గసగసాల ముద్ద, తగినంత ఉప్పు వేసి కలిపి కప్పుడు నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. మొత్తం ఉడికి నూనె తేలుతున్నప్పుడు కొత్తిమీర, గరం మసాలా పొడి చల్లి దింపేయాలి. ఈ కూర అన్నం, చపాతీలకు బావుంటుంది.

కాప్సికమ్ కూటు

కావలసినవి

పెసరపప్పు - 1 కప్పు
నూనె - 2 టీ.స్పూ.
ఆవాలు - 1/4 టీ.స్పూ.
ఎండుమిర్చి - 4
ఉల్లిపాయ - 1
టమాటా - 2
కాప్సికమ్ ముక్కలు - 1 కప్పు
పసుపు - 1/4 టీ.స్పూ.
ఉప్పు - తగినంత

వండండి ఇలా

కాప్సికమ్ లోపలి గింజలను తీసేసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పెసరపప్పు కడిగి నీళ్లు పోసి ఉడికించుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి వేసి కొద్దిగా వేగిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ వేసి మెత్తబడే వరకు వేపాలి. ఇందులో పసుపు, సన్నగా తరిగిన టమాటా వేసి కలిపి మూత పెట్టి మగ్గనివ్వాలి. తర్వాత కాప్సికమ్ ముక్కలు కూడా వేసి కలిపి చిన్న మంటమీద మూతపెట్టి మగ్గనివ్వాలి. తరవాత ఉడికించిన పెసరపప్పు వేసి కలిపి కప్పుడు నీళ్లు పోసి తగినంత ఉప్పు వేసి కలిపి ఉడికించాలి. మొత్తం ఉడికిన తర్వాత దింపేయాలి. ఇది అన్నం, రొట్టెలకు కూడా బావుంటుంది.

ఫ్రూట్ అండ్ నట్ జామ్ సాండ్‌విచ్

కావలసినవి

బ్రెడ్ స్లైసులు - 6-8
ఆపిల్ ముక్కలు - 1/2 కప్పు
ద్రాక్ష ముక్కలు - 1/2 కప్పు
నారింజ ముక్కలు - 1/4 కప్పు
జీడిపప్పు, బాదం - 1/4 కప్పు
మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్ -1/2 కప్పు
వెన్న - 1/4 కప్పు

ఇలా చేయాలి

పళ్లను చాలా చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. జీడిపప్పు, బాదం కూడా చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో జామ్, పళ్ల ముక్కలు, బాదం, జీడిపప్పు ముక్కలు వేసి బాగా కలియబెట్టాలి. బ్రెడ్ స్లైసుల అంచులు తీసేసి పలుచగా వెన్నె రాయాలి. వెన్న రాసిన స్లైసు మీద చెంచాడు జామ్, పళ్ల మిశ్రమం పెట్టి పరిచి దానిమీద ఇంకో బ్రెడ్ స్లైసు పెట్టాలి. దాన్ని మెల్లిగా అదిమి పెట్టి ఫ్రిజ్‌లో పెట్టేయాలి. సర్వ్ చేసే ముందు తీసి రెండు ముక్కలుగా కట్ చేసి సర్వ్ చేయాలి.

పాపడ్ రోల్

కావలసినవి

పెద్ద సైజు అప్పడాలు 6
క్యారట్ తురుము ..... 5 టీ.స్పూ.
బీన్స్ తరుగు ..... 6 టీ.స్పూ.
ఉల్లిపొరక తరుగు ..... 4 టీ.స్పూ.
ఉడికించిన బంగాళాదుంప 1
కాప్సికం తరుగు ..... 5 టీ.స్పూ.
నిమ్మరసం ..... 1 టీ.స్పూ.
కారం పొడి ..... 1/4 టీ.స్పూ.
ఉప్పు ..... తగినంత
నూనె ..... వేయించడానికి

వండే విధం

ఒక గిన్నెలో సన్నగా తరిగిన బీన్స్, కాప్సికమ్ ఉల్లిపొరక, ఉడికించి తరిగిన బంగాళా దుంప, తురుమిన క్యారట్, నిమ్మరసం, ఉప్పు, కారం పొడి వేసి కలపాలి. పెనం వేడి చేసి పాపడ్‌లను కొంచెం వేడి చేయాలి. ఇలా చేయడంవల్ల అవి మెత్తబడతాయి. అపుడు వెంటనే కూరగాయల మిశ్రమం పొడవుగా పెట్టి గట్టిగా చాపలా చుట్టి అంచులు నీళ్లతో తడి చేసి అతికించాలి. బాణలిలో నూనె వేడి చేసి తయారు చేసుకున్న రోల్స్‌ని వేసి బంగారు రంగు వచ్చేవరకు కాల్చి ముక్కలుగా కట్ చేసి సర్వ్‌చేయాలి.

క్యారట్ పలావ్

కావలసినవి

బియ్యం ..... 1 1/2 కప్పులు
నూనె ..... 2 టీ.స్పూ.
నెయ్యి ..... 2 టీ.స్పూ.
జీలకర్ర ..... 1 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి ముద్ద ..... 1 టీ.స్పూ.
ఉల్లిపాయ 1
క్యారట్ ముక్కలు ..... 1/2 కప్పు
పచ్చి బఠానీలు ..... 1/2 కప్పు
ధనియాల పొడి ..... 2 టీ.స్పూ.
పచ్చిమిర్చి 3
గరం మసాలా పొడి ..... 1/2 టీ.స్పూ.
పసుపు ..... 1/4 టీ.స్పూ.
ఉప్పు ..... తగినంత

ఇలా వండాలి

బియ్యం కడిగి నీళ్ళు పోసి పది నిమిషాలు నాననివ్వాలి. ముందుగా మందపాటి గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేడి చెయ్యాలి. సన్నగా తరిగిన ఉల్లిపాయ, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి మెత్తబడేవరకు వేపాలి. ఇందులో అల్లం వెల్లుల్లి కూడా వేసి కొద్దిగా వేపి క్యారట్ ముక్కలు, పచ్చి బఠానీలు వేసి కలపాలి. తర్వాత పసుపు, ధనియాల పొడి, గరం మసాలాపొడి వేసి రెండు నిమిషాలు వేపాలి. తరువాత మూడు కప్పుల నీళ్ళు పోసి తగినంత ఉప్పు వేసి మరిగించాలి. నీళ్లు మరుగుతున్నపుడు బియ్యం తీసి వేసి కలిపి మూత పెట్టి ఉడకనివ్వాలి. మొత్తం ఉడికిన తర్వాత మంట తగ్గించి, రెండు నిమిషాలు మగ్గనివ్వాలి. తర్వాత ఈ వేడి వేడి పలావ్ పెరుగు పచ్చడి లేదా కుర్మాతో సర్వ్ చేయాలి. ఇష్టముంటే ఇందులో నిమ్మకాయ పిండుకోవచ్చు.

చికెన్, కాజూ మసాలా

కావలసినవి

చికెన్ - 1 కేజీ
ఉల్లిపాయలు - 2
టమాటా - 2
జీడిపప్పు - 50 గ్రా.
కొబ్బరి పొడి - 3 టీ.స్పూ.
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 1/2 టీ.స్పూ.
ధనియాల పొడి - 2 టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1/2 టీ.స్పూ.
పచ్చిమిర్చి - 3
అల్లం వెల్లుల్లిముద్ద - 2 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 4 టీ.స్పూ.

ఇలా చేద్దాం

చికెన్‌ను శుభ్రంగా కడిగి జల్లెట్లో వేసి ఉంచాలి. టమాటాను ముక్కలుగా కట్ చేసి మిక్సీలో గ్రైండ్ చేసుకోవాలి. జీడిపప్పు నీళ్లలో నానబెట్టి కొబ్బరిపొడితో కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన లేదా నూరిన ఉల్లిపాయ వేసి దోరగా వేయించాలి.

ఇందులో పసుపు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్ది సేపు వేయించిన తర్వాత చికెన్ ముక్కలు, ధనియాల పొడి, కారం పొడి, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. చికెన్ ముక్కలు నిదానంగా నూనెలో వేగిన తర్వాత కొబ్బరిపొడి, జీడిపప్పు ముద్ద, టమాటా ముద్ద, కప్పుడు నీళ్లు పోసి కలిపి మూత పెట్టి ఉడికించాలి.

ఈ కూర పలుచగా గ్రేవీ ఉండేట్లు చేసుకోవచ్చు లేదా డ్రైగా కూడా చేసుకోవచ్చు. ముక్కలన్నీ మసాలాలో పూర్తిగా ఉడికి, నూనె తేలుతున్నప్పుడు దింపేయాలి.

చాక్లెట్, బిస్కెట్ కస్టర్డ్

కావలసినవి

కార్న్‌ఫ్లోర్ - 4 టీ.స్పూ.
కాఫీ పొడి - 1 టీ.స్పూ.
కోకో పొడర్ - 3 టీ.స్పూ.
పంచదార - 6 టీ.స్పూ.
పాలు - 3 కప్పులు
నీళ్లు - 1/2 కప్పు
వెనిలా ఎసెన్స్ -1/2 టీ.స్పూ.
వెన్న - 1 టీ.స్పూ.

ఇలా చేయాలి

ఒక పాన్‌లో కార్న్‌ఫ్లోర్, కాఫీ పొడర్, కోకో పొడర్, వెన్న, ఎసెన్స్, అరకప్పు నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. పాలు మరిగించి చిక్కబడ్డాక పంచదార వేసి కలపాలి. అది కరిగిన తర్వాత కార్న్‌ఫ్లోర్ మిశ్రమాన్ని వేసి ఉండలు కట్టకుండా కలుపుతూ ఉడికించాలి. కొద్ది సేపట్లో చిక్కబడగానే దింపేయాలి. పూర్తిగా చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాలి. చల్లబడిన తర్వాత బీటర్‌తో గిలక్కొట్టాలి. సర్వింగ్ బౌల్‌లో ముందుగా బిస్కట్ ముక్కలు పెట్టి దానిపైన కొంచెం చాక్లెట్ కస్టర్డ్ పోయాలి. దానిపైన పళ్ల ముక్కలు లేదా ఉత్త ద్రాక్ష ముక్కలు వేసి కస్టర్డ్ పోయాలి. ఆపైన బిస్కట్లు పెట్టి కస్టర్డ్ పోయాలి. దీన్ని వెంటనే సర్వ్ చేయాలి. లేదా బిస్కెట్ ముక్కలు, పళ్ల ముక్కలు బౌల్‌లో వేసి కస్టర్డ్ పోసి వెంటనే సర్వ్ చేయాలి. కావాలంటే పైన క్రీమ్ కూడా వేసుకోవచ్చు.

టమాటా, వెల్లుల్లి పచ్చడి

కావలసినవి

టమాటాలు - 250 గ్రా.
ఎండుమిర్చి -5
జీలకర్ర - 1/2 టీ.స్పూ.
ధనియాలు - 2 టీ.స్పూ.
వెల్లుల్లి రెబ్బలు - 12
నువ్వులు - 2 టీ.స్పూ
పసుపు- 1/4 టీ.స్పూ.
నూనె - 4 టీ.స్పూ.
ఆవాలు, జీలకర్ర - 1/4 టీ.స్పూ.
కరివేపాకు - 1 రెబ్బ
ఇంగువ - చిటికెడు
ఉప్పు - తగినంత

వండే విధం

పాన్ వేడి చేసి ఎండు మిర్చి, ధనియాలు, జీలకర్ర, నువ్వులు దోరగా వేయించాలి. వాటికి సగం వెల్లుల్లి రెబ్బలు కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి. అదే పాన్‌లో రెండు చెంచాల నూనె వేడి చేసి సన్నగా తరిగిన టమాటా ముక్కలు వేసి మూత పెట్టి మగ్గనివ్వాలి.

అవి చల్లారిన తర్వాత మెత్తగా రుబ్బుకుని ఇంతకుముందు చేసుకున్న పొడి, తగినంత ఉప్పు కూడా కలిపి మరోసారి గ్రైండ్ చేసుకోవాలి. చిన్న పాన్ లేదా గరిటలో మిగిలిన నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక నలగ్గొట్టిన వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు వేసి రంగు మారేవరకూ వేపి ఈ పచ్చడిలో కలపాలి. వెల్లుల్లి ఘాటు ఇష్టాన్ని బట్టి ఎక్కువ, తక్కువగా వేసుకోవచ్చు.

- జ్యోతి వలబోజు

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
ఆదివారం
17, ఫిబ్రవరి
2013

శ్రీ వత్సాంకు మరావిశేష తయు వాక్ఫీనాథు చాతుర్యమున్
దేవాధీశ్వరు వైభవీననతియు నా తిగ్మాంశు తేజంబు శ్రీ
దేవీ నందను రూప విభ్రమము చింతింపంగ నీభక్తి స
ద్భావాత్ముండగు పుణ్య మూర్తికి దృణ ప్రాయంబు సర్వేశ్వరా!

శేర్చుండ్రాం

భావం: సర్వేశ్వరా! నీ భక్తి కల్గిన పుణ్యాత్మతనికి శ్రీమహావిష్ణువు యొక్క సంపద కానీ బ్రహ్మ యొక్క చాతుర్యం కానీ దేవేంద్రుని వైభవం కానీ సూర్య తేజం కానీ మన్మథుని రూపం కానీ గడ్డి పరకతో సమానం. మానవులందరూ కోరుకొనేవి సంపద, చాతుర్యం సంపద, వైభవం, తేజస్సు, సుందరరూపం వీటిల్లో ఏ ఒక్కటి లోపించినా తక్కిన నాలుగూ వ్యర్థం. సంపద ఉండి చాతుర్యం లేకపోతే రాణించదు. ఇతరులనుఆశ్రయించి జీవించాల్సి ఉంటుంది. సంపద చాతుర్యాలురెండూ ఉండి వైభవం లేకపోతే అవి అనుభవానికే రావు. కోరుకున్నవన్నీ ఉండీ సుందరరూపం లేకపోతే లోకానికీ అసహనమూ కలిగి రాణింపు లేకుండా పోతుంది. కాని శివభక్తులకు ఈ ఐదు కూడా తృణ ప్రాయాలు. శివానందం కన్నా వారికి గొప్పవి ఏవీ లేవు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

15 **శ్రీ లత**

''పెళ్ళి కాకుండానే ఎలా పుట్టిందనడుగుతుంది? బిడ్డ జన్మకు పురుష సాక్ష్యం కావాలంటుంది'' పైకి అంది.

''తెలీదని చెబుతాను'' తండ్రి సాక్ష్యం లేని బిడ్డని చెబుతాను.

''తోడు నిలిచిన పురుషుడెవరూ అనడుగుతుంది? అంటే నిన్ను మోసం చేసినవాడు ఎవరూ అని?...

''ఏ.. ఏ పురుషుడి తోడు లేకుండా ఓ స్త్రీ బిడ్డను పెంచుకోలేదా?... పెంచుకోకూడదా? ఏదో ఒక పురుషుడి సాక్ష్యం లేకుండా బిడ్డను తన బిడ్డగా మాత్రమే పెంచుకునే హక్కు స్త్రీత్వానికి లేదా?

గుడ్డు పెట్టిన పిట్ట మగపిట్ట పేరు చెప్పమని అడిగితే చెప్పగలదా?

ఫలదీకరణం చెందిన పువ్వు... పుప్పొడి ఎక్కడిదో చెప్పగలదా?

పిల్లలను తీసిన చేప.. మగ చేప ఏదో తెలుపగలదా?

కూనలను కన్న పిల్లి మగ పిల్లి గురించి వివరించగలదా?

సృష్టిలో ఏ స్త్రీత్వమైనా సంతానం పొందడానికి కారణమైన మగ... జీవిని గురించి ఆతృత కనబరుస్తుందా? సాక్ష్యం కోసం వెంపర్లాడుతూందా?

స్త్రీకే ఎందుకు అంత నిర్బంధన?

''తండ్రెవరో చెప్పకుండా నా బిడ్డను నేను పెంచుకునే హక్కు నాకు లేదా?'' సూటిగా బాణాల్లా వేస్తున్న జీవన ప్రశ్నలకు విస్తుబోయి వింటూ ఉండిపోయింది వసంత.

''ఒక పురుషుడి భార్యగానూ... ప్రియురాలిగానో గుర్తించబడకుండా ఒక బిడ్డకు అమ్మగా కొనసాగకూడదా?

నేనేం హత్య చేయలేదు, ఘోర కిరాతకాలూ చెయ్యలేదు.

మానవ సమూహాన్ని.. విధ్వంసం.. యుద్ధాలూ. ఆక్రమణలూ.. చెయ్యలేదు. కనీసం... చిన్న దొంగతనమైనా చెయ్యలేదు. నా బిడ్డకు అమ్మనయ్యాను. ఇందులో... నేను ఎవర్నీ నష్టపరిచిందీ, కష్టపెట్టిందీ లేదు.. నేను, ఆనందాన్నిస్తున్న నా బిడ్డకు తల్లిగా నిలిచాను.

''ఎవరివల్లనైనా మోసపోయావా? ప్రేమించావా'' అడిగింది వసంత అనుమానంగా...

''అలా అని నేననలేదుగా'' జీవన అంతే ఓపిగ్గా సమాధానం ఇచ్చింది. వసంతకు ఓపిక నశించినట్లయింది. జీవనను దగ్గరగా వచ్చి కళ్ళలోకి చూస్తూ ''మొదటి నుంచి అడుగుతున్నాను ఒకే ఒక ప్రశ్ననుు! దానికింతవరక సమాధానం ఇవ్వలేదు. కనీసం ఇప్పుడయినా చెప్పు? నువ్వు ఏం చెప్పినా నిన్ను అర్థం చేసుకోవడానికి నేనున్నాను'' అంది కనురెప్పవాల్చకుండా. జీవన అలాగే చూస్తుండిపోయింది. లాభం లేదనుకుని

మళ్ళీ తనే ''నువ్వు ఎవరినీ ప్రేమించలేదు. నిన్ను ఎవరూ మోసం చేయలేదు. మరి ప్రెగ్నెన్సీ ఎలా వచ్చింది?'' అని మెత్తగా అడిగింది. అయితే ఆ మెత్తదనంలో తన గుండెను తానే కోసుకునే పదును ఉంది.

''తెలీదు''

''ఊరుకోవే! తెలీదూ? తెలీదూ?... అంత అమాయకంగా కనిపిస్తున్నానా? నువ్వు చెప్పినవి వినడానికి, నమ్మడానికి నా చెవిలో కాలీఫ్లవర్ వుందా? సృష్టిలో ఏదైనా సంభవమేమోగాని, పురుషత్వం లేకుండా స్త్రీత్వానికి తెలీకుండా మాతృత్వం సంభవించడం అనేది అసంభవం. నిన్ను కన్న తల్లినే మాటలతో మభ్యపెట్టకు! నాకు చెప్పడం ఇష్టం లేకపోతే నీ మీద ప్రేమతో నేను మౌనమవ్వగలనేమో గానీ, సమాజం నీ సమాధానానికి మౌనంగా ఉండదు'' సమాధానం చెప్పి తీరాలన్నట్టుగా ఈసారి వసంత గొంతులోని వేదన జీవనను దెబ్బతీసింది.

''తెలీని ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పగలనమ్మా?'' కాస్త ఆర్తి ధ్వనించింది. ఆ ఆర్తికి అమ్మ మెత్తబడింది. అమ్మ అంతే.. మొదటినుంచీ ఆర్తికి మెత్తబడుతుంది.

''కాదు జీవనా! అర్థం చేసుకో! అతనెవరో చెప్పు?'' బిడ్డకోసమైనా చెప్పు... కనీసం పాపను పెంచుకునేందుకైనా చెప్పు! అతనెవరు?'' లాలనగా అడిగింది ఆఖరిసారిగా.

''పాపను పెంచుకునేందుకు తెలియని తండ్రి పేరు కల్పించి చెప్పనా? ఏ.. తండ్రి పేరు చెప్పకుండా నీనా గుప్త తన కూతుర్ని పెంచుకోవడం లేదూ?

''నీనాగుప్త తానొక ఘనీభవించిన ధనస్వామ్యపు వ్యవస్థలో ఉంది. కానీ నువ్వు ప్రవాహం లాంటి మధ్యతరగతి వ్యవస్థలో ఉన్నావు. ఈ వ్యవస్థ... నిన్ను నీనాగుప్తాలా నిబ్బరంగా బ్రతకనివ్వదు. నీనా గుప్తకయినా.. తన బిడ్డ తండ్రెవరో తనకు తెలుసుగా... అలాగే బిడ్డకు తండ్రెవరో నీకు తెలిసి ఉండాలిగా...'

''తెలీదమ్మా'' జీవన కన్నీళ్ళతో సమాధానం చెప్పింది.

''అతన్ని ద్వేషిస్తూ తెలీదంటున్నావో, అతన్ని ప్రేమిస్తూ అతను దోషికాకూడదని అంటున్నావో గాని, ఏ భావమూ లేని నాతో కూడా చెప్పకపోతే ఎలా జీవనా?'' అడిగింది వసంత. ఏం మాట్లాడకుండా తలొంచుకుంది జీవన.

''అది కాదే ఈ పిల్లను తండ్రి లేని పిల్లగా ఎలా పెంచుతావే! తల్లెవరో తెలీని అనాథనయినా ఈ సంఘం జాలితో తనతో కలిసి జీవించడానికి, ఒప్పుకోవడానికి సమ్మతిస్తుందేమో కానీ తండ్రెవరో తెలీని బిడ్డను బ్రతకనివ్వదే! సమాజం కుళ్ళబొడిచి ఈ బిడ్డనూ, నిన్నూ చంపేబదులు, జన్మనిచ్చిన నువ్వే ఆ బిడ్డను చంపేసి హంతకురాలయి ఆ బిడ్డకు శాంతిని ఇవ్వవే'' మెత్తగా లోక సత్యాన్ని విప్పింది వసంత.

''జీవనకు ఆ మాటలేవీ వినిపించలేదు. తల్లెవరో తెలీని అనాథను ఈ సమాజం జాలితో తనతో కలిసి జీవించడానికి ఒప్పుకుంటుంది'' అనే విషయం తన మెదడుకు వినిపించసాగింది. కాసేపు ఆ స్థితిలోనే ఉండి తేరుకుని... ''అమ్మా! నేను పాపను గౌరవంగా ధైర్యంగా పెంచుకోగలను'' అంది ధీటుగా.

''అతనెవరో చెప్పేసి పెళ్ళి చేసుకుంటావా?'' ఆతృతగా అడిగింది వసంత.

''లేదు'' అన్నట్లుగా తలూపింది జీవన.

ఆ జవాబు అసహనంగా తల విదిల్చింది వసంత. ఇక జీవనతో ఏ వాదనా చేయకూడదని పించింది.

-ఇంకాఉంది

146 **రంగనాథ రామాయణం**
శ్రీపాద కృష్ణమూర్తి

అంత సుగ్రీవుడు సంతసించి తత్క్షణమే వానర నాయకుడు నీలుడిని పిలిపించాడు. అతనితో వివిధ పర్వతాల, సరిత్తుల, ద్వీపాల, అధిపతులయిన వానర భల్లూకాది అధిపతుల్ని రప్పించమన్నాడు.

ఇక్కడ మాల్య వంతాన తమ్ముడు లక్ష్మణుడు చెయ్యాత ఒసగ రాముడు మదినిండిన దుఃఖంతో వర్షాకాలం వెళ్ళబుచ్చాడు. శరత్కాలం అడుగుపెట్టడంతో తడవుగా కోమలి సీతకై చింతించి, మదిలో కోర్కెలు మెదలి కామ పరవశుడు అయాడు. తూర్పు కొండ మీద చంద్రుడు ఉదయించాడు. ఇది ఏమి ఉత్పాతం? ఇదేమి చందం? ఇదేమి? ఈ రేయి రవి ఉదయించినాడేమి? నా శరీర తాపం ఇబ్బడి ముబ్బడి కాజొచ్చింది. లక్ష్మణా! నన్ను వృక్షచ్ఛాయలకు కొనిపోవలసింది'' అని వచించాడు. అప్పుడు లక్ష్మణుడు రాముడితో ''అన్నా! ఉదయగిరిపై కానవచ్చేది రవికాడు. చందమామ హరిణ లాంఛనం చూడు'' అని చెప్పాడు. రాముడు హరిణాక్షి సీత లేదని ఆమె జ్ఞప్తికిరాగా మూర్ఛిల్లాడు. సుమిత్రానందనుడు కౌసల్యా తనయుడికి శీతలోపచారాలు, పచరించి తేర్చాడు.

అనంతరం రాముడు ''ఇంక లంకపై దండు నడపవలసి వుంది, లక్ష్మణా! చూడు. సుగ్రీవుడు ఏమని బాస చేశాడు? ఏమని వచించి కిష్కింధకు ఏగాడు? వానకారు గడచిపోయిన వెంటనే చనుదెంచుతానన్నాడు. శరదృతువు వచ్చింది. వానర రాజు సుగ్రీవుడు రాలేదు. నేను ఒనర్చిన ఉపకారం అంతా మరచి ఉన్మత్తుడై తారతో వున్నాడో? రుమతో మదమత్తుడై మునిగి వున్నాడో? కిష్కింధారాజ్యంలో విలాసాలతో తేలియాడుతున్నాడో? రామకార్య గతి భావింపకున్నాడు.

చేసిన ఉపకారాన్ని మరచినవాడూ, బాస చేసి తప్పినవాడూ, తన మిత్రుడి కార్యం నెరవేర్చనివాడూ- మానవాధముడని బుధులు చెప్పుతారు. కనుక కిష్కింధకు చని సుగ్రీవుణ్ణి పిలుచుకొనిరా! పిలిచినా రానని జవాబు పలికితే 'వాలిని చంపిన అమ్ము ఎక్కడకూ పోలేదు'' అని జ్ఞప్తికి ఎలయించి మరలి రమ్ము'' అని వాకొన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధకు పోవుట

లక్ష్మణుడు అన్నకు ప్రణమిల్లి కన్నుల నుంచి ప్రళయకాలాగ్ని కణాలు రాల, శరచాపాలు చేపట్టి కిష్కింధకి వెడలాడు. అతని అవని అల్లల్లాడే పెనుజంగలు వేస్తూ వెడుతూ వుంటే, ఆ గాలివేగానికి చెట్టులన్నీ సమూలంగా కూలిపడ్డాయి. వానరులు అత్యంతమూ భీతులై పరుగులు తీశారు. ద్వారపాలకులుగా వున్న కపులు 'ఇతను ఎవ్వడో' అనుకొంటూ కోటవాకిళ్లు శీఘ్రంగా మూసివేసి వానరులను కావలి వుంచారు. వేవేగు యేగి కపిరాజుకి ఎరిగించాలని పరుగెత్తి తార పరిచారకలతో ఆ విషయం తెలుపగా వాళ్లు ఇది సమయం కాదన్నారు.

అప్పుడు ఆ వానరులు అంగదుణ్ణి సమీపించి, సాగిలి ప్రణామాలు ఒనరించి, ''యువరాజా! మన నగరం వాకిట జడలు, వల్కలాలు ధరించి, మౌని వేషంతో-చేత ధనుర్బాణాలు పట్టి అకలంక సత్త్వుడయి అంతకుడి కరణి కరణి వున్నాడు'' అని తెలిపారు. అంత అంగదుడు ఆ వచ్చినవాడు శ్రీరాముడి తమ్ముడు లక్ష్మణుడని నిశ్చయించి వెంటనే ఏతెంచి లక్ష్మణుడిని కాంచాడు. అంగదుణ్ణి తిలకించి లక్ష్మణుడు ప్రచండ కోపంతో తన రాక సుగ్రీవుడికి తెలియ చెయ్యి'' అని పలికాడు. అంగదుడు శీఘ్రమే చని, మన్మథ మోహాబ్ధిలోమునిగి భార్యా రుమ కరపల్లవాలతో పాదాలు ఒత్తుతూ వుండగా తార మృదువైన తొడలు తలగడగా చేసుకొని సుఖిస్తున్న సుగ్రీవుణ్ణి పొడగాంచాడు.

''వానరరాజా! అదె లక్ష్మణుడు మండిపడుతూ మన కోట మొగసాలలో నిలిచి వున్నాడు'' అని తెలిపాడు. అప్పుడు సుగ్రీవుడు సంశయిస్తూ మంత్రులను పిలిచాడు. ''సామిత్రి కుపితుడై ఈ రీతిగా అరుదెంచాడు. కారణం ఏమిటి? నావల్ల నేరం లేదే'' అని వితర్కించాడు.

-ఇంకాఉంది

ఆదివారం, 17 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ సప్తమి మ.01.27
నక్షత్రం: భరణి ఉ.09.33
వర్జ్యం: రా.10.42 నుండి 12.27 వరకు
దుర్ముహూర్తం: సా.04.42 నుండి 05.28 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శత్రుబాధలు దూరమవుతాయి.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవ ధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధ పడతారు. అసంతృప్తితో ఉంటారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది. కొన్ని కార్యాలు విఫలమవుతాయి.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. ఆత్మీయుల సహాయ సహకారాలనై వేచి వుంటారు. దైవదర్శనం లభిస్తుంది.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
సుఖ, సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీన మేర్పడుతుంది.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. అభివృద్ధి ఉంటుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం. వినోదాలకు దూరంగా నుండుట మంచిది.

మంచిమాట

రథసప్తమి

కర్మసాక్షి అయిన సూర్య భగవానుడు తేజోమయమూర్తి, ఐశ్వర్య ప్రదాత- విశ్వనియంత. వేదాలు - పురాణాలు సూర్యుని ఎంతగానో ఈ సూర్యుని స్తుతించాయి. సూర్యుడికి ఉన్న గతుల ప్రకారం సంవత్సరాన్ని ఐదు భాగాలుగా వర్గీకరించడం జరిగిందని దేవిభాగవతం తెల్పుతుంది. ఉత్తరాయణం ప్రవేశంతో సూర్యుడు తన వేగాన్ని మార్చుకుంటాడు. సూర్యుని గతి మందం అవుతుంది. ఇది ఆరోహణ స్థానం.

మాఘ శుద్ధ సప్తమి రథసప్తమి పర్వదినంగా జరుపుకుంటారు. రథసప్తమి రోజున సూర్యుడి రథం తమ గతిని మార్చుకుంటుందని, సూర్యుని గుర్రం పేరు సప్త అనీ అంటారు. సూర్యుని నుండి ఏడు రకాల వేగాలతో కిరణాలు ప్రసరిస్తూ ఉంటాయి గనుక దానికి గుర్తుగా 'సప్తాశ్వ' అనే విశేషణం ఉంది.

విష్ణువు కొడుకు బ్రహ్మ, బ్రహ్మ కొడుకు మరీచి, మరీచి కొడుకు కశ్యపుడు, అతిథి కశ్యపుల కొడుకు సూర్యుడు. సూర్యుణ్ణి ఆదిత్యుడు అంటారు. కశ్యప మహర్షికి అదితి- దితి ఇద్దరు భార్యలు. అదితికి దేవతలు, దితికి దైత్యులు జన్మించారు. అధికారం కోసం ఇరువురి మధ్య వైరం వచ్చింది. దేవతలకు ప్రాణ సంకటం వచ్చింది. ఇది గమనించి అదితి కశ్యపులు సూర్యశక్తిని ఉపాసించారు. సూర్యుడు ప్రత్యక్షమై వారిని వరం కోరుకోమన్నాడు. అదితి దేవతలను కాపాడుమన్నది. సూర్యుడు అభయం ఇచ్చాడు. విశ్వమంతటా వ్యాపించి యున్న నా తేజస్సును వెయ్యి కిరణాలుగా చేర్చి నీ గర్భంలో స్థాపించెదను. పిదప దేవరూపమున జన్మించి నీ సంతానముల కష్టము తొలగించెదను అని చెప్పాడు. సూర్యశక్తి ఆమె గర్భంలో చేరింది. అదితి గర్భం దాల్చినది. తన సంతానానికి మేలు కలగాలని వ్రతాలు చేస్తుంటే భర్త కశ్యపుడు కోపించి, ఉపవాసాలు చేస్తుండడం మంచిది కాదు, గర్భస్థ శిశువును బలహీనుని చేయకుమన్నాడు.

శాంతంగా అదితి సమాధానం యిస్తూ, స్వామీ ఈ గర్భాండం మీరిచ్చింది కాదు, సూర్యశక్తి ప్రసాదం. ఇది వైరులను సంహరిస్తుంది. దీని తేజాన్ని పరాక్రమాన్ని చూడండని అదితి అపానవాయువేగం చేత తన గర్భాండము పరిత్యాగం చేసింది. ఆ తేజం వలన బ్రహ్మాండములో నిప్పులు రేగాయి. ముని వేద మంత్రాలతో గర్భాండమును స్తుతించాడు. అండం పగిలి దాని నుండి ఒక సుదర్శన బాలుడు జన్మించాడు. ఈ బాలుడే సూర్య నామముతో దేవతల నాయకుడైనాడు. దేవతలకు విజయం లభించింది. విశ్వనియంత అయినాడు. శివుడు సూర్యునిగాంచి సప్తాశ్వవాహనా నీవు శుభాల నొసగే కాశీపురం వెళ్లమన్నాడు. ఈ జగతిలో ఎన్ని జీవరాసులున్నాయో వాటి చేష్టలన్నియో నీకు తెలుసు. అందుకే నిన్ను లోకచక్షువంటారు. సూర్యుడు కాశీ వెళ్ళాడు. ధర్మమయమైన కాశీనగరంలో ఉండాలనే కోర్కె మనస్సులో కలిగిందిగాన లోలార్క నాముడైనాడు. కాశీలో అనేక రూపాలు దాల్చినాడు. ప్రసద్ధి చెందినాడు. ఇలా సూర్య చరిత్రమనకు తెలుస్తోంది.

మాఘమాసంలోని శుక్లపక్ష సప్తమి రోజున చేసిన దానాలు అక్షయ ఫలితాన్నిస్తాయి. అరుణోదయ కాలంలో శిరస్నానం చేసి, సూర్యుని ధ్యానించినవారికి రోగ భయాదులు పోతాయి. అకాల మృత్యువు పరిహరింపబడి అంతిమ దశలో సూర్యలోకాన్ని పొందుతారని ఋషులు వక్కాణించారు. ఈ రోజున సూర్యుని ప్రీతికరమైన జిల్లేడు ఆకులను శిరస్సు - భుజాలు- హృదయంపై వుంచుకుని శిరస్నానం చేసే ఆచారం వుంది. ఆకుమధ్యలో రంధ్రం చేసి అందులో నుంచి సూర్యదర్శనం చేయాలని శాస్త్రం. సూర్యుడు నెలకొక రూపాన్ని పొందుతూ ప్రకృతిని రక్షిస్తాడు. 12 నెలల్లో 12 రకాల రూపాలను ధరిస్తాడు గాన ద్వాదశాత్మ అంటారు. ప్రతిమాసంలో ఆరేసి మంది పరిజనంతో పరిభ్రమిస్తాడు.

సూర్య మహిమను అగస్త్య మహర్షి ఆదిత్య హృదయంలో స్తుతించాడు. త్రేతాయుగంలో రావణునిపై విజయ సాధనకు శ్రీరామునికి ఆదిత్య హృదయాన్ని ఉపదేశించాడు.

-పి.వి.సీతారామమూర్తి

వృతాసురుడు 24

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 17

మాటాట - 16 సమాధానం

మాటాట

ఆధారాలు:
అడ్డం
1. సత్కారమే
3. అదృష్టం, సంపద
4. ఏడారుల్లో వరుసగా పోయే ఒంటిల దండు
8. భార్య, ప్రియురాలు
9. దినములు
11. దాహం
13. పండుకు ముందుదళ
14. ఆనవాయితీ , వాడుక

నిలువు
2. భగవద్భక్తుడు
3. బరువు
5. దర్పం తోడిది
6. చిగురు
7. మన్మథుడు
10. రసం పిండేయగా మిగిలిన చెరుకుచెత్త
11.జాలి, కరుణ
12. ఏనుగు

అక్షర

పరిచయం..

మా టకు వున్న శక్తి సంగతి తెలిసిందే. మంచి మాటలు చెప్పగలిగినవారు స్వామీజీలు అవుతారు. అదే మాటలను బలంగా చెప్పగలిగినవారు నాయకులుగా మారతారు. వారు వాడే పదాలు, చెప్పే విషయాలు కొత్తగా వుండ కపోవచ్చు.కానీ ప్రసంగించే తీరు వైవిధ్యంగా వుంటుంది. ఇది ఎలాంటిదంటే తూటాను బలంగా ప్రయోగించడం అన్నది దాన్ని వాడే తుపాకీపై ఆధారపడినట్లే. మాట సూటిగా గుండెల్లోకి దూసుకుని, మనసు పొరలను చీల్చి, మెద డుపై ప్రభావం చూపిస్తుంది. అందుకే ప్రముఖుల ప్రసంగాలకు ఎప్పుడూ ప్రత్యేకస్థానం వుంటుంది. వియత్నాం విప్లవ నేత హోచిమన్, వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాలను, రాసిన వ్యాసాలను అతగాడ్ని అభిమానించే సోవి యట్ యూనియన్ ప్రచురిస్తే, దాన్ని ఇప్పుడు తెలుగులోకి తెచ్చింది ప్రజాశక్తి బుక్‌హౌస్. ఈ ప్రసంగాలు, వ్యాసాలు అన్నీ ఉద్యమనేపథ్యంలోనో, ఉద్యమసంఘటనలపైనో, ఉద్యమకారుల వ్యవహారాలపైనో సాగినవే కాబట్టి, ఆ ఒరవ డిలోనే వుంటాయి. ఆ తరహా పదజాలంతోనే అవి సాగుతాయి. అయితే ఇక్కడ మరో విషయం వుంది. గడచినపో యిన చరిత్రలో సాగిన ఉద్యమాలు, ఘట్టాలు, నేతలు వంటి విషయాలు ఈ ప్రసంగాలు, వ్యాసాల నేపథ్యంలో తెలు సుకోవచ్చు. అది ఒక అవకాశం కూడా. అయితే సోవియట్ యూనియన్ పుస్తకం కోసం ఎంచుకున్న వ్యాసాలు ఆ అవకాశం అంతగా ఇవ్వలేదు. ఎందుకంటే ఎంపిక చేసిన వ్యాసాల్లో ఎక్కువ లెనిన్ చుట్టూ తిరగడమే కారణం.

హోచిమిన్
అజేయ శక్తి
వెల: రూ.50
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి,
హైదరాబాద్ -20
040 -2760 8107

కాలం చెల్లిన భావనలు

మాదిరాజు రంగారావు రాసిన స్వేచ్ఛా కవిత్వం మానిఫెస్టో
''స్వేచ్ఛా కవిత్వం-పరిచయం'' అనే వ్యాసంతో ప్రారంభమవుతుంది. అయితే ఇందులో కానీ, మిగతా వ్యాసాలలో కానీ స్వేచ్ఛా కవిత్వమంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించలేకపోయారు. 'స్వేచ్ఛా కవిత్వం పద్యంకన్నా భిన్నమైన విస్తృతమైన పాత్రను నిర్వహించింది', 'స్వేచ్ఛా కవిత్వానికి నియతమైన లక్షణం లేదు' అంటూ చెప్పుకుంటూ పోతారు. ఆధునిక అవసరాలను-సంక్లిష్టతను పూరించడానికి పద్యం తప్పుకుని స్వేచ్ఛా కవిత్వానికి చోటిచ్చిందని చెబుతారు.

ఒక విషయానికి సంబంధించిన నూతన భావజాలాన్ని ప్రతిపాదిస్తూ, దాని విధాన నిర్ణయాలను వివరించడమే మానిఫెస్టో అనవచ్చు. కమ్యూనిస్టు మానిఫెస్టో లోక ప్రసిద్ధం. అలాగే తెలుగు కవిత్వానికి సంబంధించి కవిసేన మాని ఫెస్టో, స్వేచ్ఛా కవిత్వం మానిఫెస్టో, దళిత మానిఫె స్టోలు వచ్చాయి. ఇందులో అనామకంగా మిగిలి పోయిన స్వేచ్ఛా కవిత్వం మూడవ ముద్రణగా మళ్లీ మనముందుకు వచ్చింది.

స్వేచ్ఛా కవిత్వం అంటే ఏమిటీ? స్వేచ్ఛగా రాసు కునే కవిత్వమని సామాన్యార్థంలో చెప్పుకోవచ్చు. ఇంతకీ స్వేచ్ఛ కవికా? కవిత్వానికా? కవికి స్వేచ్ఛ ఉంటే కవిత్వం కూడా స్వేచ్ఛా విహారం చేస్తుంది. రాజుల కాలంలోనే కవి నిరంకుశుడని ప్రస్తుతింప బడ్డాడు. ఇక ప్రజాస్వామ్యం వచ్చాక స్వేచ్ఛకు పరి మితులు లేకుండా పోయాయి. కుటుంబాన్ని-కుటుంబ సభ్యులను విమర్శించవచ్చు. మతాన్ని తిట్టవచ్చు కాని తమ కులాన్ని భద్రంగా కాపాడుకో వచ్చు. వీలయితే అగ్రవర్ణాలను తిట్టిపోయవచ్చు. ఏ సమాజంలో నివశిస్తున్నారో, ఏ సమాజంలో తమ అవసరాలు విలాసాలను తీర్చుకుంటున్నారో ఆ సమాజాన్ని దుమ్మెత్తిపోయవచ్చు. జాతి నిర్మాత లను, దేశాన్ని తిట్టిపోయవచ్చు. ప్రభుత్వాన్ని పడ గొట్టమని పిలుపునీయవచ్చు. ఇదంతా వస్తుపర మైన స్వేచ్ఛ. రూపపరంగా కవితా నిర్మాణాన్ని అడ్డ దిడ్డంగా ముక్కలు ముక్కలు చేయవచ్చు. మూడు నాలుగు లైన్లు రాసి లేదా వచనాన్ని ముక్కలు ముక్కులుగా పేర్చి అదే కవిత్వమని బుకాయించ వచ్చు. అకవులు, కుకవులంతా గొప్ప కవులుగా పేరు తెచ్చుకోవచ్చు. అవార్డులు కొట్టేయవచ్చు. దీన్ని మించిన స్వేచ్ఛ ఇంకెక్కడ వుంది?

మాదిరాజు రంగారావు రాసిన స్వేచ్ఛా కవిత్వం మానిఫెస్టో ''స్వేచ్ఛా కవిత్వం-పరిచయం'' అనే వ్యాసంతో ప్రారంభమవుతుంది. అయితే ఇందు లో కానీ, మిగతా వ్యాసాలలో కానీ స్వేచ్ఛా కవిత్వ మంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించలేకపో యారు. 'స్వేచ్ఛా కవిత్వం పద్యంకన్నా భిన్నమైన విస్తృతమైన పాత్రను నిర్వహించింది', 'స్వేచ్ఛా కవి త్వానికి నియతమైన లక్షణం లేదు' అంటూ చెప్పు కుంటూ పోతారు. ఆధునిక అవసరాలను-సంక్లిష్ట తను పూరించడానికి పద్యం తప్పుకుని స్వేచ్ఛా కవి త్వానికి చోటిచ్చిందని చెబుతారు. ''స్వేచ్ఛా కవిత్వం వచ్చాక కవిత్వాన్ని గానం చేసే పద్ధతికి అవకాశం లేకుండా పోయింది'' 'స్వేచ్ఛా కవి త్వంలో చాలా సందర్భాల్లో ఏర్పడే క్లిష్టత భావ రూపాలకూ, ప్రతీకలకు సంబంధించింది'' ''స్వేచ్ఛా కవిత్వం సంప్రదాయ ఛందస్సు నుండి ముక్తమైన ఆధునిక ప్రక్రియ'' ''స్వచ్ఛంద నిర్మాణ శిల్పమే స్వేచ్ఛా కవిత్వం'' 'స్వేచ్ఛా కవిత్వంలో 1980 నుండి క్రమంగా మార్క్సియం వెనకబ డుతూ వచ్చింది. సమన్వయ ప్రజాస్వామ్య దళిత, స్త్రీవాద మైనారిటీ అనుభూతి వాదులూ హైకూ వంటి ధోరణులు వచ్చాయి'' -ఈ స్టేట్‌మెంట్లన్నిం టినీ బట్టి చూస్తే ఈ రోజు వచన కవిత్వాన్ని మనం దేన్ని చెప్పుకుంటున్నామో, దాన్నే వీరు 'స్వేచ్ఛా కవిత్వం'గా చెబుతున్నారని తెలుస్తోంది. ఇందు లోని వ్యాసాలన్నింటిలోను స్వేచ్ఛా కవిత్వం పేరిట వచన కవిత్వం గురించి చేసిన చర్చనే కనబడు తుంది. ఈ విషయాన్ని వీరే నిర్ధారించడం మాని ఫెస్టో రెండవ భాగం 'స్వేచ్ఛా కవిత్వం-మానవీయ భావన''లో చూడవచ్చు.

''ప్రక్రియాపరంగా నిర్మాణ స్వేచ్ఛ కలిగింది. సమాజపరంగా అన్ని వాదాల్నీ, ఆదర్శాల్నీ, సిద్ధాం తాల్నీ, అభిప్రాయాల్నీ ఆహ్వానిస్తుంది. ఈ దృష్టితో, ఈ ప్రక్రియకు 'వచన కవిత్వం' కన్నా 'స్వేచ్ఛా కవిత్వం' అన్న పేరు అన్వర్థమవుతుంది''-ఇలా అన్నవారే వచన కవిత్వం దానికి సంబంధించిన పరిమితుల కారణంగా, విశాలమైన ప్రాతిపదికగల స్వేచ్ఛా కవిత్వంలో అవలీలగా అంతర్భాగమవు తుందంటారు. వచన కవిత్వానికి పర్యాయప దంగా వ్యవహరిస్తూనే దాని పరిమితులేవో చెప్ప కుండా, తామనుకునే స్వేచ్ఛాకవిత్వంలో అది ఎలా కలిసిపోతుందో వివరిస్తే బాగుండేది. వచన కవిత్వం స్వేచ్ఛా కవిత్వం ఎలా డిఫరెంట్ అన్న విషయం చెప్పలేకపోతే ఈ ప్రతిపాదనకు అర్థమే లేకుండా పోతుంది.

''మేనిఫెస్టో స్వేచ్ఛాకవిత్వం''
మాదిరాజు రంగారావు
రసధుని
హైదరాబాద్
వెల: రూ. 50/-

మొదటి భాగంలో 'మానవత - అవసరం' గురించి వ్యాసం రాసిన రచయిత రెండో భాగానికి ఏకంగా 'స్వేచ్ఛాకవిత్వం-మానవీయ భావన' అనే పేరుతో తీసుకువచ్చారు. మానవీయత అంటూ ప్రత్యేకంగా ఉంటుందా? ప్రస్తుతం ఉన్న కవితాధో రణులలో ఏ వర్గానికి చెందని వారిని, కరుణ రస పూరితమైన కవిత్వాన్ని రాసే వారిని ''మానవతా వాద కవులు''గా ముద్రవేస్తున్నారు. ఇది చాలదన్న ట్టుగా మళ్లీ ''స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ భావ నలు'' ఏమిటి? మొదటి భాగంలో ప్రజాస్వామ్యం గురించి ఊదర కొట్టేశారు. మనకు స్వాతంత్ర్యం వచ్చి ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడిన ఇన్నాళ్లకు మళ్లీ ప్రజాస్వామ్యం గొప్పదనం గురించి వివరిం చాల్సిన అవసరముందా? ఈ భావనలన్నీ అప్రయ త్నంగానే కవిత్వంలో సిద్ధిస్తున్నప్పుడు, ప్రత్యే కంగా ఇవి ఉండాలని నిర్దేశించడం ఎందుకో? పుస్తకాన్ని తిరిగి ముద్రిస్తున్నప్పుడు, మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా పుస్తకాన్ని అప్‌డేట్ చేసుకుంటే అనవసర గందరగోళం తొల గిపోయేది.

చివరగా అర్థమైనదేమిటంటే - వచన కవిత్వం వెలువడుతున్న తొలి దశలో ఈ ప్రక్రియకు రకర కాల పేర్లు పెట్టడం జరిగింది. కొందరు ప్రాహ్లాద కవిత్వమనీ, కొందరు వచన పద్యమనీ, మరి కొందరు స్వచ్ఛంద కవిత్వమనీ, ఇంకొందరు స్వేచ్ఛా కవిత్వమని పిలుచుకున్నారు. మాదిరాజు గారు కూడా అప్పటి స్వేచ్ఛా కవిత్వం అనే మాటను ఇప్పటికీ విడవకుండా, దాన్నే అంటిపెట్టుకుని తన వాదాన్ని వినిపిస్తున్నారని అర్థమవుతుంది. వ్యవహా రంలో ఒక పదం రూఢిగా నిలిచిపోయిన తర్వాత, దాన్ని కాదని ఎంత వాదించినా ఎవరూ పట్టించు కోరు. ప్రస్తుతం కవిత్వమంటే వచన కవిత్వమే. ఎవరూ గుర్తించని, ఎవరూ ఆమోదించని స్వేచ్ఛా కవిత్వం అనే కాలం చెల్లిన భావనను ప్రచారం పేరిట ప్రతి పదేళ్ల కొకసారి ముద్రించుకోవడంలో అర్థమే లేదని గ్రంథకర్త గుర్తిస్తే బాగుంటుంది.

-కె.పి.అశోక్‌కుమార్

తరిగొండ వెంగమాంబ చరిత్ర
-వేదగిరి వేంకట నరసింహ రాయశర్మ
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో

వెంగమాంబపై మనోహర పద్యకావ్యం

పద్యకవులు తగ్గిపోయారన్నది సత్య దూరం. పెద్దలే కాదు యువకులు కూడా చాలామంది మంచి పద్యాలు రాస్తున్నారు. మనో జ్ఞులైన పద్యకృతులు రాసే కవులు కూడా ఎక్కువే. వారిలో శ్రీ వేదగిరి వేంకట నరసింహరాయశర్మ ఒకరు. అనంత వైభవం, ఆంధ్రకేసరి, అన్నమాచా ర్యులు వంటి పద్య రచనలు చేశారు. ఇప్పుడు వేంకటేశుని భక్తురాలు తరిగొండ వెంగమాంబ చరిత్రను ప్రచురించి పద్య రచనలో అందెవేసిన చేయి అనిపించుకున్నారు.

వెంగమాంబ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, నిర్మల భక్తిని ఏడు ఆశ్వాసాలుగా రసవంతంగా రచిం చారు నరసింహ రాయశర్మ. ఈ కావ్యం సంప్ర దాయ రీతిలో సాగింది.

"పుట్టినప్పటినుండి పురుషోత్తముని మీద
బుద్ధిని నిల్పిన పూవుబోణి
శేషాద్రినాథుని సేవించి నిరతంబు
పరతత్వమెఱిగిన భక్తురాలు
ఛాందసవాదుల శాస్త్ర చర్చలడంచి
ప్రతిభను చాటిన ప్రాజ్ఞురాలు..."

అంటూ అవతారికలోనే వెంగమాంబ విశిష్ట తను నాంది పద్యంగా సూచించారు. కావ్యారం భానికి ముందు చానమ్మ, తిమ్మక్క, మొల్ల, ముద్దు పళని, రంగాజమ్మ వంటి కవయిత్రుల్ని స్తుతిం చడం పరమౌచిత్యంగా ఉంది. మరి తిరుపతి ఎటువంటిది?

"సిరిగల వాని నివాసము
తిరుమల ఋషిపుంగవులకు తీర్థంబులకున్
తరువుల నిలయము, గుడిగో
పురముల కాణాచి, కూర్చు పురుషార్థతతిన్"

పూర్వ కవుల అనుసరణలూ అక్కడక్కడ కని పిస్తాయి. డా.కె.జె.కృష్ణమూర్తి 'ఛందో వైచిత్రి వర్ణ్య వస్తువును సుకుమారంగా, సొంపుగా అవి ష్కరిస్తూ ఉంది. వీరి 'కవిచంద్ర' బిరుదు సార్థకం అనడం సత్యసన్నిహితమే. ఆస్తికవర్యులు, పద్య ప్రియులూ, తెలుగు భాషాభిమానులు చదవద గిన రచన ఇది.

-ద్వా.నా.శాస్త్రి

మానవత్వపు హృదయ వైశాల్య చిహ్నాలు

ప్రపంచంలో అన్నింటికన్నా తల్లి ప్రేమ గొప్పది అన్న వాదం ఉంది కాని దీనికి భిన్నమైన వాదాన్ని బలపరిచే ప్రయోగం ఒకటి చింపాంజీల మీద జరిగింది. ఒక గాజు గదిలో తల్లి, పిల్ల చింపాంజీలని ఉంచి క్రమంగా నీళ్ల గదిలోకి పంపిస్తారు. నీటి మట్టం పెరుగుతున్నకొద్దీ తల్లి పిల్లని ఎత్తుకోడం, భుజాలమీదకి తీసుకోడం, పిల్లకి ఊపిరి అందేలా చూడడం జరుగుతుంది. నీటిమట్టం తల్లి ముక్కుదాకా వచ్చి నపుడు పిల్లని కిందపడేసి తల్లి తన ప్రాణం కాపాడుకోడానికి ప్రయత్నించడం మొదలుపెడుతుంది.

దానం చేయడం ఎలా? అన్న ప్రశ్నకు సమాధానం అంత సులువుగా దొర కదు. యుగధర్మాన్ని పాటించాలన్నది ఆర్యుల ఉవాచ. కృతయుగంలో పుచ్చుకునేవారి ఇంటికి వెళ్లి దానం చేయాలి. త్రేతాయుగంలో దాత ఇంటికి పిలిచి దానం చేయాలి. ద్వాపర యుగంలో ఇంటికి వచ్చి అభ్యర్థించిన వారికి దానం చేయాలి. కలియుగంలో ఎలా చేయాలి అన్న ప్రశ్నకు మిగతా యుగాలలో ఉన్నంత స్పష్టమైన సమాధానం దొరకదు. దాతలు వారి అనుభవం నించి నేర్చు కున్న పాఠాలనించి, దానాలు కొనసాగించవచ్చునన్నది ఒక సమాధానం. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేత్రి/ చేయిర్ పర్సన్ అయిన సుధామూర్తి అనుభవసారం 'ది డే ఐ స్టాప్‌డ్ డ్రింకింగ్ మిల్క్'అన్న పుస్తక రూపంలో చదువరుల ముందుకు వచ్చింది.

ఈ పుస్తకంలో ఇరవైమూడు వ్యాసాలున్నాయి. రచయిత్రి మానవ మనస్తత్వం లోని విభిన్నమైన కోణాలని, పాఠకుల హృదయాలు స్పందించేలా అందించ డంలో విజయం సాధించారు. స్థాలీపులాకంగా కొన్ని వ్యాసాలను పరిచయం చేసుకుందాం.

దానం చేయడానికి ధనవంతులే కావాలా? మనకున్న దాంట్లో కొంత లేని వారికి ఇవ్వవచ్చునన్న సూత్రం 'గంగా'స్‌ఘాట్'లో ఉంది. కర్ణాటకలో చిన్న గ్రామంలో నివసించే గంగ, కూలీ పనిచేసి పొట్టపోషించుకునేది. విలువైన వస్తువులేమీ లేవు కాబట్టి గుడిసెకి తాళంవేయాల్సిన అవసరం లేదు. గ్రామంలో నీటిఎద్దడి ఉంది. వేసవిలో సమస్య తీవ్రం అవుతుంది. గంగ, వంట చేసుకుంటుండగా వచ్చిన ముష్టి వాడికి, ''ఇవాళ బియ్యం తక్కువ ఉన్నాయి. ఇంకోరోజు వస్తే కొంత అన్నం పెట్టగలను'' అంటుంది.''నాకు అన్నం అక్కర్లేదు. ఒళ్లంతా దురదగా ఉంది. బక్కెట్టుడు గోరువెచ్చని నీళ్లలో స్నానంచేస్తే తగ్గుతుందని ఎవరో చెప్పారు. దయచేసి నీళ్లు ఇయ్యితల్లీ'' అన్నాడు ముష్టివాడు. ఇబ్బంది ఉన్నా గంగ 'నీరు' దానం చేస్తుంది. ముష్టివాడు ఆశీర్వదించి వెడతాడు. మర్నాడు మళ్లీ వచ్చినా నీటి దానం కొనసాగింది. కొన్నాళ్ల తర్వాత ముష్టి వాడు ఇంకొక ముష్టివాడిని తీసుకువచ్చాడు. జలదానం కొనసా గింది. గంగ చేస్తున్న దానం గ్రామస్థులకి తెలిసింది. ఎవరికి చేత నైన సాయం వారు చేయడం మొదలుపెట్టారు. సైకిలుమీద నీళ్లు తెచ్చేవారొకరైతే, ముష్టివాళ్లు ఎండుటాకులు, పుల్లలు తెచ్చేవారు. స్నానాలు చేసే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. స్త్రీలుకూడా రావడం మొదలుపెట్టారు. వారికోసం ప్రత్యేకంగా కొబ్బరి ఆకుల చాపల స్నానాల మరుగు ఏర్పాటయింది. రచయిత్రి సబ్బులు, తువ్వాళ్లు ఇస్తానంటే గంగ చెప్పిన సమాధానం ఆశ్చర్యపరు స్తుంది. ''నేను గుడిసెకి తాళం వేయాల్సిన అవసరం ఇంతవ రకూ రాలేదు. సబ్బులరిగిపోతే కొత్తవి కావాలంటారు. తువ్వాలు చిరిగిపోయింది కొత్తది కావాలంటారు. నేను తువ్వాళ్లు సబ్బులూ దాచేసుకుంటానని అనేవాళ్లూ ఉంటారు. మీరు ఇవ్వ దలచుకుంటే నాకభ్యంతరం లేదు!'' కాశీ, హరిద్వార్, ఋషీకేష్ లలో గంగానది స్నానఘట్టాలకి, చిన్న గ్రామంలో గంగ ఏర్పాటు చేసి స్నానఘట్టానికి ఏమీ తేడా లేదనిపిస్తుంది.



ది డే ఐ స్టాప్‌డ్ డ్రింకింగ్ మిల్క్
- సుధామూర్తి -
వెల: రూ.199;
పుటలు: 212
ప్రచురణ:
పెంగ్విన్ బుక్స్ ఇండియా.

రచయిత్రి ఒరిస్సా రాష్ట్రంలోని కుగ్రామంలో బడి కట్టించడానికి వెళ్లినపుడు, వానలో చిక్కుకుపోతుంది. వాన తగ్గేవరకూ ఈ గుడిసెలో తల దాచుకుందామం టాడు తోడు వచ్చిన అనువాదకుడు. గుడిసె యజమాని సాదరంగా ఆహ్వానిస్తాడు. అనువాదకుడు పనిమీద బయటకు వెడతాడు. ఆ విధి సత్కారంలో భాగంగా టీ/కాఫీ తాగమంటాడు. రచయిత్రి వద్దంటే ఏదైనా తినండి, కనీసం పాలైనా తాగండి అంటే 'సరే'నంటుంది రచయిత్రి. గృహస్థు భార్యతో 'మన అతిథి మన కోసం స్కూలు కట్టిస్తున్నారు కాబట్టి ఆవిడకి కొంచం పాలియ్యి'అని ఒరియా భాషలో చెబుతాడు. రచయిత్రికి ఒరియా రాదనుకున్న భార్య ఆవిడకి జుట్టు నెరి సినా ఇంగిత జ్ఞానం ఉన్నట్టులేదు. టీకయితే రెండు చుక్కల పాలు సరిపోతాయి. పిల్లాడు పాలకోసం ఏడుస్తున్నా కొంత టీ ఇవ్వగలం. తింటే చేపల కూర ఇవ్వ గలం. ఖరీదయిన పాలు అడిగితే ఎలా?'' అంటుంది. ఈలోగా అనువాదకుడు తిరిగి వస్తాడు. 'మనకు ఆశ్రయం ఇచ్చిన ఆయనకి నేను ఈనాడు ఉపవాసం ఉంటున్నానని బుధవారం నీరు తప్ప ఇంకేమీ తాగను కాబట్టి పాలు ఇవ్వవద్దని చెప్పండి' అంటుంది రచయిత్రి. పొద్దున్న పాలు తాగినావిడ ఉపవాసం అంటోం దేమిటని అనువాదకుడు ఆశ్చర్యపోతాడు! పుస్తకం శీర్షిక వెనకాల ఉన్న అసలు కథ ఆసక్తికరంగా ఉంది.

'మా అమ్మాయికి మంచి పెళ్లిసంబంధం చెప్పండి'అని స్నేహితులు/ బంధు వులు అడగడం సర్వసామాన్యం. రచయిత్రి స్నేహితురాలున్న ఊరికి అనుకో కుండా వెళ్లినపుడు, వాళ్లింట్లో పెళ్లిచూపులు జరుగుతూ ఉంటాయి. అయ్యో ఫోను చేయకుండా వచ్చాను. మళ్లీ వస్తాను అంటే నువ్వుకూడా కుటుంబంలోని దానివే అని స్నేహితురాలు బలవంతంగా అనేస్తుంది. కాలేజి క్లాస్‌మేట్ అని పరిచయం చేస్తుంది. రచయిత్రి నమస్కారం అందుకున్న పెళ్లివారి ముఖాలు వన్నెతగ్గుతాయి. ఫోను రావడంతో రచయిత్రి బయటకు వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి పెళ్లివారు తిరుగు ముఖం పడుతూ కనబడతారు. అబ్బాయికి మంచి ఉద్యోగం, తల్లిదండ్రులు ధని కులు అన్ని బాగున్నాయి అనుకుంటే, మీ సంబంధం వదులుకుంటున్నాం అనడం ఆడపిల్ల తల్లిదండ్రులనే కాకుండా పాఠకులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎందుకిలా జరిగిందన్న ప్రశ్నకు జవాబు తెలుసుకోడానికి 'బాడ్‌హెల్ప్' వ్యాసం చివరిదాకా చదవాలి.

ఈ రోజులలో మగవాళ్లు చేసే పనులన్నింటినీ స్త్రీలు చేస్తున్నారు. రచయిత్రి ఇంజనీరింగు పూర్తిచేసిన వెంటనే టెల్కోలో ఉద్యోగానికి ప్రయ త్నించడం, ఈ రంగంలో స్త్రీలకి ప్రవేశం లేదని ఉద్యోగం ఇవ్వ కపోతే అధినేత 'టాటా'కి ఉత్తరం రాయడం, ఆ రోజులలో ఘనంగా చెప్పుకొనేవారు. తండ్రి శ్రాద్ధకర్మలు నిర్వహించడానికి కుమారుడే ఉండాలి. కొడుకులు లేనివారికి కొడుకు వరుసైన వాడు నిర్వహించాలి. కాని స్త్రీలు చేయకూడదు అన్న గుడి మానే జరు వాదన నెగ్గిందా అన్నది 'శ్రాద్ధ'వ్యాసం చదివితేకాని తెలి యదు.

ప్రపంచంలో అన్నింటికన్నా తల్లి ప్రేమ గొప్పది అన్న వాదం ఉంది కాని దీనికి భిన్నమైన వాదాన్ని బలపరిచే ప్రయోగం ఒకటి చింపాంజీల మీద జరిగింది. ఒక గాజు గదిలో తల్లి, పిల్ల చింపాంజీలని ఉంచి క్రమంగా నీళ్ల గదిలోకి పంపిస్తారు. నీటి మట్టం పెరుగుతున్నకొద్దీ తల్లి పిల్లని ఎత్తుకోడం, భుజాలమీదకి తీసుకోడం, పిల్లకి ఊపిరి అందేలా చూడడం జరుగుతుంది. నీటిమట్టం తల్లి ముక్కుదాకా వచ్చినపుడు పిల్లని కిందపడేసి తల్లి తన ప్రాణం కాపాడుకోడానికి ప్రయత్నించడం మొదలుపె డుతుంది. మానవుల ప్రవర్తన భిన్నంగా ఉంటుందా? అన్న ప్రశ్నకు సమాధానం 'ఎ మదర్స్‌లవ్'లో లభిస్తుంది.

తరాలు మారితే అంతరాలు ఎలా మారుతాయో తెలియ చెప్పే వ్యాసం 'యు షుడ్ హావ్ అస్క్‌డ్‌మీ'. స్కూలు బాగ్‌లు తయారుచేసే కర్మాగార అధిపతి చిన్ని చిన్ని లోపాలున్న సంచు లని గ్రామాలలోని పిల్లలకి ఉచితంగా అందచేయవలసిందని రచయిత్రిని కోర తాడు. ప్రతి ఏటా మేనెలలో మీ సహాయకుడు మా మానేజరుని కలిసి సంచులు తీసుకెళ్లవచ్చు. మానేజరు మారినప్పుడల్లా సంప్రదాయం వివరించడం జరిగేది. కొన్నేళ్ల తర్వాత అధిపతి బాధ్యతలని అల్లుడికి అప్పగిస్తాడు. ''మీ అధినేత్రి నన్ను కలిస్తే కాని ఈ ఏడాది సంచులు పట్టుకెళ్లడానికి వీలులేదంటాడు''. అల్లుడు ఈ విష యాన్ని మామగారికి చెప్పాలా? చెప్పడం కుటుంబ కలహానికి దారితీస్తుంది కదా? రచయిత్రి పరిష్కరించిన తీరు మానవ సంబంధాలు విద్యార్థులకి మంచి పాఠం.

మనశ్శాంతిని సాధించిన విష్ణు, వినిపించడమే కాని వినడం తెలియని వెంకట్, ఒక్క రైలుప్రయాణంతో జీవితం మారిన చిత్ర, సంస్కృతం నేర్పించిన దెయ్యం అమెరికా వెళ్లిన కొడుకు పశ్చాత్తాపం, చరిత్ర విలువ తెలుసుకున్న రాజీవ్, దేవుడు వరమిచ్చినా అడ్డుకోగల పూజారి లాంటి ఫాక్టరీ మానేజరు- ఇలా అనేక విభిన్న మయిన మనుషులు పరిచయం మిగతా వ్యాసాలలో ఉంది. 1979లో అమెరికా వెళ్లినపుడు ఇమ్మిగ్రేషన్ అధికారి అడిగిన ప్రశ్నలకీ (ఉదా: ఇండియా ఆఫ్రికాలో ఉందా?) 2009లో అడిగిన ప్రశ్నలకీ (ఉదా: How is that Indians are so good) ఉన్న తేడా "Changing India' వ్యాసంలో చదివిన ప్రతి భారతీయుడికీ ఆనందం కలిగిస్తుంది.

ఈ పుస్తకం చదివిన తర్వాత రచయిత్రి రాసిన Wise and other wise, The Old man and his god, Maha Swetha, Doolar Bahu చదవాలనిపించడం సహజం. ఆంగ్లంలో రాసినా మాతృభాష కన్నడ ప్రభావం ఉందనిపించింది.

-పాలంకి సత్యనారాయణ



పగలే వెన్నెల
మినీ కవిత
-బోజంకి
వెల: రూ.49/-
ప్రతులకు:
సాహిత్య బోజంకి వి.రాణి
వి.శాంతపాలెం,
విశాఖపట్నం- 531 022
98854 25145

సుప్రసిద్ధులు
ఆంగ్లమూలం: జేమ్స్ బాల్డ్విన్
తెలుగు సేత: డి.రంగారావు
సంపాదకుడు: పి.రాజేశ్వరరావు
వెల: రూ.50/-
ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రేతలు
ప్రగతి పబ్లిషర్స్, ఎల్.బి.నగర్,
హైదరాబాద్-74.
040-24031257/
8096 314 553.

ఆనాటి నవలకు అలనాటి అనువాదం

నవలలోని కథాకాలం 1775 సంవత్సరం. కథలోని సన్నివేశాలు కొన్ని లండన్ నగరంలోను, మరికొన్ని పారిస్ నగరంలోను కనిపిస్తాయి. అప్పట్లో రాచరిక పాలనలో ఉన్న ఇంగ్లండ్‌లో శాంతి భద్రతల పరిస్థితులన్నీ సర్వనాశనమై అరాచకం విచ్చలవిడిగా వీరవిహారం చేస్తున్నది. దోపిడీ ముఠాలు చెలరేగిపోవడంతో సైనికులు జరిపిన కాల్పులలో కొందరు మరణిస్తే, నేరం మోపబడి ఉరి కంబానికి వేలాడే వాళ్లు మరికొందరు. ఉరితీసే ఉద్యోగులకు చేతినిండా పని.

అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన ఆంగ్ల నవల "A TALE OF TWO CITIES' కు ఇది అనువాదం. నిరంకుశ రాచరిక వ్యవ స్థకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ దేశంలో జరిగిన ప్రజాపోరాటం ఈ నవలకు నేపథ్యం. తెన్నేటి సూరి చేసిన అనువాదం 1956లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబ డింది.

నవలలోని కథాకాలం 1775 సంవత్సరం. కథలోని సన్నివేశాలు కొన్ని లండన్ నగరం లోను, మరికొన్ని పారిస్ నగరంలోను కనిపి స్తాయి. అప్పట్లో రాచరిక పాలనలో ఉన్న ఇంగ్లండ్‌లో శాంతి భద్రతల పరిస్థితులన్నీ సర్వ నాశనమై అరాచకం విచ్చలవిడిగా వీరవిహారం చేస్తున్నది. దోపిడీ ముఠాలు చెలరేగిపోవడంతో సైనికులు జరిపిన కాల్పులలో కొందరు మర ణిస్తే, నేరం మోపబడి ఉరి కంబానికి వేళాడే వాళ్లు మరికొందరు. ఉరితీసే ఉద్యోగులకు చేతి నిండా పని.

పారిస్ నగరంలో భోగ లాలసుడైన ఫ్రెంచి రాజు పరిపాలన మరీ అధ్వా న్నంగా ఉంది. పరిపాలనా బాధ్య తలు నిర్వహిస్తున్న వారు ప్రజాకం టకులుగా తయారయ్యారు. ప్రాంతీయంగా ఉన్న జమీందార్లు తమ ఏలుబడిలో ఉన్న ప్రజానీ కాన్ని పశువులకన్నా హీనంగా చూస్తూ జైలుశిక్షలు, మరణ దండ నలు విధిస్తూ ఇష్టారాజ్యంగా ప్రవ ర్తిస్తున్నారు. క్రూరమైన పాలనా స్థితికి తోడు ఆకలి చావులు మొద లైనాయి. ఒకపక్క పరిపాలించే వాళ్లు ఐశ్వర్యంతో భోగాలనుభవిస్తుంటే మరో పక్క తినటానికి తిండి దొరకక పేద ప్రజానీకం నరక యాతన పడుతున్నారు. అసహాయ స్థితిలో ఉన్న ప్రజానీకంలో ఒక అగ్ని కణం లాగా కసి మొదలైంది.

చిన్న నిప్పు రవ్వ కాస్తా రాజుకుని చివరకు ఒక విస్ఫోటనంలాగా మారడం ఈ నవలలో కనిపిస్తుంది. పేద ప్రజల తిరుగుబాటులో జమిందార్ల కోటలు కూలిపోయాయి. జైళ్లలో వున్న ఖైదీలు విడుదలయ్యారు. స్థానికంగా మొదలైన ఈ ఆందోళనలు దేశవ్యాప్తమైపో తాయి.

తిరుగుబాటుదార్లు ప్రజాకంటకులుగా భావించిన వాళ్లను ఎక్కడికక్కడ ఉరి తీయడం మొదలెట్టారు. చట్టం ప్రజల చేతుల్లోకి వెళ్లింది. మరణ దండన విధించబడిన వారి జాబితా లోకి వందల సంఖ్యలో అమాయకులైన పేద ప్రజల పేర్లు కడా చేరిపోతుండడంతో ఉరి తీసే కార్యక్రమం నిర్వహణ కష్టంగా మారింది. అందుకని శిరచ్ఛేదనా యంత్రం గిలటైన్‌ను తయారుచేసారు.

సరైన నాయకత్వం అనేది లేకుండా చెలరేగి పోయే ఉద్యమాల వల్ల ఎటువంటి దుష్పరిణా మాలు కలుగుతాయో ఈ నవల తెలుపు తుంది.

పుస్తకంలోని ప్రధాన పాత్రలలో టెల్‌సన్స్ బ్యాంకి ఉద్యోగి జర్విన్ లారీ ఒకరు. వార్ధక్య దశలోనూ శ్రద్ధగా అంకితభావంతో తన బాధ్య తలు నిర్వహ

చైత్రమాసంలో ధాత నే పేరుతోను, వైశాఖ మాసంలో అర్యయుడు అనే పేరుతోను, జేష్ట మాసంలో మిత్రుడు అనే పేరుతోను, ఆషాఢ మాసంలో వరుణుడు అనే పేరుతోను, శ్రావణ మాసంలో ఇంద్రుడు అనే పేరిట, భాద్రపద మాసంలో వివస్వానుడు అనే పేరు తోనూ, అశ్వయుజ మాసంలో త్వష్ట అనే పేరుతోను, కార్తిక మాసంలో విష్ణువు అనే పేరుతో, మార్గశిర మాసంలో అంశువు అనే పేరుతో, పుష్య మానం భగుడు అనే పేరు తోను, మాఘమాసం పూముడు అనే పేరుతో, ఫాల్గుణ మాసం క్రతువు అనే పేరు తోను సూర్యసంచారం జరుగుతోంది.

సూర్యభగవానునికి ఎదురుగా ఆవు పిడకలతో దాలిచేసి, దానిమీద పాయసాన్ని వండటం, చిక్కుడు కాయలకు చీపురుపుల్లలు గుచ్చి సూర్యరథం తయారుచేసి, క్షీరాన్నాన్ని చిక్కుడాకులలో ప్రసాదం పెట్టి లోక సాక్షికి నివేదన చేసి ప్రసాదాన్ని పంచటం. ఇలాంటి ఈరోజు ఆచరించాల్సిన ఆచరణల గురించి, భవిష్య పురాణంలో రథసప్తమి వ్రతాన్ని గూర్చి విశేషంగా తెలుపబడింది.

మానవాభ్యుదయానికి మంగళతోరణం-సూర్యకిరణం

ధ్యాయేత్ సూర్య మనంత శక్తి కిరణం తేజోమయం భాస్కరం

.....

.....

భక్తాభీష్ట వరప్రదం దినమణిం మార్తాండ మాద్యం శుభమ్॥

అనంతమైన శక్తి కిరణాలు కలవాడు, తేజోమయుడు, ఈ జగత్తుకు వెలుగును ప్రసాదించేవాడు, భక్తులకు అభయమిచ్చేవాడు, పగలు, రాత్రులతో రోజులను ఏర్పరచేవాడు, జ్యోతి స్వరూపుడు, శుభాలను కలిగించే శుభంకరుడు, జగదీశుడు, అచ్యుతుడు, ముల్లోకాలకు చూడామణి వంటివాడు. మార్తాండుడు, శుభస్వరూపుడైనవాడు ఆ సూర్యభగవానుడు. మనకు గల దేవీ, దేవతలలో కుంకుమ పూజలు, అభిషేక, అర్చనలకూ సంతుష్టి చెందేవారే అందరూ. అవి అన్నియూ కొంత ఖర్చు, శ్రమతో కూడుకొనునవి. లోక సాక్షియైన ఆ సూర్య భగవానుడు మాత్రం కేవలం నమస్కారప్రియుడు. ప్రతి నిత్యం స్నాన్నాంతరం భక్తి శ్రద్ధలతో ఆ స్వామికి నమస్కరిస్తే చాలు అనేక జన్మల నుంచి వచ్చే దారిద్ర్యాలను నశింపచేసి ఆయురారోగ్యాలను ప్రసాదించే దొడ్డదైవంగా భక్తులచే కీర్తింపబడుచున్నాడు.

మనకు గల పన్నెండు మాసాల్లోనూ పన్నెండు రకాల పేర్లతో సూర్యుని ఆరాధన జరుగుతోంది. చైత్రమాసంలో ధాత నే పేరుతోను, వైశాఖ మాసంలో అర్యయుడు అనే పేరుతోను, జేష్టమాసంలో మిత్రుడు అనే పేరుతోను, ఆషాఢ మాసంలో వరుణుడు అనే పేరుతోను, శ్రావణ మాసంలో ఇంద్రుడు అనే పేరిట, భాద్రపద మాసంలో వివస్వానుడు అనే పేరుతోనూ, అశ్వయుజ మాసంలో త్వష్ట అనే పేరుతోను, కార్తిక మాసంలో విష్ణువు అనే పేరుతో, మార్గశిర మాసంలో అంశువు అనే పేరుతో, పుష్య మాసం భగుడు అనే పేరుతోను, మాఘమాసం పూముడు అనే పేరుతో, ఫాల్గుణ మాసం క్రతువు అనే పేరు తోను సూర్యసంచారం జరుగుతోంది. మార్గశిర మాసంలో దశాదిత్య, ద్వాదశాదిత్య వ్రతాలను,పుష్యమాసంలో మార్తాండ సప్తమీ వ్రతాన్ని, మాఘమాసంలో మందసప్తమి, భానుసప్తమి వ్రతాలు, ఫాల్గుణ మాసంలో కర్కాట సప్తమి వ్రతం, చైత్ర మాసంలో ఆరోగ్యప్రద లేదా చైత్రమాసీయ వ్రత, శ్రీ సూర్యవ్రతం, వైశాఖ మాసంలో కమల సప్తమివ్రతం, జేష్టమాసంలో కరవీరవ్రతం, ఆషాఢ మాసంలో వివస్వాన్ వ్రతం, శ్రావణ మాసంలో పావనాశనీ వ్రతం, భాద్రపద మాసంలో సూర్యషష్టివ్రతం, అశ్వయుజ మాసంలో ఆదిత్య రవివార వ్రతం ప్రముఖంగా చేసే సంవత్సరంలోని సూర్యారాధన వ్రతాలు.

మనం చేసే అన్ని సూర్య వ్రతాలలోనూ అత్యద్భుత, అమోఘ దివ్య సత్ఫలితాన్ని శీఘ్రంగా, సులభంగా, శుభప్రదంగా ఒసగునది రథసప్తమీ వ్రతం. సంవత్సరం పొడవునా శాస్త్రంలో తెలుపబడిన సూర్యవ్రతాలు ఆచరించలేని అశక్తులు హీనాతి హీనపక్షం రథసప్తమి వ్రతాన్ని అయిననూ శ్రద్ధా, భక్తులతో ఆచరిస్తే సంవత్సరం మొత్తంలోని సూర్య వ్రతాలన్నీ ఆచరించి సత్ఫలితం లభించటం తథ్యం. మాఘశుద్ధ సప్తమియే రథసప్తమి. ఏ కారణంగానైనా ఈ రోజు రథసప్తమీ వ్రతం ఆచరించలేని అశక్తులు ఈ మాసంలోని ఏదో ఒక ఆదివారం ఆచరించిననూ తత్ ఫలితం లభించే తీరుతుంది.

సాక్షాత్ సూర్యభగవానుడే సాంబునికి ఉపదేశించిన నామాలు ఇరవై ఒక్కటి. వీటిని త్రికరణ శుద్ధిగా ప్రతినిత్యం జపించిన వారి సర్వ అనారోగ్యాలు పటాపంచలవుతాయని శాస్త్ర వచనం. ఆ నామాలివే

1) వికర్తన 2) వివస్వాన్ 3) మార్తాండ 4) భాస్కర 5) రవి 6) లోకప్రకాశక్ 7) శ్రీమాన్ 8) లోకచక్షు 9) మహేశ్వర 10) లోకసాక్షి 11) త్రిలోకేశుడు 12) కర్త 13) హర్త 14) తమిస్రహ 15) తపన 16) తాపన 17) శుచి 18) సప్తాశ్వవాహన 19) గభస్తిహస్త 20) బ్రహ్మ 21) సర్వదేవ సమస్కృత.

రథసప్తమి నాడు ఏమి చేయాలి? మాఘ శుద్ధ షష్టి నాడు బ్రాహ్మీముహూర్తంలోనే నిద్ర లేచి అవకాశం వున్నవారు నదీ స్నానం చేసి (స్నానంతు నదీ స్నానం ముత్తమం అని శాస్త్రవచనం) దగ్గరలోని సూర్యదేవాలయాన్ని సందర్శించి స్వామిని ఆరాధించి ఇంటికి వెళ్ళి, నూనె చేరని పదార్థాలతో బంధుమిత్రులతో భుజించాలి. రాత్రి నిరాహారుడై నేలపై పడుకోవాలి. మర్నాడు రథసప్తమినాడు మరల బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచి పూర్వ దినము వలెనే నదీ స్నానం చేసి సర్వాలంకారాలతో ఓ రథాన్ని తయారుచేసి మంటపంలో దాన్నుంచి కుంకుమ, గంధాక్షతలతో పూజించి సూర్యభగవానుని ప్రతిమను ఆ రథంలో ఉంచి అర్చించి నివేదించాలి.

రాత్రి జాగరణ చేసి అష్టమిరోజు మరల నదీ స్నానం, పూజ చేసి పేదలకు దాన, ధర్మాలు చెయ్యాలి. తర్వాత పూజించిన రథాన్ని ఆ రథంతో పాటు ఆవుని, గురువుగా భావించే వ్యక్తికి దానమివ్వాలి. రథసప్తమినాడు రథాలు మళ్ళుతాయని అంటారు. ఈరోజునుంచి చలిపోయి వేసవి వస్తోంది. అంటే ప్రాణికోటి అంతటికి ఓ సరికొత్త చైతన్యం కలుగుతుంది. అందుకు కృతజ్ఞతగానే రథసప్తమి.

అందరూ రథసప్తమి పేరిట సూర్యారాధన చేస్తారు. సూర్యభగవానునికి ఎదురుగా ఆవు పిడకలతో దాలిచేసి, దానిమీద పాయసాన్ని వండటం, చిక్కుడు కాయలకు చీపురుపుల్లలు గుచ్చి సూర్యరథం తయారుచేసి, క్షీరాన్నాన్ని చిక్కుడాకులలో ప్రసాదం పెట్టి లోక సాక్షికి నివేదన చేసి ప్రసాదాన్ని పంచటం. ఈరోజు ఆచరణలు భవిష్య పురాణంలో రథసప్తమి వ్రతాన్ని గూర్చి విశేషంగా తెలుపబడింది. సాక్షాత్ భగవానుడైన శ్రీకృష్ణపరమాత్మ ధర్మారాజుకు రథసప్తమి వ్రత మహిమను గూర్చి బోధించనున్నట్లు మహాభారతం తెలుపుతోంది.

క్షీరాన్నమే సూర్యునికి ఎందుకు నివేదించాలి? దక్షయజ్ఞ సమయంలో ముక్కంటికి అవమానం జరిగింది. దాంతో మహోగ్రుడైన పరమేశ్వరుడు వీరభద్రుని పరివారముతో సహా మామ మీదకు పంపిస్తాడు. వీరభద్రుని వీర విహారంలో దేవతలు దెబ్బలు తిన్నారు. ఈ సందర్భంలో సూర్యునికి పళ్ళన్ని రాలిపోయి బోసివాడైనాడు. దాంతో పళ్ళు లేని సూర్యునికి పరమాన్నమే నివేదన అయ్యింది.

రథసప్తమి స్నాన ఫలితం.

(రథసప్తమినాడు చేసే నదీ స్నానం సూర్యగ్రహణ సమయంలో చేసే స్నాన సమానం అత్యుత్తమ ఫలితాలను ప్రసాదింపచేస్తుంది. ఆయురారోగ్యాలను ప్రసాదింపచేస్తోంది.

సూర్య ప్రశస్తి... సూర్య భగవానుని ప్రస్తావన లేని పురాణం లేదు. బ్రహ్మపురాణం, ఋగ్వేద, యజుర్వేదాల్లో ఉపనిషత్తులలో, రామాయణ, భారత, భాగవతాది పురాణాల్లో, మార్కండేయ, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యాది పురాణాల్లో సహితం సూర్యుని ప్రస్తావన ఉండటం సూర్యారాధన ప్రాచీనతను తెలియచేస్తోంది.

మహాశుద్ధ సప్తమినాడు జిల్లేడు లేదా రేగు లేదా చిక్కుడు ఆకులను అక్షతలతో లేదా రేగు పళ్ళతో తల మీద భుజాల మీద ఉంచుకొని స్నానం చేయటం చేస్తారు. సూర్యుని తండ్రి కశ్యపుడు, తల్లి అదితి, విశ్వకర్మ కూతుళ్ళైన సంజ్ఞ ఛాయ భార్యలు. పదవిలో అత్యుత్తమ స్థానానికి పోవాలన్నా ఉద్యోగంలో ప్రమోషన్ పొందాలన్నా సూర్యారాధన చేసి తీరాల్సిందే. మాఘ మాసంలో తష్ట్యాపేరును ధరించిన సూర్యుడు బ్రహ్మాంత మహర్షి, కంబల సర్పమును, తిలోత్తమ అప్సరసను, చీకుడు రాక్షసుని, శతజిత్ అనే యక్షుని, ధృడరాష్ట్రుడు అనే గంధర్వుని వెంట బెట్టుకొని చిత్రవర్ణంలో తొమ్మిది వేల కిరణాలతో వెలుగొందుతూ సంచరిస్తాడు. మాఘమాస ఆదివారాల్లో 'శివాయనమః' అనే మంత్రాన్ని పఠించటంతో పాటు నిమ్మకాయలు పండ్లను నైవేద్యం చెయ్యాలి. ఈ మాసం శుక్లపక్ష షష్ఠినాడు ఉపవాసం ఉండి, సూర్యుని పూజించి ఆ రోజు సూర్యుని ఎదురుగా పూజా మందిరంలో నిద్రించాలి. ఈ నెలలో రథంపై ఉన్న సూర్యుని విగ్రహాన్ని లోహంతో చేయించి దానంగా యివ్వాలనేది శాస్త్రవచనం. సప్తమినాడు యథావిధిగా పూజించాలి. మాఘమాసంలో ఈ విధంగా చేయబడే రథసప్తమి వ్రతాచరణ వల్ల విజయం సిద్ధించటంతో పాటు ఆయురారోగ్యాలు వృద్ధిచెందటం తథ్యం.

- పీసపాటి నాగేశ్వరశర్మ

వెలుగే పరమాత్మ

మనకంటిని ఆకర్షిస్తుంది. కనుక ప్రపంచాన్ని మనకు కనపరిచే విశ్వవ్యాప్త శక్తి 'వెలుగు'. ఆ వెలుగు పరమాత్మ స్వరూపం. ఆ వెలుగే, శ్రీ సూర్యనారాయణమూర్తి.

జ్యోతిస్సుల కంటి జ్యోతిస్సు అయినది- 'ఆత్మ జ్యోతిస్సు'. జ్యోతి స్వరూపుడై ఆత్మ తత్వాన్ని బోధించే పరంజ్యోతి-సూర్యభగవానుడు. పెంజీకటి కవ్వల ఎవ్వండే కాకృతి వెలుగు అతని నే సేవింతున్' అన్నాడు పరమ భాగవతోత్తముడు పోతన, భాగవతంలో. ''అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'' అన్నది వేదం, అంతటా వ్యాపించిన పరమాత్మ వెలుగును విశదీకరిస్తూ. పంచ భూతములందు, మృగ పక్షులలో, తరులతాదులలో అంతర్లీనంగా భగవంతుడు వెలుగుతున్నాడని, ''పరమాత్ముడు వెలిగే ముచ్చట చూడరే, బాగ తెలుసుకోరే, హరియట హరుడట సురలట అఖిలాండకోటులట అందరిలో..'' అని రాముని పరముగా త్రిమూర్త్యాత్మకుడైన సూర్య భగవానుని గూర్చి శ్రీ త్యాగరాజస్వామి ముదావహంగా కీర్తించాడు.



సర్వ వ్యాపక స్వరూపుడు, సర్వాన్తర్యామి, సకల సృష్ట, సకల దేవతా స్వరూపుడు-శ్రీ సూర్యభగవానుడు. విశ్వమే రూపమైనవాడు, కిరణములతో కూడిన వాడు, సర్వాధారుడు, జ్యోతిర్మయుడు అయిన దివాకరుని ప్రతిదినము ఉదయమే ప్రార్థించి, నమస్కరిస్తూ నారంభం చేయడం మన అలవాటు. వెలుగులేనిదే, రోజు గడవదు. కనుక జీవకోటికి ప్రాణాధారమై అంధకారానికి అంతశ్శత్రువైనది-'సూర్యదీప్తి'.

సూర్యగమనం వలన కాల భేదములు ఏర్పడుతున్నాయి. 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' ఆదిత్యుణ్ణి ప్రార్థన చేస్తే ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడని సర్వకార్యములు నెరవేరుతాయని, పురాణములు చెప్తున్నాయి. అన్నదాత ఆరోగ్య ప్రదాత అయిన ఆదిత్యుడు, అసమానంగా ప్రకాశిస్తూ, భూమితోపాటు ఇతర గ్రహములకు వెలుగునూ, శక్తినీ అందచేస్తున్నాడని పేర్కొన్నారు-విజ్ఞాన శాస్త్రవేత్తలు.

త్రిమూర్త్యాత్మకుడు, జీవిత పరమావధికి దారి చూపే మహోదాత్త స్వరూపుడు, సూర్యనారాయణమూర్తి అని కీర్తించారు వాగ్గేయకారులు. మన్వాంతర ప్రారంభంలో దివాకరుడు సప్తమి రోజున రథాన్ని అధిరోహించాడని ప్రతి సంవత్సరం మాఘశుద్ధ సప్తమిరోజున వచ్చే పర్వదినాన్ని రథసప్తమిగా, సూర్యజయంతిగా పండుగ జరుపుకుంటాం. సప్తమ్యాంఖలు సూర్వేణ మూర్తిశ్చ కృతవాన్ భువిః అని, సూర్యభగవానుడు తొలిసారిగా భూమిమీద రథసప్తమినాడు సాక్షాత్కరించాడని చెపుతోంది-మత్స్యపురాణం. మాఘశుద్ధ సప్తమీ తిథి రోజున, అరుణోదయాత్పూర్వం ఆకాశంలో గ్రహనక్షత్ర సన్నివేశం, రథాకారంగా ఉంటుందని దైవజ్ఞులు వివరించారు. ''మాఘే మాసేసితౌ పక్షే సప్తమీ కోటి భాస్కర కుర్వాత్ స్నానార్ఘ్య దానాభ్యాం ఆయురారోగ్య సంపదః'' రథ సప్తమినాడు ప్రాతఃకాలమందే మేల్కొని, శిరసున జిల్లేడు ఆకులను ఉంచుకుని స్నానమాచరించి, అర్ఘ్య దానాచరణతో ఆయురారోగ్య ఐశ్వర్యములు కలిగి, సప్తజనుల పాపములు నశిస్తాయని చెప్పబడింది.

ఆదిత్య మండలమే సంవత్సరమను పేరుగల రథము. ఈ సంవత్సర రూప రథానికి, ఆయనము, ఋతు, మాస, పక్ష, దివస, రాత్రి ముహూర్తములు ఏడునూ చక్రములు. సంవత్సర రూప ఆరాధనే రథసప్తమి.

''ఏకో అశ్వో వహతి సప్తనామా-'' సప్త అను పేరుగల ఒకే గుఱ్ఱము కలవాడు, సప్తాశ్వములుగల సూర్యునికి 'సప్త సప్త' అని పేరు. సప్త సప్తయే నమః అన్నది సూర్య సహస్ర నామం.

అశ్వములంటే కిరణములు. సప్తద్వీపములు గల భూమిని పరిపాలిస్తున్న సూర్య భగవానునికి మాఘశుద్ధ సప్తమినాడు అర్ఘ్య ప్రదానం ఇస్తే, సర్వరోగములను పోగొడతాడు. 'సప్త సప్తిర్మరీచిమాన్'.

సూర్యోదయ సమయంలో కనిపించే ఉషఃకాంతియే అరుణవర్ణ సూర్యమండలం, అదే సప్తాశ్వరథ మండలము. కనుక ప్రతిరోజు ఆ సమయం ఉత్తరాయణ పుణ్యకాలమే,అప్పుడు చేసే సూర్యారాధన రథ సప్తమీ వ్రతాచరణమే. వేకువ జామున ప్రకృతి నుండి వెలువడే ధ్వని తరంగములతో,చల్లని పిల్లవాయువులతో, మన నాడీ స్పందనల ధ్వని తరంగములు తోడై, మనస్సు, శరీరములను ఆరోగ్య స్థితియందు ఉంచుతాయి. సూర్యోదయాత్పూర్వమే నిద్రలేచి, కాలకృత్యములు తీర్చుకుని బాహ్య, అంతర శుద్ధితో సూర్యభగవానుని ఆరాధిస్తే, హృదయ కాలుష్యాన్ని తొలగించి నిర్మలమైన మనస్సును ప్రసాదిస్తాడు. దీనివలన సత్సాంగత్యం, సద్గోష్ఠి, సత్కర్మాచరణ, సద్గ్రంథ పఠనములయందు ఆసక్తి కలిగి, మనస్సుకు ప్రశాంతత కలుగుతుంది. 'వేకువ జామున వెలయుచు తంబూర చేకొని నీ గుణములు చెలువంగ పాడుచు, అని పాడగల్గిన ధన్యాత్ములు, శ్రద్ధగా వినగలిగిన శ్రోతలు ఆ ఉభయులకును ఉదయ రాగముల నాద ప్రభావముచే బుద్ధి ప్రసన్నమై ఉంటుందన్నది రథ సప్తమీ విశేషం. ఇదే ప్రతిరోజూ ఉషఃకాలంలో ఉండే ఉత్తరాయణ పుణ్యకాల సప్తమీ పూజాఫల సిద్ధి.

జ్యోతిష శాస్త్రంలో-లగ్నంనుండి సప్తమ స్థానం-భార్యాభర్తలది. జాతక భాగంలో సప్తమ స్థానం ఎలా ఉన్నా, తగిన సమయంలో సంసారికి జీవనాన్ని ప్రసాదించి, అన్యోన్య అనుకూల దాంపత్యాన్నిచ్చి జీవన సరళిని ఆనందమయం చేసేది-రథ సప్తమీ వ్రతం, సూర్యారాధన. సప్త సముద్రములకు, సప్త ద్వీపములకు, సప్తకుల పర్వతములకు, సప్త సంతానములకు, సప్త వర్ణములకు, సప్త ఊర్ధ్వలోకములకు, సప్త అధో లోకములకు, వెలుగునిచ్చేది-సప్తమీ ప్రియుడైన సూర్యభగవానుడు. షడ్జమము, రిషభము, గాంధారము, మధ్యమము, పంచమము, దైవతము, నిషాదము అనే సప్త స్వరములకు స్ఫూర్తి-శ్రీ సూర్యనారాయణమూర్తి. సూర్యనారాయణ పరబ్రహ్మ స్వరూపాన్ని విశేషాల్ని తెలియజేసే యజుర్వేద తైత్తిరీయ ఆరణ్యకంలో-స్థావర జంగమాత్మకమైన విశ్వమంతా సూర్యుని ఆత్మ స్వరూపమని, అందరూ సూర్య స్వరూపులేయన్న మహత్తర విశేషాల్ని-సప్తమానువాకమే అందించటం, రథ సప్తమికి దీప్తినిస్తుంది.

మానవుడు తన ఇంద్రియములను మంచి అశ్వములుగా చేసుకుని, మనస్సును అదుపులో ఉంచుకుని తమ శరీర రూప రథాన్ని భగవంతునివైపు తిప్పుకొని ప్రతి రోజు ఉత్తరాయణాన్ని అనగా వెలుగును దర్శించి అందరిలోను సూర్యుణ్ణి చూస్తూ సమాజానికి తనవంతు కర్తవ్యాన్ని అందిస్తూ లోక కల్యాణాన్ని కాంక్షించాలని బోధిస్తుంది-రథ సప్తమి.

-పసుమర్తి కామేశ్వర శర్మ

పుణ్యప్రదాయిని ఇంద్రాణీ

ఈవారం మనం బార్హతం శతకమంలోని మూడవదైన మణిమధ్య స్తబకంలోని కొన్ని శ్లోకాలను చదువుదాం.

1. మంగళదాయీ పుణ్యవతాం మన్మథ దాయీ దేవపతేః।
విష్టపరాజ్ఞీ హోసలనో విక్రమదాయీ మే భవతు॥
పుణ్యాత్ములకు శుభాలనిచ్చేదీ, ఇంద్రుని మోహింపజేసేదీ ఇంద్రాణీ దేవి చిరునవ్వు. ఆ చిరునవ్వు నాకు విక్రమాన్ని ప్రసాదించు గాక!

2. దృష్టి విశేషై శ్శీతవరై ర్భూర్యనుకంపైః పుణ్యతమైః।
భారత భూమేస్తాపతతిం వానసకాంతా సాహరతు॥
విశేషమైన దయ కలిగి, ఆ ఇంద్రాణీదేవి ఎంతో పవిత్రమైన తన చల్లని కృపాదృష్టిని ఈ భారతదేశంపై ప్రసరించి భారతదేశ తాపాలను హరించుగాక!

3. పావన దృష్టి ర్యోగిహితా భాసుర దృష్టిర్దేవ హితా।
శీతల దృష్టి ర్భక్త హితా మోహనదృష్టి శ్శత్ర హితా॥
పవిత్రమైన దృష్టి కలిగి ఉండటంవల్ల యోగులకూ, ప్రకాశించే

లపు చంద్రుని పోలిన ముఖాన్నీ, మేఘం లాంటి కొప్పునూ కలిగి, నల్లని కలువరేకులతో సమానమైన కళ్ళతో దయను కలిగిన ఆ ఇంద్రాణీదేవి ప్రకాశించుగాక! సంపెంగ పువ్వులాంటి ముక్కు, చెక్కిళ్లపైన ఉండే కాంతితో ఆడుకుంటున్న చెవిలోని ఆభరణాల కాంతులు, వీణా నాదంతో సరిపోలిన పలుకులూ, దొండపండుకు ఉండే శోభను హరించే అధరాల కాంతినీ కలిగి ఉన్న ఆ ఇంద్రాణీదేవి ప్రకాశించుగాక!

7. నిర్మల హాస క్షాళి తగ్ధిత్తి సమూహా మోహహరీ।
కాంచనమాలా శోభిగళా సంతత లీలా బుద్ధికళా॥
8. విష్టపధారి క్షీరధర స్వర్ణఘట శ్రీహరి కుచా।
కాపి బిడౌజో రాజ్యరమా చేతసి మాతా భాతుమమ॥
ఆమె నిర్మలమైన నవ్వులు దిక్కులనే గోడలను శుభ్రంగా కడిగేస్తూ ఉంది. మోహాన్ని తొలగిస్తూ ఉంది. ఆమె బంగారు కంఠాభరణంతో ప్రకాశించే కంఠాన్ని కలిగి ఉంది.ఆమె నిరంతరమైన లీలలను చూపే బుద్ధి కళలను కూడా కలిగి ఉంది. ఈ మహాతల్లి ఈ ప్రపంచాన్ని పోషించడానికోసం పాలతో నిండిన బంగారు కలశాల్లాగా ప్రకాశించే కుచాలనూ కలిగి ఉంది. అటువంటి దేవేంద్రుని రాజ్యలక్ష్మియైన ఆ ఇంద్రాణీదేవి నా మనస్సులో ప్రకాశించుగాక!

9. దివ్యసుధోర్మి ర్భక్తిమతాం పావక లీలా పాపకృతాం।
వ్యోమ్ని చరంతీ శక్రసఖీ శక్తిరమోఘా మామవతు॥
ఆమె తన భక్తులకు దివ్యమైన అమృతం లాంటిది. పాపాత్ముల పాలిట అగ్నిలాంటిది. ఆకాశంలో సంచరించే ఇంద్రసఖి అనే ఆ అమోఘమైన శక్తి నన్ను రక్షించుగాక!

10. సమ్మదయంతీ సర్వతనుం సంశమయంతీ పాపతతిం।
సంప్రథయంతీ సర్వమతీ స్సంఘటయంతీ ప్రాణబలం॥
11. నిర్జిత శోకా ధూత తమా స్సంస్కృత చిత్తా శుద్ధతమా।
వాసవశక్తే ర్వ్యోమజుషః కాచన వీచిర్మాం విశతు॥
అందరినీ సంతోషపెడుతూ, పాపులను నాశనం చేస్తూ, అందరి బుద్ధులను ప్రకటించేదీ, ప్రాణబలాన్ని సమకూర్చేదీ, శోకాన్ని నాశనం చేసేదీ, చీకట్లను తొలగించేదీ, చిత్తాన్ని సంస్కరించేదీ, పరిశుద్ధమైన ఆకాశ శరీరిణి అయిన ఆ ఇంద్రాణిదేవి కిరణ వీచికొక్కటి నన్ను ప్రవేశించుగాక!

సర్వసంపత్కరం సూర్యవ్రతం

పూర్వం యశో ధర్మ అనే కాంభోజ పట్టణపు రాజుకు లేక లేక ఓ కుమారుడు జన్మించాడు. ఆ రాజ్యమంతా వేడుకలు జరిపించి ఎన్నో దానధర్మాలు పుత్రోదయ సందర్భంగా చేశాడు. ఆ పిల్లవాడు దిన దిన ప్రవర్ధమానుడౌతున్నాడు కాని ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యంతో సతమతమవు తుండేవాడు. పిల్లవాని ఆరోగ్యం దినదిన గండంగా మారజొచ్చింది. ఎన్నో వైద్య ప్రక్రియలు జరిపించినా పిల్లవాని ఆరోగ్యం మేమీ బాగుపడలేదు. ఈ విషయమై రాజు వ్యాకుల చిత్తుడై, రాజ పురోహితుడు తన కుమారుని జాతక చక్రం చూసి పిల్లవాని అనారోగ్యకారణం చెప్పమని కోరాడు. తనకు తెలిసిన సిద్ధుని ద్వారా ఈ పిల్లవాని అనారోగ్యహేతువును కనుక్కుందామనిఆ పురోహితుడిచ్చిన సలహా ననుసరించి రాజు పిల్లవానిని ఆ సిద్ధుని చూపి అతనికి ఆరోగ్యాన్ని ప్రసాదించుమని వేడుకొన్నాడు. ఆ సిద్ధుడు తన తపఃశక్తితో పిల్లవాని అనారోగ్య కారణాన్ని తెలుసుకొన్నాడు. ఇలా చెప్పాడు.'' ఓ రాజా ఈ పిల్లవాడు క్రితం జన్మలో పరమలోభి కాని ఎవరో రథసప్తమి నాడుచేస్తున్న సూర్యవ్రతాన్ని చూసి తీర్థ ప్రసాదాలు తీసుకొన్నాడు. కనుక ఈ జన్మలో నీ కుమారుడుగా జన్మించడం సిద్ధించింది. కాని లోభ గుణం వల్ల ఈ అనారోగ్యం పట్టి పీడిస్తోంది. కనుక నీవు ఈ పిల్లవాని చేత ఇపుడు సూర్యారాధన చేయించి, రథసప్తమి నాడు సూర్య వ్రతాన్ని చేయించు. దీని వల్ల నీకు కుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడు'' అని చెప్పాడు. దానికి పరమానంద పడిన రాజు నిత్యం తన పుత్రుని చేత సూర్య నమస్కారాలు చేయిస్తూ రథ సప్తమి కోసం ఎదురుచూసాడు. ఆ ప్రజలు రథసప్తమి వ్రతాన్ని చూస్తేనే ఇంత పుణ్యం లభిస్తే , చేస్తే ఇంకెంత పుణ్యాన్ని కూడగట్టుతుందో నన్న ఆత్రుతతో రథసప్తమి కోసం ఎదురుచూసారు. మాఘమాసంలో సప్తమి తిథి రానే వచ్చింది. రాజు అత్యంత శోభాయమానంగా తాను, తనపుత్రునితో కలసి రథ సప్తమీ నాడు సూర్య వ్రతాన్ని ఆచరించాడు. తానే కాక తన రాజ్యమంతా కూడా సుభిక్షంగా ఉండాలని ప్రతి ఇంట ఈ వ్రతాన్ని ఆచరించరింపచేశాడు. ఆ సూర్య భగవానుని దయతో రాజు కుమారుడు సంపూర్ణ ఆయుష్యమంతుడయ్యాడు. ఆ రాజ్యం పాడిపంటలతో సస్యశ్యామలంగా మారింది. అప్పట్నుంచి ప్రతి రథ సప్తమి నాడు జిల్లేడు ఆకులను తలపై పెట్టుకొని స్నానం చేసి జిల్లేడు లేదా చిక్కుడు ఆకులలో క్షీరాన్నాన్ని సూర్యునికి నివేదన చేసి, సూర్యాష్టకాన్ని ప్రతినిత్యం అత్యంత శ్రద్ధాభక్తులతో పఠించేవాడారాజు. తన రాజ్యంలో ప్రతివారిచేత రథసప్తమివ్రతాన్ని ఆచరింపచేసేవాడు. ఈ రథసప్తమి నాడు ఎవరైతే సూర్య వ్రతం చేస్తారో వారికి సర్వసౌభాగ్యాలు, సర్వసంపదలు, సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదిస్తాడు ఆ ప్రత్యక్ష నారాయణుడు.

-దాసరి దుర్గాప్రసాద్
సెల్: 8977676085

దేవతలకు పెళ్లిళ్లు ఎందుకంటారు?

త్రేతాయుగంలో సీత తల్లి భూదేవి కదా ఆమె శ్రీరామునికి అత్తగారు. కలియుగంలో అదే విష్ణువుయొక్క అవతారమైన శ్రీ వేంకటేశ్వరుడికి భూదేవి భార్యగా పూజలందుకుంటోంది. ఇది సముచితమా?

- నీలకంఠం వీరయ్య, సదాశివపేట

సీతాదేవి భూపుత్రి అనే మాట కేవలం అలంకారికం. భూమిలో దొరికింది కనుక భూమిపుత్రి అన్నారు. సీతాదేవి అయోనిజ. ఆమెకు తల్లే లేదు. ఇక భూదేవి శ్రీరాముడి అత్తగారు ఎలా అవుతుంది. కవుల చమత్కారాలు వేరు. ధర్మశాస్త్రం వేరు.

ఆలయాలలో దేవతలకు మళ్ళీమళ్ళీ పెళ్ళిళ్ళు జరుపుతూ వుంటారు గదా! దీని అంతరార్థమేమి? ప్రయోజనమేమి?

- కామేశ్వరి, బంజారాహిల్స్

దేవతలు మనకుమల్లే శారీరక సుఖాల కోసం ఆరాటపడే జీవులు కాదు. వారు తేజోమయ దేహులు. వారి చర్యలన్నీ మానవుల క్షేమం కోసమే. మానవులు తమకు ఏది కావాలో దాన్ని దేవతలకు చిటికెడు సమర్పిస్తే, అది వంద రెట్లు మళ్ళీ ఆ భక్తులకే చేరుతుంది. అందువల్లే ప్రతిరోజూ భక్తులు దేవతామూర్తులకు స్నానాలు చేయిస్తారు, నైవేద్యాలు పెడతారు. ఇంకెన్నో చేస్తారు. అలాగే మన ఇంట్లో నిత్య కళ్యాణంగా వుండటం కోసం దేవతలకు నిత్యకళ్యాణ సేవలనుచేస్తూ వుంటారు.

- కుప్పా వేంకట కృష్ణమూర్తి

అష్టదిక్పాలకులలో నైరుతి దిశలో వున్న పాలకుడి గురించి వివరించవలయును.

- ఎన్.జయకర్, యెల్లారెడ్డిగూడ

ఆయన పేరు నిర్ఋతి. ఆయన ఒక రాక్షసుడు. కానీ గొప్ప శివభక్తుడు. శివానుగ్రహం వల్ల దిక్పాలకత్వాన్ని పొందాడు. ఈయన గురించిన విశేషాలు స్కాంద పురాణంలోని కాశీఖండంలో ఉన్నాయి.

నైఋతాంతార రోజున క్షవరం చేయించుకోకూడదని ఒకరు చెప్పారు. అయితే గడ్డం గీసుకొనవచ్చునా?

- చైతన్యమిత్ర, విజయవాడ

విడిగా గడ్డం గీసుకోవటమే నిషిద్ధం. క్షవరానికి ఏ నియమాలున్నాయో, అవన్నీ దీనికీ వర్తిస్తాయి.

ప్రతిష్ఠచేసిన విగ్రహాలకు ఫొటోలు తీయకూడదు అంటారు. ఈమధ్య ఆలయోత్సవాలను టీవీలలో లైవ్‌గా చూపిస్తున్నారు. ఇది శాస్త్రబద్ధమేనా? కానిచో దోషమేదైనా కలుగుతుందా?

- పి.వి.భగవాన్, విజయవాడ

తిరుమల వేంకటేశ్వరాలయం వంటి ప్రధాన క్షేత్రాలలో మూలమూర్తికి ప్రతిరూప గ్రహణం (ఫొటో తీసుకోవటం) ఇప్పటికీ అనుమతింపబడటం లేదు. అందువల్లనే ఆ క్షేత్రాల మహత్తు నిత్యనూతనంగా విరాజిల్లుతోంది. ప్రతిరూప గ్రహణంవల్ల వ్యక్తులకు గానీ, ప్రతిష్ఠిత విగ్రహాలకు గ

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి సోమవారం 18, ఫిబ్రవరి 2013

ఆరోగ్యంపై అలక్ష్యం.. జీవితానికే శాపం



★ శిరోజాలు ఎక్కువగా రాలిపోతుంటే రోజూ ఆలివ్ లేదా బాదం నూనెతో తలకు బాగా మర్దనా చేసుకోవాలి.

★ బొప్పాయి గుజ్జులో- కోడిగుడ్డులోని తెల్ల సొన, తాజా కొబ్బరి పాలు, కాస్త కొబ్బరి నూనె, నాలుగు చుక్కల లావెండర్ నూనె కలిపి, ఆ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. కొన్ని రోజుల పాటు ఇలా చేస్తే జట్టు పొడిబారడం తగ్గి, మంచి నిగారింపును సంతరించుకుంటుంది.

★ కొబ్బరి నీళ్లలో మెంతి ఆకులు, కొన్ని వేపాకులు, కోడిగుడ్డులోని తెల్లసొన, ఉసిరి ఆకులు, తాజా కరివేపాకు వేసి మెత్తగా రుబ్బు కోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పావుగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టులో జిడ్డుదనం పోతుంది.

★ రోజూ కాసిన్ని శనగలు, పెసలు, కందులు, గోధుమలను నానబెట్టి ఆ మొలకలను తినడం అలవాటు చేసుకోవాలి. పచ్చిగా ఉన్న వేరుశనగ, నువ్వులను తరచూ తినాలి. ఇలా చేస్తే జుట్టు ఎదుగుదల సాధ్యమవుతుంది.

★ అవిసె నూనెలో కాస్త నిమ్మరసం కలిపి ముందురోజు రాత్రి తలకు బాగా పట్టించి, మర్నాడు ఉదయం గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే శిరోజాలు నిగనిగలాడతాయి.

★ కొబ్బరి నూనెలో తమలపాకుల రసం కలిపి తలపై మాడుకు బాగా మర్దనా చేస్తే కుదుళ్లు గట్టిపడతాయి.

మన శరీరాలు ఎటువంటి నిర్లక్ష్యాన్నయినా కొంతవరకు మాత్రమే తట్టుకోగల్గుతాయి. శరీరాన్ని నిర్లక్ష్యం చేయకుండా, దానిని గౌరవిస్తే అది తిరిగి మనకు చక్కని ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. దైనందిన జీవితంలో అనేక కారణాల రీత్యా మన శరీరాన్ని ఎంత నిర్లక్ష్యంగా వదిలేస్తున్నామో- ఒక్కసారైనా ఆలోచించండి.

రాత్రిపూట ఆలస్యంగా నిద్రించడం, వత్తిడికి, ఆందోళనకు గురవ్వడం, చెత్త తిండితో కడుపును నింపుకోవడం, తప్పుడు తిళ్లు తినడం మొదలయిన పనులన్నీ శరీరాన్ని పట్టించుకోక పోవడం కిందికే వస్తాయి. అయితే- మరీ ఎక్కువ.. లేకుంటే మరీ తక్కువ శారీరక వ్యాయామం చేయడం వంటి పనులు శరీరాన్ని నిర్లక్ష్యం చేయడం వంటివే.

'నేను చాలా బిజీగా ఉన్నాను. లంచ్ తీసుకునే టైమ్ లేదు', 'నాకు ఇచ్చిన పని పూర్తి చేసేందుకు రాత్రి నిద్రపోలేదు' అని చాలామంది అంటూ ఉంటారు. నిజమే, ఎప్పుడైనా కొన్ని కఠిన పరిస్థితులను మన శరీరం కొంతవరకు తట్టుకోగలదు. ఆరోగ్యకరమైన శరీరం మంచి జీవితానికి పునాది వంటిది. మంచి ఆరోగ్యంతో జన్మించినా, వయసు పెరిగేకొద్దీ తెలియక అనేక తప్పులు చేస్తూ శరీరాన్ని పట్టించుకోక ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటూ ఉంటాము. ఆరోగ్య పరిరక్షణకు ఎవరికైనా కొన్ని జాగ్రత్తలు అనివార్యం.

తగినంత నిద్ర

పనిచేసేందుకు సమయం సరిపడకపోతే నిద్ర సమయాన్ని కూడా పని చేయడానికి వినియోగిస్తూ ఉంటాము. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల సమయంలో ఇలా చేస్తూ ఉంటారు. రాత్రి కనీసం ఎనిమిది గంటలు నిద్రిస్తే ఆరోగ్యానికి మంచిదని పరిశోధనలలో వెల్లడయ్యింది. నిద్రించే సమయంలో శరీరం విశ్రాంతిలో ఉంటుంది. శరీరం లోపలి అవయవాల పని చురుకుదనం తగ్గుతుంది. మెదడు అంత జాగరూకతతో ఉండదు. గుండె కొట్టుకునే రేటుకూడా నిముషానికి 72 నుండి 55కి పడిపోతుంది. గాఢనిద్ర అనంతరం మేల్కొనగానే ఎంత తాజాగా మనసు, శరీరం ఉంటాయో మనకు అనుభవంలోని విషయమే. నిద్రలేమితో బాధపడేవారికి నిద్ర గొప్పదనం తెలుస్తుంది. తగినంత నిద్ర లేకపోతే మనిషికి తరచూ కోపం వస్తూ ఉంటుంది. శరీరంలో ఆమ్లాల పరిమాణం పెరిగి కంటికింద నల్లటి వలయాలు ఏర్పడతాయి.

కొంతమంది మధ్యాహ్నం చిన్న కునుకు తీస్తారు. ఇది ఎంతో లాభదాయకంగా ఉండి వారి మెదడు చురుకుదనాన్ని పెంచుతుందని ఇటీవల పరిశోధనలలో తేలింది. అనుదినం 6 నుండి 8 గంటల నిద్ర ఎంతో మంచిది. అతి నిద్ర మంచిది కాదని, మనిషిని అది పరమ బద్ధకస్తునిగా మారుస్తుందని మరువకూడదు.

మంచి ఆహారం

మంచి ఆహారం అంటే 'ఖరీదైన ఆహారం' అని అపార్థం చేసుకోకూడదు. రుచికరమైన పదార్థాలు కూడా కాదు. మంచి ఆహారం అంటే శరీరానికి నిత్యం మేలు చేసే ఆహారం. దీనిలో పొట్టి కత బాగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు, విటమిన్లు, ఖనిజాలు తగిన నిష్పత్తిలో కలిసి ఉండాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీరు విధిగా తాగాలి. తినాల్సిన ఆహారం వయసును బట్టి, మగ-ఆడ అనే విషయంపైన, పనిచేసే వ్యక్తి లోనయ్యే వత్తిడి, శ్రమలపై ఆధారపడి ఉంటుంది. ఎవరికివారే తాము ఎటువంటి సమీకృత, సమతుల్య ఆహారం తినాలని తెలుసుకుని భుజిస్తూ ఉండాలి. ఈ విధంగా ఆహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి వ్యాధులు దరిజేరకుండా శరీరం కాపాడుతుంది. అదనంగా తిండి తినడంవల్ల శరీరం అనేక విధాలుగా నలిగిపోతుంది. స్థూలకాయం, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం, గుండె జబ్బులు వంటి సమస్యలు మనకు ఎదురవుతాయి.

వ్యాయామం

వ్యాయామం ప్రాముఖ్యత నేడు ప్రతి ఒక్కరికీ తెలుసు. వ్యాయామం అంటే శారీరక, మానసిక వ్యాయామం. 'ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యమైన మనసు' ఉండాలి. వ్యాయామం శరీరాన్ని దృఢంగా ఉంచి ఎటు కావాలంటే అటు వంగేటట్లు చేస్తుంది. క్రమం తప్పని వ్యాయామం శరీరానికి ఎంతో అవసరం.

జిమ్, ఏరోబిక్స్, చురుగ్గా నడవడం, ఈత, చురుకైన ఆటలు లేదా మీకు ఇష్టమైన గేమ్స్ ఏదైనా సరే వ్యాయామం కిందకే వస్తుంది. మనకు ఆహ్లాదంగా ఉండే వ్యాయామం చేయాలి. వ్యాయామాలు నియమిత పద్ధతిలోనే చేయాలి. మనకు తోచినట్లు చేయకూడదు.

పద్ధతులు పాటించాలి

శరీరం కాపాడుకునే పద్ధతులను పాటించాలి. చిన్నతనం నుండి పెద్దలు కొన్ని పద్ధతులు అలవాటు చేస్తారు. వీటినే మనం 'మంచి అలవాట్లు' అని పిలుస్తాం. ఇవన్నీ ఆరోగ్యానికి మెట్లు అని గుర్తుంచుకోవాలి. ఉదయం నిద్ర లేవగానే ముఖం, కళ్ళు నీటితో కడుక్కోవడం, బయటనుండి ఇంట్లోకి వచ్చినపుడు కాళ్ళు, చేతులు కడుక్కోవడం, భోజనం ముందు, తరువాత కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడం, అనుదినం స్నానం చేయడం, వారానికి ఒకసారి తలస్నానం చేయడం వంటివి ఆరోగ్యానికి మంచివి.

మీ చిన్నతనంలో తరగతి గదిలో సరియైన భంగిమలో కూర్చోకపోతే, కళ్లకు దగ్గరగా పుస్తకం పెట్టి చదివినా ఉపాధ్యాయులు మందలించిన సంగతులు గుర్తుతెచ్చుకోండి. వారికి మీరు కృతజ్ఞులై ఉండాలి. ఇటువంటి చిన్న జాగ్రత్తలే ఆరోగ్యమనే సముద్రాన్ని నింపుతాయి. అనేక శారీరక సమస్యలకు కారణం శరీరాన్ని మనం అజాగ్రత్తతో వదలివేయడమే. శరీరంలో తరచు ఏదైనా రోగం ప్రవేశించి వేధిస్తూ ఉంటే వెంటనే వైద్య చికిత్స చేయించుకోవాలి. వయసు పెరుగుతున్న కొలది శరీరంలోని జవసత్వాలు తగ్గుతాయి. అటువంటప్పుడు శరీరం గురించి మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే శరీరాన్ని మర్దనా చేయాలి. ఎండలో వెళ్ళేటప్పుడు చలువ కళ్లద్దాలు ధరించి, గొడుగు వేసుకుని వెళ్లడం మంచిది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే మీ చర్మ సౌందర్యం తగ్గదు. ముఖ వర్చస్సు తగ్గకుండా వ్యాయామాలు, మెళకువలు పాటించాలి. మంచి పాదరక్షలు ధరించడం తప్పనిసరి.

సంతోషమే సగం బలం..

మనిషి ఆందోళన చెందకూడదు. ఆందోళన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. మరణానికి రహదారి అవుతుంది. ఏదైనా సమస్య ఎదురైతే సామాన్యంగా ఆందోళనకు గురి అవుతారు. ఇది సహజమైన ప్రతి చర్య. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రతిదానికి పరిష్కారం ఉంటుందని గుర్తుంచుకోవాలి. సమస్య ఎదురయినపుడు పరిష్కారం దిశగా ఆలోచించడం అలవరచుకోవాలి. ఆందోళన మనిషి ఆలోచనను అడ్డుకుంటుంది. ఆందోళన చెడు ధోరణిలోకి తీసుకువెడుతుంది. ఫలితంగా మరెన్నో తప్పులు చేయిస్తుంది. ఇది శరీరంలో హార్మోనులను విడుదల చేయిస్తుంది. సమస్యకు పరిష్కారం తమ శక్తికి మించినదయితే కుటుంబ సభ్యులు లేదా మిత్రుల సహకారం తీసుకోవడం మంచిది. చిరునవ్వుతో ఉండడం శరీరానికి ఎంతో మేలుగా ఉంటుంది. చేసే చిన్న చిన్న తప్పులకు విచారించక వాటిని గుణపాఠాలుగా తీసుకుని నవ్వుకోవడం నేర్చుకోవాలి. ఇతరులకు సహాయం చేయడంలో ఎంతటి సంతోషం మీకు ఉంటుందో అనుభవిస్తే తెలుస్తుంది. చేతనైన స్థాయిలో ఇతరులకు సహకరించడం, ప్రగతి కార్యక్రమాలకు చేయూతనివ్వడం, బంధువులతో ప్రేమగా మసలడం, స్నేహితులను ఆప్యాయంగా పలకరించడం, కొత్తవారితో మర్యాదగా మసలడం, ప్రతి ఒక్కరికీ విలువనిచ్చి, మనసు విప్పి మాట్లాడడం వంటివి అలవాటు చేసుకోవాలి.

-సి.వి.సర్వేశ్వర శర్మ

డాబా ఎక్కిన ఆన్సర్ షీట్స్!

ఎక్కడో సెల్లార్ కింద రహస్యంగా- ఓ సీల్డ్ గదిలో భద్రపరిచిన యూనివర్సిటీ పరీక్షల ఆన్సర్ షీట్స్- మూడంతస్తులు ఎక్కి, డాబా పైకి చేరుకున్నాయ్! రోహ్తక్‌లోని ఎం.డి.ఎల్. అనగా మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయంలో జరిగే బి.టెక్, ఎం.బి.ఏ, బి.బి.ఏ లాంటి డబ్బులు తెచ్చే- వాణిజ్య, సాంకేతిక విద్యా పరీక్షలకు సంబంధించిన రెండు వేల జవాబు పత్రాలు అధికారిక ముద్రలతో వున్నవి- వేరే పనిమీదపై డాబా చేరుకుని వున్నవి- చివరికి అధికారుల కంటబడ్డాయ్.

విశ్వవిద్యాలయం పరిపాలన విభాగంలో అతి రహస్యంగా దాచిన యీ పేపర్లను- 'తెలివైన' విద్యార్థులు- చురుకయిన పరీక్షాధికారులు- వీటిని తాళాలు, సీలు, సి.సి కెమెరాలు- అన్నీ వున్న భూగర్భస్థ గదులనుంచి- 'పైకి' తీసుకుపోయే ప్రయత్నంలో- డాబాపైకి తెచ్చి- గుట్టుచప్పుడు కాకుండా దాచుకున్నారన్న మాట!

అంతేనా..? ఆన్సర్ షీట్ల గదుల్లో బిగించిన- కెమెరాలు కూడా 'ఆఫ్' అయి వున్నాయ్. వేసిన తాళాలు అలాగే వున్నాయ్. వాటి 'చెవులు' సదరు అధికారుల దగ్గరే జాగ్రత్తగా వున్నాయ్. పరీక్ష హాల్లో- రాస్తున్నట్లు నటించే- పరీక్షార్థులు- ఎందరో- వేరే మరోసారి రాయడమో- రాయించుకోడమో చేస్తారన్నది జగమెరిగిన సత్యమే కదా? ''తత్ సత్యమేవ జయతే'' అన్నాడో గుమాస్తా- ఆనక నలుగురితో ఒక కమిటీ వేశారుటలెండి- అది వేరే సంగతి.

నీలి సి.డి.లు అమ్మితే ఖబడ్దార్!

వయాగ్రా మాత్రలు, నీలి చిత్రాల కాంపాక్ట డిస్కులు (సి.డి.లు), సెక్సు సాహిత్యం- తదితర సెక్సు సరుకులు వగైరాలు అమ్మినట్లు కనబడ్డారో- ''ఖర్చు ఐపోతారు! ఖబడ్దార్!'' అంటూ- పెషావర్ శివారులలో జోరుగా వ్యాపారం చేసుకుంటున్న- 'కార్ఖానో మార్కెట్'లోని షాపులకు పాకిస్తాన్ తాలిబన్లు 'వార్నింగ్' యిచ్చారు. ఈ సౌందర్యోపాసక వస్తు వ్యాపారాల దుకాణాల యజమానులు ప్రొద్దున్నే ఎవరి మొహం చూసి వచ్చి షాపులు తెరిచారో గానీ- ఎదురుగుండా తాలిబన్లు చేత్తో రాసిన తాఖీదులు పలకరించాయ్.

తెహ్రీక్ తాలిబన్ ఖైబర్ అనే పాకిస్తాన్ సంస్థ ఖైబర్ కనుమ సరిహద్దులలో చాలా చురుకుగా పనిచేస్తోంది. బోలెడు సెక్సు సామగ్రి తెచ్చి స్టాకు పెట్టుకున్న షాప్ కీపర్లు తమను కాపాడమని సైన్యానికి మొర పెట్టుకున్నారుట!

veeraji@sify.com

నిద్రలేమితో ఆత్మహత్యల వైపు..

'మంచి నిద్ర ఇక దుర్లభం'- అని భావించేవారు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తాజా పరిశోధనల్లో తేలింది. అమెరికాలోని జార్జియా రెజెంట్స్ విశ్వవిద్యాలయం వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ డబ్ల్యు. వాగ్నర్ మెక్‌కాల్ ఈ విషయమై చేసిన విస్తృత పరిశోధనలో కొన్ని ఆందోళనకరమైన అంశాలు వెలుగు చూశాయి. నిద్రకు సంబంధించి ఆశలు కోల్పోవడం ప్రమాదకరమైన పరిణామమని తేల్చారు. మంచి నిద్ర కరవైందన్న నిరాశ- జీవితంలో మిగతా విషయాల కంటే అధిక ప్రభావం చూపెడుతుందని పరిశోధనలో గుర్తించారు. వ్యక్తిగత సంబంధాలు, చదువు, ఉద్యోగం వంటి విషయాల్లో నిరాశా నిస్పృహల కన్నా నిద్రలేమి భావన చాలా ప్రమాదకరమైనది. నిద్రలేమి ఒక విభిన్నమైన నిరాశకు గురి చేస్తుందని, ఈ భావన తీవ్రరూపం దాల్చితే దాన్ని ఆత్మహత్యకు ఒక సంకేతంగా భావించవచ్చని పరిశోధనలో కనుగొన్నారు. నిద్రపై ఆశలు సన్నగిల్లడాన్ని తీవ్రమైన అంశంగా గుర్తించి, ఆ ప్రభావం నుంచి బయటపడేందుకు వైద్యపరంగా నూతన ఆవిష్కరణలు జరగాలని పరిశోధకులు సూచించారు. నిద్రలేమితో బాధపడేవారిని మానసిక వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో నష్ట నివారణ చర్యలను ప్రారంభించాలని మెక్‌కాల్ అంటున్నారు. 20 నుంచి 80 ఏళ్ల లోపు వయసు కలిగిన సుమారు 50 మంది మానసిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేశాక నిద్రలేమి ప్రభావం తీవ్ర స్థాయిలోనే ఉన్నట్లు తేల్చారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది ఏదో ఒక సందర్భంలో ఆత్మహత్యకు యత్నించినట్లు గుర్తించారు. మంచి నిద్ర దూరం కావడానికి దారితీసే పరిస్థితులను గుర్తించి తగిన వైద్య చికిత్స అందిస్తే ఆత్మహత్యలకు ప్రయత్నించే వారి సంఖ్య తగ్గుతుందని పరిశోధకులు అభిప్రాయ పడ్డారు.

మానసిక వత్తిడులతో ఆత్మహత్యలు చేసుకున్నట్లే, నిద్రలేమి సమస్య తీవ్రరూపం దాల్చినా ఇదే రకమైన పరిస్థితులకు అవకాశం ఉందంటున్నారు. వత్తిడి, నిద్రలేమి అంశాలు మానసికంగా ఒకే రకమైన ప్రభావం చూపుతున్నాయని మెక్‌కాల్ అంటున్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో ఆత్మహత్యల సంఖ్య రెట్టింపు కావచ్చని ఆయన హెచ్చరిస్తున్నారు.

'బహిరంగ రొమాన్స్'.. బంధాలకు చేటు!

పార్కుల్లో ప్రేమికుల ఆలింగనాలు, గాఢమైన చుంబనాలు, వర్షంలో తడిసి ఒకరిలోకి మరొకరు ఒదిగి పోవడం, చిలిపి చేష్టలతో అమ్మాయిల మనసుల్ని దోచేయడం.. ఇవన్నీ సినిమాల వరకైతే 'ఓకే'..! నిజ జీవితంలో ఇలాంటి 'బహిరంగ ప్రేమల'కు తాము ఎంతమాత్రం ఇష్టపడేది లేదని బ్రిటన్‌లో చాలామంది అమ్మాయిలు తెగేసి చెబుతున్నారు. ప్రేమైక లోకంలో విహరిస్తున్నా 'రొమాన్స్'కు కొన్ని హద్దులుండాలని చాలామంది యువతులు భావిస్తున్నట్లు లండన్‌లో జరిగిన ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. సినిమా ప్రేమలకు, వాస్తవ జీవితానికి చాలా తేడా ఉందని, 'బహిరంగ శృంగారం' వల్ల బంధాలు బలహీన పడతాయని చాలామంది యువతులు సర్వేలో పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం 'వాలెంటైన్స్ డే' నాడు కూడా బహిరంగంగా రొమాన్స్ జరిపేందుకు యువతులు సుముఖత చూపలేదట! దీంతో ప్రేమను వ్యక్తం చేసేందుకు యువకులు ఇక అనువైన స్థలాలను ఎంపిక చేసుకోవడం ఉత్తమమని సర్వే నిపుణులు సలహా ఇస్తున్నారు. సర్వే సందర్భంగా సుమారు రెండు వేల మందిని ప్రశ్నించగా, 28 శాతం మంది అమ్మాయిలు బహిరంగంగా ప్రేమను వ్యక్తం చేసేందుకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఇతరులు చూస్తుండగా రొమాన్స్‌లో మునిగిపోవడం నిజమైన ప్రేమ కాదని వారంటున్నారు. బ్రిటన్ యువతుల్లో పావు వంతు మంది తమ భాగస్వాములతో చేతులు కలిపి తిరగాలంటే ఇబ్బంది పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇష్టమైన పురుషుడితో సన్నిహితంగా ఉండేందుకు కొందరు మహిళలు ఇష్టపడడం లేదని సర్వేలో గుర్తించారు. ఇతరులు గమనిస్తారన్న భావన, బిడియం వంటివి ఇందుకు కారణాలంటున్నారు. 'వాలెంటైన్స్ డే' అయినంత మాత్రాన ప్రియుడి కౌగిట్లో ఒదిగిపోయి ప్రేమను చాటుకోనక్కర్లేదని మూడింట రెండు వంతుల అమ్మాయిలు నిర్మొహమాటంగా చెప్పారు. బహిరంగ ప్రేమల వల్ల అపార్థాలు, అనర్థాలు తప్పవని, ఫలితంగా అనుబంధాలు చులకనై పోతాయన్న ఆందోళన నేటి తరం అమ్మాయిల్లో ఉండడం గమనార్హమని సర్వే నిపుణులు చెప్పారు.



దూరపు చుట్టాలు..

ఎక్కడి సైబీరియా..? ఎక్కడి శ్రీకాకుళం ..? వేలాది మైళ్ల ఆవలి నుంచి ఈ 'దూరపు చుట్టాలు' ఏటా క్రమం తప్పకుండా రావడం సందర్శకులకు కనువిందు చేస్తుంది. సైబీరియా దేశం నుంచి వచ్చిన వేలాది పెలికాన్ పక్షులు శ్రీకాకుళం జిల్లా తేలినీలాపురం వద్ద ప్రస్తుతం ఎంతో సందడి చేస్తున్నాయి. సుమారు రెండు దశాబ్దాలుగా ఈ విదేశీ పక్షులు ఏటా సెప్టెంబర్‌లో ఇక్కడి వచ్చి మార్చి వరకూ విడిది చేస్తుంటాయి. ఇక్కడే సంతానోత్పత్తి చేసుకుంటాయి. సైబీరియాలో అతి శీతల వాతావరణం, ఆహారం కొరత కారణంగా ఇటీవల పెలికాన్లు అధిక సంఖ్యలో వస్తున్నాయి.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
సోమవారం
18, ఫిబ్రవరి
2013

సేర్చుకుందాం

ఇల సద్భక్తుల పాదధూళి పటలం బెవ్వండుఫాలంబునం
జిలికెన్ వాడపవర్గ నాథుడనినన్ సిద్ధంబుగా వాని ని
ర్మల హస్తార్పిత భూతి బ్రీతి నొసలారం బూయు విశ్వాసికిన్
ఫలమూహించి విధింప నెవ్వరికి జెప్పన్ వచ్చు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా సద్భక్తుల పాదధూళిని ఎవడు నొసట చల్లకొంటాడో వాడు మోక్షప్రదాత అయిన శివుడు అవుతాడు అని అంటే సిద్ధంగా వాడి నిర్మలహస్తంలోని విభూతిని భక్తితో నొసట పూసే విశ్వాసికి దక్కే ఫలం ఇదీ అని ఎవరూహించి చెప్పగల్గుతారు?

ఇది భస్మధారణ మహిమను తెలిపే పద్యం. భక్త పాదధూళి నొసట పూస్తే అపవర్గ నాథుడౌతాడనీ హస్తార్పిత విభూతి పూసికొంటే ఇంకా ఏమౌతాడో ఎవరు చెప్పగల్గుతారనీ అంటూ హస్త విభూతితో లభించే ప్రయోజనం సిద్ధమైనదిగా చెప్పారు కవి. అంటే అప్రయత్నంగానే ఫలం లభిస్తుందని అర్థం. విభూతిని ఎడమ అరచేతిలో ఉంచుకొని పంచ బ్రహ్మమంత్రంలో అమృతత్వ దాయకం చేసి నొసట దాన్ని పూస్తారు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

16 శ్రీ లత

తల్లిగా తన బాధ్యత మంచి అయినా చెడు అయినా కూతురికి అండగా నిలబడటమే ఇక తను చెయ్యగలిగిన మేలు అనుకుంది.

ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా డాక్టర్ గౌరీదేవికి ఫోన్ చేసి విషయం చెప్పింది.

''మీరు తీసుకున్న నిర్ణయాన్ని నేను కూడా సమర్థిస్తున్నాను. కానీ, ఇందులో మీకు గుండె ధైర్యం కావాలి. జీవన విషయంలో ఫరవాలేదు. తనకు మొండి ధైర్యం ఉంది. అయితే దీనివల్ల తనకు అనేక సమస్యలు ఎదురుకావచ్చు. మీరు తనకు అండగా ఉండటం తప్ప ఇంకేం చేయలేరు లెండి'' అని ధైర్యం చెప్పిందావిడ.

ఆ రోజే కుప్పతొట్టెలో పడుకోబెట్టి తెచ్చుకున్న పాప బోసి నవ్వులతోపాటు మళ్ళీ ఫోన్ రింగ్ అవడంతో వసంత గత ఆలోచనల్లోంచి బయటకొచ్చింది. గతంలోంచి భవిష్యత్తులోకి నెట్టబడింది.

⁘⁘⁘

ఒకటే ఫోన్లు... అన్నీ అభినందన కాల్స్...

''హలో అయాం ప్రౌడ్ ఆఫ్ యు మై ఫ్రెండ్! కాలనీలో అందరూ నీ గురించే మాట్లడుకుంటున్నారు గొప్పగా! ఏవిటీ సంఘ సంస్కర్తవీ, సోషల్ వర్కర్‌వీ అయిపోయావటగా! నీ పెద్ద మనసును అందరూ తెగ మెచ్చేసుకుంటున్నారు జీవనా!'' అంటూ గడగడా మాట్లాడుతున్న స్నేహితురాలి ధ్యాసలో పడి తల్లిని మరిచిపోయింది.

ఆ తర్వాత ఫోన్లు వరసగా చాలా వచ్చాయి.. తర్వాత కూడా వస్తూనే ఉన్నాయి.

⁘⁘⁘

జీవన బ్యాంక్‌కు వెళ్ళింది... ఇంకో నెల లీవ్ ఎక్స్‌టెండ్ చేసుకుందామని!

మేనేజర్ రాకపోవడంతో కొలీగ్ శాంతికి కొంచెం హెల్ప్‌గా అకౌంట్స్ చూస్తూ కూర్చుంది. శాంతి బాత్‌రూమ్‌కు వెళ్ళి వస్తూ ''ఏయ్ జీవనా! నీ కోసం ఎవరో విజిటింగ్ రూమ్‌లో వెయిట్ చేస్తున్నారే?'' అంది.

''నాకోసమా? నీకు తెలియని వాళ్ళెవరుంటారే?'' అంది నవ్వుతూ...

''ఎవరో జర్నలిస్ట్ అట, కెమెరాతో వచ్చాడు'' అంది.

''నాతో జర్నలిస్ట్‌లకేం పని! నేనేం పబ్లిసిటీ ఇవ్వాల్సినంత గొప్పదాన్ని కాలేదే?'' అంటూ విజిటింగ్ రూమ్ వైపు నడిచింది జీవన.

''ఆల్ ద బెస్ట్! ఏదయినా ప్రపోజలేమో!'' అని నవ్వింది శాంతి.

''జోకులాపవే'' అని చేతిలో పెన్ను విసిరి బయటకు వెళ్ళింది.

''హలో అని విష్ చేసి అతను లేచి నిలబడ్డాడు''

''హలో'' అని చూస్తుండిపోయింది. అతనూ ఎంతకీ మాట్లాడకపోవడంతో 'మీరు నన్నుకలవడానికే వచ్చారా?' అనడిగింది.

''జీవన అంటే మీరే కదూ?'' అడిగాడతను అయోమయంగా.

''అవును'

''నా పేరు అవినాష్! సాయంకాలం పేపర్ రిపోర్టర్‌ను. మిమ్మల్ని కలవడానికే వచ్చాను. మా పత్రిక ద్వారా మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలని వచ్చాను'' అన్నాడు పక్కనున్న కెమెరామెన్ వైపు చూస్తూ.

''ఏ విషయంలో ఇంటర్వ్యూ'' అడిగింది అర్థం కానట్టుగా.

''మీరు అనాథ బాలికను పెంచుకుంటున్నారట కదా! పెళ్ళి కాకుండానే తల్లి స్థానానికి ఇంత గౌరవం ఇచ్చి సమాజానికి ఒక క్రొత్త విషయాన్ని పరిచయం చేస్తున్న మిమ్మల్ని మా పత్రిక ద్వారా పరిచయం చెయ్యాలనుకుంటున్నాను'' నవ్వుతూ చెప్పాడతను.

''నేను అనాథ బాలికను పెంచుకుంటున్నానని మీకెవరు చెప్పారు?''

''మీ కాలనీవాళ్ళు''

''నో... నాకిష్టం లేదు. అసలు ఈ ఇంటర్వ్యూలు నాకు నచ్చవు. ఎనీ హౌ థాంక్స్ ఫర్ యువర్ రిస్క్'' అని లేవబోయింది జీవన.

''ఎందుకు... ఎందుకు మేడమ్ వద్దంటున్నారు? సామాజిక సేవ అంటూ ముసుగులు వేసుకుని స్వార్థంగా తను పనులు తాము జరుపుకుంటూ అందరూ ఫోకస్ అవుతూంటే... మీరే మిటి వద్దంటున్నారు?'' అన్నాడతను ఆశ్చర్యంగా.

''ఎందుకంటే... నేనే సామాజిక సేవ చెయ్యడం లేదు కాబట్టి'' అంది.

''అనాథ బాలికను పెంచుకోవడం అందులోనూ పెళ్లి కాకుండా! చాలా గొప్ప విషయం కదా? ఇంతకంటే గొప్ప విషయం కాదా? ఇంత కంటే సమాజ సేవ ఏముంటుంది మేడమ్?'' అన్నాడు.

''పీజ్, నాకు చిన్న పిల్లలంటే ఇష్టం, పెంచుకుంటున్నానంతే! దాన్ని అనవసరంగా ఎక్స్‌పోజ్ చేసి ఏదో పొందాలని లేదు'' అని 'నమస్తే' అని చేతులు జోడించి వెళ్లిపోయింది జీవన. అవినాష్ అలాగే చూస్తుండిపోయాడు.

''రియల్లీ షి ఈజ్ గ్రేట్'' అన్నాడు కెమెరామెన్‌తో...

''ఎందుకుసార్?'' అడిగాడు కెమెరా సర్దేసుకుంటూ...

''ఎంతో గొప్ప పని చేస్తూ 'నేనేం చెయ్యడం లేదు' అని చెబుతున్న ఆమె సింప్లిసిటీ చాలా గ్రేట్'' అన్నాడు.

⁘⁘⁘

వసంత పాపను కాళ్ళమీద పడుకోబెట్టి స్నానం చేయిస్తుంటే పైనుంచి నీళ్ళు పోస్తుంది జీవన.

''కొంచెం వేడిగా ఉన్నాయి నీళ్ళు, కాసిన్ని చన్నీళ్ళు కలుపుకురావే'' అంది- అంతలో వసంత కాలింగ్ బెల్ మ్రోగింది.

మగ్గు పక్కన పెట్టి వెళ్ళి తలుపు తీసింది జీవన. ఎదురుగా పేపర్ బాయ్ నవ్వుతూ కనిపించాడు.

''ఏంటీ మళ్ళీవచ్చావ్? పేపర్ బిల్లు ఇచ్చానుగా?''

''కంగ్రాచ్యులేషన్స్ అక్కా! పేపర్‌లో మీ ఇంటర్వ్యూ వచ్చింది. కంగ్రాట్స్ చెబుతామని వచ్చాను'' అన్నాడు.

''దేంట్లో''

''లేడీస్ స్పెషల్‌లో'' అన్నాడతను ఆనందంగా...

''సరే, వెళ్ళు నేను చూస్తాలే'' అని తలుపేసి పేపర్ కోసం అటూ ఇటూ వెతకసాగింది.

-ఇంకాఉంది

147

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

అప్పుడు హనుమంతుడు సుగ్రీవుడికి తెలిసి వచ్చేవిధంగా ''రామచంద్రుడు వాలిని సంహరించి నీకు ఈ వానర రాజ్యం ఇచ్చాడు. నువ్వు రామకార్యం ఆరడిపుచ్చి, కామోపభోగ సౌఖ్యాలు అనుభవిస్తూ వున్నావు. అందువల్లనే లక్ష్మణుడు మహోద్రగ్రుడై ఏతెంచి వుంటాడు? అందుకు సందియం పడనక్కర కలుగదు. ఆ మేటి వీరుడు వాకిట నిలచి వుండవచ్చునా? లోకవంద్యుడు ఆ ఘనుణ్ణి వెన్వెంటనే రావించి గారవించు. నీ చేసిన ప్రతిన మరవకు, రామకార్యం నెరవేర్చు'' అని వచించాడు. వెనువెంటనే సూర్య నందనుడు సుగ్రీవుడు లక్ష్మణుడిని సాదరంగా లోనికి కొని రమ్మని ఆజ్ఞాపించాడు.

రామానుజుడు విశ్వకర్మ నిర్మిత చిత్ర కౌశలం, స్వర్ణగోపుర హర్మ్య పటలం, కైలాస శిఖర రేఖా రమ్య సౌధరాజు, క్రీడా సరోవర విలసిత వనాంతం అయిన కిష్కింధానగరం ప్రవేశించాడు. ఆ నగరంలోని నిరుపమాన వస్తు సంపదకి ఆశ్చర్యపడుతూ పోయి పోయి, దేవేంద్ర భవన సన్నిభమైన వానరేశ్వరుడి సౌధం చొచ్చి, హెచ్చిన కిన్కతో అప్సర వనితల అందచందాల తెగనాడు వానరాంగనల గానంతో, వారి వీణా వేణు మృదంగ వాద్య రవాలు వింటూ అతి కుపితుడై, అంతకుడి ఆకారంతో అంతఃపుర ద్వారం చేరి నిలిచాడు.

అతడి రాక ఆలించి ఒంటిగా రాక తారా సమేతంగా ఏతెంచి లక్ష్మణుడి అంతక ఆకృతి పోలిన అత్యుగ్ర రూపం కాంచి, భక్తితో పాద పద్మాలకి నమస్కరించి అర్చన చేయబోయాడు. లక్ష్మణుడు సుగ్రీవుడి పూజలు అందుకోక 'ఓయి కృతఘ్నుడా! ఓరి రామద్రోహీ! ఈ నీ సేవలు ఉచితములా? సీతాపతి రాముడితో వర్షాకాలం ఏగిన వెంటనే ఏతెంచుతానని మాట ఇచ్చావు. ఇంతదాకా రావైతివి. రాముడి ఆన తప్పినావు. వాలిని చంపిన రామబాణం ప్రళయాగ్ని కణాలు విరజిమ్ముతున్నది, నిన్ను బుగ్గి చెయ్యక తప్పుతుందా? వనచరాధమా! వీరిడివయి చెడిపోయావు''అని వక్కాణించాడు.

ఆ భీకర వాక్కులు ఆలకించి తార మిక్కిలి భీతితో ''అనఘా! ఈ అర్క నందనుడు మీ చరణదాసుడు. ఇతడికి ఈ రాజ్య సంపదలు ఈ భోగ భాగ్యాలు, మీరు ఒసగినవే. ఈ రవి తనయుడు మీరు నాటినచెట్టు. ఇతడు మీతో వైరం పూన ఏపాటివాడు? రణ విశారదుడైన శ్రీరామచంద్రుడి ఆజ్ఞ తలమోసి, వానరచమూ మతి నీలుడిని కపి సేన నంతటినీ కూర్చి ఆనతిచ్చి, వేచి వున్నాడు. రామద్రోహి కాడు. అసత్య వాక్కు కాడు, కృత ఘ్నుడు అంతకన్నాకాడు. తాము ఈ రవిసూనుడిని కరుణించవలసింది'' అని వాకొంది.

లక్ష్మణుడు సుగ్రీవుని మన్నించుట

ఆ విధంగా తార వినయంగా పలికిన వాక్కులు ఆలించి, లక్ష్మణుడు అమర్షం మాని శాంతం వహించాడు. సుగ్రీవుడు పూజలివ్వగా కైకొన్నాడు. రామానుజుణ్ణి స్వర్ణపీఠం పైన ఆసీనుణ్ణి చేశాడు. లక్ష్మణుడి అనుజ్ఞతో తానూ ఒక సముచితాసనం మీద ఉపవిష్టుడు అయినాడు. అనువుచూసుకొని మృదు మధురోక్తులు ఈ రీతి పలుకదొరకొన్నాడు.

''దశరథ రాజనందనా! సౌమిత్రీ! రఘు రాముడి కార్యం నేను మరువగలనా? ఇప్పుడే వానరులందర్నీ రప్పిస్తాను. సీతను అన్వేషించే నిమిత్తం నలుదెసలకీ పంపిస్తాను. మీరు మూల్యవంతానికి పదండి. ఈ వెనుకనే నేనూ అరుదెంచుతాను. ఏ బాణ హతికి వాలి నేలకూలిపోయాడో, ఏ శరంతో సప్తతాళాలు కూలిపోయాయో, ఆ విశిఖమే నిఖల రాక్షసులని నాశనమొనర్చడానికి, సీతాదేవిని సాధించడానికీ చాలును. సీతాన్వేషణకీ, రావణ వధకీ ఈ రకంగా తోడ్పడి నేను శ్రీరామవిభుణ్ణి అత్యంతమూ భక్తితో సేవించుకొని శాశ్వత కీర్తిని ఆర్జించుకొంటాను'' అని పలికాడు. పిమ్మట ఆంజనేయుణ్ణి కనుగొని 'కపివరులు అందరికీ చాటింపు వేయించు. లంకపై నడిపించాలి. ఇక ఆలసించ తగదు. ఇప్పుడు మనం రామధరణీశ్వరుణ్ణి దర్శించడం కోసం బయలుదేరదాం అని వచించాడు.

-ఇంకాఉంది

సోమవారం, 18 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ అష్టమి సా.03.18
నక్షత్రం: కృత్తిక ఉ.11.51
వర్జ్యం: రా.తె.05.32 నుండి
దుర్ముహూర్తం: మ.12.53 నుండి 01.39 వరకు, తిరిగి మ.03.11 నుండి 03.57 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ధననష్టమేర్పడకుండా చూసుకోవాలి. డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. ప్రతి పని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
అనుకోకుండా కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడాలి. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీర్ణ బాధలు అధికమవుతాయి. కీళ్లనొప్పుల బాధ నుండి రక్షించుకోవడం అవసరం.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. ఉత్సాహంగా ఉంటారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. వ్యయ, ప్రయాసలు తప్పవు. వృత్తిరీత్యా కొత్త సమస్యల నెదుర్కొంటారు. కలహాలేర్పడకుండా చూసుకోవాలి.

మంచిమాట

మాఘమాస ప్రాశస్త్యం

మాసాలలో మాఘమాసం మహిమాన్వితమైనది. మ+అఘం = మాఘం. 'అఘం' అంటే పాపం, 'మ' అంటే లేనిది. 'మాఘం' అంటే పాపరహితమైనది అని తెలుస్తోంది. ఈ మాఘమాసంలో ఆచరించదగు పుణ్యఫలప్రదమైన వ్రతం 'మాఘ ఆదివార వ్రతం' మాఘమాసం ఆదిత్యుని జనన మాసం. ఆదిత్యుడు అధిదేవతగా గల వారమే 'ఆదివారం', ఆదిత్యారాధనకు అనువైన వారం. ఆదివారంనాడు ఆచరించే వ్రతం కనుక ఈ వ్రతానికి 'మాఘ ఆదివార వ్రతం' అని వ్యవహరిస్తారు. ఈ మాసంలో వచ్చే అన్ని ఆదివారాలు ఈ వ్రతం చేయడం అత్యంత ఫలప్రదం. అంతగా ఆచరించ వీలు కానివారు ఆ నెలలోని ఏ ఒక్క ఆదివారంనాడైనా చేయవచ్చును.

ఈ వ్రతాన్ని ఐదు సంవత్సరాలు వరుసగా పాటించి, ఆరవ సంవత్సరం, రథసప్తమినాడు గానీ లేక మాఘమాసంలో ఆదివారంనాడైనా ఉద్యాపన చేయవలెను. ఈ వ్రతాచారణవల్ల సంపూర్ణాయురారోగ్యములు పొంది అనంత పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయని పురాణ వచనం. మాఘమాసంలో 'మహామాఘి'గా పిలువబడే 'మాఘపూర్ణిమ' మాఘమాసంలో మహిమాన్వితమైన పుణ్య తిథి అని ప్రతీతి. చంద్రుడు సంపూర్ణ కళలతోటి 'మఘ' నక్షత్రంతో కూడి వుంటే పూర్ణిమ రోజు 'మహామాఘి'గా వ్యవహరించబడుతున్న ఈ విశిష్ట తిథినాడు చేసే ఇష్టదేవతారాధన, ధ్యాన, జపాది అనుష్ఠానములు విశిష్టమైన ఫలితాన్నిస్తాయి.

పరమ శివుని అర్ధాంగి 'సతీదేవి' మాఘపూర్ణిమనాడు ఆవిర్భవించినదని, శక్తి స్వరూపిణియైన భవానీదేవి దక్షిణావర్తపు శంఖాకారాన్ని దాల్చినదై సరయూ నదిలో పద్మసీనయై ఉండగా స్నానార్థయై వచ్చిన దక్ష ప్రజాపతి ఆ శంఖమును చూసి దానిని చేత తాకగా ఆ శంఖం బాలికా రూపం దాల్చగా, ఆ బాలికను దక్ష ప్రజాపతి పుత్రికగా సతీదేవి పేరిట పెంచుకొనెనని చెప్పబడుతున్నది. సతీదేవి జన్మదిన పురస్కారకం కావటంవల్ల ఈ మహామాఘి మరింత మహిమాన్వితమైనది.

మాఘ పౌర్ణమి నాటి ప్రాతఃకాలాన సమీప నదీ తీరంలో స్నానమాచరించి, ఆదిత్యునికి అర్ఘప్రదానం చేసి, తిల హోమం, తిలదానం, తిలసేవనం చేయాలని వ్రత గ్రంథ నిర్దేశం. నువ్వుల నూనెతో నింపిన కంచుపాత్ర తీసుకుని 'దేవ దేవ జగన్నాథ వాంఛితార్థ ఫలప్రద తిలపాత్రం ప్రదాస్యామి తదాగ్రే సంస్థితోహ్యాసం' అనే శ్లోకాన్ని పఠిస్తూ 'తిలాః పుణ్యాః పవిత్రాశ్చ సర్వపాప హరా స్మృతా' అనే మంత్రాన్ని పఠిస్తూ, ఆ తిలపాత్రను బ్రాహ్మణునికి దానం చేస్తే సర్వపాపాలు నశించి పుణ్యప్రాప్తి కల్గుతుందని శాస్త్రవచనం. ఈ మాసంలో మఘ నక్షత్రాధిపతియైన బృహస్పతి ఆరాధన కూడా శ్రేష్ఠం.

స్నాన మహిమః నర్మదా నదీతీరంలోని ఒక గ్రామంలో నివసించే సువ్రతుడనే బ్రాహ్మణుడు వేదశాస్త్ర, ధర్మశాస్త్రాలన్నింటిని పూర్తిగా చదివి పురాణాలను చెప్పటంలో తనకు సాటిలేరనే సుగుణ సంపదలతో నిండిన సువ్రతునకు ఉన్న ఒకే ఒక దుర్గుణం డబ్బుమీద వ్యామోహం. ఆ ఆలోచనతోనే మనశ్శాంతినికోల్పోయాడు.

ఇలాంటి సంపాదన చేస్తూ ఉన్నరోజులలో ఒక రోజు సువ్రతుని ధనమంతా దొంగలు దోచుకపోతారు. ఈ సంఘటనతో అధీరుడైపోయి, వివేకోదయం అయింది. భగవంతుని స్మరించకుండా, పుణ్యకార్యాలు, దాన ధర్మాలు చేయకుండా పరలోకంలో ఎలా పుణ్యగతులను పొందగలనని పశ్చాత్తాపం చెందాడు. మాఘమాస స్నానం పాప, తాపాలను హరించి, స్వర్గలోక ప్రాప్తి కలిగిస్తుందని, అనేక పురాణాలు అధ్యయనం చేసిన సువ్రతుడికి జ్ఞాపకం రాగా అదే నెల మాఘమాసం అయింది. నర్మదా నదీ స్నానాచరణవల్ల స్వస్థత చేకూరి, శాంతిని, సంతోషాన్ని పొందగలిగాడు. మాఘ మాస స్నాన మహిమతో స్వర్గంలో సకల సుఖాలు పొందాడు. మాఘమాసమంతా మాఘస్నానాన్ని పాటించలేనివారు ఒక్క మాఘ పౌర్ణమినాడైనా నియమబద్ధంగా స్నానమాచరిస్తే మాఘమాస పుణ్యఫలాన్ని పొందవచ్చునని శాస్త్ర విదితం.

-రసస్రవంతి - కావ్యసుధ

వృతాసురుడు

25

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 18



మాటాట

ఆధారాలు:

అడ్డం
1. హార్ట్‌ఎటాక్
5. భార్య
6. మధ్యలో ఓ అక్షరంతోశాకి... ఓ రాక్షసి
8. ఆంజనేయుడు
9. నునుపైన మెత్తని
10. కంచుకము
13 అడవి నరికి సాగు చేసేపాలం
14. రాక్షసుడు
15. మరక

నిలువు
2. కలహం, జగడం
3. సాదృశ్యం
4. చెడ్డఆలోచనం
6. గజ్జి లాంటిదే
7. అలక, కోపం
11. బ్రహ్మ
12. పేనం
13. ఒకరిపై ఒకరుగెలుపు సాధించే ప్రయత్నం

మాటాట - 17 సమాధానం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

'అరబ్బు'విప్లవం మళ్లీ మొదటికి!

కొత్త రూపులో పాత నియంతృత్వాలు

అరబ్బు విప్లవం..నియంతల గుండెల్లో మంటలు రేపిన జనాగ్రహానికి నిదర్శనం. టునీషియాలో నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం అనేక అరబ్బు దేశాల్లో విప్లవాగ్నులు రగిలించింది. దశాబ్దాలుగా అధికారాన్ని చేతబట్టి ప్రజల జీవితాలతో ఆడుకున్న నియంతృత్వ పాలకులకు చరమగీతానికి టునీషియా ఉద్యమం ఊతాన్నిచ్చింది. అనంతరం ఈజిప్టు, సిరియా, లిబియా సహా అనేక దేశాల్లోనూ ప్రజలు విప్లవ భేరీలు మోగించి..ప్రజాస్వామ్య ఆకాంక్షను చాటి చెప్పారు. ఇప్పుడావేడి..వాడి చల్లారిందా అన్న అనుమానాలకు ఆస్కారమిచ్చే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య పథంలోకి అడుగు పెడతాయనుకున్న దేశాల పరిస్థితి తిరోగమనమేనా అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. ఇటీవల టునీషియాలో ఓ లౌకిక పార్టీకి చెందిన నాయకుడ్ని దారుణంగా హతమార్చిన నేపథ్యంలో అరబ్బు విప్లవ సౌరభం ఎటు దారితీస్తోందన్న ఆందోళన కలుగుతోంది. ఏ నియంతృత్వాలనైతే ప్రజలు ఈసడించుకున్నారో..ఏ రకమైన పాలన తమకు వద్దనుకున్నారో..అంతకు మించిన స్థాయిలోనే అధ్వాన్న పరిస్థితులు ఆ దేశాల్లో కనిపిస్తున్నాయి. కొత్తగా అధికారం చేపట్టిన పాలకులు మాజీ నియంతల్ని మించిన స్థాయిలోనే ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న దాఖలాలు ప్రస్ఫుటమవుతున్నాయి. బంగారానికి ఎంతగా మెరుగు పెడితే అంతగా మెరుస్తుందన్న సామెత చందంగా..దశాబ్దాల పాటు నియంతృత్వంలో మగ్గిన దేశాల్లో అంత తేలిగ్గా మార్పు రాదని, ప్రజాస్వామ్య దిశగా అడుగులు వేయాలంటే..ఎన్నో రకాల ఆపసోపాలు తప్పవన్న వాదనా వినిపిస్తోంది. అందుకే అరబ్బు దేశాల ప్రజల ఆకాంక్షకు ఎంతగా ఎదురుదెబ్బలు తగిలితే వారి మనోనిబ్బరం అంతగా బలపడుతుంది. ఎంతగా సరికొత్త 'నియంతృత్వా'లు అణచివేయాలని చూస్తే అంతగానూ వారిలో ఆకాంక్ష నిగ్గుదేలుతుంది. అంటే అరబ్బు దేశాల్లోని తాజా పరిస్థితులు ఆశనిరాశల చందంగానే ఉన్నాయని చెప్పడానికి దాఖలాలు కోకొల్లలు. 2010లో టునీషియాలో మొదలైన నియంతృత్వ వ్యతిరేక పోరాటం..ప్రజా ఉద్యమాలు, నిరసనలు మధ్యప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా దేశాల్లోకి వ్యాపించి ఆక్కడి నియంతృత్వ పాలనలను, నియంతలను నీరుగార్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. టునీషియా ఉద్యమ స్ఫూర్తి దావానలంలా వ్యాపించి..అంతటా ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ఉద్దీపనగా నిలిచింది. అంతగా ప్రజలే మార్పులు కోరుకున్నప్పుడు ఎంతటి నియంతైనా తప్పుకోవాల్సిందేనని..తమతమ దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థల ఆవిర్భావానికి దారులు వేయాల్సిందేనని ప్రతి ఒక్కరూ భావించారు. అంతటా 'నిన్న నియంతృత్వం..నేడు ప్రజాస్వామ్యం'అన్న ఆశావహ దృక్పథం తొణికిసలాడింది. కానీ, రెండేళ్లు గడిచినా ప్రజలు ఆశించిన మార్పులు ఎండమావిగానే మారాయి. సిరియాను తీసుకున్నా...ఈజిప్టు పరిణామాలను పరికించినా ఆశ కంటే కూడా నిరాశే ఎక్కువగా కలుగుతుంది. సిరియాలో ఇప్పటికీ ఎడతెగని రక్తపాతమే..ఈజిప్టులో ప్రజలే ఎన్నుకున్న అధ్యక్షుడు ముర్సీ..పగ్గాలు చేపట్టిన ముస్లిం బ్రదర్‌హుడ్ పార్టీ 'కొత్త సీసాలో పాత సారా'అన్న చందంగా సరికొత్త నియంతృత్వాన్నే సాగిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరబ్బు విప్లవానికి నాందీ ప్రస్తావన చేసిన టునీషియా పరిస్థితి ఇప్పుడు దిగజారుడు చందంగానే మారింది. అక్కడి అధికార ఇస్లామిక్ పార్టీ 'ఎన్నాహ్‌దా' లౌకికవాదులను చెండాడుతోంది. ఫలితంగా ప్రజలు మరో సారి విప్లవ శంకాన్ని పూరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ దేశాల చరిత్రను పరిశీలిస్తే..పాత పాలన స్థానే కొత్త పాలన రావడం అన్నది అంత తేలిక్కాదన్న విషయం స్పష్టం అవుతుంది. ఒక వేళ మార్పు వచ్చినా కొత్తగా పగ్గాలు చేపట్టిన నేతలు 'పాత'పద్ధతుల్లోకి వెళ్లిన సందర్భాలే ఉన్నాయని, పూర్తి స్థాయి మార్పులు అసాధ్యమన్న వాదనకు తాజా పరిణామాలు అద్దం పడుతున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం నాటి నుంచి ఇప్పటి వరకూ యాభైకి పైగా జరిగిన విప్లవాల్లో అనేక నియంతృత్వాలు కుప్పకూలాయి.

ఇంకొన్ని చోట్ల గుణాత్మక రీతిలో రాజకీయ సంస్కరణలకు బాటలు వేశాయి. అయితే..నియంతృత్వ దేశాల్లో జరిగిన ప్రజా విప్లవాల్లో మూడో వంతు మాత్రమే విజయాన్ని సంతరించుకుని ఆయా దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థల ఆవిర్భావానికి దోహదం చేశాయి. విప్లవానంతర పరిణామాల వల్ల ప్రజాస్వామ్య దేశాలుగా మారిన వాటిలో కొన్నింటిలోనే స్థిరమైన పాలన కొనసాగుతోంది. ఇప్పటికీ అడపాదడపా తమ హక్కుల కోసం ప్రజలు ఉద్యమించక తప్పని పరిస్థితి అక్కడ కనిపిస్తూనే ఉంది. నియంతలను తరిమికొట్టినప్పటికీ తాము అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలంటే..ప్రజాస్వామ్య వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలంటే ఆయాదేశాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే.. తాము నిర్దేశించుకున్న పథంలో తమతమ దేశాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యమ స్ఫూర్తిని కనబర చాల్సిందే.

-బి.రాజేశ్వర ప్రసాద్

అరబ్బు దేశాల ప్రజలు ఆశించిన ప్రజాస్వామ్య లక్ష్యాలు సమీప భవిష్యత్‌లోనైనా చేరువయ్యే అవకాశం ఉందా? మూడేళ్ల క్రితం టునీషియాలో రగులుకున్న ప్రజా ఉద్యమం అనంతరం మధ్యప్రాచ్య, తూర్పు ఐరోపా పాలకుల్ని కదిలించినా ఇప్పటి వరకూ ఫలితం శూన్యం..కొత్త పాలకులతో మరో సారి పోరాటం సాగిస్తే తప్ప మారని పరిస్థితి..అసలు నియంతృత్వ దేశాల్లో మార్పు అంత త్వరగా సాధ్యమవుతుందా అన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటి వరకూ జరిగిన యాభై ప్రధాన విప్లవాల్లో కొన్ని దేశాల్లో మాత్రమే స్థిరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఇక నియంతృత్వ దేశాల్లో అయితే ఈ మార్పుల విజయం మూడో వంతు మాత్రమే..ఈ నేపథ్యంలో అరబ్బు స్ప్రింగ్ సాధించిందేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది..!

అనుకున్నదే చేసింది!

ఉత్తర కొరియా అణుపాటవ పరీక్ష

ప్రపంచ దేశాలన్నీ వద్దువద్దంటున్నా ఉత్తర కొరియా వినలేదు. అనుకున్నదే చేసింది. అణుపాటవ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. అమెరికా హెచ్చరికలను, దక్షణ కొరియా ఆందోళనలను ఏమాత్రం పట్టించుకోని ఉత్తర కొరియా యువ నాయకుడు కిమ్ జాంగ్ అన్ తన నిర్ణయాల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని, రక్షణ విషయంలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశాడు. ఉత్తర కొరియా అణు పరీక్షను నిర్వహించడం ఇది మూడోసారి. గతంలో జరిపిన రెండు పరీక్షలతో పోల్చేస్తే, ఈసారి ఉత్తర కొరియా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించింది. అమెరికా, చైనా వంటి దేశాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో, అత్యాధునిక ప్రమాణాలను అందుకోగలిగింది. ఈ పరీక్షతో ఉత్తర కొరియా రెచ్చిపోతుందనిగానీ, అమెరికా వంటి దేశాలపై అణ్వస్త్రాన్ని ప్రయోగిస్తుందనిగానీ అనుకోవడానికి వీలులేదు. అయితే, పక్కదేశాలకు పక్కలో బల్లెంగా మారుతుందనేది వాస్తవం. చిరకాల ప్రత్యర్థి దక్షిణ కొరియా ఈ పరిణామం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తుంటా, అమెరికా కూడా గొంతుకలుపుతోంది. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుందనేది అందరికీ తెలిసిన వాస్తవం. దక్షిణ కొరియా తన ఉనికికోసం అమెరికా పంచన చేరితలో, ఉత్తర కొరియాకు ఒకప్పటి సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఇప్పుడు రష్యాతో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగిస్తున్నది. అంతమాత్రం చేత, అమెరికాను శత్రుదేశంగా పరిగణిస్తున్నదనో, ఆ దేశంతో సంబంధాలను తెగతెంపులు చేసుకుందనో అనుకుంటే పొరపాటే. ఆసియాపై, ప్రత్యేకించి హిందూ మహా సముద్రంపై పెత్తనం చెలాయించే ప్రయత్నాలు చేస్తున్న అమెరికా మాత్రం ఉత్తర కొరియా అణు పాటవాన్ని భూతద్దంలో చూపుతోంది. మానవాళి మనుగడకే ప్రమాదం ఏర్పడిందంటూ నానా హడావుడి చేస్తున్నది. భూగోళం బద్దలైపోతుందని ప్రపంచ సమాజాన్ని హెచ్చరిస్తున్నది. ఉత్తర కొరియా దూకుడును ఆపాలని, అందుకు అవసరమైతే ఆంక్షలు విధించాలని సూచిస్తున్నది. కానీ, కింగ్ జాంగ్ అన్ అమెరికా ఆందోళనను, హెచ్చరికలను పట్టించుకోలేదు. ఏ క్షణంలోనైనా అణు ప్రయోగానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకున్న ఉత్తర కొరియా, ర్యాకెట్ లాంఛర్ ద్వారా అణ్వస్త్ర ప్రయోగాన్ని సైతం విజయవంతంగా ముగించింది. తాజా ప్రయోగం ఉత్తర కొరియా ఈ దిశగా వేసిన అతి పెద్ద ముందడుగు.

ఉత్తర కొరియా అణు పాటవ ప్రయోగంపై ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని భద్రతా మండలి ఏ విధంగా స్పందిస్తుందో, ఎలాంటి చర్యలు చేపడుతుందో అన్నది ఉత్కంఠ రదపుతోంది. మండలి నిబంధనల ప్రకారం, ఈసారి సమావేశానికి అధ్యక్షత వహించే అవకాశం దక్షిణ కొరియాకు లభిస్తుంది. సహజంగానే ఉత్తర కొరియా అణు ప్రయోగాన్ని దక్షిణ కొరియా చర్చకు స్వీకరిస్తుంది. కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదు. ఈ ప్రతిపాదనలకు అమెరికా మద్దతునిచ్చినా, చైనా ప్రతిఘటించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మండలిలో ఎంత సుదీర్ఘ చర్చ జరిగినా, ఎంతటి కఠినమైన నిర్ణయాలు తీసుకున్నా, అవి అమల్లోకి వస్తాయన్న నమ్మకం ఎవరికీ లేదు. చైనా అతన విశిష్ట అధికారులను ఉపయోగించి, ఉత్తర కొరియాపై ఆంక్షలు అమలు కాకుండా అడ్డుకుంటుందనేది వాస్తవం. ఉత్తర కొరియాను నియంత్రీకరించడంలో మండలి విఫలమైతే, అమెరికా చూస్తూ ఊరుకోదు. తన సొంత అజెండాతో ముందుకు వెళుతుంది. ఆంక్షలను అమలు చేస్తుంది. ఇది కూడా త్వరలో చోటు చేసుకునే పరిణామమే. అంతేగాక, ఆసియా ప్రాంతంలో అమెరికా తన సైనిక బలాన్ని, బలగాలను మరింతగా మోహించవచ్చు. మరోవైపు దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాలు రాబోయే ప్రమాదాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో నిమగ్నమవుతాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఉత్తర కొరియాకు చైనా అండగా నిలుస్తుందనడానికి కారణాలు లేకపోలేదు. అమెరికాకు దక్షిణ కొరియా అత్యంత సన్నిహితంగా ఉంటున్నందున, ఉత్తర కొరియాను మంచి చేసుకోవడం చైనాకు తప్పనిసరి. అమెరికాతో ఎంతోకాలంగా చైనా అనేకానేక అంశాలపై విభేదిస్తున్నది. ఆసియాలో అత్యంత బలమైన శక్తిగా చైనా ఎదగడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. చైనా వ్యతిరేక వర్గాలను కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. అమెరికా చేపడుతున్న చర్యలు, అనుసరిస్తున్న వైఖరి చైనాను ఆగ్రహానికి గురి చేస్తున్నది. స్థూలంగా చూస్తే, ఉత్తర కొరియా అణుపాటవ పరీక్ష, దక్షిణ కొరియాతో విభేదాలు పరోక్షంగా చైనా, అమెరికా మధ్య వైరాన్ని మరింతగా పెంచుతున్నాయి. చైనాకు చెందిన ఎన్నో ప్రముఖ కంపెనీలకు ఉత్తర కొరియాలో వ్యాపార లావాదేవీలతోపాటు భారీ పెట్టుబడులు కూడా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా మారి, అభివృద్ధిలో భాగస్వాములైన ఆయా కంపెనీల ప్రయోజానాలను కాపాడే బాధ్యత కూడా చైనాకు ఉంది. అందుకే, ఉత్తర కొరియా పట్ల చైనా సానుకూలంగా వ్యవహరిస్తున్నది.



కిమ్ జాంగ్ అన్ ఆషామాషీ నేత కాదు. ప్రజాబలం అతనికి ఉంది. త్రివిధ దళాల మద్దతును కూడగట్టుకోగలిగాడు. తండ్రి నుంచి వారసత్వంగా లభించిన అధికారాన్ని అతను అందిపుచ్చుకున్నాడు. ప్రజల మనోభిష్టానికి అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నాడు. అణు ప్రయోజం ప్రజల్లో అతనికి ఉన్న పరపతిని మరింత పెంచింది. దక్షిణ కొరియా, జపాన్ దేశాలే కాదు... చివరికి అమెరికా నుంచి ప్రమాదం ముంచుకొచ్చిన, సమర్థంగా తిప్పికొట్టే సత్తా సంపాదించుకున్నామని ఉత్తర కొరియా సంబరపడుతున్నది. యురేనియం ఆధారిత అణ్వస్త్రాన్ని రూపొందించడంలో సఫలమైన ఉత్తర కొరియా, ఇప్పుడు దానిని సాధ్యమైనంత సూక్ష్మ రూపంలోకి తీసుకొచ్చే ప్రయత్నంలో పడింది. ఈ ప్రయోగాలు విజయవంతమైతే, సాధారణ ర్యాకెట్ లాంఛర్లను ఉపయోగించి అణుదాడులు చేసే శక్తిసామర్థ్యాలను సొంతం చేసుకుంటుంది. యురేనియం నిక్షేపాల వెలికితీత, శుద్ధి, అణ్వస్త్రాల్లో దాని వినియోగం వంటి పలు అంశాలపై ఐక్యరాజ్య సమితి ఆంక్షలు విధించేలా అమెరికా ఒత్తిడి తీసుకురాగలిగింది. ప్రపంచ దేశాలు మంచిగానో, బెదిరించో దీనికి సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేయించగలిగింది. ఉత్తర కొరియా విషయంలో మాత్రం అమెరికా పాచిక పారలేదు. అనుకున్న లక్ష్యాలు నెరవేరలేదు. ఒత్తిళ్లకు లొంగని ఉత్తర కొరియా తన పంథాలోనే సాగుతున్నది. ఈ పరిణామాల ప్రభావం, ప్రపంచ దేశాల స్పందన ఏ స్థాయిలో ఉంటాయనేది భవిష్యత్తే తేల్చాలి.

- బిఎల్

ఊహించని నిష్క్రమణ!

పోప్ బెనెడిక్ట్ వైదొలగడానికి ఆరోగ్య సమస్యలే కారణమా?

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్యాథలిక్ క్రైస్తవ మతస్థులకు మతపరంగా సర్వోన్నత పీఠంగా భావించే పోప్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు 16వ బెనెడిక్ట్ హఠాత్తుగా ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పదవిలో కొనసాగుతుండగానే ఇంత హఠాత్తుగా ఆయన ఎందుకు బాధ్యతలనుంచి తప్పుకుంటున్నారనే విషయం మాత్రం ఎవరికీ అర్థం కాలేదు. చరిత్రకారులైతే గతంలో ఎప్పుడైనా ఇలా పదవిలో ఉండగా పోప్ ఎవరైనా బాధ్యతల నుంచి తప్పుకున్నారా అనే విషయాన్ని పరిశోధించడం మొదలుపెట్టారు. నిజానికి మతపరమైన బాధ్యతలను నిర్వర్తించలేని పరిస్థితుల్లో పోప్ తన బాధ్యతలనుంచి ఎప్పుడైనా స్వచ్ఛందంగా తప్పుకోవచ్చు. అయితే ఇలాంటి సంఘటన జరగడం చరిత్రలో దాదాపుగా అరుదు. దాదాపు ఆరువందల ఏళ్ల క్రితం మాత్రమే ఇలాంటి సంఘటన జరిగింది. 2 వేల ఏళ్ల క్యాథలిక్ చర్చి చరిత్రలో ఇది కేవలం రెండో సంఘటన మాత్రమే.

తాను స్వచ్ఛందంగా తప్పుకోవడానికి ఆరోగ్య సమస్యలే కారణమని 86 ఏళ్ల బెనెడిక్ట్ ప్రకటించారు. ఆయన ఈ నెల 28న పదవినుంచి తప్పుకోనున్నట్లు కూడా ప్రకటించారు. బహుశా గత ఏడాది మెక్సికో, క్యూబా దేశాల్లో పర్యటించినప్పుడే బెనెడిక్ట్‌కు పోప్‌గా మతపరమైన బాధ్యతలను తాను సక్రమంగా నిర్వర్తించలేనేనే విషయం తెలిసి వచ్చి ఉంటుంది. అయితే బెనెడిక్ట్ పదవినుంచి తప్పుకోవడానికి చూపిన కారణాలు సరయినవేనా అని చాలా మంది ఆశ్చర్య పోతున్నారు. గతంలో పోప్‌గా బాధ్యతలు నిర్వర్తించిన చాలామంది వయోభారంతో కానీ, లేదా క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ పోప్ బాధ్యతలనుంచి తప్పుకోలేదు. వారిలో చాలామంది పదవిలో కొనసాగుతుండగానే కాలధర్మం చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి.

అయితే క్యాథలిక్ చర్చి అధిపతి బాధ్యతలనుంచి తప్పుకుంటున్నట్లు బెనెడిక్ట్ హఠాత్తుగా ప్రకటించిన తర్వాత వాటికన్ ఓ రహస్యాన్ని బైటపెట్టింది. బెనెడిక్ట్ చాలా సంవత్సరాలుగా పేస్‌మేకర్ (గుండె తాత్కాలికంగా పని చేయడానికి అమర్చే పరికరం) సాయంతో జీవిస్తున్నారని, దాని బ్యాటరీని మూడు నెలల క్రితమే మార్చారన్న విషయాన్ని వాటికన్ మొట్టమొదటిసారిగా బైటపెట్టింది. ఈ వార్త చాలా మందికి దిగ్భ్రాంతి కలిగించేదే కావచ్చు కానీ ప్రముఖులకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను ఏళ్ల తరబడి రహస్యంగా ఉంచడం మాత్రం కొత్తేమీ కాదు. వారు అలా రహస్యంగా ఉంచడానికి కారణం కూడా లేక పోలేదు. వాస్తవాలను వెల్లడించిన పక్షంలో వారు చేపట్టిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేరేమోనన్న అనుమానాలు జనాల్లో కలుగుతాయనేది వారి

భయం. చాలా సంవత్సరాలుగా గుండెకు సంబంధించిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ బెనెడిక్ట్ తన పదవీ కాలంలో క్యాథలిక్ చర్చిని చుట్టుముట్టిన సెక్స్ నేరాల కుంభకోణాన్ని విజయవంతంగా ఎదుర్కోగలిగారు. కార్చిచ్చులాగా యూరప్‌నుంచి ఉత్తర అమెరికా దాకా విస్తరించిన ఈ కుంభకోణం వెలుగు చూసిన తర్వాత బెనెడిక్ట్ స్వయంగా బాధితులను కలిసి సెక్స్ నేరాలకు పాల్పడిన మత బోధకులపై సకాలంలో చర్యలు తీసుకోలేక పోయినందుకు పదే పదే క్షమాపణలు సైతం చెప్పారు. ఈ కుంభకోణం కారణంగా దిగజారిన చర్చి ప్రతిష్ఠను తిరిగి నిలబెట్టుకోవడం కోసమే పోప్ ఇలా క్షమాపణలు చెప్పారని, ఇది కేవలం కంటితుడుపు చర్యేనని బాధితుల్లో చాలా కుటుంబాలు అంటున్నప్పటికీ ముదిమి వయసులో ఇంత భారీ సంక్షోభాన్ని ఎదుర్కోవడం ఎవరికైనా అంత సులభం కాదు.

ప్రస్తుతం ప్రపంచమంతా కూడా కొత్త పోప్‌గా ఎవరు ఎంపిక అవుతారనే దానిపై ఊహాగానాలు చేయడంలో తలమునకలుగా ఉంది. ఈస్టర్‌కు ముందే కొత్త పోప్ ఎంపికను పూర్తి చేయాల్సి ఉండడంతో యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలకు చెందిన బిషప్‌లలో ఎవరిని పోప్‌గా ఎంపిక చేయాలనే దానిపై కార్డినల్స్ మంతనాలు జరపున్నారు. ఈ తతంగమంతా సాఫీగా జరిగి పోయి కొత్త పోప్ ఎంపిక సకాలంలోనే జరిగిపోవచ్చు. అయితే బెనెడిక్ట్ పదవినుంచి తప్పుకుంటున్నట్లు ఇంత హఠాత్తుగా ఎందుకు ప్రకటించారని క్రైస్తవ మతాభిమానులు మరి కొంతకాలం ఆశ్చర్యపోక తప్పదేమో!

- ఆర్కే

అఫ్గాన్ శాంతికి పాక్ ముడి!

కామెరాన్ చొరవ ఫలించేనా?

అఫ్గాన్‌లో శాంతి సాధన కృషికి మొదటి నుంచీ అడ్డంకిగా ఉన్న పాకిస్తాన్ ఎట్టకేలకు శాంతిప్రక్రియలో తనవంతు పాత్రను పోషించడానికి అంగీకరించడం శుభ పరిణామం. అఫ్గాన్‌లో శాంతి సాధన అనేది దాని పొరుగున ఉన్న పాక్ చొరవ తీసుకున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుందనే విషయాన్ని అమెరికా, బ్రిటన్‌లాంటి అగ్రరాజ్యాలతో పాటుగా భారత్ చెప్తూ వస్తున్నాయి. అయితే అఫ్గాన్ సరిహద్దులకు ఆనుకుని ఉన్న పాక్ గిరిజన ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పర్చుకున్న తాలిబన్ ముఠాలు అక్కడినుంచి సరిసద్దులు దాటి అఫ్గాన్‌లో తరచూ రక్తపాతాన్ని సృష్టిస్తూనే ఉన్నాయి. తమ భూభాగంలో తలదాచుకుని ఉన్న తాలిబన్ ముఠాలను అదుపు చేయాలని అమెరికా లాంటి అగ్రరాజ్యాలు పాక్‌పై ఎంత ఒత్తిడి తెచ్చినా రాజకీయ కారణాల దృష్ట్యా పాకిస్తాన్ ఇప్పటి వరకు అందుకు పెద్దగా సుముఖత కనబరచలేదు. ఫలితంగా పాక్‌లోని తాలిబన్ ముఠాలకు స్థావరాలుగా మారిన గిరిజన ప్రాంతాలపై అమెరికా డ్రోన్ దాడులు కొనసాగించాల్సి వస్తోంది. అమెరికా దాడుల పట్ల పాక్‌లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో అఫ్గాన్‌లో శాంతిసాధన ప్రక్రియలో పాక్ పాలు పంచుకోవడం లేదు.

అఫ్గాన్‌నుంచి అమెరికా నేతృత్వంలోని నాటో బలగాలు 2014 చివరినాటికల్లా ఉపసంహరించుకోనున్న నేపథ్యంలో అక్కడ శాంతిసాధన అగ్రరాజ్యాలకు అత్యంత ప్రధామైన విషయంగా మారింది. నాటో బలగాలు వైదొలగిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను చేపట్టనున్న అఫ్గాన్ భద్రతా దళాలు తాలిబన్ ముఠాల దాడులను ఎదుర్కోగలుగుతాయా అనేది అందరి అనుమానం. పాక్ సహకరిస్తే కానీ, ఆ ముఠాలను అదుపు చేయడం సాధ్యం కాదనేది అందరికీ తెలిసిన సత్యం. అందుకే చర్చలు జరపడం ద్వారా తాలిబన్ ముఠాలు తిరిగి జనజీవన స్రవంతిలోకి రావడానికి అవకాశం కల్పించాలని అఫ్గాన్ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్ ఎప్పటినుంచో చెబ్తూనే ఉన్నారు. ఇటీవల వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాతో జరిగిన శిఖరాగ్ర చర్చలు ముగిసిన అనంతరం కూడా కర్జాయ్ ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసారు. ఈ నేపథ్యంలో పాక్‌ను అఫ్గాన్ శాంతి ప్రక్రియలో భాగస్వామిని చేసే బాధ్యతను బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరాన్ భుజాన వేసుకున్నారు. ఇటీవల లండన్‌లో అఫ్గాన్ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్, పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీతో కలిసి నిర్వహించిన త్రైపాక్షిక చర్చలు దాదాపుగా ఫలవంతం కావడం అఫ్గాన్‌లో శాంతిసాధన ప్రక్రియలో ఓ ముందడుగు. ఈ చర్చల సందర్భంగా పాక్ అధ్యక్షుడు జర్దారీ, అఫ్గాన్ అధ్యక్షుడు కర్జాయ్‌లు అఫ్గాన్‌లో శాంతిసాధనకు ఆరు నెలల కాలవ్యవధితో కూడిన కార్యాచరణకు అంగీకరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని చర్చల్లో పాల్గొన్న అన్ని పక్షాలు అంగీకరించాయని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జర్దారీ ప్రకటించారు. అఫ్గాన్‌లో శాంతి పాక్‌లో శాంతితో సమానమేనని, తమ రెండు దేశాలు కలిసి ఉంటేనే ఇది సాధ్యమవుతుందనే విషయంతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని కూడా జర్దారీ చెప్పడం గమనార్హం. అఫ్గాన్ విషయంలో పాకిస్తాన్ ఇంత స్పష్టంగా సానుకూల ధోరణిని ప్రదర్శించడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. చర్చల్లో మూడు దేశాలకు చెందిన గూఢచార ఏజన్సీలు, మిలటరీ ఉన్నతాధికారులు కూడా పాల్గొనడాన్ని బట్టి చూస్తే ఈ విషయంలో పాక్ చిత్తశుద్ధితోనే వ్యవహరించాలని అనుకుంటూ ఉన్నట్లు కనిపిస్తోంది. కామెరాన్ తీసుకున్న చొరవ ఫలించి పాక్ గనుక చిత్తశుద్ధితో అఫ్గాన్‌లో శాంతి సాధన ప్రక్రియకు తనవంతు తోడ్పాటునందించిన పక్షంలో అటు అఫ్గాన్, పాక్‌లతో పాటుగా ఇటు భారత్ కూడా ఎంతో సంతోషిస్తుంది. శాంతి చర్చల్లో పాలు పంచుకోవలసిందిగా ఈ సందర్భంగా కామెరాన్ తాలిబన్ ముఠాలకు పిలుపునివ్వడం చూస్తే దండోపాయం ద్వారా కాక, మిగిలిన మూడు మార్గాల్లోనే అఫ్గాన్‌లో శాంతిని సాధించాలనేది అగ్రరాజ్యాల అభిలాషగా కనిపిస్తోంది.

- రామకృష్ణ

నీవేమైనా...

నువ్వేమన్నా ఆక్సిన్ హార్మోనువా?
శీర్ణ పర్ణద్రుమ సదృశ హృదయాన్ని
తిరిగి కిసలయింప జేయడానికి?

నువ్వు ల్యూసి ఫెరిన్‌వా?
గాఢాంధకారంలో ఇమిడిన గుండెకు
వెలుగుదారి చూపించడానికి?

విద్యుదయస్కాంత తరంగానివా?
కటిక చీకట్లు కమ్మిన ఎడారిపై
కాంతిపుంజమై మిరుమిట్లు గొలుపడానికి?

నువ్వేమైనా ఆక్సీఎసిటిలీన్ జ్వాలవా?
శకల శలాక మస్తిష్కాన్ని
అతికించి బ్రతికించడానికి?

ప్రాణవాయు సమ్మిళిత కర్బనాన్ని
నిండుగా నింపుకున్న అగ్నిమాపక యంత్రానివా?
మనస్సులో ఉవ్వెత్తున ఎగిసిపడే ఆవేదనాగ్నికీలల్ని
అమాంతంగా చల్లార్చడానికి?
అవునా? కాదు కదా?
అన్ని నెగెటివ్‌లూ
పాజిటివ్ ప్రభావాన్ని పులుముకుంటూ
బ్రతుకుటాశను
సజీవంగా నిలుపుకుంటున్నామేమో!

- బాల

సామాజిక చైతన్యం..

ఆధునిక వీధి నాటకం

వ్యక్తికి బహువచనం సమాజం. రెండూ అవిభాజ్యం. పరస్పరాశ్రితాలు. ప్రభావితాలు. నిరంతరం అనంతంగా సమాజంలో ఏక కాలంలో విభిన్న తరాలతోపాటు తరగతుల, వృత్తుల, వయసులవారు ఆయా పేర్లతో రూపాలతో కలసి మెలసి సహజంగానే వారి/ వాటి మధ్య వైవిధ్యం, సంఘర్షణ, సంక్లిష్టతలు సానుకూలంగాను, అనుకూలంగాను నెలకొనడం అనివార్యం. వీటిని అత్యధికంగా ప్రభావితం గావించే చారిత్రక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలనేకం సమాజపు గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశిస్తాయి. వీటి మధ్య పరస్పర సమన్వయం సాధించి సుహృద్భావం పెంచడమే సామాజిక చైతన్యం. ఆ చైతన్యమే ప్రగతికి సోపానం. ఈ చైతన్య సాధనతోనే సమాజ అస్తిత్వం పురోగతి ఆధారపడి ఉండేది. తద్వారానే అన్నింటా ఉన్న స్థితినుండి ఉన్నత స్థితికి సర్వత్రా ఎదగగలిగేది. ఈ స్పృహను అందరిలోనూ ముఖ్యంగా ప్రేక్షకునిలో కలిగించడమే సాంఘిక నాటక సామాజిక లక్ష్యం, లక్షణం.

ఈ లక్ష్యసాధనలో తొలి నుండి మన తెలుగు రచయితలు, నటులు, దర్శకులు తమదైన ప్రతిభా వ్యక్తులుగా, సమిష్టిగా కనబరుస్తూనే ఉన్నారు. తెలుగు సాహిత్యంలో ఎన్నెన్నో ప్రక్రియలకు ఆద్యులైన, ఆరాధ్యులైన వీరేశలింగం, గురజాడలు నాటి సామాజిక రుగ్మతలు రూపుమాపే ప్రయత్నంలో నాటకాన్నీ సాధనంగా వాడుకున్నారు. అనంతరం స్వాతంత్ర్య పోరాట సందర్భంలోనూ దామరాజు పుండరీకాక్షుడు నాటక రచయిత రాసిన ఏడు నాటకాలు నాటి పర ప్రభుత్వ నిషేధానికి గురైనాయంటే వాటి పట్ల అప్పటి ప్రభుత్వం ఎంతగా భయపడిందో అర్థమవుతుంది. వాటిలో ఓ మూడు గాంధీ నామధేయంతో ఉండడం విశేషం. ఈ విధంగా మన దేశ నాటక రంగ చరిత్రలో మరే ఇతర రచయితవీ నిషేధానికి గురికాకపోవడం గమనార్హం. నాటక రంగం సమాజానికి దర్పణం అనుకుంటే అందులో సాంఘిక నాటకం మరింతగా జన జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. సమకాలీనాన్ని అందుకు ప్రేరేపించిన గతాన్ని, అనంతర పర్యవసానాల్ని, వీటికి దృశ్యాదృశ్య కార్యాకారణాల్నీ, వ్యక్తుల్నీ, ఘటనల్నీ తనదైన ఇతివృత్తం తాలూకు శైలి మాటలతో, సన్నివేశాలతో దర్శకులు నటుల ద్వారా కళ్లకు కట్టిస్తాడు రచయిత. వాస్తవాన్ని నిలువుటద్దంలో నిలబెట్టి కన్పించే వాటి వెనుక కన్పించని, కన్పించనివ్వని వాటినేకం కన్పించేట్లు జేసి ప్రేక్షకునిలో ఆలోచనల్ని ప్రకోపింపజేస్తాడు. ఆ ఆలోచనే వ్యక్తి స్వీయ, సామూహిక చైతన్యానికి, ప్రగతికి నాంది. నిద్రాణమైన స్వీయ, సమిష్టి శక్తుల్ని మేల్కొల్పుతుందిది. ఈ మెలకువే సర్వత్రా ఉండవల్సిన వాటికీ, ఉంటున్న వాటికీ, జరగవల్సిన వాటికీ, జరుగుతున్న వాటికీ, చేయవల్సిన వాటికీ, చేస్తున్న వాటికీ గల అంతరాల్ని తొలగించేది. తొలగించగలిగేది. వర్తమానంలోని సమస్త రుగ్మతల, దుర్మార్గాల, దురాగతాల, దారుణాల, కిరాతకాల్ని, అమానుషాల్ని తొలగించి మనిషిలో మానవీయ లక్షణాలు పెంచేందుకు దోహదపడుతుంది సాంఘిక నాటకం కలిగించే సామాజిక చైతన్యం.

ఈ ప్రయత్నంలో భాగంగానే పలువురు రచయితలు, దర్శకులు పలు ప్రయోగాలు చేశారు. చేస్తున్నారు. సమాజంపై తనదైన ప్రభావం కలిగిస్తూనే ఉన్నారు. వీటన్నింటిలో అత్యంత గణనీయ స్థానం కలది వీధి నాటకం. అందునా ఆధునిక వీధి నాటకం. మన అపురూప జానపద కళారూపాలైన జముకుల కథ, ఒగ్గు కథ, బుర్ర కథ, చెక్క భజన, తపస్కాన్, వీధి నాటకం వంటివి ప్రదర్శనాశైలిలో ఆధునిక వీధి నాటకానికి మాతృకలు. సంప్రదాయ నాటకంలో లేని అనేకానేక ప్రత్యేకాంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. మిగతా వాటికన్నా వీటి ప్రభావం ప్రేక్షకునిపై, సమాజంపై అత్యధికంగా ఉంటుంది.

ఇందులో వేదిక ప్రత్యేకంగా ఉండదు. ప్రజాసమూహం మధ్యనే వేదిక, తెరలు దించడం, తొలగించడం లాంటివీ ఉండవు. అందరి నడుమ బహిరంగ వేదిక కావున. ప్రత్యేక రంగాలంకరణ, సెట్టింగ్‌ల హంగామా, ఆర్భాటాలుండవు. నేపథ్య సంగీతాలుండవు. పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు, సంభాషణలు సమూహ (సమాజ) సహజ వాతావరణంలో మమేకమైపోతాయి. చూసేవారనేకులు అది వీధి నాటకం అనుకోరు. వాస్తవంగానే జరుగుతుందని పూర్తిగా విశ్వసిస్తారు. కళాకారులూ ప్రేక్షకుల్లో కల్సిపోతారు. ప్రవేశ నిష్క్రమణలూ ప్రేక్షకుల్లోంచే, ప్రేక్షకులు రాకుంటే ప్రజలవద్దకే నాటకం వెళ్లాలి'' అనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ పుట్టింది. వీటిని సజీవ నాటకాలు, ఉచిత నాటకాలనీ పిలుస్తుంటారు. వీటిలో రాజకీయ, సామాజిక సమస్యలు ఇతివృత్తాలుగా ఉంటాయి. ఒకోసారి స్థానిక సమస్యలున్నూ. ప్రజా చైతన్యం, సామాజిక న్యాయం వీటి లక్ష్యం. సమస్యల ప్రాధాన్యాలతో వస్తువైవిధ్యం ఉంటుంది. అభివ్యక్తి నాటకానికి దగ్గరగా ఉంటుంది. పాత్రధారులు సమూహానికి ప్రతినిధిగా ఉండడం, పాత్రధారులకి పేర్లు లేకుండటం, ఆలస్యం అవుతున్నాయి. ఎందరిలో ఉన్నా ఎన్నింటి మధ్య ఉన్నా మనిషి నానాటికీ ఒంటరి అవుతున్నాడు. వ్యక్తి-సమాజం నడుమ అంతరం అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. 'సొంత లాభం కొంతమానుకుని--' అనే స్థానంలో 'ఎవడేమైతే నీకెందుకు? నీ సంగతి నీవు చూసుకో' అంటున్న పరిస్థితి సర్వత్రా సమస్త మనిషి- మానవ, కుటుంబ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల్లో ఏదో పూడ్చలేని లోటు, వెలితి. నిస్సహాయత. అది ప్రవేశించి అసహనం లాంటివి అనేకానేకం. నాగరిక ప్రజాస్వామ్య సర్వాంగాలు ఎప్పటికప్పుడు యథాశక్తిని వైఫల్యసాధనలో కృషిచేస్తుండడంతో మనిషి దిక్కులేని వాడు అవుతున్నాడు. కంచెలు చేను మేస్తున్నాయి. కనురెప్పలు కంటిని కాటేస్తున్నాయి. ఈ గమనం ఏ గమ్యంవైపు? ప్రశ్నలే అధికం. వాటికి సమాధానాలు కావాలి. ఆధునిక తెలుగు వీధినాటకం లేక సాంఘిక నాటక రంగం నిజమైన సామాజిక చైతన్యానికి దోహదపడాలంటే వీటిని, లేక వీటిలో ఏ కొన్నింటినైనా పట్టించుకుని, మనసుకు దట్టించుకుని నిజాయితీతో ఏ కొంతైనా ప్రయత్నించాలి. అపుడే ఈ జడత్వం వదలి సమాజం చైతన్యబాట పడుతుంది. లేకుంటే ఎటువంటి ప్రజలకు అటువంటి ప్రజాస్వామ్యం అన్నట్లు ఎటువంటి ప్రజలకు అటువంటి నాటకాలే వస్తాయి.

> ***ఆధునిక వీధి నాటకంలో ఇతివృత్తం పైనే మిగతావన్నీ ఆధారపడి ఉంటాయి. ఇది ఎంతటి తాజా సమకాలీన అందర్నీ పీడించే సమస్యలకు చెందిందై అది అంతగా ప్రేక్షక సమూహాల్ని చేరుతుంది. రచయితకు ఆ విషయంపై అవగాహనా పట్టు, నాటకంగా మలచడంలో నేర్పు, జటిల సమస్యల్నీ సాధారణీకరించడం, సామాన్యులకందించడంలో దాని విజయం ఆధారపడి ఉంటుంది.***

- బి. లలితానందప్రసాద్, 9247499715

వెజైనా మోనోలాగ్

నేను మనిషిగా కాక అవయవంగా కనిపించాను
నా శరీరం వాళ్లకు వెజైనాగా కనిపించింది.

అమానుషంగా ముగిసిన
శోకతప్త వెజైనా కథ నాది

ద్రౌపది వస్త్రాపహరణం నుండి
ఛిద్రమైన నా వెజైనా దాకా
నడిచింది స్త్రీల అవమానాల చరిత్రే కదా
ఇనుప కచ్చడాల నుండి బికినీ దాకా
సాగిన నాగరిక ప్రయాణంలో
లైంగిక దోపిడీ తప్ప మరింకేమి లేదు.
మనుధర్మశాస్త్రం నుండి వర్తమానం దాకా
వెంటాడి వేధించే *sexiest perspective*

చీకటి తెర ఆవరించిన ఆరోజు
నిర్భయ గగనం కింద
అందమైన భవిష్యత్తుతో నేను
రాత్రి నాది కాదని
మగవాళ్ళది మాత్రమేనని
తర్వాత తెలిసింది.

నేను మనిషిగా కాక అవయవంగా కనిపించాను
నా శరీరం వాళ్లకు వెజైనాగా కనిపించింది.

నా మీద లైంగిక దాడి జరుగుతున్న క్షణాన
నేను తుమ్మ ముల్లునై
వాళ్ళకు గుచ్చుకోవాలని అనుకున్నాను
నా దేహమంతా
సూదులు మొలవాలని కోరుకున్నాను

విషకన్యను కానందుకు చింతించాను.
రుతువులో మాత్రమే ఎర్రబారే నేను
ఆరోజు వాళ్లవల్ల రక్తమయమయ్యాను.
నా వెజైనా మీద హింస పరాకాష్ఠకు చేరుకున్న
ఆ అవాంఛిత విషాద సమయంలో
నేను అస్తిత్వం కోసం ప్రతిఘటించాను
పోరాడి, గాయపడి, చివరికి ముగిసిపోయాను.

నా రాజ్యమా! రాజ్యాంగమా!
నువ్వు, నీ సెక్యూరిటీ కలిసి
ఒక చిన్న వెజైనాను రక్షించలేకపోయాయి
Shame on you!

అశ్రునివాళి బరువెక్కిపోయింది
don't cry for me India
బతికున్న నీ ఆడపిల్లల కోసం కన్నీళ్ళు పెట్టు
నా కోసం చాలు.

ఈ వ్యవస్థ ముఖం మీద
నా సిగ్గుబిళ్ళను విసిరేసి వెళ్తున్నాను
అత్యాచారాల చరిత్ర పేజీ లేని నేలమీద
మళ్ళీ వెజైనాతో పుట్టాలని ఉంది
మళ్ళీ... మళ్ళీ... స్త్రీగానే.

- మహెజబీన్ బేగ్

(The title of my poem 'Vagina Monologue' is inspired by the feminist play "The Vagina Monologues" (1996) written by the American playwright, activist Eve Ensler. She has visited India recently. The play was staged in Bombay and Lucknow.)

స్వామినేనిని విస్మరించడమూ భేషజమే

సాహితి శీర్షికలో 28.01.2013 తేదీన 'భేషజపు చక్రబంధంలో రచయిత'ల పేరుతో ఎ.రజాహుస్సేన్ వ్యాసం, అలాగే దీనిపై 11.02.2013 తేదీన గొప్పవారిని కించపరచడమూ భేషజమే' పేరున వేదుల సత్యనారాయణ 'స్పందన' చదివాక యిందుకు సంబంధించి 'ప్రతిస్పందనగా' నాకు తెలిసిన విషయాల్ని పాఠకుల ముందుంచుతున్నాను.

ముందుగా వీరేశలింగం విషయంలో రజాహుస్సేన్ ప్రస్తావనపై వేదుల ఈ దిగువ అభ్యంతరాల్ని లేవనెత్తారు.

1. వీరేశలింగంగారు అప్పటికే హిత సూచనని చదివి వున్నారని రజాహుస్సేన్ ఎలా చెప్పగలిగారు?

2. వీరేశలింగంగారు వితంతు వివాహాలు జరిపించడానికి బ్రహ్మ సమాజ మతాన్ని అభిమానించడానికి హిత సూచని ఆధారమా?

3. హిత సూచని గ్రంథాన్ని రజాహుస్సేన్ చదివితే ఆ గ్రంథంనుండి ఏయే విషయాలు వీరేశలింగంగారు అనుకరించారో చెప్పవద్దా?

ఇందులో వేదులవారి మొదటి అభ్యంతరానికి సమాధానం ఏమంటే... వీరేశలింగంగారి కంటే ముందువాడైన స్వామినేని ముద్దు నరసింహంగారి హితసూచని గ్రంథాన్ని పంతులుగారు ఖచ్చితంగా చదివారు. చదవడమే కాదు హిత సూచని నుండి పేరాలకు పేరాలు, పంక్తులకు పంక్తుల్ని యథేచ్ఛగా తమ రచనల్లో వాడుకొన్నారు. (పంతులుగారు పెద్దవారు కాబట్టి 'కాపీకొట్టార'న్న సాహసం చేయలేకపోతున్నాను) హిత సూచనిలో స్వామినేని వారు 'దయ్యములకు సంబంధించిన నమ్మకములు' కల భాగమునకు 'రక్షఃప్రభృతిప్రమేయం' పేర ఇలా రాశారు.

''చనిపోయిన మనుష్యులు కొందరు రక్షస్సులున్ను- పిశాచములున్ను- భూతములున్ను- దయ్యములున్ను- ఐ- తమకు ఏ విధమైన యిలాకా లేనివారి గృహముల యందు కూడా ప్రవేశించి వాటిలో నివసించియుండే మనుష్యులకు కనబడకుండా నుండి తాళములు వేసియుండే గదులలోనో పెట్టెల లోనో ఒక దానిలో నుంచబడిన వస్తువులు మరియొక దానిలో నుండేలాగు చేయడమున్ను- అటువంటి యొక పెట్టెలో నుంచబడిన వస్త్రములలో మధ్యవస్త్రము యొక్క కొన్ని పోరలు కాలియుండేలాగు చేయడమున్ను-ఇండ్ల మీద రాళ్లు పడేలాగు చేయడమున్ను, చూరుల యందు ఒకానొకప్పుడు లోపల అగ్నిగల గడ్డి తుట్టేలు గాని పొగరాజుతూ నుండేలాగు దోపియుంచమున్నూ... (హితసూచని 1862, రక్షఃప్రభృతి ప్రమేయము)

వీరేశలింగంగారు కూడా దయ్యములు గురించి రాస్తూ హితసూచనిలోని పై వాక్యాల్ని పోలిన వాక్యాల్ని గ్రాంథిక భాషలో యిలా రాశారు.

''తాళము వేసియున్న పెట్టెలలోని వస్తువులనొకదానిలోని వాని మరియొక దానిలోనికి మార్చుటయు, దండెముల మీద గాని, పెట్టెల లోపల గాని యుండు వస్త్రములను రెండవ వారెరగకుండ దీసి కొన్ని పోరలను గాల్చి చల్లార్చి మరల నెప్పటి జొప్పున మడతలుగా బూర్వస్థములలో నుంచుటయు శుభములైన చోటుల నసహ్యములైన వస్తువులు వడియుండులాగున జేయుటయు, చూరులలో మండుచుండు గడ్డి తుట్టలు రాజుచుండు కొరపులు దోపుటయు మొదటుడు దుష్కార్యములను జేయుచుండు నాచారము కలవారుగా నున్నారు... ఇద్దరు ముగ్గురి కెత్తరాని బరువులనొకచోట నున్నవానిని వేరొక చోట నుండునట్టును, ఇండ్ల మీద రాళ్లు బొగ్గులు మొదలగునవి వడునట్టును చేయించుచునుండుటయు... భూత భీతి చేత దేహమునుమరచి వరహశమయి యున్నప్పుడు కొందరు స్వభాషలో నొండె నితర భాషలలో నొండె దామువిన్న పద్యములను మాటలను స్వభావమునకు భిన్నము గారణము లేనిదే యసందర్భముగా వచించుట కలదు... (వీరేశలింగం కవికృత గ్రంథములు: రచనలు: ఎనిమిదవ సంపుటము (వ్యాసములు) పుటలు- 388, 389, 390)

పంతులుగారి పై వాక్యాలు సందర్భంతో సహా మక్కికి మక్కి స్వామినేని హిత సూచని గ్రంథం నుండే తీసుకొన్నారనడానికి ఇంతకంటే సాక్ష్యం అవసరమా? స్వామినేనివారు కూడా రాజమహేంద్ర వాసే... పంతులుగారు కూడా రాజమహేంద్రీయులే... అయినా ఎందుకనో తమ రచనల్లో ఎక్కడా కూడా కనీసం స్వామినేనివారి ప్రస్తావన తేలేదు పంతులుగారు. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. వ్యాస రచనలో తానే ఆద్యుడినని పంతులుగారే చెప్పుకున్నారు. నిజానికి పంతులుగారి కంటే ముందే స్వామినేని హితసూచని (వ్యాస సంపుటి) వచ్చి వుంది. హిత సూచని వ్యాస సంపుటిని ప్రస్తావించడంవల్ల బహుశా తాను వెనుకబడతానేమో అని పంతులుగారు స్వామినేని ప్రస్తావన తేలేదా? ఏమో? ఏది ఏమైనా స్వామినేని వారి హిత సూచనిని చూసి కూడా కిమ్మనకుండా వుండటం భేషజం కాదా? ఇది తెలిసి వుండటంవల్లనే రజాహుస్సేన్ ధైర్యంగా పంతులుగారి భేషజాన్ని బయటపెట్టారనుకోవచ్చుకదా!

> **స్పందన**
>
> ***స్వామినేని ముద్దునరసింహంగారు 'హిత సూచని' గ్రంథాన్ని 1853లో రచించారు. ఆయన కుమారుడు రంగప్రసాదు 1862లో వీన్ని ముద్రించాడు. అప్పటికి కందుకూరి వీరేశలింగంగారి వయసు సుమారు 14 సంవత్సరాలు. 'హిత సూచని' చదివి వీరేశలింగం ప్రభావితులయ్యారు. వీరేశలింగంగారిని, గిడుగు రామ్మూర్తిగారిని ప్రభావితుల్ని చేసి ముందుకు నడిపించిన 'హిత సూచని' ప్రథమ తాంబూలం పొందదగ్గ గ్రంథం.***

ఇక వేదులవారి రెండో అభ్యంతరము:

వీరేశలింగంగారు వితంతు వివాహాలు జరిపించడానికి బ్రహ్మసమాజ మతాన్ని అభిమానించడానికి హిత సూచనియే ఆధారం... హిత సూచనిలో వివాహాలు- స్త్రీ పురుషుల గురించి స్వామినేని 62 పేజీల్లో సమగ్రంగా చర్చించారు.

స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతం కాకపోతే భారత సంతానాన్ని ఎలా సమర్థించాలి? అని స్వామినేని ప్రశ్నించారు. వ్యాసుణ్ణి కన్న తర్వాతనే సత్యవతి శంతనుడ్ని పెళ్లాడింది. భర్తలు మరణించిన తర్వాత అంబిక, అంబాలిక వ్యాసుడివల్ల సంతానం కన్నారు. ముందు మేకపోతుతో వివాహమైన తర్వాతనే గాంధారికి ధ్రుతరాష్ట్రుడితో వివాహమైంది. కుంతికి కర్ణుడు పుట్టిన తర్వాతనే పాండు రాజును వివాహం చేసుకుంది. యవ్వనం ఉన్నంతవరకు స్త్రీకి పునర్వివాహ యోగ్యత ఉన్నదని స్వామినేనివారు హిత సూచనిలో కుండ బద్దలుకొట్టినట్లు చెప్పారు.

స్వామినేని సమకాలికుడైన ఈశ్వర చంద్ర విద్యాసాగర్ బెంగాల్‌లో వితంతు వివాహాల్ని జరిపించాడు. వితంతు వివాహాలకు సంబంధించి ఈశ్వరచంద్రుడు రచించిన పుస్తకం కోసం తాను ప్రయత్నించినట్లు, అయినా అది దొరకలేదని పంతులుగారు తన ఆత్మకథలో మొదటి సంపుటంలో పే-108) స్వయంగా రాసుకున్నారు. అయితే అప్పటికే స్వామినేని హిత సూచనిని చూసి తద్వారా వితంతు వివాహాల్ని స్ఫూర్తిగా పొందారని స్పష్టంగా చెప్పొచ్చు. ఈ యజ్ఞానికి పరోక్షంగా స్వామినేని వారి హిత సూచని సామిధేని మంత్రాలు చదివిందని ఆరుద్రగారు పేర్కొనడం గమనార్హం. (ఆరుద్ర స!! ఆంసా॥చ॥ 59)

ఇక మూడో అభ్యంతరం... హితసూచని గ్రంథంనుండి పంతులుగారు ఏయే విషయాల్ని అనుకరించారో రజాహుస్సేన్ చెప్పాలి కదా! అన్నారు.

స్వామినేని హిత సూచని నుండి పంతులుగారు చాలా విషయాల్ని స్ఫూర్తిగా పొందారు. వాటిలో 1. వితంతు వివాహాలు 2. రజస్వల అయ్యాకనే ఆడపిల్లల వివాహాలు జరగాలి 3. దయ్యాలు, భూతాలు, మంత్రాల వంటివి మూఢ నమ్మకాలే. 4. స్త్రీవిద్య 5. స్త్రీ స్వేచ్ఛ 6. వ్యావహారిక భాష వాడకం ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే వున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే స్వామినేని హేతువాది... తెలుగు నేలపై మొదటి స్త్రీవాది. వారి భావాలు బ్రహ్మసమాజ భావాలు దాదాపు ఒకటే. పంతులుగారు కూడా వీటినే అనుసరించారు.

స్వామినేని హిత సూచని గ్రంథాన్ని 1853లో రచించారు. ఆయన కుమారుడు రంగప్రసాదు 1862 దీన్ని ముద్రించాడు. అప్పటికి కందుకూరి వీరేశలింగంగారు వయసు సుమారు 14 సంవత్సరాలు, హిత సూచని చదివి వీరేశలింగం ప్రభావితులయ్యారు. వీరేశలింగంగారిని, గిడుగు రామ్మూర్తిగారిని ప్రభావితుల్ని చేసి ముందుకు నడిపించిన హిత సూచని ప్రథమ తాంబూలం పొందదగ్గ గ్రంథం. ముద్దు నరసింహంగారు ప్రశంసనీయులు. 1986 హిత సూచని పునర్ముద్రణ- రాజమండ్రి ఆంధ్రకేసరి యువజన సమితి ప్రచురణలో (ఆరుద్ర ప్రవేశిక) ఇంకా కావాలంటే ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యం 3వ సంపుటి, పే 230 చూడొచ్చు.

ఇక శేషేంద్రగారు అరసం, విరసంలపై చేసిన విమర్శను సరసంగా తీసుకొని రజాహుస్సేన్ భేషజం అని వుండొచ్చు. వారు శేషేంద్రకు వీరాభిమాని అన్న సంగతి నాకు తెలుసు- వేదులవారికి తెలీదు కాబట్టి వారు అపార్థం చేసుకొని వుండొచ్చు.

ఉమర్ అలీషాగారి కౌరవ పాండవ రంగం నాటకాన్ని కొండవీటి కవిగారు ఖచ్చితంగా సంగ్రహించారు. వీరేశలింగంగారి మాదిరిగానే కొండవీటి వారు కూడా ఉమర్ అలీషా పేరును ప్రస్తావించలేదు. భేషజం పదానికి వేదుల చెప్పిన అర్థాల్లో అహంకారం, గర్వం, డాబు, దర్పం వున్నాయి. ఇందులో కొండవీటి గారిది ఏ గుణమో వేదులవారే నిర్ణయించాలి. కందుకూరి, కొండవీటి అంతటి వారు గ్రంథచౌర్యం చేశారని చెప్పడానికి రజాహుస్సేన్ గారికి సంస్కారం అడ్డొచ్చి వుండొచ్చు. అందుకే మధ్యేమార్గంగా భేషజం అన్నారనిపిస్తోంది. మన కవులు కళాకారుల్లో భేషజం వున్నవారు చాలా మందే వున్నారు. బహుశా పెద్దలు వేదులవారు చూసి వుండకపోయి వుండొచ్చు కానీ నాలాంటివారు చాలానే చూశారు. వ్యాస విస్తృతి భీతివల్ల ప్రస్తావించడం లేదు. ఈ విషయాన్ని మరోసారి విస్తృతంగా రాస్తాను. ఈ వివరణతో వేదులవారు తృప్తిపడతారని ఆశిస్తున్నాను. పాఠక లోకానికి తెలీని చాలా విషయాలు తెలియజేయడానికి వేదులవారే కారణమని చెప్పడం 'భేషజం' కాదుసుమా!

- మఠం శ్రీనివాసరావు, 9505517622

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

మంగళవారం 19, ఫిబ్రవరి 2013

ఆరోగ్యం

★ తరచూ యాపిల్ పండ్లను తింటే గుండె ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ పండ్లలోని ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను గణనీయంగా తగ్గిస్తుంది.

★ ద్రాక్ష పండ్లను శుభ్రంగా కడిగి తింటే రసాయనాల ప్రభావం మనపై పడకుండా జాగ్రత్త పడొచ్చు. ద్రాక్ష పండ్లను తినడం వల్ల గుండె సంబంధ రోగాల నుంచి దూరం కావొచ్చు.

★ పచ్చి బఠానీల వల్ల మన శరీరంలో రక్త నాళాలు పదిలంగా ఉంటాయి. ఫలితంగా గుండె జబ్బులు దరిచేరవు.

★ ప్రతి రోజూ వేరుశనగ, బాదం తీసుకుంటే గుండెకు మేలు జరుగుతుంది.

★ బీన్స్‌ను తరచూ ఆహారంలో తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

★ నారింజ రసం కూడా గుండెను పదిలంగా ఉంచుతుంది.

★ ఉదయం, రాత్రి నిద్రించే ముందు తాజా పండ్లను తింటే శరీరానికి అవసర మైన విటమిన్లు, పొటాషియం పుష్కలంగా అందుతాయి. దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది.

★ అనాస పండు తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుంది.

★ బొప్పాయి పండు ఉదర కోశ వ్యాధులను నివారిస్తుంది. మలబద్ధకాన్ని కూడా తగ్గిస్తుంది.

'నల్ల కలువల'పై చిన్నచూపేల..?

చక్రాల కుర్చీపై తిరిగే ఓ వికలాంగ యువకుడిని పెళ్లాడేందుకు ఓ యువతి ఎంతో పెద్ద మనసుతో ముందుకు వచ్చింది. వికలాంగుడిని పెళ్లాడేందుకు సిద్ధపడిన ఆమెను అంతా అభినందించారు. అయితే- ఈ సంబంధాన్ని ఆ యువకుడి కుటుంబ సభ్యులు మాత్రం వద్దనుకున్నారు. ఇందుకు కారణం- 'అమ్మాయి నల్లగా ఉండడమే..!'

* * *

'భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు, నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను, సుసంపన్నమైన, బహు విధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వ కారణం..'- అంటూ పాఠశాలల్లో 'జాతీయ ప్రతిజ్ఞ' చేయించడం ఆనవాయితీ. 'అందరూ సమానమే' అన్న భావన ఏర్పడేలా పాఠశాలల్లో ఇలా 'ప్రతిజ్ఞ'లు చేయిస్తున్నా, మన దేశంలో అనేక రూపాల్లో వివక్ష ఇంకా కొనసాగుతునే ఉంది. ఆడ-మగ, ప్రాంతం- కులం పేరిట చిన్నచూపు చూసే అనాచారాలు ఆది నుంచి కొనసాగుతుండగా, నేడు విద్యాధికులు సైతం 'రంగు' పేరిట మరో రకమైన వివక్షను చూపుతున్నారు. పుట్టుకతో వచ్చిన నలుపు రంగు కొందరిని జీవితాంతం వేధిస్తోంది. ఉన్నత వర్గాలు, చదువుకున్నవారు, సామాన్య జనం అనే తేడా లేకుండా అందరిలోనూ ఒకటే నీరస భావం. నలుపు రంగులో ఉండేవారంటే అందరికీ అలుసే. మన దేశ జనాభాలో దాదాపు 50 శాతం మంది నలుపు రంగులోనే ఉంటున్నా ఈ తరహా 'వర్ణ వివక్ష' భారీ స్థాయిలోనే ఉంది. మగైనా, ఆడైనా తమ జీవిత భాగస్వామి నలుపు రంగులో ఉండడాన్ని ఎంత మాత్రం అంగీకరించరు. ఈ కారణంగానే పెళ్లి ప్రకటనల్లో 'అందమైన వధువు కావలెను, అందమైన వరుడు కావలెను' అన్న పదాలు తప్పనిసరిగా మారాయి. పేదరికం, ఉగ్రవాదం, హింస, అవిద్య వంటి సామాజిక సమస్యలు అంతం కావాలంటూ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నిత్యం ఘనమైన ప్రకటనలు చేస్తునే ఉంటారు. అయితే- 'నలుపు రంగు' కారణంగా కొన సాగుతున్న వివక్షపై ఎవరూ గళం విప్పరు. మిగతా సామాజిక రుగ్మతల మాదిరి 'వర్ణ వివక్ష' కూడా ఎంతో ప్రమాదకరమైనదే. ఎన్ని కులాలు, మతాలున్నా భారతీయులంతా ఒక్కటే అన్న భావాన్ని మనం ప్రపంచానికి చాటి చెబుతున్నా, నలుపు రంగు వ్యక్తుల పట్ల ఎంతో కొంత వివక్ష చూపిస్తున్నామన్నది కాదనలేని కఠోర వాస్తవం.

నల్లగా ఉండే వారి కన్నా తాము అధికులమన్న భావజాలం మిగతావారిలో గాఢంగానే ఉంది. వ్యక్తిత్వానికి, తెలివి తేటలకు, సిరి సంపదలకు చర్మం రంగు కారణం కాదని తెలిసినప్పటికీ, నల్లగా ఉండే వారిని సమదృష్టితో చూసేందుకు చాలా మంది ఇష్టపడరు. మన కుటుంబ వ్యవస్థలోనే ఈ భావజాలం అనాదిగా పాతుకుపోయింది.

'పాలరాతి బొమ్మలా ఉంటావు.. బయట ఎండలో తిరుగుతున్నావా? చర్మం నల్లబడుతోంది..'- అని పిల్లల్ని తల్లిదండ్రులు ఆరా తీస్తుంటారు. దీంతో- నలుపుదనం కంటికి ఇంపు కాదని, అసహ్యకరంగా ఉంటుందనే భావన పిల్లల్లో పాతుకుపోతోంది. అమ్మాయిలు నల్లగా ఉన్నారని పెళ్లి సంబంధాలు కుదరక పోవడం, ఒకవేళ కుదిరినా 'రంగు' కారణంగా అధికంగా కట్నకానుకలు ఇచ్చుకోవడం, 'నల్లగా ఉన్నావ్.. మాకెక్కడ దొరికావ్..?' అంటూ భర్తతో పాటు అత్తవారింట కోడళ్లకు వేధింపులు, అందంగా లేరన్న సాకుతో అమ్మాయిలుకు కొన్ని చోట్ల ఉద్యోగాలివ్వక పోవడం, నల్లగా ఉండే పిల్లలకు పాఠశాలల్లో మారుపేర్లు పెట్టడం, రంగు కారణంగా పిల్లలు వివక్షకు గురవుతున్నారని తెలిసి కన్నతల్లులు కంటనీరు పెట్టుకోవడం... ఈ దృశ్యాలన్నీ సమాజంలో మనం అనునిత్యం చూస్తున్నవే.

నలుపు రంగు కారణంగా పెళ్లిళ్లు కాని వారిలో అమ్మాయిలే అధిక శాతం ఉంటున్నారనేది జగమెరిగిన సత్యం. పుట్టుకతో వచ్చిన రంగుకు ఎవరూ బాధ్యులం కాదని తెలిసినా ఈ వివక్ష మాత్రం సర్వత్రా కొనసాగుతునే ఉంది. వ్యక్తిత్వం, గుణం, తెలివి తేటల కన్నా అందానికీ, రంగుకూ ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరైంది. కాగా, 'నలుపు కూడా అందమైనదే, చర్మం రంగు కారణంగా వివక్ష చూపడం అన్యాయం' అంటూ చెన్నైకి చెందిన కవిత ఇమ్మాన్యుయేల్ గత కొన్నేళ్లుగా విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టారు. 'డార్క్ ఈజ్ బ్యూటిఫుల్' (నలుపు కూడా అందమైనదే) పేరిట ఈమె చేపట్టిన ఉద్యమానికి వివిధ వర్గాల వారు మద్దతు తెలియజేస్తున్నారు. తరాల తరబడి సమాజంలో నాటుకు పోయిన భావజాలం తొలగిపోవాలంటే కొంత కాలం పడుతుందని, నలుపురంగు వ్యక్తులపై వివక్ష అంతరించే రోజులు తప్పక వస్తాయని కవిత ఎంతో ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. చర్మం రంగు కారణంగా సాటివారిపై వివక్ష చూపడం మన దేశంలోనే అధికంగా ఉందని, ఈ విషయమై విద్యార్థులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని ఆమె అంటున్నారు.

వేడుకలకు దూరం.. దూరం

నలుపు రంగు కారణంగా కోడళ్లను పెళ్లిళ్లు తదితర వేడుకలకు దూరంగా ఉంచుతున్న అనాచారం హర్యానా, రాజస్థాన్‌లో నేటికీ కొనసాగుతోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇలా వివక్షకు గురవుతున్నట్లు ఓ స్వచ్ఛంద సంస్థ తాజాగా జరిపిన అధ్యయనంలో తేలింది. హర్యానాలోని రోహ్తక్, రేవారి, మేవాట్ జిల్లాల్లోను, రాజస్థాన్‌లోని అల్వార్, ఝుంఝూ జిల్లాల్లో ఈ సర్వే జరిపారు. ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో హర్యానా, రాజస్థాన్‌లకు చెందిన యువకులు మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలను వివాహం చేసుకుంటున్నారు. నలుపు రంగులో ఉండే యువతులను పెళ్లి చేసుకున్నందుకు వీరు భారీగా కట్నకానుకలు తీసుకుంటున్నారు. పెళ్లి చేసుకుని సొంత ఊరికి తెచ్చుకున్నాక భార్యలను బయటకు పంపేందుకు పురుషులు ఎంత మాత్రం ఇష్టపడరు. నలుపు రంగులో ఉన్న భార్యలను షాపింగ్‌కు కానీ, పెళ్లిళ్లు, పేరంటాలకు గానీ పంపరు. 'నల్లగా ఉన్నా పెళ్లి జరిపించడమే గొప్ప..!' అని, వారిని బయటకు పంపడం తమకు ఇష్టం లేదని భర్తలు, అత్తింటి వారు చెబుతుంటారు.

కట్నకానుకలపై ఆశతో- పెళ్లికి నల్ల రంగు అడ్డుకాదని, అత్తవారింట మాత్రం మహారాష్ట్రకు చెందిన యువతులు వివక్షకు గురవుతున్నారని మహిళా సమస్యలపై అధ్యయనం చేస్తున్న రీనా కుక్రేజా అంటున్నారు. తెల్లగా ఉండే మహిళలు తాము అధికులమన్న భావంతో వీరిని కించపరుస్తుంటారు. నల్లగా ఉండే కోడళ్లు అందరిలో కలిసి తిరిగేందుకు అర్హులు కారన్నట్లు అత్తింటివారు ప్రవర్తిస్తుంటారు. అమ్మాయి తెల్లగా ఉంటే కట్నం తక్కువ, నల్లగా ఉంటే భారీ కట్నం చెల్లించడం కూడా చాలా కుటుంబాల్లో చూస్తున్నామని రీనా వివరించారు.

ఆర్థిక స్థోమత లేని ఆడపిల్లల తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో పెళ్లి సంబంధాలు కుదుర్చుకుంటున్నారు. అయితే, నలుపు రంగు కారణంగా కట్నం అధికంగా ఇవ్వాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎలాగోలా పెళ్లి చేస్తే, నలుపు రంగు యువతులు అటు కన్నవారి, ఇటు అత్తింటి వారి ఆదరణకు దూరమవుతున్నారు. కాగా, తల్లిదండ్రులు స్వేచ్ఛ ఇస్తే గనుక తాము పొరుగు రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అందమైన అమ్మాయిలను పెళ్లి చేసుకుంటామని హర్యానా యువకులు చెబుతుంటారు. మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల యువతుల్లో చాలామంది నల్లగా ఉంటారని, వారితో పెళ్లిళ్లకు హర్యానా, రాజస్థాన్‌కు చెందిన యువకులు విముఖత చూపుతున్నారని అధ్యయనంలో తేలింది.

కోకోకోలా తాగి.. తాగి..!

దక్షిణ న్యూజిలాండ్‌లోని- ఇన్‌వెర్‌కారగిల్ అనే వూళ్లో నటాషా హారిస్ అనే ఎనిమిది మంది పిల్లల తల్లికి- కోకోకోలా అంటే పిచ్చి. రోజుకి పది లీటర్లు పట్టించేస్తే తప్ప నిద్ర పోయేది కాదు. తెలివి వున్నంతసేపూ- అలా 'కోకో' తాగేస్తూనే వుండేదిట! దీనివల్ల పళ్లూడిపోయాయిట కూడా. అతిగా కోకోకోలా తాగడం వల్లనే - హృదయ కవాటాల జబ్బుపచ్చి- హృద్రోగంతో 30 సంవత్సరాల పిన్న వయస్సులోనే ఆమె మరణించిందని అనుమానంగా వున్నదని- ఆమె భౌతిక కాయాన్ని క్షుణ్ణంగా పరీక్షించిన పెథాలజిస్టు గట్టిగా నమ్ముతున్నాడు. ఇంకా వేరే కారణాలు కూడా వుండొచ్చును గానీ- ప్రధానంగా ఆమె రక్తనాళాలు- కోక్‌లోని కెఫేన్‌తోనూ- పంచదార ద్రవ్యంతోనూ మూసుకుపోయి- ఆమెకు కార్డియాక్- అరిత్‌మియా సంభవించిందని వైద్యుల అభిప్రాయం. ఆమెకి 'కోక్' అంటే మరీ వెర్రి. గ్యాలన్ల డబ్బాల్లో దాన్ని దగ్గర పెట్టుకొనేది. ఒకవేళ అయిపోయిందా- చిందులు తొక్కేది. వెర్రెత్తిపోయి అందర్నీ కొట్టి, తిట్టి హింసించేదని ఆమె అత్తగారన్నది.

కాకపోతే- 'కోకోకోలా సీసాల మీద 'వార్నింగ్' ఇవ్వకపోవడం- ఈ పానీయంలో ఎంత కీఫిన్ పదార్థం కలిపారో తెల్పకపోవడం- కంపెనీ వారి తప్పు'' అంటున్నారు కొందరు. ''అన్నీ చట్ట సమ్మతమైన పాళ్లలో కలిపిన ద్రవ్యాలు- మా 'డ్రింకు'లో వున్నాయి. కోట్లాది మంది దీనిని గ్రోలి- ఉత్తేజం పొదుతున్నారు'' అని కంపెనీ వారు అన్నారు. ఏది ఏమైనా- కోక్ బాటిల్స్ మీద వార్నింగ్‌లు రాయాల్సిందేనంటున్నారు విజ్ఞులు. టేక్ కేర్...!

బురఖాకీ, ఉద్యోగానికీ లింకు!

అడిలైడ్ (ఆస్ట్రేలియా)లోని ఓ ముస్లిం స్కూలులో- ఇరవై మంది ఇతర మతస్థులు టీచర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. దక్షిణాస్ట్రేలియాలోని క్రోయడాక్ కాలేజీ ప్రాంగణంలో అన్యమతస్థులయిన మహిళలు కూడా బురఖా ధరించాల్సిందే. సమావేశాలకూ, సంబరాలకూ 'హిజాబ్' (బురఖా) ధరించకుండా హాజరైన వారికి ముందుగా మూడుసార్లు వార్నింగ్‌లు యిచ్చి- నాలుగోసారి- యింటికి పంపించేస్తామని తాఖీదులు అందించారు. ఇస్లామిక్ స్కూల్సులో ఆడాళ్లంతా హిజాబ్- (పర్దా పద్ధతిలో ఒక రకం ముసుగు) ధరించి తీరాలని అనడం చాలా ఘోరం అని, యిటువంటి విద్యా సంస్థలని గవర్నమెంటు నిలిపివేయాలని- ఎందరో ఆందోళన చేస్తున్నారు. కథ ఎంత దూరం పోతుందో...?

అవీ..ఇవీ..అన్నీ.. - వీరాజీ

veeraji@sify.com

సిక్కిం సిగలో పూల గుబాళింపు

హిమాలయ పర్వతాల కింది భాగాన పచ్చదనానికి ప్రతీకగా నిలిచిన సిక్కిం రాష్ట్రంలో ఎటు చూసినా పూల తోరణాలే! సుమారు అయిదు వేల పుష్ప జాతుల మొక్కలు సందర్శకులకు కనువిందు చేస్తుంటాయి. సువిశాల మైదానాల్లో పూల తోటలు గుబాళిస్తుంటాయి. చిన్న చిన్న మొక్కలు, భారీ వృక్షాలు, పాదులు, నీటిలో పెరిగే మొక్కలు నైతం విభిన్న రంగుల పూలతో ఇంద్రధనుస్సులను ఆవిష్కరిస్తాయి. 2008లో తొలిసారిగా సిక్కింలో నిర్వహించిన 'అంతర్జాతీయ పూల ప్రదర్శన'తో ఇక్కడి పుష్ప జాతుల విశిష్టత మిగతా ప్రపంచానికి తెలిసింది. ఇక్కడి పూలకు అంతర్జాతీయ విపణిలో మార్కెట్ పెంచేందుకు, పర్యాటక రంగంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ సిక్కింలో జరిగే 'రెండవ అంతర్జాతీయ పూల ప్రదర్శన'కు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

భారీ కాయం - సమస్యల మయం

కొంతమందిని చూస్తే మనకు జాలేస్తుంది. వయసు తక్కువే కానీ భారీ కాయంతో అవస్థలు పడుతుంటారు. నిర్ణీత స్థాయిని మించి శరీరం బరువు పెరిగితే అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకోవటమే అవుతుంది. పది శాతం బరువు పెరిగితే బి.పి ఆరు నుంచి ఏడు శాతం ఎక్కువ కావటానికి మూలం అవుతుంది. 18 ఏళ్ల నిండిన మహిళలు 70 కిలోల బరువు కన్నా ఎక్కువ ఉంటే గుండెపోటు వచ్చే అవకాశం యాభై శాతం వరకూ ఉంటుంది. బరువు ఎక్కువగా ఉండే మహిళలు బ్రెస్ట్, ఒవేరియన్, యుటెరిస్, సెర్వికల్, ఎండో మేట్రియల్ క్యాన్సర్ల బారిన పడే అవకాశాలు ఎక్కువ. డయాబెటీస్ వ్యాధికి లోనయ్యే పరిస్థితులు కూడా ఎక్కువే. బరువు బాగా పెరుగుతున్నవారు ముందు ఆహారాన్ని కంట్రోల్ చేసుకోవాలి. అంటే రోజూ తినే ఆహారంలో కనీసం ఇరవై శాతం తగ్గిస్తూపోతే వారంలోగా సుమారు 200 గ్రాముల బరువు తగ్గడానికి వీలుంటుంది. ఆహారం, వ్యాయామం వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఉదాహరణకు లాక్టోజ్ సహించనివారు కాచని పాలను తాగడం ద్వారా అనారోగ్యాన్ని ఎదుర్కోవడం కనిపిస్తుంటుంది. పాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాచి తాగాలి. లేకుంటే ఒవేరియన్ క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఇదికాక బాహ్య జననేంద్రియాలవద్ద టాల్క్ పౌడర్‌ను వాడటం కూడా ఆమోదం కాదు. ఒవేరియన్ క్యాన్సర్‌తో దానికి సంబంధం ఉండటమే అందుకు కారణం. శరీరంలో ఫోలిక్ యాసిడ్ లోపించడం లేదా తగిన స్థాయిలో లేకపోవటం కూడా సెర్వికల్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. అందుకే భారీకాయులైన మహిళలు కావలసిన మోతాదులో దీనిని తీసుకోవటం అవసరం. విటమిన్ల పరంగా మరో విషయం ఏమిటంటే నిర్ణీత పరిమాణంలో కన్నా అధికంగా విటమిన్ 'ఎ' తీసుకునే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. భారీ శరీరాన్ని కంట్రోల్ చేసుకునే విధానంలో భాగంగా నిత్యం వ్యాయామం తప్పనిసరి. వ్యాయామం వల్ల రొమ్ము, ఇతర పునరుత్పాదక అంగాలకు కాన్సర్ సోకే అవకాశం తగ్గటమే కాక గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా వుండటానికి వీలవుతుంది.

ఇక, చాలామంది చర్మ సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దేహంలోని అంతర్గత అవయవాలను కవచంలా కప్పి వుంచే చర్మం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించటం తప్పనిసరి. లేదంటే స్కిన్ క్యాన్సర్ సోకే ప్రమాదం లేకపోలేదు. విటమిన్ 'బి6', 'ఇ' లభించే ఆహారం తీసుకుంటే ఈ దుష్ప్రభావం నుంచి తప్పించుకోవచ్చు.

ఎముకలకు బలం చాలా అవసరం. ఎముకలు క్షీణించటం వలన వచ్చే ఆస్టియో పోరోసిస్ వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది సమస్యల బారిన పడుతున్నారు. ఎముకలు గుల్లబారటం, శక్తిహీనం కావటం వల్ల తలెత్తే సమస్యలు మెనోపాజ్ తర్వాతే ఎక్కువగా ఆడవాళ్ళలో బయట పడతాయి. ఎముకల క్షీణతను పెంచే వ్యాధి బారిన పడకుండా కాల్షియంతోపాటు మెగ్నీషియం సప్లిమెంట్లను 500 మి.గ్రా నుంచి 600 మి.గ్రా నిప్పత్తిలో కొంతకాలంపాటు రాత్రివేళల్లో తీసుకుంటే చాలావరకూ నివారణ పొందవచ్చు. వ్యాధి తలెత్తాక ఆందోళన పడేకంటే అన్ని వ్యాధులకు మూలం అయిన భారీకాయాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు వెంటనే ఆరంభించటం చాలా మంచిది.

-హిమజారమణ

కంటిచూపు లేకున్నా కలలు సాకారమై..

పసివయసు నుంచే అంధత్వం పెను శాపమై వెంటాడినా ఆమె ఏనాడూ కుంగిపోలేదు.. చూపు లేకున్నా ఎవరిపైనా ఆధారపడకుండా లక్ష్యసాధన దిశగా ఆమె దృఢదీక్షతో సాగి తన కలలను సాకారం చేసుకుంది.. జార్ఖండ్‌కు చెందిన రంజు (34) ప్రస్తుతం జంషెడ్‌పూర్‌లో వాణిజ్య పన్నుల శాఖాధికారిణిగా పనిచేస్తూ అందరి ప్రశంసలను అందుకుంటోంది. వృత్తిపరంగా ఎదురయ్యే ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. రంజు పుట్టినపుడే దృష్టికి సంబంధించి సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అయిదేళ్ల ప్రాయంలో ఈమె ఎడమ కన్ను దృష్టిని కోల్పోగా, ఆ తర్వాత పూర్తిగా అంధత్వం ఏర్పడింది. రెండు కళ్లూ కనిపించకపోయినా ఎవరిపైనా ఆధార పడడం ఇష్టం లేని ఈమె ఓ ప్రత్యేక 'సాఫ్ట్‌వేర్' సాయంతో కంప్యూటర్‌పై అక్షరాలను టైప్ చేయడం నేర్చుకుంది. ఇంజనీర్‌గా పనిచేసే తండ్రి రాజేంద్ర ప్రసాద్, సాధారణ గృహిణి అయిన తల్లి ఈమెకు నిత్యం అండగా నిలిచి, అన్ని విషయాల్లో వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఎంతో శ్రద్ధ చూపించే ఈమె రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి, తన తాతగారి ఆకాంక్షల మేరకు మెజిస్ట్రేట్‌గా ఉద్యోగం

చేయాలని తపన పడేది. తనకు అవసరమైన పుస్తకాలను తల్లి ద్వారా చదివించుకుని, కేవలం వినడం ద్వారా పాఠ్యాంశాలను రంజు నేర్చుకునేది. ఒక ప్రణాళిక ప్రకారం చదివి ఈమె 2008లో జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు హాజరైంది. వికలాంగుల కోటాలో తనకు ఉద్యోగం తప్పక లభిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా మొదట్లో ఫలితం దక్కలేదు. సర్వీస్ కమిషన్ పరీక్షలో ఫెయిల్ అయినట్లు తెలుసుకున్నాక, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై ఈమె లోతుగా అధ్యయనం చేసింది. సమాచార హక్కు చట్టం ప్రకారం రిజర్వేషన్ కేటగిరీలో ఉద్యోగాలు పొందిన వారి వివరాలను తెలుసుకుంది. వికలాంగుల కోటాలో తనకు ఉద్యోగం ఇవ్వాలని అభ్యర్థిస్తూ ఉన్నతాధికారులను ఆశ్రయించింది. ఈమెకు ఉద్యోగం ఇవ్వాల్సిందిగా వికలాంగుల శాఖ కమిషనర్ ప్రత్యేకంగా లేఖ రాసినప్పటికీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఇక అధికారుల చుట్టూ ఎంత తిరిగినా ప్రయోజనం శూన్యమని భావించి, ఆ తర్వాత మరోసారి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి ఈమె విజయం సాధించింది. వికలాంగుల కోటాలో ఈమెకు ప్రభుత్వ ఉద్యోగం లభించడంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. 'కలలు సాకారమయ్యే వరకూ నిరంతరం శ్రమించడమే తన విజయ రహస్యమని రంజు చెబుతోంది.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
మంగళవారం
19, ఫిబ్రవరి
2013

సేకరణ: కుందా

పలు తీర్థంబుల గ్రుంకుకంటే మహిలో భక్తాంఘ్రి పానీయముల్
తలమీదం జిలికించుకొన్న శుచి తీర్థం బొడ భారంబు త
త్ఫల మత్యల్పము భక్త పాదయుగ లాంఛ స్పర్శనిర్భావమై
యలరున్ శాశ్వత భక్తి ముక్తి ఫలదంబై యుడు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా ! అనేక పుణ్యనదుల్లో మునిగిన దానికంటే భక్తుల పాదతీర్థాలు నెత్తి మీద చల్లుకుంటే ఎక్కువ పుణ్యం. స్నానం చేయడం ఎక్కువ బరువుకూడాను. పోగా దాని వల్ల కలిగే ఫలితమూ తక్కువే. ఇక భక్త పాదయుగళ జలస్పర్శ తేలికయిన పని. పోగా అది శాశ్వతమైన భక్తి ముక్తుల ఫలాన్ని కూడా ఇస్తుంది. శైవమతంలో నిత్య జీవన విధానాలుగా సంచాచారాలున్నవి. లింగాచార, సదాచార, శివాచార, గణాచారా, భృత్యాచారాలలో భక్తునికి భక్తుడు భృత్యునిగా భావించు కోవడమన్నది గురువు. జంగముడు పాద తీర్థము ప్రసాదము అన్న అష్టావరణాలలోని నాలిగింటికి మూలం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

17 **శ్రీ లత**

''జీవనా! స్నానం అయిపోయింది తీసుకెళ్ళు'' అని వసంత పిలుస్తుంటే గబగబా పేపర్ పట్టుకుని ''ఈ రోజు పేపర్ చూశావా అమ్మా?'' అనడిగింది తల్లిని.

''ఏమిటీ ఏదైనా స్పెషలా?''

''అదే చూస్తున్నా'' అని ఆత్రంగా పేపరు తీసి చూసింది.

''అమ్మా ఇది విను'' అనరిచింది.

''ఏంట్రా?''

''పెళ్ళి కాకుండానే కనకుండానే తల్లి అయిన స్త్రీ... ఇది హెడ్డింగ్'' అని పెద్దగా చదివింది.

సంచలనం! హైదరాబాద్‌లోని అమృత కాలనీలో జీవన అనే పెళ్లికాని అమ్మాయి చెత్తకుండీలో దొరికిన బిడ్డను పెంచుకుంటోంది. పైగా ఈ విషయం తెలిసిన వాళ్ళకు ఇందులో ఎలాంటి సమాజ సేవ, గొప్పతనం లేవంటూ, తనకు చిన్న పిల్లలంటే ఇష్టం. అందువల్ల పెంచుకుంటున్నానంటూ పబ్లిసిటీకి ఇష్టపడటం లేదు. ఆమెలోని మాతృత్వ దృష్టికి అందరూ అచ్చెరువొందుతున్నారు. నిరాడంబరత, ఆదర్శ భావాలు కలిగిన ఆమె ముమ్ముందు గొప్ప ఆదర్శమూర్తియై మన దేశానికి గర్వకారణం కాగలదని అందరూ భావిస్తున్నారు'' అని గట్టిగా చదివింది.

పాపకు బట్టలు వేసి పడుకోబెడుతూ... ''బావుంది! తల్లి బిడ్డను పెంచుకోవడం సమాజ సేవ! సరే సరే విడ్డూరం కాకపోతే''- వసంత గొంతులో కొంచెం వెటకారం. వాళ్ళకు మాత్రం ఏం తెలుసులే అయినా ఈ వివరాలు వాళ్ళకెలా తెలుసు? అనడిగింది జీవనను.

''నేను ఇవ్వలేదు అతనే అనవసరంగా రాశాడు.''

''అతనెవరూ?''

''అతనూ.. మన పక్క వీధిలో ఉంటున్నాడట, పేరు అవినాష్, జర్నలిస్ట్. వీధిలో వాళ్ళు చెప్పుకుంటున్నవి విని కలిసి ఇంటర్వ్యూ తీసుకోవడానికి ఆఫీసుకొచ్చాడు. నాకిష్టం లేదని చెప్పాను''.

''మరెందుకు రాశాడు''

''ఉండు కనుక్కుంటాను? ఈ పేపరు వాళ్ళకు అవసరం లేని విషయం ఉండదు. ఈ సృష్టిలో ఎవరి మానాన వాళ్ళను బ్రతనివ్వరు. గాసిప్స్.. స్పెషల్ న్యూస్‌లు.. వీళ్ళకు మహా ఇంట్రస్ట్'' అంటూ ఫోన్ తీసుకుని నెంబర్ డయల్ చేసింది.

అటునుంచి హలో అనగానే... కనీసం అతనో కాదో కన్‌ఫాం చేసుకోకుండానే... చూడండీ మీకు వార్తలు లేకపోతే మీ భార్యా పిల్లల విషయాలు రాసుకోండి! లేదా మీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏం చేశారో రాసుకోండి. వాటిని మీ గొప్పదనాలుగా చిత్రీకరించుకోండి. అంతేగాని పర్మిషన్ లేకుండా ఇతరుల విషయాలు పేపర్లో రాస్తే 'ఇల్లీగల్ ఇష్యూ' అయి కాంపెన్‌సేషన్ కట్టాల్సి ఉంటుంది'' చిరాగ్గా చెప్పింది జీవన.

''మీరు.. ఎ...వరు?'' అని అడిగేలోపే....

నేను ముందే చెప్పాను. పాపను పెంచుకోవడం సమాజ సేవ కాదని, నా స్వార్థం కూడా ఉందనీ, మీకు మళ్ళీ చెబుతున్నాను... మళ్ళీ నా గురించి పట్టించుకున్నారంటే మాత్రం ఐ విల్ అప్రోచ్ విత్ కోర్ట్ ఆర్డర్'' అంది ఇరిటేటింగ్‌గా.

''మీరు....''

''జీవన... మీరీ రోజు సిటీ ఎడిషన్‌లో వార్త రాసింది, నా గురించే! టేక్ కేర్ ఆఫ్ యువర్ జాబ్'' అని ఫోన్ పెట్టేసింది.

''అంత కోపం ఎందుకు? కాస్త మర్యాదగానే చెప్పొచ్చుగా'' వసంత అంది వంటింట్లోంచి.

''అసలే నా ప్రాబ్లమ్స్‌లో నేనుంటే వీళ్ళేమిటమ్మా అనసరపు న్యూసెన్స్'' అంటూ తల్లిమీద కూడా చిరాకు పడింది.

''వాళ్ళకేం తెలుసే నువ్వు సమస్యల్లో ఉన్నావని! నీకేదో తీరికెక్కువై, డబ్బులెక్కువై ఆదర్శభావాలు ఎక్కువై కాలక్షేపం చేస్తున్నావనుకుంటున్నారు'' అంది పోపులో కూరగాయల ముక్కలేస్తూ... అవి సుయ్యిమని చేసే చప్పుడుకు నొసలు ముడుస్తూ... వాళ్ళిష్టం వచ్చినట్లు అనుకుంటే సరిపోతుందా? మన ఇష్టాయిష్టాలతో పనిలేదా? అంటూ చేతిలోని దిండుని హాల్లోకి విసిరేసింది జీవన. అది వెళ్ళి సోఫాలో కేరింతలు కొడుతున్న పాపకు దగ్గరగా పడింది. పాప కెవ్వున ఏడ్పు మొదలుపెట్టింది.

''బావుంది ఉరుము ఉరిమి మంగళం మీద పడిందని నీ కోపం చంటిదానిమీద చూపిస్తావేం!'' వసంత అరిచింది వంటింట్లోంచి.

''సారీ పాపా! సారీ...'' అని పాపను తీసుకుని ఏడవకమ్మా ఊ..కు.. కూ... అని ఎంత ఆడించినా పాప ఏడుపు ఆపలేదు.

''అమ్మా.. రామ్మా.. ప్లీజ్.. నావల్ల కావడం లేదు...''

''పిల్లల్ని సముదాయించడం తెలీదు, నీకు పిల్ల లేమిటీ?'' అని చేతులు తుడుచుకుని, పాపను అందుకునిభుజంమీద పడుకోబెట్టుకుని ''ఆ.. ఆ... ఆ... లేదమ్మా... ఏడవకూ.. చూడు... చూడు... ఇటుచూడు...'' అని లాలిస్తూ డింగ్ డాంగ్ బెల్స్ మోగిస్తూ ఏడ్పు మానిపించింది. పాపనెలా ఆడిస్తుందో మరిపిస్తుందో చూస్తూ కూర్చుంది జీవన. నన్నూ చిన్నప్పుడు ఇలాగే ఆడించిందేమో అనుకుంటే మనసంతా హాయిగా చల్లగా అనిపించింది.

''పాపను ఏ పేరుతో పిలుద్దామమ్మా'' అడిగింది జీవన. ఉగ్గు కలుపుతున్న అమ్మకు బేబీ డ్రాప్స్ అందిస్తూ...

''నీ కూతురికి నీకు నచ్చిన పేరు పెట్టుకో.... నా కూతురికి నేను పెట్టుకోవాలా మంచి పేరు'' కవ్వి తంగా జీవనను చూస్తూ ''నీ పేరు విన్నవాళ్ళు 'జీవన' అనేదికూడా ఓ పేరేనా? అని వెక్కిరించే వాళ్ళు' ఎలా జీవించాలి అనేదానికి నా కూతురో ఉదాహరణ కావాలి. అందుకే 'జీవన' అని పెట్టుకున్నాను అని సమర్థించేదాన్ని''.

''సరే! పాపకు 'సీత' అని పెడదాం అమ్మా అంది జీవన. అమ్మ మాటల వినీ వినన్నట్లు వదిలేస్తూ..

''అదేంటి? అదెంతో పాత పేరు. అందులోనూ సీత పేరు పెడితే సీతకొచ్చిన కష్టాలన్నీ వస్తాయని సెంటిమెంటుంది భారతీయుల్లో తెలుసా? అంటే భర్తతో అనుమానించబడటం, అరణ్యవాసంలోనే జీవితం ముగిసిపోవడం లాంటివి'' అంటూ అడ్డంగా తలూపింది వద్దన్నట్లుగా.

-ఇంకావుంది

148 **రంగనాథ రామాయణం**

శ్రీపాద కృష్ణమూర్తి

సుగ్రీవుడు తారాదిసతుల వీడ్కొలిపి, సకల దిక్కులలోను వున్న ప్లవంగ ముఖ్యులను, మర్కట సేనలను పిలిపించి పయనమయాడు. పుడమి, ఆకసం, పది దిక్కులు మారుమ్రోగే విధంగా ప్రస్థాన భేరి వేయించాడు. రత్నమాణిక్య ఖచితం అయిన ఒక పల్యంకిక తెప్పించి, అందు లక్ష్మణుణ్ణి ఎక్కించాడు. శ్వేతచ్ఛత్రం, వింజామరలు అతని వెంట అరుగ నియమించాడు. తాను మరొక శిబిక అధిరోహించి లక్ష్మణుడి వెంట బయల్వెడలాడు. శుభతూర్యాలు పిక్కటిల్లాయి. వంది బృందాల ప్రస్తుతులు చెలగాయి. నక్షత్రాల మధ్య వున్న చంద్రమసుడిలాగా ప్రకాశించాడు.

అక్కడ మాల్యవంతంమీద వున్న రామవిభుడు ఆ కలకలం ఆలించి కపిసేనలు కదలి వస్తున్నవని ఊహించి సుగ్రీవుడి పైన కల ఆగ్రహం ఉడిగాడు.

అంత మణికాంచన విలసితాలైన ఆందోళికా ద్వయం డిగ్గి సౌమిత్రి, సుగ్రీవుడు ఏతెంచి ప్రణామాలు కావించారు. సుగ్రీవుడు అవిరళ భక్తియుక్తుడయి, హస్తద్వయము చేర్చి, ఐదు పది చేశాడు.

''దేవా! వానర సేన లను పిలువ కొందరు కపి నాథులను దిక్కులకు పంపాను. వివిధ దేశాలనుంచి కపులు కిష్కింధ చేరటము ఆలస్యం అయింది. సేనలు వచ్చిన అనంతరం తమ్ము దర్శింపత లచాను. అనివార్యంగా కొంత తడవు పట్టింది. నేను రామకార్యం మరచిపోలేదు. అన్యథా భావించవద్దు'' అని విన్నపం ఒనర్చాడు.

శ్రీరామ విభుడు సుగ్రీవుణ్ణి కృపాదృష్టితో కాంచి మన్నించాడు. కొంత సమయం అయింది. అప్పుడు కైలాసగిరి, మేరునగరం, నీలాచలం, నిషధాద్రి, ద్రోణాచలం, హిమాలయం, శోణగిరి, వృషభాద్రి, వింధ్యాచలం, మలయ పర్వతం మున్నుగా గల మహీధరాలందున్న వానరనాథులు పనసుడు, అంగదుడు, గవయుడు, నీలుడు, గంధమాదనుడు, నలుడు, మైందుడు, కేసరి, జాంబవంతుడు- వారి వారిబంధు జనులు సములుగా కూడి, ఇవి వేలు, లక్షలు, కోటులు, శతకోటులు అయి నేల యీనిన మాదిరి ఏ దెసను కాంచినా వెల్లి విరిసి, ఉగ్ర గతిని క్రాలు క్రాలుడి దండాల వరుసను దీపించే బాహు దండాలు, బడబాగ్ని కీలలను పోలి ఆకాశాన్ని ఒరసుకునే వాలపాశాలు, ఉరవడితో క్రాలు ఉగ్రదంష్ట్రలు కలిగి బలములతోకూడి చనుదెంచే ప్లవంగ వల్లభులను కని రాముడు పరమానందభరిత మానసుడు అయాడు.

అంత సుగ్రీవుడు రామచంద్ర ప్రభుని కనుగొని ''దేవా! మా కపి సైన్యం ఏ తెంచిన విధం అవధరించారా? వీరిలో ఒక్కొక్కడే మీ కార్యం సాధింప సమర్థులు అని చెప్పి, వారి పేరులు, జన్మలు, జాతులు, సత్త్వములు, తనువులు, వర్ణములు, భోజనాలు, దేశాలు వివరించి చెప్పాడు.

బడబాగ్ని ముఖంలో చిక్కి వున్నా అతి వేగంగా చని ఉగ్ర గతిని ఒప్పి, పుడమి, నింగి, అబ్ధులు చొచ్చి అయినా మృత్యు వక్త్రంతో పట్టుబడినదైనా, పోరాని తావునందున్నా నా వానరాధిపులు ఒకొక్కరు నీ దేవిని వైదేహిని తేగల శక్తిసంపన్నులు. ఆనతి ఇయ్యవలసింది'' అని వాక్రుచ్చాడు.

అప్పుడు శ్రీరాముడు సుగ్రీవుణ్ణి గ్రుచ్చి ఆలింగనం కావించుకొని ''సుగ్రీవా! బల సంపదల్లో నీకు అసాధ్యాలు ఎక్కడ వున్నవి? నీ పౌరుషము చూసి నిన్ను మిత్రుడిగా కైకొన్నాను'' అని బదులు పలికి ఇక వానరులను సీతను అన్వేషింప పంపించు'' అని వాకొన్నాడు.

వానర వీరులను సీతను వెదక పంపుట

సుగ్రీవుడు హర్షించి ఉత్తమము, శుభము అయిన ఒక ముహూర్తంలో వినతుడు అనే వానర వీరుని పిలిచాడు. 'వినతా! నువ్వు నీ సేనలతో తూర్పు దిశగా అరుగు. ఏమరుపాటు చెందక రామవిభుడి దేవి కోసం యమునలో వెదకు. యామినీ గిరి పరికించు, ఆకాశగంగలో శోధించు. శోణనదం అరసి చూడు.

-ఇంకావుంది

మంగళవారం, 19 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ నవమి సా.05.23
నక్షత్రం: రోహిణి మ.02.22
శేష వర్జ్యం: ఉ.07.18 వరకు, తిరిగి రా.08.35 నుండి 10.22 వరకు దుర్ముహూర్తం: ఉ.09.02 నుండి 09.48 వరకు, తిరిగి రా.11.14 నుండి 12.04 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులచే గౌరవింపబడుదురు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక చింత యుండదు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. ఆకస్మిక ధన లాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోని వారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళ్తారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు ప్రారంభించుట మంచిది కాదు. కొంత ఆందోళన ఉంటుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
శుభవార్తలు వింటారు. ధనలాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

మంచిమాట

ఆధ్యాత్మిక చింతన

ఆధ్యాత్మిక చింతన వయసు పైబడ్డాక అంటే అరవై దాటాక ఆలోచించవచ్చు అనేది చాలామంది భావన. చిన్న వయసులో ఎవరైనా గుడికో, పురాణ ప్రవచనానికో వెళ్లినా తోటివారు 'ఇప్పటినుంచీ నీకు ఇలాంటి బుద్ధులేమిటీ? నువ్వేం బాగుపడతావు?'' అంటూ వెటకారాలు చెయ్యడం 'తాచెడ్డ కోతి వనమల్లా చెరిచిందన్న' సామెతలా మంచి బుద్ధులున్నవారిని కూడా చెడగొట్టడానికి ప్రయత్నించడం చేస్తూ వుంటారు. ధైర్యస్థులు, పట్టుదల కలవారు అయితే తోటివారి మాటల్ని లెక్క చెయ్యకుండా తమ మార్గంలోనే అడుగులు వేస్తారు. చాలామంది తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఈ మార్గంలో నడవడానికి అంగీకరించరు.

ఎంతసేపూ క్లాసు, పాఠాలు అవుపోసన పట్టేసి మంచి మార్కులు సంపాదించుకుని, అందుకే తమ పిల్లల్ని ప్రోత్సహిస్తారే తప్ప ఆధ్యాత్మిక విషయాలని అంగీకరించరు. ఏ మామ్మలో, అమ్మమ్మలో, తాతలో పిల్లలకి పురాణ కథలు చెప్తూంటే వారి తల్లి దండ్రులు సహించలేరు.

''ఈ పుక్కిటి పురాణాలు వింటూ టైము వేస్టు చేసుకోకు. క్లాసు పాఠాలు చదువుకో!'' అంటూ వెంటనే తల్లిదండ్రులు పిలిచేస్తారు.

ఇటీవల చాలామంది యువతరం గుళ్ళలో, పురాణ ప్రవచనాల్లో కనబడుతూ వుండడం కొంతవరకూ సంతోషించతగ్గ విషయమే!

అయితే వారి భావాల్లో ఆధ్యాత్మిక ఆలోచనలకన్నా దేవుణ్ణి తమ కోరికలు తీర్చేవాడిగానే చూస్తున్నట్లు కనబడుతోంది. కాని, భగవంతుని దగ్గరకు రావడమనేది ఏదో ఒక విధంగా ఆరంభమైనా ఆ భగవంతుడి మీద భక్తి క్రమేపీ ఆధ్యాత్మికతవైపు మళ్లుతుందటారు పెద్దలు. ప్రహ్లాదుడు, ధ్రువుడు మొదలైన వారంతా చిన్నప్పటినుంచే భగవద్భక్తులు కాలేదా? వారు శాస్త్రాలు అధ్యయనం చెయ్యలేదా? రాజ్యాలు ఏలలేదా? శాశ్వత కీర్తిని ఆర్జించలేదా?

అవసరం లేకపోయినా కాలక్షేపం అంటూ డబ్బు సంపాదన కోసం వెంపర్లాడే వారే ఈనాడు కనిపిస్తున్నారు కాని, అప్పటికైనా భగవధ్యానంలోనో సేవా కార్యక్రమాల్లోనో కాలాన్ని గడిపేవారు చాలా తక్కువగా కనబడుతున్నారు. అటువంటివారిలో నూటికో కోటికో ఒకరున్నా వారికి సాయాన్ని అందించేవారు అంతంతమాత్రమే!

ఆధ్యాత్మికత మనసుకి ధైర్యాన్ని, కర్తవ్యాన్ని బోధిస్తుంది. ప్రశాంత చిత్తాన్ని, సమయ స్ఫూర్తిని ఇస్తుంది. నిష్కామ కర్మలని ఆచరించేలా చేస్తుంది. చిన్న ప్రయత్నం చేసి కొండంత లాభం రావాలనుకునే అత్యాశని దూరం చేస్తుంది. ప్రాప్తమైన దానితో తృప్తిపడేలా చేస్తుంది.

ఈనాడు చాలామందిచిన్న చిన్న సమస్యలను, వారి జీవితంలో స్వల్ప ఒడిదుడుకుల్ని ఎదుర్కోలేకనో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, అంటే పిరికిపందలవుతున్నారు. మంచి చెడు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నారు. తమ బాధ్యతలనించీ దూరమై పాప ఫలాన్ని పొందుతున్నారు.

ఇందుకు కారణం మనసులో ఆధ్యాత్మిక భావాలు లోపించడంవల్లనే! భగవద్గీత కేవలం కోర్టులో ఒట్టు పెట్టించడానికీ, చచ్చిపోయినప్పుడు పఠించడానికీ కాదు. చిన్న తనం నుంచే ఆ శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన మాటలు విని మదిలో నిలుపుకుంటే తమ కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించగలుగుతారు. లేనిపోని వ్యామోహాలకి దూరంగా ఉండగలుగుతారు. పిరికితనాన్ని పారద్రోలి కర్తవ్యోన్ముఖులౌతారు.

ప్రతీ విద్యార్థీ ఆధ్యాత్మికతనలవరచుకుంటే మనీషులౌతారు. మహాత్ములౌతారు. కనీసం భ్రష్టులవకుండా వుంటారు. మనుషులు బాగుపడుతారు. వారి ద్వారా సమాజం తద్వార రాష్ట్రం దానిద్వారా దేశం బాగుపడుతుంది. ప్రపంచమూ బాగుపడుతుంది. సర్వేజనా సుఖినోభవన్తు అనే మన ప్రాచీన సూక్తి నిజం ఎల్లెడలా పరివ్యాప్తం అవుతుంది.

-ఆర్.ఎస్.హైమవతి

వృతాసురుడు 26

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 19

మాటాట

ఆధారాలు:
అడ్డం
2. ఆహ్వానం పలకడం
5. రెండైదులు
6. మత్స్యము
7. వేకువ
10. దారం చివరగల ఓ ఎర్రని పువ్వు
13.జనని
14. చర్మం
15. పార్వతీ పతి

నిలువు
1. ఋషి
3. అల్లరి
4. అర్తి
7. మొక్కు, నమస్కారం
8. తామరతూడు
9. వానకోయిల, సారంగపక్షి
11. చెక్క
12. ప్రీతి

మాటాట - 18 సమాధానం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కొత్తగా

'నెస్ట్'.. బెస్ట్!

ఇద్దరు ఆపిల్ కంపెనీ మాజీ ఉద్యోగులు రూపొందించిన చిన్న సాంకేతిక పరికరం 'నెస్ట్' -శీతాకాలంలో ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదంగా ఉంచుకోవడానికి ఉపయోగపడుతుందట. వైర్‌లెస్ కనెక్టివిటీ విధానం కింద పని చేసే ఈ పరికరం, ఇంటిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే ఐదు సెన్సార్లతో అనుసంధానమై ఉంటుంది. అందులో రెండు సెన్సార్లు మనిషి అలికిడిని గుర్తించగలిగేవిగా ఉంటాయి. ఈ సెన్సార్లు ఎప్పటికప్పుడు ఉష్ణోగ్రతను గుర్తిస్తూ, గదిలో వెచ్చటి వాతావరణాన్ని కలిగిస్తుంటాయి. ఈ పరికరానికి -చేతిలోవున్న మొబైల్ ఫోన్ కూడా ఒక రిమోట్ కంట్రోలే. గదుల్లో సౌకర్యవంతమైన ఉష్ణోగ్రత ఉంటాలంటే -నెస్ట్ ఈజ్ ది బెస్ట్ గాడ్జెట్ అంటున్నారు నిపుణులు. ఇంత తతంగాన్ని నెస్ట్ పరికరానికి ఉన్న ఒక్క బటన్ నొక్కితే చాలు అంటున్నారు దీని రూపకర్తలు. చూద్దాం.. అందుబాటులోకి వచ్చాక దీని పనితీరు.

హీరో..

ప్రణవ్ @ మైక్రోసాఫ్ట్

తొమ్మిదేళ్ల కుర్రాడు. సరిగ్గా జనవరి 9న -అరుదైన రికార్డు సాధించాడు. కాలిఫోర్నియాలోని అగౌరా హిల్స్‌కు చెందిన తొమ్మిదేళ్ల ప్రణవ్ కల్యాణ్‌కు -మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ టెక్నాలజీ స్పెషలిస్ట్ గౌరవం దక్కింది. ఈ ఘనత సాధించిన వాళ్లలో ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అత్యంత క్లిష్టమైన కంప్యూటర్ పరీక్షను అధిగమించిన వాళ్లకు మాత్రమే దక్కే గౌరవం -తొమ్మిదేళ్ల ప్రణవ్ సాధించాడు. కంప్యూటర్ సైన్స్ బాల మేధావుల జాబితాలో ఇప్పటికే ప్రణవ్ పేరు వికిపీడియాలో నమోదైవుంది. ప్రస్తుతం సాధించిన ఘనతతో అతను మరో రెండుమెట్లు పైకి ఎక్కినట్టయ్యింది.

రెండేళ్ల ప్రాయం నుంచే కంప్యూటర్ పట్ల అత్యంత ఆసక్తి ప్రదర్శిస్తూ వచ్చిన ప్రణవ్, ఆరోఏట అడుగు పెట్టడం నుంచే ప్రోగ్రామింగ్ పట్ల ప్రేమ పెంచుకున్నాడు. అక్షరమాల కూడా సరిగ్గా అర్థం గాని వయసునుంచే కంప్యూటర్ ప్రోగ్రామింగ్ మీద దృష్టిపెట్టి, తొమ్మిదేళ్ల ప్రాయానికి ఎంసిటిఎస్‌ను సాధించాడు. లెక్కలు, కంప్యూటర్ సైన్స్‌పట్ల విపరీతమైన మమకారాన్ని చూపించే ప్రణవ్, వీకెండ్స్‌లో ఈ రెండు సబ్జెక్టుల మీద ఏకబిగిన ఎనిమిది గంటలపాటు కూర్చొనేవాడని లాస్‌ఏంజిల్స్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో పని చేస్తున్న వాళ్ల నాన్న చెప్తున్నాడు. గొప్ప కంప్యూటర్ ప్రోగ్రామర్ అలాగే వ్యోమగామి కావాలని ఆశ పడుతున్న ఈ చిచ్చరపిడుగు, కలను సాకారం చేసుకుంటాడనడంలో ఏమాత్రం సందేహం లేదు.

కాలంతో పరుగు.. వేగంలో వెలుగు

క్షణం తీరిక ఉండదు.. చేస్తున్న పని మీద ధ్యాస ఉండదు! ఇది నేటితరం నైజం.. యువతరం స్వభావం.. నవతరం లక్షణం.. తీరిక లేకపోవడం, ధ్యాస ఉండక పోవడాన్ని ఏకాగ్రత లోపంగా భావిస్తే పొరబాటే! ఉర కలెత్తే యువత ఆలోచనల్ని అందుకోనట్టే.. నేటి బిజీ ప్రపంచంలో అన్నింటికీ టైముంటుంది. అది దాటితే ఓ అవకాశం లేదా సువర్ణావకాశం చేజారిపోతుంది. ఇలాంటి అవకాశాలు, కెరీర్ సోపానాలే యువతరాన్ని జనరేషన్ 'ఐ' దిశగా పరుగులు పెట్టిస్తున్నాయి. కోరికలు గుర్రాలు అవుతున్నాయి.. అందని అవకాశపు అంచుల్ని అందిపుచ్చుకునేందుకు పరితపిస్తున్నాయి. 'ముందు మనం.. తర్వాతే జనం..' అన్న నానుడి ఒకప్పుడు స్వార్థానికి, ఆత్మాశయానికి నిదర్శనం. కానీ నేడు పరిస్థితులు మారాయి. పోటీ పెరిగింది.

ఉపాధి అడుగంటింది. అలాంటప్పుడు మనకోసం ఆలోచించకుండా జనంకోసం ఆలోచిస్తే అవకాశాల్ని చేజార్చుకున్నట్టే. మనం అందుకోవాల్సిన రైలు ఓ రోజు లేటైనట్టే.. అందుకే నేటి తరానికి 'ఐ' గురుత్వాకర్షణ.. నక్షత్రాల చుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తున్నట్టుగా 'నేను' చుట్టూ యువత ఆశలు, ఆశయాలు, కోరికలు, ఆకాంక్షలు పరిభ్రమిస్తున్నాయి. మనసు దోచేదే మార్కెట్ కాబట్టి ఆ మార్కెట్‌లోకి కుప్పలు తెప్పలుగా వచ్చే ఉత్పత్తులను యువతకు చేరువ చేయాలంటే ప్రతి ఒక్కరిలో ఇది తన కోసమేనన్న భావన కల్పించాలి. మారుతున్న కాలగతిలో ఏదీ శాశ్వతం కాదు.. అందుకే 'శ్యాడ్డజ్ఞు ఔశ్ఛాట్ఞు ఖ్ఛుఖ్ఛుఆ ఖ్ఛుశ్ఛ అన్న నానుడి పుట్టుకొచ్చింది. కాలమేదైనా మార్పునకు లొంగాల్సిందే. సినిమాను తీసుకున్నా.. వినియోగ వస్తువుల డిమాండ్‌ను పరిశీలించినా వాటి రూపురేఖల్లో ఈ మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కాలగతిలో శతకాలు, దశకాలు మారినా నిత్యనూతనంగా మెరిసిపోయేది మార్పే! ఆ మార్పును ఒడిసి పట్టుకుని తన ఆకాంక్షలను నెరవేర్చుకునేదీ యువతే.. అరవై నుంచి ఎనభైయవ దశకం మధ్య తరానిది నిబద్ధతాలోకం.. విలువలే ఆలంబనగా సాగిన జీవన గతి ఆ

తరానిది. కానీ సరళీకరణ యుగంతో అంతా మారిపోయింది. సరికొత్త ఆలోచనలతో యువత తెరపైకి వచ్చింది. అనుకున్నది సాధించడమే ధ్యేయంగా దూసుకుపోయింది. పోరాటమే జీవితంగా.. ఆశయ సాధనే ధ్యేయంగా మనుగడ పోరాటం మొదలైంది. ఇక తొంభైయ్యవ దశకం ద్వితీయార్థానికి వచ్చేసరికి పరిస్థితి మరింతగా మారింది. కోరికలు రెక్కలు కట్టుకున్నాయి.. అవకాశాలు పరుగులు పెట్టించాయి. 'నేడు నాది.. రేపూ నాదే కావాలి..' అన్న తపన మొదలైంది. ఉన్నదానితో సరిపెట్టుకోవాలన్న హద్దులు చెరిగిపోయాయి. జడత్వం స్థానే చైతన్యం.. ఆదర్శాల స్థానే వాస్తవిక దృక్పథం, క్షణం గడిస్తే మళ్లీ రాదన్న సమయ పాలన యువత ప్రాథమిక లక్షణాలుగా మారాయి. సినిమాలైనా, షికార్లైనా, ఫ్యాషన్‌లైనా, రోల్‌మోడల్స్ అయినా చివరికి ప్రకటనల ప్రచారంలోనూ ఈ ధోరణులకే ప్రాధాన్యం.

'అసహననే సుగుణం' అని ఎయిర్‌టెల్ ప్రచారం చేసుకున్నా, తీరికను భరించలేం అంటూ అడిడాస్ ప్రకటనలు గుప్పించినా యువత మనోభావాలను ప్రతిబింబించే ప్రయత్నమే! జీవితం సజావుగా సాగినంత కాలం నల్లేరుపై నడకే.. ఆ బాట మారితే నడకా మారుతుంది.. జీవితమూ అంతే. ఆర్థిక మాంద్యం సమాజంలో అనిశ్చితికి ఆజ్యం పోసింది. ఉద్యోగాల్లోనూ, ఉపాధిలోనూ, ర్యాంకుల్లోనూ పోటీ పెరిగింది. విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకూ.. స్కాలర్ల నుంచి పరిశోధకుల వరకూ రాణించాలన్న తపన మెరుగవుతోంది. 'పదిమంది దారిలో వెళితే మా ప్రత్యేకత ఏమిట'న్న భావన రాటుదేలుతోంది. ఆశలు ఆకాశాన్నంటినా వాటిని సాధించుకునేందుకు అడుగులు భూమ్మీదే ఉండేలా చూసుకోవడం అన్నది ఉత్తమ లక్షణమే. అందుకే వాస్తవికత కూడా నేటి యువత లక్షణమైంది. హీరోలను ఆదర్శంగా తీసుకునే రోజులు పోయి.. వారి పాత్రల కోణంలోనే ఆలోచించే స్వభావం పెరగడానికి ఇదే నిదర్శనం. తమను తాము ఎక్కువగా ఊహించుకోకుండా అలాగని తక్కువగానూ పరిగణించుకోకుండా అవకాశానికి, సందర్భానికి తగ్గట్టుగా రాటుదేలాలన్నదే నేటి నానుడి.

అందుకే ఉన్నచోట ఉండలేని మనస్తత్వం.. ఒకచోట ఉండిపోతే కెరీర్ పరంగా ఎదగలేమన్న తాపత్రయం. 'శాశ్వతత్వం లోనే సుస్థిరత ఉందంటే.. అలాంటిది నాకు అవసరం లేదు. ఎందుకంటే జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్న చందంగా మారుతుందంటున్న ఓ యువకుడి ఆలోచన అతడికే పరిమితం కాదు.. కాలంతో పరుగులు పెడుతున్న యువత మనోభావాలకు అద్దం పట్టేదే. భవిష్యత్ విషయంలో అనిశ్చితి ఉండుగాక. దాన్నిమించిన స్థాయిలో ఆత్మ విశ్వాసాన్ని యువత సంతరించుకుంటోంది. సమస్యల్ని ముందుగానే ఊహించుకోకుండా ఎదురైతే ఎదుర్కొంటాం అన్న స్థిత ప్రజ్ఞ తను పెంచుకుంటోంది. కాలంతో పరుగు పెట్టాలంటే ఈ తరహా ఆలోచన అవసరం.. అంతకు మించిన స్థాయిలో ఆశయాలను సాకారం చేసుకునే నిబద్ధతా అనివార్యం

విజయం

విద్యార్థులమే!... అయినా విజేతలమే!!

-వాసిలి
వసంతకుమార్,
drvaasili@yahoo.co.in
Cell: 9393933946

సక్సెస్ ఈజ్ ఎ చాయిస్

""The most essential things one needs to be rewarded with bagful of success is deserving desire, determination, planning, practical action and persistence".

కృషి, సానుకూల దృక్పథం మమేకమైతే విజేతలం కాగలం!

కాలాన్ని, అవకాశాన్ని కలపగలిగితే మార్గదర్శులం కాగలం!!

మనం మహోన్నతులం కావాలన్నా, మహాపురుషులం కావాలన్నా అవకాశాలు మెండుగానే ఉంటూంటాయి. అయితే అందివస్తున్న అవకాశాలతో 'విన్నర్స్' కావటానికి, 'సక్సెస్‌ఫుల్ పర్సన్స్' కావటానికి కాలంపై సారథ్యం వహించగలగాలి. సామర్థ్యం మనదే.. అయినా సక్సెస్‌కు కావలసిన సమయ సారథ్యం మన చేతుల్లో ఉండాలి.. అప్పుడే స్టూడెంట్ లైఫ్ అంటే స్ట్రగుల్ కాదు అనిపిస్తుంది. సంసారం సమరం కాదు అనిపిస్తుంది. సంసార సారథ్యంలో సమయం విలువాత్మకమైందవుతుంది. అంటే మన పైని మన విశ్వాసమే మన సక్సెస్‌కు మార్గం సుగమం చేస్తుంది. ప్రయాణం సాగుతున్నకొద్దీ 'సక్సెస్ ఈజ్ ఎ చాయిస్' అనిపిస్తుంటుంది. మన ఎంపిక మన గమనమే! ఆ కాలగమనంలో మనం విజేతలం అయితీరుతాం.

మనం విద్యార్థులమే! అయినా విజేతలమే! చదువుల బడిలోను అనుభవాల ఒడిలోను నిరంతరం విద్యార్థులమే! నిజ జీవితంలో విజేతలం అనిపించుకోవాలంటే ఎడ్యుకేషన్ విలువ తెలిసిన తొలినాటినుండీ కాలంతో పోటీపడాల్సిందే. మనం సాధించాల్సింది ఏమిటి? మన లక్ష్యం ఏమిటి అని మనల్ని మనం ప్రశ్నించుకుంటూ.. సమాధానంతో సంతృప్తమవుతూ.. సమయపాలనతో సక్సెస్‌ను అందుకోవాలి. దీన్నే టైమ్ మేనేజ్‌మెంట్ అంటుంటాం. అంటే కాలానికి కళ్లెం వేసి కృషితో మహోన్నతం కావటం.

విజ్ఞానం కాలజ్ఞానం మమేకం కావాలి

విశ్వవిద్యాలయాల పట్టాలతో మనం విజ్ఞానులమే కాదు కాలజ్ఞానులమూ కావాలి. అప్పుడే ప్రతి అవకాశమూ విజయానికి పునాది అవుతుంటుంది. మన మార్పే పరిణామమయి గెలుపు వాకిట నిలుపుతుంది. ఇటువంటి సందర్భాలలో అవకాశాలే కాదు సమయమూ వలసినంత ఉందనిపిస్తుంది. అయితే అన్ని సమయాలు, అన్ని అవకాశాలు 'బాగ్ ఫుల్ ఆఫ్ సక్సెస్‌ను' అందివ్వలేవన్న స్పృహ, అవేర్‌నెస్ మనకుండాలి.. ఈ వివేచన కొరవడితే గెలుపు భారమవుతుంది. అవకాశాలలోని ముఖ్యావసరాలను గుర్తించలేకపోతే మనం చదివే చదువుల ప్రయోజనం ఏమిటి? మనకే పనికొచ్చే అవకాశాలను, మనవల్లే సాధ్యమయ్యే అవకాశాలను గుర్తించటం మన సామర్థ్యానికి ఒక ప్రవేశపరీక్ష అవుతుంది. ఆ అవకాశాల పరంగా గెలుపొందటానికి చేసే పరిశ్రమలో కాలం దుర్వినియోగం కాకుండా చూసుకోవటం టైమ్ మేనేజ్‌మెంట్ అవుతుంది. ఇంతకీ మన సక్సెస్‌ను నిర్ణయించేది, మన ఉన్నతత్వానికి భూమిక అయ్యేది సమయపాలనే!

చేయాల్సిన పనులను సరిగ్గా, సకాలంలో చేయగలిగితేనే మన చదువులకు సార్థకత. సర్వసాధారణంగా సాధించిన సంఖ్యకంటే సాధించని సంఖ్యనే పెద్దదిగా ఉంటుంటుంది. అయినా అపజయాలకు వివరణ ఇవ్వ ప్రయత్నిస్తున్నామంటే విజయాన్ని సమీక్షించుకోవటం తెలీటం లేదనే! సాధించలేనంత మాత్రాన మనం పనికిరామని కాదు. ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుంది. ఆ పొరపాటును సరిదిద్దుకోగలిగితే సక్సెస్ తథ్యమే!

ఉపేక్షిస్తే కాలం క్షమించదు

సాధించలేని సమయాలలో వివరణలతో తప్పుకోవాలనుకోకూడదు. వివేచనతో కట్టుదిట్టం కావాలి.. మరో ప్రయత్నానికి సమాయత్తం కావాలి. మన ఇంటెన్షన్, మోటివేషన్‌ల సాంద్రత తగ్గకూడదు. ఆ మరో పయత్నం ప్రణాళికాబద్ధం కావాలి. అంతేకానీ 'ప్రయత్నిస్తాం' అని సమాధానం చెప్పినంత మాత్రాన ప్రయత్నించి తీరతాం అన్న స్పష్ట సమాధానం కావటం లేదు. పైగా అది మనలోని అలసత్వాన్ని శబ్దిస్తుంది... అనాసక్తతను వ్యక్తపరుస్తుంటుంది. పైపై మాట అని ఖచ్చితంగా తెలుస్తుంటుంది. ఒక విధంగా ఆ సమాధానం అయిష్ట ప్రకటన.. ఇంకొక విధంగా బాధ్యతారాహిత్యం.. మరొకవిధంగా చెప్పక చెప్పిన సారీ.

ఇలా అయితే మనం క్షమించమని అడగకపోయినా కాలం మాత్రం మనల్ని క్షమించమని అడగకపోయినా కాలం మాత్రం మనల్ని క్షమించదు.

స్కూల్ గోయింగ్ వయసులో- పాఠశాల చదువులలో- సక్సెస్ సాధించటం అంటే హార్డ్ వర్కింగ్ అనే... ఎంతలా కష్టపడితే అంతలా మార్కులు వస్తాయనే. కానీ ప్రొఫెషనల్ కోర్సెస్‌లో జాయిన్ అయ్యే వయసులో సక్సెస్ పరంగా మనలో సీరియస్‌నెస్ నెలకొనాలి. 'సక్సెస్ ఈజ్ ఎ చాయిస్' కదా అని ఎంపిక చేసుకుంటే సరిపోదు. ఆ చాయిస్‌కు టైమ్ మేనేజ్‌మెంట్, టాస్క్ టేకింగ్, స్టడీయింగ్, నోట్ టేకింగ్, రీడింగ్, రైటింగ్, విజనింగ్ అనే అంశాల సప్త సోపానాలు కావాలి. ప్రొఫెషనల్ కోర్స్ కంప్లీట్ చేసి ప్రొఫెషనల్ లైఫ్‌నుప్రారంభించాలంటే ముందుగా మన చేతికి డిగ్రీ రావాలి.. మంచి గ్రేడ్స్‌తో ఉన్నత విద్యావంతులం కావాలి. ఈ దిశలో మన ప్రయత్నాలు టైమ్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీలతో జరగాలి

వినగలిగితే విజేతలం మనమే

విద్యార్థి జీవితంలో వినటం మన తొలి ప్రయత్నం కావాలి.. చక్కగా వినగలిగితే అబ్జర్వేషన్ పెరుగుతుంది.. కాన్‌సెన్‌ట్రేషన్ కుదురుతుంది. అసలు అకడమిక్ సక్సెస్ పరంగా ఓం ప్రథమంగా కావలసిది ఈ విజనింగ్ స్కిల్. లెక్చరర్ సీరియస్‌గా లెక్చరర్ ఇస్తుంటే మనం బహుముఖీనం అయితే ఎలా? మైండ్‌ను ఎక్కడో పారేసుకుంటే ఎలా? లెక్చరర్‌లోని సీరియస్‌నెస్ మనలో లేకపోతే ఎలా?

ఇలా దిక్కులు చూడకుండా క్లాస్‌లో అటెన్షన్‌లో ఉండాలంటే క్లాస్‌కు వస్తున్నపుడే ఆనాడు వినబోయే లెక్చర్‌కు సంబంధించిన చాప్టర్‌ను చూసిరావటం- చదివిరావటం- ఎంతో మేలు చేస్తుంది. లేదా క్లాస్ అయిన రోజే- ఆ రాత్రే- ఆ అధ్యాయాన్ని చదవటం వల్ల పారిభాషిక పదాలు మనసులో నిలుస్తాయి. ఆ అధ్యాయంపై అవగాహన కలుగుతుంది. అలాగే క్లాస్‌లో తీసుకున్న నోట్స్‌ను చూసుకోవటంవల్ల తరువాతి రోజు క్లాస్‌కి మెంటల్‌గా సిద్ధమవుతాం. ఈ స్ట్రాటజీతో ఏ ఒక్క క్లాస్ మిస్ కాకూడదు. ఒక రోజు మిస్ అయినా మరునాటి క్లాస్ కన్‌ఫ్యూజింగ్‌గా ఉంటుంది. వీలయినంతవరకు మిస్ అయిన క్లాస్‌లో జరిగిన సబ్జెక్ట్‌ను ముందుగానే చూసుకుని క్లాస్‌కి వెళ్లగలిగితే కంటిన్యుయేషన్ సాధ్యమవుతుంది. క్లాస్‌లో లెక్చరర్‌పై దృష్టి పెట్టి, సబ్జెక్ట్‌పై కాన్‌సెన్‌ట్రేట్ చేయగలుగుతాం.

కహానీ

చూపుడు వేలు

'ఛీ.. ఛీ... ఈ దేశంలో ఎవరికీ సివిక్ సెన్స్ లేదు. కామన్‌సెన్స్ అస్సలు లేదు' అంటూ తిట్టుకుంటూనే మిత్రుడు సురేష్ ఇంట్లోకి వచ్చాడు రమేష్. మిత్రులు ఇద్దరూ సామాజిక చర్చల్లో మునిగిపోయారు. ఇద్దరి అభిప్రాయాలు ఒకటిగానే ఉన్నాయి. 'ఈ దేశానికి ప్రజాస్వామ్యం పనికి రాదు. మిలటరీ పాలన వస్తేగానీ జనం దారికి రారు. పిట్టల్ని కాల్చినట్టు కాల్చేయాలి. రాజకీయ నేతలంతా దొంగలు. జనం పరమ బద్ధకస్తులు. ఇలాంటి దేశం ఎప్పుడు బాగుపడుతుందో. ఈ దేశాన్ని పూర్తిగా మార్చేయాలి' ఇవీ వారి చర్చల్లో దొర్లిన కొన్ని అంశాలు. 'ఏంట్రా రమేష్ ఎప్పుడూ లేనంత ఆవేశంగా ఉన్నావ్. ఏమైందేమిటి?' అంటూ అప్పటి వరకూ వారి మాటలు వింటూ పత్రిక చదువుతున్న సురేష్ అన్న సందీప్ ముందుకొచ్చాడు. 'ఏ పనీ సమయానికి చేయరు. ఒక్కరూ మాట మీద నిలబడరు. చట్టాన్ని గౌరవించరు. నిబంధనలు పాటించరు' అంటూ రమేష్ తన అసహనం వ్యక్తం చేశాడు.

'నీకో జోక్ చెప్పనా' అంటూ సందీప్ అక్కడి వాతావరణాన్ని తేలిక పరచడానికి

న్నట్టు సరదాగా అడిగాడు. సమాధానం కోసం ఎదురు చూడకుండానే జోక్ చెప్పాడు. ఒక యువకుడు డాక్టర్ వద్దకెళ్లి తనకు విచిత్రమైన జబ్బు ఉందని చెప్పాడు. 'శరీరమంతా ఎక్కడ ముట్టుకున్నా నొప్పి వేస్తుంది. కానీ శరీరంలో ఎక్కడా ఏమీ కనిపించడం లేదు. నొప్పి భరించలేకపోతున్నా' అని డాక్టర్‌ను కలిశాడు. నొప్పి ఎక్కడని డాక్టర్ అడిగితే, ఎక్కడ ముట్టుకున్నా నొప్పి అంటూ ముఖాన్ని చూపుడు వేలితో ముట్టుకున్నాడు. అబ్బో నొప్పి అని మెలికలు తిరిగిపోయాడు. కాళ్ల మీద, చెంపల మీద, వీపుమీద అన్నిచోట్లా ముట్టుకుంటూ.. నొప్పి నొప్పి అని అరుస్తున్నాడు. డాక్టర్ అతన్నే పరీక్షగా చూసి నవ్వాడు. నొప్పితో బాధపడుతున్న తనను డాక్టర్ చూసి నవ్వడంతో అతనికి మండుకొచ్చింది. 'బాబూ నీ శరీరానికి వచ్చిన సమస్యేమీ లేదు. శరీరంలో నొప్పి లేదు. రోగం లేదు. నీ ఆలోచనలోనే తేడా ఉంది' అని చెబుతూ అతని చూపుడు వేలిని పట్టుకుని చూశాడు. ఇదిగో సమస్య ఇక్కడుంది. నీ చూపుడు వేలికి గాయమైంది.

గాయంతో ఉన్న వేలితో శరీరంలో ఎక్కడ ముట్టుకున్నా నొప్పి లేస్తోంది. అది శరీరం సమస్య కాదు, నీ చూపుడు వేలి నొప్పి' అని డాక్టర్ చెబితే అతనికి అప్పుడు గుర్తుకొచ్చింది. పెన్సిల్ చెక్కుతుంటే చూపుడు వేలికి గాయమైందని. అరే వేలికి గాయమైతే మొత్తం శరీరాన్ని అనుమానించాను అనుకున్నాడు' అని సందీప్ ముగించాడు. రమేష్‌కు విషయం అర్థమై ఆలోచనలో పడ్డాడు. తరువాత సిగ్గుపడ్డాడు. దేశాన్ని మార్చడం కాదు మారాల్సింది ముందు తానే అని మనసులోనే అనుకుని మౌనంగా ఉండిపోయాడు.

-మురళి

విచిత్రాలు... నివాస్

బ్రాండ్.. రాహుల్!

విజయాన్ని చేకూర్చగల బలమైన ఆయుధాన్ని కడవరకూ దాచి పెట్టడమనేది -యుద్ధనీతి. 2014 రాజకీయ ఎన్నికల యుద్ధానికి కాంగ్రెస్ సిద్ధం చేసుకుంటున్న కడపటి ఆయుధమే -రాహుల్. రాబిన్ హుడ్ తరహాలో -రాజకీయ తెరపై హీరోయిజాన్ని ప్రదర్శించగలడన్న నమ్మకాన్ని కాంగ్రెస్ పెట్టుకుంది. 120కోట్ల భారత దేశ జనాభాలో 66శాతంగా ఉన్న యువకులను తనవైపు తిప్పుకోగల సమ్మోహనాయుధంగా భావిస్తోంది. రానురానంటూనే పార్టీ ఉపాధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించి భవిష్యత్ ప్రధాని పీఠాన్ని అధిరోహించేందుకు వ్యూహాత్మక అడుగులేస్తున్నాడు రాహుల్. 'దేశం అన్నివిధాలా భ్రష్టుపట్టిపోతోంది. ముప్పునుంచి భారత్‌ను తప్పించి, దేశాన్ని ఉద్ధరించాలంటే వేడి వాడి ఉన్న యువరక్తం కావాలి' లాంటి నినాదాలు పార్టీలూ, వ్యక్తులూ వినిపించినపుడు బావుంటాయి. కానీ, జరుగుతున్న పరిణామాలను చూసి రక్తం మరిగిపోతోన్న యువశక్తి ఈ నినాదాన్ని నమ్ముతుందా? నమ్మి నాయకుడి వెనకాల నడుస్తుందా? నాయకత్వ బరువు బాధ్యతలను సుకుమార రాకుమారుడు సమర్థంగా నెరవేరుస్తాడా? పాలనా వైఫల్యాలకు విసిగిపోయి, పెరిగిపోతున్న అవినీతిపై మండిపడుతూ -కసితో కోపంతో ఉద్రేకంతో ప్రతి చిన్న ఆందోళనా పిలుపునకూ రోడ్డెక్కుతున్న యువశక్తిని అనుకూలంగా మార్చుకోవడం చాతనవుతుందా? 2014 ఎన్నికల నాటికి విడుదవబోయే 'పొలిటికల్ హీరో' సినిమాలో రాహుల్ క్యారెక్టర్ ఎంత బలంగా ఉండబోతోందో? అన్న దానిపై ఇప్పుడు దేశంలో చాలా చర్చే జరుగుతోంది. రాహుల్' హుడ్‌ను -యువతరం హిట్టుచేస్తారో, ఫట్‌చేస్తారో వేచి చూద్దాం.

ఏ'సెన్స్

మేని వయ్యారాలను ఆరబెడుతూ సుందరాంగులు మహారాష్ట్రలోని గన్పాటిపూలె బీచ్‌లో కనువిందు చేశారు. భారతీయ సంతతికి చెందిన ప్రపంచ నలుమూలల్లో ఉన్న సుందరాంగులు 'ఇండియన్ ప్రిన్సెస్ ఇంటర్నేషనల్ 2013' కిరీటం కోసం పోటీ పడినప్పటి చిత్రమిది.

అందం.. హిందోళం!

అంతర్జాతీయ రంగస్థల నటుడు, దర్శకుడు గుమ్మడి గోపాలకృష్ణ నేతృత్వంలో 'యోగి వేమన' టీవీ సీరియల్ ప్రారంభమైంది. మానవతా దృక్పథాన్ని సమకాలీన సమాజానికి అందించాలనే ఉద్దేశ్యంతో ఈ సీరియల్‌ను తాము నిర్మిస్తున్నామని దర్శక నిర్మాత గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. సారధి స్టూడియోలో ముహూర్తపు సన్నివేశానికి కె.వి.రమణ క్లాప్ కొట్టగా, జి.బలరామయ్య కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశంలో నటుడు మురళీమోహన్ నటించారు. 26 భాగాలుగా రంగస్థల పద్యశైలితో తొలిసారిగా ఈ సీరియల్ నిర్మిస్తున్నామని గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. తెలుగు గొప్పదనాన్ని అందరూ తెలుసుకునేలా ఈ సీరియల్‌ను గోపాలకృష్ణ నిర్మిస్తున్నారని, ప్రేక్షకులకు తప్పక నచ్చుతుందని మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో రాళ్ళబండి కవితాప్రసాద్, ఆచార్య గోపి, బుర్రా సుబ్రమణ్యశాస్త్రి, సుద్దాల అశోక్ తేజ, సంగీత దర్శకుడు యశోకృష్ణ, కోట శంకర్‌రావు, శివపార్వతి, మల్లాది భాస్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సీరియల్‌కు మాటలు, కథ:డి.విజయభాస్కర్, సంగీతం:యశోకృష్ణ, నిర్మాత, దర్శకత్వం: గుమ్మడి గోపాలకృష్ణ.

ఈ ఏడో... పై ఏడో..

సాధారణంగా ఆర్టిస్టుల్ని మీ పెళ్లెప్పుడు? అని అడిగితే ''అబ్బె! అప్పుడేనా? ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే!'' అనే రొటీన్ డైలాగ్స్ చెప్తూ వుంటారు. కానీ టివి నటి సర్‌గున్ మెహతా (క్యాహువా తేరా వాదా, నాచ్ బలీయె ద్వారా విస్తృత ఖ్యాతి పొందిన నటి) మాత్రం ఇందుకు విరుద్ధం. ''మా తల్లిదండ్రులు ఆ పనిమీదే వున్నారు. అన్ని కుదిరితే బహుశా, ఈ సంవత్సరంలోనో, తప్పితే వచ్చే సంవత్సరంలోనో పెళ్లి జరుగుతుంది'' అని స్ట్రెయిట్‌గా చెప్పేసింది సర్‌గున్. అందుకు ముక్తాయింపుగా నాకు వివాహ వ్యవస్థ మీద ఎనలేని నమ్మకం ఉంది అంటూ ఓ స్మాల్ స్కేల్ సందేశం కూడా ఇచ్చేసింది సర్‌గున్.

హాస్యానికి మెచ్చుతునక 'గంగతో రాంబాబు'

ఈ మధ్య సినిమాల్లో కానీ, టీవీల్లో కానీ హాస్యరస సన్నివేశాలు చూడాలంటే ఓ మాదిరి భయమేస్తోంది. దానికి కారణం అందులో ఉండడానికి హాస్యం- అదే నవ్వు తెప్పించే సరుకు వున్నా - సదరు సరుకు సంస్కారయుతంగా ఆస్వాదించతగ్గ సావకాశం లేకుండా వుంది. అందుకు భిన్నంగా ఫిబ్రవరి 11 నుంచి వస్తున్న 'గంగతో రాంబాబు' (జీ తెలుగులో రాత్రి 10.30కి వస్తున్నది) రావడం స్వాగతించతగ్గ అంశం. అసలు సంపూర్ణ హాస్యరస ధారావాహికలను రూపొందించడం కత్తిమీదసాములాంటిది. ఎందుకంటే కామెడీ ఎక్కువైతే వెగటు పుట్టిస్తుంది. తక్కువైతే ఇచ్చిన పేరు (సంపూర్ణ హాస్య...)కు న్యాయం జరగదు. ఈ విషయాన్ని రూపకర్తలు దృష్టిలో పెట్టుకుని వీటిని తెరకెక్కించాల్సి వుంటుంది. ఈ ప్రక్రియలో దాదాపు 'గంగతో రాంబాబు' టీమ్ కృతకృత్యమయ్యింది.

మనుషుల్లో చిన్నపాటి మేధకత్వమో మరొకటో సృష్టించే హాస్యం బాపతు లాంటిది అప్పటి 'పర మానందయ్య శిష్యుల కథ' నాటినుంచి మనం చూస్తూన్నదే. ఆ ఒరవడికి విస్తృతం లేదా కొంత వైవిధ్యం కల్పించిన వరసలో నడిచే హాస్యమే జనావళిని ఆకర్షిస్తోంది ఎక్కువగా. ఇందులోనూ కాస్త అటూ ఇటూగా ఆధునిక సమకాలీన సంగతుల్ని ఆవహింపచేసుకుని ఇందులో సభ్యతాయుతంగా చూపిస్తున్నారు. టివి పాత్రలు కోసం కసరత్తు చేసే రాంబాబు, అతని ఇంట్లో వుండే వ్యక్తుల ధోరణులు తదితరాలతో తొలి భాగం (ఫిబ్రవరి 11న చూపినది) చూపారు. ఒకో పాత్ర ఒకో ధోరణి (ఆ పద్ధతీ సహజత్వానికి కొద్దిగా దూరంగా వుంటుంది)లో ప్రవర్తించడం తద్వారా ఉత్పన్నమయ్యే హాస్యం ఇందులో కేంద్ర బిందువు. రాంబాబు భార్య గంగ, స్వల్పకాలంలో అధిక వడ్డీ వస్తుందనే దృక్పథంతో ఇంట్లో వున్న డబ్బుని మరొకళ్లకి అప్పు ఇస్తుంది. వాస్తవానికి ఆ డబ్బు రెండు నెలలుగా బాకీ వున్న ఇంటి అద్దె కోసం కేటాయించింది. ఓ పక్క ఇస్తానన్న వ్యక్తి తిరిగి వడ్డీ కానీ, అసలు కానీ చెల్లించకపోవడంతో పడే ఇబ్బందులూ, ఇంటి యజమానురాలిని తప్పించుకోవడానికి చేసే రకరకాల విన్యాసాలూ ఈ భాగంలో రక్తికట్టించాయి. సరే... విషయం ఎలా ఉన్నా వాటిని పోషించిన నటీనటుల చక్కటి టైమింగ్ పాత్రల ఉన్నతికి తోడ్పడింది. గంగకిచ్చిన వచ్చీరాని ఇంగ్లీషు బాగా ఆకట్టుకుంది. అదే సమయంలో ఆ పాత్రకిచ్చిన శ్రీకాకుళం మాండలికం సరిగా కుదరలేదు. అయితే ఆ రోల్ తమ్ముడు (సత్తిపండు) మాట్లాడిన అదే మాండలికం సరిగ్గా సరిపోయింది. గంగ పాత్రకు కుదరకపోడానికి కారణం శ్రీకాకుళం యాస-ఇంగ్లీషు ఒకదాని తర్వాత ఒకటి రావడంవల్ల సరిగ్గా మిళితం అవకపోవడం అనుకుంటా! ఇక ప్రముఖ న్యాయవాది పేరుకు పేరడీగా రామ్ పితానీ అన్న పాత్ర ప్రవేశపెట్టి చేసిన బిట్సూ సహజంగా ఉన్నాయి. అతని భార్య పాత్ర (బి.టి.సుందరి) ద్వారా కురిపించిన చమక్కులూ ఆహ్లాదపరిచాయి. రాంబాబు సోదరి పాత్ర పోషించిన నటి రేడియో జాకీల మాటల పోకడను ముమ్మూర్తులా దింపేశారు.

కానీ ఇంటి యజమానురాలు ఫోన్ చేస్తే, ఆ ఫోనును అందుకున్న ఈ రేడియో జాకీ తన సహజ ధోరణిలో 'మీకే పాట కావాలి...?' అంటూ చివరలో వచ్చిన మాటకు అనుసంధానంగా 'ఓహో! మీకు 'జగన్నాటకం' చిత్రంలో పాట కావాలా? అంటూ అసలు మాటలను తప్పించి కొసరు మాటలతో నింపేసే పద్ధతి బావున్నా ఇలాంటి తరహా జోకులు చాలా రూపాల్లో గతంలోనే చూసేసిన కారణంగా కొత్తదనం అనిపించలేదు. ఇక ఇంటి యజమానురాలు పాత్రలో అల్లరి సుభాషిణి తన సహజ ధోరణిలో నటించేశారు. ఎపిసోడ్ చివరల్లో, ఇంట్లో అందరూ వున్నా ఇంటి ఓనర్ నుంచి తప్పించుకోవాలన్న ఆత్రంతో బయటి నుంచి తాళం వేసి లోపలే వుండి దోబూచులాడే సన్నివేశం రక్తికట్టింది. చివర్లో పోస్ట్‌మెన్ పాత్రను ఎం.వో వచ్చిందంటూ రప్పించడం ఓ చిన్న కొసమెరుపు. ఇక దానికి సత్తిపండు తెచ్చిన డబ్బును ఇంటి అద్దె బాకీగా చెల్లు చేసేసిన గంగ బృందం-తన డబ్బు పోయిందంటూ పోయిన వంద రూపాయల నోట్లు నెంబర్లతో సైతం పోలీసులకు ఫిర్యాదు చేయడం ద్వారా వచ్చిన హాస్యం పరాకాష్టగా నిలిచింది. అలా ఫిర్యాదు అందుకున్న నోట్ల నెంబర్ల ఆసరాతో అవే నోట్లు అందుకున్న వారి ఇంటి ఓనర్‌ను అదుపులోకి తీసుకోవడం ద్వారా ఏర్పడిన హాస్యం ఇంకాస్త పొడిగింపు. అయితే ఇవన్నీ కాస్త 'అతి'గా అనిపించే హాస్యమైనా ఎలాంటి ఇబ్బందినీ కలిగించని కామెడీ. ఇలాంటి అసౌకర్యవంతం కాని హాస్యాన్నే మిగతా ఎపిసోడ్ల లోనూ 'గంగతో రాంబాబు' పండిస్తాడేమో చూద్దాం.

-అన్వేషి

మధుర గీతాలను మైలపరచకండి!

గత పది రోజులుగా దూరదర్శన్‌లో ఓ చానల్లో ఏదో అవార్డు ఎంపిక సన్నాహం ప్రకటిస్తూ కొన్ని చిత్రాలలోని పాటల బిట్స్ చూపిస్తూ ''ఈ పాటను ఫలానా గాయకులు ఫలానా చిత్రంలో ఆలపించారు. మీరు చేయవలసిందల్లా ఫలానా చిత్రంలో ఫలానా పాట నచ్చిందని, ఫలానా నెంబరుకు ఎస్ఎమ్ఎస్ చేయండని యాంకర్లు హోయలుపోయారు. కొద్ది ఆ క్షణాలు దేశంలో బట్టల కరువు వచ్చినట్లు నాయికలు పేలికల వస్త్రాలతో, నాయకునితో స్క్రిన్ షో చేస్తూ కుప్పిగంతులు వేస్తుంటే, వారి వెనుక పని పాట లేనట్లు నలభై వేలమంది వచ్చి పిచ్చిగెంతులు వేస్తూ... నాభి, పిరుదులు, ఎద పొంగుల ఎగ్జిబిషన్ పెట్టినట్లు వెండితెరను శృంగార తెరగా మార్చివేశారు. ఆ బిట్స్ గీతాలను చూస్తూ వింటుంటే... యివి పాటలా.. యివి గాయకుల స్వరాలా 'ధూ' అనిపించింది. ఆ గీతాలను కొన్ని సెకన్లు చూట్టానికే మనసు అంగీకరించలేదు. వినకంపు (సొంపు కాదు) కొడుతున్నాయి. వాటిని యూత్ - అభిమానులు ఎలా వింటున్నారో? అలాంటి గీతాలు నచ్చాయని ఎలా ఎస్ఎమ్ఎస్ చేస్తున్నారో అర్థం కాలేదు. వారి టేస్ట్ చూసి యువత యిలా దిగజారిపోయిందని ఆవేదన కలుగుతుంది. చెత్త గీతాల చిత్రాలకు ఆడియో ఫంక్షన్లు... లక్షల ఆడియో సిడిలు అమ్మకం... ఎంత ఆత్మవంచన. నేటి హీరోల పాటలకన్నా గతంలోని హాస్య నటుల పాటలు వేయి రెట్లు మిన్న అని చెప్పవచ్చు. సన్నివేశానికి తగ్గట్లు, పాట భావం (రచన) ఆలపించిన స్వరాలు.. ఆహా.. హీరో హీరోయిన్ల పాటల స్థాయికి తగ్గకుండా వుండేవి. అలాంటివి మధుర గీతాలుగా మిగిలిపోయావని చెప్పవచ్చు. ''ఇల్లరికంలో వున్న మజా... అది అనుభవించితే తెలియునే భలే ఛాన్సులే'' (రేలంగి), అయ్యయ్యో.. చేతిలో డబ్బులు పోయెనే.. జేబులు ఖాళీ ఆయెనే' (రమణారెడ్డి అండ్ కో), 'మామా చంద మామా వినరావా నా కథ... వింటే మనసు వుంటే కలిసేవు నా జత' (చలం); 'పొరుగింటి మీనాక్షమ్మను చూశారా వాళ్ల ఆయన చేసే ముద్దు మురిపెం విన్నారా' (పద్మనాభం - గీతాంజలి); 'అరె చాల్లె పోవాయ్ బుంగమూతి నువ్వా నాకు సరిజోడి' (చంద్రమోహన్ - వెన్నిరాడై నిర్మల); 'ఒహొహొ మామయ్య.. ఇదేమయ్యా.. బలె బలె బాగుందయ్యా'; 'ఇంగ్లీషులోన మ్యారేజ్.. హిందీలో అర్థం షాది' (పద్మనాభం - గిరిజ), 'చెక్కిలిమీద చేయి వేసి చిన్నవాడా' (రేలంగి - రాజసులోచన); 'సరదాసరదా సిగరెట్టు ఇది దొరల్ తాగు బలే సిగరెట్టు' (రేలంగి); సుందరి ఒహోహో సుందరి' (రేలంగి), 'ముత్యాలు వస్తావా అడిగింది యిస్తావా' (అల్లు రామలింగయ్య) యిలా కొన్ని వందల హాస్యనటుల హిట్ సాంగ్స్ నేటికి ప్రేక్షకులు మరచిపోలేదు. ఆ స్థాయిక్కూడా నేటి హీరోహీరోయిన్ల పాటలు పనికిరావు. నచ్చిన పాట.. ఎస్ఎమ్ఎస్ అంటే యూత్‌పై జాలివేస్తుంది. అదేవిధంగా చానెళ్లలో 'నాయక్' అంటూ హీరోగెంతులు అంటే స్టెప్ డాన్సులు.. హీరోయిన్ వొంపుసొంపులు చూపిస్తూ పాటల బిట్స్ చూపిస్తున్నారు. ఒక్క పదం అర్థం కావడంలేదు, ఏం పాడుతున్నారో అది సంస్కృతమో... తెలుగో ఎవరికి అంతుపట్టలేదు. అభిమానులు ఎలా వాటిని రిసీవ్ చేసుకుంటున్నారో.. భరిస్తున్నారో? పాపం హాస్యనటీనటులకైనా స్వర్ణయుగకర్తలు ఘంటసాల - సుశీల - ఎస్.పి.లీల- అలా ఎందరో విరితేనియల స్వరాలతో ఆలపించి, వాటికి జీవం పోశారు. అందుకే అవి సైతం మధుర గీతాలుగా మిగిలిపోయాయి. తెలుగు చిత్ర రంగ రికార్డులను తిరుగవ్రాసిందని డబ్బా కొట్టుకుంటున్న చిత్రాలలోని ఏ పాటకుగాని జీవనముందా? కనీసం అభిమానులైన గుర్తుచేసుకుంటున్నారా? సినీ రంగ వ్యక్తులే ఆలోచించాలి. నిజం చెప్పాలంటే ఆయా చిత్రం ఆడినన్ని రోజులే ఆ పాటలకు అభిమానుల ఆదరణ, ఆ పిదప మరో చెత్త గీత ఆదరణ, అది నేటి గీతాల అసలు రహస్యం. అలాంటివాటికి ఎస్.ఎమ్.ఎస్‌లు. ప్రేక్షకులందరి తరఫున ప్రతినిధిగా (నిజంగా ప్రతినిధి కాదనుకోండి) ఒక్క మాట చెప్పాలంటే ఈ 20 సంవత్సరాల పాటలన్ని కలిపి తూకం వేసినా 'మనసు గతి యింతే... మనిషి బ్రతుకింతే... మనసున్న మనిషికి సుఖములేదంతే''; 'పుణ్యభూమి నా దేశం నమో నమామి' పాటల మొదటి చరణాన్ని తాకేందుక్కూడా అర్హతలేనివని చెప్పవచ్చు. ఈ 20 సంవత్సరాలలో గుడ్డిలో మెల్లగా 10 పాటలు కాస్త వినతగ్గవి వుండవచ్చుననుకోవచ్చు. ఎన్‌టిఆర్ యుగపురుషుడంటూ ఏదో చానెల్లో ఓ కార్యక్రమం చూపించారు. ఎన్‌టిఆర్ పాటలను వినిపిస్తూ కొందరు ఎన్‌టిఆర్‌ను అనుకరిస్తూ నటించి మనసును కాస్త తేలిక పరచి, కీ.శే.ఎన్‌టిఆర్‌ను గుర్తుచేశారు. సంతోషం. ఆ కమ్మని పాటలకు వీరి డూప్ నటనకు సరిపోయింది. ప్రేక్షకులు తనివితీరా నవ్వుకున్నారు. ఆనందం పొందారు. కాని, ఆ పిదప ఆ ఛానల్ వారు తప్పు చేశారు. అలనాటి ఎన్‌టిఆర్ పాటలను నేటి గాయకులతో అలకింపచేసి సంతోషాన్ని సమాధి చేశారు. అంతవరకు ఉన్న ఉత్సాహం నేటి గాయకులతో ఆ పాటలను పాడించి ఆనందాన్ని ఆవిరి చేశారు. సంగీత స్వర్ణయుగ కారకులు- అపర గంధర్వ గాత్రాలతో ఘంటసాల... సుశీల.. ఎస్.పి.పాడిన పాటలను నేటి గాత్రాలతో వినగలమా చెప్పండి. వారి స్వరాలలో మకరందం వుంది. మత్తు వుంది. కిక్కు వుంది. వారి పాటలను వింటుంటే మనసు ఎటో వెళ్లిపోతుంది. సుశీల పాటలకు హాయిగా నిదుర వస్తుంది. వారి పాటలలో అమృతం కురుస్తుంది. పరిమళం సోకుతుంది. ప్రాణం లేచి వస్తుంది. ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు. అది గాత్రమంటే. అలాంటి గాత్రాలు ఆలపించిన పాటలను నేటి గాయకులు ఆలపిస్తే వినగలమా చెప్పండి? వీరు పాట ఎప్పుడెప్పుడు ఆపుతారా అనిపించింది. అలనాటి స్వరాలు తేనియలమయం, నేటి స్వరాలు కలర్ సోడా మయం. చందమామను చూసిన హాయి జీరో బల్బ్‌ను చూస్తే వస్తుందా చెప్పండి? కోకిలారావం విని కందిరీగ శబ్దం వినగలమా ఆలోచించండి. అమృతం త్రాగిన గొంతుతో కషాయం త్రాగగలమా చెప్పండి. దయచేసి ఏ చానెల్ వారుగాని అలనాటి మధుర గీతాలను నేటి గాయకులతో పాడించి, ఆ మాధుర్యం చెడగొట్టకండి, ఆ గీతాలను అవమానపరచకండి. వాటిని కలకాలం మధురగీతాలుగా వుండిపోనివ్వండి. వాటికి మైల అంటనివ్వండి. ఎందుకంటె ఆ స్వర్ణయుగం ప్రేక్షకుల మదిలో మందిరంలా నిలిచిపోయింది. కేకలువేస్తూ.. పిచ్చి అరుపులతో అర్థం పర్థంలేని పదాలతో ఒక్క పదం అర్థం కాకుండా చీప్ పాటలు పాడే గాత్రాలతో మధుర గీతాలను పాడించకండి. వాటి అందం జీవం మాధుర్యం తరగిపోతుంది.

-మురహరి ఆనందరావు

పెళ్లితో పరిపూర్ణ పురుషుణ్ణి!

సాధారణంగా వివాహంతో వనిత జీవితం పరిపూర్ణమవుతుంది. అలా స్త్రీలకే నేంటి? మగవాళ్లకూ అది చెందుతుంది అంటున్నారు టి.వి. నటుడు విలిన్ దేస్సా. 'ప్యార్ కే ఏక్ కహానీ'తో ప్రేక్షక కోటికి సుపరిచితుడైన విలిన్‌కిటీ వల వహ్‌బాజ్ మిస్త్రీతో పరిణయమైంది. మిస్త్రీ కూడా నటే! ''దాంతో ఆర్టిస్టుల సమయ సమయాల సంగతి, ఒత్తిడుల విషయం అంతా ఆమెకు తెలుసు. అనుగుణంగా నాకు చక్కగా సహకరిస్తోంది. ఆ రకంగా భగవంతుడు నాకు బాగా సహాయం చేశాడు. ఏ మాత్రం టైమ్ చిక్కినా ఇంట్లో వుండడానికే ఎక్కువ ఇష్టపడతా! ఒక రకంగా చెప్పాలంటే, నాకు కలిగిన లక్కీ, వచ్చిన విఖ్యాతికీ కారణం నా భార్యే. అందుకే నేననుకుంటా.. వివాహం అనంతరం నేను పరిపూర్ణ పురుషుణ్ణయ్యా.

మరపురాని రోజు!

ఇటీవల వచ్చి వెళ్లిపోయిన యువతీ యువకుల మరపురాని దినం 'ప్రేమికుల రోజు' (ఫిబ్రవరి 14)న మేం ఇలా ఉన్నాం, అలా ఉన్నాం అన్న కబుర్లు విన్నాం. అయితే పేరొందిన టెలివిజన్ జంటగా అందరికీ తెలిసిన కరణ్‌సింగ్ గ్రోవర్, జెన్నిఫర్ వింగిట్‌లకు మాత్రం కలిసి వుండడానికి సమయం చిక్కలేదు. ఎందుకంటే ఎవరి కెరీర్స్‌లో వారు ఆ రోజు ఊపిరి సలపని బిజీగా వుండడమే. కరణ్ 'ఖబూల్‌హై' ధారావాహికలో వచ్చే ఆసక్తికర మలుపుల షూటింగ్‌లో నిమగ్నమైపోయారు. అదే సయమంలో జెన్నిఫర్, సుప్రసిద్ధ సినీ దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ చిన్నతెర కోసం రూపొందిస్తున్న 'సరస్వతీ చంద్ర' చిత్రీకరణలో తలమునకలైపోయారు. ఇక టైమెక్కడ? వారు కలిసి ముచ్చట్లు పంచుకోడానికి? ఈ సంగతి ప్రస్తావిస్తూ నేను షూటింగ్ కోసం బయటికెళ్తే ఇంటికెప్పుడు వస్తానో తెలియదు, నేనొచ్చే సమయానికి జెన్నిఫర్ గాఢనిద్రలో ఉంటుంది. తిరిగి నేను నిద్రలేచే సమయానికి జెన్నిఫర్ తన టెలివిజన్ కార్యక్రమం షూటింగ్ నిమిత్తం వెళ్లిపోతుంది. ఇదీ తీరు. అయినా మనం చేస్తున్న పనిని ఎంతగా ప్రేమిస్తే అంతగా మన ప్రేమా వర్ధిల్లుతుంది. మరి ఇదే కాన్సెప్టుని కరణ్ - జెన్నిఫర్ విశ్వసిస్తున్నారనుకుంటా!



ఈ వారం చాలు...

'ప్రేమికుల దినం' అనగానే అప్రయత్నంగా ప్రేమ జంటల్లో వచ్చే పరవశత్వం గుర్తుకొస్తుంది. ఆ పరవశత్వానికి వారిరువురూ ఇచ్చిపుచ్చుకునే బహుమతులు ఇంకాస్త కిక్కెక్కిస్తాయి. ఆ మోడల్ కిక్ బాపతు కబుర్లని పాప్యులర్ టివి జంట (నందీష్ సంధు - రాష్మీ దేశాయ్) ఒకరైన నందీష్ చెప్పుకొస్తున్నారు. ఈ ప్రేమికుల దినానికి వారిరువురూ ఒకటై ఏడాది గడిచింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నందీష్ ఓ పెద్ద పార్టీ ఇచ్చారు. అది మామూలే. ఆ సందర్భంగా వారిరువురూ ఒకరికి ఒకరు గిఫ్ట్‌లిచ్చుకోవడమూ మామూలే. మరి మామూలు కానిదేమిటి? ఉంది. ఎవరు ఎంతగా ఎదిగి ఎన్ని రంగాలలో ఎనలేని పేరు తెచ్చుకున్నా, వాళ్ళ వాళ్ళ చిన్ననాటి ముచ్చట్లూ తదితరాలను ఎవరు మర్చిపోరు. పరిమితంగా దాచుకుంటారు. అలా దాచుకోతగ్గ అంశాన్ని నందీష్ - రాష్మీకి తనకీ చెందిన చిన్ననాటి ముచ్చట్లన్నీ వీడియో తీసి రాష్మీకి కానుకగా ఇచ్చారు. అది చూసి- రాష్మీ వెలకట్టలేని ఆనందం పొందింది. ఈ సందర్భంగా మీకొచ్చిన బహుమతుల్లో మర్చిపోలేనిది? ఏమిటి అని అడిగితే 'ఈ వీడియో చూడగానే రాష్మీ హృదయపూర్తిగా కురిపించిన నవ్వే నన్ను కదిలించివేసిన గిఫ్ట్...' అని ఆపుకోలేని ఉత్సాహంతో నందీష్ సంధు చెప్పారు.

అమ్మాయిలకు

★ తలస్నానం చేశాక శిరోజాలను సహజమైన గాలిలోనే ఆరబెట్టాలి. డ్రయర్స్‌ను వాడకపోవడమే మంచిది.

★ తలపై జుట్టు నిగనిగలాడాలంటే వారానికోసారైనా గోరువెచ్చని కొబ్బరి నూనెతో బాగా మర్దనా చేయాలి.

★ తడి జుట్టును దువ్వడం మంచిది కాదు. పూర్తిగా తడి ఆరిపోయాక పెద్ద పళ్లున్న దువ్వెనను వాడాలి.

★ తడిగా ఉన్న జట్టును ముడి వేయడం కానీ, జడ వేయడం గానీ చేయవద్దు. ఇలా చేస్తే శిరోజాల చివర్లు చిట్లే ప్రమాదం ఉంది.

★ తలపై జిడ్డుదనం పోవాలంటే జుట్టు కుదుళ్లకు పుదీనా ఆకుల ముద్దను బాగా పట్టించి పావుగంట తర్వాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి.

★ అరటి పళ్ల గుజ్జులో కాస్త తేనె కలిపి తలకు రాసుకుంటే జుట్టు పొడిబారడం తగ్గుతుంది.

★ నూనెలు, షాంపూలను తరచూ మార్చడం మంచిది కాదు. ఏది బాగా పనిచేస్తుందనేది కొన్నాళ్లు వాడితే గానీ తెలియదు.

★ రసాయనాలున్న హెయిర్ డైలను నిపుణుల సలహా లేకుండా వాడవద్దు.

★ కోడిగుడ్డు సొనలో కాస్త తేనె కలిపి తలకు బాగా రాసుకుని అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు మిలమిల మెరుస్తుంది.

పెట్టుబడులు హాంఫట్...

మధ్యతరగతే టార్గెట్!

❖ కేవలం లక్ష రూపాయలు మా ఖాతాలో జమ చేసి చూడండి.. నెలకు పది వేల రూపాయల చొప్పున 40 నెలల పాటు తిరిగి చెల్లించి, గడువు తీరాక అసలు మొత్తాన్ని ఒకేసారి మీకు పువ్వులో పెట్టిస్తాం..

❖ నిర్ణీత రుసుము చెల్లించి ఇంటర్నెట్‌లో సులువైన కొన్ని ప్రశ్నలకు జవాబులు ఇస్తే చాలు ఎప్పటికప్పుడు దండిగా లాభాలు- నేరుగా మీ బ్యాంకు ఖాతాలోకే..

❖ తీరుబడిగా కాలక్షేపం చేసే సాధారణ మహిళలైనా ఇంట్లో కూర్చుని వెబ్‌సైట్లలో ప్రకటనలను 'క్లిక్' చేస్తే చాలు.. ప్రతి రోజూ వేలాది రూపాయల ఆదాయం...

❖ నెలవారీ సులభ వాయిదాలు.. అదీ వంద ల్లోనే చెల్లిస్తే చాలు.. మీ పేరిట విలువైన ఇంటి స్థలం అతి తొందరలోనే ఖాయం..

పెట్టుబడిగా పెట్టే అసలుకు రెట్టింపు మొత్తాలు చెల్లిస్తామని, ఉత్తపుణ్యానికే దండిగా వడ్డీలు ఇస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పే సంస్థలు అనునిత్యం ఎంతో మందిని సులభంగా బురిడీ కొట్టిస్తున్నా జనం అదేపనిగా మోసపోతూనే ఉన్నారు. మసిపూసి మాయచేసే ప్రకటనలను ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు, మహిళలు సులువుగా నమ్మేస్తూ నిండా మునిగి పోతున్నారు. అందమైన హామీలతో నిలువు దోపిడీ చేస్తున్న ఘరానా మోసగాళ్ల గురించి మీడియాలో నిత్యం ఎన్నెన్నో కథనాలు వస్తున్నా ఎంతోమంది ఆర్థికంగా నష్టపోతూనే ఉన్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా ఎంతో మంది మధ్యతర గతి జీవులు చిట్టీలు, ఇళ్లస్థలాల పేరిట భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. కోట్ల రూపాయల్లో డబ్బు సేకరించిన వ్యక్తులు అకస్మాత్తుగా అదృశ్యమవుతున్నారు. చిట్‌ఫండ్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు రాత్రికి రాత్రి బోర్డులు తిప్పేస్తున్నాయి. ఇలాంటి మోసాలు ఎన్ని వెలుగు చూస్తున్నా, నిందితులు పట్టుబడుతున్నా షరా మామూలే. వినూత్న ప్రకటనలతో, విభిన్న వ్యూహాలతో కొత్త కొత్త సంస్థలు తామరతంపగా పుట్టుకొస్తునే ఉన్నాయి.

ఊహకందని లాభాలను ఎరగా చూపించే 'వైట్ కాలర్' నేరగాళ్లు ఎక్కడ పడితే అక్కడ తమ సామ్రాజ్యాలను విస్తరింపజేసుకుని భారీగా డబ్బు సేకరించాక బిచాణా ఎత్తేస్తున్న సంఘటనలు మన రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. అంతుచిక్కని మాయాజాలంతో ఘరానా వ్యక్తులు, సంస్థలు నిలువుదోపిడీ చేస్తున్నా మధ్యతరగతి జనం మాత్రం మేలుకొనడం లేదు. తమ వరకూ వస్తేగానీ అసలు మోసాన్ని గ్రహించలేక పోతున్నారు. మిగతా నేరాల వలే 'వైట్ కాలర్' నేరాలపై పోలీసులు ముందుగా నిఘా పెట్టే అవకాశాలు లేవు. ఎక్కడైనా వంచన జరిగినట్లు బాధితులు ఫిర్యాదులు చేస్తే తప్ప ఈ విషయాలు పోలీసులకు తెలిసే పరిస్థితి లేదు. ఇలాంటి సంఘటనల్లో చాలామంది తమ పరువు పోతుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించేందుకు ముందుకు రారు. ఒకవేళ ఎవరైనా పోలీసుల వద్దకు వెళ్లినా అప్పటికే పుణ్యకాలం ముగిసి, ఘరానా మోసగాళ్లు పలాయనం చిత్తగిస్తారు.

తాజాగా విశాఖ జిల్లాలో ఓ సంస్థ దాదాపు 500 కోట్ల రూపాయల మేరకు జనం నెత్తిన టోపీ పెట్టి నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఓ బాధితుడు ఆత్మహత్య చేసుకోగా, మిగతా వారు దిక్కుతోచని దీనస్థితిలో ఉన్నారు. తనకు వేలాది కోట్ల రూపాయల విలువ చేసే స్థిరాస్తులున్నాయని, బాధితులకు త్వరలోనే న్యాయం చేస్తానని ఈ కేసులో నిందితుడు చెబుతున్న మాటల్లో నిజమెంతో కాలమే తేల్చాలి. చెన్నైకి చెందిన ఓ ఘరానా వ్యక్తి హైదరాబాద్‌లో 'మనీ సర్క్యులేషన్ స్కీం' పేరిట డిపాజిట్లు సేకరించి సుమారు వెయ్యి మందిని మోసగించి కోట్ల రూపాయలు దండుకున్నాడు. ఇలాంటి సంఘటనల్లో నిందితులు పోలీసులకు చిక్కినా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్న భరోసా లేదు.

అవగాహన లేనందునే..

పిల్లల చదువుల కోసం కొందరు.. కుమార్తెల పెళ్లిళ్ల కోసం మరి కొందరు.. ఉద్యోగ విరమణ పొందాక దాచుకున్న సొమ్ముకు సార్థకత ఉండాలని ఇంకొందరు.. ఇలా ఎంతో మంది చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారు. డబ్బుకు డబ్బు.. స్థలానికి స్థలం.. అసలుకు రెట్టింపు మొత్తాలు.. అంతులేని వడ్డీలు.. అందమైన బ్రోచర్లు.. అందుబాటులో బ్రోకర్లు.. భారీగా కమీషన్లు.. ఇలా ఘరానా మోసగాళ్ల గురి- మధ్య తరగతి జీవులపైనే! ఇక, సాధారణ గృహిణులు ఎలాంటి రాతకోతలు లేకుండానే తమ వీధుల్లో కొందరు నిర్వహించే చిట్టీల వ్యాపారంలో చేరుతుంటారు. చిట్టీలు వసూలు చేసే ఘరానా మహిళలు భారీ మొత్తాలతో రాత్రికి రాత్రి ఉడాయిస్తున్న సంఘటనలు కోకొల్లలు. డబ్బు

చెల్లించినట్లు ఎలాంటి ఆధారాలు లేనందున సాధారణ గృహిణులు ఇలాంటి వంచనలపై ఫిర్యాదులు చేయలేక పోతున్నారు. చిట్టీల గడువు పూర్తయినా చేతికి సొమ్ము అందక నిత్యం పడిగాపులు పడే వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. సరైన డాక్యుమెంట్లు లేని వివాదాస్పద స్థలాలను చూపించి తమను మోసం చేశారనే 'రియల్ ఎస్టేట్ బాధితుల' సంఖ్య కూడా రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతోంది. ఎలాంటి ఆర్థిక సంస్థ అయినా పరిమితికి మించి లాభాలను ఇవ్వడం అసాధ్యమని, కొద్ది నెలలకే పెట్టుబడి మొత్తం రెట్టింపు కావడం ఊహకు అందని విషయమని నిపుణులు ఎంతగా హెచ్చరిస్తున్నా ఫలితం కానరావడం లేదు. పది రూపాయల వడ్డీ ఇస్తామని బాహాటంగా ప్రకటిస్తున్నారంటే అందులో కచ్చితంగా ఏదో మోసం ఉందనే విషయాన్ని ప్రజలు గ్రహించాల్సి ఉంది. అయితే, అందమైన హామీల గాలానికి జనం చిక్కుకుంటూనే ఉన్నారు. వ్యాపార దృక్పథంతో వెలిసే సంస్థలు రెట్టింపు మొత్తాలు, సగం ధరకే స్థలాలు ఎలా ఇస్తాయన్న విషయమై జనం నిశితంగా ఆలోచించాలని ఆర్థిక రంగ నిపుణులు సలహాలు ఇస్తూనే ఉన్నారు. ఈ సలహాల సంగతెలా ఉన్నా, మరో వైపు మాయగాళ్ల వంచనలు, బాధితుల ఫిర్యాదులు పెరిగిపోతూనే ఉన్నాయి.

నిబంధనలు గాలికి...

చిట్‌ఫండ్స్, ఇతర ఆర్థిక సంస్థలు కొన్ని కచ్చితమైన నిబంధనలను పాటించి తీరాలని భారతీయ రిజర్వు బ్యాంకుతో పాటు ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా ఫలితం లేదు. డిపాజిట్లకు మూడు రెట్ల మేరకు ఆస్తులను హామీగా చూపాలని, ప్రతి ఏటా విధిగా ఆడిటింగ్ నివేదికలు సమర్పించాలన్న ఆదేశాలు అమలవుతున్న దాఖలాలు లేనేలేవు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కన్నా, మధ్య తరగతి జనం ఎవరికి వారు విచక్షణతో వ్యవహరించి నమ్మకమైన సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం మేలు. ■

భలే విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్!

'సుపుత్రా! కొంప పీకరా!" అని పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లాకి చెందిన దీనానగర్ మాజీ ఎమ్.ఎల్.ఏ పుత్రరత్నం రాహుల్ కుమార్ 2012, మే నుంచి ఠాకూర్ తేజ్‌సింగ్‌గా అవతారమెత్తాడు. "నేను విజిలెన్స్ శాఖ స్పెషల్ సూపర్నెంటిని. నీ మీద ఫిర్యాదుల ఫైలు నా దగ్గరుంది" అంటూ పోలీసులకీ, ఇతర అధికారులకీ ఫోన్లు చేసి బెదిరిస్తూ పైకం దండుకుంటున్నాడు. అతని వలలో 70 మంది అధికారులు చిక్కుకుని ముడుపులు చెల్లించారు. అతనిదంతా ఓ మాయ. నేరుగా రాడు. తనకి పైకం గానీ, బంగారం గానీ వద్దు అంటాడు.

"మా బంధువు ఆసుపత్రిలో వున్నాడు. అతడి చికిత్సకు రెండు, మూడు వేలు నేను చెప్పిన బ్యాంకు అక్కౌంట్‌లో పడేయండి" అంటాడు. నాథపూర్‌లో రాహుల్ అలియాస్ తేజ్‌సింగ్ ఒక

గవర్నమెంటు బ్యాంకులో ఖాతాపెట్టాడు. అందులో పడాలి ఈ సొమ్ములు. విజిలెన్స్ ఎస్.పి అంటే భయమేగా- ఏ తప్పూ, ఏ లొసుగూ లేని అధికారి వుంటాడా?

అయితే- ఓ ఆహార శాఖాధికారి ఇతనికన్నా ఘనుడు. విజిలెన్స్ బ్యూరో కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. అంతే- గుట్టు రట్టయింది. నకిలీ విజిలెన్స్ స్పెషల్ ఆఫీసరుని 'సెల్'లో పడేశారు. వాళ్ల నాన్న 'నా పేరెత్తకండి సార్' అంటాడు మీడియాతో. మనవాడు లోగడ 'చెల్లని చెక్కు'జకేసులో జైలుకెళ్ళి వచ్చాడుట!

తగవుల మధ్య తలదూర్చి..!

హాయిగా జిలేబీలన్నీ అమ్మేసుకుని బండి తోసుకుంటూ ఇంటికి చేరుకున్న జగన్నాథ్‌కి- తన ఇరుగుపొరుగు వాళ్లు తన్నుకు ఛస్తున్నట్లు కనబడ్డది. ఓ యింటి ఆసామీ- మనమడి పుట్టి నరోజు పండుగని- ధూంధాంగా - సంగీతగానాది గోలతో చేస్తూండగా- ప్రక్కింటి యువకులు పూటుగా తాగేసిన మత్తులో లౌడ్ స్పీకర్లు కడతావా? ఛస్తావా? అంటూ దాడికి దిగారు. జిలేబీల అబ్బి- తియ్యని శాంతి కబుర్లు చెబుతూ- ఆ రెండు వర్గాల మధ్య తలదూర్చాడు. "శాంతి...శాంతి..." అన్నాడు. "మొత్తం స్విచ్ ఆఫ్" అంటారు మత్తుభాయిలు- వాల్యూమ్ తగ్గిస్తానంటాడు తాతగారు. ఈ పెనుగులాటలో- 40 ఏళ్ల జగన్నాథ్‌కి రెండుపక్షాల నుంచి చావుదెబ్బలు తగిలాయి. పోలీసులు రాలేదు, అంబూలెన్సూ రాలేదు- జిలేబీల బండీ మీదనే జగన్నాథ్‌ని లూధియానా ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. అతని భార్య రామేశ్వరి రోదిస్తూంటే- కొట్టుకున్న ఆ యువకులు పలాయనం చిత్తగించారు. తగవుల మధ్య తలదూర్చటం ముప్పు సుమతీ! అంటారందుకే!

veeraji@sify.com

రాతియుగంలోనూ మహిళలపై హింస!

మహిళలపై హింస ఈనాటిది కాదని, ఇందుకు రాతియుగంలోనూ తగిన ఆధారాలున్నట్లు ఓ తాజా అధ్యయనంలో తేలింది. పురుషాధిపత్యం పర్యవసానంగా శతాబ్దాలకు పూర్వమే స్త్రీలపై అకృత్యాలు జరిగాయని పరిశోధకులు చారిత్రక సాక్ష్యాలను చూపుతున్నారు. రాతి యుగంలోనూ మహిళలు శారీరక హింసను ఎదుర్కొన్నట్లు స్కాండినేవియాలో లభించిన పుర్రెలను ఇందుకు ఆధారంగా చూపుతున్నారు. ఈ పుర్రెలకు సంబంధించి లోతైన విశ్లేషణ జరపగా విస్మయ పరిచే అంశాలు వెలుగు చూశాయి. మహిళలకు చెందిన ఈ పుర్రెలపై తలభాగంలో దెబ్బలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వేల సంవత్సరాల క్రితమే మహిళలు బాధితులుగా మారారనడానికి ఈ పుర్రెల్లో ఆధారాలు లభించాయని స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు పరిశోధకురాలు లిండా ఫిబిజెర్ అంటున్నారు. రాతియుగం చివరి దశలో పలు కారణాలతో జరిగే భయంకర దాడుల్లో పురుషులు ఎక్కువగా మరణించేవారు. పిల్లల పెంపకంలో నిమగ్నమయ్యే మహిళలను ఈ దాడులకు దూరంగా ఉంచేవారు. క్రీస్తు పూర్వం 3900- 1700 మధ్య కాలానికి చెందిన 478 పుర్రెలను పరిశోధకులు స్వీడన్, డెన్మార్క్‌ల నుంచి సేకరించి పలు కోణాల్లో పరిశోధించారు. స్వీడన్‌కు చెందిన 10 శాతం పుర్రెలపై, డెన్మార్క్‌కు చెందిన 17 శాతం పుర్రెలపై గాయాలకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించారు. పురుషుల పుర్రెలపై గాయాలు సామూహిక దాడుల వల్ల ఏర్పడి ఉండవచ్చని, మహిళల పుర్రెలపై అనవాళ్లు ఇందుకు భిన్నంగా ఉన్నట్లు పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు. పరస్పరం దాడులు, కొట్లాటల వల్ల పురుషులు గాయపడే అవకాశాలు ఎక్కువని వీరు అంచనా వేస్తున్నారు. అయితే, మహిళల పుర్రెలపై గాయాలకు కుటుంబ హింస కారణమై ఉండవచ్చని పరిశోధకులు అనుమానిస్తున్నారు. భర్త లేదా కుటుంబ సభ్యులు జరిపే శారీరక హింస వల్ల మహిళలకు బలమైన దెబ్బలు తగిలి ఉంటాయని వారు విశ్లేషిస్తున్నారు. కేవలం పుర్రెలపైనే కాకుండా, శరీరంలో ఇతర భాగాలపైనా గాయాలకు సంబంధించి ఆనవాళ్లు లభిస్తే తమ వాదనకు మరిన్ని బలమైన సాక్ష్యాలు లభించినట్లవుతుందని వారు అంటున్నారు.

భయం వీడితేనే జయం

'భయం' అనే పదాన్ని మనం తరచూ ఉపయోగిస్తుంటాం. భయంతో వుంటే మామూలు తాడు- పాములా అన్పించవచ్చు. జీవితంలో భయం వెంటాడితే దేన్నీ సాధించలేం. భయానికి నిజమైన మూలాలు మనసనే సముద్రంలోనే వుంటాయి. ధైర్యవంతులైనా ఒక్కోసారి డీలాపడిపోతుంటారు. అర్ధరాత్రి ఇంట్లోకి దొంగలు చొరబడి మనల్ని బెదిరించినపుడు నోట మాట రాకపోవచ్చు, దీనంతటికీ భయమే కారణం.

కొందరిలో కొన్ని భయాలు అనునిత్యం బాధిస్తుంటాయి. బయటకు వాటి రూపాన్ని మనం చూడకపోవచ్చుగానీ అవి చైతన్యరహిత స్థాయిలో వెంటాడుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, ఘోర ప్రమాదాలు వంటివి జరిగినా అవి మనలో భయం, దుఃఖం, ఆందోళన, అధైర్యం వంటివి కలిగిస్తాయి.

పిల్లలు పగలంతా టీవీలో దెయ్యాలు, చేతబడులు, ఫ్యాక్షనిజమ్‌కు చెందిన సినిమాలు, సీరియల్స్ చూసి రాత్రిపూట పడుకోగానే - ఆ సంఘటనల ప్రభావంతో నిద్ర దూరమవుతుంది. ఒక్కోసారి పీడకలల వల్ల భయంతో కలవరించటం, కేకలు పెట్టటం, ఉలిక్కిపడి లేవటం, అభద్రతాభావం పెరగటం అనుభవమవుతుంది. గాలికి తలుపులు కదిలినా, కిటికీ రెక్కలు కదిలినా, బయట చెట్లు ఊగుతున్నా, చీకటిగా ఉన్నా అదే భయం వెంటాడుతుంది. చేతబడులు, దయ్యాలు, రాజుల ఆత్మలు, రాణుల అంతఃపురాలు, శిథిలమైన కోటలు వంటి కథనాలతో సోషియో ఫాంటసీ ముసుగులో, గ్రాఫిక్స్ ఇంద్రజాలంతో నేడు సినిమాలు, టీవీ చానళ్లు వీక్షకులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. సాంకేతిక ప్రగతి, శాస్త్రీయ విజ్ఞానం భయపెట్టడానికా? మూఢ నమ్మకాలు, అనవసర భయాలు అంతరించినపుడే ఎవరైనా జీవితంలో అనుకున్నది సాధించే అవకాశం ఉంది. ప్రతి వ్యక్తీ భయం చెర నుంచి బయటపడి, చైతన్య స్ఫూర్తితో ముందుకు సాగినపుడే సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుంది.

-లక్కరాజు శ్రీనివాసరావు

ఏది న్యాయం?

ఈ ఇంట్లోకి మారినప్పటినుంచీ ఎవరితోటీ పరిచయం కాలేదు. ఏ పనీ లేకుండా అకారణంగా ఎవరి ఇంటికీ బెల్ కొట్టి మరీ వెళ్లడం అలవాటు లేక, ఎవరైనా ఎదురుపడి మాట్లాడితే బాగుణ్ణు అని అనుకుంటూ ఎదురుచూస్తూ వుంది మాధవీలత. అనుకోకుండా ఇవాళ మా బామ్మ గుమ్మంలో ముగ్గేస్తూ ఆమెని చూసి చిరునవ్వు నవ్వింది. అదే అదనుగా తీసుకుని మాధవీలత- "మీరు వేసిన ముగ్గు చాలా బాగుంది" అంది. "ఆ... ఏవో పాత కాలం ముగ్గులు, గీతలు గీసేయడమే. మీలాగా నాకు చుక్కల ముగ్గులు రావు" అంది బామ్మ ఓ పక్క గర్వపడుతూనే మరో పక్క చిరునవ్వు చిందిస్తూ. 'ఏ ముగ్గైనా అందంగా వెయ్యడంలోనే వుంది నైపుణ్యం' అంది నవ్వుతూ మాధవీలత. బామ్మ మరీ మురిసిపోతూ "రామ్మా.. లోపలికిరా.. ఎదిరింట్లో ఎవరో దిగారని అనుకున్నాం కానీ మన తెలుగువాళ్లో కాదో, ఎవరో ఏమిటో అనుకుంటూ వున్నాం నేనూ మా కోడలూనూ. మీరు తెలుగు వాళ్లే అయినందుకు చాలా సంతోషంగా ఉంది" అంది. మాధవీలత లోపలికొచ్చింది. 'కొత్తగా పెళ్లయిందట. పాతికేళ్ళవయసు వుంటుంది' అంటూ బామ్మ నన్ను పరిచయం చేసింది తన మనవరాలు వరేణ్యకు. అలా మాటలు కలిసాయి. "ఈ రోజుల్లో దొంగల భయం, అఘాయిత్యాల భయం. అంతా భయం.. భయం. తలుపులు తీసి పెట్టుకోకు. మనకింకా ఇక్కడ ఎవ్వరూ తెలీదని మావారు చెప్పారు.' అంది మాధవీలత. "అవునమ్మా అబ్బాయి చెప్పింది నిజమే. చచ్చిపోతున్నాం. బంగారం ధర పెరిగిపోవడం కాదు కానీ, ముక్కుపుడక దొరికినా చాలునని దొంగలెగబడుతున్నారు. వయోభేదం లేకుండా ఆరేళ్ల నుంచి అరవై ఏళ్లదాకా, పొగరెక్కి కామాంధులు ఆడాళ్లమీద పడుతున్నారు అఘాయిత్యాలకీ, అక్రమాలకీ" అంది బామ్మ. "ఆ దుర్మార్గులని పట్టుకున్న పోలీసువాళ్లు టీవీలలో చూపిస్తూ వాళ్ల మొహాలు కనబడకుండా బట్ట కప్పే

స్తారెందుకు? అక్కడ వాళ్ల పరువు కాపాడాలనా? మొన్న పేపర్లో చదివాను. ఒక మ్యాయిని, ఫిలింనగర్‌లో- ఇద్దరు స్టూడెంట్లు వెంటాడుతూ నానా చెడ్డ మాటలూ మాట్లాడుతూ హింసిస్తున్నారని అక్కడివాళ్లు, ఆ అమ్మాయిని కాపాడి, ఆ కుర్రాళ్లని పట్టుకుని చెట్టుకు కట్టేసి, చావబాదారని. వాళ్ల మొహాలు మనం చూడడం వల్ల వాళ్లు ఎక్కడైనా కనిపిస్తే మనం దూరంగా వుంటాం. జాగ్రత్తగా వుంటాం" అంది మాధవీలత. "అవును. మీరన్నది నిజమే" అంటూ కాఫీ కప్పుతో వంటింట్లోంచి వచ్చింది అమ్మ. 'నేనను కుంటాను, అలా చూపించడంవల్ల వాళ్లు ఎప్పుడు ఎక్కడ కనబడినా, అందరూ చితకబాదేస్తారేమోనని- అలా మొహాల మీద గుడ్డ కప్పేస్తారనుకుంటా. వాళ్లని చంపకుండా, వాళ్లలో మార్పు తేవాలని కదా.. మన ప్రభుత్వాల ప్రయత్నాలు ' అంది బామ్మ సాలోచనగా. "ఎన్నిసార్లు ఎంతమంది, నెలల తరబడీ ఏళ్లతరబడీ జైళ్ళలో వున్నా విడుదలయ్యక మళ్లా ఆ వెధవ పనులే చేస్తారు. వాళ్లు మారరు. మారితే సంతోషమే. ప్రజలు 'ఛీ' కొడుతున్నందునమేము మారామని చెప్పడం కాకుండా వాళ్ల ప్రవర్తన ద్వారా మారినట్టు ఋజువు చెయ్యలిగా మరి. అలా కాకపోతే, ఫిలింనగర్‌లో జరిగినట్టు చొక్కాలూడదీసి చెట్టుకు కట్టేసి బాదడమే సరైన శిక్ష. 'సోషల్ బాయ్‌కాట్' అదే అందరూ వారిని బహిష్కరించాలి. అప్పటికిగానీ పశ్చాత్తాపం వారిలో కలగదు" అన్నాను నేను.

"అవునమ్మా..! నా ప్రశ్న- వాళ్ళలో పశ్చాత్తాపమే కలుగుతుందో, కసి పెరుగుతుందో మనం చెప్పలేము కదా! అలా బాదడాలూ, గొడవ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప, ప్రతి ఒక్కరూ చెయ్యకూడదు" అంది బామ్మ.

"ప్రతీదీ తప్పనిసరే! అలా జనం సంఘటితమై వాళ్లని కొట్టారు కాబట్టి సరిపోయింది. లేకపోతే, తాగిన మైకంలో అలా వెంటాడుతూ వచ్చినవాళ్లు ఆ అమ్మాయి మీదా ఏదైనా అఘాయిత్యం చేసి ఉంటే పరిస్థితి ఏమిటి? ఆడవాళ్లపై, అమాయకులపై అన్యాయాలు జరగకుండా ప్రభుత్వం కానీ ఇతరులెవరు గానీ తీసుకునే ముందస్తు జాగ్రత్తలే మిటి? అన్యాయంగా బలైపోయిన వారి గురించి ఒకటి రెండు రోజులు రోదించి, ఘోషించి గోల చేశాక, దోషులను పట్టుకుంటే శిక్షలు కఠినంగా వుండకూడదని చెప్పేవారి మాటలు ఎంతవరకు న్యాయం?

'కుక్క కాటుకి చెప్పు దెబ్బ' అని సామెత. కుక్క కరిచి మనిషి ప్రాణం మీదకొచ్చినా, కుక్కని చెప్పుతో కొట్టడం అన్యాయం అని కొందరు అరిస్తే, ఏది న్యాయమో, ఏది అన్యాయమో కొత్త శాస్త్రాలు రాయాలా?" అంది శిరీష. అందరూ ఆలోచనలో పడిపోయారు. అప్పుడే "ఆక్కూ రలూ..." అంటూ బండి తోసుకుంటూ వచ్చిన ఆక్కూరలబ్బాయిని బామ్మగారు, 'ఆక్కూరలబ్బీ' అంటూ పరుగెత్తుకెళ్లారు వాణ్ణి పిలవడానికి. "మళ్లా వస్తాను బామ్మగారూ"అంటూ మాధవీలత కూడా ఇంటికి వెళ్లిపోయింది. ■

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
బుధవారం
20, ఫిబ్రవరి
2013

సేర్చుకుందాం

కమనీయంబగు సర్వతీర్థములు లింగం బున్నచో మూర్తిమం తములై యొప్పుచు నుండు లింగమును దాత్పర్యంబుతో భక్తగా త్రములందెప్పుడు నుండు గాన మహిలో దత్పార్థమూహింప దీ ర్థములం దెల్లను దివ్య తీర్థము భవ ద్భక్తుండు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! లింగం ఉంటేనే హృద్యాలైన సర్వతీర్థాలూ ప్రకాశ వంతాలౌతాయి. ఆ లింగం భక్త జనుల దేహాల మీద సర్వదా ఉంటుంది. కాబట్టి అనగా అంతారార్థాన్ని మనం ఊహిస్తే భూమి మీద అన్ని తీర్థాలలోనూ దివ్య తీర్థం భగవద్భక్తుడే.

ఈ పద్యంలో లింగధారి శివభక్తుల ప్రసక్తి వచ్చింది. అన్నమయ్య పుట్టింది. శ్రౌత శైత మతావలంబుమైన ఆరాధ్య బ్రాహ్మణ శాఖలో , ఆ శాఖలోని వాళ్లు శాంభవ దీక్ష తీసుకొంటారు. శాంభవ దీక్షలో శివ లింగధారణ శివపంచాక్షరీ మంత్రోపదేశమూ అన్న రెండంశాలుం టాయి.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

18 **శ్రీ లత**

''అవన్నీ నాకు తెలీదు గానీ, ఎందుకంటే సీతను మించిన అనాథ ఎవరున్నారమ్మా? అసలు సీత తల్లెవరో తండ్రెవరో తనకు తెలీదు కదా! నాలాంటిదే అయుంటుంది ఆ తల్లికూడా. పాపం ఆ బిడ్డ జనక మహారాజుకు దొరికింది కాబట్టి కావ్య నాయికై కష్టాలకు సింబల్‌గా నిలిచిపో యింది.

అసలు రామాయణం మన సంస్కృతికి పునాది అనుకుంటే అది ఒక అనాథ స్త్రీ జీవిత చరిత్రే కదమ్మా. అనాథకు జీవించే శక్తే కాదు... పూజించ బడే గొప్పదనం కూడా ఉంటుందనేగా తను నిరూపించింది. ఆదర్శంగా నిలవడానికి ఆమె అనాథత్వం ఏవీ అడ్డం రాలేదుగా. స్త్రీ చరిత్ర స్త్రీతో మొదలయింది కనుక నా కూతురూ, ఓ అనాథే నని తల్లినయిన నేనే ప్రపంచానికి చాటుకున్నాను కనుక నా కూతురికీ ఆ పేరే పెడదామని'' అంది.

''చాల్లే ఊరుకో! ఆదర్శం ముదిరి అపదర్శనం అయిందనీ, రోజురోజుకీ నీ ఆలోచనలు అడ్డదిడ్డంగా నడుస్తున్నాయి అంది వసంత పాపను కాళ్ళమీద పడుకోబెట్టి కాళ్ళూ చేతులు మడిచి తీస్తూ ''జీర్ణం! జీర్ణ! వాతాపి జీర్ణం! సకల రోగని వారణం'' అని చదువుతూ...

''పోనీ 'తార' అని పెడితే ఎలా ఉంటుందీ?'' అడిగింది జీవన ఉగ్గుగిన్నె తుడిచి అలమార్లో పెడుతూ...

''పంచ మహాకన్యల్లో ఒకటవుతుంది'' అంది వసంత.

''అంటే''

తార, తార అహల్య, మండోదరి, ద్రౌపది వీళ్ళను పంచ మహాకన్యలు అంటారు. అంటే వీరికి వివాహమయినా పురుష సంపర్కం ఉన్నా సంతానం కలిగినా వీళ్ళు కన్యలేనన్నమాట. అష్ట భార్యలూ పదహారువేల గోపికలూ ఉన్నా కృష్ణుడు అస్కలిత బ్రహ్మచారి అయినట్లు'' అంది వివరణగా.

''అదయి ఉండదు ఐదుగురూ పితృస్వా మ్యంలో ఘోరాతిఘోరంగా అవమానించబడ్డ వాళ్ళు కదా. వాలి భార్య అయినందుకు తార, చంద్రుణ్ణి ప్రేమించినందుకు ఇంకోతార, అంగదు డిచే భర్తా, బంధువర్గం చూస్తుండగా జుట్టుపట్టి ఈడ్చుకురాబడ్డ మండోదరి, బహిరంగంగా నగ్ని తను చేయబడిన ద్రౌపది, చీకట్లో మోసగించబడ్డ అహల్య 'మహా కన్యల' నడం ఎందుకు 'మహాపీ డిత'లు అంటే బావుండేదికదూ. సమాజం చేతా శాస్త్రాల చేతా పీడించబడి ఓర్పు సహనంతో బ్రతి కిన స్త్రీలు గొప్పవాళ్లా?'' అడిగింది పాపను మోకా ళ్ళమీద కూర్చోబెట్టుకుని ఉయ్యల ఊపుతూ...

''కాదు! అక్కడే నీ ఎనాలిసిస్ దెబ్బతింది. వాళ్ళ ఏ స్వామ్యం చేత అవమానించబడ్డారో అదే స్వామ్యానికి పట్టమహిషులై సామాజిక న్యాయాన్ని తమ పాత్రల ద్వారా నిరూపించిన స్త్రీశక్తులు. వాళ్ళు కన్నీళ్ళతో అగ్ని కురిపించిన పంచాగ్నులు. వీళ్ళను సంపూర్ణంగా అధ్యయనం

చేస్తే ఆనాడూ ఈనాడూ స్థిరంగా నిలబడగలిగినది స్త్రీ శక్తేనని, స్త్రీ స్వామ్యమేననీ స్పష్టంగా తెలు స్తుంది.

నీకింకోవిషయం తెలుసా?

''ఉహు... '' అడ్డంగా తలూపింది జీవన.

''కుంతి, గాంధారి, ద్రౌపది, సుధేష్ణ వీళ్ళయిదు గురి సంకల్ప బలమే కురుక్షేత్రం. నీకు తెలుసా జీవన వేదకాలంలో స్త్రీని జ.. అంటే జన్మనిచ్చునది గానూ. జ్ఞ... అంటే.. స్త్రీ... అంటే త్రయగుణ సంప న్నుగానూ సంబోధించారు తప్పితే అబలా, లలన కోమలి లాంటి పదాలు స్త్రీకి అన్వయించబడ లేదు. అంటే పూర్వకాలపు స్త్రీ శక్తిని గుర్తించిన సామాజిక వ్యవస్థ మనం అర్థం చేసుకోవచ్చు.

''అమ్మా మరి పంచమహాకన్యలు కన్యలైతే కుంతి కూడా కన్యేగా ముందే బిడ్డను కన్నది కూడా'' అడిగింది జీవన ఒళ్ళో పాపను ఊపుతూ....

''అవును మరి'' అంది వసంత.

''మరి నేనో..." సూటిగా వచ్చిన ఆ ప్రశ్నకు తెల్ల మొహం వేసింది వసంత. కాసేపు తేరుకోలేదు. అప్పటిదాకా ఎంతో శ్రద్ధగా శాస్త్ర పరిజ్ఞానాన్ని వెలువరించిన వసంత తన బిడ్డవరకూ వచ్చేసరికి తడబడిపోయింది. తన శక్తంతా క్షీణించి మామూలు అమ్మయిపోయింది.

''ఏమ్మా... మాట్లాడవు! మరి నేనూ... నేనెవర్ని.. కన్యనా.. కాదా...'' అంది పాపను దిండుమీద బోర్లాగ పడుకోబెట్టి శాలువా కప్పి రెండు మోకాళ్ళూ ఎత్తిపట్టి వాటి చుట్టూ చేతులు చుట్టి వాటిమీద గడ్డం ఆన్చి దీర్ఘంగా... వసంత వైపు చూస్తూ...

ఆగిపోయావేమ్మా... నేను కన్యనా.. కాదా..." అంది మళ్లీ వసంత తెల్లమొహం వైపు ఆసక్తిగా చూస్తూ...

జీవనలా చూస్తూండగానే వసంత చెక్కిళ్ళలోకి ఇంకిపోయిన రక్తం ప్రవహించడం మొదలెట్టి ఎర్ర బడుతూ నిండుతనం నింపుకుని సుదీర్ఘ తపస్సు లోంచి పొందిన మిగిలిన శేషంలా శక్తివంతంగా మారి.

''నువ్వు కూడా... కన్యవు... అంటే... మిస్... నువ్వు మిస్ జీవన'' స్థిరంగా శ్రద్ధగా దిటవుగా దీటుగా చెప్పింది.

''మరి సమాజం ఒప్పుకోదని నువ్వే అంటు న్నావు కదమ్మా'' అంది జీవన అమ్మలోంచి ఆలోచ ననుబయటకులాగి పట్టాలనే గాలం జీవన కళ్ళ్లో కదిలింది. ఈ వాదనకు కారణమైన పాప మాత్రం నిశ్చితంగా శ్వాసిస్తూ నిద్రిస్తూంది. వసం తలోనూ జీవనలోనూ మాటలు స్తంభించి మౌనం సుడులు తిరిగింది. ఆ సుడి వసంత కళ్ళల్లోనూ జీవన గుండెల్లోనూ కూడా కనబడింది. ముందుగా వసంతే తేరుకుంది. తన బిడ్డవైపు చూసింది. తన ఆలోచనను ఒక కొలిక్కి తెచ్చు కుంది.

''మరదే! శాస్త్రానికీ సమాజానికీ మధ్య ఉన్న గాఢాంధకారం శాస్త్ర సహేతుకమైనది. సమాజం స్వార్థపూరితమైనది. శాస్త్రానికి మానవాభివృద్ధి, మానవ సంక్షేమం లక్ష్యాలు. శాంతి, సామరస్యా లతో కూడిన జీవనం శాస్త్రలక్షణం. సమాజానికి గుత్తాధికారం ఒక్కటే లక్ష్యం. అది మత, ప్రాంత, భాషా, దేశ పరమైన అధికారం ఒక ఎత్తయితే లింగపరమైన (జండర్) అధికారం ఇంకొటి. ఇది మరీ సంకుచితం. శాస్త్రాల్ని పక్కకు పెడితే సమా జాన్ని ఏలేవి స్వామ్యాలు.

-ఇంకాఉంది

149

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

కౌశికి, సరస్వతి, సింధులందు నెమకు. పొండ్ర విదేహ భూములు మూల మూలలా గాలించు. మాళవం, కోసల, మాగధము, బ్రహ్మమూలాశైలాలు పరిశీలించు. ఉదధి తీరాల వెదకించు. మందరాద్రి పరీక్షించు. కిరాత నిలయం కను. నవ ద్వీప జంబూ ద్వీపాలందు అన్వేషించు. ఆ పయిని హిమవ న్నగము వీక్షించు. 'కాకోల' మడుగులో వెదుకు. లోహిత సముద్రం దాటిపో- కూటశా ల్మలిచ్ఛాయలు అరసి చూడు. గరుడాశ్రమం, గోశృంగ గిరి శోధించు. ఆ పర్వత శిఖరాల్లో వర్తించి వెదకు. దుగ్ధ సాగరం అలవోకగా పరి కించు. సుదర్శనాద్రిని పరీక్షించు. శుద్ధార్ణవం దాటిపో. జాతరూప పర్వతంపైన అన్వేషించు. వేయి తలలతో ఆసీనుడైన చంద్రవర్ణుడు అనంతుణ్ణి వీక్షించి నమస్కరించు. పధ్నాలుగు వేల యోజనాల ఆవల వున్న మేరువు వెదకు. ఆ మేరు గిరి చుట్టూ ప్రదక్షిణం చేసే అర్కుడిని అర్చించు. అదేవిధంగా వాలఖిల్యులకి ప్రణా మాలు చెయ్యి. ఉదయాద్రిని అన్వేషించు. రావణుడి నిలయం తెలుసుకొని సీత వార్త అరసి రావలసింది. రవిలేక చీకట్లు క్రమ్ముకోవ డంవల్ల ఈ భువిలోని ఆవలి ప్రదేశాలు నేను ఎరుగును. అక్కడ కూడా వెదకి నువ్వు ఒక నెలలో తిరిగి రావలసింది' అని ఆనతిచ్చాడు. వినతుడు లక్ష వానరులతో తూర్పుదిక్కుకి అరి గాడు.

అనంతరం నీలుడు, అంగదుడు, హను మంతుడు, జాంబవంతుడు, గజుడు, గంధ మాదనుడు, గవయుడు, గవాక్షుడు, విజ యుడు, మైందద్వివిదులు, తారుణ్ణి పిలిచి ''మీరు దక్షిణ దిశగా వెళ్ళండి. వింధ్యాచలం, నర్మద, దశార్ణనగరాల్లో వెదకండి. దండకా రణ్యం శోధించండి. గోదావరిని పరికించి, నేత్రవతిలో చూడండి. కాళింగ, నిషధ దేశాలు అన్వేషించండి. కర్ణాట, ఆంధ్ర, చోళ, చేర్తకేరళ, పాండ్యసీమల్ని గాలించండి. మలయాచలం, కావేరి అరయండి. అగస్తిమహర్షి ఆశ్రమం దర్శించి, ఆ మహర్షి అంఘ్రిలకు ప్రణమిల్లండి. ఆ ఋషి అనుమతితో తామ్రపర్ణి దాటండి. హేమపురం, మహేంద్ర వృషభాద్రుల చూడండి. పుష్పగిరి, కుంజర గిరి శోధించండి. భోగవతిలో వెదకండి. విషమాబ్ధికి అరిగి- అందు సురలు, గంధర్వులు, అప్సరసలు ఉంటారు. ఆయా తావులన్నీ గాలించండి. వైత రణి లంఘించండి. వైవస్వతుడి పురం చేరి, అందు సమవర్తి అనుజ్ఞ కైకొని పితృలోకం అంతా సందుగొందులన్నీ శోధించి సీతాదేవి వృత్తాంతం తెలిసికొని పగిడిరండి. మీకూ ఒక మాసమే గడువు''.

సుగ్రీవాజ్ఞ ఆలించారు, ఆ కపినాయకులు. మోదరస జలధిలో ఓలలాడి, సూర్య సమతే జస్వి అయిన రామచంద్ర ప్రభువుకు నతులు సమర్పించి, నుతులు సలిపి, తమ తమ సత్త్వ ములు వర్ణించి చెప్పి- జానకి వార్త- ఎన్ని ఇమ్ముదప్పులు వచ్చినా సైచి, తెలిసికొని ఏతెం చుతాము కాని వ్యర్థంగా రిక్తహస్తాలతో మరలి రామని వక్కాణించారు.

హనుమంతుడి చేతికి ముద్రిక ఒసగుట

శ్రీరాముడు హనుమంతుని కనుగొని చేర రమ్మని పిలిచి ''హనుమా! నువ్వే జనకరాజ నందనను కనుగొనజాలుతావు. నువ్వే ఈ రామకార్యం నిర్వహించ సర్వసమర్థుడివి. పవ మాన నందనా! నువ్వు నీ లావు తెలియనివా డవు. అరసి చూడగా నీ బాహుబలం అతు లితం. ఇదిగో నా ముద్రిక. జానకిని కాంచి, ఈ ముద్రిక ఆమె కొసగి ఆమె చిత్తశోకాన్ని మాన్పు. ఆమెకు మా కుశల వార్త తెలుపు. సీత క్షేమ వార్త అవశ్యం తెలుసుకొని శీఘ్రమే మర లిరావలసింది'' అని ముద్రికను ఒసగాడు. అంత వాయు తనయుడు ఆ పవిత్ర ముద్రి కను తన మస్తకమందు తాల్చి శోభిల్లాడు. ప్రాచ్యగిరి, తన శిఖరాన సూర్యుడిని మోచి వెలుగు రీతిగా హనుమంతుడు ప్రకాశించాడు. ఆనందంతో కుప్పిగంతులు వేశాడు. రామవి భుడి చరణార విందాలకి వినముడై వందన ములు కావించాడు. శ్రీరామ ప్రభువుతో 'ఇన కులాధిపా! ఎంత దవ్వు అయినా అరిగి సీతమ్మ వున్న జాడ సాధించి వస్తాను.

-ఇంకాఉంది

బుధవారం, 20 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ దశమి రా.07.33
నక్షత్రం: మృగశిర సా.05.00
వర్జ్యం: రా.02.17 నుండి 04.03 వరకు
దుర్ముహూర్తం: మ.12.06 నుండి 12.53 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
ఆరోగ్యం గూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యా త్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):
ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫల మవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తిక రంగా లేనందున మానసికాందోళన చెందు తారు. ప్రతి పని ఆలస్యంగా పూర్తిచేస్తారు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికా రులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్ర త్తగా చేయుట మంచిది.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
ప్రయాణాలెక్కువ చేస్తారు. స్థానచలన మేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందు తారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ఆటంకాలుంటాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
కుటుంబమంతా సంతోషంగా నుంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాస ముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభా లను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలి స్తాయి.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధ లుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవ కాశం లభిస్తుంది.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచ నలను కలిగి వుంటారు. బంధు, మిత్రులు గౌర విస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయా ణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందు లను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు. సహాయ సహకారాలు లభిస్తాయి.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. భయాందోళ నలు దూరమవుతాయి. కుటుంబంలో మన శ్శాంతి లోపిస్తుంది. బంధు, మిత్రులతో వైరమే ర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధ లనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశ ముంటుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవ సరం. కొన్ని ఇబ్బందులెదురవుతాయి.

మంచిమాట

ముక్తి

జీవితమంతా సద్గుణాలతో, సత్కర్మలతో, దైవభక్తితో గడిపినవారు అంతిమంగా ముక్తిపొందుతారనేది ఒక ఆధ్యాత్మిక విశ్వాసం. ముక్తి అంటే విడుదల కావడం. జనన మరణ చక్రం నుంచి వెలికిరావడమే ముక్తి. జన్మ దుఃఖం జీవనం దుఃఖం మరణం మరింత దుఃఖం. మనిషి జీవితంలో సుఖంగా ఉన్నామనుకొనే సందర్భాలు బహు కొద్ది. ఏవేవో వ్యధలు, భయాందోళనలు, నిరాశా నిస్పృహలు ఇలా ఏదో ఒకటి మనల్ని వేధిస్తూ పీడిస్తూనే ఉంటాయి.

వీటినుంచి తప్పించుకునేందుకు మనిషి అనేక అవస్థలు పడతాడు. కొందరు రామకోటి రాస్తారు. ఇంకొందరు దేవాలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి అష్టోత్తర శత నామాల్లాంటి పూజలు చేయిస్తారు. ఆలయంలో కూర్చున్నప్పుడు కాస్త మనశ్శాంతిగా అనిపించినా, అడుగు బయటపెట్టగానే ఆలోచనలు ఈగల్లా ముసురుకుంటాయి. ఇలాంటి మనఃస్థితివల్లనే మనిషికి ఆధ్యాత్మిక ఫలాలు అందకుండా పోతున్నాయి. దేహభ్రాంతి నుంచి బయటపడటమే అన్ని సమస్యలకీ ఏకైక పరిష్కారం.

కౌశంభి నగరంలో ముక్తేశ్వరాలయం పేరిట ఒక దేవాలయం ఉంది. అక్కడి శివ లింగం స్వయంభువుగా ప్రసిద్ధి. ఆదిశంకరులు ఆ శివలింగాన్ని అర్చించి అక్కడ ఒక రోజు గడిపారని, కోనేటిలో మూడుసార్లు స్నానం చేశారని ఆ కోనేట్లో స్నానం చేసిన వారికి ఆరోగ్యం లభిస్తుందనీ శిలాఫలకం మీద ఉంది. ముక్తేశ్వరాలయ ఆవరణలోనే ముక్తి మండపమూ ఉంది. అది ఆలా ఎత్తు.

సులభంగా ఎక్కడానికి వీలు లేకుండా ఉండేది. మాస శివరాత్రి, మహాశివరాత్రి రోజుల్లో ఆ మండపాన్ని భక్తులు పసుపు కుంకుమలతో అలంకరించి పూజలు చేసే వారు. ఆ మండపంలో ఆదిశంకరులు తపస్సు చేసినట్లు చెప్పుకొనేవారు. ఒక మాస శివరాత్రినాడు ముక్తేశ్వరాలయానికి శరీరమంతా భస్మలేపనం చేసుకున్న అయిదుగురు అవధూతలు వచ్చారు. వారిలో వృద్ధుడిగా కనిపిస్తున్న అవధూతను మిగతావారు భక్తి శ్రద్ధలతో అనుసరించసాగారు.

శివలింగం ఎదుట అవధూత చేతులు జోడించి పెద్ద గొంతుతో శివస్తోత్రం చది వాడు. అతి సునాయాసంగా ముక్తి మండపం మీద కెళ్లి పద్మాసనంలో కూర్చున్నాడు. ఆయన నలుగురు శిష్యులు మండపానికిగల నాలుగు మూలల్లో కూర్చున్నారు. ఈ దృశ్యం వింతగా అనిపించి, అక్కడి భక్తులు అవధూతల ముందు సాష్టాంగ నమస్కా రములు చేసి ఎదురుగా కూర్చున్నారు. కొందరు పళ్లు సమర్పించారు. అవధూతలు వాటిని తాకనైనా లేదు.

అంతలో అనంతుడనేవాడు కల్లు తాగి శివుడిమీద పాటలు పాడుతూ అక్కడికి వచ్చాడు. భక్తులు వాణ్ని అక్కడ్నుంచి గెంటివేయబోతుంటే, వృద్ధ అవధూత వారించి, తన దగ్గరికి తీసుకురమ్మన్నాడు. స్వామీ! నేను పరమ పాపాత్ముణ్ణి. ఎన్నో పాపాలు చేశాను. కానీ, శివుణ్ని వదల్లేక పోతున్నాను. వీళ్లు నేను వచ్చినప్పుడల్లా బయటికి గెంటేస్తున్నారు. ఈ పాడు జన్మ.. ఉహూ.. అసలు జన్మే వద్దు స్వామీ. నాకు ముక్తి ప్రసాదించు స్వామి అన్నాడు చేతులు జోడించి- ముందుకీ వెనక్కీ ఊగుతూ. అప్పుడు అవధూత నీకిష్టమైనవన్నీ వదిలెయ్యి, నీకు ముక్తి లభిస్తుంది అన్నాడు. ఇప్పుడే... ఈ క్షణంలోనే అన్నీ వదిలేశా అన్నాడు అనంతుడు. నీ పేరు ఏమిటి? అనడి గాడు అవధూత. అనంతుడు అన్నాడు. అన్నీ వదిలేశాక పేరెలా ఉంటుంది? శరీర భ్రాంతి వదలనంతకాలం నువ్వు ఏమీ వదలనట్టే. అరటిపండు తొక్క తీసేసి పారేసి నట్లు దేహ భ్రాంతిని విసిరిపారెయ్యి. అప్పుడు ఆత్మానందం రుచి తెలుస్తుంది. శరీరం ఉన్నా అనుక్షణం ఆత్మానుభూతితో ఉండటమే ముక్తి- అన్నాడు అవధూత.

అర్థమైంది స్వామీ. ఈ క్షణం నుంచీ నేను అనంతుణ్ణి కాను ఆత్మని అన్నాడు. అదే భావన స్థిరపరచుకున్నకొద్దీ అనంతుడు ముక్తికి దగ్గరవుతూ వచ్చాడు. చివరకు అతడు ఆత్మస్థితిని పూర్తిగా అనుభవిస్తూ ప్రాపంచికమైన చీకాకులకు అతీతుడైనాడు.

-వులాపు బాలకేశవులు

వృతాసురుడు

27

బొమ్మలు: శ్రీరామ్



sanjeevani@andhrabhoomi.net

సంజీవిని

వ్యాయామాలు చేసేముందు...

వ్యాయామాలు చేసేముందు వార్మ్ అప్‌కి సమయం తీసుకోవాలి. అలాగే, చేసిన తరువాత కొంచెం సేదదీరాలి. దీనిని కూల్‌డౌన్ అంటారు. వ్యాయామం మోతాదును క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలి. వ్యాయామాలు చేసేటప్పుడు ఆటలాడేటప్పుడు సరైన పాదరక్షలు, పాదాలకు సరిపోయే బూట్లూ ధరించాలి. మరో ముఖ్య విషయం- వ్యాయామాలు చేస్తున్నప్పుడు హఠాత్తుగా వేరేవి మొదలుపెట్టకూడదు. గుట్టలెక్కడం, మెట్లు ఎక్కడం, పరుగెత్తే వేగాన్ని పెంచడం, దూరాలు పెంచడం వంటివి క్రమంగా ప్రవేశపెట్టాలి తప్పితే హఠాత్తుగా కాదు. అలాగే మరో సూచన- కాలి పిక్కల కండరాలను అనునిత్యం సాగదీయటం, బలపరచుకోవటం చేయాలి. ఇలా చేయడంవల్ల ఎకిల్లిస్ టెండాన్ శక్తివంతమవుతుంది. కాలుకు, పాదానికి ఆధారాన్నిస్తుంది. ★

విడాకులే పరిష్కారమా?

★ నా భార్యకు 47 సంవత్సరాల వయస్సు. గత రెండు సంవత్సరాలనుంచి ఆమె విచిత్రంగా ప్రవర్తిస్తున్నది. గంటల తరబడి పూజగదిలో గడుపుతున్నది. గదినిండా రకరకాల దేవుళ్ళ పటాలు పెట్టుకున్నది. ప్రతిదేవునికి ప్రత్యేకంగా పూజ చేస్తుంది. ఒక్కొక్కరికి తొమ్మిదిసార్లు చొప్పున హారతి ఇస్తుంది. అలాగే తొమ్మిదిసార్లు దండం పెడుతుంది. అలా రోజుకు తొమ్మిది సార్లు పూజా కార్యక్రమం నిర్వహిస్తుంది. పూజా సామాగ్రి కడిగేటప్పుడు కూడా తొమ్మిదిసార్లు రుద్దడం, తొమ్మిదిసార్లు నీళ్ళు పోయడం చేస్తున్నది. దీనికి సరైన సలహా చెప్పగలరు.

-జి.ప్రసాదరావు, కర్నూలు

-మీ భార్య అబ్సెసివ్ కంపల్సరీ డిజార్డర్ (ఓసిడి) రుగ్మతతో బాధపడుతున్నది. చేసిందే చేయడం ఈ రుగ్మత లక్షణం. దీర్ఘకాలిక మానసిక వత్తిళ్ళు, కుటుంబ, దాంపత్య సమస్యలు కారణమయి ఉండవచ్చు. ఇతర కారణాల ప్రభావం వుండవచ్చు. మీ దగ్గరలోని సైక్రియాట్రిస్టును సంప్రదించి మందులు వాడవలసి వుంటుంది. అలాగే సరైన కౌన్సెలింగ్ చేయించడం, యోగ, ధ్యాన ప్రక్రియల ద్వారా స్వస్థత కలిగించడం మంచిది.

★ నా వయస్సు 25 సంవత్సరాలు. మెడిసిన్‌లో సీటు సంపాదించలేకపోయాను. ఎంఎస్‌సి కెమిస్ట్రీ చేసి ఒక ప్రయివేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఆరు నెలలనుంచి నన్నెవరో వెంటాడుతున్నట్టు అనిపిస్తున్నది. అప్పుడప్పుడు ఎవరో నా మీద వుమ్ముతున్నట్టు, కొజ్జావాడా అంటూ అవహేళన చేస్తున్నట్టు వినిపిస్తుంది. దీంతో క్లాసులో సరిగ్గా పాఠాలు చెప్పలేకపోతున్నాను. మా అమ్మ, నాన్న విషయం తెలిసి మంత్రాలు వేయించి తాయెత్తులు కట్టించారు. అయినా నా సమస్య పెరుగుతున్నదే తప్ప తగ్గడంలేదు. రిగ్రెషన్ థెరపితో ఇది తగ్గుతుందని చెప్పారు. నిజమేనా? ఈ థెరపి ఎక్కడ చేస్తారో తెలుపండి.

-కె.రమణ, గుంటూరు

-మీరు స్కిజోఫ్రెనియా అన్న మానసిక రుగ్మతో బాధపడుతున్నట్టు అనిపిస్తుంది. లేనిది వున్నట్టు ఏవో మాటలు వినిపిస్తున్నట్టు అనిపించడం ఈ రుగ్మత లక్షణం. మానసిక రుగ్మతల్లో స్కిజోఫ్రెనియా తీవ్రమైనదిగా చెప్పవచ్చు. మంత్రాలు, తాయెత్తులు, రిగ్రెషన్ థెరపీవల్ల ఇది ఏ మాత్రం నయం కాదు. సరైన మానసిక వైద్యులను సంప్రదించి చికిత్స పొందడం మంచిది.

★ నాకు పెళ్లయి ఏడాది కావస్తున్నది. నా భార్య మూలా నక్షత్రంలో పుట్టిన విషయం దాచిపెట్టారు. అది ఈమధ్య బయటపడింది. దీని వల్ల మా తండ్రికి ప్రాణగండం వుందని జ్యోతిష్కులు చెప్పారు. లోపాలు దాచిపెట్టి మోసం చేసిన మా అత్త, మామ, భార్యలకు బుద్ధి చెప్పాలనుకుంటున్నాను. కోర్టు ద్వారా విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. నా నిర్ణయం సరైనదేనా?

-కె.చంగల్రాయలు, అనంతపురం

-విజ్ఞాన సమాజంలో వున్న మీరు మూఢ నమ్మకాలతో భార్యకు విడాకులివ్వడం భావ్యం కాదు. మీకు జాతకాల పట్టింపు ఉన్నట్లయితే ముందుగానే అన్నీ పరిశీలించుకోవాలి. పెళ్ళయిన తరువాత ప్రేమానురాగాలు పంచుకోవాలి. దాంపత్యంలో ప్రేమ, అనురాగం, జాలి, దయ, కరుణ, క్షమ, త్యాగం లాంటి గుణాలు పెంచుకోవాలి. అంతే తప్ప కక్ష, కార్పణ్యం, పగ, ప్రతీకారాలకు తావు ఇవ్వరాదు. ఒకవేళ జాతకాలమీద మీకు అంతగా నమ్మకం వుంటే ఆ దారిలోనే పరిష్కారాలు వుంటాయి. మంచి జ్యోతిష్కులను అడిగి శాంతి కలగడానికి పూజలు చేయించుకోవచ్చు. అంతే తప్ప విడాకులు పరిష్కారం కాదు.

★ నాకు పెళ్ళయి 10 సంత్సరాలైనది. ఇద్దరు పిల్లలువున్నారు. నా భర్తకు నాపై తొలినుంచి అనుమానం వుంది. గత కొంతకాలంగా ఎక్కువయ్యింది. నాకు ఎవరెవరితోనో సంబంధాలు అంటగడుతున్నారు. ఒక్కొక్కసారి పిల్లలముందే నన్ను కులట, వ్యభిచారి అంటూ నిందిస్తున్నారు. ఎన్ని ప్రమాణాలు, రుజువులు చూపినా ఆయన్ను నమ్మించలేకపోతున్నాను. కొంతమంది, ఇరుగుపొరుగు ఆయన మాటలను నమ్ముతున్నారు. నిప్పులేనిదే పొగ రాదు కదా అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. పిల్లలను అనాధల్ని చేయడం ఇష్టం లేక బ్రతుకు వెళ్ళదీస్తున్నాను. దీనికి పరిష్కారం లేదా?

-ఒక సోదరి, తిరుపతి

-దీనికి కౌన్సెలింగ్ చక్కటి పరిష్కారమార్గం. మీ భర్త అనుమానపు రుగ్మత (ప్యారనాయిడ్ సైకోసిస్)తో బాధపడుతున్నారని అర్థం చేసుకోండి. ఆయనకు అనుభవజ్ఞుడైన సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించండి. అవసరాన్ని బట్టి సైకియాట్రిస్ట్ ద్వారా మందులు వాడవలసి వుంటుంది. ముందు మీరు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. ఆత్మహత్య దేనికీ పరిష్కారం కాదని గుర్తించండి. ప్రతికూల భావాలు దరి చేరకుండా జాగ్రత్తపడండి.

★ నా వయస్సు 17 సంవత్సరాలు. ఇంటర్ పాసయ్యాను. నేను చిన్నప్పటినుంచి నత్తితో బాధపడుతున్నాను. చాలామంది డాక్టర్లు చూసి నయం చేయలేకపోయారు. ఇప్పుడు ఒక జ్యోతిష్కున్ని సంప్రదించాను. ఆయన నా గ్రహచారం వల్ల నత్తి వచ్చిందని చెప్పారు. 40 రోజులపాటు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదక్షిణలు చేస్తే తగ్గుతుందని చెప్పారు. నా సమస్యకు మీరిచ్చే సలహా ఏమిటి?

-కె.రవి, మదనపల్లె

-నత్తి మానసిక సమస్య. ఆత్మన్యూనత, విశ్వాసలేమి, ఆతృత, ఆందోళన లాంటి మానసిక బలహీనతలున్నవారికి నత్తివచ్చే అవకాశం వుంది. గుళ్ళు చుట్టడం, దైవప్రార్థనవల్ల కొందరిలో ఆత్మవిశ్వాసం కలిగి ఈ సమస్య కొంతవరకు తగ్గవచ్చునేమో? అయితే కౌన్సెలింగ్, స్పీచ్ థెరపీ ద్వారా మీ సమస్యను తగ్గించవచ్చు. ఒక్కోసారి దీర్ఘకాలిక థెరపీ తీసుకోవలసి వుంటుంది.

★ నా వయస్సు 25 సంవత్సరాలు. ఇంకా పెళ్ళి కాలేదు. నాకు గత కొంతకాలంగా దైవశక్తి ఆవహించింది. భవిష్యత్‌లో జరగబోయేవి నాకు ముందే తెలిసిపోతుంటాయి. అలాగే నేను ఏదైనా చూస్తే, అది గతంలో నాకు తెలిసిందిగానే స్ఫురిస్తుంది. అయితే నా ఈ శక్తిని ఎవరు గుర్తించడంలేదు. అందరిని నమ్మించాలంటే నేనేమి చేయాలి.

-పి.పార్వతి, రాజమండ్రి

-మీరు ఇతరులను నమ్మించే ప్రయత్నం మానండి. మీరొక మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్టు గుర్తించండి. మెదడులోని రసాయన చర్యల్లో తలెత్తే లోపాలవల్ల మీకు అలా అనిపిస్తుంటుంది. మీరు మంచి సైకియాట్రిస్టును కలిసి వైద్యం చేయించుకోండి. అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. ★

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి
Psychologist
nbsreddi@gmail.com
18-4-111/2, రైల్వే కాలనీ,
తిరుపతి - 517 501.

సంతానలేమికి కారణాలివే...

నవీన యుగంలో పోటీతత్వం మనిషిని అనుక్షణం తేరుకోకుండా కాలంతో పరుగులు తీయిస్తుంది. పని ఒత్తిడి మనసు ఎక్కడ కాసేపు నిలకడగా ఉండనీయడంలేదు. ప్రతి క్షణం ఉద్యోగ వ్యాపారాల ధ్యాసే. వేగవంతమైన జీవితం, కలుషిత వాతావరణం, సమయాపాలనా లేని ఆహారం. దీంతో ఆరోగ్యంపట్ల శ్రద్ధ కరువై ఇతర అనారోగ్య సమస్యలతోపాటు 'లైంగికపరమైన' సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ రోజుల్లో చాలామందిని వేధిస్తున్న సమస్య సంతాన లేమి. నిత్య జీవితంలో మానసిక ఒత్తిడి ఎక్కువ కావడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది.

పురుషులలో సంతానలేమికి కారణాలు...

వెరికోజిల్‌వంటి సమస్యలు, జనన అవయవాలకు దెబ్బలు తాకడం, జన్యు సంబంధిత వ్యాధులు ఉండడం, శుక్రకణాలు వచ్చే దారిలో అవరోధాలు ఏర్పడడం, హార్మోన్ల సంబంధిత వ్యాధులుండడం. సుఖవ్యాధులు, ఇన్‌ఫెక్షన్‌లు, మద్యపానం, మానసిక ఒత్తిడి స్మోకింగ్, వెన్నెముకకు గాయాలు కావడం, స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవడం వంటివి ప్రధానంగా పురుషులలో కారణాలుగా పేర్కొనవచ్చు.

స్త్రీలలో సంతాన లేమికి కారణాలు

బహిష్టు సరిగా రాకపోవడం, హార్మోన్ల అసమతుల్యత లోపించడం, మానసిక ఒత్తిడి, పిసిఒడి, అధిక బరువు, ఇన్‌ఫెక్షన్స్ అండం సరిగా విడుదల కాకపోవటం, పిల్లోపియన్ ట్యూబ్స్ మూసుకపోవడం, మాటిమాటికి అబార్షన్ కావడం, థైరాయిడ్ వంటివి స్త్రీలలో సంతాన లేమికి కారణాలుగా చెప్పుకోవచ్చును.

పరీక్షలు

పెళ్లి అయిన ఒకటి లేదా రెండు సంవత్సరాలు అయినా సంతానం కలుగకపోతే పురుషులకు స్పెర్మ్ అనాలిసిస్, స్త్రీలకు అబ్డామినల్ స్కానింగ్, ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, పొల్లిక్యులర్ స్టడీ లాంటి పరీక్షలు చేయించి సమస్యను తెలుసుకోవచ్చు.

లైంగిక సామర్థ్యం తగ్గకుండా ఉండాలంటే...

మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలి. బాదం, ఖర్జూరం, మొలకెత్తిన విత్తనాలు, పాలు, గ్రుడ్లు, తాజా ఆకు కూరలు తీసుకోవాలి. కీర దోస కాయ, క్యారెట్, బీట్‌రూట్‌తో తయారుచేసిన జ్యూస్‌ను రోజు ఉదయం ఒక గ్లాసు తీసుకోవాలి. యపిల్, జామ, దానిమ్మ, ద్రాక్ష, నేరేడు వంటి తాజా పండ్లు తీసుకోవాలి.

మద్యపానం సేవించుట, స్మోకింగ్, గుట్కాలు, పాన్‌పరాగ్, నార్కోటిక్స్ తీసుకోవటం వంటి వ్యసనాలను వదిలివేయాలి. తక్షణ లైంగిక సామర్థ్యం కోసం 'స్టిరాయిడ్స్' నిత్యం వాడటంవలన లైంగిక పటుత్వం క్రమేపి తగ్గి సంతాన లేమి ఏర్పడును.

తీవ్ర మానసిక ఒత్తిళ్ళు హార్మోన్లపై ప్రభావం చూపి లైంగిక సామర్థ్యాన్ని తగ్గించును. కావున మానసిక ఒత్తిడి నివారణకు నిత్యం యోగా, మెడిటేషన్‌తోపాటు ఒత్తిడిలేని మంచి జీవన విధానమును అలవరచుకొనుటకు ప్రయత్నం చేయాలి. ప్రతిరోజు ఉదయం వేకువ జామున 30 ని. నుండి 45 ని.ల వరకు నడవటం వలన మానసిక ప్రశాంతత ఏర్పడి ఒత్తిళ్లను అధిగమించవచ్చును.

> మద్యపానం సేవించుట, స్మోకింగ్, గుట్కాలు, పాన్‌పరాగ్, నార్కోటిక్స్ తీసుకోవటం వంటి వ్యసనాలను వదిలివేయాలి. తక్షణ లైంగిక సామర్థ్యం కోసం 'స్టిరాయిడ్స్' నిత్యం వాడటం వలన లైంగిక పటుత్వం క్రమేపి తగ్గి సంతాన లేమి ఏర్పడును.

చికిత్స

సంతానలేమికి గల కారణాలను వివరంగా తెలుసుకోవాలి. వ్యక్తి మానసిక స్థాయి లక్షణాలను, శరీరక లక్షణాలను, పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత జరిగిన మార్పులను, భయాలను అవగాహన లోపాలను పరిగణనలోకి తీసుకొని కానిస్టిట్యూషన్ పద్ధతిలో ముందు ఎన్నుకొని వైద్యం చేసిన సంతాన ప్రాప్తి కలుగును.

మందులు...హైకోపోడియం

ఈ మందు యువకుల్లో వచ్చే నపుంసకత్వానికిది ముఖ్యమైనది. అతిగా కామకలాపాల్లో పాల్గొనడంవల్ల, హస్తప్రయోగానికి గురై లైంగిక సామర్థ్యం కోల్పోయిన వారికి ఈ మందు ప్రత్యేకమైనది. వీరు మానసిక స్థాయిలో దిగులుగా, ఎప్పుడు ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటారు. ద్వేషం, అహం, పిరికితనం కలిగి ఉంటారు. ముసలితనం ముందుగానే వచ్చినట్లుగా నుదుటిపై ముడతలు పడతాయి. ఎవరైనా కృతజ్ఞతలు తెలిపితే వెంటనే కంట తడి పెడతారు. వీరు స్పెర్మ్ కౌంట్ తక్కువ ఉండి అంగస్తంభన లోపంతో బాధపడుతుంటారు. ఇటువంటి లక్షణాలున్నవారు ఈ మందు వాడి ప్రయోజనం పొందవచ్చును.

నాట్రోమోర్: శుక్రకణాల సంఖ్య పెంచడానికి, నిద్రలో వీర్యస్కలనం అయ్యేవారికి గతం తలుచుకుంటూ బాధపడతారు.

పాస్ఫారస్: పెళ్లి అయి చాలా సంవత్సరాలు గడిచిన సంతాన లేమితో బాధపడేవారికి ఈ మందు బాగా ఉపయోగకరం. వీరికి లైంగిక వాంఛ అధికం. కాని సంభోగించు శక్తిని త్వరగా కోల్పోయి, లైంగిక వాంఛ మాత్రం మిగులుట గమనించదగిన లక్షణం. మానసిక స్థాయిలో వీరు సున్నిత స్వభావులు. ఎదుటివారి సానుభూతిని కోరుకుంటారు. ప్రతిదానికి తేలికగా ఆకర్షితులవుతారు. భయం, ఆందోళన ఎక్కువగా కనిపిస్తాయి. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

ఎగ్నస్ కాక్టస్: వీరు పూర్తిగా నపుంసకత్వంతో బాధపడుతూ ఉంటారు. కామవాంఛ తక్కువగా ఉండి అంగస్తంభన జరగదు. అలాగే స్కలనం కూడా తెలియకుండానే తరచుగా జరుగును. వీరికి సంభోగ వాంఛ కూడా ఉండకపోవుట గమనించదగిన లక్షణం. ఇలాంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు ప్రయోజనకరి.

అమైనొసెటైవా: నిత్యం మద్యం సేవిస్తూ, సరైన నిద్ర లేక నరాల బలహీనత ఏర్పడి, సంభోగ శక్తిని కోల్పోయినవారికి ఈ మందు బాగా ఉపకరిస్తుంది.

సెలిషియా: పెళ్లికి ముందు అతిగా శృంగారంలో పాల్గొన్న, పెళ్లి తర్వాత వంధత్వం లోనైనవారికి ఇది ఆలోచించదగినది.

తుజా: గనేరియా వచ్చి వీర్యకణాల సంఖ్య తగ్గిపోతే ఈ మందు ఉపయోగం.

సెలీనియం: మానసికంగా కామవాంఛ కోరిక ఉన్నా శారీరకంగా అంగస్తంభన జరగక తెలియకుండానే స్కలనం జరిగిపోవును. స్కలనం అనంతరం తీవ్ర నీరసంతో బాధపడేవారికి ఈ మందు ఆలోచించదగినది.

ఈ మందులే కాకుండా డామియానా, కెలాడియం, ఒనాన్‌స్టోడియం, చైనా, పల్సటిల్ల, లేకసిస్, కాల్కేరియాకార్బ్ వంటి మందులను లక్షణ సముదాయమును బట్టి డాక్టర్‌గారి సలహా మేరక వాడుకుని 'సంతాన లేమి' సమస్య నుండి విముక్తి పొందవచ్చును. ★

డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
సెల్‌నెం. 9440229646
హోమియోఫిజిషియన్, అంజనా హోమియోక్లినిక్ ఇం.నెం. 7-1-62/1
శ్రీదేవి థియేటర్ వెనుక, బస్‌స్టాండురోడ్
హన్మకొండ, వరంగల్-506001
E-mail: drpsreedhar@ymail.com

చేతిలో నొప్పిని కలిగించే సిండ్రోమ్!



మణికట్టులోపలి ప్రదేశాన్ని కార్పల్ టన్నెల్ అంటారు. ఇది కార్పెల్ ఎముకలతోను, అడ్డంగా అమరిన లిగమెంటుతోను నిర్మితమవుతుంది. ఒకవేళ ఇది వ్యాధిగ్రస్తమైతే అలాంటి స్థితిని కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ అంటారు. దీనిలో ప్రధానంగా మణికట్టులో ఉండే 'మీడియన్ నరం' మీద ఒత్తిడి పడుతుంది. ఈ వ్యాధిలో హస్తంలోను, చేతివేళ్లలోను, బొటనవేళ్లలోను, ఒకోసారి బాహువు మొత్తంలోనూ నొప్పి, తిమ్మిరి, మొద్దుబారటం, చేతి కండరాల బలహీనపడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

బాహువు లేదా ముంజెయ్యి నుంచి మీడియన్ నరం కార్పల్ టన్నెల్ ద్వారా ప్రయాణించి హస్తంలో అంతమవుతుంది. మామూలు వ్యక్తుల్లో ఈ నరం బొటనవేలు, చూపుడు వేలు, మధ్యవేలు, ఉంగరం వేలులో కొంత భాగంలో స్పర్శను, కదలికలను నియంత్రిస్తుంటుంది. సాధారణ పరిస్థితుల్లో కార్పల్ టన్నెల్ ప్రదేశంలో ఉండే నరానికి, టెండాన్లకు చాలినంతగా స్థలం ఉంటుంది. ఒకవేళ ఈ నిర్మాణాలు బిగుతుగా తయారై ఒరుసుకుపోతే మీడియన్ నరం మీద ఒత్తిడి పడుతుంది.

ఇతర దెబ్బలూ, వ్యాధులతో పోల్చితే కార్పల్ టన్నెల్ వ్యాధివలన ఎక్కువ పనిగంటలకు నష్టం కలుగుతుంటుంది. ప్రతి వందమందిలోనూ కనీసం ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. హస్తంలో సూదులు గుచ్చినట్లు పోట్లుగా అనిపించడం, నొప్పి, తిమ్మిర్లు వంటి లక్షణ సమూహంతో బాధపడేవారిలో 20 శాతం మందికి కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ వ్యాధి ఉంటుంది. పురుషులకంటే మహిళల్లో దీని ఉనికి ఎక్కువ.

కారణాలు...

మీడియన్ నరం మీద ఒత్తిడి కలుగచేసే పరిస్థితులు, రక్తసరఫరాకు ఆటంకం కలిగించే కారణాలు అన్నీ కలిసి కార్పల్ టన్నెల్ సిండ్రోమ్‌ను కలిగిస్తాయి. అవి:

హైపోథైరాయిడిజం, రుమటాయిడ్ ఆర్థ్రరైటిస్, గర్భధారం వంటి స్థితులు కార్పల్ టన్నెల్‌లో కణజాలాన్ని పెంచుతాయి. ఫలితంగా లోపల ఒత్తిడి పెరిగి ఈ వ్యాధి ప్రాప్తిస్తుంది.

మణికట్టుకు దెబ్బలు తగలటం, ఎముకల ఉపరితలం మీద బొడిపెల మాదిరిగా 'బోన్ స్పర్స్' పెరగటం, టెండన్ పొరల్లో వాపు జనించటం వంటి కారణాలవల్ల కార్పల్ టన్నెల్‌లో ఖాళీ జాగా తగ్గిపోతుంది. ముఖ్యంగా మణికట్టును అసహజమైన రీతిలో వంచుతూ పదే పదే ఏదైనా పనిచేసినప్పుడు టెండాన్ పొరలు ఉబ్బి ఈ సమస్యను ఉత్పన్నం చేస్తాయి. పదే పదే ఒకే ప్రదేశంలో దెబ్బ తగలడాన్ని వైద్య పరిభాషలో 'రిపీటెడ్ స్ట్రెయిన్ ఇంజ్యూరీ' అంటారు.

మధుమేహం వంటి స్థితుల్లో అన్ని నరాలూ సున్నితంగా మారినట్లుగానే చేతి మణికట్టులోని మీడియన్ నరం కూడా సెన్సిటివ్‌గా తయారై ఒత్తిడికి స్పందిస్తుంది. ఫలితంగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.

ధూమపానం, మద్యపానాలు రెండూ నరాలను రేగేలా చేస్తాయి ఈ క్రమంలో మీడియన్ నరం ప్రభావితమై తత్సంబధిత లక్షణాలు మొదలయ్యే అవకాశం ఉంది.

లక్షణాలు...

ఈ వ్యాధి కనిపించే అతి సాధారణ లక్షణాలు తిమ్మిరి, మొద్దుబారటం, నొప్పి, కండరాల బలహీనతలు. ఇవి చేతివేళ్లలో ఎక్కువగా కనిపిస్తాయి. అరుదుగా అరిచేతిలోనూ కనిపించవచ్చు. మీడియన్ నరం అధీనంలో ఉన్న ప్రాంతమంతా, అంటే బొటనవేలు, చూపుడువేలు, మధ్యవేలు, ఉంగరం వేలు సగభాగంలో పై లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ప్రారంభంలో రాత్రిపూట లక్షణాలు కనిపించడం మొదలవుతాయి. చెయ్యిని విదిలిస్తే అప్పటికి నొప్పి తగ్గుతుంది. చిటికెనవేలులో వ్యాధి లక్షణాలు కనిపించకపోవడమనేది ఈ వ్యాధిని గుర్తించడానికి తోడ్పడే ప్రధానమైన అంశం. దేనినైనా గట్టిగా పట్టుకున్నప్పుడు లక్షణాలు ఉధృతమౌతాయి. ఉదాహరణకు బ్రష్‌తో పళ్లు తోముకునేటప్పుడు లేదా చెంచాతో ఏదైనా తినేటప్పుడు హఠాత్తుగా చేతివేళ్లలో నొప్పి మొదలవ్వవచ్చు. ఒకోసారి చేతిలోని వస్తువులు పట్టుతప్పి నేలమీద జారిపడిపోతుంటాయి. సీసా మూతలు కలుగుతుందన్నమాట. నరం పనితీరు దెబ్బతిన్నదనటానికి ఇది సూచన. వ్యాధి తీవ్రతను ఇది సూచిస్తుంది.

-మరీ తీవ్రమైన కేసుల్లో థైరాయిడిజం, రుమాటిజం వంటి వ్యధుల ఉనికిని తెలుసుకోవటం కోసం రక్తపరీక్షలు, మీడియన్ నరం స్థితిగతులను తెలుసుకోవటం కోసం నర్వ్ కండక్షన్ టెస్టులు, ఎక్స్‌రే పరీక్షలు, ఎమ్ఆర్ఐ వంటి పరీక్షలు అవసరమౌతాయి.

చికిత్స...

హస్తంలోని కార్పల్ టన్నెల్‌లో ఒత్తిడిని లేదా నొప్పిని తగ్గించటం, నరాలు మున్ముందు మరింత దెబ్బతినకుకుండా నివారించడం, కండరాల శక్తి సామర్థ్యాలను పెంచడం అనేవి ఆయుర్వేద చికిత్సవల్ల సాధ్యమవుతాయి. దీనికి శోధహర ఔషధాలు, వేదనాస్థాపన ఔషధాలు, పంచకర్మ చికిత్సా పద్ధతులు అవసరమవుతాయి. వాతహర ఔషధాలు ఈ వ్యాధి చికిత్సలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వాతం అనేది నాడీ సంబంధ వ్యాధుల్లో ప్రధానంగా దూషితమౌతుంది. ఆయుర్వేద చికిత్సల ద్వారా దీనిని సమస్థితికి తీసుకురావాల్సి ఉంటుంది.

చేతులను, హస్తాలను సాగదీస్తూ చేసే వ్యాయామాలు, చేయి కండరాలను బలపరిచే వ్యాయామాలూ చక్కని ఫలితాలనిస్తాయి. హఠాత్తుగా నొప్పి మొదలైతే ఐస్ గడ్డలను చితక్కొట్టి అరచేయి ఉన్నవైపున మణికట్టుమీద ప్రయోగించాలి. వేడి కాపడాలను, ఐస్ ప్యాక్‌లను మార్చి మార్చి ప్రయోగించవచ్చు.

వ్యాయామ చికిత్సలవల్ల జాయింట్లలో ఒత్తిడి తగ్గుతుంది. కండరాలకు శ్రమను తట్టుకునే శక్తి వస్తుంది. మసాజ్‌తోకూడిన అభ్యంగన చికిత్సవల్ల జాయింటు కదలికలు మెరుగవుతాయి. స్వేదకర్మవల్ల శరీరంలో వేడి పుట్టిరక్తప్రసరణ మెరుగవుతుంది. శీతలోపచారాలవల్ల వాపు, నొప్పి తగ్గుతాయి (చల్లని వస్తువులను ప్రయోగించడాన్ని విపరీతార్థకర చికిత్స అంటారు).

వ్యాధి ప్రారంభావస్థలో ఉన్నప్పుడు రోజువారీగా చేసే పనుల్లో మార్పులూ చేర్పులూ చేసుకుంటే చాలావరకు వ్యాధి తగ్గిపోతుంది. ఒకవేళ ఏదైనా ఒక ప్రత్యేకమైన పనిని పదే పదే చేయటంవల్ల నొప్పి వస్తున్నదనుకుంటే దానిని వీలైనన్ని తక్కువసార్లు, ఎక్కువ విరామంతో చేయాలి. అవసరమైతే మణికట్టు తిన్నగా ఉండేలా పట్టీ (స్ప్లింట్) కట్టుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాత్రిపూట ఇలా చేయటం అవసరం.

మధుమేహం, హైపోథైరాయిడిజం వంటివి ఉన్నాయని తేలితే వాటికి ముందు చికిత్స అవసరమవుతుంది. శస్త్ర చికిత్సలో కార్పల్ టన్నెల్ పైకప్పులో ఉండే లిగమెంటును కత్తిరిస్తారు. ఐతే, వ్యాధివల్ల అంతకుముందే నరం దెబ్బతిని ఉంటే శస్త్ర చికిత్సవల్ల పెద్దగా ఉపయోగం ఉండదు కాబట్టి ప్రారంభంలోనే అప్రమత్తమై తగిన ఔషధ చికిత్సలను, నివారణ పద్ధతులను పాటించడం అవసరం.

-డాక్టర్ చిరుమామిళ్ల మురళీమనోహర్
murali manoharch@hotmail.com
రక్ష ఆయుర్వేదిక్ సెంటర్,
స్టేట్‌హోం ఎదుట,
సారథీ స్టూడియో రోడ్,
అమీర్‌పేట, హైదరాబాద్ - 500 073.

గైనకోమేజియా అంటే...?

ఆడ, మగ, శరీరాలు భిన్నాకృతులలో ఉంటాయి. శరీరంలోని కొన్ని ఎత్తుపల్లాల్ని బట్టి ఆడో, మగో నిర్ణయించగలం. ఆడవాళ్ళకున్న కొన్ని ప్రత్యేక ఆకృతులు మగవాళ్ళ శరీరంలో కనిపిస్తే, ఆ మగవాళ్ళు మానసికంగా కూడా దెబ్బతింటారు. న్యూనతాభావం ఎక్కువవుతుంది.

ఇలాంటి భావాల్ని మగవాళ్ళలో పెంచే విపరీత శరీరాకృతులలో 'గైనకోమేజియా' ఒకటి. గైనకోమేజియా అంటే మగవాళ్లలో ఛాతి ఆడవాళ్ళలోలా పెరగడం. దీనివల్ల శరీరాకృతిలో మార్పు కనిపిస్తున్నా,



కనిపించని కొన్ని జబ్బులు కారణం కావచ్చు. గైనకోమేజియా వున్న వాళ్ళలో సుమారు 90 శాతం మందికి ఎటువంటి జబ్బులుండవు. మిగిలిన 10 శాతంలో కొన్ని జబ్బులవల్ల ఇలా కావచ్చు. ఆ జబ్బులేమిటంటే- టెస్టికల్స్‌లో ట్యూమర్స్ కావచ్చు, బ్రెయిన్ ట్యూమర్స్ కావచ్చు. మేల్ హార్మోన్స్ తక్కువగా ఉత్పత్తి అవుతుండవచ్చు, ఫిమేల్ హార్మోన్స్ ఎక్కువవచ్చు.

గైనకోమేజియా ఏ వయస్సులోనైనా రావచ్చు. పెద్ద వయస్సులో వస్తే సరిగ్గా పరీక్షలు చేయించుకుని, ఏ అనారోగ్యంవల్ల ఇలా రాలేదని నిర్ధారించుకోవాలి. కారణమైన జబ్బుకి చికిత్స చేయించినా కొందరిలో పెరిగిన ఆ ఛాతీ అలాగే ఉంటుంది. దీనివల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. తన మీద తనకి నమ్మకం తగ్గుతుంది. నలుగురితో కలవలేరు. ఒంటరితనం ఎక్కువవుతుంది. ఈ సమస్యల్ని ఇతరులతో చర్చించడానికి ఇష్టపడరు. కాబట్టి బాగా కృంగిపోతారు.

ఈ సమస్య కోసం ఇంత బాధ పడక్కర్లేదు. కాస్మాటిక్ శస్త్ర చికిత్స ద్వారా ఛాతిని మామూలుగా చేయవచ్చు. ఎటువంటి శస్త్ర చికిత్సా ఆనవాళ్లు లేకుండా లైపోసక్షన్ పద్ధతిలో సూత్రప్రకారం ఛాతిలోని ఎక్కువున్న కొవ్వుని మొత్తం తోసేసి మామూలుగా ఉండేట్టు చేయవచ్చు. నిపుల్ వెనుక వున్న చిన్న గ్రంధిని ఛాతిమీద నలుపు, తెలుపుమధ్య వుండే ప్రాంతంలో ఒక సెంటీమీటర్ గాటు ద్వారా తేలికగా తీసివేయవచ్చు. ఈ చిన్న కోత కూడా వారం, పది రోజుల్లో శరీరం రంగులో కలిసిపోతుంది. శస్త్ర చికిత్స తర్వాత మూడు నెలలపాటు ప్రెషర్ గార్మెంట్‌ని ఛాతికి ధరించాల్సి ఉంటుంది.

డాక్టర్ శశికాంత్ మద్దు
సెల్‌నెం. 9581258179
ప్లాస్టిక్‌సర్జన్, గ్లోబల్ హాస్పిటల్
లక్డీకాపూల్,
హైదరాబాద్- 500004

మహేంద్ర సింగ్ ధోనీ

భారత్-ఆస్ట్రేలియా
టెస్టు సిరీస్ షెడ్యూలు..

మొదటి టెస్టు: ఫిబ్రవరి 22 నుంచి 26 వరకు
(చెన్నైలోని చిదంబరం స్టేడియంలో).
రెండో టెస్టు: మార్చి 2 నుంచి 6 వరకు
(హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో).
మూడో టెస్టు: మార్చి 14 నుంచి 18 వరకు
(మొహాలీలోని పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో).
నాలుగో టెస్టు: మార్చి 22 నుంచి 26 వరకు
(ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో).

'బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ'

ఇంగ్లాండ్‌తో ఆస్ట్రేలియా పోటీపడే టెస్టు సిరీస్‌కు 'యాషెస్ సిరీస్' అన్న పేరు ఖాయమైతే, భారత్‌తో మధ్య టెస్టు సిరీస్‌లను 'బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ'గా పిలుస్తున్నారు. 1947లో ప్రారంభమైన ఇరు జట్ల మధ్య టెస్టు సిరీస్‌లు 1995 వరకూ సాధారణ సిరీస్‌ల మాదిరిగానే జరిగాయి. 1996లో ఆస్ట్రేలియా జట్టు భారత్ పర్యటనకు వచ్చినప్పుడు తొలి సారి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇరు జట్ల మధ్య ఈ ట్రోఫీ క్రమం తప్పకుండా జరుగుతోంది.

కాగా, భారత్, ఆస్ట్రేలియా జట్లు 1947 నుంచి ఇప్పటి వరకూ 22 సిరీస్‌లు ఆడి, 82 టెస్టుల్లో ఢీ కొన్నాయి. ఆస్ట్రేలియా 38 విజయాలు సాధించింది. భారత్ 20 మ్యాచ్‌లను గెల్చుకుంది. 23 మ్యాచ్‌లు డ్రాకాగా, ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. ఆస్ట్రేలియాలో 40 మ్యాచ్‌లు జరిగాయి. ఆసీస్ 26, భారత్ 5 మ్యాచ్‌లు సొంతం చేసుకున్నాయి. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. భారత్‌లో 42 మ్యాచ్‌లు జరిగితే, భారత్ 15 విజయాలు సాధించింది. ఆస్ట్రేలియా 12 మ్యాచ్‌లు గెలిచింది. 14 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఒక మ్యాచ్ 'టై' అయింది.

సమవుజ్జీల సమరం

ప్రపంచ దేశాలను శాసించే స్థాయిలో ఉన్న క్రికెట్ దిగ్గజం ఆస్ట్రేలియా. స్వదేశంలో చెలరేగిపోయే అసాధారణ జట్టు టీమిండియా. అన్ని విభాగాల్లోనూ సమవుజ్జీలుగా నిలిచే ఈ రెండు జట్ల మధ్య జరగబోయే ఉత్కంఠ పోరు కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈనెల 22న చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ప్రారంభం కానున్న మొదటి టెస్టులో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌కు తెరలేస్తుంది. టెస్టు క్రికెట్‌లో నంబర్‌వన్‌గా చాలాకాలం వెలిగిపోయిన ఆస్ట్రేలియా వరుస విజయాలకు రెండు సార్లు అడ్డుకట్ట వేసిన ఘనత భారత్‌దే. ఒక ప్పుడు ఆసీస్ పూర్తి ఆధిపత్యాన్ని చెలాయిస్తే, ఆతర్వాత కాలంలో భారత్ ఎదురుదాడికి దిగడం ఆరంభించింది. ఈ కారణంగానే జయా పజయాల పట్టికలో భారీ తేడా కనిపించడం లేదు. మరోవైపు ఆసీస్‌తో టీమిండియా టెస్టు అనగానే కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ మ్యాచ్, అందులో వివిఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ విజృంభణ గుర్తుకొస్తాయి. అనూహ్య ఫలితాన్ని సాధించి పెట్టిన ఆ మ్యాచ్ గురించి ఎంత వర్ణించినా తక్కువే. టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఒక జట్టు ఫాలోఆన్ ఆడి, ఆతర్వాత మ్యాచ్‌ని నెగ్గిన సంఘటనలు రెండే రెండు. వాటిలో ఒకటి ఈడెన్ గార్డెన్స్ మ్యాచ్. లక్ష్మణ్, ద్రవిడ్ ఐదో వికెట్‌కు 376 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి, ఆస్ట్రేలియా పరాజయాన్ని శాసించారు. భారత్‌కు అచ్చొచ్చిన ఈడెన్ గార్డెన్స్‌లోనే అంతకు ముందు మహమ్మద్ అజరుద్దీన్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియాను ఇన్నింగ్స్ 219 పరుగుల తేడాతో ఓడించి సంచలనం సృష్టించింది. ఆసీస్‌పై భారత్‌కు అదే భారీ విజయం. అయితే, రెండు జట్ల మధ్య జరిగిన టెస్టుల్లో అత్యధిక తేడాతో గెలుపొందిన రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉంది. 1947 బ్రిస్బేన్ టెస్టును ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 226 పరుగుల తేడాతో గెలుచుకుంది. 1948 మెల్‌బోర్న్ టెస్టును ఇన్నింగ్స్ 177 పరుగులు, 2000 సిడ్నీ టెస్టును ఇన్నింగ్స్ 141 పరుగులు, 1959 ఢిల్లీ టెస్టును ఇన్నింగ్స్ 127 పరుగుల ఆధిక్యంతో సొంతం చేసుకుంది. 1979 ముంబయి టెస్టులో ఆసీస్‌పై భారత్ ఇన్నింగ్స్ వంద పరుగుల తేడాతో గెలిచింది. అత్యల్ప తేడాతో గెలిచిన రికార్డు భారత్‌ది. 2004 ముంబయి టెస్టును భారత్ 13 పరుగుల తేడాతో సొంతం చేసుకుంది. 1977 బ్రిస్బేన్ టెస్టును 16 పరుగులు, 1992 అడిలైడ్ టెస్టును 38 పరుగుల తేడాతో ఆసీస్ కైవసం చేసుకుంది. వికెట్ల పరంగా చూస్తే, 2010 మొహాలీ టెస్టులో ఒక వికెట్, 1964 ముంబయి టెస్టులో రెండు వికెట్లు, 2001 చెన్నై టెస్టును రెండు వికెట్ల తేడాతో భారత్ గెల్చుకుంది. 1977 పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా కూడా రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

జయాపజయాలు..

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు సిరీస్ 1947లో ప్రారంభమైంది. అంతగా అనుభవం లేని భారత్‌పై రెచ్చిపోయిన ఆస్ట్రేలియా 4-0 తేడాతో విజయభేరి మోగించింది. ఒక మ్యాచ్‌ని భారత్ అతి కష్టం మీద డ్రా చేసుకోగలిగింది. 1956లో ఆస్ట్రేలియా జట్టు భారత్‌కు వచ్చింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆసీస్ 2-0 తేడాతో గెల్చుకుంది. ఒక మ్యాచ్ డ్రా అయింది. 1959లో మరోసారి భారత్ పర్యటనకు వచ్చిన ఆసీస్ తొలిసారి పరాజయాన్ని చవిచూసింది. సిరీస్‌ను 2-1 తేడాతో గెల్చుకున్నప్పటికీ, మొదటి సారి భారత్ ఓ మ్యాచ్‌ని గెలవడం, మరో రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకోవడం విశేషం. 1964లో ముచ్చటగా మూడోసారి భారత్‌కు వచ్చిన ఆస్ట్రేలియా సిరీస్‌ను డ్రా చేసుకుంది. రెండు జట్ల మధ్య సిరీస్ డ్రా కావడం అదే మొదటిసారి. భారత జట్టు బలం పుంజుకుంటున్నదన్న వాస్తవం ఆసీస్‌కు తెలిసొచ్చింది. ఈ సిరీస్‌లో చెరొక మ్యాచ్‌ని సొంతం చేసుకుంటే, మరో మ్యాచ్ డ్రా అయింది. అయితే, 1967లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్ దారుణ పరాజయాలను మూటగట్టుకుంది. నాలుగు టెస్టులను గెల్చుకున్న ఆస్ట్రేలియా 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. 1969లో భారత్‌కు వచ్చినప్పుడు కూడా ఆసీస్ ఆధిపత్యాన్ని కనబరచింది. 3-1 తేడాతో సిరీస్‌ను గెల్చుకుంది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. 1977లో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. సునీల్ గవాస్కర్ మూడు సెంచరీలు బాదినప్పటికీ, ఆ సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-2 తేడాతో తన ఖాతాలో వేసుకుంది. అయితే, ఆస్ట్రేలియా గడ్డపై ఆసీస్‌కు గట్టిపోటీనివ్వడం విశేషం. 1979లో ఆసీస్ జట్టు భారత్‌కు వచ్చి పరాజయాన్ని చవిచూసింది. సుమారు పదిన్నర సంవత్సరాల తర్వాత భారత గడ్డపై కాలుమోపిన ఆ జట్టు ఆరు టెస్టులు ఆడింది. నాలుగు మ్యాచ్‌లు డ్రాకాగా, భారత్ రెండు మ్యాచ్‌లను గెల్చుకుంది. ఆసీస్‌పై భారత్‌కు అదే తొలి సిరీస్ విజయం. 1980లో ఆస్ట్రేలియా వెళ్లిన భారత్ మూడు టెస్టులు ఆడి, ఒక మ్యాచ్‌ని గెలిచింది. మరో మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధించగా, మరో మ్యాచ్ డ్రా అయింది. 1985లో భారత్ మరోసారి ఆస్ట్రేలియా వెళ్లింది. మూడు మ్యాచ్‌లు ఆడగా, అన్నీ డ్రాగా ముగిశాయి. 1986లో ఆస్ట్రేలియా జట్టు భారత్ వచ్చినప్పుడు మరోసారి ఫలితం తేలలేదు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో రెండు డ్రాకాగా, ఒక మ్యాచ్ 'టై' అయింది. గ్రెగ్ మాథ్యూస్ బౌలింగ్‌లో మనీందర్ సింగ్‌ను ఎల్‌బిగా ప్రకటించడం వివాదానికి దారి తీసింది. అయితే, అతను అవుటైనట్టు అంపైర్లు నిర్ణయించడంతో, టెస్టు క్రికెట్ చరిత్రలోనే 'టై'గా ముగిసిన రెండో మ్యాచ్‌గా రికార్డు పుటల్లోకి ఎక్కింది. 1991లో ఆస్ట్రేలియా వెళ్లిన భారత్ ఐదు మ్యాచ్‌లు ఆడి నాలుగు పరాజయాలను చవిచూసింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. 1996లో ఆసీస్ జట్టు భారత్‌లో పర్యటించి, ఒకే ఒక టెస్టును ఆడింది. భారత్ ఆ మ్యాచ్‌ని ఏడు వికెట్ల తేడాతో గెల్చుకుంది. 1997లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనేందుకు భారత్ వచ్చిన ఆస్ట్రేలియా 1-2 తేడాతో ఓటమిపాలైంది. 1999లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్ 0-3 తేడాతో ఓటమిపాలైంది. ఆడిన అన్ని మ్యాచ్‌లనూ ఆసీస్ సొంతం చేసుకుంది. 2000లో ఆసీస్ జట్టు భారత్‌కు వచ్చినప్పుడు మరోసారి ఓటమిని చవిచూసింది. మూడు టెస్టుల్లో భారత్ రెండు విజయాలు సాధించగా, ఆసీస్ ఒక మ్యాచ్‌లో నెగ్గింది. 2003లో భారత జట్టు ఆస్ట్రేలియాకు వెళ్లి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను డ్రా చేసుకుంది. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలిచాయి. రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. 2004లో భారత్‌కు వచ్చిన ఆస్ట్రేలియా 2-1 తేడాతో గెలుపొందింది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. 2007లో ఆస్ట్రేలియాకు వెళ్లిన భారత్ నాలుగు టెస్టులు ఆడి కేవలం ఒక మ్యాచ్‌ని గెల్చుకుంది. మరో మ్యాచ్ డ్రాకాగా, రెండు మ్యాచ్‌లను సొంతం చేకున్న ఆస్ట్రేలియా సిరీస్‌ను కైవసం చేసుకుంది. 2008లో భారత్ వచ్చి నాలుగు టెస్టులు ఆడిన ఆస్ట్రేలియా రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకోగలిగింది. మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలై, సిరీస్‌ను 0-2 తేడాతో కోల్పోయింది. 2010 చివరిలో ఆసీస్ జట్టు మరోసారి భారత్ వచ్చింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలైంది. 2011లో ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత్‌ను ఆసీస్ 'క్లీన్ స్వీప్' చేసింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఆసీస్‌దే పైచేయికాగా, ధోనీ కెప్టెన్సీలోని భారత్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకొని స్వదేశానికి తిరిగి వచ్చింది. గతంతో పోలిస్తే ఎంత మెరుగ్గా కనిపిస్తున్న టీమిండియా ఈసారి ఆసీస్‌కు ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి. గత ఏడాది ఆస్ట్రేలియాలో ఎదురైన చేదు అనుభవానికి ధోనీ సేన ప్రతీకారం తీర్చుకుంటుందని అభిమానుల ఆశ. దీనిని టీమిండియా ఆటగాళ్లు నెరవేరుస్తారో లేక ఆశలపై నీళ్లు చల్లుతారో చూడాలి. **- మైత్రేయి**

కెప్టెన్లు వీరే...

ఆస్ట్రేలియాపై భారత్‌కు 15 మంది, భారత్‌పై ఆస్ట్రేలియాకు 14 మంది కెప్టెన్లుగా వ్యవహరించారు. ఇరు జట్లకు సారథ్యం వహించిన ఆటగాళ్లు..

భారత జట్టుకు..

లాలా అమర్‌నాథ్, పాలీ ఉమ్రిగర్, రాంచంద్, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, చందూ బోర్డే, బిషన్ సింగ్ బేడీ, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, మహమ్మద్ అజరుద్దీన్, సచిన్ తెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, అనీల్ కుంబ్లే, వీరేందర్ సెవాగ్, మహేంద్ర సింగ్ ధోనీ.

ఆస్ట్రేలియాకు..

డొనాల్డ్ బ్రాడ్‌మన్, జాన్సన్, లిండ్‌వాల్, బెనాడ్, బాబ్ సింప్సన్, లారీ, కిమ్ హ్యూజెస్, గ్రెగ్ చాపెల్, అలాన్ బోర్డర్, మార్క్ టేలర్, స్టీవ్ వా, ఆడం గిల్‌క్రిస్ట్, రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్.

పటౌడీ ఘనత..

భారత జట్టుకు నాయకత్వం వహించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు పుస్తకాల్లో స్థానం సంపాదించిన మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ ఆస్ట్రేలియాపై ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన కెప్టెన్‌గానూ మరో రికార్డు సృష్టించాడు. 1985-1992 మధ్యకాలంలో పటౌడీ 11 మ్యాచ్‌లలో భారత జట్టుకు నాయకత్వం వహించాడు. ఆస్ట్రేలియా తరపున అలాన్ బోర్డర్, రికీ పాంటింగ్ కూడా చెరి 11 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించారు. బాబ్ సింప్సన్, స్టీవ్ వా చెరి 10 టెస్టులకు నాయకత్వం వహించారు. సౌరవ్ గంగూలీ, సునీల్ గవాస్కర్ చెరి తొమ్మిది మ్యాచ్‌లలో జట్టుకు సారథ్య బాధ్యతలు నిర్వహించారు.

భజ్జీ టాప్..

ఆస్ట్రేలియాపై ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితాలో హర్భజన్ సింగ్‌ది అగ్ర స్థానం. 2001 చెన్నై టెస్టులో అతను 80.1 ఓవర్లు బౌల్ చేసి, 217 పరుగులిచ్చి 15 వికెట్లు సాధించాడు. జసూభాయ్ పటేల్ 1959 కాన్పూర్ టెస్టులో 14 వికెట్లతో రెండో స్థానంలో ఉండగా, అనీల్ కుంబ్లేతోపాటు భజ్జీ 13 వికెట్లు కూల్చి మూడో స్థానాన్ని సంయుక్తంగా ఆక్రమించాడు. ఆస్ట్రేలియా తరపున డేవిడ్సన్, రీడ్, డైమాక్ తలా 12 చొప్పున వికెట్లు కూల్చారు.

భారీ భాగస్వామ్యాలు..

భారత్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లలో భారీ భాగస్వామ్యాల రికార్డు ఆస్ట్రేలియా ఆటగాళ్లు మైఖేల్ క్లార్క్, రికీ పాంటింగ్ నెలకొల్పారు. 2012 అడిలైడ్ టెస్టులో వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 376 పరుగులు జోడించారు. 2001 కోల్‌కతా టెస్టులో వివిఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ ఐదో వికెట్‌కు 376 పరుగులు, 2010 బెంగళూరు టెస్టులో మురళీ విజయ్, సచిన్ తెండూల్కర్ మూడో వికెట్‌కు 308 పరుగులు చొప్పున భాగస్వామ్యాలను అందించారు. 1986 ముంబయి టెస్టులో దిలీప్ వెంగ్‌సర్కార్, రవిశాస్త్రి ఆరో వికెట్‌కు అజేయంగా 298 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు.

'ఎక్స్‌ట్రాలు'

ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక ఎక్స్‌ట్రాలు ఇచ్చిన జట్టు ఆస్ట్రేలియా. 2008 అక్టోబర్ 29 ఢిల్లీ టెస్టులో ఈ జట్టు ఏకంగా 57 అదనపు పరుగులను ధారాదత్తం చేసింది. వీటిలో 28 బైస్, 17 లెగ్‌బైస్, రెండు వైడ్స్, 10 నోబాల్స్ ఉన్నాయి. భారత్ విషయానికి వస్తే, 2008 అక్టోబర్ 9 బెంగళూరు టెస్టులో 52 పరుగులను అదనంగా సమర్పించుకుంది. ఇందులో 23 బైస్, మరో 23 లెగ్‌బైస్ ఉండగా, ఆరు నోబాల్స్.

అత్యధిక స్కోర్లు..

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇంత వరకూ జరిగిన టెస్టుల్లో అత్యధిక స్కోర్ల వివరాలు.. (600 లేదా అంతకు మించిన స్కోర్లు..)

2004 జనవరి 2: భారత్ 7/705 డిక్లేర్డ్ (సిడ్నీ టెస్టు).
1948 జనవరి 23: ఆస్ట్రేలియా 674 (అడిలైడ్ టెస్టు).
2012 జనవరి 3: ఆస్ట్రేలియా 4/659 డిక్లేర్డ్ (సిడ్నీ టెస్టు).
2001 మార్చి 11: భారత్ 7/657 డిక్లేర్డ్ (కోల్‌కతా టెస్టు).
1998 మార్చి 18: భారత్ 5/633 డిక్లేర్డ్ (కోల్‌కతా టెస్టు).
2008 అక్టోబర్ 29: భారత్ 7/613 డిక్లేర్డ్ (ఢిల్లీ టెస్టు).
2012 జనవరి 24: ఆస్ట్రేలియా 7/604 డిక్లేర్డ్ (అడిలైడ్ టెస్టు).
1986 జనవరి 2: భారత్ 4/600 డిక్లేర్డ్ (సిడ్నీ టెస్టు).

అత్యల్ప స్కోర్లు ఇవే (100 పరుగుల లోపు)..

1947 నవంబర్ 28: భారత్ 58 ఆలౌట్ (బ్రిస్బేన్ టెస్టు).
1948 ఫిబ్రవరి 6: భారత్ 67 ఆలౌట్ (మెల్‌బోర్న్ టెస్టు).
1981 ఫిబ్రవరి 7: ఆస్ట్రేలియా 83 ఆలౌట్ (మెల్‌బోర్న్ టెస్టు).
2004 నవంబర్ 3: ఆస్ట్రేలియా 93 ఆలౌట్ (ముంబయి టెస్టు).
1947 నవంబర్ 28: భారత్ 98 ఆలౌట్ (బ్రిస్బేన్ టెస్టు).

సెంచరీ వీరులు..

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకూ జరిగిన టెస్టు సిరీస్‌లలో సచిన్ తెండూల్కర్ అత్యధికంగా 11 సెంచరీలు చేశాడు. సునీల్ గవాస్కర్, రికీ పాంటింగ్ చెరి 8 సెంచరీలతో రెండో స్థానాన్ని ఆక్రమించారు. డేవిడ్ బూన్, మాథ్యూ హేడెన్, వివిఎస్ లక్ష్మణ్ తలా ఆరేసి సెంచరీలతో మూడో స్థానంలో ఉన్నారు.

కాగా, పాంటింగ్ ఖాతాలో భారత్‌పై మూడు డబుల్ సెంచరీలు ఉన్నాయి. మైఖేల్ క్లార్క్, వివిఎస్ లక్ష్మణ్, సచిన్ తెండూల్కర్ తలా రెండేసి డబుల్ సెంచరీలు సాధించారు. రాహుల్ ద్రవిడ్, జస్టిన్ లాంగర్, కిమ్ హ్యూజెస్, డీన్ జోన్స్, రవి శాస్త్రి, గౌతం గంభీర్, గ్రెగ్ చాపెల్, మాథ్యూ హేడెన్, బ్రాడ్‌మన్ తలా ఒక్కో డబుల్ సెంచరీ చేశారు. 1948 అడిలైడ్ టెస్టులో ఆసీస్ బ్యాట్స్‌మన్ 198 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, దురదృష్టవశాత్తు డబుల్ సెంచరీ చేయలేకపోయాడు. 2003 మెల్‌బోర్న్ టెస్టులో భారత ఓపెనర్ వీరేందర్ సెవాగ్ 195 పరుగులకు అవుటై, డబుల్ సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్నాడు.

అర్ధ శతకాల్లో సచిన్ తెండూల్కర్ అగ్రస్థానంలో నిలిచాడు. అతను ఆసీస్‌పై ఇప్పటి వరకూ 26 అర్ధ సెంచరీలు సాధించాడు. రికీ పాంటింగ్ 20, వివిఎస్ లక్ష్మణ్ 18 అర్ధ సెంచరీలతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

ఇన్నింగ్స్ విజయాలు..

ఆస్ట్రేలియా 11, భారత్ మూడు పర్యాయాలు ఇన్నింగ్స్ తేడాతో విజయాలను సాధించాయి. ఈ మ్యాచ్‌ల వివరాలు..

1947 మార్చి 28: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 226 పరుగులు (బ్రిస్బేన్ టెస్టు).
1998 మార్చి 18: భారత్-ఇన్నింగ్స్ 219 పరుగులు (కోల్‌కతా టెస్టు).
1948 ఫిబ్రవరి 6: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 177 పరుగులు (మెల్‌బోర్న్ టెస్టు).
2000 జనవరి 2: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 141 పరుగులు (సిడ్నీ టెస్టు).
1959 డిసెంబర్ 12: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 127 పరుగులు (ఢిల్లీ టెస్టు).
1979 నవంబర్ 3: భారత్-ఇన్నింగ్స్ 100 పరుగులు (ముంబయి టెస్టు).
2012 జనవరి 3: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 68 పరుగులు (సిడ్నీ టెస్టు).
1960 జనవరి 13: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 55 పరుగులు (చెన్నై టెస్టు).
2012 జనవరి 13: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 37 పరుగులు (పెర్త్ టెస్టు).
1948 జనవరి 23: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 16 పరుగులు (అడిలైడ్ టెస్టు).
1956 అక్టోబర్ 19: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 5 పరుగులు (చెన్నై టెస్టు).
1967 డిసెంబర్ 30: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 4 పరుగులు (మెల్‌బోర్న్ టెస్టు).
1981 జనవరి 2: ఆస్ట్రేలియా-ఇన్నింగ్స్ 4 పరుగులు (సిడ్నీ టెస్టు).
1978 జనవరి 7: భారత్-ఇన్నింగ్స్ 2 పరుగులు (సిడ్నీ టెస్టు).

◦ పరుగుల విషయానికి వస్తే, 2004 అక్టోబర్ 26న నాగపూర్ టెస్టులో ఆస్ట్రేలియా 342 పరుగుల భారీ ఆధిక్యంతో గెలుపొందింది. భారత్ 2008 అక్టోబర్ 17న ముగిసిన మొహాలీ టెస్టులో 320 పరుగుల తేడాతో విజయం సాధించింది.

◦ పరుగుల్లో స్వల్ప తేడాతో నెగ్గిన జాబితాలో భారత్ అగ్రస్థానంలో ఉంది. 2004 నవంబర్ 3న ముంబయిలో ముగిసిన మ్యాచ్‌ని ఈ జట్టు వికెట్ తేడాతో గెల్చుకుంది. ఆస్ట్రేలియా 1977 డిసెంబర్ 2న ముగిసిన బ్రిస్బేన్ టెస్టును 16 పరుగుల తేడాతో కైవసం చేసుకుంది.

◦ పది వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సాధించిన అంశంలో ఆస్ట్రేలియాదే రికార్డు. భారత్‌పై ఈ జట్టు మూడు పర్యాయాలు పది వికెట్ల తేడాతో, ఒకసారి తొమ్మిది వికెట్ల తేడాతో, మరో మూడు సార్లు ఎనిమిది వికెట్ల ఆధిక్యంతో విజయాలను నమోదు చేసింది. భారత్ మూడు పర్యాయాలు ఆస్ట్రేలియాను ఏడు వికెట్ల తేడాతో చిత్తుచేసింది.

కీపర్లలో మేటి గిల్‌క్రిస్ట్

భారత్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లలో అత్యధికంగా 75 మందిని అవుట్ చేసిన ఘనత ఆసీస్ వికెట్‌కీపర్ ఆడం గిల్‌క్రిస్ట్‌ది. భారత కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 43, సయ్యద్ కిర్మాణీ 41 మందిని అవుట్ చేసి రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. హాడిన్ 31, ఇయాన్ హీలీ 26, రిక్సన్ 22, గ్రౌట్ 20 మందిని అవుట్ చేశారు.

పాప్‌కార్న్

తిరుగులేని సచిన్..

ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెండూల్కర్ తిరుగులేని రికార్డులను నెలకొల్పాడు. *35* టెస్టుల్లో, *67* ఇన్నింగ్స్ ఆడిన అతను *3,438* పరుగులు సాధించాడు. ఆస్ట్రేలియాపై అతని అత్యధిక స్కోరు *241* (నాటౌట్) పరుగులు. ఈ విభాగంలో ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్‌ది రెండో స్థానం. అతను *29* టెస్టులు, *51* ఇన్నింగ్స్‌లో *2,555* పరుగులు చేశాడు. భారత స్టార్ ఆటగాడు వివిఎస్ లక్ష్మణ్ కూడా *29* టెస్టులు ఆడినా, *54* ఇన్నింగ్స్‌లో *2,434* పరుగులు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ *32* టెస్టులు, *60* ఇన్నింగ్స్‌లో *2,143* పరుగులు చేశాడు. అతనిది ఈ జాబితాలో నాలుగో స్థానం.

కాగా, ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు ఆస్ట్రేలియా ప్రస్తుత కెప్టెన్ మైఖేల్ క్లార్క్ నమోదు చేశాడు. *2012* జనవరి *3*న సిడ్నీ టెస్టులో అతను *468* బంతులు ఎదుర్కొని, *39* ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా *329* పరుగులు సాధించాడు. జాబితాలో రెండో స్థానాన్ని లక్ష్మణ్ ఆక్రమించాడు. అతను *2001* మార్చి *11*న కోల్‌కతా టెస్టులో *281* పరుగులకు అవుటయ్యాడు. *452* బంతులు ఎదుర్కొన్న అతను *44* ఫోర్లతో ఈ స్కోరు సాధించాడు. మూడో స్థానంలో నిలిచిన పాంటింగ్ *3003* మెల్‌బోర్న్ టెస్టులో *458* బంతులు ఎదుర్కొని, *25* ఫోర్లతో *257* పరుగులు నమోదు చేశాడు.

సూపర్ బౌలర్ కుంబ్లే

భారత్ తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన అనీల్ కుంబ్లే ఆస్ట్రేలియాపైనా అద్భుతంగా రాణించాడు. *1996-2008* మధ్యకాలంలో *20* మ్యాచ్‌లు *(38* ఇన్నింగ్స్*)* ఆడిన అతను *111* వికెట్లు పడగొట్టి, సూపర్ బౌలర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఒక ఇన్నింగ్స్‌లో *141* పరుగులకు ఎనిమిది వికెట్లు అతని అత్యుత్తమ విశ్లేషణ. హర్భజన్ సింగ్ *16* టెస్టులు *(31* ఇన్నింగ్స్*)*లో *90*, కపిల్ దేవ్ *20* టెస్టులు *(38* ఇన్నింగ్స్*)*లో *79* చొప్పున వికెట్లు కూల్చారు. ఉత్తమ బౌలింగ్ ప్రదర్శనలో మొదటి మూడు స్థానాలు భారత్‌కే లభించడం విశేషం. ఆస్ట్రేలియా తరపున బ్రెట్ లీ అత్యధికంగా *53* వికెట్లు పడగొట్టాడు. ఒక ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ విశ్లేషణ విషయానికి వస్తే, జాసూభాయ్ పటేల్‌కు అగ్ర స్థానం దక్కుతుంది. *1959* కాన్పూర్ టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో అతను *35.5* ఓవర్లు బౌల్ చేసి, *69* పరుగులకు తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. అనిల్ కుంబ్లేతోపాటు, హర్భజన్ సింగ్, కపిల్ దేవ్, జాసన్ క్రెజా ఒకే ఇన్నింగ్స్‌లో తలా ఎనిమిది వికెట్ల చొప్పున పడగొట్టి రెండో స్థానంలో కొనసాగుతున్నారు. హర్భజన్ సింగ్, లిండ్‌వాల్ రెండేసి పర్యాయాలు ఒక ఇన్నింగ్స్‌లో ఏడేసి వికెట్లు కూల్చారు. ఏడు వికెట్ల బౌలర్లలో విట్నీ, కుంబ్లే, గులాం అహ్మద్, మెక్వెన్నీ, డైమాక్, బెనాడ్, డేవిడ్సన్, బిషన్ సింగ్ బేడీ, హిగ్స్ కూడా ఉన్నారు.

అగార్కర్‌కూ ఓ రికార్డు!

ఆస్ట్రేలియాపై టెస్టుల్లో భారత ఆటగాడు అజిత్ అగార్కర్ పేరిట కూడా ఒక రికార్డు ఉంది. *1999-2004* మధ్యకాలంలో తొమ్మిది మ్యాచ్‌లు *(16* ఇన్నింగ్స్*)* ఆడిన అతను ఎనిమిది సార్లు డకౌట్ అయ్యాడు. ఇదీ ఒక రికార్డే. భారత్‌కే చెందిన మరో క్రికెటర్ జహీర్ ఖాన్ *19* మ్యాచ్‌లు *(32* ఇన్నింగ్స్*)* ఆడి *7* సున్నాలతో రెండో స్థానంలో ఉన్నాడు. మూడో స్థానంలోనూ భారత్‌కు వాటా లభించింది. షేన్ వార్న్‌తో కలిసి భగవత్ చంద్రశేఖర్ ఆరు పర్యాయాలు డకౌటై, సంయుక్తంగా రికార్డును పంచుకుంటున్నాడు. **- సత్య**

చిట్కాలు

★ దుస్తులు ఉతికిన తర్వాత చేతులను వెనిగర్ లేదా నిమ్మరసంతో శుభ్రం చేసుకుంటే ఎలాంటి మరకలూ అంటుకోవు.

★ నిమ్మరసంలో పంచదార కలిపి చేతులకు రాసుకుంటే అవి నాజూగ్గా ఉంటాయి.

★ అధిక వేడి, అతి శీతల పదార్థాలను చేతితో తాకరాదు. ఇలా చేస్తే చేతులకు బిరుసుదనం ఏర్పడే ప్రమాదం ఉంది.

★ మోచేతులపై చర్మం నలుపుగా మారితే నిమ్మచెక్కలతో బాగా మర్దనా చేసుకోవాలి.

★ నిమ్మరసంలో కాస్త ఆలివ్ నూనె లేదా గ్లిజరీన్ కలిపి చేతులకు రాసుకుంటే అవి మృదుత్వాన్ని సంతరించుకుంటాయి.

★ దుస్తులు ఉతికిన పుడు డిట

ర్జంట్ సబ్బుల వల్ల చేతులకు హాని జరగకుండా గ్లోవ్స్ వాడడం మంచిది. నాణ్యత లేని సబ్బులను వాడితే చేతులకే ప్రమాదం.

★ రోజుకు ఒకసారైనా గోరువెచ్చని నీటిలో చేతులను అయిదు నిమిషాల సేపు ఉంచితే అవి కోమలంగా మారతాయి.

★ వంట పాత్రలను శుభ్రపరిచిన పుడు వేలికి ఉంగరాలను, చేతి గాజులను తీసివేయడం మంచిది. ఇలా చేస్తే బంగారు ఆభరణాలను అరుగుదల నుంచి కాపాడవచ్చు.

★ చేతులపై రోమాలను తీసివేయాలనుకుంటే కోల్డ్‌వాక్స్‌ను మృదువుగా రాస్తే మంచిది. రోమాలు ఊడిపోయాక చేతులను కోల్డ్‌క్రీమ్‌తో మర్దనా చేసుకోవాలి.

స్నేహబంధమే అద్భుత వైద్యం

టీనేజీ సైకాలజీ

'దీప చాలా ఎక్కువగా మాట్లాడుతుంది కదండీ' అంది మా ఆవిడ.

తన కామెంట్‌కి చటుక్కున తలెత్తి చూసాను. ఎందుకో చురుక్కుమనిపించింది ఆ స్టేట్‌మెంట్.

''వాగుడుకాయలా చెత్త మాట్లాడటం వేరు, విషయం ఉండి మాట్లాడటం వేరు. మేటర్ లేనిదే దీప ఎప్పుడూ మాట్లాడదు. పిచ్చాపాటి కబుర్లపై ఆసక్తిచూపదు'' అంది ప్రత్యూష.

కొందరు కొందరితో ఎక్కువగా మాట్లాడతారు, ఇంకొందరితో తక్కువగా మాట్లాడతారు. మాట్లాడటం అనేది ఇష్టాయిష్టాలపైన ఆధారపడి ఉంటుంది. కొంతమంది కొత్తవారైనా ఎక్కువగానే మాట్లాడగలుగుతారు... దాపరికాలు లేకుండా మాట్లాడతారు... దానికి కారణం ఆ విషయాలను మరొకరి చెవిన వెయ్యరన్న భరోసా ఉండడమే.

దీప ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ చదువుకుంటోంది. పగలు నాలుగైదు గంటలు పార్ట్‌టైమ్ జాబ్‌చేస్తూ సాయంత్రాలు తరగతులకు హాజరవుతుంది. పేరెంట్స్ సంపాదనపై తన చదువు కొనసాగకూడదన్నది ఆమె సిద్ధాంతం. నేటి యువతలో చాలామంది విద్యార్థి జీవితాన్ని ఇలానే కొనసాగిస్తుంటారు. 'పర్క్ అండ్ స్టడీ' అన్నది వారి పాలసీ. ఇలా స్టడీ కల్చర్‌తోపాటు పర్క్ కల్చరూ టీనేజీ నుంచే అలవడుతుంది. ఎవరు ఎక్కువ మాట్లాడతారు? ఎవరు తక్కువ మాట్లాడతారు? అనే దానికంటే ఆ మాటల్లో విషయ సాంద్రత ముఖ్యం. టీనేజీ పిల్లలు ఎక్కువగా మాట్లాడటం సర్వసాధారణం. దీప వంటి రిజర్వ్‌డ్ టీనేజర్స్ కాస్త ఎక్కువగా మాట్లాడినా అధికంగా మాట్లాడినట్లనిపించటం సహజమే! అసలు టీనేజర్స్‌నే వాగుడుకాయలని నిందించటం ఎందుకు? ఎక్కువగా మాట్లాడేవారు అన్ని వయసుల్లోనూ ఉంటారు. కొంతమందైతే ఎవరితో మాట్లాడుతున్నా తమను గురించి డైరెక్ట్‌గానో, ఇండైరెక్ట్‌గానో చెప్పుకుంటుంటారు. ఈ స్వోత్కర్ష కంటే విషయ సాంద్రత ఉన్న మాటల వల్లే ప్రయోజనం ఎక్కువ.

మాటల్లో విషయం ఉండాలి!

పదహారేళ్ల అబ్బాయిలు, అమ్మాయిలు అనే కాదు- పాతికేళ్ల ప్రాయంలోని యువత అనేకాదు- నాలుగుపదుల మధ్యవయస్కులనే కాదు- ఆరుపదుల ఇంటి పెద్దలనే కాదు... ఎవరైనా తమలోని కొంత వర్తమానాన్ని, కొన్ని దృక్పథాలను తామే తెలుసుకోలేరు.

తెల్లటి కాగితంపై నల్లటి చుక్క పెద్దగా లెక్కలోకి రాకపోవచ్చు కానీ అక్కడ 'బ్లాక్‌మార్క్' లేదని కాదు కదా! మనలోని కొన్ని లోపాలు, కొన్ని బలహీనతలు మనకంటే మన స్నేహితులకి, ఆత్మీయులకి బాగా తెలిసి ఉంటాయి. మనలోని ఈ విభిన్న తలపై వారికి స్పష్టమైన అవగాహన ఉండి ఉంటుందని మనం తెలుసుకోలేం. మనం గట్టిపడాలంటే మన ఆత్మీయుల్ని, మిత్రుల్ని విశ్వసించక తప్పదు.

మనం ఎవరి మధ్యనైతే ఎక్కువ సమయం గడుపుతుంటామో, ఎవరివద్దనైతే ఎక్కువగా మాట్లాడుతుంటామో వారికి మన మనసు తెలుస్తుంటుంది- మన వ్యక్తిత్వం వ్యక్తమౌతుంటుంది- మనలోని మంచిచెడులు తెలుస్తుంటాయి. మనలోని పాజిటివ్, నెగెటివ్ షేడ్స్ ఏగుపిస్తుంటాయి. మనలోని 'మంచి లక్షణాలు' ఏమిటో వారు ఇట్టే చెప్పెయ్యగలరు.

మనలోని 'చెడు గుణాలు' ఏమిటని అడిగినా స్పష్టంగా చెప్పగలరు. అంటే- వారు మన వ్యక్తిత్వాన్ని జల్లెడపట్టేసినట్లే కదా! మనకంటే- మనమేమిటో వారికే బాగా తెలుసు.

మన అలవాట్లు మనకు స్పష్టంగా తెలుసా? పొరపాట్లని అలవాట్లుగా అనుకుంటాం! అలా మనం గోడకుకొట్టిన మేకులా బిగుసుకుపోయి ఉంటాం. ఒక విధంగా ఇది మనలోని 'అదృశ్యం'గా ఉండే అలవాటు అన్నమాట. మనకు మాత్రమే కనిపించని అలవాటు. పొరబాటు అని, బలహీనత అని తెలుసుకోలేని అలవాటు ఇది... మన వ్యక్తిత్వాన్ని తరిగించే అదృశ్య శక్తి ఇది... అదృశ్య శక్తి అంటే నెగెటివ్ ఫోర్స్. మన నెగటివిటీని మనమే తెలుసుకోగలగటం అంత సులభ విషయం కాదు. మన మచ్చ మనకే కనిపించకపోవచ్చు. పోనీ అద్దంలో చూసుకున్నప్పుడల్లా ఆ మచ్చ కనిపిస్తున్నా పుట్టుకతో ఉన్న మచ్చ అని బుకాయించవచ్చు. ఆ మచ్చను తొలగించగల అవకాశం ఉన్నప్పుడు మిన్నకుండటం మన అశ్రద్ధ, బలహీనత అవుతుంది. మన వ్యక్తిత్వంలో ఒక చీకటి కోణం అవుతుంది. మన సన్నిహిత మిత్రులు, ఆత్మీయ వ్యక్తులు ఆ మచ్చవల్ల మన అందం ఎలా కళ తప్పుతుందో చెబితే మనం మారే అవకాశం ఉంది. మనం ఉన్నతమయ్యే అవకాశం ఉంది. ఇతరులు ఆ మచ్చను ఎత్తిచూపిస్తుంటే చులకన చేస్తున్నారనుకుంటే ఎలా? వారు మనల్ని ఉన్నతులుగా చూడాలని కోరేవారే కదా.

వారే ఆత్మీయులు!

దీప వంటి టీనేజర్స్ ఎక్కువగా మాట్లాడకపోవటంతో ఎవరితోనూ కలవరన్న ముద్ర వేస్తాం... ఎక్కడికైనా రాకపోతే సోషియల్ బీయింగ్స్ కాదంటాం... తమదైన ప్రపంచంలో ఉంటే అర్థం చేసుకోలేక 'మూడీ' అంటుంటాం. సరిగ్గా ఇటువంటి వారిని గమనించగలిగితే వారిలో అబ్జర్వేషన్ అధికంగా ఉంటుంది. తమ అబ్జర్వేషన్ పూర్తికానిదే ఎటువంటి వ్యక్తితో మాట కలపరు. వీరు మనసు విప్పి మాట్లాడితే మనలోని మంచి గుణాలను శ్లాఘించినట్లుగానే మనలోని లోపాలను ఎత్తి చూపటానికీ వెనుకాడరు.

మన దృక్పథంలోని వెనుకబాటు తనాన్ని, మన వర్తనంలోని బలహీనతను చూపించే ప్రయత్నంలో ఎంతో విమర్శనాత్మకంగా, వివేచనతో విశ్లేషణకు దిగుతారు.. మనం మరింతగా మెరుగుపడే అవకాశాలను కూలంకషంగా విడమరచగలుగుతారు.. ఒక విధంగా ఇటువంటివారిని మన ఉన్నత వ్యక్తిత్వానికి దోహదపడే అదృశ్య శక్తిగా చెప్పుకోవచ్చు. ఇంతకీ రెండుపదుల ప్రాయంలోకి అడుగు పెడుతున్నామంటే విశాల ప్రపంచంలోకి మనదైన రీతిలో, మనదైన వ్యక్తిత్వంతో అడుగులు వేస్తున్నట్లే. ఈ విశాల ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే మనం ఉన్నత వ్యక్తిత్వ సంపన్నులమై ఉండాలి. ఆ ఎదుగుదలకు కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకోవాలి.

- మన కుటుంబ సభ్యులు, మన మిత్ర వర్గం అన్నివిధాలా ఆత్మీయ విమర్శకులు అవుతారు.
- ఆత్మీయుల విమర్శలు కువిమర్శలు కావు. మన వ్యక్తిత్వానికి అవే అవార్డులు, రివార్డులు.
- మనకంటే మనమేమిటో ఆ ఆత్మీయులకే తెలుస్తుంటుంది. మనలోని అన్ని కోణాలను చూసే ఆత్మీయులు వారు.
- పాలను, నీళ్లను విడదీయగలిగినట్లుగా మనలోని మంచీ చెడులను వింగడించగల 'హంస' పాదులు ఈ ఆత్మీయులు.
- మనలోని బలాలను, బలహీనతలను విశదీకరించగల స్నేహశీలురు వీరు.
- మనలోని మచ్చలు మనకు అగుపించకపోవచ్చు. మనకు కనిపించని మచ్చలను చూడగల, చూపగల నేస్తాలు వీరు. ఆ మచ్చలు పోవటానికి కావలసిన మందులను ఇచ్చే వైద్యులు కూడా వారే.
- మనమే మాట్లాడుతుంటే మనం మాత్రమే ఆవిష్కృతమవుతుంటాం... మనం వినటం ప్రారంభిస్తే మన చుట్టూ ఉన్నవారు ఆవిష్కృతమవుతుంటారు. వింటూ వారిని అనుశీలించగలిగితే మనం ఎలా ఉండవచ్చో తెలిసి వస్తుంటుంది.

- వాసిలి వసంతకుమార్

అమాత్య పదవుల్లో అతివలు తక్కువే!

'ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం'- అని ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎంతగా నినదిస్తున్నా అధికార పదవులు, కీలక స్థానాల్లో వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం మహిళలకు సమాన ప్రాతినిధ్యం పగటికలగానే మారుతోంది. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలకు తగిన వాటా ఇస్తామంటూ నేతలు ఘనమైన ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అంతంత మాత్రమేనన్నది జగమెరిగిన సత్యం. తన ప్రభుత్వంలో మహిళలకు తగినంతగా మంత్రి పదవులు ఇవ్వలేకపోయానని తాజాగా బ్రిటన్ ప్రధాని డేవిడ్ కేమరాన్ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలనలో, కార్పొరేట్ రంగాల్లో స్త్రీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని ఆయన చెబుతున్నారు. మంత్రి పదవుల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం నేడు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశంలో మహిళా ఎంపీల సంఖ్య తక్కువగానే ఉందన్నారు.

బ్రిటన్ ప్రధాని కేమరాన్ మంత్రిమండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 27 కాగా అందులో మహిళలు నలుగురు మాత్రమే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఎనిమిదేళ్ల కాల వ్యవధిలో మహిళా మంత్రుల సంఖ్య రెండు శాతం మాత్రమే పెరిగింది. 2005లో మహిళా మంత్రుల శాతం 14.2 ఉండగా, 2012లో ఇది 16.7 శాతానికి పెరిగింది. ఎన్నికల సమయంలో అనేక దేశాల్లో నేతలు మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామంటున్నా, అలా జరగడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా మహిళా ఎంపీల సంఖ్య 1995లో 11.3 శాతం ఉండగా, 2000 నాటికి 44 శాతానికి పెరిగింది. భారత్‌లో 1991 నాటికి ఎంపీల శాతం 9.7 కాగా, 2012 నాటికి 10.96 శాతానికి పెరిగింది. విశ్వ వ్యాప్తంగా పాలనారంగంలో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం లేకపోవడం సమంజసం కాదని ఐక్యరాజ్యసమితి గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. డెన్మార్క్, ఫిన్లాండ్ వంటి కొన్ని దేశాల్లో మాత్రం మహిళలకు రాజకీయాల్లో కొంత మేరకు ప్రాధాన్యం లభిస్తోంది. ■

దీదీ ముక్కు.. కోపానికి నెలవు!

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

తన కోపమే తన శత్రువు- అన్నమాట మమతా దీదీ- మరిచిపోయినట్లుంది. రానురానూ ఆమె ముక్కు కేవలం 'కోపం కొలువు వుండటానికే తయార్' అన్నట్లుగా వుంది. ఎవరికైనా సరే చెంప ఛెళ్లుమనిపించాలని అంటుందామె. ఈ డైలాగ్ మారిందిప్పుడు. గత వారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి- మమతాదీదీ కలకత్తాలో పుస్తక ప్రదర్శనకు వెళ్లింది. మిలన్ మేళా కాంప్లెక్స్‌లో వున్న బుక్‌ఫెయిర్‌లో మమతా వాళ్ల అధికారిక స్టాల్ వుంది. 'జాగో బంగ్లా' దాని పేరు. అక్కడికి వెళ్లినప్పుడామె బుక్ మేళా కున్న ఒక గేటులోనుంచి లోపలికి పోయింది. ఆమెగారి మందీ మార్బలం, భద్రతా సిబ్బందీ అంతా అక్కడే నిరీక్షిస్తుండగా- మధ్యలోనే పుస్తక ప్రదర్శన చూస్తూచూస్తూనే ముఖ్యమంత్రి- రూటు మార్చి పక్కకి తిరిగి- ''బయటికి పోదాం''- అంటూ నడిచింది.

తూర్పు గేటులోంచి బయటికిపోయిన మమతాజీ- సైన్స్ సిటీ ఆడిటోరియం గేటులో నుంచి బయటికి నడిచింది. తయినాతుగా వున్న వాహన బలగం అంతా యిది తెలుసుకుని, అటు తిరిగి, యీ గేటులోకి రావాలి కదా?- పైగా, ప్రదర్శన వదిలేసిన సమయం అది. జనం గుంపులు గుంపులుగా బయటపడుతున్నారు. అంచేత ముఖ్యమంత్రిజీ- రెండు మూడు నిమిషాలు ఎదురుచూడాల్సి వచ్చింది. తన కారు తలుపు తెరిచి వుంటే- నేరుగా కారులోకి దూరిపోవాలనుకున్న మమతాకి- ముక్కు మీది కోపం నెత్తికెక్కి తాండవం చేసింది. ''నిన్ను కొరడాతో కొట్టాలయ్యా!'' అంటూ ఆగ్రహం- వెలిగ్రక్కుతూ - ముక్కుపుటాలెగరేసింది. భద్రతాధికారి- కె.కె.ద్వివేది ఈ దెబ్బకి (మాటకి) అవాక్కయిపోయి- నిలువునా నీరుగారి పోయాడు. దీదీ కోపంతో- చకచకా సైన్స్ సిటీ చైనా టౌన్ల దిశగా నడుస్తూండేసరికి- తయినాతీ దళం అంతా కంగారుపడిపోయింది. ఈమధ్య 'మమత'గారు తన పేరు మర్చిపోయి- చీటికీ, మాటికీ- ''ఇరిటేట్'' అవుతున్నారన్నది పశ్చిమ బంగ్లా జనవాక్యం. ఓ జర్నలిస్టు నామె యిటీవల- ''చెంప ఛెళ్లుమనిపించాలయ్యా, నీకు!'' అన్నదన్న ఆరోపణ ఒకటి యింకా చక్కర్లు కొడుతూండగానే- యీ భద్రతా దళాధికారి సి.ఎం. ఆఫీసానికి గురయ్యాడు. పైగా, అతనికి ఈ మధ్యనే - తన ఉద్యోగసేవల నిమిత్తం - 'పతకం' కూడా లభించింది. అదీ దీదీ చేతుల మీదుగానే...!

veeraji@sify.com

వివిధ దేశాలకు చెందిన ప్రవాస భారతీయ యువతులు మెరుపు తీగల్లా హొయలొలికిస్తూ ఆహూతులను ఆనంద డోలికల్లో తేలియాడించారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా గణ్‌పతిపూలే వద్ద భారీ స్థాయిలో జరిగిన 'భారత రాణులు..ప్రపంచ రాణులు- 2013' పోటీల్లో పాల్గొన్న యువతులు అందచందాలు ప్రదర్శించి అందరికీ కనువిందు చేశారు.

వైద్యుడి ఉద్యమంతో జన చైతన్యం

వైద్యుడిగా వ్యాధుల నివారణకే కాదు, సామాజిక రుగ్మతల అంతానికి కూడా ఆయన దృఢదీక్షతో కృషి చేస్తూ ఎందరిలోనో చైతన్య స్ఫూర్తిని రగిలిస్తున్నారు. 'హమ్ పాంచ్' (మేం అయిదు గురుం) పేరుతో ఆయన ప్రారంభించిన ఉద్యమం మంచి ఫలితాలను ఇస్తోంది. అయిదుగురు వ్యక్తులు మంచి ఆలోచనలు, అనుభవాలను ఇతరులతో పంచుకోవాలి. ఆ అయిదుగురూ మరో అయిదుగురితో.. ఇలా గొలుసుకట్టు మాదిరి ఇది అనంతంగా సాగుతుంటుంది. ఇలా మనోభావాలను పంచుకున్నపుడు అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను కూడా చర్చించాలి. దేశంలో అన్ని సమస్యలకూ మూలం అధిక జనాభా అన్న విషయమై సామాజిక చైతన్యం పెరగడంతో వైద్యుడిగా తన లక్ష్యాలను ఆయన సాధించగలుగుతున్నారు.

మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌కు చెందిన డాక్టర్ లలిత్‌మోహన్ పంత్ ఇంతవరకూ 3.05 లక్షల మందికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఈయన జనాభా నియంత్రణలో తన వంతు కృషి చేస్తూ మిగతా వైద్యులకు స్ఫూర్తిదాతగా నిలిచారు. ప్రజలను చైతన్యవంతం చేస్తేనే జనాభా నియంత్రణ సాధ్యమవుతుందని డాక్టర్ పంత్ చెబుతుంటారు. ఒక సంతాన నిరోధక శస్త్ర చికిత్స వల్ల సగటున 2.7 జననాలను నియంత్రించ వచ్చని, రికార్డు స్థాయిలో శస్త్రచికిత్సలు చేసి తాను ఇంతవరకూ 8.23 లక్షల జననాలను నియంత్రించగలిగానని ఆయన చెబుతున్నారు. 2011 లెక్కల ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లు దాటిందని, సాధ్యమైనంత వరకూ జననాలను తగ్గిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని ఆయన అంటున్నారు. కేవలం ఒక రోజులో 816 కు.ని శస్త్ర చికిత్సలు చేసి 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో ఈయన గుర్తింపు పొందారు. ఈయన ఒక ఏడాదిలో 627 కు.ని శిబిరాలు నిర్వహించి 27,578 మందికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేశారు.

గత 32 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉన్న పంత్ మధ్యప్రదేశ్‌లోని మారుమూల గిరిజన గ్రామాలకు సైతం వెళుతూ కు.ని. శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా కు.ని శస్త్ర చికిత్సలు చేసే ఏకైక వైద్యుడిగా ఈయన మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. పంత్ వైద్య సేవలు ప్రారంభించిన తొలినాళ్లలో కు.ని శస్త్ర చికిత్సల పట్ల పురుషులు ఎవరూ సుముఖత చూపే వారు కాదు. ప్రస్తుతం ఈయన వద్ద శస్త్రచికిత్సలు చేయించుకుంటున్న వారిలో పురుషుల సంఖ్య 60 శాతాన్ని మించింది. సామాజిక చైతన్యం మరింతగా వెల్లివిరిస్తే తొందరలోనే అధిక జనాభా సమస్య నుంచి మన దేశం గట్టెక్కే అవకాశాలున్నాయని డాక్టర్ పంత్ ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. ■

'బడుల్లో దండన'పై టీచర్లకు పాఠాలు!

బడి పిల్లలపై హింసను తగ్గించేందుకు సత్ప్రవర్తన విషయమై టీచర్లకు తగిన శిక్షణ ఇవ్వాలని మన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. హోం వర్క్ చేయలేదనో, తర గతి గదిలో అల్లరి చేస్తున్నారనో పిల్లలను ఉపాధ్యాయులు దండించడం పరిపాటే. ఇటీవలి కాలంలో కొంతమంది టీచర్లు వికృత చేష్టలకు పాల్పడుతూ పిల్లలను కఠినంగా శిక్షించడం మనం చూస్తున్నాం. పిల్లల్ని చావ బాదడం, వారి చేత మూత్రం తాగించడం, బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడడం వంటి ఉదంతాలు కోకొల్లలు. శ్రుతి మించి ప్రవర్తించే టీచర్లకు దేహ శుద్ధి చేయడం, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలలపై దాడి చేయడం, పోలీసులు కేసులు నమోదు చేయడం వంటి వార్తలు ఇటీవలి కాలంలో నిత్యకృత్యంగా మారాయి.

విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించే టీచర్లకు జరిమానాలు, జైలు శిక్షలు విధించేందుకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. అయినప్పటికీ విద్యార్థులపై హింస తగ్గుతున్న దాఖలాలు లేవు. కొందరు ఉపాధ్యాయులే బాలికలను లైంగికంగా వేధిస్తున్న సంఘటనలు కూడా అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యావ్యవస్థ పరువు కాపాడేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నియామకాల సమయంలోనే టీచర్లకు సత్ప్రవర్తన విషయమై తగిన శిక్షణ ఇప్పించాలని మానవ హక్కుల సంఘాలు, బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు చిరకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలతో వ్యవహరించాల్సిన పద్ధతులపై టీచర్లకు తగిన అవగాహన కల్పించాలని ప్రాథమిక విద్యాశాఖ నిర్ణయించింది. చట్టాలు, శిక్షలకు సంబంధించి పోలీసు అధికారులు పాఠశాలలకు వచ్చి టీచర్లకు అవగాహన కల్పిస్తారు. టీచర్లుగా నియమితులయ్యేవారు ఇకపై తమ సత్ప్రవర్తనకు సంబంధించి పోలీసు శాఖ నుంచి ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఎలాంటి ఆరోపణలు లేనివారిని టీచర్లుగా నియమిస్తే ఏ ఇబ్బందులూ ఉండవని విద్యాశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. విద్యార్థులపై హింసను నిరోధించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర వ్యాప్తంగా సరికొత్త వ్యవస్థకు రూపకల్పన చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీలో నడిచే పాఠశాలలన్నింటినీ ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకువస్తారు. టీచర్ల ప్రవర్తనకు సంబంధించి అన్ని పాఠశాలలకు త్వరలోనే సరికొత్త నిబంధనలతో సర్క్యులర్లు జారీ చేస్తారు. విద్యార్థులతో మెలగాల్సిన పద్ధతులపై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది,స్థానిక పోలీసు అధికారులు ఈ ప్రచారంలో పాల్గొంటారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం పాఠశాలలో హింసకు పాల్పడే టీచర్లకు మూడేళ్ల వరకూ కారాగార వాసం, పాతిక వేల రూపాయల జరిమానా విధించే అవకాశాలున్నాయి. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కేవలం రెండు నెలల వ్యవధిలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో టీచర్లపై 36 ఫిర్యాదులు వచ్చాయి.

సిబిఎస్ఇ పరిధిలో నడిచే కొన్ని ప్రముఖ స్కూళ్లలో ఇప్పటికే టీచర్ల వ్యక్తిగత విషయాలను పరిగణనలోకి తీసుకున్నాకే నియామకాలు జరుపుతున్నారు. ఐతే, సత్ప్రవర్తన విషయమై పోలీసు శాఖ నుంచి ధ్రువపత్రాలు తేవాలనడంతో అవినీతికి అవకాశం ఉంటుందన్న వాదనలు లేకపోలేదు. బాలల హక్కుల జాతీయ సమితి సిఫారసుల మేరకు ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలల అనుమతులను రద్దు చేసేందుకు వెనుకాడేది లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. టీచర్ల ప్రవర్తనపై ఫిర్యాదులు చేసేందుకు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలో 'హెల్ప్‌లైన్'ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులపై వెంటనే విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకునేందుకు తగిన వ్యవస్థను రూపొందించారు. విద్యార్థులను హింసిస్తున్న సంఘటనలు రాష్ట్రంలో ప్రతిరోజూ చోటు చేసుకుంటున్నాయని, వీటిని నియంత్రించేందుకు ఇప్పటికైనా చర్యలు ప్రారంభించడం శుభ పరిణామమని బాలల హక్కుల సంఘాలు స్వాగతిస్తున్నాయి. ■

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
గురువారం
21, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

ధరణిందీర్థములాడుకంటె, సతిమోదం బొప్ప యజ్ఞంబులం బరగం జేయుట కంటె, సువ్రతము లొప్పన్ వేద శాస్త్రార్థ తత్పరుడై యాదట జల్సుకంటే మది నుత్సాహించి నీ భక్తిమ త్పురుష శ్రేష్ఠుల బూజ సేయుట మహా పుణ్యంబు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! తీర్థ స్నానాలు చేయడం కన్నా , సంతోషంతో యజ్ఞాలు చేయడం కన్నా, ఆనందంతో వేద శాస్త్ర బద్ధంగా సువ్రతాలు చేయడం కన్నా మనస్సులో ఉత్సాహనిన పూని నీ యొక్క శ్రేష్ఠులైన భక్తుల్ని పూజించడం మహా పుణ్యం. కర్మ ఎంత ముఖ్యమైనది అయినా సరే భక్తి మార్గములో భక్తి అంతే గొప్పదని తెలిపేది ఈ పద్యం. ఈ మార్గంలో దేవుడు, దేవుడు కన్నా దైవభక్తుడూ మిన్న . దైవానికి పూజ చేసే పద్ధతిలోనే భక్తునికి చేయడం శైవమతంలో ప్రబలంగా కనిపిస్తుంది. మాహేశ్వర పాద పూజ అన్నది అన్నది మహాపుణ్యమని భక్తులు గట్టిగా నమ్ముతారు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది

నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

19

శ్రీ లత

పితృ మాతృ స్వామ్యాలు రెండూ రెండు రాజ కీయ పార్టీలవంటివి. ఒక పార్టీ ఒక పార్టీని కూల గొడుతూ రాజ్యమేలుతూ చక్రభ్రమణం చెందు తుంటాయి. కాల చక్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో స్వామ్యం కూలగొట్టబడుతూ ఒక్కోటి రాజ్యమేలుతూ నిరంతరగా ఘర్షిస్తూ సాగుతుం టాయి. అయితే ఈ అధికార మార్పిడికి యుగాల కాలాన్ని గాప్‌గా పొందుతాయి. వీటికి శాస్త్రంతో పనిలేదు. కేవలం అధికారంతోనే అవసరం. రాజ కీయాలు మత గ్రంథాలను వాటి అవసరాలను అనుగుణంగా ఎలా ప్రక్షిప్తాలను చేర్చుకుం టాయో, స్వామ్యలుకూడా శాస్త్రాలకు వాటి ఇష్టం వచ్చిన ప్రక్షిప్తాలను చేర్చుకుని, అర్థాలను మార్చు కుని అనర్థాలను కూర్చుకుని తమకనుగుణంగా సవరణ చేసుకుంటూ దాన్నే సామాజిక న్యాయంగా వర్ధిల్లచేసుకుంటాయి.

ఈ యుగం మాతృస్వామ్యానిది. అందుకే అడ్డదిడ్డంగా భౌగోళికంగా పితృ స్వామ్యం అన్ని వైపులనుంచీ నరకబ డుతూ కూలబడుతూంది. ఇప్పుడే స్త్రీలకు శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన అవ సరం. అవి మాత్రమే మానసిక స్థయిర్యా నికి ఆలంబనగా నిలబడగలదు. శాస్త్రా ల్లోని మాతృస్వామ్యాన్ని త్రవ్వితీయాలి. అవసరమైతే అనుగుణంగా శాసించగల గాలి". వసంత గుండెల్లోని ఆవేశం కంఠాన్ని వణికించినా పెదవులపై నవ్వును మాత్రం చెదరనీయలేదు. వసంత అంత రంగంలో అగ్ని పర్వతం పేలిన ప్రశాంత సంద్రంలా కనిపించింది జీవనకు. "ఒక బిడ్డను కని పెంచుకోలేని ఈ యుగంలో స్త్రీస్వామ్యం ఎక్కడున్నట్లమ్మా? నువ్వన్నీ ఇమిజినేషన్‌తో చెప్తావంతే" కాంప్రమైజ్ కాదల్చుకోలేదు జీవన.

"ఏవీకాదు, ఒక బిడ్డను కని పెంచు కునే శక్తి హక్కు స్త్రీకి ఆనాడూ, ఈనాడూ పవిత్రంగా పదిలంగా ఉంది. అయితే ఆ శక్తి తన భవిష్యత్తు బలయినా తట్టుకు నేంత బలమైనదై ఉండాలి. మరి కుంతి పెళ్ళికి ముందే బిడ్డను పొందినా భవిష్య త్తునే కోల్పోని అవగాహన సమాజానికీ, కుంతి అంతరంగానికీ ఉండిందనే కదా! ఆ నాటి మానవ సంబంధాల అవగాహన ఈనాడు లేదనేగా అర్థం. హక్కు ఉంది కానీ ఆ హక్కు పట్ల అవగాహన లేదు అంటున్నాను".

ఆగింది వసంత. జీవన ముఖ కవళికలు గమ నించింది. అవి తొణకడంలేదు.

"మరి ఈనాడు నీనాగుప్త పాపను కని పెంచు కుంది. తను మాత్రం ఏం భవిష్యత్తు పోగొట్టు కుంది? సమాజం మాత్రం తననేం చెయ్యగలి గింది?" తనూ వాదనలోకి దిగింది.

"వివాహమనే సామాజిక స్థానాన్ని పోగొట్టుకో లేదూ, తనూ తన వివాహం గురించి ఆలోచించ లేదు. అలాగే సమాజమూ ఆమె వివాహం పట్ల ఆసక్తి చూపలేదు. నీనాగుప్త పెళ్లి కాకుండా, పాపను కన్న విషయం టాం టాం చేసిందేకానీ, పెళ్లి చేసుకోవడంపట్ల తన అభిప్రాయానికి ఆతృత పడలేదు ఈ సమాజం. అదే అవగాహనలోపం అనిపిస్తుందీనాడు" వసంత అంది.

"ఏమవుతుంది సమాజంలో వివాహస్థానం లేకపోతే" జీవన టాపిక్‌ను పెళ్లివైపు తీసుకురా వడం వసంతకు ఆనందాన్ని కలిగించింది. ఇన్నా ళ్లకు జీవన వాస్తవంలోకి వచ్చి వర్తమానంలో నిల బడి తనను తాను అమ్మ సమాధానంలో వెతుక్కో వాలని చూస్తున్నట్లనిపించింది. తన సరైన నిర్ణ యానికి చేరుకోవాలంటే ముందుగా ఈ ప్రశ్నకు సరైన వివరణ ఇచ్చి తీరాలనిపించింది. కొద్దిసేపు మౌనమయి అంతఃశక్తిని కూడదీసుకుని తనవైపే కళ్ళార్పకుండా చూస్తూన్న జీవనను చూస్తూ మెల్లగా నవ్వి...

"స్త్రీకాని, సమాజం కానీ మూడు విభాగాలు. అట్టడుగు తరగతి, మధ్య తరగతి, ఉన్నత తర గతి, డబ్బువిద్య సామాజిక హోదా ఈ తరగ తుల్ని నిర్ణయిస్తాయి. అట్టడుగు తరగతి స్త్రీకి వివాహ స్థానం లేకపోతే ఏవీ కాదు. వివాహం అయినా కాకపోయినా తన ఆకలికి ప్రాథమిక అవ సరాలకూ తానే కర్త కనుక. అలాగే అత్యున్నత స్థాయి స్త్రీకి ఏవీ కాదు. ఆమెకు పురుష సహకారం లేకుండా బ్రతికే ఆర్థిక విద్య, అవగాహన, అనే అవకాశాలుంటాయి కనుక. ఇకపోతే మనలాంటి మధ్య తరగతి వాళ్ళకే అవ్వవలసినవన్నీ అవు తాయి. మనం గడప దాటితే ఎదురయ్యేవి ప్రశ్నలే. అనుమానాలే అవహేళనలే సమాధానం చెప్పందే నిశ్చితంగా బ్రతకనివ్వని ఆటంకాలే.

"ఆ రెండు వర్గాలకున్న కొద్దిపాటి వెసులు బాటు మనకు లేదు. అందుకే ఆదర్శాలకు మన జీవితాలకూ పొత్తు కుదరదు. వివాహం కాకుండా తల్లయిన స్త్రీని, వేశ్య కూడా అవమానిస్తుంది.

ఎందుకంటే ఎన్నో యుగాలుగా స్త్రీ అవమానిం చబడి, పడీ.. పడీ.. అవమానించడమే తమ సంస్కారంగా స్వీకరించింది. ఆలోచిం చడం మానేసుకుంది. భస్మాసుర హస్తంలా స్వామ్యానికి తన స్వామ్యాన్ని నాశనం చేసేందుకు తానే ఆయుధమై అమరింది" అంటూన్న వసంతను అడ్డుకుంటూ...

"పోమ్మా... నాకర్థం కాకుండా చెప్తున్నావు" అంది జీవన అర్థమయ్యీ కాని వసంత భావ ప్రకటన పట్టుకోలేక.

"సరే అది వదిలేయ్ అనివార్య కారణా లవల్ల, తన ఇష్టాయిష్టాలతో సంబంధంలే కుండా, మోహ ప్రలోభం వల్లో, మోసం వల్లో, పురుష సంపర్కం కలగబడిన స్త్రీ, తల్లయినా కన్యత్వం చెదరదు. తన ఇష్టంతో పురుషునితో స్త్రీ కలిసినపుడే తన కన్యత్వం సమాప్తమవుతుందని స్త్రీ అభీష్టా నికి ఎంతో విలువనిస్తూ శాస్త్రాలు నిర్ణ యాన్ని ఏర్పరచాయి. అదే న్యాయ వ్యవ స్థగా కొనసాగి తీరాలి మరి. ఎందుకంటే న్యాయానికి సోర్స్‌లో శాస్త్రాలు ప్రథమ స్థానాన్ని కలిగి ఉన్నాయి కనుక" పెళ్ళి కాకుండా తల్లయిన స్త్రీ వివాహ హోదాను ఏ మాత్రం కోల్పోకూడదు. అప్పుడే ప్రకృతి పట్ల మానవుడు సరైన న్యాయాన్ని చేకూర్చగలిగినట్లౌతాడు. ఆ న్యాయాన్ని ఎన్నో యుగాల క్రితమే న్యాయవ్యవస్థలో చేర్చడం జరిగింది" ధిటువుగా చెప్పింది.

వివాహం గురించి అవగాహన జీవనలో స్పష్టంగా ఏర్పరగలిగింది. వసంత తన వివరణలో ఎక్కడ తడబాటు తొట్రు లేకుండా అమ్మ చెబు తున్న న్యాయాన్ని నిబ్బరంగా జీవన మనసు ఇంక్ పిల్లర్‌గా గ్రహించింది.

-ఇంకాఉంది

150

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

సోమ సూర్యులను పట్టి శోధిస్తాను. అవని, ఆకాశం, వనధులు ప్రవేశించి- ఏకడ ఏ యెడ వున్నా మా తల్లిని అరసి వస్తాను. అసమాన సత్త్వుణ్ణి అయి రావణాసరుడి నివాసం ప్రవేశిస్తాను. సీతమ్మను కని వస్తాను. పోయి వస్తాను. నీ ఆశీరక్షతలు నా ఔదలపై చల్లి ఆశీర్వదించు. నీ ఆశిషమే నాకు శ్రీరామ రక్ష!" అని అభివాదం ఒనరించి, అంగదాది వానరేంద్రులతో కలిసి దక్షిణ దిగ్భాగానికి వెడ లిపోయారు.

అనంతరం వానరాధీశ్వరుడు సుగ్రీవుడు సుషేణుడిని రావించి "నువ్వు లక్ష వానరు లతో యేగి సౌరాష్ట్ర దేశం, బాహ్లిక దేశం అరిగి సీతాదేవిని వెదకాలి. సింధుసావీర, కేకయ దేశాలు అరసి పశ్చిమ జలధి, పారి యాత్రనగం పరీక్షించి, చక్రవంతం శోధించు. ఒక నెల కాలంలో ప్రతివార్త కొని రండి" అని ఆన పెట్టాడు.

తర్వాత కపిరాజు శతబలిని పిలిపిం చాడు. "లక్ష వానరుల బలాన్ని నీ వెంట కైకొని చను. సౌర సేనం, యవన దేశం, కాంభోజ దేశం అన్వేషించు. కనకాద్రిని నెతుకు. కైలాసగిరి, కౌబేరవనము విలోకించి, కుబేరుడిని అడిగి క్రౌంచ పర్వతం అన్వే షించి వైఖానస సరస్సు, ఉత్తర కురుభూ ములు- అన్నీ శోధించి శోధించి ఒక నెల లోపల సీత వార్త ఎరిగి రావలసింది" అని ఉత్తర దిశకు పంపాడు.

ఆ తరిని శ్రీరామచంద్రమూర్తి సుగ్రీవుణ్ణి కాంచి, "ఈ భూములూ, గిరులూ, నదులూ, జలధులూ నీవెప్పుడు చూశావు" అని ఆశ్చ ర్యపోయి ప్రశ్నించాడు.

అప్పుడు సుగ్రీవుడు "రఘురామా! వాలితో వైరం కలిగి- అతడు నా వెంట పడి తరుమగా తరుమగా- అతడికి భీతిల్లి నేల నాలుగు అంచులూ పరికించాను" అని చెప్పాడు. శ్రీరాముడు ఇట్టి భౌగోళజ్ఞానం అరిగి, అబ్బురం అని కపిరాజుని సన్నుతించి, సుగ్రీవ లక్ష్మణులు తన్ను సేవింప అక్కడ కొంతకాలం కాలం వెళ్ళబుచ్చాడు.

సుగ్రీవుడు పనుపున పూర్వ పశ్చిమోత్త దిశలు అన్వేషింప చనిన వానరులందరూ సూర్యకిరణాలు ఈ అవనిమీద ఎంతదాకా సోకునో, ఎంతవరకు చొచ్చుకొని పోవునో అంత దూరం తిరిగి వెదకి వెదకి సీతను కానక మరలి వచ్చారు. ఆ వార్త సుగ్రీవుడికి ఎరిగించారు. అప్పుడు రామసుగ్రీవులు ఇటు మీద హనుమదాదులు ఏతెంచి ఏ ప్రతి వార్త తెల్పుతారో అని విచారంతో ఎదురుచూస్తూ వున్నారు.

అక్కడ దక్షిణ దిశను అంగద ముఖ్యులు మహా కపీశ్వరులు పరమ హర్షంతో పంతాలు పలుకుతూ జవసత్త్వ సంపదలు వెలియ మొట్టమొదట వింధ్యాచలానికి చను దెంచి, అందలి గుహల్లోనూ, అక్కడి గహనా ల్లోను సీత కోసం అరసి అరసి చూస్తూ ఇంకా దక్షిణంగా చని పువ్వుల పొదలలోను, తరువుల్లోనూ, గిరుల్లోనూ, నదుల్లోను, నగ రాల్లోనూ శోధించి శోధించి- సీతను కను గొనే వెరవు తోచక చింతాక్రాంత చిత్తులై పోయి పోయి, అలసిపోయి, ఒక యెడను గుమిగూడ ఆగారు.

అంగదాదులు కణ్వాశ్రమం చేరుట

అక్కడ మందర- పదేండ్ల ప్రాయం కల తన తనయుడు నీట పడి మరణించగా వగచి, పుత్ర శోకాగ్ని పాయలేక పలవిస్తూ వున్న కణ్వమహాముని శాప వహ్నిలో మండి, నిర్మానుషమూ, నిర్మృగమూ అయి వుండడం వీక్షించారు. ఆ అడవిలో త్రావ నీరు లేదు, పంటలు పండక శూన్యపథం అయిన ఆ కానలో చొచ్చారు. మిక్కిలి అలసట చెంది- లోదారిలో జలం కోసం వానరులు వెదకసా గారు. అప్పుడొక రక్కసుడు కపుల ముందర- వినీల మేఘమా అన నిలిచాడు. వానరులను చూసి "ఓ మర్కటులారా! నేను మహిత విక్రముణ్ణి. మారీచతనయుణ్ణి. నేనున్న ఈ వనంలో దేవ గంధర్వులయినా ప్రవేశింప భీతిల్లుతారు. ఇందరు కూడి ఇక్క డికి ఎందుకువచ్చారు? ఏమి చేయవచ్చారు? ఎక్కడకు వెడతారు- నా చేతిలో ఇంక మర ణింపక" అంటూ సంరంభంతో అరచాడు.

-ఇంకాఉంది

గురువారం, 21 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ ఏకాదశి రా.09.38
నక్షత్రం: ఆర్ద్ర రా.07.32
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ.10.34 నుండి 11.20 వరకు, తిరిగి మ.03.11 నుండి 03.57 వరకు

• **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభర ణాలను ఖరీదు చేస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గుర్తింపు లభిస్తుంది.కొన్ని కార్యాలు నెరవేర్చుకుంటారు.

• **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):**
కళలందు ఆసక్తి పెరుగుతుంది. వస్తు, వస్త్ర ఆభ రణాలను పొందుతారు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. విజ యాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.

• **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):**
కొత్త వ్యక్తులను నమ్మి మోసపోరాదు. క్రీడాకారు లకు, రాజకీయ రంగాల్లోనివారికి మానసికాందో ళన తప్పదు. నూతన కార్యాలు వాయిదా వేసు కోవడం మంచిది.శత్రుబాధలుండవు.

• **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):**
అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రుబాధ లుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ, మర్యా దలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యా లను పొందగలుగుతారు.

• **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):**
నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తల చిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

• **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):**
నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతి భకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. సదస్సులు మిమ్మల్ని ఆకర్షి స్తాయి. చిన్నవిషయాలకై ఎక్కువ శ్రమిస్తారు.

• **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):**
కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవ కాశముంటుంది. అనారోగ్య బాధలు అధికమవు తాయి. ఆకస్మిక ధననష్టాన్ని అధిగమిస్తారు. ఈ రోజు ముఖ్యమైన వ్యక్తిని కలుస్తారు.శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

• **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):**
బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విష యంలో మిక్కిలి శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతో పాటు, మానసికాందోళన తప్పదు.

• **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):**
ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందు తారు. కుటుంబం అంతా సంతోషంగా కాల క్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావ డంతో మిక్కిలి ఆనందిస్తారు.

• **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):**
కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది . ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నుల వుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి.

• **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముం టుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. అనవసర వ్యయ ప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృధా ప్రయాణాలెక్కు వగా ఉంటాయి.

• **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):**
అనవసరంగా డబ్బు ఖర్చగుటచే ఆందోళన చెందుతారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

మంచిమాట

ఉత్తమ ధర్మము

అంపశయ్యపై ఉన్న భీష్ముని నుండి ధర్మరాజు రాజనీతి మొదలుకొని సకల ధర్మములు తెలుసుకున్నాడు. కాని ఏది ఉత్తమ ధర్మమో తేల్చుకోలేకపోయాడు. అప్పుడు భీష్ముడు 'ధర్మశాస్త్రములు ఇష్టఫలదోహనములు. ఇది ఆచరించాలి, ఇది ఆచ రించకూడదు అనేదానికి కొలబద్ద ఉండదు. ఎవరికి నచ్చిన ధర్మశాస్త్రాన్ని వారు ఆచ రించి ఫలితము పొందడం ఉత్తమ ధర్మము" అని చెప్పారు.

ఇదే విషయాన్ని నారదుడు ఇంద్రుడికి చెప్పిన కథగా భీష్ముడు ధర్మరాజుకు వివ లంగా వివరించాడు. గంగానది దక్షిణ తీరాన భృగుడు అనే ఉత్తముడైన బ్రాహ్మణుడు ఉండేవాడు. దేవకార్యములు, పితృకార్యములు, దానధర్మములు జీవనంగా ప్రశంసలం దుకుంటున్నాడు. కాని ఇంకా వేటిని ఆచరిస్తే ధార్మికుడై ఆత్మనిష్ఠ అలవాటవుతుందనే ఆలోచనలో ఉండేవాడు. న్యాయమైన ధనార్జనతో సుఖజీవనము చేస్తున్నాడు.

ఒకనాడు భృగుడింటికి ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. అతిథులను ఆదరించే భృగువు తన అతిథ్య ధర్మముతో బ్రాహ్మణుడిని తృప్తిపరిచాడు. అలాగే ఏది ఉత్తమ ధర్మ ద్వారమనే తన చింతను కూడా చెప్పి బ్రాహ్మణుడిని తెలిస్తే చెప్పమని అడిగాడు.

బ్రహ్మచర్యము, గృహస్థ ధర్మము, తపస్సు, యజ్ఞములు, దానధర్మములు, జననీ జనకారాధన, గురుభక్తి, మంచితనము, శాంత స్వభావము, ఇంద్రియ నిగ్రహము, సత్యవాక్యము, అహింసావ్రతము.... ఇవన్నీ కూడా ధర్మద్వారములు. ఆత్మానందము కలిగించేవి. కాని ఆత్మానందము కలిగించి చింతను దూరము చేసుకునే ఈ ధర్మద్వా రము కూడా స్వార్థపూరితమైనపుడు ఉత్తమ ధర్మాచరణలో సంపూర్ణ ఫలముగ అంద రికీ లభించదు"అని బ్రాహ్మణుడు పద్ముడనే నాగరాజు కథ చెప్పాడు.

పద్ముడు ఒక సర్పరాజు. మహాపద్ముము అనే తటాక ప్రాంతములో నివసిస్తున్నాడు. నెలనెలా ఒకవారం రోజులు సూర్య రథ హయ రజ్జువుగా వెళతాడు. సజ్జనమిత్రుడు. పద్ముడు భృగువు సందేహము తీర్చగల ఉన్నత ప్రవర్తనగలవాడని బ్రాహ్మణుడు భృగు వును మహాపద్ముము వెళ్ళమని ప్రేరేపించాడు.

భృగుడు బ్రాహ్మణుడు చెప్పినట్లే మహాపద్ముము వెళ్ళాడు. భుజగేంద్ర మందిరము చేరుకున్నాడు. కాని అప్పుడు పద్ముడు సూర్యరథ వహనానికి వెళ్ళి ఉన్నాడు. పద్ముడి భార్య భృగునికి అతిథి మర్యాదలు చేసి నెలవారీ వంతు పూర్తయి భర్త తిరిగి వచ్చేవ రకు వేచి ఉండమంది. నేను సర్పరాజును చూసే నియమ వ్రతములో ఉన్నాను. అందు చేత నిరాహారుడినై గోమతీ పుణ్యారణ్యములో జపం చేసుకుంటూ ఉంటాను" అని వెళ్ళిపోయాడు. భృగుడు గోమతీ పుణ్యారణ్యములో సర్పరాజు పిలుపుకు ఎదురుచూ స్తున్నాడు. కాని పద్ముడు అతిథి పూజా ప్రియుడు. భార్య ఆ పూజకు లోటురానీయకూ డదనుకుంది. గృహిణిగా భృగుడిని బ్రతిమాలి నిరాహారదీక్ష చేయవద్దని కోరింది. ఆయనఅపుడు మీకు ధర్మ విరోధము జరుగదు. ఇంటి యజమాని రాకకు ఎదురుచూ స్తాను. వారము గడిచి ఎనిమిదవ రోజున ఆయన వస్తాడని చెబుతున్నారు. అందుచేత ఆగడము ధర్మము. అలా ఎనిమిదవ రోజున రాకపోతే మీ ఇంటిలో భుజించి నాదారిన వెళ్ళిపోవడము ధర్మమని భావిస్తున్నాను" అన్నాడు. పద్ముడి భార్య మాట్లాడలేకపో యింది. పద్ముడు రాగానే భార్య విషయము చెప్పి, వెళ్ళి బ్రాహ్మణుడిని సాదరంగా తీసుకురమ్మంది. కాని పద్ముడు నసేమిరా అన్నాడు. అపుడామె తన భర్తను చక్కని ధర్మోపదేశం ప్రబోధించింది. అతిథి ధర్మాన్ని గౌరవించి బ్రహ్మహత్యాదోషానికి గురికా కూడదు అంది. ఆమె చెప్పిన ధర్మాలను పాటించి పద్ముడు ధర్మాన్ని పాటించాడు.

భృగుడిని పిలిచిన పద్ముడు సూర్య మండలం గొప్పతనాన్ని తెలిపాడు. సృష్టి చైత న్యమునకు, సకల జీవరాశులకు కావలసిన ఆహార సముపార్జనకు సూర్యరశ్మి ఆధార మవుతోంది. దాన్ని విని ఎదుటివానిని తన ప్రవర్తనతో సంతోషింపజేయడమే ఉత్తమ ధర్మముగా భృగుడు తెలుసుకొని జీవించాలన్న కోరికను పెంచుకొని ఇంటి దారి పట్టాడు.

- జొన్నలగడ్డ మార్కండేయులు

వృతాసురుడు

28

బొమ్మలు: శ్రీరామ్



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

భద్రత ప్రజలకా? విఐపిలకా?

గన్‌మన్లు.. స్టేటస్ సింబల్!

గన్‌మన్ల కనపడ్డారంటే అక్కడే ఎక్కడో అత్యంత ప్రధానమైన వ్యక్తులు అంటే ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి లేదా కేంద్రమంత్రి ఉన్నట్లే. ప్రస్తుతం జిల్లా స్థాయిలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, ఇంకా కొన్నిచోట్ల ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులకు కూడా చెల్లింపుల పద్ధతిపై ప్రభుత్వం భద్రతా సిబ్బందిని నియమిస్తోంది. విఐపిలకు రక్షణ కల్పించేందుకు గన్‌మన్లు ఏ ప్రాతిపదికన నియమిస్తున్నారనే దానిపై మార్గదర్శకాలను ఖరారు చేయాలని సుప్రీం కోర్టు ఇటీవల కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. మంత్రులు, ఇతర విఐపిల కార్లపై ఎర్రలైట్లు ఉంటాయి. ఇక ఆ తరహా వాహనాలు వస్తుంటే రోడ్డుపై పోలీసులు చేసే హడావుడి అంతా ఇంతాకాదు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కొంతమంది అత్యంత ప్రముఖ వ్యక్తులకు భద్రత కల్పించడంలో తప్పేమీ లేదు. కాని ప్రస్తుతం స్థానిక సంస్థల ప్రతినిధులు మొదలుకుని ఎమ్మెల్యే, మంత్రుల వరకు గన్‌మన్ల భద్రత విపరీతంగా పెరిగింది. ఇటీవల కోస్తా జిల్లాలో ఒక ఎమ్మెల్యేకు చెందిన గన్‌మన్ బాత్‌రూంలో స్నానం చేస్తున్న ఒక మహిళను సెల్‌ఫోన్ కెమెరాలో చిత్రీకరించాడు. దీనిపై ఫిర్యాదు వెళ్లడంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. గన్‌మన్లు విఐపిలకు భద్రత కల్పిస్తున్నామన్న ముసుగులో అనేక అరాచకాలకు పాల్పడుతున్నట్లు రకరకాల అభియోగాలు వస్తున్నాయి. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడు అనే చందంగా, విఐపిల గన్‌మన్లను ప్రసన్నం చేసుకుంటే కావాల్సిన పనులు పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా వ్యవస్థను శాసించే వ్యక్తులుగా గన్‌మన్లు తయారై అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. గన్‌మన్లను ఇటువంటి అనైతిక చర్యలకు విఐపిలే ప్రోత్సహిస్తున్నారు. అలాగే మార్గదర్శకాలకు విరుద్ధంగా వారిని ఇంటిపనులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకునే విఐపిల సంఖ్య పెరిగింది. ఇదంతా ఒక కోణం. మరో కోణంలో చూస్తే, దేశంలో ఐదు లక్షల వరకు పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రతి విఐపి రక్షణకు ముగ్గురు గన్‌మన్ల సేవలను ఉపయోగించుకుంటున్నారు. ప్రతి 761 మందికి ఒక పోలీసు కానిస్టేబుల్ ఉన్నారు. ఈ గణాంక వివరాలను బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బిపిఆర్‌డి) గత ఏడాది విడుదల చేసింది. 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 16,788 మంది విఐపిల రక్షణకు 50,059 మంది గన్‌మన్లను నియమించారు. ఈ గణాంకాలు 2011 నాటివి. ఈ రెండేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అయి ఉంటుంది. పంజాబ్ రాష్ట్రంలో 11వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కాని విఐపిల భద్రత పేరిట 5410 మంది పోలీసులు, ఢిల్లీలో 5100 మంది పోలీసులు, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు వేల మంది పోలీసులను నియమించారని బిపిఆర్‌డి పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉద్యోగాల ఖాళీల భర్తీ యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. కాని విఐపిల భద్రతకు వినియోగించే పోలీసుల సంఖ్య నానాటికీ పెరగడం గమనార్హం. విఐపిల భద్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షించి గన్‌మన్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా మార్గదర్శకాలు ఉండాలని బిపిఆర్‌డి పేర్కొంది.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చిదంబరం జడ్ కేటగిరీ భద్రత వద్దన్నారు. సీదాసాదా భద్రతను మాత్రమే ఆయన కోరుకుని అమలు చేస్తున్నారు. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు ప్రశంసించింది. గతంలోకి వెళితే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో ఉన్న తీన్ మూర్తి భవన్‌లోకి ఎవరైనా నేరుగా వెళ్లి కలిసే అవకాశం ఉండేది. ఆ ఇల్లు సందర్శకులతో కిటకిటలాడేది. ప్రస్తుతం ఒక సాధారణ ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ వద్దకు వెళ్లాలంటే గన్‌మన్లు అడ్డుపడుతుంటారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి భద్రతకు కేవలం ఒక కానిస్టేబుల్ ఉండేవారు. పారపాటున పోలీసు సబ్‌ఇన్స్‌పెక్టర్ వస్తే 'నీవు శాంతిభద్రతలు కాపాడే పనిమానివేసి నా దగ్గర ఏమి పనుంది' అని మందలించి పంపేవారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ మాజీ అధిపతి జెకె దత్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వ్యక్తుల భద్రతకు ఒక ఏజెన్సీ ఉండాలన్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తరహాలో ఒక ఏజెన్సీని ఏర్పాటు చేయాలన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నేషనల్ సెక్యూరిటీ గార్డ్‌కు, రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన పోలీసులకు శిక్షణ ఇచ్చి వారిని విఐపిల భద్రత నిమిత్తం వాడితే దేశ భద్రత, శాంతి భద్రతలను కాపాడేదెవరని ఆయన ప్రశ్నించారు. భద్రతా సిబ్బంది రక్షణ మధ్య సంసారం చేయడం, ఆఫీసు పనులు నిర్వహించడం, పార్టీలకు, షాపింగ్‌కు వెళ్లడం నేడు ఫ్యాషన్‌గా మారింది. చివరకు మనశ్శాంతి కోసం గుడికి వెళ్లినా, అక్కడ కూడా భక్తుల పట్ల గన్‌మెన్లు అమర్యాదకరంగా వ్యవహరిస్తున్నారు. భక్తులను పక్కకు తోసేస్తున్నారు. గన్‌మెన్ల మధ్య తిరిగే వ్యక్తులను సాధారణ ప్రజలు ఈసడించుకునే స్థితి వచ్చింది. విఐపి వస్తున్నాడంటే చాలు, రోడ్లపై ట్రాఫిక్‌ను ఆపడం, జనాన్ని అదలించడం, కొట్టడం, పరుషపదజాలం ఉపయోగించడం పోలీసులకు అలవాటుగా మారింది. వీరిని ఇలా తయారు చేసింది ప్రజాప్రతినిధులే. ఒకవైపు శాంతిభద్రతలు పర్యవేక్షించేందుకు, కేసులను దర్యాప్తు చేసేందుకు మానవ వనరుల కొరతతో పోలీసు స్టేషన్లు విలవిల్లాడుతుంటే, నందట్లో సడేమియాగా పుట్టుకొచ్చిన గన్‌మన్ల సంస్కృతి వెగటుగా తయారైంది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతి, స్పీకర్, కొంతమంది కేంద్ర మంత్రులు, రాష్ట్ర స్థాయిలో గవర్నర్, ముఖ్యమంత్రి, కొంతమంది మంత్రులకు మినహా మిగతా వారికి భద్రత అవసరమా? అంతగా కావాలంటే వారి సొంత జీతం వెచ్చించి భద్రతా సిబ్బందిని పెట్టుకుంటే బాగుంటుంది. అసెంబ్లీ సమావేశ సమయాల్లో గన్‌మెన్ల కోసమని పెద్ద గుడారమే ఏర్పాటు చేస్తున్నారు. గన్‌మన్లు కూడా విఐపి భద్రతకు అలవాటుపడి బద్ధకం పెంచుకుని శాంతిభద్రతల విభాగానికి వెళ్లేందుకు అంగీకరించడం లేదు. విఐపిలతోపాటే ప్రాపంచిక సుఖాలకు వీరు అలవాటుపడి పోలీసు శాఖకు బరువుగా మారారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో ప్రస్తుతం పై నుంచి కింది స్థాయి వరకు ఆరేడు వేల మంది భద్రతా సిబ్బందిని విఐపిల భద్రతకు వినియోగిస్తున్నారు. విఐపిల భద్రత పేరుతో పోలీసు శాఖలో సిబ్బందిని గన్‌మన్లుగా నియమిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారి అవసరం లేకపోయినా సొంత డబ్బు చెల్లించి గన్‌మన్లను పెట్టుకుంటున్నారు. దీంతో పెయిడ్ గన్‌మెన్లు సైతం తయారయ్యారు. గన్‌మన్లను పెట్టుకోవడం అన్నది ఒక స్టేటస్ సింబల్‌గా వారు భావిస్తున్నారు.

భద్రత కల్పించడమే మా కర్తవ్యం

రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ధృడనిశ్చయంతో హోంమంత్రిత్వ శాఖ పని చేస్తోంది. మూడున్నర సంవత్సరాల నుండి రాష్ట్రంలో శాంతి భద్రతలను గమనిస్తూనే ఉన్నాను. అవసరాన్ని బట్టి పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాను. సమర్థులైన అధికారుల పర్యవేక్షణలో పోలీసు విభాగం బాగా పనిచేస్తోంది. శాంతి భద్రతలను కాపాడటంలో భాగంగానే ప్రజాప్రతినిధులైన పార్లమెంట్ సభ్యులు, శాసనసమండలి సభ్యులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధులకు, కీలకమైన పదవుల్లో కొనసాగుతున్న అధికారులకు సెక్యూరిటీ ఇవ్వాల్సి వస్తోంది. వాస్తవం చెప్పాలంటే వ్యక్తిగత భద్రత కల్పించడం ప్రభుత్వానికి తలకు మించిన భారమే! సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్. సింఘ్వీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ ఇటీవల చేసిన సూచనలను పరిశీలించాను. విఐపిలకు కల్పిస్తున్న భద్రతను చట్టపరంగా ఏర్పాటు చేశాం. విఐపిలకు కల్పిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఉపయోగించుకుంటే సత్ఫలితాలు వస్తాయని అంగీకరిస్తాను. అయితే వ్యక్తిగత భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ కనీస బాధ్యత. సమాజంలో అనేక రకాల మనస్తత్వాలు కలిగిన వారిని చూస్తుంటాం. రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో పరిస్థితిని చూడండి. తరచూ పరస్పరం దాడులు చేసుకోవడం, ప్రాణాలు కూడా తీసుకోవడం గమనించవచ్చు. ఏదిఏమైనా పరస్పరం ప్రాణాలు తీసుకోవడం మంచిది కాదు. ఈ కారణంగానే చాలా మంది తమకు సెక్యూరిటీని అదనంగా కల్పించాలని కోరుతుంటారు. నిబంధనల ప్రకారం, చట్టం ప్రకారం విఐపిలందరికీ సెక్యూరిటీ కల్పిస్తున్నాం. ప్రజాప్రతినిధుల్లో కొంతమంది తమకు అదనపు సెక్యూరిటీ కావాలని అడిగే సందర్భాలలో ఇందుకోసం పనిచేస్తున్న కమిటీ పరిశీలించి, చేసే సిఫార్సులను అమలు చేస్తున్నాం. అలాంటి కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, అవసరాన్ని బట్టి నిర్ణయాలు తీసుకుంటాం. పరిస్థితిని అనుసరించి, క్యాటగిరీవారీగా సెక్యూరిటీని ఏర్పాటు చేస్తుంటాం. విఐపిలకు సెక్యూరిటీ కల్పించినంత మాత్రాన సమాజంలో ప్రజలకు సెక్యూరిటీ లేదని చెప్పలేం.

మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నాం. మహిళా పోలీసు స్టేషన్ల సంఖ్య పెంచుతున్నాం. ఇటీవలే ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు చర్చించి, ప్రతి జిల్లాలో కనీసం ఒక మహిళా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇతర రాష్ట్రాలతో పోల్చితే, మన రాష్ట్రంలో మహిళలకు కల్పిస్తున్న రక్షణ బాగుందనే భావిస్తున్నాను. మహిళలపై అత్యాచారాలు జరగకుండా, అఘాయిత్యాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఇందుకు అనుగుణంగా మహిళా పోలీసుల సంఖ్య గణనీయంగా పెంచుతున్నాం. గృహహింస నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నాం. ఈ చట్టం అమలు చేసేందుకు సిబ్బందిని అపరిమత్తం చేశాం. మహిళలపై ఎక్కడ, ఎప్పుడు దాడులు జరిగినా, అఘాయిత్యాలు జరిగినా, వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. కుటుంబపరంగా మహిళలు హింసకు గురైతే, భర్తలు, కాని కుటుంబ సభ్యులు కానీ హింసకు గురి చేస్తే సత్వర న్యాయం చేకూర్చేందుకు ఫ్యామిలీ కోర్టులు కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశాం. సమాజంలో అందరూ బాగుండాలదే మా ప్రభుత్వ లక్ష్యం.

- పి. సబితా ఇంద్రారెడ్డి,
రాష్ట్ర హోం శాఖ మంత్రి.

విచ్చలవిడితనం.. అత్యుత్సాహం

అవసరమున్న వారికి భద్రత కల్పించడానికి బదులు అవసరం లేని వారికి సైతం భద్రత కల్పించడం, గన్‌మన్లను విచ్చలవిడిగా ఉపయోగించడంపై ఇటీవల సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పు నిచ్చింది. ఈ తీర్పు స్ఫూర్తిని గట్టిగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అయితే రాజ్యాంగం ఏడో షెడ్యూలు ప్రకారం శాంతిభద్రతలు కాపాడటం రాష్ట్రాల బాధ్యత. పోలీసు, పబ్లిక్ ఆర్డర్ ఈ షెడ్యూలు ప్రకారం రాష్ట్రాల కర్తవ్యం. సుప్రీం కోర్టు తీర్పు స్ఫూర్తిని తీసుకుని వివిధ రాష్ట్రాలు వాటి పరిధిలో గన్‌మన్లు, భద్రత, రోడ్ ట్రాఫిక్ తదితర అంశాలను విశ్లేషించి, సమగ్రమైన సమీక్ష చేసుకుని ఒక నిర్ణయం తీసుకోవల్సి ఉంది. ఎందుకంటే ఇందులో రెండు విషయాలున్నాయి. రాష్ట్ర ఖజానాకు ఈ 'భద్రత' పెనుభారంగా మారింది. దీనివల్ల ఖజానాకు లోటు ఏర్పడుతోంది. మరొకటి గన్‌మెన్ల వ్యవస్థ దుర్వినియోగం కావడం. ఎన్‌డిఎ హయాంలో పోలీసు వ్యవస్థ ఆధునికీకరణకు సంబంధించి శిక్షణ, అభివృద్ధికి రూ.200 కోట్ల నుండి వెయ్యి కోట్లకు పెంచాం. ఈ సందర్భంగా దేశంలో అత్యధికంగా లాభపడింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. ఈ రోజు భద్రతకు ఉపయోగిస్తున్న ఆయుధాలు, రవాణా వాహనాలు కేంద్రం నిధులతో కొనుగోలు చేసినవే. ఈ నిధులను శిక్షణ కోసం కూడా ఉపయోగించాలి, కాని రాను రాను శిక్షణ లోపిస్తోంది. ప్రస్తుత సమాజంలో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ అవసరం. అందుకు పోలీసులకు ప్రతి రోజూ శిక్షణ ఉండాలి, అది జరగడం లేదు. గన్‌మన్లను ప్రముఖుల భద్రతకు వినియోగిస్తున్నారు. ఏళ్లతరబడి ప్రముఖుల వెంట తిరగడం తప్పితే వారికి ఎలాంటి శిక్షణ ఉండటం లేదు. శిక్షణకు కేటాయిస్తున్న నిధులకు జవాబుదారీతనం ఉండటం లేదు, ఒక సారి గన్‌మెన్‌గా వెళ్తే ఏళ్లతరబడి వారి వద్దే గడిపేస్తున్నారు. ఎంతోమంది గన్‌మన్లను సొంత పనుల కోసం, స్టేటస్ సింబల్‌గా ఉపయోగించుకుంటున్నారు, దానిని పరిశీలించాల్సిన అవసరం ఉంది. తప్పకుండా దీనిపై చర్యలు తీసుకోవాలి, రాజకీయ నాయకుల విగ్రహాలు కూడళ్లలో పెట్టవద్దని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. మనవాళ్లు ఎంత గొప్పవాళ్లంటే- రాజకీయ నాయకుల విగ్రహాలకు సైతం వారి గన్‌మెన్లనే చుట్టూ పెట్టేలా తయారయ్యారు. దీనికి సంబంధించి క్షాళన జరగాలి. మంత్రులకు సైతం పెద్దఎత్తున గన్‌మెన్లను వినియోగిస్తున్నారు, నా దృష్టిలో అది కూడా అక్కర్లేదు. అయితే నిరంతరం ముప్పు ఉన్న వారిని గుర్తించి వారికి గన్‌మెన్లు ఇవ్వడంపై అభ్యంతరం లేదు, అయితే ప్రతి ఒక్కరి ప్రొఫైల్స్ పరిశీలించి, నిజంగానే ముప్పు ఉందా లేదా అని చూసి వారి భద్రతపై నిరంతర నిఘాకు ఆధునిక టెక్నాలజీ వాడుకోవాలే తప్ప ప్రత్యక్ష గన్‌మెన్లు అక్కర్లేదు. విఐపిలు వెళ్తున్నపుడు రోడ్లపై ట్రాఫిక్‌ను నిలువరించడం కూడా సరైంది కాదు, బిజెపి అగ్రనేత అద్వానీ కూడా ఎపుడూ బాధపడుతుంటారు, రోడ్లపై వెళ్తున్నపుడు ట్రాఫిక్‌ను ఆపడం సరికాదనేవారు. భారతదేశంలో ఇంత మందికి ఉన్న భద్రత ప్రపంచంలో ఏ దేశంలో కనిపించదు, మన దేశంలో ప్రముఖ నేత సామాన్య ప్రజలకు షేక్‌హ్యాండ్ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వరు, కాని అగ్రరాజ్యం అమెరికాలో మాత్రం ఆ దేశాధ్యక్షుడు ప్రజల్లోకి వెళ్లి వారితో కలిసిపోతారు. మన దేశంలో అత్యుత్సాహం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదో స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అన్ని పార్టీల నాయకులను పిలిచి రెండు రోజులు విస్తృత చర్చ జరిపి వారి సలహాలు తీసుకోవాలి.

- సిహెచ్ విద్యాసాగరరావు
కేంద్ర హోం శాఖ మాజీ సహాయ మంత్రి

దుర్వినియోగాన్ని అరికట్టాల్సిందే

విఐపిల భద్రత పేరుతో వేలాది మంది పోలీసు సిబ్బంది సేవలు దుర్వినియోగం అవుతున్న మాట నిజమే. ఈ విషయంలో సుప్రీంకోర్టు పేర్కొన్న అంశాలను స్వాగతించాల్సిందే. ఎక్కడో ఒకచోట ఇలాంటి విషయానికి అడ్డుకట్ట పడాలి. ఎందుకంటే రాష్ట్ర పోలీసు శాఖలో సిబ్బంది సరిపోక పలు విభాగాల్లో పని చేస్తున్న వారు పని భారంతో నలిగిపోతున్నారు. ఎంతమందిని నియమించినా పదవీ విరమణ చేసేవారు చేస్తున్నారు. కొత్తఖాళీలు ఏర్పడేవి ఏర్పడుతున్నాయి. అవసరాలు, సేవలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రత పేరుతో దుర్వినియోగాన్ని ఆపాల్సిన అవసరం ఉంది. ఆ సిబ్బందిని వేరే అవసరానికి వినియోగిస్తే మంచి ఫలితం వస్తుంది. సుప్రీంకోర్టు చెప్పినట్లు ఒక్క రోడ్డు భద్రతకే కాదు, నేరాల నిరోధం, చోరీ సొత్తు రికవరీ వంటి విషయాల్లో ఆలస్యం జరగకుండా వీరి సేవలు వినియోగించుకోవచ్చు. అయితే పోలీసు శాఖలో పనిచేస్తున్న కొంతమంది సీనియర్ ఆఫీసర్లు తమ అవసరానికి అనుగుణంగానే భద్రత సిబ్బందిని నియమించుకుంటున్నారు తప్ప అదనంగా లేదు.

తమకు ఇంతమంది భద్రత సిబ్బంది అవసరం లేదని గతంలో కొందరు అదనపు డిజి స్థాయి అధికారులు పలువురిని తిప్పి పంపించిన సందర్భాలున్నాయి. మరికొందరు అధికారులు అవసరం లేకున్నా దర్పం, హోదా కోసం వాడుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల్లోనూ ఇదేవరస కనిపిస్తోంది. కొందరు అవసరం లేకున్నా భద్రతా సిబ్బందిని వ్యక్తిగత ప్రతిష్ట కోసం వినియోగించుకుంటున్నారు. ఇలా వేలాది మందిని రాష్ట్రంలో భద్రత పేరిట సిబ్బందిని వాడుకుంటుంటే, అసలు సేవలకు సిబ్బంది సరిపోక నానాఇబ్బంది పడుతున్నారు. నిజంగా ఎక్కడ అవసరం ఉందో అక్కడ వినియోగించుకుంటే తప్పులేదు. కొందరు సీనియర్ పోలీసు అధికారులు మావోయిస్టుల టార్గెట్‌లో ఉంటే అటువంటి వారికి గట్టి భద్రత ఇవ్వడం సమంజసమే. అధికారులే కాదు ప్రజాప్రతినిధులకు నిజంగా ఇలాంటి అవసరం ఉండి ఉంటే భద్రతను సమకూర్చాల్సిందే. కానీ ఇటీవల కాలంలో ప్రైవేటు వ్యక్తులకు అవసరం ఉన్నా లేకపోయినా గన్‌మెన్ల భద్రత ఇవ్వడం పెరిగిపోయింది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఇది మరింత పెరుగుతుంది. కొందరు డిఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు కూడా పదేసి మంది భద్రత సిబ్బందిని వినియోగించుకుంటున్నారు. ఇది మంచిది కాదు. ఈ వ్యవస్థను సరిదిద్దేందుకు ఒక కరెక్ట్ సిస్టమ్ ఉంటే మంచిదే. కానీ అది పోలీసు శాఖలో అమలు చేయడం అంత సులభం కాదు. ఆచరణలో అసలు వీలుపడదు. ఒక ఎస్పీ స్థాయి అధికారికి ఇంతమంది భద్రత సిబ్బంది ఉండాలని నిబంధనలు ఉన్నా, ఆయన అందరిని వినియోగించుకున్నా, మరికొందర్ని అదనంగా వినియోగించుకున్నా ప్రశ్నించడం ఎవరి వల్లా కాదు. అనధికారికంగా వినియోగించుకుంటే ఎలా ఆపగలుగుతాం. కాబట్టే ఎలాంటి సిస్టమ్‌ను ఆచరణలో పెట్టినా అది అమల్లోకి తేవడం చాలాకష్టం. ఎవరికి వారు తమకు ఇంతమంది భద్రతా సిబ్బంది ఎందుకు? అని ప్రశ్నించుకుని, అవసరం మీరి ఉంటే వారిని వేరే అవసరాలకు వినియోగించాలి. ముఖ్యంగా భద్రత కోసం నియమించబడిన జిల్లాలకు చెందినవారు హైదరాబాద్ వస్తే వారికి ఉండేందుకు బస ఏర్పాటు చేయడం కూడా సాధ్యం కావడం లేదు. డ్రైవర్ల పరిస్థితి అయితే మరీ అధ్వాన్నంగా ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఎవరికి వారు భద్రతా సిబ్బంది విషయంలో కంట్రోల్ కలిగి ఉంటే మంచిది.

- కె.వి.చలపతిరావు
అధ్యక్షుడు, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

కోర్టులు సమీక్షించుకోవాలి

విఐపిల భద్రతపై సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు ఆహ్వానించదగినవే. దీనిపై అన్ని కోణాల్లో సమీక్షించాలి. అధికారంలో ఎవరున్నా సెక్యూరిటీ కల్పించాలని కోరుతూ ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. సెక్యూరిటీ అనేది భద్రత కోసం అని కాకుండా ఇప్పుడది స్టేటస్ సింబల్‌గా మారింది. నిజంగా ఎవరికి భద్రత అవసరం, ఎవరు స్టేటస్ సింబల్‌గా దీనిని ఉపయోగించుకుంటున్నారు అనేది సెక్యూరిటీ పొందుతున్న ప్రతి వ్యక్తినీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. సెక్యూరిటీ కల్పించడానికి ఒక కమిటీ ఉంటుంది. కమిటీకి కచ్చితమైన నిబంధనలు ఉంటాయి. ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుని సెక్యూరిటీ ఇవ్వాలో నియమ నిబంధనలుంటాయి. అయితే అధికారంలో ఉన్న వారికి సెక్యూరిటీ కోసం వివిధ వర్గాల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రభుత్వాల్లో మంత్రులపై కూడా ఒత్తిడి ఉంటుంది. కొన్ని నిర్ణయాలు ఒత్తిడితో తీసుకుంటారు. ఇలాంటి కేసులను నిష్పక్షపాతంగా పరిశీలించాలి. వివిఐపిలకు కల్పించే భద్రతా సిబ్బందిలో కనీసం 30 శాతం వరకు తగ్గించడానికి అవకాశం ఉంది. అయితే రాజకీయంగా కాకుండా అన్ని కేసులు పరిశీలించి నిజంగా ఎవరికి అవసరం, ఎవరు స్టేటస్ సింబల్‌గా ఉపయోగించుకుంటున్నారో చూడాలి. వివిఐపిలకు సెక్యూరిటీ అవసరం ఏ మేరకు ఉందో నిర్ణయించే కమిటీ సిఫారసులకు భిన్నంగా సైతం కొన్ని సందర్భాల్లో సెక్యూరిటీ కల్పిస్తున్నారు. సెక్యూరిటీ దరఖాస్తును కమిటీ తిరస్కరించినప్పుడు వివిఐపిలు న్యాయస్థానాలకు వెళ్లి సెక్యూరిటీ పొందుతున్నారు. న్యాయస్థానాలు సైతం ఈ అంశంలో సమీక్ష జరుపుకోవాలి. కోర్టు ద్వారా సెక్యూరిటీ పొందుతున్న వ్యక్తికి నిజంగా సెక్యూరిటీ అవసరమా? స్టేటస్ సింబల్‌గా సెక్యూరిటీ కోరుతున్నారా? అనేది చూడాలి. అదే విధంగా కమిటీ సైతం నిష్పక్షపాతంగా వ్యవహరించే అవకాశం కల్పించాలి. న్యాయమూర్తుల సెక్యూరిటీ తగ్గించవచ్చునని సర్వోన్నత న్యాయస్థానమే పేర్కొన్న సమయంలో ప్రభుత్వాలు వివిఐపిల సెక్యూరిటీని సమీక్షించుకోవాలి. నేర చరిత్ర గలవారికి సైతం సెక్యూరిటీ కల్పిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సుప్రీంకోర్టులో సెక్యూరిటీపై పిటిషన్ దాఖలు చేసినవారు ఈ అంశాన్ని సైతం ప్రధానంగా ప్రస్తావించారు. వివిఐపిలకు భారీ సెక్యూరిటీతో పాటు వారు వెళ్లే సమయంలో రహదారులు మూసివేయడంపై సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అదే విధంగా వివిఐపిల కుటుంబ సభ్యులకు సైతం సెక్యూరిటీ పేరుతో చేస్తున్న వ్యయం వివరాలు కోరింది. ఇది మంచి పరిణామమే, ఈ సందర్భంగానైనా సెక్యూరిటీపై సమీక్షకు అవకాశం ఏర్పడింది. ఒక వ్యక్తికి నిజంగా ప్రాణభయం ఉండి సెక్యూరిటీ అవసరం అయితే సెక్యూరిటీ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కానీ చాలా కేసుల్లో వివిఐపిలు కేవలం స్టేటస్ సింబల్‌గా సెక్యూరిటీ కోరుకుంటే మాత్రం అలాంటి వాటిని ఇకనైనా నివారించడం మంచిది.

- టి. దేవేందర్ గౌడ్
రాష్ట్ర మాజీ హోం మంత్రి, రాజ్యసభ సభ్యుడు

ఎవరి జోక్యమూ తగదు

ఎవరికి ఎంత భద్రత కల్పించాలనే అంశంలో కోర్టుల జోక్యం తగదు. పోలీసులు భద్రత కల్పించేది ఒక్క విఐపిలకు మాత్రమే కాదు. పోలీసుల ప్రాధాన్యతలో అణగారిన వర్గాలు, దళితులు, మహిళలు, మైనార్టిలు, కార్మికులు తదితర వర్గాలు కూడా ఉన్నాయి. భద్రత విషయంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, ఎవరికి ఎంత భద్రత కల్పించాలన్నది స్థానిక ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల డిజిపీలు సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం తన జోక్యాన్ని తగ్గించుకొని, పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం వల్ల విమర్శలకు తావుండదు. ఈ అంశంలో ప్రభుత్వం కానీ, ఇతరుల జోక్యం కానీ ఎంత తక్కువ ఉంటే అంత మంచిదనేది నా అభిప్రాయం. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది. ఈ అంశంలో పూర్తి స్వేచ్ఛను పోలీసు వ్యవస్థకు కల్పించాలి. అంతేకానీ ఎవరికెంత భద్రత కల్పించాలనేది కోర్టులు కానీ, ప్రభుత్వాలు కానీ నిర్ణయించలేవు. అలాగే వివిఐపిల ముసుగులో నేరచరిత్ర కలిగిన వారికి, ఫ్యాక్షనిస్టులకు భద్రత కల్పించడం తప్పు. భద్రత కల్పించే వ్యక్తులు నేరగాళ్లో, ఫ్యాక్షనిస్టులో కాకుండా మర్యాదస్తులు అయి ఉండాలనే నియమం కూడా ఉండాలి. అంతేకానీ ఎవరికంటే వారికి భద్రత కల్పించడం వల్ల వారు చేసే తప్పుడు పనులకు పోలీసులు రక్షణ కల్పించినట్టు అవుతుంది. అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దౌర్జన్యాలకు పాల్పడేవారిని, నేరాలకు పాల్పడేవారిని అరికట్టాల్సిన పోలీసు వ్యవస్థే చివరకు అలాంటి వారికి భద్రత కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం ఏర్పడ్డాయి. అలాంటి పరిస్థితి రాకుండా చూడాలి. ఉదాహరణకు రాయలసీమలో ఫ్యాక్షనిస్టులకు, వారి ప్రత్యర్థులకు కూడా గన్‌మెన్లను ఏర్పాటు చేస్తున్నారు. నేను డిజిపిగా ఉన్న సమయంలో రాయలసీమలో ఇద్దరు ఫ్యాక్షనిస్టు నాయకులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఆ సమయంలో ఇరువైపుల ఉన్న నలుగురేసి గన్‌మెన్లు తలపడటం కూడా జరిగింది. ఇద్దరూ ఫ్యాక్షన్ నాయకులే అయినప్పుడు వారికి భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి కానీ, పోలీసుల కానీ ఎందుకు ఉండాలి? ఇలాంటి ఫ్యాక్షనిస్టుల వల్ల ఎవరి ప్రాణాలకైతే ముప్పు పొంచి ఉందో వారికి భద్రత అవసరం కానీ, ఫ్యాక్షన్ నాయకులకు కాదనేది నా అభిప్రాయం. ఎవరికి ఎంత భద్

స్వర రాగ రంజితాలు..
త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

శారద కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ 23వ వార్షికోత్సవాలు, 166వ సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రముఖుల సంగీత కచేరీలతో పరిమళ భరితంగా ముగిసాయి. శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో చివరి నాలుగు రోజులలో ప్రముఖ సంగీత విద్వాంసులు యన్.విజయశివ, హరిచరణ్ శేషాద్రి, వయొలిన్ ద్వయం మైసూర్ మంజునాథ్, నాగరాజ్, మల్లాది సోదరుల కచేరీలు కీస్ గరల్స్ హైస్కూల్లో విచ్చేసిన సంగీత ప్రేమికులకు మహదానందాన్ని కల్గించాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు యన్.విజయశివ తన కచేరీలో ''నడచి నడచి చూచే'' ఖరహర ప్రియలోను, శ్యామశాస్త్రి కృతి ''కామాక్షి'' యదుకుల కాంభోజి స్వరరాగ రంజితంగా గానం చేశారు. అమృత మురళి వయొలిన్‌పై, జె.వైద్యనాథన్ మృదంగంపై చక్కని అనుసరణ చేసి కచేరీని రక్తి కట్టించారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలలో ''నడచి నడచి చూచే' ఆలపిస్తున్న ఎన్.విజయ శివ

గాయకులు హరిచరణ్ శేషాద్రి తన కచేరీని ''సరసుడా'' నాథ్, నాగరాజ్, మల్లాది సోదరుల కచేరీలు కీస్ గరల్స్ హైస్కూల్లో విచ్చేసిన సంగీత ప్రేమికులకు మహదానందాన్ని కల్గించాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు యన్.విజయశివ తన కచేరీలో ''నడచి నడచి చూచే'' ఖరహర ప్రియలోను, శ్యామశాస్త్రి కృతి ''కామాక్షి'' యదుకుల కాంభోజి స్వరరాగ రంజితంగా గానం చేశారు. అమృత మురళి వయొలిన్‌పై, జె.వైద్యనాథన్ మృదంగంపై చక్కని అనుసరణ చేసి కచేరీని రక్తి కట్టించారు.

గాయకులు హరిచరణ్ శేషాద్రి తన కచేరీని ''సరసుడా'' సావేరీ వర్ణంలో శుభారంభంగావించారు. దీక్షితుల షణ్ముఖ ప్రియ కృతి సిద్ధి వినాయకం శ్రావ్యంగా పాడిన అనంతరం ''మారి వైరి రమణీ'' నాసికాభూషణి త్యాగరాజ కీర్తన చక్కని రాగాలాపనతో అందించారు. ''చాలా కల్లతడు'' ఆరభి త్యాగరాజ కీర్తనలో శేషాద్రి అనుపల్లవి చరణాలు మరొక కీర్తనలోని పాడటం జరిగింది. ఇలాంటి లోపాలు సరిదిద్దుకొని చక్కని కీర్తన అవగాహనతో పాడాలి గదా. ఇంక నెరుచిరా (హళవి) తదితర కీర్తనలో శేషాద్రి గానం చేసి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు.

ప్రముఖ వయొలిన్ ద్వయం మైసూర్ నాగరాజ్, డా.మంజునాథ్ వయొలిన్ విన్యాసం శుక్రవారం సాయంత్రం ప్రేక్షకులను ఆహ్లాదపరిచింది. మైసూర్ సోదరులు తమ కచేరీని ''తెరచీయగరాదా'' గౌళిపంతు రాగ త్యాగరాజకీర్తనతో చక్కని ప్రారంభిన్నిచ్చారు.

''పరిదానమిచ్చితే'' బిలహరి రాగ పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన చక్కని రాగాలాపనతో రపలికించిన తీరు వారి వాదనా సాధనకు అద్దంపట్టింది. త్యాగరాజ కీర్తన బిందుమాలిని రాగం ''ఎంత ముద్దో ఎంత సొగసో'' సౌందర్యమతమైన గమకాలతో అందించారు. మరొక త్యాగరాజ కీర్తన భైరవి రాగంలో ''ఉపచారములన చేకొనరయ్యా'' చక్కని రాగాలాప్, స్వరకల్పనలతో ఇరువురి సోదరులు అందించి వయొలిన్ కచేరీని రసప్లావితం చేశారు బి.సి.మంజునాథ్ (మృదంగం), పి.వి.రమణమూర్తి (ఘటం) వాద్య సహకారం కచేరీకి వన్నెతెచ్చింది.

మాధుర్యం పంచిన ''మల్లాది సోదరులు''

మన రాష్ట్రానికి చెందిన, జాతీయంగా ప్రసిద్ధులైన యువ జంట గాయకులు మల్లాది సోదరులు (శ్రీరామప్రసాద్, రవి శంకర్) యుగళ గాత్రం ఆరాధనోత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మల్లాది సోదరులు తమ కచేరీని ''చలమే జేసేవయ్య'' నాటకురంజి వర్ణంతో శుభారంభంగావించారు. ''నిత్యరూప ఎవ్వరి పాండిత్యమేమి'' కాపీ రాగ త్యాగరాజ కీర్తనలో చక్కగా రాగాలాపనతో శ్రీరామ్‌ప్రసాద్ కచేరీకి శోభను చేకూర్చారు. కాంభోజి రాగ త్యాగరాజకీర్తన ''మహిత ప్రవృద్ధి''లో రాగాలాపన సమతూకంగా అందించిన అన్నదమ్ములు. ''పాహి సుగుణ రత్నాకరే'' నెరవులు మధురంగా పల్కి కచేరీని రసాప్లావిత చేశాడు. లలిత రాగంలో ''అభయదాయకుడవవ నీవేనట'' అన్నమాచార్య రచనలో ఇద్దరూ హిందుస్థానీ ఛాయలో గానంచేసి తమ నిత్యసాధనా పటిమను వెల్లడిచేశారు.

ఎంబెరుకన్ననో వయొలిన్‌పై, మృదంగంపై యం.యల్.యన్.రాజు శ్రీనివాస గోపాలన్ (మోర్శింగ్)పై అనుసరించి కచేరీని శక్తివంతం చేశారు. శారదా కల్చరల్ ట్రస్టు త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యదర్శి, అధ్యక్షులు శారదా కృష్ణన్, అంబుజ రామకృష్ణన్ నేతృత్వంలో ఇతర కార్యదర్శి సభ్యులు సహకారంతో వైభవంగా ముగిశాయి.

- చివుకుల రామ్మోహన్

కనువిందుగా 'నంది'వర్ధనాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టి.వి. మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నంది' నాటకోత్సవాలు ప్రేక్షకులకు మధురానుభూతిని కలిగించింది. విజయనగరం ఆనందగజపతి కళాక్షేత్రంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించారు. పోటీలకు 185 నాటకాలు రాగా వాటిలో 43 నాటకాలను ఎంపిక చేశారు. కిక్కిరిసిన ప్రేక్షకులు, కేరింతలతో ఒక పండుగ వాతావరణం నెలకొంది. కళలకు నిలయం విజయనగరంలో నాటకాలకు మంచి ఆదరణ లభించింది. ప్రదర్శనలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రతిభకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. సురభి సెట్టింగులు, పలు సన్నివేశాలు వీక్షకులకు కనుల విందు చేశాయి. అడుగడుగునా ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. సుమారు 1100 మంది కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు.

పోటీలలో తొలి పద్యనాటకం 'నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ కె.పి.హెచ్.బి.కాలనీ (హైదరాబాద్)వారి 'భక్తప్రహ్లాద' రచన కీ.శే.బండ్ల సుబ్రహ్మణ్యం. దర్శకత్వం యం.అర్జునరావు. శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ (విజయనగరం)వారి 'యామునాచార్య' పద్య నాటకం. రచన, దర్శకత్వం డాక్టర్ మీగడ రామలింగస్వామి. శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద'లోని యామునాచార్య కథ. శివప్రియ ఆర్ట్స్(నెల్లూరు) వారి సాంఘీక నాటకం 'సృష్టి ధర్మం' రచన వి.సంఘమేశ్వరరావు, దర్శకత్వం కె.ఉదయభాస్కర్. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగినా వదలకూడదనేది 'సృష్టి ధర్మం'అని చాటి చెపుతోంది ఈ నాటకం. మైత్రికళానిలయం (విజయవాడ)వారి సాంఘీక నాటిక. 'పరిభ్రమణం' రచన కె.సుబ్రహ్మణ్యం, దర్శకత్వం వి.పురుషోత్తం. బాలసరస్వతి కళానాట్య మండలి (మహ్మదాబాద్) రంగారెడ్డి జిల్లావారి పద్య నాటకం 'భక్తపుండరీక'. రచన వరకవుల జగన్నాథరాజు, దర్శకత్వం బుక్కా సుబ్రహ్మణ్య శాస్త్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (రాజంపల్లి) వారి బాలల సాంఘీక నాటిక 'మంచోళ్ళే'. రచన, దర్శకత్వం కె.వి.రంగారావు. 'మనదేశానికి కావల్సింది డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, శాస్త్రవేత్తలు కాదు నిజాయితీగల పౌరులు కావాలి'అనేది ఈ నాటిక సారాంశం. 8రోజులపాటు జరిగిన నాటక పోటీల్లో విరామం సమయంలో కళాకారులను సుమారు 98 మందికి చిరు సత్కారం చేశారు.

- గాదిరాజు రంగరాజు

రసరమ్యం.. 'రమ' గానం

ప్రపంచ ప్రఖ్యాత (విశాఖపట్నం వాస్తవ్యులు) శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు పంతుల రమ మూడవ రోజు కచేరీ స్థానిక కీస్ గరల్స్ హైస్కూల్‌లో జరిగింది. ఈ శీర్షికా కార్యక్రమాలలో తలమానికంగా నిలిచిందనవచ్చు. రాగభావం వెదజల్లటంలోను, మనోధర్మసంగీతాన్ని ఆవిష్కరించిన తీరు, అకార సాధనా ప్రదర్శనా పటిమ, ఆమె పాండితీ ప్రకర్షకు, నిత్య సాధనకు అద్దం పట్టి, సంగీత రసజ్ఞులను సంగీత లోకంలో విహరింపజేశారనవచ్చు. అంతేగాక ఇదొక విద్వత్ ప్రదర్శనగా భాసిల్లింది. త్యాగరాజ వారసత్వ సంపదానుశీలిగా 'రమ' సంగీత గుణాత్మక కృషిని సదా కొనియాడ రావలసిన తరుణమిది అనవచ్చు.

పంతుల రమ తన కచేరిని 'నామ కుసయము లచే పూజించు' శ్రీరాగ త్యాగరాజకీర్తనతో శోభస్కరంగా రాగ భావాంబుధితో అందించారు. అనంతరం 'నిన్ను చూచి ధన్యుడైతి' సౌరాష్ట్ర రాగ పట్నం సుబ్రహమణ్యయ్యర్ రచన వేగవంతంగా గానం చేసి కచేరికి సుహృత్ సంగీత వాతావరణం సృష్టించారనవచ్చు. సందర్భోచితంగా దీక్షితుల నవగ్రహ (కుజ) కీర్తన మంగళవారం సందర్భంగా సురటి రాగ 'అంగారక మాశ్రయామ్యహం' రాగాలాపన అందంగా పల్కించి దీక్షితుల భావ సంపదను, కృతి సాహిత్య భావాన్ని అనుభవైకవేద్యం చేశారు. అనంతరం ప్రతాపవరాళి రాగ అపురూప త్యాగరాజ కీర్తన 'వినానాసకొనియున్నానురా' వేగంగా గానం చేసి 'విశ్వరూపుడవు' పదాలు సౌందర్యభరితంగా అందించారు. 'మానములేదా' హమీర్ కల్యాణి, హిందుస్థాని ఛాయంతో మాధుర్యంగా గానం చేయటమేగాక, నెరవులు మెరమెచ్చుగా పల్కితే, వయొలిన్‌పై యం.యస్.యన్. మూర్తి అనునయంగా రాగభావాన్ని వెదజల్లిన తీరు కచేరీకి మరింత మెరుగులు దిద్ది కచేరిని సుశోభితం చేశారు. ఇందులో 'రమ' రాగాలాపన, రాగప్రస్తారంలోను ప్రయోగాత్మతకు అద్దంపట్టి అదే రీతిలో మూర్తి వయొలిన్ పల్కించిన తీరు ప్రతిభావంతంగా సాగింది.

'నానోరు విలయాట్టు బొద్ముయా' నవరస కన్నడ రాగ పాపనాశం శివన్ రచన తమిళ శ్రోతలను ఆహ్లాదపరచగా, రాగం, తానం, పల్లవి అంశంగా శ్యామశాస్త్రి స్వరజతి 'కామాక్షి'ని చేపట్టి రాగం విస్తారంగా అందించి, తానం సునాదభరితం చేసి, స్వరజతి విశ్రాంతయుక్తంగా, సాహిత్య భావం ఔచిత్యభరితంగా అందించటం, నెరవులు, కల్పనాస్వరాలు శృతియుక్తంగా గానం చేయుట

సంగీత విద్వాంసురాలు పంతుల రమ గాన కచేరి

విశేషంగా పేర్కొనవచ్చు. జీవస్వరాలు విన్యాసయుక్తంగా రమ పలికించటం మరొక విశేషంగా పేర్కొనవచ్చు. పురందరదాస్ దుర్గరాగ్‌లో 'ధర్మశవణ' రాధా సమేతా కృష్ణ బహుళ ప్రచారమైన మరొక కీర్తనతో ఆద్యంతం రసప్లావితంగా అందించి రమ ప్రేక్షకులని తన గానంతో తాదాత్మ్యభరితంగా చేయటం ఆమె ప్రతిభకు చక్కని ఉదాహరణ.

మృదంగంపై ఒ.యస్.ఆర్.మూర్తి, ఘటంపై నేమాని సోమయాజులు పోటీ పోటీగా, ఇటు తని ఆవర్తనంలోను, మృదంగ ఘట సహకారంతోను తమ సహజ పాండీ ప్రకర్షకు అద్దం పట్టే విధంగా నాదాన్ని సునాదభరితంగా స్ఫూర్తివంతమైన ప్రదర్శనతో కచేరిని రక్తి కట్టించారు. రమ గానం ఆద్యంతం రమణీయంగా సాగి ప్రేక్షకులు ఆసాంతం కచేరిని వీక్షించటం రమ గాన ఆకర్షణా శక్తికి నిదర్శనమనవచ్చు.

కమనీయం 'గాయత్రి' గానం

ప్రముఖ శాస్త్రీయ గాత్ర విద్వాంసురాలు గాయత్రి వెంకటరాఘవన్ (చెన్నై) తన కచేరీని 'జగదానందకారక' నాట రాగ త్యాగరాజ పంచరత్న కీర్తనతో శుభారంభం గావించారు. అనంతరం ప్రముఖమైన భక్తరామదాసు కీర్తన 'ఎన్నగాను రామజన' పంతువరాళి రాగ కీర్తన అత్యంత భక్తి భావంతో గానం చేసి 'రామచిలుక నొకటి, రామ రామ అనుచు, కామితార్థము ఫలములిచ్చు' పదాల సౌందర్యాన్ని పల్కించి, కీర్తనాసారాన్ని అనుభవింపజేశారు. 'జననీ నిను వినా' రీతు గౌళ కీర్తన కూడా భావంతో గానం చేయటం గాయత్రి గాన పరిపుష్టికి నిదర్శనంగా నిలిచింది.

'మా రమణ ఉమారమణం'(హిందోళ) పాపనాశం శివన్, వరరాగలయ (చెంచు కాంభోజి) త్యాగరాజ కీర్తనలు ఒకదానికొకటి మాధుర్యభరితంగానే గానం చేశారు. ప్రధానాంశంగా కళ్యాణి రాగ దీక్షితుల కృతి 'కమలాం బాం భజరే' ఎంచుకొని చక్కని రాగాలాపన, నెరవులు, స్వరకల్పనలు హృద్యంగా అందించారు. 'నిత్య కళ్యాణీం కాత్యాయినీం'పదాలలో నెరవులు పల్కిన తీరు మెరమెచ్చుగా సాగింది. ఇంకా గోవర్ధన గిరిధర తదితర కీర్తనలతో గాయత్రి తన గాన విస్తృతి వెల్లడి చేసి కచేరీని ఆసాంతం రసరంజకం చేశారు. చారులత రామానుజం (వయొలిన్), మన్నార్ కోయిల్ జె.బాలాజీ (మృదంగం) ముడివక్కం ఎ.మురళి (ఘటం)పై అనువైన వాద్య సహకారం అందించి కచేరిని రక్తికట్టించారు.

మరొక ప్రముఖ గాయని సంగీత శివకుమార్ తన గాత్ర కచేరిని 'చలమేల' నాటకురంజిలో ప్రారంభించారు. రామ నన్ను బ్రోవరా (హరికాంభోజి) ఏటి జన్మము (వరాళి) త్యాగరాజకీర్తనలు గానం చేసిన అనంతరం సంగీత ఆరభిరాగ 'చాల కల్లలాడు' కీర్తన రాగాలాపనతో అందించారు. మాయమ్మ (ఆహిరి) శ్యామశాస్త్రి కృతి అనంతరం ప్రధానాంశంగా 'ఎందుకు పెద్దల' (శంకరాభరణ) త్యాగరాజకీర్తనతో తన కచేరీని ముగించారు. సంగీత శివకుమార్ తన సాధనలో ఇనుమడింపజేసే కృషితో రాణించగలరని ఆశిద్దాం.

-చివుకుల

యాభై యేళ్లుగా రసజ్ఞుల నీరాజనాలందుకుంటున్న 'గన్నోజు'

లలిత సంగీతం సుమధుర రస భరితం. సకల జీవులను పరవశింపజేసే కళ సంగీతం. సంగీత సామ్రాజ్యంలో సర్వజనులను రంజింపచేసేది లలిత సంగీతం. ఈ సంగీత సామ్రాజ్యంలో తనదైన బాణీలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఎన్నో ప్రశంసలు అందుకున్న సుమధుర గాయకుడు శ్రీనివాసాచారి గన్నోజు. స్కూలులో చదువుతున్న రోజులలోనే వేదికపై పాటలు పాడటం ప్రారంభించాడు. 1962వ సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్నపుడు మొదటిసారిగా పాడి ఉపాధ్యాయుల ఆశీస్సులు అందుకున్నాడు. ఆనాటినుండి అతనిలో పాటలు పాడాలనే ఉత్సాహం ప్రారంభమైంది. ఈయన వంశంలో చాలామంది గాయకులు. తాతగారు, మేనమామలు గాయకులుగా ప్రోత్సహించడంతో శ్రీనివాసచారికి కొండంత బలం చేరువైంది. స్కూలులో ఏ కార్యక్రమం జరిగినా ప్రార్థన ఆలపించడానికి తననే పిలిచేవారని, సాటి విద్యార్థులుతో పాటు మాష్టార్లు, హెడ్‌మాస్టర్ కూడా ఎంతో అభిమానంగా చూసేవారని శ్రీనివాసచారి తెలిపారు. ఇతని ఉత్సాహం చూసి తల్లిదండ్రులు సంగీతం కూడా నేర్పించారు. మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులైన తరువాత పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్‌లో డిప్లొమా చేశారు. ఆ తరువాత తన ఆలోచనలను పూర్తిగా సంగీతంపై మరల్చారు. ప్రభుత్వ సంగీత కళాశాలలో 1971లో అడుగుపెట్టి హిందుస్థానీ సంగీతంలో శిక్షణ తీసుకున్నారు. 1983 నుండి మూడు సంవత్సరాలు కర్నాటక సంగీతంలో అనేక కీర్తనలు, మెళకువలు నేర్చుకున్నారు. పూర్వజన్మ సుకృతంవల్లనే సుమధుర కంఠంతో పాటు అతి సునాయాసంగా పాటలను నేర్చుకోగలిగే శక్తి లభించిందని శ్రీనివాసచారి ఎంతో సంతృప్తితో చెప్పాడు. హైదరాబాద్ ఆకాశవాణి ద్వారా గుర్తింపుపొందిన గాయకుడిగా అనేకసార్లు రేడియోలో తన గానాన్ని వినిపించాడు శ్రీనివాసచారి. 1980లో సొంతంగా ఆర్కెస్ట్రా గ్రూప్‌ని తయారుచేసుకొని ఫిలిం టాలంట్ గిల్డ్ సహకారంతో రవీంద్రభారతిలో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. స్వీయ స్వరకల్పనతో లలిత సంగీతంలో అనేక ఆడియో క్యాసెట్‌లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. 'సెలయేటిలా నవ్వేవు...' అనే పాటను కుమారుడి సంగీతానికి, కంఠ మాధుర్యానికి తల్లి పరవశించింది. అతనికి తల్లి దండ్రుల సహకారం పూర్తిగా లభించింది. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు ఇతని గానాన్ని చిన్నతనం నుండి వింటున్న వారందరి

హృదయాలను దోచుకున్నారని శ్రీనివాసచారి చిన్ననాటి స్నేహితులు చెప్పారు. ఇతని అదృష్టం సంగీతంలో అభిరుచి వున్న భార్య లభించడం. ఆమె పూర్తి సహకారంతో అంచెలంచెగా గాయకుడిగా ఎదిగారు. తాను ఎంతోమంది శిష్యులను తయారుచేసి దేశం నలుమూలలా ప్రదర్శనలు ఇచ్చారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి, గానకోకిల పి.సుశీల తన పాటలు విని ఎంతో మెచ్చుకున్నారని చెప్పారు. దేశంలోని అనేక పుణ్యక్షేత్రాలలో పర్యదినాలకు ప్రత్యేకంగా తనను ఆహ్వానించి కచేరీలు ఏర్పాటుచేసేవారని చెప్పారు. సంగీత వారసత్వంలో ఇతని పిల్లలు కూడా చేరారు. కుమార్తె భావన మంచి గాయని. ప్రస్తుతం బి.కాం పూర్తి చేసింది. కొడుకు గౌతమ్ వయొలిన్, గిటార్ వాయిస్తాడు. బి.టెక్ పూర్తిచేసి ప్రస్తుతం యంబిఏ చదువుతున్నాడు. వీరిద్దరూ అవకాశం వున్నపుడల్లా తండ్రితో పాటు వేదికపైన తమ ప్రతిభను చూపిస్తుంటారు. అయ్యప్ప స్వామిపై ఇటీవల స్వీయ సంగీత దర్శకత్వంలో రూపొందించిన 'ఓంకార రూపా అయ్యప్ప' ఆడియో సీడి బాగా పాపులర్ అయ్యింది. భాష ఏదైనా భక్తి భావంతో సంగీతాన్ని ఆలపిస్తే పామరుడైనా ఆనందంతో స్టెప్పులు వేస్తారు. వ్యక్తిగత విషయాలను పరిశీలిస్తే శ్రీమతి రాధమ్మ, శ్రీశైలంలకు షాద్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో జన్మించారు. 50 సంవత్సరాల సంగీత అనుభవంతో మెలోడి మ్యూజికల్ స్టార్ అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి తన దైన బాణిలో సంగీతం నేర్పిస్తూ సంగీత ప్రదర్శనలు ఇస్తున్నాము అని గన్నోజు శ్రీనివాసచారి చెప్పారు. ఈవెంట్ మేనేజర్‌గా ఎంతో ఖ్యాతి సంపాదించారు.

-కశ్యప

భావరాగ సమన్వితం 'నాదభారతి'

గాన మాధుర్యం

నాదభారతి సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా సంగీత త్రిమూర్తుల శ్రీకృతి కచేరీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల గడ్డి అన్నారం శ్రీ కోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రముఖ వయొలిన్ విద్వాంసులు కొమాండూరి శేషాద్రి గాత్ర కచేరీలో పలు త్యాగరాజ కీర్తనలు సోదాహరణ ప్రసంగంతో వీనుల విందుగా, సాహిత్య భావ సంపత్తితో వినిపింపజేశారు. కొమాండూరి శేషాద్రి వయొలిన్, వయోలా విద్వాసులేగాక, కవి, సంగీత విశ్లేషకులు, గేయకర్తగా బహుముఖ ప్రజ్ఞావంతులు.

ఈనాటి గాత్ర కచేరిని కొమాండూరి 'శ్రీ గణపతిని సేవింపరాదే' సౌరాష్ట్ర రాగంతో ఆరంభించి కీర్తనా విశేషాలను గణేశ స్తుతి పరంగా వివరించి గానం చేశారు. రామా నిన్నే నమ్మినాను (హుసేని) కీర్తన శ్రావ్యతా ప్రధానంగా అందించి, సాద, ధీర, రాజరాజమందిత పదాలు పల్కిన తీరు అనుభవజ్ఞతను వెల్లడిజేసింది. ప్రముఖమైన శ్రీ త్యాగరాజ పంచరత్న కీర్తన 'ఎందరో మహానుభావులు' కీర్తనా భావాన్ని ప్రస్ఫుటంగా వివరించి, పాఠాంతర విశేషాలను విశదపరిచి గానం చేశారు. ఉండేది రాముడొకడు (హరికాంభోజి) చక్కని స్వర కల్పనలతో అందించి కొమాండరి గాన మాధుర్యాన్ని పంచారనవచ్చు.

రాగరత్న మాలికే (రీతిగౌళ), జ్ఞానమొసగరాదా (పూర్వీ కళ్యాణి), రెండు కీర్తనలను చక్కని రాగాలాపనతో, నెరవులు స్వరకల్పనలతో బహు హృద్యంగా గానం చేశారు. నైగదుష ట్ఛాస్త్ర, పురాణాగమార్థ, జీవాత్ముడు, పరమాత్ముడు, పదాల సౌందర్య భరితంగా అందించిన తీరు మెరమెచ్చుగా సాగింది.

ఇంకా మాకేలరా విచారము (రవి చంద్రిక) ఆధ్యాత్మిక భావ సంపత్తితో అందించి, ప్రధానాంశంగా భైరవిరాగ 'ఏనాటి నోము ఫలమో' కీర్తన చేపట్టి కచేరిని రక్తివంతం చేశారు.చివరగా హెచ్చింకరారా (యదుకుల కాంభోజి)తో కచేరిని శేషాద్రి చక్కని ముగింపునిచ్చారు. ఎంపిక చేసిన కీర్తనలతో త్యాగరాజ సాహిత్యాన్ని బహు పసందుగా అనుభవింపజేశారనవచ్చు. శౌరీరాజన్ కొమాండరి (వయొలిన్) తండ్రికి అనునయంగా వాయిస్తూ, కొండొకచో స్వీయ బాణిని పల్కించగా, మృదంగంపై పరవస్తు శ్రీనివాస గోపాలన్ అనుసరణ చేస్తూనే, తనిఆవర్తనం సునాదభరితంగా ఆద్యంతం కచేరిని రసప్లావితం చేశారనవచ్చు.

-సి.యస్.ఆర్

సోదరుడు దినకర్‌తో కలిసి జుగల్‌బందీ చేస్తున్న ప్రముఖ వేణుగాన విద్వాంసుడు ప్రేమకుమార్

ప్రవహించే నాదఝరి..
వేణుగాన సంగీతలహరి!

వసంత భైరవి, బౌళి, అభేరి, శ్రీ, కానడ, సింధుభైరవి, హంసధ్వని తదితర రాగాల్లో వాగ్గేయకార సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా తన వేణువుపై పలికిస్తూ కర్ణాటక సంగీతంలో సరికొత్త ప్రయోగాలు చేయడమే కాకుండా వందలాది మంది ఔత్సాహికులను వేణుగాన కళాకారులుగా తీర్చిదిద్దుతున్న ప్రముఖ వేణుగాన విద్వాంసుడు ఆర్ ప్రేమకుమార్ తన వేణుగాన విన్యాసంతో మూడు దశాబ్దాలకు పైబడి సంగీత ప్రియులను స్వరఝరులలో ముంచెత్తుతున్నారు. గుంటూరు నగరానికి చెందిన ప్రేమ్‌కుమార్ కర్ణాటక సంగీతాన్ని, తనకు ఇష్టమైన వేణునాదాన్ని అప్పటి సంగీత విద్వాంసులు సాగి వెంకటేశ్వరరావు వద్ద అధ్యయనం చేసి అనంతరం స్వయంగా నిరంతర సాధన చేస్తూ అనతికాలంలోనే వేణుగాన విన్యాసం చేయడంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌లో పట్టా పొంది మృదంగం, వేణువులో డిప్లమో అందుకున్న ప్రేమ్‌కుమార్ ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారునిగా సుపరిచితులయ్యారు. జగమెరిగిన గాయక శిరోభూషణుడు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గాత్ర కచేరికి అనేక పర్యాయాలు వేణువుపై పక్కవాద్య సహకారాన్ని అందించి ఆయన అభిమానాన్ని చూరగొన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించి 50సంవత్సరాలు గడిచిన సందర్భంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉత్సవంలో బాలమురళికి ప్రేమ్‌కుమార్ అందించిన వాద్య సహకారం ఆకాశవాణి శ్రోతలందరినీ పులకింపజేసింది. 1999లో మద్రాస్ మ్యూజిక్ అకాడమీ ఆయనను ప్రత్యేకంగా గౌరవించింది. జీటివి వారు ఏర్పాటు చేసిన మంజుభార్గవి, అటా కార్యక్రమానికి వాద్యసహకారాన్ని అందించి విజయవంతం కావడంలో ముఖ్యభూమికను ప్రేమ్‌కుమార్ పోషించారు. తన సోదరుడు ప్రముఖ వయోలిన్ విద్వాంసుడైన దినకర్‌తో కలిసి అనేక నగరాల్లో ఇటీవలి కాలంలో జుగల్‌బందీ కచేరీలు చేసి సంగీత రసాస్వాదకుల, విమర్శకుల ప్రశంసలు పొందారాయన. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్ శ్రీవారి పాదాల చెంత నాద నీరాజన మండపంపై ఏర్పాటు చేసిన వయోలిన్, వేణువు, జుగల్‌బందీ కార్యక్రమంలో దినకర్‌తో కలిసి ఆయన వేణువుపై చేసిన ప్రయోగాలు టిటిడి వారి మన్ననలు పొందాయి. టిటిడి ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌తో ఆయన పలు సందర్భాల్లో కచేరీలు చేశారు. ద్వారకా తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రేమ్‌కుమార్ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ సంస్థ ఆధ్వర్యాన 9మంది వాద్య కళాకారులతో కలిసి సమర్పించిన 'సప్తవాద్య విన్యాస' కచేరీ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. 20ఏళ్లుగా వందలాది మంది శిష్యులకు సంగీతాన్ని ఆయన బోధిస్తున్నారు. ఆయన వద్ద సంగీత సాధన చేసిన అనేకమంది ఈరోజు మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని పలు కళాశాలల్లో సంగీత అధ్యాపకులుగా రాణిస్తున్నారు. కీబోర్డ్, మృదంగం, వీణ, గిటార్, వయోలిన్, ఫ్లూట్, జాజ్ డ్రమ్స్, డోలక్, తబలా, మాండొలిన్, గాత్రంపై నిరంతరం ప్రయోగాలు చేయడమే కాకుండా తన ఇంటి వద్ద సాయిశృతి మ్యూజిక్ అకాడమీ పక్షాన శిక్షణ ఇస్తున్నారు. ఇన్నేళ్లుగా కర్ణాటక సంప్రదాయ సంగీత ప్రాచుర్యానికి తనదైన రీతిలో కృషిచేస్తున్న ప్రేమ్‌కుమార్ 'కళతో మాట్లాడుతూ... సంగీత వాద్యాల నిన్టింటిలో వేణువుకున్న ప్రాముఖ్యత అంతాఇంతా కాదన్నారు. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలను క్రమబద్ధీకరిస్తూ గుండె లోతుల్లో నుండి ఆరాధనా భావంతో లయాత్మకంగా రాగాలను సమ్మిళితం చేస్తేనే ఉదాత్తమైన గానం పలుకుతుందన్నారు. తనకు శ్రీకృష్ణ భగవానుడే స్ఫూర్తి అని ఆయన వినమ్రతతో చెప్పారు.

- పివి గౌరీశంకర్

IV లో...

చిన్నెల

ఆంధ్రభూమి
శుక్రవారం 22
ఫిబ్రవరి 2013

చిత్రరంగ వందేళ్ల చరిత్రలో నలభై సంవత్సరాలు అంటే 1950వరకు చిత్రరంగం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన కాళ్లపై నిలబడి ముందుకు సాగే దిశగా పయనించిందని చెప్పొచ్చు. తప్పటడుగులతో, సమాజంలో లోపాలను చూపిస్తూ నిర్దేశ దిశగా సాగాయి అలనాటి చిత్రాలు. ఆ తర్వాత నలభై సంవత్సరాలు అంటే 1950నుండి 1990వరకు చిత్రసీమ మూడు పువ్వుల ఆరు కాయలుగా ముందుకు సాగింది. అటు జానపదులు-భారత రామాయణ గాథలు- పురాణ కథలు- సాంఘిక నవలా చిత్రాల ద్వారా ఎనలేని కీర్తి సంపాదించుకుంది. వంద చిత్రాలు నిర్మిస్తే ఎనభై చిత్రాలు విజయం దక్కించుకునేవి. నిజమైన వినోదం- సందేశం- అలనాటి ప్రేక్షకులపై మత్తులా చల్లింది. ఆ తర్వాత ఈ ఇరవై సంవత్సరాలు చిత్రసీమ పాతాళానికి దిగుతూ వస్నెకోల్పోయింది. పతనం అంచులకుచేరి వారసత్వ నటులు నటనంటే తెలియని నటీనటుల ప్రభావంతో నాశనమైపోతుంది.

వందేళ్ల భారతీయ సినిమా

భారతీయ చలనచిత్ర రంగం 2013నాటికి వందేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా కేంద్రం భారీఎత్తున కార్యక్రమం రూపొందించ సంకల్పించింది. అందుకోసం 'జాతీయ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్' ఏర్పాటుచేస్తున్నట్లు, దాదాపు 2500 గొప్ప చిత్రాలను రాబోవు తరాలకు కానుకగా భద్రపరచ భావించినట్లు ప్రకటిస్తూ 2013 జనవరి 26వ తేదీకి కార్యక్రమ వివరాలను రూపొందించి, 2013 ఆగస్టు 15వ తేదీన భారత దేశమంతటా జాతి గర్వించేలా కార్యం జరపాలని నిర్దేశించింది. అందుకు ఆ సంఘం కృషిచేస్తుందని ప్రకటించింది. ఈ వార్త అటు చిత్రరంగానికి, ఇటు ప్రేక్షక లోకానికి సంతోషం కలిగించింది.

ఈ వందేళ్ల భారత సినీ చరిత్రను తెలిసినంతవరకు పరిశీలించి చూస్తే నేడు సంఖ్యాపరంగా చిత్రాలు పెరిగినా, చిరకాలం ప్రేక్షక హృదయాలలో స్థానం సంపాదించుకున్నవి ఇరవై శాతం చిత్రాలు కూడా వుండకపోవచ్చునన్నది నిజం. చిత్రరంగ వందేళ్ల చరిత్రలో నలభై సంవత్సరాలు అంటే 1950వరకు చిత్రరంగం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన కాళ్లపై నిలబడి ముందుకు సాగే దిశగా పయనించిందని చెప్పొచ్చు. తప్పటడుగులతో, సమాజంలో లోపాలను చూపిస్తూ నిర్దేశ దిశగా సాగాయి అలనాటి చిత్రాలు. ఆ తర్వాత నలభై సంవత్సరాలు అంటే

1950 నుండి 1990 వరకు చిత్రసీమ మూడు పువ్వుల ఆరుకాయలుగా ముందుకు సాగింది. అటు జానపదులు-భారత రామాయణ గాథలు- పురాణ కథలు- సాంఘిక నవలా చిత్రాల ద్వారా ఎనలేని కీర్తిసంపాదించుకుంది. వంద చిత్రాలు నిర్మిస్తే ఎనభై చిత్రాలు విజయం దక్కించుకునేవి. నిజమైన వినోదం- సందేశం- అలనాటి ప్రేక్షకులపై మత్తులా చల్లింది. ఆ తర్వాత ఈ ఇరవై సంవత్సరాలు చిత్రసీమ పాతాళానికి దిగుతూ వస్నెకోల్పోయింది. పతనం అంచులకుచేరి వారసత్వ నటులు నటనంటే తెలియని నటీనటుల ప్రభావంతో నాశనమైపోతుంది. 1913లో దాదాసాహెబ్ పాల్కే 'రాజాహరిశ్చంద్ర' చిత్రాన్ని నిర్మించి దేశంలో మూకీ చిత్రాలకు నాంది పలికారు. ఆ తర్వాత 1939లో నిర్మించబడిన 'ఆలం-అరా' టాకీ చిత్రం సరికొత్తపుంతలు తొక్కి చిత్ర నిర్మాణానికి జీవం పోసింది. 1950వరకు మార్గదర్శక యుగమని, 1950నుండి 1990 వరకు స్వర్ణయుగమని, నాటి నుండి నేటివరకు దిగజారుడు యుగమని పేర్కొనవచ్చు. ఈ వందేళ్లలో దాదాపు మన దేశంలో నలభై ఐదువేల చిత్రాలు నిర్మాణం జరుపుకున్నాయి. విజయాలకంటే అపజయాల సంఖ్య ఎక్కువని అంగీకరించి తీరవలసిందే. మొదటి తరం నటీనటులు నాటకాల అనుభవంతో, స్వతహాగా గానం చేయగలిగి చిత్రరంగ విత్తులు చల్లారు. ప్రయోగ దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగింది. రెండవ దశ అంటే స్వర్ణయుగంలో దేశంలో పలు భాషలలో మహానటులు-గొప్ప రచయితలు- గాన గంధర్వులు- సంగీత విద్వాంసులు అలాఅలా వచ్చి చిత్రరంగ గగనంలో తారల్లా మిలమిలమెరిశారు. వెన్నెల హాయిలా వినోదాన్ని ప్రేక్షకులకు పంచారు. అశోక్‌కుమార్- పృథ్విరాజ్‌కపూర్, దిలీప్‌కుమార్- దేవానంద్- రాజేష్‌ఖన్నా- రాజ్‌కుమార్- నేడు షారూఖ్ - సల్మాన్- అమీర్ లాంటి హీరోలు- నూతన్- వైజయంతిమాల- మీనాకుమారి లాంటి ఎందరో హీరోయిన్లు హిందీ రంగ వైభవానికి బాసటగా నిలిచారు. రఫీ- కిశోర్- లత- ఆశా లాంటి గాత్రధారులు... అలా అప్పటి అందరి పేర్లు మనం తలంచుకోవలసిందే. తమిళంలో యం.జి.ఆర్, శివాజీగణేషన్, బి.సరోజదేవి, జయలలిత, మన తెలుగులో ఏ.ఎన్.ఆర్, ఎన్‌టిఆర్, జగ్గయ్య, ఎస్.వి.రంగారావు, సావిత్రి-జమున, శ్రీదేవి, శారద, జయసుధ, జయప్రద- వాణిశ్రీ ఇలా ఎందరో... కళామతల్లికి సేవలు చేశారు. ఘంటసాల, సుశీల, జానకి లాంటి మధుర గాత్రాలు అందరినీ పరవశింపజేశాయి. పేరుపేరున ఆ స్వర్ణయుగంలో చలనచిత్ర రంగంలో అందరూ కృషిచేశారు. ఆణిముత్యాల్లాంటి చిత్రాలు నిర్మించారు. నీతి సందేశం దేశ భక్తి అందులో పొందుపరిచారు. నటీనటులు అన్ని పాత్రలకు జీవంపోసి చరితార్థులయ్యారు. పోతే మూడవ దిగజారుడు యుగంలో నటవారసులు రావడం, నాసిరకం చిత్రాలు తీస్తూ- బూతు సంభాషణలు కేకలు, అరుపులు, మూలుగుల స్వరాలతో కీచు గొంతు స్వరాలతో తెలుగో అరమో ఒక్కపదం అర్థంకాని రచయిత పాటలతో నటనే రాని హీరోలు- హీరోయిన్లు, మూడు ఫైట్లు, ఆరు పాటలతో

మిగతా... IIIలో

ట్రేడ్‌టాక్...

మిర్చిలాంటి పెద్ద కమర్షియల్ హిట్ థియేటర్లలో వుండగా, మూడు చిన్న సినిమాలు ఈవారం సాహసించి విడుదలయ్యాయి. మంచి దర్శకుడిగా పేరున్న నీలకంఠ 'చమక్ చల్లో', నారా రోహిత్ 'ఒక్కడినే', సురేష్‌కొండేటి డబ్బింగ్ సినిమా 'పిజ్జా' ఈవారం విడుదలయ్యాయి. ఈ మూడింటిలో పిజ్జానే కాస్త మంచి మార్కులు కొట్టేసింది. మార్కెట్‌లో మిర్చి ఘాటు ఈవారం కూడా బాగానే వుంది. అంతకు ముందు వచ్చిన సినిమాల హడావుడి బాగా తగ్గింది. మరో రెండు వారాల వరకు పెద్దగా సినిమాలు ఏవీ వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితి మిర్చికి మరికాస్త అనుకూలం కావచ్చు.

పూర్ తాప్సీ!

గ్లామరస్ గర్ల్ తాప్సీకి బాలీవుడ్‌లోనూ ఎపైర్లగోల తప్పడం లేదు. టాలీవుడ్, కోలీవుడ్‌లో తాప్సీకి తను నటించిన సినిమా హీరోలతో లింకులు పెట్టి రూమర్స్ సృష్టించిన మీడియా ఇప్పుడు బాలీవుడ్‌లోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తోంది. ఇదంతా తాప్సీకి పెద్దతలనొప్పిగా తయారైందట. తెలుగు, తమిళ భాషల్లో గ్లామర్ తారగా క్రేజ్‌ని సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మకు ఏదీ దాచుకోకుండా ఎడాపెడా ప్రదర్శించడం అలవాటు. ఆ అలవాటు కాస్త తలనొప్పిగా తయారై ఎపైర్లకు కారణమవుతుందంటున్నారు సినీవర్గాలు. బాలీవుడ్‌లో తాప్సీ ప్రస్తుతం 'ఛష్మేబద్దూర్' అనే సినిమా చేస్తోంది. ఈ సినిమాలో ముఖ్య పాత్రను చేస్తున్న వరుణ్‌ధావన్‌తో తాప్సీ షూటింగ్ సమయంలోనే కాక, ఇతర సమయాల్లోనూ చనువుగా ముంబయ్ వీధుల్లో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోందని బాలీవుడ్ మీడియా అంతా కోడైకూస్తోంది. ఆనోటా ఈనోటా ఈ కబురు కాస్త తాప్సీ చెవిని చేరాయి. దాంతో అగ్గిమీద గుగ్గిలంలా తాప్సీ భగ్గుమంటోందిట. ఏ మాట ఎలావున్నా నిప్పులేందే పొగరాదుగా!? అన్న విషయం తాప్సీ ఎప్పుడు తెలుసుకుంటుందో..ఏమో...ప్చ్ పూర్ తాప్సీ!!

బాలయ్యతో జోడీ

బాలీవుడ్ భామ సమీరారెడ్డి ఎన్‌టిఆర్‌తో 'నరసింహ', చిరంజీవితో 'జై చిరంజీవ' చిత్రాలు చేసింది. ఇప్పుడు తాజాగా మరో తెలుగు చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదీ..బాలయ్య సరసన. అబ్బాయ్‌తో 'నరసింహ' చిత్రం చేసిన ఈ భామ బాబాయ్ బాలయ్యతోజోడీ కట్టేందుకు సిద్ధమవుతోంది. బాలకృష్ణతో 'సింహా' చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు బోయపాటి శీను దర్శకత్వంలో ఈ చిత్రం రానుంది. దీనికి 'రూలర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. గ్లామర్‌తో పాటు పెర్‌ఫార్మెన్స్‌ను ప్రదర్శించాలనుంది అని చెప్పే సమీరా తన తాజా చిత్రంలో ఏ మేరకు ఎక్స్‌పోజ్ చేస్తుందో చూడాల్సిందే..!

రానా రాణించేనా?

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'లీడర్' చిత్రం ద్వారా తెలుగుతెరకు పరిచయమైన రానా ఆ తర్వాత 'నేను నా రాక్షసి', 'దమ్ మారో దమ్', 'డిపార్ట్‌మెంట్ (హిందీ), 'నా ఇష్టం', 'కృష్ణం వందే జగద్గురుమ్' చిత్రాల్లో నటించారు. ఇప్పుడు అయన తాజాగా గుణశేఖర్ దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రని పోషిస్తున్న 'రుద్రమదేవి'లో నిడవర్ధపురం యువరాజు చాళుక్య వీరభద్రుడిగా నటిస్తున్నారు. కాకతీయుల చరిత్రలో యువరాజు వీరభద్రుడికి ప్రముఖ స్థానం వుంది. ఈ పాత్రని రానా చేస్తుండడంతో సినిమాకు మరింత ప్రాచుర్యం వచ్చింది. ఈ క్యారెక్టర్‌కు చాలా మందిని అనుకున్న తర్వాత చివరకు రానా అయితేనే కరెక్టుగా సూటవుతాడన్న అభిప్రాయానికి దర్శకుడు గుణశేఖర్ వచ్చి అయనను ఎంపిక చేసుకున్నారు. ఈ చిత్రానికి సంబంధించి షూటింగ్ ఇటీవలే వరంగల్‌లోని వేయిస్తంభాల గుడిలో ప్రారంభమయింది. తొమ్మిది వందల సంవత్సరాలక్రితం వెలసిన స్వయంభూ శివలింగంపై తొలి దృశ్యాన్ని చిత్రీకరించారు. కాకతీయ వైభవానికి సాక్షీభూతంగా నిలిచిన వేయి స్తంభాల గుడి కంటే ప్రశస్తమైన ప్రాంతం వేరే వుండదు అందుకే ఈ ప్రాంతాన్ని దర్శకుడు ఎంచుకున్నారు. "పౌరాణిక, చారిత్రత్మక పాత్రలంటే నాకు ఎంతో ఇష్టం. అలాంటి పాత్రలు చేయాలని ఎప్పుడూ అనుకుంటాను. ఈ అవకాశం రావడం నా అదృష్టం. దర్శకుడికి నా కృతజ్ఞతలు. ఈ పాత్ర నాకు ఓ ఛాలెంజ్ లాంటిది" అన్నారు రానా. విదేశీ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్న ఈ చిత్రాన్ని స్టీరియో స్కోపిక్ త్రీడీ ఫార్మాట్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కళ తోటతరణి సమకూరుస్తుండగా, ఛాయాగ్రహకుడిగా అజయ్ విన్సెంట్ వ్యవహరిస్తున్నారు. ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో చారిత్రక పాత్రలో రానా రాణించేనా? అంటున్నారు సినీ జనాలు.

వెన్నెల ఆంధ్రభూమి
శుక్రవారం 22 ఫిబ్రవరి 2013

రుచిగానే వుంది

భయానికి లాజిక్‌లు వుండక్కర్లేదు. అదే విధంగా భయపెట్టాలనుకునే సినిమాలకు పెద్దగా సినిమాటిక్ కథలూ అక్కర్లేదు. రామ్‌గోపాల్‌వర్మ భయపెట్టే సినిమాలు ఈ స్కీములో కాకుండా, రెగ్యులర్ స్కీమ్‌లో తీయాలనుకుని విఫలమయ్యాడు. కానీ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, లాజిక్‌లు, పడికట్టు సూత్రాలను లేని చిన్న లైన్‌ను ఎంచుకుని, చిన్న సినిమాగా తీసి, థ్రిల్లర్లు, హార్రర్లు ఇష్టపడేవారి నుంచి తొలి సినిమాకే మంచి మార్కులు కొట్టేసాడు. అయితే రెగ్యులర్ థీమ్ సినిమాలు అంటే, ఓ ఎత్తుగడ, నడక, ముగింపు ఇలాంటి వ్యవహారాలు కోరుకునే వారికి మాత్రం చిన్న నిరాశ అనిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

మైకేల్ (విజయ్ సేతుపతి) పిజ్జా డెలివరీ బాయ్. అను (రమ్య) అనే అమ్మాయితో సహజీవనం చేస్తుంటాడు. ఇతగాడికి ఊరంత భయం. ఆమెకేమో దెయ్యాల కథలన్నా, భయపెట్టే సినిమాలన్నా ప్రాణం. మరోపక్క పిజ్జా షాప్ యజమాని కుమార్తెను నిత్య అనే దెయ్యం పట్టి పీడిస్తుంటుంది. ఇలాంటి నేపథ్యంలో అను గర్భవతి కావడంతో, మైకేల్ తప్పనిసరిగా పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది. అయితే బిడ్డ పుడితే బతకడం ఎలా అన్నది పెద్ద ప్రశ్నార్థకం. ఓ రోజు రాత్రి వేళ పిజ్జా డెలివరీకి ఓ ఇంటికి వెళ్తాడు మైకేల్. అక్కడ భయంకరమైన అనుభవాలు ఎదురవుతాయి. తీరా చేసి ఏదోలా బయటపడితే అను మాయమవుతుంది. నిజానికి ఆ ఇంట్లో కొన్నాళ్ల క్రితం నాలుగు హత్యలు జరిగాయని, ఆపై ఇద్దరు పోలీసులు మృతి చెందారని తెలుస్తుంది. తన చుట్టూ ఏం జరుగుతుందో తెలియని అయోమయం మైకేల్‌కు..ఇలాంటి కథ చివరకు ఎలా ముగిసిందన్నది మిగిలిన సినిమా.

సాంకేతికంగా, చిత్రీకరణ, ఉత్కంఠ, స్క్రిప్ట్, ఇలా అన్నివిధాలా పెద్ద సినిమా అయిన పిజ్జా, నిర్మాణం వరకు మాత్రం చిన్న సినిమా. పట్టుమని పదిమంది నటీనటులు, రెండు మూడు లొకేషన్లు మించి అవసరం లేకుండా, కథను అటు ఇటు ఇష్టం వచ్చినట్లు తిప్పకుండా, నేరుగా చెప్పుకువెళ్లడం వంటి వ్యవహారాలతో, ప్రేక్షకులు హాయిగా సినిమా చూసేలా చేయగలిగాడు దర్శకుడు. కానీ ప్రేక్షకులు ముందేం జరుగుతుందని భావిస్తున్న దగ్గర టక్కున ఆపేయడం అన్నది మాత్రం అన్ని రకాల ప్రేక్షకులు నచ్చేది, నప్పేది కాదు. బహుశా పార్ట్ టూ తీసే ఉద్దేశంతో ఇలా చేసారా అన్నది కూడా ఓ అనుమానం. అదే విధంగా కోట్ల విలువ చేసే వజ్రాలు మాయమయినా, పిజ్జా షాప్ ఓనర్, కేవలం దెయ్యాల భయంతో వాటి జోలికి వెళ్లకుండా వుండడం అన్నది కూడా కొంచెం లాజిక్‌కు దూరంగా వుంది.

సరే లాజిక్‌లు, ముగింపు సంగతి పక్కన పెడితే, కొత్త దర్శకుడు, కొత్త హీరో కలిసి, అనుభవం పండినంతగా సినిమాను అందించడం విశేషం. సినిమాను చక్కటి రొమాన్స్‌తో ప్రారంభించి, సెంటిమెంట్‌ను జతచేసి, ఆపై మెల్లగా థ్రిల్లింగ్ సన్నివేశాల మీదుగా హార్రర్‌లోకి దారితీసి, దాని ప్రభావం డిఫరెంట్‌గా, డెఫినిట్‌గా వుంటుంది. సినిమాకు స్క్రిప్ట్ తరువాత పెద్ద ప్లస్ నేపథ్య సంగీతం. సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం బాగుంది. గోపీ అమరనాథ్ ఫొటోగ్రఫీ సినిమాకు అదనపు హంగులు తేకపోయినా, ఫర్వాలేదు. లియోజాన్‌పాల్ ఎడిటింగ్ సినిమాకు మరో ప్లస్. ముఖ్యంగా హార్రర్ సన్నివేశాల్లో షార్ప్‌గా వుంది. హార్రర్ సినిమాలు నచ్చే వారు, మెచ్చేసినిమా.

- ఐఎన్‌ఎన్

★★ పిజ్జా

తారాగణం: విజయ్ సేతుపతి, రమ్య నంబీసన్, నరేన్, పూజ, జయకుమార్, వీర సేతురామన్ తదితరులు
సంగీతం: సంతోష్ నారాయణన్
నిర్మాత: సురేష్ కొండేటి
కథ, దర్శకత్వం: కార్తీక్ సుబ్బరాజ్

సున్నిత మనస్కులకేనా...

బాక్సాఫీసు వద్ద హిట్టయిన ఇటీవలి ఒక సినిమా తొలి స్లయిడ్..... సున్నిత మనస్కులు ఈ సినిమా చూడవద్దు... అనేది...అయితే చమ్మక్ చెల్లో సున్నిత మనస్కుల కోసం తీసినదేనా?

అత్యంత వేగంతో నడిచే స్క్రీన్‌ప్లే...వీరోచితపైట్లు, 10వేల హెడ్జెస్ మ్యూజిక్, కార్లు పేల్చేసే దృశ్యాలు, ఛేజింగ్‌లు, విలన్లు ఈ సినిమాలో లేరు, సినిమాలో అన్ని పాత్రలూ మంచివే...సరదాగా గడిపేసేవే...పరిస్థితులే ఈ సినిమాకు విలన్లు.

టెక్నాలజీ ఫ్లస్ యువత వేగాన్ని దృష్టిలో ఉంచుకుని సెకెనుకు 36 ఫ్రేములు దాటించి చూపిస్తున్న నేటి తరుణంలో నిమిషానికి 24 ఫ్రేములు చూపించడానికి కూడా నీలకంఠ మొహమాటపడినట్టుంది.

'ఇలాంటి ప్రేమలు ఉంటాయంటే ముందే జాగ్రత్త పడేవాడిని' అనేది సినిమాలో హీరోగారి డైలాగ్. ప్రేక్షకులు కూడా అలాగే అనుకుంటున్నారు...ఇలాంటి ప్రేమ కథలు వస్తాయంటే ముందే జాగ్రత్తపడేవాళ్లం కదా అని...

శారీరకసౌందర్యాన్నే(?) కోరుకునే హీరో ప్రేమలో పడతాడు. హీరోయిన్‌తో పెళ్లికూడా కుదురుతుంది. పెళ్లిచేసుకునేలోగా మరో 'అందమైన' అమ్మాయిని మోహించేస్తాడు. అంతే పెళ్లిచేసుకోవల్సిన అమ్మాయి చేసుకోనంటుంది, హీరో పడిపడీ మరీ బ్రతిమాలతాడు, ససేమిరా అంటుంది, దాంతో మోహించిన అమ్మాయినే పెళ్లిచేసుకోవాలనుకునేలోగా హీరోయిన్ కరుణిస్తుంది. అదీ సినిమా...

షో...మిస్సమ్మ వంటి కమర్షియల్ ప్రయోగచిత్రాలతో తళుక్కున మెరిసిన దర్శకుడు నీలకంఠ లాజిక్‌లేని లవ్ మ్యూజిక్ చేస్తున్నాడనగానే ఏదో విభిన్నంగా తీస్తాడని, ఎక్కువగా ఊహించుకుని నమ్మకాలు పెట్టుకోవడం ప్రేక్షకుడి తప్పే...'టు లవ్ నో లాజిక్ ' (అదే ట్యాగ్‌లైన్) అని చెప్పకనే తన కథ...కథనం గురించి చెప్పేశాక కూడా ఆశలు పెట్టుకున్నామనడం ఎవరి తప్పవుతుంది? హిట్‌ల కోసం ఎదురుచూస్తూ ఆవురావురుమంటున్న వరుణ్‌సందేశ్‌పై మరో కొత్త తరహా ప్రేమ చిత్రం లాజిక్ లేకపోవడంతో ప్రేక్షకుల అభిమానాన్ని పొందలేకపోయింది. సినిమా తీయాలనుకుంటున్న కిశోర్ (అవసరాల శ్రీనివాసరావు) తాజా ప్రేమ కథ కోసం వెతుకుతుంటాడు. ఆ క్రమంలో అతనికి ప్రొఫెసర్ అప్పారావు(షాయిజీషిండే) ఎదురవుతాడు. విభిన్నమైన ప్రేమ కథ కావాలనుకుంటే తన కాలేజీ విద్యార్థిదే ఒకటి ఉందని చెబుతాడు. ఆ కథే సినిమా కథ ...శ్యామ్(వరుణ్‌సందేశ్) అన్వ(సంచితాపదుకోనే)లది. ప్రేమంటే తెలియని హీరోయిన్ , ఎపుడూ కలల్లో విహరించే హీరో ఒకరినొకరు దగ్గరకావడం, మనసులో ఏ మాత్రం లేకున్నా వారిద్దరి మధ్య స్నేహం చిగురించి ప్రేమగా మారడం, అది కాస్తా తాంబూలాల వరకూ వెళ్తుంది. ఈ లోగా హీరో బెంగుళూరుకు బదిలీ కావడం, అక్కడ ఊహించని విధంగా తన బాస్ సునయినా(కేథరిన్)ను ఇష్టపడటంతో అనుకోని విధంగా శ్యామ్ కొత్త చిక్కుల్లో పడతాడు. అకస్మాత్తుగా బెంగుళూరు వచ్చిన అన్వ, శ్యామ్‌ను అనుమానించి తన బంధాన్ని తెంచుకుని హైదరాబాద్ వెళ్లిపోతుంది. దాంతో అన్వతో పెళ్లి పెటాకుల వరకూ వస్తుంది. ఎపుడూ చలాకీగా ఉంటే హీరోలో అకస్మాత్తుగా వచ్చిన మార్పును నిలదీయడంతో అన్వతో ఉన్న బంధాన్ని సునయినాకు చెబుతాడు. ఇద్దరూ కలిసి అన్వ ఇంటికి వెళ్లి ఎంత బ్రతిమాలినా, బామాలినా ఆమె మనసుకరగదు...ఇక చేసేది లేక తాను సునయినను వివాహం చేసుకుంటానని చెప్పి హీరో వెళ్లిపోతుండగా, హీరోయిన్ మనసుమార్చుకుంటుంది.మధ్య మధ్యలో చిన్న చిన్న 'డైలాగ్' ట్విస్టులు తప్ప, ఏమీ ఉండదు.

ప్రేమ అంటే ఏమిటి? ప్రేమ ఎలా ఉండాలి? ఏది నిజమైన ప్రేమ..? ప్రేమిస్తే పెళ్లి చేసుకోవాలా? స్నేహం ప్రేమ ఒక్కటేనా? ఆడ లేదా మగ స్నేహితులు అంతా ప్రేమికులేనా? ప్రేమకు పరమార్థం ఏమిటి? ఇలా ఎన్నో ప్రశ్నలతో ప్రేమను చర్చించి చర్చించి చివరికి ఈ కథను రాసుకున్నట్టు అర్థమవుతోంది. ఫ్రెష్‌లవ్‌స్టోరీ అని ప్రచారం చేసుకుంటూనే సినిమాలోనే హీరో తండ్రితో ఇలా చెప్పిస్తాడు- మా చిన్నప్పటి నుండి కూడా ప్రేమలు ఇంతేనని...యువత చాలా వేగంగా ఉంటున్నారని, క్షణంలో స్నేహాన్ని ప్రేమగానూ, దానిని పెళ్లిగా మార్చేసుకుంటున్నారని అంతే వేగంగా విడాకులు కూడా తీసుకుంటున్నారని చెప్పిన దర్శకుడు సినిమాను మాత్రం ఆ వేగంతో తీసుకువెళ్లలేకపోయారా....మంచి విజువల్ ఇంప్రెషన్, సంగీతం, ఫోటోగ్రఫీ, లిరిక్స్ ఉన్న ఈ చిత్రంలో అనవసరపు సాగతీతకు కత్తెరవేసి అవసరమైతే మరికొన్ని ట్విస్టులు పెట్టి బాక్సాఫీసు హిట్ చేసే అవకాశం ఉన్నా నీలకంఠ తాను కూడా సున్నితమనస్కుడిగానే మారిపోయినట్టుంది.

మిస్టర్ నోకియో తీసి నోకియో కంపెనీతో పేచీలు పెట్టుకున్న డిఎస్ రావు షారూక్‌ఖాన్ చిత్రం రావణ్ నుండి హీరోయిన్‌తో పాటు ఆ సినిమా పాటలోని చరణాన్ని చమ్మక్ చెల్లో ను పికప్ చేశారు నిర్మాత డిఎస్ రావు. చమ్మక్ చెల్లో అంటే నెరజాణ అని అర్థం. చిత్రంలో 8 పాటలు వినసొంపుగా ఉన్నాయి. వారణాసి కిరణ్, అనంత శ్రీరామ్, రమాదేవి, సిరాశ్రీ రాసిన పాటలను హేమచంద్ర, సాహితీ, వారణాసి కిరణ్ , మాలవిక పాడారు. మై హార్ట్ గోస్ టు ..బూమ్ బూమ్, సింపుల్‌గా చెప్పాలా...సిల్లీగా చెప్పాలా...ఎలా చెప్పాలిరా...చందమామపై కుందేలా...కుర్రగుండెలో ఉండేలా...., ఏదో మైకం, ఓ మేరి మెహబూబా, నా కళ్లలోనే...నాలోనే ...పాటలు వినువిందుగా కనువిందుగా ఉన్నాయి.

-బి.వి.

★ చమ్మక్ చల్లో

తారాగణం: వరుణ్ సందేశ్, సంచితా పదుకొనె, కేథరిన్, అవసరాల శ్రీనివాస్, షాయాజీ షిండే, వెన్నెల కిషోర్, తదితరులు
సంగీతం: కిరణ్ వారణాసి
నిర్మాత: మాస్టర్ బుజ్జిబాబు
దర్శకత్వం: నీలకంఠ



మరో భయపెట్టే సినిమా

భటీవలి రోజుల్లో థియేటర్లలో భయపెట్టే 'ఆత్మ'(?)ల జోరు యాదృచ్ఛికమా? లేక 'భయం' కాన్సెప్ట్ పేజీలకొద్దీ భయపెడుతుందన్న విశ్వాసమో? తెలీదుగానీ - గత వారం నుంచీ వచ్చిన చిత్రాల్లో 'భయం' కనపడుతోంది. కాకపోతే కిటికీలు గాలికి కొట్టుకోవటం.. కర్టెన్లు మెల్లగా ఎగరటం.. నిశ్శబ్దంలో ఉన్నట్టుండి భయంకరమైన శబ్దాలు.. సడెన్‌గా కరెంట్ పోవటం.. ఏవేవో నీడలు- ఇలా పాత పద్ధతులన్నీ యాదృచ్ఛికంగానే రెచ్చిపోతూంటాయి. ఇంతకుమించి మరొకటి హాలీవుడ్ స్క్రిప్ట్‌లోనూ ఉండదు కాబట్టి- భయపడుతూ చూట్టమే. 'మర్డర్-3' టైటిల్‌కీ కథకీ పొంతన కుదర్లేదు. క్రైం థ్రిల్లర్ అందామా? అంటే అదీ కాదు. చివరికి కథ ఏ తీరానికి చేరుతుందో అర్థంకాక- 'భయం' కాన్సెప్ట్‌లో బతికేయట మొక్కటే మార్గం.

'మర్డర్' కథ ఏమిటో చూద్దాం. ఫ్యాషన్ అండ్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విక్రమ్ (రణదీప్ హూడా). అతడి గర్ల్ ఫ్రెండ్ రోషిణి (అదితిరావ్ హైదరీ). ఓ పురాతన గెస్ట్‌హౌస్‌లో సహజీవనం చేస్తూంటారు. ఉన్నట్టుండి ఆమె మిస్ అవుతుంది. దాంతో విక్రమ్ తాగుడికి అలవాటుపడతాడు. బార్‌లో అతడి పరిస్థితిని గమనించిన నిషా (సారా లోరెన్) అతణ్ణి తన రూంకి తీసుకెళ్తుంది. ఇద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. రోషిణి జ్ఞాపకాలు మరచిపోలేక పోతున్నాననీ.. ఒంటరితనంతో బాధ పడుతున్నాననీ నిషాకి దగ్గరవుతాడు. నిషాని విక్రమ్ తన గెస్ట్‌హౌస్‌కి తీసుకువస్తాడు. దశాబ్దాల నాటి ఆ పురాతన బంగ్లాలో నిషాకి కొన్ని చేదు అనుభవాలు ఎదురవుతాయి. బాత్ టబ్‌లో ఉండగా ఉన్నట్టుండి నీళ్లలో రక్తం కనిపిస్తుంది. ఎవరో పిలుస్తున్నట్టు.. కాపాడమని అరుస్తున్నట్టు శబ్దాలు వినిపించేవి. షవర్‌లోంచి వేడివేడి నీళ్లు వచ్చి వొళ్ళంతా కాలిపోతుంది. ఉన్నట్టుండి కరెంట్ పోతుంది. ఎవరో ఏడుస్తూంటారు. దీంతో ఆ బంగ్లాలో రోషిణి ఆత్మ తిరుగుతోందన్న అనుమానం నిషాలో బలపడుతుంది. రోషిణిని విక్రమ్ హత్య చేశాడా? ఆమెని ఎక్కడ పూడ్చిపెట్టాడు? ఆమెతో ఎలా మాట్లాడాలి? ఏం చేస్తే ఆమె ఆత్మ అక్కణ్ణుంచీ వెళ్లిపోతుంది? ఇలాంటి ప్రశ్నలు నిషాని వేధిస్తాయి. విక్రమ్‌కి ఆ విషయం చెబితే అదంతా వొట్టిదేనంటాడు. పాత బంగ్లా కాబట్టి 'రీ సౌండ్స్' వస్తున్నాయంటాడు. ఇంతకీ విక్రమ్ మనస్తత్వం ఏమిటి? అతడొక స్త్రీలోలుడు. మోడల్స్‌నీ.. అందంగా కనిపించే అమ్మాయిల్ని ట్రాప్ చేయటం.. వాళ్లతో గడపటం అతడికి సరదా. కాబట్టే రోషిణి ఉత్తరం రాసి ఎటో వెళ్లిపోతున్నానని చెప్పినా.. అంతగా పట్టించుకోడు. కానీ అతడి మనస్తత్వం ఏమిటో 'నీడల వెనుక' రోషిణి పసిగడుతుంది. విక్రమ్ చక్రవ్యూహంలో నిషా అలా చిక్కుకొందని గ్రహిస్తుంది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఏదైనా చేయాలన్నా అది నిషాకే సాధ్యం.. ఇలా సాగిన ఆమె ఆలోచనలు చివరికి కథని ఏ మలుపు తిప్పాయన్నది చూడాల్సిందే.

ఈ సస్పెన్స్ కథలో ఉన్నది ఒక్కటే మలుపు. దశాబ్దాల నాటి ఆ బంగ్లాలో ఉన్న మిస్టరీ. ఫస్ట్ హాఫ్‌లో కథని ఎంతో చక్కగా లాక్కొచ్చినప్పటికీ.. సెకండ్ హాఫ్‌లో అసలు సంగతి అర్థమై పోవటంతో ఏం జరుగుతుందన్న సస్పెన్స్‌కి బ్రేక్ పడింది. విక్రమ్ మనస్తత్వం ఏమిటో తెలిసిన రోషిణి అతడిపై పగ తీర్చుకోవాలని అనుకోకుండా - వెళ్లిపోవటం కొరుకుడు పడని వ్యవహారం. వెళ్తూ వెళ్తూ నిషాని రక్షించే ఉద్దేశంతో 'కీ' ఇన్‌స్ట్రక్టర్‌కి పంపించటంతో కథ అర్థంతరంగా ఆగిపోయినట్టు అనిపిస్తుంది. పోలీసుల వ్యవహారం అంతా నాటకీయంగా అనిపిస్తుంది. పనివాడిచేత తోటలో అక్కడక్కడ తవ్వుతున్నట్టు.. పరిశోధించి వెళ్లిపోవటం లాంటివి కథలో సస్పెన్స్ సృష్టించటానికేనన్న చందంగా ఉంటాయి. కథకి ఈ సన్నివేశాలు ఏ విధంగానూ పనికిరావు.

కాకపోతే కెమెరా పనితనంతో ఈ అవరోధాలన్నీ గట్టెక్కినట్టే. రాజూసింగ్ సంగీతం ఫర్వాలేదు. రణదీప్ హూడా కొన్ని ఫ్రేమ్‌లలో ఇమ్రాన్ హష్మీలా అనిపిస్తాడు. బోలెడన్ని ముద్దు సీన్లు కూడా యథాతథం. నటనాపరంగా రణదీప్‌కి అవకాశం తక్కువ. అదితిరావ్ హైదరీ..

★ మర్డర్ 3

తారాగణం: రణదీప్ హూడా, అదితిరావ్ హైదరీ, సారా లోరెన్ తదితరులు
సంగీతం: రాజసింగ్
నిర్మాత: ముఖేష్
దర్శకత్వం: విశేష్ భట్

సారా లోరెన్ తమ నటనతోనూ గ్లామర్‌తోనూ అర్ధనగ్న ప్రదర్శనతోనూ ఆకట్టుకొంటారు. దర్శకత్వంలో ఏమంత ఎక్స్‌ట్రార్డినరీ క్వాలిఫికేషన్స్ ఏమీ లేవు. ఎందుకంటే - క్రైం సస్పెన్స్ కథలో ఇంతకుమించి మరేమీ ఉండవు కాబట్టి.

-సాహితి



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

శుక్రవారం 22-2-2013

శ్రీ నందన, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం
తిథి : శుద్ధ ద్వాదశి రా.11.24
నక్షత్రం : పునర్వసు రా.09.50
వర్జ్యం : ఉ.08.41 నుండి 10.27 వరకు, తిరిగి రా.తె.06.29నుండి
దుర్ముహూర్తం : ఉ.09.01 నుండి 09.47 వరకు, తిరిగి మ.12.52 నుండి 01.38 వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)

ఆకస్మిక ధన లాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.)

మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రుబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు. ఆకస్మిక లాభాలుంటాయి.

మిథునం (మృగశిర 3,4పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.)

వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగానుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష)

అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసిక ఆందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.)

నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధన వ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధ సేవ అవసరం.

తుల (చిత్త 3,4పా., స్వాతి, విశాఖ 1,2,3పా.)

కొన్ని ముఖ్యమైన పనులు వాయిదావేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లల పట్ల మిక్కిలి జాగ్రత్తవహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ)

రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగానుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకొని గలుగుతారు. పిల్లల పట్ల జాగ్రత్తగానుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.)

వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధన లాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.)

తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగానుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి)

విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

వందేళ్ల భారతీయ సినిమా

Iవ పేజీ తరువాయి

సినీ రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. ప్రతి వంద చిత్రాలలో నేడు పట్టుమని పది చిత్రాలు కూడ విజయం సాధించడం లేదన్న సంగతి మనకు తెలియంది కాదు. వెయ్యి చిత్రాలలో నటించాం, ఏడు వందల చిత్రాలలో నటించాం... మేము సెల బ్రిటీలం అంటూ జబ్బలుచరుచుకునే స్థాయికొచ్చారు నేటి నటీనటులు. ఎన్ని చిత్రాలలో నటించామన్నది ముఖ్యంకాదు, ఎన్ని చిత్రాలు విజయం సాధించాయి... ఏ పాత్రలు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచాయన్నది ముఖ్యం. అది గమనించడం లేదు వారు. మన దేశంలో 'షోలే', 'దిల్ వాలే దుల్హన్ లేజాయింగే' చిత్రాలు ఎంతటి ఘనవిజయాన్ని నమోదు చేసుకున్నాయో తెలిసిందే. అప్పట్లో శత దినోత్సవం, సిల్వర్ జూబ్లీ, ప్లాటినం జూబ్లీ , గోల్డెన్ జూబ్లీ చిత్రాలకు జరుపుకునే వారు. అలనాటి చిత్రాలలో మంచి కథ, నటన, సంభాషణలు, పాటల రచన, గాత్రధారులు, సంగీత దర్శకులు, చిత్ర దర్శకులు కలిసి కృషిచేసి చిత్ర విజయానికి పాటుపడేవారు. అందుకే అవి మరపురాని చిత్రాలుగా చరిత్రలో చోటుసంపాదించుకున్నాయి. నేడు భారత చలనచిత్ర రంగంలో కమల్‌హాసన్ నెంబర్ వన్‌గా అంగీకరించి తీరవలసిందే. అప్పట్లో అందరూ నెంబర్ వన్‌ను మించినవారేనని చెప్పాలి.

నాడు చిత్ర యూనిట్ కలసికట్టుగా పనిచేసి విజయం సాధించేవారు. నేడు రెండవరోజు చిత్రం ఆడకముందే సూపర్ డూపర్..వంద కోట్లని డబ్బాకొట్టుకునే స్థితికి దిగజారిపోయారు. ప్రేక్షకులను థియేటర్లవరకు లాక్కెళ్లే సినిమాలు లేక, థియేటర్లను కళ్యాణ మండపాలుగా మార్చుకుంటున్నారు. కోట్లు పారితోషికం తీసుకుంటూ, చెత్త చిత్రాలు నిర్మిస్తూ, టికెట్ల ధర పెంపునకు, పైరసీ సీడీలకు మూలకారకులౌతున్నారు.సినీ కళామతల్లిని భూస్థాపితం చేస్తున్నారు. సాంకేతిక విజ్ఞానం మాత్రం పెరిగింది తప్ప మిగతా అన్ని రంగాలలో చిత్రరంగం వెనక్కు నడుస్తుంది. మహా దర్శకుడు 'సత్యజిత్‌రే'కి చివరి రోజులలో గౌరవార్థం ఆస్కార్ సభ్యులు వచ్చి ఆయన కృషికి ఆస్కార్ అవార్డు యిచ్చారు. విదేశీయులు నిర్మించిన చిత్రం వలన ఎ.ఆర్.రెహమాన్‌కు ఆస్కార్ దక్కింది. 'లగాన్' ఆస్కార్ తలుపుతట్టి వెనక్కు వచ్చింది. ఓ 'మదర్ ఇండియా' మొఘలే ఆజం, వెలుగునీడలు, సీతారామకళ్యాణం లాంటి చిత్రాలు నిర్మించలేని చిత్రరంగం ఆస్కార్ వరకు వెళుతుందా? నమ్మకం లేదు. అలా గొప్ప నటులు, గొప్ప దర్శకులు, గొప్ప కథకులు లేరన్నది వాస్తవం. పనికిమాలిన పది సినిమాలలో నటించడంకన్నా ఒక గొప్ప సినిమాలో నటిస్తే చరిత్ర అందుకుంటుంది. గత వైభవమే తప్ప నేడు ఏముంది చెప్పుకునేందుకు? యాభై ఏళ్ల 'ఏరువాక సాగేరో రన్నో చిన్నన్న' గానం ఎవరు మరచిపోయారు. అది స్వర్ణయుగ మహిమ. 'కలకానిది విలువైనది' రచనంటే... గాత్ర మంటే అది. 'జగదేకవీరుని కథ' అంటే అది కథ... స్వర్ణయుగమంటే అదే మరి... గుర్తుండేది.. వందేళ్లల్లో వెలుగునింపిన ఆ స్వర్ణయుగం తప్ప...నేడు ఏముంది?

- మురహరి ఆనందరావు

★ ఒక్కడినే!

తారాగణం:

రోహిత్ నారా, సాయికుమార్, కోట శ్రీనివాస రావు, చంద్రమోహన్, బ్రహ్మానందం, అలీ, ఎం.ఎస్.నారాయణ, జీవా, నాగేంద్రబాబు, శ్రీనివాస రెడ్డి, నిత్యామీనన్, సుధ, ఢిల్లీ రాజేశ్వరి, సత్యకృష్ణ, స్నిగ్ధ, రచనామౌర్య, గురుప్రీతంసింగ్, విజయచందర్ తదితరులు.

సంగీతం: కార్తీక్

నిర్మాత: సి.వి.రెడ్డి

దర్శకత్వం: శ్రీనివాస్ రాగ

ట్విస్ట్‌లపై శ్రద్ధ-సినిమాపై అశ్రద్ధ

వినకటికొకాయన కథంతా వినేసి ''అంతా బానే వుంది కానీ, ఇందులో ట్విస్టులేం లేవేం?''అని అడిగాడట. అప్పుడు అలా కథ చెప్పినాయనకు 'కథంటే తప్పనిసరిగా అందులో మలుపులు (ట్విస్టులు) ఉండాలన్న మాట''- అని నిర్ధారణకొచ్చేసి ట్విస్టులకోసమే తెగ ఆలోచించాడట! అలా 'ట్విస్టు'కోసమే ఎక్కువ శ్రమపడి దానిపైనే దృష్టికేంద్రీకరించి కథావరస ఔచిత్యం, విస్మరించడట. అలా విస్మరించిన సంగతే 'ఒక్కడినే' విషయంలో జరిగింది. ఫలితంగా ట్విస్టు ఇరికించిన కథ అనేక అనౌచిత్యాల సమాహారమై అందరికీ అసంతృప్తి మిగిల్చింది. మరిప్పుడు 'కథ-మలుపు' విషయాలకొద్దాం.

దీర్ఘకాలం విదేశాల్లో ఉన్నత చదువులు చదివిన శైలజ (నిత్యామీనన్) నాన్న శివాజీరావు(సాయికుమార్) ఉన్న ఈ దేశానికొస్తుంది. ఇక్కడ సంఘసేవకుడిగా శివాజీరావుకు మంచి పేరుంది. సరిగ్గా శైలజ ఇండియాకొచ్చిన సమయంలోనే తన రాజకీయ ప్రవేశంకోసం విదేశాల్లో సమాలోచన (?) నిమిత్తం వెళ్తాడు. తనొక్కతే వుంటే బోరుకొడుతుందన్న ఉద్దేశ్యంతో ఆ సమయంలో స్నేహితురాలు సుజాత (స్నిగ్ధ), ఆమె బంధువు శీను, మామ (నాగేంద్ర బాబు) సహాయంతో వైజాగ్ సమీపంలోని శ్రీరామపురం అడవీ ప్రాంతాలకు వెళ్తుంది. అక్కడామెకు సూర్య (రోహిత్ నారా) పరిచయమవుతాడు. తద్వారా అతని కుటుంబ సభ్యులైన తండ్రి శివయ్య(కోట శ్రీనివాసరావు), తల్లి అలివేలుమంగ (సుధ), చెల్లెలు (సత్యకృష్ణ), బావ (శ్రీనివాసరెడ్డి), ఇతరులు పరిచయమవుతారు. ఆ అనుబంధాలు చూసి మురిసిపోయిన శైలజ 'ఇలాంటి కుటుంబం తనకు లేదే' అన్న బాధకీ గురవుతుంది. అలాంటి తక్కువ రోజుల సాన్నిహిత్యంలోనే సూర్య-ఆమెను కావాలనుకోడం, ఆమెకూడా అందుకు అనుకూలంగా స్పందించడం జరుగుతుంది. కానీ తీరా శైలజ హైదరాబాద్ వెళ్లిపోయే సమయానికి తాను ఇన్నాళ్లూ కలిసి తిరిగిన శివయ్య కుటుంబం అంతా రెండేళ్లక్రితమే చనిపోయారన్న నిజం తెలుసుకుని షాకైపోతుంది. అప్పటికి సినిమా ప్రథమార్ధం అయిపోతుంది. తర్వాత ''తాను చూసిన నిజం కల ఎలా అవుతుంది? అన్న ముడి విడిపోవడం తదితరాలతో ద్వితీయార్ధం గడుస్తుంది. ఈ కథాక్రమంలో తొలినుంచి అంతంవరకూ సినీ సామాన్యుజ్ఞి తొలిచేసే అసామాన్య ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. మచ్చుకు కొన్ని.. కథానాయిక ఏదో మారుమూల ప్రాంతంనుంచి వచ్చినా అంతంతమాత్రమే చదువుకున్న వనిత కాదు. సుదీర్ఘకాలం విదేశాల్లో చక్కటి చదువు గడించిన పడతి. అయినా తన కళ్లెదుటే ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసధికారినీ, ఎం.ఎల్.ఏని పిట్టల్ని కాల్చినట్లు కాల్చేసినా దాని గురించి ఆనుపానులు తెలుసుకోదు. అలాగే ఆమె తండ్రి పాత్ర (శివాజీరావు) మలిచిన తీరూ తర్కరహితమే. పయోముఖ విషకుంభమైన పాత్రలా దర్శకుడు తీర్చిదిద్దుదామన్న భావన దర్శకుడికున్నా అది తెరపై చూపించిన తొలి సన్నివేశంలోనే అతని పాత్రకిచ్చిన సంభాషణోచ్చారణా రీతీ ప్రేక్షకునిలో అనుమానం రేకెత్తిస్తుంది. ''ఇక్కడి రాజకీయ ప్రవేశం కోసం నువ్వు విదేశాలకెందుకెళ్తున్నావ్?'' అని ఓసారి కూతురడిగితే ఆ పాత్రతో ఇండియాలో మీడియా పవర్‌పుల్, విషయం నిర్ధారణయ్యేవరకూ విదేశాల్లోనే వ్యూహరచన చెయ్యాలన్న సమాధానం అతి తెలివిగా చెప్పిస్తారు. కానీ ఆ పాత్రా (శివాజీరావు) చివర్లో శీను మామ (నాగబాబు) ఎదుట ''నేను వీళ్లను చంపా, వీళ్లని చంపించా...'' నంటూ ఓ పేద్ద బహిరంగ ప్రదేశంలో చెప్తుంది. మరప్పుడు ఇతని పాత్ర మీడియా పవర్ మర్చిపోయిందా? ఇలాంటి పరస్పర విరుద్ధాలు ఎన్నో! అసలు అలా శతృనిశ్శేషం, సాక్ష్యరాహిత్యం (తన ప్రేరణతో సైకోవేషంలో సూర్య కుటుంబాన్ని అంతటినీ చంపిన కారుడ్రైవరు భార్యనీ యాక్సిడెంట్ ద్వారా చంపించడం తదితరాలు...) గుణాలున్న శివాజీరావు తనంతట తానే నడిరోడ్డుపై వీరంగమాడతాడా? అదీ అని లక్ష్యం రాష్ట్ర అత్యున్నత పీఠం ముఖ్యమంత్రి అవడం అయిన నేపథ్యంలో... తన నేర ఎపిసోడ్‌లో భాగస్థులైన పోలీసధికారి, ఎంఎల్ఏలు అనుమానస్పద పరిస్థితిలో చనిపోయినప్పుడూ శివాజీరావు స్పందించాడా? అన్నదీ శేష ప్రశ్నే. అసలు ఇందులో ఏ పాత్రా నేరస్థుణ్ణి చట్టానికి పట్టిద్దామన్న దృష్టితో ఉండదు. దొరికిన రీతిలోనే వెంటనే అక్కడే నిర్మూలించేద్దాం.. అన్న ఆటవిక న్యాయంతోనే నడుస్తుంది. ఇదెంతవరకూ సమర్థనీయమో నవతరం దర్శకులు ఆలోచించాలి. సాధారణంగా ఒక నేరాన్ని మరింత లోతుగా పరిశోధనార్థం జరిగిపోయిన అంశాన్ని పునర్నిర్మించి ముందుకెళ్లడం అలవాటు. కానీ ఇందులో కథానాయకుడు తన లక్ష్యసిద్ధికోసం హీరోయిన్‌కు లేని కుటుంబాన్ని సృష్టించి కథ నడుపుతాడు. ఇది కన్విన్స్ అవ్వడానికి మిగతా కథాక్రమం సహకరించలేదు. సూర్య పాత్రలో రోహిత్ నారా సంభాషణోచ్చారణ వరకూ ఓకే అయినా, భావప్రకటనలో ఇంకా చాలా కృషిచేయాల్సి ఉంది.

అలాగే పాటల్లో స్టెప్స్ విషయంలోనూ తీవ్ర అభ్యాసం చేసి తీరాలి. శైలజగా నిత్యామీనన్ ముద్దుముద్దుగా నటించినా బలహీనమైన సన్నివేశాలు దాన్ని రాణింపునకు తీసుకురాలేకపోయాయి. బ్రహ్మానందం, అలీ పాత్రలు వారి స్థాయికి తగినవి కావు. నాగబాబుది గణనీయమైన పాత్ర. సాయికుమార్ పాత్ర టెంపో కోల్పోవడంతో ఆకర్షించలేకపోయింది. తొలిసారిగా స్ట్రెయిట్ తెలుగు చిత్రానికి సంగీత నేతృత్వం వహించిన కార్తీక్ పాటల్లోనూ పేర్కొనతగ్గవి లేవు. వాటి ప్లేస్‌మెంట్ విషయంలోనూ దర్శకుడు శ్రద్ధ వహించలేదు. అందుకు తార్కాణంగా చెల్లి పెళ్లి కుదిరిందన్న సంతోష సమయంలో 'పుట్టింటోళ్లు తరిమేశారు' అన్న రీమిక్స్ సాంగ్‌ను (రచనామౌర్య, బృందంతో) ప్రవేశపెట్టడం. అయితే ఓ పాటలో 'అదిరిందే నీ ఒంటి పరిమళం, లేపిందే కలకలం...' అంటూ చిన్న చిన్న చమక్కులు పాట రచయిత చేయడానికి ప్రయత్నించాడు. నూట ముప్ఫైమూడు నిమిషాల ఈ చిత్ర నిడివిని మరింత తగ్గించవచ్చు.

ట్విస్ట్‌పై పెట్టిన దృష్టిని మిగిలిన 'కథ'పైనా పెట్టివుంటే (ఈ చిత్ర దర్శకుడు గతంలో 'కథ' అన్న చిత్రానికీ దర్శకత్వం వహించారు) 'ఒక్కడినే' చిత్రం ''అందరూ'' చూడతగ్గదై వుండేది.

- అన్వేషి

మీ వ్యూస్

ఆశ.. నిరాశ.. అడియాస...

ఆశ.. నిరాశ.. అడియాసల 'కడలి' దేవుడు, సైతన్‌ల మధ్య పగకు కారణాన్ని బాగా చూపలేదు. నీచుడైన సైతన్ క్లయిమాక్స్‌లో మారిపోవడం అద్భుతం. గౌతమ్‌కార్తీక్ తులసి నుంచి నటన రాబట్టలేకపోయాడు. దర్శకుడు. రెహమాన్ సంగీతం అద్భుతంగా వుంది. ఈ సినిమాలో మణిరత్నం దర్శకత్వ ప్రతిభకు అద్భుతమైన తోడు. అర్జున్, అరవింద్‌స్వామిల విశిష్ట నటనతో మానవ సంబంధాలు మన కళ్లముందు కదిలాయి.

- కాళహస్తి వెంకట శేషగిరిరావు, నెల్లూరు

ఓపెనింగ్స్ వరకూ ఢోకాలేదు

'మిర్చి' చిత్రంలో పగ, ప్రతీకారాలు, నరకటం, నరుక్కోవడాలు చాలా ఎక్కువ ఘాటుగా వుండి కొంచెం ప్రేక్షకులను ఇబ్బందిపెట్టాయి. కథాకథనాలలో కొత్తదనం లేకపోవటం కూడా ఈ చిత్రానికి పెద్ద మైనస్. దేవిశ్రీ బాణీలు కొంతవరకు సినిమాని సేవ్ చేసినా ఓవరాల్‌గా చూస్తే ఇది ఫ్రంట్ బెంచర్స్ సినిమాగా ఉంది తప్ప యూనివర్సల్ అప్పీలు లేదు. సినిమాను ఏమాత్రం అయినా ఎంజాయ్ చేశామూ అంటే అది ఇంటర్‌వల్ తరువాత మాత్రమే. తెలుగు చలనచిత్ర సీమలో ఒకరైన హీరో 'ప్రభాస్' కథల ఎన్నికలో శ్రద్ధవహించాల్సిన అవసరం ఎంతోవుంది లేకపోతే పోటీలో వెనుకబడిపోతాడు. ఏదిఏమైనా ఓపెనింగ్స్ వరకూ ఢోకాలేదు ఎందుకంటే పోటీ చిత్రాలు లేవు కనుక.

- పంచకర్ల గోవర్ధనరావు, కంకిపాడు

పరమచెత్త చిత్రం 'నాయక్'

నాలుగురకాల సినిమాల సీన్లని కాపీకొట్టి, ఏవో కొన్ని పంచ్ డైలాగ్‌లని పెట్టి, జనంమీదకి వదిలితే ఎలాగైనా చూసేస్తారు అని భ్రమించిన దర్శకుడు వినాయక్. హీరో రామ్‌చరణ్‌లకి నాయక్‌ని ఫ్లాప్ చిత్రంగా తిప్పికొట్టి, ప్రేక్షకులు సరైన తీర్పునిచ్చారు. ప్రథమార్ధంలో కాసింత హాస్యం తప్ప ఈ నాయక్ సినిమా అంతా పరమచెత్తగా వుంది అనేది లక్షలాది మంది టాక్. సినిమా మొత్తం కలగాపులగం, అతకుల బొంత. గత కాలపు శుభలేఖ రాసుకున్నా... అనే హిట్ పాటని రీమిక్స్ పేరుతో ఖూనీ చేసాడు సంగీత దర్శకుడు, పాటలు ఏమీ ఆకట్టుకోలేదు. హీరోయిన్లకి ప్రాధాన్యం లేదు. ఏతావాతా ఈ నాయక్ భయానక్‌గా పరమచెత్తగా మిగిలాడు.

- షేక్‌అబ్దుల్ మజీద్, ముదినేపల్లి

బాగా ఎంజాయ్ చేస్తున్నారు

'నాయక్' చిత్రం కథలో కొంచెం పాతదనం ఉన్నప్పటికీ ప్రేక్షకులను రంజింపచేయటంలో దర్శకులు వి.వి.వినాయక్ విజయం సాధించారు. రామ్‌చరణ్ ఫైట్స్, డాన్సులలో చాలా ఈజ్ చూపించాడు, ఒక స్టార్ హీరోకి కావలసిన క్వాలిటీస్ పుష్కలంగా తనకు ఉన్నాయని నిరూపించుకున్నాడు. మెగా ఫ్యాన్స్‌కాకుండా సగటు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు కామెడీ కూడా ఒక పెద్ద కారణం. ముఖ్యంగా పోసాని, జయప్రకాష్‌రెడ్డి చాలా బాగా రాణించారు. రామ్‌చరణ్, కాజల్ జోడీ మరొక్కసారి ప్రేక్షకులను రంజింపచేసింది. నూతన సంవత్సరపు శుభారంభంగా ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్ కావటం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు మంచి శుభపరిణామం. చివరిగా 'ధమన్' సంగీతం ఈ చిత్రానికి చాలా పెద్ద ప్లస్.

- పంచకర్ల పూర్ణచంద్రరావు, మండపల్లి

పాత్రలకు న్యాయం చేశారు

8-2-2013ల తేదీ వెన్నెలలో ఫ్లాష్‌బ్యాక్ శీర్షికలో 22-2-1963వతేదీ సవతి కూతురు విడుదలైనట్లు తెలిసి కొన్నాం. 1963వ సంవత్సరం దాదాపు 27 చిత్రాలు విడుదలై నట్లు వాటిలో విజయం పొందినవి, విజయం పొందలేనివి వుండవచ్చు. సవతికొడుకు కూడ అనుకున్నంత స్థాయిలో విజయం సాధించలేదు, కాని హేమాహేమీలు నటులు తమ పాత్రలకు న్యాయంచేసిన మాట వాస్తవమే. మరి కథాబలంలోనా లేక సాహిత్యపరంగానా లేక సంగీతం సరిగా సమకూర్చలేకనా? వీటిని బేరీజువేసికొంటే సంగీత దర్శకుడు సత్యం మంచి సంగీత దర్శకుడని పేరు వుంది. గాయకుడు ఘంటసాల సరేసరి. జమునారాణి, యస్.జానకి, సుశీల వంటి గాయణీమణులు తమ గాత్రాన్ని విరబూయించారు. మరి ప్రేక్షకులు సవతి కొడుకు సినిమాను ఆదరించలేదంటే ఏదోఒకటి లోప ముండవచ్చు. ఏదిఏమైనా సవతికొడుకు వ్యాసం చదివి చాలా విషయాలు తెలుసుకున్నాం.

- మార్కస్ మణిరాజ్, ముద్దనూరు

నిరాశకు గురిచేసింది

సంవత్సరాల తరబడి నిర్మాణమౌతూ చిత్రం పూర్తయ్యాక కూడా విడుదలకు అనేక విఘ్నాలు ఎదురౌతూ ఆఖరుకు స్వంత రాష్ట్రమైన తమిళనాడులో విడుదలకు నోచుకోక వివాదాస్పద చిత్రాలలో అగ్రతాంబూలం అందుకున్న 'విశ్వరూపం' సినిమా ఎంతగానో నిరాశకు గురిచేసింది. అసలు ఈ చిత్రంలో ఏవిధమైన అభ్యంతరకర సన్నివేశాలు లేవు. ఏ కులాన్ని గాని, మతాన్ని గాని, వర్గాన్ని కాని కించపరచలేదు. మరి ఈ చిత్రం ఎందుకు వివాదస్పదమైనట్లు? నాట్య కళాకారుడిగా కమల్‌హాసన్ నటన అద్భుతంగా వుంది. ఈ వయస్సులో కూడా యాక్షన్ సన్నివేశాలలో యువతరం నటులతో పోటీపడి నటించడం ప్రశంసనీయం. ఫొటోగ్రఫీ, సంగీతం, కళాదర్శకత్వం, ఎడిటింగ్, యాక్షన్ అన్నీ అంతర్జాతీయ ప్రమాణంలో వున్నాయి. జిహాదీకోసం పోరాడే ఇస్లామిక్ తీవ్రవాదులను బేస్‌చేసుకొని రాసిన కథ సైతం బాగుంది కానీ సినిమాకు స్క్రీన్‌ప్లేయే పెద్ద విలన్. కథనం నత్తనడక సాగడంవలన బాగా బోరుకొడుతుంది. పైగా ప్రథమార్ధం అసహనం కలిగించేదిగా వుంది. ఇంటర్‌వెల్ ముందు వచ్చే ఎపిసోడ్‌తోనే నిద్రపోతున్న ప్రేక్షకులు నిద్రలేచారు. క్లైమాక్స్‌ను కూడా అంతగా సాగదీయడంతో విసుగుకలిగింది. సినిమా నిడివి ఒక అరగంట తగ్గించి కథనం వేగం పెంచి వుంటే సినిమా కాస్త బాగుండేదేమో?

- ఎం.కనకదుర్గ, తెనాలి

ముంచేసిన 'కడలి'

మణిరత్నం తీసిన అనువాద చిత్రమైన కడలి నిరాశ పరిచింది. మణిరత్నం తీసిన గత చిత్రాల్లో కనపడిన ఫీల్ ఈ చిత్రంలో లోపించింది. పాత్రలకు తగ్గ నటులను ఎంపిక చేసుకున్నా కథని జనరంజకంగా తీయడంలో దర్శకుడు విఫలమయ్యాడు. గత కొంతకాలంగా మణిరత్నం తీసిన చిత్రాలు విఫలమౌతున్నాయి. ఇకనైనా మేల్కొనకపోతే కష్టం. ఎ.ఆర్.రహ్మాన్ నుంచి వచ్చిన పాటల్లో రెండు పాటలే బాగున్నాయి. మిగతా వాటిల్లో పదాలు అసలు అర్థమవలేదు. కొన్ని సన్నివేశాలు ఎందుకు పెట్టారో అర్థంకాదు. హీరోయిన్ నర్స్ అయివుండి హీరోచేత ప్రసవం చేయించడం బాగాలేదు. చిత్రంలో నేటివిటీ లోపించింది. మణిరత్నం ఇకనైనా విజయం సాధించే చిత్రాలు తీయాలని, తన పూర్వవైభవాన్ని పొందాలని ఆశిద్దాం.

- రోహిత్‌రాజ్, హైదరాబాద్

విశ్లేషణ బాగుంది

1-2-2013 వెన్నెలలో 'ఎందుకురావాలి మనవాళ్ళకి అవార్డులు' వ్యాసం మనస్సు లోతుల్లోంచి అన్నికోణాల్లో వ్యాస రచయిత విశ్లేషణ బాగుంది. నిజమే! అవార్డులు రాలేదని మనం అనుకోవడంకాదు అవార్డు అర్హులు కూడ అనుకోవాలి. తమ గురించి జాతీయస్థాయిలో ప్రచారం చేయించుకోవాలి అంటే మన గురించి దేశ ప్రజలకందరికీ తెలియాలి. మన పేరును జాతీయస్థాయిలో ఇతర ప్రాంతాలవారు అవార్డుల కమిటీకి తెలియచేస్తే సులువవుతుందనేది కూడ వాస్తవమే!! రానివాళ్ళు రాలేదని బాధపడటంకన్నా, వాటిమీద మక్కువుంటే జాతీయస్థాయిలో తెలిసేలా కృషిచేసుకోవాల్సిందే! చెట్టున పండు కావాలంటే తగిలేలా నాలుగురాళ్ళతో కొట్టాల్సిందే! అవార్డుల గురించి పట్టించుకోనివారి గురించి మదన పడేవారు ఇలాంటి విమర్శల్ని మానుకోవాలి లేదా వారి తరపువారికి అవార్డు సాధించిపెట్టే ప్రయత్నాలు చేయాలి. ఇక్కడ ముఖ్యం కమిటీవారిని కూడ ఎంపిక ప్రక్రియ అంత సులువు కాదు. ప్రలోభాల్ని, పైరవీల్ని, వత్తిళ్ళల్ని తట్టుకోవాలి. వచ్చిన జాబితా ప్రకారం వాస్తవ అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవాలి. నిజాయితీ అన్నది కూడ వారి విజ్ఞతనుబట్టి ఉండాలి.

- పొట్టి వెంకట శివప్రసాదరావు, అద్దంకి

పసందైన 'మిర్చి'

ప్రభాస్ నటించిన మిర్చి సినిమా బాగుంది. చిత్రం ఆరంభంలో కొంత కన్‌ఫ్యూజన్ కలిగించిన మెల్లిగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా విరామానంతరం చిత్రం బాగుంది. రెబెల్‌లో పూర్తి మాస్ ప్రేక్షకులనే టార్గెట్‌గా చేసి తీశారు. కానీ

మిర్చి ఇటు క్లాస్ అటు మాస్ అందర్నీ అలరించేలా వుంది. పాటలు, సెంటిమెంట్, ఫైట్లు అన్నీ బాగా కుదిరాయి. ప్రభాస్ బాగా నటించాడు. ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాల్లో చాలా అందంగా కనిపించాడు. అనుష్క బాగానే చేసినా, కొన్ని సన్నివేశాల్లో లావుగా, వయసు పైబడిన దానిలా కనపడింది. నదియా చాలా అందంగా వుంది. ప్రభాస్ తల్లిగాకంటే అక్క లేదా వదినగా అయితే ఇంకా బాగా కుదిరేది. ఎందుకో మన దర్శకులు పరాయి భాషా నటులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. మనవాళ్లని వదిలేసి, ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రల్లో పరాయి భాషవాళ్లే ఉన్నారు. ఉదా: సత్యరాజ్ నదియా, సంపత్, ఆదిత్యమీనన్, ఈ పద్ధతిలో మార్పువస్తే బాగుంటుంది.

- జైదీప్, హైదరాబాద్

కొత్తదనం కోసమే

కొత్తదనం అంటూ హిందీ విలన్లను తెచ్చిపెట్టుకున్నా, ఒకరిద్దరు బాలీవుడ్‌లోకాక టాలీవుడ్‌లోనే పాతుకుపోయారు కూడా, అలాగే తమిళ హాస్య నటీనటులు, దర్శకులు కూడా వచ్చారుపోయారు. కొత్తదనం కోసమే ప్రభుని తెచ్చిపెట్టారు. నిజానికి సహనటుల చిత్రాల జయాపజయాల్ని శాసించలేరు. ప్రభు నటించిన చాలా చిత్రాలు ఫ్లాప్ అవడానికి అతడు బాధ్యుడుకాడు. బాగానే చేస్తున్నాడు.

- శుభ, కాకినాడ

ఆకట్టుకుంటున్నాయి

ప్రతి శుక్రవారం వెన్నెలలో ఫ్లాష్‌బ్యాక్ శీర్షికలో పాత చిత్రాల విశ్లేషణ, గాయకులు, దర్శకులు, సంగీత దర్శకులు, నటీనటుల పాత్రధారణ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాత చిత్రాల గురించి ఈతరం వారికి తెలియక పోయిన సినిమా పరిజ్ఞానం ఉన్నవారు తప్పక చదవాల్సిన వ్యాసం. 25-1-2013 వెన్నెలలో ఫ్లాష్‌బ్యాక్‌లో 1963లో నిర్మించిన పౌరాణిక చిత్రం 'వాల్మీకి' చిత్రానికి కథ, మాటలు, పాటలు, పద్యాలు వ్రాసిన సీనియర్ సముద్రాల, గాయకులు, ఘంటసాల, రఘురామయ్య, జానకి, పి.సుశీల పరిచయం సాంకేతిక నిపుణుల పనితనం ఒక నిఘంటువులా వుంది. మంచి వ్యాసాన్ని అందించిన వెన్నెలకు అభినందనలు.

- మార్కస్ మణిరాజ్, ముద్దనూరు

చాలా బాధాకరం

విశ్వరూపం కమల్‌హాసన్ కలల పంట. విశిష్ట నటుడు అంటారు అతడిని. పది కాకులు, నల్లకాకులలో ఓ తెల్లకాకి వస్తే విశిష్ట.. తెల్ల ఏనుగైనా అంటే.. పిచ్చిమొక్కల మధ్య ఓ గులాబీ బ్రతికిబట్టకట్టలేదు. ఈ దేశం భావప్రకటనా స్వేచ్ఛనిచ్చింది. కళాకారునిగా అతనికి స్వేచ్ఛవుంది. ఎవరినీ నొప్పించగూడదంటే యదార్థం ఎలా చెప్పడం..బహయినులో బౌద్ధవిగ్రహం పగలుగొట్టిన ముష్కరులు ఫండమెంటలిస్టులను గూర్చి పొగడాలా? సినిమా అంటే మహత్తర కళారూపం. సమాజంలోని దౌష్ట్యాన్ని చూపగలగాలి. కొన్ని కన్విక్షన్లు కళాకారునికుంటాయి. సెన్సార్లు అయిన సినిమాను రగడ పట్టించి ఓ కళాకారుని రాజకీయ బలిపశువు చేయడం.. కళ్ళనీళ్ళపర్యంతంలో దేశాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతాను అనడం..చాలా బాధాకరం.

- జి.పద్మావతి, తణుకు

వారి నటన బాగా గుర్తుంది!

ఆనాటి శబ్దగ్రహణం సవ్యసాచిగా పేరుపొందిన వి.శివరామ్‌గారు (1962) గులేబకావళి కథలో విజయ్ (హీరో)గారి ఎదుట (ఎన్టీఆర్) ప్రత్యక్షమై వరం ఇచ్చిన సిద్ధునిగా వి.శివరామ్‌గారు నటించడం ఓ విశేషం! అలాగే మంచిమనసులు చిత్రంలో (1962) జడ్జిగా నటించారు. వారి వాగ్ధాటి ఎంతో శ్రావ్యంగా వుంటుంది. నాకు తెలిసినంతవరకు ఈ రెండు చిత్రాలు వారి నటన గుర్తువున్నది.

- కోవూరు వెంకటేశ్వరప్రసాదరావు, కందుకూరు

వ్యాసం బాగుంది

శుక్రవారం 01-02-2013 వెన్నెలలో శ్రీ పర్చూరిశరత్‌కుమార్ 1963 సం.లో విడుదలైన సినిమాలలో ఎన్టీఆర్‌గారు ఏకంగా 13 చిత్రాలలో నటించి 'తారకనామ సంవత్సరం'అన్న శీర్షికపై వ్రాసిన వ్యాసం బాగుంది. అయితే ఆ 13 చిత్రాల పేర్లను వ్రాయలేదు. ఆ చిత్రాలు ఇవి: 1. శ్రీకృష్ణార్జున యుద్ధం (పౌరాణికం), 2. ఇరుగుపొరుగు (సాంఘిక), 3. వాల్మీకి (పౌరాణికం), 4. పెంపుడు కూతురు (సాం.), 5. సవతి కొడుకు (సాం.), 6. లవకుశ (పౌ.), 7. పరువుప్రతిష్ట (సాం.),8. ఆప్తమిత్రులు (సాం.), 9.బందిపోటు (జానపదం), 10.లక్షాధికారి (సాం.) 11. తిరుపతమ్మ కథ (పౌ.),12.నర్తనశాల (పౌ.), 13. మంచిచెడు (సాం.). అలాగే అగ్ర నటులు నటించిన 'తెనాలి రామకృష్ణ', 'చరణదాసి' (ఠాగూర్ రచన (నౌకాడూంబీ) గురించి వ్రాయలేదు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత ''శ్రీకృష్ణార్జునయుద్ధం''నుండి 1977లో ''చాణక్యచంద్రగుప్త'', 'రామకృష్ణులు', 'సత్యం-శివం'చిత్రాలు వచ్చాయి. 'రేచుక్క' సినిమాలో అక్కినేని ఓ పాటలో అతిథిగా కన్పించారు. అలాగే 'భక్తరామదాసు' (నాగయ్య) చిత్రంలో గెస్టుగా అక్కినేని- ఎన్టీఆర్‌లు కన్పించారు. ప్రపంచంలో ఇంతవరకు ఏ భాషలో కానివ్వండి ఇద్దరు అగ్రనటులు కలిసి నటించిన చిత్రాలు '13' మన ఎ.ఎన్.ఆర్, ఎన్టీఆర్ గార్లే.

- ఎన్.శ్రీనివాసరావు, ఎమ్మిగనూరు

పాత మిర్చి - కొత్త రుచి

యంగ్ రెబెల్ స్టార్ ప్రభాస్ నటించిన 'మిర్చి' పర్వాలేదు. కథ పాతదే అయినా స్క్రీన్‌ప్లే కొత్తరకంగా చూపించడంతో పాత మిర్చి అయినా రుచి కొత్తగా వుంది. ఈ సినిమా ద్వారా రచయితగా గుర్తింపుపొందిన 'కొరటాల శివ' దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆయన వ్రాసిన మాటలు ముత్యాల్లా మెరిశాయి. ముఖ్యంగా 'వీలైతే ప్రేమిద్దాం డ్యూడ్ పోయిందే ముంది మహాఅయితే తిరిగి ప్రేమిస్తారు', కటౌట్ చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి డూడ్.. లాంటి ఎన్నో డైలాగ్స్ బాగున్నాయి. ప్రభాస్ మిర్చిలో ఎంతో స్టైల్‌గా స్మార్ట్‌గా నటించి అదరగొట్టాడు. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు వచ్చే సీన్‌లో ప్రతీకార పురుషుడుగా పవర్ ఎంతో చూపించాడు. అనుష్క అదరగొట్టింది. రిచా నటన ఓ మోస్తరుగా వుంది. జయ్‌రాజ్ సింపుల్‌గా నటించారు. ఈ సినిమాకి సంగీతం ప్లస్ పాయింట్. విలన్‌గా సంపత్‌రాజ్‌కి మంచి బ్రేక్‌ని ఇవ్వవచ్చు ఈ సిన

వెన్నెల TV ఆంధ్రభూమి
శుక్రవారం 22 ఫిబ్రవరి 2013

ఈపాట గుర్తుందా?

ఆరేసుకోబోయి పారేసుకున్నాను
హరి హరి హరి హరి
కోకెత్తుకెళ్ళింది కొండగాలి..
నువ్వు కొంటేచూపు చూస్తేనే
చలి చలి చలి చలి చలి చలి
పారేసుకోవాలనారేసుకున్నావు
హరి హరి హరి హరి
నీ ఎత్తు తెలిపింది కొండగాలి..
నాకు ఉడుకెక్కిపోతోంది
హరి హరి హరి హరి హరి హరి
ఆరేసుకోబోయి పారేసుకున్నాను
హరి హరి హరి హరి

నాలోని అందాలు నీ కన్నుల
ఆరేసుకోనీ సందెవేళ
నా పాట ఈ పూట నీ పైటల
దాచేసుకోనీ తొలి పొంగుల
నాలోని అందాలు నీ కన్నుల
ఆరేసుకోని సందెవేళ
నా పాట ఈ పూట నీ పైటల
దాచేసుకోని తొలి పొంగుల
నీ చూపు సోకాలి నా ఊపిరాడాలి
హా.. నీ చూపుసోకాలి నా ఊపిరాడాలి
నీ జంట నా చేతి చలి మంట కావాలి
నీవింక కవ్వించక కాగిపోవాలి
నీ కౌగిలింతలోనే దాగిపోవాలి.

ఆరేసుకోబోయి పారేసుకున్నాను
హరి హరి హరి హరి
కోకెత్తుకెళ్ళింది కొండగాలి..
నాకు ఉడుకెక్కిపోతోంది
హరి హరి హరి హరి హరి హరి
నీ ఒంపులో సొంపులే హరివిల్లు
నీ చూపులో రాపులే విరిజల్లు
నీ రాక నా వలపు ఏరువాక
నిను తాక నీలిమబ్బు నా కోక
నే రేగిపోవాలి నేనూగిపోవాలి
నే రేగిపోవాలి నేనూగిపోవాలి
చెలరేగి ఊహలో ఊరేగి రావాలి

ఈ జోడు పులకింతలే నా పాట కావాలి
ఆ పాట పూబాటగా నిను చేరుకోవాలి

ఆరేసుకోబోయి పారేసుకున్నాను
హరి హరి హరి హరి
కోకెత్తుకెళ్ళింది కొండగాలి..
నువ్వు కొంటే చూపుచూస్తేనే
చలి చలి చలి చలి చలి చలి
పారేసుకోవాల నారేసుకున్నావు
హరి హరి హరి హరి
నీ ఎత్తు తెలిపింది కొండగాలి..
నాకు ఉడుకెక్కిపోతోంది
హరి హరి హరి హరి హరి హరి
లలల.. లల...

ఈ పాట మీకు తెలుసా?
ఏ సినిమాలోది?
గీత రచయిత ఎవరు?
సంగీత దర్శకుడు ఎవరు?
మాకు తెలియచేయనక్కరలేదు..
మీరు గుర్తు చేసుకుంటే చాలు..
తెలియకుంటే, వివరాలు వచ్చేవారం ఇక్కడే.

గతవారం పాట

సినిమా : అడవి రాముడు
సంగీతం : కె.వి.మహదేవన్
రచన : వేటూరి

బిన్ లాడెన్ అంతుచూసిన చిత్రం

రివ్యూ

★★ జీరో డార్క్ థర్టీ

తారాగణం:
జెస్సికా ఛాస్టెయిన్, జేసన్ క్లార్క్, జోయెల్ ఎడ్గిర్టన్
ఫొటోగ్రఫీ : గ్రెగ్ ఫ్రెజర్
రచన, సహనిర్మాత:
మార్క్‌బోల్
దర్శకత్వం, సహనిర్మాత:
కాథరిన్ బిగెలో

గతంలో 'హార్ట్ లాకర్' చిత్రంతో ఆస్కార్‌అవార్డు పొందిన దర్శకురాలు కేథరిన్ బిగెలో, రచయిత మార్క్‌బోల్ నిర్మాతలుగా మారి తీసిన కొత్త చిత్రమే ''జీరో డార్క్ థర్టీ''. అమెరికాలో జరిగిన 2001 సెప్టెంబర్ '11 దాడులకు గాను అల్‌ఖాయిదా నాయకుడు బిన్‌లాడెన్ కారకుడిగా గుర్తించి అతడ్ని వెతికి పట్టుకోవడానికి సిఐఏ నిశ్చయించుకుంటుంది. పదేళ్ళపాటు అమెరికన్ రహస్య గూఢచారులు, మిలిటరీ అధికారులు కలిసి ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన రహస్య మంత్రాంగంలో బిన్‌లాడెన్ వునికిని పసిగట్టి, అతడ్ని హతమార్చడం ఇందులో చిత్రీకరించారు.

2001 సెప్టెంబర్ '11 దాడులవల్ల జరిగిన విధ్వంసం బాధితుల ఆక్రందనలు ఖాళీ తెరమీద వినిపిస్తూ ''జీరో డార్క్ థర్టీ''సినిమా ప్రారంభమవుతుంది. దీని తర్వాత రెండేళ్ళకు చదువుముగించుకుని నేరుగా సిఐఏలో చేరిన మాయా రహస్య సమాచార విశ్లేషకురాలిగా పాకిస్తాన్‌లో వున్న అమెరికన్ రాయబార కార్యాలయంలో డాన్ అనే ఆఫీసర్‌తో కలిసి పనిచేయడానికి వస్తుంది. వీళ్ళు సౌదీ తీవ్రవాదులతో సంబంధముందని అనుమానించిన అమ్మర్ అనే వ్యక్తిని విచారణ పేరుతో రకరకాలుగా చిత్రహింసలు పెడతారు. మాయా, డాన్‌లు కలిసి వాడ్ని పాత జాబితాలో వున్న అబూఅహ్మద్‌గా ప్రకటిస్తారు. మిగతా ఖైదీలు బిన్‌లాడెన్‌కు, అబూ ఫరాజ్‌కు మధ్య వార్తలను ఈ అబూ అహ్మద్ అందజేసేవాడని చెబుతారు. సిఐఏ, పాకిస్తాన్ పోలీసులతో కలిసి 2005లోనే అబూ ఫరాజ్‌ను పట్టుకున్నారని తెలుస్తుంది. మాయా, అబూఫరాజ్‌ను ఎన్ని చిత్రహింసలు పెట్టినా ఏ విషయాన్ని తెలుసుకోలేకపోతుంది.

ఆధునిక పరిజ్ఞానాన్నుపయోగించి పరిశోధనలతో రకరకాలుగా దొరికిన సమాచారాన్ని విశ్లేషించుకుంటూ, అబూ అహ్మద్‌ను పట్టుకుని వాడి ద్వారా బిన్‌లాడెన్ పట్టుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంది. తర్వాత జరిగిన అయిదు సంవత్సరాలలో అనగా 2008లో ఇస్లామాబాద్ మారియట్ హోటల్లో జరిగిన పేలుళ్ళు, కారులో వస్తుంటే తీవ్రవాదులు కాల్పులు జరపటంనుండి మాయా తప్పించుకుంటుంది. మాయా సహోద్యోగి జెన్సికా 2009లో జరిగిన దాడివల్ల మరణిస్తుంది. ఒక జోర్డాన్ ఖైదీవల్ల అబూ అహ్మద్ ఎప్పుడో 2001లో చనిపోయాడనీ, తానే స్వయంగా అతడ్ని పాతిపెట్టానని చెబుతాడు. లేని వ్యక్తికోసం సిఐఏ 9 సం. వెతికారని తెలుసుకుంటారు. మొరాకో ఇంటలిజెన్స్ ఆర్కీవ్స్‌ను పరిశోధించిన విశ్లేషకుడు అబూ అహ్మద్ అసలుపేరు ఇబ్రహీంసయ్యద్ అని తెలపగా, మాయా వెతికి వాడికో తమ్ముడు హబీబ్ వున్నాడని తెలుసుకుంటుంది.

డాన్ సిఐఏ నిధులనుపయోగించి కువైట్ రాజుకు బహుమానాలిచ్చి సయీద్ తల్లి ఫోన్ నెంబర్ తెలుసుకుంటాడు. ఆమెకు వచ్చే ఫోన్‌కాల్స్‌ను ట్రేస్ చేసి అబూ అహ్మద్ ఉనికిని కనుగొంటాడు. పాకిస్తాన్ నేషనల్ మిలిటరీ అకాడమీ వున్న అబొట్టాబాద్ దగ్గర్లోని ఒక పెద్ద విశాలమైన కాంపౌండ్‌లో వున్న భవంతిని కనుగొంటారు. కొన్నినెలలుగా రకరకాల పద్ధతులనుపయోగించి, అతి సునిశితంగా పరిశీలించినా, అందులో బిన్‌లాడెన్ వున్నాడని నిరూపించలేకపోతారు. చివరకు సిఐఏ, అమెరికా అధ్యక్షుడితో సంప్రదించి ఆ కాంపౌండ్‌లో లాడెన్ వున్నాడని తెలిస్తే చంపడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. మే 22, 2011లో అది కార్యరూపం దాలుస్తుంది. ఒక రాత్రి హెలికాప్టర్‌లలో దాడికి బయలుదేరిన సుశిక్షితులైన సైనికులు విరుచుకుపడి, ఆ కాంపౌండ్‌లోవున్న మనుషులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేస్తారు. ఆ భవంతిలోని మొదటి అంతస్తులో పడివున్న మృతదేహం బిన్‌లాడెన్‌దని గుర్తిస్తారు. జలాలాబాద్‌లో వున్న అమెరికన్ స్థావరంలో సిఐఏ, మిలిటరీ అధికారులతో ఎదురుచూస్తున్న మాయా దగ్గరకు బిన్‌లాడెన్ మృతదేహాన్ని తీసుకువస్తారు. ఆ మృతదేహం లాడెన్‌దేనని మాయా ధృవీకరిస్తుంది. తన ఆపరేషన్ పూర్తికావడంతో మిలిటరీ విమానంలో మాయా అమెరికా తిరిగి వెళ్ళిపోవడంతో సినిమా ముగుస్తుంది.

వృత్తిపరమైన అంకితభావం, పట్టుదలతో మాయా-మగవారికి తీసిపోకుండా పనిచేస్తుంది. ఆమెకు కుటుంబం గానీ, స్నేహితులు గానీ, ప్రేమ వ్యవహారాలు గానీ ఏమీవుండవు. తప్పుడు సమాచారం, ఎలాంటి సమాచారం దొరక్కపోయినా అధైర్యపడకుండా టెర్రరిజం దాడులను ఎదుర్కొని బిన్‌లాడెన్ నివాసాన్ని కనుక్కొని అంతం చేయడంలో మాయా చూపిన తెగువ, సాహసాలు ఆకట్టుకుంటాయి. మాయాగా నటించిన జెస్సికా ఛాస్టెయిన్ ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డుకు ప్రతిపాదించబడింది.

పాకిస్తాన్‌లోని లాహోర్, అబ్బొట్టాబాద్ దృశ్యాలను మన దేశంలోని చండీగఢ్‌లో చిత్రీకరించారు. భారతదేశంలో పాకిస్తాన్ స్థల దృశ్యాలను చిత్రీకరించడంపై స్థానికుల నిరసనను ఎదుర్కొన్నారు. ''ఫర్ గాడ్ అండ్ కంట్రీ'' పేరుతో తయారైన ఈ చిత్రం తర్వాతి ''జీరో డార్క్ థర్టీ''గా పేరుమార్చుకుంది. ''అర్ధరాత్రి దాటిన అరగంటకు''అనే మిలిటరీ సాంకేతిక పదం ఇది. ఈ పదం ఒక దశాబ్దకాలంపాటు కొనసాగిన చీకటి, రహస్యాన్ని తెలియజేస్తుంది. ఈ సినిమా అక్టోబర్ '2012'లో విడుదల అయితే రీఎలక్షన్స్‌లో అమెరికా అధ్యక్షుడుగా ఒబామా గెలవడానికి ఈ సినిమా ఉపయోగపడుతుందని ప్రత్యర్థులు తమ అభ్యంతరాలను వెలిబుచ్చారు. సోనీ పిక్చర్స్‌వారు ఈ చిత్రంలో ప్రెసిడెంటు పాత్ర లేదని వివరణ ఇచ్చారు. క్రిస్మస్ సెలవులను, ఆస్కార్ అవార్డు పోటీలను దృష్టిలో వుంచుకొని ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో విడుదలచేశారు. చిత్ర నిర్మాతలు అధికార యంత్రాంగంనుండి సేకరించిన సమాచారాన్ని సరిగా ఇవ్వలేదనీ, వక్రీకరించారని సెనెటర్లు విరుచుకుపడ్డారు. అమెరికా ఖైదీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నదనీ, విచారణ పేరిట చిత్రహింసలు పెడుతుందని వస్తున్న విమర్శలను ఈ చిత్రం నిజంచేసిందని అధికారులు, పత్రికలు- ఈ చిత్రాన్ని తిట్టిపోస్తున్నారు. ఇప్పటివరకు ఈ సినిమా నాలుగు గోల్డెన్ గ్లోబ్ అవార్డు నామినేషన్లను, అయిదు అకాడమీ అవార్డులకు నామినేషన్లను పొందగలగడం విశేషమే.

- కె.పి.

నట ప్రపూర్ణ నట వైవిధ్యం

తెలుగు చిత్రకళామతల్లి నుదుట కుంకుమ తిలకంలా శోభిల్లిన నటుడు తాడేపల్లి లక్ష్మీకాంతారావు(టి.యల్.కాంతారావు). ''నిర్దోషి'' (1951) చిత్రం ద్వారా చిత్రసీమకు పరిచయమయ్యారు. ''ప్రతిజ్ఞ'' (1953) చిత్రంలో కథానాయకునిగా నటించారు. ఆ తరువాత అంతగా అవకాశాలు లభించక, ఆ తరువాత ఎన్.టి.ఆర్ నిర్మించిన ''జయసింహ'' చిత్రంలో ఆయన సోదరుడుగా నటించి, మెప్పించారు. నాటినుంచి తిరుగులేని నటుడిగా, జానపద కథానాయకునిగా స్థిరపడ్డారు.

''నటప్రపూర్ణ'', ''ఆంధ్రా ఎం.జి.ఆర్'' అని తెలుగు, తమిళ ప్రేక్షకుల మన్ననలు పొందారు. 1963వ సం.లో నటరత్న ఎన్.టి.ఆర్. 13 చిత్రాలలో నటిస్తే, టి.యల్.కాంతారావు 11 చిత్రాలలో నటించటం ఓ విశేషం. పౌరాణిక చిత్రాలు 6, సాంఘిక చిత్రాలు 4, జానపద చిత్రం 1.

వెండి తెరపై ఎందరో నటులు పురాణప్రసిద్ధమైన నారద పాత్రను ధరించారు. కాని ఆ నారదుని పాత్రను తనలో ఆవహింప చేసుకొని, నారదుడంటే కాంతారావే అన్న విధంగా (సుమారు 20 చిత్రాలకు పైగా) రక్తికట్టించిన నటుడు కాంతారావు. ఇద్దరు మహానటులు ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్.లతో సరిసమానంగా నటించి, కథాగమనానికి తోడుపడిన నారదునిగా మెప్పించిన చిత్రం ''శ్రీకృష్ణార్జున యుద్ధం''(9-1-63).

''లవకుశ'' చిత్రంలో శ్రీరాముని‌గా నటించిన ఎన్.టి.ఆర్. అనుంగు సోదరుడు లక్ష్మణునిగా నటించారు కాంతారావు. సీతాదేవిని అరణ్యంలో విడిచి వచ్చే సమయంలో కాంతారావు నటన శ్లాఘనీయం.

పురాణపురుషుడు, అవతారమూర్తియైన శ్రీకృష్ణుని పాత్రను ఎన్.టి.ఆర్. తరువాత అంత సమర్థవంతంగా నటించిన పేరు కాంతారావుకే దక్కటం విశేషం. ''నర్తనశాల'' చిత్రంలో శ్రీకృష్ణునిగా, ''విష్ణుమాయ'' చిత్రంలో శ్రీమహావిష్ణువుగా నటించారు.

''దేవసుందరి'' చిత్రంలో యక్షునిగా జానకితోనూ, ''సోమవార వ్రతమహత్యం'' చిత్రంలో యువరాజు చంద్రసేనుడిగా దేవికతోనూ, జంటగా నటించారు.

ఇక సాంఘిక చిత్రాలు కృష్ణకుమారితో కలిసి కానిస్టేబుల్ కూతురులో జంటగా నటించారు. డబ్బుగలవానిగా సరదాలకు లోనయినా, కానిస్టేబుల్ కూతురయిన హీరోయిన్‌ను ప్రేమించి, ఆ ప్రేమకోసం తపించిన యువకునిగా అద్భుతమైన నటన ప్రదర్శించారు.

''ఎదురీత'' చిత్రంలోనూ కృష్ణకుమారితో జంటగా నటించారు. అనుకోని పరిస్థితులకు లోనయిన జీవితాన్ని, కష్టాల నుంచి అధిగమించిన యువకుని పాత్ర పోషించారు.

''ఆప్తమిత్రులు'' చిత్రంలో ఎన్.టి.ఆర్ మిత్రునిగా నటిస్తూ అతనికి, అతని ప్రేయసికి ఎడబాటు కల్పించే విలన్‌గా నటించారు.

''తోబుట్టువులు'' చిత్రంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ళు (సావిత్రి, జమున, శారద) పెద్దకూతురు సావిత్రి భర్తగా, అనురాగవంతుడయిన పతిగా, మరదళ్ళకు బాధ్యత గల బావగా నటించి, మెప్పించారు.

బి.విఠలాచార్య నిర్మించిన అనేక జానపద చిత్రాలలో కత్తియుద్ధాలకు ప్రత్యేకత లభించింది కాంతారావుకు. ఎన్నో మాయలు, మంత్రాలతో కూడిన పలు చిత్రాలలో నటించి, మెప్పించారు. కత్తివీరుడు కాంతారావు అని, జానపద కథానాయకుడని పేరు పొందారు.

అలా ఎన్ని మాయలు, మంత్రాలు, సింహంతో, గొరైతో పోరాటం, గుర్రం డాన్స్ వంటి చిత్ర, విచిత్ర విన్యాసాలతో కూడి సక్సెస్ సాధించిన చిత్రం ''గురువును మించిన శిష్యుడు''. ఈ చిత్రంలో కూడా కృష్ణకుమారి నాయిక.

విలన్ రాజనాల, గురువు ముక్కామల. ఈ కాంబినేషన్‌లో కాంతారావు రాకుమారుడిగా నాయిక ప్రేమకోసం, గురువుకు పాఠం నేర్పే శిష్యునిగా ఎంతో సునాయాసంగా నటించి మెప్పించారు.

కేవలం కథానాయకునిగానే కాక, విలన్‌గా, చిత్రసీమకు యువతరం ప్రవేశించాక గుణచిత్ర నటునిగా కూడా ప్రతిభను చాటుకున్న నటులు శ్రీకాంతారావు. మార్చి 22, (2009)లో కాన్సర్ మహమ్మారి కారణంగా అసువులు బాసారు.

- సి.వి.ఆర్.మాణిక్యేశ్వరి

ముంబై టాక్

బాలీవుడ్ బ్యూటీ, శత్రఘ్నసిన్హా ముద్దుల తనయ సోగకళ్ల సోనాక్షిసిన్హా త్వరలో టాలీవుడ్‌లో మెరవనుంది. ఈ విషయాన్ని తనే స్వయంగా ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. 'ప్రిన్స్' మహేష్‌బాబుకు జోడీగా క్రిష్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మించే 'శివం' చిత్రం కోసం ఆమె ఓకే చెప్పేసింది. మహేష్‌బాబుతో నటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ- "తెలుగులో 'శివం' చిత్రం ద్వారా మహేష్‌బాబు సరసన పరిచయమవుతున్నందుకు చాలా సంతోషంగా వుంది. మహేష్ గురించి చాలా విన్నాను. ఆయన చిత్రాలు టాలీవుడ్‌లో ఏ రేంజ్‌లో విజయాన్ని సాధిస్తాయో అందరికీ తెలిసిందే. ఈ సినిమా నాకు టాలీవుడ్‌లో మంచి గుర్తింపుని తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నా"అని పేర్కొంది. శత్రఘ్నసిన్హా తనయగా తెరకు పరిచయమైనా, తర్వాత నటించిన చిత్రాల ద్వారా తన నటనను ప్రేక్షకులకు తెలియజేసింది. 'దబాంగ్'లో నటనకు గాను ఫిలింఫేర్ అవార్డును, ది గ్లోబల్ ఇండియన్ ఫిల్మ్ అవార్డు, లైన్స్ గోల్డ్ అవార్డ్, స్టార్‌డస్ట్ అవార్డు, జీ-సినీ అవార్డులను అందుకుంది. 'దబాంగ్' తెచ్చిన స్టార్ డమ్‌తో ఈ ముద్దుగుమ్మ వరసగా చిత్రాలు చేసింది. 'రౌడీరాథోడ్', 'జోకర్', 'ఓ మైగాడ్', 'సన్నాఫ్ సర్దార్', 'దబాంగ్-2',తో పాటు ఇప్పుడు తాజాగా 'లుటేరా' 'వన్స్ అపనేటైమ్ ఇన్ ముంబై-2', 'బుల్లెట్ రాజా', 'రాంబో రాజ్‌కుమారుడు', 'శివం'(తెలుగు) చిత్రాల్లో నటిస్తోంది.

ఇట్స్ ఫోటో టైమ్

ప్లస్ పాయింట్!

'జయంతా భాయ్ కీ లవ్‌స్టోరీ'లో నేహా శర్మ - వివేక్ ఒబెరాయ్ మధ్య 'కెమిస్ట్రీ' నడిచిందన్నది వార్త. 'నేహా' సంగతి తెలిసిందే. పాపం! వొంటి మీద బట్ట ఉన్నదీ లేనిదీ చూసుకోదు. ధ్రీగా నటించేస్తుంది. 'చిరుత'లోనూ అంతే కదా! అంటూ తెర వెనుక ఏవేవో గాసిప్స్ వచ్చినప్పటికీ - అవే పట్టించుకునే పరిస్థితిలో ఆమె లేదు. 36 ఏళ్ల వివేక్ ఒబెరాయ్ 'రక్తచరిత్ర' తర్వాత నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఇప్పటికీ థియేటర్లలో రోజుల కొద్దీ ఆడేస్తూ - ట్రెండ్ సెట్టర్ సృష్టించిందిట. కాకపోతే నేహా అందానికి మార్కులొచ్చాయా? 'వివేక్' నరికొత్త అవతారానికి మార్కులొచ్చాయా అన్నది పక్కనబెడితే - మొత్తానికి ఈ 'ఏజ్డ్ లవ్‌స్టోరీ' జనాన్ని ఆకట్టుకున్నట్టేనా? అదేమో గానీ - క్రెడిట్ మాత్రం నేహాకే. 'పుట్టినప్పుడు బట్ట కట్టలేదు.. పోయేటప్పుడు అది వెంటరాదు' అన్న వేదాంతాన్ని అక్షరాలా పాటించే నేహా ఈ విషయంలో కాస్తంత ముందు ర్యాంక్‌లో ఉన్నట్టే లెఖ్ఖ.

'నో' ఐటెం!

'వర్మ' డిపార్ట్‌మెంట్‌లో 'ధన్‌ధన్ చీనీ' అంటూ టన్నుల కొద్దీ శృంగారాన్ని వొలకబోసిన నథాలియా కౌర్ ఇక నుంచీ మడి కట్టు క్కూర్చుంటుందిట. 'నో' ఐటెం సాంగ్స్.. 'నో' అరకొర కాస్ట్యూమ్స్ అంటోంది. ముప్పాతిక నగ్నత్వాన్ని ప్రదర్శించి బోర్ కొట్టేసిందట. కాబట్టి- ఐటెంలోంచి యాక్టింగ్‌లోకి దిగుతానంటోంది. ఆవిడ నిర్ణయం చెప్పేసింది.



కానీ - జ్యోతిలక్ష్మి చీర కడితే ఆ రోజుల్లోనైతే చూశారేమో గానీ - నథాలియా ఒళ్లంతా కప్పుకొంటే ప్రేక్షకులు ఒప్పుకుంటారా? అన్నది వేన వేల ప్రశ్న. 'ఐటెం సాంగ్‌లు చేయాలని లేదు. నటనలో నేనేమిటో నిరూపించుకోవాలని ఉంది' అంటూ ముక్తాయింపు పలికింది. ఈ మాట చెప్పిందగ్గర్నుంచీ నిర్మాతలు ఆవైపు కన్నెత్తి చూట్టం లేదట. రెమ్యునరేషన్ ఎంతయినా ఫర్వాలేదు. 'ఐటెం'లో నటించమంటూ వస్తూన్న ఆఫర్లను కాలదన్నుకొని పుట్టిన ఈ విపరీత బుద్ధిని ఏమనాలంటూ సన్నిహితులు వాపోతున్నారు. ఏది ఏమైనా.. నా నిర్ణయం నాదేనంటూ భీష్మించుక్కూర్చుంది నథాలియా. మరి - నిర్మాతలు నథాలియా మాటను అంగీకరిస్తారో? లేదో? అంటే - నాగార్జున చిత్రం 'భాయ్'లో 'ఐటెం' సాంగ్‌తో నథాలియా 'ఖేల్' ఖతం అయినట్టేనా? ఏమో? చూద్దాం. 'ఐటెం' ఎగరావచ్చు?!

ఇనుపరాడ్‌తో చావబాదింది!

అవీ.. ఇవీ.. అన్నీ..

- వీరాజీ

బరోడాలోని గోద్రా తాలూకాకు చెందిన పంచమహల్ దరి ఛావడ్ గ్రామానికి చెందిన లీలా బారియాకి- తన కూతుర్ని వలలో వేసుకున్న వివాహిత యువకుడు ప్రదీప్‌పై ఆగ్రహం వచ్చింది. అతడు రోజూ మొబైల్ నుంచి ఫోన్ చేశాక బారియా కుమార్తె అతడి బైక్ ఎక్కేస్తుంది. స్కూల్ వద్దే దింపుతాడు అనుకోండి- గానీ, అదీ- అప్పుడప్పుడు షికార్లు కూడా ఉంటాయ్!

ప్రదీప్ భార్యతో దాంగారియాలో కాపురం ఉంటూనే ఆ మైనర్ బాలికను సమ్మోహితురాల్ని చేశాడు. ఒక రోజు కూతురికి వచ్చిన ఫోన్‌కాల్‌ను బారియా అందుకుంది. ''ఎంత చెప్పినా వినవా? మా అమ్మాయిని వదిలేయవా?'' అని బతిమాలుకుంది. ప్రదీప్ 'సారీ'- అన్నాడు. 'ఇవాళ శనివారం కదా? అయినా బస్ స్టాప్‌లో కాపు వేశావా?' అనడిగింది.

బారియా భర్త పాలం పనులు చేస్తాడు. అతను వాడే గునపాన్ని తీసుకుని ప్రదీప్ నిల బడ్డ చోటుకే పోయి నెత్తిన ఒక్క దెబ్బ వేసింది. మరో రెండు దెబ్బలు పడేలోగా నలుగురూ చేరి బారియాను పట్టుకున్నారు. ఆసుపత్రికి తీసు కెళ్లేలోగా ప్రదీప్ మరణించాడు. చేతులకు బేడీలు వేశాక ఆ తల్లి పోలీసులతో నిబ్బరంగా నడిచింది.

veeraji@sify.com

ఇంటింటా

★ ఇంట్లో దోమల బెడద ఎక్కువగా ఉంటే ఒక పాత్రలో టీపొడిని కాల్చితే ఆ వాసనకు దోమలు బయటకు పోతాయి.

★ ఒక గ్లాసులో నగం వరకూ నీళ్లు పోసి, అందులో కొన్ని కర్పూరం బిళ్లలు వేస్తే ఆ వాసనకు దోమలు చెల్లాచెదురవు తాయి.

★ దోమలను నిర్మూలించేందుకు మార్కెట్‌లో లభిస్తున్న ప్రత్యేకమైన అగర్‌బ త్తీలను ఇంట్లో వెలిగిస్తే కొంత ఫలితం ఉంటుంది.

★ ఇంట్లో చిన్నకుండీలో పుదీనా మొక్కలు పెంచుకుంటే ఆ ఘాటుకు దోమలు దరిచేరవు.

★ శరీరంపై దోమ కుట్టిన చోట వెనిగ ర్‌లో ముంచిన దూదితో మెత్తగా రుద్దితే ఉపశమనం లభి స్తుంది.

★ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడితే దోమల సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

శభాష్.. అమృత..!

ఆమె మౌనాన్ని ఛేదించింది.. వేధింపుల వేళ తల దించుకుని వెళ్లి పోకుండా ఎంతో తెగువ చూపింది.. తాను నేర్చుకున్న కరాటే విద్యతో ఆకతాయిలకు తగిన గుణపాఠం చెప్పింది.. సాటి యువతులకు స్ఫూర్తిగా నిలిచిన అమృతా మోహన్ (20) సంచలన వ్యక్తిగా వార్తల్లో నిలిచింది. కేరళ రాజధాని తిరువనంతపురంలో బి.ఎ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఈమె కొద్ది రోజుల క్రితం నడిరోడ్డుపై వేధిస్తున్న యువకులను తరిమి కొట్టింది. అయితే, చట్టాన్ని చేతిలోకి తీసుకుందనే అభియోగంపై అమృతపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినందుకు మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మహిళలపై హింసకు నిరసనగా తిరువనంతపు రంలో జరిగిన ర్యాలీకి హాజరై, చీకటి పడ్డాక అమృత తన తల్లిదండ్రులు, స్నేహితురాళ్లతో కలిసి రోడ్డు పక్కన నిలబడి ఉండగా ఓ వాహనంలో వచ్చిన ముగ్గురు యువకులు చులకనగా మాట్లా డుతూ వేధింపులు ప్రారంభించారు. ఆకతాయి లపై మొదట మాటలతో దాడి చేసి అమృత గట్టి గానే ఎదిరించింది. తన తండ్రిని నెట్టివేయడంతో ఆగ్రహానికి లోనై కరాటే దెబ్బలను ఆకతాయిలకు ఆమె రుచి చూపించింది. ముగ్గురిలో ఒకడు పలా యనం చిత్తగించగా మిగతా ఇద్దరినీ అమృత కరాటే 'పంచ్'లతో ఎదుర్కొంది. కొద్ది సేపటికి పోలీసులు అక్కడికి చేరుకుని వాహనం డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఇద్దరు ఆకతాయిలను ఉద్యోగం నుంచి తొలగిం చారు. తాను ఉద్దేశ పూర్వకంగా ఆకతాయిలను కొట్టలేదని తన కుటుంబ సభ్యులను,స్నేహితురా ళ్లను వేధింపుల నుంచి కాపాడేందుకే అలా చేశా నని అమృత చెబుతోంది. తాను చట్టాన్ని ధిక్క రించ లేదని, మౌనాన్ని ఛేదించానని ఆమె అంటోంది. సినీ ప్రముఖులతో పాటు మహిళా సంస్థల ప్రతినిధులు అమృత ధైర్య సాహసాలను ప్రశంసించారు. ఈ సంఘటన గురించి మీడి యాలో తెలుసుకున్నాక ఎంతో మంది ఫోన్లు చేసి అమృతను అభినందించారు. అమృతలా తెగువ చూపకపోతే మహిళల్లో ఎన్నటికీ చైతన్యం రాదని, ఆకతాయిలకు ఇదో గుణపాఠమని ప్రముఖ నటి కావ్య మాధవన్ అన్నారు. లైంగిక వేధింపులకు నిరసనగా దేశ వ్యాప్తంగా మహిళలు పోరాడుతుం డగా అమృత వంటి సాహస యువతులపై కేసులు బనాయించడం విడ్డూరంగా ఉందని కేరళ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బిందు కృష్ణ విమ ర్శించారు. అక్రమ కేసులు పెడితే అరాచక శక్తులపై ఫిర్యాదులు చేసేందుకు ఎవరూ ముందుకు రారని ఆమె వ్యాఖ్యానించారు. కాగా, ఆకతాయిలను ఎది రించేందుకు మహిళలు కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు తమ వద్ద ఉంచుకోవాలని, కరాటే వంటి యుద్ధవిద్యలు నేర్చుకోవాలని పోలీసులు సలహా లిస్తూనే ఉన్నారు. అత్యాచార సమయంలో మహి ళలు నిందితులను హతమార్చినా అది ఆత్మరక్షణ కిందకే వస్తుందని, హత్యానేరం కాదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం తాజా చట్టంలో ప్రకటించింది. అయితే, ఆకతాయిలను ధైర్యంగా ఎదుర్కొన్న అమృతపై పోలీసులు కేసులు పెట్టడం పట్ల అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చట్టాన్ని చేతిలోకి తీసుకున్నందున ఈమెపై కేసులు నమోదు చేయాలని స్థానిక కోర్టు ఆదేశించడం చర్చనీయాంశమైంది. ఆకతాయిలను ఎదిరించిన అమృతపై కేసులు పెట్టడం యువతను నిరాశకు గురి చేస్తుందని, అసాంఘిక శక్తులను ఎదిరించా లంటే ఇక ఎవరూ ముందుకు రారని మహిళా సంఘాల ప్రతినిధులు అంటున్నారు. అమృతపై కేసులకు నిరసనగా మహిళలు భారీ ఎత్తున ర్యాలీ జరిపి మద్దతు ప్రకటించారు. అమృతకు చిన్నప్పటి నుంచి కరాటే వంటి యుద్ధవిద్యలంటే ఎంతో ఇష్టం. తాను నేర్చుకున్న విద్య ఆకతాయిల బారి నుంచి కాపాడిందని ఆమె ఆనందం వ్యక్తం చేస్తోంది.

నాకూ స్వేచ్ఛ కావాలి!

-శారదా అశోకవర్ధన్

సాయంత్రం ఆరు దాటింది. అత్తగారు గుడికని బుట్టలో చామంతి పూలూ, కొబ్బరికాయా పెట్టుకుని, పట్టుచీర కట్టుకుని, తలనిండా కొప్పుమీంచి కనబడేటట్టు మల్లెదండ చుట్టుకుని 'వెళ్లొస్తా'నని కోడలితో చెప్పి, బయటినుంచి తలు పుకి తాళం పెట్టి, తాళం చెవుల గుత్తిని బొడ్లో చెక్కుకుని బయ లుదేరింది కాంతమ్మ. ఆవిడ చేసినదంతా కొడుకు ఆజ్ఞ ప్రకా రమే. ఒక్క కొడుకు పుట్టగానే ఆమె భర్త విజయకుమార్ సన్యాసం పుచ్చుకుని, ఏవేవో ఆశ్రమాల చుట్టూ తిరుగుతూ ఇల్లొదిలి వెళ్లిపోయాడు. కాంతమ్మ మాత్రం అందరికీ అతడు అమెరికాలో వున్నాడని చెబుతుంది. ఆశ్రమంలో వున్నాడో, అమెరికాలో వున్నాడో, అసలున్నాడో లేడో తెలీదుకానీ, కాంతమ్మ మాత్రం గుళ్లకీ, గోపురాలకీ, సినిమాలకీ, షికార్లకీ, మహిళా మండలి స్నేహితులతో ఇరుగింటివారూ, పొరుగింటి వారితో వెళుతూనే వుంటుంది. కొందరనడం మాత్రం ' భర్త విజయకుమార్ ఈవిడ పెట్టే బాధలు పడలేక, ఎటో వెళ్లిపో యాడు, అమాయకుడు' అని అంటారు.

ఆలోచిస్తూ కిటికీ తలుపులు తెరిచి, కిటికీ దగ్గర కూర్చుంది అవనిజ. అత్తగారు పన్లన్నీ పూర్తిచేసుకునొచ్చి, తలుపు తాళం తెరిచేవరకూ అలా కూర్చోవడం ఆమెకు అలవాటే. అలా పిచ్చిదానిలా, రోడ్డుమీద వచ్చి పోయేవారిని చూసుకుంటూ, బండబారిన మనస్సుతో కూర్చోవడం, ఏ అర్ధరాత్రో భర్త భర ద్వాజ్ వచ్చేవరకూ కూర్చుని కూర్చుని, అతనొచ్చాక భోజనం పెట్టి, తనూ తినాలనున్నా లేకపోయినా నాలుగు మెతుకులు ఎంగిలిపడి, అప్పుడు స్నానం చేసి ముస్తాబై, అత్తగారు పెట్టు కోగా మిగిల్చిన పూలని తలలో పెట్టుకుని మంచం మీదికి చేరడం, భరద్వాజ్ ఈసడింపు మాటలతో, వికృత చేష్టలతో అతని చేతిలో కీలుబొమ్మలా మారడం, పెళ్లయిన ఏడాది నుంచీ ఆమె పడుతూన్న పాట్లే. ఎన్నోసార్లు తన బాధని అత్త గారితో చెప్పుకుంది. చాలాసార్లు భరద్వాజ్‌తో ఘర్షణ పడింది. ఘర్షణ పడినప్పుడల్లా అతడి హింసలు మరీ ఘోరం. ''పెద్ద పెద్ద కళ్లు నీకెందుకే? ఒక గుడ్డు పీకేసినా- ఒక కన్ను చాలు నీ చూపుకి! నిన్ను చూసిన ప్రతీవాళ్లూ, నీ కళ్లని చూసి పొగడ్డమే. ఆ కళ్లకి కాటుక కూడా పెట్టి, ఇంకా పెద్దవి నా కళ్లు చూడండి చూడండి అని చెప్పుకోవాలా? కడిగెయ్'' అని పక్కనే తాగడానికని పెట్టుకున్న చెంబుడు నీళ్లూ మొహాన కుమ్మరించేవాడు కడిగెయ్యమని! తనతో పక్క మీదున్నంతసేపూ ఉంచుకోమన్న కాటుకనీ, తల్లో పువ్వులనీ, తన మోజు తీరగానే, పూలచెండు ఊడదీసి పీకిపారేసేవాడు.

''సి.ఏ.లాంటి పెద్ద చదువులు చదివారు. యూనివర్సిటీలో ఉద్యోగం. ఇదేం శాడిస్టు గుణాలు?'' భర్తను అడిగింది కొత్తలో అవనిజ.

''నాకు ఆడవాళ్లంటే అసహ్యం. కాస్త చనువిస్తే చాలు, మీద మీద పడతారు. ముగ్గులోకి దించుతారు. తరవాత అజమా యిషీ చేస్తారు. అందులో అందమైన వాళ్లయితే మరీ. అదే వాళ్ల ఆయుధం. అందుకే నీ కళ్లు, వాటి అందం చూసినప్పు డల్లా పొడిచెయ్యాలనిపిస్తుంది ఆ కళ్లని...'' గొప్పగా నవ్వుతూ చెబుతూన్న వాడల్లా ''ఆపండి'' అన్న అరుపు విని క్షణం నివ్వె రపోయి ఆపేశాడు.

''ఎవరో మిమ్మల్ని మోసం చేసుండొచ్చు! అంతమాత్రం చేత, ఆడవాళ్లందరినీ అసహ్యించుకోవడం, అందమైన వాళ్లంటే క్రూరంగా ఆలోచించడం మంచిది కాదు''.

అంతలోనే ఫెళ్లున చప్పుడు! కళ్లు బైర్లు కమ్మాయి!

''యూ... బ్రూట్'' అంది ఆవేశంగా అవనిజ.

అంతే!

వన్... టూ... త్రీ.. రెండు చెంపలూ ఎర్రగా కందిపో యాయి ఆ దెబ్బలకి. ఆ రోజునుంచి ఆమెకి ఇల్లే జైలు. పుట్టిం టికి కూడా పంపరు. వాళ్లు ఫోన్ చేస్తే, 'తను స్నానం చేస్తోం దనో', 'ఎటో వెళ్లిందనో' చెప్పి ఫోన్లో అన్నీ బాగానే వున్నట్టు, ఆమె చాలా సంతోషంగా వున్నట్టూ చెప్పి పెట్టేసేవారు.

ఒక రోజు అవనిజ తమ్ముడు ఆర్య ఇంటికొచ్చాడు. వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగోలేదని, ''నాలుగు రోజులు అవనిజని ఇంటికి పంపించమని మీతో చెప్పమని అన్నారు'' అని చెప్పాడు.

దీంతో కాంతమ్మ, భరద్వాజ్ మొహమొహాలు చూసుకు న్నారు. ''రెండ్రోజులుంచుకుని పంపించండి'' అంది కాంతమ్మ. ''అవనిజ లేకపోతే చాకిరీ అంతా తనమీద పడు తుందన్న భయంతో. అవనిజ లేకపోతే ఇల్లంతా చిన్నబోయి నట్టుంటుంది. మేము గలగలా మాట్లాడుకుంటూ తిరు గుతాం. అందుకే రెండ్రోజులుంచుకుని పంపించండి'' అంది తెలివిగా.

ఆమె మాటలకి షాక్ తింది అవనిజ, అయినా పుట్టింటికెళు తున్నానన్న సంతోషంతో ఏమీ మాట్లాడలేదు. తల్లి మాటలకి తందానా అన్నాడు భరద్వాజ్.

వెంటనే బట్టలు చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని, జైల్లోంచి విడు దలైన ఖైదీలా బయటికొచ్చి, ఆర్య తెచ్చిన ఆటోలో కూర్చుంది హాయిగా ఊపిరి పీల్చుకుంటూ అవనిజ. అమ్మా, నాన్నతో తన ఘోషంతా చెప్పుకుని గుండెలోని బరువు దిగే దాకా బోరుమని ఏడవాలనుకుంది. తన జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకోవాలనుకుంది. ఈ రెండ్రోజులూ హాయిగా కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోవాలని కలలుకంటూ ఇల్లు చేరుకుంది.

''ఇలా చిక్కిపోయావేంటి? ఏమన్నా విశేషమా?'' అడి గింది తల్లి నవ్వుతూ. మాట్లాడకుండా ''నాన్నగారెలా వున్నారూ?'' అంటూ తండ్రి మంచం దగ్గరికెళ్లింది.

''డాక్టర్ ఏమేమో టెస్టులు చేస్తున్నారు. బీపీ ఎక్కువగా ఉంది. నువ్వేమిటీ? ఎప్పుడు ఫోన్ చేసినా బాత్‌రూమ్‌లో వుందనో, ప్రెండింటికో, బజారుకో వెళ్లిందనో చెప్తారు. వాళ్లుమాట్లాడి ఫోన్ పెట్టేస్తారు మీ అత్తగారూ, మీ ఆయనా. అమ్మా, నాన్నని మర్చిపోవడమేనా?'' అంది తల్లి చిరునవ్వుతో.

''అవనిజ ఎన్నిసార్లు ఫోన్ చేసినా తిరిగి తను చెయ్య దేమని అడిగితే- తను మహా బిజీ.. ప్రెండ్స్‌తో కబుర్లూ, పక్కింటావిడా, ఎదిరింటావిడా అందరితో ముచ్చట్లే.. అంటూ చెప్తారు. నిజమేనా? అమ్మా నాన్నలతో మాట్లాడటానికి కూడా తీరిక లేదా? అత్తగారూ, మొగుడూ అంత బాగా చూసుకుం టున్నారన్నమాట! -అంత అనారోగ్యంలోనూ చిన్నగా నవ్వా రాయన.

అవనిజ కళ్లు సాగరాలయ్యాయి. పైట చెంగుతో కళ్లు తుడుచుకోవడం తల్లి కంటపడింది. నాన్నగా రికి బాగాలేదని కంట తడి పెట్టిందనుకుం దామె!

''ఇప్పుడు కాస్త బాగానే వున్నారమ్మా. నిన్ను చూడాలని కలవరిస్తూ వుంటే ఆర్యని పంపించాను'' అంది తల్లి.

అవనిజ ముభావంగా ఊరుకుంది, చిరు నవ్వు నవ్వి. ఆ రాత్రి అవనిజకిష్టమయిన అర టికాయ ఆవ పెట్టి కూర, కందిపచ్చడి, ఇంగువచారూ పెట్టింది. అప్పడాలు వేయించి పెట్టింది. అమ్మ చేతి వంట కమ్మగా తిని, వెంటనే నిద్రపోయింది అవనిజ. ఆ రోజంతా ఆమెకి స్వర్గంలో వున్నట్టుగా వుంది పుట్టింట్లో. అక్క పక్కన కూర్చుని ఒకటే కబుర్లు చెబుతూ వచ్చాడు ఆర్య. ఆర్య తొమ్మిదో తర గతి చదువుతున్నాడు. వాడి స్నేహితుల గురించీ, స్కూలు గురించీ మాట్లాడుతూ మాట్లాడుతూ పడుకుంది అవనిజ. అలా అక్కతో కబుర్లు చెప్పి, చాలాకాలమయిం దేమో, వాడు ఉషారుగా మాట్లాడుతూ అక్క పక్కనే నిద్రపోయాడు!

⁂

పెళ్లయిన రెండేళ్లలో అవనిజని ఇప్పుడు రెండోసారి చూస్తున్న తల్లి, నిద్రపోతూన్న కూతు రికేసి తలనిమురుతూ తదేకంగా చూసింది. మొహం వాడిపోయిన కమలంలా వుంది. కళ్లకింద నల్లటి చారలు వలయాల్లా వున్నాయి. ఎందుకనో ఆమె మనసులో ఆందోళన చెందింది. 'అసలు అవనిజ ఆనందంగా వుందా? ఏదో మానసికంగా కలత చెందుతూన్నట్టు ఆమె మాటల్లోని నిరాశా నిర్లిప్తతా చెబుతున్నాయి. ఫోనులో వాళ్లత్త గారూ, భర్తా చెప్పే మాటలు నిజం కాదేమో?' తల్లి మనసు గొల్లుమంటోంది!

మామూలుగా పొద్దున్నే లేచి తయారయి స్కూల్‌కెళ్లిపో యాడు ఆర్య. అవనిజ గాఢ నిద్రలో వుండడంవల్ల లేపలేదు తల్లి. బాగా పొద్దెక్కేక బాలభానుడి కిరణాలు కిటికీ చువ్వల్లో నుంచి వెచ్చగా వొంటిమీద పడి, క్రమంగా వేడెక్కుతూ వుంటే, కళ్లుతెరిచి 'అబ్బా.. ఇంతసేపూ పడుకున్నానా?' అంటూ ఒళ్లు విరుచుకుని లేచింది.

''అమ్మ ఇల్లు కదా! అలాగే నిద్రొస్తుంది. బ్రష్ చేసుకునిరా. ఏకంగా టిఫిన్ తిని కాఫీ తాగుదువుగాని'' అంటూ వేడి వేడి ఇడ్లీలూ, కొబ్బరి చట్నీ ప్లేటులో డైనింగ్ టేబిల్‌మీద పెట్టి, వేడి వేడి కాఫీ కప్పులో పోసి పక్కన పెట్టింది. ఇవన్నీ ఎప్పుడో మర్చిపోయిన అవనిజకి పట్టలేని ఆనందంగా వుంది. ఇలాగే అమ్మ దగ్గరే వుండిపోతే? తింటూ తింటూ ఆమాటే అంది. టిఫిన్ తినడం అయిపోయాక, తల్లి తన వైవాహిక జీవితం గూర్చి గుచ్చి గుచ్చి అడుగుతూంటే, అన్నీ వివరంగా చెప్పి, ''నేను విడాకులు తీసుకుంటాను, ఆ సంసారం చెయ్యలేను'' అంది. అంతవరకూ అన్నీ కంటతడి పెడుతూ సావధానంగా విన్న తల్లి 'విడాకులు' అనగానే ఉలిక్కిపడింది.

''అదేమిటి? సంసారం అన్నాక కష్టాలూ, సుఖాలూ అన్నీ వుంటాయి.. తట్టుకోవాలి'' అంది.

''నే చెప్పినదంతా విన్నావుగా...! కష్టాలు తప్ప, కొంచెమైనా సుఖాలు కనిపించాయా? రోజూ చస్తూ బతకడం నావల్ల కాదు''.

''నిజమే! నీకు అన్నీ కష్టాలే వున్నాయి. ఏం చేస్తాం? ఖర్మ! అన్నీ చూసి ఒక్కడే కొడుకు, చదువుకున్నాడు, మంచి ఉద్యో గంలో వున్నాడని అడిగినంత కట్నం ఇచ్చి ఘనంగానే పెళ్లి చేశాం. కానీ, అతడిలాంటి వాడని ఎవరికి తెలుసు? కొన్నాళ్లు పోతే, నీ కడుపున ఓ నలుసు పుడితే అన్నీ సర్దుకుంటాయి. అందాకా కష్టాలైనా సుఖాలైనా ఓర్చుకోవాలి'' అంటూ వేదాంతం వల్లించింది తల్లి.

''అమ్మా!... ఓర్చుకుంటున్నాను కాబట్టే, ఏడాది నుంచి చిత్ర హింసలు పెడుతూన్నా పెదవి విప్పి మీతో ఒక్క మాటా చెప్పుకోలేదు. నా ఈడు స్నేహితులూ, నా ఈడువాళ్లూ ఎలా వున్నారు! నేను ఇన్ని నెలల తరవాత ఈ రోజున రోడ్డును చూశాను. లేకపోతే నేనూ, ఆ గదీ, పెడితే తినడం లేకపోతే లేదు. నవ్వు పెట్టిన తిండి కడుపునిండా తిని నిద్రపోయాను నిన్నా ఇవాళ. చిన్న చిన్న అపార్థాలూ, అపోహలూ వుంటే సర్దుకుపోవొచ్చుకానీ, శారీరకంగా, మానసికంగా బాధలు పడడం ఎంత కష్టమో తెలుసా? అందుకే విడాకులు తీసుకుం టాను'' నిశ్చలంగా చెప్పింది అవనిజ.

''విడాకులు మన ఇంటా వంటా లేవు. పెళ్లయిన ఏడాదికే విడాకులు తీసుకుని పుట్టింటికొస్తే పరువు పోతుంది. కాస్త ఓపిక పట్టు. అన్నీ సర్దుకుంటాయి'' అంది తల్లి.

గదిలోంచి ఈ సంభాషణంతా వింటున్న తండ్రి లేచొచ్చి ''విన్నానమ్మా.. అంతా విన్నాను. విడాకులు తీసుకుని మా పరువు తియ్యడంకంటే, ఏదన్నా విషమిచ్చి మా ప్రాణాలు ఒక్కసారిగా తీసెయ్యి! ఆయనకేం మగమహారాజు, మళ్లీ పెళ్లి చేసుకుని హాయిగా వుంటాడు. ఆడపిల్ల విడాకులతో పుట్టిల్లు చేరుకుందంటే మేము నిత్యం చస్తూ బతకాలి, నలుగురి నోళ్లలో నానుతూ!'' అన్నారు.

''నాన్నగారూ... మీరూ ఇలా మాట్లాడతారని నేననుకో లేదు. పెళ్లయ్యాక మంచైనా, చెడైనా అక్కడే పడి చావాలన్న సిద్ధాంతాన్ని ఎవరూ హర్షించరు ఈ రోజుల్లో. ఆడపిల్ల సేఫ్టీ గురించి, గృహహింసల గురించీ ఎన్నో చట్టాలు వచ్చాయి. కోర్టుకెక్కడం నాకిష్టంలేదు. రెండు నిమిషాల్లో ఆ తల్లీ కొడు కులని గృహ హింస చట్టం కింద అరెస్టు చేయించొచ్చు. కానీ, దానివల్ల నాకేం లాభం? నాకు ఆ పంజరం నుంచి విముక్తి కావాలి!'' అంది అవనిజ.

తల్లిదండ్రులే అలా మాట్లాడుతూంటే తన కష్టాలకన్నా పరువే ముఖ్యమైనట్టు, గుండె బద్దలయిపోతూన్నట్టనిపిం చింది అవనిజకి.

''అమ్మా! ఒక్కటి గుర్తుంచుకో! ఇంకోసారి విడాకులూ, గిడాకులూ అని మాట్లాడకు. నీకో తమ్ముడున్నాడు. పరువు పోతే రేపు జీవితంలో కష్టాలెన్నో రకాలు. మంచి సంబం ధాలు రావు. ఒక మచ్చ పడుతుంది కుటుంబం మీద. అది పోవడం కష్టం. ఇంకో పదేళ్ళకి వాడికి పెళ్లయినా, ఆ అమ్మాయి ఈ విషయం గురించి దెప్పుతూ వుంటుంది. మరో సారి ఆ మాటెత్తకు. అన్నీ సర్దుకుపోడం అలవాటు చేసుకో మమ్మా... కాలమే కష్టాలను కరిగిస్తుంది... విడాకులు తీసు కుంటే జీవితం బాగుపడిపోతూందన్న అపోహ నుంచి బయ టపడు! లోకులు కాకులు! ఏవో నిందలు వేస్తూనే వుంటారు'' అని తండ్రి కచ్చితంగా చెప్పేశాడు.

అవనిజకి అర్థమయిపోయింది పుట్టింట్లో తనకి స్థానం లేదని! ఆ సాయంత్రమే మళ్లీ ఆ నరకంలోకే వెళ్లిపోయింది, తమ్ముడు దిగబెట్టి వస్తే కన్నీళ్లతో! తల్లి బొట్టుపెట్టి చీర, పసుపూ కుంకుమ ఇచ్చింది.

⁂

ఆలోచిస్తూ కిటికీ దగ్గర కూర్చున్న అవనిజ దృష్టి ఈ రోజు ఎదురుగా వున్న కూరలమ్ముతూన్న ఒక ముప్పై ఏళ్ళ స్త్రీమీద పడింది. చక్కగా కూరలన్నీ సర్ది తట్టల్లో పెట్టి అందంగా అమర్చి తను కుర్చీలో కూర్చుని వచ్చేవాళ్ళతో గలగలా మాట్లాడుతూ అమ్ముతున్న దృశ్యం. ఆ మొహంలో కనిపి స్తున్న ఆనందం, ఆమె స్వేచ్ఛకి ముగ్ధురాలయింది. ఆమెతో పాటు, ఆమె భర్తకామోసు అతనూ, ఒక నడివయస్కురాలు అత్తగారిలా వుంది, ఆ ముగ్గురూ కలిసి సరదాగా మాట్లాడు కుంటూ పనులు చేసుకుంటూ వుండడం ఎంతో సంతోషంగా అనిపించింది. డబ్బులు లేకపోవచ్చు వాళ్ళ దగ్గర, కానీ వారి ఆప్యాయతలు ముచ్చటగొలిపాయి.

''ఈ పంజరపు బతుకు ఎన్నాళ్లు పడాలి? అమ్మానాన్నలు తనమాట విని తన కష్టాలు తీరేలా ఆదరిస్తారని ఆశించిన తనకి అదికూడా లేదని అర్థమయిపోయింది. ఈ గదిలోనే ఉరి పెట్టుకుని చచ్చిపోతే? ఛీ! అది పిరికి తనం! బతకాలి.. మనిషిగా పుట్టినందుకు ఎలాగోలా మంచిగా బతకాలి! మార్గం తనే అన్వేషించుకోవాలి!'' తేనెతుట్టల్లా ముసురు కుంటున్న ఆలోచనలతో సతమతమైపో తోంది అవనిజ. సమయం కోసం ఎదురుచూ స్తోంది బయటపడడానికి.

ఆ రోజు ఇంట్లో కూరలేవీ లేవు. వంద రూపాయల నోటిచ్చి ఏవో నాలుగు కూరలు ఎదురుగా వున్న దుకాణానికెళ్లి తెమ్మని పంపించింది కాంతమ్మ తనకి చాత కాక. ఎన్నడూ గడపదాటనివ్వని ఆమె ఆ రోజు తనకి బద్ధ కంగా వుందని అవనిజని పంపింది. వెంటనే ఒక్క పరుగులో ఇంటికి వెళ్లిపోయింది అవనిజ. లక్కీగా శైలజ ఇంట్లోనే వుంది. ఆమె ఉద్యోగాలేమీ చెయ్యకపోయినా 'ఏ షాపింగ్‌కో వెళ్లిందేమో?' అని భయపడుతూ వచ్చింది.

సడెన్‌గా వచ్చిన అవనిజని చూసి ఆశ్చర్యపోయింది శైలజ. ''ఎన్నాళ్ళయిందే నిన్నుచూసి? అసలు నీ పెళ్లి తరవాత మనం కలవనే లేదు. ఏ ఊళ్లో ఉన్నావ్? ఏం చేస్తున్నావ్? నయం, నేను షాపింగ్‌కెళదామనుకున్నాను. అర్జున్ కారు కూడా పంపించాడు. ఎందుకో బద్ధకించాను. చూశావా? నువ్వేవస్తా వని కలగన్నానేమో?'' అంటూ ప్రశ్నలు, సమాధానాలూ వరసగా గుప్పించేసింది.

అవనిజకి ఏం చెప్పాలో తెలీలేదు. క్షణం ఆగి ఊపిరిపీల్చు కుని, శైలూ తెచ్చిన లెమన్ జ్యూస్ తాగి ''శైలూ.. నువ్వు నాకు ఒక సహాయం చెయ్యాలే'' అంది.

:అసలు నువ్వేమిటి? కొత్తపెళ్లికూతురివి. పెళపెళలాడుతూ వుండక ఇలా వెలవెలపోతున్నావేమిటి?' అడిగింది. అవనిజకి కన్నీళ్లాగలేదు. పెళ్లినాటి నుంచి ఇప్పుడు కూరలు కొనడానికి వచ్చి ఎలా ఇంట్లోంచి పారిపోయి, ఎక్కడికెళ్లాలో తెలీక తన దగ్గరికెలా వచ్చిందో చెప్పింది పూసగుచ్చినట్టు.

అంతా విన్న శైలజకు దుఃఖం వచ్చింది. ''అవనీ! మంచి పని చేశావ్. నువ్వునా దగ్గరికే రావడం. నీకేం భయం లేదు. మీవాళ్లకెవరికీ మా అడ్రస్ తెలీదు. తెలిసినా, నువ్వు రాలేదని చెప్తాను'' అంది ప్రేమగా శైలూ.

''మీ ఆయనతోచెప్పి వీలైనంత త్వరగా, నన్ను ఈ ఊళ్లో కాకుండా వేరే ఎక్కడైనా ఉద్యోగానికి పంపించు. నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను'' ప్రాధేయపడుతూ అంది అవనిజ.

''సరే..! ఇక అన్నీ మర్చిపో! కొత్త జీవితం ప్రారంభించు. రాత్రికి అర్జున్‌తో మాట్లాడుతాను. ముందు స్నానం చేసి ఈ బట్టలు కట్టుకునిరా అంటూ చీరా, బ్లౌజూ అన్నీ తెచ్చి టేబిల్ మీద పెట్టింది. శైలూతో మాట్లాడుతూ విపరీతంగా ఏడ్చిం దేమో ఆమె మొహం, కళ్లు ఎర్రగా అయిపోయాయి. వద్దు వద్దంటూనే మెల్లగా వెళ్లి శైలూ బలవంతంమీద స్నానం చేసొ చ్చింది గెస్ట్ రూంలోకెళ్లి. ఈలోగా శైలూ కూడా స్నానం చేసి తయారై వచ్చింది.

''పద.. అలా వెళ్లొద్దాం. నేను షాపింగ్‌కెళదామని పొద్దున బద్ధకించాను. మంచిదయింది. ఇప్పుడు ఇద్దరం కలిసి వెళ్లి మనకి కావలసినవి కొనుక్కొనొద్దాం''.

''నాకేమీ అక్కర్లేదు''.

''అంటే? ఆ ఒక్క చీరతోటే రోజులు గడిపేసి, ఉద్యోగం కూడా చేసేస్తావా?''

కళ్ల నీళ్లు పెట్టుకుంది అవనిజ ఏం చెప్పాలో తెలీక.

''ఏదైనా బంగారం దుకాణానికి వెళదాం. నా గాజుల మ్మేసి..''

''షటప్! ముందు పద'' ప్రేమతో మందలించింది శైలూ.

''నన్నెవరైనా గుర్తుపడితే... నాకు భయమేస్తోంది.''

''మీవాళ్లు ఈ మూలకి రారు. మనం అటువైపువెళ్లం.. పద'' అంటూ లాక్కెళ్లింది.

ఇద్దరూ కార్లో కూర్చున్నారు. కారును కొత్తపేటలో ఓ షాపింగ్ మాల్ దగ్గర ఆపి ఇద్దరూ ఆ కాంప్లెక్స్‌లోకెళ్లారు. తనకి నచ్చినవి రెండు షిఫాన్ చీరలు కొనుక్కుంది శైలజ. అవనిజ కోసం రెండు షిఫాన్లు, రెండు సింథటిక్, రెండు కాటన్ చీరలూ కొంది.

''ఏమిటే ఇన్ని చీరలా? గాజులమ్మేద్దాం. నీ చేత ఇంత ఖర్చు పెట్టించడం నాకిష్టం లేదు'' అంది అవనిజ.

''అట్లాగే! నీకు ఉద్యోగం వచ్చాక ఇదంతా నాకు వాపస్ చేద్దువుగాని. ఓకేనా?'' అంది శైలజ.

ఇద్దరూ కలిసి బైటికొచ్చి, టైలర్ షాపుకెళ్లి బ్లౌజులు కుట్టడా నికిచ్చారు. మిగతా బట్టలేవో కొన్ని కొనుక్కుని ఇల్లు చేరుకు న్నారు రాత్రి ఎనిమిదింటికి. ఇంటికొచ్చాక ఇద్దరూ గబగబా చపాతీలూ, ఆలూ కూర్మా చేసేరు. ఎనిమిదిన్నరకి అర్జున్ ఇంటికొచ్చాడు. అవనిజని పలకరించాడు.

''శైలూ... నాకన్నీ చెప్పింది ఫోన్‌లో. మీరు బేఫికర్‌గా వుండండి. మీరు అదృష్టవంతులు. మీ కోసం ఉద్యోగం రెడీగా వుంది. అయితే ఎక్కడో మారు మూల పల్లెటూళ్లో!

''మరీ మంచిది. మావాళ్లెవరి కంటా నేను పడను''

''కరెక్ట్''

''విజయనగరం జిల్లాలో 'మొయిద' అనే చిన్న గ్రామంలో ఒక్క సూలు నడుపుతు న్నాడు మా బాబాయ్! మిడిల్ స్కూల్! అక్కడికెళ్లండి. మీ పేరు అమల అని చెప్తాను. మిస్ అమలగా అక్కడ చేరిపోండి. మా బాబాయ్‌తో

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
శనివారం
23, ఫిబ్రవరి
2013

సేర్చుండ్రాం

భవదీయామల తత్త్వ నిర్ణయ కళాప్రఖ్యాతసద్భక్త పుం
గవ గోష్ఠీ సుఖ వార్ధిలోన గడువేడ్కం దేలినం గాక యీ
భువిలో దీర్ఘ జలంబులం గడగినం బోనేర్చునే ఘోరదు
ర్భవ సంఘాకలితాత్మ తామస మహా పంకంబు సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! నీ యొక్క నిర్మల తత్త్వాన్ని నిర్ణయించే కళలో ప్రఖ్యాతులైన సద్భక్త శ్రేష్ఠుల గోష్ఠీ సుఖం అనే వార్ధి లోపల సంతోషంతో ఓలలాడ్తే తప్ప ఈ భూమి మీద కేవల తీర్థ జలాలతో కడిగినంత మాత్రంలో భయంకరమైన దుష్టజన్మ సమూహాలతో కూడిన అజ్ఞానమనే మహా పంకం పోతుందా?

శివతత్త్వనిర్ణయ కళలో ప్రఖ్యాతులైన శివభక్తుల సత్సంగ మహిమఈ పద్యం చెప్తున్నది. భక్తమతం తప్పని సరిగా సత్సంగాన్ని చెప్పుతుంది. శివనామం ఉచ్చరిస్తేనే మహాపుణ్యం వస్తుంది. అట్లాంటి భక్తసులభుడైన శివునిపై భక్తి ఉంటే చాలు ఇక ఏతీర్థంలోనూ మునగనక్కర్లేదనేది శివభక్తుల విశ్వాసం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

20 — శ్రీ లత

ఇద్దరూ కాసేపు ఆలోచనలో పడి మాట్లాడ లేదు. జీవనే తన ఆలోచనల్ని ఒక కొలిక్కి తెచ్చు కుని.

''సర్లేమ్మా ఇవన్నీ సరే కానీ పాపకు ఏం పేరు పెడదాం ఇంతకీ'' మళ్లీ అమ్మను మొదట్లోకి లాక్కొస్తూ అంది.

''ఇంటిపేరు లేదు. తండ్రివరో తల్లికి తెలీదు. ఈ పాపను ఎవరితో పోలుద్దాం'' తండ్రివరో అనే ప్పుడు జీవనను తరచి చూస్తూ అంది వసంత. జీవన గమనించినా గమనించనట్లే...

''తను ప్రకృతిలా సహజ జనిత కనుక 'ప్రకృతి' అని పెడదామా పోనీ'' అంది జీవన సంబరంగా, ఆ సంబరం చూసి వసంతకూ ఆనందం వేసింది. ''పోనీ! తన బిడ్డను చూసి తను ఆనందపడు తుంటే ఆ ఆనందాన్ని కాలరాచి, తండ్రివరూ, మళ్లీ పెళ్లి అంటూ వేధించడం మానవత్వం కాదేమో. తనంతట తనకు వాటి గురించి ఆలోచ నలు వచ్చినపుడు ఆ విషయం పట్ల దీర్ఘంగా సాగితే బావుంటుందేమో''అను కుంది.

''ఇదేమిటో కొత్తగా ఉంది. పిలవడ నికి కూడా తమాషాగా ఉంది. ఇదే పెడదాం'' అంటూ తనూ సంబరపడిపో యింది వసంత.

పాపకు మెలకువ వచ్చి బద్ధకంగా ఒళ్లు విరుచుకుని, బుంగమూతి పెట్టి, అమ్మమైవూ అమ్మమ్మ వైపూ చూసి పిడి కిళ్ళు బిగించి ఆవులించి, అప్పుడే దీర్ఘ తపస్సు పూర్తి చేసి ఆశించిన ఫలాన్ని పొందిన సంతృప్తిలో నవ్వే తపస్వినిలా నవ్వింది. ఆ నవ్వు వసంతలోనూ జీవన లోనూ చిట్టి చిట్టి ఆనందపు జల్లు కురి పించి, చిన్న చిన్న మొలకలు మొలిచి, బుజ్జి బుజ్జి అరవిందాలను పూయిం చింది.

వసంత పాపను ఎత్తి పట్టి, రెండు చేతుల్లో బోర్లాగా ఎత్తి పట్టి ముక్కుతో ముక్కును తాకిస్తూ రెండు చెవులకూ పెదవులను చేర్చి చెరి మూడుసార్లు ''ప్రకృతీ, ప్రకృతీ, ప్రకృతీ'' అని పిలి చింది.

పేరు నచ్చిందో, పేరు పెట్టే మనిషి నచ్చిందో, మనిషి పెట్టే చక్కలిగింత నచ్చిందో తెలీదు కాని అమ్మమ్మ జుట్టు రెండు పిడి కిట్లోనూ పట్టి కిలకిలా నవ్వింది.

వసంత భుజాలను చుట్టు చుట్టుకుని జీవన కూడా పాపను చూస్తూ ''ప్రకృతీ... ప్రకృతీ... ప్రకృతీ'' అని పిలిచింది.

పాప నవ్వుతూ ఒకరి తర్వాత ఒకరు వాళ్ళలాగే పిలుస్తూ.. అమ్మ చిన్నప్పుడు తనను కూడా ఇలాగే లాలించి ఉంటుంది అనుకుంది జీవన.

వసంత పాప కాళ్ళమీద పడుకోబెట్టుకుని ఆయిల్ మసాజ్ చేస్తోంది.

జీవన ప్రక్కనే కూర్చుని చిక్కుళ్ళు వలుస్తోంది.

పాపకు మూడు నెలలు నిండటంతో ఒళ్ళు చేసి బొద్దుగా, మరీ ముద్దుగా తయారయింది. తల్లి చేతిలోని పాపను అందుకుని ముక్కుకు ముక్కు ఆనించి కళ్ళలోకి చూసి నవ్వింది జీవన.

''అమ్మా! ఈ రోజు బ్యాంక్ నుంచి వచ్చేట ప్పుడు పాపకు మంచి ఫ్రాక్ తెస్తానమ్మా'' అంది.

''ఫ్రాక్స్ చాలానే ఉన్నాయి కానీ బోర్లా పడుకో బెట్టడానికి ఓ మంచి ఫోమ్ పిల్లో పట్టుకురా'' చెప్పింది వసంత. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. చేతిలోని చిక్కుళ్ళు ప్లేటులో పడేసి తలుపు తీసింది జీవన.

''నమస్తే మేడం! మేము టివీ ఛానల్ నుంచి వచ్చాం. ఈ సంవత్సరం సోషల్ వర్క్ చేసిన వారిని గుర్తించి అవార్డు ఇవ్వాలని నిర్ణయించాం. ఈ విషయంలో మీరు ఇంటర్వ్యూ తీసుకుందా మని వచ్చాం'' అని పరిచయం చేసుకున్నాడో యువకుడు.

''నేనేం సోషల్ వర్క్ చేయలేదే' అంది జీవన చికాగ్గా.

''మీరు ఒక కుప్ప తొట్టి పాపాయిని పెంచు కుంటున్నారని తెలిసింది. అందుకే ఇంటర్వ్యూ కోసం వచ్చాం'' అన్నాడతను.

''సారీ నాకిష్టం లేదు' జీవన నిర్లక్ష్యంగా పలి కింది.

''మీకవసరం వున్నా లేకపోయినా సోషల్ యాక్టివిటీస్ వున్న వాళ్లను మేం వెంటాడుతూ ఉంటాం మేడమ్. ఇతరుల ద్వారా విని రాసే బదులు మీ ద్వారా మీ అభిప్రాయాలలు తెలుసు కుంటే మంచి ఇన్‌ఫర్మేషన్ అవుతుంది కదా మేడమ్'' నింపాదిగా అన్నాడతను.

''మీకు నా వివరాలు ఎవరు చెప్పారు?'' సూటిగా అడిగింది.

''సాయంకాలం పత్రికలో మీ గురించి రాశారు. రిపోర్టర్ అవినాష్ మీ అడ్రస్ ఇచ్చాడు''

అవినాష్ పేరు వినగానే బి.పి స్థాయి పెరి గింది జీవనలో. ''ఇతనేంటి తనను ప్రశాం తంగా బ్రతకనిచ్చేలా లేడు'' అనుకుంది.

''చూడండీ! నేను ఈటీవీ ద్వారా అయినా ముఖాముఖి అయినా ఒకే మాట చెప్పాలను కుంటున్నాను. నేను సోషల్ వర్క్ చేయడం లేదు. చిన్నపిల్లలంటే ఇష్టం కాబట్టి పెంచు కుంటున్నాను. దీన్ని అవసరంగా గొప్ప విష యమంటూ గందరగోళం చేయకండి. మీ సర్వేలో నన్ను చేర్చకండి. మీరిచ్చే అవార్డు నాకొద్దు. ఇంకోసారి దయచేసి ఇటువైపురా కండి. వస్తే నేను మేనర్స్ మరచిపోయి ప్రవ ర్తించాల్సి ఉంటుంది'' అని బయటకు వెళ్ళమ న్నట్లుగా సైగ చేసి వెళ్ళాక తలుపేసి సోఫాలో కూలబడింది. ఇప్పటివరకు మాట్లాడిన మాటలన్నీ రికార్డు అయ్యాయనీ, కెమెరా ఆన్‌లోనే ఉందన్న విషయం మాత్రం జీవన గుర్తించలేకపోయింది.

''ఏమిటట?'' వసంత అడిగింది లోపలి గదిలోంచి.

''ఏమిటమ్మా ఇది? పాప నా కూతురని తెలిస్తే నలుగురు ఆడిపోసుకుంటారని ఇలా నాటకమాడితే అది నిజమనుకుని ఇలా వెంట బడుతున్నారు?'' జీవన మాటలకు వసంత పెద్దగా నవ్వింది.. ''కూడబెడితే పిసినారం టుంది, దానం చేస్తే దుబారా అంటుంది, చెడు చేస్తే దుర్మార్గమంటుంది. మంచి చేస్తే డ్రామా అంటుంది. సమాజమంటే ఏమనుకున్నావు? దానికి ఒక నాలుక కాదే తల్లీ! కోట్ల నాలుకలు సమూహం'' అంది వసంత అదే నవ్వుతో.

-ఇంకావుంది

రంగనాథ రామాయణం

151

శ్రీపాద కృష్ణమూర్తి

అంత అంగదుడు రుష్టుడై ఆ రక్క సుణ్ణి అదరులంట కొట్టాడు. వెంటనే మారీచ పుత్రుడు వక్త్రం నుంచి బొటబొట రక్తం క్రక్కు కొంటూ నేలకూలిపోయాడు.

అనంతరం వానరులు- అలసిపోయారు కనుక- ఒక మహావృక్షం ఛాయను కూర్చు న్నారు. దిప్పిక హెచ్చి నీటికై వెదకసాగారు. ఎదుట ఒక బిలద్వారం నుంచి జలపక్షులు ఒక్కటొక్కటె ఎగురుతూ ఏతెంచుతూ వుండడం కనుగొన్నారు. ఆ బిలంలో జలం లభించవచ్చునని తలచి, వచ్చి వానరులం దరూ అందులో దిగారు. అక్కడ గాఢాంధ కారం క్రమ్మి తెరువు తెలియ వెరవు తోచక ఒండీరుల్ని పిలుచుకొంటూ పోగాపోగా ఆ చీకట్లు విచ్చిపోయాయి. అక్కడ జగదాశ్చర్య కరాకారం అయిన పురాన్ని వీక్షించారు. ఆ పురం పైడిగోపురాలతో, పసిడి మేడలతో, బంగరు తోటలతోను, చామీకర తరువుల తోను, జాతవేద గిరులతోను అత్యంత రమ ణీయమై వుండడం కని, ఎంతో చోద్యమంది, అనంత సంపదలచే విరాజిల్లుతున్నది. కాని అది నిర్మానుషంగా వుంది. వానరులు ఈ పురం ఎందువల్లనో ఈ విధంగా అయినదో అనుకొంటూ అక్కడ నుంచి బయటపడే విధంగా అయినదో అనుకొంటూ అక్కడ నుంచి బయటపడే విధం ఎరుగరాక చింతిస్తూ, అక్కడ కొన్ని నాళ్లు సంచరిస్తూ, ఆ నగరం మధ్య వీధిని ఆకసాన్ని చుంబించే సౌధాన్ని వీక్షించి ఆ సౌధం మీదికి కపులం దరూ ఎగబ్రాకారు. అక్కడ తపోవృత్తితో హరిణాజినం పయిని ఆసీనయై- తరుణ చంద్రకళను పోలి- విరాజిల్లే ఒక స్త్రీని కాంచి, ఆమెకు పాదాభివందనం చేసి, నిష్కల్మష చిత్తుడై హనుమానుడు ఈ క్రియ పలికాడు.

''ఓ తన్వీ! నీవెవ్వరవు? ఒంటరివైవుండి ఇక్కడ ఈ వడువున తపం ఒనర్చ కారణం ఏమిటి? ఈ హేమ నగరం ఏ మహానుభా వుడి నగరం? ఇటువంటి విచిత్రాలు మేము ఎక్కడా పొడగాంచి ఎరుగం.

హనుమంతుడి పలుకులు విని ఆ తప స్విని తన పూర్వీగాథ చెప్పబూనుకొంది.

''పూర్వం మయుడు అనే దానవుడు బ్రహ్మదేవుడి గురించి తపస్సు కావించాడు. పస కల్గిన నిర్మాణ శక్తిని అలవరచుకొన్నాడు. ఈ పసిడి గోపురాన్ని నిర్మించాడు. ఆ మయుడు 'హేమ' అనే దివ్య కాంతతో పెద్ద కాలం ఇక్కడే నివసించాడు. ఆ రాక్షసుణ్ణి మహేంద్రుడు వజ్రాయుధ హతుడిని చేసి ఆ తన్విని కొనిపోయాడు. నేను ఆ హేమ చెలిక త్తెని. నా తండ్రి మహిత మానసుడైన సావర్ణి. ఆ వనిత ఆజ్ఞ శిరసావహించి, విడవక అతి తపో నియతితో వుంటాను. నా పేరు 'స్వయంప్రభ' అని వాక్రుచ్చింది. ఆ వానర వరులందరికి కందమూలాలు, రుచ్యాలైన ఫలాలు తనివితీర ఒసగింది. వారితాపం తీర్చింది.

''అనఘులారా! మీరెవ్వరు? ఇక్కడికి ఏతెంచ కారణం ఏమిటి? దేవతలు సయితం ఇక్కడికి చనుదెంచకూడదు. మీరు ఏ భంగి ఇక్కడికి ప్రవేశించారు?'' అని ప్రశ్నించింది.

ఆమె పలుకులు విని ఆంజనేయుడు ''తన తండ్రి మాట జవదాటక శ్రీరాముడు మునివృత్తితో దండకారణ్యం వచ్చి వున్నాడు. ఆ శ్రీరాముడి ధర్మపత్నిని జనకసుతను లంకే శ్వరుడు రావణాసురుడు అపహరించుకొని పోయాడు. మేము వానరులం- ఒక జట్టు వాళ్లం- సీతను అన్వేషిస్తూ వచ్చి, తీరని దప్పి కచేత ఒక బిలంలో ప్రవేశించాము. అంధకార బంధురమైన ఆ బిలంలో త్రోవ కానకరాక దైవయత్నంవల్ల ఈ ఆశ్రమం చేరుకొన్నాం. ఇక్కడనుంచి వెడలిపోయే మార్గం తెలియక- తెలియజెప్పవారు కనరాక- తిరుగాడుతూ పలు దివసాలు గడిపాము'' అని తెలిపాడు.

అంత 'స్వయంప్రభ ''వీరు కిల్బిష రహి తులు- అనఘులు. పుణ్యాత్ములు. రామకా ర్యార్థం వచ్చిన వారు'' అని తలపోసి ''మీకు ఏది ఇష్టం? వేడుకొనండి'' అని అనుగ్రహిం చింది. అప్పుడు వానరులు ''మాకు ఈ బిలం వెలువడే మార్గం తెలుపగోరుతున్నాం. వేగమే సీతాదేవిని అన్వేషింపపోతాము'' అని వాకొన్నారు.

-ఇంకావుంది

శనివారం, 23 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ త్రయోదశి రా.12.47
నక్షత్రం: పుష్యమి రా.11.46
శేష వర్జ్యం: ఉ.08.12 వరకు
దుర్ముహూర్తం: ఉ.06.42 నుండి 08.15 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా వుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు వినోదాల్లో పాల్గొంటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభముంది.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థాన చలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువచేస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందులనె దుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు. అధికార భయం ఉంటుంది. కొత్త పనులు ప్రారంభించరాదు.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీయుల సహకారం లభిస్తుంది. అజీర్ణ బాధలు అధికమవుతాయి. కీళ్ళనొప్పుల బాధ నుండి రక్షించుకోవడం అవసరం.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి జాగ్రత్తగా వ్యవహరించుట మంచిది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. అభివృద్ధి ఉంటుంది.

మంచిమాట

తృప్తి

తూచలేని బంగారమున్నా సరే తృప్తిపడని వారు కొందరు. తులం బంగారమున్నా సరే అదే చాలు అని సంతృప్తి చెందుతారు ఇంకొందరు. అసలు మానవుడికి తృప్తి ఎన్నడు ఎలా కలుగుతుంది? ఆకలిని భోజనంతో తాత్కాలికంగా తృప్తిపరచవచ్చు. కామాన్ని శరీర మిధునంతో కాసేపటివరకు తృప్తిపరచవచ్చు. కానీ ధనదాహానికి తృప్తి అనేది ఉండదు. లక్షలు, కోట్లు సంపాదించినా సరే ఇంకా ఇంకా అంటూ ఆశ అటువైపు లాక్కెళ్తుంది. కోరికలకు కళ్లెం వెయ్యకపోతే తృప్తి అనేది ఎన్నటికీ లభించదు. లేదా ఒక కోరిక తీరిన వెంటనే మరో కోరిక అలా అనంతమైన అనేకమైన కోరికల చిట్టా మనసులోంచి పుడుతూనే ఉంటుంది.

కోరిక, తృప్తి అనేవి రెండూ పక్కపక్కనే వుండే రైలు పట్టాలలాంటివి. అవి కలిసి వున్నట్లుగానే ఎంతో దూరం సాగుతున్నా ఎన్నటికీ కలవవు. అలాగే కోరికకు, తృప్తికి ఎన్నడూ లంకె కుదరదు. వేటిదారి వాటిదే. అందుకనే తృప్తి కావాలంటే కోరికలని త్యజించాలి లేదా కోరికలని జయించాలి. ఆ రెండు కాకపోతే కోరికలను నియంత్రించుకోవాలి. అనగా కోరికలను మన అదుపులో వుంచుకోవాలి లేదా మనమే కోరికల యొక్క వలయంలోకి మనకు తెలియకుండానే చిక్కుకుపోతాం. ఇక అప్పుడు అతనికి సంతృప్తి అనేది దరిదాపులలో కూడా కనిపించదు. పేద పురుగు పేడలోనే పుట్టి పేడలోనే మరణించిన చందాన మానవుడు కూడా కోరికతోనే జన్మిస్తాడు. చివరికి ఆ కోరికలలోనే కొట్టుమిట్టాడుతూ మరణిస్తాడు. కానీ తృప్తి పొందలేడు. జీవితాన్ని పరిపూర్ణంగా జీవించినవారే సంతృప్తులుగా చెప్పబడుదురు. ఇక్కడ సంతృప్తి అనగా కేవలం అది భోగభాగ్యాలతో, ధనధాన్యాలతో, వస్తు వైభోగాలతోనే వస్తుందని కాదు. మూడు పూటలా కడుపు నిండా తిండి, కంటినిండా నిద్ర, కట్టుకోడానికి గుడ్డ, తలదాచుకోవడానికి గూడు, ఈ కనీస సౌకర్యాలతో జీవితాన్ని తృప్తిగా గడపవచ్చు కదా. అది తెలుసుకోవడంలోనే తృప్తి యొక్క అసలైన నిర్వచనం. మానవుడికి తప్ప ఇతర ప్రాణులన్నీ తమకున్నవాటిని సద్వినియోం చేసుకుని తమకు లభించిన దాంతో సంతోషంగా జీవిస్తాయి. కానీ మానవుడు మాత్రం తమకు వున్నదాన్ని వదిలేసి లేనిదాని కోసం అర్రులు చాస్తాడు.

అవతలివారికున్న వాటిని చూసి ఓర్వలేక అసూయ చెందుతాడు. తత్ఫలితంగా అతనికి తెలియకుండానే అతనిలో అసంతృప్తి అనేది జ్వలిస్తుంది. ఎప్పుడైతే ఈ రకమైన అగ్ని చెలరేగుతుందో అది లోలోన మండుతూ వ్యక్తిని నిలువెల్లా దహిస్తుంది. ఇక అప్పుడు వ్యక్తిలో పేర్కొన్న అసంతృప్తి అనేది పరాకాష్ఠకు చేరుతుంది. ఆ స్థాయిలో అసంతృప్తిని నిర్మూలించడం ఎవ్వరితరమూ కాదు. అందుకే అసంతృప్తిని మొగ్గగా వున్నప్పుడు తొలగించుకోవాలి. అసంతృప్తిని జయించాలి, నిర్మూలించాలి. చిన్నచిన్న విషయాలకూ, సంఘటనలకూ తృప్తి చెందడం అలవర్చుకోవాలి. అలనాడు గీతలో శ్రీకృష్ణుడు కూడా ఇదే పద్ధతిని అవలంభించాడు. అక్షయపాత్రలో మిగిలిన ఒకే ఒక మెతుకులో సగం మెతుకుని తిని ఎంతో సంతృప్తి చెందాడు. కానీ నేటి మానవుడు ఎంత తిన్నా ఎన్నివేల, లక్షలకోట్లు అక్రమంగా సంపాదించినా సరే ఇంకా ఇంకా అంటున్నారు తప్ప ఇక చాలు అని తృప్తిపడుటలేదు. తృప్తిపడటం అంటే ఎదగలేక ఓడిపోవడం కాదు ఉన్నదాన్ని అనుభవిస్తూ ఉన్నదాంతో సంతృప్తి చెందుతూ ఎదగడం. ఈ క్షణాన నాకు ఆ పరమాత్ముడు ఇచ్చినదాంతో నేను సంతృప్తిగా నిండు మనసుతో జీవించడమే సిసలైన తృప్తికి నిర్వచనం. తృప్తికి మించిన సంపద లేదు. తృప్తి అనేది కేవలం సంపదలోనే లేదు. ఎంత తీసుకున్నా సరే మనసులో తృప్తి అనే భావం లేకపోతే ఆ వ్యక్తి జీవితమంతా చిల్లుపడిన కుండలాంటిదే. పంచభక్ష్యాలను అసంతృప్తిగా భుజించుటకంటే తృప్తిగా నాలుగు పచ్చడి మెతుకులు తిన్నా చాలు. అది వంటబడుతుంది. ఇందుకు మంచి ఉదాహరణ అలనాడు పాండవులు పదమూడు సంవత్సరాల అరణ్యవాసమే. అరణ్యంలో వున్నా సరే పాండవులు వున్నదాంతో సంతోషంగా, సంతృప్తిగా జీవించారుతప్ప ఏనాడూ అసంతృప్తిపడలేదు. అలాగే అక్కడ కౌరవులు అన్నీ వున్నా కూడా వారు ఏనాడూ తృప్తిగా జీవించలేదు.

-శ్రీష్టి శేషగిరి

వృతాసురుడు

29

బొమ్మలు: శ్రీరామ్





రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

nudi@andhrabhoomi.net

నుడి

నిర్వహణ: **డా.సామల రమేష్‌బాబు** - ncharithra@gmail.com Cell: 9848016136

కుదురు మాటలు (క్రియాధాతువులు Verbal Bases)

చెఱుచు, చెరుపు = కార్యవైకల్యము సేయుట
చెఱలాడు = దరికోరాడు
చెఱుము = రాచుట
చెల్లు = అప్పుదీఱుట, ప్రతిబంధములేనిదవుట, చచ్చుట
చెలఁగు = శోభించుట
చెలరేఁగు = మిక్కిలి వ్యాపించుట, మిక్కిలి నుద్ధతుండవుట
చేకుఱు, చేకూఱు, చేకూడు = అనుకూలమగుట
చేటుముణుగు, చేటుమూడు, చేడ్పడు = దైవప్రాతికూల్యము వొందుట
చేఁదు = బావి మొదలైన దానిలో నుండి నీళ్లు చేఁదుట
చేఁపు = పాలు ఉబుకుట, ఆవు పాలుబుకఁజేయుట
చేపడు = హస్తగతమౌట
చేపట్టు = అవలంబించుట, వివాహమగుట
చేమోడ్చు = మ్రొక్కుట
చేయు = సలుపుట
చేరు = పొందుట, అనుకొనుట, హస్తగతమౌట
చేరుచు, చేర్చు = పుష్పాదులు ధరించుట, పొందించుట
చొప్పడు = అనుకూలమవుట
ఒప్పిలు = ప్రకాశించుట
చొరవేయు = లోపలికిఁబ్రవేశించుట, లోపలికిఁబ్రవేశింపఁజేయుట

-శ్రీ వేదం పట్టాభిరామశాస్త్రి 200 ఏళ్ళ క్రితం రచించిన 'ఆంధ్రధాతుపాఠ / ధాతుమాల' నుంచి

ద్రావిడ భాషల అధ్యయనం తెలుగుతోనే మొదలు

మనిషిని మనిషితో కలిపేది భాష. నుడి. పలుకు మానవుడికున్న గొప్పవరం. ఈ విశ్వప్రాణి కోటి నుంచి మనిషి వేరుపరిచి చూపేది భాష. నుడి. మనిషి సృష్టించిన కళలన్నిటిలోను అత్యంత ఉన్న తమైంది, వాక్కళ. మనిషికి మనిషికి మధ్యనుండే సంబంధాలకు రూపమిచ్చేది భాష. భాషల గురించి చాలా పరిశోధనలు జరుగుతున్న, ముఖ్యంగా విశిష్ట భాషలుగా గుర్తింపు పొందిన, పొందాలని యత్నిస్తున్న ఈ వేళలో భాషలే కాదు ఆయా భాషలకు ఆయా భాషా కుటుంబాలలో ఉన్న స్థానం ఎలాంటిదన్న చర్చ కూడా ప్రాము ఖ్యాన్ని సంతరించుకొంది.

ప్రపంచంలో ఉన్న పలు భాషల్ని భాషా శాస్త్రవే త్తలు కొన్ని కుటుంబాలుగా వర్గీకరించారు. భారత దేశంలో ఉన్న మూడువేల చిల్లర భాషల్ని కొన్ని భాషా కుటుంబాలుగా వేర్పరిచారు. అందులో ముఖ్యమైనవి ఇండో - ఆర్యన్ భాషా కుటుంబం, ద్రావిడ భాషా కుటుంబం.- అసలు భాషా కుటుం బమంటే ఏంటి? భాషల్లోని పోలికల్ని ఆధారం చేసుకొని ఈ భాషా కుటుంబాలు ఏర్పాటుచేస్తారు. నిజానికి ప్రపంచంలోని ఏ భాషనైనా ఏ ఇతర భాష తోనైనా పోల్చి చూసినపుడ తప్పక కొన్ని వందల పదాల్లో పోలికలు కన్పిస్తాయని సుప్రసిద్ధ ద్రావిడ భాషా శాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఒక సభలో అన్నారు. మరి ఆ భాషలన్నిటిని ఏక కుటుంబానికి చెందినవిగా పేర్కొనవచ్చా అన్న ప్రశ్న పుట్టకమానదు. కాని భాషాశాస్త్రవేత్తలు భాషా కుటుంబాన్ని ఏర్పరచేటప్పుడు ముఖ్యంగా క్రియా నిర్మాణం, శరీరాంగాలు, బంధువాచకాలు, సంఖ్యా వాచకాలు మొదలైనవి ఆధారంగా తీసుకొని ఇవన్నీ చాలా దగ్గరగా లేదా సమానమైన నిర్మాణం కలిగి ఉండే భాషల్ని ఒక కుటుంబంగా ఏర్పరుస్తారు. ఈ రకంగా భాషా కుటుంబాలు ఏర్పడతాయి.

భారతదేశాన్ని దాదాపు మూడు వందల ఏళ్ళు ఏలిన బ్రిటీషు ప్రభుత్వం భాషల విషయంలో ఒక ప్రత్యేకమైన అభిప్రాయాన్ని కలిగి ఉండేది. ఒక జాతి సంస్కృతికి కొలత ఆ జాతీయుల భాషే! అప్పటికే పాశ్చాత్య దేశాల్లో భాషలపట్ల ప్రత్యేకమైన పరిశోధనలు మొదలయ్యాయి. భారతదేశంలో తొలిసారిగా కొలకత్తాలో జరిగిన ఒక సమావేశంలో భారతదేశ భాషల గురించి వచ్చిన చర్చల్లో భాషల్లో కన్పించే పదాల ఆధారంగా భారతదేశ భాషలన్ని సంస్కృతం నుంచే పుట్టాయని తీర్మా నాన్ని చేశారు. అలాగే, మద్రాసులోను ఒక సద స్సులో భాషల పట్ల చర్చ జరిగింది. అందువల్ల భాషల పట్ల ఆలోచన, పరిశోధన ప్రారంభమ య్యాయి.

ఫ్రాన్సిస్ వైట్ ఎలీస్ 1976-1819 మధ్య బ్రిటీష్ ప్రభుద్యోగ్గి. అప్పటిలో సివిల్ విభాగంలో వివిధ ప్రదేశాల్లో పనిచేసినవారికి స్థానిక భాషలతో ఏర్పడ్డ అవసరమే వాళ్ళకా భాషల మీద ఆసక్తిని కలి గించింది. ఆ తర్వాత ఆయా భాషలు నేర్చుకొని పరిశోధనలు చేసేలా పురికొల్పాయి. ఎలీస్ 1796 నుంచి మద్రాసు ప్రెసిడెన్సిలో ఇరవై మూడేళ్ళ పాటు పనిచేశాడు. 1819లో మరణించాడు. ఎలీస్ దక్షిణ భారతీయ భాషల విషయంలో చాలా తక్కువ రాశాడు. A.D.campbell రాసిన ""A Grammar of the Teloogoo Language'' (1816) వ్యాకరణానికి ముందుమాటలో ఈ కింది విషయాలను మొదటిసారి ఉదాహరించింది ఫ్రాన్సిస్ వైట్ ఎలీస్. (A Grammar of the Telingana Language 1814).

""The languages of India principally are derived from Sanscrit. The structure of most of the languages in middle and north of India, is generally the same, the chief difference in them lies in the termination of nouns and verbs, and in those derivations from sanscrit orthography which custom has established in the countries where they are spoken. The languages of south India i.e., The Teinga, Karnatic, Tamil, Malayalam and Cingalese, while they have the same origin with those of north, differ greatly from them in other respects; and especially in having a large number of words, the origin of which is unascertained'' (Cited be Elis) (చాలా భారతీయ భాషలు సంస్కృతం నుంచి పుట్టాయి. మధ్య, ఉత్తర భాషలు చాలావరకు ఒకేలా ఉంటాయి. వాటిలో ఉన్న ముఖ్య భేదం నామవా చక, క్రియా నిర్మాణాల్లో ఉంది. లిపులన్నీ సంస్కృతం నుంచి పుట్టినవే అని ఆయా భాషలు వ్యవహరింపబడే దేశాల్లోని సాంప్రదాయక భావన. దక్షిణ భారతీయ భాషలు తెలింగ, కర్ణాటిక్, తమిళ్, మలయాళం, సింహళం పుట్టువిషయంలో ఉత్తర భారతీయ భాషల్లాగే అయినా, మిగిలిన విష యాల్లో అనేక మార్పులున్నాయి. ముఖ్యంగా పుట్టుక విషయాన్ని తేల్చలేని ఎన్నో పదాలు వీటిల్లో ఉన్నాయి). అలాగే ""The hidoostanee and the timil, with languages of Gujarat and Malayala, are evidently derived from Sanscrit, but the two former are greatly mixed with foreign words. The Bengali, Maratta, Kurnata and Telinga languages are alomost wholly composed by sanscrit words'' (హిందుస్తానీ, తమిళం, గుజరాత్, మలయాళ సంస్కృతం నుంచే పుట్టాయి. కాని, మొదటి రెండు భాషలలో అన్య దేశాలు ఎక్కువగా కలిసి ఉన్నాయి. బెంగాలి, మరాట, తెలింగ భాషలు చాలావరకు సంస్కృత పదాలను కలిగున్నాయి) అని సంస్కృతా నికి వ్యాకరణం (1804) రాసిన విలియం క్యారి (1761-1834) తెలియజేశాడని ఎలీస్ చెప్పాడు. తెలుగు వ్యాకరణానికి ముందుమాట రాశాడు. అందులో తన అభిప్రాయాల్ని చెప్పాడు. ""It is the intent of the following observations to show that the observations in the preceding quotations are not correct; that neither the Tamil nor the Telugu any cognate dailects, are derivations from sanscrit; that the latter it may contribute to their polish, is not necessary for their existence; and that they form a distinct family of languages, with which sanscrit has, in latter times especially intermixed, but with which it has no radical connection'' పైన చూపించిన ఉదాహరణలు ఏవీ సరైనవి కావు. తమిళం కాని తెలుగు కాని, అంతెం దుకు మరే ఇతర మాండలికాలు కూడా సంస్కృతం నుంచి పుట్టలేదు; అవి ఎదగడానికి సంస్కృతం తోడ్పడి ఉండవచ్చు, అవి వేరే కుటుంబానికి చెంది నవి. వాటితో సంస్కృతం కలిసిపోయిండవచ్చు, కాని ఆ భాషలతో ఏ సంబంధం లేదు అని చెప్పిన వాడు ఎలీస్. తెలుగు భాష ప్రత్యేకతను, ద్రావిడ భాషలు వేరే భాషా కుటుంబానికి చెందినవని గుర్తించి, మొట్టమొదటిసారిగా పేర్కొన్న వాడు ఎలీస్. అతడు నాలుగు కొత్త విషయాల్ని చెప్పాడు. 1.తెలుగు భాషలోని ప్రాథమిక పదజాలాన్ని ఆధారం చేసుకొని, అవి సంస్కృతంలో జన్యుపర మైన సంబంధం లేనివని నిరూపించాడు. 2.ఆ తెలుగు పదాల్ని పక్కనే మాట్లాడుతున్న తమిళ, కన్నడ భాషలతో పోల్చి చూపించాడు. 3.సాంప్రదా యకమైన పద్ధతిని ఆధారం చేసుకొని తెలుగు భాషా పదాల్ని నాలుగు విభాగాలుగా విడదీశాడు. 4.అలా చేయడంవల్ల అతడు తెలుగు పదాల నిర్మాణం సంస్కృత పదాలతో ఏ మాత్రం పోలవనీ, తమిళ, కన్నడాలతో బాగా పోలుతాయనీ తెలుసు కొని నిరూపించాడు. ఈ మూడు భాషల వాక్యా లను తీసుకొని వాటిని పోల్చి చూసి చాలా విశ్లేషా త్మకంగా అవి సంస్కృతంతో సంబంధం లేని ఒక భాషా కుటుంబానికి చెందినవన్నాడు. తెలుగు ప్రత్యేకతను చాటడానికి ప్రయత్నించాడు. వాటిని దక్షిణ భారతీయ భాషలని పేర్కొనవచ్చని కూడా సూచించాడు.

ప్రపంచంలో ఉన్న పలు భాషల్ని భాషా శాస్త్రవేత్తలు కొన్ని కుటుంబాలుగా వర్గీకరించారు. భారత దేశంలో ఉన్న మూడువేల చిల్లర భాషల్ని కొన్ని భాషా కుటుంబాలుగా వేర్పరిచారు. అందులో ముఖ్యమైనవి ఇండో - ఆర్యన్ భాషా కుటుంబం, ద్రావిడ భాషా కుటుంబం, ముండాభాషాకు టుంబం. అసలు భాషా కుటుంబమంటే ఏంటి? భాషల్లోని పోలికల్ని ఆధారం చేసుకొని ఈ భాషా కుటుంబాలు ఏర్పాటుచేస్తారు. నిజానికి ప్రపంచంలోని ఏ భాషనైనా ఏ ఇతర భాషతోనైనా పోల్చి చూసినపుడ తప్పక కొన్ని వందల పదాల్లో పోలికలు కన్పిస్తాయని సుప్రసిద్ధ ద్రావిడ భాషా శాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఒక సభలో అన్నారు.

Robert Caldwell ""A comparative Grammar of Dravidian or South Indian family of Languages'' దక్షిణ భార తీయ భాషా కుటుంబానికి 1856లో వ్యాకరణ రాసి అందులో ద్రావిడ అనే పదాన్ని వాడాడు. అతడే ఈ భాషా కుటుంబం పట్ల పరిశోధన చేసిన వాళ్ళలో ప్రథమ స్థానాన్ని పొందాడు. కాని, అంతకు నలభై ఏళ్ళ ముందు తెలుగు ప్రత్యేకతను, ఈ భాషా కుటుంబాన్ని గురించి సూచించిన ఎలీస్‌ను మరె వ్వరు పేర్కొనపోవడంవల్ల ఎలీస్ గురించి చాలా మందికి తెలియలేదు. అంతేకాదు మద్రాసీయులనీ, మదరాసీ అని పిల్వబడటం దాదాపు పంతొమ్మిది వందల ఎనభైలదాకా సాగింది. అలాటిది తెలుగు విశిష్టతను 1816లోనే చాటడానికి యత్నించిన ఎలీస్ మరణం తెలుగు ప్రత్యేకతనే కాదు, ద్రావిడ భాషాధ్యయనంలో తెలుగు స్థానాన్ని కూడా వెనక్కు నెట్టింది. ద్రావిడ భాషాధ్యయనమనగానే దానికి తమిళమే ఆధారమన్న భావన ప్రబలడానికి కూడా ఎలీస్ పరిశోధన పూర్తి కాకపోవడం, అతడు చనిపోవటం కూడా కారణమయ్యాయి.

విలియం ఎరిస్కిన్ ఎలీస్ గురించి వివరిస్తూ ''అతడికి సంస్కృత సాహిత్యంతో, చందస్సుతో చాలా పరిచయముండేది, అతడు సంస్కృతాన్ని పరిశోధించే విధానం చాలా కొత్తగా విశిష్టంగా ఉండేది. అతడి మరణం భారతీయ భాషల అధ్య యనానికి, ముఖ్యంగా మద్రాసు ప్రెసిడెన్సీకి సంబం ధించిన భాషల అధ్యయనానికి తీరనిలోటు'' అన్నాడు. తెలుగు భాష ప్రత్యేకతను గుర్తించి, దాన్ని నెలకొల్పడానికి ఎలీస్ ప్రారంభించిన ప్రయత్నం పూర్తయి ఉంటే ద్రావిడ భాషాశాస్త్ర అధ్యయనంలో గొప్ప మార్పును తెచ్చేది. అది పూర్తిగా జరగకపోయిన ద్రావిడ భాషా శాస్త్ర అధ్య యనంలో భీష్మాచార్యుల వంటి ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి ''Telugu Verbal Bases'' ద్రావిడ భాషా శాస్త్ర అధ్యయనంలో ఒక మైలు రాయి. ఇవన్నీ మరింత జాగ్రత్తగా పరిశీలించి తెలు గుకు దక్కాల్సిన విశిష్టమైన గౌరవాన్ని దక్కించవల సిన అవసరం, ద్రావిడ భాషాశాస్త్ర అధ్యయనంలో తెలుగు ప్రాముఖ్యాన్ని నిరూపించవలసిన బాధ్యత తెలుగు భాషాభిమానులందరిమీదా ఉంది. తెలుగు ప్రత్యేకతను పరిశీలించే స్థితిలోనే ఎలీస్ కన్నడ, తమిళాలతో తెలుగును పోల్చి చూసి అవి సంస్కృ తానికి సంబంధించని ఒక ప్రత్యేక కుటుంబానికి సంబంధించినవని వివరించడానికి యత్నించాడు. అంటే, ద్రావిడ భాషల అధ్యయనం తెలుగుతో తెలుగువల్ల ప్రారంభమయ్యిందన్న మాట నిజం. తెలుగుకు విశిష్ట భాష హోదా లభించిన ఈ తరు ణంలో ఫ్రాన్సిస్ వైట్ ఎలీస్ తెల్లవారగానే తెలుగు వాళ్ళు గుర్తుతెచ్చుకొని జోతలు అందించవలసిన పరిశోధకుడని గుర్తుంచుకోవాలి.

(శ్రీ పి.శ్రీకుమార్‌గారి యుజిసి ప్రాజెక్ట్ ఆధారంగా)

- జె.వి.సత్యవాణి, ద్రావిడ విశ్వవిద్యాలయం

భాషాభివృద్ధికి చేయవలసింది

తెలుగు భాషపై సర్కారికి హఠాత్తుగా ప్రేమ కలిగింది. తెలుగు సరిగ్గా పలకడం రాని ముఖ్యమంత్రివర్యులు ఆ భాషనుద్ధరించడానికి కంకణం కట్టుకోవడం విచిత్రమే. ఇది కేవలం ఈ భాషపై ప్రేమతోనా, లేక వేరే ఉద్దేశంతోనా అన్నది అస్మదీయులకే తెలియాలి. దీంతో రాజుగారు తల చుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు కోటానుకోట్లు ఉదా రంగా ఖర్చుపెట్టే, రాష్ట్రపతిని తీసుకొచ్చి మరీ ప్రపంచ తెలుగు మహాసభల్ని అట్టహాసంగా జరిపించారు.

ఇలాంటి భారీ కార్యక్రమాల్లో కొన్ని చిన్న చిన్న లోపా లుండకమానవు. ఇక ఇలాంటి సర్కారీ తిరునాళ్లను ఆమో దించని పలు సంస్థలూ, సంఘాలూ సభల్ని బహిష్కరించి నిరసనలు తెలపడం లాంటివి కూడా యథావిధిగానే జరి గాయి. ఏమైనా ఈ సభలు ఉత్త కాలక్షేపానికి కాదనీ, గట్టి కార్యాచరణకు నాందీ ప్రవస్తావన కోసమని చెప్పడానిక న్నట్లు ప్రభుత్వం కొన్ని చర్యల్ని ప్రకటించింది. అయితే ఈ సభల సందర్భంగా తెలుగు భాషా వాదంపై పత్రికల్లోగానీ, సమావేశాల్లోగానీ వందలాది చర్చోపచర్చలు జరిగాయి. వాటిని గురించి ఇక్కడ పరామర్శ చెయ్యబోవడం లేదు గానీ, మాతృభాషావాదంలో, అలాగే తెలుగు భాషావా దంలో ఇమిడి ఉన్న కొన్ని సమస్యలను గురించి క్లుప్తంగా పరిశీలన చెయ్యడం జరుగుతుంది.

ఎవరి ఇంటి భాషను వారు ప్రేమించడం సహజమైన విషయమేగానీ, అదే సందర్భంలో ఆధిపత్య ధోరణుల్ని వీడాలి. మైనారిటీలకూ వారి భాషలో చదువుకునే అవకాశం కల్పించాలి. మన రాష్ట్రంలో ముస్లింలు మాత్రమే మైనారిటీ లుకాదు. గిరిజనుల్ని ఇప్పటికే మనం లెక్కలోకి తీసుకోవ డంలేదు. ఆయా గిరిజన భాషల్లోనే వారికి కనీసం ప్రాథ మిక విద్య వరకైనా నేర్చుకునే అవకాశం కల్పించాలి. ఇటీవలే గోండు భాషలో కొన్ని రచనలు బయటపడటం తెలిసిందే. తెలుగు భాషాభివృద్ధి గురించి మాట్లాడేవారు ఆయా గిరి జన భాషల అభివృద్ధి గురించి, వారి సంస్కృతీ సాహిత్యాల గురించి అధ్యయనం చేయాలి. సాహిత్య సేకరణ చెయ్యాలి. అలాగే ఇతర మాండలీకాలను గౌరవించాలి. ఆ మాండలీకాలను చిన్నచూపు చూడటంవల్లే ప్రాంతీయ విద్వేషాలు పెరిగిపోయాయని గమనించాలి. ఈ రోజు తెలుగు భాషావాదుల అభ్యంతరాలలో ఒకటి భాషా సంకరం గురించి! ఇది కూడా ఇంగ్లీషు భాషా సంకరం గురించే తప్ప, ఇతర భాషా సంకరాల గురించి కాదు. ఎందుకంటే ఇప్పటికే తెలుగులోకి సంస్కృత, ప్రాకృత పదాలు అతివేలంగా చేరిపోవటమేగాక, అసలు ఆ భాష ల్నుంచే తెలుగు పుట్టింది అని చెప్పేవారు ఇప్పుడూ ఉన్నారు. అలాగే ఉర్దూ, పోర్చుగీసు తదితర భాషా పదాలు తెలగులో జీర్ణమై, అవన్నీ తెలుగు పదాలే అని చాలామంది భావిస్తున్నారు. అలాగే ఇంగ్లీషు పదాలు కూడా డజన్లకొద్దీ తెలుగులో కలిసిపోయి, వాటికి సరైన సమానార్థకాలు తెలు గులో ఉన్నా కూడా, ఆ తెలుగు పదాలు వాడితే జనం వింతగా చూసే పరిస్థితి నెలకొనడం అందరికీ తెలిసిందే. అయితే కొందరు పరిశుద్ధవాదులు అలాంటి ఇంగ్లీషు పదా లను కూడా తొలగించాలంటున్నారు. మరికొందరైతే బాగా అలవాటుపడ్డ ఇంగ్లీషు పేర్లకుబదులు అర్థంకాని సంస్కృత పదబంధాలను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సంస్కృతీకరణ మోజు నేడు కేవలం తెలుగుకే పరిమితం కాలేదు. ప్రధాన భాష అయిన హిందీలోనూ ఇదే ఒరవడి సాగుతూండటం గమనార్హం! కొత్తపదాల సృష్టికి యత్నిం చడం మంచిదే గానీ, అది నేల విడిచి సాముగా మారకూ డదు. ఉదాహరణకు ఓ ప్రముఖ తెలుగు పత్రిక పనిగట్టు కుని చేస్తున్న ప్రయత్నాలను చూడండి: 'కార్పొరేషన్ల'కి 'ప్రాధికార సంస్థ'లనీ, 'పబ్లిక్ సర్వీస్ కమీషన్'కి 'ప్రజాసేవా సంఘం' అనీ, ... లాంటి పదబంధాలను సృష్టించడం తెలుగు భాషా సేవా లేక, ఆంగ్ల భాషా ద్వేషమా అన్నది ఆలోచించాలి. ఇలాంటి యత్నాలు ప్రజలకు సౌలభ్యం కలి గించాలి తప్ప అయోమయం సృష్టించడానికి కాదని గ్రహిం చాలి!

మాండలీకాలల్లో ఉన్న నుడిని సృష్టించుకునే ప్రయత్నం జరగాలి. అంతే తప్ప, పైన పేర్కొన్నట్లు సంస్కృతీకరణ ద్వారా ఆ ప్రయత్నం చేస్తే ఉపయోగం ఉండదు. ఈ విష యంలో సాహిత్యకారులు, పత్రికలు కృషిచెయ్యాలి. అలాగే ఆయా మాండలీకాల్లో ఇప్పటికే జరుగుతున్న కృషిని మరింత అధికం చెయ్యాలి. అయితే అలా చేస్తున్న ప్పుడు ఆయా పదాలకు అక్కడే అర్థవివరణ ఇవ్వాలి. అప్పుడే ఇతర ప్రాంతాల ప్రజలు ఆ సాహిత్యాన్ని ఆస్వా దించడానికి వీలవుతుంది.

నేడు భాషావాదుల్నేకాదు, ప్రజల్ని కూడా తీవ్రంగా కలత పెడుతున్న విషయం ప్రభుత్వ పాలన తెలుగులో జరగకపో వడం. అక్షరాశ్యులకూ, నిరక్షరాశ్యులకూ అందరికీ అర్థ మయ్యే తెలుగులో గానీ, ఇంగ్లీషులో సాగడం. ప్రభుత్వం ఇప్పుడు తెలుగులోనే సాగిస్తానంటోంది. ఇది సవ్యంగా అమలుజరిగితే అంతకంటే కావలసింది లేదు. ఏమైనా మనకు కావలసింది భాషా దురభిమానం కాదు. వాస్తవ పరి స్థితుల్ని గుర్తించాలి. తెలుగు భాషాభివృద్ధికి వాస్తవిక చర్యలు చేపట్టడం. అదే సమయంలో పరభాషల్నీ ఆదరిం చడం. బహుభాషల్ని అధ్యయనం చెయ్యడం నేటి గ్లోబల్ యుగంలో ఎంతైనా అవసరం.

ఏమైనా భాషావాదులు గుర్తించాల్సిన అంశం పాఠశాల స్థాయిలో భాషను తప్పుల్లేకుండా రాసేలా చెయ్యడం, మంచి సాహిత్యం పట్ల వారిలో ఆసక్తిని కలిగించేలా పాఠాల్ని రూపొందింపజేయడం! భాషా సాహిత్యాలే వ్యక్తి సంస్కారాన్ని తీర్చిదిద్దుతాయి. మన పాఠ్యగ్రంథాల్లో, ముఖ్యంగా భాషాజ్ఞానం పెంపుకోసం అందించే ప్రాచీన పాఠ్యభాగాల్లో కుల, మత, పురుష దురహంకారాలను, మూఢ నమ్మకాలను, సెక్స్‌ని ప్రేరేపించే భాగాల్ని తొలగింప జేసి, నైతికత, వ్యక్తి సంస్కారాన్ని వృద్ధిచేసే పాఠ్యాంశాల్ని ప్రవేశపెట్టేలా ఒత్తిడి తీసుకురావాలి! అలాగే రిజల్ట్స్ ప్రధాన మైన విద్యగాక, నాణ్యతే ప్రధానమైన చదువుకావాలని ప్రభు త్వాలపై ఒత్తిడి చెయ్యాలి!

చివరిగా ఒకమాట! ఎస్సీ, ఎస్టీ, బి.సిల అభివృద్ధికోసం పాటుబడుతున్నామని చెబుతున్న కొందరు మేధావులు- ఆంగ్ల భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, తెలుగు అభి వృద్ధికోసం తీసుకునే చర్యలన్నీ పైన పేర్కొన్న వర్గాల అభి వృద్ధిని అడ్డుకునే కుట్రలో భాగమనీ, అందువల్ల ఆంగ్ల భాష అమలుకోసం ఉద్యమాలు నిర్వహిస్తామని చెబుతున్నారు. ఆంగ్లభాష ప్రజల అభివృద్ధికి ఎంతవరకు ఉపకరిస్తుందో అంతవరకూ ఉపయోగించుకోవాల్సిందే. కానీ అలా చెయ్యాలన్న ఉద్దేశంకాస్తా, ఆంగ్లంపై మోజుగా, ఇంకా చెప్పాలంటే ఆంగ్లంపై గుడ్డి భక్తిగా, అలాగే తెలుగుపై ద్వేషంగా వ్యక్తంచెయ్యడం అభ్యంకరకరం! ఒకవేళ వీరు ఉద్యమాలుచేస్తే ఏ భాషలో చేస్తారు? ఆంగ్లం రాని సామాన్య, నిరక్షరాస్య జనానికి ఆంగ్లంలోనా?

- ఎన్. వి.ఎస్. నాగభూషణాచార్యులు,
పాలకొల్లు, 9493474836

పరభాషా ఆధిపత్యాన్ని అరికడదాం

ఎక్కడ ఆధిపత్యం ఉన్నా సరే, అది పక్కనున్న దాన్ని అణచివేస్తుంది. అసలు అపుడే ఆధిపత్యం అంటాం కదా. ఇది ఏ ఒక్కరి ఆస్తిపాస్తులలోనూ, ఓరెండిళ్ళ మధ్య ఏర్పడితే ఫర్వాలేదు కాని అదే ఒక జాతి మాట్లాడే భాషకు జరిగితే ఆ దేశాభ్యుదయానికే నష్టం వాటిల్లుతుంది. ఒక భాషపై మరొక భాష ఆధిపత్యం సాగిస్తే ఆ భాష మాట్లాడే వారందరిపైనా దీని ప్రభావం ఉంటుంది. ఈ భాషాధిపత్య ధోరణి ఎక్కడకు తీసుకెళ్లుతుంది అంటే అణచివేయ బడుతున్న భాషాఉనికిని నామమాత్రం కూడా లేకుండా చేసేయ్యగల శక్తి దీనికి ఉంటుంది.

దానివల్లే ఇపుడు పెత్తనం సాగిస్తున్న ఆంగ్లం మీద కత్తినూరాల్సిన అవసరం ఏర్పడింది. అవసరం ఎంతవరకో అంతవరకు పరాయిభాషను ఆహ్వానిస్తే ఎవరికీ ఏమాత్రం బాధ ఉండదు. కాని, అవసరం ఉన్నా లేకున్నా ఊరికినే వస్తే.... అన్న సామెత లాగా ఏదో ఒక సాకును అడ్డుపెట్టుకుని పరాయి భాషను నెత్తిన పెట్టుకోవడంతో ఒక జాతి మొత్తానికి ఇటువంటి పరిస్థితులు ఏర్పడకుండా పూడ్చలేని తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది.

ఒక జాతి వికాసం ఆ జాతి జనులు మాట్లాడే భాషపైనే ఆధారపడి ఉంటుంది. ఈ భాషను కాపాడుకుంటుంటేనే తనదైన ప్రత్యేకతను సమాజంలో నిలబెట్టు కొంటుం దా జాతి. ఒక జాతి తన నుడిని కాపాడుకుం టే ఆ జాతికి సంబంధించిన సంస్కృతి, సంప్రదాయం, సాహిత్యం తర్వాతి తరాలకు అందించ బడుతాయి. లేకుంటే ఆ జాతి వికాసమార్గంలో సంఘర్షణకు గురై ఇతరులకు దాసోహ మనడానికి అవకాశాన్ని కల్గిస్తుంది. అంతేకాక, పాలితులభాష ఒకటిగాను, ప్రజలభాష మరొకటి ఉండటం వల్ల కూడా ప్రభుత్వం చేయదల్చుకున్న అభివృద్ధి కారక చర్యలు అమలు కావడంలో కూడా జాప్యం, ఒక్కొక్కసారి అసలు ఆ పథకమే నీరు కారిపోయే పరిస్థితులు ఏర్పడ్డా ఆశ్చర్యమేమి ఉండదు. కూజాలో కుక్కు పాయసం పెట్టిన రీతిగా ప్రభుత్వ పథకాలు అందవలసిన వారికి అందకుండా పోతాయి.

ఉండాలంటే ఏ జాతి జనులైనా వారి వారి నుడులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ నుడి ద్వారానే మానవుని సామాజికావసరాలు తీరిన నాడు కాపాడనవసరం లేదన్నా సరే ప్రతి ఒక్కరూ నుడిని జాగ్రత్త చేస్తారు. అది అనాయాసంగా దానికదే నుడి రక్షించబడుతుంది. కాని ఈ పరిస్థితి రావడానికి జనులతో పాటుగా ప్రభుత్వం, సంస్కరణ వాదులు, ఉద్యమ కారులు కలసి పనిచేసి బహుముఖాలుగా భాషను అన్నిరంగాలలోనూ చొప్పించాలి.

పుట్టిన శిశువు దగ్గరన్నుంచి కూడా నేర్చు కోకుండా వచ్చేదే మాతృభాష కనుక ఈ భాష తోనే దేనినైనా సాధించే వీలును కలిగించాలి. నుడి మౌలికతను కాపాడుకుంటూనే ఆధుని కతను ఆహ్వానించే నేర్పును నుడిలో కల్పించే వెసులుబాటును కలిగించుకోవాలి. రాతి యుగం నుంచి మానవుడు ఏవిధంగా క్రమ పరిణామంలో ఎదుగదల చూపించాడో అలానే భాషలో కూడా నుడిని ఇతర భాషా పదాలను తెలుగునుడి గా మలుచుకుంటూ భాషాసంపదను ఎప్పటికప్పుడు పెంచు కుంటా ముందుకు పోవాలి. అపుడే నుడి విస్తరిస్తుంది.

ఉదాహరణకు ఇంతకు ముందుకాలంలో హరికథ అంటే కేవలం వైకుంఠ వాసుడైన హరికి సంబంధించిన గాథలను మాత్రమే తెలిపేది పదంగా ఉన్నప్పటికీ సామాజికాభి వృద్ధిలో భాగంగా హరికథ అన్న పదం అర్థ విపరిమాణం చెంది ఆ పదమే ఒక కళా రూప నామంగా పరిణామం చెందింది. అలా ప్రతి తెలుగు పదమూ ఉపయోగపడేదే. ఇపుడు వాడుక తగ్గి జారి పోయాయనే పదాలను ఏరి వాటికిఇప్పటిఅవసరాలకు పనికివచ్చే లాగు కొత్తరూపునిస్తే నుడిసంపదకు కొదువ ఉండదు. కొత్త పదాలను కనిపెట్టడమే కాకుండా మనం వదిలేసిన పదాలను మళ్ళీ కూడగట్టే పనిని కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. అపుడే తెలుగుపై ఆంగ్ల ఆధిపత్యాన్ని అరికట్టవచ్చు.

- రామదాసు, కేరళ

భాషా పరతంత్రులుగా మార్చిన ఆంగ్ల మాధ్యమం

ఏనాడో ఈ దేశాన్ని తెల్లోడు పాలించాడు. తన పాలనలో సౌలభ్యం కోసం ఈ దేశంలో ప్రాంతీయ భాషల స్థానంలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టాడు. అలా ఆంధ్ర దేశంలో నాడు మన మాతృభాషాస్థానాన్ని ఆంగ్ల భాష ఆక్రమించింది.

విద్యా విషయకంగా మాధ్యమ విషయంలో ఆంగ్లేయులు వదిలి వెళ్లిన ఈ వ్యాపార సంస్కృతినే నేడు ఖర్చులేని గొప్ప ఆదాయ వనరుగా మన పెట్టుబడిదారులు భావిస్తున్నారు. మాతృభాషా మాధ్యమంలో విద్యను అందిస్తే అది లాభార్జ నకు అనుకూలంగా లేదు. భాష అనే వస్తుపరంగా కొత్తదనం కనిపించదు. అందుకే నేడు ఆంగ్ల భాషా మాధ్యమం పేరుతో వస్తుపరంగా కొత్తదనాన్ని చూపిస్తున్నారు. ఇది ప్రైవేటు విద్యా వ్యాపార రంగంలో కలిసి వచ్చిన అంశంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే విద్య విషయంలో వ్యాపార సంస్కృతి వాడవా డలా సందులో గొందులో విజృంభించింది. 'ఇంతింతై వటు డింతై' అన్న రీతిలో పెరిగిపోయింది. మఱ్ఱిచెట్టు ఊడలు నేలలో పాతుకుపోయినట్లు ఈ విష సంస్కృతి గట్టిగా వేళ్ళా నుకొంది.

నేడు సమాజపు పోకడను పరిశీలిస్తూ చాలామంది తమ బిడ్డలను తెలుగు మాధ్యమంలోకి చేర్చలేని స్థితిలో ఉన్నారు. అలాగని ఆంగ్ల మాధ్యమంలోకి చేర్చినా కుటుంబ పరిసర వాతావరణం వీరికి సహకరించడంలేదు. విషయ అవగాహన చేసుకోలేని దుస్థితిలో ఉన్నారు. ఇలా పెట్టుబడిదారులు ఆంగ్ల మాధ్యమం ద్వారా చిత్ర విచిత్ర వ్యాపార సంస్కృతిని సృష్టించారు. అది నేడు ప్రభుత్వాన్ని- ఇటు సామాన్య ప్రజలను- విద్యార్థులను అయోమయానికి గురిచేసింది. నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచని పరిస్థితి కల్పించింది.

నిజానికి ప్రభుత్వరంగంలో ప్రతి సం. ఉపాధ్యాయ, కళా శాల ఉపన్యాసక, గ్రూప్-1, గ్రూప్ -2, గ్రూప్-3, గ్రూప్-4, రక్షక భట నియామకాలు జరుగుతున్నాయి. కొన్ని వేల ఖాళీలు ఆయా శాఖలలో భర్తీ చేయబడుతున్నాయి. ఇలా గ్రామ స్థాయినుంచి సచివాలయ స్థాయి వరకు జరిగే అన్ని నియామకాల్లో ఎక్కడా ఆంగ్ల మధ్యమంలో చదవాలనే నియమం లేనేలేదు. అలాగే కేంద్ర స్థాయిలో జరిగే అత్యున్నత సివిల్ సర్వీసు పరీక్షలో కూడా తమ తమ మాతృభాషలలో రాసుకొనే వెసులుబాటు ఉండనే ఉంది. ఇలా రాష్ట్ర స్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు లక్షల ప్ర

కైలాసనాథ ఆలయం

విశేషాలు

మన దేశంలో భారీ బండరాళ్లను కోసి నిర్మించిన దేవాలయానికి ఉత్తమ ఉదాహరణ- రాష్ట్రకూట మహారాజు కృష్ణ (756-773 ఎ.డి) హయాంలో ఔరంగాబాద్ సమీపంలోని ఎల్లోరాలో నిర్మించిన కైలాసనాథ ఆలయం. ఇక్కడి గర్భగుడి, ధ్వజస్తంభం, చిన్న ఆలయాలు, ముఖద్వారం మొదలైనవన్నీ బండరాళ్లను ముక్కలుగా చేసి నిర్మించారు. ఈ ఆలయం యావత్తూ రాళ్లను అందంగా మలిచి పూర్తి చేశారు. ఇటుక నిర్మాణం వలే కాక, పని ఎగువ నుండి ప్రారంభమై దిగువ పునాదికి చేరుతుంది. కనుక రవాణా సమస్యకానీ, పరంజా సమస్య కానీ తలెత్తదు. అందుకే ఎల్లోరా ఆలయం ఓ అద్భుత నిర్మాణంగా నిలిచింది.

- ఎ.రాంబాబు

సిసింద్రి

sisindri@andhrabhoomi.net

12

ఆంధ్రభూమి

శనివారం
23, ఫిబ్రవరి
2013

వీకెండ్ క్విజ్-451

వీరిద్దరూ ఎవరు?

మీ జవాబులను కార్డుపై రాసి పంపించండి. సరైన సమాధానాలు రాసిన వారిలో ఒకరిని డ్రాలో ఎంపిక చేసి రూ. 100 బహుమతి అందిస్తాం.
చిరునామా: సిసింద్రి, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

క్విజ్-450 సమాధానాలు

- కేంద్ర మంత్రి వై. కిశోర్ చంద్ర దేవ్
- దక్షిణాఫ్రికా 'బ్లేడ్ రన్నర్' ఆస్కార్ పిస్టోరియస్

విజేత

పాలడుగు పద్మజ, W/o పి. సతీష్,
ప్లాట్ నెం. 178/301,
మోతీనగర్, హైదరాబాద్- 500 018.

సరైన సమాధానాలు రాసిన వారిలో కొందరు

రాజోలి సరళకుమారి, హైదరాబాద్
పి.దేవదాస్, గుంటూరు
తూపిలి భారతి, హైదరాబాద్
మ్యాదం శ్రీనివాస్, బోరబండ
పి.పరశురామయ్య, పూళ్ళ
ఇనగంటి నందిని, అప్పికట్ల
బెల్లంకొండ చంద్రిక, భర్తిపూడి
కంభంపాటి గోపాలకృష్ణ, మర్రిపూడి
కొనరాజు తుషారబిందు, చింతలపూడి
బి.ప్రసన్న, మేడికొందూరు
నూతక్కి వైజయంతి, తుళ్ళూరు
యలవర్తి నుగుణ, మాచవరం
వీరవల్లి రాఘవమ్మ, కావూరు
చంద్రవెంకయ్య, బాపట్ల
కందేపు భావన, బాపట్ల
తుమ్మల రఘునాథరాయలు, హైద్రాబాద్
చిగురుపాటి పద్మజ, మోతీనగర్
కందేపు తులశమ్మ, భర్తిపూడి
కందిగట్ల సంగీత, హైదరాబాద్
పాలడుగు సరోజిని, బోరబండ
బెల్లంకొండ మనోజ్‌సాయి, భర్తిపూడి
మక్కపాటి అందాలు, మోతీనగర్
కాకరపర్తి మంజుల, చీరాల
దాసరి శబల, నిడుబ్రోలు
కడవకుదురు రమణమ్మ, అప్పికట్ల
కూచిపూడి మనోహరరావు, అప్పికట్ల
కందిగట్ల జయశ్రీ, అవంతినగర్
మార్కస్ మణిరాజ్, ముద్దనూరు
యం.ఎన్.అనిల్‌కుమార్, పెనుకొండ
కె.హేమ, నర్సీపట్నం
మేకల సుబ్రమణ్యం, పుత్తూరు
బి.ఎస్.కె.చక్రవర్తి, తిరుపతి
శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్
చిగురుపాటి సుప్రియ, బోరబండ
చంద్ర సుబ్బారావు, బాపట్ల
కుర్రా మాధవి, బాపట్ల
శ్రీహర్షవర్ధన్, హైదరాబాద్
బి.వద్మ, సికింద్రాబాద్
చంపాక అచ్యుతరామరాజు, మర్రిపూడి
వలివేటి లక్ష్మినారాయణ, మర్రిపూడి
గుమ్మడి సింహాద్రి, హైదరాబాద్
కుర్రా శకుంతల, భర్తిపూడి
బెల్లంకొండ హరి, అప్పికట్ల
మన్నె సుశీల, ఈతేరు
అచంట సుభాషిణి, బాపట్ల
రామకూరు మనోజ్‌కుమార్, శ్రీకాకుళం
టి.వి.డి.ఎన్.సీతారామారావు, విజయవాడ
కోట ప్రసాదరావు, వెల్వెండ
కాజా లక్ష్మీకామేశ్వరి, గుంటూరు
కె.సుభాషిణి, బాపట్ల
కోట ప్రియదర్శిని, వెల్వెండ
మల్లెల వీరాంజనేయులు, చిలకలూరిపేట
ఉలాపు బాలకేశవులు, గిద్దలూరు
బి.వి.హెచ్.కె.శాస్త్రి, గుంటూరు
గంగారపు జీవన్‌కుమార్, వైదుకూరు
గొడవర్తి బాపయ్యగుప్త, పొన్నూరు
వులాపు బాలకేశవులు, గిద్దలూరు
ఎం.సౌందర్య సుధ, ముగ్గళ్ళ
కె.మురళీకృష్ణ, చీరాల
శ్రీమాన్ శ్రీకాశ్యప, సింహాచలం
అంబటి ఎ.నాయుడు, కొత్తగూడెం
దాసారపు ఎల్లయ్య, యాదగిరిగుట్ట
ఎన్. అంజనేయులు, రామచంద్రపురం

ఆటోగ్రాఫ్



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం
ప్రముఖ నేపథ్య గాయకుడు

చుట్టపు సాంగత్యం

కథ

రామాపురంలో నివసించే సుమిత్రకు ఒక్కడే కొడుకు. పేరు వినయ్. సమీపంలోని టౌన్‌లో ఏడవ తరగతి చదువుతున్నాడు. సుమిత్రకు భర్త లేడు. దుస్తులు కుట్టి జీవిస్తూంటుంది. కొడుకుని బాగా చదివించి అభివృద్ధిలోకి తీసుకురావాలని అహర్నిశలూ కష్టపడుతోంది. తల్లి పడే కష్టం గమనించి వినయ్ స్కూల్ నుంచి రాగానే బావిలో నీళ్ళు తోడటం, పొయ్యిలోకి కట్టెలుకొట్టి ఇవ్వటం వంటి పనులుచేస్తూ సాయపడుతూండే వాడు. చక్కగా చదువుతూ, క్రమశిక్షణతో ఉంటూ పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఎంతో అభిమాన పాత్రుడయ్యాడు.

ఆ రోజు తెలుగు పీరియడ్ జరుగుతోంది. మాస్టారు రాజు అనే విద్యార్థిని దగ్గరకు పిలిచి, ''ఏరా రాజూ! నాలుగురోజుల నుంచి పాఠశాలకు రావటం లేదేం?''అని అడిగారు.

''మా నాయనమ్మ చనిపోయింది సార్!'' అన్నాడు రాజు.

''మొన్ననే కదరా.. మీ నాయనమ్మ చనిపోయిందని బడి ఎగ్గొట్టావు. మీ నాయనమ్మ నెలకు ఎన్నిసార్లు చనిపోతుందేమిటి? దొంగవెధవా!'' అంటూ మాస్టారు రాజు అరచేతిమీద బెత్తంతో ఛెళ్ళున కొట్టారు.

మాస్టారు రాజుని కొడుతూంటే వినయ్ గుండె దడదడా కొట్టుకుంది. భయంతో కాళ్ళు వణికాయి. మాస్టారి ముఖంలో కోపం చూడటమంటే భయం వినయ్‌కి. ఆయనకి కోపం రాకుండా చెప్పినట్లు నడచుకునేవాడు. రాజు మాత్రం మాస్టారు కొట్టే దెబ్బలను మిఠాయి తిన్నంత తేలికగా భరించేవాడు.

''ఈ పీరియడ్ అంతా క్లాస్ బయట ఎండలో నిలబడు. ఇదే నీకు శిక్ష'' అని చెప్పి పాఠం చెప్పటంలో మునిగిపోయారు మాస్టారు. క్లాస్ అయిపోయినట్లుగా బెల్‌కొట్టారు. పిల్లలందరినీ భోజనానికి వదిలారు.

రాజు తన్నులు తినటమే కాకుండా పీరియడ్ అంతా ఎండలో నిలబడి ఉండటం చూసి జాలేసింది వినయ్‌కి. ''నువ్వు క్యారేజీ తెచ్చుకోలేదా?'' అని అడిగాడు. రాజు తల అడ్డంగా ఊపాడు.

''నేను తెచ్చుకున్నాను. ఒక బాక్స్ నీకిస్తాను. తిందువుగాని రా!'' పిలిచాడు వినయ్.

ఇద్దరూ చెట్టుకింద కూర్చుని చెరొక బాక్స్‌లోని అన్నం తినసాగారు. ''నువ్వు రోజూ బడికి వచ్చి చదువుకుంటే మాస్టారు కొట్టరు కదా!'' సానుభూతిగా అన్నాడు వినయ్.

''సాయంత్రం దాకా కదలకూడదు, మెదలకూడదు, పక్కవాళ్ళతో మాట్లాడకూడదు. పనికిమాలిన పాఠాలన్నీ బట్టీపట్టాలి. ధూ! నాకసలు ఇష్టమే లేదు. మా నాన్న పోరు పడలేక బడికి వస్తున్నా!'' అన్నాడు రాజు.

''బడికి రాకుండా ఏం చేస్తావు?''

''సినిమాలు చూస్తాను.''

''సినిమాలా..?''

''అవును... నువ్వు చూడవా?''

''ఊహూ...''

''మీ అమ్మ పంపించదా?''

''మా అమ్మ కూడా చూడదు... ఇంతకీ సినిమాలు చూడడానికి నీకు డబ్బు ఎక్కడిది?'' వినయ్ అడిగాడు.

''మా నాన్న నిద్రపోయేటప్పుడు జేబులో నుంచి తీసుకుంటాను. ఒక్కోసారి పేకాటలో గెలుచుకుంటాను'' అన్నాడు రాజు.

''పేకాట ఆడతావా?''

''అవును. ఊరుబయట పాడుబడిన సత్రం లేదూ! అక్కడ ఆడతాం.''

''ఇవన్నీ చేయటం తప్పు కాదా?''

''ఊహు. ఏమౌతుంది?''

''దేవుడికి కోపం వస్తుంది. కళ్ళుపోతాయని మా అమ్మ చెప్పింది.''

రాజు ఫకాలున నవ్వాడు. ''నేను ఎన్నిసార్లోచేశాను. మరి నా కళ్ళు పోలేదేం?'' కళ్ళు పెద్దవి చేసి చూపిస్తూ అన్నాడు.

''నువ్వు వట్టి పల్లెటూరి మొద్దువి. ఎక్కడికీ వెళ్ళవు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడవు. ఇల్లు, బడి తప్ప నీకేం తెలియదు'' అన్నాడు రాజు.

వినయ్‌కి దిగులేసింది. రాజు చెప్పేవన్నీ నిజంగానే తనకు తెలియవు. రాజు తెలివి కలవాడు. అన్ని విషయాలూ తెలుసు.. అనుకున్నాడు.

ఇద్దరూ అన్నం తినటం పూర్తి చేశారు. పంపు దగ్గర బాక్స్‌లు కడుక్కున్నారు. ''ఈసారి నిన్ను సినిమాకి తీసుకువెళతాను. భలేగా ఉంటుంది. డబ్బు అవసరం లేదులే! ఇంటర్వెల్‌లో గేటు తీస్తారు కదా! జనంతోపాటు లోపలికి దూరి వెళ్ళవచ్చు. వస్తావా?'' అన్నాడు రాజు. వినయ్ వస్తానన్నట్లు తలూపాడు.

''ఒక్క నెలరోజులు నాతో ఉన్నావంటే ఊరంతా లిప్పి చూపిస్తాను. నిన్ను తెలివిగలవాడిగా చేసేస్తాను.'' అన్నాడు రాజు. వినయ్ మనసంతా సంతోషంగా నిండిపోయింది. ''అలాగే!'' అన్నాడు ఉత్సాహంగా.

అప్పటినుంచీ రాజు వినయ్‌ని ప్రతిరోజూ తనతో తిప్పుకోసాగాడు. వినయ్ కూడా పేకాట నేర్చుకున్నాడు. ఇద్దరూ ఊరంతా తిరిగేవారు. వినయ్ అలస్యంగా ఇంటికి వచ్చి ఏమేో అబద్ధాలు కల్పించి చెప్పేవాడు.

ఒకరోజు ఇద్దరూ ఊరి చివర సత్రం నుంచి పేకాట ఆడి తిరిగి వస్తున్నారు. సిగ్నల్ కోసం రైలు ఆగిఉంది. ''ఒరేయ్! మనం ఇక్కడ రైలు ఎక్కి స్టేషన్‌లో దిగుదాం. నడిచే పనిలేకుండా హాయిగా వెళ్ళవచ్చు''అన్నాడు రాజు.

ఇద్దరూ రైలు ఎక్కారు. సిగ్నల్ ఇవ్వటంతో రైలుబయలుదేరింది. రైలు వెళుతూంటే చల్లటి గాలి వస్తూంది. ఇద్దరికీ హుషారుగా ఉంది. రైలు కాసేపటికి స్టేషన్‌లో ఆగింది. రైలు దిగి బయటకు వస్తూంటే గుమ్మం దగ్గర టి.సి. ఆపి ''టిక్కెట్'' అన్నాడు.

టి.సి.ని చూడగానే వినయ్ తెల్లమొహం వేశాడు. రాజు గభాలున పరుగు లంకించుకుని జనంలో కలిసిపోయాడు.

టి.సి. వినయ్‌ని రైల్వే పోలీసులకి అప్పచెప్పాడు. వినయ్‌కి ఏడుపువచ్చింది. ''టిక్కెట్ లేకుండా ప్రయాణం చెయ్యటం నేరం అని తెలియదా? మేం విచారణ జరిపేదాకా బయటకు వెళ్ళటానికి వీల్లేదు'' అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

వినయ్ బిక్కచచ్చిపోయినట్లు ఉండిపోయాడు. గేటుదగ్గర కానిస్టేబుల్ తుపాకీ పట్టుకుని నిలబడి ఉన్నాడు. పారిపోవటానికి అవకాశం లేదు. వినయ్ కిటికీలోనుంచి దిగాలుగా చూస్తూ గోడదగ్గర నిలబడి ఉన్నాడు.

ఇంతలో రైలువచ్చింది. ప్రయాణీకులు ఎక్కుతూ, దిగుతూ ప్లాట్‌ఫాం అంతా కోలాహలంగా మారింది. సూట్‌కేస్ పట్టుకుని రైలు దిగి వెళుతున్న ఒకాయనను చూడగానే ''మాస్టారూ!'' అని వినయ్ అరిచాడు సంతోషంగా.

తెలుగు మాస్టారు ఇటువైపు చూసి ''అరె..! వినయ్! నువ్వా! ఇక్కడున్నావేం?'' ఆశ్చర్యంగా దగ్గరికి వస్తూ అడిగాడు. సిగ్నల్ దగ్గర రైలు ఆగటం, ఇద్దరూ ఎక్కటం, రాజు పారిపోవటం క్లుప్తంగా చెప్పాడు వినయ్.

మాస్టారు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు.

''ఏయ్.. అబ్బాయ్..! ఈసారికి వదిలేస్తున్నాను. మళ్ళీ ఎప్పుడైనా ఇలా చేశావా జైలుకే!'' అన్నాడు ఇన్‌స్పెక్టర్. వినయ్ చేతులు కట్టుకుని వినయంగా తలూపాడు.

''మా ఇంటికి వెళదాం రారా! లగేజీ ఇంట్లోపెట్టి నిన్ను మీ ఇంటి దగ్గర దింపుతాను'' అన్నారు మాస్టారు.

ఇద్దరూ ఇంటికి వచ్చారు. మాస్టారు వినయ్‌ని కాళ్ళూ, మొహం కడుక్కుని రమ్మన్నారు. ఆపిల్‌కాయ ముక్కలు కోసి అందించారు.

''ఈ మధ్య నువ్వు బడికి సరిగ్గా రావటం లేదేం? చదువుపై కూడా నీకు శ్రద్ధ తగ్గిపోయింది'' అడిగారు.

వినయ్ రాజుతో పరిచయమైన దగ్గర్నుంచి జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పాడు. మాస్టారు అంతా విన్నారు.

''కొంతమంది ఎక్కువగా మాట్లాడకుండా రిజర్వుడుగా ఉంటారు. అది తమలో ఉన్న సంస్కారం అని తెలుసుకోలేక లోపంగా భావించి బాధపడుతూ ఉంటారు. రాజుమీద జాలి పడి అన్నం పెట్టావు. వాడేం చేశాడు? నువ్వు ఆపదలో ఉన్నప్పుడు నిన్ను వంటరిగా విడిచి తనదారి తను చూసుకున్నాడు. దుష్టులతో సాంగత్యం ఎప్పటికైనా చేటు కలిగిస్తుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నీ మేలు కోరేవారు. వారు చెప్పినట్లుగా చేస్తే మంచి జరుగుతుంది'' అన్నారు.

''ఇంకెప్పుడూ తప్పు పనులు చేయను సార్! మీరు చెప్పినట్లే నడుచుకుంటాను''అన్నాడు వినయ్ పశ్చాత్తాపంతో.

- గోనుగుంట మురళీకృష్ణ

మానవ శరీరం



మన శరీరం మీది చర్మాన్ని వొలిచి తూకం వేయగలిగితే మూడు కిలోల బరువు ఉంటుంది. ఇందులో సంవత్సరానికి ఒక కిలో చొప్పున రాలిపోతుంటే మరలా కొత్త చర్మం పుట్టుకొస్తుంది.

మన శిరస్సు మీద సుమారు ఒక లక్షా ఇరవైవేల వెంట్రుకలు ఉంటాయి. జ్ఞానేంద్రియాలు అందించే సమాచారంలో మెదడు ఒక శాతం మాత్రమే జీర్ణించుకుంటుంది. మిగిలినవి సమసిపోతాయి.

శరీరంలో పది లక్షల కోట్ల జీవ కణాలు ఉన్నాయి. మన శరీరంలోని కండరాలన్నిటిలోకి గుండె చాలా దృఢమైనది. విశ్రాంతి తీసుకోకుండా ఏళ్ళ తరబడి పనిచేస్తూనే ఉంటుంది. మన ఆయువు డెబ్భై సంవత్సరాలు నిండేసరికి ఐదు మిలియన్లపాటు గుండె కొట్టుకుంటుంది.

శరీరంలో ఎర్రరక్త కణాలు నాలుగు నెలల కాలం జీవిస్తాయి. ఈ నాలుగు మాసాలలో అవి పదిహేను వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తాయి. జీవితకాలంలో శరీరం సగటున నలభయి టన్నుల ఆహారాన్ని తీసుకుంటుంది. ఐదు లక్షల ఘనపుమీటర్ల గాలిని పీలుస్తుంది. నోటిలో పదివేల గాలన్ల లాలాజలం ఊరుతుంది.

మన ఉదరం పొడవు నిజంగా జానెడే ఉంటుంది. అంటే పది అంగుళాలు మాత్రమే. మన పొట్టలో జీర్ణప్రక్రియకు ఉపయోగపడే జఠర రసాలలో ఉదహరికామ్లం ఒకటి. దీనిని ఒక గొట్టంలో జాగ్రత్తగా బయటకు తీసి ఒక దుంగమీద వేస్తే అది కాలిపోతుంది. అందుకే జఠరాగ్ని అని పేరు వచ్చింది.

మన తెలివికీ, మెదడులో ఉన్న జీవకణాలకు అవినాభావ సంబంధం ఉంది. చిన్న కీటకం మెదడులో ఇరవై ఐదు కణాలు, చీమకు రెండు వందల యాభై, తేనెటీగకు వెయ్యి ఉంటే- మన మెదడులో పది బిలియన్ల జీవకణాలు ఉంటాయి.

మన చెవులకు అన్ని శబ్దాలు వినిపించవు. లేకుంటే గాలిలో తేలియాడే అణువులు ఒకదానికొకటి ఢీకొన్నపుడల్లా ఆ శబ్దానికి మెదడు చిద్రమవుతుంది. మెదడులో ఉన్న కణాల సంఖ్య పెరిగిన కొద్దీ ఆ వ్యక్తికి తెలివితేటలు అధికమయ్యే ఆస్కారం ఉంది. కానీ, మెదడులో ఉన్న కణాలు రోజుకు యాభై వేల చొప్పున నశించిపోతాయి. అంటే డెబ్భయి ఏళ్ళ జీవితంలో 1.3 బిలియన్ల కణాలు తగ్గిపోతాయి. కనుక వయసు పెరిగే కొద్దీ తెలివితేటలు తగ్గాలి. అయినప్పటికీ వృద్ధులను తెలివైనవారిగానే పరిగణిసాం. ఎందుకో తెలుసా? పుట్టుకతో చూస్తే మెదడు సైజు పదవ వంతు తగ్గినా, అనుభవం ఎక్కడికి పోతుందని? అందుకే వృద్ధులను మనం గౌరవిస్తాం.

-ఎ.లక్ష్మీ సువర్చల

రంగులు నింపండి



గురుత్వాకర్షణను లెక్కచేయని గింజ

చేసి చూద్దాం

ఒక అడుగు పొడవుగల దారాన్ని తీసుకోవాలి. ఒక కొనకు వేరుశనగ గింజను కట్టాలి. టేబుల్ అంచుకు రెండవ కొనను టేపు సహాయంతో అతికించాలి. అంచునుండి వేలాడదీసిన దారం రెండవ కొననుండి గింజ కింది వైపు వేలాడుతూ ఉంటుంది.



ఒక రబ్బరు బెలూన్‌ను గాలితో ఊదిన దానిని తీసుకోవాలి. దానిని ఉన్ని లేదా ఊలు లేదా మీ తలమీద గల పొడి జుట్టుతో రుద్దాలి. ఇప్పుడు బెలూన్ విద్యుదావేశితం కాబడుతుంది. దానిని వేరుశనగ గింజవద్దకు తీసుకురావాలి.

వేరుశనగ గింజను బెలూన్ ఆకర్షిస్తుంది. అయితే ఈ రెండూ కలవకుండా ఉండే విధంగా బెలూన్‌ను తగినంత దూరంలో ఉంచాలి. ఆ రెండూ కలిస్తే అనవసరంగా వాటి నడుమ విద్యుదావేశం బదిలీ అవుతుంది. ఇప్పుడు బెలూన్‌ను పైకి ఎత్తుతూ తీసుకువెళ్లాలి. వేరుశనగ గింజ కూడా బెలూన్‌తోపాటు గురుత్వాకర్షణను లెక్కచేయకుండా పైకిలేస్తుంది.

వేరుశనగ గింజ తటస్థ విద్యుదావేశం కల్గినది. అంటే దానిలో ధన, ఋణ విద్యుదావేశాలు సమంగా విస్తరించబడి ఉంటాయి. దీని దగ్గరకు ఋణ విద్యుదావేశంగావించబడిన రబ్బరు బెలూన్ తీసుకురాబడినది. ఇది వేరుశనగ గింజలోని ధనావేశాలను బెలూన్ వున్న వైపు ఆకర్షిస్తుంది. ఈ రెండు వ్యతిరేక విద్యుదావేశాలు ఆకర్షించుకుంటాయి.

వేరుశనగ గింజ, దానిని వేలాడదీసిన దారం తేలిగ్గా ఉండడం వలన బెలూన్, గింజల నడుమ ఆకర్షణ బలం ఇటువంటి ఫలితాన్ని కలుగజేస్తుంది.

- సి.వి.సర్వేశ్వరశర్మ

తల్లిదండ్రులను గౌరవించు

స్ఫూర్తి

కూర్మరాజు తను చదివే ఓ పుస్తకాన్ని విసుగ్గా పక్కన పడేయడం గమనించిన వాడి తండ్రి అడిగాడు.

''ఏం? ఆ పుస్తకం లోని కథలు బాగాలేవా?''

'బాలేవు నాన్నా! ఒక్క కథ కూడా నమ్మశక్యంగా లేదు. అన్నీ కల్పితాలే'' కూర్మరాజు జవాబు చెప్పాడు.

''కథంటేనే కల్పితం అని అర్థం. ఇవన్నీ నీ వయసువాళ్ళు నేర్చుకోదగ్గ నీతి కథలు అని దీన్ని నీకు బుక్ ఎగ్జిబిషన్‌లో కొని బహుమతిగా తెచ్చాను. ఆ కథే మిటి?'' అన్నాడు తండ్రి.

''ఇది చైనా కథ. ఒకతను తన భార్య, కొడుకుతో జీవిస్తూంటాడు. అతని తల్లి కూడా వాళ్ళతోనే ఉంటుంది. ఆవిడ చేతులు వణుకుతూంటాయి. అన్నం తినేప్పుడు ఆవిడ అంతా కిందకి వెదజల్లుతూ తింటుంది. తర్వాత శుభ్రం చేయాలంటే కోడలికి విసుగు. ఒకటి, రెండు సార్లు ఆవిడ వణికే చేతిల్లో నిలబడని అన్నం తినే పింగాణీ బౌల్స్ కిందపడి పగిలి పోయాయి. దాంతో ఆవిడ కొడుకు ఇంట్లోని కలపతో ఓ చెక్క బౌల్‌ని చేసి తల్లికి ఇస్తాడు. అందులోనే ఆవిడ అన్నం తింటుంది. కిందపడ్డా అది విరగదు. ఆవిడ అన్నం మెతుకులని కింద పోస్తోందని కోళ్ళకి దాణావేసే పెద్ద పళ్ళెంతో కూర్చోపెట్టి అన్నం పెడుతుంటారు. ఆ పళ్ళేన్ని తర్వాత బయటకి తీసుకెళ్ళి నీళ్ళతో కడుగుతారు.''

''అది చాలా క్రూరమైన పని.'' తండ్రి చెప్పాడు. కానీ, అది సౌకర్యం కదా నాన్నా? కథ చివర్లో ఆ ముసలావిడ మనవడు చెక్కతో ఏదో తయారుచేస్తుండటం చూసి తండ్రి వాడి దగ్గరకి వెళ్ళి చూస్తే తన కొడుకు రెండు చెక్క బౌల్స్‌ని చేస్తున్నాడని గ్రహిస్తాడు. ఎందుకు అవి చేస్తున్నావని అడిగితే, రేపు నువ్వు, అమ్మ ముసలివాళ్ళయ్యాక మీకు తినడానికి బౌల్స్‌ని చేస్తున్నాను- అని జవాబు చెప్పాడు. అది ఏం కథో నాకు అర్థం కాలేదు.

''ఏ కథ చదివినా దాని గురించి కొద్దిసేపు ఆలోచిస్తే ఆ కథ ఏం బోధిస్తుందో అర్థం అవుతుంది. ఈ కథ తన తల్లిదండ్రులను తండ్రి ఎలా చూస్తాడో, పెద్దయ్యాక అతని కొడుకు కూడా అలాగే చూస్తాడనే సత్యాన్ని బోధిస్తుంది. వృద్ధాప్యంలో తను తన పిల్లలచేత చక్కగా చూడబడాలనుకుంటే, తను కూడా తన తల్లిదండ్రులని చక్కగా చూడాలి-అనే నీతిని ఈ కథ బోధిస్తుందని కూర్మరాజుకు తండ్రి వివరించాడు.

''ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే, ఏ సమయంలోనైనా సరే తల్లిదండ్రులని పిల్లలు గౌరవంగా చూడాలనే అన్ని మతాలు బోధిస్తున్నాయి'' అని అంతదాకా వారి సంభాషణని విన్న మీదట కూర్మరాజు నాయనమ్మ చెప్పింది. ఆవిడ నోటి పక్క నించి కారే ఉమ్ముని వాళ్ళ రాజు తండ్రి ఎప్పటిలాగే శుభ్రమైన బట్టతో తుడిచాడు.

-మల్లాది వెంకట కృష్ణమూర్తి

అర్థాల ఆట



కింద ఇచ్చిన తెలుగు పదాల అర్థాల ఆధారంగా ఆంగ్ల పదాలతో గడులు నింపాలి.

ఆధారాలు

అడ్డము

1. కోపము
3. బాడుగ బండి
5. విరోధి
8. వెనుకవైపు
9. ప్రయాణ వ్యయం
11. ఊత
13. కొట్టు
14. సుగంధ ద్రవ్యం

నిలువు

1. వయసు
2. ఇంటి పైకప్పు
4. వధువు
6. మంచుగడ్డ
7. కిరణము
8. కుంచె
10. యజమాని
12. మొత్తము

గత వారం సమాధానాలు

అడ్డం : 1.CHAIN 3. FAT 5. DIE 8. ATOM 9. HORN 11. ARM 13. MAT 14.GREED

నిలువు : 1. CAT 2. NAIL 4. THORN 6. MOB 7. NOW 8. ALARM 10. DRUG 12. MUD

-కైపు ఆదిశేషారెడ్డి

నేను గీసిన బొమ్మ



జి. గాయత్రి | హెచ్.అలేఖ్య | ఎ.ప్రీతి | జి.పవన్‌కుమార్ రెడ్డి | డి.దేవానంద్ | టి.ఆకాష్

వీరంతా విక్టరీతి ఇంగ్లీషు మీడియం పాఠశాల (అనంతపురం) విద్యార్థులు.

కె. మౌనిక, విశాఖపట్నం

జిలేబీ పుడ్డింగ్

కావలసినవి

జిలేబీలు - 6
పాలు - 3 కప్పులు
పంచదార -1/2 కప్పు
కోడిగుడ్లు - 2
యాలకుల పొడి - 1/2 టీ.స్పూ.

తయారు చేసేదిలా

జిలేబీలను రెండు లేదా నాలుగు ముక్కలు చేసుకుని వెన్న రాసిన గిన్నెలో అడుగున పరచాలి. వేరొక గిన్నెలో పంచదార, గుడ్లు కలిపి గిలక్కొట్టాలి. తర్వాత పాలు కొంచెం కొంచెం కలుపుతూ ఉండాలి. చివరిలో యాలకుల పొడి వేసి గిలక్కొట్టి జిలేబీల మీద పోశాక మూత పెట్టాలి. పెద్ద గిన్నెలో నీళ్లు పోసి ఈ పుడ్డింగ్ గిన్నె పెట్టి మూత పెట్టి పొయ్యి మీద ఉంచి 20 నుండి 30 నిమిషాలు ఉడికించాలి. లేదా 150 డిగ్రీల వద్ద వేడి చేసిన ఓవెన్‌లో పెట్టి బేక్ చేయొచ్చు. మొత్తం పుడ్డింగ్ సెట్ అయ్యాక తీసి వేడిగా కానీ, ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా గానీ సర్వ్ చేయొచ్చు.

ఎండు రొయ్యలు, ఎగ్ కర్రీ

కావలసినవి

ఎండు రొయ్యలు	1/2 కప్పు
కోడిగుడ్లు	2
ఉల్లిపాయలు	3
పసుపు	1/4 టీ.స్పూ.
కారం పొడి	1 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి ముద్ద	1 టీ.స్పూ.
కరివేపాకు	1 రెమ్మ
కొత్తిమీర	3 టీ.స్పూ.
ధనియాల పొడి	2 టీ.స్పూ.
గరం మసాలా పొడి	1/4 టీ.స్పూ.
ఉప్పు	తగినంత
నూనె	3 టీ.స్పూ.

చేయండి ఇలా

పాన్ వేడి చేసి ఎండు రొయ్యలు వేసి దోరగా వేయించాలి.

అవి తీసి పక్కన పెట్టి అదే పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇప్పుడు పసుపు, కరివేపాకు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం పొడి వేసి కలపాలి. రెండు నిమిషాలు వేగిన తర్వాత వేయించిన రొయ్యలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. రొయ్యలు కాస్త మగ్గిన తర్వాత అరకప్పుడు నీళ్లు పోసి కలిపి మూత పెట్టి నిదానంగా ఉడికించాలి. మొత్తం ఉడికి చిక్కబడ్డాక గుడ్లను కొట్టివేసి గరిటతో మెల్లిగా కలిపి మూత పెట్టాలి. నీరంతా ఇగిరిపోయాక గరం మసాలా పొడి, సన్నగా తరిగిన కొత్తిమీర కలిపి దింపేయాలి.

కార్న్, ఆలూ కట్లెట్

కావలసినవి

బంగాళదుంపలు - 3
స్వీట్‌కార్న్ గింజలు - 1/2 కప్పు
ఉల్లిపాయ -1 చిన్నది
పచ్చిమిర్చి - 4
కొత్తిమీర - 4 టీ.స్పూ.
అల్లం తురుము - 1 టీ.స్పూ.
బ్రెడ్ స్లైసులు - 4
పసుపు - చిటికెడు
ఉప్పు - తగినంత
నూనె - 1/4 కప్పు

ఇలా చేయాలి

బంగాళదుంపలు, స్వీట్ కార్న్ గింజలు విడివిడిగా కొంచెం ఉప్పు వేసి ఉడికించాలి. చల్లారిన తర్వాత బంగాళదుంపల చెక్కు తీసి పొడి పొడిగా మెదుపుకోవాలి. ఒక గిన్నెలో దుంపలను వేసుకుని ఉడికించిన స్వీట్ కార్న్ గింజలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర, తగినంత ఉప్పు, నీళ్లలో తడిపి, నీరంతా పిండేసిన బ్రెడ్ స్లైసులు కానీ బ్రెడ్ క్రంబ్స్ పొడి కాని వేసి బాగా కలిపి చిన్న ఉండలు చేసుకోవాలి.

చేతులకు నూనె రాసుకుంటూ ఈ ఉండలను కొద్దిగా వెడల్పుగా కానీ కోలగా కానీ వత్తుకోవాలి. పెనం లేదా పాన్ వేడి చేసి ఈ కట్లెట్లను వరసగా పెట్టి నూనె వేసుకుంటూ రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు కాల్చుకోవాలి. ఇష్టముంటే నూనెలో డీప్ ఫ్రై కూడా చేసుకోవచ్చు. లేదా ఓవెన్‌లో గ్రిల్ చేసుకోవచ్చు.

వెజ్ పనీర్ కుర్మా

కావలసినవి

పనీర్	200 గ్రా.
ఉల్లిపాయ	1
టమాటా	2
బీన్స్ తరుగు	1/4 కప్పు
క్యారట్ తరుగు	1/4 కప్పు
బంగాళ దుంప ముక్కలు	1/2 కప్పు
కరివేపాకు	1 రెబ్బ
కొత్తిమీర	కొద్దిగా
పసుపు	1/4 టీ.స్పూ.
కారం పొడి	1 టీ.స్పూ.
కొబ్బరి పొడి	3 టీ.స్పూ.
ధనియాల పొడి	2 టీ.స్పూ.
గరం మసాలా పొడి	1/2 టీ.స్పూ.
ఉప్పు	తగినంత
అల్లం వెల్లుల్లి ముద్ద	1 టీ.స్పూ.
నూనె	5 టీ.స్పూ.

వండండి ఇలా

పనీర్‌ని అంగుళం సైజు ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో రెండు చెంచాల నూనె వేడి చేసి ఈ పనీర్ ముక్కలను వేసి దోరగా వేయించి గోరు వెచ్చని నీళ్లలో వేసి ఉంచాలి. ఇలా చేయడం వల్ల పనీర్ ముక్కలు గట్టిపడకుండా మృదువుగా ఉంటాయి. అదే పాన్‌లో మిగిలిన నూనె వేసి వేడయ్యాక సన్నగా తరిగిన ఉల్లిపాయ వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇందులో కరివేపాకు, పసుపు, కారం పొడి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా వేపి ఒకే సైజులో కట్ చేసుకున్న కూరగాయర ముక్కలు (బీన్స్, క్యారట్ బంగాళ దుంప, టమాటా), తగినంత ఉప్పు వేసి కలిపిమూత పెట్టి మగ్గనివ్వాలి. కూరగాయ ముక్కలు కాస్త మెత్తబడ్డాక కొబ్బరి పొడి, ధనియాల పొడి వేసి కలిపి కప్పుడు నీళ్లు పోసి మూత పెట్టి ఉడకనివ్వాలి. తర్వాత పనీర్ ముక్కలు, గరం మసాలా పొడి, కొత్తిమీర వేసి కలిపి నూనె తేలేంత వరకు ఉడికించి దింపేయాలి. ఇష్టముంటే అరకప్పు పెరుగు చిలికి ఇందులో కలపొచ్చు లేదా అరకప్పు నీళ్లలో కాస్త శనగపిండి కలుపుకుని ఉడికిన కూరలో కలిపితే చిక్కగా అవుతుంది.

రొయ్యల రసం

కావలసినవి

ఎండు రొయ్యలు - 1/4 కప్పు
చింతపండు - 50 గ్రా.
ఉల్లిపాయ - 1
పచ్చిమిర్చి - 2
కరివేపాకు - 2 రెబ్బలు
పసుపు - చిటికెడు
ఎండుమిర్చి - 4
జీలకర్ర - 1/2 టీ.స్పూ.
ధనియాలు - 1 టీ.స్పూ.
మెంతులు - చిటికెడు
వెల్లుల్లి - 4 రెబ్బలు
పంచదార - 1/2 టీ.స్పూ.
ఆవాలు, జీలకర్ర -1/4 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 2 టీ.స్పూ.

వండే విధం

పాన్‌లో వేడి చేసి ఎండుమిర్చి, జీలకర్ర, ధనియాలు, మెంతులు వేసి దోరగా వేయించి చల్లారాక పొడి చేసుకోవాలి. అదే పాన్‌లో ఎండు రొయ్యలు కూడా దోరగా వేయించి ధనియాల పొడిలో కలిపి పొడి చేసుకోవాలి. చింతపండు నీళ్లు పోసి నానబెట్టి పలుచగా పులుసు తీసి పెట్టుకోవాలి. మరీ పలుచగా కూడా ఉండకూడదు. పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి కొద్దిగా వేపాలి. ఇందులో చింతపండు పులుసు పోసి పసుపు, ఉప్పు కరివేపాకు వేసి మరిగించాలి. చారు మరుగుతుండగా రొయ్యలు, ధనియాల పొడి, కొత్తిమీర, పంచదార వేసి మరికొద్దిసేపు మరిగించాలి. పులుపు పోయి కమ్మని వాసన వస్తుండగా వెల్లుల్లి రెబ్బలు నలక్కొట్టి వేసి దింపేయాలి.

క్యారట్ సర్వ పిండి

కావలసినవి

బియ్యం పిండి - 2 కప్పులు
క్యారట్ తురుము - 1/2 కప్పు
ఉల్లిపాయ - 1
పచ్చిమిర్చి - 2
పసుపు - చిటికెడు
కారం పొడి - 1/2 టీ.స్పూ.
కరివేపాకు - 1 రెబ్బ
కొత్తిమీర - 2 టీ.స్పూ.
పల్లీలు - 3 టీ.స్పూ.
శనగపప్పు - 2 టీ.స్పూ.
నువ్వులు - 3 టీ.స్పూ.
జీలకర్ర - 1 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 1/4 కప్పు

తయారు చేసేదిలా

పాన్ వేడి చేసి పల్లీలు, నువ్వులు విడివిడిగా వేయించుకోవాలి. పల్లీలను పొట్టు తీసి బరకగా పొడి చేసుకోవాలి లేదా రెండేసి ముక్కలుగా చేసుకోవాలి. శనగపప్పు నీళ్లలో నానబెట్టాలి. ఒక గిన్నెలో జల్లించిన బియ్యం పిండి, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, క్యారట్ తురుము, జీలకర్ర, వేయించిన నువ్వులు, పల్లీలు, అల్లం వెల్లుల్లి ముద్ద, పసుపు, కారం పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టి అవసరమైనన్ని నీళ్లు కలుపుకుంటూ చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఇది మరీ గట్టిగా కానీ, మెత్తగా కానీ ఉండకూడదు.

మందపాటి గిన్నె లేదా నాన్‌స్టిక్ పాన్ తీసుకుని దాని లోపలంతా పలుచగా నూనె రాయాలి. తడిపి ఉంచుకున్న పిండి మరోసారి మర్ధనా చేసుకుని కొంచెం పెద్ద సైజు ఉండలు చేసుకోవాలి. నూనె రాసిన పాన్‌లో ఒక ముద్ద పెట్టి నూనె రాసిన చేతితో వెడల్పుగా చపాతీలా మరీ పలుచగా కాకుండా, మరీ మందంగా కాకుండా వత్తుకోవాలి. తర్వాత చూపుడు వేలితో అక్కడక్కడా రంధ్రాలు చేయాలి. ఈ రంధ్రాలలో, చుట్టూతా కొద్దిగా నూనె వేసి మంట మీద పెట్టాలి. మూత పెట్టి నిదానంగా ఐదు నిమిషాలు ఉడికించాలి. మూత తీసి మరో ఐదు నిమిషాలు కాల్చుకోవాలి. కావాలంటే మరి కొంచెం నూనె వేసి రొట్టెను రెండోవైపున కూడా కాల్చుకోవచ్చు. అవకాయ లేదా పెరుగుతో వెంటనే సర్వ్ చేయాలి.

కొత్తిమీర పలావ్

కావలసినవి

కొత్తిమీర ఆకులు	1 కప్పు
ఉల్లిపాయ	1
టమాటా	1
పచ్చిమిర్చి	3
అల్లం ముక్క	చిన్నది
పెరుగు	1/2 కప్పు
బియ్యం	2 కప్పులు
గరం మసాలా పొడి	1/2 టీ.స్పూ.
నూనె	2 టీ.స్పూ.
జీలకర్ర	1/2 టీ.స్పూ.

ఉప్పు	తగినంత
లవంగాలు	4
యాలకులు	2
దాల్చిన చెక్క	చిన్న ముక్క
షాజీర	1 టీ.స్పూ.

ఇలా వండాలి

బియ్యం కడిగి పదిహేను నిమిషాలు నాననివ్వాలి. కొత్తిమీర ఆకులు, పచ్చిమిర్చి, అల్లం ముక్క కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో పెరుగు కలిపి పక్కన పెట్టుకోవాలి. మందపాటి గిన్నె లేదా పాన్‌లో నూనె వేడి చేసి జీలకర్ర వేయాలి. అది చిటపటలాడుతుండగా సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి మెత్తబడేవరకు వేపాలి. తర్వాత టమాటా ముక్కలు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, షాజీర కూడా వేసి కొద్దిసేపు వేపాలి. ఇప్పుడు కొత్తిమీర ముద్ద వేసి రెండు నిమిషాలు వేపి నాలుగు కప్పుల నీళ్లు పోసి తగినంత ఉప్పు కలిపి మూత పెట్టాలి. నీళ్లు మరుగుతుండగా బియ్యం తీసి వేయాలి. మంట తగ్గించి ఉడికించాలి. అన్నం ఉడికి నీరంతా ఇగిరిపోయిన తర్వాత మూత పెట్టి రెండు నిమిషాలు మగ్గనివ్వాలి. ఈ పలావ్ పెరుగుపచ్చడి లేదా వెజ్ కుర్మాతో వేడిగా సర్వ్‌చేయాలి.

- జ్యోతి వలబోజు

చికెన్ కోఫ్తా కర్రీ

కావలసినవి

చికెన్ కీమా లేదా బోన్‌లెస్ చికెన్ - 250 గ్రా.
కార్న్‌ఫ్లోర్ - 5 టీ.స్పూ.
శనగపిండి - 1 కప్పు
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
మిరియాల పొడి - 1/4 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 1/2టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ.
ధనియాల పొడి - 1 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
టమాటాలు - 200 గ్రా.
కరివేపాకు - 1 రెబ్బ
కొత్తిమీర -కొద్దిగా
నూనె - వేయించడానికి

ఇలా చేయాలి

ఒక గిన్నెలో చికెన్ కీమా లేదా బోన్‌లెస్ చికెన్ తీసుకుని అందులో తగినంత ఉప్పు, మిరియాల పొడి, అర చెంచా అల్లం వెల్లుల్లి, కార్న్‌ఫ్లోర్, శనగపిండి వేసి కలిపి తగినన్ని నీళ్లు చల్లుకుంటూ బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ఇది మరీ పలచగా కూడా ఉండకూడదు. బాణలిలో నూనె వేడి చేసి ఈ చికెన్‌ను చిన్న చిన్నగా ఉండలుగా వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించి పెట్టుకోవాలి.

ఒక పాన్‌లో మూడు చెంచాల నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. తర్వాత కరివేపాకు, పసుపు, కారం పొడి అల్లం వెల్లుల్లి ముద్ద వేసి మరో రెండు నిమిషాలు వేసి సన్నగ తరిగిన టమాటా ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టి చిన్న మంటమీద ఉడికించాలి. అవసరమైతే అరకప్పు నీళ్ళు కలుపుకోవచ్చు. టమాటా ముక్కలు ఉడికి చిక్కబడ్డాక వేయించిన చికెన్ కోఫ్తాలు వేసి కలిపి మూత పెట్టాలి. మొత్తం కలిసి ఉడికి నూనె తేలుతున్నప్పుడు కొత్తిమీర, గరం మసాలా పొడి కలిపి దింపేయాలి.

కీరా, టమాటా కూర

కావలసినవి

కీర దోసకాయ ముక్కలు - 2 కప్పులు
టమాటా తరుగు - 1 కప్పు
ఉల్లిపాయ - 1
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
కరివేపాకు - 2 రెబ్బలు
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
కొత్తిమీర - 2 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ.
నూనె - 3 టీ.స్పూ.

ఇలా చేద్దాం

కీర దోసకాయ చెక్కు తీసి చేదు చూసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇందులో కరివేపాకు, పసుపు, కారం పొడి కలిపి కొద్దిసేపు వేయించి కీరా ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. నిదానంగా చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ముక్కలు మెత్తబడ్డాక సన్నగా తరిగిన టమాటా ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. టమాటా ముక్కలు కూడా మగ్గి మెత్తబడ్డాక కొత్తిమీర, గరం మసాలా పొడి కలిపి దింపేయాలి. ఇది అన్నం కంటే చపాతీలకు బావుంటుంది.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
ఆదివారం
24, ఫిబ్రవరి
2013

సేకరణ: కుందా

ధరణిం బ్రాక్తన భక్త నిర్మిత మహా స్థానంబులై యొప్పు శ్రీ గిరి ముఖ్యం బగు దివ్య తీర్థములు భక్తిం జూచిరే వారి దు స్తర దోషంబులు వాయునన్న ఱి సాక్షాద్భక్తులం జూచినం బర మార్థంబుగా బాయదే నరుల పాపం బెల్ల సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా ! ప్రాచీన భక్తుల చేత నిర్మింపబడిన శ్రీశైలాది దివ్య తీర్థాలన చూస్తే పాపాలు పోతాయన్నారే మరి సాక్షాత్తు (అలాంటి) భక్తుల్నే చూసినపుడు మానవుల పాపాలన్నీ పరమార్థంలో పోవా?

ఈ పద్యంలో కవి కవిప్రయోగించిన తర్కం భక్త జనుల పక్షపాతం కలదిగా కనిపిస్తుంది. శ్రీశైలాది దివ్య క్షేత్రాలలో ని దేవాలయలను నిర్మించింది భక్తులే. ఆ భక్తులు నిర్మించిన దేవాలయాలను దర్శించినపుడు లేకఆ యా తీర్థాలలో స్నానం చేసినపుడు వారి వారి పాపాలు పోతే మరి ఆ భక్తుల్నే చూసినపుడు పాపాలు భస్మీపటలం అవుతాయి కదా. భాగవతసేవ చాలా పుణ్యాన్ని కలిగిస్తుందని భావం.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

21 **శ్రీ లత**

''అది కాదమ్మా! నా జీవితం నా ఇష్టం వచ్చినట్లు నేను మలుచుకుంటే అసలు వీళ్ళకేంటి ఇంత శ్రద్ధ. పేరు కావాలని కీర్తి కావాలని తాపత్రయపడేవాళ్ళు చాలామంది ఉండగా, ''వద్దు బాబూ'' అంటున్న నన్ను పొగడటానికి కంకణం కట్టుకున్నట్లు వీళ్ళ ప్రయత్నాలేంటి?''

''ఎందుకంటే చెడు చెయ్యడంవల్ల ఎంత నష్టమో, మంచి చెయ్యడంవల్ల కూడా కొందరికి అంతే నష్టం'' చెప్పింది వసంత.

''నేను మంచి చేస్తే వాళ్ళకేంటి నష్టం?''

''ఆ మంచివాళ్ళు చెయ్యలేరు కాబట్టి''

''ఎవరా మంచి చేయలేనివాళ్ళు?''

''ఎవరేంటి జీవనా! బుద్ధుడు ఎంతమందికి శత్రువయ్యాడు? గాంధీహత్య చేయబడ్డాడు ఎందుకు? వాళ్ళు చెడ్డవాళ్ళు? కాదు, చెడ్డవాళ్ళకు నచ్చనివాళ్ళు'' వివరించింది వసంత. కాసేపాగి మళ్ళీ తనే... ''జీవనా ఓ విషయం చెప్పనా? సమాజంలో నివసించేటప్పుడు మన జీవితాలపై మనకు అధికారం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ జీవితాలను సమాజానికి గుత్తాధికారంగా సమర్పించాల్సిందే. అలా కాకుండా ఎవరైనా బ్రతికే వాళ్ళుంటే వాళ్ళు మనుషులు కాదు దేవతలు'' అంది.

''అంతంత గొప్పవాళ్ళకు సరే వ్యతిరేకులుంటారు. మరి నాలాంటి గుర్తింపులేనివాళ్ళతో ఎందుకమ్మా ఈ తగలాటకాలు?'' పిచ్చిగా అడిగింది.

వసంతమ్మ ఏం మాట్లాడకుండా నవ్వి ఊరుకుంది.

''అసలు దీనికంతటికీ కారణం... కారణం.. అతనే అవినాష్'' కోపంగా అనుకుంది జీవన.

⁘⁘⁘

జీవన ఆటో దిగి 'సాయంకాలం' పత్రిక కార్యాలయంలోకి నడిచింది.

సెక్యూరిటీ దగ్గరకు వెళ్ళి సిగ్నేచర్ చేసి లిఫ్ట్‌లోకెళ్ళి ఫస్ట్ ఫ్లోర్ బటన్ నొక్కింది. లిఫ్ట్ అనగానే అడుగులో అడుగు కాకుండా ఎగ్జాట్లీ ఒక మెజర్‌మెంట్‌లో భూమిని కొలుస్తున్నట్లుగా టకటకా నడిచి వస్తున్న జీవన హీల్ చప్పుడును రిసెప్షనిస్టుతలెత్తి చూసింది.

''అవినాష్ ఎక్కుడుంటారు?'' అడిగింది జీవన.

''యూ... హి ఈజ్ ఇన్ థర్డ్ ఫ్లోర్ యు వాంట్ అప్రోచ్ త్రూ ఫోన్? యూకెన్'' అని ఫోన్ జీవన ముందుకు జరిపింది.

''నో థాంక్స్.. ఐ వాంటు మీట్ హిమ్'' అనేసి గిరుక్కున వెనక్కి తిరిగి లిఫ్ట్‌లోకెళ్ళి థర్డ్ నెంబర్ నొక్కింది. లిఫ్ట్ పైకి వెళుతుండగా కళ్ళు మూసుకుంది. ''న్యూసెన్స్, న్యూసెన్స్ అయిపోయాడు ఇడియట్'' గొణుక్కుంది.

''వాట్ హాపెండ్ మేడమ్? ఎనీథింగ్ రాంగ్?''

''హెల్ప్ అడిగానా?''

''లేదు''

''నాకో సమస్య ఉందని చెప్పానా?''

''లేదు''

''మరి నేనసలు మిమ్మల్ని పట్టించుకోలేదు. నన్ను అనవసరంగా పలకరించారేం'' తీక్షణంగా అడిగింది.

''యాజ్ ఎ పర్సన్.. మీరేదో వర్రీలో ఉన్నట్టు అనిపిస్తే'' అని గొణిగాడతను.

''రోడ్డుమీద ఎవరయినా మీ కళ్ళెదురుగా హత్య చేస్తే చూసి పారిపోతారు అవునా? ఎవరయినా ముసలివాళ్ళు రోడ్డుమీద పడిపోతే ఆగి చూడరు అవునా? కానీ, నన్ను మాత్రం ఎంతో శ్రద్ధగా పలకరించారు... కారణం చెప్పనా? అడిగింది అదే స్థాయిలో....

''మీరూ...''

''ఆ.... నేను అమ్మాయిని కాబట్టి! అనవసరంగా నాలాంటివాళ్ళను పట్టించుకుని మరీ ఆనందించడం మీ మగాళ్ళ హాబీ కాబట్టి'' అంది జీవన.

''అది...'' అని ఏదో చెప్పేలోపే.

''మైండ్ యువర్ బిజినెస్! అడక్కుండానే అనవసరంగా పట్టించుకునేవాళ్ళను చూస్తే నాకు గొంగలి పురుగుని చూసినట్లుగా ఉంటుంది'' అంది సీరియస్‌గా, థర్డ్ ఫ్లోర్ రావడంతో లిఫ్ట్ ఆగింది. విసురుగా డోర్ తీసి బయటకు రాబోతుంటే....

''ఎక్స్‌క్యూజ్‌మీ''అన్నాడను.

''ఏంటి'' అన్నట్లుగా వెనక్కి తిరిగింది.

''మీరు చెప్పినవి అన్నీ బావున్నాయి కానీ ఒక్క విషయంలో మీరు పొరపాటు బడ్డారు'' అన్నాడు.

''నేనా...'' అని జీవన ఏదో చెప్పేలోపే... అతను మధ్యలోనే కలగజేసుకుని ''మీరు అందంగా ఉన్నారనీ, అందుకే నేను పలకరించానని అనుకుంటే అదీ మీ అందం పట్ల మీకున్న ఓవర్ కాన్ఫిడెన్స్, మీరు అతి మామూలుగా బిలో యావరేజ్‌లో ఉన్నారు. ప్రతీ అబ్బాయి అందాన్ని మాత్రమే చూసి అమ్మాయిలను పలకరిస్తారనుకుంటే అది మీ భ్రమ. ఇలా ఓవర్ కాన్ఫిడెన్స్ పెంచుకున్న వారిని చూస్తే నాకు పిల్లి పిల్లలను చూసినట్లుగా ఉంటుంది'' అని నవ్వాడు.

'షిట్' అని విసురుగా గ్రిల్ వేసింది. ఆ హడావిడిలో గ్రిల్‌కు గ్రిల్‌కు మధ్య అతని బొటనవ్రేలుపడి 'అమ్మా'అని అతనరిచిన అరుపు జీవనకు వినపడలేదు.

కారిడార్‌లోకి నడిచి కాసేపు అక్కడే ఆగింది. తనేం మాట్లాడదలచుకుందో మరోసారి గుర్తుచేసుకుంది. ఆ తరువాత నెమ్మదిగా స్పెషల్ డెస్క్ ఛాంబర్‌లోకి నడిచింది.

అక్కడ నాలుగైదు టేబుల్స్ వేసి ఉన్నాయి. మొదటి టేబుల్ దగ్గరకు వెళ్ళి ''ఎక్స్‌క్యూజ్‌మీ మే ఐ మీట్ మిస్టర్ అవినాష్ ప్లీజ్'' అంది. చివరి టేబుల్ వైపు చూపించాడతను. ఆ టేబుల్ వైపు చూసింది. ఫైల్స్, ఏవో పుస్తకాలు చాలా ఎత్తుగా పేర్చి ఉన్నాయి. మనిషి కనబడటం లేదు.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం

152

శ్రీపాద కృష్ణమూర్తి

అప్పుడు స్వయంప్రభ ఉప్పొంగి ''మీరు మీ కన్నులు మూసికొనండి'' అని పలికింది. వానరులందరూ తమ కన్నులు మూసికొనగా ఆ వనిత వానరులను నిమేష మాత్రంలో తీసుకొని వచ్చి బిలముఖాన దిగ విడచి తాను వెడలిపోయింది.

అప్పుడు కపినాథులు, భల్లూక వల్లభులు ఆ స్వయంప్రభను మనసారా సంస్తుతి ఒనరిస్తూ అటుపోయి పోయి అక్కడ ఒక్క సరస్సు కాంచి అందు నిర్మల జలాలు కడుపులార క్రోలి దప్పి తీర్చుకొన్నారు. అందరూ మహేంద్ర పర్వతం చేరారు.

అంత యువరాజు అంగదుడు మన రాజు సుగ్రీవుడు పెట్టిన గడువు ముగిసిపోయింది. రామవిభుడి దేవిని కనుగొనలేక పోయాం. మన రాజు ఆజ్ఞ 'సుగ్రీవాజ్ఞ' అని అందరం ఎరిగి వున్నాం. ఆ ఆన తప్పినామని మనలను పొడగని వెంటనే నడిమికి రెండుగా నరికివేస్తాడు. కనుక మనం వానరేశ్వరుణ్ణి చూడబోవడం తగవు కాదు. బుద్ధీ అనిపించుకోదు. వెలికివచ్చిన ఈ బిలం చొచ్చి అందే వుందాము. అష్టదిక్పాలురక యినా అది అభేద్యం. అత్యంత రుచ్య పరిపక్వ ఫలభరితాలైన ఆరామాలు అతి వేలంగా కలది'' అని వచించాడు. అంగదుడి పలుకులు కొందరికి కలకండ పలుకులయి ఇయ్యకొన్నారు. మరికొందరికి చేదు గుళిక లని తోచి అందు అంగీకరింప లేకపోయారు.

అపుడు మారుతి ఆగ్రహోదగ్రుడయాడు. ''అంగదా! నువ్వు పెద్ద బుద్ధివి. అంతేకాక వానరులకి యువరాజువి. పిన తండ్రి పంప గద్దరివై రాముడి కార్యార్థం చనుదెంచావు. ఈ బిలంలో వసించడానికి నేను, తారుడు, నీలుడు, నలుడు ఏ విధంగాను సమ్మతించేది లేదు. ఈ వానరులు తక్కిన కపుల్ని చుట్టపక్కాలని, హితులని, సతులను వదలి, నిన్ను కొలిచి వుండనేరుస్తారా? అదీకాక వెనుక ఇంద్రుడు తన వజ్రాయుధంతో కొట్టి ఒక బిలం ఏర్పరచాడు. అటువంటి నిశిత వజ్రాస్త్ర కోటి లక్ష్మణుడి అధీనంలో పెక్కులు ఉన్నాయి. అతడు మాట మాత్రంతోనే నిన్ను, నీ వానర బలాన్ని నాశనం చేసివేస్తాడు. ఈ దుర్బుద్ధులు విడిచి పెట్టు. బుద్ధి పెడతల వాపోయినట్టులు వున్నది. జానకి జాడ తెలియ మాతరం కాలేదు. మన్నించు'' అని అందరం అరిగి సుగ్రీవుడి పాదాలు కన్నులకి ఒత్తుకొందాము. ఆ కపిరాజు నిన్ను, మమ్ము దయతలుస్తాడు. ఆ పయిని నీ జనని తారకు సుగ్రీవుడు అనురక్తుడు. కనుక నీ పయిన అలుక చెందడు. నువ్వు కుమారుడివి కనుక నిన్ను అవశ్యం రాజుని కావిస్తాడు'' అని వచించాడు

హనుమ పలుకులు అంగదుడు ఆలకించాడు. ''మారుతీ! పితృతుల్యుడైన వాలిని మడియించి, అతడి భార్యని వరించి, ఆ మీద తనకు ఉపకృతి కావించిన రామకార్యం మరచి లక్ష్మణుడు ఆగ్రహించిన కదా మా పినతండ్రి వచ్చినది? అతడి హీన ప్రవర్తన ఎరుగవా? అటువంటి కామాంధుణ్ణి, అటువంటి కృతఘ్నుడిని ఏ విధంగా విశ్వసించవచ్చు? అది, ఇది అనడం ఎందుకు? ఆ సుగ్రీవుడి చేతిలో మరణించడంకన్నా ఇక్కడే పరమపదించడం లెస్స. ప్రాయోపవేశం చేద్దాము. సిద్ధం అవండి'' అంటూ వానరులూ తామూ దర్భశయనులై ఇటు రావడం వృథా అని ఆత్మలో చింతించారు.

తెగులు, ముదిమి, వేదన, నవత లేని ప్రాణములు కావ, లేచి దిక్కులు పరికించి, తమ తమ చుట్టాలను, సతులను తలచుకొన్నారు. ''చావురే దైవమా! చలపట్టి మమ్ములను ఈ క్రియ వృథా పరిమార్చ ఇక్కడ సమకట్టినావా?'' అని వాపోతూ అఖిల వానరులు గుమురులు గుమురులు అయి కూడి ఈ పగిది వగచారు.

''ఇనకుల మణి అరణ్యాలకు రానేల? కులసతిని రాక్షసుడి చేత కోల్పోవనేల? ఆ దైత్యుడు జటాయువుని చంపడం ఏమిటికి? రామవిభుడు సుగ్రీవుని ఏ విధంగా చూశాడు. సీత వార్తను అతడు చెప్పడం ఎందుకు?

-ఇంకాఉంది

ఆదివారం, 24 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ చతుర్దశి రా.01.43
నక్షత్రం: ఆశ్లేష రా.01.15
వర్జ్యం: మ.01.22 నుండి 03.03 వరకు
దుర్ముహూర్తం: సా.04.44 నుండి 05.31 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధన నష్టం కలిగే అవకాశాలుంటాయి. అనుకోని ఆపదల్లో చిక్కుకోకుండా గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్త పడుట మంచిది.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. ముఖ్యమైన కార్యాలు పూర్తి అవుతాయి.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
నూతన కార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురి చేస్తుంది. అసత్యానికి దూరంగాఉంటేమంచిది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైర మేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. సంతోషంగా ఉంటారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణ బాధలు తొలగిపోతాయి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
కుటుంబ కలహాలకు తావీయరాదు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. పిల్లలతో జాగ్రత్త వహించుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగంలోనివారికి ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడాలి. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో ఉంటారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంటుంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకుంటారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆకస్మిక ధనవ్యయం అయ్యే అవకాశం. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు.

మంచిమాట

విచక్షణాజ్ఞానం

మన చుట్టూ అనేక సంఘటనలు చోటుచేసుకుంటూ ఉంటాయి. వాటిని మనం పరిశీలనా దృష్టితో గమనిస్తూ ఉండాలి. ఆ సంఘటనలలో మంచి ఏదో, చెడు ఏదో నిర్ణయించుకోవాలి. అట్టి జ్ఞానాన్నే విచక్షణా జ్ఞానం అంటారు. మనం ఇతరులతో మాట్లాడేటప్పుడు నోటిని అదుపులో ఉంచుకోవాలి. ఏది మాట్లాడితే ఎదుటివారికి బాధ కలుగకుండా ఉంటుందో, సమస్య ఉత్పన్నం కాకుండా ఉంటుందో జాగ్రత్త పడాలి. ఎదుటివారికి ఏదైనా బాధ కలిగినపుడు మనకు చేతనైన రీతిగా సాధ్యమైనంత సహాయం అందించాలి. మనుషుల ప్రవర్తనలను బట్టి మంచి చెడులను బేరీజు వేసుకొని మసలుకోవాలి.

మాటలవలననే కాకుండా చేతలవలన కూడా ఇతరులకు అసౌకర్యం, ఇబ్బంది కలుగకుండా మెలగాలి. అటువంటి విచక్షణా జ్ఞానం ప్రతి యొక్కరికీ అవసరమే. ఏ పని చేయడంవల్ల అందరికీ ఉపయోగకరమైన విధంగా ఉంటుందో నిర్ణయించుకోవడానికి విచక్షణా జ్ఞానం ఉండాలి.

మంచి చెడ్డలు గమనించకుండా నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతూ, చిత్తం వచ్చినట్లు పనులు చేస్తూ పరులకు బాధ కలుగజేసేవారిని పెద్దలు మందలిస్తూ కాస్త విచక్షణా జ్ఞానం ఉపయోగిస్తూ మెలగాలయ్యా అంటూ బుద్ధి చెప్పడం పరిపాటిగా వస్తూ ఉంది. ఏదైనా ఒక పని చేసేటప్పుడు ఆ పని యొక్క పర్యవసానాన్ని గూర్చి యోచించాలి.

విచక్షణా జ్ఞానానికి ముఖ్యంగా ఉండవలసింది ఆలోచనా పాటవం, సమయస్ఫూర్తి, తెలివితేటలు. అందుకుగాను చిన్నతనం నుండీ ఆలోచనా శక్తిని పెంపొందించే విధంగా శిక్షణ ఇవ్వాలి. తొందరపడి మాట్లాడటం, తొందరపాటు నిర్ణయాలు, ఆవేశం తగ్గించుకొని ఆలోచన కలిగి ఏ పని చేస్తే ఎటువంటి ఫలితం వస్తుందో ఒకటికి రెండు సార్లు యోచించి రంగంలోకి దిగాలి.

ఆవేశమే అన్ని అనర్థాలకు మూలం. ఆవేశంలో ఉన్న మానవుడు విచాక్షణా జ్ఞానం కోల్పోతాడు. తాను ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేయబోతున్నాడో తనకే తెలియని పరిస్థితి అది. అందువల్ల ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవాలి. ఆలోచనా శక్తిని పెంచుకోవాలి. జ్ఞానమే మానవుని మనుగడకు పునాది. అందువల్ల జ్ఞానము కలవాడు ఎటువంటి విపత్కర పరిస్థితులు ఆసన్నమయినా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవడు.

విచక్షణా జ్ఞానం కోల్పోయి పలికిన మాటలకు చేసిన చేతలకు కలిగే దుష్ఫలితాలకు, పర్యవసానాలకు తరువాత ఎంత బాధ పడినాప్రయోజనం ఉండదు. అందుకే ముందు జాగ్రత్త వహించడం శ్రేయోదాయకం అని పెద్దలు వచించడం యదార్థమే కదా! పొరపాటున కాలు జారితే వెనక్కు తీసుకోవచ్చు కానీ నోరు జారితే వెనక్కు తీసుకోవడం సాధ్యం కాదు. అందుకే నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందనే సామెత పుట్టింది. విచక్షణా జ్ఞానానికే ఇంగితజ్ఞానం అనే పర్యాయపదం కూడా ఉంది.

సమాజంలోని ప్రతివారూ పెద్ద చిన్నా అంతరం తెలుసుకొని మసలుకోవాలి. ఎవరిని ఎలా గౌరవించాలో అలాగే గౌరవించడం అలవరచుకోవాలి. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుసుకొని అలాగే మాట్లాడాలి. అలా చేయడంవల్ల అందరి మన్ననలు పొందవచ్చు.

వివేకవంతుడైనవాడు ఎటువంటి పరిస్థితుల్లోనైనా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోడం జరుగదు. విచక్షణాజ్ఞానం కలవాడు సమాజంలో అందరి మన్ననలకు పాత్రం కావడమే కాకుండా సమాజానికి ఉపయోగకారిగా నుండగలడు. అందరికీ ఆదర్శప్రాయుడుగా ఉంటూ ఇతరులకు మార్గదర్శనం చేయగలడు. కాబట్టి విచక్షణా జ్ఞానం సామాన్య మానవుని మనీషిగా మారుస్తుంది అని అనడంలో అతిశయోక్తి లేదు.

-కరణం రాజేశ్వరరావు

వృతాసురుడు

30

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 23

మాటాట

ఆధారాలు:
అడ్డం
2. ఆసామి, అధికారి
5. పిల్లల్ని ఊరించే పదార్థం
7. పహారా
8. తెలివి మంతుడు
10. యు శస్వు
11. అరటిపండ్లు
14. మాట
15. మన్మథుడి

నిలువు
1. ఇతరుల ప్రతిభను గుర్తిస్తూ మెచ్చుకోలు మాట..
3. వేటి
4. వేలిముద్ర
6. నావలు నిపడానికి వేసేది
9 విలువైన వెక్క, కావాలంటే పలక ను తిరగేసి సరి
10. పురుగు
12. పసువులాంటి పవిత్రమైనది
13. సూర్యోదయ దెస

మాటాట - 22 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

● జగమంతా రామమయం

పరిచయం..

కట్టించిన కోటలన్ని మిగిలిపోయెను, కట్టుకున్న మహరాజులు తరలిపోయెను' అంటాడో కవి. కోటలు మిగిలినా, రాజులు తరలినా, మరపురానిది, రాకూడనిది మరొకటుంది. అదే ఆయా కోటల చరిత్ర. ఒక కోట వైనం అంటే ఇంచుమించు కొంత కాలక్రమంతో పరిచయం కిందే లెక్క. పాలించిన రాజులు, వంశాలు, సంస్కృతులు, జనజీవితం, ఇలా ఎన్ని విషయాలు కలగలసి వుంటాయో. అచ్చమైన తెలుగుదనాన్ని సంతరించుకున్న అతి కొద్ది కోటల్లో గండికోట ఒకటి. కడప జిల్లాలో వున్న దీని చరిత్ర అంతగా సామాన్య జనబాహుళ్యానికి తెలియదు. ఇంతకు ముందు దీని ప్రస్తావన వున్న పుస్తకాలు కానీ, రచనలు కానీ, సాదా సీదా పాఠకులు అందుబాటులో వుండకపోవడమే కారణం. ఇప్పుడాలోటును భర్తీ చేస్తూ, వీలయినంత సవివరంగా తవ్వా ఓబుల్‌రెడ్డి, గండికోట చరిత్రను రచించారు. అందరికీ అర్థమయ్యే విధంగా, వివిధ చాయాచిత్రాలు, పటాలు అన్నీ పొందుపరిచి అందించారు. కోట చుట్టుపక్కల వున్న సందర్శన స్థలాల వైనాలను వివరించారు. పనిలోపనిగా గండిగోట గురించి అప్పటి గెజిట్‌ల్లో, రికార్డుల్లో వున్న వాటిని యధాతథంగా ప్రచురించారు. మొత్తానికి ఒక కోట గురించి చిన్నదైనా, సవివరమైన రచనగా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే బోలెడు ప్రకటనలు పుస్తకంలో అందించి కూడా, వంద రూపాయిల వెల పెట్టకుండా, అందరికీ అందుబాటులో వుండేలా నిర్ణయించి వుంటే బాగుండేది.

గండికోట
తవ్వా ఓబుల్‌రెడ్డి
వెల: రూ.100/-
ప్రతులకు: టి.పార్వతి,
13-553-1,
ఎన్‌బిఐ స్ట్రీట్,
మైదుకూరు,
వైఎస్‌ఆర్ కడప జిల్లా.
మరియు
ప్రముఖ పుస్తక కేంద్రాలు

తెలంగాణోద్యమ నెగడు 'కొర్రాయి'

ప్రజా ఉద్యమాల్లో అగ్రస్థానాల్లోకి చేరుకొని మలుపుతిప్పిన చారిత్రక సందర్భాల్లో చురుగ్గా వ్యవహరించిన నాయకులు భౌతికంగా మనమధ్య నుండి దూరమైతే, మనం వారు లేని లోటును తలుచుకుని దుఃఖపడతాం. వారితో ఉన్న అనుబంధాన్ని తలుచుకుని కుమిలిపోతాం. వారి ఆశయ సాధనకై కంకణబద్ధులమై ఉంటామని ప్రతిన పూనుతాం. తెలంగాణ సాయుధ పోరాటంలో గన్ను పెన్ను ధరించిన సుద్దాల హనుమంతు లెక్క విప్లవ సాహిత్యోద్యమంలో కలంతో, వర్గపోరులో భాగంగా గన్నును ధరించిన ఉద్యమ నెలబాలుడు శివసాగర్. ప్రజల గుండెల కొండల మాటున దాగి ట్రిగ్గర్ నొక్కగలిగిన వాడే ద్రష్టాని ఆచరించిన విప్లవ సమరశీల ఆయన. బహుజనుల విముక్తికోసం చివరివరకు పోరాడిన నల్లసూర్యుడతడు. 'నీ స్పర్శతో కవిత్వం పునీతమైంది'అనే బలమైన కవిత ద్వారా ఆయన ఉద్యమజీవితం మన కళ్ళముందు పరిచారు.

విప్లవాల యుగం మనది. విప్లవిస్తే జయం మనదని ఎలుగెత్తిచాటిన చరబండరాజు సూచనలతో పద్యరచన నుండి వచన కవిత్వంవైపు మారిన దామెర రాములు కవిత్వాన్ని సామాజిక ఉద్యమాల నేపథ్యంనుండే పరిశీలించాలి. ఎమర్జెన్సీలో రాజ్య దమనకాండను నిరసిస్తూ 'కోరస్' (1978), కల్లోల దశాబ్దంతోపాటు ఇంద్రవెల్లి సంఘటనల గూర్చి 'నెత్తుటి వెన్నెల' (1988), తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షలను వ్యక్తంచేస్తూ జరుగుతున్న ఉద్యమ సందర్భంలో 'జయహే తెలంగాణ' (2006)లు వచ్చాయి. ఆయన కవితల నిండా గల్ల బట్టి నిలదీసే చైతన్యం తొణికిసలాడుతుందని చెప్పటానికి నిదర్శనంగా పాలపిట్ట బుక్స్ ప్రచురణగా ఇటీవల వెలువడిన 'కొర్రాయి' (2012) మనమధ్యకు వచ్చింది. ఇందులో పదునైన అరవై ఐదు కవితలున్నాయి. ఈ కవితల్లో వర్తమాన ప్రజల జీవన పోరాటాలే కనిపిస్తాయి. రాజ్యాన్ని ప్రశ్నించేవారి చెంతనే ఉంటానంటాడు. వారికి చిన్న కష్టమొచ్చిన ఉగ్రుడై కవిత్వమౌతాడు.

కొర్రాయి
దా.దామెర రాములు
వెల: రూ.70/-
ప్రతులకు: పాలపిట్ట బుక్స్,
16-11-20/6/1/1, 403,
విజయసాయి రెసిడెన్సీ,
సలీమ్‌నగర్, మలక్‌పేట్,
హైదరాబాద్
ఫోన్ : 27678430.

ఉధృతంగా మొదలైన తెలంగాణ పోరాటంలో రాటుదేలిన కవితలు రాస్తున్న వారిలో దామెర ఒకరు. తెలంగాణ పోరుగడ్డలో విస్తృతంగా రాస్తున్న నందిని సిద్ధరెడ్డి, జూకంటి జగన్నాథం, జూలూరి గౌరిశంకర్, చెరుకు సుధాకర్, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణలే కాకుండ ఇంకా అనేకుల సరసన నిలబడి అంతే దూకుడుగా కవిత్వమవుతున్నారు. ఈ సంపుటిలోని కవితలే అందుకు తార్కాణం. సీమాంధ్రుల కుతంత్ర కుట్రలను బట్టబయలు చేస్తున్నారు. వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెనక్కి మళ్ళిన తీరును, రాజకీయ కుటిలత్వాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించటానికి సమాయత్తం కావాలని పిలుపునిస్తున్నారు ఈ కవితల ద్వారా.

సకల జనుల సమ్మె, యువకుల ఆత్మబలిదానాలు, సుదీర్ఘ చర్చలు, మిలియన్ మార్చ్, సాగరహారం, బందులు, ధర్నాలు, నిరాహారదీక్షలు, అరెస్టులు ఎన్ని జరిగినా ఉద్యమానికి విశ్రాంతి లేదని లక్ష్యంసాధించేవరకు అలుపువద్దని నినదిస్తున్నాడు ఈ పన్నెండు కవితలలో. ఈ కవితలను ఒకసారి చదివితే ఏమంటున్నాడో తెలుస్తుంది. 'సుదూర నక్షత్రం నీ తెలంగాణ, సమయం మించిపోలేదు, విరామం ఓటమి కాదు, ఈ రాత్రికి రాత్రే తేల్చలేం..., కాలాన్ని ప్రశ్నించిన బిడ్డలు, బలికావద్దు- బరిగీయుండ్రి, ఇగ ఇప్పుడు సరిపిచ్చిన ఆయుధం తెలంగాణ, నగరంలో.. 48 గంటల 'తె'బంద్, ఆత్మీయ రాగం, తెలంగాణలో కాశ్మీరయానం, నడుమ గీరాయల తెలంగాణ లొల్లేంది?, తెలంగాణపై మెలిక' అన్నింటి సారాంశం ఒక్కటే జరుగుతున్న తెలంగాణ సమరంలో ఒక్కట్టై నడుద్దాం అంటున్నారు. తేల్చలేని నాయకులను ఇలా ప్రశ్నిస్తున్నారు.

'నటిస్తున్నారా కుట్రలు కుతంత్రాల్ని కడుపులో దాచుకుని
నిద్రిస్తున్నారా మా ఏడ్పుల్ని సంగీతంగా అవహేళన చేస్తూ
ఆదేశాల్నిస్తున్నారా లాఠీలు తూటాలకు బాధ్యవాయువులకు
తొక్కేయదలిచారా మహోద్యమాన్ని మీ పద ఘట్టనలకింద
అయినా రాత్రికి రాత్రే తేల్చలేని/ చిదంబర రహస్యమా?
.....
ఖబర్దార్!/ సాగుతుంది మిలియన్ మార్చ్...
మీ కుతంత్రాల వ్యూహాన్ని పటాపంచలు చేస్తూ
జనం కదంతొక్కే- పద ఘట్టనల కింద తొక్కేస్తూ...' (పేజీ.. 46)

ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా స్వరాష్ట్ర ఆకాంక్షకోసం బలిదానాలు చేసుకోవటం అందర్ని కలవరపాటుకు లోనుచేస్తుంది. జాతీయోద్యమంలో సత్యాగ్రహం ద్వారా స్వరాజ్యాన్ని సాధిస్తామని గాంధీ పిలుపునిచ్చాడు. చేసి చూపించాడు. శాంతియుతంగా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించాలని గత పుష్కరకాలంగా చేస్తున్నాం. అశాంతికి లోనైన యువత తమకుతాము ప్రాణాలుతీసుకోవటం వద్దని ఈ నేల పోరుదారుల్లో పూసిందని దాన్ని ఆసర చేసుకొమ్మని కోరుతున్నారీ కవి.

'నేనడుగుతున్నా.. ఎందుకు మీరు
నిరాశా నిస్పృహల ఎండమావుల్లో కలలు
ఆవిరి చేసుకుంటూ ఆహుతవుతున్నారు బిడ్డలారా!
నాటి కొమురంభీంనుంచి బందగీదాకా
నాటి చాకలి ఐలమ్మ నుంచి నేటి కిషన్‌జీ దాకా
మీలో నిక్షిప్తమైన ఉన్న ధిక్కారస్పృహ
ఎదురుతిరిగే స్వరాల కరవాలాలు
ఎమైనాయ్ తండ్రులారా! ఎందుకు చచ్చిపోతున్నారు
మీకేమైంది! తల్లి పాల రుణం తీర్చుకోరా!'... (పేజీ.. 72)

సమాజం నిత్య ఘర్షణతోనే సాగుతుంది. కొత్తకొత్త ప్రతిపాదనలను రాజ్యం ప్రజలముందుకు తోస్తుంది. ఆలోచనాపరులు వాటిపై విభిన్న అభిప్రాయాలను వెల్లడిస్తారు. సరైన అవగాహన కల్పించటానికి కవులు, రచయితలు తమదైన దృష్టితో రచనలు చేస్తారు. సామాజిక మార్పును ఆహ్వానించటంలో సృజనకారులు ముందుంటారు. గ్లోబలీకరణతో ప్రపంచం కుగ్రామంగా మారింది. శరవేగంగా వచ్చిపడుతున్న వస్తు వ్యామోహంతో పెరుగుతున్న ధరలపై ఆందోళన తీవ్రస్థాయిలో జరుగుతున్న వైనాన్ని గూర్చి 'చాలించు సరాగాలు' అనే కవితలో ఇలా అంటారు.

'ఆర్థిక సంక్షోభం సునామీలో
సగటు మనిషి మనుగడ ప్రశ్నార్థకం
మన్మోహనా!
చాలు సరాగాల సరసాలు/ ఏపుగా పెరిగిన
బలుపో చావో తెలియని
కరెన్సీ వనంలో చిక్కుపడిన మాకు
దిక్కేది? దారేది?'... (పేజీ.. 70)

ప్రజా ఉద్యమాల్లో అగ్రస్థానాల్లోకి చేరుకొని మలుపుతిప్పిన చారిత్రక సందర్భాల్లో చురుగ్గా వ్యవహరించిన నాయకులు భౌతికంగా మన మధ్య నుండి దూరమైతే, మనం వారు లేని లోటును తలుచుకుని దుఃఖపడతాం. వారితో ఉన్న అనుబంధాన్ని తలుచుకుని కుమిలిపోతాం. వారి ఆశయ సాధనకై కంకణబద్ధులమై ఉంటామని ప్రతిన పూనుతాం. తెలంగాణ సాయుధ పోరాటంలో గన్ను పెన్ను ధరించిన సుద్దాల హనుమంతు లెక్క విప్లవ సాహిత్యోద్యమంలో కలంతో, వర్గపోరులో భాగంగా గన్నును ధరించిన ఉద్యమ నెలబాలుడు శివసాగర్. ప్రజల గుండెల కొండల మాటున దాగి ట్రిగ్గర్ నొక్కగలిగినవాడే ద్రష్టాని ఆచరించిన విప్లవ సమరశీల ఆయన. బహుజనుల విముక్తికోసం చివరి వరకు పోరాడిన నల్లసూర్యుడతడు. 'నీ స్పర్శతో కవిత్వం పునీతమైంది'అనే బలమైన కవిత ద్వారా ఆయన ఉద్యమజీవితం మన కళ్ళముందు పరిచారు.

'గేచి గేంగళి గాళ్లు/ గేండు కోలాం లంబాడ
మాల మాదిగ డెక్కలి చిందు/ మేడిపట్టే కాపుమేదరి పెరిక
కుమ్మరి కమ్మరి/ మంగలి చాకలి దూదేకుల
పీడిత కులాల సబ్బండవర్ణాలు/నువ్ పాడిన 'నరుడో భాస్కరుడా'
పాట బీటిల్స్‌లా/ స్వరపరచి కదంతొక్కుతున్నారు
ఉట్నూరునుంచి/ చిక్కోలు దాకా
నువ్ వినిపించిన /ఛండాల చరిత్ర విన్నారు'... (పేజీ.. 41)

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ) మరణం విప్లవోద్యమంలో ఒక కుదుపు. జంగల్‌మహల్ నిర్మాణంలో ఉండగానే రాజ్యం చేసిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన విప్లవ కాంతిపుంజం కిషన్‌జీ. ఆయన అందించిన పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకుంటు, ఆయనతోటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటునే అమరవీరుల లోకంలో కిషన్‌జీకి పలుకుతున్న స్వాగతంగా 'కోటి దండాలు' కవితను బరువెక్కిన హృదయంతో చెమ్మగిల్లిన కళ్ళతో ఇలా రాశారు ఈ కవి.

'పెద్దపల్లినుంచి జంగల్‌మహల్ దాకా
గోదావరి నుంచి బ్రహ్మపుత్ర దాకా
ప్రస్థానం సాగించిన యోధాగ్రేసురుడు
శ్రమజీవుల స్వేద బిందువుల
సౌందర్యానికి ఫిదా అయినవాడు
దోపిడి దొరల గడీల మీద
మెరుపుదాడి చేసిన గెరిల్లా నేత
రైతాంగ జైత్రయాత్రల వ్యూహకర్త'... (పేజీ... 99)

తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ గూర్చి 'జైశంకర్', తెలంగాణ సాహితి శిఖరం సామల సదాశివ గూర్చి 'ఏక్ సహర్ గుజర్ గయా'అని రాసిన కవితలు ఆకట్టుకుంటాయి. వారితోటి గడిపిన క్షణాలను మనస్సు పొరల్లోంచి వెలికితీసి సానపెట్టుకుంటాం ఈ కవితలను చదివినంక.

దామెర రాములుగారి కవిత్వంలో రెండు బలమైన అంశాలు కనిపిస్తాయి. ఒకటి జరుగుతున్న తెలంగాణ ఉద్యమం గూర్చికాగా రెండవది దళిత బహుజనుల గూర్చి. ఈ అంశాలమీద అలవోకగా కవిత్వం రాస్తారు. ఈ సంపుటిలో అత్యధికంగా రాసిన కవితలు ఆయనను దళిత బహుజనుల ప్రతినిధిగా నిలబెడతాయి అనటంలో సందేహం అక్కర్లేదు. దళితుల వేదనాభరితమైన జీవితాన్నిగూర్చి రాసిన జాషువా గుర్తుకువస్తారు. కులాతీతమైన, మతాతీతమైన సమాజాన్ని అందరు కోరుకుంటున్నారు కానీ ఆచరణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది ప్రస్తుత పరిస్థితి. ఆయన స్వయంగా అనుభవించిన చేదు సంఘటనలను 'పుట్టుబానిసను కాను ధిక్కార స్వరాన్ని'అంటూ ఇలా అక్షరాల్లో బంధించారు.

స్నేహ పరిమళాన్ని వెదజల్లిన మిత్రుడు
ప్రేమ వరాశి వొలకబోసిన ప్రేయసి
నీ కళానైపుణ్యానికి సలాంజేసినా
సోకాల్డు నాగరికులు సైతం
ఒక్కసారి నీ కులం వాసన పసిగట్టారా
మనసంతా కకావికలమై
భూమిబద్దలైనట్టుగా భావిస్తారు'... (పేజీ... 93)

దళిత బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులువేయాలని కోరుతూ అంబేద్కర్ ఆలోచనలను, పూలే విధానాలను ఆకలింపుచేసుకుంటూనే సమసమాజ నిర్మాణంలో భాగంకావాలని కవితల్లో వెల్లడిస్తున్నారు. వాడలపై, విగ్రహాలపై జరుగుతున్న దాడులమీద ఆగ్రహం ప్రకటిస్తునే ఐక్యంకావాలని ఆశిస్తున్నారు. 'ఆ మనువు కుళ్లుబుద్ధితో మళ్ళీ నవ్వాడు..., సడలని ధైర్య సంరావం, దళపతి, చావుడప్పు, అగ్గికుండ, నీ బలమెంత, విశ్వమానవుడు'లాంటి కొన్ని కవితలు ఆయన వ్యక్తీకరణలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఆత్మగౌరవంకోసం, సమాన హక్కులకోసం ఉద్యమిస్తూనే 'ఇక నేను ఏమాత్రం/ పుట్టు బానిసను కాను/ ధిక్కార స్వరాన్ని'అని ప్రకటించారు.

స్త్రీలమీద జరుగుతున్న అత్యాచారాల గూర్చి, ప్రపంచ పోలీస్ అమెరికా ఆధిపత్యం గూర్చి, ఆదివాసి ప్రాంతంలోని రోగాల గూర్చి, ధరల పెరుగుదల గూర్చి, రైతుల ఆత్మహత్యలతోపాటు వారి ఆక్రందనల గూర్చి, ప్రభుత్వ ఉదాసీనత గూర్చి, యువత ఆకాంక్షలగూర్చి, అవినీతిగూర్చి కవిత్వంలో చక్కటి ప్రతీకలతో రాశారు.

ప్రజల ఆరోగ్యాన్ని సరిచేసే డాక్టరుగానే కాకుండ సమాజానికి పట్టిన రుగ్మతలను కూడా తనదైన పద్ధతిలో శస్త్రచికిత్సచేస్తున్న రాములు గారికి నిర్మల్ అన్న, ఆదిలాబాద్ అన్న అమితమైన ప్రేమ. 'స్వర్ణభూమి నిర్మల్'లో ఇలా అంటారు. 'పులిని తరిమిన కుందేళ్ల/ధీరభూమి నాది/ తెలుగు ఉర్దూ మరాఠల/ సమ్మిశితం జనపదాలు/ బహు భంగిమల కొయ్యబొమ్మలు/తెలుగుతల్లి మునివాటిక అలంకరణలు.'

తెలంగాణ నేల ఉద్యమాల ఖిల్లా. ఓరుగల్లు పోరుగల్లు బిడ్డ పౌరుషం ధిక్కార స్వరాలై, ఊరూరా ఉద్యమనెగడులను మండించే 'కుర్రాయి'లను అందుకోండి. ఇలా ప్రజ్వలించండి.

-గోపగాని రవీందర్

రాంగ్‌వే నుంచి రైట్‌వేకి

నవల : రాంగ్ వే
రచయిత:
ఎన్.ఎమ్.ప్రాణ్‌రావ్
ప్రతులకు: విశాలాంధ్ర,
ప్రజాశక్తి, నవోదయ
పుస్తకాలయాలు మరియు
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ
కేంద్రాలలో లభిస్తున్నాయి.
వెల: 80 రూపాయలు.

ఎలా సంపాదిస్తున్నామని కాదు ఎలాగైనా సంపాదించటం ముఖ్యం అను దిగజారుడు తనం ఇప్పుడు దేశీయం. ఏ భేదాల్లేకుండా ప్రతి స్థాయి వ్యక్తీ యిలాగే ఆలోచిస్తున్నాడు. ఇదే ఆచరిస్తున్నాడు. దీనికి వ్యతిరేకులైన వాళ్ళని అసమర్థులుగా చేతకాని వాళ్ళుగా అగౌరవ పరచడం మనుషుల సహజ లక్షణమైపోయింది.

లంచాలు తీసుకున్నాడా, దోచుకున్నాడా, మోసగించి సంపాదించాడా ఇవేమీ పట్టించుకోని ఆక్షేపించని, తప్పుపట్టని విషయాలేకాక- ఇవన్నీ సమర్థతగల గొప్ప సంగతులైపోయాయి. నీతి, నిజాయితీ, నిబద్ధత అనేవి పనికిమాలిన సిగ్గుపడే విషయాలయ్యాయి.

కానీ సమాజం గమనించని వాస్తవం ఏమిటంటే ఏ విలువలు లేకపోవటం కుటుంబం- సమాజం- దేశం పతనానికి, విధ్వంసానికి దారితీస్తుందని.

వీటిని గమనించని 'రాంగ్‌వే' నవల మనల్ని హెచ్చరిస్తుంది. నవల్లోని కథా కాలం స్వాతంత్ర్యం ముందునుండి నేటివరకూ సాగి అవినీతి, లంచగొండితనం, స్వాతంత్ర్యం ముందునుంచీ కొనసాగి ఇప్పుడు మరిన్ని వెర్రితలలు వేసిందని చెపుతుంది.

ప్రముఖ కవి దార్శనికుల నగ్నముని ముందుమాట రాసిన ఈ నవల కరప్టడ్ అయిపోయిన మనుషుల ఆలోచనాతీరు, ఆచరణ మారాలనే రచయిత ఎస్.ఎమ్.ప్రాణ్‌రావ్ ఆవేదనలోంచి వచ్చింది.

ఈ నవల 'రాంగ్‌వే'ని రచయిత- అవినీతితో రాజీపడకుండా, విలువలు కాపాడుకుంటూ, అవినీతిలో పీకలదాకా కూరుకుపోయి కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న ఈ సమాజానికి ప్రాణవాయువు అందించాలని తపిస్తున్న అన్ని వర్గాల ప్రజలకు అంకితం ఇవ్వటం, విలువల పట్ల రచయిత ప్రాణారావుకున్న నిజాయితీ- తపనే కారణం. అన్నింటిలో పోటీతత్వ వలన, పోల్చి చూసుకోవటంవల్ల, నిర్మాణంలోవున్న అసమానతవల్ల, సంక్షోభంలో పడేస్తున్న విధానాల వల్ల జీవితంలోకి 'రాంగ్ వే' ప్రవేశించింది. కానీ ఎలాంటి పరిస్థితుల్లో అయినా విలువల్ని జీర్ణించుకునే వ్యక్తులు ఆ సమాజానికి మార్గదర్శకులౌతారు. పై పరిస్థితులు మార్చటానికి కార్యోన్ముఖులు అవుతారు. ఇది చెప్పటమే 'రాంగ్ వే' నవల ఉద్దేశ్యం.

నవలా నాయకుడు ముకుందం తండ్రి కేశవరావు లాగానే నీతి నిజాయితీలకోసం, విలువలకోసం జీవించాడు. వాటిలోనే ఆత్మవిశ్వాసంతో- తృప్తితో తననితను పరిపూర్ణమైన వాడిగా తీర్చిదిద్దుకున్నాడు. చుట్టూ ఎంతమంది తనని వంచించాలని ప్రయత్నించినా విలువల్ని వదులుకోలేదు. అందర్నీ తన వ్యక్తిత్వంతో-ఆత్మవిశ్వాసంతో గెలిచాడు. అంతవరకూ తనూ, తన కుటుంబం విలువలు పాటిస్తే చాలని భావించిన ముకుందం సుమన్ పాత్రతో కరెప్టడ్ అయిపోయిన సమాజాన్ని మార్చటానికి ఉద్యమాలు అవసరమని తననితాను ఉత్తేజపరుచుకుంటాడు. అయితే నవల చివరిలో- సుమన్ కూడా ముకుందను వంచించటానికే ప్రయత్నిస్తుండగా నవల ముగుస్తుంది. కానీ ముకుందంలో కలిగిన ఉత్తేజం, ఉద్యమ స్ఫూర్తే ప్రారంభం.

నవల చదువుతూన్నంతసేపు మన సమాజాన్ని ఒక అద్దంలో పెట్టి చూపిస్తున్నట్టుగా వుంటుంది. ఏ కల్పనలు లేకుండా వాస్తవికంగా ఒక మంచి నవల అందించిన రచయిత శ్రీ ఎన్.ఎమ్.ప్రాణ్‌రావ్‌కి ధన్యవాదాలు.

-బులుసు సరోజినీదేవి

తెలుగులో సామవేదము

వేదములు నాలుగు- అవి బుక్‌యజుర్ సామ అధర్వణములు. ఇవి వరుసగా పద్య గద్య గేయాత్మకములు. 'వేదానాం సామవేదోస్మి' అని భగవద్గీతలో ఉంది. సామవేదమును గానం చేసేవారిని ఉదాత్త అంటారు. సామవేదంలో ఎక్కువ భాగం ఋగ్వేదమునుండి ఉద్ధరింపబడిన మంత్రములే ఉన్నాయి. స్వరభేదము చేత అర్థ భేదము సంక్రమించింది. సామవేదమునకు లోగడ సాయణాదుల భాష్యములు ఉన్నాయి. ఇటీవల తెలుగులో మ్రరిక్ష్టారెడ్డిగారు చతుర్వేద భాష్యమును సమగ్రముగా వేదమంత్రములు అన్నింటినీ తమ సంపాదకత్వములో వెలువరించినారు. అదే పద్ధతిలో దయానంద భాష్యము ఆధారంగా శ్రీ యం.వి.నరసింహారెడ్డిగారు నాలుగు వేదములను సరళమైన తెలుగులో సహజమైన వచన రచనాశైలిలో వెలువరించినారు. ఈ వరుసలో ఇది సామవేదము ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ గ్రంథమునకు కలికితురాయిగా శ్రీ శీలం జగతీధరుల వారి పాండితీ మండితమైన పీఠిక కూడా సమగ్రమైనది ఉంది. యం.వి.నరసింహారెడ్డిగారు ఒక వ్యక్తిగా కాక ఒక శక్తిగా ఎదిగిన క్రమాన్ని జగతీధర్‌గారు ప్రశంసించారు. అంతేకాదు వేదము చాతుర్వర్ణ్యములవారు స్త్రీలు కూడా అధ్యయనము చేయవచ్చునని వివరించారు. యజ్ఞాగ్నిలో మనము హనము చేయవలసిన జంతువులు కామక్రోధాది అదిషట్ వర్గములును.

సామవేదము
-తెలుగు వచన అనువాదము
వెల: రూ.200/-,
ప్రతులకు: సాహిత్య నికేతన్,
కేశవ నిలయం, బర్కత్‌పురా,
హైదరాబాదు- 500027.

సామవేదమునకు పదహారు ఉపనిషత్తులున్నాయి. వాటిని అనుసంధానం చేసుకోవాలి. కాలక్రమంలో సామవేద పాఠక్రమాలు ఎన్నో లుప్తమైపోయాయి. ఇవ్వాళ సామవేద పండితులు వేళ్లమీద లెక్కింపదగినవారు మాత్రమే మిగిలారు. ప్రపంచ సంగీత వాఙ్మయమంతా సామవేదమునుండే పుట్టింది. వేదములు భారతదేశంలో పుట్టినా ఒక మతమునకు ప్రాంతమునకు కాలమునకు చెందినవి కావు అని నరసింహారెడ్డిగారు తమ ముందుమాట 40వ పుట.లో పేర్కొనటం యదార్థమే.

భగవంతుని సూచనలు ఆదేశాలు ఋషుల ద్వారా మానవునిలో చైతన్యము కలిగించి నిరంతర అన్వేషణలో విజ్ఞానము విరజిమ్మింది (ముందుమాట వేదము ఏకం సత్ విప్రాఃబహుధావదంతి అని చెప్పింది. వేదములో ప్రకృతి పూజ ఉంది. ఇక్కడి ఇంద్రుడు సూర్యుడే. వేదములో జీవేశ్వర భేదం సూచింపబడింది. వేదము విశ్వసాహిత్యంలో తొలి గ్రంథము. వేదములోని ఋషుల పేర్లు. పౌరాణిక ఋషుల పేర్లు ఒకే రకంగా ఉన్నప్పటికీ వారూ వీరూ ఒకరు కారు. విశ్వమిత్ర అంటే ప్రపంచమునకు స్నేహితుడు అని అర్థం.

వేదర్షులు మంత్రకర్తలు కారు మంత్రద్రష్టలు మంత్ర స్మర్తలు- అని నరసింహారెడ్డిగారు సూచించారు. వేదములలో నీతి వాక్యములే కాక సమస్త భౌతిక విద్యాజ్ఞానము కూడా ఉంది. అవి తెలియకపోవటంవలన భారత జాతి క్రమంగా నిర్వీర్యమైంది. ''శీతలత్వము చేత వేడిని చల్లార్చినట్లు జ్ఞానముచేత అజ్ఞానమును జయింపవలెను'' (50వ పుట.)

''ఎవరు తెల్లవారకముందే లేచెదరో వారి ఇంట సిరిసంపదలు నిలుచును. ఏ స్త్రీ ఉషోదయ మువలె గుణవతి అగునో ఆ ఇంటిలో శాంతి సిరి సంపదలు స్థిరముగా ఉండును'' (283వ పుట.) సౌమ్యుణ్ణి అందరూ ఆదరిస్తారనీ దుష్టుణ్ణి దృష్టుణ్ణి మాత్రం ఎదిరించాలని వేదము బోధించింది (186వ పుట.)

నరసింహారెడ్డిగారు ఈ భాష్యములో ఆది భౌతికార్థాన్ని వివరించారు. ఇది దయానందమతము- సాయణుడు కర్మపరంగానూ అరవిందుడు జ్ఞానపరంగానూ వ్యాఖ్యానించారు.

నిజానికి మూడూ సరియైనవే!
వేదానికి ఇంకా అర్థాలున్నాయి.
నరసింహారెడ్డిగారి ప్రయత్నం సఫలమైనది.

-ముదిగొండ శివప్రసాద్

తెలుగు నవలలు - విమర్శనాత్మక పరిచయం

ఆంగ్లంలో ''హండ్రెడ్ బెస్ట్ నవల్స్, హండ్రెడ్ గ్రేట్ నవల్స్, 100 నవల్స్ మస్ట్ షుడ్ రీడ్, హండ్రెడ్ క్లాసిక్స్ మస్ట్ రీడ్, హండ్రెడ్ క్లాసిక్స్‌రీ విజిటెడ్''అంటూ రకరకాల పేర్లతో నవలా పరిచయాలు పుస్తక రూపంలో వచ్చాయి. ఈ నలలను పూర్తిగా చదివే ఓపిక, తీరిక లేనివాళ్ళకు ఈ సంక్షిప్త పరిచయాలు వాళ్ళకు సంతృప్తిపరచగలవు. ఇంకోవైపు కొత్త తరానికి ఆ పుస్తకాలు పరిచయమవుతాయి. భవిష్యత్తులో వారిని మూలగ్రంథ పఠనం వైపుకు మళ్ళిస్తాయి. యూరోపియన్లకు హండ్రెడ్ అనే నెంబర్ మీద వున్న మోజువల్ల ప్రతిదానికి హండ్రెడ్ కొలమానంగా పెట్టుకుని పుస్తకాలు తీసుకువస్తుంటారు. అలా హండ్రెడ్ బెస్ట్ రొమాంటిక్ నవల్స్ మొదలుకొని హండ్రెడ్ ఫోస్ట్‌స్టోరీస్ వరకు బోలెడన్ని ఉదాహరణలు కనిపిస్తాయి. చూడదగ్గ నూరు చిత్రాలు, చూడదగ్గ నూరు ప్రదేశాలు, నూరుమంది ప్రముఖులు- ఇలా రకరకాలుగా 'హండ్రెడ్' కొనసాగుతూ వుంటుంది. ఇవికాకుండా కొందరు వ్యక్తులు 'నాకు నచ్చిన నూరు నవలలు, నాకు నచ్చిన నూరు సినిమాలు' పేరిట పుస్తకాలుగా తీసుకువస్తుంటారు.

ఆంగ్లంలో మాదిరిగానే తెలుగు సాహిత్యంలో కూడా ఉత్తమ నూరు నవలలు, ఉత్తమ నూరు కథలను ఎంపికచేయడం అంత సులభంకాదు. వాదాలు, ధోరణులు, ప్రాంతాల వారీగా విడివిడి ముఠాలుగా ఏర్పడిన తెలుగు సాహిత్యంగానే ఏకాభిప్రాయం సాధించడం చాలా కష్టమైన పని. ఇవన్నీ గమనించిన ఒక తెలుగు దినపత్రిక సాహిత్య పేజీ నిర్వాహకులు, తెలుగులో వచ్చిన ఉత్తమ నూరు నవలలను సూచించవలసిందిగా పత్రికా ప్రకటన ఇవ్వడంతో బోలెడంత మంది స్పందించి తమతమ అంచనాలమేరకు జాబితాను రూపొందించి పంపారు. వాటన్నింటినీ విశ్లేషించి, క్రోఢీకరించిన పత్రికవారు సరికొత్త జాబితాను ప్రకటించారు. కాని అదికూడా సమగ్రమని చెప్పలేం. ఎందుకంటే జాబితాను రూపొందించే ఆలోచనా ధోరణిలోనే లోపం వుంది. ఎంతసేపూ నూరు నవలలనగానే, ముందు నూరు మంది రచయితల పేర్లను తయారుచేసుకుని వారి నవలలను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రణాళిక కేవలం 'నూరు నవలలు'అనే శీర్షికకు మాత్రమే సరిపోతుంది. అందరు రచయితలు ఉత్తమ నవలలు రాయలేరు కదా! చాలామంది పాపులర్ రచయితలే. రచయితలనుబట్టి కాకుండా, నవలలనుబట్టి ఎంపికచేస్తే బాగుంటుంది. రంగనాయకమ్మ, రావిశాస్త్రి, అంపశయ్య నవీన్, వాసిరెడ్డి సీతాదేవి, కేశవరెడ్డి లాంటి రచయితల పుస్తకాలను మూడునాలుగు కూడా తీసుకోవచ్చు. ఒక రచయిత, ఒకే పుస్తకం అనుకుంటే అన్ని మంచి నవలలు రావు. లేదా ఉత్తమ నవలలు నూరు వుండాలన్న నిబంధన పెట్టుకోకూడదు. ఎన్ని వుంటే అన్నింటి జాబితా ఇచ్చి 'తెలుగులో ఉత్తమ నవలలు'అని పేర్కొంటే సరిపోతుంది.

విచిత్రమేమిటంటే, తెలుగులో నూరు నవలలు పరిచయం కంటే ముందుగా ఆంగ్ల సాహిత్యంలో వచ్చిన ఉత్తమ నవలల పరిచయానికే పత్రికలు ఎక్కువగా ప్రాధాన్యతనివ్వడం జరిగింది. మాలతీ చందూర్, కస్తూరి మురళీకృష్ణ, ముక్తవరం పార్థసారథి లాంటివాళ్ళు ప్రముఖ ఆంగ్ల నవలల పరిచయాలను సీరియల్‌గా రాయడం, తర్వాత అవి పుస్తక రూపంలో రావడం కూడా జరిగింది. ఆంగ్ల నవలల పరిచయాలయినా, తెలుగు నవలల పరిచయాలయినా ఏదైనా పత్రికకు సీరియల్‌గా రాయాలే తప్ప నేరుగా రాయడం కుదరని పని.

తెలుగులో మొదటిసారిగా నూరు నవల

అసూయను పారద్రోలే ఘృష్ణేశ్వరుడు

ఆ స్వామిని ఏ పేరుపెట్టి పిలిచినా వచ్చి ఆదుకుంటాడు. భక్తితో ఏది సమర్పించినా అందుకుని కటాక్షిస్తాడు. అందుకే ఆ స్వామి భక్తవశంకరునిగా, భోళాశంకరునిగా పూజలందుకుంటున్నాడు. శివ పూజ అనేది ప్రాప్తంతో కూడుకున్నది. శివాను గ్రహం ఉంటేనే గానీ శివపూజ లభించదు. శివపూజకు ఎలాంటి నియమ నిబంధనలూ లేవు. భక్తితో రెండు చుక్కలు నీరు పోస్తే మహాదేవుడైన ఆ స్వామి పెద్దమనసు చేసుకుని కటాక్షిస్తాడు. అయితే ఉండాల్సిందల్లా భక్తి, విశ్వాసం. శివుడు తన భక్తుల్ని అనుగ్రహించడానికి అనేకచోట్ల వెలిసినప్పటికీ, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలే ఎక్కువగా ప్రసిద్ధిపొందాయి. కారణం ఆయా క్షేత్రాలలో శివుడు భక్తుల అభీష్టంమేరకు లోక కళ్యాణంకోసం వెలిశాడు. అలా శివుడు తనకుతానుగా ఆవిర్భవించిన క్షేత్రాలే ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలుగా ప్రసిద్ధిపొందాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల మహిమ అపారం. ఆ మహాదేవుడు జ్యోతిర్లింగ రూపంలో వెలసిన మరో పుణ్య ధామం 'వెరూల్'. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు 35 కిలోమీటర్లు దూరంలో ఉందిది. శివుడు ఇక్కడ ఘృష్ణేశ్వరస్వామిగా కొలువులందుకుంటున్నాడు. వెరూల్ దివ్య క్షేత్రంలోని శ్రీఘృష్ణేశ్వర స్వామి ఆలయం సుందరమైనది. మనోహరమైన కట్టడాలతో అలరారుతున్న ఈ ఆలయం చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. ప్రశాంతమైన వాతావరణంలో అలరారుతున్న ఈ దివ్యాలయాన్ని రోజూ వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. సాక్షాత్తు మహాదేవుడు జ్యోతిర్లింగ రూపంలో వెలిసిన వెరూల్ దివ్యక్షేత్రంలో

పూర్వం నాగజాతి ఆదివాసులుండేవారు. 'బాంబీ' అంటే పాముల పుట్టలని అర్థం. పాముపుట్టలను మరాఠీలో 'వారుళ్'అంటారు. వారుళే కాలక్రమంలో వెరూల్‌గా రూపాంతరం చెందినట్లు తెలుస్తోంది. అలాగే పూర్వకాలంలో ఈ క్షేత్రాన్ని 'యెల'అనే రాజు పాలించేవాడు. అతని రాజధాని 'యేలాపూర్'. ఆ యేలాపూర్ యేలూరుగా, వెరూల్‌గా పేర్గొంచింది. మనోహరమైన కట్టడాలు, ప్రాకారాలతో అందంగా అలరారుతున్న శ్రీ ఘృష్ణేశ్వర స్వామి ఆలయం అతి పురాతనమైనది. ఈ ఆలయాన్ని జైజాబాయి, అహిల్యాదేవి హోల్కర్ తదితర భక్తులు పునర్నిర్మించారు. అలాగే ఈ ఆలయ గోపురానికి జయరామ్ భాటియా అనే భక్తుడు స్వర్ణ రేకు తాపడంచేశాడు. అలాగే 24రాళ్ళ స్తంభాలతో సభామండపాన్ని కూడా చేయించాడు. అతి పురాతనమైన ఘృష్ణేశ్వరం మహిమాన్వితమైనది. శివుడు ఈ క్షేత్రంలో కొలువై ఉండడానికి ఓ పురాణ గాథ ప్రచారంలో ఉంది.

పూర్వం దేవ పర్వతంపై సుదేహ, సుధర్ముడనే బ్రాహ్మణ దంపతులు నివసించేవారు. సుదేహకు సంతానం కల్గకపోవడంతో తన చెల్లెలు అయిన ఘుశ్మను తన భర్తకిచ్చి వివాహంచేసింది. కొంతకాలానికి ఘుశ్మ గర్భాన్ని ధరించి ఓ మగశిశువుకు జన్మనిచ్చింది. ఆ కొడుకు పెద్దవాడై సంతోష భాగ్యాలతో ఉండడంతో ద్వేషాన్నిపెంచుకున్న సుదేహ, తన చెల్లెలు ఘుశ్మ కొడుకును చంపించి, చెరువులో పడవేయించిందట. శివభక్తురాలైన ఘుశ్మ తన కొడుకు మరణించినా చెక్కుచెదరకుండా శివార్చన చేసిందట. శివుడు అనుగ్రహించి ఘుశ్మ కొడుకుకి పునర్జీవితం ప్రసాదించాడు. దీనికి కారణమైన సుదేహను భస్మం చేయడానికి ఉద్యుక్తుడవుతుండగా తన అక్క చేసిన పాపాన్ని క్షమించమని, లోకకళ్యాణం కోసం స్వామిని అక్కడ వెలవమని ప్రార్థించిందట. ఘుశ్మ అభీష్టంమేరకు శివుడు అక్కడ ఘుశమేశ కామధేయుడై జ్యోతిర్లింగ రూపంలో వెలిశాడు. అలాగే స్వామి ఇక్కడ వెలవడం వెనుక మరో పురాణ గాథ కూడా ఉంది. ఒకరోజు శివుడు, పార్వతి కామ్యక వనంలో ఏకాంతంలో ఉండగా పార్వతికి దాహం వేసిందట. అపుడు శివుడు పాతాళంనుంచి భోగవతి నీటిని పైకి రప్పించి ఆమె దాహం తీర్చాడట. అది నీటి కొలనుగా మారి శివాలయ తీర్థంగా పేర్గాంచింది. పార్వతి మాత తన పాపిటను అలంకరించుకోవడానికి కుంకుమ, కేసరిలను శివాలయ తీర్థంలో కలిపిందట. ఆమె చేతిలో కుంకుమతో శివలింగం తయారయ్యిందట. ఆ లింగం నుంచి ఓ దివ్యజ్యోతి ఉద్భవించగా పార్వతిమాత ఆ దివ్య జ్యోతిర్లింగాన్ని ఒక రాతి లింగంలో వుంచి, లోక కళ్యాణంకోసం అక్కడ ప్రతిష్టించిందట. అనాటినుంచి ఆ పూర్ణ జ్యోతిర్లింగానికి కుంకుమేశ్వరుడనే పేరొచ్చింది. సాక్షాత్తు పార్వతిమాత ప్రతిష్టించిన జ్యోతిర్లింగం కాబట్టే దీనికి ఇంతటి మహత్తు ఏర్పడిందంటారు. ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం ఉన్న ఆలయం విశాలమైనది. పూర్తిగా రాతి కట్టడం, ఆలయానికి ముందు భారీ ఆకారంలో ఉన్న రాతి నంది ఉంది. ఈ నంది శిల్పం అందం వర్ణనాతీతం. గర్భాలయానికి ముందు ఎడమవైపు భాగంలో ఘృష్ణేశ్వరుడు కొలువుదీరాడు. ఆలయ ప్రాంగణంలో పార్వతి మాత ఆలయం ఉంది. గర్భాలయంలో ఉన్న ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం సర్వపాప హరణం. ముక్తిదాయకం. భూమిలోకి చొచ్చుకుపోయి ఉన్న ఈ జ్యోతిర్లింగానికి దిన వారాలతో పనిలేకుండా జల, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు జరుగుతాయి. అలాగే మాఘ, కార్తీక మాసాలలో ఈ ఆలయంలో విశేష పూజలు జరుగుతాయి. ఈ ఆలయంలో ఇంకా ఆంజనేయ స్వామి, వినాయక మందిరాలు కూడా ఉంది. ఘృష్ణేశ్వరంలో బసచేయడానికి పెద్దగా వసతి సౌకర్యం లేదు. అందువల్ల ఔరంగాబాద్‌లో బసచేసి ఈ స్వామిని దర్శించుకోవచ్చు.

ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం పూర్వజన్మల పుణ్యఫలం.

-దాసరి దుర్గాప్రసాద్
సెల్: 8977676085

ఆది, అంతమూ నీవే! ఆదిపరాశక్తివి నీవే!

ఈ వారం మనం బార్హతం శతకమంలోని మూడవదైన మణిమధ్యా స్తబకంలోని మరికొన్ని శ్లోకాలను చదువుదాం.

12. ఉద్గత కీలం మూలమిదం భిన్న కపాలం శీర్షమిదం।
ఉజితమోహం చిత్తమిదం వాసన శక్తిర్మాం విశతు॥
13. దృశ్య విరక్తం చక్షురిదం భోగవిరక్తం కాయమిదం।
ధ్యేయ విరక్తా బుద్ధిరియం వాసవశక్తి ర్మాం విశతు॥

14. చక్షు రదృశ్య జ్వాలభృతా వ్యాపక ఖేన ప్రోల్లసతా।
విస్తృత కాయం సందధతీ వాసవశక్తి ర్మాం విశతు॥
15. కాయ మజస్రం వజ్ర దృఢం బుద్ధి మశేషం వ్యాప్తిమతీ।
దివ్యతరంగైరా దధతీ వాసవశక్తి ర్మాం విశతు॥
16. మూర్ధ్ని వతంతీ వ్యోమతలా త్సంతతమంత స్సర్వత నౌ।
సంప్రవహంతీ దివ్యరుధై వాసవశక్తి ర్మాం విశతు॥
17. భానువిభాయాం భాసకతా దివ్యసుధాయాం మోదకతా।
కాపి సురాయాం మాదకతా వాసవశక్తిర్మాం విశతు॥

కిరణాలు వెళ్లే మూలాధారం, కపాల భిన్నమైన శిరస్సు, మోహాన్ని వదిలేసిన మనస్సు కలిగిన నా ఈ దేహంలో ఆ వాసవ శక్తి ప్రవేశించుగాక (కపాల భేదన జరిగాకనే గణపతి ముని ఈ ఇంద్రాణీ సప్తశతి వ్రాశారనేది మనకు తెలిసిందే)! విరక్తితో ప్రపంచంపై నుండి దృష్టి మరల్చిన ఈ కన్ను, భోజానుంచి విరక్తమైన ఈ దేహం, ధ్యేయ వస్తువునుండి విరక్తమైన బుద్ధి కలిగిన నన్ను (నాలో) ఇంద్రాణీదేవి ప్రవేశించుగాక!

అంతేకాదు. కంటికి కనిపించని జ్వాలలను భరిస్తూ ఎంతో ఎక్కువగా ప్రకాశవంతంగా ఉంటూ విస్తరించిన ఆకాశాన్నే శరీరంగా కలిగిన ఆ ఇంద్రాణీదేవి నన్ను ప్రవేశించుగాక! సంపూర్ణమైన బుద్ధిని వ్యాపింపజేస్తూ, ఎల్లవేళలా శరీరాన్ని వజ్రంలాగా దృఢంగా ఉంచే ఆ ఇంద్రాణీదేవి నన్ను ప్రవేశించుగాక! ఆకాశంనుంచి శిరస్సుపై పడ్తూ శరీరమంతా వ్యాపించి నిరంతరమైన దివ్య ప్రవాహంగా ఉండే ఆ ఇంద్రాణినాలో ప్రవేశించుగాక!

సూర్యుడిలోని ప్రకాశతత్వమూ, అమృతంలోని ఉల్లాసం, సురలోని మాదకతా- ఈ మూడు వాస్తవ శక్తిలోనే ఉన్నాయి. ఆ వాసవశక్తి నాలో ప్రవేశించుగాక!

18. భాసయతాన్మే సమ్యగ్ఘృతం మోదముదారం పుష్యతుమే।
సాధుమదం మే వర్ధయతా న్నిర్జర భర్తుశ్శక్తిరజా॥

ఇంద్రాణీ శక్తి నా మానసిక సత్యాన్ని బాగా ప్రకాశింపజేయుగాక. నాకు బాగా సంతోషాన్నిస్తూ సాత్విక బలాన్ని కూడా ఇచ్చుగాక!

19. కశ్చన శక్తిం యోగబలా దాత్మశరీరే వర్ధయతి।
ఏపి వివృద్ధిం భక్తిమతః కస్య చిదీశే త్వం వపుషి॥
20. సాధయతాంవా యోగవిదాం కీర్తయతాంవా భక్తిమతాం।

వత్సల భావాదింద్ర వధూ ర్గర్భభువాంవా యతిపశం॥

అమ్మా! ఇంద్రాణీ! యోగబలంతో ఒకడు తన దేహశక్తిని పెంపొందించుకుంటే, ఇంకొకరి శరీరంలో నీవే వృద్ధినొందుతూ ఉంటావు. సాధన చేసి యోగవేత్తలకూ, కీర్తించే భక్తులకూ కూడా వాత్సల్యంతో తన గర్భంనుంచి వెలువడిన వారికి వశమైనట్లే ఆ ఇంద్రాణీదేవి వశమవుతుంది.

21. యస్య సమాధిఃకోపి భవే దాత్మమనీషా తస్యబలం।
యస్తవ పాదాంభోజరత స్తవ్యఖలు త్వం దేవి బలం॥
22. ద్వాదశవర్షీ యోగబలా ద్యాఖలు శక్తిర్యుక్త మతేఃి।
తాం శచి దాతుం భక్తిమతే కాపి ఘటే తే మాతరలం॥

అమ్మా! ఇంద్రాణీదేవీ! 12 సంవత్సరాలు యోగబలనియుక్తుడై ఉండినవానికి ఏ శక్తి అయితే కలిగిందో, నీ భక్తుడనైన నాకు అటువంటి శక్తినే ఇవ్వాలీ అని నీవనుకుంటే ఒక్క గడ్డి చాలు. నాకు తప్పక ఇవ్వగలవు.

23. యోగబలాద్వా ధ్యానకృతో భక్తిబలాద్వా కీర్తయత।
యాతు వివృద్ధిం విశ్వహితా వాస్తవశక్తిర్మే వపుషి॥

యోగబలంతో ధ్యానించే వారికీ, భక్తిబలంతో కీర్తించే వారికీ ఏ శక్తి అయితే వృద్ధి చెందుతుందో, అలాటి ఇంద్రాణీ సంబంధమైన శక్తిని నా శరీరం కూడా పొందుగాక!

24. దుఃఖిత మేత శ్ఛ్రీరహితం భారతఖండం సర్వహితం।
త్రాతుమధీశా స్వర్జగత స్సుక్షమబుద్ధిం మాం కురుతాం॥

ఐశ్వర్యాన్ని కోల్పోయి సదా దుఖిఃస్తూన్న సర్వహితమైన ఈ భారత ఖండాన్ని రక్షించడానికి ఇంద్రాణీదేవి నాకు తగిన బుద్ధిని ఇచ్చుగాక!

25. సంతు కవీనాం భర్తురిమే సుందర బంధా శ్శుద్ధతమాఃి।
సన్మణి మధ్యా స్వర్జగతో రాజ మహిష్యాఃి కరణ సుఖాఃి॥

కవి భర్తయైన ఈ గణపతిముని వ్రాసిన సుందరమైన, అత్యంత శుభ్రమైన ఈ స్మరణిమధ్యా వృత్తాలు ఇంద్రాణీదేవి చెవికి సుఖాన్నిచ్చుగాక!

బార్హతం శతకంలోని మూడవదైన మణిమధ్యా స్తబకం ఇక్కడికో పూర్తి అయింది.

ఇపుడు

మూడవదైన బార్హతం శతకమంలోని మాత్రాసమక స్తబకములోని కొన్ని శ్లోకాలను తెలుసుకుంది.

1. శుక్ల జ్యోతిఃి ప్రకర్తర్వ్యాప్త స్సూక్ష్మోవ్యంతాన్ హరితాం హాసఃి।
జిష్ణోఃి పత్న్యా స్తిమిరా రాతి ర్ని శ్శేషం మే హరతా న్మోహం॥

కంటికి కనిపించని తెల్లని కాంతితో నలుదిక్కులా వ్యాపించినదీ, చీకటిని పారద్రోలేదీ అయిన ఇంద్రాణీదేవి చిరునవ్వు నా అజ్ఞానాన్ని పూర్తిగా తొలగించుగాక!

శృణ్వత్కర్ణా సదయాలోకా లోకేంద్రస్య ప్రియనారీ సా
నిత్యక్రోశై ర్విరుదద్వాణీం పాయాదేతాం భరత క్షోణీం॥

నేను చేసే ఈ స్తుతిని తన చెవులారా విని ఆ ఇంద్రాణీదేవి అపార దయ కలిగిన తల్లి. నిత్య శోకంతో చాలా రోదిస్తూ ఉండే వాక్కు కలిగిన ఈ భారతభూమిని ఇంద్రాణీదేవీ రక్షించుగాక!

3. దేవేషు స్వఃి పరిదీప్యంతీ భూతేష్విందౌ పరిఖేలంతీ।
శక్తిరిష్టో ర్ధిపదాం సంఘే హంతై తస్యాం భువి నిద్రాతి॥

స్వర్గంలో దేవతలలో ప్రకాశిస్తూ, చంద్రగోళంలో భూతాలలో క్రీడించే ఇంద్రాణీదేవి ఈ భూమిపై ఉండే మానవులలో మాత్రం నిద్రిస్తూ ఉంది. ఇది ఆశ్చర్యం కలిగించే విషయం. (అజ్ఞానులలో మూలాధార చక్రంలో నిద్రిస్తూ ఉంటుందని అంటారు) కదా!

4. నిద్రాణాయా అపి తేజ్యోతి ర్గంధాదేతే ధరణీలోకే।
మర్త్యఃి కించిత్ర భవంతీ శే త్వం బుద్ధాచే త్కిము వక్తవ్యం॥

తల్లీ! నిద్రిస్తూ ఉన్నా నీ తేజస్సు అనే గంధంవల్ల భూలోకంలో ఈ మనుష్యులు కొంతవరకూ సమర్థులుగానే ఉన్నారు. కానీ, నీవు ఆ మనిషిలో మేల్కొన్నావని తెలిస్తే ఇక చెప్పడానికే ముంటుందీ?

5. మేఘచ్ఛన్నో వ్యరుణ స్తేజో దద్యాదేవ ప్రమదే జిష్ణోఃి।
అత్ర స్థానా భవతీ గ్రంధీ చ్ఛన్నా స్యేవం కురుతే ప్రజ్ఞాం॥

అమ్మా! సూర్యుడు మేఘాలతో కప్పబడినా వెలుతురునిస్తాడు. నీవు గ్రంధులతో కప్పబడినా, భూలోకవాసులకు వారికి ప్రజ్ఞనిస్తూ ఉన్నావు.

6. ధ్యాయామో యత్కథయామో య త్పశ్యామో యచ్ఛు ణుమో యచ్చ!
జీవోమోవా తదిదం సర్వం నిద్రాణాయా అపితే భాసా!!

నీవు నిద్రిస్తూ ఉన్నా సరే, నీ కాంతివల్లనే మేము ధ్యానం చేయడం, పలకడం, చూడటం, వినడం, జీవించడం - ఇవన్నీ చేస్తూనే ఉన్నాం.

7. నాడీ బంధా దభిమానాచ్చ చ్ఛన్నా మాత ర్భవతీ దేహేః
ఏకాపాయా దితరో న్యే త్తస్మా ద్ద్వేధా తపసఃి పంథాఃి॥

అమ్మా! నాడీబంధం వల్లా, అభిమానం వల్లాకూడా నీవు దేహంలో కప్పబడి ఉన్నావు (అందుకే వాటిని గ్రంధులున్నారు). ఏ ఒక దానికి అపాయం కలిగినా రెండు నశిస్తాయి. అందువల్ల తపస్సుకు రెండు దారులు ఏర్పడ్డాయి. (ప్రాణ సంబంధమైనది ఒకటైతే మనస్సుకు సంబంధమైనదింకొకటి).

8. చిత్తం యస్య స్వజని స్థానే ప్రజ్ఞా బాహ్యే సభ వేద్యస్య।
ఆధత్సే త్వం భువనాధీశే బుద్ధా క్రీడాం హృదయే తస్య॥

అమ్మా ఎవరికి చిత్తం స్వస్థానంలో ఉంటుందో, ఎవరి ప్రజ్ఞ బయటకు తెలియదో అటువంటి వారి హృదయంలో తెలివివై నీవే ఉన్నావు (ఇక్కడ, 'మనస్సును తన మూలమైన హృదయంలోనే అణిచి ఉంచి, ఆలోచనకు అందకుండా పోవడం' అనే రమణ మహర్షి ఉపదేశంలో ఒక భాగం వెల్లడి అవుతుంది).

గురువుదీ ఎదురుచూపే

'స్వయం తీర్ణఃి పరాన్ తారయతి'-అని పూర్వులు అన్నారు. తాను తరించిన వాడు ఇతరులను తరింపచేయగలడని అర్థం. కొద్ది మార్పులతో శ్రీరమణులు ''సాక్షాత్కారం పొందిన వ్యక్తి ఇతరులకు కూడా సాక్షాత్కార విషయంలో సహాయం చేయగలడు. నిజమైన గురువు అతడే. దీక్ష అంటే అదే'' (పు.99 అమర చైతన్యము) అని అన్నారు. సాక్షాత్కార విషయంలో ఇతరులకు సహాయం చేయగలిగినవాడే నిజమైన గురువని అర్థం. అట్లా చేయలేని వారిని ఆశ్రయించేటప్పుడు పదిమార్లు ఆలోచించుకొని నిర్ణయించుకోవడం మేలని చెప్పనక్కర్లేదు కదా. సాక్షాత్కారం పొందడం అంటే ఆత్మనిష్ఠుడుగా ఉంటున్నవాడు. అలాంటి గురువు నకూ శిష్యునికీ భేదం ఉండదు. (ఆ గురువు దృష్ట్యా). ఆయన స్వ శరీరమాత్రుడు కాదు. శిష్యునితో ఆయన భేద భావం లేని అద్వైత అనుభూతి. ఇది గురువు దృక్కోణం నుంచి అన్నదని చెప్పనక్కరలేదు. శిష్యుని కోణం నుంచి అంతా ఆత్మయేనన్న అనుభూతి స్థిరపడేంత దాకా గురువుతో అద్వైత భావ స్థితిని భావించడు. ఐతే శ్రీరమణులు మాత్రం సాధన దశలో కూడా ద్వైతభావాన్ని అంగీకరించరు. ఇరువురికీ నడుమన భేదం బొత్తిగా లేదన్నది దృష్టిలో ఉంచుకునే 'సాధన' చేస్తూ ఆత్మనిష్ఠులు కమ్మన్నదే వారి మాటల తాత్పర్యంగా అగుపిస్తుంది. అసలు మానవ రూప గురువు పాత్రను గురించి కూడా వారిది విశేష అభిప్రాయం. గురువు తన శక్తిని ప్రసరించి శిష్యునికి ఆత్మసాక్షాత్కారం కలిగించకూడదా అని అడిగినపుడు వారు సమాధానమిస్తూ

-''నిజమే గురువు ఆత్మ సాక్షాత్కారాన్ని కల్గించలేడు. దానికి గల అడ్డంకులు తొలగించగలడు. ఆత్మ ఎ ప్పుడూ ఉన్నదే'' అని అన్నారు.

ఎవరి 'కృషి' వారిదే-ప్రయత్నం ఎవరిది వారిదే. 'అవతలి' వ్యక్తి జేబులోంచి తీసి ఇచ్చేది కాదు ఆత్మ సాక్షాత్కారం. ఐతే గురువు పాత్ర బొత్తిగా లేకపోలేదు. ఆయన చేసేపని శిష్యునికి చేసిపెట్టే పని చాలా ముఖ్యమైంది కూడా. అది శిష్యునికి ఆత్మ సాక్షాత్కారం సిద్ధించడానికి (భౌతిక, ఆధిభౌతిక) అడ్డంకులు ఏవి కలిగినా,కలుగుతున్నా, వాటినాయన తొలగించగలడు. ఇదేమైనా సామాన్య విషయమా? సాధారణ విషయమా? అందరు వ్యక్తులూ చేయగలిగిన పనా?! ఆత్మసాక్షాత్కారం పొందిన సిద్ధ పురుషుడైన జ్ఞాని మాత్రమే చేయగలిగిన పని ఇది అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

శ్రీరమణులు అలాంటి గురువు కాబట్టే వారు జ్ఞానిగా తిరువణ్ణామలైలో మౌనంగా, కళ్లు మూసుకొని కూర్చున్న ప్పటికీ లక్షలాది సాధకులు వారి వద్దకు వెళ్లి వారి సన్నిధి సుఖాన్నీ, లాభాన్నీ పొందినారు. 1950లో వారు తమ దివ్య కాయం వదలిన తర్వాత కూడా ఈ లబ్ధి సాధకులకు భక్తులకు నిరాఘాటంగా జరుగుతునే ఉంది! అందుకే గురువుల విషయంలో సాధారణంగా చెప్పుకునే మాటలు శ్రీరమణులకు పూర్తిగా అన్వయించవు. గురువు ఆత్మసాక్షాత్కారాన్ని కల్గించలేడన్న మాట వారి ఎడ కుదిరే మాట కాదు. మోక్షం మానవులకేనన్నారు. వారొక గోమాతకు (లక్ష్మి అన్నదామె కున్న పేరు) మోక్షమును ప్రసాదించింది జగత్ప్రసిద్ధం. వారి జీవిత చరిత్రలలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించిన విషయం కూడా.

ఆత్మ సాక్షాత్కారానికి మాటల ద్వారా మార్గం చూపగల్గడమొక్కటేనా గురువు చేసే పని? తాము తరించకుండా టన్నుల కొద్దీ మాటల రాశులను పేరుస్తున్న వారు వేలాదిగా ఈ రోజుల్లో గురువులుగా అగుపిస్తున్నారు కదా. లాభం ఏమిటి? మాటలు ముక్తికి దారి తీయవన్నది చెప్పనవసరం లేదు. తాము గురువుగా చెప్పుకోవడానికి శ్రీరమణులు ఎన్నడూ అంగీకరించలేదు. ఒకటి రెండు సందర్భాలలో వారు ఒకరిద్దరు వ్యక్తులకు గురువుగా పరోక్ష రీతిలో అంగీకరించినప్పటికీ తమనొక మతాధిపతిగానో, మార్గ ప్రబోధకునిగానో వారెన్నడూ చూపుకోలేదు. అందుకు వారిష్టపడలేదు. అని చెప్పి గురువుని గురించి సాధారణ రీతిలో 'వారు' చెప్పిన కొన్ని ముఖ్యాంశాలను పూర్తిగా వారికి అన్వయించలేము. అన్వయించకూడదని కొన్ని వారు చేసిన దివ్య ఘటనలే రుజువు చేస్తున్నాయి. గురువుయొక్క ఆవశ్యకతను గురించి వారు తెలిపిన ఈ కింది అంశాలను ముందుగా గమనించి ఆ తర్వాత శ్రీరమణులు ఎట్లా ఒక అసాధారణ గురువో, సాక్షాత్తూ మోక్ష ప్రదాతయో గమనిద్దాము.

- ''లౌకికమైన ఏ విషయం నేర్చుకోవాలన్నా గురువు అవసరం. అలాగే ఆధ్యాత్మిక విషయాలలో కూడా అవసరం''
- ''గురువు అవసరమే. ఆధ్యాత్మిక మార్గంలో వెలుగు చూపుతాడు. గురువు అందరినీ ఆత్మస్వరూపులుగా చూస్తాడు. ఆయనకు అజ్ఞానులు అంటూ ఎవరూ ఉండరు. వాళ్లకు తనకు ఏ భేదాన్ని చూడడు''
- ద్వైతము (నానాత్వము-అనేకత్వము) ఉన్నంత వరకు గురువు అవసరమే. నీకు వ్యక్తిత్వమున్నంతవరకూ గురువు అవసరమే. గురువు ఆత్మే. నీవు నిన్ను శరీరముగా భావించుచున్నావు. అందుకనే గురువును కూడా శరీరముగా భావించి ఈ ప్రశ్నలు వేయుచున్నావు. నీవుగాని, గురువుకాని శరీరాలు కారు. ఆత్మయే. నీవు, గురువు ఇద్దరూ ఆత్మ స్వరూపులేనన్న జ్ఞానము, ఆత్మ సాక్షాత్కారమైన తరువాతనే కలుగుతుంది''.

(అన్నీ 'అమరచైతన్యము'లోనివే. అను॥ సాయికృష్ణ)

సాక్షాత్కారం దాకా మానవ రూప గురువు యొక్క అవసరాన్ని రమణులు కాదనలేదు. అందులోనూ దక్షిణామూర్తి అపరావతారమయిన భగవాన్‌ని గురువుగా పొందిన వారు వారినుంచి లాభాన్ని, మోక్షాన్ని (ఆత్మ సాక్షాత్కారాన్ని) పొందకుండా ఎట్లా ఉంటారు. అలనాటి వారి సాకార 'రూపమూ', ఈనాటి వారి నిరాకార 'రూపమూ' రెండూ శిష్యులను 'లోగొని' లక్ష్యసిద్ధి కల్గించినవే-కలిగిస్తున్నవే.

'సమర్థుడైన గురువు నాకు సహాయం చేయగలడా?' అని ముముక్షువులైన మునగాలవారూ, పాల్ బ్రంటన్‌లు అడుగగా భగవాన్

''తప్పక చేస్తాడు. ఇప్పుడు నీవద్దనున్న జ్ఞానముతో అన్వేషించు. నీవు తప్పక గురువును కనుగొంటావు. ఆయన కూడా నీ కొరకు ఎదురు చూస్తుంటాడు'' అని ప్రకటించారు! శిష్యుడు గురువుని కనుక్కొంటాడా? లేక గురువుగారే నిరీక్షిస్తూ శిష్యుని పట్టుకుంటాడా? శ్రీ రామకృష్ణ పరమహంసుల జీవితంలో తనవద్దకు శిష్యుల్ని పంపించమని వారు జగన్మాతతో మొరపెట్టుకుని శోకించిన ఘట్టాలనేకం పేర్కొన బడ్డాయి. ఆంతర గురువూ, బాహిర గురువూ ఇద్దరూ శిష్యునికోసం ఎదురు చూస్తుండడాన్ని శ్రీరమణులు కూడా తమ సాకార నిరాకార రూపాల ద్వారా తమ జీవిత ఘటనల ద్వారా చూపారు. హంప్రీసు, శివప్రకాశం పిళ్లై, కావ్యకంఠ గణపతి శాస్త్రి, మురగనార్ వంటి మహా జ్ఞానులైన భక్తుల కోసం శ్రీరమణుల ఎదురు చూసినట్టుగా ఆయా ఘటనలను జాగ్రత్తగా పరిశీలిస్తే స్పష్టపడ్తుందేమో?! తేలిన అంశాలు

- అద్వైత సిద్ధి కల్గేటంతవరకు మానవ రూప బాహిర గురువు పాత్ర ఎంతో లాభదాయకం.
- దైవావతారంగా వచ్చిన గురువు కేవలం చిన్న చిన్న సాయాలే కాక, ప్రధానమైన ఆత్మసాక్షాత్కారాన్నీ కల్గిస్తాడు.
- అన్వేషిస్తే శిష్యునికి సరైన గురువు లభిస్తాడు.
- శిష్యునికోసం గురువుకూడా ఎదురు చూస్తుంటాడు.

- ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య

ఏది ముందు ఏది తర్వాత?

దేవాలయంలో తీర్థమిచ్చి తర్వాత శఠారి ఇవ్వాలా? లేక శఠారి ఇచ్చి తీర్థమివ్వాలా? దీనిలో శైవ వైష్ణవాది భేదాలేమైనా వున్నాయా?

- బలుస నర్సింహులు, మార్కాపురం

శఠారి అనేది ఆ దేవుడి పాదుకలకు సంకేతం. తీర్థం తీసుకుని ఆ పాదుకలను శిరస్సున దాల్చిన, లేదా ముందుగా

పాదాలను శిరస్సున ధరించి తరువాత తీర్థము స్వీకరించినా రెండూ ఒక్కటే. దీన్ని గురించి పెద్దగా చర్చించవలసిన పని లేదు.

ఈశ్వరుడ్ని లింగాకారంతోనే ఎందుకు కొలుస్తారు?

- తేట కనకరాజు, వినుకొండ

ఈశ్వరుడు జ్యోతిస్వరూపుడు. జ్యోతి అంటే కాంతి కిరణం. అది స్తంభాకారంగా వుంటుంది. దానికి సంకేతంగా స్తంభాకారంగా వుండే శివలింగాన్ని ఈశ్వర స్వరూపంగా స్వీకరించమని శాస్త్రజ్ఞులు నిర్దేశిస్తున్నారు.

స్త్రీలు పూలు ధరించి దేవాలయ ప్రాంగణంలో భజనలు గానీ, కోలాట సేవలు గానీ చేయుట సంప్రదాయ విరుద్ధం కాదా?

- కొవ్వూరు వేంకటేశ్వర ప్రసాదరావు, కందుకూరు

ఏడుకొండల పరిధిలో పూచే పూలన్నీ స్వామివేనని, వాటిని ఇతరులు తమ అలంకారంకోసం వాడుకోరాదనీ, నియమం తిరుమల వరకే వర్తిస్తుంది. ఇతర దేవతారాధనలలో దేవ నిర్మాల్యాన్ని అలంకారంగా స్వీకరించి తన శరీరాన్ని ఉపాస్య దేవతలాగా అలంకరించుకుని, ఆ దేవతను సేవించమని అనేక ఆగమగ్రంథాలలో కనిపిస్తున్నది.

పెండ్లికాని ఆడమగ భక్తులు చండీ ప్రదక్షిణం చేయవచ్చా?

-దువ్వూరి లక్ష్మీనరసింహం, ముమ్మిడివరం చేయవచ్చు.

గోమతి చక్రమంటే ఏమిటి? దాని విశిష్టత ఏమిటి?

- దువ్వూరి లక్ష్మీనరసింహం, ముమ్మిడివరం

గుజరాత్‌లోని గోమతి నదిలో దొరికే సుదర్శన చక్రాకారపు శిలావిశేషమే గోమతి చక్రం. ఇది లక్ష్మీస్వరూపమనీ, ఐశ్వర్య ప్రదమని, స్థానిక భక్తులు పూజలుచేస్తూ వుంటారు.

ధర్మ సందేహాలు

- కుప్పా వేంకట కృష్ణమూర్తి

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా
కుప్పా వేంకట కృష్ణమూర్తి
ఇంటి నెం. 11-13-279,
రోడ్ నెం. 8, అలకాపురి,
హైదరాబాద్-500 035.

అందం

★ ఫ్రిజ్‌లో ఉంచిన చల్లటి బొప్పాయి ముక్కలతో ముఖభాగంపై సున్నితంగా రాసుకుంటే చర్మం నాజూగ్గా మారుతుంది.

★ పెరుగులో కాస్త ముల్తానీ మట్టి కలిపి ముఖానికి 'ప్యాక్'లా వేసుకుని పావుగంట తర్వాత శుభ్రంగా కడిగేసుకుంటే జిడ్డు సమస్య పోతుంది.

★ కలబంద గుజ్జును ముఖానికి బాగా పట్టించి పది నిమిషాల తర్వాత కడిగేసుకుంటే ముఖంపై దద్దుర్లు వంటివి అంతరిస్తాయి.

★ నీటిలో కాస్త వెనిగర్ వేసి దూదితో ముఖానికి రాసుకుంటే ఎండ ప్రభావం నుంచి బయట పడవచ్చు.

★ టమాటా గుజ్జును ముఖానికి రాసుకుని పావుగంట తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే చర్మం నునుపు దేరుతుంది.

★ అరటిపండు గుజ్జును ముఖానికి బాగా పట్టిస్తే చర్మంపై ముడతల సమస్యకు ఫలితం లభిస్తుంది.

★ ప్రతి రోజూ కనీసం 10 నుంచి 12 గ్లాసుల నీళ్లు తాగితే వ్యర్థ పదార్థాలు బయటకు వచ్చి శరీరం కాంతులీనుతుంది.

★ పైనాపిల్ రసాన్ని చర్మానికి బాగా పట్టించినా ముడతలు తగ్గే అవకాశం ఉంది.

★ కళ్ల కింద నల్లటి వలయాలు, ముడతలు పోవాలంటే నిమ్మరసాన్ని సున్నితంగా రాస్తే ఉపశమనం కలుగుతుంది.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

సోమవారం 25, ఫిబ్రవరి 2013

శిశు సంక్షేమానికి

బాలారిష్టాలు..!

'బా'లలే భావి భారత పౌరులు.. దేశానికి దశ, దిశను నిర్దేశించేంది వారే..'- అని అంతా భావిస్తాం. అయితే, చిన్నారుల ప్రాథమిక అవసరాలు, వారి కనీస హక్కుల విషయంలో మన పాలకులు అనాదిగా అలసత్వాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారన్నది కాదనలేని వాస్తవం. పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, తీసుకుంటున్న చర్యలు అరకొరగానే ఉన్నాయని తాజా అధ్యయనంలో తేటతెల్లమైంది. ఏటా మన దేశంలో ప్రసవాల సంఖ్య లక్షల్లో ఉంటుండగా ఆడశిశువుల సంఖ్య తగ్గుతోంది. లింగ నిష్పత్తిలో వ్యత్యాసం అధికం కావడంతో సామాజికపరంగా పెను సవాళ్లు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. మరోవైపు తగిన పోషకాహారం లభించక ఎంతోమంది పిల్లలు శారీరక, మానసిక వైకల్యాలను ఎదుర్కొంటున్నారని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్లలోపు పిల్లల్లో దాదాపు 44 శాతం మంది నిర్ణీత బరువుకన్నా తక్కువగా ఉంటున్నారు. 31 శాతం మంది శారీరక ఎదుగుదల లేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దేశంలోని పిల్లల్లో దాదాపు సగం మంది మాత్రమే బడి ముఖం చూస్తుండగా, అనేక మంది

అర్ధంతరంగా చదువుకు దూరమవుతున్నారు. 2020 నాటికి భారతీయుడి సగటు వయసు 29 ఏళ్లకు చేరుకుంటుందని, పోషకాహార లోపం, తగినంత విద్య లేకపోవడం వంటివి అపుడు తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆహార భద్రత కల్పించేందుకు దండిగా నిధులను ఖర్చు చేసేందుకు పాలకులు పలు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ప్రభుత్వ నిర్ణయాలు ఆచరణకు నోచుకోకపోవడం, బడ్జెట్‌లో సమృద్ధిగా నిధులు కేటాయించక పోవడం వల్ల పిల్లల పరిస్థితి విషమంగానే కనిపిస్తోంది.

ప్రపంచంలోని ప్రతి అయిదుగురు చిన్నారుల్లో కనీసం ఒకరు భారత్‌లో నివసిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి గుర్తించింది. మన దేశంలో మైనారిటీ తీరని (18 ఏళ్ల లోపు) వారి సంఖ్య 43 కోట్లుకాగా, ఇందులో ఆరేళ్ల లోపు బాలల సంఖ్య 16 కోట్లుగా ఉంది. సామాజిక అంశాల విషయమై ఏటా ప్రభుత్వం ఖర్చు చేస్తున్న మొత్తం స్థూల జాతీయ ఉత్పత్తిలో ఏడు శాతాన్ని మించక పోవడం గమనార్హం. దేశ జనాభాలో 42 శాతానికి మించి పిల్లలు ఉండగా, వారి అవసరాలకు తగ్గట్లుగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. దీంతో పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య భద్రత ఆశించిన స్థాయిలో కానరావడం లేదు. ఏటా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల కేటాయింపులతో బడ్జెట్‌ను ఆమోదిస్తున్నా అందులో చి న్నారుల సంక్షేమానికి సముచిత వాటా దక్కడం లేదు. 2011-12 బడ్జెట్‌లో బాలల కోసం 4.51 శాతం, 2012-13లో 4.76 శాతం నిధులను మాత్రమే కేటాయించారు. 2001 నుంచి 2005-06 మధ్య బడ్జెట్‌లో రెండు శాతం నిధులను మాత్రమే చిన్నారుల కోసం కేటాయించారు. 2006-07 నుంచి ఈ కేటాయింపులు గుడ్డిలో మెల్ల అన్నట్లుగా 4 శాతానికి పెరిగింది. అయినప్పటికీ పిల్లల అభివృద్ధి దిశగా ప్రధాన రంగాలను నిధుల కొరత వేధిస్తూనే ఉంది. పన్నెండవ పంచ వర్ష ప్రణాళికలో తగినంతగా నిధులను కేటాయించాలని వివిధ సంస్థలు, మహిళా శిశు సంక్షేమ శాఖ కోరినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. 2012-13లో శిశు సంక్షేమానికి అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 18 శాతం మేరకు నిధులు తగ్గిపోవడం గమనార్హం. ఆరోగ్యం, విద్య, ఆహార భద్రతకు తగిన కేటాయింపులు లేనపుడు బాలల ప్రగతి ప్రశ్నార్థకంగానే మిగులుతుంది. తగినంత పోషకాహారం, కొత్త పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల విషయమై ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపడం లేదు. పరిస్థితి ఇదే తీరున ఉంటే శిశు సంక్షేమంలో ఆశించిన లక్ష్యాలు అందనంత దూరంలోనే ఉంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 12వ పంచవర్ష ప్రణాళిక (2013-2018) కాలంలోనైనా తగినంతగా నిధులు కేటాయించేందుకు పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నించాల్సి ఉంది. పిల్లల అవసరాలు, హక్కుల విషయమై దృష్టి సారించనంత కాలం పరిస్థితి ఇంతకన్నా

భిన్నంగా ఉండే అవకాశాలు లేవు. భవిష్యత్‌లో దేశం ఎలాంటి ప్రగతి సాధించాలన్నా శిశు సంక్షేమానికి తగినంత ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. భావి ప్రణాళికలపై తగిన దృష్టిని కేంద్రీకరించడంతో పాటు, నిధుల కేటాయింపుపై పాలకులు ఇకనైనా చిత్తశుద్ధి చూపాల్సి ఉంది. ఇవి జరగనంతకాలం శిశు సంక్షేమం హామీలకే పరిమితమవుతుందని బాలల హక్కుల సంస్థల ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. ■

గృహిణి సేవలకు ఖరీదు కట్టలేం..

కుటుంబ వ్యవస్థలో స్త్రీల సేవలకు వెల కట్టడమంటే అది మాతృత్వాన్ని, మహిళాలోకాన్ని అవమానించడమేనని కేరళ హైకోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. తల్లి, భార్య, కుమార్తె, సోదరి వంటి రూపాల్లో మహిళలు అందించే సేవలకు విలువ నిర్ణయించలేమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచి అభిప్రాయ పడింది. అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న గృహిణులకు కనీస వేతనాలు నిర్ణయించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని 'ఉమెన్స్ వాయిస్' అనే సంస్థ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు స్పందించారు. గృహిణులు ప్రతి రోజూ 10 నుంచి 14 గంటల సేపు ఇంటి బాధ్యతలతో పని చేస్తారని, గ్రామీణ మహిళలైతే రోజంతా కష్టపడుతుంటారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. పని వేళలను బట్టి మహిళలకు కనీస వేతనాలు చెల్లించాలని 'ఉమెన్స్ వాయిస్' ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గృహిణులకు కనీస వేతనాలు చెల్లించేలా జోక్యం చేసుకోవాలన్న పిటిషనర్ అభ్యర్థనను కోర్టు త్రోసిపుచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల ప్రకారం గృహిణులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించే అవకాశాలు లేవని కోర్టు తీర్పునిచ్చింది. ప్రమాదాల్లో నష్టపరిహారం చెల్లిస్తున్న మాదిరి గృహిణులకూ చెల్లించాలంటే అది తప్పుడు మార్గాలకు అవకాశం ఇస్తుందని న్యాయమూర్తులు అన్నారు. పిటిషనర్ కోరినట్లు తాము కొత్త చట్టాన్ని సృష్టించలేమని, ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలను మాత్రమే పరిశీలించగలమని వారు పేర్కొన్నారు. నిర్ణీత మొత్తాలను వేతనాలుగా చెల్లించేందుకు ప్రత్యేక చట్టం కావాలన్న విషయమై పిటిషన్‌లో ఎలాంటి స్పష్టత లేదని కోర్టు భావించింది. ఆర్థిక కోణంలో ఆలోచిస్తే మహిళల సేవలు ఎలాంటి అంచనాకు అందవని, నేడు విభిన్న రంగాల్లో స్త్రీలు విశేష ప్రతిభతో పని చేస్తున్నారని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఎదుగుతూ, ఎన్నెన్నో బాధ్యతలు నిర్వర్తిస్తూ మహిళలు కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటున్నారని వివరించారు. భార్యగానే గాక గృహిణిగా కుటుంబ నిర్వహణలో మహిళ కీలకపాత్ర పోషిస్తోందని న్యాయమూర్తులు అన్నారు. 'దేవుడు అన్ని చోట్లకూ వెళ్లలేడు గనుకే- తల్లులను సృష్టించాడ'ని హైకోర్టు బెంచి పేర్కొంది.

కారు నెంబర్‌కు రూ.10లక్షలు!

ఆధ్యాత్మిక బోధనలు చేసే ఓ బాబా 55 లక్షల రూపాయలు ఖరీదు చేసే తన 'ఆడి' కారు కోసం పది లక్షల ఐదువేల రూపాయలు వేలం పాట పాడి ఓ ఫ్యాన్సీ నెంబర్ని కొనుక్కున్నాడు. చండీగఢ్‌లో ఉంటున్న ఈ బాబా వయసు 23 ఏళ్లే గానీ అనుయాయులకీ, భక్తులకీ దేవుడే! ''నా భక్తులు నన్ను మోటారు బండిలోనే ప్రయాణం చేయమంటున్నారు. ఏం చేయను? నా లక్కీ నెంబర్ 0001. అంచేత- సి.హెచ్.-01. ఏఆర్ 0001- అనే నెంబర్‌ని వేలంలో పాడుకున్నాను'' అన్నాడు బాబాగా పేరుగాంచిన ఛోటా మహంత్. ఈ బాబా అన్నగారు గతంలో విషాహార ప్రయోగం కారణంగా మరణించగా, వార

సత్వపు పీఠాధిపతి అయిన ఈ యువ మత గురూజీ- 'ఐపాడ్' సైతం వాడుతాడు. 42 అంగుళాల ఎల్.ఇ.డి టెలివిజన్ మాత్రమే చూస్తాడు. అతడి 'డేరా' (ఆశ్రమం)లో ముఖమల్ సోఫాలుంటాయి. తివాచీలుంటాయి. సిసిటీవీ కెమేరాలుంటాయి. అన్ని రిమోట్ కంట్రోల్స్ మాత్రం ఆయన దగ్గరే వుంటాయ్!

అమ్మాయి చదువు కోసం..!

వాళ్లమ్మాయిని గ్రాడ్యుయేట్ చేయాలి. చేస్తే- రేప్పొద్దున్న వాళ్లిద్దరూ వయోవృద్ధులైనాక ఆదరిస్తుందని ఆశ! తండ్రి వూయిబింగ్ బొగ్గుగనుల్లో పనికి పోతాడు. ఎలక్ట్రికల్ డ్రిల్లింగ్ మెషీన్ మీద చెమటోడ్చి నెలకో 500 డాలర్ల విలువైన చైనా రూపాయలు తెస్తాడు. తల్లి- కావో వీపింగ్ యాపిల్ తోటల్లో రోజంతా పని చేస్తుంది. రోజుకో పన్నెండు డాలర్ల విలువ చేసే చైనా కరెన్సీ తెచ్చుకుంటుంది. ఆ ఇద్దరికీ వుండటానికో పూరి గుడిసె వుంది. జీవనోపాధి వెతుక్కుంటూ హాంజింగ్ నగరం చేరుకున్న వేలాది మందిలో వాళ్లొక జంట. అమ్మాయి కాలేజీ చదువుల కోసం డబ్బు దాచడమే తప్ప- తమ జీవితం ఎట్లా గడుస్తుందోనన్న చింత లేదు.

'అమ్మాయికి చదువు చెప్పిస్తే- ఆమె ఓ పెద్ద ఉద్యోగం చేసి మనల్ని ఆదుకోదా?'' అంటాడు నాన్న. కానీ, అమ్మాయి హాస్టల్‌లోనే వుంటానంటోంది. అందుకు డబ్బులు కావాలి. ఓ పూట పస్తులున్నా- అది సాధ్యమా? తోటి విద్యార్థినుల మధ్య తన హోదా చూసుకుంటుందే తప్ప అమ్మానాన్నల కాయకష్టం మాటెత్తదు ఆ పిల్ల. ఇలాంటి కుటుంబాలు చైనాలో చాలా ఉన్నా, ఆడపిల్లలు పట్టభద్రతకే మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగాలు ఎక్కడ? డిగ్రీలు నాలుగింతలు పెరిగాయ్. అయ్యయ్యో..! చైనా..! నీకూ- ఇండియా పోలికే వచ్చిందా..?

veeraji@sify.com

సత్వర శిక్షలతో మార్పు సాధ్యం

అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు ఎలాంటి జాప్యం లేకుండా కఠిన శిక్షలు విధిస్తేనే మహిళల్లో భద్రతా భావం నెలకొంటుందని బాలీవుడ్ నటి, మాజీ విశ్వసుందరి ఐశ్వర్య బచన్ అంటున్నారు. దేశ రాజధానిలో ఓ అవార్డుల సభలో ఆమె మాట్లాడుతూ, లైంగిక నేరాల్లో దండనకు ప్రత్యేక చట్టాలు అవసరమని, సకాలంలో కేసుల్ని విచారించి బాధితులకు న్యాయం చేస్తేనే ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు వస్తుందని అన్నారు. ఢిల్లీలో ఇటీవల వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన దేశాన్ని కుదిపివేసినప్పటికీ లైంగిక నేరాల జోరు కొనసాగుతూనే ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా సంచలనాత్మక సంఘటన జరిగినపుడు ఆందోళనలు చేయడం, ఆ తర్వాత అంతా మరచిపోవడం కాకుండా అత్యాచారాలను పూర్తి స్థాయిలో నివారించే దిశగా పదునైన చట్టాలను కఠినంగా అమలు చేయాల్సి ఉందని ఐశ్వర్య కోరుతున్నారు. ఢిల్లీ సంఘటన దేశంలో మహిళల దుస్థితికి సాక్షీభూతంగా నిలిచిందని, అన్ని ప్రాంతాల్లో ఇదే రకమైన హింసను స్త్రీలు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార పర్వానికి తెర దించాలంటే చట్టాల పట్ల మహిళల్లో నమ్మకం పెంచాల్సి ఉందన్నారు. నేతలు హామీలిస్తున్నా అధిక శాతం మహిళలు అభద్రతతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆమె అన్నారు. మహిళలు కూడా మౌనాన్ని ఛేదించి, తమ కష్టనష్టాలను ధైర్యంగా తెలియజేసి న్యాయం కోసం పోరాడితే తప్ప పరిస్థితిలో మార్పు రాదని ఆమె అభిప్రాయ పడ్డారు.

అంధుల పాలిట ఆశాదీపం

మొక్కవోని దీక్ష, మానవత్వం ఉంటే మనం ఎలాంటి పరిస్థితిలో ఉన్నా పదిమందికీ ఆసరాగా ఉండవచ్చని హర్యానాకు చెందిన మధు సింఘాల్ నిరూపించింది. పుట్టుకతోనే అంధురాలైన ఈమెకు చిన్నతనంలో చదువు కోవడానికి అవకాశం లేకపోయింది. పరిస్థితులు అనుకూలించక ఈమె బ్రెయిలీ స్కూలుకుగానీ, మామూలు పాఠశాలకుగానీ వెళ్లి చదువుకోలేకపోయింది. తల్లిదండ్రుల సాయంతో ఇంటి వద్దే ఉపాధ్యాయుల తర్ఫీదులో ప్రాథమిక విద్యను

అభ్యసించింది. చదువులో ఈమె చురుకుదనాన్ని గుర్తించిన వారంతా మెచ్చుకోవడంతో తల్లిదండ్రులు ఎట్టకేలకు పాఠశాలలో చేర్చారు. అక్కడ క్రమశిక్షణతో చక్కగా చదివి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

1987లో మధు బెంగళూరులో నివసించే తన సోదరి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు ఓ ఆలోచన వచ్చింది. తనలాంటి మరెంతోమంది అభాగ్యులకు సాయం చేయాలని అనుకుంది. ఏ రంగంలో అయినా విజయం సాధించడానికి తొలిమెట్టు చదువే కనుక నిరక్షరాస్యులకు అండగా నిలవాలని భావించింది. ఈ ఆలోచనను ఆమె సోదరి, బావ కూడా ప్రోత్సహించారు. ఈమె 'మిత్ర జ్యోతి' పేరిట 1990లో ఒక సంస్థను స్థాపించింది. అందులో ముందుగా గ్రంథాలయం ఏర్పాటుచేసింది. అక్కడ బ్రెయిలీ పుస్తకాలు, వివిధ రీతుల్లో ఉపాధి పొందేందుకు ఉపయోగపడే పుస్తకాలను ఏర్పాటుచేసింది. అంధులు సులువుగా పాఠాలు నేర్చుకోవడానికి వీలుగా ఆమె 'టాకింగ్ లైబ్రరీ'ని ఏర్పాటుచేసింది. ఇందులో సీడీల ద్వారా ఎవరికి కావలసిన పాఠాలను వారు విని గుర్తుపెట్టుకుని నేర్చుకోవచ్చు. అంధులు విద్యావంతులు కావడానికి ఇది సులువైన మార్గం. ఇందుకు మధు సింఘాల్ పాఠ్యాంశాలను ముందుగా కొంతమందితో చదివించి, వాటిని రికార్డు చేసింది. ఆ రికార్డులలోని సారాంశాన్ని విని జ్ఞాపకం ఉంచుకుంటే ఎటువంటి పరీక్షలనైనా సులువుగా రాయవచ్చు. ఆ విధంగా 'మిత్రజ్యోతి'లో చేరి నాలుగు మాసాలపాటు శిక్షణ పొందిన అనేకమంది అంధులు ఇప్పుడు ఏదో ఒక ఉపాధిని సంపాదించుకొని తమ కాళ్లపై తాము నిలబడ్డారు.

అంధుల కోసం మరొక రకమైన కోర్సును కూడా మధు డిజైన్ చేసింది. చాలామంది అంధులు రోజువారీ పనులకు కూడా ఇంట్లోని కుటుంబ సభ్యులపై ఆధారపడుతుంటారు. అటువంటివారు తమ పనులు తామే చేసుకునేలా ఒక కోర్సును డిజైన్ చేసింది. ఆ కోర్సు సాయంతో అంధులు కూడా సులువుగా తమ పనులు తాము చేసుకోవడమేకాకుండా వంట చేయడం, ఇంటిని శుభ్రం చేసుకోవడం, గార్డెనింగ్ వంటి పనులు మామూలుగా చేసుకోగలుగుతున్నారు. ఆడవారైతే ఎవరికివారు చీర కట్టుకోగలగడం, బయటికి వెళ్లి బస్సు ఎక్కడం వంటి పనులు సులువుగా చేసుకోగలుగుతున్నారు.

పలు రకాల హస్తకళలు, ప్లాస్టిక్ వైర్‌లతో బాస్కెట్ల తయారీ వంటి విషయాల్లో మధు అంధ మహిళలకు తర్ఫీదు ఇస్తోంది. ఆమె అంధుల కోసం రిక్రూట్‌మెంట్ సర్వీస్‌ను కూడా ఏర్పాటుచేసింది. పురుషులతో పోలిస్తే మహిళలకు ఉద్యోగావకాశాలు అంతంతమాత్రమేనని, అందుకే మహిళలు ఉద్యోగాలు సంపాదించుకునే విషయంలో తోడ్పాటును అందిస్తున్నట్లు తెలిపింది. నగరంలోను, సమీప ప్రాంతాల్లో ఉండే ఫ్యాక్టరీలు, సంస్థలు, ప్రైవేటు కార్యాలయాలలో ఉన్న ఖాళీలను ముందుగా తెలుసుకుని, ఆ ఖాళీలకు తగిన అర్హత, ఆసక్తి ఉన్న మహిళలకు ఆ వివరాలు తెలియజేసి వారు ఆయా ఉద్యోగాలు సంపాదించుకునేలా సాయపడుతుంటానని మధు తెలిపింది. కర్నాటకలో ఇప్పటి వరకు తమ సంస్థ రెండు వందల మంది మహిళలు ఏదో ఒక ఉపాధి పొందేలా కృషి చేసినట్లు తెలిపింది.

అంధులకే కాకుండా, ఏ ఆసరా లేని అభాగ్య మహిళలకు, ఎలాంటి ఆధారం లేని పురుషులకు కూడా 'మిత్రజ్యోతి' సంస్థ ద్వారా సాయపడుతున్న మధు సింఘాల్ కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు ఆమెని వరించాయి. మలేషియా ప్రభుత్వం ఈమెను తమ దేశానికి ఆహ్వానించి సముచిత రీతిన సత్కరించింది. తన విజయం గురించి మధు మాట్లాడుతూ, ఆడపిల్లలు ధైర్యవంతులని, తల్లిదండ్రులు స్త్రీ, పురుష భేదం లేకుండా పిల్లల్ని పెంచితే మగవారితో సమానంగా ఆడవాళ్లు కూడా మంచి అవకాశాలు దక్కించుకుంటారని చెబుతోంది.

-బాబు

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
సోమవారం
25, ఫిబ్రవరి
2013

శ్లోకం

జలజాత ప్రభవాచ్యుతాదులు మదిం జర్చించి చర్చించి నీ కల రూపారయ లేక చిక్కుల బడంగా నిన్నుహస్తార్చితా మలక వ్యాప్తికి దెచ్చి యేర్పరిచి సంబంధించి చేకొన్న భ క్తుల శౌర్యంబుపమింప నెవ్వడు సమర్థుడింక సర్వేశ్వరా!

భావం: సర్వేశ్వరా! బ్రహ్మవిష్ణ్వాదులు మనస్సులో ఎంత ఆలోచించినా నీవున్న రూపాన్ని తెలిసికోలేక కష్టపడగా, అరచేతిలో ఉసిరికాయంత సులభంగా నిన్ను అందరికీ చూపించి, స్పష్టపరిచి నీతో సంబంధం కల్గించిన భక్తుల ప్రతాపాన్ని పోల్చడానికి ఎవ్వడు సమర్థుడు. అసంగతుడూ, నిరాకారుడూ అయిన సర్వేశ్వరుడు నిత్యనూతనుడు ప్రాచీనుడు కూడా. ఆ సర్వేశ్వరుని తెలుసుకొంటామని ఎందరెందరో ప్రయత్నించి విఫలమవుతూనే ఉన్నారు. రేపటి వారూ ఇలా చెప్తారేమో నంటే ఆశ్చర్యమేమీ లేదు. కాని భక్తుడు చిన్నపాటి ప్రయత్నమూ లేక తన హృదయపద్మంలో నివసించిన ఉన్న నిన్ను గూర్చిన అనేక విషయాలు విపులంగా చెప్తే కూడా ఆశ్చర్యమేమి లేదు కదా ఎందుకంటే భగవంతుడు భక్తసులభుడవు కదా.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

22 **శ్రీ లత**

''నో బడీ ఈజ్ దేర్'' అంది కదలకుండానే.

''అతని టేబుల్ అదే! ఉంటే మాట్లాడండి లేదా వచ్చేవరకు వెయిట్ చెయ్యండి'' అని చెప్పి మళ్ళీ తలొంచుకున్నాడు.

వెళ్ళి అక్కడే కుర్చీ ఉంటే కూర్చుంది. ఎంతకీ రాకపోవడంతో 'ఉఫ్'అంటూ వెనక్కి తిరిగి రాబోతుంటే టీవీలో వస్తున్న ప్రోగ్రామ్ జీవన ఆపేసింది. అవాక్కయి అలాగే నిలుచుండిపోయింది.

''చూడండి నేను సోషల్ వర్క్ చేయడం లేదు. చిన్న పిల్లలంటే ఇష్టం అందుకే పెంచుకుంటున్నాను'' అని తన గొంతు చించుకుని అరుస్తోంది. టీవీలో అంతలోనే.. ''చూశారా మదర్ థెరిసా మళ్ళీ పుట్టింది అన్నట్టుగా కుప్పతొట్టి బిడ్డకు పెళ్ళి కాకుండానే తల్లయిన ఒక గొప్ప స్త్రీ చెబుతున్న తన అంతరంగం. ఈమెలాగే ప్రతీ ఒక్కరూ ఆలోచించగలిగితే మన దేశ జనాభా మితిమీరిపోదు. మన దేశంలో అనాథలే వుండరు. అధిక జనాభా తగ్గించడమనే అంతర్జాతీయ సమస్యకు అతి చిన్న వయసులో ప్రాక్టికల్‌గా సమాధానం చెప్పిన జీవన అనే ఈ అమ్మాయికి ఈ సంవత్సరం 'బెస్ట్ సోషల్ వర్కర్' అవార్డు ప్రకటిస్తున్నందుకు సంతోషిస్తున్నాం. ఇది సోషల్ వర్క్ కాదని కొట్టిపారేస్తే ఆ అమ్మాయి మానసిక ఉన్నతిని అభినందిస్తున్నాం'' అంటూ ప్రకటన, ఆ తరువాత చప్పట్లు.

అప్పటివరకు ఆ టీవీ వైపే నోరు తెరుచుకు చూస్తున్న జీవన తల తిప్పిచూసింది. ఎదురుగా లిఫ్ట్‌లో తిట్టించుకున్న అతనే నవ్వుతూ దగ్గరగా వచ్చి 'కంగ్రాట్స్ అండీ.. ఏదయినా చేయడానికి దిల్.. దిల్ ఉండాలండీ'' అని చెయ్యి చాచాడు. అతన్నిచూస్తే ఎందుకో చికాకనిపించింది. రెస్పాన్స్ ఇవ్వాలనిపించలేదు.

''నేను అవినాష్‌ను కలవాలి. అతనెక్కడున్నారు?'' అడిగింది.

''ఇంతకుముందెప్పుడూ మీరతన్ని చూశారా?'' అడిగాడతను.

''చూశాను'' అంది.

''ఎలా ఉంటాడు?''

''ఆ... కొంచెం గడ్డం పెరిగి...'' అని మధ్యలోనే ఆగి అయినా మీకెందుకు? అతనెక్కడుంటాడో చెప్పండి. నేను కలవాలి'' అంది జీవన.

''నా కెందుకంటే నా పేరు కూడా అవినాష్, ఒక వేళ మీరడిగే అవినాష్ నేనేమోనని'' అని నవ్వాడు. ఆ నవ్వడంలో అతని కళ్ళు చెక్ మని మెరిశాయి.

''మీరూ ఇక్కడే జాబ్ చేస్తున్నారా?'' అడిగింది.

''అవును''

''మా బ్యాంక్‌కు వచ్చారా?''

''అవును'' అన్నాడతను యథాలాపంగా.

''అయితే ఆ అవినాష్ మీరే! కానీ గడ్డం...''

''ఓ.... మీరు నన్ను కాకుండా నా గడ్డాన్ని గుర్తుంచుకున్నారన్నమాట. ఓ పని చేయండి'' అన్నాడు సలహా ఇస్తున్నట్లు.. ఏమిటన్నట్లు చూసింది.

''ఒక వారం రోజులయ్యాక కలవండి... నేను గడ్డం పెంచుకుని ఉంటాను. అప్పుడు గుర్తుపట్టగలరేమో. నేను అసలు అవినాష్‌నో కాదో'' అని రిలాక్స్‌గా తన సీట్‌లో కూర్చున్నాడతను.

''సారీ, మళ్ళీ మళ్ళీ మీ చుట్టూ తిరగాలని లేదు.''

''నా గురించి న్యూస్ రాసింది మీరేనా?'' అడిగింది సీరియస్‌గా...

''ఏ న్యూస్?''

''పాపను పెంచుకున్ననే న్యూస్'' చికాగ్గా చెప్పింది.

''ఓ.... అదా! కూర్చోండి... అయ్యో మిమ్మల్ని నిలబెట్టే మాట్లాడుతున్నాను'' అన్నాడు జీవన కూర్చుంది.

మిమ్మల్ని నేను గుర్తుపట్టలేకపోయానండీ! మీరప్పుడు జడ వేసుకుని ఉన్నారు. ఇప్పుడు పోనీటైల్‌లో ఉన్నారు. మీరు నా గడ్డం విషయంలో కన్‌ఫ్యూజ్ అయినట్లు'' అని నవ్వాడు తన జోక్‌కు తనే. జీవన నవ్వకపోయేసరికి టక్కున నవ్వాపుకున్నాడు. అతను కావాలనే అలా అంటున్నాడని జీవనకు అర్థమైపోయిందనీ.. అతనికీ తెలిసిపోయింది. అతనలా చూస్తూండగానే జీవన కళ్ళలో కన్నీటి పొర కమ్ముకుంది. అతనూ మెత్తబడిపోయాడు.

''ఓ అయాం సారీ... ఇఫ్ యు డోంట్ మైండ్... ఇంతకీ నన్నెందుకు కలవాలనుకున్నారు'' అడిగాడు మెత్తగా. పక్కనే ఉన్న బాటిల్‌లోంచి మినరల్ వాటర్ ప్లాస్టిక్ గ్లాస్‌లో పోసి ఆఫర్ చేశాడు. అందుకుని త్రాగేసి తనను తాను కంట్రోల్ చేసుకున్నట్లు అతని వైపు చూసింది.

''ఈ టీవీ వాళ్ళను ఇంటర్వ్యూకు పంపింది మీరే కదూ?'' అడిగింది.

''ఆ.. అవును ఇది ప్రపంచంలో మొట్టమొదటి సారి జరిగిన విషయమండీ! ఎంతోమంది స్త్రీలు చెడు తిరుగుళ్ళు తిరుగుతూ ఏ పాపం ఎరగక జీవం పోసుకున్న బిడ్డలను కుప్పతొట్లలో, నాలాల్లో విసిరేసే కాలం.. బిడ్డల్ని అనాథల్ని చేసే కాలం... అలాంటిది పెళ్ళి కాకుండానే ఓ కుప్పతొట్టి పాపను పెంచుకోవడం చిన్న విషయం ఎలా అవుతుంది? అందుకే అన్ని టీవీ చానల్స్‌కూ.. బిబిసి వాళ్ళకు కూడా మీ వివరాలు, ఈ టీవీ వాళ్ళు తీసిన క్యాసెట్ పంపేశాను. మీకు విశ్వవ్యాప్తంగా మంచి కీర్తి వస్తుంది. ఎనీ హూ మీ లాంటివారితో పరిచయం కావడం నిజంగా నా అదృష్టం'' అని వివరిస్తూ జీవన ముఖ కవళికలు గమనించసాగాడు.

అడక్కుండా ఆమె గొప్పతనాన్ని గుర్తించి ప్రచారం చేసిన తనకు థాంక్స్ లాంటివి చెప్పకపోయినా కృతజ్ఞతగా నవ్వుతుందనుకున్నాడు.

అలాంటివేవీ లేకపోగా అంతకుముందు ముఖంలో ఉన్న శాంతం పోయి... మెల్లగా అసహనం మొదలయి అంతకంతకు అది పెరగడం గమనించి ఆగిపోయాడు.

అప్పటివరకు కోపాన్ని బలవంతంగా అణచిపెట్టుకుని ఉన్న జీవన లేచి నిలబడి అనినాష్ కాలర్ పట్టుకుని లేపి చెంపమీద చెళ్ళున కొట్టింది. నిశ్శబ్దంగా డెస్క్ వర్క్ చేసుకుంటున్న వాళ్ళంతా తలలు తిప్పి చూసి అవాక్కయ్యారు. అవినాష్ చేష్టలుడిగి నిలుచుండిపోయాడు. అటు ఇటు వాళ్ళు టేబుల్ దగ్గరకు వచ్చారు.

-ఇంకావుంది

153 **రంగనాథ రామాయణం**
శ్రీపాద కృష్ణమూర్తి

రామలక్ష్మణులు పంపా తీరానికి రావడం ఏమిటికి? సుగ్రీవుడి చెంతకు ఆ దాశరథులు ఏ తెంచడం ఎందుకు? సుగ్రీవుడు అతని సఖ్యాన్ని కోరడం ఎందుకు? రాముడు వాలిని సంహరించడం ఏమిటి? కపి సేనలు రావడం ఎందుకు? కపిరాజ మనలను ఇక్కడికి పంపించడం దేనికి? మనకి ఈ పాట్లు కల్గడం ఏమిటి? ప్రాణాలు ఊరక విడిచిపుచ్చడం ఎందుకు? అక్కటా? వైకేయి వరం మనువు వంశంతోపాటు మన వానర జాతిని అణచడం ఎందుకు?'' అని శోకిస్తూ వుండిపోయాడు.

అంగదాదులు సంపాతిని చూచుట

ఆ సమయంలో సంపాతి అను ఖగరాజు విశాల శరీరుడు, అత్యంతమూ వృద్ధుడు, పక్షాలు, ప్రాయం, బలిమి లేమి ఆ కొండ గుహ నుంచి మెల్ల మెల్లిగా వచ్చి, మరణింప కోరి ధరణిపై త్రెళ్లిపడి యున్న వనచరనాథులను వీక్షించాడు. ఈ రోజున దైవం నన్ను దయతలచాడు. తనకు ఆహారం లభించిందని వానరుల దగ్గరికి అరుదెంచాడు.

అప్పుడు ఆంజనేయుడితో యువరాజు అంగదుడు ''ఇది పక్షి కాదు. మమ్ములనందరిని సంహరించడం కోసం యమధర్మరాజు ఈ రూపం తాల్చి వచ్చాడు. శ్రీరాముడి భార్యను జానకిని రావణాసురుడు అపహరించుకొనిపోయే ఈ సమయంలో జటాయువు ఆ రక్కసుణ్ణి ఎదిరించి, పోరాడి అతడి ఖడ్గధారి హతికి మరణించి దివ్య పదం పొందడా? రాముడి కార్యం నెరవేర్చి వచ్చి మనం ప్రాణాలను ఈ మహాఖగానికి ధారపోయడం లగు'' అనే వాక్కులు సంపాతి ఆలకించాడు. శోకంతో గద్గదఖిన్న కంఠుడు అయాడు. కపి నాయకులను సమీపించాడు.

''ఓ వానరులారా! ఎక్కడ నుంచి వచ్చారు? ఆ జటాయువు నా అనుగు తమ్ముడు. నేను, జటాయువు సూర్యపు త్రులం. జటాయువుని నిశిత నఖుడు. దశరథ సఖుడు, సత్యధనుడు. అతను ఎందుకు మరణించాడు?'' అని అడిగాడు.

అంగదుడు ఈ విషయం అంతా తెలిసికొన్నాడు. ఎంతో శోకించాడు. కపులు సంపాతిని మోసికొనిపోయి చేరువనున్న సముద్రానికి కొనిపోయాడు. సంపాతి ఆ జలధిలో స్నానమాడాడు. విపుల శోకంతో ఆ సంపాతి కపులతో తన పూర్వ కథ ఈ రీతిని చెప్పసాగాడు.

''జటాయువు, నేను కైలాసగిరి పయిని జతగూడి వుండగా, జవసత్వాలతో మేము ఇరువురమూ మత్సరం పూని ఉదయవేళ ఆకాశ మండలంలోకి ఎగిసిపోయాము. మధ్యాహ్న వేళదాకా విహరించాము. తీక్షణమయిన సూర్య రస్ములు తాకి జటాయువు కాలిపోతూ వుండడం గమనించాను. తమ్ముణ్ణి రక్షించాలని నా పక్షాలతో వాడిని పదిలంగా పొదువుకొన్నాను. నా పక్షాలు కాలిపోయాయి. నా ఎరకలు రాలిపోయి, సత్త్వం కోల్పోయి, వచ్చి ఈ ఆశ్రమంలో పడిపోయాను. జటాయువు ఎటు ఎగిరిపోయాడో ఏమయిపోయాడో ఎరుగను. అతని మరణ వార్త మీవల్ల విన్నాను. హీనబలుడిని, పక్షాలు లేనివాడని, పూర్వమట్లు నాకు రెక్కలువుంటే దక్షతతో నా సోదరుడి పగ తీర్చి, మగటిమితో శ్రీరామభద్రుడి దేవేరిని తేనేర్చేవాడిని. మాటలకేమి?'' అని విచారగ్రస్తుడు అయినాడు.

అంత భల్లూక వల్లభుడు జాంబవంతుడు హనుమంతుడూ, అంగదుడూ హర్షంతో ఉప్పొంగ ''సంపాతీ? నీకు జటాయువు తమ్ముడు. ఈ జగత్తులన్నింటిలో నీకు ఎదురు ఎక్కడ? నువ్వు చూడని యెడలు, నువ్వు ఎరుగని తావులు వుండవు. రావణుడి శ్రీరామవిభుడి దేవిని ఎక్కడ దాచినాడో నీవెరింగిన తెలియచెప్పవలసింది'' అని అడిగాడు. అంత సంపాతి సందేహం తీరిపోయే విధంగా ఈ పగిది వచించాడు.

''దుర్దమ పరాక్రమడు, ఘనుడు 'సుపార్శ్వుడు' నా తనూభవుడు.

-ఇంకావుంది

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

సోమవారం, 25 ఫిబ్రవరి 2013

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: శుద్ధ పౌర్ణమి రా.02.07
నక్షత్రం: మఖ రా.02.14
వర్జ్యం: మ.01.44 నుండి 03.24 వరకు
దుర్ముహూర్తం: మ.12.52 నుండి 01.38 వరకు, తిరిగి మ.03.11 నుండి 03.58 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):** అనారోగ్యమేర్పడుతుంది. దేనికీ ఎక్కువ పట్టుదల మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండాలి. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.
- **వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):** బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శత్రుబాధలు దూరమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి.
- **మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):** ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. సన్నిహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గుర్తింపు లభిస్తుంది.
- **కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):** కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):** ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. అనారోగ్య బాధలుంటాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా చూసుకోవాలి. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.
- **కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):** నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ధన లాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవ దర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.
- **తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):** అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి.
- **వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):** కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):** నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభాలను పొందుతారు. ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):** వ్యవసాయ రంగంలోనివారికి లాభదాయకంగా వుంటుంది. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది.ప్రయత్న కార్యాలు సఫలమవుతాయి. ఆందోళన ఉంటుంది.
- **కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):** మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.
- **మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):** ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. దైవదర్శనం లభిస్తుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. ఋణం తొలగిపోతాయి.

మంచిమాట

తల్లిప్రేమ

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని పురాణాలు చెబుతున్నాయి. తల్లిని మించిన దైవం లేదని కూడా చెబుతున్నాయి. నవమాసాలు బిడ్డను తన కడుపున మోసి, తాను తీసుకున్న ఆహారాన్ని తన కడుపులోని శిశువుకు అందించి, బిడ్డను కనేటపుడు పునర్జన్మను పొందుతుంది అమ్మ. కన్న తరువాత కంటికి రెప్పలాగా కాపాడుతూ పెంచి పెద్ద చేసి ఆలనా పాలనా చూసుకుంటోంది. సంఘానికి ప్రయోజకుడుగా పెంచాలని పరితపిస్తుంది. తండ్రి తిట్టినా, దండించినా బిడ్డను సావధానపరచి బుజ్జగించేది అమ్మ. అలాంటి అమ్మ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిది. మనకు ఎన్నో ఋణాలు ఉన్నాయి- దేవఋణం, ఋషి ఋణం, మాతృఋణం, పితృ ఋణం, దారాఋణం. తల్లిదండ్రుల ఋణం తీర్చుకుంటే ఏ పని నెరవేరదు! 'యా దేవీ సర్వ భూతేషు మాతృ రూపేణ సంస్థితా' అని చండీ స్తోత్రంలో ఉంది. కాబట్టి తల్లిలో జగన్మాతను దర్శించాలి. స్త్రీలందరూ దేవీ స్వరూపిణులే. కొందరు శ్లోకాలను వల్లిస్తారు. పెద్ద పెద్ద ప్రసంగాలు ఇస్తారు. కాని తల్లి పట్ల ప్రవర్తన తద్విరుద్ధం. వృద్ధురాలైన అతడి తల్లికి తినడానికి తిండి లేదు. తల్లి సేవను విస్మరించి సాధువులకు, జీయర్లకు సేవ చేస్తే సమంజసమా?

తల్లిదండ్రులను ఎట్టి పరిస్థితులో త్యజించరాదు. తల్లిదండ్రులంటే సామాన్యులు కారు. వారు ప్రసన్నం కాకపోతే జీవితంలో ఏదీ ఫలవంతం కాదు. నీ తల్లిదండ్రులు నిన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. ఇప్పుడు నీకు పిల్లలున్నారు. ఈ స్థితిలో భార్యను తోడ్కొని ఇల్లువిడిచి బయటకు వచ్చావు. తల్లిదండ్రులను మోసం చేసి, వంటరి వారిని చేసి, భార్య పిల్లలను పిలుచుకొని వచ్చి ఏదో గొప్ప మహాత్ముడిగా భావిస్తున్నావు. విఘ్నరాజు వినాయకుడంతటివారు 'తల్లిదండ్రులకు ప్రదక్షిణ చేస్తే ముల్లోకాలను, పుణ్యతీర్థాలను చుట్టి వచ్చిన ఫలితం లభిస్తుంది అనే ధర్మసూక్ష్మాన్ని గ్రహించి పార్వతీ పరమేశ్వరులకు ప్రదక్షిణ చేసి గాణాధిపతిగా భక్తుల చేత పూజలనందుకుంటున్నాడు. పూర్వం పురుషోత్తమపురి అనే గ్రామంలో నరసింహాచార్య అనే ఒక వైష్ణవుడు వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజారిగా ఉండేవాడు. అతడు సంగీత సాహిత్యాలలో అపార నైపుణ్యం కలవాడు. నిత్యం స్వామి భక్తికై అనేక కీర్తనలు వ్రాసి, గానం చేసేవాడు. ద్రావిడ వేద పారాయణాలతో స్వామిని కీర్తించెడివాడు. అతనికి ఐదుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. మగ పిల్లలకు అందరికీ విష్ణునామాలను పేర్లుగా పెట్టుకొని పిలుచుకొనేవాడు. అందరికి క్రమంగా విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులుగా చేసి, తనకున్న మాగాణి పొలాన్ని అందరూ సమానంగా పంచుకోమని చెప్పి కన్నుమూశాడు. తండ్రి మరణంతో దిక్కుతోచని సంతానమంతా తల్లి బాగోగుల కోసం పరితపించారు. కాని మగపిల్లలలో 3వ సంతానమైన రామకృష్ణ మాత్రం మొదటినుండి అమ్మా, నాన్నల బాగోగులను పట్టించుకొనేవాడు కాదు. ఎంతసేపు తాను, తన సంపాదనమీదే ధ్యాస తప్ప ప్రేమాభిమానాలు గాని, మంచి చెడులను గాని పట్టించుకునేవాడు కాదు. తండ్రి చనిపోయిన సంవత్సరంలోపే ఆస్తిని పంచమని తగాదా పెట్టాడు. దానితో బాధపడిన మిగతా సోదరులు తండ్రి ఇచ్చిన పొలాన్ని అమ్మి రామకృష్ణ వాటా అతనికి ఇచ్చారు. ఇక దానితో రామకృష్ణ సంతోషం చెంది మహానగరానికి బయలుదేరాడు. అతని ఇద్దరు కుమారులు యుక్త వయస్సుకు వచ్చారు. రామకృష్ణ తన ఇద్దరు పిల్లలకు వివాహాలు చేశాడు. కోడళ్ళతో, మనుమలు, మనుమరాళ్ళతో హాయిగా కాలం గడుపుదామనుకున్నాడు. కాని కర్మ ఫలితం అనుభవించక తప్పదు కదా! అయినా రామకృష్ణ స్వార్థ చింతన మానుకోలేదు. కానిచేసుకున్న పాపానికి రామకృష్ణ వీధిపాలైనాడు. అప్పుడు అతనికి గతం గుర్తుకు వచ్చింది.. పరుగు పరుగున పురుషోత్తమపురికి వచ్చాడు. అక్కడ మంచంలో ఉన్న తల్లి పాదాలపై పడి కన్నీరు కార్చాడు. అప్పుడు 90 ఏళ్ళ ఆ తల్లి విషయం తెలుసుకొని అక్కున చేర్చుకుంది. మిగతా సోదరులను పిలిపించింది. అందరికీ భోజనాలు పెట్టించి జీవితంలో తల్లి ప్రేమ, సోదర ప్రేమే శాశ్వతమని అందరూ కలిసి జీవించమని చెప్పింది.

-ముడుంబ దామోదరాచార్యులు

వృతాసురుడు 31

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 24

మాటాట

ఆధారాలు:

అడ్డం
1. వరూధిని వలచినవాడు
5. చిత్తరువు
6. చదరంగంలో కదిపేవి
8. పాద్యమి తరువాత
9. చన్ను
10. సరదా, వేడుక
13. పిడికిటి పోటు
14 . దవ్వు
15. పారాణి పా'లేదు

నిలువు
2. నిరూపణ , దృష్టాంత
3. దీపం గూడు , గోపురం వంటి నిర్మాణం
4. ఓ సంస్కృతకవి రచితో ఉన్నాడు.
6. పరమాన్నమే
7. తలకిందయిన కలర్స్
11. యుద్ధం
12. ఇల్లాలు
13. పాద

మాటాట - 23 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఆఫ్రికా దేశాలు ఉగ్రవాద గుప్పిట చిక్కుకున్నాయి. ఆసియా దేశాలు సైనిక, ఆర్థిక శక్తిని సంతరించుకోవడంతో అన్ని విధాలుగా బలహీనమైన ఆఫ్రికానే అల్‌ఖైదా తదితర ఉగ్రవాద సంస్థలకు కేంద్రంగా మారింది. అంతర్జాతీయంగా తీవ్రవాదానికి ఇప్పుడు మూల కేంద్రాలుగా ఆఫ్రికా దేశాలు మారుతున్నాయి...

ఆఫ్రికాపై ఉగ్రపాదం

» ఆఫ్రికా దేశాలు ఉగ్రవాదం గుప్పిట్లో చిక్కుకొని అల్లాడుతున్నాయి. అమెరికా ఆర్థిక, సైనిక శక్తికి తాత్కారణంగా ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్, పెంటగాన్‌లపై అల్‌ఖైదా మిలిటెంట్లు దాడి చేసిన అనంతరం ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద ముప్పు మరింతగా పెరిగింది. ప్రపంచం నుంచే ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్న అమెరికా మొదట అఫ్గానిస్థాన్, అనంతరం ఇరాక్ దేశాలపై దాడులు జరిపి, ఆ వ్యవహారాన్ని అక్కడికే పరిమితం చేయడంతో, ఇప్పుడు తాజాగా పాకిస్తాన్, అఫ్గానిస్థాన్‌తోపాటు మొత్తం ఆసియాలోని అనేక దేశాలకు ఈ ముప్పు తీవ్రంగా పరిణమిస్తున్నది. దాదాపుగా, ఆసియా ఖండంలోని అన్ని దేశాలూ ఏదో ఒక రూపంలో అల్‌ఖైదా, తాలిబన్, లష్కరే తోయిబా, జమా ఇస్లామియా, జమాయతే ఉద్ దవా వంటి ఉగ్రవాద సంస్థల విచ్ఛిన్నకర కార్యకలాపాలకు లోనవుతునే ఉన్నాయి. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత సమసిపోతుందనుకున్న ఉగ్రవాదం కొత్త శక్తితో, ఆధునిక సంపత్తిని సంతరించుకొని, భయానక విపత్తులకు కారణమవుతున్నది. ఈ దశాబ్దకాలంలో ఆత్మాహుతి దాడులు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు, బాంబు విస్ఫోటనాలు తదితర హింసాత్మక సంఘటనలెన్నో మధ్యప్రాచ్య, ఆగ్నేయాసియా దేశాల్లో చోటు చేసుకున్నాయి. అయితే, తాజా పరిణామాలను బట్టిచూస్తే ఆసియా దేశాలు ఇటీవల కాలంలో కొంత మేర ఆర్థిక, సైనిక శక్తిని పెంపొందించుకోడంతో ఈ ఉగ్రవాద సంస్థల దృష్టి ఆఫ్రికా దిశగా మళ్లిందన్న విషయం స్పష్టమవుతున్నది. అందుకు కారణం, ఆఫ్రికాలోని అన్ని దేశాలు, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అత్యంత బలహీనంగా ఉండడమే. అక్కడ ఉగ్రవాద సంస్థలు ఎలాంటి దాడులకు ఆస్కారం లేని రక్షణయుత పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవకాశం ఉండడమే.

తాజాగా, ఆఫ్రికా దేశాలను కేంద్రంగా చేసుకొని ఉగ్రవాద సంస్థలు విజృంభిస్తున్నాయంటూ అమెరికా నిఘా విభాగాలు రోజువారీ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. నైజీరియాలో తాజాగా ఓ కంపెనీకి చెందిన ఏడుగురు విదేశీయులను అపహరించడం ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. ఆఫ్రికా దేశాల్లో భద్రత లేకపోవడంతోపాటు, అక్కడి పౌరులకే ఏ విధమైన రక్షణ లేదని చెప్పడానికి ఈ తరహా సంఘటనలు ఆస్కారమిస్తున్నాయి. బొకో హారమ్ సంఘటన ఉద్రవాదుల విజృంభణపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఆఫ్రికా ఖండంలో ఇస్లాం మతస్థులు స్థిరపడడం నిన్న మొన్నటి విషయం కాదు. శతాబ్దాలుగా ఇది జరుగుతూ వచ్చిన పరిణామం. ఆయా దేశాల్లోని పేదరికాన్ని, వెనుకబాటు తనాన్ని ఉగ్రవాద సంస్థలు తమకు అనుకూలంగా మలచుకోవడమే ఇప్పుడు సమస్యలకు కారణమవుతున్నది. సోమాలియాలో సుమారు దశాబ్ద కాలంగా అల్‌ఖైదా ఆధ్వర్యంలో పని చేస్తున్న అల్ షహబ్ సంస్థ చావకింద నీరులా పని చేస్తున్నది. అపహరణల నుంచి ఆత్మాహుతి దాడుల వరకూ అన్ని రకాల విధ్వంసాలకూ కారణమవుతున్నది. సోమాలియా భద్రతా దళాలు ఎంత ప్రయత్నించినా ఉగ్రవాద దాడులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. నిజానికి సోమాలియా సైన్యంతో పోలిస్తే, తీవ్రవాద సంస్థల వద్దే ఆత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. ఆసియాలో మాదిరిగానే ఆఫ్రికాలోనూ ఇస్లామిక్ ఉగ్రవాదం క్రమంగా వేళ్లూనుకుంటున్నది. భూగోళంలో మరో మతానికిగానీ, వర్గానికిగానీ చోటు లేకుండా, ఇస్లామిక్ మహాసామ్రాజ్యాన్ని నిర్మించడమే ఉగ్రవాద సంస్థల లక్ష్యం. విధ్వంసాలను సృష్టిస్తేగానీ తమ ఉనికి ప్రపంచానికి తెలియదని వారి ఆంతర్యం. ఆసియాలో ఉగ్రవాద దాడులు నిత్యకృత్యంకాగా, ఈ సంస్కృతి ఆఫ్రికా ఖండానికి కూడా విస్తరించింది. మతం పేరుతో జరుగుతున్న ఈ మారణకాండకు తెర దించే ప్రయత్నంలో ప్రపంచ దేశాలన్నీ ఒకే తాటిపై నిలవాల్సిన అవసరం ఉంది.

- ఎంజి ప్రసాద్

అమెరికాకు చైనా భయం!

» చైనా పేరు వింటేనే అగ్రరాజ్యమైన అమెరికా భయపడుతున్నది. చైనా సైనిక పాటవాన్ని లేదా అధునాతన ఆయుధాలను చూసికాదు ఈ భయం. అణ్వస్త్ర దాడులకు దిగుతుందనీ కాదు. అన్నిటినీ మించిన గొప్ప ఆయుధాన్ని అమెరికాపై చైనా గత కొంతకాలంగా ప్రయోగిస్తున్నది. అదే అధునాతన సైబర్ పరిజ్ఞానం. ఎంతటి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, తమ కీలక వెబ్ సైట్లను చైనా హ్యాక్ చేయడం అమెరికాను ఆందోళనకు గురి చేస్తున్నది. నిజానికి ఇది అమెరికాకు మాత్రమే పరిమితమైన అంశం కాదు. దేశదేశాల భద్రతా సైట్లను కూడా చైనా కంప్యూటర్ నిపుణులు సునాయాసంగా హ్యాక్ చేసేస్తున్నారు. అమెరికాను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న ఈ దారుణం మిగతా దేశాలపైనా చైనా ప్రయోగించదని చెప్పడానికి వీలులేదు. భద్రత నుంచి కార్పొరేట్ రంగం వరకూ రంగం ఏదైనప్పటికీ వెబ్‌సైట్లను యథేచ్ఛగా హ్యాక్ చేయడం, కీలక సమాచారాన్ని దొంగిలించడం, అందరినీ గందరగోళ పరిచే రీతిలో అసంబద్ధమైన సమాచారాన్ని చేర్చడం వంటి చర్యలకు చైనా ఎంతోకాలంగా పాల్పడుతున్న దన్నది బహిరంగ రహస్యం. అమెరికా తీసుకుంటున్న అన్ని జాగ్రత్తలకూ చైనా గండికొడుతున్నది. అక్కడి కార్పొరేట్ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వెబ్‌సైట్లపై దాడికి పాల్పడుతున్న హ్యాకర్లకు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ)తో

దగ్గరి సంబంధాలున్నాయన్న వాస్తవం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. షాంఘై నగర శివార్లలోని పిఎల్ఎ యూనిట్ 61398కు కార్యాలయంలోనే అధిక శాతం హ్యాకింగ్ జరుగుతున్నదని అమెరికా నిఘా సంస్థలు కనుగొన్నాయి. 'కామెంట్ క్రూ' లేదా 'షాంఘై గ్రూప్'గా ముద్రపడిన హ్యాకర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. చైనా సైన్యం సహాయ సహకారాలతోనే హ్యాకర్లు విజృంభిస్తున్నారని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాల అనుమానం. ఈ విషయాన్ని రుజువు చేసే సాక్ష్యాధారాలను కూడా ఈ వర్గాలు సేకరించాయి. అయితే, చైనా ప్రభుత్వం ఈ వార్తలను ఖండిస్తున్నది. హ్యాకర్లతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేస్తున్నది. ప్రజలకు సమాచారం అందించడానికి ఉంచిన వెబ్‌సైట్లను హ్యాకింగ్ చేయాల్సిన అవసరం ఎవరికైనా ఎందుకు ఉంటుందని ఎదురు ప్రశ్నిస్తున్నది. అమెరికా ఇంటర్నెట్ ప్రొవైడర్లు, యాంటీ వైరస్ అమ్మకం దారులకు సంబంధించిన సమాచారాన్ని చైనా లాఘవంగా తస్కరిస్తున్నదన్న అమెరికా వాదనను కూడా బీజింగ్ ఖండిస్తోంది. మరోవైపు తమ వెబ్‌సైట్స్ చైనాలో కనిపించకుండా అమెరికా సాంకేతిక నిపుణులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. చైనాకు అమెరికాలోని ఒక వర్గం సహకరిస్తున్నదన్న అనుమానాలు లేకపోలేదు. విద్యుత్ పవర్ గ్రిడ్, గ్యాస్ లైన్లు, నీటి సరఫరా వంటి అత్యంత కీలకమైన శాఖల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న చైనా ఆగడాలకు కళ్లెం వేయాలని అన్ని ప్రభుత్వ శాఖలకు సూచించారు. కానీ, చెప్పుకోతగ్గ ఫలితాలు మాత్రం రాలేదు. అమెరికా సైట్లపై చైనా హ్యాకర్ల దాడులకు తెరపడడం లేదు. పైగా, రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు సమీప భవిష్యత్తులో అమెరికా, చైనా మధ్య సైబర్ యుద్ధానికి కారణమవుతాయని విశ్లేషకుల అభిప్రాయం. సంయమనం పాటిస్తున్నామని అంటున్న అమెరికా ఇంకా ఎంతకాలం చైనా హ్యాకర్లను ఉపేక్షిస్తుందో చూడాలి. చైనా అనుసరించిన దారినే అమెరికా కూడా ఎంచుకుంటే, సైబర్ యుద్ధానికి దారులు తెరుచుకున్నట్టే.

- బిఎల్

జింటావోను మించిన జిన్‌పింగ్

పట్టు బిగించిన నవ నాయకుడు

» పదేళ్లకోసారి జరిగే అధికార మార్పిడి తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీపైన, సైన్యంపైనా తన పట్టును బలోపేతం చేసుకోవడమే కాకుండా చైనా కొత్త నాయకుడు జీ జిన్‌పింగ్ అధికారంలో వంద రోజులను విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో పాటు తనకన్నా ముందున్న హు జింటావోకన్నా బలమైన నాయకుడిగా సైతం ఎదిగారు. 59 ఏళ్ల జిన్‌పింగ్ వచ్చే నెల హు జింటావోనుంచి అధ్యక్ష పదవిని సైతం చేపట్టడం ద్వారా దశాబ్ద కాలంలో పార్టీ నాయకుడు, మిలిటరీ చీఫ్, అధ్యక్ష పదవి-ఇలా మూడు పదవులను చేపట్టిన తొలి వ్యక్తిగా నిలవనున్నారు. గత ఏడాది నవంబర్ 15న చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన జీ జిన్‌పింగ్ ఈ నెల 23వ తేదీన అధికారంలో వందరోజులను పూర్తి చేసుకోనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, అధ్యక్ష పదవులనుంచి తప్పుకున్న తర్వాత హు జింటావో మిలిటరీ చీఫ్ పదవిని మాత్రం అట్టి పెట్టుకున్న ఇంతకు ముందు అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ తరహాలోనే తెరవెనుకనుంచే వ్యవహారాలను నడపాల్సి వచ్చింది.

అత్యంత సాఫీగా సాగిన అధికార మార్పిడిగా అభివర్ణించే గత ఏడాది జరిగిన అధికార మార్పిడిలో అధికార చైనా కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన మూడు కీలక పదవులనూ దక్కించుకున్న జిన్‌పింగ్ రాష్ట్రాల పార్టీ అధ్యక్ష పదవుల్లోను, ఇతర పార్టీ ముఖ్య పదవుల్లోను తనకు అత్యంత విశ్వాసపాత్రులయిన వారిని నియమించుకోవడం ద్వారా పార్టీపై తన పట్టును సుస్థిరం చేసుకున్నారు. అంతేకాకుండా అన్ని ముఖ్యమైన సైనిక విభాగాలను సందర్శించడం ద్వారా ప్రపంచంలోనే అత్యంత పెద్ద సైన్యంగా చెప్పబడే 23 లక్షల మంది సైనికులు ఉండే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీపై కూడా పట్టు సాధించగలిగారు. వచ్చే నెల అధ్యక్ష బాధ్యతలను కూడా చేపట్టిన తర్వాత పరిపాలనను అట్టడుగు స్థాయినుంచి పైదాకా ప్రక్షాళన చేయడానికి కూడా అవకాశం లభిస్తుంది. అధికార మార్పిడి కోసం ఎదురు చూస్తున్న కారణంగా గత ఆరు నెలలుగా పాలనా వ్యవస్థలో కొంతమేరకు స్తబ్ధత ఏర్పడింది. పదవీ విరమణ చేయనున్న పాతతరం వారి స్థానంలో కొత్తతరం వారిని నియమించడం ద్వారా తిరిగి దానికి జవసత్వాలను నింపాల్సిన అవసరం ఉంది. వచ్చే నెల 3న ప్రారంభం కానున్న జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాల సందర్భంగా వెన్ జియబావోనుంచి ప్రధానమంత్రి బాధ్యతలను చేపట్టనున్న ప్రభుత్వంలో నంబర్ టూ నాయకుడయిన లీ కెక్వియాంగ్‌తో కలిసి జీ జిన్‌పింగ్ కొత్త క్యాబినెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు కూడా బోలెడన్ని ఉన్నాయి. పొరుగు దేశాలతో ముఖ్యమైన బలమైన దేశమైన జపాన్‌తో దీవులకు సంబంధించి చైనాకు సరిహద్దు వివాదాలు పెరుగుతున్నాయి. అలాగే దక్షిణ చైనా సముద్రానికి సంబంధించి కూడా వియత్నాం లాంటి దేశాలతో వివాదాలు రగలుతున్నాయి. మరో పక్క టిబెట్ సైతం నివురుగప్పిన నిప్పులాగా మండుతోంది. స్వయం పాలనకోసం టిబెటన్ల ఆత్మాహుతులు వందను దాటిపోవడమే అక్కడి ప్రజలు చైనాకు దూరమవుతున్న వాస్తవాన్ని ఎత్తి చూపిస్తోంది. అవినీతిని అంతం చేయడానికి కొత్త నాయకత్వం చేపట్టిన చర్యలను ప్రశంసిస్తూ అధికార 'జిన్హువా' వార్తాసంస్థ ఒక సుదీర్ఘ వ్యాసంలో 'ఎన్నో పరీక్షలు, అంచనాలు ముందున్నప్పటికీ కొత్త నాయకుల ఎన్నిక తర్వాత మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి' వ్యాఖ్యానించింది. ఇది మంచి ఆరంభమని అందరూ అంగీకరిస్తున్నప్పటికీ ఎన్నో సవాళ్లు, ఆకాంక్షలు ముందున్నాయని ఆ వ్యాసం పేర్కొంది. 2012 చైనా వృద్ధి రేటు గత 13 ఏళ్లలో ఎన్నిడూ లేనంత దిగువకు పడి పోయింది. 2011లో వృద్ధి రేటు 9.3 శాతం ఉండగా అది గత ఏడాది 7.8 శాతానికి తగ్గిపోయింది. అంతేకాక పెట్రోలియం దిగుమతులపై దేశం ఆధారపడ్డం కూడా రికార్డు స్థాయికి చేరుకుంది. వాస్తవ విరుద్ధమైన ఆర్థిక పరిస్థితి భవిష్యత్తులో అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. దేశవ్యాప్తంగా నగరాలన్నీ కూడా వాతావరణ కాలుష్యంతో మునిగి పోయిన నేపథ్యంలో పెరిగి పోయిన వాతావరణ, పర్యావరణ సమస్యలను దేశం ఎదుర్కొంటోందని కూడా ఆ వ్యాసం పేర్కొనింది. ఇవి కాక పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు, అవినీతి, అదికార దుర్వినియోగం, ఆహార భద్రతకు సంబంధించిన కుంభకోణాలు, ఫలితంగా ప్రజల్లో పెరిగి పోతున్న అసహనం కొత్త నాయకత్వం ఎదుర్కోవలసిన తక్షణ సమస్యలని కూడా జిన్హువా వ్యాఖ్యానించింది. అంచెలంచెలుగా ఈ సమస్యలతో సుదీర్ఘ పోరాటం సాగించడానికి కొత్త నాయకత్వం సిద్ధం కావలసిన అవసరం ఎంతయినా ఉందని ఆ వార్తాసంస్థ అభిప్రాయ పడింది.

సిరియాలో శిథిల నగరం

చీకట్లో సిరియా!

సిరియా ఇప్పుడో శిథిల దేశం..నాలుగు దేశాల మధ్య నలుగుతున్న సిరియాలో శాంతి ఎండమావి. నిరంతర ఘర్షణలు, అదుపు తప్పిన ఆరాచకాలు ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. పీఠాన్ని పట్టుకు వేలాడుతున్న అసాద్ ప్రజాకాంక్షను కాలరాస్తున్నారు. రెండు లక్షల మందిని నిర్బంధించారు. జిహాదీలు, వార్‌లార్డులదే శాసనంగా మారుతున్న నేపథ్యంలో సిరియాను భవిష్యత్ కనిపించని చీకట్లే కమ్ముకున్నాయి!

» ఏళ్ల తరబడి హింసా, అనిశ్చితి, అరాచక పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్న సిరియా విచ్ఛిన్నం కాబోతోందా? సిరియా పరిణామాలను పశ్చిమ దేశాలు పట్టించుకోక పోతే..తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోక పోతే మాత్రం పరిస్థితులు మొత్తం మధ్యప్రాచ్యకే ముప్పు తెచ్చి పెట్టేవిగానే కనిపిస్తున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయం నుంచి సిరియా గమనం సమస్యలమయంగానే ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఆ దేశ ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. సిరియా పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేయడం మినహా పశ్చిమ దేశాలు ఏ మాత్రం పట్టించుకోక పోవడం వల్ల అంతర్గత సమస్యలు అంతర్యుద్ధ స్థాయికి విషమించాయి. ఇప్పుడు దాదాపుగా దిక్కుతోచని లేదా దిక్కులేని స్థితినే కల్పించాయి. టర్కీ, లెబనాన్, జోర్డాన్ ఇరాక్ మధ్య ఉన్న సిరియా వేగంగానే అస్థిరమయమవుతోందనడానికి ఎడతెగని రీతిలో సాగుతున్న తాజా విధ్వంస కాండలే నిదర్శనం. రోజురోజుకూ తీవ్రమవుతున్న ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొని గత కొన్ని నెలలుగా నిలబడ గలిగినప్పటికీ అధ్యక్షుడు అసాద్ ప్రభుత్వ పతనం అనివార్యంగానే కనిపిస్తోంది.

అటు మిలిషియా, వార్‌లార్డులు, ఇస్లామిస్టుల చేతుల్లో సిరియా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సమీప భవిష్యత్‌లో పరిస్థితులు మెరుగు పడకపోతే లక్షలాది మంది పౌరుల జీవితాలు దుర్భరమవుతాయి. ఇదే జరిగితే విచ్ఛిన్న సిరియా నుంచి పుట్టుకొచ్చే జిహాదీ శక్తులు అంతర్జాతీయ శాంతికే ముప్పును కలిగిస్తాయి. అంతే కాదు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్టుగా కనిపిస్తున్న మధ్యప్రాచ్య దేశాల శాంతికే దీని వల్ల పెను ముప్పు వాటిల్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకూ జరిగిన ఘర్షణల్లో 70వేల మంది మరణించగా వందల వేల సంఖ్యలో గల్లంతయ్యారు. మరో రెండు లక్షల మంది అసాద్ సైనికుల నిర్బంధంలో మగ్గుతున్నారు.

మధ్యప్రాచ్యంలో సుస్థిర శాంతిని పాదుగొల్పాలన్న అమెరికా లక్ష్యం నెరవేరాలంటే ముందుగా సిరియాను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలి. ఎందుకంటే గత అక్టోబర్ కంటే కూడా ఇప్పుడు సిరియా పరిస్థితి మరింత విషమించింది. అంతా అతివాదమే రాజ్యమేలుతోంది. అరాచక మూకలు ప్రజా జీవితాలను శాసిస్తున్నాయి.

-బిఆర్పీ

కుస్తీ కాదు దోస్తీ!

క్యూబాకు చేరువవుతున్న అమెరికా

» ఇప్పటివరకు ఒకరి పొడంటే మరొకరికి గిట్టని అమెరికా, క్యూబా దేశాలు ఇప్పుడు దగ్గర కావాలనుకుంటున్నాయి. అమెరికాకు చెందిన అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందం ఒకటి త్వరలో క్యూబాను సందర్శించనుంది. ఇరు దేశాలు ఇంతకాలంగా తమ మధ్య ఉన్న విభేదాలను మరిచిపోయి మెరుగయిన వాణిజ్య, పర్యాటక సంబంధాలను పెంపొందించుకోవడానికి మార్గాన్ని ఇది సుగమం చేస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఏది ఏమయినా రెండు దేశాలు ఆ స్థాయికి చేరుకోవాలంటే ముందుగా అవి తమ మధ్య ఉన్న రాజకీయ విభేదాలను అధిగమించడమేకాక, భౌగోళికంగా ఇరుగు పొరుగు దేశాలయిన తమ రెండు దేశాలు సత్సంబంధాలను కలిగి ఉండడం అవసరమనే వాస్తవాన్ని గ్రహించడం అత్యవసరమని పరిశీలకులు అంటున్నారు. క్యూబాలో పర్యటించనున్న డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ పాట్రిక్ లీహై నాయకత్వంలోని ప్రతినిధి బృందం ఇరు దేశాల నిర్బంధంలో ఉన్న వ్యక్తులను విడుదల చేయడానికి మార్గాన్ని సుగమం చేయడం లాంటి చర్యల ద్వారా ఇరు దేశాల నాయకుల మధ్య శిఖరాగ్ర సమావేశం జరగడానికి అవసరమైన పరిస్థితులను కల్పించ వచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు.. ఇంటర్నెట్ పరికరాలను స్మగ్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణపై ప్రస్తుతం క్యూబాలో జైలుశిక్ష అనుభవిస్తున్న అమెరికా పౌరుడు అలాన్ రాస్‌ను విడుదల చేయించడం, దరిమిలా అమెరికాలో నిర్బంధించిన క్యూబన్లను విడుదల చేయడం ద్వారా ఇరు దేశాల మధ్య పరిస్థితుల్లో మార్పు తీసుకురావచ్చు. అంతేకాదు తమ పొరుగు దేశాలతో సత్సంబంధాలను కలిగి ఉండాలన్న అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా విదేశీ విధానం వాస్తవ రూపం దాల్చేలా చూడడానికి ఇలాంటి చర్యలు ఎంతో దోహదపడుతాయి కూడా. గత కొంతకాలంగా అమెరికా తన సాగర జలాల చుట్టుపక్కల ఉన్న దేశాలతో ముఖ్యంగా దక్షిణ అమెరికా దేశాలతో వాస్తవ పరిస్థతులకు దూరంగా ఉండే, అంతేకాకుండా రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తూ ఉంది. క్యూబా, వెనిజులా దేశాల పట్ల అది అనుసరిస్తున్న శత్రుత్వ ధోరణే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా కమ్యూనిస్టు దేశమైన క్యూబా ప్రజాస్వామిక విధానాలను అనుసరించడం ద్వారా తన విధానాలను మార్చుకోవడమే కాకుండా రాజకీయ రంగంలో సైతం స్వచ్ఛందంగా అనేక సంస్కరణలు తీసుకు వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాతో అర్థవంతమైన చర్చలు జరపాలని ఆ దేశం ఎంతో

ఆసక్తిని కనబరుస్తోంది కూడా. అమెరికా గనుక తాము తమ సోషలిస్టు అజెండాను అమలు చేయడానికి అవసరమైన రాజకీయ అవకాశాన్ని కల్పించినట్లయితే ఆ దేశంతో వివాదాస్పద అంశాలు దేనిపైనైనా చర్చించడానికి తాము సిద్ధమేనని క్యూబా అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో గత ఏడాది ప్రకటించడమే ఆ దేశ వైఖరిలో మార్పు వచ్చిందనడానికి నిదర్శనమని పరిశీలకులు అంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఒబామా తొలిసారి అధికారంలో ఉన్న నాలుగేళ్ల కాలంలో రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ ఆ దేశం ప్రాధాన్యత ఇచ్చిన దేశాల్లో క్యూబాకు సముచిత స్థానం లభించిందనేది వాస్తవం. ఇరు దేశాల మధ్య పెరిగిన వాణిజ్య, పర్యాటక రంగాల వ్యాపారమే ఇందుకు నిదర్శనం. ఈ రెండు దేశాల మధ్య ఈ రంగాల్లో వ్యాపారం ఇప్పుడు 45 కోట్ల డాలర్లకు చేరుకుంది. క్యూబాతో వ్యాపారం జరుపుతున్న తొలి పది దేశాల్లో అమెరికా ఒకటిగా నిలవడంతో పాటుగా కెనడా తర్వాత క్యూబాకు అత్యధికంగా పర్యాటకులను పంపిస్తున్న దేశంగా కూడా అది నిలిచింది. ఈ ధోరణి ప్రోత్సాహకరమైనదే కాకుండా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి తోడ్పడగలదన్న ఆశలను సైతం కల్పిస్తోంది. ఇందుకు అమెరికా ముందుగా చేపట్టాల్సిన చర్యల జాబితాలో దాదాపు అయిదు దశాబ్దాలుగా క్యూబాపై విధించిన వాణిజ్య నిషేధాన్ని ఎత్తివేసి దేశానికి అధికారికంగా దౌత్యపరమైన గుర్తింపునివ్వడం అగ్రస్థానంలో ఉంటాయి.

-ఆర్.కె

వెలుగు నీడలు

తూరుపు నుదుట
తిలకం దిద్ది
వెళ్ళిపోయింది చీకటి

పక్షులు రెక్కలు విప్పుకుని
బారులు తీరుతూ
ఆకాశానికి హారాలవుతున్నాయి

రుతువుల చీరలు కడుతూ
ప్రకృతి వధువుగా
ముస్తాబవుతోంది

వెలుగు నీడల
రేఖాచిత్రానికి
కాలం ఫ్రేం అవుతోంది

గతం గోడకి
వర్తమాన చిత్రపటం
అలంకారమై వ్రేలాడుతోంది

- పెద్దిపాగ పున్నారావు, 9959248542

సాహిత్యంలో పాటకు చోటెక్కడ?

మనిషిలో వచ్చిన మానసిక అనుభూతులు, అనుభవాలు, సంఘర్షణలను అక్షర రూపంలో అందంగా చెబితే కవిత్వమవుతుంది. లయబద్ధంగా చెబితే పాట అవుతుంది. అయితే కవిత్వం వ్యక్తిగతం... పాట సామూహికం. కవిత్వాన్ని ఉమ్మడిగా వ్యక్తీకరించుకోవచ్చు కాని అది అనివార్యత కాదు. పాట దాని అంతఃసంబంధం రీత్యా పాడితేనే దానిలోని అందాలు ద్విగుణీకృతమవుతాయి. అయితే పాడకపోతే పాటలను చదవలేమా అంటే చదువుకోవచ్చు. కాని పాడినప్పుడు దానితో ఉండే అందాలు చదువుకున్నప్పుడు కనిపించవు, వినిపించవు. సినీ కవులు ఆత్రేయ, నారాయణ రెడ్డి, కృష్ణశాస్త్రి లాంటి వారు రాసిన పాటలను విన్నప్పుడు పండితులు, పామరులు ఎంత ఆనందానుభూతికి లోనవుతారో, పాటలను చదివినప్పుడు కూడా కవిత్వాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ అంతే ఆనందానికి లోనవుతారు. ఎందుకంటే వారి పాటల్లో వాడిన భావచిత్రాలు, ప్రతీకలు, లయబద్ధమైన పద విన్యాసం, మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తాయి. ఒకసారి పాటను పాడాలంటే, అప్పుడు గాయకుడు, వాయిద్యకారుడు, వంతపాడేవారు (కోరస్ ఇచ్చేవారు) తెరమీదకు వస్తారు. బాగా పాడితే ఆ గాయకునికి వచ్చే పేరు రచయితకూ రావాలని లేదు. వినేవారికి రాసినవారి పేరు తెలుసుకోవాల్సిన అవసరం లేదు.

మానవ సమాజ పరిణామ క్రమంలో అన్ని సాహితీ ప్రక్రియలకు తల్లివంటిది పాటే! జీవితపు ప్రతి మలుపులో మనిషి చుట్టూ అల్లుకున్నది పాటే. తరాలనుండి నేటి వరకు జీవన సంఘర్షణలు చాలావరకు లిఖిత సాహిత్య రూపేణా కావచ్చు, మౌఖిక సాహిత్య రూపేణా కావచ్చు. పాటలోనే అమూల్యమైన చరిత్ర సంపద దొరుకుతుంది. సాహితీ ప్రపంచంలో ఇంత బలమైన పాటల సాహితీ ప్రక్రియను నేడొస్తున్న పత్రికలు ప్రోత్సహించకపోవడం ఒక విషాదం.

సాహితి ప్రక్రియల్లో భాగమైన కవిత, కథ, పద్యం, నాటకం, పాటల్లో ఏరకంగా చూసినా మానవ పరిణామ క్రమంలో ముందుగా వచ్చింది పాటే. ఏ ప్రక్రియకుండే అదనపు సౌకర్యాలు, కష్టసుఖాలు దానికున్నాయి. మానవ మనుగడలో భాగంగా తరాలనుండి అనంతంగా సాగుతున్న పాట సాహితీ రూపాన్ని, నేడు రాష్ట్రంలో వస్తున్న దినపత్రికలు, వారపత్రికలు, సాహితీ పత్రికల్లో పాటకిస్తున్న స్థానాన్ని పరిశీలించాల్సిన అవసరముంది.

నేడు పలు దినపత్రికల్లో సోమవారం వస్తున్న సాహితీ పేజీల్లో, సాహిత్యం కోసమే వస్తున్న సాహితీ పత్రికల్లో కవిత్వం, కవితా సంపుటాలపై అనేక విమర్శనా వ్యాసాలు వస్తున్నాయి. ఎప్పుడు చూసినా, ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరి పేరు మీద కవితల పోటీలు, వాటికోసం అవార్డులు, కవితా సంపుటాలకు పురస్కార ప్రదానోత్సవాలు జరుగుతాయి. కవితల పోటీల నిర్వహణపై కొన్ని ప్రమాణాలు ఏర్పరచుకొని ఎంతో కొంత నూతన రచయితలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఇస్తున్న బహుమతులపై అక్కడక్కడ కొన్ని అభ్యంతరాలున్నా ఎంతో కొంత ఆ కవితలు, కవితా సంపుటాలు ప్రాచుర్యంలోకి రావడానికి ఆ పోటీలు ఉపయోగపడుతున్నాయి. అందుకే బహుమతులు కానీ, అవార్డులు కానీ వచ్చిన కవులు జన బాహుళ్యంలోకి పోవడానికి వారి పేర్లు ప్రాచుర్యంలోకి రావడానికి పోటీలు నిర్వహిస్తున్నవారు కారకులవుతున్నారు. ఇక్కడే పాట గురించి చర్చించాలి. సాహితీ ప్రక్రియలో భాగమైన అన్ని అంశాలపై రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట పోటీలు నిర్వహిస్తున్నారు. కాని ఒక్క పాటల రచనలపై పోటీలు నిర్వహించడం ఇప్పటివరకు లేదు. టీవీల్లో జానపద పాటల పోటీలు నిర్వహించినప్పుడు కూడా పాడిన గాయకుడే ప్రాచుర్యంలోకి వస్తాడు. అయితే జానపద పాటల విషయంలో పాటల రచయితలు ఉండరు కనుక ఈ చర్చ వీటికి వర్తించకపోవచ్చు. కాని నేడు రాష్ట్రంలో అనేక అంశాలపై కొన్ని వందల పాటలు వస్తున్నాయి. పాటల పుస్తకాలు వస్తున్నాయి. నిరంతరం రోజువారీ సమస్యలపై పాటలు రాసే వారున్నారు. అయితే ఈ పాటలపై పత్రికా ముఖంగా విమర్శనా వ్యాసాలు నేటివరకు లేవు. ఒక అంశంపై పాటల రచనల పోటీ నిర్వహించి, వచ్చిన పాటల్లో సాహిత్యపరమైన అందాలను, భావ చిత్రాలను, శిల్ప సౌందర్యాన్ని, ప్రతీకలను చూసి ప్రోత్సహించవచ్చు. ప్రాచుర్యంలోకి ఎలా పోవడమన్నది వేరే అంశం. దానికి అనేక అంశాలు కారణమవుతాయి.

ఉదాహరణకు పుచ్చలపల్లి సుందరయ్య నిర్వహించిన పాటల పోటీల్లో ఎన్నికయిన వేములపల్లి శ్రీకృష్ణ రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' పాట ప్రచురించి నాటినుండి కాపాడారు కనుకనే నలభయ్యేళ్ళ తర్వాత ఎన్టీరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రచారంలో భాగంగా ఆ పాటే రాష్ట్రమంతటా మార్మోగిపోయింది. అందుకే రచనలు వేరు, ప్రాచుర్యం వేరు. ప్రాచుర్యం అంశాన్ని వేరేచోట చర్చించుకోవచ్చు కాని పాటల రచనల అంశాన్ని ప్రస్తావించుకున్నప్పుడు కారణాలు ఏవైనా, నేడొస్తున్న దిన, వార, సాహితీ పత్రికల్లోని సాహిత్య పేజీల్లో పాటలను ప్రచురించడం కాని పాటల పోటీలు పెట్టి ప్రోత్సహించడం లేనేలేదు. కవితలను కవితా సంపుటాలను పత్రికల్లో ప్రోత్సహించిన రీతిలోనే సాహితీ అభిమానులు, విమర్శకులు పాటల రచనల పోటీలు నిర్వహించడం, పాటల రచయితలను ప్రాచుర్యంలోకి రావడానికి అవకాశాలు కల్పించిన అవసరం ఉంది.

నేటికి కవిత్వంపై వచ్చిన విమర్శనా వ్యాసాలను పోల్చుకున్నప్పుడు పాటలపై అలాంటి ప్రయత్నాలు జరిగిన అనుభవాలు నేటికీ రాష్ట్రంలో లేవు. తెలుగు నాట పాటలపై, వాటి మంచిచెడ్డలపై నిరంతరం చర్చించే విమర్శకులు లేకపోవడం తెలుగు సాహిత్యం, అందులో పాట ప్రక్రియ చాలా కోల్పోయింది. అయితే పాట అన్నప్పుడు జానపద సాహిత్యంపై తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో అనేక పుస్తకాలు వచ్చాయి. ఇది మంచి ప్రయత్నమే. బిరుదురాజు రామరాజు, ఆర్వీఎస్ సుందరం లాంటివారు అనేకమైన పుస్తకాలు రాశారు. ఈ మేరకు జానపద సంపద రికార్డు కావడానికి కారకులయ్యారు. ఆ స్థాయిలో నేడు వస్తున్న పాటలపై చర్చ జరగలేదు. నేడు రాష్ట్రంలో ఎన్ని కవితా సంపుటాలు సంవత్సరానికి విడుదలవుతున్నాయో సుమారుగా లెక్కించవచ్చేమో గానీ, ఎన్ని పాటల పుస్తకాలు వచ్చాయన్నదానికి మాత్రం ఏ రికార్డూ లేదు. ఏ వ్యాసాలు లేవు. మానవ సమాజ పరిణామ క్రమంలో అన్ని సాహితీ ప్రక్రియలకు తల్లివంటిది పాటే! జీవితపు ప్రతి మలుపులో మనిషి చుట్టూ అల్లుకున్నది పాటే. తరాలనుండి నేటి వరకు జీవన సంఘర్షణలు చాలావరకు లిఖిత సాహిత్య రూపేణా కావచ్చు, మౌఖిక సాహిత్య రూపేణా కావచ్చు. పాటలోనే అమూల్యమైన చరిత్ర సంపద దొరుకుతుంది. సాహితీ ప్రపంచంలో ఇంత బలమైన పాటల సాహితీ ప్రక్రియను ఆ రచనలు నేడొస్తున్న పత్రికలు ప్రోత్సహించకపోవడం ఒక విషాదం. తెలుగునాట విస్తరిస్తున్న ప్రపంచీకరణ చేదు ఫలాలు సాంస్కృతిక కాలుష్యాన్ని తరిమేసే క్రమంలో పాట ప్రాముఖ్యతను గుర్తించి, పాటలను, రాస్తున్న కవులకు సాహిత్య పేజీల్లో ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరముంది.

- స్ఫూర్తి, 9490098694

చిరపరిచిత చిహ్నాలు

కలం దించకు కవీ
కలకలం ఎంత రేగినా కర్తవ్యం మిగిసేదాకా
గర్భంలోనే ఆడ పిల్లల ఆగమనాన్ని నిషేధిస్తూ
నిర్దయనాన్ని నిర్దేశించే రాక్షస కృత్యాలతో
స్త్రీని రక్షించలేని
వీరుడొక్కడూ లేని విఫలతనీ
అనంతమైన ఆకాశాన్ని
చూపుల్లోనే ఇముడ్చుకున్న మాతృదేవతల్నీ
అక్షరాల ఆలంబనతో ధర్మ పతాక విజయాన్నీ
కరుణాస్పర్శతో స్పృశించకుండా

కలం దించకు కవీ
కలకలం ఎంత రేగినా కర్తవ్యం మిగిసేదాకా
మానవ సహజ గుణాలు నశించి
వెలుతురు నిదారుగా మారి
నీడలు కుంచించుకుపోతున్నట్లు
ప్రళయ కాలపు నిగూఢ రహస్యాలు
అశుభ సమాచారాల దావానలమై
రగులుతున్నప్పుడు
గతించిన కాలానికి
ఒక బరువైన చరిత్రగా బతకాలని
అలవాటుపడనియ్యకు

కలకల నవ్వుల కేరింతల
వెన్నెల కన్నుల నెలబాలుని
సొగసుల హృదయపు కోవెల తోటలోకి
పూరేకుల రెక్కలు తొడిగి
చిత్తు నుంచి వచ్చే చిన్నారి మొలక
అంతరంగాన్ని చీల్చుకుని ఆవిర్భవించే
జ్ఞానదీపిక అని 'తట్టి' చెప్పు.

లక్ష పిడతంత నోటితో
విశ్వమంతా చిలిపి నవ్వుల్ని చిందించే
పసిడి అందాల
చిగురుకొమ్మల తీపి బొమ్మలకి
కష్టాల్ని కలిగించే తమ ఇష్టాల్ని
రద్దుచేసుకుంటున్నామని వాపోతున్న
తల్లుల గుండెల దగ్గర మాంసాన్ని లాగి పెకిలిస్తుంటే
వందలకొద్దీ భయాందోళిత అశువులు
నిశ్శబ్దంగా రాలిపడి
జలపాతాలై హోరెత్తుతున్న విధ్వంసాల్ని ఒరుసుకుంటూ
కార్చిచ్చులా వ్యాపించకముందే -
కలాన్ని సంధించు.

చిర పరిచిత చిహ్నాల్లా
ఇళ్ళ ద్వారాలకి
లేత మామిడాకు తోరణాలు వెలిగించు.

- బులుసు సరోజినీదేవి
9866190548

పొరలు

డాక్టర్ కంటి పొరను
తొలగించాడు గాని
మనసు పొరను
ఎవరు తొలగించాలో!?
ముదరనివ్వండి అన్నాడు
సన్నటి పొర
ఉండనివ్వదూ ఊడిపోదు

దృశ్యాలను వడబోసీ వడబోసీ
కళ్ళు అలిసిపోతున్నాయి
ఇంతకూ నేను చూసిందెంత?
పసిపిల్లల ఇంట్లోంచి
బయటికి పరుగులు తీసినట్లు
కనుల లోగిళ్ళను
కనువిందు చేసే వెలుతురు చిత్రాలు
చిత్రాలను చదవడానికి
జీవితం సరిపోదు
కాంతి ఆహార్యంతో ఉన్న
చీకటి మాత్రం
మెల్లగా మనసులోనికి దిగుతుంది
పరిమాణం తెలియని
అపారమైన పారావారం మనసు
ఆరాటానికీ
అలలతో పోరాటానికీ
అంతు ఉండదు

కళ్ళు మూసుకుంటేనే మనస్సు
తెరిస్తే తెరలేపే ఉషస్సు
చీకటి ఉండదని కాదు
ఉషస్సు ఆధిపత్యం ముందు
అది కనిపించని తమస్సు!
అందుకే
మనసు పొరను కూడా తొలగిస్తే
అతీతమైన
ఓ కాంతిపుంజం సాక్షాత్కరిస్తుంది

- ఎన్. అరుణ

స్త్రీవాదం వెనకబడిందని ఎవరన్నారు!

ఆ మధ్య ఎక్కడో చదివిన గుర్తు. 'తెలుగు కవిత్వంలో స్త్రీవాదం వెనకబడిపోయింది. కాలక్రమంగా అది కనుమరుగైపోతోంద'ని. అయితే 18-02-2013 నాటి 'సాహితి'లో మహెజబీన్ కవిత ''వెజైనా మోనోలాగ్'' ఈ మాటలన్నవాడికి చెంపపెట్టు.

'చేరా' అన్నట్లు జబీన్‌ది లిరికల్ వాయిస్. కానీ ఈ తాజా కవితతో ఆమె గొంతు మారింది. కవిత్వం రంగూ మారింది. కమ్మగా పాటపాడే కోయిల గొంతెందుకు మార్చింది. లాలిత్యం పుట్టిపడే గొంతు పాషాణంలా ఎందుకు మారింది? ప్రేమ పురస్కారాలకు నెలవైన జబీన్ అక్షరాలు ఎందుకిలా తిరస్కారాలై అగ్గిని కురిపించాయి. ఒక్క క్షణం ఆలోచిస్తే... ఇటీవల ఢిల్లీలో 'నిర్భయ'పై మృగాళ్లు జరిపిన సామూహిక అత్యాచారం కళ్ల ముందు కదలాడింది. బాధ ఎవరిదైనా బాధే. కానీ ఎవరి బాధ వారి గొంతులో వింటేనే దాని తీవ్రత తెలుస్తుంది. సాటి స్త్రీకి జరిగిన అన్యాయం జబీన్ గొంతులో లావాలా ఉబికొచ్చింది. నిందితుల సంగతి సరే, చిన్న వెజైనాను కూడా కాపాడలేని ఈ ప్రభుత్వానికి రక్షణ వ్యవస్థకు ఆమె సూటిగా విసిరిన సవాలు సామాన్యమైంది కాదు. సభ్య సమాజం, మన సోకాల్డ్ ప్రభుత్వం సిగ్గుతో తల బాదుకుని చావవలసిన పరిస్థితి. భావ వ్యక్తీకరణ కవిత్వానికి ఆయువుపట్టు లాంటిది. సమస్య తీవ్రతను బట్టి వ్యక్తీకరణ ఎంత ధాటిగా వుంటే పాఠకుడి గుండెకు అంత సూటిగా గుచ్చుకుంటుంది. కవిత్వపు చెమ్మ గుండెను తడిపి పాఠకుడ్ని తనతో పాటు మమేకం చేసుకుంటుంది. జబీన్ కవిత కూడా అదే చేసింది. ఈ కవిత పాఠకుడ్ని ఆలోచనలో ముంచెత్తి కళ్లు ఎర్రబారేలా చేస్తాయి. ఫెమినిజం తాలూకు తీవ్రతతోపాటు తనను హింసించే ఈ వ్యవస్థను నిలదీసే 'తెగువ' ఈ కవితను ఎంతో ఎత్తుకు తీసుకుపోయింది.

''ఈ వ్యవస్థ ముఖంమీద / నా సిగ్గుబిళ్లను విసిరేసి వెళ్తున్నాను/ అత్యాచారాల చరిత్ర పేజీ లేని నేలమీద / మళ్లీ వెజైనాతో పుట్టాలని వుంది / మళ్లీ... మళ్లీ... స్త్రీగానే!

- అంటుంది గుండెలనిండా ఆత్మవిశ్వాసాన్ని నింపుకొన్న జబీన్. రక్షణ కల్పించాల్సిన రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని నిలదీసి ''నువ్వూ నీ సెక్యూరిటీ కలిసి / ఒక చిన్న వెజైనాను రక్షించలేకపోయాయి / Shame on you'' అంటూ ఈసడించిన విధానం ఎంతో ఆలోచనాత్మకంగా వుంది. ఇనుప కచ్చడాల నుండి బికినీ దాకా / సాగిన నాగరిక ప్రయాణంలో లైంగిక దోపిడీ తప్ప మరింకేమీ లేదని వ్యవస్థమీద తుపుక్కున ఉమ్మేసిన జబీన్ ఫెమినిస్టు కవిత్వానికి ఈ దశాబ్దపు మరో వాగ్దానం నిలిచింది. సమాజంలో లైంగిక అత్యాచారాలకు గురవుతున్న స్త్రీల బాధను ఓ కదలాడే చిత్రంగా సజీవంగా మన కళ్లముందు నిలిపింది జబీన్. (నాకైతే త్వమేవాహమ్ కావ్యంలో రజాకార్లచేత చెరచబడిన స్త్రీ బాధను ఆరుద్ర ఆవిష్కరించిన తీరు గుర్తొచ్చింది).

ఒకప్పుడు స్త్రీలు తమ భావాల్ని వెల్లడి చేయడానికి తగిన పరిస్థితులు లేవు. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. చైతన్యంతో స్త్రీ ముందడుగు వేస్తోంది. ఇన్నాళ్లుగా గొంతు విప్పని స్త్రీ నేడు స్వేచ్ఛగా, నిర్భీతిగా గొంతు విప్పి తన మనోభావాల్ని ప్రకటిస్తోంది.

'నేను మనిషిగా కాక అవయవంగా కనిపించాను / నా శరీరం వాళ్లకు వెజైనాగా కనిపించింది' అనడంలోనే స్త్రీ పట్ల సమాజానికున్న చిన్నచూపు అర్థమవుతుంది. అత్యాచారానికి గురవుతున్నప్పుడు కూడా అబలగా బేల పడకుండా సబలగా తిరుగుబాటు చేయాలన్న ఆత్మవిశ్వాసాన్ని జబీన్ ఆవిష్కరించిన తీరు కొత్తగా వుంది. 'నామీద లైంగిక దాడి జరుగుతున్న క్షణాన / నేను తుమ్మ ముల్లునై / వాళ్లకు గుచ్చుకోవాలని అనుకున్నాను / విషకన్యను కానందుకు చింతించాను / నా వెజైనా మీద హింస పరాకాష్ఠకు చేరుకున్న / ఆ అవాంఛిత విషాద సమయంలో / నేను అస్తిత్వం కోసం ప్రతిఘటించాను / పోరాడి గాయపడి, చివరికి ముగిసిపోయాను' అంటుంది. ఈ కవితలో సరికొత్త జబీన్‌ను చూశాను. ఫెమినిజంలో చివరి పాఠాన్ని ఈరోజే చదివిన అనుభూతిని పొందాను.

ఫెమినిస్టుల కవిత్వంలో ఇటువంటి తెగింపు కొత్తేమీ కాదు. రేవతీదేవి స్త్రీ హృదయాన్ని 'రసజ్వలిత దాహంతో వెచ్చగా విచ్చుకున్న నెత్తురు పువ్వుతో వర్ణిస్తే... చింతల నెమలి (1997 ఆగస్టు)లో జయప్రభ ఎన్నో అడుగులు ముందుకేసి స్త్రీ జననాంగాన్ని మృదుపుష్పంతో, ఆల్చిప్పతో, అత్తిపండుతో, ముఖమల్ వస్త్రంతో పోల్చారు. 'అది నా నల్లచిరుత / కొమ్ముల దుప్పి / కుందేటి పిల్ల / అది రతీదేవి / దాన్ని రెచ్చగొట్టకు / ముకుళించుకు పోగలదు సుమా / దాన్ని బాధ పెట్టకు'' అంటూ జయప్రభ ఆనాడే హెచ్చరించింది.

రాక్షస సంచారమో / రక్త ఝరీ ప్రవాహమో / ప్రణయ కావ్యమో / ప్రాచీ రాగమో / ఈ దేహం / అనుభవ వేదమో / అజ్ఞాన తిమిరమో / అచంద్ర తారార్కమో దేహం? అంటూ స్త్రీ దేహభాష (Body Language)ను కూడా ప్రకటించింది. స్త్రీలపై అత్యాచారాలు జరిపే నరహంతకుల అంగాల్ని తెగనరకాలంటుంది జయప్రభ (ది పబ్ ఆఫ్ వైజాగ్ పట్నం - శత్రువు చేయి) 'సామూహిక బలాత్కారాలకు ఎర అయి లైంగిక హింస పడిన స్త్రీల మనశ్శరీరాల క్షోభనూహించగలరా? అంగాన్ని ఆయుధంగా చేసుకున్న నర పశువుల అంగాల్ని - తెగనరకాలని మాకుంటే హింసకి ప్రతిహింస ఎలా తప్పవుతుందిరా?' అని ప్రశ్నిస్తుంది. 'ఒకే ఒక జయప్రభ'. స్త్రీలపై జరుగుతున్న హింసను ఎదుర్కోవాల్సింది కూడా స్త్రీలే అన్నది జయప్రభ అభిప్రాయం.

గర్భంలో జరిగే శిశుదశ నుంచి ఆడతనంపై అత్యాచారం... హత్యాచారం అలవాటుగా మారిన ఈ సమాజంపై జయప్రభ యుద్ధం ప్రకటించింది. 'ద్వాపరం నాటి వస్త్రాపహరణం సభ / ఈనాడు పునరావృతమగుట వ్యథ' అంటూ అనసూయ కూడా శృతి కలిపింది. అందమైన దోపిడీకి / పవిత్రమైన హింసకు న్యాయమైన దాస్యానికి / బలైపోయిన నేను భారత స్త్రీనంటూ ఓల్గా పడిన ఆవేదనలో వ్యవస్థ పట్ల ఛీత్కారింపూ ఉంది. స్త్రీ స్వేచ్ఛ కోసం, రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం లేదు. ముందు మన ఆలోచనల్లో మార్పు రావాలి. స్త్రీని స్త్రీగా చూడగలగాలన్నది ఫెమినిస్టుల వాదన.

ఒకపక్క కుటుంబంలో మరోపక్క బయట జరిగే అణచివేత, అత్యాచారం జుగల్బందీగా స్త్రీ జీవితాల్ని దుర్భరం చేస్తున్నాయి. రక్షించాల్సిన ప్రభుత్వాలు, న్యాయం చెప్పాల్సిన వ్యవస్థలు నిస్సహాయంగా న్యాయాన్ని నీరుగారుస్తున్నాయి. నిజానికి స్త్రీలపై జరిగే అన్యాయాలకి, అత్యాచారాలకి స్త్రీ బాధ్యతేమీ లేదు. నిన్నటి మధుర, రమీజాబి, మాయాత్యాగి, నేటి నిర్భయ యిందుకు సాక్ష్యం. మధుర కన్య కాదని, రేప్‌కు ప్రతిఘటించలేదనే కారణాలు చూపి ఈ కేసులో శిక్షలు పడిన పోలీసులు నిర్దోషులుగా బయటపడ్డారు. అలాగే రమీజాబీపై 'వేశ్య' అనే ముద్ర వేసి నిందితులు తప్పించుకున్నారు.

తాజాగా సూర్యనెల్లి గ్యాంగ్ రేప్ బాధితురాలిని వేశ్య అంటూ ఓ పార్లమెంటు సభ్యుడు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే మాయాత్యాగికి బందిపోట్లతో సహవాసం వుందన్న సాకు చూపి దోషులు శిక్షకు దూరమయ్యారు. ఢిల్లీ రేప్ కేసు బాధితురాలు నిర్భయ కూడా అత్యాచార సమయంలో ప్రతిఘటించి వుండాల్సిందన్న వ్యాఖ్యలూ వినిపించాయి. ఇప్పుడు ఆమె చనిపోయింది. కేసు విచారణలో వుంది. నిందితులకు ఏ శిక్ష పడుతుందో తెలీదు.

ఒకప్పుడు స్త్రీలు తమ భావాల్ని వెల్లడి చేయడానికి తగిన పరిస్థితులు లేవు. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. చైతన్యంతో స్త్రీ ముందడుగు వేస్తోంది. ఇన్నాళ్లుగా గొంతు విప్పని స్త్రీ నేడు స్వేచ్ఛగా, నిర్భీతిగా గొంతు విప్పి తన మనోభావాల్ని ప్రకటిస్తోంది. ఫెమినిస్టుల భావ వ్యక్తీకరణలో భాష పచ్చిగా వుండొచ్చు. 'సంస్కారవంతులకు' అభ్యంతరకరంగా వుండొచ్చు. కానీ ఆ భాషలోని బాధ తీవ్రతను అర్థం చేసుకుంటే వ్యక్తీకరణలోని నిజాయితీ అర్థమవుతుంది.

- ఎ. రజాహుస్సేన్, 9505517052

స్పందన

'కవిత్వం' తక్కువ.. 'కసి' ఎక్కువ!

'సాహితి'లో 11.02.2013న 'ఉదాత్త రచనతో సాహిత్య ధర్మం' శీర్షికన ఓల్గా కవిత్వంపై ఎం.నారాయణశర్మగారి విశ్లేషణను చదివాక నా స్పందన. ఫెమినిస్టు కవయిత్రులకు పురుషాధిక్య సమాజం పై కసి, కోపమూ వుంటాయి. ఈ లక్షణాలు వారి కవితల్లో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే వీళ్లు తమ కవితల్లో కసిని, కోపాన్ని మాత్రమే కూరితే సరిపోతుందా? కవితలన్నాక వాటిలో కవిత్వం కూడా వుండాలి కదా! ఓల్గా వెలువరించిన ఏకైక కవితా సంపుటి 'కొన్ని కవితలు' చదివినపుడు వాటిలో కవిత్వం పాలుకంటే కసి, కోపాల తీవ్రతే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కవితల్లో 'పురుషాహంకారపు పెద్దపులిపై స్వారీ చేయాలన్న తపనలో కవిత్వం కాస్తా పలచబడిపోయింది.

1972 నుండి 2009 వరకు అంటే 37 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఓల్గా అప్పుడప్పుడు జరిగిన సంఘటనలకు స్పందించి రాసినవి, అలవోకగా అల్లినవీ, స్త్రీవాద ఉద్యమకారిణిగా ఎలుగెత్తినవీ అన్నీ కలిపి 48 కవితల్ని యేర్చి కూర్చి సంపుటిగా తెచ్చారు. అందరూ హర్షించ వలసిన ప్రయత్నం యిది. అయితే ఓల్గా కవితా ప్రస్థానాన్ని పరిశీలిస్తే కవయిత్రిగా ఆమె ఇంకా ఉనికిని చాటుకునే ప్రయత్నంలోనే వున్నారనిపిస్తోంది. ఈ కవితా సంపుటిలో మనసును తాకేవి చాలా తక్కువగా వున్నాయి. కొన్ని కవితల్లో అక్కడక్కడా 'మెరుపుల్ని', మరికొన్నిటిలో అయితే జీర్ణించుకోలేని 'మరకల్ని' కూడా చూడొచ్చు. ఇంకొన్నయితే మరీ సాదాసీదాగా వున్నాయి. వచనం నడ్డి విరగ్గొట్టి కవితా పాదాలుగా పేర్చిన కవితలు కూడా తక్కువేం కాదు. మొత్తానికి ఈ సంపుటిలో భద్రంగా దాచుకోవాల్సిన కవితల కంటే చదవగానే మరిచిపోయేవి చాలానే వున్నాయి. ఓల్గా ఫెమినిస్టుగా స్త్రీవాద ఉద్యమంలోకి వచ్చి నాలుగు దశాబ్దాలు దాటుతున్నాయి. కథ, నవలా రచయిత్రిగా ఇప్పటికే ఆమె తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇక యిప్పుడు కవయిత్రిగా నిలబడటానికి ఈ కవితా సంపుటి ఏమాత్రం ఉపయోగపడుతుందో కాలమే చెప్పాలి. ఫెమినిస్టు రచయిత్రిగా పురుషాధిక్య సమాజంపై కన్నెర్ర చేసి నిప్పులు కురిపించడం ఓల్గాకు కొత్తేమీ కాదు. అదే ధోరణి ఈ కవితల్లో కూడా కొనసాగింది. అందువల్లనే ఏమో కవితల్లో కవిత్వం కంటే 'ఫెమినిజమే' డామినేట్ చేసింది. 'నేను పతివ్రతా తల్లిని కాను/ ప్రబంధ కన్యను కాను/ పంచదార చిలకను కాను/ ఫ్యాషన్ పెరేడ్ బొమ్మను కాను' అన్నపుడు ఓల్గా వకాల్తా పుచ్చుకున్న స్త్రీ ఉద్యమకారిణిగా కనబడతారు.

స్త్రీ, పురుషుల మధ్య మోహం లేని ప్రేమవృధా అంటాడు చలం. ఓల్గా కూడా చలం చిటికిన వేలు పట్టుకొని ముందుకు నడిచినట్లుంది. 'రాత్రంటే నీకు నిద్రావస్థ/ నాకు భగ్న స్వప్నం' అంటూ ఉస్సూరంటుంది. 'ఇది కలలు లేని/ కటిక నిజాల రాత్రి' అన్నపుడు ఓల్గా వేడి నిట్టూర్పు సెగ పాఠకుడ్ని తాకుతుంది. వామపక్ష ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన ఓల్గా తొలినాళ్ల కవితల్లో ఎక్కువగా నినాదాలే కనిపిస్తాయి, వినిపిస్తాయి. కానీ నారాయణశర్మ గారికి ఓల్గా కవిత్వంలో నినాదాల కంటే విధానాలే ఎక్కువగా కనిపించడం ఆశ్చర్యంగా వుంది. పాఠకుడు ఏ కవిత్వం చదివినా అందులోని వెళ్లి పోవాలన్న శర్మగారి మాటలు ఓల్గా కవిత్వానికి వర్తించడం కష్టమే. 'పాటలూ నినాదాలు నింపుకున్న/ వెయ్యి రేకుల పుష్పం నా గొంతు' అంటూ ఓల్గానే స్వయంగా చెప్పుకున్నారు. 'మనిషిని కాను అష్టమభోగాన్ని' 'వెలి వేయబడ్డ చీకటి బ్రతుకుని' అంటూ నినాదాలతో హోరెత్తిస్తారు ఓల్గా. ఇక పచ్చిగా రాయడం ఫెమినిస్టు లక్షణం అన్న నానుడికి తాను కూడా ఏమాత్రం తీసిపోనన్నట్లుగా అక్షరాలకు వేడిపుట్టించే ప్రయత్నం చేస్తారు. ఇక చలి కాచుకోవడం పాఠకుల వంతు. ఫెమినిస్టుగా ఓల్గా నిబద్ధతను శంకించడం సాహసమే అవుతుంది. ఓల్గా నవలలు, కథలు చదివితే ఫెమినిజం ఆమెలో ఎంతగా జీర్ణించుకుపోయిందో ఇట్టే అర్థమవుతుంది. అయితే తాను నమ్మిన విధానాన్ని కవిత్వంలో ఇమడ్చడం ఎంత కష్టమైనదో కవయిత్రి ఓల్గాకు బాగా తెలిసొచ్చి వుండాలి. నాదాలు, నినాదాలు, విధానాలు ముడిపదార్థాల వంటివి. వాటితో అందమైన కవిత్వనగ చేయబూనడం దుస్సాహసమే. ఎంతో చేయి తిరిగిన కవులకు గానీ ఈ ఫీటు అలవడదు. ఈ విషయంలో ఓల్గా ఇంకా అక్షరాభ్యాస దశలోనే వున్నారని ఆమె కవిత్వం చదివిన వారెవరికైనా అర్థమవుతుంది.

ఫెమినిస్టు యాక్టివిస్టుగా తానుపడే యాతనను, 'సహజీవనం'లోని రాత్రుల మాధుర్యం, అలాగే చిన్ననాటి రాత్రుల వేదన వ్యవసాయ కూలి రోదనకు కవిత్వ పూత పూయాలనే ప్రయత్నం చేశారు. 'మెహందీ స్త్రీల విజ్ఞప్తి'లో 'చావటానికి మా దగ్గరకు రాకండి/ బతకటానికి నానా చావూ చస్తున్నవాళ్లం' అన్న మాటలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. మొత్తంమీద ఓల్గా కవిత్వంలో పెద్దగా చెప్పుకోదగ్గ విశేషం ఏమీలేదు. కానీ ముప్పయ్ ఏడేళ్ల సుదీర్ఘ సామాజిక జీవనయాత్రలో జరిగిన వివిధ సంఘటనల పట్ల ఓల్గా స్పందనగా ఆమె కవిత్వాన్ని చూడాలి. అంతే.

- రాజా

చిట్కాలు

★ స్వీట్లు, చాకొలెట్లు, పిజ్జాలు, బర్గర్లకు బదులు పిల్లలకు పళ్లీలు, మురుకులు, పాప్‌కార్న్, వేయించిన పప్పులు ఇస్తే వారి దంతాలు ఆరోగ్యవంతంగా ఉంటాయి.
★ ఆరేళ్ల లోపు వయసున్న పిల్లల దంత సంరక్షణను తల్లిదండ్రులు ప్రత్యక్షంగా చూడాలి. ఏడాదిలో కనీసం ఒకసారైనా దంత వైద్యుడి వద్దకు పిల్లలను తీసుకువెళ్లాలి.
★ మొలకెత్తిన పెసలు, బఠానీలు,వేరుశనగ వంటివి తరచూ పిల్లల చేత తినిపిస్తే దంతాలు పుష్టిగా ఉంటాయి.
★ అతి చల్లని,వేడి పదార్థాలు పిల్లలు తినకుండా చూడాలి. పచ్చిగా ఉండే క్యారట్, బీట్‌రూట్ ముక్కలు, తాజా ఫలాలను పిల్లలకు తరచూ ఇవ్వాలి.
★ తీపి పదార్థాలను అధికంగా తినడం వల్ల దంత సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.
★ హడావుడిగా కాకుండా పిల్లలు నిదానంగా కనీసం నాలుగైదు నిమిషాలను 'బ్రష్' చేసుకునేందుకు శ్రద్ధ చూపాలి.
★ సరైన బ్రష్‌ను ఉపయోగించి దంతాలను మరీ గట్టిగా లేదా సున్నితంగా కాకుండా మధ్యస్తంగా తోమాలి.
★ తడి ఆరకుండా బ్రష్‌ను అలాగే వదిలేస్తే దానిపై బాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది.
★ చిన్న పిల్లలు సరిగ్గా బ్రష్ చేసుకునే పద్ధతిని తల్లిదండ్రులు దగ్గరుండి నేర్పించాలి.

'యాసిడ్ పగ' చల్లారదా..?

★★ ఉన్నత చదువులతో ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆమె ఆరాటం.. అనూహ్య రీతిలో ఆమె జీవితం 'యాసిడ్ రక్కసి'కి బలైపోయింది.. చెన్నైలోని ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో ఇరవై ఏళ్ల విద్య తనపనేదో తాను చేసుకుంటున్న సమయంలో ఓ ప్రేమోన్మాది యాసిడ్‌తో దాడి చేసి బీభత్సం సృష్టించాడు. ఈమె సుమారు నాలుగు వారాల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ఓడిపోయింది...

★★ బిటెక్ పూర్తి కావడంతో తన కలలు సాకారం కాబోతున్నాయని సంబర పడుతున్న 23 ఏళ్ల వినోదిని యాసిడ్ దాడికి లోనై దాదాపు వందరోజుల పాటు మృత్యువుతో పోరాడింది. పుదుచ్చేరిలో ప్రేమోన్మాది జరిపిన ఘాతుకానికి ఈమె నిండు జీవితం అర్ధంతరంగా ముగిసింది.. కుటుంబ సభ్యులకు అంతులేని విషాదం మిగిలింది...

★★ యాసిడ్ దాడుల ఫలితంగా కోలుకోలేని అనారోగ్యంతో ఏళ్ల తరబడి జీవచ్ఛవాలుగా బతుకుతున్న యువతుల దీనగాథలు ప్రపంచ వ్యాప్తంగా కోకొల్లలు.. అనుక్షణం నరక యాతనతో మృత్యువు కోసం వీరి ఎదురుచూపులు.. కఠిన చట్టాలు, సత్వర శిక్షలు లేనందున యథేచ్ఛగా సాగుతున్న ప్రేమోన్మాదుల కిరాతకాలు...

విశ్వవ్యాప్తంగా నిత్యకృత్యంగా మారిన యాసిడ్ దాడులకు మహిళలే బలైపోతున్నారు. బంగ్లాదేశ్‌లో 1999 తర్వాత సుమారు మూడు వేల మంది మహిళలపై యాసిడ్ దాడులు జరిగాయి. 2012లో పాకిస్తాన్‌లో 117 యాసిడ్ దాడులు జరిగాయి. భారత్‌లోనూ ఏటా వందల సంఖ్యలో యాసిడ్ దాడుల కేసులు నమోదవుతున్నాయి. యాసిడ్ దాడుల్ని నివారించేందుకు సమగ్రమైన, పదునైన చట్టాలను అమలు చేయకపోవడం పట్ల సుప్రీం కోర్టు కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసింది. యాసిడ్ దాడుల్ని అరికట్టే విషయంపైనే గాక, బాధితులకు చికిత్స, పునరావాసం, యాసిడ్ విక్రయాలపై నిరంతర నిఘా వంటి అంశాలపై దృష్టి సారించాలని అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించింది.

దేశంలో 13 రాష్ట్రాల్లో మాత్రమే యాసిడ్ దాడుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తున్నారని, దేశ వ్యాప్తంగా ఒకే విధానం అమలులో లేకపోవడం దారుణమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 2005లో యాసిడ్ దాడిలో గాయపడిన ఢిల్లీకి చెందిన లక్ష్మి (23) 2006లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఫలితంగా సుప్రీం కోర్టు స్పందించింది. యాసిడ్ దాడులను తీవ్రమైన నేరంగా పరిగణించి, తగిన చట్ట సవరణలు చేస్తానా పరిస్థితిని అదుపులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. బాధితుల వైద్యచికిత్సలకు తగినంత నష్టపరిహారం చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని, విచ్చలవిడిగా సాగుతున్న యాసిడ్ అమ్మకాలను నియంత్రించాలని కూడా కోర్టు సూచించింది. కాగా, యాసిడ్ దాడుల్లో బాధితులకు లక్షన్నర రూపాయల మేరకు ఆర్థిక సహాయం అందించాలని తాజాగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మిగతా రాష్ట్రాల్లోనూ యాసిడ్ దాడుల సంఖ్య పెరుగుతున్నా నష్టపరిహారం విషయమై ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదు.

ఆదుకునే నాథుడేడి..?

పదహారేళ్ల ప్రాయంలో యాసిడ్ దాడికి గురైన లక్ష్మి గత ఏడేళ్లుగా ప్రత్యక్ష నరకం అనుభవిస్తూ, ఇతరులెవరూ ఇలాంటి బాధలకు గురికాకుండా ఉండేందుకు న్యాయ పోరాటం చేస్తోంది. తండ్రి మరణించడం, సోదరుడు క్షయ వ్యాధి బారిన పడడం, బంధుమిత్రులు ముఖం చాటేయడంతో ఈమె భవిష్యత్ నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడంతో ఈమె వైద్యం చేయించుకోలేని దీనస్థితిని ఎదుర్కొంటోంది. ఆదుకునేవారు గగనం కావడంతో ఈమె కుటుంబ సభ్యులు దినదిన గండంగా రోజులు నెట్టుకొస్తున్నారు. ఇతరుల చూపులకు, వ్యాఖ్యానాలకు భయపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని లక్ష్మి చెబుతోంది. అయినా, తనకు ఏదో ఒక ఉద్యోగం ఇస్తే కుటుంబానికి కొండంత ఆసరా లభించినట్లవుతుందని ఈమె ఆశగా ఎదురు చూస్తోంది. యాసిడ్ దాడి వల్ల తన కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇలాంటి దాడులు జరగకుండా పటిష్టమైన చట్టాలు, కఠిన శిక్షలను అమలు చేయాలని ఈమె కోరుతోంది. మానసిక, ఆర్థిక మద్దతు లేకుంటే యాసిడ్ బాధితుల జీవితాలు నరకం కంటే ఘోరంగా ఉంటాయని ఈమె చెబుతోంది.

నష్టపరిహారం ఊసే లేదు..

ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచార ఘటన నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం లైంగిక నేరాల నిరోధానికి ఓ ఆర్డినెన్స్‌ను ప్రకటించినా యాసిడ్ దాడుల అంశానికి అంతగా ప్రాధాన్యం లభించలేదు. యాసిడ్ దాడుల్లో నిందితులకు గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష విధించాలనే సవరణలు తప్ప బాధితుల పునరావాసానికి సంబంధించి ఆర్డినెన్స్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. జైలుశిక్షలను పెంచేందుకు భారత శిక్షాస్మృతిలో రెండు కొత్త సవరణలు చేర్చేందుకు (సెక్షన్ 326ఎ, 326బీ) మాత్రం కేంద్రం సమ్మతించింది. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపరిస్తే పదేళ్లు, పాక్షికంగా గాయపరిస్తే అయిదు నుంచి ఏడేళ్ల వరకూ జైలుశిక్షలు విధించాలని, పది లక్షల రూపాయల వరకూ జరిమానాలు విధించాలని తాజా ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. ఈ జరిమానాల మొత్తాలను బాధితులకు అందజేయాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. కాగా, యాసిడ్ బహిరంగ విక్రయాలను నిరోధించేలా చట్టాన్ని చేసేందుకు నిపుణులతో ఒక కమిటీని నియమించాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి రసాయనాలు,ఎరువుల మంత్రిత్వ శాఖను ఆదేశించారు. అనేక కారణాల రీత్యా యాసిడ్ విక్రయాలను అదుపు చేయడం అసాధ్యమేనన్న అనుమానాలు లేకపోలేదు. అలాగే, 'పేలుడు పదార్థాల చట్టం' ప్రకారం యాసిడ్‌ల నిల్వ, పంపిణీ, విక్రయాలను నిరోధించే పరిస్థితి లేదని న్యాయ నిపుణులు అంటున్నారు. యాసిడ్ విక్రయాలను అడ్డుకునేందుకు ఈ చట్టంలో ఎలాంటి అవకాశాలు లేవని వారు పేర్కొంటున్నారు. కొత్త చట్టాల సంగతలా ఉంచితే, ఇప్పటికే ఉన్న చట్టాన్ని అమలు చేస్తున్న దాఖలాలు లేవు. అనుమతులు లేని దుకాణాలపై, పరిమితికి మించి యాసిడ్ విక్రయాలు జరుపుతున్న వారిపై నిఘా లేకుండా పోయిందని మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి.

అటకెక్కిన ప్రతిపాదనలు..

యాసిడ్ దాడుల్లో బాధితులైన మహిళలు, పిల్లలకు పునరావాసం కల్పించాలంటూ దాదాపు పుష్కర కాలం క్రితం జాతీయ మహిళా కమిషన్ చేసిన ప్రతిపాదనలకు అతీగతీ లేకుండా పోయింది. వివిధ మహిళా సంఘాలతో చర్చించి పన్నెండేళ్ల క్రితం ఆ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. వీటి విషయం తనకు ఇంతవరకూ తెలియలేదని ప్రస్తుత మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మమతా శర్మ అమాయకంగా చెప్పడం మరీ విడ్డూరం. యాసిడ్ దాడుల్లో నిందితులకు ఏడేళ్ల నుంచి జీవితకాలం వరకూ జైలు శిక్ష విధించాలని ఆనాడు మహిళా కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. బాధితులకు ఆర్థిక సాయం, పునరావాసం వంటి విషయాలపై చాలా కాలం క్రితం ప్రతిపాదనలు చేసిన మాట నిజమేనని, అయితే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడంతో అవన్నీ కాగితాలకే పరిమితమైనట్లు కేంద్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు.

యాసిడ్ దాడుల్లో బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే 50 వేల రూపాయలు, ఆ తర్వాత చికిత్స అవసరాలను బట్టి పాతిక లక్షల రూపాయల వరకూ ఆర్థిక సాయం చేయాలని మహిళా కమిషన్ గతంలో సిఫారసు చేసింది. బాధితులు మరణిస్తే కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయలు చెల్లించాలని ప్రతిపాదించారు. ఆర్థిక సాయం, పునరావాసం సక్రమంగా అందేలా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అధికారులతో కమిటీలను నియమించాలని అప్పట్లో భావించారు.

హర్యానా ఆదర్శం..

యాసిడ్ దాడుల్లో గాయపడిన మహిళలకు సహాయం, పునరావాసం అందించేందుకు హర్యానా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఓ పథకాన్ని ప్రారంభించింది. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం, వైద్య ఖర్చులను తిరిగి చెల్లించడం, పునరావాసం వంటివి ఈ పథకం కింద వర్తిస్తాయి. హర్యానాలో నివసిస్తూ 2011 మే 2 తర్వాత గాయపడిన బాధితులు ఈ పథకం కింద సాయం పొందేందుకు అర్హులు. యాసిడ్ దాడిలో గాయపడిన మహిళకు తక్షణం పాతిక వేల రూపాయలు చెల్లించేందుకు, నిర్దేశించిన ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య చికిత్స చేయించేందుకు జిల్లా స్థాయి కమిటీలకు పూర్తి అధికారాలు ఇచ్చారు. బాధితురాలు మరణిస్తే ఆమె కుటుంబానికి అయిదు లక్షల రూపాయల నష్టపరిహారంగా చెల్లిస్తారు.

హర్యానా తరహాలో ఇలాంటి చర్యలను తీసుకునేందుకు మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ చూపాలని మహిళా ఉద్యమ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

తారెత్తించిన కుర్చీ!

బరోడాలోని ఎం.ఎస్.యూనివర్సిటీ న్యాయ శాస్త్ర విభాగంలో విద్యాహక్కుపై జాతీయ సెమినార్‌కి రంగం సిద్ధమైంది. ముఖ్యఅతిథిగా గుజరాత్ హైకోర్టు జడ్జి సోనియా గోకానీ, సభాధ్యక్షుడిగా వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్, విశిష్ట అతిథిగా లా కాలేజీ డీన్ తదితరులు వారి ఆసనాలను అలంకరించారో లేదో వి.సి.గారు తన సీట్లో చీమలు కుట్టినట్లు

అటూ ఇటూ కదిలాడు. పలు విన్యాసాలు చేస్తూ 'ఖుజిలీ' (దురద) అంటూ- ఎవరో తరుముతున్నట్లు తన కారువైపు దూసుకుపోయేసరికి- డీన్ ఎస్. ఎస్.భట్టాచార్య ''సార్.. సార్!'' అంటూ వి.సి.ని అనుసరించాడు. అవాక్కయిన వి.ఐ.పిలు, డెలిగేట్స్ కాస్సేపటికి అసలు సంగతి అర్థం చేసుకున్నారు. వి.సి.గారి కుర్చీకి- దురద గుండాకు పసరు దట్టంగా పట్టించి వుంది. ఇది ఆకతాయి కుర్రాళ్ల పని అనుకున్నారా? కాదు. లా కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ సోలంకీ ఈ ఘన కార్యాన్ని చేశాడు. ఈ ప్రొఫెసర్‌గారిని గదిలోకి తీసుకుపోయి అంతా గూటాయించారు. ''నేనే- వి.సిగారి మీద కోపంతో కాదు, డీన్‌పై కోపంతో ప్రతీకారం తీర్చుకోడానికి- ఈ పని చేయించా'' అన్నాడు. ''వి.సి గారు పనిగట్టుకుపోయి- డీన్ కోసం వేసిన కుర్చీలో చతికిలబడ్డారు. డీన్‌గారు 'హ్యాపీ'గా ఉన్నారు'' అన్నాడు.

''నా ప్రమోషన్‌కి డీన్ అడ్డం పడి పాలి'ట్రిక్స్' ఆడుతున్నాడు. అంచేత తగిన శాస్తి చేయాలనుకున్నాను'' అన్నాడు. మెజిస్ట్రేటు దగ్గరికి తీసుకుపోంగానే- ''నేనేం వాగ్మూలం ఇవ్వలేదు. పోలీసులే బలవంతంగా రాయించారు'' అంటూ ఎదురు తిరిగాడు. ఎంతైనా 'లా' ప్రొఫెసర్ కదా.. జామీను తెచ్చుకున్నాడు. ఆహా! ఏమి ఉన్నత విద్యా స్థాయి? ఏమి విద్యాహక్కు?

పాక్‌లో వెబ్‌సైట్‌ల బంద్!

'మత వ్యతిరేక దృశ్యాలు' చూపెట్టే వెబ్ సైట్‌లు పాకిస్తాన్‌లో బంద్ ఐపోతాయి. 2012 సెప్టెంబర్ నుంచి అక్కడ 'యూ ట్యూబ్' బంద్! ఇస్లామ్‌కు వ్యతిరేకమైన పోర్నోగ్రఫీకి తావు లేదని ఆ దేశ ఆంతరంగిక శాఖ ప్రకటించింది. మొత్తం మీద అక్కడ 750 లింకులు, 4900 అశ్లీల వెబ్ సైట్లు బంద్ అయ్యాయి. కాకపోతే, గత ఏడాది డిసెంబర్ 29న జనం గోల భరించలేక - ఓ గంటసేపు యూ ట్యూబ్ ప్రదర్శనకు అవకాశం ఇచ్చారు.

కానీ, ఇస్లామ్‌కు వ్యతిరేకమైన అశ్లీల దృశ్యాలు ఇంకా అలాగే వున్నాయని తెలిసి 'యూ ట్యూబ్'ని మళ్లీ నొక్కేశారు.

veeraji@sify.com

మానవ సంబంధాలే మహా వరం

మనలో కొంతమందికి కుటుంబం, బంధు మిత్రుల గురించి ఏ విధమైన వ్యతిరేక ఆలోచనలూ ఉండవు. ఐతే, మనకు ఎంతో సన్నిహితులైన వారి వద్ద కూడా కొన్ని దోషాలుంటాయి. మనకు ఇష్టంలేని పనులు వారు చేస్తూ ఉంటారు. అలాంటి వారికి మనం దూరంగా ఉంటాం. వారు మన మనోభావాలను గాయపరుస్తూ ఉంటారు. అందుకే మన మనసు వారిని వ్యతిరేకిస్తూ ఉంటుంది. మనం ఇతరులను సులువుగా తూలనాడగలం. ఇతరులు మనలను ఎందుకు చెడుగా చూస్తారో తెలియక తికమక పడుతూ ఉంటాం. మనల్ని ఎందుకలా చూస్తున్నారో మనం ఆలోచించుకోవాలి. మనం ఎక్కడైనా తప్పు చేస్తున్నామా? సరిచూసుకోవాలి. మనలో వ్యతిరేక ఆలోచనలు వున్నాయేమో చూసుకోవాలి. బంధాలను, అనుబంధాలను తెంచే వ్యతిరేక ధోరణులు ఎన్నో ఉంటాయి.

ఇతరులను తక్కువ చేయడం

మీ స్నేహితుడు లేదా ఆత్మీయుల గురించి మీరు వ్యతిరేకంగా ఆలోచిస్తూ, తప్పంతా వారిదే అని మీరు భావిస్తున్నారంటే మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవాలి. ఎదుటి వ్యక్తిని తక్కువ చేసి మాట్లాడుతుంటే అతడు మిమ్మల్ని ఎలా ఆమోదిస్తాడు? మిమ్మల్ని వ్యతిరేకించడా? తక్కువ చేయడం అంటే మీరు అధిక్యులుగా మాట్లాడితే సరిపోతుంది. 'నన్ను చూడు', 'నా దుస్తులు చూడు' వంటి మాటలు చాలు మిమ్మల్ని మీరు- స్నేహితులను దూరం చేసుకునేందుకు. బంధువులను, కుటుంబ సభ్యులను విమర్శించడం మంచిది కాదు. విమర్శ ఎటువంటిదైనా అది మనుషుల మధ్య దూరం పెంచుతుంది. ఎదుటివారిపై వ్యంగ్యంగా మాట్లాడడం, సతాయించడం వంటివి కూడదు. వీటివల్ల మనుషులు దూరం అవుతారు. మీ విజ్ఞానాన్ని ప్రదర్శించి ఎదుటి వారికి ఏమీ రాదని నిరూపించే ప్రయత్నం మానవ సంబంధాలను మరింత దూరం చేస్తుంది.

నణుగుడు, ఫిర్యాదులు

నణుగుడు ధోరణి, ఫిర్యాదు చేసే నైజం మనుషుల మధ్య అగాధాలను సృష్టిస్తాయి. ఎవరి సమస్యలు, ఇబ్బందులు వారే పడాలి తప్ప ఇతరులను ఇరికించే ప్రయత్నం చేయకూడదు.ఫిర్యాదు చేసే మనస్తత్వం గల వ్యక్తులతో సన్నిహితంగా ఉండడానికి ఎవరూ ముందుకు రారు.

స్వార్థ చింతన, నిర్దయ

స్వార్థపరులను ఎవరూ చేరదీయరు. దయాగుణం లేనివారి వద్దకు కూడా ఎవరూ వెళ్లరు. తరచూ 'నేను' పదం వాడడానికి బదులు 'మనం', 'మీరు' పదాలు అలవాటు చేసుకోవాలి. స్నేహితులతో సంబంధాలు కొనసాగించాలంటే వారి మనసును రంజింపచేసే విధంగా ప్రవర్తించాలి. వారి పుట్టిన రోజు లేదా ఇతర సందర్భాల్లో చిన్న చిన్న బహుమతులిచ్చి వారిని ఆశ్చర్యపరచాలి. స్వార్థానికి క్రూర రూపం- నిర్దయ. ఇది మనిషికి సంతోషం, సుఖం లేకుండా చేస్తుంది. దయాగుణం మనిషికి ఎనలేని ఆకర్షణ, అందం తెచ్చిపెడుతుంది.

అసూయతో కూడిన పోటీ

పక్కింటివారికి కారు ఉంటే తనకు కూడా ఉండాలనే అసూయతో కూడిన పోటీతత్వం అందరినీ దూరం చేసుకునేందుకు సహకరిస్తుంది. తన భర్త మరొక స్త్రీతో మాట్లాడితే భార్యకు ఎంతో అసూయ కల్గుతుంది. ఎందుకంటే అభద్రతాభావం, ఆపైన వ్యతిరేక ధోరణి ఆమెలో ఉంటుంది. అనారోగ్యకరమైన ఇటువంటి ధోరణి నుంచి బయటపడకపోతే మానవ సంబంధాలు సులువుగా తెగిపోతాయి. దీనికి పరాకాష్ట అనుమానం.

అలుక

కోపం, అలుక భార్యాభర్తలమధ్య దూరం పెంచుతుంది. ప్రతి చిన్న విషయానికీ పెదవి విరుపు మరొక ప్రమాదకరమైన సంకేతం. భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలకు బదులు ఆధిక్యత చోటుచేసుకున్నా, అభిప్రాయ భేదాలు తలెత్తినా వారిమధ్య అనుబంధానికి బదులు దూరాలు పెరుగుతాయి.

వాగ్దాన భంగాలు, అబద్ధాలు

మీరు చేసిన వాగ్దానాలు నెరవేర్చకపోతే ఇతరులు మిమ్మల్ని అబద్ధాల కోరుగా పరిగణిస్తారు. ఉదాహరణకు తోటి విద్యార్థులు ఒక ప్రతిభావంతుడైన సీనియర్ విద్యార్థికి దూరంగా ఉంటున్నారు. ఎందుకు ఆ విధంగా ఉంటున్నారో అతడికి అర్థం కాలేదు. ఒక రోజున తోటి విద్యార్థులు తనగురించి ''అతడు చెప్పే ఏ విషయాలనూ నమ్మలేం'' అనడం విన్నాక, అప్పుడు ఆ విద్యార్థికి తెలిసింది తాను చేస్తున్న తప్పేమిటో. మాట్లాడడం ఇష్టం లేకపోతే మౌనం ఉత్తమం. అనవసరపు మాటలు, అబద్ధాలు చెపితే మనిషి ఒంటరివాడయిపోతాడు.

వాదనలు కూడదు

వాదనతో మీరు విజయం సాధించినట్లు భావిస్తే ఎదుటి వ్యక్తిని మీరు దూరం చేసుకుంటున్నట్లు తరువాత మీకు తెలుస్తుంది. ఒక స్నేహితుడిని మీరు కోల్పోయిన సంగతి తరచూ మీకు గుర్తుకు వస్తూ ఉంటుంది. ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. అన్న గారు తమ్ముడిని వాదనతో గెలిచే ప్రయత్నం చేసేవాడు. ఎన్నడూ అతడి ప్రేమాభిమానాలు గెలవాలని ఆలోచించలేదు. ఫలితం వారేమీ కలిసి సాధించలేక పోయారు. ఒక స్నేహితుడి గురించి మరొక స్నేహితుని వద్ద కథలు చెప్పడం మీకు ఇష్టంగా ఉండవచ్చు. ఆ కథ విన్న స్నేహితుడు- తన గురించి కూడా ఇలాంటి కథలు మీరు చెపుతారని భావించి మీకు దూరమైపోతాడు.

సెక్సు భయాలు

ఆడ, మగ సృష్టిలో ఒక అద్భుతం. సృష్టి కొనసాగడానికి వీరిరువురూ అవసరం. ఆడవారితో మాట్లాడితే పెడర్థాలు తీయడం మరీ ప్రమాదకరం. సెక్సుపట్ల అపోహలు భార్యాభర్తలను దూరం చేస్తాయి. దుర దృష్టవశాత్తూ ఎవరూ ఎవరికీ సెక్సు విషయాలు బోధించరు. ఎవరికివారే తెలుసుకోవాలి. సరైన సెక్సు విజ్ఞానం వీరికి తెలిస్తే ఒంటరితనం నుంచి బయటపడి అన్యోన్య దాంపత్యంతో జీవిస్తారు.

-సి.వి.సర్వేశ్వర శర్మ

పోలియో కేసుల్లేని తమిళనాడు!

పోలియో వ్యాధిని సమూలంగా నివారించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలతో, దండిగా నిధులను ఖర్చు చేస్తున్నప్పటికీ పలు రాష్ట్రాల్లో అడపాదడపా పోలియో కేసులు బయట పడుతూనే ఉన్నాయి. తమిళనాడులో గత తొమ్మిదేళ్ల కాలంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని ఆ రాష్ట్ర ప్రభుత్వం గర్వంగా చెబుతోంది. రెండు రోజుల క్రితం జరిగిన 'పల్స్ పోలియో' కోసం దాదాపు రెండు లక్షల మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. గత ఏడాది జనవరిలో అయిదేళ్ల లోపు వయసున్న 70 లక్షల మంది బాలలకు పోలియో చుక్కలు వేశారు. తొమ్మిదేళ్లుగా పోలియో కేసుల జాడ లేనప్పటికీ ఎలాంటి అలసత్వం వహించకుండా తమిళనాడు ప్రజారోగ్య శాఖ రెండో విడత 'పల్స్ పోలియో'ను విస్తృత స్థాయిలో నిర్వహించింది. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి పోలియో వైరస్ వ్యాపించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో 'పల్స్ పోలియో'కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో చుక్కల మందు వేసుకున్న బాలలపై కూడా దృష్టి సారించారు. 40 వేల కేంద్రాల్లో పోలియో చుక్కలను అందుబాటులో ఉంచడంతో ఈసారి కూడా 'పల్స్ పోలియో' విజయవంతమైంది.

అధరాలు అదరహో..!

'దొండపండు పెదవి.. పండునిమ్మ పసిమి..'- అన్న కవుల వర్ణనకు తగ్గట్టుగా అధరాలు మిలమిల మెరిసి పోవాలని నేటి యువతుల్లో ఎన్నెన్నో ఆశలు.. పెదాలకు సరికొత్త సోయగాలు తెచ్చేలా నేడు మార్కెట్లో రంగురంగుల 'లిప్‌స్టిక్'లు ఎన్నెన్నో.. కళ్లను కట్టిపడేసే అధరాల ఆకర్షణే వేరు.. పెదాలకు తళుకుల్ని, మెరుపుల్ని అద్దే సహజమైన వర్ణాలకే కాదు, వినూత్న రంగులకూ నేడు డిమాండ్ పెరిగింది. పండు మిర్చి లాంటి ఎరుపుకే కాదు.. గులాబీ, ఆరంజ్, లేత ఆకుపచ్చ, నలుపు, నీలం వంటి గాఢమైన, తేలికైన రంగుల లిప్‌స్టిక్‌లకూ ఆదరణ పెరుగుతోంది. ఇంద్రధనుస్సులా రంగుల మేళవింపును తమ అధరాలపై ఆవిష్కరించేందుకు కొందరు మగువలు మనసు పడుతుంటారు. విభిన్న రంగుల లిప్‌స్టిక్‌లు లభిస్తున్నా, మేని ఛాయకు మరింత శోభనిచ్చే వాటిని ఎన్నుకోవడంలోనే నైపుణ్యం దాగుంది. మనసులోని భావాలను పలికేందుకు- పెదాలే కాదు, వాటిపై హొయలొలికే రంగులూ దోహదం చేస్తాయి!

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
మంగళవారం
26, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

కని సదభక్తుల కంత నంత గడు వేడ్కన్ హృత్ప్ర మాణంబు సే
సిన మాత్రం జెడు సర్వదోషములు, తచ్ఛ్రీపాదముల్ముట్టి మ్రొ
క్కిన సర్వాంగ సమగ్ర శుద్ధియగు భక్తిన్ వారికిం బ్రీతిచే
సిన ఁ దద్దివ్య దయావలోకనఘన శ్రీ లొందు సర్వేశ్వరా!

భావం : సర్వేశ్వరా సద్భక్తులకు ఎంతోప్రీతితో హృదయ పూ ర్వక నమస్కారం చేస్తే సర్వదోషాలూ పోతాయి. ఆ భక్తుల పాదాలని అంటి మొక్కితే సర్వంగాలు సంపూర్ణంగా శుద్ధి అయిపోతాయి. భక్తితో వాళ్ల కి ప్రేమ చూపితే వార కృపాపూరిత దృష్టులనే గొప్ప ఐశ్వర్యం లభి స్తుంది. పైపైన చేసే నమస్కారం వల్లనే సర్వదోషాలూ పోతాయంటే ఇక పాదాలను ముట్టి నమస్కరిస్తే భక్తజనుల దయ లభిస్తుందని చెప్తూ వారి దయ ఈశ్వరానుగ్రహతల్యమని పరోక్షంగా సూచిస్తు న్నారు కవి. జనుల సేవే జనార్దనుని సేవ అని తెలుసుకొని ప్రతి మనుజుడూ ప్రవర్తిస్తే సర్వుల హృదయాలలో ఉంటే సర్వేశ్వరుడు సంతోషించి మనకు మేలు చేస్తాడు.

సర్వేశ్వర శతకములోని పద్యమిది **నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్**

అమ్మ

23

శ్రీ లత

''ఇటీజ్ టూ మచ్.. మా ఆఫీసుకొచ్చి మా కొలీగ్‌మీద చెయ్యి చేసుకుంటారా?'' అడిగాడొక సబ్ ఎడిటర్.

''వితవుట్ పర్మిషన్ నా జీవితంలోని సంఘటన లను ఇతన్నెవరు పేపరుకు ఎక్కించమన్నారు?'' అడిగినతన్ని తీక్షణంగా చూస్తూ ప్రశ్నించింది.

''పత్రికల్లో రాసే న్యూస్‌లన్నిటికీ పర్మిషన్ తీసు కుని రాయరు మేడం! పత్రికా స్వాతంత్ర్యం ప్రజా స్వామ్యంలో ఉండాల్సిన మొదటి హక్కుగా, మాకు ఏ వార్త తెలిసినా రాసే హక్కుంది. మీకం తగా ఇష్టం లేకపోతే లీగల్‌గా ప్రొసీడవ్వండి. అంతేకానీ, ఇలా ఎంప్లాయిస్ మీద చెయ్యి చేసు కుంటే ఇప్పటికిప్పుడే మిమ్మల్ని అరెస్టు చేయించ గలం'' ఇంకో వ్యక్తి విసురుగా అన్నాడు.

''మీ పేపర్ వరకే అతను లిమిట్స్ మెయింటైన్ చేసి ఉంటే బాగానే ఉండేది. కానీ, అతను అన్ని పేపర్లకూ, టీవీ చానల్స్‌కు అందించి అనవసర ప్రాపకాండ చేయడానికి కారణమ య్యాడు. అందుకే నా కోపం హద్దులుదా టింది. అయినా ఎదుటివాళ్ళ గురించి అతి ఆసక్తి చూపించడం అంత మంచిది కాదనే విషయం మీ పత్రికలో పని చేసేవా ళ్ళకు తెలియకపోతే పర్యవసానం ఇలాగే ఉంటుంది'' అతనికన్నా గట్టిగా అంది జీవన. అతను తల తిప్పి అవినాష్ వైపు చూశాడు. అవినాష్ ముఖంలో కోపం గానీ, టెన్షన్‌గానీ ఏం లేవు.

''సార్! మిమ్మల్ని ఆ అమ్మాయి అన్ని మాటలు అంటుంటే మీరేం అనడంలేదెం దుకని?'' అడిగాడింకో అతను. అయినా అవినాష్ ఏమీ మాట్లాడలేదు. కళ్ళప్ప గించి జీవననే చూస్తుండిపోయాడు.

అవినాష్ పక్కనే నిలుచున్న కొలీగ్.. జీవనవైపు కోపంగా చూస్తూ.. చూడండీ అతను మిమ్మల్ని అవమానించడం వంటి వేమీ చేయలేదుకదా! మీరు కుప్పతొట్టి పాప... అని అనగానే మధ్యలోనే ఆపి ''ప్లీజ్.. ఆ పదం మళ్లీ ఇంకోసారి వాడితే లీగల్‌గా అప్రోచ్ అవ్వాల్సి ఉంటుంది'' ఇంకా సీరియస్‌గా అంది. అవినాష్ ఇంకా విభ్రమంగా చూడసాగాడు జీవన వైపు అలాగే!

''సరే! మీరు 'పాప'ను పెంచుకోవడం గొప్ప విషయంగా అంగీకరిస్తూ మీ కీర్తిని పంచా డేగానీ, మీకేం అపకీర్తి తేలేదుగా! అందుకు థాంక్స్ చెప్పాల్సిందిపోయి యిలా మండిపడుతు న్నారేంటి?''

''ఎవరిక్కావాలండీ కీర్తి? ఒకవేళ మిమ్మల్ని పెంచుకోవడం మీ అమ్మకు కీర్తి అయితే ఆమె గురించీ, మీ గురించీ రాసుకోండి. పాపను పెంచడం నేనేం గొప్ప విషయంగా భావించడం లేదు'' చెప్పింది.

''మా అమ్మ నన్ను కన్నది కాబట్టి అది కీర్తి కిందకురాదు. ఎందుకంటే నన్ను పెంచడం మా అమ్మ కర్తవ్యం. కానీ మీ విషయం ఇదే కోవలోకి రాదు. మీరా పాపను కనలేదుగా! మీరొక అనా థను...'' పూర్తి చేసేలోపే...

''మైండ్ యువర్ టంగ్ మిస్టర్... దయచేసి అనాథ అనేపదం వాడొద్దు. మీ అమ్మ మిమ్మల్ని కన్నదా లేదా అని రుజువు చేసుకోవడానికి నేనిక్క డకు రాలేదు. ఇంకోసారి నా పేరుగానీ, నా పాప గురించి గానీ ఎక్కడైనా వచ్చిందంటే నేను చాలా తీవ్రంగా తీసుకుంటాను'' అని వెనుదిరిగి వెళ్ళబో యేంతలో..

''లుక్ మేడమ్! మావాడికి సారీ చెప్పండి'' అన్నాడతను.

మళ్ళీ రివ్వున వెనక్కి తిరిగి అవినాష్ దగ్గరకు వచ్చి

''కుప్పతొట్టి వెధవా, అమ్మా అబ్బా ఎవరో తెలీని అనాథా, బజార్లో పెరిగిన బికారీ వెధవా, నీకు నేను సారీ చెప్పాలా?'' అంది.

అతని దవడనరం బిగుసుకుంది. కళ్ళు ఎర్రబ డ్డాయి. నుదుట చెమట అలుముకుంది. మూసు కున్న పిడికిలి విడివడి ఆమె చెంపను తాకబోయి బలవంతంగా ఆగింది. ఆ ఉద్రేకాన్ని గమనించిన జీవన శాంతించింది. అతను తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు.

''చూశారా? మీకు ఎలా కోపం వచ్చిందో! ఈ కోపమే నా పాపను అంటే నాకు వచ్చింది, కనుక సారీ చెప్పాల్సిందినాకు'' అనేసి గిర్రున వెనుదిరిగి వెళ్లిపోయింది.

ఆమె వెళ్ళిన తర్వాత కూడా అవినాష్ ఆ 'అవ మానం'లో చాలాసేపు అలాగే ఉండిపోయాడు. అసలది అవమానమా, జ్ఞానోదయమా తెలీని షాక్‌లో ఎంతసేపు గడిపాడు. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా సరదాగా ఉండే అవినాష్ అంత టెన్ష న్‌లో ఉండటం ఎవరూ చూడలేదింతవరకూ! తన కంత కోపం చెప్పించిన ఆ అమ్మాయిని ఏమీ అన నంత సహనం! ఆ కోపంలో ఏమీ చేయకపో వడం, మాట్లాడకపోవడం కూడా కొలీగ్స్‌ను ఆశ్చ ర్యంలో ముంచింది. అవినాష్‌లో నిండు మనిషిని, ఆ మనిషిలోని సీరియస్‌నెస్‌నూ అందరూ చూడ గలిగారు ఆ రోజు! ఇంతలో ఎడిటర్ గారొచ్చారు.. 'వాట్ హాపెండ్' అంటూ. అవినాష్ తేరుకుని 'నథింగ్ సార్' అనేలోపే...

''సర్! జీవన అనే అమ్మాయి వచ్చి గొడవ చేసింది సార్. 'ఒక అనాథ బాలికను పెంచుకుంటున్న పెళ్లికాని తల్లి' అనే ఐటెమ్ నిన్నవచ్చింది కదా సార్! ఆ అమ్మాయి సార్'' అని ఓ ఎంప్లాయ్ చెప్పాడు.

''ఏంటంట?'

''నాగురించి న్యూస్ రాయడానికి నువ్వెవరూ అంటూ అవినాష్‌ను కొట్టింది సార్''

''బ్రిటన్ అప్రోచ్ అవ్వాలని చెప్ప లేదా మీరు?'' అడిగారాయన.

''ఆ అమ్మాయస్సలు ఛాన్సే ఇవ్వ లేదు సార్'' చాలా దుర్ధగా చెప్పాడిం కోతను. అవినాష్ అంటే అంతిష్టం వాళ్ళకు. ఎవరికి ఏ సాయం అవసర మైనా చేస్తాడు. నవ్వుతూ నవ్విస్తూ ఉంటాడు. అందుకే అవినాష్‌కు జరి గిన అవమానం తమందరిగా భావిం చారు వాళ్ళు.

''సరే! ఆ అమ్మాయికి లీగల్ నోటీసు పంపిస్తాను'' అన్నారాయన.

ఎడిటర్ సీరియస్‌గా తీసుకోవడంతో అప్పుడు జోక్యం చేసుకున్నాడు అవినాష్.. ''సారీ సర్! ఆ అమ్మాయి తప్పు చేసిందని నేను భావించడం లేదు. నేను తనను అవమానించాను కాబట్టి తను నన్ను అవమానించింది.

-ఇంకాఉంది

రంగనాథ రామాయణం

154

శ్రీపాద కృష్ణమూర్తి

పక్షాలు కాలిపోయి ఈ దుస్థితిలో వున్న నాకు నా తనయుడు భక్తి యుక్తుడై ఆహారం తెచ్చి పెడుతూ వుంటాడు. ఒకనాడు వాడు నాకు ఆహారం కొని రావడం చాలా ఆలస్యం అయింది. అపుడు నేను నేడు తడిసి నావేల?'' అని ప్రశ్న చేశాను. సుపార్శ్వుడు ''తండ్రీ! నీకు ఆహారం తీసుకొని రావడం కోసరం మహేంద్రాద్రి సముద్ర తీరంలో పొంచి వున్నాను. అప్పుడు సూర్య ప్రభ వంటి అంగనామణిని కొనిపోతూ కాటుక కొండ వంటి ఒకడు చనుదెంచి తనకు ప్రియము చెప్పి, త్రోవ ఇవ్వగా శీఘ్రంగా వెడ లిపోయాడు. అపుడు అక్కడ వున్న మునీశ్వ రులందరూ సంతసిస్తూ 'నేడు నీ చావు తప్పింది. వాడు అంతకుడు వంటి రాక్షసుడు రావణుడు. శ్రీరాముడి సతిని చెరగొని లంకకు కైకొని పోతున్నాడు'' అని తెలిపారు. ఆ కారణంవల్ల ఈ రోజు చాలా ఆలస్యమయి పోయింది'' అని పలికాడు. కనుక సందియ మందనేల? జనకరాజు తనయ రాక్షస కాంతా పరివృత అయి- మేఘ మాలలోని చంద్రకళ భాతి లంకలో వుంది. నా చూపు ఈ పుడమి మీద శతయోజనాల దవ్వు ప్రసరి స్తుంది. అన్ని పక్షుల కంటె నాకు మనోదృష్టి కూడా అత్యధికం'' అని చెప్పి సంపాతి మరల ఈ విధంగా పలికాడు.

''నా పక్షద్వయం దగ్ధం అయినపుడు నేను వచ్చి మూర్ఛపోయి, చావు తప్పి, ఇక్కడ పడిపోయాను. సైచరాని దప్పికతో, కుట్టూర్పు లతో కొన్ని సంవత్సరాలు గడపాను. నా భాగ్యవశంవల్ల సమస్త జన తాపహరుడు నిశాకరుడు వంటి 'నిశాకరుడు' అనే పేరుగల ఋషి ఇక్కడ తీవ్ర నిష్ఠతో తపస్సు ఒనర్చు కుంటూ వుండడం కనుకొన్నాను. ఆ మునీశ్వ రుడికి ప్రణామాలు పెట్టి ''మహాభాగా! సూర్య దీప్తుల చేత నా పక్షాలు రెండూ కాలి నా శరీరం వున్న విధం ఆ మౌని శేఖరుడికి విన్నవించుకొన్నాను. ఆ ముని శిఖామణి అంతకుమున్నే నన్ను ఎరుగును. కనుక మిక్కిలి కరుణించి, భవిష్యత్తు తలచి, పరాత్ప రుడు శ్రియఃపతి అయిన విష్ణుమూర్తి దశ రథ మహారాజుకి నందనుడయి అవతరి స్తాడు. ఆపైన అతడు తన తండ్రి ఆన చేత ఘోరాటవులకు వచ్చి వున్నపుడు అతని సతిని రావణుడు అపహరించుకొని పోయి చెరబెట్టి వున్నపుడు ఆమె ఆహార తృష్ణలు విడిచి వసిం చేది. అపుడు రామవిభుడు సుగ్రీవుడితో మైత్రి కావించుకొని వాలిని చంపుతాడు. అనంతరం సుగ్రీవాజ్ఞవల్ల సీతను అన్వేషింప నాల్గు దిక్కు లకూ వస్తారు. ఆ రాముడి నిజ దూతలైన వానరులతో నీ కథ వివరించిన రోజున నీ రెక్కల జోడుమరల నీకు మొలుస్తుంది'' అని ఆ ముని చంద్రుడు వాక్రుచ్చాడు. ఆ నిశాకర మునీంద్రుడు వచించినట్లే నా కథ మీకు విని పించిన వెంటనే నాకు నా పక్షాలు వచ్చాయి'' అని చెబుతూ నింగికెగిరి లంకపోయి అక్కడ అశోక వనంలో సీతను వీక్షించి వచ్చి ''ఇదె లంకలో సీతను చూశాను. మీ ప్రాయోపవేశ ప్రయత్నాలు మానండి. ఇటనుండి సాగి పౌల స్త్యుడి లంకలో సీతను వెదకడం కోసం ఏగవ లసింది'' అని చెప్పి ఆ సంపాతి హేమాద్రికి ఆకాశ మార్గంలో ఎగిరి వెళ్లిపోయాడు. అప్పుడు వానర వీరులు హర్షచిత్తులయి, ఏగి, తీవ్ర వాయు ఘాతాల చేత ఒండీర సంయు తము, ఘోర నక్రగ్రాహసమూ హసంక వితము అయిన అంభోరాశిని పొడగాంచారు. అల్లకల్లోలమయి ఉత్తుంగ తరంగ భీకరం అయిన వనధిని కనగానే చేష్టలుడిగి కొయ్య లయి పోయారు. కుందేడెందాలతో అక్కడే కూర్చుండిపోయారు. ఈ సముద్రం దాటడా నికి మనలో ఎవడు సమర్థుడు? అంత సత్త్వం కల యోధుడు వానరులలో ఎవ్వడు?'' అని చింతించసాగారు. అంగదుడు, ఇతర తరుచ రులు ఆ ఉదధి తీరంలో ఆ రేయి వేగించారు. మరునాడు వీర వానరులను పేరు పేరు వీక్షించి ''మీ మీ పౌరుషాలు నేలపాలు చేసి నూరు యోజనాల జలరాశిని దాటిపోవడానికి ఈ గతి విచారిస్తారెందుకు? మీ మీ జవ ములు, మీ మీ దాటుకొలదులు ఇంతింత అని నాకు తెలియజెయ్యండి'' అని ప్రశ్నిం చాడు.

-ఇంకాఉంది

మంగళవారం, 26 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: బహుళ పాడ్యమి రా.02.00
నక్షత్రం: పూర్వఫల్గుని రా.02.44
వర్జ్యం: ఉ.10.24 నుండి 12.02 వరకు
దుర్ముహూర్తం: ఉ.09.00 నుండి 09.46 వరకు, తిరిగి రా.11.14 నుండి 12.04 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగు తుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభి స్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధన లాభముంటుంది. శుభవార్తలు వింటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):
ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవు తాయి. ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహిం చుట మంచిది. అనారోగ్య బాధలు ఉంటాయి. తీర్థయాత్రలకు ప్రయత్నిస్తారు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. ఇతరులకు అపకారం కలి గించే పనులకు దూరంగా నుండాలి . అనా రోగ్య బాధలుండవు.చంచలంగా ఉంటారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుం టాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్త పడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అంద రితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొం టారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచ నలను కలిగి వుంటారు. బంధు, మిత్రులు గౌర విస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుం టారు. ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రు లతో కలుస్తారు. ఉత్సాహంగా ఉంటారు.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్ని స్తారు. ఋణప్రయత్నాలు ఫలిస్తాయి.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
కొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానం దాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. ధననష్టమేర్పడే అవకాశ ముంది. క్రొత్త సమస్యల నెదుర్కొంటారు.

మంచిమాట

సత్ప్రవర్తన

మానవుడు సంఘజీవి. సమాజంలో తన సహచరులతో సంబంధ బాంధవ్యాలు సక్రమంగా సాగాలంటే సత్ప్రవర్తనే ముఖ్యసాధనం. సత్ప్రవర్తన లేనివాడు సత్పురు షుడు కాజాలడు. సత్ప్రవర్తన అంటే మంచి నడవడిక. ఇది మనిషికి మంచి వ్యక్తిత్వా న్నిస్తుంది. వ్యక్తి యొక్క వ్యక్తిత్వం అతని జీవితాన్నే ప్రభావితం చేస్తుంది. ఒక వ్యక్తి మంచివాడా? కాదా? అన్నది అతని ప్రవర్తనే నిర్ణయిస్తుంది. ప్రవర్తన అద్దంలాంటిది. ప్రతి మనిషి ప్రతిబింబం అందులో కన్పిస్తుంది. చాణుక్యుడు ప్రవర్తనా ప్రాముఖ్యాన్ని వివరిస్తూ 'మిత్రుల్ని కానీ, శత్రువుల్ని కానీ సృష్టించేది మీ ప్రవర్తనే' అని అంటాడు.

సత్ప్రవర్తన సుగంధం లాంటిది. సుగంధ పరిమళాన్ని అందరూ ఆస్వాదించినట్లే, సత్ప్రవర్తన కలవారిని అందరూ ఇష్టపడతారు. సత్ప్రవర్తనను సొంతం చేసుకోవాలంటే త్రికరణశుద్ధిగా జీవించాలి. అంటే మనస్సులో ఎలా అనుకుంటున్నామో, అలాగే మాట్లాడాలి. ఏ విధంగా మాట్లాడుతున్నామో మన పనులు కూడా అలాగే ఉండాలి. ఐతే మన ఆలోచనల్లో నిస్వార్థం, మాటల్లో నిజాయితీ, ఆచరణలో నిబద్ధత ఉండాలి. అప్పుడే మనిషి సత్ప్రవర్తన గల సత్పురుషుడిగా ప్రజల మన్ననా పొందుతాడు. సత్పు రుషుడు పుణ్యజలం లాంటివాడు. పుణ్యజలంలో స్నానం చేస్తే పవిత్రత పొందినట్లే, సజ్జన సాంగత్యంవల్ల సత్ప్రవర్తన కలుగుతుంది.

ఎదుటివారితో అప్రియంగా మాట్లాడకూడదు. వారికి ఇష్టమైన రీతిలో, నలుగురు మెచ్చే విధంగా మన మాట తీరు ఉండాలి. అందుకే కాబోలు ''నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు'' పెద్దలు. పరుషంగా మాట్లాడటం, గర్వాన్ని ప్రద ర్శిస్తూ ఒకరి అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని హేళన చేస్తూ మాట్లాడటం వంటివి మన దుష్ప్రవర్తనకు సంకేతాలు. మనం ఎక్కడికి వెళ్ళినా, ఏమి మాట్లాడినా విన్నవారి మన్న నలు పొందాలి. అలాగే ఎవ్వరు చెప్పినా ఓర్పుతో వినాలి. ఎందుకంటే బాగా వినగలి గినవాడే బాగా మాట్లాడగలడు. మాటే మనిషికి ఆభరణం. భాష, సంభాషణా శక్తి మనిషికి దేవుడిచ్చిన వరాలు.

మనస్సులో 'నాది' అన్న భావన వీడాలి. అందరిది అన్న విశాల దృక్పథం అలవ డాలి. అప్పుడే జీవితం సుఖశాంతులతో హాయిగా ఉంటుంది. గుండెనిండా స్వార్థాన్ని నింపుకొని, మంచివాడన్న ముసుగు ధరించినంత మాత్రాన, ఒక వ్యక్తి ఉత్తముడు కాడు. నిజ జీవితంలో పలు సందర్భాలలో అతడు ప్రవర్తించిన తీరు, అతని గుణగణా లని నిర్ణయిస్తుంది. ఎప్పుడైతే ఎదుటివానికి హాని చేయాలన్న ఆలోచన మన మన సులో నాటుకుందో, అప్పుడే మన పతనం ప్రారంభమవుతుంది. పదిమంది సుఖంగా ఉండాలని కోరుకునేవాడు పదికాలాలపాటు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపో తాడు.

తన సత్ప్రవర్తన వల్లే ఆంజనేయుడు శ్రీరామచంద్రమూర్తికి నమ్మిన బంట య్యాడు. అలాగే సుగ్రీవుడు శ్రీరాముడికి మంచి మిత్రుడయ్యాడు. సత్ప్రవర్తన కలిగిన వారికి దైవ సహాయం ఎప్పుడూ వెన్నెంటే ఉంటుంది. ప్రహ్లాదుడు సద్గుణశీలుడు కాబట్టే విష్ణుమూర్తి నరసింహావతారమెత్తి అతడిని రక్షించడానికి వచ్చాడు. పాండవుల ప్రవర్తన సరియైనది కాబట్టే మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు వారి పక్షాన నిలిచాడు. అలాగే సంసార జీవితంలో కూడా భార్యాభర్తలు తమ సత్ప్రవర్తనతో పరస్పరం ప్రేమా నురాగాలు పొందవచ్చు. తన సత్ప్రవర్తనతో విద్యార్థి గురువుల ఆశీస్సులను, ఉద్యోగి తన పై అధికారుల మెప్పును, వ్యాపారి వినియోగదారుల నమ్మకాన్ని పొందవచ్చు.

సత్ప్రవర్తన సంద్రం లాంటిది. సముద్రం మధ్యలో అలజడులున్నట్లే, సత్ప్రవర్తన సాధనలో మనకు అప్పుడప్పుడు కొన్ని సమస్యలు ఎదురైనా, చివరికి జీవితం ఆనంద తీరానికే చేరుకుంటుంది. ఒక్కొక్కసారి మన ప్రవర్తన ఎదుటివారిలో పరివర్తన తీసుకు రావచ్చు. దుర్మార్గులనుకూడా సన్మార్గులుగా మార్చవచ్చు. సర్వకాల సర్వావస్థలలో సర్వోత్తమమైనది సత్ప్రవర్తన.

-బొద్దూరు విజయేశ్వరరావు

వృతాసురుడు

32

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 25

మాటాట - 24 సమాధానం



మాటాట

ఆధారాలు:

అడ్డం
1. చాణుక్యుడు దీనిలో ప్రసిద్ధుడు
4. వాడిమి, తీక్షణం
5. సమాజం
8. అజుర్యం
9. క్షీరమే
10. ఖనిజాలు తవ్వితీసే ప్రదేశం
12. బీడు నేల
14. అమావాస్య అర్ధరాత్రి పుట్టితే ఇలా అవతారట అంటారుకొందరు

నిలువు
1. రాచరీవి
2. జలము
3. అవు
4. పల్యాంకిక
7. వేరీజు
8. పువ్వులతో చేసిన చెండు
11. ఏరు , నది
13. విత్తనం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కొత్తగా

ఎక్స్‌బాక్స్ 720

» ఈ ఏడాదిలో -ప్రపంచాన్ని అబ్బురపర్చేందుకు వస్తున్న గాడ్జెట్లలో ఎక్స్‌బాక్స్ 720 గేమింగ్ కన్సోల్‌ను కూడా టెక్ నిపుణులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. మునుపటి గేమింగ్ కన్సోల్ కంటే శక్తివంతమైన ప్రభావంతో వస్తున్న 'ఎక్స్‌బాక్స్ 720'తో గేమర్ల ఆనందం పరాకాష్టకు చేరడం ఖాయమన్న రివ్యూలూ కనిపిస్తున్నాయి.

బ్లూ-రే సపోర్ట్, 3డి గేమింగ్, ప్రత్యక్ష టెలివిజన్ రికార్డింగ్ ప్రణాళిక, అనుబంధ వాస్తవిక గాజు పరికరంపై పని చేసేలా తీర్చిదిద్దిన కైనటిక్ డివైస్‌గా ఎక్స్‌బాక్స్ 720 మార్కెట్‌కు రావడం ఖాయమన్న అంచనాలూ వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకూ లీకైన సమాచారం ప్రకారం -8జిబి రామ్, క్వాడ్ కోర్ ప్రాసెసర్లు దీని ప్రత్యేకతలుగా చెప్తున్నారు. ఇప్పటి వరకూ వచ్చిన గేమింగ్ కన్సోల్స్‌లో ఇది ప్రత్యేకం, శక్తివంతం అని వినిపిస్తున్నా, మార్కెట్‌కు వచ్చాకగానీ దీని సత్తా తెలీదు. ఏమంటారు?

'డిజైన్ ద ఛేంజ్' పేరిట న్యూఢిల్లీలో సాగిన వాల్ పెయింటింగ్ ఈవెంట్ ఇది. కుంచెలు మెలివేయగల వృత్తి కళాకారులు, ఇప్పుడిప్పుడే రంగుల రంగరింపులో ఓనమాలు నేర్చుకుంటున్న బాల కళాకారులు కలిసి కొత్త ఢిల్లీ గోడలపై అద్భుతాలను ఆవిష్కరించారు. ఊహ, సృజనాత్మకను మేళవించి వర్తమాన సామాజిక పోకడలపై రంగులు విరజిమ్మిన 'డిజైన్ ద ఛేంజ్' ఓ గొప్ప ప్రయత్నమనే చెప్పాలి. 'సమున్నత సమాజావిష్కరణ'కు సాగిన ప్రయత్నంలో చిన్న భాగమే ఈ 'గోడ మీది బొమ్మ'!

ఎదురీతకు అంతం ఉంది!

» ఎదురీతకు అంతం లేదా.. నా మదిలో రేగే గాయం మానిపోదా? అంటూ పాత సినిమాలో ఓ హీరో తనను తాను పాటతో ప్రశ్నించుకుంటాడు. సినిమా చివర్లో కష్టాలను అధిగమించి -ఎదురీతకు అంతం ఉంది? అన్న విషయాన్ని దృశ్యరూపంలో మనకు అందిస్తాడు. అలా అందరికీ సాధ్యమేనా? ఎదురీతకు అంతం ఉంటుందా? అదెలా....?

⁘

జీవితం నిత్య పోరాటం. సుదీర్ఘమైన పయనంలో ఎన్నో ఆటుపోట్లు, అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఏ మనిషైనా క్రుంగిపోతుంటాడు. ఇక జీవితమంతా నా పరిస్థితి ఇంతేనేమో అని బాధపడుతుంటాడు. ఈ పరిస్థితిని చాలామంది మనసు పాడయిపోయిందని సర్ది చెప్పుకుంటూ ఉంటారు. అయితే పాడయిపోయిన మనసును బాగు చేసుకోవడం ఎలా? అని ఆలోచించే వాళ్లు చాలా కొద్దిమందే ఉంటారు. అలాంటి వారు తిరిగి మామూలు పరిస్థితికి మనసును తీసుకు రావడానికి స్ఫూర్తినిచ్చే పుస్తకాలు చదవడం, పెద్దల ప్రసంగాలు వినడం లాంటివి చేస్తూ ఉంటారు. అంటే ఇలాంటి మోటివేషన్ (స్ఫూర్తి) మన మనసును బాగు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అర్థం. ఈ స్ఫూర్తే మన లోని వ్యతిరేక ఆలోచనలను పారదోలి తిరిగి మనల్ని విజయం వైపు నడిపిస్తూ ఉంటుంది. నిజమైన క్రీడాకారుడు ఏదైనా పోటీలో విఫలమైనప్పుడు క్రుంగిపోడు. ఈసారి తప్పకుండా విజయం సాధిస్తానన్న నమ్మకంతో ముందుకు సాగుతాడు. అలాంటి నమ్మకాన్ని కూడగట్టుకోవడం కోసం తన వంతు కృషి చేస్తాడు. సామాన్య మానవుడు కూడా అలాంటి పనే చేయాల్సి ఉంటుంది.

అయితే ఇలాంటి స్ఫూర్తిని అందించడానికి మంచి పుస్తకాలు, ప్రసంగాలు లాంటివి నిజ జీవితంలో ఏమైనా ఉపయోగపడతాయా? అన్న ప్రశ్న తలెత్తుతూ ఉంటుంది. ప్రశాంతంగా కూర్చుని మీరు చదిన పుస్తకం, లేదా విన్న ప్రసంగంలోని మంచి విషయాలను ఒక్కసారి మననం చేసుకోండి. ఆ



జాబితా చాలా పెద్దదే అయి ఉంటుంది. అయితే ఈ సూక్తులు మన ఆలోచనలపైన, లైఫ్ స్టైల్‌పైన ఏమైనా ప్రభావం చూపిస్తాయా? లేదా లక్ష్య సాధనకు ఏమయినా ఉపయోగపడతాయా? అంటే అది మీ ఆలోచనా ధోరణిని బట్టి ఉంటుంది. చాలామంది తాము చదివిన లేదా విన్న ప్రసంగాల్లోని మంచి విషయాలను మెదడులో అట్టే నిల్వ చేసుకుని వాటిని తమ జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవడానికి ఉపయోగించుకోరు. ఉదాహరణకు 'ఇది సాధ్యమే. నేను దీన్ని సాధించగలను' అని ఏదయినా పని ప్రారంభించే ముందు అనుకోవాలని ఎవరైనా చెప్పారనుకోండి. కష్టాలు ఎదురయినప్పుడు ఆ మాటలను మీరు మనసులో ఎన్నిసార్లు అనుకుని ఉంటారో గుర్తు చేసుకోండి. మహా అయితే ఏ ఒకటి రెండుసార్లో అనుకుని ఉంటారు. కొందరయితే అదీ ఉండదు. అదే సమయంలో 'ఇది నాకు చేతకాదు' అనే వ్యతిరేక భావాలు మీ మనసుల్లో ఎన్నోసార్లు కలిగి ఉంటాయి. ఆ వ్యతిరేక భావాల ప్రభావం కారణంగా ఈ సానుకూల భావాలు తెరమరుగవుతూ ఉంటాయి. చిన్నప్పటినుంచి మంచి పుస్తకాలు చదవడం, పెద్దల ప్రసంగాలు వినడం లాంటివి అలవాటు చేసుకున్నప్పుడు ఏర్పడే బలమైన పునాది దైనందిన జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్ఫూర్తిదాయకం అవుతుంది. ఏళ్ల తరబడి అభద్రతా భావానికి లోనవుతూ ఆ పరిస్థితుల మధ్యే జీవించడానికి బదులు అలాంటి పరిస్థితులకు దూరంగా వెళ్లేందుకు ప్రయత్నించడం మంచిది.

ఇలాంటి ఆత్మ విశ్వాసాన్ని సంపాదించుకున్నప్పటికీ మనం మానవమాత్రులం గనుక కష్టాలు ఎదురవుతూ ఉండడం సహజమే. అలాంటప్పుడు తాను కూడా సామాన్యుడినేనని, ఏ అసాధారణ శక్తీ తనకు అండగా నిలవడం లేదని భావించడం వెర్రితనం. ఎందుకంటే నెగెటివ్ ఆలోచనలకు బలం ఎక్కువ. అవి మనలోని సానుకూల ఆలోచనలను వెనక్కినెట్టేసి మనలో భయం, పిరికితనం లాంటివి ముప్పిరికొనడానికి కారణమవుతూ ఉంటాయి. మీరు చదివిన పుస్తకాలు, విన్న ప్రసంగాల్లో ఎన్ని మంచి మాటలు ఉన్నా వాటిని కూడా నెగెటివ్ ధోరణిలోనే రిసీవ్ చేసుకుంటూ ఉంటారు.

అయితే వాస్తవాల పట్ల మీ ధోరణే మీలోని నెగెటివ్ ఆలోచనలను దూరం చేస్తుందనే వాస్తవాన్ని మీరు మరిచిపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఉదాహరణకు ఈ ప్రపంచంలో నీటి కన్నా ఎక్కువగా లొంగే వస్తువు మరేదీ లేదు. అయితే అది బలంగా దాడి చేసినప్పుడు ఎవరు కూడా దాన్ని ఎదుర్కొని నిలబడలేడు. ఎందుకంటే దాన్ని మార్చే దారి లేదు. అలాగే నెగెటివ్ ఆలోచనలు కూడా. 'ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలుసుకానీ ఎవరు కూడా ఆ ప్రయత్నం చేయరు' అని మేధావులు అంటారు.

అందువల్ల మీ మొత్తం జీవితానికి బలమైన పునాదికి అవసరమైనవేవో ముందు నిర్ణయించుకోండి. మనల్ని మామూలు మనిషిని చేసేవి ఏవో మనకు తెలుసు కానీ మన మొండి వైఖరి వాటిని అంగీకరించడానికి ఇష్టపడదు. మన జీవితాన్ని చైతన్యం చేసే విషయాలను పట్టించుకోకుండా, వాటిని ప్రతిఘటిస్తూ ఉంటాం. అందుకే అలాంటి ధోరణినుంచి బైటపడడానికి ప్రయత్నించాలి. మంచి విషయాలను విని, చదివి, వాటిని మననం చేసుకుంటూ, ఆచరించడం ద్వారా అలాంటి పరిస్థితి నుంచి బైటపడగలం.

ఇది సాధ్యమా? కాదా? అన్నది మళ్లీ మనసుమీదే ఆధారపడి ఉంటుంది.

విజయం

స్టడీ అవర్స్ + ఫన్ టైమ్
లైఫంతా హ్యాపీడేస్!

-వాసిలి వసంతకుమార్,
drvaasili@yahoo.co.in
Cell: 9393933946

» సమయపాలనలో ప్రతీ విద్యార్థికి ముఖ్యమైనవి ప్రణాళికలు. ప్లానింగ్ సిద్ధమయ్యాక ఇంప్లిమెంటేషన్ ఎవాల్యూయేషన్ అనేవి ప్రముఖ పాత్ర పోషిస్తాయి. విద్యార్థి దశను ఎంత హాపీ డేస్ అనుకున్నప్పటికీ ఈ మూడు అడుగులలో ఏ అడుగు తప్పినా వృత్తి జీవనం ఆశావహం అనిపించదు. అందుకే సంపూర్ణ జీవితంలో అకడమిక్ లైఫ్ ఎంతో విలువైంది. అదే భవిష్యత్తుకు వారధి. మనల్ని మనం దిద్ది తీర్చుకోగలిగితేనే భవిష్యనిధి అందేది. అలాగని విద్యా జీవనంలో ఫన్ ఉండకూడదని కాదు... హాపీగా గడపకూడదని కాదు. ఫన్‌కయినా స్టడీస్‌కయినా దేని ప్రాధాన్యత దానిదే. స్టడీస్‌కయినా ఫన్‌కయినా సమయాన్ని కేటాయించాల్సిందే.

మనలోని చాలామందిమి సినిమాలు, షికార్లు, ఫన్ పేరిట సమయాన్ని శక్తికి మించి తగలేస్తుంటాం. సెమిస్టర్ విద్యా విధానంలో నెలలు రోజుల్లా గడిచిపోతుంటాయి. ఫన్నీగా నాలుగు నెలలు ఎంజాయ్ చేసిన తర్వాత ఎగ్జామ్ ఫీవర్ పట్టుకుంటుంది. పుస్తకం పట్టుకుంటే ఒళ్లు వేడిగా అనిపించదు కానీ ఒంట్లో నుండి వేడి తన్నుకొస్తుంటుంది. చాపర్టర్స్ వెంట కళ్లు పరిగెడుతున్నా ఏ ఒక్క అధ్యాయమూ మైండ్‌లో రిజిస్టర్ కాదు. మైండ్ 'బ్లాంక్' అయి ముచ్చెమట్లు పోస్తుంటాయి. దరిమిలా పరీక్షకు ముందు రెండు మూడు రోజుల్లో పూర్తిచేయొచ్చులే అని మనసును సమాధానపరుస్తాం. ఈ పోస్ట్‌పోన్‌మెంటే ప్రొక్రాస్టినేషన్. ఇదే ఫెయిల్యూర్‌కు తొలి అంకం. ఎగ్జామ్‌కి రెండు మూడు రోజుల ముందు రివైజ్ చేసుకోవలసిన సబ్జెక్ట్‌ను ఆ స్వల్ప వ్యవధిలో చదవటం ప్రారంభిస్తే మనకు సమయం విలువ తెలిసిరానట్లే! సక్సెస్‌పరంగా తొలి ఆటంకం, విఘాతం ఇదే!

సైలెంట్ మోడ్ నుండే స్టడీ మూడ్

సామాన్యంగా విద్యార్థి జీవనంలో లేచింది మొదలు పడుకునేవరకు అంటే ఉదయం ఏడింటి నుంచి రాత్రి పదిపన్నెండింటి వరకు స్నేహితులు, సరదాలు, సెల్‌ఫోన్‌లు, ఎస్సెమ్మెస్‌లు, మెయిల్స్, చాటింగ్స్, సినిమాలు, సరసాలు- ఎంతలా బిజీ అయిపోతుంటాయో?! వీటికే టైమ్ సరిపోకపోవటం వల్ల క్లాస్‌లు ఎగ్గొడతాం. కాలేజ్ బంక్! చదువు మూలన పడ్డా పర్లేదు.. బాక్‌లాగ్స్ కామనే కదా!! దటీజ్ స్టూడెంట్ లైఫ్. కనీసం కాలేజ్ అవర్స్‌ను కళాశాలకే పరిమితం చేస్తే లెక్చరర్స్ చెప్పేది కాస్తో కూస్తో బుర్రకు ఎక్కుతుంది. పుస్తకం తెరిచినపుడు అక్షరాలు అలుక్కుపోవు... పదాలు వెక్కిరించవు. సాయంత్రాలను స్నేహితులతో గడపవచ్చు కానీ రాత్రి ఏడింటి తర్వాత సెల్‌ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేస్తే మన సొమ్మేం పోదు కదా! కనీసం వాటిని సైలెంట్ మోడ్‌లోకి పంపగలిగితే మనం స్టడీ మూడ్‌లోకి రాగలుగుతాం.

కాలేజ్ అవర్స్‌ను, స్టడీ అవర్స్‌ను ఫన్ టైమ్ చేసుకుంటే కాలం క్షమించదు. కళాశాల ప్రాంగణంలో తప్పినా తాత్కాలికమే అనిపించి ఫైనల్ ఇయర్‌లో పూర్తిచేయవచ్చనుకున్నా- స్టూడెంట్స్ టెర్మినాలిజీతో ఈ ఫెయిల్యూర్‌కు 'బాక్‌లాగ్' అని ట్యాగ్ తగిలించినా- సరిదిద్దకపోతే, సమయం విలువ తెలుసుకోలేకపోతే ఫ్యూచర్ ఫెయిల్యూర్ అవుతుంది. జీవితం అపజయంతో అపహాస్యం పాలవుతుంది. ఫలితంగా సాదాసీదాగా జీవితం గడుపుతూ సదరు జీవితానికి మనకు మనమే సక్సెస్ ట్యాగ్ తగిలించుకోవలసి వస్తుంది. మనకు కావలసింది ట్యాగ్ తగిలించుకుని బ్రతుకును ఈడ్చే జీవితం కాదు... అడుగడుగునా ప్రతిఫలించే సక్సెస్‌ఫుల్ లైఫ్.

స్టడీ కల్చర్ నుండే వర్క్ కల్చర్

ఇంతకీ సమయపాలన పరంగా చెప్పొచ్చేదేమిటంటే-

-సెమిస్టర్‌కు నాలుగు పేపర్లంటే ఒక్కో పేపర్‌కు ఒక్కో గంట చొప్పున నాలుగు గంటలు చదవాల్సిందే.

-సంబంధిత పరీక్షకు మూడు రోజుల ముందే చదివిన సబ్జెక్ట్‌ను ఒకసారి సంపూర్ణంగా సమీక్షించుకోవాలి.

-రేపు ఎగ్జామ్ అనగా ఈ రోజు రాత్రి రివ్యూ చేసుకోవాలి.

-ఎగ్జామ్ నాటి ఉదయాన సబ్జెక్ట్‌ను చాప్టర్స్ వైజ్ మనసులోకి తెచ్చుకోవాలి.

-మైండ్‌ఫుల్ అయి ఎగ్జామ్ హాల్‌లోకి అడుగుపెడితే ఆస్సరింగ్ సుళువు అవుతుంది.. సక్సెస్ స్వంతమవుతుంది.

-ప్రతిరోజూ స్టడీ అవర్స్‌ను, ఫన్ అవర్స్‌ను ఫిక్స్ చేసుకోవాలి.. స్టడీ ప్లాన్ ఫాలో కావాలి.. సెల్‌ఫోన్‌లను సైలెంట్ మోడ్‌లోకి పంపి స్టడీ మూడ్‌లోకి రావాలి.. కంప్యూటర్ స్క్రీన్‌పైని చాటింగ్ బాక్స్‌ని క్లోజ్ చేయాలి. మనం డిస్టర్బ్ కాని విధంగా అనుకూల ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి.

-ఉమ్మడి కుటుంబాల్లో రాత్రి పదయితే కానీ సద్దుమణగదు. అటువంటపుడు ఏడింటి నుండి పదింటివరకు పడుకుని రాత్రి పదింటికి చదవటం ప్రారంభించి ఒంటిగంటకో, రెండింటికో పూర్తి చేసి పడుకోవచ్చు. ఎటువంటి డిస్టర్‌బెన్స్ లేకపోవటంవల్ల కాన్‌సెన్‌ట్రేషన్ దెబ్బతినదు.

ఇలా ఓ వారం ఈ స్ట్రాటజీని ఫాలో కాగలిగితే తర్వాత్తర్వాత ఈ షెడ్యూల్ అలవాటయిపోతుంది. ఎంతో హాపీగాను, శాటిస్‌ఫాక్టరీగాను వుంటుంది. సాయంత్రాలు ఫన్.... రాత్రిళ్లు స్టడీస్... విద్యార్థి దశలో దీనికి మించిన హాపీడేస్ ఏముంటాయి?! దీనికి మించిన అకడమిక్ సక్సెస్ మరేం ఉంటుంది?! మనసుంటే మార్గం ఉంటుంది. సమయాన్ని కేటాయిచగలిగితే సక్సెస్ మనతోనే ఉంటుంది. ఈ స్టడీ కల్చర్‌కి అలవాటుపడగలిగితే సమీప భవిష్యత్తులో వర్క్ కల్చర్‌కి సులభంగా బదిలీ కాగలుగుతాం. టైమ్ మేనేజ్‌మెంట్‌తో అకడమిక్‌గా సక్సెస్ కాగలిగితే ప్రొఫెషనల్ సక్సెస్ సాధ్యం కాకుండా పోదు.

(మిగతా వచ్చే వారం)

జ్ఞాపకాలో, అనుభవాలో, అల్లరో, ఆనందమో.. ఏదైనా పాఠకులతో పంచుకోవాలని అనిపిస్తే -ఈ పేజీకి రాసి పంపించండి. బావున్న వాటిని ప్రచురిస్తాం. మీ రచనలు మాకు పంపాల్సిన చిరునామా..

ఎడిటర్,
ఆంధ్రభూమి దిన పత్రిక
36, సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్

కహానీ

అసలు.. వృద్ధుడెవడు?

» 'ఈ భాషలెవడు కనిపెట్టాడ్రా బాబూ!' అంటూ శత్రువు సినిమాలో కోట శ్రీనివాస్‌లాగే -వినోద్ డైలాగ్ కొట్టగానే రూమ్‌లోని ఫ్రెండ్సంతా గొల్లున నవ్వుకున్నారు. వాళ్ల కంబైండ్ స్టడీలో ఇలాంటి జోకులే ఎక్కువగా పేల్తుంటాయ్. 'ఇవే కనుక లేకపోయి ఉంటే జీవితం ఎంతహాయిగా ఉండేదో? మాతృభాష, ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్ ఇవి చాలవన్నట్టు ఏదోక విదేశీ భాష నేర్చుకోమని ఇంట్లో పోరు. వీటికి తోడు అమ్మాయిల్ని ఆకట్టుకునే 'భాష' మనం సొంతంగా నేర్చుకోవాలి' అని అశోక్ అనేసరికి అంతా చప్పట్లు కొట్టారు. భాషలు నేర్చుకోవడంతోనే జీవితం సరిపోతుంది -అని అంతా బాధపడ్డారు. కొద్దిసేపటికి వారి చర్చ పక్కింటి పైకి మళ్లింది. ఏరా వినోద్ ఈమధ్య ప్రతి రోజూ ఒకే సమయానికి మీ పక్కింటికో అంటీ వస్తోంది. ఏంటీ కథా? అంటూ చిలిపిగా నవ్వాడు ప్రకాశ్. 'నాకూ అదే అర్థం కాలేదురా! పక్కింట్లోకి కొత్తగా వృద్ధ జంట దిగింది. అయినా, వాళ్లిద్దరూ వృద్ధుల్లా ఉండరు. మన కంటే ఎక్కువ ఉత్సాహంగానే ఉంటున్నారు. ఈసారి పలకరించి, విషయమేంటో తెలుసుకోవాలి' అని వినోద్ బదులిచ్చాడు.

⁘

'నమస్కారం అంకుల్' -దారిలో ఎదురుపడిన పక్కింటి వ్యక్తిని పలకరించాడు వినోద్. రేబాన్ అనుకుంటా అని మనసులోనే నవ్వుకున్నాడు కంటి అద్దాలను చూసి. వినోద్ పరిచయంతో ఆ వ్యక్తి ఇంట్లోకి ఆహ్వానించాడు. కొద్ది సేపటికే ఒకమ్మాయి వచ్చింది. 'ఫరవా లేదు కూర్చో' అని వినోద్‌కు చెప్పి, ఆ వృద్ధుడు మాత్రం ఆమె ముందు విద్యార్థిగా మారిపోయాడు. అర్థంగాకుండా అయోమయంగా ఆమె చేతిలోని బుక్‌వైపు చూస్తున్న వినోద్‌తో అంది.. 'ఇది బ్రెయిలీ లిపి పుస్తకం' అని.

⁘

వృద్ధునికి ఆమె బ్రెయిలీ లిపి నేర్పించడానికి రోజూ వస్తోంది. విషయం అర్థమయ్యాక అయోమయం మరింత పెరిగింది వినోద్‌లో. ఈ వయసులో? అంటూ మనసులోని ప్రశ్నార్థకాన్ని అప్పుడే అక్కడకు వచ్చిన వృద్ధుడి భార్యముందు అనేశాడు. దానికి ఆమె -అంకుల్‌కి ఏడుపదులు దాటి చాలా కాలమైంది. ఆయనకు చాలా భాషలు వచ్చు. ఇప్పుడు క్రేజీగా చెప్పుకుంటున్న ఐఐటి చదువులు ఆయన ఎప్పుడో చదివాడు. పెద్ద కంపెనీలో పెద్ద హోదాలోనే పని చేసి రిటైరయ్యారు. ఈ వయసులో హఠాత్తుగా కళ్లుపోయాయి. వినికిడి శక్తి మాత్రం ఉంది' అని చెప్పుకొచ్చింది. అతని గురించి తెలిశాక వినోద్ ఆశ్చర్యంగా 'ఈ వయసులో బ్రెయిలీ నేర్చుకుని ఏం చేస్తారు' అడిగాడు. చిన్నప్పటి నుంచి చదవడం ఆయనకు ఇష్టమైన పని. హఠాత్తుగా కళ్లుపోయాయి. బ్రెయిలీ లిపిలో మంచి ఆత్మ కథలు ఉన్నాయట. వాటిని చదువేందుకు ఇప్పుడు బ్రెయిలీ నేర్చుకుంటున్నారు' అంటూ ఆమె చెప్పుకునిపోతుంటే -వినోద్‌కు మనసులోనే అనిపించింది. 20ఏళ్ల వయసులో ఏదైనా కొత్త భాష నేర్చుకోవడం కష్టమైన పని అనుకునే నేను వృద్ధుడినా? ఏడు పదుల వయసులో కళ్లుపోయినా ఆత్మకథలు చదివేందుకు బ్రెయిలీ నేర్చుకోవడానికి ఉద్యుక్తుడైన అంకుల్ వృద్ధుడా? అని తనను తానే ప్రశ్నించుకున్నాడు. తాను చదవాల్సినవి చాలా ఉన్నాయి. 'భగవంతుడా.. నాకు కళ్లిచ్చావు చాలు. వీటిని సార్థకం చేసుకుంటాను' అని మనసులోనే అనుకుని ఇంటిముఖం పట్టాడు.

-మురళి

విచిత్రాలు... నివాస్

వారెవా.. వాల్లిస్!

» రంగం ఎదైనా రచ్చ గెలవడమే హీరోయిజం. రింగుల జుత్తుతో అమాయకంగా కనిపించే పసికూన -తెర మీద అద్భుత నటనా ప్రావీణ్యాన్ని ప్రదర్శించి ఆస్కార్ ఎత్తుకు ఎదిగిపోవడం ఆషామాషీ కాదు. క్వెంజనె వాలిస్ -లాంటి చిచ్చర పిడుగులకే సాధ్యం.

ఆస్కార్‌కు మూడు క్యాటగిరీల కింద 'బీస్ట్ ఆఫ్ ది సదరన్ వైల్డ్' నామినేట్ అయ్యింది. ఈ సినిమా కోసం ఆడిషన్స్ జరిగినపుడు హుష్‌పప్పీ పాత్ర కోసం వాలిస్ నాలుగువేల మందితో పోటీపడింది. ఆడిషన్స్‌లో అనూహ్య విజయాన్ని సాధించిన ఆమె -తెర మీద కోట్లాది సినీ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది. బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు కోసం వివిధ సినిమాల నుంచి కాకలుతీరిన నటీమణులే పోటీపడుతున్నా -వాలిస్‌కూ అవకాశాలు ఎక్కువే ఉన్నాయంటున్నారు సినీ పండితులు. లూసియానా బురద నేలల్లో బతికే ఓ కుటుంబంలో -ఏమాత్రం సహనం లేని తండ్రి యోగక్షేమాలు చూసుకుంటూ పదిమందికీ ఆదర్శంగా నిలిచిన ఓ పిల్ల -ఆకస్మికంగా జబ్బుపడితే పరిస్థితి ఏమిటనేదే సినిమా కథాంశం.

-ఉత్తమ నటి క్యాటగిరీ కింద ఆస్కార్‌కు నామినేట్ అయిన అతి పిన్న వయస్కురాలు ఈమె. ప్రస్తుతం స్టీవ్ మెక్వీన్స్ నిర్మించబోతున్న '12 ఇయర్స్ ఏ స్లేవ్' చిత్రానికి సైన్ చేసిన వాల్లిస్ -భవిష్యత్‌లో ఎలాంటి ప్రతిభను చూపుతుందో చూద్దాం.

ఈ ప్రేమకు 'రేటె'క్కువ!

» మూడేళ్ల క్రితం సంఘటన. అప్పారావు, నేను చదువుకుంటున్న కాలం. ఇద్దరం చాలా ఏళ్లుగా స్నేహితులం. ఆగస్టు 15 సందర్భంలో కాలేజీ పోటీల్లో పద్మ అనే అమ్మాయి కలిసింది. అప్పారావు పొగడ్తల్లో ముంచేశాడు. ఆమె కూడా తెగ నవ్వేసింది.

తరువాతి రోజు.. ఆగస్టు 15. పద్మ, అప్పారావు దగ్గరకు వచ్చింది. ఇప్పుడు నేనొక పాట పాడాలి, ఏం పాడమంటావ్ అడిగింది. అప్పారావు ఏదో చెప్పాడు. అదే పాడింది. నాకేం అర్థం కాలేదు. తర్వాత అప్పారావు నాతో మాటలు తగ్గించాడు. ఆమె వెనుక తిరగడం పెంచాడు. పాని పూరీలు, హాట్‌చాట్‌లు, న్యూడిల్స్ మామూలే.

ఓసారి క్లాస్ మధ్యలో అప్పారావుకి ఫోన్. క్లాస్ అయిన తర్వాత ఆ నెంబర్‌కి ఫోన్ చేశాడు. అవతలినుంచి -పద్మతో తిరగవద్దు. ఆమెతో మాట్లాడకు అని కఠినమైన హెచ్చరిక. నువ్వేం చేసుకుంటావో చేసుకో. ఆమె నా లవర్ అన్నాడు అప్పారావు. అవతల ఫోన్‌లో వున్న వ్యక్తి ఓసారి మిమ్మల్ని కలవాలి అన్నాడు. ఆ రోజు సాయంత్రం అప్పారావు బస్టాప్ దగ్గర ఉంటే ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి వచ్చాడు. నా గుండె వేగం పెరిగింది. పెద్ద గొడవ జరగడం ఖాయం అనుకున్నా. ఒళ్ళంతా చెమటలు.

అతను దగ్గరకు వచ్చి -బాసు పద్మ వల్ల నాకు ఆరు వేలు లాసు. నువ్వు నాలాగా దెబ్బతినకూడదని నా హితవు. ఆమెతో ఉన్నంతసేపూ బాగానే ఉంటుంది. తరువాతే తెలుస్తుంది, మన జేబుకు చిల్లుపడిన సంగతి అన్నాడు దీనంగా.

అప్పారావు మైండ్ కాస్త వెనక్కి వెళ్లింది. పిన్నీస్‌కు గుచ్చిన మస్కిటో కాయిల్ గిర్రున తిప్పుతున్నట్టు ముఖం పెట్టాడు. ఒళ్లంతా చెమటలు. ఠక్కున ఈలోకం లోకి వచ్చినట్టు ఫేస్ టర్నింగ్ ఇచ్చుకున్నాడు.

నిజమే బాసూ, ఇప్పటి వరకూ నాచేత వెయ్యి ఖర్చు చేయించింది. ఏమేమో చెప్పి రెండు వేలు పిండేసింది అంటూ బావురుమన్నాడు. ఒరే అప్పారావ్ నీ ఈ ప్రేమకు రేటెక్కువ అని నేను ఛలోక్తి విసరడంతో ఇద్దరి ఏడుపు ముఖాల్లో కాస్త నవ్వు కనిపించింది. అది గుర్తుకు వచ్చినప్పుడల్లా ఇప్పటికీ నవ్వుకుంటాం.

-ఎన్. సురేంద్ర, విశాఖపట్నం

ఇంటితెర

intitera@andhrabhoomi.net

'సూపర్ ఫార్మ్'గా మాధురి?

ఒకప్పుడు తన అందచందాలతో, అద్భుత నటనతో ప్రేక్షక జనాలను సమ్మోహితుల్ని చేసిన బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ త్వరలోనే 'బుల్లితెర'పై కనువిందు చేయబోతోంది. వివాహం జరిగాక కొన్నాళ్లు విదేశాల్లో ఉండి, 2011లో ముంబై చేరుకున్న ఈ భామ ఓ టీవీ షోలో ప్రధాన భూమిక పోషించేందుకు రంగం సిద్ధమైంది. అమెరికాలో సూపర్ హిట్ అయిన 'ది గుడ్ వైఫ్' టీవీ సీరియల్‌ను హిందీలో 'రీమేక్' చేయాలని భావిస్తున్న మన దేశంలోని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఇప్పటికే మాధురిని సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సీరియల్‌లో కీలక పాత్ర పోషించేందుకు మాధురి దాదాపు అంగీకరించిందని, ఆమె కాల్‌షీట్లు లభించాక సీరియల్ నిర్మాణం ప్రారంభమవుతుందని అంటున్నారు. ఇంతకుముందే అంగీకరించిన కొన్ని ప్రాజెక్టులు దాదాపు పూర్తి కావచ్చినందున మరో రెండు మూడు వారాల్లో 'ది గుడ్ వైఫ్' షూటింగ్ ప్రారంభం కావచ్చని తెలుస్తోంది. ఈ సీరియల్ హిట్ అయితే 'బుల్లితెర'పై మాధురి బిజీగా మారే అవకాశాలున్నాయని బాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే బాలీవుడ్ నటులు అమితాబ్, అనిల్ కపూర్, ఆమీర్ ఖాన్ తదితరులు టీవీ షోలతో బిజీగా మారగా, మాధురి కూడా ఆ జాబితాలో చేరుతుందంటున్నారు.

-ఎన్‌ఆర్

విషయం అదే అయినా..!

చిత్రాల్లో విషయం అదే అయినా వాటిలో పేరెన్నికగన్న తారాతోరణం వుంటే కలిగే అదనపు సదుపాయం వేరు. అలాగే దాదాపు ఆ మాదిరి రియాల్టీ షోల్లో కాస్త అటూ ఇటుగా నిర్ధారపరిచే రౌండ్స్, తదితరాలు ఒకటే అయినా ఆ కార్యక్రమాన్ని నిర్వహించే యాంకర్లు చేయి తిరిగినవారైతే ఒనగూడే శోభే వేరు. అలాంటి శోభ కలుగుతుందనే ప్రసిద్ధ వ్యాఖ్యాత్రి ఝాన్సీ నేతృత్వంలో 'బంగారు కుటుంబం' ప్రతి సోమవారం జీ తెలుగు చానల్‌లో రాత్రి 9.30కి ప్రసారం అవుతున్నది) ప్రసారం ఆరంభమైంది. స్టార్స్ ఉన్న చిత్రానికి అంచనాలు వున్నట్లే స్టార్ యాంకర్స్ ఉన్నదానికీ ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి. కానీ ఆ అంచనాలకు చేరుకోలేకపోతోంది... 'బంగారు కుటుంబం'. దీనిక్కారణం ఈ బాపతువి అటూ ఇటూగా చిన్నతెరపై చూసేయడంవల్ల కావచ్చు. పాల్గొనేవారి కోసం పెద్ద తెరను ప్రాకులాడడమెందుకని టెలివిజన్ స్టార్స్‌నే పురమాయించుకున్నరిందులో. కాకపోతే పోటీ పోటీగా టెలివిజన్లో వచ్చే ధారావాహికల నటీనటుల్ని ఇందులో తీసుకొచ్చారు.

'చిన్నకోడలు' కుటుంబం, 'శిఖరం' కుటుంబం, 'అంతఃపురం'లోని రాజావారి కుటుంబం, 'ఎసిపి ప్రతాప్ కుటుంబం', అలాగే 'ముద్దబిడ్డ'లో కృష్ణ కుటుంబం, రాజా వానిరెడ్డి ఫేమిలీ... ఇలా సీరియల్స్ బృందాలని ప్రవేశపెట్టారు. ఎంతలేదన్నా తెలుగు సీరియల్స్ నిరంతర ప్రేక్షకుల సంఖ్య గణనీయం కనుక వీరిపట్ల వారికొక ఆసక్తి వుంటుంది. ఆ ఆసక్తిని ఈ షో బాగా వినియోగించుకుంటోంది. అన్నిట్లోలాగే ఇందులోనూ నాలుగు రౌండ్లు 'అమ్మా బొమ్మాళీ', 'డియ్యాలో డియ్యాల', 'ఎవడిగోల వాడిది', 'జుంబారే జుంజుం బరే'... వున్నాయి. వీటిలో ప్రశ్నలడగడం, సమాధానాలు చెప్పడం, సరిగా చెప్పినవారు గెలుపొందడంవంటి సాధారణ అంశాలు ఉన్నాయి. వీటిలో 'ఎవడిగోల వాడిది' రౌండ్ కొంత కొత్తగా వుంటుంది. మరొకరితో సంబంధం లేకుండా వారికిచ్చిన పని (కొట్టడమో, దంచడమో, తిప్పడమో, మోత మోగించడమో... అలాగ) చేసుకుపోవడం. అలాగే మరో రౌండ్‌లో పాల్గొంటున్నవారు ఒకటి, రెండు... అంటూ వరసగా సంఖ్యలు చెపుతూ ఐదు గుణిజంతో వచ్చే అంకెలు (5, 10, 15...) స్థానంలో యాంకర్ ఇచ్చిన విభాగానికి చెందిన పేర్లు చెప్పాలి. ఒకరు చెప్పిన పేరు మరొకరు తిరిగి చెప్పకూడదు. అన్నీ బాగానే వున్నాయి కానీ, ప్రతీ రౌండ్‌లోనూ గెలుపొందిన అభ్యర్థులు విధిగా నృత్యం చేసి తీరాలన్న అలిఖిత నిబంధన వున్నట్లు ఇందులో కనపడుతుంది. ఇది చాలా పాత పద్ధతైంది కనుక దానికి బదులుగా మరొకటి ప్రవేశపెట్టవచ్చు. ఉదాహరణకు ఇందులో పాల్గొంటున్న వారందరూ ధారావాహికల ద్వారా చిరపరిచితులైనవారే కనుక సంబంధిత సీరియల్‌కు చెందిన ఆసక్తికర అంశాలను స్పృశించవచ్చు. లేదా వారు అందులో పోషిస్తున్న పాత్రల ద్వారా పొందుతున్న స్పందననూ చెప్పవచ్చు. ఇక ఝాన్సీ వ్యాఖ్యానం గూర్చి కొత్తగా చెప్పేదేం లేదు కానీ సాధ్యమైనంతవరకూ డాన్స్‌లను వదిలేస్తే హుందాగా వుంటుంది. ఇప్పటికీ సుప్రసిద్ధురాలైన ఆమెకీ చిన్న చిన్న స్టెప్స్‌వల్ల కొత్తగా వచ్చే ఖ్యాతేం లేదు. కార్యక్రమ 'సంతక శృతి' (సిగ్నేచర్ ట్యూన్)గా 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు..' పాటను ఉపయోగించుకోడం బావుంది.

* * *

అక్కడ చనిపోయిన వారెవరూ ఎవరికీ శత్రువులు కారు. క్షతగాత్రులైనవారిపట్లా ఎవరికీ ద్వేష భావమూ లేదు. కానీ వారంతా ముష్కరుల దారుణ క్రియకు లోనయ్యారు. ఇదీ ఇటీవలి హైదరాబాద్ బాంబు ఘటన పరిణామం. 'దిల్' (మనసు) వున్నవాడెవడూ కంటతడిపెట్టకుండా వుండలేని దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్‌లో బాంబు పేలుళ్ళు జరిగిన ప్రాంతం) సంఘటన అనంతర అంశాలను ఎప్పటికప్పుడు చిన్నతెర తెలియజేసింది. అది ఏ ప్రధానమైన చానల్ అయినా, ఘటనపట్ల సత్వరం స్పందించి పరిశోధనాత్మకానికీ, సమాచార సరఫరాకి చిత్తశుద్ధితో కృషిచేసాయి. ఈ సందర్భంగా ప్రసారం చేసిన చర్చోపచర్చలు కూడా అనేక అంశాలపై దృష్టి సారించేలా చేసాయి. అయితే ఈ వేడీ, వగైరా ఘటనానంతర ఉద్వేగపూరిత వాతావరణంలోనే కాక, అసలు ఇలాంటి వాటి మూలాలు తెలుసుకోడానికీ, తీవ్ర పరిణామాలు రాకుండా సామాన్య పౌరులు సైతం తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తల పట్ల కూడా వీలైనంతవరకూ చిన్నతెర ప్రసారం చేయాలి. అప్పుడు ఇప్పుడు వినపడుతున్న ''ముందస్తు హెచ్చరికలు వచ్చినా..'' అన్నవాటినీ అవకాశమున్నంతవరకూ ఎదుర్కోడానికి ఆస్కారముంటుంది.

-అన్వేషి

అమీర్ 'షో'కు స్పందన

రాజస్థాన్‌లో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు

ఆడశిశువుల పట్ల వివక్ష, లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు నిరసనగా ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ నిర్వహించిన 'సత్యమే వజయతే' టీవీ షోకు స్పందించి రాజస్థాన్ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసింది. లింగ వివక్ష కారణంగా రాజస్థాన్‌లో ఆడశిశువుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని, నిందితులకు సత్వర శిక్షలు విధించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని గతంలో అమీర్ సూచించాడు. దీంతో జిల్లా కేంద్రమైన 'కోట'లో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఆవిర్భవించి ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తోంది. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్లు, వైద్యులపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. 'కోట'లో ఏర్పాటైన ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇప్పటికే రెండు కేసుల్లో తీర్పులు వెలువరించింది. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఓ వైద్యుడికి రెండేళ్ల జైలు శిక్షను విధించారు. ఈ నెలాఖరుకు మరికొన్ని కేసుల్లో తీర్పులు రానున్నాయని 'సత్యమేవ జయతే' సహ దర్శకురాలు స్వాతి చక్రవర్తి తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు సంబంధించి రాజస్థాన్‌లో 2006 నుంచి వివిధ కోర్టుల్లో ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసులను ఆరు వారాల్లోగా పరిష్కరిస్తారు. తన సూచనను మన్నించి రాజస్థాన్ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం పట్ల అమీర్ ఖాన్ సంతోషం వ్యక్తం చేశాడు. సామాజిక రుగ్మతలను సాధ్యమైనంత తొందరలో అంతం చేసేందుకు ఈ కోర్టులు ఎంతగానో దోహదం చేస్తాయని ఆయన తెలిపాడు. మిగతా రాష్ట్రాలు కూడా రాజస్థాన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని అమీర్ కోరుతున్నాడు. వైద్యులకు శిక్షలు విధించిన విషయంలో రాజస్థాన్ మెడికల్ కౌన్సిల్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉందని ఆయన అన్నాడు.

-పిఎస్

కుంభమేళా చుట్టూ చానెళ్లు

చెన్నై దూరదర్శన్‌వారు 6.2.13 బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు 'తూరట్టియాట్టం' శివలీలలకు సంబంధించిన తమిళ జానపద కళారూపాన్ని ప్రదర్శించారు. ఇందులో బక్కగా, పొడవుగా ఉన్న శివుడు - పొట్టిగా, లావుగా వున్న పార్వతి కనిపించడం ఆశ్చర్యమనిపించినా, వాళ్ళు ఒకే కుటుంబానికి చెందిన వృత్తి కళాకారులని ఊహించవచ్చు. ఆ నాటకంలోని సంభాషణలను వాళ్ళే పలికినా, పాటలు మాత్రం నేపథ్యగాయకులు ఆలపిస్తే అంటే స్టేజికి ఒక పక్కనే వున్న పాటగాళ్ళు వాయిస్తూ పాడుతూ వుంటే వీళ్ళు నటించడం కనిపించింది. 9.2.13న 'చందన' అనే కన్నడ దూరదర్శన్ చానెల్‌లో మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు 'మహిషాసుర మర్థనం' అనే జానపద కళారూపాన్ని ప్రదర్శించారు. ఇది అచ్చు మన చిందు భాగోతంలానే వుంది. ఇది గాన రీతిలో కొనసాగిన కళారూపం. పాత్రధారులను వాళ్ళ వేషధారణను బట్టే గుర్తించవచ్చు. దేవేంద్రుడి చేతిలో వున్న వజ్రాయుధాన్ని బట్టి, మహిషాసురుడ్ని వేషాన్ని బట్టి ఇలా ప్రతి పాత్రధారుడ్ని గుర్తించడానికి అనువుగా మేకప్ బాగా చేశారు. నటన, గానం చక్కగా కుదిరిన ఈ జానపద కళారూపం ఎంతో బాగుంది.

6.2.13 బుధవారం సాయంత్రం 7.30కు రాజ్ న్యూస్ ఛానెల్‌లో 'ఆటోగ్రాఫ్' శీర్షికన సినీనటి సౌందర్య పరిచయం ఇచ్చారు. 'మనవరాలి పెళ్లి'తో సినీ రంగ ప్రవేశం

చేసిన సౌందర్య 'అమ్మోరు' సినిమా హిట్‌తో తారాపథంలోకి దూసుకెళ్ళింది. ఈ చిత్రం ద్వారా పౌరాణిక పాత్రలకు సరిపోతానని నిరూపించుకోవడంతో 'మంజునాథ' లాంటి చిత్రాలలో హీరోయిన్‌గా నటించగలిగింది. వెంకటేశ్‌తో నటించిన చిత్రాలు హిట్ కావడంతో వెంకటేష్ - సౌందర్య హిట్ పెయిర్‌గా స్థిరపడింది. విమాన ప్రమాదంలో దుర్మరణం పొందిన సౌందర్య లేని లోటు ఎవరూ తీర్చలేనిదంటారు. ఆమె నటించిన చిత్రాల క్లిప్పింగ్స్‌ను కూడా ఈ కార్యక్రమంలో చూపించారు. కథనం- వ్యాఖ్యానం బాగుంది. ఇదే రోజు సాయంత్రం 8 గంటలకు 'వనిత' చానెల్‌లో 'ఫిలింనగర్' శీర్షికన 'సినీ బాబా' అనే వైవిధ్యభరితమైన హాస్య కార్యక్రమం ప్రసారమయింది. రకరకాల హాస్య సన్నివేశాల కూర్పులా కాకుండా, ఒక భిన్నమైన అంశాన్ని తీసుకుని దానికనుమైన సన్నివేశాలను జోడించి ప్రసారం చేయడం మంచి ఆలోచన. ఈసారి 'సినీ బాబా' పేరిట సినిమాల్లో దొంగస్వాములు, దొంగ బాబాలు చేసే మోసాలు, వాటినుండి ఉద్భవించిన హాస్య సన్నివేశాలను ఈ కార్యక్రమంలో చూపిన విధానం బాగుంది. బ్రహ్మానందం, వేణుమాధవ్, రఘుబాబు, రవితేజ మొదలైనవారు దొంగ బాబాలుగా నటించిన హాస్య సన్నివేశాలను చూపారు. ఇక పాత సినిమాలకు సంబంధించి 'అప్పుచేసి పప్పుకూడు'లో ఎన్టీఆర్ స్వామీజీ వేషం, రేలంగి-గిరిజల మీద చిత్రీకరించిన 'కాశీకి పోయాను రామా హరి' పాటను ప్రసారం చేయడం బాగుంది. చివరగా వ్యాఖ్యాత్రి దొంగ బాబాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటూ హెచ్చరించడం మరీ మరీ బాగుంది.

8.2.13 శుక్రవారం 8.30కు స్రవంతి శీర్షికన ప్రఖ్యాత రచయిత గోపీచంద్ రాసిన 'ధర్మవడ్డీ' కథకు పి.చంద్రశేఖర ఆజాద్ కూర్చిన టెలిప్లే ప్రసారమయింది. ఇందులో సూరయ్యగా 'సూర్య' చాలా బాగా నటించాడు. 9.2.13 శనివారం 8.30లకు పాలగుమ్మి పద్మరాజు రాసిన కథ 'మగ పురుషుడు - ఆడ స్త్రీ'కి కస్తూరి మురళీకృష్ణ నాటకీకరణ చేశారు. చక్కటి స్క్రీన్‌ప్లే, సంభాషణలతో ఈ టెలిప్లే ఆసక్తికరంగా రూపొందింది.

9.2.13 శనివారం మధ్యాహ్నం 1.15కు పంజాబీ దూరదర్శన్ చానెల్‌లో 'స్టార్ కళాకార్' శీర్షికన నిర్మాత, దర్శకుడు యాష్ చోప్రా చేసిన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన సినీ ఆసక్తుల గురించీ, అతను తీసిన సినిమాల గురించి, అలాగే చిత్ర పరిశ్రమ గురించి ఎన్నో విషయాలను తెలియజేశారు. ఇంటర్వ్యూ పంజాబీలోనే చేసినా కొంత పంజాబీ ఎక్కువగా హిందీ, ఇంగ్లీష్‌లలో మాట్లాడారు. ఆయన బ్రతికి వున్నప్పుడు చేసిన ఆ ఇంటర్వ్యూ మరణానంతరం మళ్ళీ ప్రసారం చేశారు. అదే రోజు రెండు గంటలకు డి.డి భారతిలో రాజ్‌కపూర్ మీద రూపొందించిన కార్యక్రమం అరగంటపాటు ప్రసారమయింది. రాజ్‌కపూర్ గురించి, ఆయన గొప్పదనం గురించి, ఆర్.కె. బ్యానర్ చిత్రాల గురించి వ్యాఖ్యాతతోపాటు రణధీర్‌కపూర్, రిషికపూర్‌లు అభిప్రాయాలు కూడా తెలియజేయడం విశేషం. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ఒడియా దూరదర్శన్ ఛానెల్‌లో చిన్న పిల్లల నృత్య పోటీ కార్యక్రమం ప్రసారమయింది. 12 ఏళ్ళ పిల్లలవరకు సంప్రదాయ, జానపద, సినీ పాటల మీద వాళ్ళు చేసిన నృత్యాలను ప్రదర్శించారు. మరాఠీ దూరదర్శన్‌లో ప్రసారమయ్యే 'దమ్ మారోదమ్' కార్యక్రమానికి ఒరియా రూపమే ఇది. కానీ మరాఠీ కార్యక్రమంలో కనిపించిన ఎంపిక, ఎడిటింగ్, రివ్యూ ఇందులో కనిపించలేదు. అదే బాగుంది.

* * *

ప్రపంచంలోనే అతి పెద్ద మత, ధార్మిక కార్యక్రమంగా కోట్లాదిమంది చేసే పవిత్ర స్నానాల కార్యక్రమంగా, దానిలో పవిత్రతను, అపూర్వతను చాటిచెబుతూ అన్ని చానెల్సూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. ఉత్తరాది భక్తి చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. 'జీ జాగరణ్' చానెల్ సాయంత్రం 6.30కు, ఉదయం 6 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతిరోజూ ప్రసారం చేసింది. ప్రత్యక్ష ప్రసారం గంటలకొద్ది సమయం చూడాలంటే విసుగు. అందుకని ఉత్తరాది న్యూస్ చానెల్స్ మహా కుంభమేళా హైలెట్స్ అరగంటసేపు ప్రసారాలను తరచుగా చూపించాయి. న్యూస్ చానెల్స్ దిగంబరంగా కనిపించే నాగ సాధువులపైనే ఎక్కువగా తమ దృష్టిని సారించాయి. ఆదివారం (10.2.13) ఉదయం 8.30 నుండే హైలెట్స్‌ను ప్రసారం చేయడం ప్రారంభించారు. ఆదివారం అత్యంత పవిత్రమైన 'అమావాస్య' కారణంగా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం నుండే ప్రారంభమైన భక్తుల తాకిడిని, వాళ్ళ కోసం చేసిన ఏర్పాట్లను చూపించారు. ఆరువేల ఎకరాల్లోలక్షలాది గుడారాలతో నిర్మించిన తాత్కాలిక 'కుంభనగర్' భక్తులతో కిటకిటలాడింది. మత



సంస్థలకు చెందిన పెద్దలు ఏనుగులు, గుర్రాలపై ఊరేగింపుగా రాగా వారి వెంట సాధువులు, సన్యాసులు కదిలివచ్చారు. ఉల్లాసాలు, కేరింతలతో 'గంగా మాతాకీ జై' నినాదాలతో స్నానఘట్టాలు కిటకిటలాడాయి. త్రిశూలాలతో, గదలతో వచ్చి కొంతమంది సాధువులు నీళ్ళలో మునకలేయడం విచిత్రమనిపించింది. వేల సంఖ్యలో విదేశీయులు వందలాదిగా యూరోపియన్లు కనిపించడం ఆశ్చర్యం. యూరోపియన్ సాధువులు కూడా కనిపించి ఇంటర్వ్యూలో హిందూత్వం గురించి మాట్లాడడం, దేవుడు, పవిత్రత, పుణ్యం లాంటి పదాలనుపయోగించడం బాగుంది. చానెళ్ళవారు కుంభమేళా గురించి భక్తులతో మాట్లాడిస్తే, ఎవరూ సరిగ్గా దాని ప్రాముఖ్యతను చెప్పలేకపోయారు. ఎంతసేపూ హిందూత్వ, భారతీయత, సంస్కృతి, ఏకత లాంటి చిలుకపలుకులతోనే సరిపెట్టారు. శరీరమంతా బూడిద పూసుకుని, బుడ్డగోచి ధరించి, గంజాయి పీలుస్తున్న నాగ సాధువులను చూపించడమే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహా కుంభమేళాకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను పోలీసు బలగాలను చూపించారు. అంత జన సమ్మ

ర్థంలో ప్రతిరోజూ 1500 మిస్సింగ్ కేసులు నమోదు అవుతున్నాయట. ఇరవై రోజుల నుండి కనిపించకుండా పోయిన భర్తను వెతుకుతున్న భార్య ఇంటర్వ్యూను ఇచ్చారు. 140 ఏళ్ళకోసారి వచ్చే మహాకుంభమేళా ఇదియని, మన జీవితకాలంలో మళ్ళీ చూడలేమని చానెల్స్ ఊదరగొట్టడం వల్లనే ఈసారి అంచనాలకు మించిన జనాలు వచ్చారని ఒక కథనం.

* * *

దిల్ రాజు, డివివి దానయ్య లాంటి భారీ బడ్జెట్ నిర్మాతలపై దాడిచేసిన ఇన్‌కంటాక్స్ అధికారులు ఈసారి బండ్ల గణేశ్ ఇంటిపై, కార్యాలయాలపై సోమవారం (11.2.13) నుండి సోదాలు జరిపారు. మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తమ కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించారు. ఈ ఉదంతం అటు సినీ రంగంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ పెను ప్రకంపనలను సృష్టించింది. ఈ వ్యవహారాన్ని నిశితంగా పరిశీలించిన సాక్షి చానెల్ 12.2.13 మంగళవారం రాత్రి 8.30కు 'బినామీ గణేశ్' పేరిట ఒక అరగంట సేపు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేసింది. ఒకప్పుడు చిన్నా చితక వేషాలేసిన బండ్ల గణేష్ హఠాత్తుగా కోట్లకు కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీయడమేమిటి? ఇరవై కోట్లతో తీసిన 'ఆంజనేయుల', ముప్పై కోట్లతో తీసిన 'తీన్‌మార్' చిత్రాలు ప్లాప్ అయినా తట్టుకుని నలభై కోట్లతో 'గబ్బర్‌సింగ్' ఎలా తీయగలిగాడు? జూ. ఎన్టీఆర్‌తో 'బాద్‌షా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలు' భారీ బడ్జెట్ చిత్రాలు తీయబోవడం ఏమిటి? ప్రొమోలకు, పబ్లిసిటీకి విచ్చలవిడిగా ఎలా ఖర్చుపెట్టగలుగుతున్నాడు? కేవలం పౌల్ట్రీ, రియల్ ఎస్టేట్‌ల మీద ఇంత సంపాదించడం సాధ్యమా? అసలు ఈ డబ్బు ఎవరిది? ఎక్కడనుంచి వచ్చింది? సినిమాలకు మాఫియా వాళ్ళు, ఫ్యాక్షనిస్టులు, పారిశ్రామికవేత్తలు, అవినీతి రాజకీయ నాయకులు దొడ్డిదారిన పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. మరి బండ్ల గణేశ్ వెనుక ఎవరున్నారు? ఆయన ఎవరికి బినామీగా వ్యవహరిస్తున్నాడు? అని ప్రశ్నిస్తూ చివరకు బండ్ల గణేశ్ బొత్స సత్యనారాయణకు బినామీగా తేల్చేశారు. పార్టీ పరంగా బొత్స సత్యన్నారాయణ ప్రత్యర్థి కాబట్టి, ఆయన్ని దెబ్బ తీయడానికి బండ్ల గణేశ్ ఉదంతాన్ని హైలెట్ చేసి ఈ కార్యక్రమాన్ని రూపొందించారనే మోనని అనుమానించాల్సి వస్తుంది. బండ్ల గణేశ్ 44 లక్షల రూపాయల విలువ చేసే సిగరెట్ లైటర్‌ను పూరీ జగన్నాధ్‌కు, గబ్బర్‌సింగ్ చిత్రంలో హీరో వాడిన జీపును ఒక రాజకీయ నాయకుడికి బహుమతిగా ఇవ్వడంతో అందరి దృష్టి ఆయన మీద పడింది. ఈ ఖరీదయిన బహుమతులతోనే తన గొయ్యి తానే తవ్వుకోగలిగాడని ముక్తాయింపు. సంచలనం కోసం కాకుండా నిష్పక్షపాతంగా అక్రమ సంపాదన- అవినీతిపై ఇలాంటి కార్యక్రమాలు రూపొందిస్తే చాలా బాగుంటుంది.

-కె.పి.అశోక్‌కుమార్

'ఎవరే అవిడ'

"మా షూటింగ్ అంతా పిక్నిక్‌లా జరిగింది" అంటూ నటీనటులు ప్రెస్ మీట్స్‌లో అనడం మామూలు. అదెంతవరకూ నిజమో తెలీదు కానీ 'అమితా కా అమిత్'లో నటించే నల్గురు తారామణులూ కూడా మేమంతా షూటింగ్‌లో వున్నామంటే అల్లరే అల్లరి అంటున్నారు. సీరియల్‌లో ఆరతి పాత్ర పోషిస్తున్న జ్యోతి నిజ జీవితంలో ఓ పెద్ద వాగుడుకాయ. అలాగే చాందిని భగవానీ (అమితా పాత్రధారిణి)ని అందరూ ఆట పట్టిస్తూ వుంటారు. 'అలాగే మేం అందరం ఏం చేసినా అంటే కాఫీ, టీ, బ్రేక్‌ఫాస్ట్ అన్నీ కలిసే చేస్తాం" అని ప్రభజిత్‌కౌర్ (జిగ్నా వేషం వేస్తున్న నటి), ప్రీతి పాత్ర పోషిస్తున్న నేహా సక్సేనా చెప్పారు. ఒకోసారి మేం చేసే అల్లరిని మృదువుగా సీరియల్ దర్శకుడు కసురుకునే వారు కూడా అని వారు సరదాగా చెప్పారు.

నేనింకా తగ్గాలి

తారగా వాళ్లెంత ప్రతిభావంతులైనా, ముందుగా వారిలో అందరూ చూసేది వాళ్ళ ఆకారం. ఆ ఆకారంలో కాస్త హెచ్చుతగ్గులు కనపడ్డా వికారంగా వుంటుందన్న సంగతి వాళ్లు ముందే పసికట్టేస్తారు. దానికి తగ్గ నివారణాచర్యలూ చేపట్టేస్తారు. అలాంటి కార్యక్రమంలో టివి నటి సౌమ్యాసేథ్ పడింది. ఈమధ్య తను కాస్త లావుగా అవుతున్నానన్న భావన ఆమెకు కలిగింది. అలాంటి భావం కలగడమే తరువాయి తక్షణ నివారణ చర్యల్లోకి వెళ్లిపోయి అందుకనువైన మార్గాల్లోకి వెళ్లిపోయింది. 'నవ్య' ధారావాహిక ద్వారా అందరి మన్ననలూ పొందిన సౌమ్య త్వరలో రాబోతున్న 'దిల్ కీ నజర్ సే ఖూబ్‌సూరత్' సీరియల్ తనకు తప్పకుండా మంచి పేరు తెస్తుందని ధంకా భజాయించి చెపుతోంది. ముక్కోణపు ప్రేమ కథ నేపథ్యంగా నడిచే ఈ సీరియల్‌లో రేడియో జాకీతో ప్రేమలో పడుతుంది. విశేషమేమిటంటే టివి నటి కాకముందు సౌమ్య రేడియో జాకీ అవ్వాలనుకుంది. అది కుదరలేదు కానీ ఆ పాత్రలో ప్రేమలో పడే ఛాన్స్ దక్కించుకుంది (సీరియల్‌లోనే...) కొన్ని కొన్ని ఇలాంటి తమాషాలూ జరుగుతాయి కదూ!

కలిసొచ్చిన నృత్య విద్య

అసలు ఓ రంగంలో ఆరితేరాలే కానీ, ఆ రంగం అనుభవం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు పనికొస్తుంది. అలాంటి అనుభవం ప్రముఖ నృత్య దర్శకురాలు, దర్శకురాలు కూడా అయిన ఫర్హాఖాన్‌కు జరిగింది. ఇప్పుడందర్నీ ఓ ఊపు ఊపేస్తున్న ఐపిఎల్ సిరీస్‌లో మధ్యమధ్యలో వచ్చే ఛీర్ డాన్స్‌కు స్టెప్స్ కంపోజ్ చేసే అవకాశం ఫర్హాఖాన్‌కు వచ్చింది. ఆటగాళ్లు ఫోర్లు, సిక్స్‌లు లేదా వికెట్ తీసినప్పుడు వెంటనే జరిపే నృత్య స్పందన సాధ్యమైనంత వైవిధ్యంగా ఉండేలా నృత్య బాధ్యతను ఫర్హా తీసుకున్నారు. ''ఇలాంటప్పుడు చేసే స్టెప్స్ చాలా ఈజీగా ఉండాలి. అందర్నీ ఆకర్షించాలి. ఆ పద్ధతినే నేను అనుసరిస్తున్నా. వాస్తవానికి ఇంతకుముందు నేను క్రికెట్‌కు పెద్ద అభిమానినేం కాను. అయితే సోనీ మాక్స్ నాకిలా నృత్యదర్శకత్వం చేయమని కోరిన తర్వాత సచిన్ టెండూల్కర్, ఎం.ఎస్.ధోనీ, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్ అంటే నాకు ఫేవరేట్ ప్లేయర్స్ అయిపోయారు..." అంటున్నారు ఫర్హాఖాన్.

చిట్కా

★ శుభ్రంగా తుడిచిన చిన్న కరక్కాయను బుగ్గన ఉంచుకుంటే దగ్గు సమస్య తగ్గుతుంది. కరక్కాయ ముక్కలను కొంతసేపు మంచినీళ్లలో నానబెట్టి ఆ రసాన్ని తాగితే గుండెకు మంచిది.

★ కరక్కాయ మన వొంట్లో పైత్యాన్ని నివారిస్తుంది. దీని చూర్ణాన్ని నీటిలో కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి.

★ కరక్కాయ చూర్ణాన్ని నీటిలో కలిపి నుదుటి భాగానికి రాసుకుంటే తలనొప్పి, కళ్ల మంటల నుంచి ఉపశమనం లభిస్తుంది.

★ మెత్తటి ఉప్పులో కరక్కాయ పొడిని కలిపి పండ్లు తోముకుంటే ఎలాంటి దంత వ్యాధులు దరిచేరవు. పిప్పి పన్ను బాధ లున్నా నివారణ అవుతుంది.

★ పిల్లలకు కరక్కాయ రసం తాగిస్తే మలబద్ధకం సమస్య తలెత్తదు. కఫం కూడా తగ్గుతుంది. కరక్కాయ రసంలో ఇండుగ పిక్క పొడిని చేర్చి తాగిస్తే పిల్లల్లో అరుచి లక్షణాలు అంతరిస్తాయి. జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది.

★ కూరల్లో మసాలా ఎక్కువైందని అనిపిస్తే ఉడికించిన టమాటా ముక్కలను కలిపితే ఘాటు తగ్గుతుంది.

★ ఉడికించిన కూరల్లో నీరు ఎక్కువైందని అనిపిస్తే కొన్ని బ్రెడ్ ముక్కలను వేయాలి. అనవసరమైన నీటిని బ్రెడ్ ముక్కలు పీల్చేస్తాయి.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

బుధవారం 27, ఫిబ్రవరి 2013

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనూహ్య ప్రగతితో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోగా- అక్కడి మహిళలు ఇంకా సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.. అనునిత్యం అనేక సవాళ్లతో జీవితాలను నెట్టుకొస్తున్నారు.. సామాజిక అడ్డుగోడలే వారికి శాపంగా పరిణమిస్తున్నాయి.. ఇదీ హర్యానాలో అధిక శాతం మహిళల దీనస్థితి.. ఇక్కడి మహిళల్లో దాదాపు సగం మందికి గర్భ నిరోధక సాధనాల గురించి కానీ, కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి కానీ ఎలాంటి విషయాలూ తెలియవని తాజా అధ్యయనంలో తేటతెల్లమైంది. కొద్ది శాతం స్త్రీలకు మాత్రమే కండోమ్, కాపర్-టి, గర్భ నిరోధక మాత్రలు వంటి విషయాలపై కొంత అవగాహన ఉందని సర్వేలో తేలింది.

ఈ మౌనం ఎన్నాళ్లు..?

గర్భ నిరోధక పద్ధతులకు సామాజిక అడ్డంకులు

వివాహిత మహిళల్లో 52 శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్నా వారికి గర్భ నిరోధక పద్ధతుల గురించి ఎలాంటి కౌన్సెలింగ్‌లు హర్యానాలో నిర్వహించడం లేదు. వీరికి కాపర్-టి, కండోమ్, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, హెచ్‌ఐవి/ఎయిడ్స్ గురించి ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. 'గర్భ నిరోధక పద్ధతులు, సౌకర్యాలు, సమాచారం' అనే విషయంపై ఓ ప్రైవేటు సంస్థ జరిపిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. గర్భ నిరోధక విధానాలు, జనాభా నియంత్రణకు హర్యానా ప్రభుత్వం తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని తేలింది. ఈ విషయాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసే బాధ్యతను ప్రధానంగా 'ఆశ' కార్యకర్తలపైనే ఉంచారు. 'ఆశ' కార్యకర్తలు, కింది స్థాయి వైద్య ఉద్యోగులు గ్రామాల్లో నివసించే పరిస్థితి లేదు. దీంతో చాలా చోట్ల వీరు అందుబాటులో ఉండడం లేదు. ఫలితంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు ఆశించిన స్థాయిలో ప్రచారం లభించడం లేదు. ప్రభుత్వం సరఫరా చేసే కాపర్-టి వంటి గర్భ నిరోధక సాధనాలు ఆస్పత్రుల్లో వృథాగా పడి ఉంటున్నాయి. కాలం చెల్లిన వీటిని పంపిణీ చేయడానికి ఆరోగ్య సిబ్బంది నిరాకరిస్తున్నారు. సనాతన సంస్కృతి, సామాజిక కట్టుబాట్ల వల్ల మహిళలు గర్భ నిరోధక సాధనాలను వాడేందుకు ముందుకు రావడం లేదు.

సామాజికపరమైన అడ్డంకుల వల్లే వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, సమానత్వం,శాస్త్రీయ విజ్ఞానానికి హర్యానా మహిళలు దూరంగా ఉన్నారని చాలాకాలంగా మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, పరిస్థితిలో మార్పు రాలేదని అధ్యయనంలో తేలింది. గర్భధారణ, కుటుంబ నియంత్రణ, జీవించే హక్కు వంటి అంశాలపై అవగాహన లేనందున మహిళలు నేటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారు. పిల్లలను కనే విషయమై మహిళలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు అసలే లేవు.

18 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న 168 మంది వివాహిత మహిళలను అధ్యయనం సందర్భంగా ప్రశ్నించగా, గర్భనిరోధక పద్ధతులపై తమకు అవగాహన లేదని చాలామంది చెప్పారు. మహిళలు వాడే కండోమ్‌ల గురించి తమకేమీ తెలియదని 45 శాతం మంది చెప్పగా, కాపర్-టి గురించి తెలుసని 11.3 శాతం మంది తెలిపారు. పురుషులు వాడే కండోమ్‌ల గురించి 9.5 శాతం మందిలో, గర్భ నిరోధక మాత్రల గురించి రెండు శాతం మందిలో అవగాహన ఉన్నట్లు సర్వేలో తేలింది. 47 శాతం మంది మహిళలు కుటుంబ నియంత్రణ శిబిరాల గురించి తెలుసని చెప్పగా, ఇలాంటి శిబిరాల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్నట్లు 17 శాతం మంది మాత్రం వివరించారు. భర్తల వత్తిడితో కు.ని శస్త్రచికిత్సలు చేయించుకున్నామని కొద్దిమంది మహిళలు చెప్పారు. గర్భ నిరోధక సాధనాలను వాడితే ఆరోగ్యానికి ప్రమాదం అనే అపోహలు చాలా మంది మహిళల్లో ఉన్నాయి. పెళ్లయిన తర్వాత మగ బిడ్డ పుట్టే వరకూ తాము గర్భ నిరోధక పద్ధతులకు దూరంగా ఉంటామని ఇంకొందరు మహిళలు చెబుతున్నారు. కుటుంబ పరమైన, సంస్కృతి పరమైన అడ్డంకుల వల్ల చాలామంది మహిళలు గర్భ నిరోధక విధానాలకు దూరంగానే ఉండాల్సి వస్తోంది. ఇలాంటి విషయాలపై ఇతరులతో మాట్లాడేందుకు గానీ, గర్భ నిరోధక సాధనాలను కొనుక్కునేందుకు కానీ అధిక శాతం మహిళలు ఇష్టపడరు. గర్భ నిరోధక పద్ధతులపై తెలుసుకోవాలన్న ఆసక్తి ఉన్నా సామాజిక పరిస్థితులు అందుకు అడ్డుపడుతున్నాయని 91 శాతం మంది అవివాహిత యువతులు పేర్కొనడం గమనార్హం. ఇలాంటి విషయాలపై మాట్లాడితే సామాజికంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవల్సి ఉంటుందని వారు భయపడుతున్నారు. అవివాహిత యువతుల్లో 86 శాతం మందికి గర్భ నిరోధక సాధనాల గురించి తగిన అవగాహన లేదు. కు.ని శస్త్ర చికిత్సల గురించి 54 శాతం మందికి కొంత తెలుసు. ప్రభుత్వం ఉచితంగా కండోమ్‌లను పంపిణీ చేస్తున్న విషయం 72 శాతం మంది యువతులకు తెలుసు. గర్భధారణకు ముందు ఎలాంటి వైద్య సలహాలు తీసుకోలేదని 94.6 శాతం మంది మహిళలు తెలిపారు. 'ఆశ' కార్యకర్తలను ఎప్పుడూ సంప్రదించలేదని 66 శాతం మంది, ప్రైవేటు ఆస్పత్రులంటేనే తమకు నమ్మకం ఉందని 60 శాతం మంది వివరించారు. కాగా, గర్భ నిరోధక మాత్రలు, కండోమ్‌లను మాత్రమే తాము ఎక్కువగా విక్రయిస్తున్నట్లు చాలామంది మెడికల్ దుకాణాల యజమానులు చెబుతున్నారు. ఇంజక్షన్లు, మహిళల కండోమ్‌ల గురించి తమను ఎవరూ అడగడం లేదని వారంటున్నారు. చాలా మంది మహిళలు నోటి మాత్రలు తప్ప ఇతర గర్భ నిరోధక సాధనాల గురించి అడగరని మందుల దుకాణాల వారు తెలిపారు. ఏది ఏమైనా మహిళలు చైతన్యవంతులైతే తప్ప కుటుంబ సంక్షేమం సాధ్యం కాని పరిస్థితి హర్యానాలో నెలకొంది. జాతీయ జనాభా విధానాన్ని అమలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధ్యయనంలో పాల్గొన్న వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ■

ప్రాణాంతక బహుమతి!

పిల్లలకు ఆటబొమ్మలు ఇచ్చేముందు బాగా ఆలోచించాల్సిందే. అందుకే చైనా బొమ్మలపై 'మూడేళ్ల లోపు పిల్లలకు వీటిని ఇవ్వకండి'- అంటూ విధిగా వార్నింగ్ కూడా ఉంటుంది. కానీ, అది చూసి కొంతమంది నవ్వుకుంటారు. పాపం.. పసివాళ్లకేం తెలుస్తుంది? ఓ ఐదేళ్ల పాపకు తుపాకులంటే మహా సరదా. ఇది గమనించిన వాళ్ల నాన్నగారి స్నేహితుడొకాయన సదుద్దేశంతోనే ఆ పాపాయికి ఓ ఎయిర్‌గన్ తెచ్చి ఇచ్చాడు. పాప తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు. 'మేం చేయలేని పని మీరు చేశారు అన్నగారూ' అంటూ ఆ తల్లి- పాపకు తుపాకీ ఇవ్వగా, రబ్బరు బుల్లెట్లు అందులో పెట్టి ఎలా పేల్చాలో చూపించాడు తండ్రి. బొప్పాయి చెట్టుపై ఉడతను గురి చూసి కొట్టింది పాప. 'ఓహో' అన్నాడు తండ్రి. కానీ,

ఆటలో భాగంగా ఆ పాప తన తల్లిమీద తుపాకీ గురి పెట్టి బెదిరించింది. తల్లి ఏ మాత్రం భయపడక గలగలా నవ్వేసింది.

'ఓసీ పోవే.. నీ బొమ్మ తుపాకీ నన్నేం చేస్తుంది..'అని ఆ తల్లి వేళాకోళం చేసింది. దాంతో పాపా తుపాకీని ఒక్కసారి పేల్చింది. రబ్బర్ బుల్లెట్ తల్లి గుండె భాగానికి తగిలింది. ఆమె ప్రాణాలు అక్కడికక్కడే అనంత వాయువుల్లో కలిసిపోయాయి. తల్లి లేని పిల్లను ఎలా ఓదార్చాలో తెలియని తండ్రిని పోలీసులు పట్టుకుపోయారు. ప్రాణాంతకమైన ఆట వస్తువుల్ని పిల్లలకు ఇవ్వడం నేరమే కదా మరి! ఈ దుర్ఘటన తమిళనాడులో జరిగింది.

బోల్తపడ్డ ఆటోవాలా

ప్రయాణీకులు రాత్రి పూట ఆటో ఎక్కేందుకు భయపడతారు. దారి మధ్యలో ఆటో డ్రైవర్ కత్తితో బెదిరించి తమను దోచుకుంటాడేమోనని. ఢిల్లీ సమీపంలోని గుర్గావ్‌లో మాత్రం ఈ కథ అడ్డం తిరిగింది. ఓ ఆటోలో ఇద్దరు ప్రయాణీకులు మొదట బాగానే ఉన్నా తర్వాత ఎదురుతిరిగారు. ఝర్సాచౌక్‌లో ఇద్దరు యువకులు సోనూ చౌహాన్ (రాజస్తాన్ వాసి)కు చెందిన ఆటోలో ఎక్కారు. 'హుడా' జింఖానా క్లబ్‌కు పోనివ్వమన్నారు. అక్కడికి చేరుకున్నాక, 'మీ స్టాప్ ఇదే దిగండి' అన్నట్లు ఆటోవాలా బ్రేకు వేశాడు. వెంటనే ఆ ఇద్దరు ప్రయాణీకులు కలిసి ఆటో డ్రైవర్‌ను ఎడాపెడా చితకబాదారు. డ్రైవర్ నుంచి నగదు లాక్కుని అదే ఆటోలో ఘరానా యువకులిద్దరూ ఉడాయించారు. వారు కొట్టిన దెబ్బలకు బాధ పడుతూ ఆటోవాలా సెక్టర్ 29లోని పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. 'ఆగంతకులు దొరక్కపోయినా ఆటోను ఎక్కడో అక్కడ వదిలి పోతారు కదా!'అంటూ డ్రైవర్‌ను పోలీసులు ఓదార్చారు.

veeraji@sify.com

'పెప్పర్ స్ప్రే'లు ఎక్కడ?

హైదరాబాద్‌లో ఇటీవల ఓ యువతి ఆటోలో వెళుతూ ఆకతాయిలను 'పెప్పర్ స్ప్రే'తో ధైర్యంగా ఎదిరించి, లైంగిక వేధింపుల నుంచి సురక్షితంగా బయటపడిన వైనం ఎంతోమంది యువతులకు స్ఫూర్తిని కలిగించింది. దీంతో 'పెప్పర్ స్ప్రే'లు ఎలా ఉంటాయి? అవి ఎక్కడ లభిస్తాయి? అన్న విషయమై సాధారణ మహిళల్లో సైతం ఆసక్తి పెరిగింది. ఢిల్లీలో ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఘటన తర్వాత మహిళల భద్రత విషయమై దేశ వ్యాప్తంగా సరికొత్త చర్చకు తెరలేచింది. ఆకతాయిల వేధింపుల నుంచి సురక్షితంగా బయట పడేందుకు మహిళలు కారం పొడి పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు (మిరియాల పొడి) వంటివి నిత్యం తమ వద్ద ఉంచుకోవాలని, కరాటే వంటి యుద్ధవిద్యలు నేర్చుకోవాలని ఇటీవల పోలీసులు సూచించడం పరిపాటిగా మారింది. ఇంటి నుంచి బయటకు వెళ్లే యువతులు, ఉద్యోగినులు నేడు ఆత్మరక్షణ చర్యలపై ఆసక్తి చూపుతున్నారు. కారం పొడి పొట్లాలు మామూలు కిరాణా దుకాణాల్లో, షాపింగ్ మాల్స్‌లో లభిస్తున్నా, 'పెప్పర్ స్ప్రే'లు మాత్రం ఖరీదైన వ్యవహారమేనని మహిళలు అంటున్నారు. ఉద్యోగాలకు వెళ్లి, రాత్రి వేళ ఇళ్లకు చేరుకునే ఉద్యోగినులు 'పెప్పర్ స్ప్రే'ల కోసం ఎక్కువగా ఆరా తీస్తున్నారు. నగరాల్లోని భారీ షాపింగ్ మాల్స్‌లోగానీ, మెడికల్ షాపుల్లో గానీ ఇవి విక్రయిస్తున్న దాఖలాలు లేవు. 'పెప్పర్ స్ప్రే'ల తయారీ, విక్రయం కొన్ని దేశాల్లో తప్ప భారత్‌లో ఇంకా ఊపందుకోలేదు. ఆకతాయిలు ఎదురైనపుడు వారిపై కారం పొడి లేదా మిరియాల పొడిని చేతులతో విసరడం వల్ల అంతగా ప్రభావం ఉండదు. 'పెప్పర్ స్ప్రే'తో అయితే అత్యంత వేగవంతంగా ఘాటైన గాలి బయటకు వస్తుంది. దీంతో ఒక్క క్షణంలోనే ఆకతాయిలు ఉక్కిరి బిక్కిరై ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ కారణంగానే 'పెప్పర్ స్ప్రే'లకు అనేక దేశాల్లో డిమాండ్ పెరిగింది. ఇప్పుడిప్పుడే అవసరమవుతున్నందున మన దేశంలో వీటికి సంబంధించి మార్కెట్ ఇంకా పుంజుకోలేదు. మన నగరాల్లో సైతం ఇవి అంతగా లభించడం లేదు. దీంతో కొంతమంది ఉద్యోగినులు వెబ్‌సైట్లలో సంప్రదించి 'ఆన్‌లైన్' ద్వారా వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. 'ఆన్‌లైన్'లో ఆర్డర్ చేసినా ఇవి తొందరగా లభించని పరిస్థితి ఏర్పడింది. విదేశాల్లో ఉన్న బంధుమిత్రులను సంప్రదిస్తూ 'పెప్పర్ స్ప్రే'లను తీసుకురావల్సిందిగా కోరుతున్నామని కొందరు ఉద్యోగినులు చెబుతున్నారు. అనేక రూపాల్లో లభిస్తున్న ఈ స్ప్రే ఖరీదు 500 నుంచి 600 రూపాయల వరకూ ఉందని, ఇవి తమకు అందుబాటులో లేవని చాలామంది మహిళలు అంటున్నారు. గృహిణులు, తక్కువ జీతం వచ్చే ఉద్యోగినులు వీటిని కొనే పరిస్థితి లేదు. ఇవి చౌకధరల్లో లభించేలా ప్రభుత్వమే తగిన ఏర్పాట్లు చేయాలని మహిళలు కోరుతున్నారు. అయితే, ఇలాంటి ఖరీదైన 'స్ప్రే'ల కన్నా చౌకగా లభించే కారం పొడి పొట్లాలను తమ వద్ద ఉంచుకోవడం మేలని సాధారణ, మధ్య తరగతి మహిళలు భావిస్తున్నారు.

'సైబర్ భద్రత'పై పిల్లలకు శిక్షణ

సామాజిక వెబ్‌సైట్లలో తప్పుడు సమాచారం, ఇతరులను కించపరిచే రాతలకు సంబంధించి పాఠశాల విద్యార్థులపైనే అధిక శాతం అభియోగాలు ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయమై ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సైబర్ భద్రతపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు పోలీసులు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండడంతో పాఠశాల విద్యార్థులు సైతం సామాజిక వెబ్‌సైట్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. తప్పుడు సమాచారంతో ప్రొఫైల్స్ అప్‌లోడ్ చేయడం, అమ్మాయిల విషయమై అసభ్య రాతలు 'పోస్ట్' చేయడం వంటి చర్యలకు చాలా మంది విద్యార్థులు పాల్పడుతున్నారు. తప్పుడు ప్రొఫైల్స్ గురించి 245 ఫిర్యాదులు, ఇతరులను కించపరచడం గురించి 51 ఫిర్యాదులు తమకు అందాయని, అధిక శాతం కేసుల్లో విద్యార్థులే నిందితులు కావడం ఆందోళన కలిగిస్తోందని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. 14 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులు- సైబర్ భద్రతపై తగినంత అవగాహన లేనందున ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని నేర పరిశోధన విభాగం అధికారులు గుర్తించారు. సామాజిక వెబ్‌సైట్లను వినియోగించాల్సిన పద్ధతులు చాలామంది పిల్లలకు తెలియడం లేదు. ఇలాంటి చర్యలు విద్యార్థులకే కాదు, ఇతరులకూ హాని కలిగిస్తాయని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. 9, 10వ తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా సమావేశ పరచి సైబర్ భద్రత' గురించి పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా సమావేశ పరుస్తున్నారు. సైబర్ నేరాలపై అత్యవసర సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏప్రిల్ నాటికి ఢిల్లీలోని దాదాపు అన్ని పాఠశాలల్లో ఇలాంటి అవగాహన తరగతులు ఏర్పాటు చేస్తామని పోలీసులు ప్రకటించారు. పాఠశాల యాజమాన్యాలు, టీచర్లలో కూడా అవగాహన పెరిగితే సైబర్ నేరాల నుంచి విద్యార్థులను దూరంగా ఉంచవచ్చని వారు అంటున్నారు. కొంతమందికి శిక్షణ ఇచ్చి వారిని 'ఇంటర్నెట్ సేఫ్టీ ఆఫీసర్లు'గా పాఠశాలల్లో నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ●

ఇంతకూ.. మనం ఎటు పోతున్నాం..?

మన భారతీయ వ్యవస్థ చాలా ఏళ్ళ వరకూ గొప్పగానే వుండేది. భయభక్తులు, స్త్రీలపై గౌరవం, బాంధవ్యాలపై మర్యాద, దేవుడి మీద నమ్మకం... ఇలా పవిత్రతను, ప్రేమనూ చాటేవి. కొన్ని కొన్ని అంధవిశ్వాసాలూ, మూఢ నమ్మకాలూ తప్ప! అవి ఎప్పుడూ ఏ దేశంలోనైనా, ఏ కాలంలో అయినా వుంటాయి. పాపపుణ్యాలపై నమ్మకం, కర్తవ్యం పట్ల, వృత్తిపట్ల ఎనలేని విశ్వాసం ఇలా వుండేవి మన దేశంలో. అందుకే 'పుణ్యభూమి మన దేశం, కర్మభూమి మన దేశం' అన్నారు- మన జాతిని, దేశాన్ని కొనియాడుతూ మనవాళ్ళు. రాను రానూ పాశ్చాత్య చదువుల ప్రభావం వల్ల మన సంప్రదాయం గత వైభవం కోల్పోసాగింది. పరదేశీయుల పట్ల వ్యామోహం, వారి అలవాట్లు, వేష భాషలూ వొంట పట్టించుకోవడం మొదలై, విచ్చలవిడితనాన్ని స్వేచ్ఛగా భావిస్తూ ఆ చింతనలోనే వుండడం వల్ల అనేక రకాల ఘోరాలూ, నేరాలూ జరిగిపోతున్నాయి! ఆడపిల్లని చెల్లిగా, కాస్త పెద్ద వారైతే తల్లిగా భావించే మన దేశంలో నేడు ఆ పరిస్థితి మారింది. వయోభేదం లేకుండా లైంగిక వేధింపులతో ఎంతోమంది ఆడవారిని దారుణంగా చంపేస్తున్నారు. ఢిల్లీ మహానగరంలో జరిగిన సామూహిక అత్యాచారం ఘటనను ఇంకా ఎవరూ మరిచిపోలేదు. అనేక స్వచ్ఛంద సంస్థలు చేసిన పోరాటాలు జ్ఞాపకం వున్నాయి. అయినా ఏవో శిక్షలు ఖరారు చెయ్యడం జరిగింది ఏన్నో వాదోపవాదాల మధ్య! అలాంటి శిక్షలని ఎవ్వరూ లెక్కజెయ్యడం లేదు. భయపడడం లేదు. ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట అఘాయిత్యాలూ, అకృత్యాలూ జరుగుతూనే వున్నాయి. ఎందుకిలా?-అని ఆలోచిస్తే, కోర్టు ప్రకటించిన ఆ శిక్షలు మూర్ఖంగా ప్రవర్తించేవారికి సరిపోవేమో? 'ఎంత వాడైనా కాంత దాసుడేగా' అన్నట్టు, ఎటువంటి



కండల వీరుడైనా భయపడేది ఒక్క మృత్యువుకే! చిత్రం ఏమిటంటే ఒకరి అభిప్రాయంతో మరొకరు ఏకీభవించడం లేదు. అలా ఏకీభవించకే తెలంగాణ సమస్య ఇన్నేళ్లుగా నానుతూనే వుంది. ఏకాభిప్రాయం కావాలంటే ఎలా వస్తుంది? ఒకరు 'ఔను' అంటే మరొకరు 'కాదు' అనే సంస్కృతి ప్రబలిపోతోంది. కుటుంబాలలో కూడా ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం కుదరడం లేదు. అఫ్జల్‌గురు పార్లమెంట్ మీద దాడి చేస్తే ఆనాడు అట్టుడికిపోయిన దేశం, శిక్ష వెయ్యక ఇంత కాల యాపన ఏమిటి? చచ్చు ప్రభుత్వం, పుచ్చు ప్రభుత్వం అన్న వాళ్ళు కొందరు. ఆలస్యంగానైనా శిక్ష అమలు చేస్తే 'మరణదండన తగదు, అది తప్పు' అని వాదిస్తున్నాయి కొన్ని సంస్థలు. మరెలా? కర్ర విరగకూడదు, పాము చావకూడదులా వుంది పరిస్థితి. ఘోరమైన సంఘటనల్లో బలైపోయిన మహిళల విషయంలో ఎంతో జాలి చూపించిన వాళ్ళు, మంచి పరిష్కారాన్ని చూపలేక పోతున్నారు. 'చీకటి పడ్డాక ఆడవాళ్లు తిరగడం ఎందుకు? అనో', ఆధునిక డ్రెస్సులు వేసుకోవడం మానెయ్యండి' అనో సలహాలిస్తున్నారే తప్ప, పిచ్చి పిచ్చి ప్రేమల గురించి సినిమాలు తియ్యకండి-అని చెప్పేవారు లేరు. పాలకులూ, సెన్సార్ వాళ్లూ ఇంతే. చదువు లేకపోయినా, సంపాదన లేకపోయినా, సినిమాల్లోలాగా ఆడపిల్లల చుట్టూచేరి ఆట పట్టించడం, అవహేళన చెయ్యడం, అవమానించడం, ఒక డజను సార్లు ఆమెని వేధించి 'ఐ లవ్ యూ' చెప్పమని, పదమూడోసారి ఆ అమ్మాయి అమాంతం ప్రేమలో పడిపోవడం, పార్కుల్లో డాన్సులూ, పబ్బుల్లో డ్రింకులూ, ఊరి చివర గెస్ట్ హౌస్‌లో ఏకాంతాలూ జరిగిపోయి, ఆ తరవాత చిన్న చిన్న అపార్థాలూ, విరహాలు, మళ్లీ కలుసుకోవడాలు, కుదిరితే పెళ్లి లేకపోతే గుడ్‌బై.. ఇలాంటి సినిమాలు చూసి, ఇదే జీవితం అనుకునే అమాయక చక్రవర్తులు సాక్షాత్తూ అలాగే చేస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి చేజారిపోతున్నారు. గురువులంటే ఎవరో తెలీదు. ఈ స్థితి మారేదెట్లా? మొన్నామధ్య కొందరు పాలకులు, మహిళలు కూడా ప్రతి ఆడపిల్లా కారం పొడి పాకెట్లు, కత్తులూ దగ్గర పెట్టుకోవడంతోపాటు కరాటే నేర్చుకోవాలన్నారు. నిజమే! ఆత్మరక్షణకు అదీ అవసరమే అనుకున్నారు పాపం ప్రజలు! కానీ, ఇటీవల రెండు, మూడు రోజుల్లో విన్న వార్తలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రాత్రి 8 గంటలకు నలుగురు కూర్చున్న ఆటోలో ఆఫీసుకు వెళ్ళబోతుంటే, ఇద్దరు దిగిపోయాక ఆటోలో వున్న ఒకడు ఆ అమ్మాయి మీద చేతులు వేస్తూ పట్టుకోవడం, ఆటోవాలా ప్రవర్తన చూసి అనుమానపడ్డ ఆ అమ్మాయి ప్రాణాలకు తెగించి ఆటోలోంచి దూకి, తల పగిలి, చావుబతుకుల మధ్య ఉండగా రోడ్డు మీద పోయే కొందరు బాటసారుల పుణ్యమాని ఆసుపత్రిలో చేరింది. ఆమె దగ్గర కత్తీ, కారం పొడీ లేకపోవచ్చు.

మరి కేరళలో ఒక కుట్టి- అతనెవరో దుర్భాషలతో వేధిస్తూ వుంటే తను నేర్చుకున్న కరాటేతో వాణ్ణి చితకబాదితే (ఆమె బ్లాక్ బెల్ట్ హోల్డరట) పోలీసులు ఆమెను అరెస్టు చేసి కేసు పెట్టారట! విచిత్రం కదూ? మరెందుకు కరాటే? ఆమె ధైర్యానికి మెచ్చుకోవలసింది పోయి, కేసులు పెట్టడమా? ఇదేమిటి? ముందుకెళితే నుయ్యి, వెనక్కొస్తే గొయ్యి! ఇవన్నీ చూస్తూ వుంటే 'ఇదేనా నా దేశం? ఇదా భారతదేశం' అనిపించదా ఎవరికైనా? ■

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
బుధవారం
27, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

అమరన్ 'భక్తగణాత్మమధ్యమము లింగావాస మాలింగమ ధ్యమమం బద్య భవాండ భాండ నిలయంబైయుంపుటన్ భక్త తృప్తి మహాలింగము తృప్తమై మహిమ నుద్దీపించు దల్లింగ తృప్తిమహత్త్వంబున నీ సమస్తమును దృప్తిం బొందు సర్వేశ్వరా! భావం: సర్వేశ్వరా లింగము భక్త సమూహం యొక్క ఆత్మ నడిమి భాగంలో ఉంటుంది. ఆ లింగం నడమి భాగం బ్రహ్మాండ భాండానికి నిలయమై ఉండటం వల్ల ఆ లింగ తృప్తి యొక్క మహత్త్వంచేత ఈ సమస్తమున్నూ తృప్తిని పొందుతుంది. ఆచార లింగం, గురులింగం, శివలింగం, చరలింగం ప్రసాదలింగం మహాలింగాలని షల్లింగాలు ఇవి మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత , విశుద్ధ అజ్ఞాచక్రాలలో ఉంటవి. ఈ సృష్టి యావత్తూ మహాదేవుడి ఆజ్ఞకు లోబడిఉంది. శివాజ్ఞలేనిదే చీమైనా కదలదు అటువంటపుడు శివుడు తప్పమరేమీ లేదుకదా. అందుకనే శివుడు తృప్తి పొందితే సర్వమూ తృప్తి పొందినట్లే అవుతుంది.

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

అమ్మ

24 శ్రీ లత

అదీకాక ఇది పబ్లిక్ ఇష్యూ మ్యాటర్ చేయడం నా కిష్టం లేదు. ఇది మా ఇద్దరి పర్సనల్ మ్యాటర్‌గా నేను భావిస్తున్నాను'' అనడంతో అందరూ విస్తుబోయారు.

''అది సరే, ఇది పత్రికాఫీస్ ప్రెస్‌మీట్‌లో జరిగింది. దీన్ని పర్సనల్ ఇష్యూ అనడానికి వీల్లేదు'' అన్నారాయన.

''అందుకే నేను మీకు సారీ చెప్తున్నాను సార్. ఈసారి నా పర్సనల్ విషయాలు నా ఆఫీసు ప్రిమిసెస్‌లో జరక్కుండా చూసుకుంటాను. ఈసారికి నామీద మీకున్న అభిమానంతో ఈ ఇష్యూను ఇంతటితో వదిలేయాల్సిందిగా రిక్వెస్టు చేస్తున్నాను'' అని అడిగాడు ఎడిటర్‌ను.

ఆయనేమీ అనలేక 'ఓకే' అని భుజాలెగరేసి 'ఇలాంటి న్యూసెన్స్‌లు ఇంకోసారి నేను బేర్ చెయ్యను' అనేసి వెళ్లిపోయాడు. ఆయనటు వెళ్ళగానే అక్కడ గుమికూడిన వాళ్ళందరూ... ''భలేవారండీ అవినాష్‌గారూ, మేమేదో మీ మీద అభిమానంతో టెమ్ట్ అయితే, చక్కని గుణపాఠం చెప్పారండీ బాబూ'' అనేసి వెళ్ళిపోతుంటే ప్రతి ఒక్కరికీ విడివిడిగా సారీ చెప్పాడు.

అందరూ వెళ్లిపోయాక ఆ అమ్మాయి కొట్టిన చెంపమీద అరచేత్తో నిమిరాడు. కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

ఆఫీస్‌లో లీవ్ తీసుకుని రూమ్‌కొచ్చేశాడు.

⁘

జీవన పాపను ఒళ్ళో పడుకోబెట్టి ఊపుతోంది.

అమ్మ ఉగ్గుగిన్నెలో మందు రంగరించి జీవనకిచ్చింది. జీవన ''ఆ..'' అని నోరు తెరిచి పాప రెండు బుగ్గలు నొక్కిపట్టి నోట్లో మందు పోసింది. మందు తియ్యగా ఉందేమో పాప చప్పరించి నవ్వింది. జీవన పాపనుచూసి నవ్వింది. వసంత జీవనను చూసి నవ్వింది.

''ఏంటమ్మా నవ్వుతున్నావ్?'' అంది జీవన వసంత నవ్వటం చూసి.

''నీ కూతురి పసి చేష్టలకు నీకు వచ్చినట్లుగానే నా కూతురు పసి చేష్టలకు నాకూ నవ్వొస్తుంది'' అంది వసంత ఉగ్గుగిన్నె పక్కనపెడుతూ...

''నేనేం పసి చేష్టలు చేశానమ్మా'' అడిగింది జీవన పాపకు పక్క సరిచేసి పడుకోబెడుతూ.

''పసి చేష్టలుకాక మరేవిటీ నీ గురించి రాశాడనీ, టీవీ వాళ్ళకు ఇన్ఫర్మేషన్ ఇచ్చాడనీ ఆ అబ్బాయిని నలుగుర్లో కొట్టడం తప్పు కాదా? ఆ అబ్బాయెంత అవమానడి ఉంటాడు'' అంది వసంత.

''అతను అవమానం పడ్డాడని ఆలోచిస్తున్నావే గానీ, నన్ను, పాపనూ అతనవమానించాడని ఒప్పుకోవేంటమ్మా?'' అంది కాస్త ఆర్గ్యుమెంట్ ధోరణిలో....

''సర్లే ముందు కాఫీ తాగు' అని ఫ్లాస్క్‌లో కాఫీ కప్‌లో పోసి అందించి జీవన ఒకసిప్ చేశాక సిప్ చేస్తూ.

''సరే ఇంతకీ నాదే తప్పంటావు, నీవు కూడా సారీ చెప్పమంటావా అతనికి'' నవ్వుతూ అడిగింది జీవన.

''సారీ చెప్పమనడం తప్పుకు పరిహారం కాదు. 'అతనికి నీ విషయం తెలియదు. పాప నీ పాప అని తెలియక రాశాడు. నువ్వు అతను ఒక రిపోర్టర్ అనీ, అతనికి తోచింది సబబు అనిపించినపుడు అతనికి రాసే హక్కు ఉందనీ, తెలిసి కొట్టావు. మరి తప్పు ఇద్దరూ చేసినా తెలియక చేసే తప్పుకూ తెలిసి చేసే తప్పుకూ తేడా లేదూ?'' అంది తనూ కప్పులో కాఫీ పోసుకుని

అలా అయితే ఎంతెంతో తప్పులు చేసేసి సారీ ద్వారా తప్పించుకోవచ్చు. నీకిష్టం లేని పని ఎవరైనా చేస్తే నీ అయిష్టత వాళ్ళకు అర్థం అయ్యేలా విశదీకరించాలి తప్పితే వికృతంగా ప్రవర్తించకూడదు'' అంది వసంత రెండు కప్పులూ, సాసర్లూ ఒక మూలన పెడుతూ...

''అమ్మా నువ్వు బుద్ధుడి కాలంలో పుట్టాల్సినదానివి.. నీ అంత ఓపిక మా జనరేషన్‌కు ఉండూద్దూ? నేనూ భలే అంటించాలే.. నిన్నూ... పాపను పిలిచినట్లు పిలిస్తే ఏమవుతుందనీ'' అంది జీవన.

''అంటే'' అడిగింది వసంత.

''కుప్పతొట్టి వెధవా'', అమ్మా అబ్బా తెలీని వెధవా?'' అని.

''ఏమన్నాడు?'

''నాలాగే చెయ్యత్తి కొట్టబోయి కంట్రోల్ అయ్యాడు'' అంది జీవన.

''చూశావా... అతనికున్న కంట్రోలింగ్ పవర్ నీకెందుకు లేదు? అదే అందరిముందూ అతనూ నిన్ను కొట్టి ఉంటే ఎలా ఉండేది పర్యవసానం'' అడిగింది వసంత.

జీవన మాట్లాడలేదు, ''ఆలోచించు! ఏ విషయమైనా ఆలోచించకుండా చేస్తే తర్వాత బాధపడాల్సి వస్తుంది'' అని లోపలికెళ్ళింది వసంత.

అమ్ము ఏదయినా మాట్లాడితే తన అంతర్గతమే తన ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లుంది జీవనకు. తనూ ఒక క్షణం అలాగే అనుకుంది కానీ కొట్టి పారేసింది. ''ఒకవేళ కొట్టి ఉంటే...'' ఇక ఆపై ఊహించలేకపోయింది.

ఆరాత్రి నిద్రపట్టలేదు జీవనకు, పాప లేచి మారాం చేసినపుడల్లా వసంతే లేచేది రోజూ. ఈ రాత్రి మాటిమాటికీ లేచే పాపను జీవన సముదాయించడం చూసి వసంతనుకుంది ''జీవనకు నిద్రపట్టలేదని..''

జీవనకు కళ్ళు మూసుకుంటే చాలు కొట్టడానికి బలంగా లేచిన చెయ్యి, తన కళ్ళెదురుగ వచ్చి ఆగిపోవడం. అదే సీను రిపీట్ అయ్యి అయ్యి తనకేదో గిల్టీనెస్‌ను పేర్చింది మనసులో. తెల్లవారుజామునే వసంతను లేపి అడిగింది.

''అమ్మా అతను నన్నెందుకు కొట్టలేదంటావ్?'' అని.

''అతను నీ కన్నా ఆత్మబలం కలవాడు, అంతేకాదు పడిమందిలో ఎవరినీ అవమానించకూడదన్న వివేకం ఉన్నవాడు. జీవితంలో ఎంతో ఘర్షణకు గురైన వ్యక్తి తప్పితే ఇలా ప్రవర్తించడం ఇతరులకు కుదరదు''అని. ''సర్లే ఇక పడుకో'' అంది

కానీ అతను దెబ్బ ఆపడం, వసంత మాటలూ జీవనను బాగా కలతపెట్టాయి

-ఇంకాఉంది

155 రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

వానర వీరులు తమ తమ సత్త్వములు తెలుపుట

అంగదుడు కినిసి ఆ కరణి ప్రశ్నింపవానరు వీరులందరూ తమ తమ సత్త్వసంపదలు తర్కించుకొని ఒక్కొక్కరే ఈ విధంగా వాకొన్నారు.

గజుడు అనే కపి నేను పదియోజనాలు దుముకగలనన్నాడు. గవాక్షుడు ఇరవై ఆమడలు లంఘించగలనని పలికాడు. గవయుడు నాలావు కలిమితో ముప్ఫయి ఆమడల దవ్వు దాటగల్గుతానన్నాడు. తన శక్తికొలది నలభై యోజనాలు పోగలనని శరభుడు వచించాడు.

గంధమాదనుడు యాభై ఆమడలు సంద్రము దాటుతాన్నాడు. మైందుడు అరవై యోజనాలు, ద్వివిదుడు డెబ్భై యోజనాలు దాటనోపుతామని వాకొన్నారు. మహావీరుడైన తారుడు తాను ఎనుబది యోజనాల మేర లంఘిస్తానని పలికాడు. తమ తమ శక్తులు దాచుకోక కపివీరులు ఏపుగా ఈ గతి పలుకుతూ వుండడం బహుకాల వృద్ధుడు భల్లూకనాథుడు, లోకాతీత విక్రముడు జాంబవంతుడు ఒక మాట చెప్పాడు.

''నా చిననాటి బలం చెప్పవస్తే హాస్యకారణం అవుతుంది. అయినా వానరవీరులారా! వినండి. నేను బ్రహ్మదేవుడి ఆవులింత నుంచి జనించాను. అమృతం కొరకు దేవదానవులు సమరాలు సల్పుతూ వుండగా అమరుల సహాయార్థం వచ్చి ఆ దేవతలొసగిన అమృతం క్రోలాను. సప్త సముద్రాలు దాట సమర్థుడిని అయి ఉదయ పర్వతం పయినుంచి అస్తగిరి మీదకి ఒక జంఘ పెడుతూ వుండేవాడిని. ఈ లోకాల్లో నాకు ఎదురే లేక వర్తించాను. త్రివిక్రముడు బలి చక్రవర్తిని బంధించేనాడు ఇరవై ఒక్క మారులు ఆ దేవుడికి ప్రదక్షిణాలు కావించి, సేవించే తరిని కొండ కాలిలోవిరిగింది. కాలం గడచిన కొలదీ జరాభారంమీద పడింది. అరసి చూడ మూడు కాళ్ళ ముదుసలిని అయాను. నేను తొంభై ఆమడలు మించి దుముకలేను. ఈ రామకార్యం నెరవేర్చ శక్తుణ్ణి కాను''అని వాక్రుచ్చాడు. అంగదుడు నూరు యోజనాల జలధీ లంఘిస్తాను. కాని మరలిరా సమర్థుణ్ణి కాను'' అన్నాడు. అప్పుడు జాంబవంతుడు ''అంగదా! మాకు అందరకూ అధిపతివి ఈ ఉదధి దాటజాలు తానుకాని మరలి రానేరనంటావు. ఈ వానర వీరులకు సుగ్రీవుడి తర్వాత రాజువి. మాచే పనికొనదనునుగాని ఈ వడువున పలుక పాడియా? నీకింత దైన్యం ఏల? రామకార్య పరాయణుడు, సుగ్రీవుడి మంత్రి, అసమాన పరాక్రమ సంపన్నుడు, ఈ వానరులందరికీ ప్రాణము అయిన వాయు కుమారుడు వుండగా నీకు అసాధ్య కార్యాలు వుంటాయా?'' అని వాకొని రామభక్తుడు హనుమంతుణ్ణి పిలిచి, అతడితో ఈ కరణి ప్రియవాక్యాలు పలుకదొడగాడు.

జాంబవంతుడు హనుమంతుని ప్రార్థించుట

''మారుతీ? రామకార్యం మా పయిని వేసి ఊరక మిన్నకుండడం నీకు వుచితమా? అప్సరసలలో లలితలావణ్య విలాసాలతో విలసిల్లే 'పుంజికస్థలి' అన ఒప్పే నీ జనని అంజిన మున్ను అగ్నిదేవుడి శాపంవల్ల వానర వనిత అయి జన్మించింది. కేసరికి అర్ధాంగి అయి తనరారింది. ఆ అంజనాదేవి ఒకనాడు గిరి వనస్థలాల్లో విహరిస్తూ వుంది. వాయుదేవుడు ఆ అంజన గజయానం, చంద్రబింబాన్ని త్రోసిరాజనే నెమ్మోము, కలదు లేదనే కాను, తల చుట్టి వచ్చే తళుకు బెళుకుల కనుగవ, పీనవక్షస్థలమూ కనుగొని, మరులుకొని మన్మథ శరభిన్న మానసుడు అవుతూ అంజనను దరసి ఆలింగనం చేసుకొన్నాడు. అప్పుడు ఆ అంజనాదేవి కుపితయైన నా పాతివ్రత్య మహిమ పాడుచేయ సమకట్టి, ఏ దుష్ట బుద్ధి ఇట్లు చేశాడో?'' అన ''ఓ అంజనా! అలుగకు. నేను వాయుదేవుడిని. నీ పాతివ్రత్య మహిమకి భంగం కలిగించకుండా హృదయ సంగం చేశాను.

-ఇంకాఉంది

బుధవారం, 27 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: బహుళ విదియ రా.01.22
నక్షత్రం: ఉత్తర ఫల్గుని రా.02.44
వర్జ్యం: ఉ.09.56 నుండి 10.32 వరకు
దుర్ముహూర్తం: మ.12.05 నుండి 12.52 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం ఉండొచ్చు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగశిర 1,2పా):
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు ప్రారంభించుట మంచిది కాదు. మార్పులవల్ల ఆందోళన చెందుతారు.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. విజయాన్ని సాధిస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీయుల సహాయ సహకారాలందుతాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో సహనం వహించక తప్పదు. అప్రమత్తత అవసరం.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు. సమస్యలు పరిష్కరించుకుంటారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందులు అధిగమిస్తారు. వ్యతిరేక ఫలితాలు కలుగవచ్చు. నూతన కార్యాలు ప్రారంభించరాదు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
బంధు, మిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. వృథా ప్రయాణాలెక్కువగా ఉంటాయి. దైవ ప్రార్థన చేస్తారు.

మంచిమాట

మనస్సు

మనస్సులో వున్నదిమూడు అక్షరాలే అయినా విశాలమైన ఆ మనస్సు ముల్లోకాలనూ చుట్టిరాగలదు. మనస్సుకు అందని ఊహలు, చేయని ఆలోచనలు వుండవు. మనస్సు క్షణంలో రెక్కలు కట్టుకొని ఎక్కడెక్కడో విహరించిరాగలదు. కోతిలా చిత్ర విచిత్రంగా శాఖాచంక్రమణం చేయగలదు. మనస్సుకు నిలకడ తక్కువ. చంచలమెక్కువ. మనస్సు మనసుగా తేలికగా కూడా పిలవబడుతుంది. మనస్సు ఎంత బరువై మనిషిని క్షోభ పెట్టగలదో అంత తేలికగానూ వుండి ఉర్రూతలూగించగలదు. మనస్సును గురించి పరిశోధనలు జరిపిన మనస్తత్వ శాస్త్రజ్ఞులున్నారు.

ఈ పరిశోధనలు రుగ్మతలకు చికిత్సలుగా కూడా ఉపయోగపడతాయి. ఇతరుల మనస్తత్వాన్ని అంచనా వేసుకోవడానికి దోహదపడతాయి. మనస్సును గురించి రాయబడిన కవితలు, పాటలు సామాన్య ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటూ ప్రభావితం చేయగలుతున్నాయంటే దానికి ఆ కవుల రచనా శిల్పమే కారణం. మనస్సుకు భాష లేకపోవచ్చు కానీ భావాన్ని వ్యక్తీకరించే శక్తి వుంది.

మనస్సు చేసే ఆలోచనలను, మనస్సులోని భావాలను ముఖం ప్రతిబింబపజేస్తుంది. మనస్సు నిర్మలంగా వుంటే ముఖం ప్రశాంతంగా వుంటుంది. మనస్సులో ఆందోళన వుంటే ముఖంలో అలజడి కనిపిస్తుంది. మనస్సు భాష మనస్సుకు మాత్రమే తెలుస్తుంది. పంచేంద్రియ జ్ఞానాలకు లోబడకుండా వుండే జ్ఞానాన్ని సిక్స్త్ సెన్స్‌గా దేన్నైతే అంటున్నారో అది మనస్సు వెల్లడించే భాష.

పసిపాపకు భాష రాదు, లేదు. అయినా మనస్సు వుంటుంది. తల్లికి తన హావభావాలద్వారా సంకేతాలనందిస్తుంది. భాష రాని ఆ పసిపాప పరుల సంకేతాలను కూడా అందుకుని తన ఇష్టానిష్టాలను వెల్లడిస్తుంది. ఇలా మనస్సుయొక్క మహత్త్యం విచిత్రమైనది. మనస్సును ఉప్పొంగిపోనీకుండా, ఉసూరుమనిపించ నీయకుండా, ఉండడం స్థితప్రజ్ఞ లక్షణమని, ఆ విధంగా తటస్థంగా వుండమని పెద్దలు చెబుతూ వుంటారు. ఆనందాలు, ఆవేశాలు సామాన్య మానవులకు సహజమైనవి, వాటిని సరిగా వ్యక్తం చేయలేకపోతే కుమిలిపోయి బాధపడిపోవలసి వస్తుంది. ఫలితంగా అనారోగ్యాన్ని, అశాంతిని ఎదుర్కోవలసివస్తుంది.

రకరకాల ఒత్తిడులతో అనారోగ్యానికి గురి అవుతున్నవారే దీనికి సాక్ష్యం. ఆలోచనలను నిరోధించడం అసాధ్యం కానీ చెడు ఆలోచనలవైపు మనస్సును మళ్లనీయకుండా చూసుకోవడం అవసరం. మనస్సును మంచి ఆలోచనలవైపు, మంచి వ్యాపకాలవైపు మళ్ళించి ప్రలోభాలకు, దుష్ప్రభావాలకు, చెడు ఆలోచనలవైపు పోనీయకుండా అదుపులో వుంచుకోవడం మన చేతుల్లోనే వుంటుంది. అయితే కుటుంబ పరిస్థితులు, సమాజపరంగా వచ్చే సమస్యలను ఎదుర్కొనగలగడమన్నది మన చేతుల్లో పూర్తిగా వుండదు.

వాటిని నేర్పుగా పరిష్కరించుకోగలగడమో, ఉన్న పరిస్థితులను సానుకూలంగా మార్చుకుని ఆనందంగా వుండడమో చేయగలగాలి. సుహృద్భావ వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలి.

-కె.లక్ష్మీ అన్నపూర్ణ

వృతాసురుడు 33

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 26

మాటాట

ఆధారాలు:
అడ్డం
1. ఇది ఆపాతమధురం
3. జలుబు
4. శివుని ఆయుధం
8. పేదవాడు
9. విశ్వదాభిరామ శతకకారుడు
11. ఇల్లు
13. శివుడు
14. ఏనుగు

నిలువు
1. అల్లికాడు దేహంలోని నరం
3. పర్వతం
5. కొర్రు
6. జన్మదినం
7. అవమానం , పరాభవం
10. ఆలోచన
11. హరిహారసం
12. హర్షం,సంతోషం

మాటాట - 25 సమాధానం



● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు.
రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి.
మూడు అరతావులకు తగ్గకుండా వుండాలి.
ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

sanjeevani@andhrabhoomi.net

సంజీవిని

11
ఆంధ్రభూమి
బుధవారం
27, ఫిబ్రవరి
2013

మన ఆరోగ్యం మనచేతుల్లోనే...

ప్రకృతిపరంగా దొరికే ఆహారపదార్థాలను తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడుల నుండి తప్పించుకునే వీలుంది. ఎప్పుడైతే ప్రకృతిపరంగా దొరికే ఆహారపదార్థాలను తీసుకోవడం జరుగుతుందో దానివల్ల కడుపులో మంట, ఎసిడిటీ వంటివి శరీరాన్ని బాధించే వీలుండదు. కేవలం మానసిక ఆందోళన, ఒత్తిడిలను అధిగమించేందుకే కాకుండా మనసును, శరీరాన్ని మన స్వాధీనంలో ఉంచుకోవాలంటే సాధన అనేది చాలా అవసరం. దేనిని సాధించాలన్నా పట్టుదల కూడా అవసరం. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందనే ప్రాథమికసూత్రాన్ని మరువకుంటే చాలు. ఏ ఒత్తిడులు, ఆందోళనలు మనల్ని బాధించవు, దరిచేరవు. ★

రక్తసంబంధమంటే అదే మరి!

బిరువు బాధ్యతలు మోయాల్సిన పెద్దకొడుకు 73 ఏళ్ళ కన్నతండ్రిని ఆస్తికోసం హతమార్చాడు. తన బావమరిదితో కలిసి ఈ దారుణానికి ఒడికట్టాడు. తలకొరివి పెట్టి రుణం తీర్చుకోవాల్సిన ఆ కుమారుడు ఇప్పుడు కటకటాలపాలై ఊచలు లెక్కిస్తున్నాడు.

ఒక అన్న తన తోడబుట్టిన తమ్ముడు, అతని భార్యను కక్షగట్టి కుట్ర చేసి దారుణంగా నరికి చంపాడు. సహచరుల సహాయంతో ఒక పాడు బావిలో పడేశాడు. మరొక సహోదరి తన అన్న పిల్లలను చిత్రవధ చేసి, చంపడానికి ప్రయత్నించి పోలీసులకు పట్టుబడింది. ఇంకొక వ్యక్తి ఆస్తి తగాదాల్లో కక్షగట్టి, కుమారులతో కలిసి అన్న భార్యను గడ్డపారతో తలమీద కొట్టి చంపేశాడు.

ఒక వృద్ధురాలు పెద్దకొడుకు, కోడలు పెట్టే బాధలు చేసే హేళనలు సహించలేకపోయింది. సమయానికి మందులు, ఆకలి వేసే భోజనం దొరక్క నానా హింసలు అనుభవించింది. మనసు విరిగి, అలిగి ఉన్న ఒక్కగానొక్క కూతుర్ని ఆశ్రయించింది. కూతురి రక్షణలో ఆఖరి రోజుల్ని సుఖంగా గడిపి, కన్ను మూసింది. అయితే హృదయంలేని కొడుకు కనీసం ఆఖరి చూపులకు వెళ్ళలేదు. ఇంకొకచోట తల్లి తనను సరిగా చూడలేదని పెద్దకూతురు అలిగిపోయింది. చెల్లెల్లి బాగా చదివించి, మంచి సంబంధం చూసి పెళ్లి చేసిందని అపోహ పెంచుకున్నది. అమ్మతో మాట్లాడటం మానేసింది. ఆమె చనిపోయినా వెళ్లి చూడలేదు. కనీసం రెండు కన్నీటి చుక్కలైనా కార్చలేదు. ఇలాంటి వార్తా కథనాలు రోజూ దర్శనమిస్తుంటాయి.

రాబంధులా?

మానవ సమాజం జంతు సమూహానికి భిన్నమైనది. ఇక్కడ రక్తసంబంధం, అనుబంధం, ప్రేమ, అనురాగం, సేవ, సహకారం లాంటి మానవీయ గుణాలు పునాదిగా ఉంటాయి. అయితే కొంతమంది జంతువుల్లా, రాబంధుల్లామారి స్వంత మనుషులనే పీక్కుతింటున్నారు. రక్త సంబంధమన్నది మానవ సృష్టిలో చాలా విలువైనది. తల్లిదండ్రులు ఎంతో ఆప్యాయతతో, ప్రేమతో, కరుణతో పిల్లల్ని పెంచి పెద్ద చేస్తారు. మమత, మమకారాలను రంగరించి వృద్ధి చేస్తారు. చదువు, ఉద్యోగం, పెళ్లి అంటూ తపించి సర్వం ధారపోస్తారు. చాలా సందర్భాలలో ఆస్తులు, ఆరోగ్యం పాడు చేసుకుని పిల్లలకు సర్వం సమర్పిస్తారు. తమకు చేతనైనంత వరకు కృషి చేస్తారు. అయితే ఆ పిల్లలు చదివి, ఉద్యోగం సంపాదించి, పెళ్లి కాగానే తల్లిదండ్రుల్ని విస్మరిస్తుంటారు. అలా విస్మరించడానికి అడ్డగోలు ఆరోపణలు చేస్తుంటారు. తమను సరిగా పెంచలేదని, ఆస్తిపాస్తులు ఇవ్వలేదని ఏవో కుంటిసాకులు చూపుతుంటారు. లేదా తమ బ్రతుకు తాము చూసుకోవాలని, తమ పిల్లల్ని పెంచుకోవాలని తలపోస్తారు. రకరకాల స్వార్థాలను తలకెక్కించుకుని కన్నవారిని, తోడబుట్టినవారిని గాలికి వదిలేస్తుంటారు. కొంతమంది కక్షలు, కార్పణ్యాలు పెంచుకుని ద్రోహం చేస్తుంటారు. మరీ బరితెగించిన వారు హత్యలకు వెనకాడరు. ఇలాంటి పెడధోరణులు విపరీత బుద్ధులు రావడం మానవత్వానికి మచ్చగా పరిణమిస్తున్నది.

విలువలు కాపాడాలి

ఆధునిక సమాజంలో మానవీయ విలువలు దిగజారి ఆర్థిక విలువలు పెరుగుతున్నాయి. ప్రతి వారు ఆశలు ఆకాంక్షలు, లక్ష్యాలు కలిగి వుండటంలో తప్పులేదు. ఒక వ్యక్తి ఉన్నత స్థితిని కోరుకోవడం, చేరుకోవడం ఎవరికీ ముప్పు కాదు. అయితే అతను ఎంచుకునే దారి తప్పకూడదు. డబ్బు, ఆస్తి, పదవి, హోదాల కోసం విలువలు, ధర్మాలు కాలరాయకూడదు. బాధ్యత, రుణం లాంటి అంశాలను ఎప్పటికీ విస్మరించకూడదు. ప్రతి వ్యక్తి మానసిక క్రమశిక్షణను అలవర్చుకోవాలి. మానవీయ ధర్మాలు, ఆచారాలు, పద్ధతులు, ప్రమాణాలను పాటించాలి. సాంఘిక జీవనం, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి. ఒక మంచి మనిషిగా జీవించాలి. కుటుంబ సంబంధాలు, రక్త సంబంధాలు అన్నింటికంటే విలువైనవని గుర్తించాలి. మనిషి మనిషిగా జీవించి మరణించాలి. మరణించిన తరువాత అయినవారు బంధువుల రక్తసంబంధీకుల మనసుల్లో జీవించాలి.

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి
Psychologist
nbsreddi@gmail.com
18-4-111/2, రైల్వే కాలనీ,
తిరుపతి - 517 501.

హార్మోనుల సమతుల్యతను కాపాడటానికి మంచి ఆహారాన్ని తీసుకోవాలి. తాజా కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు వంటివి నిత్యం తీసుకోవాలి. ఒత్తిడిలేని మంచి జీవన విధానాన్ని కొనసాగించుటకు ప్రయత్నించాలి. ముఖ్యంగా మానసిక ఒత్తిడిని తగ్గించటానికి యోగ, మెడిటేషన్, వ్యాయామం నిత్యం చేయాలి. బరువున్న వారు క్యాలరీలు తగ్గించుకునేటువంటి వ్యాయామాలు నిత్యం చేయాలి. ఇలా చేయడం వల్ల అధిక రుతుస్రావం నుంచి బయటపడవచ్చు.

అధిక రుతుస్రావమైతే...?

ఈమధ్యకాలంలో చాలామంది 'అధిక రుతుస్రావం'తో బాధపడుతున్నారు. దీనినే వైద్య పరిభాషలో మెనోరేజియా అంటారు. అధిక రుతుస్రావంవలన రక్తహీనత, నిస్త్రాణ, సంతానలేమి వంటి పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి సలహా తీసుకోవాలి.

కారణాలు: మానసిక ఒత్తిడి, గర్భకోశంలో ఫైబ్రాయిడ్స్ ఏర్పడుటవలన, జన్యు లోపాలు, ఈస్ట్రోజన్, ప్రొజిస్టిరాన్ హార్మోనుల అసమతుల్యత.

లక్షణాలు: -రుతుస్రావాలు ముందుగానే రావడం, ఎక్కువ రోజులు కావడం, బహిష్టు సమయంలో రక్తస్రావం ఎక్కువగా ఉండి బాధించడం.

-గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్ పెద్దగా ఉన్నప్పుడు బహిష్టు సమయంలో కాకుండా మధ్యమధ్యలో రక్తస్రావం ఎక్కువ కావడం.

-కొన్ని సందర్భాలలో రక్తస్రావం ఎక్కువ కావడంవలన గర్భం ధరించినా గర్భస్రావం జరిగిపోవటం జరుగును.

-పొత్తి కడుపులో నొప్పి తీవ్రంగా ఉండును. పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం జరుగును.

-బరువు పెరుగుట, మానసికంగా చికాకుగా ఉండటం.

జాగ్రత్తలు: -హార్మోనుల సమతుల్యతను కాపాడటానికి మంచి ఆహారమును అనగా తాజా కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు వంటివి నిత్యం తీసుకోవాలి.

-ఒత్తిడిలేని మంచి జీవన విధానమును కొనసాగించుటకు ప్రయత్నించాలి. ముఖ్యంగా మానసిక ఒత్తిడిని తగ్గించటానికి యోగ, మెడిటేషన్, వ్యాయామం నిత్యం చేయాలి.

-బరువున్న వారు క్యాలరీలు తగ్గించుకునేటువంటి వ్యాయామాలు నిత్యం చేయాలి.

-అధిక ప్రొటీన్ ఉండే ఆహారమును తీసుకోవాలి. రక్తస్రావం ఎక్కువగా ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి సలహా తీసుకోవాలి.

చికిత్స: హోమియో వైద్యంలో 'అధిక రుతుస్రావం'కి మంచి చికిత్స కలదు. వ్యక్తి శరీరతత్వం, మానసిక లక్షణాలు వ్యక్తి అలవాట్లు మరియు ఆలోచన విధానమును ఆధారం చేసుకొని మందులను ఎంచుకొని చికిత్స చేసిన హార్మోనులు సమతుల్యంగా పనిచేసి 'అధిక రుతుస్రావం' సమస్య నుండి విముక్తి పొందవచ్చును.

మందులు: క్రోకస్:రుతుస్రావం నెల పొడవున ఉండేవారికి ఈ మందు ఆలోచించదగినది. శారీరక బాధలు, మానసిక బాధలు ఒకటి మార్చి ఒకటి వస్తూ వుంటాయి.

సెబైనా:రుతుస్రావం ఎక్కువగా ఉంటుంది. వెన్ను నుండి పొత్తి కడుపులోకి నొప్పి వ్యాపించును. స్రావాలు నీరులాగా పలుచగా ఉండును. నల్లటి కండలు కూడా పడుతుంటాయి. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పనిసరిగా ఆలోచించదగినది.

కాల్కేరియా కార్బ్:రుతుస్రావాలు ముందు వచ్చి ఎక్కువ రోజుల పాటు అవుతుంటాయి. వీరికి తెలుపు ఎక్కువగా అవుతుంటుంది. ఊబకాయంతో ఉండి తలకు చెమటలు ఎక్కువగా పడుతుంటాయి. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు ప్రయోజనకారి.

చైనా: రుతుస్రావాలు ఎక్కువగా ఉండి నిస్త్రాణ ఎక్కువగా ఉన్నవారికి ఈ మందు బాగా పనిచేయును.

ఈ మందులే కాకుండా బెల్లడోనా, ఫాస్ఫారస్, నక్స్‌వామికా, ఇపికాక్ వంటి మందులను లక్షణాలాధారంగా వాడుకొని అధిక రుతుస్రావం సమస్య నుండి బయటపడవచ్చును.

డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
సెల్‌నెం. 9440229646
హోమియోఫిజిషియన్, అంజనా హోమియో క్లినిక్ ఇం.నెం. 7-1-62/1
శ్రీదేవి థియేటర్ వెనుక, బస్టాండ్‌రోడ్
హన్మకొండ, వరంగల్-506001
E-mail: drpsreedhar@ymail.com

గృహ చికిత్సలు

చర్మంమీద నలుపు రంగు మందపాటి ముడుతల్ని తగ్గించే లేపనం (జిడ్డు చర్మం కలిగినవారికి)

పదార్థాలు: వేప బెరడు చూర్ణం అరచెంచా, అతిమధురం వేరు చూర్ణం అర చెంచా, చందనం పొడి అర చెంచా, త్రిఫలాల చూర్ణం అర చెంచా, మంజిష్ఠవేరు చూర్ణం పావు చెంచా, నీళ్ళు తగినంత (పేస్టులా కలపడానికి)

తయారీ, వినియోగం: ఒక పాత్రలో వీటిని తీసుకోండి. వేప బెరడు చూర్ణం అరచెంచా, అతిమధురం వేరు చూర్ణం అర చెంచా, చందనం పొడి అర చెంచా, త్రిఫలాల చూర్ణం అర చెంచా, మంజిష్ఠ వేరు చూర్ణం పావు చెంచా నీళ్లతో కలిపి పేస్టులాగా తయారుచేయండి. దీనిని చర్మపు ముదురుముడతల మీద లేపనం చేసుకోండి. ఇలా ప్రతిరోజూ నలభై రోజులపాటు చేస్తే చర్మపు ముడుతల్లోని నలుపుదనం తగ్గుతుంది. ఇది జిడ్డు చర్మం కలిగినవారికి బాగా పనిచేస్తుంది.

అలసటకు కారణం...హార్మోన్ల లోపమా?

మనకి శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. ఈ లక్షణాలన్నీ అరోగ్యానికి చెందినవి కాకపోవచ్చు. శరీరంలో కొన్ని లోపాలని మనకు తెలియజేయాలి అన్నట్లు కొన్ని లక్షణాలు కనిపించవచ్చు. ఈ లక్షణాలు అకారణంగా ఉన్నా, చాలాకాలంగా బాధిస్తున్నా, వీటితోపాటు ఇతరత్రా ఆరోగ్య సమస్యలు బాధిస్తున్నా, ఈ లక్షణాలవల్ల దైనందిన జీవితం కష్టమవుతున్నా వెంటనే వైద్యుల సలహా తీసుకోవలసిన అవసరం ఉంది.

ఉదాహరణకి అలసట అనేది ఎక్కువగా పనిచేస్తే రావచ్చు. ఒత్తిడివల్ల రావచ్చు. ఈ లక్షణాలు తగ్గకుండా ఉంటే మనం తప్పకుండా వైద్యుడికి చూపించుకోవాలి. కొన్ని మనకి సాధారణ లక్షణాలుగా కనిపిస్తాయి గానీ వాటికి, 'ఎండ్రోక్రైన్' వ్యవస్థకి సంబంధించిన కారణాలకి సంబంధం ఉండవచ్చు.

అలసట, శక్తిహీనత: మనందరికీ ఒక రోజు కాకపోతే మరొక రోజు అలసట, నిస్సత్తువ లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇవి కారణం లేకుండా కనిపిస్తే వాటికి ఎండోక్రైన్ వ్యవస్థలోపం కారణం కావచ్చు. హైపోథైరాయిడిజం లేదా హైపర్ థైరాయిడిజం కావచ్చు, హైపర్ కాల్షిమియా అదుపులో లేని డయాబెటిస్, హైపోగొనడిజం, హైపోపిట్యూటిజం, హైపోఎడ్రినలిజం. కుషింగ్స్ సిండ్రోమ్, విటమిన్-డి లోపం లాంటివి కారణాలుకావచ్చు. హైపర్ థైరాయిడిజం, ఫియోక్రోమోసైటోమా లాంటి హార్మోన్ సమస్యల వలన కలిగే ఇబ్బందులవల్ల ఆదుర్దా, చెమటలు పట్టడం, పొట్టలో నొప్పి, తలనొప్పి, బరువు తగ్గడం, గుండెదడ లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కుంగిపోవడం-కుంగిపోవడం అనేది కేవలం మానసిక సమస్యే కాదు. కొన్ని హార్మోన్‌ల లోపంవల్ల ఈ స్థితి కలుగవచ్చు. హైపోథైరాయిడిజం కావచ్చు. హైపర్ కాల్షీమియా, కుషింగ్స్ సిండ్రోమ్, హైపోగొనడిజం, హైపోపిట్యూటరిజం కావచ్చు... వీటిలో ఏదైనా కావచ్చు.

కండరాల నొప్పి: దీనికి హైపోథైరాయిడిజం, విటమిన్-డి లోపం కార్టికోస్టెరాయిడ్ సమస్యలు కారణం కావచ్చు. కొన్నిసార్లు కొలెస్ట్రాల్ సమస్యలకి వాడే స్టాటిన్స్ కారణం కావచ్చు.

పాలియూరియా, నొక్టూరియా: మూత్రవిసర్జన ఎక్కువగా అవ్వడం, రాత్రిళ్ళు తరచూ మూత్రంకోసం నిద్రలేవడం.. ఎక్కువ దాహం కావడం. ఇవి డయాబెటీస్ ఉన్న వాళ్ళలో సాధారణంగా కనిపించే లక్షణాలు. అలాగే హైపర్ కాల్షీమియా (అంటే రక్తంలో కాల్షియమ్ ఎక్కువవ్వడం) కూడా ఈ లక్షణాలకు కారణం కావచ్చు. కొన్నిసార్లు వాసోప్రెసిన్ లోపంవల్ల కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి.

తీవ్రంగా చెమటలు పట్టడం: హైపర్ థైరాయిడిజం, ఫీయోక్రోమోసైటోమా, కార్సినాయిడ్ సిండ్రోం, ఒవేరియన్/టెస్టిక్యులార్ ఫెయిల్యూర్, మెనోపాస్, గ్రోత్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అవటం ఇందుకు కారణాలు. ఫెయింట్స్ అండ్ ఫిట్స్ లాంటి లక్షణాలు- ఇవి ఫియోక్రోమోసైటోమా, ఎడ్రినల్ గ్లాండ్ ట్యూమర్స్, కార్సినాయిడ్ సిండ్రోమ్‌వల్ల, హైపర్‌థైరాయిడిజంవల్ల, ఇన్సులినోమా, పిట్యూటరీ గ్రంథుల్లో రక్తస్రావం కావడంవల్ల కలుగవచ్చు. జుట్టు రాలిపోవడం-దీనికెన్నో కారణాలున్నాయి. ఎండోక్రైన్ కారణాలేమిటంటే హైపోథైరాయిడిజం, కుషింగ్స్ సిండ్రోమ్, ఎడిసన్స్ డిసీజ్, పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్, హైపోగొనడిజం, హైపోపిట్యూటరిజం.

ఆడవాళ్ళలో ముఖంమీద వెంట్రుకలు: పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్, ఎడ్రినల్ గ్రంథుల్లో ఒక తరహా హార్మోన్ లోపం, కుషింగ్స్ సిండ్రోమ్, ఎడ్రినల్ గ్రంథులు, ఓవరీలో కణుతులు రావడం కారణం కావచ్చు.

అంగస్తంభన కలగడపోవడం: డయాబెటిస్, హైపోగొనడిజం, పిట్యూటరీ గ్రంథుల నుంచి ప్రొలాక్టిన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి కావడం, థైరాయిడ్ సమస్యలవలన, హైపోపిట్యూటరిజం ఎండోక్రైన్ కారణాలు. ముఖం వెలిసినట్లవడం-దీనికి హైపోథైరాయిడిజం, హైపోపిట్యూటరిజం లేక హైపోగొనడిజం కారణాలు.

బరువు పెరగడం: హైపోథైరాయిడిజం, కుషింగ్స్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్, గ్రోత్ హార్మోన్ తగ్గడం, హైపోథలామిక్ డిజార్డర్స్ కారణాలు కావచ్చు.

బరువు తగ్గడం: కారణం లేకుండా బరువు తగ్గడానికి ఎండోక్రైన్ కారణాలు హైపర్ థైరాయిడిజం, హైపోఎడ్రినలిజం, హైపోపిట్యూటరిజం, డయాబెటిస్, ఫియోక్రోమోసైటోమా.

ఎక్కువగా నల్లబడటం: ఎడిసన్స్ డిసీజ్, కొన్ని రకాలైన కుషింగ్స్ సిండ్రోమ్ దీనికి కారణం కావచ్చు. విరోచనాలు ఎక్కువ లేదా సరిగ్గా కాకపోవడం. థైరాయిడ్ సమస్యలు, కాల్షియం సమస్యలు, డయాబెటిస్ వలన నరాలు దెబ్బతినడం, కార్సినోయిడ్ సిండ్రోమ్ ఈ సమస్యలు కలుగజేస్తాయి. బయటున్నప్పుడు ఎక్కువ రక్తస్రావం అవడం- ఇతర మెన్‌సస్ సమస్యలు థైరాయిడ్ సమస్యలవల్ల, ప్రోలాక్టినోమా, హైపోపిట్యూటరిజం, హైపోథలామస్ సమస్యలు, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిం డ్రోమ్, ఎనొరెక్సియా, ఓవరీస్ ఫెయిల్ అవ్వటం, కుషింగ్స్ సిండ్రోమ్ లాంటివి కారణాలు.

తలనొప్పి చూపుల్లో తేడాలు: ఈ రెండు లక్షణాలు, పిట్యూటరీ గ్రంథిలో కంతులు ఏర్పడటంవల్ల డయాబెటిస్ అదుపులో ఉండకపోవడం వల్ల రావచ్చు. ఏఏ ఎండోక్రైన్ గ్రంథులవల్ల ఎలాంటి సమస్యలొస్తాయో తెలుసుకుంటే ప్రజల్లో ఎండ్రోక్రైన్ సమస్యల గురించి అవగాహన వస్తుంది. సాధారణంగా ఈ లక్షణాల్ని పట్టించుకోరు. చెప్పొచ్చేదేమిటంటే ఇలాంటి లక్షణాలున్నప్పుడు మీ దగ్గరలోని వైద్యుడి దగ్గరకు వెళ్లి చూపించుకోవడం అవసరం. ★

-డాక్టర్ రవిశంకర్ ఇరుకులపాటి
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్
drravihormones@yahoo.com
Cell: 7702777305

మరుగుజ్జు రూపానికి కారణాలివే...

మరుగుజ్జుతనానికి అనేక వ్యాధులు, స్థితులు కారణమవుతాయి. వీటిల్లో చాలావరకూ ఎముకలు సాధారణ రీతిలో పెరగకపోవటం గాని, అభివృద్ధి చెందకపోవటంగాని జరుగుతాయి. ఈ వ్యాధులను లేదా స్థితులను అన్నిటినీ స్కెలిటల్ డిస్‌ప్లేసియాస్ అనీ, కాండ్రో డిస్ట్రఫీస్ అనీ వ్యవహరిస్తారు. ఇటువంటి వాటిని దాదాపు 100 రకాలను ఇప్పటివరకూ గుర్తించారు. వీటన్నిటిలోనూ ఎకాండ్రోప్లేసియా అనేది ఎక్కువగా కనిపిస్తుంది.

ఎకాండ్రోప్లేసియా అనేది జన్యుపరంగా ప్రాప్తించే స్థితి. మరుగుజ్జుతనం లేదా పొట్టిదనానికి ప్రధాన కారణం. ఈ వ్యాధిలో ఎముకలు, ఎముకల మధ్యనుండే మృధులాస్థి సక్రమంగా, సమస్థితిలో పెరగవు. దీనితో, ఈ వ్యాధి కలిగినవారు నాలుగు అడుగులకు మించి పెరగరు. ముఖ్యంగా హ్యూమరస్ (భుజానికి, మోచెయ్యికి మధ్యనుండే ఎముక), అలాగే ఫీమర్ (తుంటికి మోకాలుకు మధ్యనుండే ఎముక) పూర్తి స్థాయిలో పెరగవు. ప్రపంచవ్యాప్తంగా చూసినట్లయితే ప్రతి పదిహేను వేల నుంచి ఇరవై వేల మంది శిశువుల్లోను ఒకరు ఈ రకమైన స్థితితో పుడుతుంటారు.

కారణాలు: జన్యువులో సంభవించే లోపంవల్ల ఈ వ్యాధి ప్రధానంగా ప్రాప్తిస్తుంది. మనిషి కణాలలో ఉండే నాలుగో క్రోమోజోమ్‌లోని ఎఫ్‌జిఎఫ్‌ఆర్ 3 (ఫైబ్రోబ్లాస్ట్ గ్రోత్ ఫ్యాక్టర్ రిసెప్టార్-3) అనే పేరుగల జన్యువులో జరిగే మ్యుటేషన్ (జీవ రసాయనచర్య) దీనికి కారణం. మ్యుటేషన్ కారణంగా గ్రోత్ ప్లేట్‌లోని మృధులాస్థి పెరుగుదల ఆగిపోతుంది. ఫలితంగా గ్రోత్‌ప్లేట్‌లో ఉండే కార్టిలేజ్‌లోని ఎముక పెరిగే వేగం సైతం తగ్గిపోతుంది. వీటన్నిటి పర్యవసానంగా ఎముకలు కురచగా మారటం ఎముకలు అసహజమైన ఆకృతిని సంతరించుకోవటం వంటివి జరుగుతాయి. ఎకాండ్రోప్లేషియా వ్యాధితో జన్మించే వారిలో ప్రతి పదిమందిలోనూ తొమ్మిదిమంది తల్లిదండ్రులు మామూలుగానే అంటే సాధారణ ఎత్తులోనే ఉంటారు. ఈ వ్యాధికి అధిక శాతం కేసుల్లో (80-90 శాతం) శైశవ దశలో జరిగే యాదృచ్ఛిక ఉత్పరివర్తనం (స్పాంటేనియస్ మ్యుటేషన్ లేదా హఠాత్తుగా జరిగే జన్యులోపం) కారణమవుతుంది. ఇలా హఠాత్తుగా మ్యుటేషన్ జరగటానికి దారితీసే కారణాలమీద గాని, విధివిధానాల మీదగాని వైద్య శాస్త్రవేత్తలకు ఇంకా అవగాహన కలగాల్సి ఉంది.

కొన్ని సందర్భాల్లో (పది శాతం కేసుల్లో) ఎకాండ్రోప్లేసియా వ్యాధికి కారణమైన జన్యువు కుటుంబంలో వారసత్వంగా కూడా నడుస్తుంటుంది. తల్లిదండ్రుల్లో ఒకరికి ఈ వ్యాధి ఉంటే సంతానానికి వచ్చే అవకాశం 50 శాతం ఉంటుంది (ఆటోజోమల్ డామినెంట్ ఇన్‌హెరిటెన్స్). ఒకవేళ తల్లిదండ్రులు ఇద్దరూ మరుగుజ్జువారైతే, వారికి జన్మించిన సంతానంలో ఈ వ్యాధి వారసత్వంగా నడిచే అవకాశం 25 శాతం ఉంటుంది. అంటే, నలుగురు పిల్లల్లో ముగ్గురు మరుగుజ్జు లక్షణంతోను, ఒకరు మామూలు ఎత్తుతోను జన్మించే అవకాశం ఉంది.

రిస్కులు: ఈ వ్యాధి వచ్చే అవకాశాలను కొన్ని పరిస్థితులు ఎక్కువ చేస్తాయి.

అవి:-ఏకాండ్రోప్లేసియా వ్యాధి కలిగిన తల్లిదండ్రులకు జన్మించటం

-తల్లిదండ్రులు సాధారణమైన ఎత్తులో ఉన్నప్పటికీ బాధితుడికి ఎఫ్‌జిఎఫ్‌ఆర్ 3 జన్యువు కలిగి ఉండటం.

తల్లిదండ్రులు ఇద్దరూ మామూలు స్థాయి ఎత్తులో ఉన్నప్పటికీ ఒక వేళ మ్యుటేషన్ కారణంగా మొదటి సంతానానికి ఈ వ్యాధి వచ్చింద నుకుందాం. వారి రెండో సంతానానికి కూడా ఈ వ్యాధి వస్తుందేమో ననే భయం ఉంటుంది. అయితే అలా వచ్చే అవకాశం చాలా చాలా తక్కువ. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వెయ్యిమంది శిశువుల్లో ఒకరికి రావచ్చు. అంకెల్లో చెప్పాల్సివస్తే ఈ వ్యాధి రిస్కు 0.1 శాతమన్నమాట. దీనిని బట్టి తల్లిదండ్రులు తమకు తదుపరి సంతానం కావాలా వద్దా అనేది నిర్ణయించుకోవచ్చు.

ఇప్పుడు ఇదే సమస్యను మరో కోణం నుంచీ చూద్దాం. తల్లిదండ్రుల్లో ఒకరికి ఈ వ్యాధి ఉండి మరొకరు మామూలు ఎత్తులోనే ఉన్నారనుకుందాం. వారికి పుట్టిన వ్యక్తి మామూలు ఎత్తుకు చేరుకున్నాడనుకుందాం. ఇలాంటి వ్యక్తికి జన్మించే సంతానానికి ఈ వ్యాధి వచ్చే రిస్కు 0.01 శాతం మాత్రమే. అంటే, పదివేల జననాల్లో ఒకరికి మాత్రమే ఈ వ్యాధి వస్తుందన్నమాట.

లక్షణాలు: మరుగుజ్జు శరీరం ఈ వ్యాధి ప్రధాన లక్షణం. మొండం పొడవుగా ఉంటుం ది. మొండెంతో పోలిస్తే కాళ్లు, చేతులు కురచగా ఉంటాయి. చేతుల పైభాగంలోను, తొడల్లోను కురచదనం స్పష్టంగా కనిపిస్తుంది. పుట్టుకతోనే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి గురైన పెద్దలు 42-56 అంగుళాల పొడవుకు మించి ఉండరు. తల పెద్దగా ఉంటుంది. నుదురు ప్రస్ఫుటంగా ముందుకు పొడుచుకువచ్చి కనిపిస్తుంది. ముక్కు ప్రారంభంలో రెండు కళ్ల మధ్య ప్రదేశం బల్లపరుపుగా కనిపిస్తుంది.

ముఖంలో కొన్ని భాగాల్లో ఎదుగుదల నిలిచిపోతుంది. దవడ

ముందుకు పొడుచుకు వచ్చి కనిపిస్తుంది. దంతాల అమరిక సక్రమంగా ఉండదు. పైపళ్లు, కింద పళ్ల అమరిక ఒక క్రమంలో ఉండదు. ఎగుడు దిగుడుగా, ఇరుక్కుపోయి కనిపిస్తాయి. పుట్టినప్పుడు శిశువు కాళ్లు తిన్నగా ఉన్నప్పటికీ నడిచే సమయానికి కాళ్లు విల్లులాగా వంకర తిరుగుతాయి.

ఈ వ్యాధికి గురైన పెద్దల్లో మిగతా శరీరంతో పోలిస్తే హస్తపాదాలు చిన్నవిగా కనిపిస్తాయి. అలాగే వేళ్లు కురచగా, లావుగా కనిపిస్తాయి. పాదాలు చూడటానికి విశాలంగా, బల్లపరుపుగా కనిపిస్తాయి. పాదాల్లో ఉండాల్సిన సహజ వంపు (ఆర్చ్) కనిపించదు. చేతిని మోచెయ్యి వద్ద తిన్నగా చేయటం కష్టతరమవుతుంది. పక్కలకు తిప్పటం కూడా పూర్తి స్థాయిలో చేయలేరు. అయితే ఈ సమస్య ఉన్నప్పటికీ వ్యాధికి గురైన వ్యక్తి చేసే సాధారణ పనులకు ఆటంకం కలగదు.కొన్ని జాయింట్లలోని లిగమెంట్లు వదులుగా తయారవుతాయి. దీనితో చేతివేళ్లు, మణికట్టు, తుంటి జాయింటు, మోకాళ్ల వంటి జాయింట్లను అసాధారణ రీతిలో వంచటం చేస్తారు. దీనితో జాయింట్లు వైదొలిగే రిస్కు ఎక్కువగా ఉంటుంది. వ్యాధికి గురైన పిల్లల నడుము అధికంగా వ్యతిరేక దిశలో వంపు తిరుగుతుంది. దీనిని వైద్య పరిభాషలో కైఫోసిస్ అంటారు. దీని కారణంగా బాతులాగా అటు, ఇటు ఊగుతూ నడుస్తుంటారు. అధిక బరువు కలిగి ఉండటం ఈ వ్యాధిలో కనిపించే మరో ప్రధాన లక్షణం.

ఎకాండ్రోప్లేసియా వ్యాధికి గురైన వ్యక్తుల మెదడు పనిరు, తెలివితేటలు అందరిలాగా సాధారణంగానే ఉంటాయి. పొట్టిగా ఉండటమనే ఒక్క అంశం తప్ప ఇతర విషయాలన్నీ అందరిలాగానే నేర్చుకుంటారు. కాకపోతే కొన్ని ప్రత్యేక తరహా పనులు చేయడానికి ఇతరుల కన్నా కాస్తంత ఎక్కువ సమయం తీసుకుంటారు. ఉదాహరణకు, పుట్టిన తరువాత తల నిలపడానికి ఎక్కువ సమయం తీసుకుంటారు. అలా గే రెండో ఏట లేదా మూడో ఏటగాని స్వతంత్రంగా నడవలేరు.

వ్యాధి నిర్ధారణ: ఈ వ్యాధిని ప్రారంభావస్థలో గుర్తిస్తే శ్వాసకోశ వ్యాధులు, వెన్నుపూసలు ఇరుకుగా మారటం (స్పైనల్ స్టీనోసిస్) వంటి ఇబ్బందులను నిరోధించడానికి వీలవుతుంది. దీనిని శారీరక లక్షణాలను ఆధారం చేసుకొని నిర్ధా రించాల్సి ఉంటుంది. ఎక్స్‌రే, ఎమ్ఆర్ఐ వంటివి కూడా ఉపయోగపడతాయి. కాళ్లు, చేతుల్లో పట్టు ఎంత వరకు ఉందనేది చూడాల్సి ఉంటుంది. అలాగే, మూత్ర విసర్జన మీద నియంత్రణ ఏ మేరకు ఉందో పరీక్షించాల్సి ఉంటుంది. అశక్తత, మూత్రవిసర్జన మీద నియంత్రణ కోల్పోవటం అనేది వెన్నుపాము మీద ఒత్తిడి పడటాన్ని సూచిస్తుంది.

చికిత్స: వ్యాధి కారణంగా జనించే చిక్కులను, ఇక్కట్లను నిరోధించి బాధితుడికి సాధ్యమైనంత సహజమైన జీవన విధానాన్ని, నాణ్యతను కలిగించడం ఆయుర్వేద చికిత్స ప్రధాన ఉద్దేశ్యం. వ్యాధి పురోగతి గాని, తీవ్రతగాని జన్యువుల అంతర్నిర్మాణాన్ని బట్టి మారుతుంటాయి. ఒకవేళ వ్యాధిగ్రస్తునిలో తల్లిదండ్రులు ఇరువురి నుంచి వ్యాధి కారక జన్యువులు సంక్రమించినట్లయితే (హోమోజైగస్) పుట్టిన తరువాత ఒకటి రెండు నె

అధికారుల తప్పటడుగులు!

గర్ల్‌ఫ్రెండ్ రీవాను హత్య చేసినట్టు ఆరోపణను ఎదుర్కొంటున్న 'బ్లేడ్ రన్నర్' ఆస్కార్ పిస్టోరియస్ కేసును పోలీస్, విచారణ అధికారులే తప్పుతోవ పట్టిస్తున్నారు. ప్రాసిక్యూషన్ కథనంతో ఏమాత్రం సంబంధం లేని సమాచారాన్ని కోర్టుకు అందించి, తామే స్వయంగా చిక్కుల్లో పడ్డారు. పిస్టోరియస్ తరపు లాయర్ బారీ రూక్స్ వేసిన ఒక్కో ప్రశ్నకు ఒక్కోరకంగా సమాధానం ఇచ్చిన డిటెక్టివ్ హిల్టన్ బోథా చివరికి ఈకేసులో తాను కూడా పొరపాట్లు చేశానని పరోక్షంగా అంగీకరించాడు. సంఘటన స్థలానికి విచారణ నిమిత్తం వెళ్లే డిటెక్టివ్ అధికారులు అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి తమ కాలి, వేలి గుర్తులు ఎక్కడా పడకుండా చూడాలి. లేకపోతే, సంఘటన స్థలంలో దోషులు విడిచిపెట్టే సాక్ష్యాధారాలు తుడిచిపెట్టుకుపోతాయి. అయితే, బోథా ఇలాంటి జాగ్రత్తలు ఏవీ తీసుకోకుండానే సంఘటన స్థలానికి వెళ్లాడు. అక్కడ తిరిగాడు. ఆధారాలు సేకరించే ప్రయత్నంలో తన కాలి, వేలి గుర్తులను అక్కడ వదిలాడు. పిస్టోరియస్ న్యాయవాది అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్న క్రమంలో బోథా ఈ పొరపాటును అంగీకరించాడు. దీనితో ప్రాసిక్యూటర్లు తలలు పట్టుకోవాల్సివచ్చింది. పైగా రీవా తన చేతుల్లోనే హతమైందని స్పష్టం చేసిన పిస్టోరియస్ తాను ఉద్దేశపూర్వకంగా ఈ పొరపాటు చేయలేదని అంటున్నాడు. తనను చంపడానికి ఎవరో చొరబడ్డారన్న అనుమానంతోనే తాను కాల్పులు జరిపినట్టు చెప్పాడు. రీవ్‌తో ఘర్షణ పడిన పిస్టోరియస్ ఆతర్వాత ఆమెను కాల్చిచంపాడని ప్రాసిక్యూషన్ అభియోగం. అయితే, డిటెక్టివ్ బోథా తన ప్రాథమిక విచారణలో సంపాదించిన వివరాలేవీ పిస్టోరియస్ ఉద్దేశపూర్వకంగానే రీవాను హత్య చేశాడన్న వాదనకు బలాన్ని చేకూర్చడం లేదు. అంతేగాక, ప్రాసిక్యూషన్ కథనానికి భిన్నమైన సమాచారాన్ని ఇచ్చి, కేసును మరింత జటిలం చేశాడు. ఇప్పుడు పిస్టోరియస్‌ను దోషిగా తేల్చడం ఎలాగో అర్థంగాక ప్రాసిక్యూటర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. బెయిల్‌పై విడుదలై, దర్జాగా బయటకు వచ్చిన పిస్టోరియస్ ఉదంతం మిస్టీరియస్‌గా మారింది. రీవాను పిస్టోరియస్ హత్య చేశాడా లేక పొరపాటున అతని చేతిలో హతమైందా అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో పోలీస్ ఉన్నతాధికారులు మళ్లీ వేట మొదలుపెట్టారు. నిజానిజాలు ఎలావున్నా, ఈ సంఘటనలో ప్రాణాలు పోగొట్టుకున్న అమాయకురాలు రీవా. పిస్టోరియస్ ఆమెను హత్య చేసి ఉంటే, ప్రాసిక్యూషన్ పొరపాట్లను చూసి ఆమె ఆత్మ ఎంత క్షోభిస్తున్నదో! నమ్మిన వాడి చేతిలోనే అర్ధాంతరంగా తనువు చాలించిన రీవాకు జరిగిన అన్యాయాన్ని ఏ చట్టాలు కాపాడతాయి? ఏ వాదనలు న్యాయాన్ని అందిస్తాయి?

అఫ్రిదీ తలబిరుసు!

పాకిస్తాన్ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ షహీద్ అఫ్రిదీ తల బిరుసు మరోసారి బైటపడింది. దక్షిణాఫ్రికాతో జరిగే వన్డేసిరీస్‌కు అఫ్రిదీని ఎంపిక చేసినట్టు పాక్ చీఫ్ సెలక్టర్ ఇక్బాల్ ఖాసిం చేసిన ప్రకటనపై అతను నిప్పులు చెరిగాడు. తనను శాసించే అధికారం సెలక్టర్లకు లేదన్నాడు. ఎంతకాలం కెరీర్‌ను కొనసాగించాలి, ఏఏ టూర్లలో పాల్గొనాలి, ఏ సిరీస్‌లకు దూరంగా ఉండాలి అన్న అంశాల్లో నిర్ణయాధికారం పూర్తిగా తనకు మాత్రమే పరిమితమని, ఇందులో ఎవరు జోక్యం చేసుకున్నా సహించేది లేదని మండిపడ్డాడు. పాక్ జాతీయ జట్టులో స్థానం పొందక పోతే, అఫ్రిదీకి పేరుప్రఖ్యాతులు ఎలా వచ్చాయో అతనికే తెలియాలి. కాంట్రాక్టు ఆటగాడిగా ఉన్నప్పుడు, ఏదైనా అనుకోని ఉపద్రవం వచ్చిపడితే తప్ప, ఫలానా సిరీస్‌కు తాను అందుబాటులో ఉండబోనని చెప్పే అధికారం ఆటగాళ్లకు ఉండదు. ఈ విషయాన్ని సదరు క్రికెటర్ ముందుగానే సంబంధిత క్రికెట్ బోర్డుకు సమాచారం ఇవ్వాలి. అనుమతి పొందాలి. కానీ, తాను సర్వస్వ తంత్రుడిని అన్న చందంగా అఫ్రిదీ వ్యాఖ్యలు చేయడం పాకిస్తాన్ క్రికెట్ జట్టులో కొరవడిన క్రమశిక్షణ రాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం. సలీం మాలిక్ నుంచి షోయబ్ అక్తర్ వరకూ, కమ్రాన్ అక్మల్ నుంచి అఫ్రిదీ వరకూ ప్రతి ఒక్కరూ సెలక్టర్లను సవాలు చేసేవాళ్లే. తాము లేకపోతే, పాక్ క్రికెట్ అనేదే లేదన్నట్టు రెచ్చిపోయిన వాళ్లే. 'జంటిల్మన్ గేమ్' క్రికెట్‌లో ఇలాంటి పరిణామాలు తప్పుడు సంకేతాలను పంపుతాయి. సెలక్టర్లు, క్రికెట్ బోర్డు, ఆటగాళ్ల మధ్య అగాధాలను సృష్టిస్తాయి. క్రికెట్ పరువును బజారుకీడుస్తాయి. ఈమాత్రం ఇంగితం లేని అఫ్రిదీ జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించడం ద్వారా సెలక్టర్లకు మెహర్బానీ చేస్తున్నట్టు ఫోజులు కొట్టడం అహంకారానికి పరాకాష్ట. అజ్ఞానానికి తార్కాణం.

ఆర్మ్‌స్ట్రాంగ్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

నిషిద్ధ మాదక ద్రవ్యాలను వినియోగించి పట్టుబడిన ప్రముఖ సైక్లిస్టు లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ చుట్టూ ఉచ్చు మరింతగా బిగుస్తోంది. డోపింగ్‌లో పట్టుబడిన అతను టైటిళ్లతోపాటు పరువుప్రతిష్టలను కూడా కోల్పోయాడు. స్పాన్సర్లు ఇప్పుడు ముఖం చాటేశారు. కాగా, అమెరికా ప్రభుత్వం ఇప్పుడు నష్టపరిహారాన్ని కోరుతూ కోర్టుకెక్కింది. అమెరికా పోస్టర్ సర్వీస్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రతిష్టాత్మక టూర్ డి ఫ్రాన్స్‌సహా పలు పోటీల్లో పాల్గొన్నాడు. మేజర్ స్పాన్సర్‌షిప్‌ను పోస్టల్ శాఖ అందించింది. అయితే, ఉత్ప్రేరకాలను వాడి తాను టూర్ డి ఫ్రాన్స్ తదితర రేసుల్లో గెలుపొందినట్టు ఆర్మ్‌స్ట్రాంగ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అంగీకరించడంతో, అతను మోసం చేశాడని పోస్టల్ శాఖ వాపోతున్నది. ఆర్మ్‌స్ట్రాంగ్ కోసం ఖర్చు చేసిన మొత్తాలను అతని నుంచి వసూలు చేయించాలని కోర్టులో లాసూట్ దాఖలు చేసింది. ఇప్పటికే పలు సమస్యలతో అల్లాడుతున్న ఆర్మ్‌స్ట్రాంగ్‌కు తాజా పరిణామం కోలుకోలేని దెబ్బ. దీని నుంచి అతను బయటపడడం అనుకున్నంత సులభం కాదనేది వాస్తవం.

అధ్యక్షుడికే సర్వాధికారాలు!

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) అధ్యక్షుడు జకా అష్రాఫ్ ఇకపై సర్వాధికారాలను చెలాయించనున్నాడు. ఇటీవలే పిసిబి నిబంధనావళిని సమూలంగా మార్చారు. అధ్యక్షుడికి సర్వాధికారాలను కట్టబెడుతూ పిసిబి సర్వసభ్య సమావేశంలో తీర్మానాలను ఆమోదించారు. పిసిబి చీఫ్ ప్యాట్రాన్‌గా పాక్ దేశాధ్యక్షుడు అసిఫ్ జర్దారీ వ్యవహరిస్తుండగా, నిర్ణయాధికారాలతోపాటు, పలు విశేష అధికారాలు పిసిబి అధ్యక్షుడికే ఉంటాయని కొత్త నిబంధనావళి స్పష్టం చేస్తున్నది. ఈ తీర్మానాల ప్రతిని ఇప్పటికే జర్దారీకి పంపిన బోర్డు, అతని ఆమోద ముద్ర కోసం ఎదురుచూస్తున్నది. తాజాగా మార్చిన నియమావళి ప్రకారం 2017 వరకూ అష్రాఫ్ పిసిబి అధ్యక్షుడిగా కొనసాగుతాడు. అతనికి విశిష్టాధికారాలు లభిస్తాయి. పిసిబి అధ్యక్షుడు ఎన్నికల ప్రక్రియ ద్వారా కాకుండా, నియామకం ద్వారా అధికారంలోకి వస్తాడు. మొదటి నుంచి పిసిబి ఇదే విధానాన్ని అనుసరిస్తున్నది. దేశాధ్యక్షుడే పిసిబి చైర్మన్‌ను నియమించడం ఆనవాయితీగా మారింది. కాగా, పిసిబి కొత్త రాజ్యాంగాన్ని అనుసరించి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌సహా వివిధ విభాగాల్లో అధికారులను నియమించే అధికారం చైర్మన్‌కు లభిస్తుంది. అంతేగాక, జట్టు కెప్టెన్, కోచ్ ఎంపికలోనూ అతను ప్రధాన పాత్ర పోషిస్తాడు. జట్టు ఎంపిక నుంచి సాధారణ పాలన వరకూ పలు అంశాలపై సాధారణ సభ అనుమతితో సంబంధం లేకుండా అతను నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కొత్త నిబంధనల ద్వారా లభిస్తుంది. అష్రాఫ్ తన పదవిని కాపాడుకోవడంతోపాటు, విశేష అధికారాలను పొందడం ద్వారా పాక్ క్రికెట్‌పై తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించాలని భావిస్తున్నాడు. ఈ క్రమంలోనే నియమావళిని సమూలంగా మార్చేశాడు. దేశాధ్యక్షుడు జర్దారీ ఆమోద ముద్ర పడిన మరుక్షణం పిసిబికి తిరుగులేని ఏకైక అధికారికా అష్రాఫ్ ఎదుగుతాడు. ఇలావుంటే, అష్రాఫ్ వైఖరిని పలువురు పాక్ మాజీ క్రికెటర్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఒకే వ్యక్తి ఆధీనంలో యావత్ క్రికెట్ రంగాన్ని ఉంచడం భవిష్యత్తులో పలు సమస్యలకు కారణమవుతుందని ధ్వజమెత్తుతున్నారు. పాకిస్తాన్‌లో క్రికెట్ బతికిబట్టకట్టాలంటే, ఈ రకంగా ఒకే ఒక్కడి పెత్తనంలో పిసిబి ఉండకూడదని స్పష్టం చేస్తున్నారు. వివాదాస్పదంగా మారుతున్న పిసిబి కొత్త నిబంధనావళి, బోర్డు అధ్యక్షుడికి సమకూరనున్న విశిష్టాధికారాలపై చీఫ్ ప్యాట్రాన్‌గా వ్యవహరిస్తున్న దేశాధ్యక్షుడు జర్దారీ ఎలా స్పందిస్తాడన్నది ఉత్కంఠ రేపుతోంది.



బంగ్లా జట్టులోకి మొమినుల్

మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ గాయపడడంతో, శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ మొమినుల్ హక్ స్థానం సంపాదించాడు. లంకతో ముష్ఫికర్ రహీం నాయకత్వంలోని బంగ్లాదేశ్ జట్టు రెండు టెస్టుల సిరీస్ ఆడుతుంది. ఆతర్వాత మూడు వన్డేలతోపాటు, ఏకైక టి-20 మ్యాచ్‌లో పాల్గొంటుంది. మొదటి టెస్టు మార్చి ఎనిమిది నుంచి గాలేలో మొదలవుతుంది. బంగ్లా క్రికెట్‌పై ప్రత్యేక ముద్ర వేసిన ఆల్‌రౌండర్ షకీబ్ స్థానంలో ఎంపికైన మొమినుల్ ఎంత వరకూ రాణిస్తాడో చూడాలి.

ఆడాళ్లూ? మజాకా?

మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పురుషులకు మాత్రమే పరిమితమన్న రోజులకు తెరపడింది. ఇప్పుడు మహిళలు కూడా ఈ పోటీల్లో దూసుకొస్తున్నారు. బాక్సింగ్, కిక్ బాక్సింగ్, కరాటే, జూడో, తేక్వాండో, రెజ్లింగ్ వంటి పలు క్రీడాంశాలను తనలో ఇముడ్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అత్యంత ప్రమాదకరమైన క్రీడ. శాశ్వత అంగవైకల్యం, ప్రాణాపాయం వంటి ప్రమాదాలు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో ఎక్కువ. తలపై బలమైన గాయాలు తగిలినప్పుడు కోమాలోకి వెళ్లిపోతారు లేదా పిచ్చివాళ్లవుతారు. ఈ క్రీడలో పాల్గొనే వారి ప్రవర్తన సాధారణ క్రీడాకారులకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అసహనం, ప్రతి చిన్న విషయానికీ తీవ్రంగా స్పందించడం, రెచ్చిపోవడం, ఘర్షణకు దిగడం వంటి మానసిక రుగ్మతలు ఆవహిస్తాయి. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ రింగ్‌లోకి అడుగుపెట్టడమంటే ప్రమాదాలకు ఆహ్వానం పలకడమే. ప్రాణాలతో పరాచకాలు ఆడడమే. తీవ్రమైన శారీరక, మానసిక దుష్ప్రభావాలకు తెర తీసే ఈ క్రీడను నిన్నమొన్నటి వరకూ మహిళకు దూరంగా ఉంచారు. కానీ, ఔత్సాహికులు మాత్రం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌ను ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నారు. మహిళల విభాగంలోనూ పోటీలను నిర్వహించాలని చాలాకాలంగా జూడోకాలతోపాటు ప్రేక్షకులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు తలవంచిన యుఎఫ్‌సి గత శనివారం కాలిఫోర్నియాలోని అనాహెమ్‌లో రోన్డా రూసీ, లిజ్ కార్మొచే మధ్య పోటీని నిర్వహించింది. అంతకు ముందు పలు ఎగ్జిబిషన్ పోటీలతోపాటు, అంతర్జాతీయ స్థాయి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ టోర్నీల్లోనూ పాల్గొని సత్తా చాటిన రోన్డా ఫైట్ మొదలైన మరుక్షణమే లిజ్‌పై విరుచుకుపడింది. తొలి రౌండ్‌లోనే ఆమెను చిత్తుచేసి, యుఎఫ్‌సి తొలి మహిళల మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ టైటిల్‌ను సంపాదించింది. ఈ పోటీలు పురుషులకు మాత్రమే పరిమితం కాదని, అవకాశం వస్తే మహిళలు కూడా రాణించగలుగుతారని నిరూపించింది. రోన్డాను స్ఫూర్తిగా తీసుకొని ఈ క్రీడలో పాల్గొనేందుకు వేలాది మంది యువతులు సిద్ధమవుతున్నారు. మార్షల్ ఆర్ట్స్‌కు ఆదరణ పెరగడం ఒక రకంగా మహిళలకు మంచిచేసే పరిణామమే.

పాపకార్న్

ఫౌజా చివరి రేస్

♦ భారత్‌లో జన్మించి ఇంగ్లాండ్‌లో స్థిరపడిన ఫౌజా సింగ్ చివరి పబ్లిక్ రేస్‌లో పాల్గొని, యువతకు స్ఫూర్తినందించాడు. ఆదివారం జరిగిన హాంకాంగ్ మారథాన్ 10 కిలోమీటర్ల విభాగంలో పోటీపడిన ఫౌజా వయసు 101 సంవత్సరాలు. వందేళ్లు పైబడినా ఇప్పటికీ యువకులతో సమానంగా ఉత్సాహంగా కనిపించే ఫౌజా సింగ్ క్రమశిక్షణే తన ఫిట్‌నెస్‌కు కారణమని అంటున్నాడు. ఎక్కడ మారథాన్ రేసులు జరిగినా అక్కడ ప్రత్యక్షమయ్యే అతను, ఇక మారథాన్ రేసుల నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించాడు. కాగా, అతనికి అభిమానులు బ్రహ్మరథం పట్టారు.



డానికా సంచలనం

♦ డానికా ప్యాట్రిక్ సంచలనం సృష్టించింది. అసాధారణ వేగంతో రేసు కార్లను నడపడమే గాదు... అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పురుషులతో పోటీపడడం ఆమెకు ప్రత్యేకతను సంపాదించిపెట్టింది. డేటొనా బీచ్‌లో జరిగిన నాస్కార్ స్ప్రింట్ కప్ రేసులో పాల్గొన్న తొలి మహిళగా రికార్డు నెలకొల్పింది. అంతేగాక, పోల్ పొజిషన్‌ను కూడా సంపాదించి సంచలనం సృష్టించింది. మెయిన్ రేస్‌లో కారుకు సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తడంతో అర్ధాంతరంగా వైదొలగాల్సి వచ్చింది. అయితే, అప్పటికే ఆమె పురుషుల విభాగంలో పోటీకి దిగి, పోల్ పొజిషన్ సాధించిన తొలి మహిళగా చిరస్మరణీయ రికార్డును సొంతం చేసుకుంది. ఫార్ములా వన్ రేస్ తర్వాత అంతటి ఆదరణ ఉన్న నాస్కార్‌లో ఒక మహిళ పోటీ పడడం రానున్న రోజుల్లో చోటుచేసుకోబోయే మార్పులను సూచిస్తున్నది. డానికా అసాధారణ మహిళ. రేస్ ట్రాక్‌పై మెరిసిన తార. మహిళా శక్తికి ఆమె నిలువెత్తు నిదర్శనం.

మెస్సీ 300 నాటౌట్!

♦ బార్సిలోనా తరపున ఆడుతున్న అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ 300 గోల్స్ మైలురాయిని దాటాడు. న్యూహో లాన్ కార్మెనెన్‌లో గ్రనడాతో జరిగిన స్పానిష్ లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించిన మెస్సీ మొత్తం 301 గోల్స్‌ను తన ఖాతాలో చేర్చుకున్నాడు. గ్రనడా ఆటగాడు ఒడియోన్ ఇహాలో తొలి గోల్ చేసి, తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించడంతో కంగుతిన్న బార్సిలోనా ఎదురుదాడికి దిగింది. మ్యాచ్ ద్వితీయార్ధంలో మెస్సీ ఈక్వెలైజర్ సాధించాడు. అదే క్రమంలో అతను 300 గోల్స్ మైలురాయిని చేరాడు. ఆతర్వాత మరో గోల్ చేయడంతో, ఈ మ్యాచ్‌ని బార్సిలోనా 2-1 తేడాతో కైవసం చేసుకుంది. - సత్య

స్పెషల్ స్టోరీ

సంచలనాల ఈడెన్ గార్డెన్స్

'ఈడెన్' హీరోలు లక్ష్మణ్, ద్రవిడ్

భారత క్రికెట్ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించ తగ్గ రెండు మ్యాచ్‌లు కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ మైదానంలోనే జరగడం విశేషం. 1998 మార్చి 18 నుంచి 21వ తేదీ వరకూ జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియాను మహమ్మద్ అజరుద్దీన్ కెప్టెన్సీలోని భారత్ ఇన్నింగ్స్ 219 పరుగుల తేడాతో చిత్తుచేసింది. జవగళ్ శ్రీనాథ్, సౌరవ్ గంగూలీ, అనీల్ కుంబ్లే తలా మూడేసి వికెట్లు కూల్చడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 633 పరుగుల భారీ స్కోరువద్ద డిక్లేర్ చేసింది. లక్ష్మణ్ 95, నవ్‌జోత్ సింగ్ సిద్ధు 97, రాహుల్ ద్రవిడ్ 86, సచిన్ తెండూల్కర్ 79, గంగూలీ 65 పరుగులతో రాణించారు. కెప్టెన్ అజరుద్దీన్ అజేయంగా 163 పరుగులు సాధిస్తే, వికెట్‌కీపర్ నయన్ మోంగియా 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కాగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ మరింత దారుణంగా విఫలమైంది. 181 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మార్క్ టేలర్ చేసిన 45 పరుగులే టాప్ స్కోర్. ఇయాన్ హీలీ (38), స్టీవ్ వా (33) ఫరవాలేదనిపించారు. మిగతా వారంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. కుంబ్లే ఐదు, శ్రీనాథ్ మూడు వికెట్లు పడగొట్టి, ఆసీస్ పతనానికి కారణమయ్యారు.

ఇక రెండో మ్యాచ్ విషయానికి వస్తే, 2001 మార్చి 11 నుంచి 15 వరకూ ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో సౌరవ్ గంగూలీ నాయకత్వంలో భారత్ సంచలనం సృష్టించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఎనిమిది వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. కానీ, రెండో రోజు ఆటలో ఎదురుదాడికి దిగి, 445 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ స్టీవ్ వా 110 పరుగులు చేశాడు. టెయిలెండర్లు అతనికి అండగా నిలిచారు. జాసన్ గిలెస్పీ 46, గ్లెన్ మెక్‌గ్రాత్ 21 పరుగులు చేశారంటే, భారత్ బౌలింగ్ ఎంత పేలవంగా సాగిందో ఊహించవచ్చు. ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకే పరిమితం చేయలేకపోయిన భారత్, ఆతర్వాత బ్యాటింగ్‌లోనూ దారుణంగా విఫలమైంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 128 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయి, మూడో రోజు భోజన విరామానికి కంటే ముందే, 171 పరుగులకే చాపచుట్టేసింది. ఫలితంగా ఫాలోఆన్ ఆడక తప్పలేదు. రెండో ఇన్నింగ్స్‌లో పరిస్థితి కొంత మెరుగుపడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేయగలిగింది. ఆసీస్‌ను మళ్లీ బ్యాటింగ్‌కు దింపాలంటే అప్పటికి ఇంకా 16 పరుగులు చేయాల్సిన పరిస్థితి. లక్ష్మణ్ 109, ద్రవిడ్ 7 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. నాలుగో రోజున వీరిద్దరూ అద్భుతాలు సృష్టిస్తార నిగానీ, భారత్‌ను ఆదుకుంటారనిగానీ ఎవరూ కలలో కూడా ఊహించలేదు. మెక్‌గ్రాత్, గిలెస్పీ, షేన్ వార్నర్, మైఖేల్ కాస్ప్రోవిజ్ వంటి హేమాహేమీ బౌలర్లకు వీరు ఎదురునిలిచి జట్టును ఆదుకోవడం అసాధ్యంగానే కనిపించింది. కానీ, వీరు ఆసీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలిచారు. నాలుగు రోజు మొత్తం మారథాన్ ఇన్నింగ్స్ ఆడారు. మరో వికెట్ కూలకుండా జాగ్రత్త పడుతూ ఆట ముగిసే సమయానికి స్కోరును 589 పరుగులకు చేర్చారు. అప్పటికి లక్ష్మణ్ 275, ద్రవిడ్ 155 పరుగులు తమ ఖాతాలో వేసుకున్నారు. ఇక చివరి రోజున అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. లక్ష్మణ్ 281, ద్రవిడ్ 180 పరుగులు చేసి అవుట్‌కాగా, గంగూలీ 48 పరుగులు సాధించాడు. ఏడు వికెట్లకు 657 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, ఆసీస్ ముందు 384 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అసాధ్యంగా కనిపించిన ఈ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఛేదించలేక పోయినా, డ్రా చేసుకుంటుందని అంతా ఊహించారు. కానీ, హర్భజన్ సింగ్ విజృంభణతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. 212 పరుగులకే రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌటైన ఆస్ట్రేలియా 171 పరుగుల తేడాతో ఓడింది. భజ్జీ 73 పరుగులకు ఆరు వికెట్లు కూల్చితే, సచిన్ తెండూల్కర్ 31 పరుగులిచ్చి మూడు వికెట్లు సాధించాడు. ఈ రెండు టెస్టులు చరిత్ర సృష్టించాయి. - టిహెచ్ రావు

అందం

★ ఎండలో తిరిగేవారు చర్మం నల్లబడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ సార్లు మజ్జిగ, పండ్ల రసాలు, మంచి నీరు తాగాలి.

★ ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖానికి సన్‌క్రీమ్ లోషన్ రాసుకుంటే మేలు.

★ నల్లద్రాక్ష గుజ్జులో కాస్త తేనె కలిపి ఉదయం వేళ స్నానానికి ముందు ముఖానికి రాసుకుంటే చర్మం కాంతివంతమవుతుంది.

★ చర్మం మిలమిల మెరవాలంటే పెరుగులో కమలాపండు రసం కలిపి శరీరానికి రాసుకోవాలి. నిమ్మరసంలో కాస్త తేనె లేదా దోసకాయ రసం కలిపి రాసుకున్నా నిగారింపు వస్తుంది.

★ పాలపొడిలో కాస్త తేనె, నిమ్మరసం, బాదం నూనె వేసి పేస్టులా చేసుకుని ముఖానికి రాసుకుంటే చర్మం తళుకులీనుతుంది.

★ పండ్ల నందుల్లో ఇరుక్కునే ఆహార పదార్థాలను, పాచిని తీసేందుకు పిల్లలు గుండు సూదులు, అగ్గిపుల్లలు వంటివి వాడకుండా చూడాలి.

★ మాంసాహార వంటకాల్లో మసాలా ఎక్కువైతే కాస్త నిమ్మరసం లేదా చింతపండు పులుసు గానీ కలిపితే ఘాటు తగ్గుతుంది.

'బ్యాడ్‌మూడ్'తో బాధలే!

టీనేజీ సైకాలజీ

లాన్సింగ్‌లో కారు దిగి ఇంట్లోకి అడుగుపెట్టేప్పటికి మేం చలిముద్దలం అయ్యాం. కారణం- మైనస్ డిగ్రీల చలి. అమ్మానాన్నలను అమెరికాలో తన ఇంట చూసిన మా అమ్మాయి ప్రత్యూష సంతోషానికి హద్దులు లేవు. పాపం దీప- మా హెవీ సూట్‌కేస్‌లను ఇంట్లోకి చేర్చింది. మేం కబుర్లు చెప్పుకుంటుండగా మా అల్లుడి నుంచి ఫోన్.

''హలో.. మామయ్యా! ప్రాజెక్ట్ ఎండింగ్ స్టేజ్‌లో ఉంది. అందుకే ఎయిర్ పోర్ట్‌కి రాలేకపోయాను. అత్తయ్య, మీరూ ఓకేనే కదా! జెట్‌లాగ్ ఉందా?''-శ్రవణ్ పలకరింపు.

''ఎవ్రిరి ఒన్ అండ్ ఎవ్రిథింగ్ ఓకే... అంతా బాగానే ఉంది.'' అన్నా.

''ఓకే మామయ్యా! ఈవినింగ్ వచ్చాక షాపింగ్‌కి వెళ్దాం. ఆల్రెడీ మీకు స్నో జాకెట్, గ్లోవ్స్ కొన్నాను. ఇంకా స్నోషూస్ కొనాలి... సాయంత్రం షాపింగ్‌కి వెళ్దాం''-అంటూ శ్రవణ్ ముందు జాగ్రత్త.

మేం అమెరికాలో అడుగుపెట్టేప్పటికే మెడికల్ ఇన్సూరెన్స్ రెడీ...స్పోషాల్ సీజన్ కాబట్టి మా విషయంలో ఇన్ని రకాల జాగ్రత్తలు.

అందరం రిలాక్స్‌డ్‌గా కాఫీ తాగుతుండగా- ''ఆరు నెలల కోసం ఇన్సూరెన్స్ ఎందుకమ్మా'' అన్నాను ప్రత్యూషతో.

''లేదంకుల్... అది మస్ట్'' వాతావరణ ప్రభావం చాల ఎక్కువగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ ప్రతి ఒక్కరూ ఫ్లూ షాట్స్ తీసుకుంటారు. ఎందుకంటే కోల్డ్ ఎఫెక్ట్‌కి దూరంగా ఉండటానికి. అందుకే మెడికల్ ఇన్సూరెన్స్ కూడా. ఇన్సూరెన్స్ లేకపోతే ఇక్కడ ట్రీట్‌మెంట్ చాల ఎక్స్‌పెన్సివ్. ఎంత సంపాదించినా మందులకు కూడా సరిపోదు. ఆ ఖర్చులు భరించలేకనే ముందు జాగ్రత్తగా ఇన్సూరెన్స్. ఒక విధంగా ఇన్సూరెన్స్ అనేది అనారోగ్యానికి, మెడికల్ ఎక్స్‌పెన్సెస్‌కి ఫిజికల్ ఈక్వలెంట్.''

''పోనీలే.. ఫిజికల్ ఈక్వలెంట్‌కి మెడిసిన్ ఉంది...ఆ ఎక్స్‌పెన్సెస్ కవర్ చేయటానికి ఇన్సూరెన్స్ ఉంది. మరి ఎమోషనల్ ఈక్వలెంట్ సంగతేంటి?'' అన్నాను.

''అంటే బ్యాడ్‌మూడ్‌లో ఉన్నపుడు ఏం చేయాలనా మీ ఉద్దేశం?'' దీప ప్రశ్న.

''ఎస్...మనకు అనేకానేక సందర్భాలలో మూడ్ అవుట్ అవుతుంటుంది. చీమ చిటుక్కుమన్నా భరించలేని మూడ్‌లో ఉంటాం... మనకుమనమే ఎమోషనల్‌గా క్రాక్ అవుతుంటాం... అంటే మన భావోద్వేగ తీవ్రతను మనకు మనమే భరించలేం...అప్పుడు చుట్టుపక్కల వారిపై విరుచుకుపడతాం... స్నేహితుల్ని సైతం లెక్కచేయం... పైగా మన మూడ్ అవుట్ కావటానికి వారే కారకులని నిందిస్తుంటాం. ఓ విధంగా ఈ బిహేవియర్ ఎమోషనల్ ఈక్వలెంటే కానీ, బ్యాడ్‌మూడ్ నుండి బయట పడటానికి సరైన ప్రత్యామ్నాయం కాదు. నిజానికి మనం ఇతరులను మన భావోద్వేగాలకి గురిచేయకూడదు. వారిని మన బ్యాడ్ మూడ్‌కి దూరంగా ఉంచగలగటమే విజ్ఞత. ముందు జాగ్రత్తచర్యగా మనం ఫిజికల్‌గా ఎలా ప్రిపేర్ అవుతున్నామో, ఎమోషనల్‌గానూ ప్రిపేర్ కావాలి.''

''సాధ్యమంటావా.. దీపా?''

''ఎందుకు సాధ్యం కాదు... మీకు జలుబు చేస్తే ఏం చేస్తారు? అందరిలో కలవకుండా, ఆ ఇన్‌ఫెక్షన్ అందరికీ సోకకుండా జాగ్రత్తపడతారు. జలుబు, దగ్గు ఇన్‌ఫెక్షన్‌ని కలగజేస్తుందని, అది ఇతరులకు సోకే అవకాశం ఉందని తెలుసుకాబట్టి... ఇతరులూ బాధపడవలసి వస్తుందన్న ఇంగితజ్ఞానం

వల్ల... ఇదే ఫార్ములాని మనం ఎమోషనల్‌గాను ఫాలో కావచ్చు కదా! కానీ పెద్దగా పట్టించుకోం. అందుకే మన బ్యాడ్ మూడ్‌తో ఇతరుల్ని మూడ్‌అవుట్ చేస్తుంటాం. మన ఎమోషనల్ సఫరింగ్‌ని ఇతరులకు సంక్రమింప చేస్తుంటాం.''

దీప మాట్లాడుతుంటే ఎంతో అనుభవంతో మాట్లాడుతున్నట్లు అనిపిస్తోంది. పదహారేళ్ల పిల్లకి ఏం అనుభవం ఉంటుందిలే? అని కొట్టిపారెయ్యటానికి వీల్లేదనిపిస్తుంది. అనుభవం లేకున్నా తన అబ్జర్వేషన్ సామాన్యమైంది కాదు.

అడపా దడపా అలా తప్పదు!

''అంకుల్! నాది టీన్ సైకాలజీ అంటూ కొట్టిపారెయ్య నంటే ఒక విషయం చెబుతాను. ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి, మనల్ని మనం అనలైజ్ చేసుకోవటానికి నేను మరీ చిన్నదాన్నికాదు...నాది మరీ పసిపిల్ల మనస్తత్వమూ కాదు... అలాగని గాలికి కొట్టుకుపోయే వ్యక్తిత్వమూ కాదు. మనల్ని మనం క్రియేట్ చేసుకోవటానికి అనుశీలన ఎంతోఅవసరం. కొన్ని సందర్భాలలో మనల్ని మనమే విమర్శించుకోవలసి ఉంటుంది. మనతో మనమే పోరాటం చేయవలసి ఉంటుంది. ఎంతటి మహాత్ములైనా, ఎంతటి గొప్పవారైనా, ఎంతటి సాదాసీదా వ్యక్తులైనా అడపాదడపా బ్యాడ్‌మూడ్‌లోకి పోవటం సహజం. అసలు బ్యాడ్‌మూడ్ అంటే నాకు తెలీదని ఎవరైనా బుకాయించారనుకోండి- అటువంటివారిని ఏ మాత్రం విశ్వసించకూడదు. ఓపెన్ బుక్‌లా ఉండే వారిని నమ్మితే మనకు ఎటువంటి నష్టం ఉండదు.''

దీప చిన్నపాటి క్లాస్ తీసుకుంటోందా? అనిపిస్తున్నా... తెలీని విషయాలు ఎన్నో చెబుతోంది. బుద్ధిగా, స్టూడెంట్‌లా వినటమే మంచిది అనిపించింది.

''ఇంతకీ అంకుల్! ఈ బ్యాడ్‌మూడ్‌ని మా టీనేజర్స్ 'వర ల్డ్‌క్లాస్ థాట్ అటాక్' అంటుంటాం. ప్రపంచీకరణతో ప్రపంచం మొత్తం ఒక్కటై పోతున్నట్లుగా ఈ వరల్డ్‌క్లాస్ థాట్ అటాక్ కూడా ప్రపంచ జనాభాకు చాలా కామన్ అయిపోయింది. కారణం ప్రపంచ పౌరులందరూ దీని రంగూ, రుచీ, వాసనలతో ఎమోషనల్ అయినవారే. సామాన్యంగా బ్యాడ్ మూడ్‌తో మనలో అభద్రతాభావం నెలకొంటుంది. ప్రతికూల భావనలు అధికం అవుతాయి...వ్యతిరేక ధోరణులు బలపడతాయి... ఆత్మీయులనుకుంటున్నవారు సైతం అసూయాగ్రస్తులనిపిస్తుంటారు... స్నేహితులు సైతం మనకు శత్రువుల్లా అనిపిస్తుంటారు... చివరికి కన్నవారు సైతం ప్రతి విషయానికి మనపై కన్నెర్ర చేస్తున్నట్లనిపిస్తుంది. అంతెందుకు ప్రతి విషయంలోను పరాజితులం అవుతామేమోనన్న భయం వెన్నాడుతుంటుంది. ఇవన్నీ మన బ్యాడ్‌మూడ్ నుండి పుట్టిన భావనలే. దీనికి మీరైనా, నేనైనా అతీతం కాదు. అయితే మా టీనేజర్స్ బయటపడినంత త్వరగా మీ జనరేషన్ బయటపడలేదు. బ్యాడ్‌మూడ్ పరంగా మా జనరేషన్‌కీ, మీ జనరేషన్‌కీ ఉన్న తేడా అది.''

'దీపా! ఎక్కడినుండి ఎక్కడికి తీసుకెళ్తున్నావ్?' అనుకున్నాను మనసులో.

''అసలు మనం బ్యాడ్‌మూడ్‌లో ఉంటాం. ఆ విషయాన్ని మరచి ఇతరులు మనకు సలహాలు ఇస్తున్నా, సర్దిచెప్ప ప్రయత్నిస్తున్నా చెవుల కెక్కించుకోం. వారినే అనుమానిస్తాం... బ్యాడ్‌మూడ్‌తో మనం జీర్ణం చేసుకోలేకపోతున్న అంశాలనే వారి దృష్టికి తీసుకుపోతాం. వారికి అన్నింటినీ విడమరిచి చెప్తాం. వారు మన సమస్యను అర్థం చేసుకుని మనసు ఊరడించే ప్రయత్నంచేస్తుంటే వారినే కోపగించుకుంటాం...చులకనగా చూస్తాం... పైగా వారికే ఎదురుతిరుగుతాం. అలా బ్యాడ్ మూడ్‌తో వారికి దూరమవుతాం. వారిని దూరం చేస్తూ మనం ఏదో బావుకున్నట్టు ఫీలవుతాం. ఇలా బ్యాడ్‌మూడ్‌తో ఉన్నంతకాలం మనం ఒంటరివారమే అవుతాం. ఆ సమయాలలో ఆత్మీయులైనా, స్నేహితులైనా- పరాయి వాళ్లలా మనకు అనిపిస్తుంటారు.''

ఫూలిష్ బిహేవియర్..!

''అంతెందుకు.. ఈ బ్యాడ్‌మూడ్‌తోనే జీవితం గడిచిపోదని మనకు తెలుసు. కొన్ని గంటలు లేదా ఒకటిరెండు రోజులు ఈ బ్యాడ్‌మూడ్‌లో ఉంటాం. ఆ తర్వాత దాని ప్రభావం నుంచి బయటపడి గుడ్‌మూడ్‌లోకి వస్తాం. ఆత్మీయులను, స్నేహితులను అక్కున చేర్చుకుంటాం. గుడ్‌మూడ్‌లో ఉంటే ఇతరులు మనకు చెప్పే విషయాలను బుద్ధిగా వింటుంటాం. మనం బ్యాడ్‌మూడ్‌లో ఉన్నప్పుడు మన బిహేవియర్ ఎంత చెత్తగా ఉందో వారు చెబుతుంటే మనమే విని ఆనందిస్తుంటాం, నవ్వుకుంటుంటాం. అంటే బ్యాడ్‌మూడ్‌లో మనది 'ఫూలిష్ బిహేవియర్'అని తెలిసి వస్తుంటుంది. మొత్తానికి బ్యాడ్‌మూడ్ అనేది- ఫర్ ఎవర్ కాదన్నది మాత్రం స్పష్టం. ఒక విధంగా బ్యాడ్‌మూడ్ తాత్కాలిక ఆవేశం వంటిది.''

''అవును దీపా..! యు ఆర్ హండ్రెడ్ పర్సెంట్ రైట్. బ్యాడ్ మూడ్ అంటేనే హారిబుల్ మూడ్ అని, ఒక విధంగా దీన్నే 'లో స్టేట్ ఆఫ్ మైండ్' అని అనొచ్చు. విలువైన, ఆదరించదగిన అంశాలు సైతం బ్యాడ్‌మూడ్‌వల్ల ఆదరణీయాలు, విలువైనవి కాకుండాపోతుంటాయి. ఇలా బాడ్‌మూడ్ అనేది ప్రతి ఒక్కరూ అనేక మలుపులలో ఎదుర్కోవలసిన స్థితే. పారిపోవాలనుకున్నా వెంటాడే స్థితి ఈ బ్యాడ్‌మూడే. ఎస్కేప్ కావాలనుకోకూడదు - ఫేస్ చేయాలి. ఫేస్ చేయగలిగితేనే అర్థంచేసుకునే అవకాశం దొరుకుతుంది. అర్థం చేసుకునే ప్రయత్నంలో బ్యాడ్‌మూడ్ అవగాహనకు వస్తుంది. ఎంతటి ఆరోగ్యవంతులైనా అప్పుడప్పుడు చిరు చిరు అనారోగ్యాలు తప్పవు. అలాగే- ఎంతటి స్ట్రాంగ్ మైండ్‌కైనా ఇలాంటి లో స్టేట్ ఆఫ్ మైండ్, హారిబుల్ మూడ్స్ తప్పవు.''

''అవును అంకుల్! మేం మేం టీనేజ్‌లో బ్యాడ్‌మూడ్‌ని సైతం పెద్దగా పట్టించుకోం... మహాఅయితే మేం బ్యాడ్‌మూడ్‌లో ఉన్నాం అని తెలుసుకుని, మా ప్రపంచంలో మేం ఉంటాం. మేం అలిగాం అనో, కోపంగా ఉన్నాం అనో- మీ వంటి పెద్దలు మమ్మల్ని నానా విధాల విసిగిస్తారే తప్ప, మేం బ్యాడ్‌మూడ్‌లో ఉన్నామని తెలుసుకునేలా ప్రయత్నించరు. తెలిసినా మా అహం దెబ్బతినేలా మాటలంటుంటారు. మా బ్యాడ్‌మూడ్‌కి కారణం మాకు తెలుసు. అందుకే ఆ సమయాలలో మాకు మేముగా అందరికీ దూరంగా ఉంటుంటాం. మేం ఇంత జాగ్రత్తగా, సెక్యూర్డ్‌గా ఆలోచిస్తుంటే, మా టీనేజర్స్‌ను మీ జనరేషన్ ఎందుకు అర్థం చేసుకోలేకపోతోందంకుల్!'' అంది దీప.

ఇది తల బిరుసు సమాధానం మాత్రం కాదు! అర్థం చేసుకోగలిగితే- బ్యాడ్‌మూడ్‌లో సైతం టీనేజర్స్ ఎంత ముందు చూపుతో వ్యవహరించగలుగుతున్నారో తెలుస్తుంది.

- వాసిలి వసంతకుమార్

అత్తగారిలో అమ్మతనం!

'శ్రీమాన్... ఎక్కడున్నావురా?' అరిచింది దుర్గాంబ.

'వంటింట్లో బెండకాయలు తరుగుతున్నా నమ్మా' అన్నాడు శ్రీమాన్.

'ఆడాళ్ల పనులు చేయకురా... నాకు చాలా చిరాగ్గా వుంటుంది' విసుక్కుంది తల్లి.

'తొమ్మిదవుతోంది.. ఇద్దరం బ్యాంకుకు వెళ్లాలి. పూర్వం రోజుల్లో భార్య వంటింటికే పరిమితం అన్నారు కాబట్టి మగవాడు హాల్లో కూర్చుని మహారాజులా వుండేవాడు. ఇప్పుడలా కాదు కదమ్మా. నాతోపాటు జాబ్ చేస్తూ లోన్ తీసుకుని స్వంత అపార్ట్‌మెంట్ కొని, మనకి అద్దె ఇంటి బాధ తప్పించింది నా భార్య. నేను కట్నం తీసుకోనని పంతం పడితే నాకంటే ఎక్కువ జీతం తెచ్చే వనితని కోడలిగా అంగీకరించవు. అక్కడ పుట్టింట్లో వనితని వాళ్ళమ్మ ఒక్క పనీ చేయనిచ్చేది కాదు. నువ్వేమో కోడలు రాగానే వంటింటి నుంచి తప్పుకున్నావు. అన్ని పనులకీ ఓ మనిషిని పెట్టుకోవచ్చు గానీ, నీకు రుచిగా వంట చేసి పెట్టాలని వంట మనిషిని వద్దంది వనిత. ఇంటా బయటా శ్రమ. నాకు వనితని చూస్తే జాలివేస్తోందమ్మా. అందుకే కొద్దిగా ఉడత సాయం..' అని చెబుతున్న కొడుకుని తెల్ల బోయి చూసింది దుర్గమ్మ.

మర్నాడు క్యాబేజీని రంపం పొట్టులా తరిగి, కొబ్బరి చిప్పల్ని కోరి వంటింట్లో స్టౌ ప్రక్కన వుంచింది దుర్గాంబ. అత్త చేసే పనులను చూసి వనిత ఆశ్చర్యపోయింది. 'నిన్న సౌమ్యంగా నీ గురించి మా అమ్మకు చెప్పేను. చిన్న చిన్న సాయాలు చేస్తే ఎదుటివారిని ఎంతగా సంతోషపెట్టవచ్చో తెలియచేశాను' అన్నాడు శ్రీమాన్ నవ్వుతూ.

రెండు రోజుల తరువాత కోడలు, కొడుకు బ్యాంకు నుంచి వచ్చేసరికి వేడిగా పకోడి, ఫ్లాస్క్‌లో టీ చూశాక సంబరపడిపోయింది వనిత.

''అత్తయ్యా.. మీరింత శ్రమపడటం.. ఈ వయసులో...'' అంటుంటే, 'నీకంటే ఎక్కువ శ్రమ పడుతున్నానా? అయినా ఏభై ఆరేళ్ళకే రిటైర్మెంట్ బాగుండదేమో. మరో నాలుగేళ్ళు పని చేస్తాను' అని సరదాగా మాట్లాడుతున్న అత్తగారిని కౌగిలించుకుని ముద్దు పెట్టేసుకుంది వనిత. దుర్గాంబకి చాలా సంతోషం కలిగింది కోడలు చేసిన పనికి.

''అత్తయ్యా.. ఈరోజు నుంచి శ్రీమాన్‌లా నేను కూడా మిమ్మల్ని 'అమ్మా' అని పిలుస్తాను'' అంది నవ్వుతూ.

ఆ సన్నివేశాన్ని సెల్‌ఫోన్‌లో బంధించి చిరునవ్వుతో 'ఇది మీ అమ్మ వాళ్ళింట్లో చూపెడతాను. వాళ్ళంతా ఎంతగా సంబరపడతారో' అన్నాడు శ్రీమాన్ వనితతో మెల్లగా. అత్తగారు అమ్మగా మారాలంటే- కోడలిని కూతురులా చూసుకుంటూ, చేతనైన రీతిలో సాయం చేస్తే చాలు. ప్రతి ఇల్లూ నిజంగా ఒక స్వీట్ హోం అవుతుంది.

-జ్యోతిర్మయి

మిస్టర్ బీన్ కారు రిపేరు.. వామ్మో..!

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

బ్రిటీష్ నటుడు మిస్టర్ బీన్‌ని ఆబాలగోపాలం ఎరుగుదురు. 245 దేశాలలో ఈ నటుడి పద్ధాలుగు - మిస్టర్ బీన్ పాత్ర వున్న క్యామెడీ ఎపిసోడ్‌లు జోరుగా అమ్ముడుపోయాయి. వ యసు మళ్లినా- పసిపిల్లాడి మనస్తత్వం, అమాయక చేష్టలు ప్రదర్శిస్తూ- కొన్ని చిక్కుల్ని పరిష్కరించే బీన్ పాత్రలో జీవిస్తున్న ఈ నటుడి అసలు పేరు రోవాన్ అట్కిన్‌సన్. ఈయన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎం.ఎ చేస్తున్నప్పుడు మొదట ఈ ఐడియా వచ్చింది. 2011లో అతను తన ఖరీదైన మోటారు కారుని (65 లక్షల పౌండ్ల ఖరీదు చేసే మాక్‌లారెన్ హెచ్1) ఒక చెట్టుకి ఢీకొట్టి మహా భయంకర ప్రమాదంలో పడ్డాడు. దాని రిపేరుకు ఏడాది పట్టింది. మరమ్మతుల ఖర్చులే పద్ధాలుగు లక్షల డాలర్లు (9 లక్షల పౌండ్లు) అయింది. కారు బాగుపడ్డది కానీ.. అతడి భుజానికి తగిలిన దెబ్బ ఇంకా బాధిస్తూనే వుంది!

శృంగారానికి ద్వితీయ ప్రాధాన్యం!

బ్రిటన్ పురుషుల్లో 46 శాతం మంది ఆటలంటే అమితాసక్తి కనబరుస్తూ, శృంగార క్రీడలకు ద్వితీయ ప్రాధాన్యం ఇస్తున్నారట! కొంతమంది పరిశోధకులు జరిపిన ఓ తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 'వన్ పోల్' అనే సంస్థ 18 నుంచి 34 ఏళ్ల లోపు వయసు కలిగిన సుమారు వెయ్యి మందిని సర్వే చేయగా ఈ విషయాలు వెలుగు చూశాయి. సర్వేలో పాల్గొన్నవారిలో అధికశాతం మంది ఆటలంటే తమకు ఇష్టమని పేర్కొనగా, 12 శాతం మంది శృంగారం పేరిట తాము ఇంతవరకూ ఎలాంటి 'రిస్క్' తీసుకోలేదని చెప్పారు. బ్రిటన్‌లో కీలకమైన నైరుతి ప్రాంతానికి చెందిన పురుషుల్లో 47 శాతం మంది తాము ఎలాంటి 'థ్రిల్' కోసం ఉబలాడ పడడం లేదన్నారు. బరువైన వస్తువుల్ని మోయడం కొంతమందికి సరదా కాగా, విభిన్న రుచుల ఆహారం పట్ల 29 శాతం మంది మోజు చూపుతున్నారు.

veeraji@sify.com

వ్యక్తిత్వానికి దర్పణం..

గృహాలంకరణ

ఎంత డబ్బు ఖర్చు చేసి ఇల్లు పూర్తి చేశారన్నది కాదు.. ఎంత అందంగా ఇంటిని తీర్చిదిద్దుకున్నారన్నదే అసలైన నైపుణ్యం. ఇటీవల గృహ నిర్మాణరంగంలో ఎన్నెన్నో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో అవసరాలతో పాటు అందచందాలకూ ప్రాధాన్యం పెరిగింది. మన అభిరుచుల మేరకు గృహాలంకరణ చేసుకునేలా విభిన్న పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. వంటగది, డైనింగ్ హాలు, బెడ్‌రూం, స్నానాల గది, టాయిలెట్లు.. ఇలా అన్ని చోట్లా ఆధునిక వసతులు సమకూర్చుకునేందుకు ఎన్నెన్నో మార్గాలు. ఫ్లోరింగ్, సీలింగ్, గోడలకు రంగులు, ఫర్నిచర్, కుండీల్లో మొక్కలు.. ఇలా ప్రతి విషయంలోనూ ప్రత్యేకతను చాటుకోవాలని చాలా మంది తహతహలాడుతుంటారు. ఇంట్లో స్థలం, చేతిలో డబ్బు బట్టి గృహాలంకరణకు సరిహద్దులే లేవు. మన అభిరుచులకు, వ్యక్తిత్వానికి



ఇంటి అలంకరణ దర్పణం పడుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నందునే గృహాలంకరణపై ప్రత్యేకంగా పత్రికలు, వెబ్‌సైట్లు, సంస్థలు వెలిశాయి. నగరాల్లో అయితే గృహాలంకరణపై తగిన సలహా లిచ్చే నిపుణులు కూడా నేడు అందుబాటులో ఉన్నారు.

ముందుగా ఇంట్లో ఏ మేరకు స్థలం అందుబాటులో ఉంది? ఎలాంటి అలంకరణ అవసరం? మన బడ్జెట్ అందుకు అనుమతిస్తుందా? అనే విషయాలను లోతుగా ఆలోచించాలి. అలంకరణ సామగ్రికి సంబంధించి అనుభవజ్ఞులైన నిపుణుల సలహాలు తీసుకోవడం మంచిది. బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి అక్కడి అలంకరణను పరిశీలిస్తే మనకు కొంత అవగాహన ఏర్పడుతుంది. అలంకరణ

వల్ల ఇల్లు మరీ ఇరుకైందన్న భావన రాకుండా జాగ్రత్త పడాలి. కంటికి ఇంపైన రంగులను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. జారి పడేందుకు అవకాశం లేని విధంగా ఫ్లోరింగ్ ఉండాలి. ఇంట్లో స్థలాన్నంతా ఫర్నిచర్ ఆక్రమించినట్లయితే ఇబ్బందులు తప్పవు. ఫర్నిచర్ కొనేముందు మన అభిరుచులు, ఆర్థిక పరిస్థితులను సరిచూసుకోవడం ఉత్తమం. మనకు అవసరమైన ఫర్నిచర్‌ను మాత్రమే ఎన్నుకోవాలి. ఆడంబరం కోసం భారీ సోఫాలు, ఖరీదైన సామగ్రి పట్ల మోజు పడితే సమస్యలు తప్పవు. తరచూ శుభ్రం చేసుకునేందుకు వీలుగా ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో తగిన గాలి, వెలుతురు వచ్చేలా అలంకరణ సామగ్రిని అమర్చుకోవాలి. వీలైనంత వరకూ విద్యుత్ పొదుపు చేసేలా లైట్లు వంటివి ఏర్పాటు చేసుకోవాలి. వెలుతురు వచ్చేలా జాగ్రత్త పడితే పగటి పూట విద్యుత్ లైట్లను వాడాల్సిన అవసరం ఉండదు. తగినన్ని కిటికీలు, ద్వారాలు ఉంటే గాలి,వెలుతురు పుష్కలంగా లభిస్తాయి. పలుచని కర్టన్లు వాడితే మేలు. గదులకు మరింత అందం తెచ్చేలా కార్పెట్లు ఉండాలి. అలంకరణతో పాటు భద్రత విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. షార్ట్ సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఇంట్లో సామగ్రిని అమర్చుకోవాలి. రంగుల విషయానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. కంటికి ఇంపైన రంగులను వాడాలి. ఇంట్లో చీకటి వాతావరణాన్ని తెచ్చే ముదురు రంగుల వల్ల మంచి అలంకరణ అసాధ్యం. ఫ్లోరింగ్, టైల్స్, పెయింట్ల విషయంలో నిపుణులు సలహాలు తీసుకుంటే మంచిది. పిల్లల గదుల్లో అలంకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అవసరం. స్విచ్‌లు, ప్లగ్‌లు, విద్యుత్ పరికరాలు చిన్న పిల్లలకు అందుబాటులో లేకుండా జాగ్రత్తలు అవసరం. ఇక, వాల్ పేపర్లను ఎంచుకోవడంలోనే నైపుణ్యం దాగి ఉంది. వంట సామగ్రిని, ఆహార పదార్థాలను పొందికగా ఉంచేందుకు కిచెన్‌లో తగిన ఏర్పాట్లు అవసరం. అలంకరణకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, అందుకువాడే వస్తువుల నాణ్యతపై కూడా అంతే ఆసక్తి చూపాలి. ఏది కొన్నా మన బడ్జెట్ పరిమితులు, నిపుణుల సలహాలు, మన అవసరాలు వంటి విషయాలపై తగిన అవగాహన అవసరం.

'ఎవరెస్ట్'పై ఎదురులేని రికార్డు

ఒకే సీజన్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని రెండు సార్లు అధిరోహించి నేపాల్‌కు చెందిన కుర్రిమ్ (29) సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాక, 'గిన్నిస్ బుక్' సంస్థ వారు తాజాగా ఈమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎవరెస్టు శిఖరంపై ఏటా మే నెలలో పర్వతారోహణ సీజన్ ప్రారంభమవుతుంది. మార్చి, ఏప్రిల్ నాటికి పర్వతారోహణపై ఆసక్తి ఉన్నవారు ఇక్కడికి చేరుకుని వాతావరణ పరిస్థితులకు అలవాటు పడుతుంటారు. వాతావరణం అనుకూలించాక మేలో పర్వతారోహకుల యాత్ర ప్రారంభమవుతుంది. గత ఏడాది మేలో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు బయలు దేరిన కుర్రిం 29,035 అడుగుల మేరకు ప్రయాణం సాగించి 12వ తేదీన తన లక్ష్యాన్ని సాధించింది. మరో వారం రోజుల వ్యవధిలోనే రెండోసారి (మే 19న) ఈ పర్వతాన్ని రెండోసారి అధిరోహించింది. ఒకే సీజన్‌లో రెండుసార్లు ఎవరెస్టు ఎక్కినందుకు 'గిన్నిస్ బుక్ రికార్డు' ధ్రువపత్రాన్ని నేపాల్ పర్యాటక శాఖామంత్రి బహదూర్ బొగాటి ఈమెకు అందజేశారు.

'ఈ రికార్డుతో సరిపెట్టుకోను, మున్ముందు పర్వతారోహణను కొనసాగిస్తాన'ని కుర్రిమ్ చెబుతోంది. పర్వతారోహణలో పాల్గొనే మహిళల సంఖ్య తక్కువగానే ఉందని, కొద్దిమంది మాత్రమే రికార్డులు సృష్టించారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. పర్వతారోహణలో మహిళల కంటే పురుషులు ఎంతో ముందంజలో ఉన్నారని, టాయిలెట్ల సమస్య తమకు ఎక్కువగా ఇబ్బంది కలిగిస్తోందని ఈమె అంటోంది. ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని ఇంతవరకూ సుమారు నాలుగు వేల మంది అధిరోహించగా, వీరిలో మహిళల సంఖ్య తక్కువేనని నేపాల్ పర్వతారోహణ సంఘం తెలిపింది. అతి శీతల వాతావరణం పర్వతారోహణకు అడ్డంకిగా ఉంటుంది. వేసవికాలం అనుకూలం కావడంతో ఏటా వందలాది మంది ఎవరెస్ట్‌ను అధిరోహించేందుకు ఉత్సాహ పడుతుంటారు.

ప్రపంచపు వృద్ధ మహిళ!

జపాన్‌కు చెందిన 114 ఏళ్ల మిసావో ఓక్వా ప్రపంచం లోనే బతికున్న అత్యంత వృద్ధురాలిగా 'గిన్నిస్ బుక్' రికార్డును దక్కించుకుంది. వచ్చే వారం 115వ పుట్టినరోజును జరుపుకోబోతున్న ఈమె అనునిత్యం తన ఆరోగ్య పరిరక్షణ పట్ల శ్రద్ధ చూపుతుంది. విశ్వవ్యాప్తంగా చూస్తే కేవలం జపాన్‌లోనే రికార్డు స్థాయిలో- వందేళ్లు నిండిన వారు 51వేల మంది ఉన్నారు.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
గురువారం
28, ఫిబ్రవరి
2013

నేర్చుకుందాం

అనురాగంబున నిన్ను జూచు దలపోయుం జొక్కు గాంక్షించ వ
ర్ణన సేయున్‌దమకించు సిగ్గు విరియం బ్రార్థించు శోషించునం
తను నీ ధ్యానమ దాల్చు దన్ను మఱచుం దానీ దశావస్థలం
దనరంగా మది నిన్ను దక్కగొను సద్భక్తుండు సర్వేశ్వరా

భావం: సర్వేశ్వరా ప్రేమతో నిన్ను చూస్తాడు. భావిస్తాడు., పరవశిస్తాడు, కోరుకొంటాడు,. వర్ణిస్తాడు చలిస్తాడు ఒక్కచిక్కుతాడు నీ ధ్యానంలో ఉంటాడు. తనని తాను విస్మరిస్తాడు. సద్భక్తుడు అయిన వాడు ఈ దశావస్థలలోనూ నిన్ను అనుభవిస్తాడు. భక్తుడైన వానికి భగవంతుడు తపప అన్యమేదియూ కనిరీచదు . చివరకు తాను ఉన్నానన్న విషయాన్నే సంపూర్తిగా మరిచిపోతాడు. అందుకనే భగవంతుడు కూడా తనను నమ్మి సేవించిన భక్తుని దాసుడై భక్తుడు కోరుకున్నవిధంగా భగవంతుడుకనిపిస్తాడు. బెజ్జమహాదేవి లాలపోస్తే పోయించుకొన్నవాడు, కన్నప్ప మాంసాహారం పెడితే ఆరంగించినవాడు, మరోభక్తుడు గుగ్గిలం వేస్తే వేయించుకొన్నావాడు ఆ పరమేశ్వరుడే కదా. తానేవిధంగా కోరుకుంటే ఆవిధంగాకనిపించే భగవంతుని ఆరాధనలో కాక భక్తుని మనసు మరెక్కడ ఉంటుంది?

సర్వేశ్వర శతకములోని పద్యమిది — నిర్వహణ: శ్రీపావని సేవా సమితి, హైదరాబాద్

25

అమ్మ

శ్రీ లత

తననెవరైనా బాధపెట్టకూడదూ అనుకున్న పుడు వాళ్ళను అవమానించే హక్కు తనకు లేదని ఎందుకు అర్థం చేసుకోలేకపోయింది?

''ఛ.. తన తెలివి ఎందుకూ కొరగాకుండా పోతుందెందుకు?'' అని తనను తాను తిట్టు కుంది.

తన అన్ కంట్రోల్డ్ బిహేవియర్‌కి అతనికి ''సారీ'' చెప్పాలనుకుంది మనస్ఫూర్తిగా...

⁘⁘⁘

అవినాష్‌కు కూడా ఆ రాత్రి నిద్రపట్టలేదు.

పాపకోసం ఆమె పడే ఆత్రం అతనికి చాలా అబ్బురంగా తోచింది ఏదో ఈ కాలం అమ్మా యిలు సరదాగానో, గుర్తింపుకోసమో స్పెషాలిటీ కోసమో ఎవరూ చేయని కొన్ని పనులు చేస్తుం టారు. అలాంటిది ఈ అమ్మాయి కూడా అనుకు న్నాడు మొదటిసారి.

''ప్రాపకాండ నాకిష్టంలేదు'' అన్నపుడు.

''ఎవరైనా మొహమాటానికి అలాగే అంటారు. అందరూ మెచ్చుకుం టూంటే అపుడు సంతోషప డతారు''అనుకున్నాడే కానీ, ఆ అమ్మాయి అంత హర్ట్ అవుతుం దనుకోలేదు.

ఎంత ప్రేమ ఆ పాపంటే ఆ అమ్మా యికీ! ఆ పాప కోసం నలుగుర్లో గొడవపడి కొట్టడానికి కూడా జంకలేదు. ఆడవా ళ్ళకు పిల్లలంటే అంత ఇష్టమా. మరి తనకు అమ్మ... తన అమ్మకు... తనంటే ఇష్టం లేదా? తనలో ఆడతనం లేదా? తన కోసం అమ్మ కూడా నలుగుర్లో ఎందుకు పోరాడలేదు''నా బాబును ఎవరైనా అంటే కొడ్తానిలా'' అని ఎందుకు కొట్టి చూపించలేదు? ఆ అమ్మాయిలా ప్రపంచం విస్తుపోయేలా ఎందుకు చేయలేదు?

''రేయ్ కుత్తోకి బచ్చా''అని తన ఫ్రెండ్స్ ఎగ తాళి చేసినా తనెందుకు భరించాడు. తన తల్లి కూడా తనను కుక్క పిల్లలు మధ్య వదిలేసి వెళ్ళి నందుకా? మరి కుక్కపిల్లలతోపాటు పెరగడాన కుక్కల కొడకా అంటే కోపంరాలేదు. నిజానికి తన మనుషులమధ్య కంటే కుక్కల మధ్యే ఎక్కువ బ్రతికాడు కదూ?

''ఎందుకు...? ఎందుకు? సమాజం చేత అనాథ అనిపించుకుని అందరి కాళ్ళా పట్టుకు న్నాడు ఎందుకు... ఎందుకంటే... తన అమ్మకు అమ్మతనం లేదు'' అనిపించింది. అమ్మతనం అంటే ఏవిటో ఈ అమ్మాయి కనకుండా కనిపింప చేసింది. కంటేనే అమ్మతనం రాదనీ పసిబిడ్డకు ఒడి పరి చిన ప్రతి మనిషీ అమ్మేననీ జీవితంపై పెటిల్లున కొట్టి మరీ చెప్పింది.

అమ్మ లేదని ఏనాడూ రాని కన్నీళ్ళు ఈ రోజెం దుకో పొంగి వచ్చాయి. ఆకలేసి కుక్కల్తోపాటుగా విస్తరాకులపై ఎగబడిన పసితనం గుర్తొచ్చింది. ''అమ్మా అమ్మా నన్నెందుకమ్మా కుక్కలు పాలు చేశావు?'' ఆర్తిగా గొణుక్కున్నాడు.

''ఒరేయ్ కుక్కల కొడుకా'' అని తను పనిచే సిన హోటల్ తంబయ్య తన్నడం గుర్తొచ్చింది. అచ్చం కుక్కలా అందరూ తాగేసిన గాజు గ్లాసు లోని అడుగు నీటిని ఒక గ్లాసులోకి పోసుకుని తాగడం గుర్తొచ్చింది. ఆ రాత్రి తన అయిష్టమైన అహస్యకరమైన బాల్యాన్ని గుర్తుచేసి బావుర మనిపించింది.

బాల్యం అందరికీ మధురం కాదు. విషం చేదు విషం. బాల్యం అందరికి తీపి జ్ఞాపకం కాదు అసహ్యకరమైన అను భవం. బాల్యం అందరికీ మరిచి పోలేనిది కాదు తుడిచెయ్యాలనే కసి. బాల్యం అందరికీ వరం కాదు తీక్షణమైన శాపం.

నాన్నెవరనే ధ్యాస లేకున్నా అమ్మ ఒడి లేదనే తపన అవినాష్‌ను ఎంతగానో మరిగించింది. ''పిచ్చిదో, కురూపో, వేశ్యో, భిక్షగత్తో, ఎవరైనా సరే మెత్తడి తొడులను ఒడి చేసి నిండు గుండె లకు తనను హత్తుకుని పెదవుల కొసలతో నుదు టన చుంబించే 'అమ్మ'... 'అమ్మ'కావాలి. ఏ కుక్క యినా సరే ఎగబడితే దానితో పోరాడి బిడ్డను కాపాడుకునే అమ్మ కావాలి. జస్ట్ అమ్మ...

అమ్మ పొదుగు కుమ్మే లేగదూడలా, వెంటపడి నడిచే మేకపిల్లలా, రెక్కలో దూరే కోడిపిల్లలా, అమ్మ సంచిలో ఒదిగే కంగారు కూనలా... అమ్మ... అమ్మలోని నులిలెచ్చదనంలో కళ్ళు మూసుకుని జగం మరిచే స్వాంతన కావాలి.

అచ్చం ఆ అమ్మాయి లాంటి ఆరాటం ఉన్న అమ్మ కావాలి అని తన పసితనమంతా రాత్రిళ్ళు ఏడుస్తూ ఏడుస్తూ గడపలేదూ...?

అతని కన్నీళ్ళు దిండును తడిపి ముద్దచేశాయి. పసిపిల్లాడిలా ఆ రాత్రి కూడా దిండును ఒడి చేసు కుని తడి తడిలో నానుతూ ఉండిపోయాడు.

ఆమెకు ఆ 'సారీ' ఆమెకు కాదు ఆమెలోని అమ్మతనానికి చెప్పాలనిపించింది.

అలా అనుకున్నాక అతనికి కొన్ని క్షణాలపాటు నిద్రపట్టింది.

⁘⁘⁘

చల్లగా మంచు కురుస్తూంది.

పారిజాతం పువ్వు ఆకుల దోసిట్లోంచి జారి నేల తల్లికి ఒళ్ళో పసిపాపలా వాలింది. తూరుపు గుండెను చీల్చుకుని ఓ కిరణం సూటిగా బయలు దేరి అనంతంలోకి దూసుకెళ్ళబోతూ అవనిని వోసారి చూసిపోదామనుకుందేమో అల్లరి పారి జాతం మీద అలవోకగా సోకింది.

పాపకు.... ''ఉంగా.. ఉంగా'' అంటూ ఉగ్గు పోస్తుంది'' అంది జీవన.

''జీవనా నేనో మాట చెప్పనా'' అందావిడ ఆప్యాయంగా.

''చెప్పండాంటీ'' అంది జీవన. తిప్పుతున్న మెలిక ఆపేసి.

''నిజంగా నీలాంటి అమ్మాయి చాలా అరుదు సుమా. ఆదర్శాలు వల్లించే వాళ్ళను చూశామేగాని ఆచరించేవాళ్ళను చూళ్లేదు. అంతెందుకు నా మటుకు నాకు ఎన్ని ఆదర్శాలున్నా లోలోన గొణు క్కున్నానే తప్పించి ఆచరించలేకపోయాను. నువ్వలా కాదు చాలా ధృఢమైనదానివి''.

ఇక ఎంతసేపు విన్నా పొగడ్తల మీనింగ్‌తో రక రకాల డైలాగులే వస్తాయని నిర్ధారించుకుని ముగ్గు మెలికలు తప్పడం మొదలెట్టింది.

''కుప్పతొట్టి పాపనీ పెంచుకోవడం..'' అంటూ అనబోయేసరికి చివుక్కున తలెత్తింది జీవన. ఇంత లోకి పాలవాడు సైకిల్ బెల్ మోగించడంతో అడ్డం జరుగుతూ ఆపేసింది పార్వతమ్మ.

-ఇంకాఉంది

156

రంగనాథ రామాయణం

శ్రీపాద కృష్ణమూర్తి

దీనివల్ల నీకు వేగ విక్రమ పౌరుష కార్యాలు కల తనయుడు జన్మిస్తాడు'' అని పలికి వెడలిపోయాడు. అంత అంజనాదేవి మనమునందు అలరుతూ వాయుదేవుడి ప్రతిమల కృప చేత నిన్ను పడసింది. కావున నువ్వు ఈ జగత్తులో వాయువేగంతోడి భూరి సత్త్వుడివి. పరాక్రమ కళాస్ఫూర్తిలో ఆ గరు త్మంతుడి కన్నా అధికుడివి. బ్రహ్మ ఒసగిన వరంవల్ల నీకు ఆయుధ మరణము లేదు. నిఖిల జగాలలో నీ సాటి ఎవరూ లేరు. నీ సత్త్వ సంపదను నేనెరుగుదును. ఈ సము ద్రాన్ని లంఘించి, జనకాత్మజను కనుగొని, రామకార్యం నెరవేర్చి ఈ కపుల ప్రాణాలు, రామచంద్రుడి ప్రాణాలు, సుగ్రీవుడి ప్రాణాలు కరుణించి రక్షించు. ఓ జగత్ప్రాణనందనా! రామకార్యం సాధించి ఉత్తమ లోక పదాలు నువ్వు పొందు'' అని అంజనా నందనుణ్ణి ప్రార్థించాడు.

హనుమంతుడు ''అవునవును. మీరు పంపినట్లయితే రఘుపతి కార్యం చేస్తాను. కపి నాయకులు నేడు నా లావు పరికించండి. జగద్ధితీ బుద్ధితో జలధి లంఘించి వేగ చని దేవతలు అడ్డు వచ్చినా మన పని పూర్తి కావి స్తాను. లోకాలన్నింటినీ బూడిద చేస్తాను. అబ్బురం గొలిపే శక్తితో లంకలో ప్రవేశిస్తాను. వైదేహిని అరసి వస్తాను. ఆ లంకను పగుల గొట్టి అయినా సీతాదేవిని తెస్తాను. అవశ్యం రామభద్రుడితో చేరుస్తాను. అటు కాకుంటే జలధులన్నీ కలచివేస్తాను. అమరాచలాన్న యినా గుండ చేస్తాను. ఈ భూమిని తుత్తు మురు అయేటట్టు పొడుస్తాను. మృత్యువున యినా త్రుంచివేస్తాను. ద్వీపాలన్నీ శోధించు తాను. చేవ మీర లంకచొచ్చి దుర్మార్గులైన రాక్షసుల్ని తూటారుస్తాను. సృష్టి సమస్తం అంధకార బంధురం చేస్తాను. అంతేకాని మీ చెంతకు రిక్త హస్తాలతో రాను'' అని వచించి మహేంద్ర పర్వతం అధిరోహించాడు.

సముద్రాలతోపాటు సృష్టి క్రుంగ- ప్రళ యకాల రుద్రుడో అన, త్రివిక్రముడైన విష్ణుదే వుడో అన, అసమాన శరీరుడై పెరిగి, అంగ దాది వానరేశ్వరుల అనుమతి కైకొన్నాడు. అంగం అంతా ఉప్పొంగేలాగున తన అంత రంగంలో జనకుడు వాయుదేవుణ్ణి తలచుకొ న్నాడు. శ్రీరాముడి చరణ జలేజాలను ఆత్మలో నిలుపుకొన్నాడు. మెడ సారించి శరీరం క్రుంగేటట్టు మహేంద్ర గిరి పయి నిల్చాడు. కను బొమ్మలు పైకెత్తి జలరాశిని వీక్షించాడు. రావణాసురుడి పురం మీద దృష్టి సారించాడు. నేలమీద తన వాలాన్ని అల్లా ర్చాడు. రెండు చెవులూ రిక్కించాడు. గిరి శిల మీద చేతులు ఊది పట్టాడు. అమృతాహర ణార్థం వినతాసుతుడు భువినించి దివికి ఎగ సిన చందంగా- పటు జవముతో హనుమం తుడు పైకి లంఘించాడు. ఆ సంరంభంలో గిరి శిఖరాలు భూరేణువులకన్నా చిన్న చిన్న కణాలుగా పొడి పొడి అయిపోయాయి. రావ ణుడు సముపార్జించుకొన్న ఘన కీర్తి పొడి అయినట్లు ఆ భూరజః కణాలు తోపింపచే శాయి. ఆ రవడికి మ్రాకులు ఆ మారుతితో పాటు- భావిసేతు నిర్మాణార్థం- వాయుసూ నుడు శంకుస్థాపన చేశాడో అన తోయధులో తునియలు తునియలై పడ్డాయి. విషవాయు వులు చెలరేగి నానాదిశలకు వ్యాపించాయి. హనుమంతుడు లంక పయి వక్రించాడో అన- ఇంద్రాదులకు తెలుపుగా- అబ్ధి నీరంతా పైకి ఎగసి, ఆవలి పాతాళ లోకం కన వచ్చింది. రాముడి హితకార్య ధైర్య శౌర్య ములు కని మహేంద్రాది దేవతలు కొని యాడ- ఈ చందంగా వనధి దూకి యేగుతు న్నాడనీ, ఎంతో దవ్వుపోతున్నాడనీ- ఈ మారుతికి యిక్కడ విశ్రాంతి ఒసగి పంపుతా నని సముద్రుడు మదిలో తలచి మైనాకుణ్ణి పిలిచి, ఈ యెడకి ఇప్పుడు హనుమంతుడు ఏతెంచాడు. అతడికి సాదరంగా సముచి తంగా- ఆతిథ్యం ఒసగి మరలిపోవలసింది'' అని పలికాడు.

హనుమంతునకు మైనాకుడాతిథ్యమొసగుట

అంత నిజ పక్షయుగళ జనిత వాయువే గానికి ఉప్పొంగిన సముద్రం మధ్య నించి మైనాకాచలం పైకి లేచి, తన యెదుటతోతెం చడం ఆంజనేయుడు కాంచాడు.

-ఇంకాఉంది

గురువారం, 28 ఫిబ్రవరి 2013

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ నందన, ఉత్తరాయణం
శిశర ఋతువు, మాఘమాసం

తిథి: బహుళ తదియ రా.12.16
నక్షత్రం: హస్త రా.02.16
వర్జ్యం: ఉ.10.58 నుండి 12.32 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.31 నుండి 11.18 వరకు, తిరిగి 03.11 నుండి 03.58వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా):
ఆరోగ్యం గూర్చి జాగ్రత్త పడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం.

• వృషభం (కృత్తి 2,3,4పా, రోహిణి, మృగ శిర 1,2పా):
ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫల మవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తిక రంగా లేనందున . ప్రతి పని ఆలస్యంగా పూర్తి చేస్తారు. జాగ్రత్తగా నుండుట మంచిది.

• మిథునం (మృగశిర 3,4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2,3పా):
పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికా రులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి.

• కర్కాటకం (పునర్వసు 4పా, పుష్యమి, ఆశ్లేష):
ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలన మేర్పడే అవకా శాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎల ర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా):
సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిరనివాస ముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభా లను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలి స్తాయి. సూక్ష్మ విషయాలను గ్రహిస్తారు.

• కన్య (ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1,2పా):
సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరి స్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులచే గౌరవింపబడుదురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆర్థిక చింత యుండదు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందెదరు.

• తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా):
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు.

• వృశ్చికం (విశాఖ 4పా, అనూరాధ, జ్యేష్ఠ):
కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవ కాశం ఉంది. మీ పరిస్థితిని అదుపులో ఉంచు కోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్ర యత్నాలు చేస్తారు

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా):
ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. ఋణప్ర యత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో మన శ్శాంతి లోపిస్తుంది.

• మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా, శ్రవణం, ధనిష్ఠ 1,2పా):
కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు వాయిదా వేసుకుంటారు.

• కుంభం (ధనిష్ఠ 3,4పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా):
మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. అనారోగ్య బాధలనుభవిస్తారు. ఆక స్మిక కలహాలకు అవకాశముంటుంది.

• మీనం (పూర్వాభాద్ర 4పా, ఉత్తరాభాద్ర, రేవతి):
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవ సరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవు తాయి.

మంచిమాట

విజయం

జీవితంలో విజయం సాధించచటం అంటే, అంతులేని ధనరాశులు కూడబె ట్టడం విలాసవంతమైన భవనాలు నిర్మించడమని భావిస్తారు. అవి అవసరమే, కాని, వాటిని మాత్రమే సాధించడం ఘనవిజయంగా భావించడం సముచితం కాదు. మరి కొందరు బహుశా కొద్దిమంది- చిత్రకళలు సంగీతం, నాట్యం వంటి నిర్దీత క్షేత్రాల్లోశ్ర మించి జీవితాలను అందంగా తీర్చిదిద్దుకుంటారు. ఇవి మనసుకు అఖండ సంతృప్తి కలిగించే అపూర్వవిజయాలు. జీవితం ఏ కోణంలోనుంచి చూసినా పరిపూర్ణత్వపు మాధుర్యంగా పల్లవించాలి. అదే జీవితానికి అర్థం, పరమార్థం. సాఫల్యమకుటం. సాధారణంగా ఎన్ని ఐహిక సంపదలున్నా ఆ ఆనందంతో సరితూగలేవు. అటువంటి వారి దృష్టిలో ధనం ఒక లక్ష్య సాధనకు ఉపకరణం మాత్రమే. ధనమే ధ్యేయం కాదు. మన శరీరంలోని కాలు, చెయ్యిలాగా ధనం కూడా పని చెయ్యాలి. లేకపోతే అది తలకు మించిన భారం అవుతుంది. మితిమీరిన ధనం అమిత ప్రమాదాలకు దారితీ యవచ్చు. ధనం బాగా సంపాదించేవారు వేదన చెందుతూనే వుంటారు. చాలినంత సంపాదనతో జీవించేవారు మరింత తృప్తిగా రోజులు గడుపుతారు. శాంతి, సామరస్య సౌజన్యతే వారి పొదుపు.ప్రేమానురాగాలే వారి బ్యాంకు ఖాతా.

ఆర్థిక స్థితి మెరుగుపడినకొద్దీ సుఖ సంతోషాలు పెరుగుతాయని భరోసా లేదు. భద్రత అన్నది ఎండమావి. డబ్బువల్ల హంసతూలికా తల్పం కొనవచ్చు కాని నిద్రను కొనలేం. పుస్తకాలు కొనవచ్చు కాని ప్రజ్ఞా ప్రాభవం బజార్లో దొరికే వస్తువు కాదు. ఆహారం కోకొల్లలుగా కొనవచ్చు కాని ఆకలిని కొనలేం. అందమైన వస్తువులు ఎన్నైనా కొనవచ్చు. కాని సౌందర్యం ధనరాశులకు అందదు. ఎన్నో అంతస్తుల మేడ కొన వచ్చు. శాంతిధామాన్ని కొనలే. మందులు కొనగలుగుతారు. ఆరోగ్యం కొనలేరు. విలాస వస్తువులను కొనవచ్చు. సంస్కారం, సంస్కృతి అంగట్లో దొరకవు. మనిషి కేవలం ఆహారం తిని మాత్రమే బతకలేరు. అతనికి నలుగురి సానుభూతి కావాలి. సువిశాలమైన అనంత ప్రపంచంలోని మహోత్కృష్ట కాంతివైపు తలుపులు మూసి వేసి, వెలుగు అనుకుంటున్న చీకటి నిశ్శబ్దంలో తనను బంధించుకున్న వ్యక్తి నిజమైన ఆనంద సముద్రాలను ఏనాటికీ చూడలేడు. జీవితాన్ని అలౌకిక విజయంగా భావించి, ఆదర్శశిఖరాల్లో ఆశయదీప్తితో జీవించడానికి మించిన సౌభాగ్యం లేదు.

ఆనందమే చిట్టచివరి భవితవ్య తీరం కాదు. అదొక నిరంతర మహా ప్రయాణం. పరమాద్భుతమైన కాంతి పుంజాలు. కాంచన ద్వీపాల వైపు ఆ యాత్ర సాగుతుంది. ఆ ఆనంద స్వర్గాలు, విజ్ఞాన భూమికలు పరిపూర్ణత్వం నిజంగా ఉన్నాయా? అవి మనిషి అందుకోగలడా అని చాలామంది సందేహం. అటు ఆరోహించడం సాధ్యం కాదు అనేవారున్నారు. ప్రాచీన క్రాంతదర్శులు వాటిని సిద్ధింపజేసుకున్నట్లు, వారు మానవాళికి వదిలివెళ్లిన ప్రవచనాలే సాక్ష్యం. ఆధునిక కాలంలో జన్మించిన ఆత్మజ్ఞాన సంపన్నులూ చెబుతున్నారు. మృగప్రాయమైన మన జీవితం జయించలేని ఔన్న త్యాల్లో అంతులేని ఆనందాలు, తేజోమయ ప్రజ్ఞాన మహోర్ణవాలు. అనంత శాంతి సీమలు మన ఆవిష్కరణకై నిరీక్షిస్తున్నాయి. క్షణంపాటు మెరిసే మెరుపును చూసినట్లు ఆ అంతర్నిక్షిప్త రత్న రాశులను ఒక్కసారి వీక్షిస్తే చాలు. వాటిని పూర్తిగా కైవసం చేసు కునేవరకు మానవాళి నిద్రించదు. వారు జీవితంలోని సర్వస్వాన్ని త్యజించి వాటికై పరుగులు తీస్తారు. వాటికి మార్గం బాగా సన్నది. తలుపులు తెరవటం అంత తేలిక కాదు. భయం అవిశ్వాసం సందేహం అనే చీకటి రాజభటులుకాపలా కాస్తూ మనల్ని ఆ రాజ్యంలోకి అడుగుపెట్టనివ్వరు.

చర్విత చర్వణమై విసుగు పుట్టించే జీవన నిరామయ నిరాసక్త, కల్లోలిత జలధి తరంగాలనుంచి, అజ్ఞాన తమస్సునుంచి విముక్తమయ్యే మనసుకు, సమావిష్కృత మయ్యే బంగారు ఉషోదయాలు అవి. యుగయుగాలుగా, జన్మ జన్మలుగా సాగే భువన జీవన రూపకానికి సరికొత్త భాష్యం చెప్పే అంతిమ కిరణం అక్కడే దాగి ఉంది. వాటిని సాధించడమే అసలైన విజయం.

-వులాపు బాలకేశవులు

వృతాసురుడు

34

బొమ్మలు: శ్రీరామ్

జంట పేలుళ్ల ఘటన

నిర్లక్ష్యమా? నిఘా వైఫల్యమా?

ఉగ్రవాదుల మృత్యుక్రీడలో మరో 16 మంది బలయ్యారు. 119 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 21న జరిగిన బాంబు పేలుళ్లు హైదరాబాద్ చరిత్రలో మరో విషాదకరమైన రోజు. ఈ ఘోరకలికి బాధ్యులెవరు ? అనే దానిపై నర్వత్రా చర్చ జరుగుతోంది. బాంబు దాడులకు పాల్పడిన దోషులకు సంబంధించి పోలీసులకు బలమైన ఆధారాలు ఇంకా లభించలేదు. ఉగ్రవాదులు దాడి చేయవచ్చుననే హెచ్చరికలు ఉన్నా, ప్రమాదాన్ని నివారించ లేకపోయారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి దిల్‌సుఖ్‌నగర్‌లో ఫిబ్రవరి 21న బాంబుపేలుళ్ల సంఘటనను పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగిన సంఘటనగా చాలా మంది భద్రతా నిపుణులు భావిస్తున్నారు. ఈ ఘోర కలి జరగదానికి నిఘా విభాగం వైఫల్యమే అన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి. తాము అప్రమత్తంగానే ఉన్నామని పోలీసులు సమర్థించుకున్నా, నిఘా వైఫల్యం మాత్రం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అదే సమయంలో ప్రజల బాధ్యతను కూడా మనం విస్మరించరాదు. కేంద్ర హోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే దేశంలో ఉగ్రవాదులు తెగబడే అవకాశం ఉందని అన్ని శాఖలను, ప్రభుత్వాలను హెచ్చరించామని, ప్రత్యేకంగా కొన్ని నగరాలకు హెచ్చరికలు పంపామని చెప్పారు. ఫలానా సమయంలో ఫలానా చోట దాడులు జరుగుతాయని చెప్పలేమని, కాని ముందస్తుగా అప్రమత్తం కావాలంటూ హెచ్చరిక జారీ చేశామని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆర్‌పి సింగ్ కూడా అష్జల్‌గురు, కసబ్‌లకు ఉరిశిక్షను అమలు చేసిన నేపథ్యంలో పేలుళ్లకు ఉగ్రవాదులు పాల్పడవచ్చనే నిఘా సమాచారం తమ వద్ద ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, డిజిపి వి దినేష్‌రెడ్డి వేరువేరుగా నిర్వహించిన విలేఖర్ల సమావేశాల్లోమాట్లాడుతూ తమకు జనరల్ అలర్ట్‌లు మాత్రమే వచ్చాయన్నారు.

ఢిల్లీ పోలీసులు గత ఏడాది అక్టోబర్ నెలలో ఉగ్రవాది మక్బూల్‌ను అరెస్టు చేశారు. అతనిని విచారించిన తర్వాత పోలీసులు రాష్ట్ర పోలీసు శాఖకు ఒక నివేదిక పంపించారు. హైదరాబాద్‌లో బేగంబజార్, దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబుపేలుళ్లకు కుట్ర పన్నానని మక్బూల్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఈ నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమై ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా దిల్‌సుఖ్‌నగర్‌పై ఉగ్రవాదుల గురి ఎప్పటినుంచో ఉంది. 2002లో ఇక్కడ స్కూటర్ బాంబు పేలింది. 2007లో ఇదే ప్రాంతంలో ఫుట్ ఓవర్ వంతెన వద్ద ఒక పేలని బాంబును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అదే ప్రాంతంలో జంట బాంబులు పేలి 16 మంది బలయ్యారు. మొదటి నుంచి దిల్‌సుఖ్‌నగర్ ఉగ్రవాదుల లక్ష్యంలో ఉన్న నేపథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షణ చేసి ఉండాల్సిందన్న భావన వ్యక్తమవుతోంది. నిఘా విభాగం ఇక్కడే విఫలమైంది. నిఘా విభాగం పనితీరు తెలుసుకోవాలంటే ఇజ్రాయేల్, అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాల గురించి ప్రస్తావించుకోవాలి. మన పోలీసులు పేలుళ్లు జరిగిన చాలా హడావుడి చేసి వారం రోజుల తర్వాత రొటీన్‌లో పడిపోతారు. కాని ఆ దేశాల్లో ఒక ఉగ్రవాది కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తారు. అలుపు సొలుపు ఉండదు. కొన్ని వందల రాత్రులు, పగళ్లు వృథాగా పోయాయని భావించరు. కానీ ఏదో ఒకరోజు ఆ నిందితుడిని పట్టుకుంటారు. లేదా మంచి కూలు సాధించి పేలుళ్ల సంఘటనలను నివారిస్తారు. ఆ దీక్ష, పట్టుదల మన పోలీసు శాఖలో లేదనే విమర్శ వినిపిస్తోంది. దీనికి పోలీసు శాఖను మాత్రమే నిందించి లాభం లేదు. మన రాజకీయ వ్యవస్థలో మొదటి నుంచి నిఘా వ్యవస్థను రాజకీయ నిఘా కోసం ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇదే మన పాలిట శాపంగా మారింది. సున్నిత అంశాలతో ముడిపడి ఉన్న హైదరాబాద్ లాంటి నగరంలో నిఘా విభాగం నిరంతరం పని చేయాలి. మత ఉగ్రవాద సంస్థల కదలికలను కనిపెట్టే నిఘా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఉండాలి. వారికి వేరే ఏ పనీ అప్పగించరాదు. కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం దాదాపు నిర్వీర్యమైంది. 2007 బాంబు పేలుళ్లలో 55 మంది మరణించారు. అనంతరం అప్పటి ప్రభుత్వం ఆక్టోపస్ సంస్థను ఏర్పాటు చేసింది. కాని ఆక్టోపస్‌ను కూడా నిర్వీర్యం చేశారు. ఆక్టోపస్‌కు దర్యాప్తు, నిఘా, గాలింపు చర్యలు, అరెస్టు చేసే తదితర అధికారాలు ఉండాలి. అవేమి లేకుండా కేవలం ఒక గార్డు విధులను నిర్వహించే సంస్థగా ఆక్టోపస్ మారిందనే అభియోగాలున్నాయి. వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఎస్‌ఐబి లాంటి మంచి నిఘా సంస్థను ఏర్పాటు చేశారు. మెరికల్లాంటి వారితో గ్రేహౌండ్స్ దళాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలను నిర్వహించి వామపక్ష తీవ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించారు. ఆ తరహా పోలీసు నాయకత్వం, శిక్షణ ప్రస్తుతం లేదు. ఉగ్రవాదం అడవుల్లో ఉండదు. జనావాసాల్లో ఉంటుంది. వీరు సాదాసీదా వ్యక్తులే. వీరిని పట్టుకోవడం, శిక్షించడం వెనుక పెద్ద కసరత్తు చేయాల్సి ఉంటుంది. రాజకీయ వత్తిడులుంటాయి. వామపక్ష తీవ్రవాదం కంటే ప్రమాదకరమైనది ఉగ్రవాదం. వామపక్ష తీవ్రవాదులకు శత్రువు పెట్టుబడిదారులు, పోలీసులు. కాని ఉగ్రవాదులకు ఒక వర్గం శత్రువులంటూ ప్రత్యేకంగా ఉండరు. మన దేశంలో జాతీయ స్థాయిలో ఉగ్రవాదుల కదలికల సమాచారాన్ని పంచుకునే యంత్రాగం అంతంత మాత్రమే. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన తర్వాత కొంత లోకొంత మెరుగుపడింది. కాని ఈ వ్యవస్థ పనితీరు ఇంకా మెరుగుపరచాల్సి ఉంది. నిఘా విభాగంలో ఉండే వారికి ఉగ్రవాదులు మాట్లాడే భాష తెలిసి ఉండాలి. ఇచ్చిన పని పూర్తి చేయడం కోసం సర్వం త్యాగం చేసే దృక్పథం ఉండాలి. ఒక రకంగా చెప్పాలంటే దేశభక్తి కలిగి ఉన్నవారే ఈ తరహా నిఘా విభాగంలో పనిచేసేందుకు అర్హులు. కాని మన పోలీసు యంత్రాంగం, రానున్న రోజుల్లో ఇంకా విజృంభించనున్న ఉగ్రవాదం ముప్పును ముందుగా పసిగట్టి పీచ మణిచే స్థాయికి ఎదిగే విధంగా తీర్చిదిద్దాలంటే రాజకీయ నాయకత్వం ఆలోచనా ధోరణులు మారాలి. అలాగే పోలీసు యంత్రాంగాన్ని విఐపిల భద్రతకు ఉపయోగించే విధానాలకు స్వస్తి చెప్పాలి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోలీసు సంస్కరణలను అమలు చేయాలి.

శాంతి భద్రతలు పర్యవేక్షణ, దర్యాప్తు విభాగం, నిఘా విభాగం పనులకు పోలీసులను ఉపయోగించుకోవాలి. ఈ విభాగాలను వేరు చేయాలి. అన్నింటికి మించి రాష్ట్ర స్థాయిలో, రాష్ట్రం, కేంద్రం మధ్య, రాష్ట్రాల మధ్య సమన్వయం ఉండాలి. ఈ సమన్వయం లేని పక్షంలో వ్యవస్థను ఎంత ప్రక్షాళన చేసినా, ఆధునీకరించినా ఉపయోగం ఉండదు.

ప్రభుత్వ లోపం లేదు

దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబుపేలుళ్ల సంఘటనలకు సంబంధించి ప్రభుత్వ వైఫల్యం ఏమీ లేదు. దీన్ని నిఘా వైఫల్యం అనడానికి కూడా వీలులేదు. ప్రభుత్వం ప్రతిక్షణం అప్రమత్తంగానే ఉంది. రాష్ట్రంలో ఎక్కడైనా, ఏదైనా సంఘటన జరగగానే 'ప్రభుత్వ వైఫల్యం' అంటూ విపక్షాలు విమర్శిస్తుండటం సహజమే. అధికారంలో ఎవరు ఉన్నప్పటికీ ఉగ్రవాదం, తీవ్రవాదంపట్ల కఠినంగా ఉండాల్సిందే! మా ప్రభుత్వం కూడా ఉగ్రవాదులు, తీవ్రవాదులపట్ల కఠినంగానే ఉంది. పోలీసు వ్యవస్థ, ఇంటెలిజెన్స్ నిఘా ఉండటం వల్ల శాంతిభద్రతల పరిస్థితి అదుపులోనే ఉంది. అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఒక్కోసారి ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తుందో కొన్ని పర్యాయాలు బహిరంగంగా వెల్లడించడానికి వీలు కాకపోవచ్చు. అలా వెల్లడించడం సరైన విధానం కాదు. ఉగ్రవాదులు, తీవ్రవాదులకు సంబంధించి ప్రభుత్వం ఏం చేస్తుందో బహిరంగంగా వివరించదు. అందువల్ల ప్రభుత్వం పనిచేయడం లేదని, పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయిందని, నిఘా వైఫల్యం అయిందని ఆరోపించడం సరైంది కాదు. కొన్ని అంశాలను బహిరంగంగా చర్చించడం మంచిది కాదు. సంక్షేమ కార్యక్రమాలో, అభివృద్ధి కార్యక్రమాలపైనే చర్చ జరిగితే అర్థం చేసుకోవచ్చు. వీటిపై అందరి అభిప్రాయాలు తీసుకోవడంలో తప్పు లేదు. అయితే శాంతిభద్రతల పరిస్థితి, ఉగ్రవాదులు, తీవ్రవాదుల విషయంలో ప్రభుత్వం తీసుకునే చర్యలపై చర్చించడం వల్ల మంచికన్నా కీడే ఎక్కువగా ఉంటుంది. ఒక వేళ నిఘా వైఫల్యం వల్లనే ఈ సంఘటన జరిగినట్టు రూఢీ అయితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రమాద హెచ్చరికలను తేలిగ్గా ఏమీ తీసుకోలేదు.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని దర్యాప్తు సంస్థలు, కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐ) పేలుళలపై దర్యాప్తు జరుపుతున్నాయి. ఇప్పటికే అనేక పర్యాయాలు ఉన్నతస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి కూలంకషంగా చర్చించాం. ఒకవైపు దర్యాప్తు కొనసాగిస్తూనే, మరోవైపు ప్రజల సహకారం కూడా కోరాం. బాంబుపేలుళ్ల సంఘటనకు సంబంధించిన ఉగ్రవాదుల సమాచారం అందించాలని, అలా అందించిన వారికి పదిలక్షల రూపాయలు బహుమతిగా ఇస్తామని ప్రకటించాం. ఈ విధంగా ప్రకటించడాన్ని కూడా కొందరు తప్పు పట్టారు. మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, ప్రపంచంలో చాలా దేశాలు కూడా ఈ విధమైన ప్రకటనలు చేస్తుంటాయి. ప్రభుత్వానికి సమాచారం ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారికి ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు ఏ ప్రభుత్వమైనా ఈ విధమైన ప్రకటన చేయడం సాధారణమే. ప్రభుత్వపరంగా పదిహేను దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగాయి. దర్యాప్తు కొనసాగిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. కీలకమైన ప్రాంతాల్లో 450 కోట్లతో 3,500 క్లోజ్‌డ్ సర్క్యూట్ (సిసి) కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, భారీ దుకాణాలు, పెద్ద ఆసుపత్రులు, సినిమా థియేటర్లలో సర్వెలెన్స్ కెమెరాలను పెట్టాలని నిబంధనలను పెడుతున్నాం. కేంద్రం సహకారంతో ఉగ్రవాదులు, తీవ్రవాదులపై కఠిన చర్యలు చేపడతాం.

- పట్లోళ్ల సబితారెడ్డి, హోం శాఖ మంత్రి

హెచ్చరించినా పట్టించుకోరా?

హైదరాబాద్‌లో జరిగిన బాంబు పేలుళ్ల విషయంలో రాజకీయ పార్టీలన్నీ తమ విభేదాలను విస్మరించి దేశ రక్షణ కోసం ప్రజల హితం కోసం ఏకం కావల్సిన అవసరం ఉంది. దేశాన్ని అస్థిర పరచాలని, ఆర్థికంగా బలహీన పరచాలని, ఆంతరంగిక కలహాలు సృష్టించి మతాన్ని ఆయుధంగా వాడుకుని ప్రజల్లో విభేదాలు సృష్టించాలని, ప్రోత్సాహాన్నిచ్చి, శిక్షణ ఇచ్చి, నిధులిచ్చి, విధులు కూడా తెలియజెప్పి సరిహద్దులు దాటించి మన శత్రువులు భారతదేశానికి పంపిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. పథకం ప్రకారం దేశాన్ని ప్రచ్ఛన్న యుద్ధం ద్వారా బలహీన పరచాలనే ప్రయత్నం జరుగుతోంది. దీనిని మనం గుర్తించలేకపోతే, సమైక్యం కాకపోతే దేశానికి తీరని హాని చేసిన వారం అవుతాం. కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు పంపించినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? ఆ హెచ్చరికలను ఎందుకు ఖాతరు చేయలేదు? హెచ్చరికలు అందాయా లేదా కేంద్రం చెప్పింది నిజమేనా కాదా అనేదైనా రాష్ట్ర ప్రభుత్వం వివరించాలి. సిసి కెమేరాలు పనిచేయడం లేదని, మరొకటని అంటున్నారు అదంతా నిజమేనా కాదా అన్నది కూడా వివరించాలి. ఇటీవల కమిషనర్ వివరణలో ఈ విషయం కొంత స్పష్టం చేసినా ఇంకా ప్రజల్లో అనుమానాలు నివృత్తి కాలేదు. వీటన్నింటికీ ఎవరు జవాబుదారీ వహిస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. నిజమైన పోలీసు అధికారులు ఎ.కె. మహంతి, రాజీవ్ త్రివేది వంటి వారిని విధుల నుండి తప్పించి, రాజకీయ వత్తిడులకు లొంగి ఓటు బ్యాంకు రాజకీయాలకు ఈ ప్రభుత్వం పాల్పడింది. నగరంలో స్లీపింగ్ సెల్స్ ఉన్నాయని ప్రభుత్వానికి తెలుసు, అలాంటపుడు వాటిపై ఏం చర్యలు తీసుకుంది? అలాగే అష్జల్ గురు ఉరితీత తర్వాత హుజీ, జిహాది కౌన్సిల్, లష్కరే తోయిబా తదితర సంస్థలు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించాయి కదా... ఎందుకు అప్రమత్తం కాలేకపోయారు? ఒకవేళ స్పందించి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పండి... వీటన్నింటినీ స్పష్టం చేయాలి. కేంద్రం ఇచ్చిన హెచ్చరికను రొటీన్‌గా ముఖ్యమంత్రి చెప్పడం చాలా ఆశ్చర్యకరం. కేంద్రం అలాంటి హెచ్చరికలు ఇవ్వకపోతే డోర్ నెంబర్‌తో సహా ఇస్తారా. అన్నీ వారే ఇస్తే ఇక రాష్ట్రం చేస్తున్నది ఏమిటి? కేంద్ర ఇంటెలిజెన్స్ బృందాలు ఎన్నో హెచ్చరికలు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటి? అదే జరిగితే కౌంటర్ ఇంటెలిజెన్స్‌లు, ఆక్టోపస్‌లు, ఇంటెలిజెన్స్ బ్యూరోలు ఇవన్నీ ఎందుకు? మాకు తెలియదని చెప్పడానికైనా ప్రభుత్వానికి సిగ్గుండాలి... ఇదంతా ఒక ఎత్తయితే, పాకిస్తాన్ ఉగ్రవాదులకు హైదరాబాద్ అడ్డాగా మారిన విషయం కొత్త కాదు, 1991 నుండి వరుసగా ఎన్నో సంఘటనలు, బాంబు దాడులు జరిగాయి. నందరాజ్ గౌడ్, పాపయ్య గౌడ్‌లను ఆనాడే చంపారు. 1994, 1995, 2002లో అనేక ఘటనలు జరిగాయి. 2005లో టాస్క్‌ఫోర్సు ఆఫీసు ముందు, 2007లో మక్కా పేలుళ్లు జరిగాయి. గోకుల్‌చాట్, లుంబిని పార్కు ఘటనలు జరిగిన తర్వాత కూడా హైదరాబాద్‌కు టెర్రరిజానికి ఉన్న లింకు ఏమిటి? ఐఎం, హుజీ, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు కొంతమంది నాయకుల సహకారంతో కార్యకలాపాలు సాగిస్తున్నాయని ప్రభుత్వానికి తెలియదా? ముజీబ్ అనే వ్యక్తికి క్షమాభిక్ష పెట్టి, ఐఎస్‌ఐ కార్యకలాపాలకు పాల్పడేందుకు వీలుకల్పించినట్టు కాదా? పాకిస్తాన్ పౌరులు కాలం గడిచినా ఇక్కడే తిష్టవేశారు. దీన్‌దార్ అంజుమాన్ అనే సంస్థ మంచిదని కూడా కొంతమంది సర్టిఫికేట్లు కూడా ఇస్తున్నారు. ఈ సంస్థ మీద ఢిల్లీ పోలీసులు ఏం చెప్పారో అందరూ చదువుకోవాలి.. హైదరాబాద్‌లో రెక్కీ గురించి ఢిల్లీ పోలీసులు ఏనాడో చెప్పిన మాట నిజం కాదా... అందుకే ఉగ్రవాదుల పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించాలని అంటున్నాం. ఓట్ల కోసం మెతకవైఖరి అవలంభిస్తే మనం ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నామో తేల్చుకోండి... అమెరికాలో ఒక ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత మళ్లీ అలాంటి సంఘటన జరగలేదు, కాని భారత్‌లో మాత్రం ఎప్పటికపుడు ఏదో ఒక నగరంలో ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? కారణం ప్రభుత్వ వైఫల్యమే. దీనికి మందు కఠినంగా వ్యవహరించడమే.

-ఎం. వెంకయ్యనాయుడు

బిజెపి సీనియర్ నాయకుడు

మొదటిదీ కాదు.. చివరిదీ కాదు!

పేలుళ్ల సంఘటన మన రాష్ట్రంలో మొదటిదీ కాదు.. చివరిదీ కాదు. గతంలోనూ ఈ తరహా సంఘటనలు జరిగాయి. భవిష్యత్తులో జరిగే అవకాశాలూ ఉన్నాయి. ప్రజల్లో భయోత్పాతం సృష్టించేందుకు ఉగ్రవాదులు, తీవ్రవాదులు ఏదో ఒక దుర్ఘటనకు పాల్పడాలన్న ఆలోచనతోనే ఉంటారు. ఉగ్రవాద సమస్య మన రాష్ట్రానికే పరిమితం కాలేదు. ఇది జాతీయ సమస్య. దేశంలో ఎక్కడ ఉగ్రవాద సంఘటనలు జరిగినా.. దానికి హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నాయంటూ వార్తలు వస్తూనే ఉన్నాయి. అంటే ఉగ్రవాదానికి 'మూలాలు' హైదరాబాద్‌లో ఉన్నాయని స్పష్టమవుతోంది. ఉగ్రవాదులకు సాధారణంగా పెద్దగా ఆయుధ సంపత్తి ఉండదు. డెటనోటర్లను, పేలుడు పదార్థాలను పేలుళ్లకు ఉపయోగిస్తారు. ఉగ్రవాదులు నేరుగా వీటిని పేల్చేందుకు ముందుకు రాకుండా ఇతరులను ఉపయోగించుకుంటారు. పేలుడు పదార్థాలను సైకిళ్లకో, మోటార్ సైకిళ్లకో అమర్చి ఫలానా స్థలంలో పెట్టిరమ్మంటూ కొంత మంది సహాయం తీసుకుంటూ ఉంటారు. దీని కోసం పెద్దగా శిక్షణ కూడా అక్కర్లేదు. నియామకాలు సైతం అక్కర్లేదు. కొంత మంది యువతను ఆకట్టుకుని తమ పనికానిచ్చేందుకు ఉగ్రవాదులు ఒక ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తుంటారు. 'స్లీపర్ సెల్స్' ఉగ్రవాదులకు సహాయంగా ఉంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉగ్రవాదం ప్రత్యేక సమస్యగా మారింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే 'ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్' (ఆక్టోపస్) ఏర్పాటు చేయాల్సి వచ్చింది. టెర్రరిస్ట్ కార్యకలాపాలు శాంతిభద్రతల సమస్య అయినప్పటికీ, దీన్ని మరో కోణంలో చూడాల్సిందే! ఉగ్రవాదుల కదలికలపై నిరంతరం నిఘావేసి ఉంచేందుకు కౌంటర్ ఇంటలిజెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే బాగుండేది. అయితే ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేస్తే తమ పెత్తనం పోతుందేమోనన్న అపోహ పోలీసు ఉన్నతాధికారుల్లో ఉంది. రాష్ట్ర స్థాయిలో కౌంటర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ అధిపతి తమకు ప్రత్యామ్నాయ అధికార కేంద్రంగా మారతారేమోనన్న భయంతో ఈ తరహా వ్యవస్థను రూపొందించలేకపోతున్నారు. నిబద్ధత కలిగిన అధికారి నేతృత్వంలో నిరంతర నిఘా కొనసాగించడం వల్ల, ఉగ్రవాద చర్యలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం వల్ల సత్ఫలితాలు వస్తాయనడంలో సందేహం లేదు. ఉగ్రవాదుల ఆచూకి కోసం 'ఇన్‌ఫార్మెంట్' వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇది చిన్న అంశం ఏమీ కాదు. ఇన్‌ఫార్మెంట్ వ్యవస్థ ఉగ్రవాదుల్లో కలిసిపోయి, వారిలో ఒకరిగా మారిపోయి, సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉంటుంది. ఇలాంటి వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం కష్టమే! స్లీపర్‌సెల్స్ లేకపోతే ఉగ్రవాదులు తమ కార్యకలాపాలను కొనసాగించడం కష్టమవుతుంది. అందుకే స్లీపర్‌సెల్స్‌పై నిఘా అవసరం ఉంటుంది.

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లపై సరైన దర్యాప్తు జరగడం లేదు. దర్యాప్తు సంస్థలు ఎవరో ఒకరిపై, ఏదో సంస్థపై అనుమానాలు రేకెత్తించి, మీడియా ద్వారా ప్రచారం చేసుకుని పనిచేస్తున్నట్లు హడావుడి చేస్తున్నాయి. అలాగే సరైన సమాచారంతో అనుమానితులను అరెస్ట్ చేస్తే రాజకీయనేతలు అడ్డుకుంటున్నారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో రాజకీయాలు చోటు చేసుకోవడం, నాయకులు జోక్యం చేసుకోవడం మంచిది కాదు.

- ఎం.వి. మైసూరారెడ్డి,
మాజీ హోంమంత్రి.

నిరోధక చట్టం కావాలి!

మన దేశంలో తీవ్రవాదుల అణచివేతకు, తీవ్రవాద చర్యల నిరోధానికి సంబంధించి ఇప్పటివరకు సమగ్రమైన 'తీవ్రవాద చట్టం' (టెర్రరిస్ట్ యాక్ట్) లేదు. 'అన్‌లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్-1967' అమల్లో ఉంది. ఈ చట్టానికి కాలానుగుణంగా కొన్ని మార్పులు, చేర్పులు జరిగాయి. అయితే తీవ్రవాదం, ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించేందుకు ఈ చట్టం సరిపోవడం లేదు. రాష్ట్రంలో తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని 'తీవ్రవాది' అంటూ గట్టిగా అనలేని దుస్థితి నెలకొంది. అధికారంలో ఉన్నవారు ఓటుబ్యాంకును కాపాడుకునేందుకు తీవ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. పేదరికం పేరుతో ఒక వర్గానికి ప్రభుత్వం వంతపాడుతోంది. పేదరికం అన్నది ఏ ఒక్క వర్గానికో పరిమితం కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం తాండవిస్తోంది. గిరిజనులు నూటికి నూరు శాతం పేదరికంలో, మౌలిక సదుపాయాల లేమితో బాధపడుతున్నారు. ఇది చాలా దురదృష్టకరమైన అంశం. జాతీయంగా, అంతర్జాతీయంగా మారుతున్న సామాజిక పరిస్థితుల మూలంగా మన దేశం కూడా తీవ్రవాదులను అణచివేసేందుకు, తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు ప్రత్యేక చట్టం చేయాల్సి ఉంది. యునైటెడ్ కింగ్‌డం, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో ఈ తరహా చట్టాలు అమల్లో ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాంబు పేలుళ్ల వంటి తీవ్రవాద చర్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇతర దేశాల తరహాలోనే తీవ్రవాదాన్ని అణచివేసేందుకు మన దేశం కూడా ఈ తరహా చట్టాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న చట్టాల వల్ల సామాన్యుల్లో అభద్రతాభావాన్ని తొలగించలేకపోతున్నాం. ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి క్షేమంగా వస్తాడని చెప్పలేని దుస్థితి నెలకొని ఉంది.

మనరాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. కేంద్ర నిఘా వ్యవస్థ-రాష్ట్ర పోలీసు యంత్రాంగం మధ్య సమన్వయం కూడా బాగానే ఉంది. బాంబు పేలుళ్ల సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడటం సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటి సంఘటనలకు శాశ్వత పరిష్కారం లేదు. 2007లో గోకుల్‌చాట్, లుంబినీ పార్క్‌లలో జరిగిన బాంబు పేలుళ్ల తర్వాత మళ్లీ ఆ తరహా సంఘటన జరగడం ఇదే ప్రథమం. అంటే ఆరేళ్ల తర్వాత ఈ తరహా సంఘటనలు జరిగాయని స్పష్టమవుతోంది. బాంబు పేలుళ్ల సంఘటనలు కేవలం మన రాష్ట్రానికే పరిమితం కాలేదు. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లోనూ ఈ తరహా సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం మన రాష్ట్రంలోనే పోలీసు వ్యవస్థ బాగాలేదనడంలో ఔచిత్యం లేదు. ఆక్టోపస్, కౌంటర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా అమలు చేస్తున్నాయి. అయితే స్థానిక పోలీసులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల పోలీసుల విభాగంలో నియామకాలు చేపట్టి, 37 వేల మందిని నియమించింది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ కూడా చేయలేని దుస్థితి నెలకొని ఉన్నప్పటికీ, హైదరాబాద్ ఫ్రీజోన్ కావడంతో పాటు చట్టపరమైన కారణాలవల్ల ఇక్కడ పోలీసు సిబ్బంది సంఖ్యను పెంచలేకపోతున్నాం. ఈ అంశంలో ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- కె. అరవిందరావు, డిజిపి (రిటైర్డ్)

ముమ్మాటికీ ఇంటెలిజెన్స్ వైఫల్యమే

పేలుళ్లకు ఇంటెలిజెన్స్ వర్గాల వైఫల్యమే కారణం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, ఉగ్రవాదం కార్యకలాపాలను పూర్తిగా విస్మరించిందని చెప్పవచ్చు. రాజకీయ వత్తిళ్ళతో కౌంటర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఇంటెలిజెన్స్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కార్యకలాపాలకే పరిమితం చేసి, తన సొంత జేబు సంస్థగా మార్చుకుంది. అసమ్మతి నేతలపై నిఘా, ప్రతిపక్ష పార్టీల కార్యకలాపాలు, రాజకీయ ఉద్యమాలు వీటి సమాచారాన్ని రాబట్టడానికే ఇంటెలిజెన్స్ వ్యవస్థను పరిమితం చేసింది. దేశ భద్రత, రాష్ట్ర భద్రత, శాంతిభద్రతలు, తీవ్రవాదం, ఉగ్రవాదంపై దృష్టి సారించాల్సిన వ్యవస్థను ప్రభుత్వం పక్కదారి పట్టించింది. అష్జల్‌గురు, కసబ్ ఉరితీత అనంతరం తలెత్తే పరిణామాలను ప్రభుత్వం అంచనా వేయలేకపోయింది. ఈ రెండు ఉరిశిక్షలను అమలు చేసిన తర్వాత ఉగ్రవాదులు చేసిన హెచ్చరికలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే హైదరాబాద్‌లో ఉగ్రవాదులు సులువుగా పేలుళ్లకు పాల్పడ్డారు. దీనికి ముఖ్యమంత్రి, హోంమంత్రి, డిజిపి ముగ్గురూ బాధ్యులే. అష్జల్ గురు, కసబ్ ఉరితీతల అనంతరం హైదరాబాద్‌లో ఉగ్రవాదులు దాడులకు తెగపడే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించినా, తమకు సాధారణ హెచ్చరికలే తప్ప, ప్రత్యేకమైన హెచ్చరికలు ఏమి అందలేదని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పడం పూర్తిగా బాధ్యతారాహిత్యం. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన తప్పనీ, కేంద్రహో

యశోదకృష్ణ నృత్యరూపకంలో రసానందం పంచే సన్నివేశం

నేత్రపర్వం యశోదకృష్ణ

దేశ విదేశాల్లో శాస్త్రీయ వాద్యసంగీతం, గానం, నృత్యాభినయంతో ఖ్యాతినార్జించిన ప్రముఖ కళాకారుల కచేరీలు, నృత్యరూపకాలతో ఆంధ్రా మ్యూజిక్ అకాడమీ కళాభారతి ఆడిటోరియంలో ఐదురోజుల పాటు నిర్వహించిన 13వ వార్షిక సంగీత నృత్యోత్సవాలు ఘనంగా ముగిసాయి. చివరిరోజు హైదరాబాద్‌కు చెందిన ఉషాగాయత్రి నృత్యదర్శకత్వంలో బృందం కళాకారులు శ్రీకృష్ణుని లీలల పరమార్థాన్ని తెలిపే 'యశోద కృష్ణ' నృత్యరూపకాన్ని కనువిందు చేసే నృత్యాభినయంతో నేత్రపర్వంగా ప్రదర్శించి ఆహూతులను అలరించారు. 'ఇదే మా గోకులం...., బైలుదేరి యశోదమ్మ భగవానుని దర్శించగ... వంటి కృతులకు కళాకారులు అద్భుతంగా నర్తించి ఆహుతులకు కనువిందు చేశారు. ముందుగా నగరానికి చెందిన ప్రముఖ గాత్ర సంగీత కళాకారులు ద్వారం త్యాగరాజు కృతులు కీర్తనలను అమృతమయంగా గానం చేసి శ్రోతలను ఆనందడోలికల్లో ఓలలాడించారు. శహన వర్ణంతో గాత్రకచేరి ప్రారంభించారు. ఎం.నీలాద్రిరావు వయోలిన్‌పై, డి.ధర్మారావు మృదంగంపై లయవాద్య సహకారం అందించి కచేరిని రక్తి కట్టించారు.

జానపద నృత్యాలు ఆలపిస్తున్న కళాకారులు

అకాడమీ చీఫ్ పేట్రన్, భీమిలి ఆనందవనం యోగి సద్గురు కందుకూరి శివానందమూర్తి ఆశీస్సులు, సంగీత కళానిధి, సంగీత విద్యానిధి నేదునూరి కృష్ణమూర్తి సలహా, అధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌రావు, సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రభాకర్, సభ్యుల పర్యవేక్షణలో నృత్యోత్సవాలు జరిగాయి. డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణ కార్యక్రమ వ్యాఖ్యానంతో ఆహుతులను ఆకట్టుకున్నారు. అధికసంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.

వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం జాతరలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన శృతిలయ డాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు అలరించాయి. స్వాగతం, కోయిలా కోయిలా, ఓ రంగయ్య, లంబాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే గాయకులు దాసరి శంకర్, బాబుల్ మాస్టార్‌లు ఆలపించిన తీయ తేనియలాంటి, కమ్మనైన తెలుగు, నా దేశం నలుదిశలా, సందె కూకిపోతున్నాది, చెల్లి నీ ఆడజన్మకో, స్నేహమేరా, పండు వెన్నెల, నల్లా నల్లాని పోరి, డప్పుగోటి దరువెయ్యనా, మంత్రాల మరితిగాడు వంటి జానపద గీతాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. అలాగే కార్యక్రమంలో అమర్‌నాథ్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం జాతర పరిపాలనాధికారి బక్తర్ పర్యవేక్షించారు.

కళ్లు లేకున్నా.. గళముంది

బెంగుళూరుకు చెందిన యువ విద్వాంసులు ఎ.ఆర్.మారుతీ ప్రసాద్ శాస్త్రీయ గాత్ర కచేరి మాధుర్య భరితంగా సాగింది. కీస్ గరల్స్ హైస్కూల్లో కళాసాగరమ్ నెలవారి సంగీత కార్యక్రమంలో మారుతీప్రసాద్ గాత్ర కచేరి ఏర్పాటుచేశారు.

కనుచూపు లోపించినా, మారుతీ ప్రసాద్ దృఢచిత్తంతో చిన్ననాటి నుండి సంగీతమే వ్యాపకంగా గురువులు చింతలపల్లి సూర్యనారాయణ, పంతుల లలిత, రాజశ్రీల వద్ద శిక్షణనందుకుని, గత 15 సంవత్సరాలుగా డా. టి.యస్.సత్యవతి శిష్యరికంలో అంచెలంచెలుగా ఎదుగుతూ యువ విద్వాంసులుగా రాణిస్తున్నారు.

లండన్, ఇతర పాశ్చాత్య నగరాలలో, అలాగే భారత దేశంలోని కొన్ని ముఖ్య పట్టణాలో తన గానాంబుధిని పంచిన మారుతీ ప్రసాద్, ఆలిండియా రేడియో, దూరదర్శన్ కార్యక్రమాలలో పాల్గొన్న అనుభవమేగాక పలు ప్రతిష్ఠాత్మక వేదికల్లో కచేరీలనందించారు. తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, రాష్ట్రపతి అవార్డు (2003) తదితర అవార్డులు, రివార్డులు అందుకున్న ప్రజ్ఞావంతుడు మారుతీ ప్రసాద్.

మారుతీ ప్రసాద్ తన కచేరిని భైరవిరాగ అటతాళవర్ణంతో శుభారంభం గావించారు. సిద్ధి వినాయకం (మోహన కళ్యాణి) ముత్తయ్య భాగవతార్, మాయమ్మ యనిన్నే (ఆహిరి) శ్యామశాస్త్రి కీర్తనలు కొద్దిపాటి రాగాలాపనతో సుస్వర యుక్తంగా అందించారు. మరొక త్యాగరాజ కీర్తన, దుర్మార్గ చరాధములు (రంజని) రూపకతాళంతో చిట్టిస్వరాలతో, సొగసైన రాగాలాపన చేసి, చక్కని స్వరకల్పన చేశారు. అనుపల్లవిలో, నెరవులలో 'ధర్మాత్మక, ధన ధాన్య దైవము' పదాల సొబగులు అద్దిన తీరు ప్రసాద్ గాత్ర సొలభ్యత తేటతెల్లమయింది. ఇంకా ఆనందభైరవిలో పురందరదాసు రచన, ప్రధానాంశంగా మైసూరు వాసుదేవాచారి బీగడ రాగకీర్తనలో రాగాలాపన, నెరవులు, స్వరప్రస్తారం హృద్యంగా అందించి మారుతీ ప్రసాద్ సంగీత రసికుల హర్షామోదాలందుకున్నాయి. పవన్‌సింగ్ వయొలిన్‌పై బుర్రా శ్రీరామ్ మృదంగంపై, జనార్దన్ ఘటంపై చక్కని సహకారం అందించి యువ విద్వాంసుని కచేరిని రక్తివంతం చేశారు. మారుతీప్రసాద్ రాబోయే రోజుల్లో మంచి గాత్ర విద్వాంసునిగా రాణించగలడని, ఆ విధంగా తన కృషిని కొనసాగించగడలని ఆశిద్దాం. ఆశీర్వదిద్దాం.

-చివుకుల

అచ్చుగుద్దిన చేవ్రాలు

ముంబయి ఐఐటి ఫెస్టివల్‌లో మెరిసిన దార్ల నాగేశ్వరరావు

ఐఐటి బొంబాయిలో మూడ్ ఇండిగో వారు ఇటీవల నాలుగు రోజులపాటు ఫెస్టివల్స్ కార్యక్రమాలు నిర్వహించారు. సెలబ్రేషన్స్ ఆరంభం నుండి చివరిరోజు వరకు స్టూడెంట్స్ సంతోషానికి అవధులు లేనివిధంగా మూడ్ ఇండిగో చేసిన హంగామా ఓ పండుగను చేసుకున్న తీరు కనబరిచింది. బాంబే పావై క్యాంపస్ మొత్తం ఇండియా నుండే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఐఐటి కాలేజీ నుండి విద్యార్థులు, అతిథులు, కళాకారులు మొత్తం దాదాపు 80 వేల మంది రావడంతో కిటకిటలాడుతూ, కళకళలాడింది. ఐఐటి సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న వారందరికి అంతర్జాతీయ అనుభూతి కలిగేలా అతిథి మర్యాదలు చేపట్టింది. అద్భుత, వినోదాత్మక, కళాత్మకమైన, సాంస్కృతిక తదితర కార్యక్రమాలకు తగ్గట్టుగా స్టేజీలను ఏర్పాటుచేసింది. ఆకర్షించిన వాటిలో థూమ్‌సడే పార్టీ, గ్లోబల్ మేళా, స్ట్రీట్ వాక్, ఆర్ట్‌స్పేస్ మొదలగునవి ఉన్నాయి. ఆర్ట్ స్పేస్‌లో ఒక్కొక్కచోట, ఒక్కొక్క ప్రత్యేకమైన కళాత్మకమైన చేతికళలు, వారి మేధాశక్తికి నిలువుటద్దంగా వున్నాయి. ఇందులో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కల్గిన చెన్నై నుండి ఒకరు, రాజస్తాన్ నుండి ఒకరు, ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొన్న ఒకే ఒక్క కళాకారుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముద్రణాలయంలో పనిచేస్తున్న ఆర్టిస్టు. దాదాపుగా 20 రికార్డులను సొంతం చేసుకున్న ప్రముఖ రెప్లికా ఆర్టిస్టు డా. దార్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మూడ్ ఇండిగో ఐఐటి బాంబే కాలేజీ నుండి ఆహ్వానం అందడంతో డా. దార్ల నాగేశ్వరరావు ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొనడం ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణం. బాంబేలో స్థానిక ఇద్దరు కళాకారులతోపాటు ఆర్ట్‌కు సంబంధించిన మొత్తం ఆరుమంది కళాకారులు బెంగుళూరు నుండి ఒకరితో కలుపుకుని ఆరుమంది కళాకారులు పాల్గొన్నారు. డా.దార్లగారి చేయి తిరిగిన కళలో అచ్చుకు అచ్చు గుద్దినట్లున్న వార్త పత్రికలకు ప్రతీకలైన చేతితోకాపీ చేసిన పత్రికలను అంతర్జాతీయ స్థాయి నుండి వచ్చిన కళాకారులను, విద్యార్థులను, అతిథులను సైతం అబ్బురపరిచింది. అలాగే బొట్టు (స్టిక్కర్స్)లతో చేసిన బరాక్ ఒబామా ముఖ చిత్రం, మూడ్ ఇండిగోకు సంబంధించిన లోగో, మరియు మియామ్-మియామ్, చార్లిన్ చాప్లిన్ చిత్రాలు, అక్షరాలతో దేశభక్తిని కనబరిచిన ఇండియా మ్యాప్, మరికొన్ని స్పెష్ ఆర్ట్ వర్క్స్ కలిగిన కళాకారులను ప్రదర్శించిన తీరు వర్ణించనలవి కాదు. ఈ ప్రదర్శనలో డా. దార్ల నాగేశ్వరరావుతోపాటు హైదరాబాద్ నుండి దార్ల మురళీకృష్ణ, కమ్మరి మోహనకృష్ణ ఉన్నారు.

ఈ సందర్భంగా 'మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్-2012'' నుండి వచ్చిన మరో మూడు రికార్డులకు సంబంధించిన సర్టిఫికేట్‌లను బాంబేలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ కళాకారిణి రేఖ కె.రానా, చంద్రకాంత్ గనాచార్యగారు మరియు చెన్నైకు చెందిన నోమన్ ఎమ్.ఎ.హజిగారి చేతులమీదుగా అందుకోవడంతో డా. దార్ల నాగేశ్వరరావును పలువురు ప్రముఖులు, అతిథులు, ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఐఐటి విద్యార్థులు ప్రశంసలతో కొనియాడారు.

- ఎన్.ఆర్.దార్ల

మూడవ మిరాకిల్స్ వరల్డ్‌రికార్డ్ సర్టిఫికేటును అందచేస్తున్న నోమన్ ఎ.హజి

కళాఖండాలను పరిశీలిస్తున్న విదేశీ విద్యార్థులు

రాగ 'సుధా' రసం పంచిన 'కచేరీ'

సుధా రఘునందన్

ప్రముఖ శాస్త్రీయ గాయని సుధా రఘునాధన్ ప్రపంచ ప్రఖ్యాత విద్వాంసురాలు కీ.శే. యం.యల్.వసంతకుమారి శిష్యురాలిగా ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పద్మశ్రీ బిరుదును కూడా సొంతం చేసుకున్న ప్రజ్ఞాధురీణి.

కీస్ సైన్స్కూల్‌లో నిర్వహించిన శ్రీ చంద్రశేఖరేంద్ర సంగీత విద్యా సొసైటీ సుధా రఘునాధన్ గాత్ర కచేరి రాగ సుధా రసం పంచిన చందంగా సాగింది. 'సుధ' తన కచేరీని 'నిన్నే కోరియున్నాను' మోహన రాగ వర్ణంతో శుభారంభం గావించారు. అనంతరం పురందరదాసు రచన 'జయ జయ జానకీ కాంత' నాటరాగంలో శ్రీరామకీర్తనాగానాన్ని భావాత్మకంగా అందించారు. 'త్రిపుర సుందరి నిన్నే శరంటినీ' హంసధ్వనిలో స్వరకల్పనలు హృద్యంగా పంచి, 'రాజిత గుణమయభూషిణి'లో నెరవులు అందంగా పల్కి సాహిత్య భావాన్ని ఆవిష్కరింపజేశారు. ప్రసిద్ధ తమిళ రచన 'నింబి కిట్టెవ్వర్ ఎవరయ్యా' తమిళ శ్రోతలను ఆహ్లాదపరిచారు. 'ఎన్నాళ్ళారకే' శుభ పంతురావళి, త్యాగరాజ కృతిలో చక్కని రాగాలాపన చేయగా అదే రీతిలో వయొలిన్ విద్వాంసులు బి.వి.రాఘవేంద్రరావు వయొలిన్ పల్కించిన తీరు కచేరీకి శోభని చేకూర్చింది. అభేరిరాగ అన్నమాచార్య రచన 'పలుకు తేనెల తల్లి పవళించెను' క్లుప్తంగా పాడిన అనంతరం రఘునాధన్ ప్రధానాంశంగా 'స్వరరాగ సుధారసయుత' శంకరాభరణం రాగ త్యాగరాజకృతి చేపట్టి రాగసుధారసాన్ని పంచారు. ఈ చౌక కాలకీర్తన చేపట్టి, రంజికమైన రాగాలాపన పల్కించి, స్వరప్రస్తారం మాధుర్యంగా మెరమెచ్చుగా సమర్పించారు. చివరగా 'హే గోవింద హే గోపాల్' మీరా జన్, తదితర కీర్తనలతో ఆద్యంతం ప్రేక్షక ప్రశంసలతో కార్యక్రమం సుధాపానరసంగా సాగింది. మృదంగంపై నైవేలీ స్కంద సుబ్రహ్మణ్యం, మోర్సింగ్‌పై ఆర్.రామన్ చక్కని వాద్య సహకారంతో కచేరీని రసభరితం చేశారు.

పరవశింపజేసిన 'ప్రియ సోదరీమణుల' గానం

ప్రసిద్ధ గాత్రయుగళం 'ప్రియ సిస్టర్స్' షణ్ముఖప్రియ, హరిప్రియ రంజకమైన గాత్రం త్యాగరాజు ఆరాధనోత్సవాలకు చక్కని ముగింపుని

షణ్ముఖ ప్రియ, హరిప్రియల గానకచ్చేరి

చ్చింది. ప్రియ సిస్టర్స్ తమ కచేరీని ఖమాస్ వర్ణంతో వేగవంతమైన గమకాలతో ప్రారంభించారు. 'ఉండేది రాముడొక్కడు' హరికాంభోజిలో భావయుక్తంగా అందించిన అనంతరం 'నిన్నాడవే నీరజాక్ష' చక్కని రాగాలాపనతో అందించారు. 'మారి వైరి రమణి' నాసికా భూషిణి త్యాగరాజ కృతి నెరవులు, స్వరకల్పనలు స్వర సాహిత్యాన్ని అత్యంత రమణీయంగా గానాంబుధితో అందించారు.

ప్రధానంగా 'దాచుకోవలెనా' (తోడి) రాగాలాపన, నెరవులు పల్కిన తీరు ప్రశంసాయుతంగా సాగింది. షణ్ముఖప్రియ, హరిప్రియ ఇరువురూ స్వరమాధుర్యాన్ని పంచారనవచ్చు. యం.ఎ.కృష్ణస్వామి (వయొలిన్), డిల్లీ యస్.సాయిరాం (మృదంగం) బి.యస్.పురుషోత్తం (కంజీర)పై చక్కని అనుసరణ చేశారు. సద్గురు శ్రీ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనా గోష్ఠి గానంచేశారు. మల్లాది సోదరులు శ్రీరామ్ ప్రసాద్, రవికుమార్, యస్.ఉమాదేవి, నీతూ చంద్రశేఖర్, రాధా సారంగపాణి, అయ్యంగారి శ్యాంసుందర్, యస్.కె.వెంకటాచారి, మల్లెం దక్షిణామూర్తి, యస్. చంద్రశేఖర్ దంపతులు మొదలైన జంటనగరాలకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులందరూ ఈ గోష్ఠి గానంలో పాల్గొన్నారు. ఈ ఐదు రోజుల కార్యక్రమాలను కార్యదర్శి యస్.చంద్రశేఖర్ అధ్యక్షతలో జె.శ్రీలక్ష్మి సమన్వయంతో శోభాయమానంగా నిర్వహించారు.

-చివుకుల రామమోహన్

ఆద్యంతం అలరించిన కన్యాశుల్కం

కన్యాశుల్కం సంపూర్ణ నాటక ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. గురజాడ అప్పారావు రచనకు అనుగుణంగా 8 గంటలపాటు కన్యాశుల్కం నాటకాన్ని విజయనగరం నవ యువ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. నటీనటులు పోటీపడిమరీ నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాటి కాలమాన పరిస్థితులకు కన్యాశుల్కం నాటకం నిలువుటద్దంగా నిలిచింది. విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉక్కు నగరం గురజాడ కళాక్షేత్రంలో సంపూర్ణ నాటక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు తిలకించేందుకు ఉక్కు అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చిన విజయనగరం నవ యువ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు వారి నైపుణ్యాన్ని అద్భుతంగా బయటపెట్టారు. నాటకంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకుల ఆదరణను చూరగొంది. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ప్రదర్శన నిర్విరామంగా కొనసాగింది. రంగస్థల అలంకరణ, సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నటులు హావభావాలు, ఆహార్యం నాటి కాలంలో ఉన్నామా అనే అనుభూతికి లోనుచేశాయి. నాటకానికి వచ్చిన స్పందనను చూస్తే నేటికీ కన్యాశుల్కం నాటకం ఎందుకు ఎవర్ గ్రీన్‌గా కళాభిమానులు పేర్కొంటారో అర్థమవుతుంది. గిరీశం, రామప్ప పంతులు, కరకటకశాస్త్రి, మధురవాణి పాత్రలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా మధురవాణి ఇంట్లో గిరీశం, రామప్ప పంతులు ఒకరికి తెలియకుండా ఒకరు మంచంకింద నక్కే సన్నివేశం నవ్వులు పూయించింది. అగ్నిహోత్రావధానులు తన కుమార్తెకి వృద్ధుడిని ఇచ్చి వివాహంచేసే సన్నివేశం అలరించింది. సుబ్బమ్మ పెళ్లి చెడగొట్టడానికి గిరీశం రాసిన ఉత్తరాన్ని రామప్ప పంతులు చదివే విధానం ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టింది. శొంఠంనేని కిశోర్ దర్శకత్వం వహించారు. మేకప్ భరణి అందించగా సంగీతాన్ని నెల్లూరి శ్యామలరావు, లైటింగును అశోకరావు, రంగాలంకరణను పిఠాపురం బాబూరావు అందించారు. గురజాడ 150వ జయంతి సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ప్రధానంగా నాటక ప్రదర్శనకు ఉక్కు అధికారులతోపాటు సినీ నటుడు 'కళ్లు'చిదంబరం, ఉక్కు కార్మిక నేతలు హాజరయ్యారు.

మధురవాణి తో సంభాషిస్తున్న గిరీశం.
మంచం కింద నక్కిన రామప్ప పంతులు.

- దుర్గాప్రసాద్ సర్కార్

రంగస్థలమే దేవాలయం

ప్రపంచ చరిత్ర తిరగేస్తే భారతీయ సంస్కృతికి ఒక ప్రత్యేకత ఉంది. అనేక కళారూపాలు మన సంస్కృతిలో ఇమిడి ఉన్నాయి. మానవుని సుఖదుఃఖాల ఆలంబనగా ఆవిర్భవించిన కళారూపాలు మానవ నిరంతర సృజనాత్మకతను తమలో ఇముడ్చుకుంటూ అనేక రకాలుగా నాటకంలో కనిపిస్తుంటాయి. ప్రాచీన కాలంనుండి నాటక కళను నమ్ముకుని జీవిస్తున్నవారు ఎందరో ఉన్నారు. తెలుగునాట కొన్ని వందల నాటికి కళారూపాలున్నాయి. బ్రతుకు జీవన యాత్రకోసం ఉద్యోగం చేసుకున్నప్పటికీ ఆ ఉద్యోగంలో న్యాయం చేయలేక నాటక రంగంపై వున్న మక్కువతో ఉద్యోగాన్ని వదులుకుని నటనకే ప్రాధాన్యత ఇచ్చేవారున్నారు. తన నటన ప్రదర్శించడానికి సరైన రంగస్థలాన్ని నమ్ముకుని 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా..' అని ఎదురు చూసేవారిలో మావిడాల అర్జున్‌రావు ఒకరు. నాటక రంగానికి తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అవకాశం ఉన్నప్పుడల్లా ఆదాయం కోసం ఆలోచించకుండా నాటకాలను ప్రదర్శిస్తున్నారు. మాకు రంగస్థలమే దేవాలయం. ఈ కళా ప్రదర్శన తప్ప వేరే ఉపాధి కోసం ఆలోచించము. అందుకే ఉద్యోగాలను వదులుకుని నటననే నమ్ముకుని బతుకుతున్నాము. కొన్ని సందర్భాలలో నాటక ప్రదర్శన ఏర్పాటు చేసే సంస్థలు ఇచ్చే పారితోషికం తక్కువగా ఉన్నప్పటికీ అవకాశం వదులుకోలేక రాజీపడి నాటకాన్ని ప్రదర్శిస్తుంటాము అని అర్జున్‌రావు అన్నారు. ఒక్కసారి వీరి జీవిత చరిత్రలోని పుటలు తిరగేస్తే వీరిది గుంటూరు జిల్లాలోని కొండవీడు ప్రాంతం. చిరు ప్రాయంలో ఆ ప్రాంతంలో ముదిరాజులు ప్రదర్శించే వీధి నాటకాలను చూసి ఉత్తేజపూరితుడై ముఖానికి రంగులు పూసుకుని స్నేహితులతో కలిసి నాటకాలు వేసేవాడిని. అది చూసి మా ఊరి ప్రజలు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. హైస్కూలులో చదివే రోజుల్లో అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ప్రదర్శిస్తే మాస్టార్లు, విద్యార్థులు అందరూ ఎంతో మెచ్చుకున్నారు. కాలేజీలో చదివే రోజుల్లో సాంస్కృతిక కార్యాక్రమాల సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. మూడు సంవత్సరాల డిగ్రీ కాలంలో ఇంద్రజిత్, సీతారామరాజు, దుర్యోధన, మాయల మరాఠీ ఏకపాత్రాభినయం పలుసార్లు ప్రదర్శించారు. చదువుకునే రోజుల్లోనే 'సెవన్ బుల్లెట్స్' సంస్థను స్థాపించి కోడెనాగు, రాముడు-రంగడు, ఆరని కన్నీరు, పూల రంగడు, కన్నీటి కాపురం మొదలైన నాటకాలు ప్రదర్శించారు. పౌరాణిక నాటకాలు నాకు చాలా ఇష్టం. శ్రీకృష్ణ రాయబారం నాటకంలో సహదేవుని పాత్రతో పౌరాణిక రంగంలో ప్రవేశించాను. సత్యహరిశ్చంద్ర నాటకంలో వారణాసి ఘట్టం నాకు ఎంతో పేరు తెచ్చింది అని అర్జున్‌రావు అన్నారు.

పుట్టి పెరిగిన ఊరు వదిలి 1996లో హైదరాబాద్ చేరాము. సినిమా నటుడు అవ్వాలని, సినిమాకు డైరెక్షన్ చేయాలని ఒక సంవత్సరం పాటు ఫిలింనగర్‌లో తిరిగి తిరిగి అలసిపోయి ఆ ఆలోచన విరమించుకున్నాను అని అర్జున్‌రావు చెప్పారు. దేవాదాయ శాఖ అవకాశాలు ఇస్తున్నారు కానీ వారు ఇచ్చే పారితోషికం పదివేలు పన్నెండు వేలకు మించదు. మాకు ఒక ప్రదర్శనకు సుమారు నలభై వేలు ఖర్చవుతోంది. అందుకే కొన్ని అవకాశాలు వదులుకోవాల్సి వస్తోంది. మాలాంటి పేద కళాకారులకు రవీంద్రభారతి ఆడిటోరియంకు అద్దె చెల్లించి ప్రదర్శన ఏర్పాటుచేసుకోవాలి అంటే చాలా కష్టం. అందువల్ల నాటకాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మాలాంటి కళాకారులకు రవీంద్రభారతిని ఉచితంగా ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. కళా హృదయులు రాష్ట్ర ముఖ్య మంత్రిగారు ఈ విషయంలో త్వరలో ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రార్థిస్తున్నాము అని అర్జున్‌రావు చెప్పారు. నాటకాలలో మా ప్రావీణ్యతను ప్రభుత్వం కొంతవరకు గుర్తించింది. బాలనాగమ్మ నాటకం మాయల ఫకీర్ పాత్రకు 2011 సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు వచ్చింది. నంద్యాలలో ప్రదర్శించిన 'మహిషాసుర మర్దని' నాటకానికి 2010 సంవత్సరానికి గాను ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. విజయనగరంలో 2012 సంవత్సరంలో ప్రదర్శించిన 'భక్తప్రహ్లాద' నాటకానికిగాను హిరణ్యకశిపుని పాత్రకు ఉత్తమ ప్రతినాయకుని బహుమతి లభించింది. మా నాటకాలలో నా తమ్ముడు ఎం.శ్రీనివాస్ (ఆటో డ్రైవర్) కలిసి ప్రదర్శనలలో నటనా చాతుర్యాన్ని చూపిస్తుంటాడు. తిరుమల కొండపైన శ్రీ వెంకటేశ్వరుని సన్నిధిలో మా నాటకాలు ప్రదర్శించడానికి అవకాశం కల్పించాలి. వృత్తినే నమ్ముకున్న మాలాంటి పేద కళాకారులకు ప్రభుత్వం పారితోషికం పెంచి ప్రోత్సహించాలి. మళ్లీ కళారంగానికి మంచిరోజులు వస్తున్నాయి. కళను నమ్ముకొనిబతికే వారికందరికీ మంచి రోజులు వస్తాయి. కళారంగానికి మళ్లీ స్వర్ణయుగం వస్తుంది అనే ఆశతో ఎదురు చూస్తున్నాము.

-కశ్యప